# అబద్ధాల వేట - నిజాల బాట

రచయిత

**నరిసెట్టి ఇన్నయ్య, Ph.D**

పరిష్కర్త

**ఇసనాక మురళీధర్**

అబద్ధాల వేట – నిజాల బాట అదనపు వ్యాసాలతో
e –పుస్తకముగా ప్రచురింపబడుతోంది - 2011

Abaddala Veta – Nizala Bata
(Lie hunting – Leading to truth)
Narisetti Innaiah, Ph.D.
Collection of Essays in Telugu

© రచయిత

వెల – రూ. 150/-

ప్రథమ ప్రచురణ – 2005

ప్రతులకు

- విశాలాంధ్ర బుక్ హౌస్, అన్ని బ్రాంచీలు
- ప్రజాశక్తి బుక్ హౌస్, అన్ని బ్రాంచీలు
- అక్షర, హైదరాబాదు, ఫోన్ 040-23543906
- అశోక్ బుక్ సెంటర్, విజయవాడ ఫోన్ 0866-2476966
  విశాఖపట్నం ఫోన్ 0891-2565995
- నవోదయ పబ్లికేషన్స్, హైదరాబాదు, ఫోన్ 040-24652387

For Copies in USA
Innaiah
#2, Hawlings Court, Brookville, MD-20833, USA.

ప్రచురణ

Rationalist Voice Publications
3-15, A.P. Housing Board Colony,
Moulali, Hyderabad – 500 040.
Phone : 27001939, 55222712

# అంకితం

## ఆత్మీయులు మేడపాటి సత్యనారాయణరెడ్డికి



సాధారణవ్యక్తిగా కనిపించే అసాధారణ మానవతావాది.
కార్మిక శ్రేయోభిలాషిగా తన న్యాయవాద వృత్తిని వినియోగించిన తీరు గమనార్హం.
స్నేహపాత్రులు, అశేష మిత్రబృందాల అభిమానులు.
జననం 7 ఆగస్టు 1928, ఏలేటిపాడు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**తండ్రి : చిన్న సుబ్బారెడ్డి** **తల్లి : సీతమ్మ**

**భార్య : సూర్యకాంతం** **పిల్లలు : ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు**

### జీవిత విశేషాలు

| | | |
|---|---|---|
| 1937 | - | బర్మా రాజధాని రంగూన్‌లో ప్రాథమిక విద్య ఆరంభం |
| 1940 నుండి | - | మార్టూరులో స్కూలు విద్య |
| 1945 ఏప్రిల్ | - | ఎస్.ఎస్.ఎల్.సి. |
| 1946 | - | నౌకాదళంలో పని |
| 1950-1959 | - | ఇంటర్, బి.కాం., ఎల్.ఎల్.బి. పూర్తి చేశారు |
| 1947 నుండి 1966 వరకు | - | హైదరాబాద్‌లో ఉద్యోగ జీవితం వివిధ వృత్తులు చేసి న్యాయవాదిగా స్థిరపడ్డారు. |
| 1966 నుంచి | - | ట్రేడ్ యూనియన్‌లో కృషి. రవాణా కార్మికుల సేవలు. న్యాయవాదిగా సేవలు, ప్రజాసేవలు |
| 2001 | - | ఉప్పల్, హైదరాబాద్‌లో కంటి ఆస్పత్రి నెలకొల్పారు. |
| 2004 | - | ఉప్పల్, హైదరాబాద్‌లో వృద్ధాశ్రమం ప్రారంభించారు. అమెరికా, బ్రిటన్ మరియూ యూరోపియన్ దేశాలు పర్యటించారు. |

# ముందుమాట అంతవసరమా?

అబద్ధాలవేట-నిజాలబాట లాంటి పుస్తకాన్ని పరిష్కరించే అవకాశం నాకు దక్కటం చాలా సంతోషకరమైన విషయం. అసలు పరిష్కరించటమంటే ఏమిటట? పరిష్కరించటం = సేకరించటం, వరసలో పెట్టటం, ప్రూఫ్‌లు చూడటం, ఒక పుస్తకరూపం యివ్వటం అన్నమాట. ఇన్నయ్యగారు వివిధ పత్రికలకు రాసిన అనేకానేక వ్యాసాల్లోంచి ఏర్చికూర్చిన సంకలనం యిది. ఈ వ్యాసాలు అనేక సంఘటనల్ని, అనేక విషయాల్ని నిశితంగా స్పృశిస్తాయి. దొంగల్ని పట్టిస్తాయి, దగాకోరుల్ని నిలదీస్తాయి. శాస్త్రీయతనీ, అశాస్త్రీయతనీ వేరుచేసి చూపెడతాయి. మంచికీ చెడుకూ మధ్యన గోడలు కడతాయి. పాఠకుడు సమగ్ర మానవవాదిగా మారే అవకాశాన్ని కలిగిస్తాయి.

అబద్ధాలవేట-నిజాలబాట పరిష్కరించటంలో నాకు ఎదురైన రెండు విషయాలు మీ ముందుంచుతున్నా. ఒకటి సమకాలీనత. ఈ వ్యాసాలు రాసే సమయం వ్యాసం చివరన ప్రచురణయిన పత్రికతో సహా యిచ్చాను. ఆ సంఘటనలు, అందులో వ్యక్తులు ఆ సమయంలో ప్రవర్తించిన తీరుతెన్నులు, వాటి చారిత్రాత్మక ప్రాముఖ్యత మనం గుర్తించాలి. రెండవది, ఈ వ్యాసాల్లో కొన్ని విషయాలు, సంఘటనలు అక్కడక్కడా రెండు మూడుసార్లుగా తటస్తిస్తాయి. అవి వేర్వేరు పత్రికల్లో, వేర్వేరు సమయాల్లో ప్రచురితమయ్యాయి. అలాంటివి వీలైనంత తక్కువగా వచ్చేటట్లు ప్రయత్నించాను.

ఇన్నయ్యగారు రాసిన రాస్తున్న ఎన్నో విషయప్రాముఖ్యతా వ్యాసాల్లో ఇవి కొన్ని మాత్రమే. ఇన్నయ్యగారికి, వారి కలానికి రిటైర్‌మెంట్ లేదు, భవిష్యత్తులో ఇలాంటి సంకలనాలు మరెన్నో రావాలని ఆశిస్తున్నా. ఈ పుస్తకం మీ ముందుంచటంలో ఇన్నయ్యగారి సతీమణి శ్రీమతి వెనిగళ్ళ కోమల సహాయం ఎనలేనిది. వారికి నా కృతజ్ఞతలు. పరిష్కరించటంలో ఏవేని తప్పులు దొర్లి వుంటే మన్నించమని పాఠకుల్ని, రచయితను వేడుకుంటున్నా. అందుకు ఇది రాయటం అవసరమే.

- ఇసనాక మురళీధర్

# ఈ బాటలో...

| క్ర.సం. | విషయము | పేజీ నెం. |
|---|---|---|

## హేతువాద, మానవవాద వ్యాసాలు


1. దివ్యశక్తులు వుంటే 5 కోట్ల రూపాయలు సంపాదించవచ్చు! 2
2. ఇంద్రియాతీత శక్తులు-1 8
3. ఇంద్రియాతీత శక్తులు-2 13
4. నేటి తాత్విక విమర్శలు - ధోరణులు 20
5. వేదాల్లో క్లోనింగ్ ఉందట 24
6. నిజాలు చెప్పి నమ్మించడం కష్టమా? 27
7. భవిష్యత్తు చూడగలమా? చెప్పగలమా? 28
8. కదిలేది-కదిలించేది 30
9. ప్రార్థనలతో ప్రాణాలు నిలుస్తాయా? 32
10. అమెరికా హేతువాదులతో 33
11. వెంకటేశ్వర సుప్రభాతం తెలుగులో పాడరెందుకు? 35
12. చదువుకున్నవారిలోనూ మూఢనమ్మకాలెందుకుంటాయి? 37
13. బాబాలు - ఆశ్రమాలు - ఆస్తులు 43
14. చావుబ్రతుకుల్లో సెక్యులరిజం 45
15. అన్ని మన మూలగ్రంథాల్లో వున్నాయా? 48
16. బైబిల్ - క్రైస్తవులు - హేతువాదులు 50
17. అమెరికాలో ఆధ్యాత్మిక వ్యాపారం! ఇండియా ఎగుమతులు! 53
18. బాబా ఏమైనా చేయగలడు! 56
19. అయ్యప్పా, మనుషులే నీకు శరణం! 72
20. 21వ శతాబ్దంలోకి పోబోయే ముందు మానవతావాదానికి మైనారిటీ తీరాలి 73
21. హేతువాదుల కార్యరంగం 79
22. పిల్లల్ని మతాలకు దూరంగా వుంచండి 82
23. పిల్లలకు హక్కులున్నాయి! కానీ...? 84

| | | |
|---|---|---|
| 24. | చిన్నపిల్లలకు ఎలా చెప్పాలి? | 89 |
| 25. | పిల్లలకూ హక్కులున్నాయి! అమలుపరిచేది ఎవరు? | 92 |
| 26. | అపూర్వ అన్వేషణా కేంద్రం | 93 |
| 27. | మూఢనమ్మకాలు | 96 |
| 28. | రాజకీయాల్లో కులం : హేతువాదు లేమంటారు? | 98 |
| 29. | చిట్కావైద్యంలో కొత్త రష్యా డాక్టర్లు | 108 |
| 30. | ఆంధ్ర సాహితీ సంస్కృతులు హేతువాద దృక్కోణం | 109 |
| 31. | అంబేద్కర్‌ను అంతం చేస్తున్నారు! ఆపగలవారున్నారా? | 114 |
| 32. | దివ్యశక్తులు వుంటే హేతువాదులకు అభ్యంతరమేమిటి? | 124 |
| 33. | పరలోక శక్తులు - నిద్ర పక్షవాతం | 132 |
| 34. | ఇస్లాం (అరబ్) సామ్రాజ్యవాదం | 134 |
| 35. | పోపుగారి పాలు | 137 |
| 36. | డిరోజియో ఉజ్వల ఆరంభం | 139 |
| 37. | సగం సంస్కరణ - సగం పునర్వికాసం | 142 |
| 38. | పదండి వెనక్కు - వేదాల్లో విమానాలున్నాయిట! | 148 |
| 39. | ముందు స్వాతంత్ర్యం - తరువాత సంఘ సంస్కరణ | 155 |
| 40. | మూఢనమ్మకాలకు దివ్యజ్ఞానసమాజ సిమెంట్ | 157 |
| 41. | భారత ముస్లింలలో పునర్వికాసం ఎందుకు రాలేదు? | 163 |
| 42. | గాంధిభాయి సెక్యులరిజంలో పునర్వికాసం | 173 |
| 43. | క్రైస్తవులు పునర్వికాసానికి దోహదం చేశారా? | 183 |
| 44. | పునర్వికాసానికి సిక్కుల అవరోధం | 190 |
| 45. | హిందువులు మళ్ళీ పునర్వికాసం ఆరంభించాలి | 193 |
| 46. | అరవిందాశ్రమంలో ఆధ్యాత్మిక వ్యాపారం!? | 198 |
| 47. | ఏది సెక్యులరిజం? ఎలా అమలుపరచడం? | 203 |
| 48. | దళితులకు సాంఘిక సమానత్వం కావాలి | 205 |
| 49. | 'అశాస్త్రీయతే 'దేశం' పునాది, లౌకికత్వానికి ఏనాడో సమాధి' | 208 |

## జీవిత చిత్రణలు


50. నవ్య మానవుడు ఎరిక్ ఫ్రామ్ 212
51. ఎం.ఎన్. రాయ్ ఇలా చేశాడా! 217
52. అమెరికాలో ఎం.ఎన్. రాయ్ 219
53. ఎం.ఎన్. రాయ్ - అబ్బూరి లేఖలు 241
54. హ్యూమనిస్టు "రాణె" అనుభవాలు - ఆదర్శాలు 243
55. అబద్ధాలవేట ఏది సత్యం? గాంధీగారూ! 244
56. శాస్త్రవేత్త గెలీలియోను హతమార్చిన తీరు! 251
57. హిందూ నెపోలియన్‌గా వివేకానంద 253
58. మూర్ఛ రోగులకు మొక్కితే మోక్షం వస్తుందా? 263
59. చిత్తశుద్ధి లేని వివేకానంద 267
60. 21వ శతాబ్ది తాత్వికుడు పీటర్ సింగర్ 272
61. రామమోహన్‌రాయ్ పునర్వికాసానికి తోడ్పడ్డాడా? 276
62. మతరాజకీయ వ్యాపారంలో మదర్‌తెరిసా 280
63. హిస్టీరియా - చార్‌కాట్ పాత్ర 284
64. మెస్మరిజం - అసలు వాస్తవాలు 287
65. ఫ్రాయిడ్‌లో నిజాలు - భ్రమలు 292
66. ఫ్రాయిడ్ విశ్లేషణలపై సరికొత్త శోధన! 304
67. ఇద్దరు నరేంద్రనాథ్‌లు 311
68. ఆవుల గోపాల కృష్ణమూర్తి (స్కెచ్) 312
69. అమెరికాలో ఆవుల గోపాల కృష్ణమూర్తికి హెచ్చరిక! 315
70. టంగుటూరి ప్రకాశం 317
71. ఆర్థర్ కాటన్ 322
72. కార్మికోద్యమానికి స్ఫూర్తి వెంకట్రావు 327
73. రచ్చగెలిచిన జర్నలిస్టు చింతామణి 328
74. సెక్యులర్ జర్నలిస్ట్ ధూళిపూడి ఆంజనేయులు 330
75. విలక్షణ పాత్రికేయుడు గో.రా. శాస్త్రి 333
76. రాయిస్టు ఆలోచనలకు పాదువేసిన ఎం.వి. శాస్త్రి 336
77. విశిష్ట పాత్రికేయుడు ఎబికె 337

## సైన్సు సంగతులు


78. మనుషులు మరెక్కడ లేరా? 344

79. బంగారం తయారుచేయడమెలా? 345

80. వికృతాకారాలు - వింతజీవులు 347

81. నాస్తికులు - హోమియో 349

82. హోమియో శాస్త్రీయమని ప్రపంచంలో ఎక్కడా రుజువు కాలేదు! 351

83. హోమియో అమానుషం : అమెరికా హ్యూమనిస్టుల నిర్ధారణ 354

84. హోమియో సాంఘిక నేరమా? అమానుషమా? 358

85. పెట్టుబడిలేని గిట్టుబాటు వ్యాపారం యోగ 364

86. యోగ 367

87. జపాన్ దిగుమతి రేకి చికిత్స 369

88. జ్యోతిష్యం 370

89. విశ్వాన్వేషణల్లో ఎక్కడున్నాం? 374

90. ఈనాటి సైన్సు విశేషాలు 376

91. శాస్త్రీయ పద్ధతి వినియోగం - దుర్వినియోగం 380

92. న్యూటన్ నుండి ఐన్‌స్టీన్ వైపుకు 383

93. నేనెలా పుట్టాను? 386

94. ఇప్పుడు వీస్తున్న సైన్స్ గాలి 388

95. సూదులమందు (ఆక్యూపంక్చర్) 403


## పుస్తక పరిచయాలు


96. నేను ముస్లింను ఎందుకు కాదు? 408

97. పిశాచ పీడిత ప్రపంచం 412

98. "పిచ్చి" అంటే 414

99. బిలియన్స్ అండ్ బిలియన్స్ 417

100. మేధావుల చిత్రణ 420

101. పునర్జన్మ - ఒక పరిశీలన 426

102. విజ్ఞాన సమన్వయం 430

103. **అదనపు వ్యాసాలు** 433

# హేతువాద, మానవవాద
# వ్యాసాలు

# దివ్యశక్తులు వుంటే
# 5 కోట్ల రూపాయలు సంపాదించవచ్చు!

దివ్యశక్తులు, ఇంద్రియాతీత (అతీంద్రియ) మహిమలు ప్రాచీనకాలం నుండి నేటి వరకూ చర్చనీయాంశమే. నమ్మకస్తులు, భక్తులు, ఆస్తికులు యీ శక్తుల్ని ఏదో మేరకు ఒప్పుకుంటారు. వారి బలహీనతను ఆధారంగా పురోహిత వర్గాలు, బాబాలు, మాతలు వివిధ ప్రక్రియలతో ఆకర్షించి ఆర్జిస్తున్నారు. ఇంచుమించు వ్యాపార సరళిలో నమ్మకాలను నడిపిస్తున్న మతాలు అన్ని రంగాలలో ప్రవేశించి ప్రభావితం చేస్తున్నాయి.

ప్రశ్నించేవారు, సందేహించేవారు, శాస్త్రీయ పద్ధతిలో సాగిపోయేవారు ఇంద్రియాతీత శక్తుల్ని, మూఢ నమ్మకాలను, అద్భుతాలను బట్టబయలు చేస్తున్నారు. అయినా కొత్తవి పుట్టుకొస్తున్నాయి. ఇటీవల సైన్స్‌ను, కంప్యూటర్లను, సాంకేతిక జ్ఞానాన్ని మూఢనమ్మకాల వ్యాప్తికి వాడడం విశేషంగా కనిపిస్తున్నది. అది మరీ జనాకర్షణకు దారితీస్తున్నది. జ్యోతిష్యం, హోమియో వైద్యం కంప్యూటరైజ్ చేసి దుర్వినియోగం చేయడం ఎక్కువైంది.

మహిమలు, దివ్యశక్తులు ప్రశ్నార్థకంగా చేసిన వ్యక్తులలో జేమ్స్ రాండిని ప్రముఖంగా పేర్కొనవచ్చు. ఆయన 25 ఏళ్ళ క్రితం 10 లక్షల డాలర్లు బ్యాంకులో పెట్టి ఇంద్రియాతీత శక్తుల్ని ప్రపంచంలో ఎవరు ఎక్కడ రుజువు చేసి అయినా, ఆ డబ్బు స్వీకరించమన్నాడు. ఇప్పటి వరకు ఆ పందాన్ని ఎవరూ గెలవలేదు. నిరంతరం జేమ్స్ రాండి ప్రపంచ పర్యటన చేసి, అద్భుతశక్తుల్ని, మహిమల్ని, భక్తి కూటముల రోగ చికిత్సను, హోమియో మోసాన్ని, జ్యోతిష్యాన్ని ఎండగడుతూనే వున్నాడు.

జేమ్స్ రాండి 10 పుస్తకాలు రాశాడు. అందులో సారాంశమంతా దివ్యశక్తులు, పేరా సైకాలజీ మహిమల గురించి గుట్టు రట్టు చేయడమే.

ఇటీవల జేమ్స్ రాండి ఒక విజ్ఞాన సర్వస్వం వెలువరించాడు. అకారాది వరుసలో అన్నిచోట్ల ప్రచారంలో వున్న శక్తుల గురించి సంక్షిప్తంగా, హాస్యభరితంగా వెలువరించాడు. దీనికి ఆర్థర్ సి. క్లార్క్ (శ్రీలంక శాస్త్రజ్ఞుడు) ముందు మాట రాశాడు.

టి.వి. ప్రసారాలలో జేమ్స్ రాండి శక్తుల - మహిమల బండారాలను బయటపెట్టాడు. చైనా నుండి ఆస్ట్రేలియా వరకూ పర్యటించి ఉపన్యాసాలిచ్చాడు. ఫిలిప్పీన్స్‌లో విపరీత మోసాలకు గురైన సైకిక్ సర్జరీ నిశితంగా పరిశీలించాడు. హోమియో దగాలను ఫ్రాన్స్, కెనడా, ఇజ్రాయల్, ఇంగ్లండు, అమెరికాలలో ఛాలెంజ్ చేసి, అసలు విషయాలు చెప్పాడు. అమెరికాలో భక్తి కూటాల దొంగ బాబాలను నిలబెట్టి వారి మోసాలను చెప్పడంతో కొందరు రంగ నిష్క్రమణ చేశారు. మరికొందరు దివాలా తీశారు.

యూరిగెల్లర్ తనను దివ్యశక్తుల మాంత్రికుడుగా ప్రచారం చేసుకుని డబ్బు ఆర్జించగా జేమ్స్ రాండి అతడ్ని ఢీకొన్నాడు. చెంచాలు చూపుతో వంచడం, ఇంకా అనేక శక్తుల వెనుక ఎలా దగా చేస్తున్నాడో చెప్పాడు. చివరకు కోర్టు తగాదాలలో యూరిగెల్లర్ ఓడిపోయి అమెరికా నుండి పారిపోయి ఇంగ్లండ్‌లో స్థిరపడ్డాడు. క్రైస్తవ మత ప్రచారకులు ఎప్పటికప్పుడు జేమ్స్ రాండి దెబ్బలకు హతమౌతూనే వున్నారు.

జేమ్స్ రాండి రాసిన Faith Healers పుస్తకానికి శాస్త్రజ్ఞుడు కార్ల్ శాగన్ పీఠిక రాశాడు.

మెకార్థర్ అవార్డు అందుకున్న జేమ్స్ రాండి కెనడా వాసి అయినా అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాడు. అవివాహితుడు. ఆయన పరిశోధనలు ఇప్పుడు కంప్యూటర్ ద్వారా website లో చూడవచ్చు.

ప్రపంచ ప్రళయం వస్తుందని పవిత్ర గ్రంథాలలో అన్ని మతాలు పేర్కొని జనాన్ని ఎప్పటికప్పుడు హడలుగొడుతూనే వున్నాయి. అలాంటి వాటిలో ప్రముఖమైన 49 ప్రళయ జోస్యాల్ని జేమ్స్ రాండి ప్రచురించాడు. అన్ని తేదీలతో సహా వున్నాయి. ఎప్పటికప్పుడు మతాలు కొత్త తేదీలు యిస్తూ జనాన్ని భయం గుప్పిట్లో, తమ సేవలో అట్టిపెడుతున్నాయి. 2000 సంవత్సరం కూడా అంతానికి తేదీగా నిర్ణయించి, ఏమీ జరగకపోయేసరికి, కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు.

ఆసక్తికరమైన ఎన్‌సైక్లోపేడియాలో జేమ్స్ రాండి చూపిన వివరాలు, ఒక్కొక్క అంశంపై యిచ్చిన సరళమైన, చతురోక్తులతో కూడిన వివరణ గమనార్హం.

(An Encyclopedia of claims, frauds and hoaxes of the occult and super-natural, by James Randi, St. Martins press, 175 Fifth avenue, New York 10010 USA, 284 పేజీలు Arthur C. Clarke పీఠిక)

ఇందులో హోమియో గురించి జేమ్స్ రాండి ఏమన్నాడో చూడండి. హానిమన్ రోగాలన్నీ మూడంశాలనుండే వస్తాయన్నాడు. సిఫిలస్, దురద పేర్కొనదగినవి. ఏ లక్షణాలున్న రోగం అదే లక్షణాలతో నయమౌతుంది. హోమియోలో వాడే ఔషధంలో మందు వుండదు. ప్రకంపనాలతో శక్తి పెరిగి, మందులో దాగివుంటుంది. వాస్తవానికి కేవలం నీరు మాత్రమే వుంటుంది. నీటిని అయస్కాంతీకరణ చేయవచ్చునని ప్రస్తుతం కొందరు రాగితీగెల్ని వాడుతున్నారు. మూలకారణాల జోలికి పోక, రోగలక్షణాలనే హోమియో పట్టించుకోడానికి వారికి మూలం తెలియకపోవడమే.

హోమియో ఒక రకంగా మాజిక్ అంశంగా మారింది. అందుకే యీ పుస్తకంలో దానిని చేర్చినట్లు జేమ్స్ రాండి పేర్కొన్నాడు.

ఎన్‌సైక్లోపేడియాలో అబారిస్ (పైథాగొరస్‌కు గురువు)తో ఆరంభించి జోంబి (Zombie) తో ముగించాడు. ప్రతి మాటను సంక్షిప్తంగా అర్థమయ్యేట్లు చెప్పడం జేమ్స్ రాండి కళ.

మహర్షి మహేష్ యోగి గురించి యిందులో క్లుప్తంగా చెప్పినా, అతడి మోసాలను మరో గ్రంథంలో చాలా వివరంగా బట్టబయలు చేశాడు.

(Flim - Flamలో The Giggling Guru : A matter of Levity చూడండి. Prometheus Books, 700 East Amherst Street Buffalo, Ny 14215 USA PP 342 దీనికి ఐజక్ అసిమోవ్ పీఠిక రాశాడు).

భారతదేశంలో మహిమల గుట్టును శాస్త్రీయంగా వెల్లడిస్తున్న, బి. ప్రేమానంద్ గురించి యీ పుస్తకంలో వుండడం విశేషం. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రేమానంద్ తమిళనాడులోని పోడునూరు, కోయంబత్తూరు నుండి ఇండియన్ స్కెప్టిక్ అనే ఇంగ్లీషు మాసపత్రిక నడుపుతున్నారు.

జ్యోతిష్యం భవిష్యత్తును చెబుతున్నా, కంబోడియా జ్యోతిష్యం రానున్న ఉపద్రవం అరికడతానని కూడా అంటుందని రాశాడు.

భారతీయులకు సంబంధించి జిడ్డు కృష్ణమూర్తి దివ్యజ్ఞాన సమాజ పరిస్థితి ఉదహరించాడు.

కుండలినియోగం, చక్రం, ఫకీర్, గురువు, హరేకృష్ణ, కర్మ, కమండలాలు, మంత్రం, ఓం, సాయిబాబా, సిద్ధి, తంత్ర, యోగం, ప్రస్తావనలు వున్నాయి.

భారతీయులకు తెలియని విదేశీ విషయాలు చాలా వున్నాయి. కొన్ని మాత్రం మనదేశంలో వున్నట్లే ఇతర దేశాలలో మార్పులు చేర్పులతో వున్నాయి. అందుకు ఉదాహరణగా దానంతట అదే, చేయి రాస్తూ పోతుందనడం, హస్త సాముద్రికం (కొందరు అరికాలిలో గీతలు కూడా ప్రభావితం చేస్తాయని నమ్ముతారు). జ్యోతిష్యం, నిప్పులపై నడక, గాలిలో తేలడం, దూరశ్రవణ, దూరదృష్టి, ముఖ కవళికల్ని బట్టి వ్యక్తి ఎలాంటివాడో చెప్పగలగడం, దృష్టిదోషం, చేతబడి, దివ్యశక్తితో, నీళ్ళు ఆయిల్ ఎక్కడపడేది చెప్పడం వున్నాయి.

## ప్రపంచం అంతం

జేమ్స్ రాండి పేర్కొన్న 49 ప్రపంచ అంతం జోస్యాలు చాలా ఆసక్తికరమైనవి. బైబిల్ ఉదాహరణలు, క్రైస్తవ జ్యోతిష్యుల అంచనాలు యిచ్చి అవి ఎలా వెర్రివాళ్ళను చేసాయో చూపాడు.

క్రీ.శ. 992లో మొదలుపెట్టి 1999 జులై వరకూ చెప్పిన ప్రళయ జోస్యాలు రాండి పేర్కొని, విఫలం అయిన తరువాత కూడా జ్యోతిష్యులు తలెత్తుక తిరుగుతున్నారన్నాడు. జోస్యాలు చెప్పిన వారిలో బిషప్పులు కూడా వున్నారు.

(శ్రీశ్రీ మాటలు గుర్తు తెచ్చుకోండి - హిప్పొపొటమస్ ఒక బిషప్పును గనియిట్లనియె స్వామీ తమరు చెప్పిందే చెప్పిందే మరల మరల చెప్పటెందులకని)

16వ శతాబ్దంలో ఫ్రెంచి వ్యక్తి నోస్ట్రాడాముస్ (1503-1566) శతాబ్దాలు అనే గ్రంథం (Centuries) రాశాడు. ఇది 10 భాగాలు. ఇందులో అన్ని భవిష్యత్తువాణి అన్నాడు. ఇప్పటికి వాటిని నమ్మేవారున్నారు. అతడు ఒకటవ ఎలిజబెత్ రాణి గురించి చెప్పింది ఒక్కటీ నిజం కాలేదు. అతడు 10వ భాగంలో చెప్పిన ప్రకారం 1999 జులైలో ప్రపంచం అంతం కావాలి. జేమ్స్ రాండి దీనిపై వ్యాఖ్యానిస్తూ అంతా అబద్ధాలమయంగా వున్నా ఆ 10 భాగాల రచనల్ని భక్తులు విపరీతార్థాలతో జనాన్ని భయపెడుతున్నారన్నాడు.

తోకచుక్కల విషయం శాస్త్రీయంగా బొత్తిగా తెలియక దాని చుట్టూ అనేక ప్రళయ కథలు అల్లారన్నాడు.

సంఖ్యాశాస్త్రంలో, నేడు కంప్యూటర్లు వాడి తప్పుడు భాష్యాలు చెప్పడాన్ని చూపాడు. అలాగే పిరమిడ్లను అడ్డం పెట్టుకొని కొందరు కథలు అల్లడాన్ని చూపాడు రాండి.

ఆద్యంతాలు ఆసక్తికరంగా రాసిన యీ ఎన్సైక్లోపీడియా లైబ్రరీలలో వుండాలి. పిల్లలు చదవాలి. తల్లిదండ్రులు చదివి పిల్లల భయాలను పోగొట్టాలి. అసిమోవ్ చెప్పినట్లు పిల్లలందరూ సందేహవాదులే. వారు ప్రతిదీ ప్రశ్నిస్తారు. కాని ఆ ప్రశ్నా స్వభావాన్ని తల్లిదండ్రులు మతాలు చంపేస్తున్నాయి.

## 5 కోట్లు గెలవండి

జేమ్స్ రాండి 70వ పడిలో మూఢ నమ్మకాలపై నిరంతర పోరాటం సాగిస్తూ, బ్యాంకులో 10 లక్షల డాలర్లు పెట్టాడు.

ప్రపంచంలో ఎక్కడైనా ఎవరైనా సరే సైకిక్, అతీంద్రియ (ఇంద్రియాతీత) శక్తులున్నాయని రుజువుపరచి, ఆ డబ్బు స్వీకరించవచ్చు.

జేమ్స్ రాండి అడ్రసు :
201 East. Davie Boulevard (S.E. 12th St),
Fort Lauderdale,
Florida 33316-1815

ఈ నిర్ణయంలో జడ్జిగా జేమ్స్ రాండి వుండడు.

ముందుగానే చెక్కును నిష్పక్షపాతి వద్ద అట్టిపెడతాడు.

ఏ శక్తి వున్నదీ ముందుగా తెలియపరచాలి.

నిర్ణయించిన తేదీ, స్థలం ప్రకారం, పేర్కొన్న శక్తి ప్రదర్శన జరగాలి. ప్రదర్శన అంతా ఫోటో తీయడం, రికార్డు చేయడం జరుగుతుంది.

శక్తి ప్రదర్శన వేరే దేశాలలో జరగవలసివస్తే, జేమ్స్ రాండి ఒక నిష్పాక్షిక ప్రతినిధిని పేర్కొంటాడు. వారి ఎదుట ప్రదర్శన జరపాలి. ఇందులో దారిఖర్చుల చెల్లింపు వుండదు. ప్రదర్శన వలన జరిగే నష్టాలకు రాండి బాధ్యుడు కాదు కనుక నష్టపరిహార చెల్లింపు వుండదు.

జేమ్స్ రాండి తన తదనంతరం ఛాలెంజ్ ధనాన్ని అతీంద్రియ శక్తుల శాస్త్రీయ పరిశోధనా సంస్థకు యివ్వాలని రాశారు. ఇది అమెరికాలోని నయగరా వద్ద బఫెలో నగర శివార్లలో వుంది. (Committee for the Scientific Investigation of claims of the paranormal)

ప్రదర్శనలో పేర్కొన్న ప్రకారం అతీంద్రియ శక్తి చూపలేకపోతే, తనకు అలాంటి శక్తి లేదని ప్రదర్శకుడు స్పష్టంగా ప్రకటించాలి.

web address :

http://www.randi.org

Phone : 954-467-1112

Fax : 954 467 1660

## ప్రార్థనలతో రోగాలు మటుమాయం

భక్తికూటాలు ఏర్పరచి, భజనలతో, ప్రార్థనలతో, బోధనలతో రోగాలు నయం చేస్తామని, వికలాంగులను బాగుచేస్తామని ప్రపంచ వ్యాప్తంగా మోసాలు చేస్తున్నారు. దీనిని చాలెంజ్ చేసి అదంతా బూటకమని జేమ్స్ రాండి రుజువు చేశాడు. అయినా వెర్రి భక్తితో జనం కొత్త బాబాల చుట్టూ ఆశగా డబ్బు వదిలించుకుంటూనే వున్నారు.

తన అనుభవాలను జేమ్స్ రాండి ఒక పుస్తకంలో రాశాడు. అది బాగా ప్రచారంలోకి వచ్చిన గ్రంథం.

The Faith Healers (Prometheus Books, 3/4 pages, 700 East Amherst Street, Buffalo New York 14215 USA)

అమెరికాలో క్రైస్తవ ప్రచారకులు చేసిన విపరీత మోసాలు బయటపెట్టిన పుస్తకం యిది. అమెరికా అధ్యక్షపదవిని ఆశించిన క్రైస్తవ ప్రచారకుడు పాట్ రాబర్ట్‌సన్ మొదలు, ఎ.ఎ. ఎలెన్, ఓరల్ రాబర్ట్స్, డబ్లు.వి. గ్రాంట్ ప్రభృతులను ఎండగట్టిన గ్రంథం యిది. టెలివిజన్ ప్రచారంలో భక్తి పేరిట చాలా డబ్బు వసూలు చేసిన సంఘటనలున్నాయి. రష్యాలో కమ్యూనిజం అరికట్టమని దేవుడు ఆదేశించాడు. గనుక అర్జెంటుగా డబ్బివ్వమని టెలివిజన్ ద్వారా విజ్ఞప్తి చేసి, కాజేసిన వారి సంగతి బయటపెట్టాడు.

కుంటి, గుడ్డి వాళ్లను స్వస్థత కూటాలలో బాగుచేస్తున్నట్లు చేసిన మోసాలను వెల్లడించాడు.

కొందరు దివాలా తీసి పారిపోయారు. కొత్త బాబాలు తలెత్తుతున్నారు. నిరంతరం జేమ్స్ రాండి పోరాటం సాగిస్తూనే వున్నాడు. మనం తీసుకెళ్ళిన కుంటి, గుడ్డి, మూగవాళ్ళను అక్కడ నయంచేయరు. వారు ముందే ఏర్పాటుచేసి, నటించేవారిని తెచ్చి నయమయినట్లు చూపి, డబ్బు కాజేస్తుంటారు.

జేమ్స్ రాండి తన Flim-Flam అనే గ్రంథంలో మరికొన్ని రంగాలలో మోసాలను బయటపెట్టి వివరాలందించాడు. ఆకాశం నుండి ఎగిరే పళ్ళాలలో వచ్చి కొందరు రోగాలను నయం చేస్తున్నారనే వదంతి ఎలా పనిచేస్తుందో చూపాడు. గాలిలో తేలిపోడానికి యోగవిద్య పనిచేస్తుందనే మహేష్ యోగి మోసాలను బయటపెట్టాడు. ప్రత్యామ్నాయ ఔషధాల పేరిట చికిత్సలు చేసి మోసాలు కప్పిపుచ్చుకుంటున్నవారి గుట్టు రట్టు చేశాడు. దయ్యాలు, భూతాలు, పిశాచాలు, దేవతల పేరిట అద్భుతాల వ్యాపార రహస్యం వెల్లడించాడు. జ్యోతిష్యాన్ని ఎండగట్టాడు. హోమియోను ఉతికేశాడు.

జేమ్స్ రాండి స్వయంగా మెజీషియన్. ప్రదర్శనలు యిస్తాడు. అయితే ఇతరులకూ యితనికీ తేడా వుంది. ప్రదర్శనలు కేవలం డబ్బుకోసం. ప్రేక్షకులకు వినోదం అందించడం. కాని మాజిక్ పేరిట మోసాలు చేయడాన్ని రాండి సహించడు.

సైంటిస్టులు అతి సులభంగా మాజిక్ వలలో పడతారని రాండి రాశాడు. సైన్స్ సూత్రాలను అతిక్రమించినట్లు మాజిక్‌లో కనిపించే వాటిని సైంటిస్టులు గుడ్డిగా నమ్ముతారని అదేవారి లోపం అనీ అన్నాడు. అందుకే కొందరు సైంటిస్టులు బాబాల భక్తులై పోయి, మూఢ నమ్మకాల వ్యాప్తికి తోడ్పడుతున్నారన్నాడు.

మాజిక్ తెలిస్తే మోసాలను గ్రహించడం తేలిక. మూఢంగా నమ్మడం వుండదు. చదువుకున్న వారు సైతం మాజిక్ మోసాలు తెలియక బాబాల వలలో తేలికగా పడుతున్నారన్నాడు.

మాజిక్ ఎలా చేస్తారు, అందులో రహస్యం ఏమిటి, ప్రపంచంలో మాజిక్ ఎలా వ్యాప్తిలో వున్నదీ జేమ్స్ రాండి వివిధ రచనలలో విపులీకరించాడు. Conjuring అనే రచన ముఖ్యంగా చదవదగింది. కొందరు మెజీషియన్లు తమ విద్యను స్టేజికి పరిమితం చేయక, బాబాలుగా మారడంపట్ల రాండి ఆగ్రహించాడు. యూరిగెల్లర్ మోసాలను అలాగే బయటపెట్టాడు.

పేరా సైకాలజీ ఒక అంటువ్యాధిలా అమెరికా, యూరోప్‌లో, ఇతర చోట్ల వ్యాపించింది. కొందరు డిగ్రీలు కూడా పుచ్చుకుంటున్నారు. జె.బి.రైన్ మొదలు నేటివరకు పేరాసైకాలజి పేరిట జరుగుతున్న మోసాలను జేమ్స్ రాండి ఎదుర్కొన్నాడు.

*-మిసిమి మాసపత్రిక, మే-2000*

# ఇంద్రియాతీత శక్తులు-1

ఒక మనిషి మరో మనిషి మనస్సులోని ఆలోచనను చెప్పగలగడం ఒక విశేష శక్తిగా పేర్కొంటారు. అమెరికాలో ఒకరుంటారు - ఇండియాలో మరో వ్యక్తి వుంటాడు. వారిరువురూ ఫోను సైతం చేసుకోరు. అయినా ఇండియాలో వున్న వ్యక్తి ఒకానొక సమయంలో ఏమి ఆలోచిస్తున్నాడో అదే సమయంలో ఆ విషయాన్ని అమెరికాలో వున్న వ్యక్తి చెబుతాడు. తరువాత పరిశీలించిన వారికి యిది అద్భుతంగా ఇంద్రియాతీతశక్తిగా కనిపిస్తుంది. ఇలాంటి ప్రక్రియకు టెలిపతి (Telepathy) అని పేరు పెట్టారు. మరికొందరు యీ టెలిపతి శక్తి ద్వారా మరో వ్యక్తి యిష్టానికి వ్యతిరేకంగాను పనిచేయించగలడంటారు.

టెలిపతి అనేది సాధ్యమా కాదా అనే చర్చ సాగుతున్నది. కార్ల్ యూంగ్ (Carl Jung) వంటివారు దీనికి శాస్త్రీయ గౌరవాన్ని తెచ్చిపెట్టే ప్రయత్నం చేశారు. జె.బి. రైన్ వంటివారు డ్యూక్ యూనివర్శిటీలో (అమెరికా) పరిశోధనలు చేసి ఫలితం కోసం తిప్పలు పడ్డారు. సోవియట్ యూనియన్‌లో పరిశీలన తీవ్రస్థాయిలో జరిపారు. అయినా ఇంతవరకూ శాస్త్రీయ నిర్ధారణకు నిలిచే ప్రయోగం తేల్చలేదు. దూరాన వున్న మనుషుల్ని, వస్తువుల్ని తాకకుండానే ప్రభావితం చేయడం, మనస్సు బలంతో వస్తువుల్ని కదల్చడం, మొదలైన చర్యలు చేయవచ్చునని కొందరు భావించారు. ప్రదర్శనలు చేశారు. ఇలాంటి శక్తికి సైకోకెనిసిస్ అని పేరు పెట్టారు. ఇజ్రాయిల్‌కు చెందిన యూరిగెల్లర్ చెంచాలను వంచడం, గాలిలో నుండి వస్తువుల్ని సృష్టించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. అదంతా అతీంద్రియ శక్తిగా గెల్లర్ చాటుకున్నాడు. జోసెఫ్ బి. రైన్ కూడా సైకో కెనిసిస్ పై ప్రయోగాలు చేశాడు. గైగర్ కౌంటర్ పరిశోధనలు జరిపాడు. రేడియో యాక్టివిటి విచ్ఛిన్నత ఆధారంగా ప్రయోగాలు ఎన్నో చూచాడు. ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ (అమెరికా)లో రాబర్ట్ జాన్ చాలా ప్రయోగాలు చేశాడు.

ఇంతవరకూ టెలిపతిలోగాని, సైకోకెనిసిస్‌లోగాని శాస్త్రీయ పరిశోధనకు నిలిచేవి కనిపించలేదు.

గుర్రపు పందాలలో ఎవరు గెలుస్తారు, లాటరీ టిక్కెట్టులో దేనికి ప్రథమగెలుపు దక్కుతుంది అనేవి యీ శక్తుల ద్వారా ఎందుకు చెప్పలేకపోతున్నారనే విమర్శకు సమాధానం రావడం లేదు. అయినా నమ్మకస్తులు మొండిగా వీటిని ప్రచారం చేస్తూనే వున్నారు. టెలిపతి ప్రకారం ఒక వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండానే మరో వ్యక్తి మెదడులో ఆలోచనలు గ్రహించగలిగితే, మెదడు ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలి. మనిషి మెదడులో సుమారు పది బిలియన్ల కణాలున్నాయి. వీటి పరస్పర సంబంధాలు జటిలంగా వుంటాయి. ఆలోచనలు, ఉద్వేగాలు, నిర్ణయాలు అన్నీ మెదడులో జనించి, ప్రసరిస్తాయి. ఈ కణాలు న్యూరాన్స్ (Newrones) యాగ్జాన్స్ (Axons) కు అతిచేరువగా వుంటాయి. కణాలిచ్చే సంకేతాలను

యాగ్జాన్లు క్షణంలో మరోచోటకు చేరుస్తాయి. ఇదంతా విద్యుత్తు రసాయనిక చర్యగా సాగిపోతుంటుంది. న్యూరాన్ల మధ్య సంబంధాలకు అయోన్లు అనే అణువులు ఉపకరిస్తాయి. మెదడులో జరిగే యీ ఆలోచనా ప్రక్రియ మరో మెదడుకు తెలియాలంటే సంకేతాలు ఏదొక విధంగా బయట పడాలన్నమాట. టెలిపతి ప్రకారం ఆ సంకేతాలను గ్రహించిన వ్యక్తి, వాటి భావాన్ని బయటపెడతాడు. టెలిపతి ప్రకారం అవతల వ్యక్తి మెదడులో సంకేతాలను ఎలాగో తెలుసుకోవడమేగాక వాటి అర్థాన్ని విప్పి చెప్పగలగాలి. మెదడులో భిన్న భాగాలు భిన్న పనులు నిర్వహిస్తుండగా, టెలిపతి ప్రకారం వీటిని స్వీకరించడమేగాక, సమన్వయీకరించి, అర్థం చెప్పాలి కూడా. ఇది సాధ్యమా?

కొందరు పేరా సైకాలజిస్టులు యీ జటిల సమస్యలోని చిక్కుముడి విప్పడానికి ఒక పరిష్కారం కనుగొన్నారు. మెదడు నుండి సిట్రాన్స్ అనే కణాలు వస్తాయని (psitrons) వీటికి సాంద్రత, శక్తి వుండదనీ అన్నారు. క్వాంటం సిద్ధాంతం చెప్పే న్యూట్రినో (Neutrino) వంటివే సిట్రాన్లు అని సామ్యం చూపారు. కార్ల్ యూంగ్ వంటి సైకాలజిస్టులు యీ విషయంలో కోపు వేసుకున్నారు. సిట్రాన్ల సహాయంతో ఇతర మనస్సులలో జరిగే ప్రక్రియను తెలుసుకుంటున్నారన్నారు.

క్వాంటం ఫిజిక్స్‌లో న్యూట్రినోలు అంచనాలకు, పరిశోధనలకు అందాయి. ఫలితాలు వచ్చాయి.

టెలిపతి చెప్పే సిట్రాన్ల వునికి యింత వరకు నిర్ధారణ కాలేదు. అదే ప్రధానమైన తేడా.

మెదడుపై ఆధునిక శాస్త్రం చేసిన పరిశోధనలు యింకా కొనసాగుతుండగా, యిప్పటి వరకూ తెలిసిన విషయాలు కొన్ని అంశాలను బయటపెట్టాయి.

మెదడు పనిచేసే తీరులో నాలుగు విధాలైన తరంగాలను కనుగొన్నారు. వీటిని గ్రహించడానికి ఎలక్ట్రో ఎన్‌సిఫలో గ్రాఫ్ (EEG) తోడ్పడుతుంది.

ప్రతి సెకండ్‌కూ మెదడులోని వివిధ తరంగ ప్రకంపనాల ప్రసారాలు భిన్న తీరుల్లో వుంటాయి.

మెదడు విశ్రాంతిగా ఉన్నప్పుడు ఆల్ఫా తరంగాలు జనిస్తాయి. (Alpha rhymes)

మెదడు చురుకుగా పనిచేస్తుండగా బీటా (Beta) తరంగాలు ప్రకంపిస్తాయి.

నిద్రలో మెదడు డెల్టా తరంగాలను విడుదల చేస్తుంది.

గాఢనిద్రలో తీటా (Theta) తరంగాలు వస్తాయి.

ఈ తరంగాలన్నీ సెకండుకు ప్రసరించే వేగాలలో మార్పు వుండగా, ఇఇజి పరికరం వాటిని చూపగలుగుతుంది. ఇవన్నీ వైద్యరంగానికి బాగా తోడ్పడ్డాయి. మూర్ఛరోగులకు చికిత్సలో యివి సహకరించాయి.

టెలిపతిలో పనిచేసే తీరు వివరించడానికి యీ పరికరం వాడిన (EEG) వారు, ఫలితాలను సాధించలేకపోయారు. సందేహవాదుల సమక్షంలో టెలిపతి పనిచేయదని మరికొందరు వాదించారు!

టెలిపతి రుజువు పరచడానికి చేసిన ప్రయత్నాలలో భాగంగా ఇంగ్లండ్ ఆర్థర్ కోస్లర్ 1985లో ఎడిన్‌బర్గ్ యూనివర్శిటీలో ఒక కేంద్రం నెలకొల్పారు.

ఎక్కడైనా ఒక విద్యార్థి అనూహ్య ప్రతిభను చూపినప్పుడు అదంతా టెలిపతి వల్లనే అనడం ఆనవాయితీ అయింది. ఎక్కడా టెలిపతి శాస్త్రీయ పరిశోధనకు నిలవలేదు.

సైకో కెనిసిస్ వాదులు రేడియో సంకేతాల సామ్యం చూపుతూ, అలాంటి "ఆలోచనా సంకేతాలు" దూరానవున్న వస్తువులపై ప్రభావం చూపుతాయన్నారు. రేడియో సిగ్నల్స్ సమాచారాన్నందిస్తాయి. వాటి వలన వస్తువులు కదలవు, చెంచాలు వంగవు. విద్యుదయస్కాంత రేడియేషన్ వంటిది ఆలోచనా తరంగాలలో వుంటే, అదెక్కడా రుజువుకు నిలబడలేదు. రుజువుకు అతీతమైనదని టెలికెనిసిస్ వాదులు అంటే అది వారి మూఢ నమ్మకాన్ని సూచిస్తుంది.

పేరా సైకాలజీ నిపుణుడుగా పేరొందిన జె.బి. రైన్ అమెరికాలోని నార్త్ కెరోలైనా రాష్ట్ర డ్యూక్ యూనివర్శిటీలో 1930 నాటికి ఒక శాఖను స్థాపించాడు. శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు చేసి, పేరా సైకాలజీకి గౌరవాన్ని ఆపాదించే ప్రయత్నంలో ఆయన వేలాది పరిశోధనలు చేశాడు. అందులో పేక ముక్కల వంటి కార్డులను ప్రయోగించి, కార్డులలో ఏముందో ఎటువైపు అవి కనిపిస్తాయో అనే అంశం పరిశీలించాడు. అలాగే చదరంగంలో పావులు కూడా వినియోగించాడు. నాణాలు ఎగరవేస్తే తల, తోక (బొమ్మబొరుసు) ఎటుపడతాయో లెక్కలు కట్టాడు.

1934లో లాంగ్‌మూర్ అనే నోబెల్ ప్రైజ్ గ్రహీత వెళ్ళి జె.బి. రైన్ పరిశోధనల్ని శ్రద్ధగా తిలకించాడు. పరిశీలకులు తమను తామే వంచించుకుంటున్నారని, లేని వాటికోసం వెతుకుతున్నారని, అదంతా దయనీయమైన స్థితిగా వున్నదని అన్నాడు. తన అభిప్రాయాన్ని జె.బి. రైన్‌కు చెబితే, అతడు ఆశ్చర్యపడక పోగా, ఇర్వింగ్ లాంగ్ మూర్ అభిప్రాయాల్ని బయట పెట్టమని కోరాడు. తద్వారా తనకు ప్రచారం లభిస్తుందన్నాడు.

జె.బి. రైన్ తన పరిశోధనలలో పాల్గొన్న వారు కొందరు కావాలని తప్పుడు అంచనాలు వేస్తున్నా, వాటిని రైన్ బయట పెట్టకుండా దాచినట్లు లాంగ్ మూర్ కనుగొన్నాడు. తనంటే యిష్టం లేనివారు అలా తప్పుడు అంచనాలు వేశారు గనుక వారి లెక్కల్ని చేర్చలేదని రైన్ అన్నాడు. తప్పుడు అంచనాలు వేస్తున్నారని రైన్‌కు ఎలా తెలుసు? లెక్కల్లో కొన్ని మరీ తక్కువ అంచనాలు చూపడమే.

లాంగ్ మూర్ అనే సైంటిస్టు పేరా సైకాలజీలో ఆసక్తి కనబరచాడనే ప్రచారం చేశారు తప్ప, అతను ఖండించిన రైన్ పరిశోధనల్ని బయట పెట్టలేదు?

నెవాడ యూనివర్శిటీలో పేరా సైకాలజిస్ట్ డీన్ రాడిన్ పరిశోధనలు చేబట్టి, ఒకానొక వ్యక్తికి చెమట పోసే రీతులలో ఉద్వేగ స్థాయిని కొలవ వచ్చునన్నాడు. కంప్యూటర్ ముందు ఒక వ్యక్తిని కూర్చోబెట్టి కొన్ని గందరగోళపరచే బొమ్మల వలన ఎలా వూహలు మారతాయో చూడవచ్చునన్నాడు. అంతటితో ఆగక, రానున్న బొమ్మను వ్యక్తి వూహించడం ద్వారా అతడిలో ఉద్వేగాలు మారతాయన్నాడు. కొందరు ముందే ఎలాంటి బొమ్మ రానున్నదో సరిగా చెప్పగలుగుతారన్నాడు.

అమెరికాలో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ 1987లో పేరా సైకాలజీని క్షుణ్ణంగా పరిశీలించి, 130 సంవత్సరాల పరిశోధనలలో ఎలాంటి శాస్త్రీయ నిర్ధారణ జరగలేదని స్పష్టం చేశారు.

న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో రాబర్ట్ జాన్ పేరా సైకాలజీ పరిశోధనలు చేశారు.

ఒక బల్ల ముందు గైలిన్ (Guillen) కూర్చొని, ఒక బొమ్మ కప్పను తన మనోబలంతో తన దగ్గరకు రప్పించాలని ప్రయత్నించాడు. దూరంగా జరిగినప్పుడు మనోబలం తీవ్రంగా లేనట్లు, సమీపంగా వచ్చినప్పుడు మనోబలంతోనే అది చెంతకు వచ్చినట్లు పేర్కొన్నారు. సైకో కెనిసిస్, వస్తువులపై మనోబలం చూపే విధానానికి యిదొక నిదర్శన అని చూపదలచారు. అలాగే నీళ్ళ పంపులలో నీటిచుక్కలపై మనోబలం గురించి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలలో పాల్గొనే అసిస్టెంట్లు చాలా సందర్భాలలో తమ "బాస్"ల తృప్తి కోసం అనుకూల ఫలితాలు చూపినట్లు బయటపడింది.

లాంగ్ మూర్ యీ పేరా సైకాలజీని పేథలాజికల్ సైన్స్‌గా చిత్రించారు.

పేరా సైకాలజి ఒక ఫాషన్‌గా, అంటువ్యాధిలా వ్యాపించింది. దీనికి సైంటిఫిక్ ముసుగు తొడిగి గౌరవం ఆపాదించాలనే ప్రయత్నంలో కోట్లాది ధనం వెచ్చించి, వృధా ప్రయాసకు గురి అయ్యారు. ఫలితాలు మాత్రం శూన్యం.

## పేరా సైకాలజీ చరిత్ర

తొలుత పేరా సైకాలజీలో అనేకాంశాలు పరిశీలనలోకి స్వీకరించారు. దూరదృష్టి, దూరశ్రవణం, భవిష్యత్తును చెప్పడం, మనోబలంతో వస్తువుల్ని కదలించడం, దయ్యాలు, భూతాలు, ఆత్మలు, పునర్జన్మ, గాలిలో తేలడం, మనోశక్తితో ఇతరుల మనస్సులలో ఆలోచనలు గ్రహించడం యిత్యాదులన్నీ చేర్చారు. ఇలాంటివి అన్ని సమాజాలలో పూర్వకాలం నుండి వున్నాయి. యూరోప్‌లో ఆధ్యాత్మికత పేరిట అధ్యయనాలు బాగా సాగాయి. కొందరు తమ వృత్తులు సైతం వదలి, అదే పనిగా ఇంద్రియాతీతశక్తులపై దృష్టి సారించారు.

మొట్టమొదటగా 1882లో సైకిక్ పరిశోధనాకేంద్రాన్ని లండన్‌లో ప్రారంభించారు. వీరి పరిధిలో శక్తులు, ఆత్మలు, పూనకాలు, దయ్యాలు, భూతాలు, మనస్సుల మధ్య సంబంధాలు వుండేవి. కేంబ్రిడ్జి తాత్వికుడు హెన్రి సిడ్జిలిక్ యీ సైకిక్ రీసెర్చి సంఘానికి అధిపతిగా వ్యవహరించాడు. అందులో 13 మంది ఆధ్యాత్మిక వాదులు, ఆరుగురు పరిశోధకులు వుండేవారు. పరిశీలన అంతా ఆ ఆరుగురు మాత్రమే చేస్తుండగా ఆధ్మాత్మికవాదులు ఒక్కరొక్కరే తప్పుకున్నారు. 1887 నాటికి కొందరు సుప్రసిద్దులు యీ సంఘంలో చేరారు. సర్ ఆలివర్ లాడ్జి, లార్డ్ రాలి, జె.జె. థాంసన్‌లు సైకిక్ రీసెర్చి సంఘంలో ఆసక్తిగా పాల్గొన్నారు. ఆత్మకు శాస్త్రీయ గౌరవం ఆపాదించాలని యీ సంఘం ప్రయత్నించింది. వ్యక్తికి భౌతికేతర అంశం కూడా చాలా ప్రధానం అని వీరు తలచారు. అయితే వీరు, టెలిపతితో బాటు, దృశ్యాలు కనబడడంతో సహా అనేకాంశాలు పరిశీలనలోకి స్వీకరించారు. మనస్సును గ్రహించడం, టెలిపతి శక్తుల గురించి దృష్టి బాగా కేంద్రీకరించారు. అనేక శక్తులు సరైనవేనని వీరు నమ్మారు. సర్ ఆలివర్ లాడ్జి తన కీర్తిశేషుడైన కుమారునితో మాట్లాడినట్లు చెప్పుకున్నాడు.

ఈ సంఘం వారిలో కొందరు ఆత్మల పరిశీలనాంశాలలో మోసాలు జరిగినట్లు ఒప్పుకున్నారు.

చేతులు వాటంతట అవే రాస్తూ పోవడం ఒక శక్తిగా యీ సంఘం నమ్మింది. అవన్నీ ఆధ్యాత్మిక రంగానికి అంటగట్టారు.

ఇంగ్లండ్‌లో సైకిక్ రీసెర్చి ప్రారంభించిన తరువాత, 1985లో అలాంటి సంఘాన్ని అమెరికాలోని బోస్టన్‌లోనూ మొదలెట్టారు. సుప్రసిద్ధ సైకాలజిస్టు విలియం జేమ్స్ యిందులో పాల్గొన్నాడు. కాని ఆధ్యాత్మిక శక్తులలో వీరికి పూర్తి నమ్మకం లేక, కొన్ని కలహాలు తలెత్తాయి, సంఘం చీలింది. ఉత్తరోత్తరా సైకాలజిస్టు విలియం మెగ్డోగల్ మరికొందరు సంఘాన్ని పునరుద్ధరించారు.

సైకిక్ సంఘం కలగాపులగంగా మారడంతో, పేరా సైకాలజీని విడదీసి, శాస్త్రీయ గౌరవం ఆపాదించే నిమిత్తం జోసెఫ్ బాంక్స్ రైన్ ప్రయత్నించాడు.

సైకికల్ రీసెర్చి స్థానే పేరా సైకాలజీని 1930 నుండీ జె.బి. రైన్ ప్రచారంలోకి తెచ్చాడు. పరిశోధనాలయాలలో శాస్త్రీయ పరిశీలన చేసి పేరా సైకాలజీని సైన్స్‌లో భాగంగా చేయాలని రైన్ కృషి చేశాడు. ది జర్నల్ ఆఫ్ పేరా సైకాలజీ అనే పత్రిక ప్రారంభించాడు. అంతకు ముందు జర్నల్ ఆఫ్ సైకికల్ రీసెర్చి పత్రిక ఇంగ్లండు నుండి వెలువడుతూ దయ్యాలు, పూనకాలతో సహా అన్ని అంశాలు ప్రచురించింది.

ప్రపంచ వ్యాప్తంగా పరిశోధకులు పేరా సైకాలజీకి శాస్త్రీయ గౌరవం తెచ్చే ప్రయత్నంలో నిమగ్నులయ్యారు. అమెరికన్ సైంటిఫిక్ సొసైటీలో సభ్యులుగా పేరా సైకాలజిస్టులు చేరడం గమనార్హం. పరిశోధనాంశాలు ప్రమాణ పత్రికలో ప్రచురించారు. అయితే పేరా సైకాలజీ 4

ప్రధానాంశాలకే పరిమితమై మిగిలిన వాటిని మూఢ నమ్మకాలుగా తృణీకరించింది. ఇది గ్రహించవలసిన అంశం.

**టెలిపతి**

పేరా సైకాలజీలో అత్యంత ప్రధానాంశంగా టెలిపతి వున్నది. ఏ ఆధారం లేకుండానే ఇతరుల మనస్సులలోని విషయాలు గ్రహించి చెప్పగలగడం యిందులో విశేషం.

దూరదృష్టి రెండో పరిశీలనాంశంగా టెలిపతి స్వీకరించింది. వస్తువులు ఎక్కడ వున్నాయో గ్రహించడం, ఇతరుల రోగాల గురించి తెలుసుకోవడం, ఇందుకుగాను తెలిసిన ఆధారాలేవీ వుండక పోవడం యిందలి ఆశ్చర్యకర అంశం.

భవిష్యత్తును చెప్పడం, ఉపద్రవాలను హెచ్చరించగలగడం మరో అంశం.

మనోబలంతో వస్తువుల్ని కదలించడం, వాటిపై వివిధ రీతులలో ప్రభావాన్ని చూపడాన్ని సైకో కెనిసిస్ అంటారు. పేరా సైకాలజీ దీనిని కూడా తన పరిధిలోకి స్వీకరించింది. అయితే కేవలం మనో శాస్త్రానికో, భౌతికశాస్త్రాలకో పరిమితం కానందున దీనిని పేరా సైకాలజీ అంటున్నారు. కొంతమేరకు శాస్త్రీయ పరిశోధనను తీసుకొని, మిగిలిన శక్తులు కూడా వున్నాయనడం యీ పేరా సైకాలజీ ప్రత్యేకత. జ్యోతిష్యం, ఎగిరే పళ్ళాలు, స్పటికాల ప్రభావం మొదలైనవి పేరా సైకాలజీ స్వీకరించలేదు.

1957లో పేరా సైకాలజీకల్ అసోసియేషన్ ఏర్పడి, వార్షిక సమావేశాలు జరుపుతూ, పరిశోధనా ఫలితాలను చర్చిస్తూ పోతున్నది. అవన్నీ వివిధ పేరా సైకాలజీ పత్రికలు ప్రచురిస్తున్నాయి.

*- మిసిమి మాసపత్రిక. ఫిబ్రవరి-2001*

# ఇంద్రియాతీత శక్తులు-2

1969లో విజ్ఞానాభివృద్ధికి ఏర్పడిన అమెరికా సైన్సు సొసైటీ వారు పేరాసైకలాజికల్ అసోసియేషన్‌కు అనుబంధ సభ్యత్వం ప్రసాదించారు. హ్యూమనిస్ట్, కాగ్నిటివ్ సైకాలజి శాఖలు బయలుదేరి మోహనిద్ర, కలలు, ధ్యానం, తెచ్చిపెట్టుకునే విశ్రాంతి యిత్యాదులను అధ్యయనం చేశాయి. హెల్మెట్ షిమిట్ (Helmet Schmidt) కృషి ఫలితంగా అతీంద్రియశక్తుల పరిశోధనలలో పాతపావుల, కార్డుల పద్ధతుల స్థానే ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించారు. 1985లో ఇంగ్లండ్‌లో అర్థర్‌కోస్లర్ పీఠాన్ని స్థాపించి పేరా సైకాలజీ అధ్యయనం ఎడిన్‌బరో యూనివర్శిటీ ఆరంభించింది. సమన్వయ పేరా సైకాలజీ పేరిట పీఠాధిపతి రాబర్ట్‌మోరిస్ కొత్త ప్రతిపాదనలు తెచ్చాడు. పరిశోధకులు కొందరు పి.హెచ్.డి.లు తీసుకున్నారు. ఇతర శాఖలతో సమన్వయం,

శాస్త్రీయ పద్ధతులు కొత్త ప్రతిపాదనలలో చోటుచేసుకున్నాయి. రానురాను అమెరికాలోని డ్యూక్ యూనివర్శిటీ, ఇంగ్లండ్‌లోని ఎడిన్‌బరో యూనివర్శిటీ కూడా కొన్ని పేరా సైకాలజీ కేంద్రాల్ని మూసేయడం గుర్తించాలి. జె.బి. రైన్ అతని భార్య కూడా పేరా సైకాలజీ రీసెర్చి పేరిట దొంగనివేదికలు, లెక్కల మోసాలు జరిగినట్లు గుర్తించారు. కొన్నాళ్ళు గుట్టు చప్పుడు కాకుండా వుంచినా చివరకు వారు భరించ లేక నిజాలు బయటపెట్టారు. పేరా సైకాలజీకి ఎదురుదెబ్బ తగిలింది. పేరా సైకాలజీ పరిశోధనలలో పాల్గొనే వ్యక్తులు తమకూ బయట ప్రపంచానికీ గల సంబంధాలను వివరించడంలో అనేక భ్రాంతులకు, దోషాలకు గురౌతున్నట్లు తెలిసింది. వీటిని నివారించి, పరిశోధించడానికిగాను, కొన్ని జాగ్రత్తలు వహిస్తున్నారు. తలవని తలంపుగా వచ్చిన అనుభవాలను రికార్డు చేసుకోవడం ఒక ముఖ్యదశగా వుంది. వ్యక్తి ఆలోచనలు, అనుభూతులు వెల్లడించినప్పుడు, వాటికి అనుగుణంగా బయట జరిగిన వాటిని జోడించి చూచుకోవడం యిందులో ప్రధానాంశం. వ్యక్తుల అనుభవాలను, జరిగిన సంఘటనలను క్షుణ్ణంగా పరిశీలించడం రెండో దశ. మూడోస్థాయిలో వ్యక్తుల అనుభవాలను, వారుచెప్పేవాటిని, తదనుగుణంగా బయట జరిగినట్లు చెప్పేవాటిని, పరిశోధనాలయంలో నిశిత పరిశీలనకు గురిచేస్తున్నారు. సైన్స్‌లో అన్వయించే పంథాలను పాటించడాన్ని, కంట్రోల్డ్‌పరిశోధన అంటున్నారు.

ఇలాంటి పరిశోధనలు జరిపినప్పుడు పేరా సైకాలజి కొన్ని సమస్యల చిక్కులో పడక తప్పడంలేదు. ఒక వ్యక్తి తన అతీంద్రియ శక్తితో రెండో వ్యక్తి శరీరాన్ని ప్రభావితం చేశాడనుకుందాం. మొదటి వ్యక్తి దృష్టిలో అది సైకొకొనిసిస్ అయితే, రెండో వ్యక్తికి అది టెలిపతి అవుతుందా? అతీంద్రియ శక్తితో దూరాన వున్న వస్తువును కదలిస్తే, అలాంటి ప్రయోగాన్ని మళ్ళీ చేసి చూపించవచ్చా? భవిష్యత్తును ముందే చెప్పగల శక్తిని ఎలా పరిశోధనకు గురి చేస్తారు? ఇలాంటి ప్రశ్నలు చిక్కు సమస్యలుగా పేరా సైకాలజీలో మిగిలిపోతున్నాయి.

అతీంద్రియశక్తి వుంటే, శరీరంలో అది అంతర్గతంగా యిమడ్చగల అవకాశం వుందా? వుంటే పరిణామంలో మనుషులకు ఎంతో ప్రయోజనకారి అవుతుంది గదా. అతీంద్రియ శక్తి కావాలని పెంపొందించుకోవచ్చా?

అతీంద్రియ శక్తికొన్ని సార్లే పనిచేయడం, బయట పడడం, మిగతా సమయాల్లో పనిచేయకపోవడం జరుగుతుందా? ఎందుకని? అన్ని సమయాల్లోనూ అతీంద్రియశక్తితో వస్తువులపై ప్రభావం చూపెట్టలేకపోడానికి కారణాలు ఏమిటి? ఇలాంటి సందేహాలు, ప్రశ్నలు తలెత్తాయి. సమాధానం రావలసి ఉంది.

## సైకొకెనెసిన్ (మనోశక్తితో వస్తువుల కదలిక)

పేరా సైకాలజీలో మనోశక్తితో దూరానవున్న వస్తువులపై వివిధ విధాల ప్రభావం చూపెట్టడం ఒక ప్రధానాంశంగా ప్రచారంలో వుంది. ఇందులో పెద్ద వస్తువులు, సూక్ష్మపదార్థాలపై

ప్రభావం అని విడదీసిచెబుతున్నారు. పెద్ద వస్తువులపై ప్రభావం అంటే, బల్లను గాలిలోకి లేవనెత్తడం, చెంచాలను వంచడం మొదలైనవి ఉదాహరణలుగా చెప్పారు. సూక్ష్మంగా వస్తువులపై ప్రభావం చూపడం అంటే పావులు ఎగరేసి, నాణాలు విసిరేసి, బొమ్మ బొరుసు కావాలనుకున్న తీరులో వచ్చేటట్లు చేయడమన్నమాట. ఛాన్స్ పద్ధతిలో వచ్చే అంచనాకు విరుద్ధంగా ఎక్కువ సార్లు మనోశక్తి ఎలా కావాలనుకుంటే అలా వస్తుందని ప్రచారం చేశారు.

రోగులను మనోశక్తితో నయం చేయడం కూడా సైకొకెనిసిస్ తన శక్తిగా చూపుతున్నది. వీటన్నిటినీ ఆయా సందర్భాలలో పరీక్షకు గురిచేశారు. యూరిగెల్లర్ చేసిన కొన్ని పనులు, స్పూన్ వంచడం వంటివి జేమ్సురాండి 1982 లోనే చూపాడు. మరికొన్ని శక్తులు, ముఖ్యంగా రోగాలు నయం చేసే అంశాలలో మోసాలు, కప్పి పుచ్చడాలు బయటపడ్డాయి. హెల్మెట్ షిమిట్ వంటి వారి పరిశోధనలలో తీవ్రలోపాలను సి.ఇ.ఎం. హాన్సల్ (C.E.M. Hansel) చూసి, మూలపద్ధతిలోనే దోషాలు వున్నట్లు వెల్లడించారు. కొందరు పేరా సైకాలజిస్టులు చిత్తశుద్ధితో శాస్త్రీయ పద్ధతిలో ప్రయోగాలు చేసి రుజువులకై తిప్పలు పడుతున్న మాట వాస్తవం. కాని వారికి అడుగడుగునా తీవ్ర ప్రతిబంధాలు ఎదురౌతూనే వున్నాయి.

పళ్ళాలు, చెంచాలు యిత్యాది వస్తువుల్ని వంచడం, తుంచడం, వంటివి శక్తులుగా చూపిన ఉదంతంపై పరిశోధన జరిగింది. 160 గంటల పరిశీలనను అల్ఫా ప్రాజెక్టు అన్నారు. సైకిక్ రీసెర్చ్‌కి నిధులు సమకూర్చి సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్శిటీ వారిని పరిశోధించమన్నారు ఈ లాబ్‌ను మాక్ లాబ్ (MAC LAB) అంటారు. జేమ్స్ రాండి శిష్యులు యిరువురు కూడా ఆ పరిశోధనలో చేరారు. తరువాత జరిగిన ట్రిక్ అంతా డిస్కవరీ పత్రిక వివరంగా వెల్లడించింది.

## పేరా సైకాలజి - పబ్లిసిటి

పేరా సైకాలజి పేరిట జరిగే సంఘటనలు నిజమా, కాదా అనే విచక్షణ గాని, విచారణ గాని లేకుండానే పత్రికలు, రేడియో, టి.వి.లలో ప్రచారం విపరీతంగా వస్తున్నది. ఈ విషయంలో పాఠకులకు, ప్రేక్షకులకు వాస్తవాలు తెలిపే దానికంటే, వ్యాపారసరళి బాగా కనిపిస్తున్నది. అతీంద్రియ శక్తులకు చెందిన అద్భుతాలు ఆసక్తి కలిగిస్తాయి గనుక, జనం ఆత్రుతగా చదువుతారుగనుక, వాటికి చాలా ప్రాధాన్యత లభిస్తున్నది. అద్భుతాలు, మూఢనమ్మకాలు, అతీంద్రియశక్తుల విషయమై సందేహవాదులు, సైంటిస్టులు చేసే హెచ్చరికలు, వాస్తవాలు అంత ప్రాధాన్యతను సంతరించుకోవడం లేదు.

ప్రజలు నమ్మడానికి సిద్ధంగా వున్నారు. నిజా నిజాలతో వారికి నిమిత్తం లేదు. అతీంద్రియ సంఘటన వెనుకవాస్తవాన్ని వివరించడానికి సమయం పడుతుంది. పైగా వివరణ చాలా చిక్కులతో, జటిలంగా వుండవచ్చు. ఒక కథ వలె సాగిపోతున్న ఇంద్రియాతీత శక్తి

సంఘటన వలన పత్రికల సర్క్యులేషన్ పెరుగుతుంది. పత్రికలలో అతీంద్రియ శక్తుల వార్తలు వేసినంతగా వాటి వ్యతిరేక వార్తలు, ప్రధానంగా చోటుచేసుకోవు. సంపాదకులు, రిపోర్టర్లు, అతీంద్రియ శక్తుల్ని నమ్మడం, లేదా ఆసక్తి కనబరచడం వలన ప్రసారాలు, ప్రచారంలో అవి ప్రాధాన్యత పొందుతాయి. అలాగే ప్రసార సాధనాల యాజమాన్యం కూడా ఆసక్తి కనబరచి తమ వ్యాపార లాభాలకై ఏ స్థాయికైనా వెడుతున్నారు. ఈ ధోరణివలన వాస్తవాలు దెబ్బతింటున్నాయి. వార్త నిజం కాదని తెలిసినా అతీంద్రియశక్తుల వార్తకు తాము బాధ్యులం కాదని ప్రచురించరు.

అతీంద్రియ శక్తుల వార్తలు ప్రచురించడంలో, ప్రసారం చేయడంలో కొన్ని నియమాలు పాటించడం అవసరం. అతీంద్రియ శక్తులున్నాయని బాబా, మాత, లేదా మారుమూల వ్యక్తులు చెబుతున్నప్పుడు, మూలాధారాల కోసం రిపోర్టర్లు అన్వేషించాలి. చెప్పుడు మాటల్నిగాక, ఆధారాలే ప్రమాణంగా స్వీకరించాలి. ఇంద్రియాతీత శక్తుల పరిమితులు - శాస్త్రీయ పంథాలు పోల్చి చూచుకోవాలి. లోగడ అలాంటి అతీంద్రియ శక్తుల విషయమై జరిగిన పరిశోధనల్ని దృష్టిలో పెట్టుకొని వార్తలు ప్రచురించాలి. అతీంద్రియ శక్తుల వెనుక వున్న సాధారణ పరిస్థితులు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. విమర్శల్ని పక్కనబెట్టరాదు. అతీంద్రియ శక్తులున్నాయన్నప్పుడు బహిరంగ ప్రదర్శనకై వత్తిడి చేయాలి. ఆ సంఘటనను పరిశీలనకు పెట్టాలి. సంఘటనలో కప్పిపుచ్చి, మోసపూరితంగా వ్యవహరించే ధోరణిని అరికట్టాలి. సంఘటనపై చిలవలు పలవలుగా ప్రచురించే కరపత్రాలు, అభిప్రాయాలు ప్రమాణంగా తీసుకోరాదు. ఇలాంటి నియమాలు ప్రసార సాధనాలు, పత్రికలు పాటించగలిగితే, మూఢ నమ్మకాలు జనాన్ని మోసంచేయజాలవు. ఒకానొక అతీంద్రియ సంఘటనకు మీడియా యిస్తున్న విపరీత ప్రాధాన్యత వలన ప్రజలలో ఆసక్తి పెరగడమేగాక, మూఢ నమ్మకాలు ధృవపడుతున్నాయి. దీనికి తగ్గట్లుగా అతీంద్రియ శక్తిని బట్ట బయలుచేస్తూ వచ్చిన నివేదికను, వార్తను చాలా అప్రధానంగా ప్రచురించడం వలన ఎంతో హాని జరుగుతున్నది. ఇలాంటి ధోరణిపత్రికా రంగంలో సర్వసాధారణంగా కనిపిస్తున్నది. బొత్తిగా బాధ్యత లేని అశాస్త్రీయ ధోరణి అటు రిపోర్టర్లలోనూ, యిటు సంపాదకులలోనూ సర్వత్రా కనిపిస్తున్నది. ప్రజలకు శాస్త్రీయంగా నిజాలుచెప్పాలనే ధోరణి రానంత వరకూ అతీంద్రియ శక్తుల పట్ల నమ్మకం సడలదు.

## అతీంద్రియ శక్తుల పట్ల సందేహాలు

ప్రాచీనకాలం నుండీ చెదురు మదురుగా ఇంద్రియాతీతశక్తుల పట్ల సందేహాలు, ఖండన మండనలు వ్యక్తమౌతూనేవున్నాయి. గ్రీస్-రోమన్ ప్రాంతాలలో సందేహ వాదపితామహుడుగా ఇలిస్‌కు చెందిన పైరో (Pyrrho)ను చెప్పవచ్చు - 360 - 270 క్రీ.పూ. ఆ తరువాత అకడమిక్ సందేహవాదం ప్లేటో అకాడమీ నుండి పుట్టింది. ఆర్సిలాస్ (Arcesilaws), కార్నిడాస్ (Carneades) యీ రంగంలో పేర్కొనదగినవారు. ఆధునికయుగాలలో పైర్‌బేల్ (1647-1706), రేనడెకార్ట్ (1596-1650), డేవిడ్ హ్యూం (1711-1776) సందేహవాదానికి పునాదులు

గట్టిగా వేశారు. ఫ్రెంచి అకాడమీ ప్రత్యేక విచారణలు జరిపి ఫ్రాంజ్ మెస్మర్ (1734--1815) యానిమల్ మాగ్నటిజపు బూటకాలను బట్టబయలు చేసింది. 19వ శతాబ్దం చివరలో 20వ శతాబ్దం ప్రారంభంలో అనేక అతీంద్రియ శక్తుల గురించి పరిశోధనలు జరిగాయి. ఏదీ శాస్త్రీయ పరిశీలనలో రుజువు కాలేదు. జె.బి. రైన్ వచ్చి అతీంద్రియ శక్తులకు శాస్త్ర గౌరవం కోసం అనేక పరీక్షలు జరిపాడు. సైకాలజిస్టు బి.ఎఫ్. స్కిన్నర్ యీ రంగంలో రైన్ వృథా ప్రయాసను తీవ్రంగా ఎదుర్కొన్నాడు. సైకొ కెనిసిస్‌పై శాస్త్రీయ విమర్శలను ఎడ్వర్డ్ గిర్డెన్ (Edward Girden) ప్రచురించాడు.

1976లో అమెరికాలో అతీంద్రియ శక్తుల శాస్త్రీయ పరిశీలనకు ఒక నిపుణుల సంఘం ఏర్పడింది. దీనిని సికాప్ (CSICOP) అని పొడిగా పిలుస్తారు. పాల్‌కర్జ్ సంఘాధ్యక్షుడుగా ఇందులో అనేకులు పనిచేశారు. సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు కార్ల్‌శాగన్, తాత్వికులు సిడ్నీ హుక్, ఎర్నెస్ట్ నాగెల్, మార్టిన్ గార్డ్‌నర్, జేమ్స్ రాండి, డబ్లు. వి. క్విన్, ఫిలిప్ క్లాజ్, మార్సిలో ట్రూజి, రేహైమన్ ప్రభృతులు బాగా లోతుపాతులు అధ్యయనం చేశారు.

సైకో కెనిసిస్ రంగంలో ప్రపంచ ప్రసిద్ధుడుగా ఆవిర్భవించిన యూరిగెల్లర్ స్పూన్ (చెంచాలు) వంచడం వంటి ఇంద్రియాతీతశక్తి వెనుక వున్న కిటుకులను బయటపెట్టి యీ సంఘం శాస్త్రీయంగా ముందుకు సాగింది. సంఘం పక్షాన స్కెప్టికల్ ఇంక్వైరర్ అనే పత్రిక పెట్టి, ఎప్పటికప్పుడు అతీంద్రియ శక్తుల శాస్త్రీయ పరిశీలనా ఫలితాలు వెలికి తెస్తున్నారు. కెంద్రిక్ ఫ్రేజర్ సంపాదకత్వాన యీ పత్రిక కొనసాగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా ఇంద్రియాతీత శక్తి సంఘటన దృష్టికి వచ్చినా యీ సంఘంవారు పరిశీలిస్తున్నారు. ఎక్కడా రుజువుకు నిలబడిన సంఘటన కనిపించలేదు. Committee for the Scientific Investigation of Claims of the Paranormal (CSICOP) సంఘాన్ని చైనాకు ఆహ్వానించి, అక్కడ జరుగుతున్న అతీంద్రియ శక్తుల వుదంతాలను పరిశీలించమన్నారు. పాల్‌కర్జ్ ఆధ్వర్యాన 1988లో ఆరుగురితో కూడిన సంఘం ,చైనాలోని కొందరు అతీంద్రియ శక్తిపరుల్ని పరిశీలించింది. సైకిక్ శక్తులున్నాయన్న పిల్లల్ని కూడా టెస్ట్‌కు గురిచేశారు. మోసాలు జరగకుండా జాగ్రత్తలు చేసేసరికి, పిల్లల్లో ఎలాంటి ఇంద్రియాతీతశక్తులు లేవని తేలింది. చైనాలో బాగా ప్రచారంలో వున్న కిగాంగ్ (Qigong) శక్తిలో "శక్తి" ఏదీ లేదని రుజువుపరచారు.

ప్రతి సంవత్సరం యీ సంఘం వారు సమావేశాలు జరిపి అత్యంత అధునాతనంగా ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతున్నదీ వివరిస్తూ అతీంద్రియశక్తుల అధ్యయనం చేస్తున్నారు. ఈ విషయాలపై టేప్‌లు సిద్ధం చేసి యిస్తున్నారు. యూరిగెల్లర్ యీ సంఘంపై కోర్టులో కేసులు పెట్టి ఓడిపోయి, ప్రస్తుతం అమెరికాలో అడుగుపెట్టకుండా ఇంగ్లండ్‌కు పరిమితమయ్యాడు. కోర్టులో తన చెంచాలు వంచే శక్తి నిజమని రుజువు చేసుకోలేకపోయాడు.

అతీంద్రియ శక్తులున్న వారిని అమెరికా, యూరోప్‌లలో పోలీస్ శాఖ సైకిక్ డిటెక్టివ్‌లుగా వాడుకుంటున్నది. నేరస్తులను పట్టివ్వడానికి, నేరాలలో కీలకాలు బయటపెట్టడానికి సైకిక్ డిటెక్టివ్‌లు ఉపకరిస్తారని పోలీస్ నమ్మింది. కాని రుజువుకు పెడితే ఎక్కడా సైకిక్ డిటెక్టివ్‌లు నిలబడలేదు. ఉజ్జాయింపుగా వూహించి చెప్పడం, అదృష్టవశాత్తు నిజమైతే తమ శక్తిగానూ, లేకుంటే నోరు మూసుకొని మరోచోటికి పోవడం జరుగుతున్నది. కంట్రోల్డ్ పరిశోధనలకు కొందరు సైకిక్ డిటెక్టివ్‌లను గురిచేసి, నివేదికలు వెల్లడిస్తే వారికి ఎలాంటి ఇంద్రియాతీత శక్తులు లేవని తేలింది. పాశ్చాత్య దేశాలలో వున్న యీ సైకిక్ డిటెక్టివ్ సంప్రదాయం భారత దేశంలో సోకలేదు. ఇది బాబాలకు, మాతలకు పరిమితమైన శక్తిగానే మిగిలింది. అయితే బాబాలను శాస్త్రీయ పరిశోధనకు గురిచేయనందున వారి వ్యాపారం నిరాఘాటంగా సాగిపోతున్నది.

భారతీయ బాబా మహేష్‌యోగి అమెరికా వెళ్ళి గాలిలో తేలే విద్య నేర్పిస్తానని కొంతకాలం ధనార్జన చేశాడు. ఎంతకూ ఆ శక్తి బయట పడకపోయే సరికి ఆయన శిష్యులే కోర్టుకెక్కారు. ఫిలడెల్ఫియా కోర్టు మహేష్‌యోగిపై తీర్పు యిస్తూ ఆయన్ను డబ్బు చెల్లించమన్నది. కోర్టు బయట మహేష్ యోగి వ్యవహారం పరిష్కరించుకున్నాడు.

మనదేశంలో ఏ బాబాను శాస్త్రీయ పరిశోధనకు గురిచేసినా వారి నిజానిజాలు తెలుస్తాయి. హెచ్. నరసింహయ్య కమిటి అలాంటి పరిశోధన చేయబోగా సాయిబాబా తప్పించుకున్నాడేగాని, నిలబడలేదు. బాబాలకు పోలీస్, ప్రభుత్వం అండగా నిలిచినంతకాలం వారి అతీంద్రియ శక్తులు భక్తుల్ని వశపరుచుకుంటూనే వుంటాయి. ఇన్నాళ్ళుగా విభూతితో, ఇతర ఇంద్రియాతీత శక్తులున్నాయనే భ్రమ కల్పించిన సాయిబాబా సైతం, తనకు అలాంటి మహిమలు, శక్తులు లేవని ఒప్పుకున్నట్లే అయింది. అందుకు నిదర్శనం రోగుల్ని నయం చేయడానికి పుట్టపర్తిలో సాయిబాబా సూపర్ స్పెషల్ ఆస్పత్రి పెట్టడమే తార్కాణం. మహిమలతో రోగాలు తగ్గించగలిగితే ఆస్పత్రిలో శాస్త్రీయంగా చికిత్స దేనికి అనే అంశం భక్తులకు తెలియడానికి కొంతకాలం పడుతుంది. ఇది అందరు బాబాలకు, స్వాములకు, మాతలకు అన్వయించి చూచుకోవాలి.

## కార్ల్‌యూంగ్

అతీంద్రియ శక్తుల గురించి సిగ్మండ్ ఫ్రాయిడ్, కార్ల్ యూంగ్‌లు తీవ్రంగా వాదించుకున్నారు. ఫ్రాయిడ్ నాస్తికుడు మూఢ నమ్మకాలకు వ్యతిరేకి. యూంగ్ నమ్మకాల పుట్ట, అతడి ప్రభావం వలన కూడా అతీంద్రియ శక్తుల ప్రచారం బాగా సాగింది. కార్ల్ గస్టావ్ యూంగ్ (1875-1961) సింక్రోనిసిటి, ఆర్కిటైప్ అనే రెండు సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టి, మూఢ నమ్మకాలకు ప్రాతిపదికలు సమకూర్చాడు. యూంగ్ జ్యోతిష్యాన్ని, టెలిపతిని, గాలిలో తేలడాన్ని, వస్తువుల్ని సృష్టించడాన్ని నమ్మాడు. అతీంద్రియ శక్తుల విషయంలో యూంగ్ ఒకవైపు అతిజాగ్రత్త వహిస్తున్నట్లు అగుపించినా, వాటికి ఆధునిక శాస్త్రీయ ప్రతిపత్తి కల్పించాలని తహతహలాడాడు.

జె.బి. రైన్ పరిశోధనలు తన సిద్ధాంతాలకు మద్దతుగా చూపాడు. తీరా, జె.బి. రైన్ పరిశోధనలే శాస్త్రీయ పరిధికి నిలవకుండా పోయాయి. బయట ప్రపంచంలో జరిగే సంఘటనలే వ్యక్తికి అనుభూతులుగా ప్రతిబింబిస్తాయని యూంగ్ తన Synchronicity సిద్ధాంతంలో నమ్మాడు. అదే సిద్ధాంతం ప్రకారం, సమిష్టి అవ్యక్తత (Collective Unconscious) లోని అంశాలు వ్యక్తిలో ప్రతిబింబిస్తాయన్నాడు యూంగ్. యూంగ్ ఆర్కిటైప్ వాదం జ్యోతిష్యం చెప్పే రాసులవంటివి, వాటికి ఉనికిలేదు. అవి కేవలం నమ్మకంపై ఆధారపడినవే. పురాణగాధల్లోని అంశాలకు బాహ్యరూపాన్ని, వాస్తవికతను కల్పించే ప్రయత్నం కూడా యూంగ్ చేశాడు. ఆర్కిటైప్ అంశాలు వంశపారంపర్యతగా సంక్రమిస్తాయని కూడా యూంగ్ నమ్మాడు. క్వాంటం సిద్ధాంతంలో విషయాల్ని యూంగ్ తన సామ్యాలకి వాడుకోబోయి పొరబడ్డాడు. క్వాంటం సిద్ధాంత ప్రతిపాదనలు రుజువుకు నిలిచాయి. యూంగ్ చెప్పేవాటికి రుజువు గాక, నమ్మకమే ప్రధానం. అయినా యూంగ్, ఆర్థర్ కోస్లర్ వంటి వారి ఆసక్తి కారణంగా అతీంద్రియ శక్తుల పట్ల నమ్మకం పెరిగింది. వ్యక్తిగతంగా వుండే అవ్యక్తత, సమిష్టి అవ్యక్తత అనేవి మానవ సంపదగా చూపిన యూంగ్, క్రమానుగతంగా, లామార్క్ జీవ సిద్ధాంతం వలె, సంక్రమిస్తాయని అతడి నమ్మకం. వీటికి ఆర్కిటైప్ అని నామకరణం చేశాడు. భావాలకు యివే మూలం అన్నాడు.

టెలిపతి పట్ల ఉదార దృష్టి అవలంబించమని యూంగ్ కోరాడు. అతీంద్రియ శక్తులను సమర్థించడానికి యూంగ్, ఒక సైంటిస్ట్ పాలి (Pauli) తో కలసి Interpretation of Nature and Psyche అనే పుస్తకం రాశాడు. పదార్థానికి చెందిన సూక్ష్మరూపంలో సైకి విధానాన్ని నిర్మించవచ్చని అన్నాడు. సైన్సులో రుజువుకు నిలవకుంటే తోసిపుచ్చుతారు. యూంగ్ ఒక వైపున సైన్స్ ఉదాహరణలు తెచ్చి, తాను చెప్పే సైకిని రుజువుకు పెట్టడానికి, రుజువు కాకుంటే నిరాకరించడానికి సిద్ధపడలేదు. అదే నమ్మకస్తుల బలం! అతీంద్రియ శక్తుల విషయంలో అత్యంత ఉత్సాహం చూపిన ఆర్థర్ కోస్లర్ చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు.

నేడు పేరా సైకాలజీ కొన్ని యూనివర్శిటీలలో కోర్సులుగా వున్నది. అక్కడ మాత్రం దీనికి ఎలాగైనా శాస్త్రీయగౌరవాన్ని తీసుకరావాలని కృషి చేస్తున్నారు. ఆధునిక విజ్ఞాన సాంకేతిక పరికరాల సహాయంతో వివిధ పరిశీలనలు జరుపుతున్నారు. ఇంత వరకూ నిర్ధారణగా ఒక్క పేరా సైకాలజీ పరిశోధనకూ శాస్త్రీయ ప్రమాణం రాలేదు. పేరా సైకాలజీని సైన్సులో భాగంగా పరిగణించడానికి అవకాశం లభించడం లేదు, ఇదీ వాస్తవ పరిస్థితి. సైన్స్ పేరిట, శాస్త్రీయ పరిశోధనల పేరిట మోసాలు చేసి తాత్కాలికంగా నమ్మించడం పేరా సైకాలజీలో పరిపాటి అయింది. శాస్త్రీయ పరిశోధనలంటూ కొన్ని పత్రికలలో వివరాలు ప్రచురించడం, తీరా వాటిని మళ్ళీ పరీక్షకు పెడితే ఫలితాలు రాకపోవడం సర్వసాధారణమై పోయింది.

ఇంత జరుగుతున్నా, సైన్స్ నేటికీ విశాల దృక్పథంతో, సహనంతో వుంది. పేరా సైకాలజీ ఎప్పుడు ఎక్కడ రుజువుపరచినా ఆమోదించడానికి సైన్స్ సిద్ధపడుతోంది. ఏమైనా సరే, పేరా

సైకాలజీ కూడా సైంటిఫిక్ అని రుజువు చేయాలని ఆత్రుత పడడంలోనే, సైంటిఫిక్ మెథడ్‌లోని గొప్పదనం అర్థం చేసుకోవచ్చు.

సైన్స్, సంపూర్ణతను, అంతా కనుగొన్నాం అనడాన్ని సుతరామూ ఒప్పుకోదు. సైన్స్ ప్రకారం తెలుసుకోవడం, మార్చుకోవడం, దిద్దుకోవడం నిరంతరం జరిగేపని. పవిత్ర గ్రంథాల పేరిట అంతా అందులోనే వున్నదని సైన్స్ ఏనాటికీ అనదు. అందువలన సైన్స్ మానవాళికి తోడ్పడుతుంది.

పేరా సైకాలజి మానవ అభివృద్ధికి దోహదం చేసిన ఉదాహరణ ఒక్కటి లేదు.

*- మిసిమి మాసపత్రిక, జులై-2001*

# నేటి తాత్విక విమర్శలు - ధోరణులు

ఇసుకలో ఆడుకుంటూ, సముద్రపు ఒడ్డున బొమ్మలు గీస్తారు. కొందరు ఇసుకమేడలు, కోటలు కడతారు. కాసేపు అవి బాగానే వుంటాయి. ఆ తరువాత అలలు వచ్చి కొట్టుకపోతాయి. ప్రకృతి పరిణామంలో మనిషి కూడా అంతే- ఫ్రెంచి తాత్వికుడు మైకల్ ఫొకో (1926-1984) మానవవాదాన్ని దుయ్యబడుతూ చేసిన విమర్శ సారాంశం అది.

మానవ ప్రగతిని పేర్కొంటూ పునర్వికాసం, ఆధునికయుగం అని వర్గీకరించినట్లే, మానవవాదాన్ని కూడా చెబుతున్నారని మైకల్ ఫొకో (Michel Foucault) అన్నాడు. పునర్వికాసం కొంతకాలం వుండి, తరువాత అంతరించింది. మానవవాదమూ అంతే. ఆధునికత పేరిట మానవవాదులు శాశ్వత తత్వాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తున్నారు. అది తప్పు. మానవవాదం, ఆధునికత తాత్కాలికాలే. అవి కాలగర్భంలో కలసిపోతాయి. మైకలఫొకో విమర్శలకు మరొక ఫ్రెంచి తాత్వికుడు జీన్ ఫ్రాంకో లెటార్డ్ (Jean Francois Lyotard) తోడై మానవవాదంపై ధ్వజమెత్తాడు. తత్వాన్ని పరిశీలిస్తే ఏం కనిపిస్తుంది? అన్నీ కథలు, అదిభౌతిక చర్చలు, అస్థిరత్వాన్ని గురించిన చర్చలు అని లెటార్డ్ అన్నాడు. ఆధునిక విజ్ఞానం కూడా అస్థిరత్వాల్ని వెతుక్కుంటూ పోతున్నదన్నాడు. పూకో ఈ అస్థిరత్వ ధోరణిని, మానవవాదాన్ని ఖండించాడు. సైన్స్ బంధంలో మానవుడు చిక్కుకపోయాడనీ, అతడిని విడిపించాలనీ ఫొకో వాదించాడు. వాస్తవాన్ని ఎదుర్కోలేక మానవవాదులు, ఇతరులపైబడి, అందరినీ పలాయనవాదులుగా నిరాశాపరులుగా చిత్రిస్తున్నారన్నాడు.

విశ్వంలో మానవుడు కేంద్రం అంటూ, నీతిశాస్త్రాల్ని సృష్టించే మానవవాదాన్ని ఫొకో, లెటార్డ్‌లు నిరాకరించారు. మానవుడి ప్రగతిని, ఆశావాదాన్ని వర్ణించడమే మానవవాదంగా చూపడాన్ని వారు నిరాకరించారు. మానవశాస్త్రాలన్నీ అస్థిరమైనవిగా వారు చూపారు.

మానవవాదుల తలబిరుసుతనాన్ని వివరిస్తూ డేవిడ్ ఎరన్‌ఫీల్డ్ విమర్శల పరంపర చేశాడు. (David Ehrenfield-The Arrogance of Humanism) మానవుడి భవిష్యత్తు నిర్మాణంలో మానవవాదుల కృషి ఏమీ లేదంటూ, వీరు కేవలం మానవ ప్రేమ పేరిట స్వార్థాన్ని పెంచుకుంటున్నారని డేవిడ్ విమర్శించాడు. ప్రపంచాన్ని మళ్ళీ నిర్మించి, మానవుడు కేంద్రంగా వుండే తీరును వీరు వూహిస్తున్నారన్నాడు. వాస్తవానికి మానవుడే విధ్వంసానికి పూనుకుంటున్నాడనీ, మానవశక్తిని మరచిపోయి ప్రవర్తిస్తున్నాడన్నాడు. మానవుడు తన హద్దుల్ని తెలుసుకుంటే, సృజనాత్మకతలో భాగం పంచుకుంటాడనీ, అదే అతడికి తృప్తి కలిగిస్తుందన్నాడు.

ఆధునికతకు వ్యతిరేకంగా పోయే ధోరణికి ముసుగు వేసి చూస్తున్నారని జర్గన్ హేబర్‌మాస్ (Jurgen Habermas) అన్నాడు.

ఆధునికతపైనా, మానవవాదంపైనా సమకాలీన ప్రపంచంలో, ముఖ్యంగా యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియాలలో విమర్శలు 1950 నుండే ఆరంభమయ్యాయి. దీనినే ఆధునికత అనంతర కాలం (Post Modernism) గా పేర్కొంటున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం సత్తావాది హైడిగ్గర్ (Heideggar) మానవవాదాన్ని ఎదుర్కొనడానికి శ్రీకారం చుట్టాడు. మానవుడిని ఉన్నతస్థానంలో కూర్చోబెట్టే ప్రయత్నంలో మానవవాదం విఫలమైందని, యుద్ధానికి, విధ్వంసానికి మూలం మానవవాదమేనని ఆయన మొదలెట్టాడు. ఆ తరువాత ఫ్రెంచి తాత్వికులు వియన్నా చింతనాపరుల్ని విమర్శిస్తూ, నిక్కచ్చిగా ప్రతిదీ వుండాలనే వాదాన్ని ఖండించారు. అందులో భాగంగానే మానవవాదాన్ని చేర్చి, మైకల్‌ఫొకో, జీన్‌ఫ్రాంకో లెటార్డ్, డెరిడా (Derrida) లు చాలా విమర్శనాత్మక రచనలు చేశారు.

అమెరికాలో ఈ విమర్శల్ని అందుకున్నవారు, మానవవాదం వలన పాశ్చాత్యనాగరికత సృష్టించిన విలువలు పలచబడ్డాయని, కుటుంబవ్యవస్థ దెబ్బతిన్నదనీ, దైవనమ్మకం సడలిందనీ అన్నారు. "నేషనల్ రివ్యూ" ప్రచురణకర్త విలియం ఎ. రషర్ ఇలాంటి రచనలు చేశారు.

మానవుడు సృష్టించిన సాంకేతిక శాస్త్రం విద్వాంసానికి దారి తీసిందనీ, అన్ని సమస్యలకూ మానవుడే పరిష్కారాన్ని యివ్వగలడనుకోవడంలో మానవవాదం పొరపాటు పడిందనీ డేవిడ్ ఎరన్‌ఫీల్డ్ రాశాడు.

వాతావరణాన్ని, పరిసరాల్ని దృష్టిలో పెట్టుకోకుండా మానవుడు ప్రవర్తించడం, మానవుడే ముఖ్యం అంటూ, మానవుడి కోసం ప్రకృతిని నాశనం చెయ్యడం బైర్డ్ కాలికాట్ చూపాడు. దీనివలన మానవ కేంద్రనీతి ఎలా కాలుష్యానికి దారితీసిందీ వివరించాడు.

కంప్యూటర్ సృష్టిలో సృజనాత్మకత, ఉద్వేగం దెబ్బతిన్నాయని మార్మికవాదులు, దివ్యదృష్టిని నమ్మేవారూ విమర్శలు చేశారు.

దేవుడిలో నమ్మకం కోల్పోతేనైతికంగా అరాచకత్వం వస్తుందనే వాదన పూర్వం నుండే వస్తున్నా యిటీవలి టైం పత్రిక ఎడిటర్ సైతం యిలాంటి విమర్శలు చేశాడు. హెన్రీ గ్రున్ వాల్ క్ తన విమర్శలలో, మానవుడికి దేనిపైనా నమ్మకం, గురి లేకుంటే, నీతి నిలబడదని వాదించాడు. సృష్టివాదులు కూడా అలాంటి వాదనే చేస్తున్నారు. మానవవాదంపై తీవ్ర విమర్శలు చేసిన వారిలో రష్యా రచయిత అలెగ్జాండర్ సోల్జినిట్సిన్, ఇర్వింగ్ క్రిష్టల్, రిచర్డ్ జాన్, న్యూహాస్ మొదలైన ప్రముఖులు వున్నారు.

మానవవాదంపై మతం విమర్శిస్తే అర్థం చేసుకోవచ్చు. కాని తాత్వికులు, చింతనాపరులు విమర్శలు చేసినప్పుడు జాగ్రత్తగా పరిశీలించవలసి వుంటుంది.

మానవవాదాన్ని సమర్థించడంలోనూ, విమర్శల్ని పట్టించుకోవడంలోనూ యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియాలు బాగా శ్రద్ధ వహిస్తున్నాయి. ఇండియాలో ఇంకా ఈ విమర్శలకు ప్రాధాన్యత యివ్వడం లేదు. అలాంటి విమర్శలు వున్నాయని కూడా ఏ కొద్దిమందికో తప్పతెలియదు.

డేవిడ్ విల్సన్, జాన్ డ్యూయీ, కార్ల్‌లెమాంట్, కార్ల్‌వాగన్, ఐజక్ అసిమోవ్, పాల్ కర్జ్, అడాల్ఫ్ గ్రున్‌బాం, బార్బరాస్మోకర్ మొదలైనవారు విమర్శల్ని శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఎదుర్కొన్నారు.

1980 ప్రాంతాల నుండీ మానవవాదానికి వచ్చిన అపఖ్యాతి తొలగుతూ పోయింది. మానవవాదం అంటేనే ఒక తిట్టుగా 1950-80 మధ్య ప్రచారం సాగింది. ఆ ధోరణి ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది.

సంఖ్య రీత్యా మానవవాదులు ప్రపంచవ్యాప్తంగా అల్పసంఖ్యాకులే. కాని వారి వాదబలం నిలబడడానికి ప్రధాన కారణం వారు స్వీకరించిన ఆయుధమే. అదే శాస్త్రీయపద్ధతి. సామాజిక, మానసిక శాస్త్రాలలో సైతం వివేచనాత్మకంగా సాగాలని మానవవాదులు కోరుతున్నారు. థామస్ సాజ్ (THOMAS SZASZ) వంటివారు యిటీవల చేసిన విమర్శలే మానవవాదాన్ని మళ్ళీ పట్టాలపై నిలబెట్టడానికి ఉపకరించాయి.

ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న అతిప్రధాన సమస్యల్ని గుర్తిస్తే, ఒకటి జనాభా పెరుగుదలగానూ, రెండవది ప్రకృతిలో కాలుష్యవ్యాప్తిగానూ తేలాయి. మానవవాదులు యీ రెండింటినీ పట్టించుకుంటున్నారు. మతవాదులలో కొందరు మానవ నియంత్రణను వ్యతిరేకిస్తున్నారు. సోషియో బయాలజీ తత్వానికి పితామహుడైన ఎడ్వర్డ్ విల్సన్ ఈ సమస్యలపట్ల అటు మతవాదుల్ని ఇటు మానవవాదుల్ని కలిపి చర్చలు సాగించే కృషిని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చేస్తున్నారు. తాత్వికంగా చూస్తే, పరిణామవాదాన్ని అంగీకరించిన మానవవాదులు ప్రకృతిని కాపాడుకోవడంలో శ్రద్ధ వహిస్తారని విల్సన్ అంటారు. (ఫ్రీ ఇన్‌క్వైరీ 1993 స్ప్రింగ్, బఫెలో, అమెరికా)

జనాభా పెరుగుదలకూ, సంపదను శక్తిని వినియోగించడానికీ సంబంధం వుంది. ప్రకృతి పరిసరాలపై దీని ప్రభావం పడుతున్నది. కనుక మత గ్రంథాలు ఏంచెప్పినా, క్రమేణా యీ సమస్యల్ని గుర్తించి పరిష్కరించక తప్పదని ఎడ్వర్డ్ విల్సన్ అన్నారు.

తాత్వికంగా పరిశీలిస్తే మానవవాదులు ఫౌకో, డెరిడా, లెటార్డ్ విమర్శల్ని తట్టుకోగలిగారు. వియన్నా తాత్విక సర్కిల్‌ను అధిగమించి, సైన్స్ పద్ధతులను వారు స్వీకరించగలిగారు. నిర్ధారణే కావాలని నేడు సైన్స్ కోరుకోవడం లేదు. పరిశోధనలు ఎటు దారి చూపితే అటు పోవడం నేర్చుకున్నారు. కార్యకారణవాదం స్థూల ప్రపంచంలో వున్నదనీ, సూక్ష్మప్రపంచంలో లేదనీ సైన్స్ నిర్ధారించింది. మానవవాదులు అందుకు అంగీకరించక తప్పదుగదా.

కోపర్నికస్ రుజువుల వలన ప్రకృతిలో భూమి చాలా స్వల్పం అనీ, డార్విన్ ఆధారాల వలన మానవుడు పరిణమించిన ప్రాణి అనీ తేలిన తరువాత, మానవవాదులకు వినయం, నమ్రత తప్పదు. మానవ సమస్యల పరిష్కారానికి మానవుడే కేంద్రం అంటారే తప్ప, మరేమీ కాదు.

మానవవాదంపై వచ్చిన విమర్శల దృష్ట్యా కళలు, రామణీయకతలు, కవితల విషయంలోనూ చాలా మార్పులు చేసుకున్నారు. రుజువుకు నిలబడని శక్తుల్ని ఆరాధించడం మానేసి, మానవుడికి ప్రాధాన్యత యిస్తూ ఆనందించే అన్ని కళల్ని పోషిస్తూ పెంపొందించు కుంటున్నారు. అంతేగాక పుట్టిన దగ్గర నుండీ చనిపోయేవరకూ వివిధ దశలలో ఉత్సవాలు, క్రతువులు, పండుగలు చేసుకుంటున్నారు. వీటిలో దైవం బదులు మానవుడే వుంటాడు. మరణించేటప్పుడు ఓదార్పు, అనంతరం బంధుమిత్రులకు వూరట కలిగించే రీతులు కూడా పెంపొందించారు. మతం ఆయా సందర్భాలలో పురోహితుడ్ని ప్రవేశపెట్టగా మానవవాదులు మధ్యవర్తిత్వాల్ని కాదని, సహకార భావంతో క్రతువులు చేస్తున్నారు.

మానవుడిలో పెద్ద బలహీనత మరణమే. అది తలచుకొని భయపడుచున్నకొద్దీ, దాని చుట్టూ చాలా సిద్ధాంతాలు, తత్వాలు అల్లారు. అందులో భాగంగానే అమరత్వం, శాశ్వతత్వం, ఆత్మ, పునర్జన్మ, కర్మ, మోక్షం, నరకం మొదలైనవి వచ్చాయి. ఇంచుమించు అన్ని మతాలు మరణాన్ని ఆసరాగా తీసుకొని మనిషి బలహీనతలపై స్వారీ చేస్తున్నాయి.

మానవవాదులు నిస్సహాయులుగా వున్నంతకాలం మరణం అనే వాస్తవం మనిషిలో ఎన్నో వికారాలు పుట్టిస్తుంది. మరణం సహజమని, తరువాత ఏమీ వుండదని, మనిషి భావాలు తరువాతివారు గుర్తుంచుకోవడం ప్రధానమని నచ్చచెప్పగలగాలి. ఈ విషయమై సుప్రసిద్ధమానవ తాత్వికుడు కార్లిస్ లెమాంట్ చక్కని రచన చేశారు. మరణం పట్ల మానవుడు ఎలాంటి ధోరణి అవలంబించాలో చర్చించారు. నమ్మకాల మధ్య పెరిగేవారికి ఇది కష్టమైన విషయం. అయినా మానవవాదులు చెప్పేది మానవకేంద్రంగా వున్న తత్వమే. మానవవాదంపై ఫౌకో, డెరిడా, లెటార్డ్ చేసిన విమర్శలు నిలిచేవి కావు. మానవుడు దీర్ఘకాలిక పరిణామంలో తాత్కాలిక జీవి కావచ్చు.

కొన్నేళ్ళకు ముందు మానవుడు లేనట్లే, కొన్నేళ్ళ తరువాత మానవుడు లేకుండా పోవచ్చు. అయితే సైన్స్ కాలమానం ప్రకారం అది కొన్ని కోట్ల సంవత్సరాలు పడుతుంది. తక్షణ ప్రమాదం మానవ ఉనికికి లేదు. ఈ దృష్ట్యా, మానవుడు ఇసుకలో బొమ్మవలే చెరిగిపోతాడనడం అంత ఉచితం కాదేమో!

**సమకాలీన విమర్శలకై పరిశీలించాల్సిన రచనలు :**

1. Michel Foucault : The Order of Things
2. Jean Francois Lyotard : The Post Modern Condition
3. Richard Rorty : The Consequences of Pragmatism
4. David Ehranfeld : The Arrogance of Humanism
5. James Rachels : Created from Animals
6. Martin W. Lewis : Green Delusions
7. Bill McGibben : The End of Nature
8. Edward O. Wilson : The Biophilia Hypothesis 1993
9. Jacques Derrida : The End of Man in Margins ofPhilosophy 1982
10. E. Ann Kaplan (ed) Post Modernism and its Discontents
11. Hugh Silverman (ed), Donn Welton : Post Modernism and Continental Philosophy.
12. Robert Basil (ed) On the Barricades, 1989, Prometheus book, USA.
13. Corliss Lamont : The illusion of Immortality
    1990 Half Moon Foundation New York PP 303.

*- మిసిమి మాసపత్రిక, జూన్-1995*

# వేదాల్లో క్లోనింగ్ ఉందట

వైద్యరంగంలో విప్లవాలు వస్తున్నాయి. అంటురోగం వస్తే తుడిచిపెట్టుకుపోయే కాలం పోయింది. కొత్త రోగాలు వస్తుంటే సరికొత్త చికిత్సలు, మంచి మందులు కనుగొంటున్నారు. ఇది నిత్య పరిశోధనా ఫలితం, శుచి, శుభ్రం అనేది దేహారోగ్యానికి ముఖ్యం అని తెలుసుకోవడం వైద్యరంగంలో తొలిమెట్టు. ఇప్పుడు శస్త్రచికిత్సలు చేయాలంటే మత్తుమందువల్ల (అనస్తీషియా) అతి సులువుగావడం పెద్ద విశేషం. చాలా కాలం సూక్ష్మజీవులు వైరస్ వల్ల రోగాలు వస్తాయని తెలుసుకోలేకపోయారు. అది తెలిసిన ఫలితంగా మందులు, టీకాలు వచ్చేశాయి. ఈ విధంగా ఎప్పటికప్పుడు పరిశోధనలు ఫలితంగా వైద్య విప్లవాలు వచ్చి, ఆయుష్షు పెంచుతున్నాయి.

కొత్తరంగం అని నేడు సగర్వంగా చెప్పదగింది జన్యుశాస్త్రం. మెండల్ గ్రెగోర్ 1850 ప్రాంతాలకే మొక్కల పారంపర్యత చూచాడు. కాని అదెలా పనిచేస్తుందో, సూక్ష్మరసాయనిక చర్య ఏమిటో ఆనాడు తెలియదు. అందుకోసం 1953 వరకూ పరిశోధనలు జరిగాయి. ఫ్రాన్సిస్‌క్రిక్, జేమ్స్‌వాట్సన్ అనే శాస్త్రజ్ఞుల కృషివల్ల పెనవేసుకుపోయినట్లుండే (డబుల్ హెలిక్స్) రెండు తీగల రూపం చూచారు. ఇది చాలా పెద్ద జీవకణం. అదే డిఎన్ఎ (డెక్సిరిజో న్యూక్లిక్ యాసిడ్) బాగా పరిశీలిస్తే యీ డిఎన్ఎలో నాలుగు రసాయనిక మూలకాలు వున్నాయి. పొడి అక్షరాలలో ఎ, టి, జి, సి అన్నారు. ఎ అంటే అడిలైన్, టి అంటే థైమైన్, జి అనగా గానైన్, సి అంటే సైటోసిస్. ఈ నాలుగింటిల్లో ఏ మూడు కలిసినా ప్రొటీన్లు వస్తాయి. అవే జీవానికి మూలం.

ఒక్కొక్క జీవకణం ఒక విజ్ఞాన సర్వస్వ నిఘంటువు వంటిదే. ప్రతి జీవకణంలో 23 జతల క్రోమోజోములుంటాయి. ఇందులో పెనవేసుకుపోయిన డిఎన్ఎ లుంటాయి. ఇలాంటి విజ్ఞాన సర్వస్వాలు 46 సంపుటాలమయంగా మానవుడిలో వుండగా, ఒక్కొక్క సంపుటి అనేక విషయాలను చూస్తుంది. నిఘంటువులో ఒక పదం ఒక డిఎన్ఎతో పోల్చి చెప్పవచ్చు. ప్రతి వ్యక్తిలో రెండు జన్య జంట (అలెక్స్) సంక్రమిస్తుంది. తల్లిదండ్రుల నుండి యీ జంట వస్తుంది. తండ్రి లక్షణాలు తల్లి లక్షణాలు పిల్లలకు యిలా వస్తాయి. అలా వచ్చేటప్పుడు కొంచెం చెదిరినా, మార్పు జరుగుతుంది. దీనికి పెడదారి (మ్యూటేషన్) అని పేరు పెట్టారు. మనం అచ్చుగుద్దినట్టు కార్బన్‌కాపీ తీస్తుంటే, కొంచెం జరగడం, ముద్ర సరిగా పడకపోవడం, అక్షరం చెదరడం చూస్తాం. అలాగే తల్లిదండ్రుల నుండి వచ్చే జన్యువులలో కొద్దిమార్పులు జరిగి, పిల్లల్లో అవి వివిధ రూపాలుగా కనిపిస్తాయి. అందుకే పోలికలతోబాటు మార్పులు చూస్తాం. జన్యుకణాలలో మూలంగా వున్న నాలుగు రసాయనికాలలో ఏ మూడైనా కలుస్తూపోతాయని గమనించాలి. ఇది జరిగే తీరు ఒక్కొక్క కణంలో విప్పి చూస్తే ఏమి వుంటుంది అని తెలుసుకోడానికి పరిశోధన 1980 ప్రాంతాలలో మొదలెట్టి 1990 ప్రాంతాలకు ఒక దారినపడింది. ఈ బృహత్తర పథకానికి జెనోం ప్రాజెక్టు అని పేరు పెట్టారు.

ఈ పథకం వల్ల గొప్ప ఉపయోగం ఏమంటే రోగాలకు మూలం జీవకణాలేమిటి, వాటిని తొలగించడం ఎలా అనేది సాధ్యపడుతుంది.

సుమారు 5వేల రోగాలు వివిధ జన్యుకణాల మూలంగా వున్నాయని జెనోం ప్రాజెక్టు వల్ల తేలింది. అంటురోగాలు జన్యుకణాల వల్ల రావడమనేది కూడా గ్రహించాలి. కాగా నిరోధకశక్తి జన్యుకణాల వల్లే వివిధ దశలలో వుంటుంది. కొన్ని జన్యుకణాలు బాగా పెత్తనం చేస్తాయి. తండ్రి నుండి వచ్చిన కణం ఊదా రంగు (బ్రౌన్)లో వుండొచ్చు. తల్లి నుండి వచ్చిన కణం నీలం (బ్లూ) రంగులో వుండొచ్చు. అయినా సంతానంలో కనుపాపల రంగు బ్రౌన్ ఆధిక్యతనే చూపుతుంది. ఇదే కణాధిక్యత అంటారు. అలాగే ఒక్కొక్క కణం రోగానికి దారితీసేదిగా వుంటుంది. అలాంటి జీవకణాలను తెలుసుకుంటున్నారు. తరువాత వాటికి చికిత్స, ఎలా తొలగించడం అనేది

పరిశోధిస్తారు. శరీరంలోవున్న జబ్బు కలిగించే జన్యుకణానికి పరిసరాల తోడ్పాటువల్ల కూడా హాని జరిగే అవకాశాలున్నాయి.

మొట్టమొదటగా ఏ కణానికి ఏ లక్షణం వుందో తెలుసుకుంటేగాని దాని బాగోగులను ఎలా మలచడమనేది కుదరదు. ఇదే పెద్దపని. జెనోం ప్రాజెక్టు యీ కృషి చేస్తుంది.

కణ చికిత్స (జీన్ థెరపి)లో మంచి కణాలను ఎంపికచేసి, వాటిని శరీరంలో ప్రవేశపెట్టడం, అవి దేహంలో పెరిగేటట్లు చూడటం ముఖ్యం. ఇదే అత్యంత జటిలమైన పని. అయితే చెడ్డ జన్యువుల్ని పెంపొందించి ప్రవేశపెడితే దుర్మార్గులు పుట్టరా అనే భయాందోళనలు కొందరు వెలిబుచ్చుతున్నారు.

తల్లిగర్భంలో పిండాన్ని తొలిదశలోనే పరిశీలించి, జన్యుకణాల ప్రకారం ఏది చెడు ఏది మంచి అనేది చూడగలిగితే, ఆరోగ్యకరమైన బిడ్డల్నే కనవచ్చు, అనారోగ్యకరమైన సంతానాన్ని రాకుండా చేయవచ్చుకూడా. జన్యు శాస్త్రంలో పరిశోధనల వల్ల చివరకు క్లోనింగ్ విధానానికి దారితీసింది. వేదాల నుండి నేటి వరకూ కథలలో విన్న విషయాలు, సైన్స్ పరిశోధనల వల్ల ఒక దశకు చేరింది. 1996 జులైలో ఇయాన్ విల్మట్ అనే శాస్త్రజ్ఞుడు పరిశోధనాలయంలో జీవకణాల నుండి దాల్గినే గొర్రెపిల్లను సృష్టించాడు. అలాగే మనుషుల్లోనూ సృష్టి చేయవచ్చుగదా. అంతటితో అలాంటి పని నైతికమా కాదా అనే చర్చ జరుగుతోంది.

క్లోనింగ్ ప్రకారం దాత నుండి అండం తొలగించి జాగ్రత్తగా భద్రపరచి, మరొకరిలో కనడానికి ప్రవేశపెడతారు. అలా తొలగించిన అండంలో జీవకణాలు పెరగకుండా పోషక పదార్థాన్ని ఆపేస్తారు. ఆ తరువాత మళ్ళీ జీవకణాలు పెరిగేటట్లు చేస్తారు. కొందరు స్త్రీల నుండి అండం ఉత్పత్తి చేయిస్తారు. వాటిని జాగ్రత్తగా పరిపక్వదశలోకి తెస్తారు. దాత నుండి తొలగించిన జీవకణం స్వీకరించే వారిలో ప్రవేశపెట్టి విద్యుత్‌షాక్‌ను జీవకణంలోకి పంపిస్తారు. అప్పుడు జీవకణాన్ని స్వీకరించినట్లు తెలిస్తే, ఉత్పత్తి మొదలౌతుంది. ఆ దశలో అండాన్ని తొలగించి, తల్లికాదలచిన స్త్రీలో ప్రవేశపెడతారు. విల్మట్ చేసిన ప్రక్రియ ఇలాంటిదే. ఇదంతా క్లిష్టమైన పనే.

ఎంతో సాంకేతిక, శాస్త్రీయ పరిశోధన జరిగిన తరువాత క్లోనింగ్ దశకు చేరారు. వేదాల్లోనో, మరెక్కడో పిట్టకథల్లో వూహించిన విషయాలు చూపి, అప్పుడే మన పూర్వీకులు దివ్యదృష్టితో క్లోనింగ్‌తో సహా అన్నీ చెప్పేశారనే వారు, మంచి హాస్యాన్ని సమ కూర్చుతున్నారు.

*- వార్త, 16 డిసెంబరు, 2001*

# నిజాలు చెప్పి నమ్మించడం కష్టమా?

నిజం చెప్పడం అవసరం కాని నిజం చెప్పి ఒప్పించడం కష్టం. అబద్ధం చెప్పడం సులభం. అనుకోకుండా, అలవాటుగా, అనవాయితీగా అబద్ధాలు చెబుతుంటాం. కొన్నాళ్ళకు అబద్ధాన్నే నిజం అని నమ్ముతాం.

అబద్ధానికి రుజువులు, సాక్ష్యాధారాలు అక్కరలేదు. నమ్మకం, మూఢ విశ్వాసం వుంటే చాలు. అబద్ధాలె చెల్లుతాయి. అలా అదేపనిగా అబద్ధాలు చెబుతూ పోతుంటే కొన్నాళ్ళకు అవి స్థిరపడి పోతాయి.

నిజానికి రుజువులు కావాలి. ఆధారాలు చూపాలి. ముఖ్యంగా పిల్లలకు నిజం చెప్పాలి. వారికి తెలుసుకోవాలనే జిజ్ఞాస, ప్రశ్నించడం అలవాటు. కాని వాటిని ప్రోత్సహించం. కొన్నాళ్ళకు ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, గద్దించి నోరు మూసుకోమంటాం.

పిల్లలకు మూఢనమ్మకాలు నేర్పుతున్నాం. క్రమశిక్షణ పేరిట మనోవికాసాన్ని చంపేస్తున్నారు. ఇదంతా కావాలని చేయలేకపోయినా, సమాజం కోసం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోడానికి జరుగుతున్నపనే. అది పిల్లల పట్లద్రోహం. నమ్మకాలు వంశపారంపర్యంగా సంక్రమిస్తున్నాయి. పూర్వీకులు కార్యకారణ సంబంధం అంతగాపట్టించు కోనప్పుడు నమ్మకాలు పుట్టాయి. వర్షం రావడానికి, పిడుగుపడడానికి, ఉరుములు మెరుపులు చూసి వాటి వెనుక దేవుళ్ళను, శక్తులను వూహించి నమ్మారు.

మన ఇంద్రియాల ద్వారా మెదడుకు సమాచారం అందుతుంది. ఇది తాలమసే అనే భాగంమీదుగా కార్టెక్స్‌కు అంది, అక్కడ విడమర్చి పరిశీలన జరుగుతుంది. ఆ తరువాత ఒక విత్తనం ఆకారంలో గల అమిగ్దల (AMYGDALA)కు రాగా అక్కడ తగిన ఉద్వేగాలు, భయాందోళనలు జతఅవుతాయి. ఈ అమిగ్దలభాగానికి దెబ్బతగిలిన వారికి భయం వుండదు! ఒక్కోసారి తాలమస్ నుండి సూటిగా అమిగ్దలకు చేరగా ఉద్వేగాలు, భయాలు, నమ్మకాలు స్థిరపడుతుంటాయి.

వ్యక్తిగతంగా అర్థంపర్థం లేని మూఢనమ్మకాలు పెద్ద ఆటగాళ్ళలో, సైంటిస్టులలో, రాజకీయ నాయకులలో వుంటాయి. మెడలో దండవేసుకోవడం ఇందులో భాగమే. దాని వలనే గెలుస్తున్నామనుకుంటారు. ఆట మధ్యలో తాయెత్తును కళ్ళకు అద్దుకుంటారు. గెలిస్తే తాయెత్తు మహిమ అనుకుంటారే గాని, ఓడిపోతే అనుకోరు. ఇదే వ్యక్తిగత మూఢనమ్మకం.

మెదడులోని సెరిబ్రల్ కార్టెక్స్ విభాగం మనల్ని హెచ్చరిస్తున్నా సరే, పట్టించుకోకుండా కొన్నిసార్లు మూఢనమ్మకాలు పాటిస్తారు. యజ్ఞం చేయిస్తే వర్షాలు వస్తాయని ప్రభుత్వాలు సైతం ప్రజల్ని మభ్యపెట్టడం యిందులోభాగమే.

సాంకేతిక విజ్ఞానం వలన మూఢనమ్మకాలు అతి వేగంగా ప్రపంచమంతటా వ్యాపించే అవకాశాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వినాయకుడి విగ్రహం పాలుతాగిందనే అంధవిశ్వాసం అతి త్వరలో అమెరికాకు పాకింది. మేరీమాత కళ్ళవెంట నీళ్ళు, రక్తం చిందినట్లు అమెరికాల్లో కలగిన భ్రమపూరిత మోసం ఇండియాకు వెంటనే వ్యాపించింది. కంప్యూటర్లను సైతం మూఢనమ్మకాల వ్యాప్తికే వాడి చెడగొడుతున్నారు.

పిల్లలు తొందరగా నమ్ముతారు. తల్లిదండ్రులు వారికి ప్రమాణం. తరువాత స్నేహితులు, ఆ పిమ్మట బడిలో ఉపాధ్యాయులు. పిల్లలకు నమ్మకాలు ఎంత త్వరగా వస్తాయో అంతతొందరగా పోతాయి కూడా. కాని వాటిని పోనివ్వకుండా పదేపదే పునశ్చరణ చేయడంతో మూఢనమ్మకాలు గట్టిగా నాటుకుపోతాయి. చిన్నప్పుడు చాలా స్థిరపడిన నమ్మకాలు ఒక పట్టాన వదలవు. సైంటిస్టుగా, సాంకేతిక నిపుణునిగా, ఉపాధ్యాయుడిగా, డాక్టర్‌గా పెరిగిన పిల్లవాడిలో చిన్నప్పటి నమ్మకాలు అలాగే తిష్టవేస్తాయి. తన వృత్తివరకూ నైపుణ్యంగా చేసినా మిగిలిన విషయాలలో కార్యకారణ సంబంధాలు శాస్త్రీయపద్ధతి అమలు చేయకపోడానికి ఇదే కారణం.

పిల్లల పట్ల మనం చాలా అపచారం. తెలిసో తెలియక చేస్తున్నాం. మన నమ్మకాల్ని వారికి అందించడమే యీ అపచారం. మానసిక వికాసాన్ని చంపేయడం కంటే ఘోరమైన తప్పు మరొకటి లేదు.

పిల్లల్ని ఆస్తిగా భావించరాదని పిల్లల మనోవికాసాన్ని వ్యక్తిత్వాన్ని గుర్తించాలని ఐక్యరాజ్యసమితి 1989లో ఒక చట్ట ప్రకరణ రూపొందించింది. ఇది ఇంకా ప్రచారంలోకి రావాలి.

మనకు తెలియంది తెలియదు అనడానికి, పిల్లలముందు ఆ మాట అనడానికి మనో నిబ్బరం కావాలి. తెలుసుకొని చెబుతాం అనగలగాలి. గుడ్డిగా దండాలు పెట్టించరాదు, మొక్కించరాదు. పిల్లలకు దూరంగా వుంచాల్సిన విషయాలలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, ఆధారాలు లేని అయోమయ విషయాలు అనేది గుర్తించాలి.

ఆలోచనలకు పదునుపెట్టాలి గాని చంపేయరాదు. ఇది కష్టమే కాని సాధ్యం.

*- వార్త, 30 డిసెంబరు, 2001*

# భవిష్యత్తు చూడగలమా? చెప్పగలమా?

మనకు వీరబ్రహ్మం వున్నట్లే ఫ్రాన్స్‌లో మైకల్ నోస్ట్రాడమస్ వున్నాడు. వీరిరువురూ చెప్పిన ప్రవచనాలు, సూక్తులు భవిష్యత్తును చెప్పినట్లు కొందరు నమ్ముతారు. రాత్రిళ్ళు విమానాలు ఎగరడం, భూకంపాలు రావడం, ఇలా ఏది కొత్తగా జరిగినా అదంతా లోగడే మనవాళ్ళు చెప్పారంటారు.

గుజరాత్‌లో భూకంపం వచ్చి అనేక భవనాలు కూలి ఎందరో చనిపోతే, మేం ముందే చెప్పాం అనేవారున్నారు.

భవిష్యత్తు చెప్పడానికి మనకు వూళ్ళలో సోది వుంది. ఇళ్ళ వెంట వచ్చి చేటలో బియ్యం పోయమని, ఆడవాళ్ళను కూర్చోబెట్టి సోది చెప్పడం గమనించవచ్చు. చిలకలతో పెట్టెలోని కార్డులు తీయించి, అందులోవున్న విషయంచదివి, అది భవిష్యత్తుగా చెప్పే చిన్న వ్యాపారస్తులు వున్నారు. నాడీశాస్త్రం ప్రకారం తాటాకులపై మన భవిష్యత్తు, గతం అంతా రాసిపెట్టి వున్నదని నమ్ముతున్నారు.

ఇలా వివిధ రూపాలలో గతాన్ని, భవిష్యత్తును చెప్పి ఆకర్షించి, డబ్బు చేసుకొనే పద్ధతులు అన్ని దేశాల్లోనూ వున్నాయి. భవిష్యత్తును ఎలా చెబుతారు? తాము మనోశక్తితో చూడగలుగుతున్నామంటారు. నిద్రలో కలలుగా వచ్చే వాటిని నమ్మి అదే భవిష్యత్తువాణి అని భావిస్తున్న వారున్నారు. సంఘటన జరిగిన అనంతరం అనేక సందర్భాలలో కొందరు ముందుకు వచ్చి తాము ముందే చెప్పామని, ఊహించామని అనడం సర్వసాధారణంగా వుంది.

కాల ప్రవాహాన్ని ముందే పసిగట్టడం సాధ్యమని సైన్స్‌లో క్వాంటం సిద్ధాంతాల ఆధారంగా చెబుతున్నారు. వాంహోల్స్ అనే విధానం ప్రకారం కాంతి వేగంతో, ప్రయాణం చేసి, ముందు జరుగనున్నది చూడగలమని సిద్ధాంత పరంగా చెబుతున్నారు. ఇందులో ఒకవైపు కాంతివేగంతో ప్రయాణం చేస్తుంటే మరోవైపు నెమ్మదిగా పయనిస్తుంది. అప్పుడే భవిష్యత్తు చూడటం కుదురుతుంది. ఇది సైన్స్‌లో యింకా రుజువుకాని ప్రతిపాదన అని మరచిపోకూడదు.

ఇంతవరకూ వివిధరకాలుగా భవిష్యత్తు చెప్పడంలో స్పష్టత ఎక్కడా లేదు. అస్పష్టంగా చెప్పి, ఏదన్నా జరిగినప్పుడు మా అర్థం అదే అంటారు. ఇది బ్రహ్మంతత్త్వాలలో బాగా కనిపిస్తుంది. అలాగే నోస్ట్రాడమస్ (1503-1566)లో కూడా. క్వాంటం సిద్ధాంతంలో వూహించినవి, పరిశోధించినవన్నీ మన ప్రపంచానికి అన్వయించవీల్లేదు. అస్థిరత్వం అనేది క్వాంటంలో వున్నా, ఆచరణలో ఫలితాలు కనిపించి, నిర్ధారణగా రుజువయ్యాయి.

క్వాంటం సిద్ధాంతం వల్ల ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్లు, లేజర్లు, టెలివిజన్, కంప్యూటర్లు, ఆకాశంలో ప్రయాణం, అలా ఎన్నో వచ్చాయి. కనుక అందులో నిర్ధారణ వుంది. కార్ల్‌యూంగ్ వంటి మనోశాస్త్రజ్ఞులు కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించి, భవిష్యత్తు చెప్పడానికి వీలుందనే ఆశలు కల్పించారు. మానవుడి చైతన్యత భవిష్యత్తులోకి తొంగి చూడగలదన్నా డాయన. కాని భవిష్యత్తుకు సంబంధించిన సిద్ధాంతాలేవీ రుజువుకు నిలబడలేదు. అంటే సోది, నాడి, జోస్యం వంటివి రుజువు కావన్నమాట. కేవలం నమ్మకమే వీటికి బలం.

సైన్స్‌లో వచ్చే సిద్ధాంతాలను జోస్యం చెప్పేవారు అడ్డంపెట్టుకోవడంలో అర్థం లేదు. సైన్స్ తననుతాను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ సాగుతుంటుంది. పాతనే అంటిపెట్టుకోదు.

ఈ విషయంలో జోస్యం చెప్పేవారు ఎన్నటికీ నిలబడరు. అనేక విషయాలు చెప్పినప్పుడు ఒక్కోసారి ఏదైనా తగలవచ్చు. అంతమాత్రాన జోస్యం నిజంకాదు. భవిష్యత్తు తెలుసుకోవాలని ప్రతివారికీ వుంటుంది. ఈ కోర్కెను తీర్చడానికి ముందుకువచ్చిన జోస్యాలవారు అదొక వ్యాపారంగా మార్చేస్తున్నారు. ఇందులో బాబాలు, మాతలు కూడా పుట్టుకొస్తున్నారు.

సినిమాలు యీ జోస్యపు కట్టుకథల్ని ప్రచారంలో పెడుతున్నాయి.

*- వార్త, 27 జనవరి, 2002*

# కదిలేది-కదిలించేదీ

చూపుతోనే దూరాన వున్న వస్తువులు కదులుతున్నాయి, బల్లమీద కప్పు, సాసర్ మెల్లగా జరుగుతున్నది. ఇది ఎక్కడోకాదు, దేవుడంటే నమ్మకం లేని నాస్తిక దేశం సోవియట్ యూనియన్‌లో జరిగింది. కనుక అతీత శక్తులున్నాయి.

ఇలాంటి వార్తలు హఠాత్తుగా అప్పుడప్పుడు ఏదో మూలనుండి వచ్చేసరికి నమ్మకస్తులు విజృంభిస్తారు. పత్రికలు ముందు వెనుక చూడకుండా ఆకర్షణీయంగా ఇలాంటి వార్తలు వేస్తాయి. దూరాన వున్న వస్తువుల్ని కదిలించడాన్ని 'సైకోకెనసిన్' అంటారు. వస్తువుల్నే కాదు, మనషుల్ని సైతం మహాత్ములు ప్రభావితం చేస్తారంటారు. ఇరువురి మధ్య ఎలాంటి శక్తి సంబంధం లేకుండానే యిలా చేయడం ఎలా సాధ్యం?

మనోబలంతో వస్తువుల్ని కదిలించడం, మనుషుల్ని ప్రభావితం చేయడం గొప్పవింతగా, శక్తిగా చెబుతున్నారు. శాస్త్రీయ పరిశోధనకు గురిచేసిన అంశం సైకోకెనసిన్ దూరశక్తి అనే ఈ విధానంపై అమెరికా, యూరప్‌లో పరిశోధనలు జరిపారు. చదరంగం ఆటలో పావుల్ని మనోబలంతో ప్రభావితం చేస్తామనే వారువున్నారు. జె.బి.రైన్ వీటిపై 30 ఏళ్ళ పాటు వివిధ పరిశోధనలు జరిపి, నిర్ధారణగా తేల్చలేకపోయాడు. బొమ్మ, బొరుసు వలె, పావులు కూడా కొన్నిసార్లు అనుకున్నట్లు పడతాయి. వీనిని గణాంక పద్ధతిలో సగటు లెక్కలు అంటారు.

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో శాన్‌అంటోనియోలో హెల్మట్‌స్మిట్ ఒక సంస్థ నెలకొల్పి మనోబలం మీద పరిశోధనలు జరిపాడు. రేడియో ధార్మిక శక్తి క్షీణించే రీతుల్ని గైగ్గర్ కౌంటర్ విధానంలో చేస్తారు. అందులో ఎప్పుడు, ఎలా రేడియోధార్మిక శక్తి క్షీణిస్తుందో వూహించ వీల్లేకుండా జరుగుతుంది. కాని, సగటున ఎంత జరుగుతుందో అంచనావేస్తారు. అందుకు గైగర్ టెస్ట్ వుపకరిస్తుంది. న్యూజెర్సీ రాష్ట్రంలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటిలో రాబర్ట్‌జాన్ పరిశోధన జరిపాడు. ఇతర దేశాలకు పరిశోధకుల్ని పంపించి కూడా యీ టెస్ట్‌లు జరిపాడు. అయినా దూరశక్తి యింత వరకు శాస్త్రీయంగా నిర్మాణం కాలేదు. అయినా నమ్మేవారు నమ్ముతూనే

వున్నారు. ఇప్పటివరకు వివిధ శాస్త్రజ్ఞులు దూరశక్తిపై జరిపిన పరిశోధనల్ని సమీక్షించి, సమీకరించి సమష్టిగా జీన్‌గ్లాస్ అనే మనో శాస్త్రజ్ఞుడు పరిశీలించాడు. కానీ నిర్ధారణగా దూరశక్తి శాస్త్రీయమని రుజువు కావడంలేదు. దూరాన వున్న వస్తువులలో చూపు ద్వారా వస్తున్న మార్పులు, వాస్తవానికి వివిధ కారణాలుగా జరుగుతున్నాయని కూడా తెలుస్తున్నది. భూకంపాల స్వల్ప ప్రకంపనాలు, థర్మల్ తరంగాలు, సూర్యరశ్మి చర్యమొదలైనవి గమనించారు.

ప్రిన్స్‌టన్ యూనివర్శిటిలో రోజర్‌నెల్సన్, డీన్ రాడిన్‌లు దూరశక్తిపరిశోధనల్ని క్రోడీకరించి మళ్ళీ చూశారు. వ్యక్తులు నమ్మే అనేక అంశాలపై ఆధారపడుతున్నట్లు నిర్ధారణగా దూరశక్తి రుజువు కానట్టు చెప్పారు. న్యూయార్క్ సెయింట్ జాన్స్ యూనివర్శిటిలో రెక్స్‌స్టాన్ ఫర్డ్ పరిశోధనల వలన కూడా శాస్త్రీయ దూరశక్తి కనపడలేదు. అయితే దూరశక్తిలేదా? దూరాన బల్లపై వున్న వస్తువుల్ని చూపుతో కదలించలేరా? బల్లమీద ఒకగ్లాసు, ఒక చెంచా వంటి వస్తువులు కేవలం చూపుతో, మనోబలంతో కదిలించాలంటే 1×10, -4 జౌల్స్ శక్తి కావాలి. ఇది స్వల్పమే. బల్లమీద వున్న ఒక చెంచాను చూపుతో కదిలించడానికి మెదడులో అదనంగా 0.25 ఏమ్స్ శక్తి వుత్పత్తి చేయాలి. ఈకరెంటులో సగం గుండెకు ప్రసరిస్తే మనిషి చచ్చి వూరుకుంటాడు.

యూరిగెల్లర్ అనే ఇజ్రాయిల్ దేశస్తుడు కొన్నాళ్ళపాటు చూపుతోనే చెంచాలను, కప్పలను కదిలించడం, చెంచాలను వంచడం, గాలిలోనుండి వస్తువులను సృష్టించడం యిత్యాదులు చేసి పెద్ద సంచలనం సృష్టించాడు. వీడియో కెమెరాలు పెట్టి కూడా అతన్ని పరిశీలించారు. తనకు ఎలా శక్తి లభిస్తున్నదో తనకే తెలియదని యూరిగెల్లర్ అన్నాడు. యూరిగెల్లర్ చేసిన వస్తువుల్ని అనుకరించి అవిహస్తలాఘవంతో ఎలా చేయవచ్చునో జేమ్స్‌రాండీ అనే మాంత్రికుడు చూపాడు. యూరిగెల్లర్ కేసులు పెట్టి ఓడిపోయి, అమెరికా రావడం మానేశాడు. ఒక చెంచాను వంచాలంటే 150 ఏమ్స్ శక్తి మెదడులో వుత్పత్తి చేయాలి. లేదా విద్యుదయస్కాంత శక్తిని చెంచాపైకి ప్రసరింపచేయాలి. ఇవేవీ సాధ్యం కాదని తేలింది. ఇలాంటి పరిశోధనలు చేసిచూశారు. రేడియో సంకేతాలు దూరాన్నుండి వస్తున్నట్లే, ఆలోచనా తరంగాలు పంపించి వస్తువుల్ని ప్రభావితం చేయవచ్చని నమ్మకస్తులు వాదించారు. రేడియో సంకేతాలు సమాచారాన్ని అందిస్తాయి. అంతేగాని వస్తువుల్ని కదిలించవు. వస్తువుల్ని కదిలించడానికి, వంచడానికి శక్తికావాలి. అలాంటి వేమీ పరీక్షలకు లభించలేదు. అతీంద్రియశక్తిగా చెప్పే దూరశక్తికి ఆధారాలు లేవు. ఉన్నదల్లా నమ్మకమే. శాస్త్రీయంగా రుజువుకు నిలబడకపోయినా అలాంటి శక్తి వుందని నమ్మితే మనం ఏమీ అనలేం. నమ్మితే ఏదైనా నమ్మవచ్చు.

***- వార్త, 31 మార్చి, 2002***

# ప్రార్థనలతో ప్రాణాలు నిలుస్తాయా?

ఉద్యోగాలకై గ్రామాలకు వెళ్ళమంటే పోకపోగా, సమ్మెచేయడం ధర్నాలు నిర్వహించడం మనకు తెలిసిన కథే. అమెరికాలో పరిస్థితి వేరే వుంది. అక్కడ గ్రామ ప్రాంతాలకు అమెరికా డాక్టర్లు వెళ్ళరు. అందుకు మార్గాంతరంగా ఆయా ప్రభుత్వశాఖలు ప్రతిపాదనచేసి, డాక్టర్లను పిలిపించుకోవచ్చు. స్వదేశీ డాక్టర్లు దొరకరు కనుక విదేశీ డాక్టర్లను రప్పిస్తారు. డాక్టర్ ప్రదీప్‌కుమార్ అలా వచ్చిన ఇండియన్ డాక్టర్. పంజాబ్ నుండి 1999లో అమెరికా వచ్చిన ప్రదీప్‌కుమార్‌ను ఎడారిలోని ఒక కుగ్రామానికి వెళ్ళమన్నారు. ఇండియాలో అయితే వెళ్ళేవాడు కాదేమోగానీ, అమెరికా కదా వెళ్ళక తప్పలేదు. యురేకా అనే మారుమూల ప్రాంతానికి వెళ్ళాడు. నేవాడ రాష్ట్రంలో డైమండ్ పర్వతాల చెంత ఈ కుగ్రామం వుంది. కొద్దిమంది నివశించే ఈ గ్రామంలో కనీస సౌకర్యాలు లేవు. హాస్పటల్ లేదు. అయినా డా॥ ప్రదీప్‌కుమార్ మూడు సంవత్సరాలు పనిచేసి గ్రామస్తుల ప్రేమాభిమానాలు చూరగొన్నాడు. అక్కడి వారు ప్రదీప్‌కుమార్‌ను తమలో ఒకడిగా భావించేవారు.

యురేకాలో ఎవరికైనా జబ్బుచేస్తే హాస్పటల్‌లో చేర్పించాలంటే 110 మైళ్ళు పోవలసిందే. అమెరికాలో అలాంటి ప్రదేశాలు వున్నాయి. ప్రదీప్‌కుమార్ ఇప్పుడు ఇండియానా రాష్ట్రంలో పనిచేయడానికి వెళ్ళాడు. అక్కడ తన భార్య, చిన్న కుమారుడు వున్నారు. ఒకప్పుడు అమెరికాకు విపరీతంగా వెళ్ళిన డాక్టర్ల ప్రభావం ఇప్పుడు లేదు. ఇంజనీర్ల వలస కూడా వెనుకంజ వేసింది. ప్రభుత్వ శాఖలు తమ అవసరాలకు డాక్టర్లను విదేశాల నుండి పిలిపించుకోవచ్చు. కొత్త వాతావరణంలో వచ్చేవారికి టెర్రరిస్టు సంబంధాలు లేకుండా వుండాలి. కానీ అది రుజువు చేయడం ఎలా? ఆ పని రక్షణ సంస్థలు, ఇమిగ్రేషన్ శాఖ చేయాలని ఇతర ప్రభుత్వ శాఖలు అంటున్నాయి. పల్లె ప్రాంతాల్లో మాత్రం డాక్టర్ల అవసరం చాలా వుంది. యురేకాలో డాక్టర్ ప్రదీప్‌కుమార్‌కు డబ్బు వచ్చినా కనీస సౌకర్యాలు కూడా లేకుండానే కష్టపడి పనిచేయాల్సి వచ్చింది.

కొన్ని క్రిస్టియన్ శాఖలు కేవలం ప్రార్థనలతో జబ్బులు నయమవుతాయని నమ్ముతున్నారు. అమెరికాలో ఇలాంటి క్రిస్టియన్ శాఖలు పది వరకు వున్నాయి. పిల్లలకు జబ్బుచేస్తే కొందరు ప్రార్థనలు జరిపినా జబ్బు నయంకాక చనిపోతే, అడిగే దిక్కు లేకుండాపోయింది. దీనిపై డా॥ రీటా స్వాన్ తిరుగుబాటు వేసింది. ఆమె కుమార్తె అలానే చనిపోయింది. కోర్టుకు వెడితే మతసంస్థలపై తమకు హక్కులేదని అన్నారు. ఇప్పుడు కొన్ని రాష్ట్రాలలో కోర్టుకు వెళ్ళే రీతిలో చట్టాలు మారుస్తున్నారు. మంత్రాలకు చింతకాయలు రాలతాయని నమ్మేవారు అమెరికాలోనూ వున్నారు.

*- వార్త, 1 డిసెంబరు, 2002*

# అమెరికా హేతువాదులతో

అమెరికా మూఢ నమ్మకాలలోనూ అగ్రరాజ్యమే. అత్యధిక సంఖ్యాకులు క్రైస్తవులుగా వివిధ విశ్వాసాలతో జీవితాన్ని సాగిస్తున్నారు. అటువంటివారి మెతక మనస్తత్వాలపై క్రైస్తవ బాబాలు, చర్చీలు చక్కగా వ్యాపారం చేసుకుంటూ ధనార్జన చేస్తున్నాయి.

అమెరికాలో హేతువాదులు అల్పసంఖ్యాకులే. అయినా వారికి బలీయమైన ఆయుధం సైన్స్, సైంటిఫిక్ పద్ధతి. కొద్దిమంది శాస్త్రజ్ఞులు హేతువాద సంఘాలలో పనిచేస్తూ ప్రోత్సహిస్తున్నారు. కాని మూఢనమ్మకాల అమెరికా సమాజంలో వీరిది ఎదురీతగానే వుంది. ఎప్పటికప్పుడు హేతువాదులు (మానవాదులు) ప్రజలకు జరుగుతున్న మతపరమైన మోసాలు, దివ్యశక్తుల పేరిట కుట్రలు, అతీంద్రియ శక్తులపేరిట ఘోరాలు బట్టబయలుచేస్తూనే వున్నారు. అయినా అమెరికన్లు కొత్త బాబాల్ని వెతుక్కుంటూ, కొత్త మోసాలకు గురిఅవుతూనే వున్నారు.

నేను 1992లో ఆర్నెల్లు, 1994 సంవత్సరం అమెరికా సంయుక్తరాష్ట్రాలలో గడిపి హేతువాద, మానవవాద, నాస్తిక, సందేహవాదులతో పరిచయం ఏర్పరచుకున్నాను. వారి కార్యకలాపాలు పరిశీలించాను. వారి సమావేశాలలో మాట్లాడి మన హేతువాదుల కృషిని వివరించాను. వారపత్రికలు, ప్రచురణలు, ప్రసారాలు క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. కొందరు ప్రతిభాశాలురతో సన్నిహిత పరిచయం కూడా ఏర్పరచుకున్నాను. వారిలో పాల్‌కర్ట్జ్, ఫ్రెడరిక్ ఎడ్వర్డ్స్ వంటివారికి ఇండియాతో పరిచయం వుంది.

అమెరికాలో హేతువాదులు, మానవవాదులు ఒకటిగానే పనిచేస్తున్నారు. హేతువాదులు సెయింట్ లూయిస్ నుండి రేషనలిస్ట్ అనే మాసపత్రిక నిర్వహిస్తున్నారు. దీనికి గార్డన్ స్టయిన్ సంపాదకుడు. ఆయన ప్రతిభాశాలి. ప్రస్తుతం బఫెలో నగరంలో ఇంగర్‌సాల్ గ్రంథాలయం పెంపొందిస్తున్నారు. ఇంగర్‌సాల్ ఇంటిని ఒక మ్యూజియంగా 1994లో రూపొందించారు. ఇది న్యూయార్క్ రాష్ట్రంలోని డ్రెస్‌డన్‌లో వుంది. ఇంగర్‌సాల్ పుస్తకాలన్నీ పునర్ముద్రించారు. కంప్యూటర్ డిస్క్‌లో కూడా అమర్చి అందిస్తున్నారు. క్రైస్తవమత ఘోరాల్ని ఇంగర్‌సాల్ ఎదుర్కొన్నతీరు జనాలకు జ్ఞప్తి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంగర్‌సాల్‌పై ప్రచురించిన గ్రంథాలు, అనువాదాలు సేకరించి బఫెలో గ్రంథాలయంలో అమర్చే ప్రయత్నంలో వున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా హేతువాద, మానవవాద ప్రచురణలు కూడా ఒకచోట చేర్చి అందుబాటులో వుండేట్లు ప్రయత్నిస్తున్నారు. బఫెలో కేంద్రంలో భవనాలు నిర్మించడంలో ప్రస్తుతం వీరు కృషి చేస్తున్నారు. ఇది నయాగరా దగ్గరే వుంది. అమెరికా సందర్శించే హేతువాదులు యీ కేంద్రానికి వెళ్ళి అక్కడ జరుగుతున్న హేతువాద కార్యక్రమాలు పరిశీలించాలి. కొంతవరకు అవి మనకు ఉత్తేజాన్ని కలిగిస్తాయి.

అమెరికా మానవవాద, హేతువాద సంఘాలు ఆ దేశంలో కొందరు నిపుణులతో పరిశీలన

సంఘాలను ఏర్పరచాయి. అతీంద్రియశక్తులున్నాయని చెప్పేవారి నిమిత్తం ఒక సంఘం వుంది. వీరు ఆయా సంఘటనలు జరిగినచోట్లకు వెళ్ళి పరిశీలిస్తారు. వివరంగా పూర్వాపరాలు తెలుసుకుంటారు. దీనికి రే హైమన్ అధ్యక్షులుగా వున్నారు, పేరా సైకాలజి ఉపసంఘం వారు అనేక మౌలిక విషయాలు బట్టబయలు చేశారు. డ్యూక్ విశ్వవిద్యాలయంలో జె.బి. రైన్ ఆధ్వర్యాన మూడు దశాబ్దాలపాటు జరిగిన మోసాల్ని రట్టుచేశారు. అక్కడ శాస్త్రీయ పరిశోధనల పేరిట జరిగినదంతా తంతు అని తెలిపారు.

జ్యోతిష్య విషయ పరిశీలన సంఘానికి ఐ.డబ్లు. కెల్లీ అధ్యక్షులుగా వున్నారు. సైంటిస్టులు జ్యోతిష్యాన్ని పరిశీలించి అందులో శాస్త్రీయాధారాలు లేవని తేల్చారు. పత్రికలలో జ్యోతిష్యఫలాలు ప్రకటించినప్పుడు, అది కేవలం వినోదం కొరకేనని వ్రాయమని ఎడిటర్లకు విజ్ఞప్తి చేశారు. కొన్ని పత్రికలు అలా చేస్తున్నాయి.

ఆరోగ్యరంగంలో అశాస్త్రీయ చికిత్సలు బయటపెట్టడానికి ఒక సంఘం పనిచేస్తూ వున్నది. విలియం జార్విస్ దీనికి అధ్యక్షులు. అక్యూపంక్చర్, హోమియో, కైరోప్రాక్టిస్ మొదలైన విధానాల వలన హాని, అశాస్త్రీయత బయటపెట్టారు.

ఎగిరే పళ్ళాల గొడవ మనకు అంతగా పట్టలేదుగాని అమెరికాలో యిది తీవ్రంగా వుంది. దీని ఉపసంఘం అధ్యక్షుడు ఫిలిప్‌క్లాజ్ లోగుట్టు అంతా బయటపెట్టాడు. ఆయన్ను నేను కలసి ఇంటర్వ్యూ చేశాను. ప్రజలు తమకు తెలియని ఆకాశ వస్తువులపట్ల ఎలాంటి భ్రమలు, ఊహలతో వుంటారో వివరించారు.

అనేక మూఢనమ్మకాలను బట్టబయలు చేయడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు వాడే ఉపసంఘం పనిచేస్తున్నది. ప్రముఖ హేతువాది పేజ్‌స్టేఫెక్ దీనికి అధ్యక్షులు. ఆయనతో, సెయింట్ లూయీస్‌లో ఒకరోజు గడిపి, చర్చించాను. హిప్నాటిజం, జ్యోతిష్యం, సంఖ్యాశాస్త్రం, హస్తసాముద్రికం, దివ్యవాణి, అతీంద్రియ శక్తులు, ట్రిక్‌ఫోటోగ్రఫీ మొదలైన విషయాలలో వీరు కంప్యూటర్ల ద్వారా పరిశోధన చేస్తున్నారు.

క్రైస్తవ మత ప్రచారకులు, భక్తితో రోగాల్ని నయం చేస్తామనే వారిని జేమ్స్ రాండి అనే ఆయన ఉతికేస్తున్నాడు. కొందరు ఆయన ధాటికి తట్టుకోలేక దివాళా తీశారు. యూరిగెల్లర్ వంటి మాంత్రికులు కోర్టుకుపోయి, ఓడిపోయి, జేమ్స్ రాండి దెబ్బకు హడలి, పారిపోతున్నారు. అనేక రంగాలలో జేమ్స్‌రాండి నేటికీ యువకులకు శిక్షణ యిస్తున్నారు. ఇండియా నుండి ఎవరైన వస్తే శిక్షణ యిస్తారుకూడా. ఆయనతో నేను ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాను. సైన్స్ రంగంలో మోసాలు చేస్తున్నవారి గురించి సుప్రసిద్ధ సైన్స్ రచయిత మార్టిన్ గార్డినర్ అనేక రచనలు చేసి, యధార్థాలను వెల్లడించారు. 80వ ఏట కూడా ఆయన యింకా యీ కృషిసాగిస్తూ, హేతువాదులకు తోడ్పడుతున్నారు.

సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు కార్ల్‌శాగన్‌ను కలిశాను. ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాను. శాస్త్రీయంగా ఆయన అనేక విషయాలలో మతం పేరిట చేస్తున్న తప్పుడు వాదనలు బయటపెడుతున్నారు. ఆయన ఉపన్యాసాలు స్వయంగా విన్నాను. భారత హేతువాదులకు, మానవవాదులకు తన శుభాకాంక్షలు అందజేశారు.

మానసిక వైకల్యం, పిచ్చి అనే పేరుతో దొంగ చికిత్సలు చేస్తున్నవారిని తీవ్రంగా విమర్శిస్తూ థామస్ సాజ్ కృషి చేస్తున్నారు. ఆయన్ను కూడా కలిశాను. ఆయన పుస్తకాలు హేతువాదులు పరిశీలించాలి. ముఖ్యంగా మిత్ ఆఫ్ మెంటల్ ఇల్‌నెస్ గమనించాలి. ఇండియాకు ఎవరైనా పిలిస్తే వస్తామన్నారు.

*- శాస్త్రీయ హేతువాదం, జనవరి-ఫిబ్రవరి 1998*

# వెంకటేశ్వర సుప్రభాతం తెలుగులో పాడరెందుకు?

వెంకటేశ్వర సుప్రభాతం సంస్కృతంలో వుంది. రోజూ రేడియోలలో, టి.వి.లలో, మైకులు పెట్టి దేవాలయాలలో, ఇండ్లలో కేసట్లు వాడుతూ పారాయణం చేస్తున్నారు. సంస్కృతం తెలిసిన భక్తులు అతి స్వల్పం. కాని అలవాటుగా మిగిలిన భక్తులు అది విని తరించినట్లు భావిస్తున్నారు. వెంకటేశ్వర సుప్రభాత మహాత్మ్యంపై పత్రికలలో రాయించారు.

పిల్లల చేత కూడా యీ సుప్రభాతాన్ని పాడిస్తున్నారు. అర్థం లేని చదువు వ్యర్థం అంటారు గదా! పిల్లలకు అర్థం చెప్పకుండా వల్లే వేయించరాదు. కనుక అర్థం చెప్పరు. అర్థం తెలిసిన తరువాత పిల్లలకు వెంకటేశ్వర సుప్రభాతం చెప్పవచ్చునా లేదా అనేది స్పష్టపడుతుంది.

### సుప్రభాతంలో 1వ శ్లోకం :

కమలాకుచ చూచుక కుంకమతో
నియతారుణి తాతుల నీలతనో
కమలాయతలోచన లోకపతే
విజయీభవ వేంకట శైలపతే

దీని అర్థం తెలుగులో యిది. లక్ష్మీ దేవి చనుమొనలయందున్న కుంకుమపూ రంగువల్ల అంతటా ఎర్రగా చేయబడ్డ సాటిలేని నల్లని శరీరం కలవాడా తామర రేకులవంటి విశాలమైన కన్నులు కలవాడా జగన్నాయకుడా, వెంకటాచలపతీ, జయించే స్వభావం కలవాడవు కమ్ము.

**సుప్రభాతంలో 3వ శ్లోకం :**

మాతస్సమస్త జగతాం మధుకైటభారే
వక్షో విహారిణి మనోహర దివ్యమూర్తి
శ్రీ స్వామిని శ్రితజనప్రియ దానశీలి
శ్రీ వెంకటేశదయితె తవసుప్రభాతమ్

**తెలుగులో అర్థం** : అన్ని లోకాలకు తల్లివి. ఎప్పుడు విష్ణుమూర్తి రొమ్ముల పై వుండేదానివి. మనోహరమైన ఆకారం గలదానవు. ఆశ్రయించినవారి కోర్కెలను తీర్చేదానవు. వేంకటేశ్వరుని ప్రియురాలివైన శ్రీ లక్ష్మీదేవి నీకు శుభోదయం అగుగాక.

**13వ శ్లోకం :**

శ్రీమన్నభీష్ట వరదాఖిల లోకబంధో
శ్రీ శ్రీనివాస జగదేక దయైకసింధో
శ్రీ దేవతా వృషభుతాంతర దివ్యమూర్తి
శ్రీ వెంకటాచలపతీ తవసుప్రభాతమ్

**తెలుగులో అర్థం** : లక్ష్మీదేవితో కూడిన వాడా, కోరిన వరాలిచ్చేవాడా, సమస్తలోకాలకు బంధువైన వాడా, పూజ్యురాలైన లక్ష్మీదేవికి నివాసమైనవాడా. ప్రపంచానికంతటికీ ఒక్కడివే విశాలమైన దయగలవాడవు. లక్ష్మీదేవి రెండు చేతుల మధ్య గట్టిగా ఇరక్కున్నవాడా. మనస్సు హరించే అందమైన ఆకారం గలవాడా. వెంకటేశ్వరుడా, నీకు సుప్రభాతమగుగాక.

**23వ శ్లోకం :**

కందర్పదర్ప హరసుందర దివ్యమూర్తి
కాంతాకు చాంబురుహ కుట్మలలోల దృష్టే
కళ్యాణ నిర్మలగుణాకర దివ్యకీర్తి
శ్రీ వెంకటాచలపతీ తపసుప్రభాతమ్

**తెలుగులో అర్థం** : మన్మథుడి గర్వాన్ని హరించగల అందమైన ఆకారం గలవాడా. ప్రియురాలి తామర మొగ్గల వంటి చన్నుల మీద ఆసక్తితో చూపులు పెట్టినవాడా. శుభాన్ని కలిగించే మంచి గుణాలకు నిలయమైనవాడా. గొప్ప కీర్తి కలవాడా. వెంకటాచలపతీ నీకు సుప్రభాతముగుగాక.

ఇందులో శ్లోకాలకు తెలుగు అర్థాన్ని ఇంకో విధంగా భక్తులు రాస్తారేమో తెలియదు. ఇక్కడ చెప్పిన తెలుగు అర్థాన్ని కీ॥శే॥ వెనిగళ్ల సుబ్బారావు రచన "శ్రీ వెంకటేశ సుప్రభాత శృంగారం" నుండి స్వీకరించాను. (1982 కనమత వెంకట రామరెడ్డి, ప్రగడవరం, రేపల్లె, మెయిన్‌రోడ్)

నేను అమెరికాలో పై విషయాలను ఇంటర్నెట్‌లో తెలుగు వారితో చర్చించినప్పుడు, కొందరు భక్తులు ఆగ్రహించారు. అదే వారి సమాధానం. మరికొందరు ఒస్! ఇంతే గదా! సంస్కృతంలో ఇలాంటి శృంగారం మాకు అలవాటే అన్నారు. ఇంకొందరు ఎంతో శృంగారం వుందనుకున్నాం, యీ మాత్రానికే దెప్పిపొడవాలా అన్నారు. చర్చ అలా సాగింది. భక్తుల నుండి అంతకు మించి ఆశించలేని నైతిక విప్లవం కావాలనే వారేమంటారో చూడాలి. ఏమైనా పిల్లల్ని వీటికి దూరంగా వుంచడం అవసరం.

*- హేతువాది, ఫిబ్రవరి 2001*

# చదువుకున్నవారిలోనూ మూఢనమ్మకాలెందుకుంటాయి?

అంత చదువుకున్న సైంటిస్టు బాబా కాళ్ళకు మొక్కుతున్నారు. కనుక ఏదో మహత్తు వుందన్నమాట అని సాధారణ పౌరులు అనుకోవడం చూస్తున్నాం.

సాంకేతిక నిపుణులు, పవిత్ర గ్రంథాలను పట్టుకొని, పూజలు చేస్తున్నారు. ప్రొఫెసర్లు, సాధువు ఏం చెప్పినా, ఇంటిలో విగ్రహారాధన, బయట మొక్కుబడులు చేస్తున్నారు.

ఈ విధంగా చదువుకున్నవారు మూఢనమ్మకాలను పాటిస్తుండటం వలన ప్రజలలో యింకా వాటికి బలం పెరుగుతోంది.

రాజకీయవాదులు, సినిమాతారలు, జడ్జీలు, పోలీస్ అధికారులు తిరుపతి, షిర్డి, అయ్యప్ప భక్తులుగా, బాబా పాదాక్రాంతులుగా ప్రవర్తించడంతో అదంతా ఆనవాయితీగా ప్రశ్నించరాని తీరుగా మారుతోంది.

చదువుకున్నవారు మూఢవిశ్వాసాలతో వుండడం మన సమాజానికే పరిమితం కాదు. అగ్రరాజ్యమైన అమెరికా మొదలు కమ్యూనిస్టు దేశాలవరకూ యీ మూఢత్వం వివిధ రూపాలలో వ్యాపించి అంటురోగం వలె ప్రబలుతున్నది.

కొందరు కొన్నిటిని మూఢనమ్మకాలుగా కొట్టిపారేసి మరికొన్నిటిని గుడ్డిగా నమ్ముతున్నారు.

మనకు అనుకూలమైన విషయంలో మనకు గిట్టుబాటు అయినచోట, సంపాదనకు ఉపకరించే దగ్గర, శాస్త్రీయ పరిశీలన పక్కనబెట్టి, హాయిగా మూఢనమ్మకాన్ని పాటిస్తున్నారు. మిగిలిన విషయాలపై వేదికలెక్కి మూఢనమ్మకాలను ఖండించే వారే, యిలా అవకాశవాదులుగా మారడంతో ప్రజలలో విశ్వాసం సడలుతున్నది.

ఇలా ఎందుకు జరుగుతున్నది? ఈ విషయం సునిశితమైనది. జాగ్రత్తగా పరిశీలించి

అవగాహన చేసుకోవాలి. ముఖ్యంగా మానవవాదులు, హేతువాదులు, సందేహవాదులు, నాస్తికులు గ్రహించాలి.

మన సమాజాలు పెత్తందారీ విధానంలో వున్నాయి. అధికారాన్ని కొలిచే సంప్రదాయంలో అలవాటుగా పెరుగుతున్నాం. తల్లిదండ్రులు చెప్పిందే చిన్నప్పుడు వేదం. బడిలో ఉపాధ్యాయులు చెప్పిందే సరైనది అని నిర్ధారణగా నమ్ముతారు. సమాజంలో రాజకీయ నాయకులు, సినిమా తారలు, బాబాలు, చాలామందిని నడిపిస్తున్నారు. వీరందరిలో మూఢనమ్మకాలు అలవాటుగా, వంశపారంపర్యంగా వస్తున్నవి.

చిన్నప్పుడు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, సమాజంలో పెద్దలు చెప్పిన మూఢనమ్మకాలు వాళ్లల్లో గాఢంగా నాటుకపోయివుంటాయి. అలాంటప్పుడు సైంటిస్టుగా, ఇంజనీర్‌గా, డాక్టర్‌గా చదువుకున్న వ్యక్తి తన పరిధిలో, తన ప్రాక్టీసులో నిపుణుడుగా తేలినా, మిగిలిన రంగాలలో మూఢనమ్మకాలను పట్టించుకోడు. కనుక చిన్నతనంలో మనస్సులో నాటుకుపోయిన నమ్మకాలు విజృంభించి పనిచేస్తాయి. ఈ విషయాలను పరిశీలించి కార్ల్‌శాగన్ చక్కని గ్రంథం రాశారు. అందుకే జేమ్సురాండి అంటాడు - చదువుకున్నవారిని, సైంటిస్టులను భ్రమలో పెట్టడం మోసగించడం తేలిక అని, ఏదో ఒక అద్భుతం జరుగుతున్న చోటుకు పరిశీలక బృందం వెడితే, అందులో ఒక మెజీషియన్ వుండడం అవసరమని జేమ్సురాండి అన్నాడు. లేకుంటే కనికట్టుతో, ఇంద్రజాలంతో బురిడీ కొట్టించడం చాలా తేలిక. సైంటిస్టులు ముక్కుసూటిగా పోతూ, యీ పక్కదారుల్లో జరిగే మాయాజాలాన్ని పట్టించుకోరు. పైగా వాటిని గ్రహించానికి వేరే శిక్షణ వుండాలి.

రాజ్యాధికారంలో వున్న వ్యక్తులు జ్యోతిష్యాన్ని, వాస్తును, యోగంను చిట్కావైద్యాలను ప్రచారం చేసినప్పుడు, ప్రజలు పక్కదారులకు పోతుంటారు. అందుకే రాజకీయవాదుల్ని బాబాలు ఆశ్రయించి తమ పని సులువు చేసుకుంటారు. ఉభయులూ జనాన్ని మోసం చేయడం, వారి పబ్బం గడుపుకోవడానికే.

అలాంటి వాతావరణంలో కొందరు హేతువాదులు, మానవవాదులు నాస్తికులు సైతం ఒక్కోసారి ఏదో ఒక మూఢనమ్మకం దగ్గర తప్పటడుగు వేస్తారు. శాస్త్రీయ పద్ధతిని అన్వయించడంతో అది విమర్శలకు దారితీస్తుంది.

ఇలాంటి విషపూరిత సామాజిక మూఢనమ్మకాల వాతావరణంలో ఏం చేయాలి?

శాస్త్రీయ పద్ధతి మూలసూత్రాలు వంటబట్టించుకోవాలి. సమస్య ఎదురైనప్పుడు శాస్త్రీయ పద్ధతిలో అన్వేషించే అలవాటు చేసుకోవాలి. ఏ ప్రశ్న వేయాలి, ఎలాంటి పరికరాలు వాడాలో అన్వేషించడంలో ఏ మార్గం అనుసరించాలి, అనేవి గ్రహించాలి. ఒక్కొక్క మూఢనమ్మకం వెనుక వున్న విషయం ఏమిటి అనేది చూడాలి. సైన్స్ పరిశోధనలు ఒకసారి వచ్చి ఆగిపోవు. నిత్యనూతనంగా జరిగే, ప్రక్రియ అది. కనుక ఎప్పటికప్పుడు కొత్త అంశాలు ఏమి వచ్చాయో చూడాలి.

ఎంత గొప్ప సైంటిస్టు చెప్పినా అది వ్యక్తిగత అభిప్రాయం అయితే దానిని ప్రమాణంగా స్వీకరించరాదు. జ్యోతిష్యాన్ని గురించి న్యూటన్, యూంగ్ చెప్పాడంటే అది సైన్స్‌లో భాగం కాదు. ఈ విషయం గ్రహించక తరచు సైంటిస్టుల పేరు చెప్పి బోల్తా కొట్టించే వారి విషయం జాగ్రత్తగా పట్టించుకోవాలి. ఈ విషయాన్ని మరో కోణం నుండి చూద్దాం.

సూరి భగవంతం సైంటిస్టుగదా. అలాంటి వ్యక్తి సత్యసాయిబాబా భక్తుడై అతని దేవుడని నమ్మాడుగదా. ఏమంటారు అని అనేకమంది అడుగుతుంటారు. అలా సమస్య వచ్చినప్పుడు సామాన్యవ్యక్తులు అవును నిజమే అంతటి సైంటిస్టే నమ్ముతుంటే ఏమీ లేకపోతే ఎందుకు గుడ్డిగా పాదాక్రాంతుడౌతాడంటారు.

హేతువాదులు ఆ క్లిష్టసమస్యను ఎదుర్కోవడంలో ముందుగా గమనించవలసిన విషయాలున్నాయి. సూరి భగవంతం ఫిజిక్స్‌లో ఒక భాగమైన క్రిస్టలోగ్రఫీ నిపుణుడు. అది గొప్ప సైన్సు. ఆ విషయాలు ఏవైనా సూరిభగవంతం చెబితే అందుకు రుజువులు, ఆధారాలు, పరిశోధనలు, పరిశీలనలు వుంటాయి. ఆయన చెప్పేవి నిజం అవునోకాదో ఇతరులు అవే పరిశోధనలు చేసి కనుగొనవచ్చు. కాని సత్యసాయిబాబా విషయం కేవలం వ్యక్తిగత నమ్మకం. ఫిజిక్స్‌లో ఆయన చదివిన దానికీ, యీ మూఢవిశ్వాసానికీ ముడిపెట్టకూడదు. కాని జనం అలా రెండింటినీ పెనవేసి, ఒకేగాటిన కట్టేసి చూస్తారు. అదే లోపం. శ్రీ పాదగోపాలకృష్ణ మూర్తి ఫిజిక్స్ ప్రొఫెసర్ కాని ఆయన జిల్లెళ్ళమూడి అమ్మ భక్తుడు. ఆ రెండింటికీ సంబంధం లేదు. ఈ విషయాలను విడమరచి చూడకపోవడంలోనే తేడా వస్తున్నది.

భగవతి ఒక జడ్జి. ఆయన సాయిబాబా భక్తికీ, న్యాయమూర్తిగా ఆయన చట్టనైపుణ్యతకూ పొందిక లేదు. ఇలాగే ఎవరి విషయంలోనైనా చెప్పవచ్చు.

జనంలో వీరారాధన తత్వం వుంది. అందులో అరలు పొరలు వున్నాయి. సినిమా హీరోలను, రాజకీయవాదులను గొప్ప ఆరాధ్యులుగా చూచేవారున్నారు. వారికోసం ప్రాణాలు తీసుకునేవారూ వున్నారు. అలాంటివారే బాబాలకు భక్తులుగా వున్నప్పుడు, వారిని ఆరాధించే తీరు సంగతి చెప్పాలా?

జనంలో వున్న యీ బలహీనతల్ని, వీరారాధన తత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛని తాకట్టుపెట్టే ధోరణిని బాగా వాడుకుంటున్నారు. స్వేచ్ఛకు దూరంగా జరుగుతూ ఎవరికో, ఒకరికి లొంగిపోయి అదే హాయి అనే ధోరణిలో జీవిస్తున్నారు. దీనికి కర్మవాదం తోడైంది.

భయం వలన భక్తిగా వుండటం సర్వసాధారణం, చిన్నప్పటినుండే పిల్లల్ని కొట్టి, తిట్టి, గుడులకు మసీదులకు, దేవాలయాలకు తీసుకెళ్ళి, గుడ్డిగా వల్లెవేయించిన ఫలితంగా యీ భయం గూడు కట్టుకొనివుంటుంది. అది పెద్ద అయినా పోవడం లేదు. ఆ భయం చుట్టూ క్రతువులు, పూజలు, మొక్కుబడులు, యజ్ఞాలు, యాగాలు ఒకటేమిటి, ఎన్నో అల్లేశారు.

పురోహిత వర్గం అన్ని మతాలలో యీ భయాన్ని కట్టుదిట్టం చేసి, జనాన్ని గుప్పిట్లో పెట్టుకున్నది. కమ్యూనిస్టు పాలనలో సైతం యిది రూపుమాపలేకపోయారు.

శాస్త్రీయ పద్ధతిని చిన్నప్పటి నుండే పిల్లలకు చెప్పడం ఒక్కటే ఈ భయాన్ని పోగొట్టగలదు. ఇది క్రమేణా జరగాలి.

సమస్యలు ఎదురైనప్పుడు ఎలా పరిశీలించాలో, ఎలా ఎదుర్కోవాలి అనే విషయం ఇప్పుడు చూద్దాం. దీనికి ముందు ఒక్క సత్యాన్ని విస్మరించరాదని హెచ్చరిక చేయక తప్పదు.

సత్యసాయిని ఖండించే వారంతా మూఢనమ్మకాలకు వ్యతిరేకం అని భ్రమపడితే పెద్ద పొరపాటే. సత్యసాయి బోగస్ కానీ, షిర్డీ సాయి అనువైన వాడనేవారున్నారు. ఇదంతా కాదు, కేవలం తిరుపతి వెంకటేశ్వరుడే నిజమైన దేవుడనేవారూ వున్నారు. మనం చెక్కిన విగ్రహాలకు మనమే మొక్కుతూ బానిస మనస్తత్వంతో బ్రతుకుతున్నామని ఆర్యసమాజ్ వారన్నారు. అలాగని వారు వేదాల్లోకి వెనక్కుపోయి అక్కడే ఆగిపోదామంటున్నారు.

ఈ మతాల మధ్య కలహాలలో పరస్పరం దేవుళ్ళ మహాత్మ్యాలు బయటపడుతుండగా, అన్ని మతాల సమన్వయ వ్యాపారానికి దిగిన రామకృష్ణ పరమహంస వున్నారు. మూఢ నమ్మకాలలో, తరతమభేదాలే తప్ప యిందులో మానవుని స్వేచ్ఛను కాపాడేవి ఒక్కటీ లేవు. అది గ్రహించగలిగితే వివిధ మూఢనమ్మకాలను, వాటి పేరిట జరిగే చికిత్సలను బట్టబయలు చేయవచ్చు. ఎలా చేయడం అనే దగ్గర జాగ్రత్త వహించాలి.

## జ్యోతిష్యం శాస్త్రీయమనంటే?

జ్యోతిష్యం ఒక మూఢనమ్మకం అని హేతువాదులు అంటుంటారు. కాదు శాస్త్రీయమే అని మరొక వాదన వుంది. ఏదైనా శాస్త్రీయం అని ఎవరన్నాసరే సంతోషమే. ఒక విషయం శాస్త్రీయం అనగానే అందరూ ఆహ్వానించాలి. శాస్త్రీయం అయితే బహిరంగంగా పరిశీలనకు పెట్టవచ్చు. ఎప్పటికప్పుడు వచ్చే మార్పులు చేర్పులకు అనుగుణంగా శాస్త్రీయ విధానం వుంటుంది. దీనినే శాశ్వతం అనదు. పూర్వకాలంలో రుషులు రాసారు గనుక అదే ప్రమాణం అని శాస్త్రీయం అంగీకరించదు. రుజువుకు నిలబడితే ఒప్పుకోవడం, లేకుంటే తృణీరించడం శాస్త్ర లక్షణం. తనను తాను దిద్దుకుంటూ సాగడం శాస్త్ర మూలం.

జ్యోతిష్యం శాస్త్రీయమేనని అనగానే, హేతువాదులు ఏమని అడగాలి? ఎలా పరిశీలించాలి? ఏది రుజువుకు పెట్టాలి? ఈ అంశాలు కూడా క్షుణ్ణంగా తెలిసి వుండాలి. గుడ్డిగా వ్యతిరేకించి కొట్టిపారేయరాదు. ఆ దృష్ట్యా మానవ, హేతువాదులకు సూచనలు యిస్తున్నాను. జ్యోతిష్యం ప్రకారం గ్రహాలు, నక్షత్రాలు మనుషులపై ప్రభావం చూపుతాయి. సరే, బాగానేవుంది. ముందుగా గ్రహాల నుండి ఎలాంటి ప్రభావం వస్తుందో చూడాలి. ఇంత వరకు సైన్స్

పరిశోధించిన దానినిబట్టి నాలుగు శక్తులున్నాయి. అందులో వీక్‌న్యూక్లియర్, స్ట్రాంగ్, విద్యుదయస్కాంతశక్తులు అని తేల్చారు.

అస్థిరంగా వుండే న్యూక్లై క్షీణదశకు వీక్‌న్యూక్లియర్ ఫోర్స్ కారణమౌతుంది.

స్ట్రాంగ్ న్యూక్లియర్ ఫోర్స్ అణువు పరమాణువుల స్థాయిలో అతి సమీపస్థలంలో పనిచేస్తుంది.

విద్యుదయస్కాంత శక్తి పనిచేయడానికి వస్తువుల్ని ఛార్జి చేయాలి. అప్పుడే అది చర్యకు ఉపక్రమించి రసాయనిక మార్పులకు దారితీస్తుంది.

గురుత్వాకర్షణ శక్తి ఏవైనా పెద్ద వస్తువుల మధ్య పనిచేస్తుంది. అంటే భూమి చంద్రుడు లేదా చంద్రుడు సముద్రాలంతటి పెద్ద వాటి మధ్య పనిచేస్తుందన్నమాట. నాలుగు శక్తులలో ఇది చాలా బలహీనమైనదంటారు. మనిషికీ గ్రహానికీ ప్రత్యక్షంగా ప్రభావం చూపే శక్తి కనబడలేదు. ఇక మిగిలింది సూర్యుడి నుండి వచ్చే వెలుగు మాత్రమే. ఎప్పుడు పడిన వెలుతురును ప్రమాణంగా స్వీకరించాలి? తల్లిగర్భం ధరించిన తరువాత ప్రసవించే వరకూ పడే వెలుగును జ్యోతిష్యం స్వీకరించడం లేదు. వెలుగుకు ప్రభావం వుంటే ఆ 9 మాసాల వెలుగు కిరణాలమాటేమిటి?

జ్యోతిష్యులు కొందరు చెప్పే అయస్కాంత ప్రకంపనాల ప్రభావం ఇంతవరకూ రుజువు కాలేదు. జ్యోతిష్యంలో నక్షత్రాల ప్రస్తావన వుంది. భూమికి సమీప నక్షత్రం నుండి వెలుగు రావడానికి నాలుగున్నర సంవత్సరాలు పడుతుంది. మిగిలిన వాటి దూరం శతాబ్దాలకు మించిపోయింది. కనుక ఈ కిరణాల ప్రభావం పరిగణలోకి జ్యోతిష్యం తీసుకోజాలదు.

జ్యోతిష్యంలో పేర్కొనే రాశిచక్రాలు, గుర్తులు ఊహామాత్రమైనవి. అంటే వాటికి ఉనికి లేదు. గ్రహాలలో రాహువు కేతువు అంతే. అవి కేవలం నమ్మకాలు. గ్రహాల ప్రభావం వుందని తాత్కాలికంగా అంగీకరిస్తే, కొత్తగా కనుగొన్న నెప్ట్యూన్, యురేనస్, ప్లూటో మాటేమిటి? అవి కనుగొనక ముందున్న జ్యోతిష్యం అంతా తప్పు గదా? ప్రాచీన జ్యోతిష్యం గ్రంథాలన్నీ తిరగరాయాలి గదా.

ఒకే సమయంలో పుట్టిన కవలలపై జ్యోతిష్య ప్రభావం భిన్నంగా వుండడాన్ని అధ్యయనం చేశారా?

ఆకాశంలో వున్న సమీప శకలాలు (మీటరాయిట్స్, అస్టరాయిడ్స్) తోకచుక్కల ప్రభావం జ్యోతిష్యం పరిగణలోకి తీసుకోదా? ఎందుకని?

నక్షత్రాలు పుడతాయి. గిడతాయి. అటువంటప్పుడు నక్షత్రాల ప్రభావాన్ని గురించి, జ్యోతిష్యం ఏమంటుంది? జ్యోతిష్యం నమ్మకస్తులకు యీ విషయాలను వివరించాలి. వెంటనే

నమ్మకాలు వదలుకోరు. జ్యోతిష్యం గిట్టుబాటైన వ్యాపారంగా మార్చేశారు గనుక అది నిలదొక్కుకోడానికే ప్రయత్నిస్తుంది. అందుకే క్రమబద్ధమైన ఎదుర్కోలు సాగాలి.

## అతీంద్రియ శక్తులు (పేరాసైకాలజీ)

దూరాన వున్న మనిషి మనస్సులో వున్న ఆలోచన చెప్పగలగడం టెలిపతి అంటున్నారు. అలా చెప్పిన వ్యక్తికి, అవతల వ్యక్తికి మధ్య ఏ సంబంధమూ వుండదు.

దూరాన వున్న వస్తువుల్ని కంటిచూపుతో, మనోశక్తితో కదలించడం, ప్రభావం చూపడాన్ని సైకో కెనిసిస్ అంటున్నారు.

మామూలుగా తెలిసిన ఇంద్రియశక్తులకు మించిన శక్తులు వున్న వ్యక్తిని మహాత్ముడని, బాబా అని, చెబుతున్నారు.

వీటన్నిటినీ పరిశీలించడానికి 19వ శతాబ్దంలో మొదలుపెట్టి నేటి వరకూ చాలా శాస్త్రీయ పరిశోధనలు జరిగాయి. ఇంగ్లండ్‌లో యూరోప్ దేశాలలో, అమెరికాలో యీ శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా యింతవరకూ ఎక్కడా పేరాసైకాలజీ, అతీంద్రియశక్తులు శాస్త్రీయంగా రుజువు కాలేదు.

అమెరికాలో జె.బి. రైన్ మొదటి డ్యూక్ యూనివర్శిటీలో పేరాసైకాలజీ శాఖను ఆరంభించి పరిశోధించారు. చివరకు తేలిందేమంటే, రైన్ చిత్తశుద్ధితో చేసినా ఆయన వద్ద పనిచేసినవారు మోసగించారు. శాస్త్రీయ పరిశోధనలనే పేరిట దొంగ లెక్కలు చూపి రుజువు అయినట్లు ప్రకటించారు. తీరా వాటిని శాస్త్రీయంగా పరిశోధిస్తే ఫలితాలు రాలేదు. రైన్ దంపతులు తమ తప్పును ఒప్పుకున్నారు. డ్యూక్ యూనివర్శిటీలో పేరాసైకాలజీ శాఖను ఎత్తివేశారు. కాని చాలా చోట్ల యీ అతీంద్రియ శక్తుల దుకాణాలు వెలశాయి.

ఇంగ్లండ్‌లో ఆర్థర్ కోస్లర్ యీ అతీంద్రియ శక్తులపై తెగరాసి, నిధులు సమకూర్చి, పరిశోధనలు చేయించాడు. అయినా రుజువుకాలేదు. ఎప్పటికప్పుడు పరువు నిలబెట్టుకోడానికి పేరాసైకాలజీ వారు తిప్పలు బడుతూనే వున్నారు. పేకముక్కల ప్రయోగం గణాంక పరిశీలనలు, గోడ అవతల మనిషిని పెట్టి అతడి ఆలోచనలు చెప్పాలనే పరిశోధన, యిలా రకరకాలుగా చేసి, బోర్లాబడ్డారు. ఆశ వదలుకోలేక యింకా పేరాసైకాలజీని రుజువు చేద్దామనుకుంటున్నారు.

సైంటిఫిక్‌గా చూస్తే దూరాన వున్న వ్యక్తి మనస్సులో ఏముందో తెలుసుకోడానికి, అవతలవ్యక్తి మెదడునుండి వచ్చే ఆలోచనలు పట్టుకోవాలి. మెదడులోని కోట్లాది న్యూరాన్‌లు ఆలోచన, ఆవేదన, నిర్ణయాలు తీసుకునే పనిచేస్తుంటాయి. న్యూరాన్లు ఏగ్జాన్లతో కలుస్తాయి అంటే సంకేతాలు పంపిస్తుంటాయి. అలా పంపించే తీరును విద్యుత్ చర్యగా పేర్కొంటారు. మెదడు విద్యుత్ రసాయనిక చర్య ద్వారా పనిచేస్తుంది. అవతల వ్యక్తి మెదడులో యివన్నీ

పనిచేసే తీరు ఏదో ఒక విధంగా బయటకు పొక్కితే గాని, టెలిపతి సాధ్యంకాదు. అదెలా సాధ్యమో ఇంతవరకూ పరిశోధనలో టెలిపతివారు చెప్పలేకపోయారు. ఎలాగో పట్టుకున్నారనుకుందాం. అవతలవ్యక్తి మెదడులో వచ్చే ఇంపల్స్‌లను టెలిపతి ఎలా విప్పి చెబుతుంది. దీన్ని డికోడింగ్ అంటారు. అదెలా సాధ్యమో చెప్పలేకపోయారు.

సిట్రాన్ అనే కణాలను మెదడు విడుదల చేస్తుందని వాటిని అధ్యయనం చేసి టెలిపతి పనిచేస్తుందని బుకాయించారు. కాని సిట్రాన్ వునికి యింతవరకు తేలలేదు!

టెలిపతిలో ఏ మాత్రం వాస్తవం వున్నా లాటరీ టిక్కెట్ల నంబరు చెప్పి గెలవడం సాధ్యమేగదా. అదెందుకు చేయలేకపోయారు? గుర్రపు పందాలలో ఏ గుర్రం గెలుస్తుందో చెప్పలేకపోవడానికి కారణం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు టెలిపతి సమాధానం చెప్పదు.

దూరాన్నుండే వస్తువులు కదలించే ప్రయోగాలు యూరిగెల్లర్ చేయగా, అందులో మోసాన్ని, బూటకాన్ని జేమ్సురాండి బయటపెట్టారు. ఇందులోనే చూపుతోనే స్పూన్‌లు వంచడం కూడా వుంది.

దూరాన్నుండి ఒక వస్తువును చూపుతోనే కదలించాలంటే మెదడు ఎంత శక్తి వినియోగించాలి అనే పరిశోధనలు చేశారు. అలాంటి పని మానవుడి మెదడు ఉత్పత్తి చేయాల్సిన శక్తి ప్రమాదకర ఓల్టేజితో వుంటుంది. అది కూడా సాధ్యం కాదని రుజువైంది. బల్లమీద ఒక గ్లాసును చూపుతో కదలించాలంటే 100 మిల్లిఓల్ట్స్ శక్తి మెదడులో ఉత్పత్తి కావాలి. 0.25 ఏమ్స్ అదనపు ఎనర్జీ ఇందులో సగం గుండెలో ప్రసరిస్తే మనిషి చచ్చిపోతాడు! కొందరు రేడియో సంకేతాల సామ్యం తెచ్చారు. రేడియో సిగ్నల్స్ సమాచారాన్ని యిస్తాయే గాని వస్తువుల్ని కదలించవు. చంచాలను వంచవు. విద్యుదయస్కాంతం ద్వారా సైకొకెనిసిస్ పనిచేస్తుందనడానికే రుజువులు దొరకలేదు. ఇంతవరకూ సైన్స్‌కు తెలిసిన శక్తుల వలన టెలిపతి టెలికెనెసిస్ పనిచేయడం సాధ్యం కాదు. ఇక మిగిలింది మూఢనమ్మకమే. అదే కొందరిని నడిపిస్తున్నది.

కొందరు శాస్త్రజ్ఞులు చిత్తశుద్ధితో అతీంద్రియ శక్తుల విషయంలో కృషి చేశారు. అందులో ష్మిట్, జాన్, జె.బి. రైన్ పేర్కొనదగినవారు.

*- హేతువాది, జూన్ 2001*

# బాబాలు - ఆశ్రమాలు - ఆస్తులు

ఆశ్రమాలకు ఆస్తులకూ చాలా దగ్గర సంబంధం వుంది. దేశంలో బాబాలు, మాతలు, సన్యాసులు, స్వాములు భక్తిపేరిట, ఆధ్యాత్మికత పేరిట ఆస్తులు కూడగట్టారు. ఆస్తులు కాపాడుకోడానికి అస్తి పన్ను మినహాయింపు తెచ్చుకున్నారు. మతం, ధార్మికత, మొదలైనమాటల

చాటున ప్రభుత్వాలు ఆస్తి పన్ను మినహాయిస్తున్నాయి. ఆదాయం వచ్చే ఆశ్రమాలకు ఆకర్షణ ఎక్కువ. అక్కడ కూడా బాబాలకు, ఆదాయం పన్ను మినహాయిస్తున్నారు.

మతం పేరిట పన్నులు మినహాయింపు తెచ్చుకోడం వివిధ దేశాలలో యించుమించు అన్ని మతాలకూ వున్నది.

పౌరులందరినీ చట్టరీత్యా సమానంగా చూడాల్సిన ప్రభుత్వం నేరాలు, ఫోర్జరీ చేసిన బాబాలకు మినహాయింపులిస్తున్నది. పోలీస్ అధికారులు, న్యాయమూర్తులు, మంత్రులు, రాష్ట్రపతులు, గవర్నర్లు, సంపన్న వాణిజ్య వేత్తలు వివిధ కారణాలతో వివిధ బాబాలకు భక్తులుగా పబ్లిక్‌గా ప్రదర్శించడం, ఆయా ఆశ్రమాధిపతులకు గిట్టుబాటుగా వుంది.

ఇటీవల దత్తభగవాన్ అనే బాబాను హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. కాళీబాబా ఆశ్రమంపై బాంబులు పడ్డాయి. సత్యసాయిబాబా పుట్టపర్తి ఆశ్రమంలో నాలుగుహత్యలు జరిగాయి. రాజమండ్రి వద్ద గోదావరి ఒడ్డున సుందర చైతన్యస్వామి ఆస్తులపై వివాదం వుంది. ముస్లింల వక్ఫ్ బోర్డులు ఆస్తులపై కావలసినన్ని నిందారోపణలున్నాయి క్రైస్తవుల చర్చీల ఆస్తుల కలహాలు కోకొల్లలు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ఆశ్రమాలున్నాయి? ఆ ఆశ్రమాలలో ఎలాంటి స్థిరాస్తులు చరాస్తులున్నాయి? ఆశ్రమాధినేతలు ఎవరు? వారి పూర్వపరాలేమిటి? ఈ విషయమై పూర్తి రికార్డు ప్రభుత్వం వద్ద వుందా?

ఆధ్యాత్మిక చింతన వీధినపడింది. ఆశ్రమాలు, బాబాలు, మాతలు, విచ్చలవిడిగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. మతం రాజకీయాల్లో బాగా ప్రవేశించింది. నగరాలలో గ్రామాలలో ట్రాఫిక్‌కు అడ్డంగా కొత్త దేవుళ్ళను సృష్టించి కొంగ్రొత్త దేవాలయాలను, మసీదులను, గుడులను కట్టేస్తున్నారు.

సుప్రీంకోర్టు వద్దన్నా వినకుండా మైకుల రూపంలో శబ్దకాలుష్యం సృష్టించి, భక్తిని బజార్లో పెడుతున్నారు. భక్తివ్యాపారం బాగా సాగిపోతున్నది.

సాంకేతిక శాస్త్రీయ రంగాలలో ముందుకుపోతున్న సమాజాన్ని, సామాజిక రంగంలో మతంపేరిట వెనక్కునడిపిస్తున్నారు. విగ్రహారాధన వద్దన్న రామమోహన్‌రాయ్, వీరేశలింగం గార్లను మరచిపోయి, కొత్త విగ్రహాలు పెడుతున్నారు.

విదేశాలకు భక్తిని ఎగుమతి చేస్తున్న బాబాలు పరువు తీసేస్తున్నారు. అయినా ఒక బాబా మోసాన్ని బట్టబయలుచేసినప్పుడు, జనం మరోబాబాని వెదక్కుంటున్నారు. అంతేగాని, కొంచెం తేడాతో అందరు బాబాలూ ఒకే మూసలోని వారేనని గ్రహించడం లేదు.

రజనీష్, మహేష్ యోగి అమెరికాలో ఆస్తులు విపరీతంగా సంపాదించి, అక్కడి సమాజం

చీదరించుకోగా పారిపోవాల్సి వచ్చింది. అలాగే చంద్రస్వామి, ధీరేంద్ర బ్రహ్మచారి వగైరాల గొడవలు బయటపడ్డాయి. రామకృష్ణమఠం, షిర్డిసాయిమతం, అయప్పకేంద్రం, తిరుపతి దేవస్థానం అవినీతి పనులు ఎన్నోసార్లు బయటపడుతూ వచ్చాయి. తిరుపతిలో గుండు చేయించుకుంటే తిరిగి జుట్టురాదంటే చాలామంది చేయించుకోరని ఒకరు చమత్కరించారు. ఏమైనా మతవ్యాపారానికి చిన్న పిల్లల్ని సైతం చిత్రహింసల పాలు చేస్తున్నారు.

ఇదీనేడు జరుగుతున్న తంతు! చిన్నతనం నుండి తల్లిదండ్రులు, పంతుళ్ళు, పురోహితులు మతమూఢనమ్మకాల్ని నూరిపోయడం వలన, శాస్త్రజ్ఞులుగా తయారైనవారు సైతం చిన్నతనం ప్రభావం నుండి ఒక పట్టాన బయటపడలేకపోతున్నారు.

నేడు ప్రభుత్వం బాహాటంగా బాబాలను, సన్యాసులను, యోగులను ప్రోత్సహిస్తున్నది.

సమాజంను నిర్వీర్యం చేస్తున్నది యీ బాబాలే. ఆలోచనను చంపేయాలని యోగ పద్ధతులను చిత్రవిచిత్రాలుగా ప్రచారం చేస్తున్నది యీ మతాలవారే. సన్యాసులు ఎంత ఎక్కువైతే సమాజం అంతగా క్షీణిస్తుంది. మూఢనమ్మకాలకు నిలయం యీ సన్యాసి ఆశ్రమాలు.

ప్రభుత్వం తక్షణమే యీ ఆశ్రమ వివరాలన్నీ సంపూర్ణంగా సేకరించాలి. ఆశ్రమాలకు ఆస్తి పన్ను, ఆదాయం పన్ను మినహాయింపులు యివ్వరాదు. నేరాలనుండి ఆశ్రమాలకు భద్రత కల్పించరాదు. మతాన్ని ప్రభుత్వాన్ని వేరుచేయాలి. భక్తివుంటే అది ప్రైవేట్ విషయంగానే తప్ప ప్రదర్శనకు పెట్టరాదు. ఇప్పటికే ఆశ్రమాలు, బాబాలు చాల సంఘద్రోహం చేశాయి. ఇప్పటికైనా అడ్డుకట్ట వేయకపోతే మనం ముందుకు పోలేం.

***- హేతువాది, జూన్ 2001***

# చావుబ్రతుకుల్లో సెక్యులరిజం

ఇండియాలో సెక్యులరిజం కనుచూపు మేరల్లోలేదు. కేంద్రంలో గానీ, రాష్ట్రాలలో గానీ ప్రభుత్వాలు వస్తూ పోతూ వున్నవి. వీటన్నిటికీ సెక్యులరిజం పట్ల ఏకాభిప్రాయం వున్నది. అటువంటి అవగాహన వున్న రాజకీయపార్టీలు పెత్తనం చేసినంతకాలం సెక్యులరిజానికి అర్థం మారక తప్పదు. ఓట్లు రాబట్టాలనే దురుద్దేశ్యంతో రాజీపడే యీ రాజకీయపార్టీలు సెక్యులరిజానికి నిర్వచనం చెప్పాయి. దీనికి ఇండియాలో రాధాకృష్ణన్ పితామహుడు.

సెక్యులరిజం అంటే అన్ని మతాలను సమానంగా పరిగణించడం అని రాధాకృష్ణన్ చెప్పిన భాష్యానికి రాజకీయపార్టీలు అంటిపెట్టుకున్నాయి. అవసరమైతే తమకు అనుకూలమైన మతాన్ని ప్రచారం చేసుకుంటూ, మధ్యమధ్య మిగిలిన మతాలను పొగుడుతూ ఒక సందేశం పారేస్తుంటారు.

మతాన్ని వ్యక్తిగతంగా అట్టిపెడితేనే సెక్యులరిజం అవుతుంది. ఎవరి మతం వారిది. ఎవరి నమ్మకాలు వారివి. ప్రభుత్వం అందరిదీ. కనుక ప్రభుత్వంలో వున్నవారు తమ వ్యక్తిగత నమ్మకాలను ప్రచారం చేయడం గాని, ఇతరులపై రుద్దడంగాని, ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించడం గానీ కూడదు. అంటే మతాన్ని బజార్లోకి ఈడ్చుకరాకూడదని సారాంశం.

సెక్యులరిజాన్ని యీ విధంగా అమలుజరపకపోవడం వలన అన్ని అనర్థాలు వచ్చాయి. ఇంకా వస్తాయి. దేశంలో తరచు జరిగే హిందూ-ముస్లిం కలహాలు, హిందువులలోని శాఖలలో తగాదాలు, సిక్కుల ఖలిస్తాన్ ఉద్యమం, ఇవన్నీ ప్రభుత్వ సెక్యులర్ వైఖరివలన జనించినవే.

అన్ని మతాలు ఒకటికాదు. మతాలన్నీ ఒకే విషయాన్ని బోధించడం లేదు. దేవుడు ఒక్కడు కాదు. ఎవరి మతానికున్న దేవుడు ఆ మతానికి గొప్ప. అన్ని మతాలు ఒకటే అయితే ఇన్ని మతాలు పుట్టేవేకాదు. ఒక మతాన్ని ఖండిస్తూ, మరొక మతం పుట్టింది. హిందూమతాన్ని కాదని బౌద్ధ, జైనమతాలు వచ్చాయి. హిందువులలో శైవులు, వైష్ణవులు చావచితకబాదుకున్నారు. ఇలాగ ప్రపంచవ్యాప్తంగా మతాలన్నీ పరమత ద్వేషంతో పుట్టి పెరిగినవే. మతాలు హింసను పోషించి ఆచరించాయి. చివరకు బౌద్ధంకూడా అలాంటిదే. అల్లా ఒక్కడే దేవుడంటున్న ముస్లింలు మిగిలిన దేవుళ్ళను ఒప్పుకోరు. క్రైస్తవులూ అంతే. అందరు చెప్పేది ఒక్కటే అయితే, మతప్రచారం అర్ధరహితం గదా.

కాని మన రాజకీయవాదులు, పదవులలో వున్నవారు జాతీయసమైక్యత పేరిట తమను మోసగిస్తూ, ఇతరులను భ్రమింపజేయాలని ప్రయత్నిస్తున్నారు. మతకలహాలు జరిగినప్పుడు, సభలుపెట్టి చిలకపలుకులు వల్లిస్తున్నారు. వారికి చిత్తశుద్ధిలేదు. ఉంటే దేశంలో పౌరులందరికీ ఒకే కోడ్ ఎప్పుడో అమలుచేసేవారు.

పంజాబ్‌లో శిక్కుల మతపరమైన కోర్కెలు ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం మరోసారి సెక్యులరిజాన్ని చావుదెబ్బ కొట్టింది. మిగిలిన మతాలవారుకూడా వెనకా ముందూ చూచుకొని మతాధిక్యతపై ప్రయత్నిస్తారు.

సెక్యులరిజం చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది.

ఇందిరాగాంధీకి వ్యక్తిగతంగా ఏ నమ్మకాలున్నాయో మనకు అనవసరం. ఎన్.టి. రామారావు స్వయంగా దైవాంశ సంభూతుడనని కలలు కంటే మనం చేయగలిగిందేమీలేదు. కాని ప్రధానిగా ఇందిరాగాంధీ, ముఖ్యమంత్రిగా ఎన్.టి. రామారావు ప్రజలకు బాధ్యులు. వారేమిచేసినా ప్రజలు గమనిస్తారు. ఇక్కడే వ్యక్తిగత నమ్మకాలకూ, ప్రభుత్వ ఆచరణకూ గిరిగీయవలసి వుంటుంది. వీరిద్దరూ ప్రభుత్వ ఖర్చు లేకుండా, ప్రైవేటుగా తిరుపతి వెళ్ళినా, సంతోషిమా దగ్గర ప్రణామం చేసినా మనకు అనవసరం ప్రజల డబ్బుతో పటాటోపంగా తమ భక్తిప్రపత్తులను ప్రచారం చేయడం సెక్యులర్ వ్యతిరేకం. ఇతర మతాలవారిని తృప్తిపరచడానికి

గురుద్వారా, మసీదు, దేవాలయాలను సందర్శించినా, ఎవ్వరూ నమ్మరు. పైగా ద్వేషం రగులుతూ కలహాలకు దారితీస్తుంది.

ప్రభుత్వ యంత్రాంగం కూడా నిష్పాక్షికంగా వుండకపోతే, పరిపాలన వలన అందరికీ సుఖం లభించదు. విజయవాడవద్ద కృష్ణపై వంతెనకు కనకదుర్గ అని పేరు పెడితే, ముస్లింలు, క్రైస్తవులు, నాస్తికులు ఎలా భావిస్తారు? రేడియో, టి.వి.లు అందరికోసం ఉద్దేశించారు. మతం ఒక వర్గానికి చెందినది. ఆయా మతస్తులు అనేక ఆచారవ్యవహారాలను పాటిస్తుంటారు. అప్పుడే కలహించుకుంటారు కూడా. మసీదు పక్కగా బాండ్ మేళాలతోపోతే కలహాలు వచ్చాయి. పంది మాంసం గురించి, ఆవు మాంసం గురించి ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ దృష్టిలో ఇవన్నీ లా అండ్ ఆర్డర్ సమస్యలుగానే వుండాలి. ఉద్యోగాలుచేసే వారికి రూల్స్ ఒకటే. మతపరమైన పండగవస్తే ఆ మతస్థులు సెలవు పెట్టుకోవాలి. అందరికీ సెలవు యివ్వడం అనవసరం. ఉద్యోగాలుచేసే ముస్లింలు ప్రార్థన పేరిట పోతామనడం కూడా సెక్యులర్ వ్యతిరేకమే. ఇతరులకు కష్టం కలిగించే వ్యవహారమే యిది. ఆఫీసుల్లో ప్రార్థన నిమిత్తం షెడ్లు నిర్మించమంటే, అన్ని మతస్తులు ఏదో ఒక కోరిక కోరతారు. దీనికి అంతం వుండదు. క్రమేణా కలహాలకు దారితీస్తుంది.

రేడియో, టి.వి.లలో మతప్రచారం ఎక్కువైంది. దీనివలన సమైక్యత చెడుతుందేగాని బాగుపడదు. వారానికి 5 రోజులు హిందువుల భజనచేసి, ఒకరోజు ముస్లింల ప్రార్థన, ఒకరోజు క్రైస్తవుల భక్తిగీతాలు వేస్తే అన్ని మతాలు ఒక్కటైనట్లు కాదు. పైగా ఒకే భక్తి గేయాల్ని తరచు వేయడం వలన మత ప్రచారం అనిపించుకుంటుందే గాని మతాన్ని గురించి చెప్పినట్లు కాదు.

మత ప్రచారం నిమిత్తం వివిధభారతిలో డబ్బిచ్చి కొనుక్కోవచ్చు. విదేశాలలో క్రైస్తవులు అలాగే చేస్తున్నారు. ఇష్టం వున్నవారు వింటారు. లేకుంటే లేదు. కాని ఆలిండియా రేడియో ప్రజలందరి కోసం, అందరి డబ్బుతో స్థాపించిన వ్యవస్థ. అక్కడ ప్రతి శనివారం వెంకటేశ్వర సుప్రభాతం వినిపిస్తే అర్థం ఏమిటి?

ప్రభుత్వంలో కీలక స్థానంలోవున్న వ్యక్తులు స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో సెక్యులరిజంపట్ల వేసిన తప్పటడుగు వలన నేటి దుష్పరిణామం వచ్చింది. రాజకీయపార్టీలు మతాన్ని ఓట్లకోసం వినియోగించుకొనే దుస్థితికి దిగజార్చాయి. హైదరాబాద్‌లో ఒక్కొక్క యేడు గణపతి ఉత్సవం జరుగుతుంటే హిందూ-ముస్లిం ద్వేషం ప్రబలిపోతూ వున్నది.

సమస్యను మూలానికి వెళ్ళి పరిశీలించకుండా, తాత్కాలిక ప్రయోజనాలతో దాటవేద్దామంటే యిలాగే వుంటుంది. మహాత్మాగాంధీ రాం రహీం ఒక్కటే అంటే హిందువులు ఒప్పుకున్నారా? ముస్లింలు అంగీకరించారా? సెక్యులర్ సమస్యల్ని మతపరంగా చూస్తే పరిష్కారం లభించదు. ప్రతిమతం పుట్టడానికి, పెరగడానికి చారిత్రక కారణాలు వున్నాయి. వాటన్నిటినీ కాదని, ఒకే గాటిన అన్ని మతాలను కట్టేయడం సాధ్యంకాదు.

ప్రభుత్వ దృష్టిలో అన్ని మతాలు సమానం అంటే, అన్నిటికీ సమాన దూరంగా వుండటమే అని గ్రహిస్తేచాలు. అదే సరైన సెక్యులరిజం అవుతుంది. మతాలు వున్నంతకాలం మతకలహాలు తప్పవు. కనుక మతాల్ని వ్యక్తిపరమైన విశ్వాసంగా అట్టిపెట్టి, పరిపాలించడం సెక్యులరిజం అనిపించుకుంటుంది.

*- హేతువాది, ఆగస్టు 1984*

# అన్ని మన మూలగ్రంథాల్లో వున్నాయా?

అన్నీ మన వేదాలే చెప్పాయని నమ్మేవారున్నట్లే ఇతర దేశాల్లో అన్ని మతాల్లో శాశ్వత సత్యాల్ని నమ్మేవారున్నారు. అంతటితో ఆగకుండా, సైన్సు ఏదయినా కొత్త అంశం కనుగొనగానే అది మనవాళ్ళెన్నడో చెప్పారని శ్లోకాలు వల్లించే వారున్నారు. క్రైస్తవులు బైబిల్‌ని గుడ్డిగా నమ్మి, దానికోసం కోర్టులదాకా వెళ్ళి ఓడిపోయారంటే నమ్ముతారా? ఈ విశ్వమంతా బైబిల్ ప్రకారం సృష్టి అయిందని, అలాగే పిల్లలకు పాఠాలు చెప్పాలన్నారు. సైన్స్ రుజువుచేసిన పరిణామవాదాన్ని ప్రశ్నించారు. అమెరికాలో కోర్టులలో యీ సృష్టివాదాన్ని రుజువు చేయలేక వెల్లకిలా పడ్డారు. బైబిల్, వేదాలు, ఖురాన్ ఇత్యాది మతగ్రంథాలన్నీ ఆయా మతస్తులకి పవిత్రాలు, శిరోధార్యాలు కాని అవి కేవలం నమ్మకాలని విస్మరించి, వాస్తవాలన్నప్పుడే చిక్కొస్తుంది. పైగా సైన్సు ప్రకారం వున్నాయంటే మరీ ప్రమాదం.

అమెరికాలో కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో ఫిజిక్స్ ప్రొఫెసర్ ఫ్రిట్జ్‌ఆఫ్‌కాప్రా ఒక పుస్తకం రాశాడు. ది టావో ఆఫ్ ఫిజిక్స్ అనే యీ గ్రంథం బాగా అమ్ముడు బోయింది. బహుళ ప్రచారంలోకి వచ్చింది. సైన్స్‌లో నేడు శాస్త్రజ్ఞులు కనుగొన్నదంతా చైనాలో నాడే తెలుసుకున్నారని ఆయన పేర్కొన్న సారాంశం. ఇంకేముంది! జనం ఎగబడికొన్నారు. అందునా ఒక అమెరికా ఫిజిక్స్ ప్రొఫెసర్ రాశాడంటే అది పరమ సత్యమే అయివుంటుందని నమ్మే ఆసియా వాసులు చాలామంది వున్నారు. ఇండియాలో కూడా యీ నమ్మకం బాగావున్నది. సత్యసాయిబాబా, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి మొదలైన వారి గురించి పాశ్చాత్యులు రాస్తే, అదొక సర్టిఫికెట్‌గా భావిస్తారు. తెల్లవారు రాసినా నల్లవారు చెప్పినా అందులో సత్యాసత్యాలు తెలుసుకోడానికి శాస్త్రీయ ప్రమాణాలు ఒకటేనని మరచిపోతారు.

చైనాలో ఇన్ అనేది హేతుబద్ధ ఆలోచనగానూ, యాంగ్ అనేది ఉద్వేగానికి సంబంధించినదిగానూ భావిస్తారు. ఈ రెండూ ఒకే సత్యాన్ని రెండు కోణాలనుంచి చూస్తాయని అంటారు. టావో గ్రంథానికి ఆధునిక సైన్స్ రీత్యా కాప్రా భాష్యం చెప్పాడన్నాం గదా? ప్రాచీన చైనా గ్రంథాలలో చెప్పిందంతా చూస్తే ఆధునిక సైన్స్ అందులో వున్నట్లు కాప్రా నమ్మాడు. కనుక సైన్సు గొప్పతనం ఏమీలేదనీ, ప్రాచీనులు తమ దివ్యదృష్టి ద్వారా అన్నీ కనుగొన్నారనీ యిందలి

సారాంశం. ఆధునిక అణు విజ్ఞాన శాస్త్రం ఏ విధంగా ప్రాచీన టావో గ్రంథంలో యిమిడి వున్నదో కాప్రా రాశాడు. అలాగే వేదాలు, ఖురాన్, బైబుల్ గురించి చెబుతున్నవారున్నారు. ఇదంతా చాలా బాగున్నది నమ్మకస్తులకు తామరపై వేడినీరు పోసినట్లున్నది.

సైన్సు కనుగొనేవరకూ ఆగకుండా సమస్యలన్నీ పూర్వీకులు తమ గ్రంథాల ద్వారా ఎలా పరిష్కరించారో చెప్పేస్తే సరిపోతుందికాని అలా చెయ్యకుండా, సైన్స్ కనుగొనేవరకూ ఆగి అదంతా మా వేదాల్లో వుందని ఎందుకంటున్నారు?

మరొక ప్రధానమైన అంశం యీ నమ్మకస్తులు విస్మరించి యెప్పటికప్పుడు చావుదెబ్బ తింటున్నారు. సైన్స్ ఒకసారి కనిపెట్టిన విషయాన్ని, కొత్త సాక్ష్యాధారాలు లభించిన తరువాత తృణీకరిస్తుంది. కొన్నిసార్లు సవరిస్తుంది. అప్పుడేమంటారు? వేదాలు, ఖురాన్, బైబిల్, టావో రచనలు కూడా అలా సవరిస్తారా? దివ్యశక్తి అనేది సైన్సులో కూడా వున్నది. సైంటిస్టు తన పరిశోధనకు పరిష్కారం లభించనప్పుడు ఆలోచిస్తూవుంటాడు. హఠాత్తుగా పరిష్కారం లభించినట్లు కల వస్తుందనుకోండి అదే పరమసత్యం అనడు. దానిని పరిశీలనకు, రుజువుకు పెడతాడు. దివ్యశక్తి కూడా అలా పరిశోధనకు గురిచేయడమే సైన్సు విశిష్ఠత. నమ్మకస్తులు యీ విషయం విస్మరించారు.

కాప్రా రాసిన టావో ఫిజిక్స్ గ్రంథాన్ని సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు ఐజెక్ అసిమోవ్ పరిశీలించాడు. ఆయన అభిప్రాయాలు వెలిబుచ్చుతూ, సైన్స్ పరిశోధన చాలా ఖర్చుతో కూడిన పని. ప్రభుత్వాలు యీ ఖర్చును భరించలేకపోతున్నాయి. కనుక సైన్స్ యెదుర్కొంటున్న అనేక సమస్యలకు టావో ఫిజిక్స్ ఏం చెబుతున్నదో విడమరచి వివరించమని కోరాడు. అలా చెప్పగలిగితే కాప్రా యెంతో సేవచేసినవాడే గాక, ఖర్చు శ్రమ మిగులుతాయి అని అసిమోవ్ సూచించాడు. ఇది వేదాంతులకు, బైబిల్, ఖురాన్ నమ్మకస్తులకూ వర్తిస్తుంది.

ఉదాహరణకు సూక్ష్మలోకంలో క్వార్క్‌లనే అణువులు దేనితో ఏర్పడ్డాయో తెలియక సైన్స్ సతమతమౌతున్నది. దీన్ని గురించి టావో ఫిజిక్స్ యేమంటుంది?

అలాంటి క్వార్క్ (Quarks) లు ఎన్ని ఉన్నాయి? ఎలక్ట్రాన్లు దేనితో యేర్పడ్డాయి? భారమైన లెప్టాన్లు వున్నాయా? ఉంటే యెన్ని? క్వార్క్‌లకూ లెప్టాన్లకూ సంబంధం ఏమిటి? ఇవన్నీ క్వాంటం సిద్ధాంతరీత్యా మౌలిక సందేహాలు. వీటికి సమాధానం టావో ఫిజిక్స్‌లో యేమున్నదో చెప్పమని 1980లోనే అసిమోవ్ అడిగాడు. ఆయన చనిపోయాడు కూడా. 14 సంవత్సరాలైనా కాప్రా మాట్లాడలేదు. నమ్మకస్తులెవరూ నోరు విప్పలేదు.

సైన్స్ కనిపెట్టిన తరువాత ఏదో ఒక శ్లోకాన్ని, వాక్యాన్ని, సూత్రాన్ని పట్టుకొచ్చి, దీనికి అర్థం సైన్స్ చెప్పినట్లే వున్నదనడం ఫాషన్ అయింది. నమ్మేవారున్నంతకాలం ఇలాంటి మోసాలు సాగుతూనే వుంటాయి.

గ్రీకులు సెక్యులర్‌గా హేతుబద్ధంగా ఆలోచన సాగిస్తుండగా, క్రైస్తవమతం దెబ్బ కొట్టింది. ఫలితం యేమైంది? అంధకారయుగం వచ్చిందని అసిమోవ్ వాపోయాడు. ఇప్పుడు అలాంటి స్థితి యేర్పడింది. మళ్ళీ అంధకారయుగం రాకుండా చూచుకోవాలని ఆయన హెచ్చరించారు.

బైబిల్ నమ్మేవారు క్రీస్తుపూర్వం 4004 ఏళ్ళనాడు సృష్టి జరిగిందన్నారు. సైన్స్ ప్రకారం 15 బిలియన్ సంవత్సరాల చరిత్ర సృష్టికి వున్నది. సృష్టి ప్రారంభ దశనుండే భూమి కూడా వున్నదని బైబిల్ నమ్మింది. సైన్స్ ప్రకారం 5 బిలియన్ ఏళ్ళ క్రితం భూమి యేర్పడింది. అంటే 10 బిలియన్ సంవత్సరాల పరిణామం తరువాత భూమి వచ్చిందన్నమాట. బైబిల్ ప్రకారం సూర్య, చంద్రులకంటె ముందే భూమివుంది. సృష్టి అంతా 6 రోజులలో పూర్తి అయినట్లు బైబిల్ పేర్కొన్నది. పరిణామం యెప్పుడూ జరుగుతూనే వున్నదని నక్షత్రాలు యిప్పుడుకూడా ఏర్పడుతూనే వున్నాయని సైన్స్ చెబుతున్నది.

ఖగోళ శాస్త్రజ్ఞుడు రాబర్ట్‌జస్ట్రోవ్ 'గాడ్ అండ్ ది అస్ట్రానమర్స్' అని పుస్తకం రాశాడు. ఆయన బైబిల్‌ను సమర్థించడంతో మతస్తులకు మంచి పట్టు చిక్కినట్లు భావించారు. రుజువుకు నిలబడని విషయాలు శాస్త్రజ్ఞుడు చెప్పినా ఒకటే, పురోహితుడు ప్రవచించినా ఒక్కటే అని విస్మరించారు. ఈ గ్రంథాన్ని కూడా అసిమోవ్ కూలంకషగా పరిశీలించి, అందులో పెడదారులు పట్టించే తీరును యెండగట్టాడు.

*- హేతువాది, ఫిబ్రవరి 1994*

# బైబిల్ - క్రైస్తవులు - హేతువాదులు

ఇంగర్‌సాల్ బైబిల్ విమర్శ చదువుతుంటే వెంకటాద్రి ఉపన్యాసాలు గుర్తుకు వస్తాయి. బైబిల్‌లోని మూఢనమ్మకాలు, మహత్యాలు అద్భుతాల కల్పితాల గురించి ఇంగర్‌సాల్ తిరుగులేని దెబ్బతీశాడు. ఎదుటవారి వాదన అర్థంలేనిదిగా, నిర్హేతుకంగా వున్నపుడు వెంకటాద్రి కూడా అలాగే సుత్తితో బాదినట్లు బాది తలబద్దలుకొట్టి, అసలు విషయం చెబుతారు. అయినా మూర్ఖులు తగ్గటం లేదు. భక్తి ముదరడం మానలేదు.

క్రైస్తవ భక్తి, బైబిల్ నమ్మకం పట్ల మానవవాదులు శాస్త్రీయ దృక్పథాన్ని అవలంబించి చెబుతూనే వున్నారు. హేతువాదిలో పి.యస్.ఆర్. రచనలే అందుకు ఉదాహరణలు.

ప్రపంచవ్యాప్తంగా మానవవాదులు తమ సహేతుక విమర్శలు చేసి, శాస్త్రీయ దృక్పథం యేమిటో చెబుతున్నారు. సుప్రసిద్ధ సైంటిస్టు, రచయిత ఐజెక్ అసిమోవ్ బైబిల్ పైనా, క్రైస్తవుల పైనా విమర్శ పరంపరలు చేశాడు. ఆయన విమర్శకూ, ఇంగర్‌సాల్ విమర్శకూ చాలా తేడా వుంటుంది. గులకరాళ్ళు పట్టువస్త్రంలో చుట్టి, కణతకు గురిపెట్టి కొట్టినట్లు అసిమోవ్ వ్రాస్తాడు.

బైబిల్‌కు గైడ్ వ్రాసిన అసిమోవ్ అందులో చరిత్ర పాలెంత, నమ్మకం ఏ మేరకు వుంది, కవిత యెంత, కథ యెక్కడ అనేది ఆధారాలతో పరిశీలించారు. ఇదిగాక తన రచనల్లో అసిమోవ్ చాలాచోట్ల బైబిల్‌పై విమర్శలు చేశాడు.

నేను త్వరలో తిరిగొస్తాను (బైబిల్ రివలేషన్ 22:7) అని చెప్పి వెళ్ళిన క్రీస్తు రెండువేల సంవత్సరాలు అయినా రాలేదు. అంతటితో బైబిల్‌లో కొత్త నిబంధన ముగుస్తుంది. అలాంటి బైబిల్‌ను వివిధ కోణాల నుంచి చూస్తున్నారు. యూదులు కేవలం పాత నిబంధన వరకే పరిమితమౌతున్నారు. కొత్త నిబంధన వారు అంగీకరించరు. యూదులు, క్రైస్తవులు అక్కడ పోట్లాడుకుంటున్నారు.

అసిమోవ్ వివరణ ప్రకారం బైబిల్ పాతనిబంధన ప్రకారం కొన్ని చారిత్రక ప్రస్తావనలు, కొన్ని వివాదాస్పద తేడాలు, కొన్ని గాథలు వున్నాయి. క్రీ.పూ. 8500 సంవత్సరం మొదలుకొని యీ ప్రస్తావనలు వున్నాయి. యూదుల దృష్టిలో క్రీ.పూ. 3761 నాడు సృష్టి ఆరంభమైంది! ఆర్చిబిషప్ ఉషర్ (USHER) దృష్టిలో క్రీ.పూ. 4004 నాడు సృష్టి మొదలైంది.

వివిధ ప్రస్తావనల అనంతరం, క్రీ.పూ. 4న జీసస్ క్రీస్తు పుడతాడు. ఆధునిక చరిత్ర దృష్ట్యా బైబిల్‌ను స్వీకరించకూడదు. పురావస్తు పరిశీలన చేసి రాసిన గ్రంథం కాదని గ్రహించాలి. అలాగే నిర్ధారిత తేదీలు, ఆధారాలు కూడ బైబిల్ ద్వారా లభించవు. అయినా ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా పాశ్చాత్యులు బైబిల్ చదువుతున్నారు. బైబిల్‌ను ఆరాధ్య గ్రంథంగా అధ్యయనం చేస్తారు. చరిత్రలో బైబిల్ సమకాలీన అంశాలు చాలా జరిగినా వాటికి బైబిల్‌లో స్థానం లేదు. బైబిల్‌లో ప్రస్తావించిన వాటి అసలు సంగతి ఏమిటో అసిమోవ్ వివరించాడు. క్రీ.పూ. 4 వేల నుండి క్రీ.పూ. 900 వరకు 5 సామ్రాజ్యాల కాలంగానూ ఆ తరువాత క్రీ.త. 100 వరకూ మరో 5 రాజుల కాలంగానూ అసిమోవ్ చూపాడు.

యూదులకూ క్రైస్తవులకూ ప్రధాన తేడా ఏసుక్రీస్తు దగ్గరే వస్తుంది. ఆ తరువాత క్రైస్తవులలో మళ్ళీ పోప్ పెత్తనం దగ్గర తగాదాలు రాగా, రోమన్ కాథలిక్కులు మిగిలినవారు చీలిపోయారు. మతం పేరిట యుద్ధాలు జరిగాయి.

బైబిల్ మొత్తం క్రైస్తవులకు ఆరాధ్య గ్రంథం కాగా, యూదులు పాత నిబంధనకే పరిమితం అయ్యారు. పాత నిబంధనలో శామ్యుల్, కింగ్స్ అనే అధ్యాయాలలో చరిత్ర వుండగా, జనిసిస్, ఎక్సోడస్‌లో గాథలు వున్నాయి. కవిత, చింతన, భవిష్యత్తు ఊహాపోహలు పుష్కలంగా కన్పిస్తాయి.

కొత్త నిబంధనలో క్రైస్తు చరిత్రను నలుగురు వ్రాయగా, కొంత చారిత్రక విషయం, మరికొంత జోస్యం మిళితమై వుంది. వివరాలకు పోతే కొన్ని చారిత్రక విషయాలలో సరిగా లేకపోవచ్చు.

అయితే, బైబిలులో ఆదాం, ఈవ్, కెయిన్, ఏబల్, నింరోడ్, అబ్రహాం, ఐజాక్, జాకబ్ వంటివారి ప్రస్తావన వున్నా వారికి చారిత్రక నిజస్వరూపం లేదు. బైబిల్ వెలుపలవారికి స్థానం లేదు. అలాగే అద్భుతాలన్నీ బైబిల్‌పై నమ్మకం గలవారికే పరిమితం.

బైబిల్ చెప్పే సృష్టివాదం శాస్త్రీయంగా యెక్కడా నిలవదు, బైబిల్ చెప్పిందంతా సత్యం అని మూర్ఖంగా పట్టుబడితే, శాస్త్రజ్ఞులకూ నమ్మకస్తులకూ ఘర్షణ రాకతప్పదు. అసిమోవ్ తన రచనలో ఈ హెచ్చరిక చేశాడు.

అమెరికాలో సుప్రసిద్ధ మానవవాది ఎడ్‌డోయర్ రాస్తూ స్కూలు పిల్లల్ని ఫలానా విధంగా ప్రార్థన చేయమని, మౌనం వహించమని ప్రభుత్వ పాఠశాలల్లో శాసించే హక్కు లేదంటున్నారు. మతపండుగలు చేసుకోడానికి ప్రభుత్వాన్ని సెలవులు యివ్వమనడాన్ని ఆయన గర్హిస్తున్నారు. ప్రభుత్వం, మతం వేరుగా వుండాలని ఎడ్‌డోయర్ తీవ్రంగా పోరాడుతున్నారు.

ఆఫ్రికా - అమెరికా మానవతావాదులు నామ్‌ఏలెన్ సంపాదకత్వాన వెలువరించిన గ్రంథంలో జోరానీల్ ప్రశ్నలు ఆశ్చర్యాన్ని గొలుపుతాయి. క్రీస్తు పాపులను కాపాడటానికి పుట్టి, సిలువకు గురియై పాపాత్ములను రక్షించాడు కదా! ఇంకా మనుషులను పాపులంటూ చర్చి ఫాదరీలు ప్రచారం చేస్తారేమిటి? పాపాలు పోగొట్టలేదా క్రీస్తు అని అడుగుతున్నారు. ఈ సృష్టి అంతా దేవుడు చేస్తే, అది మార్చమని ప్రార్థనలు చేయడం మరీ పాపం కదా అంటున్నారు. దైవ నిర్ధారణ మార్చమని ప్రార్థిసే, దైవసృష్టిలో దోషం వున్నట్లా? ఇక భక్తుల మాటకొస్తే, నాజీలు, జాత్యహంకారవాదులు సైతం పరమభక్తులే అని గుర్తు చేస్తున్నారు. పేదలకు సేవ చేయడానికి యింత డబ్బు ఖర్చుపెట్టి అంత పెద్ద గుడులు కట్టడం దేనికని కూడా ప్రశ్నిస్తున్నారు. కుటుంబ నియంత్రణ సాధనాలను పోప్ వ్యతిరేకిస్తుండగా సెక్యులర్ ప్రభుత్వాలు ఏంచేయాలో ఆలోచించుకోవాలి.

క్రైస్తవులందరూ జీసస్‌ను, బైబిల్‌ను అంగీకరిస్తున్నా, వివరాలలో ఏకాభిప్రాయం లేదు. పైగా చంపుకునేటంత భేదాభిప్రాయాలున్నాయి. మూల ప్రతినిధిని నేనే అని పోప్ అనగా కాదని మార్టిన్ లూథర్ ఎదురుతిరిగాడు. ఎవరి బైబిల్ వారు అనువదించి, వాడుతున్నారు. ఎవరి వ్యాఖ్యానం వారు చేస్తున్నారు. దైవానికీ మనిషికీ మధ్య పోప్ ఎవరు అని ప్రశ్నించిన ప్రొటెస్టంటులు క్రమేణా ఫాదరీలను తెచ్చిపెట్టుకుని గుడులు కట్టి, కరడు గట్టుకపోయిన మతవ్యాపారంలోకి దిగారు. ఇప్పుడు కేథలిక్కులు, లూథరిన్లు, ప్రొటెస్టంట్లు, బాప్టిస్టులు, మెథడిస్టులు, ఎవాంజలిస్టులు, సెవెన్త్‌డే ఎవాంజలిస్టులు, పెంతకోస్తులు, ప్రెస్బిటేరియన్లు, ఆంగ్లికన్లు, కాంగ్రిగేషనలిస్టులు, డిసైపుల్స్ ఆఫ్ క్రీస్తులు, యూనీటేరియన్లు ఇంకా అనేక చిన్న శాఖలున్నాయి. అందరూ ఎవరి కుంపటి వారు వెలిగించి, నిధులు వసూలుచేస్తూ, మతమార్పిడులు జరుపుతూ, ప్రభుత్వ పన్నులు మినహాయింపులతో దైవం పేరిట మానవుడిపై స్వారీ చేస్తూ, మానవ బలహీనతలపై చక్కగా వ్యాపారం చేసుకుంటున్నారు.

మానవ హక్కులు అమలుపరచకుండా దైవం పేరిట అడ్డుపడుతున్న క్రైస్తవాన్ని హేతువాదులు సైన్స్ ద్వారా ఎదుర్కొంటున్నారు. సైన్స్ కూడా తమదేనని చెప్పిన క్రైస్తవులు అపహాస్యం పాలయ్యారు. అమెరికాలో 90% దైవంలో నమ్మకం వున్నవారైనా, ఫలానా దేవుడని గాని ప్రార్థిస్తే వరాలిస్తాడని గాని నమ్మకం లేనివారు 30% వున్నారట.

భవిష్యత్తు జోస్యాలతో బైబిల్‌ను అడ్డం పెట్టుకొని, 2 వేల సంవత్సరంలో విశ్వం అంతమౌతుందని చెప్పే క్రైస్తవులూ వున్నారు. ఈ తేదీలు సమయానుకూలంగా మారుస్తుంటారు.

భవిష్యత్తు చెప్పగలిగిన క్రైస్తవ నాయకులు, ప్రజల నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. దీనికి బదులు లాటరీ టిక్కెట్లు కొని, గెలిచే నంబర్లు తెలుసుకొని చూపితే, సులభంగా కోటీశ్వరులౌతారుగదా అని ఛార్లస్ ఫాల్కనర్ అడిగాడు. బహుశా అతీంద్రియ శక్తులతో భవిష్యత్తు చూడగలమనే వారందరికీ యీ ప్రశ్న వర్తిస్తుంది.

నమ్మకస్తులు సులభంగా మారరు. ప్రశ్నలు, చర్చలు, ఆలోచన యివన్నీ చిత్రహింసలు నమ్మకానికి బుర్ర తాకట్టు పెడితే హాయిగా వుంటుంది. అందుకే సైన్సు ఇంత పెరిగినా నమ్మకస్తులు చలనం లేకుండా సాగిపోతున్నారు. బైబిల్‌కు ఆదరణ సన్నగిల్లలేదు!

*- హేతువాది, ఆగస్టు 1994*

# అమెరికాలో ఆధ్యాత్మిక వ్యాపారం! ఇండియా ఎగుమతులు!

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఆధ్యాత్మిక వ్యాపారం విచ్చలవిడిగా, యథేచ్ఛగా సాగిపోతున్నది. పెట్టుబడిలేని సంపాదనగా మనుషుల బలహీనతలే ఆధారంగా, భక్తి పేరిట దోపిడీ పెరిగిపోతున్నది. ఈ రంగంలో భారతదేశం నుండి కొందరు తమ విశ్వాసాలను అమెరికాలో అమ్ముకొని విలాస జీవితాల్ని గడుపుతున్నారు.

అమెరికాలో సంవత్సరంన్నర కాలంపాటు పరిశీలించిన అనంతరం, 600 మతశాఖలు ఆధ్యాత్మిక వ్యాపారంలో వున్నట్లు గమనించాను. ఇందులో చిన్న, పెద్ద స్వాములు, బాబాలు వున్నారు. వివిధ దేశాల నుండి అమెరికా చేరుకున్న ఆయా మతగురువులు సొంత దుకాణాలు పెట్టుకొని, తమ దేశస్తులకే పరిమితమై గుట్టుగా దోపిడిలో నిమగ్నులై వున్నారు. ఇందులో సుమారు 75 శాఖలు మహత్తులు, మాజిక్‌లు, మోసాలు, భీభత్సాలు, చికిత్సలు, భయానక వాతావరణం సృష్టించి తమ వారిని ఆకట్టుకొని, పీల్చి పిప్పి చేస్తున్నారు. మతస్వేచ్ఛ పేరిట వీరు చేసే ఆగడాలు యిన్నీ అన్నీ కాదు. అందులో కొన్ని రహస్య కార్యకలాపాలలో నిమగ్నమైనాయి. విషాదాంతంగా విపరీత సంఘటనలు బయటపడినప్పుడే వాటి గుట్టు జనానికి తెలుస్తున్నది.

అలా యిటీవల తెలిసిన మత సంఘాలలో డేవిడ్‌శాఖ, జిమ్‌జోన్స్, డేవిడ్ కోరేష్ రహస్య సామూహిక హత్యలు, ఆత్మహత్యలు సుప్రసిద్ధమైనవి.

మన దేశానికి చెందిన ఎగుమతి ఆధ్యాత్మిక శాఖలు అమెరికాలో కొంత ప్రచారం పొంది, అపఖ్యాతి పాలయ్యాయి. అందులో రజనీష్ ఆశ్రమం ఒకటి. సెక్స్‌తో ఆధ్యాత్మికతను రంగరించి, డబ్బు విపరీతంగా సంపాదించి, ఒక వూరునేకొనేసి విమానాలు, కార్లు, అమ్మాయిలతో రభస చేసిన నేరానికి రజనీష్‌ను వెళ్ళగొట్టిన ఉదంతం కొందరికి జ్ఞాపకం వుండి వుంటుంది. ఆయన ఇండియావచ్చి పూనాలో చనిపోయాడు.

కృష్ణ చైతన్య అంతర్జాతీయ సంఘం ఒకటి ఇండియాలో పుట్టి అమెరికాలో మెట్టింది. మరొకటి మహేష్ యోగి ఆధ్వర్యాన అలౌకికధ్యానం పేరిట జోరుగా వ్యాపారం సాగిస్తున్నది. డివైన్ లైట్ మిషన్ కూడా భారతీయ ఎగుమతి సంస్థలలో ఒకటి.

మహేష్ యోగి అమెరికాలో బీటిల్స్ సంగీతకారుల్ని, జేన్ ఫాండాను, మియా ఫారెను ఆకర్షించి, బహుళ ప్రచారం పొందాడు. ఒక రాష్ట్రంలోని కళాశాలనుకొని, దానికి అంతర్జాతీయ విశ్వవిద్యాలయం అని పేరు పెట్టి అలౌకిక యోగవిద్య ప్రత్యేకంగా నేర్పిస్తున్నారు. 1970 ప్రాంతాలలో దాదాపు 10 లక్షల అమెరికన్లను ఆకర్షించిన మహేష్‌యోగి రానురాను క్షీణదశలో పడ్డాడు. తనది మతం కాదన్నాడు. తన బోధనలు సృష్టి పూర్వక సైన్స్‌గా పేర్కొన్నాడు. కాని తగాదాలతో కోర్టుకు వెళ్ళగా మహేష్‌యోగి ధ్యానం మతమేనని తీర్పు వచ్చింది. మహేష్‌యోగి విధానం మతమేనని తీర్పు వచ్చింది. అదలా వుండగా, మహేష్‌యోగి గాలిలో ఎగరడాన్ని తన శిష్యులకు నేర్పినట్లు చాటాడు. ఇది అసత్యమంటూ ఆయన శిష్యుడు కోర్టుకు వెళ్ళగా, 2 లక్షల డాలర్ల జరిమానా మహేష్‌యోగి చెల్లించవలసి వచ్చింది. కోర్టు వెలుపల 50 వేల డాలర్లు చెల్లించి, పరిష్కారం చేసుకొని, మహేష్‌యోగి బయటపడ్డాడు. మహేష్‌యోగి ధ్యానవిద్య వలన కొన్ని ప్రదేశాలలో నేరాలు తగ్గాయని, శాంతి నెలకొన్నదని ప్రచారం చేసుకున్నారు. అది అబద్ధమని అమెరికా సెక్యులర్ హ్యూమనిస్ట్ సంఘం వారు పరిశోధించి వివరంగా తేల్చిచెప్పారు. ప్రస్తుతం మహేష్‌యోగి తరచు అమెరికా పత్రికలో విపరీతంగా ఖర్చుపెట్టి, ప్రకటనలు యిచ్చే స్థాయికి దిగజారారు.

## హరేకృష్ణ ప్రచారాలు :

భక్తి వేదాంతస్వామి ప్రభుపాద ఇండియాలో స్థాపించి, అమెరికాకు ఎగుమతి చేసిన యీ కృష్ణచైతన్యశాఖ కొందరు అమెరికన్లను ఆకర్షించింది. భగవద్గీత వీరి పవిత్రగ్రంథం. హరేకృష్ణ, హరేరామ అంటూ మంత్రపఠనం చేసే యీ సంఘంవారు సన్యాసత్వం ప్రచారం గావించడం వలన కొందరికే పరిమితమైంది. కొత్తవారిని అట్టే ఆకర్షించలేదు. వీరు అమెరికాలో విమానాశ్రయాలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో డబ్బు వసూలు చేస్తున్నారు. ఇది అభ్యంతరకరంగా పరిణమించగా కోర్టువరకూ వెళ్ళింది. కొందరు కృష్ణచైతన్య స్వాముల వద్ద ఆయుధాలు దొరికాయి. ఆధ్యాత్మికతకు

ఆయుధాలు ఎందుకనే మీమాంస వచ్చింది. అమెరికాలో ప్రస్తుతం వీరి సంఖ్య 3 వేలకు మించలేదు. బోడిగుండు, కాషాయి వస్త్రం, బహిరంగ ప్రదేశాలలో హరేకృష్ణ పారాయణం వలన వీరు తాత్కాలిక ఆకర్షణకు దారితీసినా, యిదీ క్షీణదశలో వున్నది.

## డివైన్ లైట్ మిషన్ :

హన్స్‌జి మహరాజ్ 1960లో భారతదేశంలో యీ శాఖను స్థాపించారు. ఆయన చనిపోగా ఆయన 8 సంవత్సరాల కుమారుని గురువుగా మార్చారు. అతడి చుట్టూ కథలు అల్లారు. అభూత కల్పనలు ప్రచారం చేశారు. అమెరికాకు పంపారు. తొలుత బాగా ఆకర్షించిన యీ సంఘం 1973 నుండే తగ్గుముఖం పట్టింది. కొన్ని దుర్ఘటనల వలన సంఘానికి చెడ్డపేరు వచ్చింది. మహారాజ్‌జి మయామిలో స్థిరపడగా, యీ శాఖ కొన్ని ఆశ్రమ కేంద్రాలకు కుంచించుకపోయింది

జపాన్, కొరియాల నుండి వచ్చిన సంఘాలు అమెరికాలో తిష్టవేసి ఆధ్యాత్మిక వ్యాపారం చేస్తున్నాయి.

అమెరికాలో ఎప్పటికప్పుడు కొత్త సంఘాలు తలెత్తడం, వింత బాబాలు పుట్టుకరావడం జనాన్ని వంచించడం సర్వసామాన్యమైంది.

జిమ్ జోన్స్ అనే అతడు గయానాలోని జోన్స్ టౌన్‌లో 900 మందితో సామూహిక ఆత్మహత్యలు జరిపినప్పుడు ప్రపంచం విస్తుపోయింది. తానే జీసస్ క్రీస్తును అంటూ అతడు భ్రమింపజేసి అలాంటి ఘాతుకంతో అంతమయ్యాడు.

కృష్ణచైతన్య సంఘం వారు బహిష్కరించగా బయటకు వచ్చిన కీత్‌హాం అనే అతను కీర్తానందస్వామి భక్తిపాద అని పేరు పెట్టుకొని దారుణాలకు పాల్పడ్డాడు. 1987 నుండీ అతడు చేసిన, చేయించిన హత్యలు, హింసలు, రహస్య ధనసేకరణ బయటపడగా 30 ఏళ్ళ జైలుశిక్ష విధించారు. కొత్త బృందావనం స్థాపించిన కీత్‌హాం 4 వేల ఎకరాలు స్థలంలో విలాసాలు సృష్టించాడు. (వెస్ట్ వర్జీనియా మౌండ్స్ విల్లి) గుడి శిఖరానికి బంగారు తొడుగు అమర్చగా, అది యాత్రికులకు ఆకర్షణగా మారింది. పోలియోతో చిన్నతనం నుండి బాధపడుతున్న భక్తి పాదస్వామి సమాజానికి దూరంగా వుండాలని ఫెడరల్ కోర్టు ఆదేశాలిచ్చింది. మూడవ ఫ్రెడరిక్ అనే అతడు జెన్ మాస్టర్ రాము అనే పేరుతో కంప్యూటర్ కల్ట్‌ను స్థాపించి లక్షలు గడించాడు. బౌద్ధాన్ని కేపిటలిజాన్ని మేలికలయిక చేశానంటాడీయన కాని, అతడివల నుండి బయటపడినవారు అతడి కామతృష్ణ, ఇతర ఘోరాన్ని బయటపెట్టారు. కేవలం కంప్యూటర్లు వాడి ఏడాదికి 10 మిలియన్ డాలర్ల వరకూ వీరు ఆర్జిస్తున్నారు. ఆ డబ్బుతో గురువు విలాసవంతంగా జీవిస్తున్నాడు. 390 మంది శిష్యులు అమెరికాలో యీ శాఖలో పనిచేస్తున్నారు. అమెరికాలో ప్రశాంత జీవనం సమకూర్చుతామనీ, యోగం ద్వారా చింతల్ని దూరం చేస్తామనీ కొందరు బయలుదేరి చిన్న సంస్థలు పెట్టి ధనార్జన చేస్తున్నారు.

అమెరికాలో మతస్వేచ్ఛను స్వాములు బాగా దుర్వినియోగపరుస్తున్నారు. ఇతరులకు హాని చేయనంత వరకే మతస్వేచ్ఛను వాడుకోవాలని వున్నా, అన్ని మతలు కూడా జనాన్ని పీల్చి, డబ్బు వసూలు చేస్తున్నాయి. రహస్య కార్యకలాపాలు సాగిస్తూ అనేక మందిని చిత్రహింసలపాలు చేస్తున్నాయి. పైగా ప్రభుత్వం జోక్యం చేసుకోగూడదంటున్నాయి! జెహోవా విట్‌నెసెస్, అడల్ట్ క్రిష్టియన్ సైంటిస్టులు మతస్వేచ్ఛ పేరిట, రోగాలకు మందులు తీసుకోకుండానూ, రక్తమార్పిడి నిరాకరిస్తూ వున్నారు. అయితే పిల్లలకు సైతం యిలా చేయవచ్చా అనేది తీవ్ర చర్చనీయాంశం అయింది.

మత కార్యకలాపాలకు వచ్చే డబ్బుపై పన్ను వేయకపోవడంతో దుర్వినియోగం కూడా విపరీతంగా సాగిపోతున్నది. రానురాను కొందరు బయలుదేరి "దయ్యం వదలగొట్టే పనిలో నిమగ్నులమయ్యాం - మాకూ పన్ను మినహాయించండి" అని కోరారు.

టెక్సాస్ రాష్ట్రంలోను, వాకోలో ఏకాంతభవనంలో మారణాయుధాలు పెట్టుకొని, డేవిడ్ బ్రాంచ్ అనే క్రైస్తవశాఖ నాటకాలు ఆడింది. అందులోని పిల్లల్ని, తల్లుల్ని కాపాడాలని పోలీస్ ప్రయత్నిస్తే లోనుండి కాల్పులు జరిపారు. చివరకు ఎందరో చనిపోతేగాని, కొందరు బయటపడలేదు. గత సంవత్సరం జరిగిన యీ సంఘటన గమనిస్తే, మతం పేరిట నేటికీ ఎంత దారుణం జరుగుతున్నదో చూడవచ్చు. మతానికి ఆయుధాలు దేనికి?

మతం వ్యక్తిగత విషయంగా భావించి సంస్థాగతం నుండి తప్పిస్తే చాలామంది నాటకాలు అంతమౌతాయి. పన్నుల మినహాయింపు తీసేస్తే ఆదాయం పడిపోయి, అవినీతి తగ్గుతుంది. 1995 నాటికి ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైనది, మూడవ ప్రపంచ యుద్ధానికి మించినదీ మతహింస మాత్రమే.

**- హేతువాది, మే, జూన్ 1995**

# బాబా ఏమైనా చేయగలడు!

సంసార స్త్రీలు తమ ఇళ్ళలో యిబ్బందుల్ని బాబాలకు, మాతలకు, సోది చెప్పేవారికి విన్నవించుకుంటారు. స్త్రీల చేతనే అన్నీ ఏదో విధంగా రాబడతారు. పరిష్కారం చెప్పినట్టు నటిస్తారు. ఈలోగా దక్షిణలు, కానుకలు, ఎన్నో స్వాములకు చేరిపోతాయి, కొన్ని సందర్భాలలో స్త్రీలను భయకంపితుల్ని చేసి, వారి నుండి లబ్ధిపొందే స్వాములూ వున్నారు. స్త్రీలలో నమ్మకాలు క్రమంగా వారి సంతానానికి సంక్రమిస్తాయి. గుడికి పోవడం, మొక్కుబడులు, తాయెత్తులు, ఒకటేమిటి? అన్ని లక్షణాలు చిన్నప్పటినుండే వస్తాయి. అవి పెద్ద అయినా పోవు.

హేతువాది ప్రేమానంద్‌కు బొంబాయిలో యిలాంటి ఘట్టం ఒకటి తటస్థపడింది. ఒక బాబాచే బాధితురాలైన స్త్రీని విమోచన చేయమని ఆమె కుమారుడే వచ్చి కోరాడు. బాబా చేసిన

కొన్ని మంత్రతంత్రాలు, మహత్తులు ప్రేమానంద్ చేసి చూపగా, ఆమెకు మబ్బు విడిపోయి, యథాస్థితికి వచ్చింది.

మట్టితెచ్చి, పొట్లంలో చుట్టి నోటిదగ్గరగా తీసుకెళ్ళి ప్రేమానంద్, ఏవో మంత్రాలు చదివాడు. అలా మంత్రాలు చదువుతూనే మట్టి పొట్లాన్ని చేతివేళ్ళమధ్యదాచి, అంతకుముందా వేళ్ళమధ్యదాచిన పసుపు పొట్లం అరచేతిలోకి తెచ్చాడు. చుట్టూ గుమిగూడినవారు మట్టికాస్తా పసుపుగా మారడంపట్ల ఆశ్చర్యపోతుండగా ప్రేమానంద్ తన జేబులో చేయి పెట్టి అంతకుముందే పెట్టిన నిమ్మబద్దను చూపుడువేలితో రాశాడు. తరువాత చూపుడువేలును పసుపుతో రాస్తాడు. అది కాస్తా ఎర్రకుంకుమ రంగులోకి మారుతుంది. మట్టి ముందుగా పసుపుగా మారి తరువాత కుంకుమగా ఎలా మారిందీ ప్రేమానంద్ వివరించేసరికి, భక్తులకు మాయ కాస్తా పొర తొలగినట్లు తొలగింది.

## టెంకాయ భక్తి

భక్తికీ కొబ్బరికాయలకూ చిరకాలంగా సన్నిహిత సంబంధం వుంది. కొబ్బరిబొండాలతో, టెంకాయలతో చిత్రవిచిత్ర చర్యలుచూపి భక్తులను ఆకట్టుకోవడం, భయపెట్టడం కూడా చూస్తున్నాం. కేరళలో యిది మరీ ఎక్కువ.

కొబ్బరికాయలు తలకు వేసి కొట్టుకొని అది భక్తిగా కొందరు ప్రదర్శిస్తారు. కొబ్బరికాయ పగులగొట్టినప్పుడు రెండు సమాన భాగాలైతే మంచిదనీ, ఒకే దెబ్బతో పగిలితే శుభమనీ, అలాంటి నమ్మకాలెన్నో వున్నాయి. కొబ్బరికాయ పగులగొట్టినప్పుడు లోన పుష్పాలు, రంగునీళ్ళు, ఎరుపు కనిపిస్తే దానిపై వ్యాపారం చేసి, చిత్రవిచిత్ర వ్యాఖ్యానాలు చేసే గ్రామ వైద్యులున్నారు, భూతవైద్యులున్నారు. ఇలాంటి కొబ్బరికాయ మహత్తులను హేతువాదులు, ప్రేమానంద్ ఆధ్వర్యాన ఎన్నో పర్యాయాలు బట్టబయలు చేశారు. అందులో కొన్ని చూద్దాం. లేత కొబ్బరికాయలు మూడు కన్నులచోట తలకేసి కొడితే వూరికే పగులుతాయి. అలాంటివి కేరళలో, శ్రీలంకలో 101 తలకు కొట్టుకొని అదే మహత్తుగా చూపిన బాబాలున్నారు. అలాంటి కొబ్బరికాయలలో ముదురుకాయల్ని హేతువాదులు చాటుమాటుగా పెట్టినప్పుడు బాబాలకు నొసట రక్తం కారింది. కాని, కొబ్బరికాయ పగలలేదు!

గట్టి టెంకాయ పగులగొట్టాలంటే తలకు దెబ్బ తగులుతుంది. కొబ్బరిపీచు తీసేసి కత్తితో మెల్లగా కొట్టి, చిట్లే వరకూ చూడాలి. తరువాత మూడు రోజులు ఎండబెట్టి, చిట్లినచోట కుంకుమ, గంధంరాసి, మంత్రాలు చదువుతూ, భక్తుల ఎదుట, తలకు, కొట్టుకుంటే వూరికే పగులుతుంది. చిట్లిన విషయం వారికి తెలియదుగదా.

కొబ్బరికాయ పీచు తీసేసి నిమ్మరసం వున్న పాత్రలో పెట్టి తరువాత మూత తీయాలి. అప్పుడు కొబ్బరికాయపై మంత్రాలు చదువుతూ నీళ్ళు చల్లితే, పగులుతుంది.

కొబ్బరికాయ పీచుతీసి, కన్నులవద్ద పట్టుకోడానికి వీలుగా పీచు అట్టిపెట్టాలి. ఇంజక్షన్‌తో నీళ్ళు కలిపిన పొటాషియం పర్మాంగనేటు ద్రావణాన్ని మెత్తని కన్ను ద్వారా పంపాలి. తరువాత మైనం పెట్టాలి. పట్టుకొనే పీచులో సోడియం మెటల్ ముక్క పెట్టాలి. భక్తుణ్ణి పట్టుకోమని, మంత్రాలు చదువుతూ, కొబ్బరికాయపై నీళ్ళు చల్లాలి. హఠాత్తుగా నిప్పు రగులుతుంది. కొబ్బరికాయ పగిలి, ఎర్రని రక్తం వంటి ద్రవం కారుతుంది. నీటితో కలసిన సోడియం రసాయనిక మార్పు అది. మహత్తుగా దీనిచుట్టూ ఎన్నో కథలు అల్లవచ్చు.

## బాబా దర్శనం

షిర్డి సాయిబాబా భక్తి యిటీవల ఎక్కువగా ప్రవహిస్తున్నది. "నేను షిర్డీసాయి అవతారమని" సత్యసాయి లోగడ చెప్పాడు. చెన్నారెడ్డి మొదలు ఎన్.టి. రామారావు వరకూ షిర్డిసాయి భక్తులే. రాజకీయవాదులు కొత్తగా భక్తి పెంచుకుంటే, మూలపురుషుణ్ణి కూడా సందేహించాలి.

షిర్డీసాయి గురించి సినిమాలు వచ్చాయి. చిత్రవిచిత్ర కథలు ప్రచారంలో వున్నాయి. భక్తులు కొందరు ఆయన ఫొటో, చిత్రపటం తమ ఇళ్ళలో కనిపిస్తున్నట్లు చూపుతున్నారు. ఇదెలా సాధ్యం?

గ్లాస్‌ప్లేటు శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. హైడ్రోఫ్లోరిక్ ఆమ్లం (యాసిడ్)లో ముంచిన స్టీల్‌పెన్‌తో షిర్డిసాయి బొమ్మ వేయండి. 10 నిమిషాల తరువాత మంచినీటితో కడగండి. గ్లాస్ ఎండబెట్టి లేదా ఆరబెట్టి వస్త్రంతో తుడిస్తే ఏమీ కన్పించదు. గ్లాస్‌పై గాలి వదలండి. షిర్డీసాయి బొమ్మ వస్తుంది. గాలిలో తేమ ఆరగానే బొమ్మ అదృశ్యమవుతుంది. దీనిపై భక్తుల్ని ఎంతైనా మోసగించవచ్చు.

మీరు సత్యసాయి భక్తులైతే ఇంకో విచిత్రం చేసి మహత్తుగా చలామణి చేయవచ్చు. ఫొటోపేపర్‌పై సత్యసాయి బొమ్మవేసి, మంచినీటితో కడగండి. మెర్క్యురిక్ క్లోరైడ్ ద్రావణంలో ఫొటోపేపరు వుంచి, బయటకు తీసి ఆరబెట్టండి.

భక్తుల్ని కూడగట్టండి. సత్యసాయి నిజమైన భక్తులకు కనిపిస్తాడని కథలు అల్లండి. ప్రార్థనలు చేయించండి. హైపో సొల్యూషన్‌లో ఫొటో పేపరు వుంచితే, సత్యసాయి ఫొటో కనిపిస్తుంది. దీనిపై ఎంత గిట్టుబాటు అయితే అంత చేసుకోవచ్చు.

## బట్టలు తగులబడుతున్నాయ్!

మన గ్రామాలలో బాణామతి, చేతబడి, దయ్యాలు, భూతాలు, పిశాచాలు, హస్తలాఘవాలు ఇంకా ఎన్నో జనాన్ని పట్టి పీడిస్తున్నాయి. వీటి ఆధారంగా ప్రజలను ఏడిపించే మంత్రగాళ్లు, భూతవైద్యులు, గ్రామవైద్యులు ఉండనేవున్నారు. అలాంటివారికి విపరీతమైన గౌరవం యిస్తూ, వారంటే భయపడుతూ వుండడంతో, వారు యింకా వ్యాపారం చేస్తున్నారు.

ఉన్నట్లుండి యింట్లో బట్టలనుండి నిప్పు వస్తుంది. ఆరుబయట ఆరవేసిన వస్త్రాలు అంటుకొని నిప్పు రాజుతుంది. ఇంకేముంది? ఆ సంఘటన చుట్టూ కథలు అల్లుతారు. శాంతి చేయించమంటారు. కొన్నాళ్లు యిల్లు పాడుబెట్టమంటారు. ఎవరో చేతబడి చేయించారంటారు. దోషం పోవడానికి ఏమేమి చెయ్యాలో చెబుతారు.

ఇంటి బయట బట్టలు ఆరేయండి. పచ్చ ఫాస్ఫరస్ ఒక పాలు, కార్బన్‌డైసల్ఫైడు ఆరు పాళ్లు కలపండి. కొద్దిగా బట్టలపై చల్లండి అలా చల్లింది ఆరగానే కాసేపట్లో నిప్పు అంటుకొంటుంది. ఇంట్లో అలమరలో పెట్టిన దుస్తులలోనూ యీ ద్రావకం చల్లవచ్చు. యింటిలోని వారిని ఏడిపించడానికి ఇలాంటి పనులు రహస్యంగా చేస్తుంటారు. జాగ్రత్తగా కనిపెడితే ఎవరు చేస్తున్నదీ అర్థమవుతుంది.

సాధారణంగా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు, మూలకారణం పరిశీలించకుండా, మతపరమైన మూఢనమ్మకాల వలన భూతవైద్యుల్ని, సోది చెప్పేవారిని పిలుస్తుంటారు.

## ఏసుక్రీస్తు మహిమలు

మహత్తుల పేరిట జనాన్ని ఆకర్షించడం హిందువుల సొత్తు మాత్రమే కాదు. అన్ని మతాల్లోనూ యివి కొద్దో గొప్పో వున్నాయి. క్రైస్తవులలో కొన్ని శాఖలు మహిమలను ఖండిస్తాయి. మరికొన్ని తటస్థ వైఖరితో వున్నాయి. కేథలిక్‌లు, ఎవాంజలిక్‌లు, మరికొందరు మహత్తులున్నాయంటారు. బైబిల్‌లో మహిమల ప్రస్తావన వుంది.

ప్రపంచంలో క్రైస్తవ మహిమలు జరగడం, వాటిని పోప్ గుర్తించడం ఒక చరిత్రగా కొన్ని వందల సంవత్సరాల నుండీ జరుగుతున్నది. మేరీమాత విగ్రహం కన్నీళ్ళు పెట్టడం, క్రీస్తు సమాధిపై కప్పిన బట్టపై క్రీస్తుముద్ర పడిందనడం, ఆఫ్రికాలో ఎడారి ఇసుకలో క్రీస్తు పాదాల ఆనవాళ్లు వున్నాయనడం వింతగా చెబుతారు.

క్రైస్తవ మతాధిపతులు, ఫాదరీలు అప్పుడప్పుడు కొన్ని మహిమలు చేసి ప్రచారంలోకి తెస్తుంటారు. హేతువాదులు జేమ్స్‌రాండి, ప్రేమానంద్ యిలాంటివి బయటపెట్టారు. క్రైస్తవమత ప్రచారకులు అత్యంత అధునాతన టి.వి. రేడియో మొదలైన ప్రసార సాధనాలు వాడుతున్నారు.

దేవాలయంలో కొవ్వొత్తిని ఫాస్ఫరస్ ద్రావణంలో ముంచి నిలబెడతారు. ద్రావకం తడి వున్నంతసేపూ ప్రార్థనలు చేస్తారు. ఆ తరువాత తడి ఆరగానే కొవ్వొత్తి అంటుకుంటుంది. అదొక గొప్ప క్రీస్తుమహిమగా చూపుతారు.

మరో కొవ్వొత్తి స్టాండులో కొవ్వొత్తి ప్రక్కన క్రోమిక్‌యాసిడ్ స్ఫటికాలు వేయాలి. ఇంకో కొవ్వొత్తిని ఆల్కహాలులో ముంచాలి. ఆల్కహాలులో ముంచిన కొవ్వొత్తిలో క్రోమిక్‌యాసిడ్ స్ఫటికాలున్న కొవ్వొత్తిని తాకిస్తే రెండూ వెలుగుతాయి.

అప్పుడు కూడా ప్రార్థనలు చేసి ఏసు మహిమగా చెబితే పరీక్ష చేయకుండా నమ్మే భక్తులు నమ్ముతారు.

## జ్వాలాముఖి మహత్తు

ఉత్తరాదిలో గోరక్‌నాథ్ దిబ్బ జ్వాలాముఖి గుడిలో వుంది. భక్తులు యీ గుడిని సందర్శించినప్పుడు బుడగలతో వుడికిపోతున్న నూనె కనిపిస్తుంది. భక్తులు ఆ దృశ్యం తిలకించి, కానుకలు సమర్పిస్తారు అద్భుత దృశ్యంగా చూచి మహత్తుగా భావిస్తారు. భక్తుల తలలపై మండే నూనెను పురోహితుడు చల్లినప్పుడు, అది మంచువలె చల్లగా మారుతుంది. కొందరు శాస్త్రజ్ఞులు సైతం ఈ దృశ్యం చూచి, తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు.

జ్వాలాముఖి గుడి నూనె బావిలో బుడగలు వస్తున్నమాట వాస్తవం. పురోహితుడు ఒక కాగితాన్ని వెలిగించి, నూనెపై వుంచితే గాస్ తగులబడుతుంది. అలాంటి నూనె పురోహితుడు భక్తులపై చల్లితే మంచు నీరుగా ఎలా మారుతుంది? హేతువాది ప్రేమానంద్ ఈ గుడి సందర్శించి, జరుగుతున్నదంతా గమనించాడు. సహజవాయువు బయటకు వచ్చేచోట జ్వాలాముఖి గుడిని నిర్మించారు. ఒక గొట్టం ద్వారా వచ్చే గాస్ నిరంతరం వెలుగునిస్తుంటుంది. గాస్ బావి ప్రక్కగా ప్రవహించే నీటిబుడగల్ని చూచి, గాస్ ప్రవాహం వలన అవి ఏర్పడుతున్నాయని భక్తులు భావిస్తున్నారు, నీటిబుడగలు సహజవాయువుతో కలిసినప్పుడు తుకతుక వుడుకుతున్న నూనె వలె కన్పిస్తున్నది. నీటిలో గాస్ కలుస్తున్నందున, అది కలుషితమై క్రూడ్ఆయిల్ వలె మడ్డిగా వుంటున్నది. అందులో చేయి పెడితే చల్లగా వుంటుంది. అదే పురోహితుడు చేసే మహత్తు.

## సంతాన ప్రాప్తి

గొడ్రాలు అంటే పాపిష్టిదానిగా చూచే సమాజం కనుక, పెళ్ళి అయిన ప్రతి స్త్రీ సంతానం కోరుకుంటుంది. ఎన్నాళ్ళకూ సంతానం కలుగకపోతే వైద్యపరీక్షలు చేయించుకొనే బదులు బాబాల దగ్గరకు పోతారు. మూఢనమ్మకాలకు ఇదొక పెద్ద నిదర్శనం బాబా చెప్పినట్లు చేస్తారు, లింగాలకు మొక్కుతారు.

కాలభైరవ రాయికి మొక్కితే పిల్లలు పుడతారని ఆంధ్రలో నమ్మకం వుంది. ఇలాంటివి ఇతర రాష్ట్రాల్లో వున్నాయి కూడా. చాలా మంది ఇది నిజం అని నమ్ముతారు. కొంతకాలంగా సంతానం లేనివారికి గర్భగుడిలో అర్థరాత్రి పూజలు చేస్తే పిల్లలు పుట్టినట్లు చెబుతారు.

ఒక పూజారి కాలభైరవ గుడిని అంటిపెట్టుకొని, సంతానప్రాప్తి కలిగిస్తున్నాడనే వార్త విని హేతువాది ప్రేమానంద్ వెళ్ళాడు. డబ్బు సమర్పించుకొని, తనకు సంతానప్రాప్తి కలిగించమని వేడుకున్నాడు. వెంట స్నేహితుడి భార్యను తీసుకెళ్ళాడు. వీరు చెప్పినదంతా విన్న అనంతరం పూజారి పంచలోహపాత్రలో బియ్యం పోసి, కత్తి మధ్యలో పెట్టి, మంత్ర పఠనం చేసి, పాత్రను

కత్తితో పైకిలేపాడు. అంతకు ముందు ప్రాయశ్చిత్త క్రతువు చేశాడు. తరువాత గర్భగుడిలో ఆమెను లింగపూజ చేయమని అందరినీ వెళ్ళిపొమ్మన్నాడు. చీకట్లో ఏదో మెదులుతుండగా ఆమె ఒక పీటతో గట్టిగా మోదింది. పూజారి తల పగిలింది. లింగం కూడా పగిలింది. తలుపు కొట్టగా బయట వేచివున్న ఆమె భర్త, హేతువాది ప్రేమానంద్ తలుపు తెరిచారు. లోగడ స్త్రీలకు సంతానప్రాప్తి ఎలా కలిగిందో దీనివలన అర్థమైంది.

మహారాష్ట్రలోని సతారాలో యిలాంటి బాబాను అంధశ్రద్ధ నిర్మూలన సమితి బట్టబయలు చేసింది.

## దేవుడికి ఎన్ని రూపాలో!

దేవుడి పేరిట జరుగుతున్న ఆధ్యాత్మిక వ్యాపారం నిరంతరం కొనసాగుతున్నది. జనాకర్షణలో యిదొక వింతగా వుంటున్నది. గ్రామాలలో తరచు సాధువులు, యోగులు, బాబాలు, మాతలు ఎక్కడనుంచో వచ్చి చిన్న ప్రయోగాలు చేస్తారు. అది వింతగా చూచి, అద్భుతంగా భావించి కానుకలు సమర్పిస్తారు. గిట్టుబాటు కాగానే స్వామీజి మరో గ్రామానికి తరలివెడతాడు. ఇదంతా దైవం పేరిట జరిగే పెట్టుబడిలేని వ్యాపారమే. అలాంటి సంపాదనకు పాల్పడేవాణ్ని - డబ్బు, ఆస్తి ఎలా వచ్చిందని అడిగేవారు లేరు. మతం యొక్క గొప్పతనం అలాంటిది.

ఇంద్రియాతీత శక్తులున్నాయనే యోగి బొటనవేలి గోటిలో సోడియం దాచి, ఒక వేడినీటి పాత్రపై చేయి తిప్పినట్లు చూపి, సోడియం అందులోకి జారవిడుస్తాడు. మంత్రాలు చదువుతుంటాడు. నీటి నుండి మంటలు రావడంతో అది ఒక దైవశక్తిగా జనం భ్రమిస్తారు.

మరొక యోగిపుంగవుడు తన దివ్యమహిమ చూపడానికి నోటి నిండా నీరు నింపి సిపి ఈథర్, పొటాషియం లోహముక్కగల నీటిపాత్రలో పూస్తాడు. పొటాషియం లోహపుముక్క తగులుకొని ఈథర్‌కు అంటుకోగా నీటిపై మంటలు కనిపిస్తాయి. స్వామీజీ నోటి నీటికి అంత శక్తి వున్నదన్నమాట.

ఇంకొక పవిత్ర స్వామీజీ వంటినిండా దైవంపేరు కనిపిస్తుంటుంది. ఆయన యజ్ఞం చేస్తుండగా, యిలా దైవం పేరు కనిపించడం వలన భక్తులు సాష్టాంగపడతారు. ఏదైనా పాలు కారే కొమ్మను విరిచి, దానితో దేహంపై యిష్టదైవం పేరు రాయాలి. దీని బదులు సబ్బు వాడొచ్చు, అలా రాసిన తరువాత ఆరనివ్వాలి. యజ్ఞగుండం వద్ద వేడికి స్వామీజీకి చెమట వట్టినప్పుడు స్వామీజీపై భక్తులు విభూది చల్లుతారు. అప్పుడు లోగడ రాసిన దైవనామం కనిపిస్తుంది.

ఇంకా కొందరు యోగులు కుంచెను పొటాషియం ఫెర్రొసైనైడ్ ద్రావణంలో ముంచి చేతిమీద దైవనామం రాసి ఆరబెడతారు. ఐరన్ క్లోరైడ్ ద్రావకంలో దూదిగాని, వస్త్రంగాని ముంచి లోగడ దైవనామం రాసినచోట తుడిస్తే నీలం రంగులో ప్రత్యక్షమై, భక్తుల్ని ఆశ్చర్యపడుస్తుంది.

ఇలాంటి చిత్రవిచిత్రాలతో అమాయకులైన, అజ్ఞానులైన భక్తుల్ని మోసగించి, భ్రమింపజేసి, తాత్కాలికంగా లబ్ధిపొందవచ్చు.

## చిట్కాలతో సంతానం

పిల్లలు పుట్టని వారికి మానసిక బలహీనత వుంటుంది. ఎలాగైనా సరే సంతానం పొందాలి. ఆ బలహీనతను ఆసరాగా తీసుకొని ఇరుగుపొరుగువారు సలహాలు చెబుతుంటారు. మొక్కుబడులు చేయిస్తుంటారు. గుడులకు పంపిస్తుంటారు, అంతటితో ఆగక, బాబాలకు, మాతలకు పరిచయం చేస్తుంటారు. సంతానం కలిగిస్తామని చెప్పే బాబాలు అనేక చిట్కాలు చేయిస్తారు. ధనాన్ని వివిధ రూపాలుగా రాబడతారు. కొందరు ఇళ్ళలో తిష్టవేసి ఏవేవో పూజలు, వ్రతాలు, యజ్ఞాలు, క్రతువులు చేయిస్తారు. ఆ విధంగా ఖర్చుపెట్టి ఆరిపోయిన వారున్నారు. అయితే సంతాన ఆశ వారిచేత ఏ పనైనా చేయిస్తుంది. ఎంతకూ తమ ఖర్మ అనుకుంటారే గాని, చేస్తున్న పనులకూ, సంతాన ప్రాప్తికీ సంబంధం లేదని గ్రహించరు.

ఒక స్వామి సంతానప్రాప్తి పరీక్షగా పాత్రలో బియ్యం పోసి, కత్తి అందులో దింపి, కత్తితో పైకెత్తినప్పుడు పాత్ర పైకిలేస్తే, సంతానప్రాప్తి కలుగుతుందనీ, లేకుంటే లేదనీ చెబుతాడు. హేతువాది ప్రేమానంద్ కొన్ని వేల పర్యాయాలు ఈ చిట్కా వేసి చూపెట్టాడు. దీనికి సంతానానికి ఎలాంటి కార్యకారణ సంబంధం లేదని స్పష్టం చేశాడు.

అడుగుభాగం వెడల్పుగానూ, మూతివద్ద సన్నంగానూ వుండే పాత్ర తీసుకోండి. అందులో బియ్యం నింపి, ఒక నిడుపైన కత్తితో పొడుస్తూ వుండండి. బియ్యం పాత్ర అడుగున బాగా బిగుసుకపోయినప్పుడు కత్తిని అడుగువరకూ దింపి, పిడి పట్టుకొని పైకి ఎత్తితే బియ్యం పాత్ర పైకి లేస్తుంది. బియ్యం బాగా బిగుసుకుపోవడం యిక్కడ ముఖ్యం. అలా జరిగిన తరువాత కత్తిని దింపితే, గట్టిగా పట్టుకుంటుంది. దీనికీ సంతానానికీ ముడిపెట్టడం హేతుబద్ధం కాదు. అయినా ఇదొక గొప్ప విషయంగా నమ్మేవారున్నారు.

## రక్తంతో కైంకర్యం

గ్రామాలలో అప్పుడప్పుడు భీభత్స దృశ్యాలు చూస్తాం. జుట్టు విరబూసుకొని, చొక్కాలేకుండా, పూసలు, రుద్రాక్షలు ధరించిన భక్తుడు, మాంత్రికుడు, ఫకీరు యింకా యిలాంటివ్వారు తమ శరీరాన్ని కొరడాతో కొట్టుకుంటారు. కొందరు కత్తితో చేతుల్ని, కాళ్ళను కోసుకొని రక్తమయం చేస్తారు. అది చూచి భక్తులు కానుకలు సమర్పిస్తారు.

శరీరం మీద గాని లేదా చేతులపై గానీ ఫెర్రోక్లోరైట్ ద్రావకం పూయాలి. సోడియం సల్ఫో సనైడ్ ద్రావకంలో కత్తిని ముంచాలి. ఎక్కడ ఫెర్రిక్‌క్లోరైడ్ పూసారో, అక్కడ కత్తితో నరికినట్లు నటిస్తే రక్తపు చారలు వచ్చినట్లు కనిపిస్తుంది. జనం వెళ్ళిపోయిన తరువాత తడిబట్టతో తుడిచేయవచ్చు.

మరొక తీరులో చేతిమీద లేదా శరీరంపైన ఫెర్రిక్ అమోనియం సల్ఫేట్ ద్రావకం రాయాలి. సోడియం సాలిసిలేట్‌లో కత్తిని ముంచి శరీరంపైనా, చేతిమీదా తాకిస్తే ఎర్రని మరకలు వస్తాయి. భక్తులు చందాలిచ్చి వెళ్ళిన తరువాత తడిగుడ్డతో తుడిచేయాలి. కాళీమాతను లేదా అమ్మవార్లను సంతృప్తిపరచే వంకతో కొరడాతో బాదుకొనడం మరో భక్తి నిదర్శన సంఘటనే. కొరడా చివరి వరకూ జాగ్రత్తగా మెలికలు తిప్పితే చప్పుడు వస్తుందే కాని దెబ్బ తగలదు. కొరడా చివర ముడివేస్తే అది తగిలిన చోట చర్మం చిట్లుతుంది. ఇది ప్రాక్టీసు చేసిన పూనకభక్తులు చూచేవారిని దడిపించేటట్లు మంత్రాలు ఉచ్చరిస్తూ, భయంకర శబ్దాలు చేస్తుంటారు.

## తాంత్రికుల అగ్నిపరీక్ష

తాంత్రికవిద్య వింతగా, భయానకంగా వుంటుంది. తాంత్రిక యోగంలో స్త్రీవుండాలనేది నిషేధానికి గురైంది. తాంత్రిక విద్య బహుళ ప్రచారం పొందకపోయినా, అక్కడక్కడా ఆచరణలో వుంది, తాంత్రికులు అనేక విచిత్రచర్యలు చేస్తుంటారు. వారి భీభత్సభక్తికి నిదర్శనగా చాలా ప్రయోగాలు పేర్కొనవచ్చు.

ఒక లోహపాత్రలో రంపపుపొడి వుంచి అందులో సోడియం పెరాక్సైడ్ పొడి కలుపుతారు. భక్తులలో ఒకరిని పిలిచి నీళ్లు తెమ్మంటారు. నీళ్ళు గుక్కెడు తాగి, రంపపుపొట్టుపై వదలుతారు. నీరు తగలగానే సోడియం పెరాక్సైడ్ వలన మంటలు లేస్తాయి. అప్పుడు తాంత్రికుడు ఏవో మంత్రాలు ఉచ్చరిస్తాడు. భక్తులు అదంతా మహిమగా స్వీకరిస్తారు.

పూనకం వచ్చినట్లు నటించే తాంత్రికుడు ఏవో సోది భవిష్యత్తు కబుర్లు చెబుతాడు. పొటాషియం నైట్రేట్ ద్రావకంలో నాలుగు పర్యాయాలు నారను ముంచి ఎండనిస్తారు. ఒకవైపు నారతాడు వెలిగించి మిగిలిన తాడు దూదితో వుండగా చుడతాడు. ఆ వుండను నోటిలో పెట్టుకుంటాడు. నోటితో గాలి వదలుతుంటే మంటలు వస్తుంటాయి. నోటిలో బాగా లాలాజలం వూరిన తర్వాత ఇలా చేస్తాడు. నోటిలో వుండ వున్నంతసేపు గాలి వదలడం తప్ప, పీల్చడు. తరువాత ఒక వస్త్రంతో నోటిలోని వుండ తీస్తాడు. అలా చేసినప్పుడు భక్తులు మంత్రాలు చదువుతుండగా శిష్యులు హావభావాలు చేస్తూ, కానుకలు వసూలుచేసి పెడతారు.

## పక్షితీర్థంలో దైవం

తమిళనాడులో చాలాకాలంగా యాత్రికులు సందర్శనంచేసే స్థలం ఒకటి వుంది. తిరుపుర కుంద్రం అనే ఈ స్థలం దగ్గర యాత్రికులు ఆగుతారు. మధ్యాహ్నం సరిగా 12 గంటలకు రెండుగద్దలు వచ్చివాలతాయి. అక్కడ పురోహితుడు యిచ్చే ప్రసాదం స్వీకరించడానికి పక్షిరూపంలో సాక్షాత్తు గరుడపక్షులు వస్తాయని కథ ప్రచారంలో వుంది. విష్ణు వాహనంగా గరుడపక్షి వుండడం పురాణకథనం కాగా, ఆ దేవాలయం విష్ణు దేవాలయం కావడం ఒక కారణంగా పేర్కొంటారు. ఏమైనా రెండు పక్షులు వేళ తప్పకుండా నిత్యమూ రావడం వాస్తవం.

ఏమిటీ విచిత్రం? హేతువాది ప్రేమానంద్‌ను భక్తులు అడిగారు. హేతువాదులు కార్యకారణ అన్వేషణ సాగించారు. ప్రేమానంద్ నిశిత పరిశీలనలో తేలిన అంశం. రెండు గద్దలను పట్టుకొని వాటికి యిచ్చే ఆహారంలో నల్లమందు కలిపారు. అలా నల్లమందుకు (ఓపియం) అలవాటుపడిన రెండు పక్షులు రోజూ రావడం ఆరంభించి, అలవాటు చేసుకున్నాయి. అలవాటు అయిన తరువాత పక్షుల్ని వదిలేసినా తప్పనిసరిగా వస్తున్నాయి.

పురాణకథలు ఎన్ని చెప్పినా అసలు రహస్యం యిది. భక్తులు ఎన్ని కానుకలు సమర్పించినా వాస్తవం యిదే.

## తాయెత్తులు, తాంత్రికుల చిత్రాలు :

మన జనాల్లో, చదువుకున్నవాళ్ళతో సహా తాయెత్తులపై నమ్మకాలు ఎక్కువ. ఈ తాయెత్తులు అనేక రూపాలలో వుంటాయి. రుద్రాక్షలు, వెండి, రాగి బొమ్మలు, ఉంగరాలు, మాలలు ఇంకా ఎన్నో వున్నాయి. కొందరు చిన్న కడియాలు చేతికి, కాలికి ధరిస్తారు. రాగి కడియాల వలన శరీరంపై ప్రభావం వుంటుందని నమ్ముతారు. అప్పుడప్పుడూ ఇళ్ళకు వచ్చే బాబాలు, తాంత్రికులు తాయెత్తులు యిస్తుంటారు. అవి ధరిస్తే అశుభాలు పోతాయని, మంచి జరుగుతుందని నమ్ముతారు. ఇంట్లో కాళీమాత వంటి దేవతల ఆగ్రహం పోగొట్టడానికి తాయెత్తులు ధరించడమేగాక, రక్తాన్ని అర్పించే క్రతువులు చేస్తుంటారు.

తాంత్రికులు తాయెత్తు మహిమ చూపే తీరులు ఎన్నో వున్నాయి. రాగి బొమ్మను ఎమిరి పేపర్‌తో శుభ్రంచేసి మెర్క్యురస్ నైట్రేట్ ద్రావణంలో ముంచుతారు. మెత్తని వస్త్రంతో బాగా రుద్దితే, వెండివలె కన్పిస్తుంది. అల్యూమినియం ఫాయిల్ గట్టిగాచుట్టి భక్తుడికి ఇస్తారు. దానిపై ఏకాగ్రతతో ధ్యానం చేయమంటారు. పిడికిలి గట్టిగా బిగించి తాయెత్తు పట్టుకోమంటారు. కాసేపట్లో రసాయనిక మార్పువలన వేడెక్కి వెండి ఫాయిల్ తొలగించి చూస్తే, విభూతి వంటి పౌడర్ కన్పిస్తుంది. అది కళ్ళకు అద్దుకుంటారు.

ఇంట్లో శాంతి జరపడానికి తాంత్రికులు, మాంత్రికులు గమ్మత్తు పనులు చేసి తమ ముడుపులు వసూలుచేసుకుంటారు. యజ్ఞగుండం ఏర్పరచి కట్టెలలో నెయ్యి వేస్తారు. ఒక ప్లేటులో పొటాషియం పర్మాంగనేటు బొట్లు వేసి అందులో నీళ్లుపోస్తారు. రక్తంవలె కన్పించే ఆ నీటిప్లేటులో దీపం వెలిగించి, మధ్యలో పెట్టి, దానిపై ఒక మూత వేస్తారు. పాత్రలోని ఆక్సిజన్ అయిపోగానే దీపం ఆరిపోతుంది. నీటిలో కార్బన్‌డయాక్సైడ్ కలసి, శూన్యప్రదేశం ఏర్పడగానే పాత్రలోకి నీరు పీల్చుకుంటుంది. ప్లేటులోని నీరు (రక్తం వలె కనిపించేది) పాత్రలోనికి పోగానే, దేవత శాంతించినట్లు వ్యాఖ్యానించి, డబ్బు వసూలు చేసుకొని మాంత్రికుడు నిష్క్రమిస్తాడు. గృహస్థులు తృప్తిపడతారు. మాంత్రికుడు ఏంచేసాడో హేతువాది ప్రేమానంద్ వివరిస్తాడు. అప్పుడు అందరికీ నిజం తెలుస్తుంది.

## సర్వరోగ నివారిణి ఆయిల్ పుల్లింగ్ :

ఇటీవల చదువుకున్న వారినీ, సామాన్య అమాయకుల్నీ ఆవరించిన వైద్యం ఆయిల్ పుల్లింగ్. నూనె నోట్లో పోసుకొని కొంచెంసేపు పుక్కిలించి తరువాత పూసేయడం యిందులో ప్రధానం. మస్టర్డ్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతున్నారు. ఆయిల్ రంగు మొదట్లో ఎలా వున్నా నోట్లో పోసుకుని కాసేపు పుక్కిలించేసరికి, నోట్లో లాలాజలంతో కలసిపోతుంది. అలా కలవడం వలన నూనె రంగు మారుతుంది. రంగు మారటాన్ని చికిత్సగా భావిస్తున్నారు. అంతేగాక అన్ని రోగాలకు యిది మందు అని ప్రచారం చేస్తున్నారు. ఇలా నూనె పుక్కిలిస్తున్న వారు కొందరు తమకు ఏదో రిలీఫ్ యిచ్చినట్లున్నదని భావిస్తున్నారు. శరీరంలో సహజంగా వున్న రోగనిరోధకశక్తి వలన తగ్గిపోయే లక్షణాలుంటాయని వీరు గమనించడం లేదు.

తాంత్రికులు, మాంత్రికులు లోగడ కామెర్ల (జాన్‌డిస్) రోగులకు ఆయిల్ యిచ్చి బాగా పుక్కిలించమనేవారు. కాసేపటికి వూసేస్తే అది లాలాజలంతో కలసినందున పసుపుపచ్చగా మారేది. అది చూపించి, జబ్బు తగ్గిందని, పథ్యం చెప్పేవారు. కాలేయం, లివర్‌కు విశ్రాంతి యిస్తే తగ్గే రోగాలకు అలా చెప్పి జనాన్ని భ్రమింపజేయడం చిరకాలంగా వస్తున్నదే.

ఒకవేళ లివర్ (కాలేయం), కిడ్నీ జబ్బులు, ముఖ్యంగా కామెర్లు, తగ్గకపోతే, తాంత్రికులు, మాంత్రికులు బాధ్యత వహించరు. అప్పుడు రోగి కర్మగా చెబుతారు.

## సమాధిలో యోగులు :

కారేశ్వరి బాబా సజీవ సమాధి అవుతారని ఢిల్లీలో వార్త ప్రాకింది. ఇంకేముంది? భక్తులు ఆఫీసులకు సెలవు పెట్టి వచ్చేశారు. బాబా గుడ్డి, చెవిటి, మూగవాడు. ఆ విషయం తెలిసి ఆయనపై యింకా ఆసక్తి పెరిగింది.

10 అడుగుల లోతు 2.5 అడుగుల చతురస్రపు సమాధి తయారుచేశారు. సిమెంటు చేసిన సమాధిలో కారేశ్వరి బాబా ప్రవేశించారు. అది 1980 అక్టోబరు మాసం.

సమాధిలో ప్రవేశించడం కళ్ళారా చూచిన భక్తులు, చుట్టూచేరి భజనలు చేశారు. 24 గంటల అనంతరం సమాధి తెరిచి చూచారు.

ఆశ్చర్యపోవాల్సిన భక్తులు నోరు నొక్కుకున్నారు. కారేశ్వరి బాబాను పురుగులు తింటున్నాయి. ఆయన చనిపోయాడు.

ఏం జరిగింది? మహత్తు ఏమైంది?

హేతువాది ప్రేమానంద్ భక్తులకు వివరించారు. సిమెంట్ చేయని సమాధి అయితే నేలలోని రంధ్రాల ద్వారా ప్రాణవాయువు వస్తుంటుంది. అందువలన 24 గంటలు వుండగలరు. సిమెంట్ చేసిన సమాధిలో కారేశ్వరి బాబా నిమిత్తం ప్రత్యేకంగా ఆక్సిజన్ వచ్చేట్లు ఏర్పాటు

చేశారు. అయినా ఎందుకు చనిపోయాడు? గాలి బయటకు పోవడానికి ఏర్పాట్లు చేయలేదు. వత్తిడి పెరిగినందున కారేశ్వరి బాబా చనిపోయాడు.

పైలట్ బాబా అనే అతడు కూడా జీవసమాధి అవుతానని చాలాసార్లు ప్రకటించాడు. కాని సాహసించలేకపోయాడు.

## నిప్పులపై నడక :

ఇసుక వేస్తే రాలనంత జనం. బాబా నిప్పులపైన నడుస్తారని ఆనోటా ఆనోటా ప్రచారం అయింది. వూరి వెలుపల చింత నిప్పుల గుండం ఏర్పరచారు. చుట్టూ జనం వున్నారు. ఇంతలో ఎక్కడినుండో బాబా ఆ స్థలానికి చేరుకున్నారు. చింత నిప్పుల కణాలు గుండంలో వున్నాయి. ఆత్రుతగా జనం చూస్తున్నారు. పూర్వం సీతమ్మవారు యిలాగే రాములవారి కోరికపై నిప్పుల మీద నడచి పాతివ్రత్యం నిరూపించారని అనుకున్నారు. అంటే శీలపరీక్ష కూడా చింతనిప్పులు తేల్చి పారేస్తాయన్నమాట.

బాబా గబగబా కొన్ని సెకండ్లలో చెప్పులు లేకుండా అగ్నిగుండంలో 8 అడుగులు నిడివిని నడచి వెళ్ళారు. కళ్ళు మూసి తెరిచేలోపు జరిగిపోయింది. అద్భుతం అనుకున్నారు.

ఎక్కడి నుండో "ఆగండి" అంటూ కేక వినిపించింది. ప్రేమానంద్, మరికొందరు హేతువాదులు వచ్చారు. మేమూ నడుస్తాం అన్నారు. అంటూనే ముందుగా ప్రేమానంద్ నిప్పులపై నడవగా, ఆయన్ను అనుసరించి కొందరు హేతువాదులు నడిచారు.

బాబాగారంటే మహత్తు వలన నడిచారన్నారు. మరి వీరెలా నడవగలిగారు? ప్రేమానంద్ వివరించారు:

నిప్పు కణాలపై బూడిద వుంటుంది. అది వేడిని వెంటనే రానివ్వకుండా ఆపగల్గుతుంది. అలాంటి నిప్పులపై ఏడెనిమిది క్షణాలు నడచినా కాలుకాలదు. ఎక్కువసేపు వుంటే కాలుతుంది. నిప్పుల్లో మేకులు, సీసపు పెంకులు, లోహాలు లేకుండా జాగ్రత్త పడాలి. వేడి పాత్రలో నీరు కాస్తే వేడి ఆవిరి వస్తుంది. అందులో చేయి పెడితే వెంటనే కాలదు. అయితే పాత్రకు చేయి తగలకుండా చూచుకోవాలి. ఏ బాబా కూడా కాలే లోహపుపాత్రల మీద, ఇనుపకడ్డీల మీద నడవలేడు.

హేతువాదుల వివరణతో బాబా పస తేలిపోయింది.

## బాబా నిప్పు మింగాడు :

టక్కర్ బాబా విడిదిచేసి నెలరోజులైంది. పక్క గ్రామాలనుండి కూడా తండోపతండాలుగా జనం వస్తున్నారు. క్రమబద్ధం చేయడానికి పోలీస్ కూడా వచ్చింది. బాబా ఆదాయం పెరిగిపోతున్నది. పత్రికలవాళ్ళు, టి.వి. వాళ్ళు పోటీపడి బాబా మహిమల్ని చూపుతున్నారు.

ఈ రోజు ఏం జరుగుతుందోనని జనం ఎదురుచూస్తున్నారు. వేచివున్న జనాన్ని ఆదుకోడానికి కొందరు మంచినీళ్ళు అందిస్తున్నారు.

చివరకు స్వామీజీ రానే వచ్చారు. చిన్న ప్రసంగం చేశారు. బాబాకు తెలుగు రాదు గనుక ఆయన ప్రవచనాల్ని శిష్యుడు తెలుగులో చెప్పారు.

మాటల అనంతరం బాబా అరచేతిలో కర్పూరం పెట్టుకొని, మంత్రాలు చదువుతూ వెలిగించారు. చూస్తుండగానే మండుతున్న కర్పూరాన్ని నోట్లో వేసుకున్నారు.

భక్తులంతా ఆశ్చర్యపోయారు. బాబా మామూలుగానే మాట్లాడారు. ఆయనకు నోరుకాలదా?

ఇంతలో హేతువాది ప్రేమానంద్ వచ్చాడు. నేనూ బాబావలె చేయగలనని చేతిలో కర్పూరపు ముద్ద వెలిగించి, నోట్లో వేసుకున్నాడు.

నిప్పు రావాలంటే ఆక్సిజన్ అవసరం. కర్పూరం వెలుగుతుండగా నోట్లో వేసుకొని, నోరు మూసుకుంటే ఆక్సిజన్‌లేక ఆరిపోతుంది. నోట్లో కర్పూరపుముద్ద వేసుకొని నోరు మూసి గాలి బయటకు వదలాలి. మనం వదిలేది కార్బన్‌డైయాక్సైడ్ (బొగ్గుపులుసువాయువు). అది మంటను వెంటనే ఆర్పేస్తుంది. కాకుంటే నోట్లో వెలిగే కర్పూరపుముద్ద వున్నప్పుడు గాలి పీల్చకూడదు. పీల్చేది ఆక్సిజన్ (ప్రాణవాయువు) గనుక, అది మంటను ఆర్పదు.

ప్రేమానంద్ వివరణతో బాబా ట్రిక్కు అందరికీ బట్టబయలు అయింది. అయినా భక్తులు కొత్త మహత్తులకు ఎదురుచూస్తున్నారు.

## క్రీస్తుమహిమలు :

సువార్త కూటములు జరుగుతాయనే ప్రచారం విపరీతంగా సాగింది. మారుమూల గ్రామాల నుండి క్రైస్తవులు సందేశం వినడానికి చేరుకున్నారు.

అమెరికానుండి చాలా గొప్ప క్రైస్తవ ప్రచార బోధకుడు వచ్చాడట. ఆయన క్రీస్తు మహిమలు వివరిస్తాడట. అందువలన సువార్త కూటములకు ప్రత్యేకత సంతరిల్లింది.

ప్రార్థనలు చేసిన అనంతరం ఇంగ్లీషులో ఉపన్యాసం సాగింది. తెలుగులో అనువదించి ఒక పాస్టర్ చెబుతున్నాడు. బైబిల్ చేతుల్లో పట్టుకొని మోకాళ్ళపై కూర్చున్న భక్తులు శ్రద్ధతో ఆలకిస్తున్నారు.

ఏసుక్రీస్తు ఒక పెళ్ళి సందర్భంగా వచ్చిన వారందరికీ చాలినంత ద్రాక్ష సారాయి (వైన్)ని నీళ్ళద్వారా అందించాడట. నీరు కాస్తా ద్రాక్ష సారాయిగా మార్చడానికి ఆరు రాతి కూజాలను వాడారట. అలాగే మరో సందర్భంలో 5 రొట్టెముక్కల్ని వేలాదిమందికి క్రీస్తు పంచి అద్భుతాన్ని చూపాడట. బైబిల్ ఆధారంగా యీ విషయాల్ని ఆయన వివరించాడు.

అమెరికా మాంత్రికుడు జేమ్స్ రాండి యీ విషయాలను లోగడ వివరించాడు. హేతువాది ప్రేమానంద్ సువార్త కూటాలవద్దకురాగా, భక్తులు కొందరు ఆటంకపరచారు. బయట సభపెట్టి క్రీస్తు మహిమల రహస్యాన్ని ఆయన వివరించాడు.

ఒక బావిలో నీటిని ద్రాక్ష సారాయిగా మార్చవచ్చుగదా. అలాగాక, కేవలం రాతి కూజాలు అమర్చి వాటిలో నీళ్ళు పోయించి ద్రాక్షసారాయిగా ఎందుకు మార్చినట్లు? అదే రహస్యం. క్రీస్తుకు బావిలోనీటిని మార్చగల శక్తి లేదు. ఆయన తాను నేర్చిన మాంత్రికవిద్యతో ట్రిక్కు ప్రదర్శించి, ఆకర్షించాడు. ఎలాగ?

పెద్ద రాతి కూజాలలో చిన్న రాతి కూజాలు అమర్చాడు. చిన్న కూజా అంచు పెద్ద కూజా పైకి వుండేటట్లు ఏర్పరుస్తారు. చిన్న కూజా జనానికి కనిపించదు. పెద్దకూజాలో ద్రాక్షసారాయి పోస్తారు. తరువాత చిన్నకూజా లోనపెట్టి, తలక్రిందులు చేస్తే చిన్న కూజా పెద్ద కూజాలో అతుక్కుపోతుంది. తరువాత చిన్నకూజాపై మూతపెట్టి పెద్దకూజా మూతతీసి, అందులో ముందుగానే పోసిన ద్రాక్షరసాన్ని పంచుతారు. ఈ ట్రిక్కు తెలియక, భక్తులు అద్భుతంగా దాన్ని భావిస్తారు.

## బాబా పూనకం

ప్రతిరోజువలె నేడు కూడా బాబా 12 గంటలకు దర్శనం యిస్తారని భక్తులు చెప్పారు. దర్శనార్థం వచ్చినవారు కానుకలు సమర్పించి, ప్రార్థనలు చేస్తున్నారు.

రోజూ రావలసిన సమయానికి బాబా రాలేదు. ఒక శిష్యుడు వచ్చి నేడు బాబాకు పూనకం వచ్చింది. అమ్మవారి దర్శనం ఆయనతోపాటు యితరులకు సైతం చూచే భాగ్యం కల్పిస్తారని ప్రకటించారు.

బాబా రానున్న సందర్భంగా ఒక తెల్లని వస్త్రం పరచారు. బాబా కాళ్ళను కడిగిన భక్తుడు, ఆ నీళ్ళను కళ్ళకు అద్దుకున్నారు. అప్పుడు ప్రవేశించిన బాబా ఆ తెల్లని వస్త్రంపై పాదాలు పెట్టగానే, అమ్మవారిపాదాలవలె ముద్రలు పడ్డాయి. బాబా, పూనకం వచ్చినట్లు ఏవేవో మంత్రాలు చదివారు. గ్రామస్తులు ఏం చేయాల్సిందీ చెప్పారు. తెల్లని వస్త్రంపై ఎర్రని పాదముద్రలు అక్కడి భక్తులంతా కళ్ళారా చూచారు.

భక్తులలోని ఒక సందేహవాది యీ విషయాన్ని హేతువాది ప్రేమానంద్‌కు చెప్పారు. ఆయన విషయ వివరణ చేశారు.

బాబా వచ్చేముందు పరచిన తెల్లని వస్త్రం అంతకుముందే పసుపు ద్రావకంలో తడిపారు. ఎండబెట్టారు. వస్త్రంపై అంటిన పసుపు పౌడర్‌ను దులిపారు. వస్త్రం మళ్ళీ తెల్లగా కనిపించింది. బాబా ఆ వస్త్రంపై నడవబోయే ముందు భక్తుడు కాళ్ళు కడిగాడు గదా. ఆ నీళ్ళ నిమ్మరసం కలిపిన

నీళ్ళు, ఆ కాళ్ళతో బాబా తెల్లని వస్త్రంపై నడిచారు. అంతకు ముందే పసుపు ద్రవంలో తడిపినవస్త్రం గనుక నిమ్మరసం తగలగానే కాలిముద్రలు ఎర్రగా పడ్డాయి. పసుపు, నిమ్మ కలసినందున ఎర్రగా మారిందనేది అసలు రహస్యం. దీనిని పూనకంగా చూపి బాబా భ్రమింపచేశారు, ప్రేమానంద్ వివరణతో గుట్టు బట్టబయలైంది.

## నాడి కొట్టుకోకుండా ఆపగలరా?

బ్రతికినంత కాలం నాడి కొట్టుకుంటుంది. నాడి ఆగడం అంటే చనిపోవడమే. కాని సిద్ధులు తమ తపస్సు వలన, శక్తిని సాధించి, నాడి సైతం ఆపగలరని ప్రచారంలో వుంది. భక్తులు యిది కళ్ళారా చూచినపుడు నమ్మక చేసేదేముంటుంది.

వూళ్ళోకి వచ్చిన స్వాములవారు ఇంకోరోజు డాక్టరును పిలుచుక రమ్మన్నారు. ఆవేళ ఏమి అద్భుతం జరుగుతుందోనని భక్తులు ఎదురుచూస్తుండగా, నాడి చూడమని స్వామివారు చెయ్యిచాచారు. డాక్టరు పరీక్షించి, సాధారణంగా నాడి ఆడుతున్నట్లు ప్రకటించారు.

స్వామీజీ యిలోగా ఏవో మంత్రాలు చదివారు. సంస్కృతంలో వున్న ఆ మంత్రాలకు అర్థం తెలియక భక్తులు దండాలు పెట్టుకుంటున్నారు. మళ్ళీ నాడిచూడమని డాక్టర్‌కు సైగ చేశారు. ఈసారి చూచిన డాక్టర్ నాడికొట్టుకోవడంలేదని చెప్పాడు. మళ్ళీ చూచారు. సెతస్కోప్‌కు నాడీ శబ్దం అందలేదు.

భక్తులు సాష్టాంగపడ్డారు. ఇంకా కొందరు విరాళాలు గుప్పించారు.

హేతువాది ప్రేమానంద్ వచ్చి తానూ నాడి చూస్తానన్నారు. స్వామీజీ చేయి అందించారు. స్వామీజీ రెండుచేతుల్నీ పైకి ఎత్తిన ప్రేమానంద్, చూస్తుండగానే, స్వామీజీ రెండు చంకల నుండి రెండు నిమ్మకాయలు కిందపడడం భక్తులు చూచారు. చంకతో నిమ్మకాయలుగాని చేతిరుమాలు వుండగా చుట్టిగాని పెట్టి గట్టిగా నొక్కితే రక్తప్రవాహం ఆగి నాడి ఆగినట్లు అవుతుంది. హేతువాది వలన స్వామీజీ గుట్టు బయటపడిందిగాని లేకుంటే గిట్టుబాటు వ్యాపారమే!

## శరీరంలో ఉష్ణోగ్రత మహత్తు :

వూళ్ళోకి స్వాములవారు వేంచేశారు. భక్తులు యధాశక్తి కానుకలు అర్పిస్తున్నారు. రోజూ ఆయన చెప్పినట్లు పూజలు చేస్తున్నారు. స్వామి ఆకర్షణీయంగా చెప్పే మాటలకు పారవశ్యం చెందుతున్నారు. కొత్తగా వచ్చిన స్వామి, రోజుకో మహత్తు చూపి భక్తులను ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నారు.

ఆ రోజూ స్వామికోసం భక్తులు ఎదురుచూసి విసిగిపోతున్నారు. ఎంతకూ వేదికపైకి ఆయన రాలేదు. చివరకు శిష్యుడువచ్చి స్వామి రాకను ప్రకటించారు. స్వామివారు రాగానే, వూళ్ళో డాక్టరును పిలిపించమన్నారు. డాక్టర్ రాగానే థర్మామీటరుతో ఉష్ణోగ్రత చూడమన్నారు.

మామూలుగా వున్నది. కాసేపువున్న తరువాత మళ్ళీ చూడమన్నారు. ఈసారి 104 డిగ్రీలతో ఒడలు మండిపోతున్నది. అయినా స్వామి చలించలేదు. ఇంతలో ఏంజరిగిందో తెలియని భక్తులు స్వామి మహత్తుకు అబ్బురపడి దండాలుపెట్టి నోరు మూసుకున్నారు.

డాక్టరు వస్తున్నప్పుడే సబ్బుముక్క చప్పరించి మింగిన స్వామి, కొద్దిగా తేనీరు సేవించారు. ఆ విషయం భక్తులకు తెలియదు. తీర్థం పుచ్చుకుంటున్నాడని భ్రమించారు.

కడుపులో సబ్బునందుగల క్షారం (ఆల్కలీ)తో తేనీటిలోని ఆమ్లం (యాసిడ్) మిళితం కాగా, రసాయనికమార్పు జరిగి వేడి పుడుతుంది. ఇది కృత్రిమంగా సృష్టించిన ఉష్ణోగ్రత. భక్తులు ఆశ్చర్యపడుతుండగా స్వామి ఏమీ పుచ్చుకోకుండా కేవలం చల్లనినీరు మాత్రమే తాగుతూ డాక్టరు ఇస్తామన్న మందులు, ఇంజక్షన్ పుచ్చుకోరు. చల్లని నీరు వలన కడుపులో మంట, ఉష్ణం తగ్గిపోతుంది. అదంతా దివ్యశక్తిగా భక్తులు భావిస్తారు.

## గుడిశెలు తగులబడుతున్నాయి !

తెలంగాణా మారుమూల గ్రామం సింగారంలో ఒకనాడు మిట్టమధ్యాహ్నం వున్నట్లుండి ఒక గుడిశపై మంటలు చెలరేగాయి. మగవాళ్ళంతా కూలీకిపోయారు. మంటలు చూచిన ఆడవాళ్ళు గుండెలు బాదుకున్నారు. కష్టపడి నీళ్ళుపోసి ఆర్పేశారు.

మరునాడు ఇంకోగుడిసెపై అలాగే మంటలు లేచాయి. ఈ వార్త ప్రాకిపోయి, ఆ వూరికేదో శాపం తగిలిందన్నారు. జనం పొరుగూళ్ళనుండి వచ్చిచూచి, వింతకథలు అల్లారు. స్థానికపత్రికలలో కూడా వార్త వచ్చింది.

హేతువాదులకు యీ విషయం తెలిసి, వెళ్ళి పరిశీలించదలచారు. ప్రేమానంద్ అనే మాంత్రిక హేతువాదిని వెంటబెట్టుకొని ఆ వూరు చేరారు. జనం చెప్పిన కథలు ఆలకించారు.

ప్రేమానంద్ తగులబడిన గుడిసెలు పరిశీలించాడు. పిడకలు ఎండబెట్టిన గుడిశెలే తగులబడ్డాయి. పిడకలు లేని ఇళ్ళకు మంటలురాలేదు.

ఏం జరిగింది? పరిశీలించగా తేలిన సారాంశం

పిడకలు చేసేటప్పుడే పచ్చఫాస్ఫరస్ కలిపిపెట్టారు. పిడకలలో తడి ఆరగానే, పచ్చ ఫాస్ఫరస్ నుండి వేడివచ్చి, క్రమేణా గుడిసెపై పొగరావడం, తగులబడడం జరిగింది. కావాలని పచ్చఫాస్ఫరస్‌ను కలిపి పెట్టారన్నమాట. ఎవరు పిడకలు చేశారో తెలుసుకుంటే దొంగ దొరికిపోతాడు. ఎందుకు అలా చేసిందీ ఆరా తీయవచ్చు. ఇది చేయకుండా నమ్మకాలతో వుంటే, ఇంకా జనాన్ని భయకంపితుల్ని గావించి, వ్యాపారం చేసుకునే వారుంటారు.

## విగ్రహం కన్నీరు పెడుతోంది :

"లోకంలో పాపం పెరిగిపోయింది. అది చూడలేక మేరీమాత విగ్రహం కన్నీరు పెట్టుకుంటున్నది. ప్రభువు ఆగ్రహిస్తాడు. పాపం పోగొట్టుకోవాలి" అని క్రైస్తవ ఫాదర్ బోధిస్తున్నాడు. మేరీమాత విగ్రహం కన్నీళ్ళు పెడుతుందనే వార్త పత్రికలలో వచ్చింది. భక్తజనం తండోపతండాలుగా వచ్చి అద్భుతాన్ని తిలకించి, కానుకలు సమర్పించారు. ప్రార్థనలు చేశారు. క్షమించమని వేడుకున్నారు. ఒకరోజు కన్నీరు పెట్టుకున్న విగ్రహం మరునాడు ఆపేసింది. ఈలోగా వచ్చిన కానుకల్ని దైవకార్యం నిమిత్తం ఫాదర్ స్వీకరించాడు.

మాంత్రికుడు జేమ్స్ రాండి (అమెరికా)కి వార్త తెలిసివచ్చాడు. విగ్రహాన్ని పరిశీలిస్తానన్నాడు. వీల్లేదన్నారు. నిజంగా కన్నీరు కారుస్తుంటే, పరిశీలనకు ఆటంకం ఏమిటన్నారు. అయినాసరే ఒప్పుకోలేదు. భక్తుల విశ్వాసాన్ని ప్రశ్నించకూడదన్నారు. హేతువాదులు జేమ్స్ రాండిని వివరం అడిగారు. విగ్రహాన్ని తరువాత పరిశీలించిన రాండి విపులీకరించి, ఏం జరిగిందో తెలియపరచాడు.

మేరీమాత విగ్రహం మెడ లోపలిభాగం ఖాళీగావుంది. తలపై చిన్న రంధ్రం పెట్టి నీళ్ళు పోశారు. తలపైముసుగు కప్పారు. విగ్రహం రెండు కళ్ళకూ మైనం పెట్టి, నీళ్ళు పోసినప్పుడు మైనం తొలగించారు. లోన పోసిననీరు బొట్టుబొట్టుగా బయటకు వచ్చింది. మేరీమాత ఏడుస్తున్నట్లు ప్రచారం చేసి, భక్తుల వద్ద కానుకలు స్వీకరించారు.

మైసూరులో చాముండేశ్వరి విగ్రహం యిలాగే ఏడుస్తున్నట్లు లోగడ ఒకసారి ప్రచారం చేశారు. మాంత్రికుడు యీ గుట్టు బయటపెట్టాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహమైతే, లోన ఉప్పునీరుపోస్తే, సన్నని రంధ్రాలనుండి చెమ్మ వస్తుంది. అది కూడా భక్తుల్ని నమ్మించడానికి ప్రచారం చేసేవారు.

విగ్రహాలను తయారుచేసేది మనుషులే. వాటిని పూజించేది మనుషులే. విగ్రహాలను రాళ్ళుగా, బొమ్మలుగా ఆడుకునేది పురోహితవర్గమే.

## నీవు బాబా కావచ్చు ! (మాతకూడా!)

ఎటుచూచినా జనం భక్తులు పారవశ్యంతో చెంపలు వేసుకుంటూ టక్కర్ బాబాను చూస్తున్నారు. కొందరు పాదాలపై పడుతున్నారు. కాషాయ వస్త్రాలతో మెడలో రుద్రాక్షలతో, కర్ర చెప్పులతో బాబా ఏవో మంత్రాలు చెబుతూ భక్తులకు విభూది యిస్తున్నాడు. అది కళ్ళకు అద్దుకొని, నొసటన బొట్టుగా పెట్టుకుంటున్నారు. అంతమంది భక్తులకు హఠాత్తుగా బాబా విభూది ఎలా యివ్వగలిగాడు? చేతులు అటూఇటూ తిప్పి, తరువాత భక్తులకు విభూది యిచ్చిన బాబా మహత్తును కొనియాడుతున్నారు.

ఒక సందేహవాదికి అనుమానం కలిగింది. ప్రేమానంద్ అనే మాంత్రిక హేతువాదిని

అడిగారు. ఆయన వెంటనే చేతులు అటూఇటూతిప్పి విభేది యిచ్చాడు. సందేహవాది ఆశ్చర్యపోయి, ఎలా సాధ్యమైంది అని అడిగాడు. ప్రేమానంద్ వివరించాడు. విభూది వుండను చూపుడువేలు బొటనవేలు మధ్య పెట్టుకోవాలి. అలా వుంచి కూడా, నమస్కారం పెట్టవచ్చు. కరచాలనం చేయడం అలవాటు చేసుకోవచ్చు. తరువాత చేతిని అటూఇటూ తిప్పాలి. వేళ్ళ మధ్యవున్న విభూది వుండను అరచేతిలోకి తెచ్చి పొడిచేసి, కొంచెంగా భక్తులకు పంచాలి. బాబాలు చేసే పని యిదే పదార్థం లేకుండా, సృష్టి కాదు. బాబా దగ్గరకు వచ్చే భక్తులు అనుమానంతో ప్రశ్నించడానికి రారుగా? అందువలన బాబాచేసే ట్రిక్కులు, మాజిక్‌లు భక్తులకు అద్భుతాలుగా కనిపిస్తాయి.

సువాసనవచ్చే విభూదిని గంజినీళ్ళలో కలిపి వుండలుచేసి అట్టిపెట్టుకుంటే యీ పని చేయవచ్చు. సాయిబాబా మొదలు శివానంద వరకూ ఏ బాబా చేసినా యింతే. లోగడ అబ్రహాం కోవూరు కూడా చంకలో నుండి ఒక గొట్టాన్ని లాల్చీలో అమర్చి, అందులో నుండి విభూది కావలసినంత తెప్పించేవాడు.

*- హేతువాది, మార్చి, ఏప్రిల్, మే, జూన్ 1996*

# అయ్యప్పా, మనుషులే నీకు శరణం!

ప్రతి సంవత్సరం నవంబరు నుండి జనవరి వరకూ కేరళలోని శబరిమల కొండపైన అయ్యప్ప దర్శనార్థం భక్తులు యాత్ర జరుపుకుంటారు. జనవరి 14న ఉత్సవానికి పరాకాష్ఠ, ఆఖరి రోజు కూడా ఆరోజు శబరిమల కొండకు పదికిలోమీటర్ల దూరానవున్న పొన్నంబల మేడు కొండపై సాయంత్రం ఆరున్నర నుండి ఆరు నలభై లోపు మూడు పర్యాయాలు మకరజ్యోతి వెలుగుతుంది. ఇది దైవికమనీ, మానవులకు ఈ ప్రదేశం అందుబాటులో ఉండదనీ చిరకాలంగా ఒక గాథ ప్రచారంలో ఉన్నది. ఆ వెలుగు కనిపించగానే భక్తులు గుండెలు బాదుకుంటూ, అయ్యప్పా శరణం అంటూ నినదిస్తారు.

ఈ జ్యోతి మానవులతో నిమిత్తం లేకుండా వెలుగుతున్నదా? అనేది హేతువాదులను కొంతకాలంగా వేధించిన సమస్య అయింది. పరిశోధన జరపాలని వారు కేరళలో తీవ్ర ప్రయత్నం చేశారు. ఐతే హేతువాదులను ఆ కొండపైకి పోకుండా పోలీసులు అటకాయించటమే కాక 1980లో లాఠీ చార్జీ కూడా చేశారు.

యుక్తివాది సంఘంవారు ఈ విషయ పరిశోధనకు సుకుమారన్ ధనువాచపురమ్, టి.యన్. బాబు అనే వారిని పురమాయించారు. వీరిద్దరకూ కొండపైకి ముందుగానే చేరుకున్నారు. వారికి పోలీసు జీపు కె.యల్.యఫ్. 2676, కె.ఆర్.టి. 2951 నంబరులో మరో జీపు, కేరళ విద్యుత్ బోర్డువారి జీపు కనిపించాయి. ఆ జీపులలో వచ్చిన వ్యక్తులు కొబ్బరికాయలు, అగరువత్తులు, కర్పూరపు పొట్లాలు పట్టుకొచ్చారు. దీనితో వెలుగు ఏ విధంగా వస్తున్నదీ తేలిపోయింది.

దేవస్థానం అధికారులూ, పోలీసులూ, విద్యుత్ బోర్డువారూ కలిసి కొందరు వ్యక్తులను మాత్రమే ఈ ప్రదేశానికి పంపిస్తున్నారు. ఒక వ్యక్తి సరిగా సాయంత్రం ఆరున్నరకు ఒక పాత్ర నిండా కొన్ని కిలోల కర్పూరాన్ని నింపి వెలిగిస్తాడు. రెండు చేతులతో ఆ పాత్రను పైకి ఎత్తి మూడు పర్యాయాలు శబరిమలకొండవైపు చూపి దించివేస్తారు. ఇదే ఇన్నాళ్ళు భక్తులు దైవికమైన మకరజ్యోతిగా భావించి పూజిస్తున్న వ్యవహారం.

1983లో యుక్తివాద సంఘంవారు ప్రజలను మోసగిస్తున్న ఈ తీరు పట్ల అభ్యంతరం తెలుపుతూ కొండపైకి వెళ్ళటానికి ప్రయత్నించగా పోలీసులు లాఠిచార్జి చేశారు. అసెంబ్లీలో ఈ విషయం ప్రస్తావనకు రాగా కేరళ ప్రభుత్వం కంటితుడుపుగా విచారణ సంఘాన్ని నియమించింది. అప్పటి నుండి దేవస్థానం వారు మకరజ్యోతిని గురించి దైవికమని గాని, కాదనిగానీ చెప్పకుండా మౌనం వహించారు. ఐతే మకరజ్యోతిని ఫోటోలు తీయనీయరు. రహస్యం బయట పడకుండా అట్టిపెట్టటానికి ఇదొక ఎత్తుగడగా భావిస్తున్నారు.

ఈ దేవస్థానం నిధుల దుర్వినియోగం విషయమై చాలా ఫిర్యాదులున్నవి. 1965లో 342 మంది దేవస్థానం సిబ్బంది ఉండగా, 1986 నాటికి 1234 మంది అయ్యారు. ఈ నియామకాలు కూడా అరాచకత్వంతో కూడినవని విచారణ జరిపిన రెవిన్యూబోర్డు సభ్యుడు డా॥ సి.ఆర్. కృష్ణమూర్తి తెలియపరచారు. ఈ సిబ్బందిలో చాలా మందికి నెలకు రు. 50, వందరూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు. సేవానిబంధనలు ఏర్పరచలేదు. అవినీతి విలయతాండవం చేస్తున్నదనీ, భక్తులిచ్చిన బంగారాన్ని అమ్ముకుంటున్నారని ఫిర్యాదులున్నవి.

భక్తులు విషయాన్ని విడమరచి తెలుసుకోరు గనుక వారి మూఢనమ్మకాలే శబరిమల దేవాలయానికి ఆదాయం తెచ్చిపెడుతున్నవి.

*- హేతువాది, మార్చి 1987*

# 21వ శతాబ్దంలోకి పోబోయే ముందు మానవతావాదానికి మైనారిటీ తీరాలి.

పోలీసులు ఉన్నారు గనుక మనం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నామనటం తప్పు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే మనకూ సౌకర్యంగా ఉంటుందీ, ఇతరులకూ అనుకూలంగా ఉంటుందీ, సమాజం సాఫీగా నడుస్తుంది. మనిషి నీతిగా, రీతిగా హేతుబద్ధంగా ఉండటం మనకు, తోటివారికీ, సంఘానికి మంచిదని మానవతావాదం చెపుతుంది. మరణించిన తరువాత దేవుడు రక్షిస్తాడు గనుక, నరకంలో యమయాతనలు పడవలసి వస్తుంది గనుక అధమాధమ పునర్జన్మ ఎత్తవలసి వస్తుంది - తాము చెప్పిన నీతిని పాటించమని మత శాస్త్రాలూ, పురోహితవర్గాలు ఘోషించాయి.

పదుగురాడు మాట పాటియై ధరజెల్లు అన్న గొర్రెలమంద ధోరణిని మూఢనమ్మకాలు ప్రోత్సహిస్తాయి. కొందరు అనుభవిస్తూ, ఇతరులను అణచివేస్తూ, అందుకు తగ్గట్టుగా, ధర్మం, కర్మం, దైవం అంటూ జనాన్ని మత్తులో అట్టిపెట్టి - కొత్తభావాలూ, ఆలోచనలూ తప్పు అని మతాలు చెబుతూ వచ్చాయి. ఇందుకు భిన్నంగా మానవతావాదం విజ్ఞాన పంధాను ఎంపిక చేసుకున్నది. ప్రవాహానికి ఎదురీదింది. దీని వలన సైన్సు పుట్టింది. మానవ పురోగతికీ, నిరంతర అభ్యుదయానికి విజ్ఞానం తోడ్పడుతున్నది. ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని పక్కదారులు పట్టించడానికి మతం ప్రయత్నిస్తూనే ఉన్నది. ఆ ప్రయత్నంలో ఓడిపోయి ఇప్పుడిప్పుడే మతం కూడా విజ్ఞాన పంధాలను అనుసరించి ఆవిర్భవించిందని చెపుతున్నారు. ఇందులోని ప్రమాదాన్ని వారు గ్రహించలేదు. విజ్ఞానం స్థిరమైనది కాదు. శాశ్వతమైనది కాదు. ఎప్పటికప్పుడు కొత్తవి కనిపెడుతూ, వాటిలోని దోషాలు సవరించుకుంటూ, అనంతంగా పయనిస్తూ ఉంటుంది. మతం కొన్ని ప్రమాణాలను అంటిపెట్టుకొని, అవి ప్రశ్నించటానికి వీలులేనివనీ, అధికారికంగా చాటుతుంది. కనుక మతం శాస్త్రీయమంటే రుజువుకు నిలబడాలని, లేకుంటే తృణీకరించాలని అర్థం. మానవతావాదం మాత్రమే అందుకు సిద్ధపడగలదు.

వ్యక్తికీ, సమాజానికీ ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకొని మానవతావాదం కొన్ని విలువలనూ, ప్రమాణాలనూ రూపొందిస్తుంది. వాటిలో మార్పులు అవసరమైతే వెనుకాడదు. మతం దైవవిశ్వాసం పేరిట శాశ్వత విలువలనూ, ప్రమాణాలనూ బలవంతంగా మనుషులపై రుద్దుతుంది. మతస్థులు వాటిని మార్చుకోటానికి సిద్ధపడరు.

మానవతావాదం మనుషులను ఐక్యం చేస్తుంది. సహకరింపజేస్తుంది. స్వేచ్ఛకు విలువనిస్తుంది. మతం మనుషులను విభజిస్తుంది. ద్వేషాలను పెంచుతుంది. హింసను ప్రోత్సహిస్తుంది. ఇది చరిత్ర సత్యం. ఈ దృష్ట్యా మనదేశంలో మానవతావాదం ఎలా పరిణమించిందో దానికి అడ్డువచ్చిన శక్తులేమిటో పరిశీలిద్దాం.

మనదేశంలో క్రీస్తుపూర్వం 1500 సం॥కాలంనుండి ఆర్యుల రాకతో వేదాలు, ఉపనిషత్తులలో స్వేచ్ఛాపూరితమైన ఆలోచన సాగింది. వేదరచనలో ఇందుకు అనేక నిదర్శనాలు కనిపిస్తాయి. కాని ప్రప్రథమంగా శరీర రంగును బట్టి మనుషులను విభజించడం కూడా అప్పుడే ప్రారంభమైంది. ఆర్యులు ఉన్నతులనీ, క్షత్రియులు తక్కువవారనీ వాదన మొదలైంది. పురోహితవర్గం అనేక హక్కులను ఆపాదించుకొని మిగిలిన వారిని విచక్షణతో హీనంగా చూచారు. యజ్ఞం చేస్తే ఏ పాపమైనా పోతుందనీ, గోదానం చేస్తే మోక్షం లభిస్తుందని చెప్పారు. పురోహిత వర్గం శూద్రులను బానిసలుగా స్వీకరించారు. దేవుళ్లను విభజించి, పురోహితులకు వేరే దేవుళ్లు, మిగిలిన వారికి వేరే దేవుళ్లు అని పేర్కొన్నారు. ఈ విధంగా వేదకాలంలో పురోహితవర్గం దేశంలో మానవులను విభజించింది. క్షత్రియులు ఇందుకు ఎదురు తిరిగారు. అప్పట్లో కులవ్యవస్థ నేడున్నంత స్పష్టంగా లేకపోయినా బ్రాహ్మణ, క్షత్రియ విభజన మాత్రం స్పష్టంగానే ఉన్నది. ఒక విధంగా

వేదాలకు వ్యతిరేకంగా, అంటే పురోహితవర్గాలకు భిన్నంగా, క్షత్రియులు ఉపనిషత్తులను ప్రోత్సహించారంటారు.

వేదాలకు ప్రాధాన్యత ఇవ్వక తప్పలేదు. వాటిని అపౌరుషేయాలనీ, ప్రమాణాలనీ పేర్కొన్నారు. మతాన్ని సంస్కరించాలనే వారంతా వేదప్రమాణాన్ని అంగీకరించే ముందుకు సాగారు. కనుక మనదేశంలో మత-మానవతావాద చర్చకు వేదప్రాధాన్యతను గుర్తించక తప్పదు. వేదకాలంలో సహజ స్వభావ వాదాలకు నిదర్శనాలున్నవి. కాని ఆ వాదాలు ప్రామాణికుల పెత్తందారీతనంలో సమసిపోయాయి. కనుక వేదకాలంలో తలెత్తబోయిన మానవతావాదాన్ని మొగ్గలోనే తుంచివేసినందున మళ్లీ అది ఏనాడూ బలపడలేకపోయింది. వేదకాలంలో పురోహితవర్గాలు తమలో తాము కలహించుకొని దేవుళ్లకు వాటిని ఆపాదించారు. తాము సృష్టించిన దేవుళ్లను శక్తివంతంగా అట్టిపెట్టాలని చేసిన ప్రయత్నాలలో ఇంద్రుడూ, వరుణుడు, అగ్నిరుద్రుడు, ప్రజాపతి పైకీ, క్రిందికీ స్థాన భ్రష్టం పొందుతూ రావడం ఈ పురోహితవర్గాల లీల మాత్రమే. కుక్కను చంపాలంటే పిచ్చెక్కినట్లు పేర్కొనాలి. మానవతను చంపాలంటే దైవం పేరు అడ్డం పెట్టుకోవాలి. వేదకాలంలో ఇదే జరిగింది. గార్గి, మైత్రేయి వంటి ఆలోచనాపరులు తార్కికంగా దైవాన్ని ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరించారు. వేదప్రమాణానికి విలువ అలాంటిది. ప్రమాణం అంటే ప్రశ్నించ వీలుకానిది. ఆధారరహితమైనది. అధికారానికి ఆయువుపట్టు. మన సంస్కృతికీ, విలువలకీ ప్రాచీనకాలంలో ఆ విధంగా దోషపూరిత పునాదులు పడ్డాయి. తరువాత నిర్మించిన మతశాఖలూ, వచ్చిన సంస్కరణలూ, అన్నీ ఈ అధికారిక ప్రమాణాన్ని అడ్డం పెట్టుకొని పుట్టుకొచ్చినవే. మానసికంగా మన వెనుకబడినతనానికి ప్రాతిపదికలు వేదకాలంలోనే జన్మించాయి. మానవతకు అక్కడే పురుగుపుట్టింది. ఆ తరువాత పరిణామాలు ఎలా వచ్చాయో పరిశీలిద్దాం.

భారతదేశం ప్రాచీన కాలంలో యాజ్ఞవల్క్యునికి బదులు ఉద్దాలకుని అనుసరించి నట్లయితే, దేశం వైజ్ఞానికంగా ముందుకు వెళ్లేదని ఒక భావన ఉన్నది. ఉద్దాలకుడు ప్రశ్నించమన్నాడు. యాజ్ఞవల్క్యుడు నమ్మమన్నాడు.

ఉపనిషత్తులు వేదాల అనంతరం వచ్చినవి. వాటిలో భిన్నత్వం గోచరిస్తుంది. షుమారు క్రీస్తుపూర్వం ఐదు వందల సంవత్సర ప్రాంతంలో అవి వ్రాసినట్టు చెప్పవచ్చు. ఉపనిషత్తులలో అక్కడక్కడా స్వేచ్ఛాపూరిత ఆలోచనకు నాంది పలికిన లక్షణాలు కనిపిస్తాయి. పోతే, ఉపనిషత్తులను వేదాలతో సమానంగా అందరూ స్వీకరించటం లేదు, దయానందుడు వాటిని స్పష్టంగా నిరాకరించారు.

భారతదేశంలో ప్రప్రథమంగా మానవతా దృక్పథానికి స్పష్టమైన ఆలోచన చేసింది చార్వాకులనవచ్చు. దీనినే లోకాయత అని కూడా అంటారు. ఈ ఆలోచనాస్రవంతిని ఖండిస్తూ భారతీయ మతాలూ, చింతనాపరులూ చాలా చోట్ల ప్రస్తావన తెచ్చారు. సర్వదర్శన సంగ్రహం,

సర్వసిద్ధాంతసార సంగ్రహం, ప్రబోధ చంద్రోదయం మొదలైన వాటిలో లోకాయత ప్రస్తావనలున్నాయి. లోకాయత దృష్టిలో మానవులందరూ సమానం. నీతిగా ఉండటానికి దైవం అక్కరలేదు. యజ్ఞయాగాదులను తీవ్రంగా ఖండించారు. ఐతే పురోహితవర్గం ఈ వాదాన్ని ప్రచారంలోకి రానీయకుండా మట్టుపెట్టే వరకూ నిద్రపోలేదు. కనుక మానవతావాద వ్యాప్తి అక్కడే ఆగిపోయింది.

తరువాత పురోహిత వర్గానికి ఎదురు తిరిగి రాజుల అండతో, ప్రాపకంతో క్షత్రియులుగా జైన, బౌద్ధ సిద్ధాంతకర్తలు ప్రచారంలోకి వచ్చారు. జైనులు యజ్ఞయాగాదులను ఖండించినా, బ్రాహ్మణులను వ్యతిరేకించినా, కింది కులాలవారిని పట్టించుకోనే లేదు. స్త్రీలను పురుషులతో సమానంగా జైనతత్త్వం చూడలేకపోయింది. 1848లో అహమ్మదాబాదు వద్ద నిర్మించిన సేట్ హత్తిసింహ జైన దేవాలయంలో కుక్కలూ తక్కువ కులాలవారు ప్రవేశించరాదని బయట బోర్డు పెట్టారంటే, మానవుల పట్ల వారి ధోరణి అవగాహన చేసికోవచ్చు. జైనమతాన్ని అవలంబించి, పాటించే మార్వాడీ వర్తకులు చాలామంది ఆవుల్ని పోషిస్తూ, పూజిస్తూ, మనుషుల్ని చక్రవడ్డీలతో రక్తం పీలుస్తారంటారు.

బుద్ధుడు కుల విచక్షణను భిక్షువులు పాటించరాదన్నారు. ఐతే భిక్షువులుగా మారని వారిలో కులం కొనసాగటానికి బుద్ధుడు వ్యతిరేకించలేదు. బ్రాహ్మణులను తీవ్రంగా వ్యతిరేకించిన బుద్ధుడు క్షత్రియుల ప్రాపకంతో తన వాదాన్ని ప్రచారం చేసుకోగలిగాడంటారు. కులాన్ని ఒక వ్యవస్థగా అట్టిపెట్టరాదనీ, అది తొలగించాలనీ బుద్ధుడు చెప్పిన దాఖలాలు ఎక్కడా లేవు. అంతేకాక బుద్ధుడు కూడా స్త్రీల పట్ల చిన్నచూపే చూశారు. శౌక్యశాఖకు చెందిన మహాప్రజాపతి భిక్షులలో చేరటానికి అంగీకారం కుదరనప్పుడు అయిష్టంగానే బుద్ధుడు ఆమెను చేర్చుకున్నాడు. స్త్రీలను చేర్చుకుంటే తన వ్యవస్థ అట్టేకాలం ఉండదని కూడా అతను అభిప్రాయపడ్డాడు.

భగవద్గీత చాలా స్పష్టంగా కులాలు, వర్ణాలు, భగవంతుని సృష్టి అనీ, వ్యక్తి స్వభావాన్ని బట్టి, వృత్తిని బట్టి అవి వచ్చాయని పేర్కొన్నది. మహాభారతం నాటికి వర్ణాశ్రమ ధర్మాలు బాగా పాతుకపోయి కులాల హెచ్చుతగ్గులు అల్లుకుపోయాయి. ఎక్కడో చెదురుమదురుగా తప్ప కులవ్యవస్థను వ్యతిరేకించిన సూచనలు లేవు. ప్రతిదీ దైవానికి అంటగట్టి కులవ్యవస్థను సమర్ధించినందువలన మానవవిలువలు పూర్తిగా మృగ్యమైపోయాయి. ఆ తరువాత, అంతకుముందూకూడా వచ్చిన ధర్మశాస్త్రాలూ, సంహితలూ, శుక్రనీతిసారం, మొదలైనవన్నీ భగవంతుని పేరిట కులవ్యవస్థను, శిక్షలను బాగా కట్టుదిట్టం చేసి బిగించివేసాయి. కౌటిల్యుని అర్ధశాస్త్రం కూడా హిట్లర్ నాజీయిజం, ముసోలినీ ఫాసిజానికి మించిపోయిన శిక్షలను పేర్కొన్నది. కులాంతర వివాహాలు నిషిద్ధం అన్నారు. కుల కట్టుబాట్లను దాటినవారినీ, వ్యతిరేకించిన వారినీ శిక్షించడానికి ఎన్నో ఆంక్షలు పెట్టారు. మొత్తం మీద దోపిడీవ్యవస్థ బలపడి కొందరు అగ్రకులాలుగానూ, మరికొందరు నీచకులాలుగానూ వర్గీకరణ పొందారు. ఛండాలులూ,

అంటరానివారు అనే ఒక ప్రత్యేకమైన కులం కూడా మతం నుంచి పుట్టుకొచ్చింది. మనం ఈనాడు ఊరివెలుపల చూస్తున్న హరిజనులనేవారు మన ప్రాచీన ధర్మశాస్త్రాల, పవిత్రగ్రంథాల అగ్రవర్ణాల సృష్టిఅని మరచిపోకూడదు. గ్రీకులు, రోమనులు తమ ప్రజాస్వామ్యాన్ని బానిసలకు విస్తరించకుండా, సంతలో పశువులవలె మనుషుల్ని అమ్మినట్లే, అంతకంటె నీచంగా తక్కువ కులాలవారినీ, అంటరానివారినీ చూచి బాధించి బానిసత్వాన్ని శాశ్వతం చేశారు. అక్కడే మానవతావాదం అడుగంటింది.

హిందూమతంలో హెచ్చుతగ్గులను కొంతవరకైనా వ్యతిరేకించిన బౌద్ధాన్ని శంకరుడు వచ్చి చంపేశాడు. ఆయన నిర్గుణ బ్రహ్మ సిద్ధాంతాన్నీ, అద్వైత వేదాంతాన్నీ ప్రబోధించినా వర్ణాశ్రమ ధర్మాలను మాత్రం కఠినంగా అమలుపరచాలన్నాడు. బ్రహ్మసూత్ర భాష్యంలో స్పష్టంగా వేదాన్ని వినే అధికారం శూద్రులకు లేదన్నాడు. ఉత్తరాదిలో వైష్ణవం, దక్షిణాదిలో శైవం వ్యాపించినప్పటికీ కులాన్ని మాత్రం ఎవరూ ఎదురుకోలేదు. శంకరుణ్ణి వ్యతిరేకించిన రామానుజాచార్యులు, వీరిద్దరినీ ఖండించిన మధ్వాచార్యులూ కులం జోలికి పోలేదు. ఆ తరువాత దేశంలో పెద్దమార్పులు వచ్చాయి.

ముస్లిములు 10వ శతాబ్దం నుండి దేశంపై అనేక పర్యాయాలు దాడిచేసి దేవాలయాలను కొల్లగొట్టారు. దేవాలయాల జోలికిపోతే కళ్ళు పోతాయనీ మ్లేచ్ఛులు దైవాగ్రహానికి ఆహుతై పోతారనీ పురోహిత వర్గాలు చేసిన ప్రచారం అబద్ధమని తేలిపోయింది. మనుషులు కట్టిన దేవాలయాలు, సృష్టించిన దేవుళ్లు చూస్తుండగానే ముస్లిముల ఆక్రమణకు గురయ్యారు. కొద్దిమంది విదేశాలనుండి దండయాత్ర చేసి ఇంతమంది హిందువులను జయించటానికి ఇక్కడవున్న కులాల చీలికలూ, మతం పేరిట కొట్లాటలూ, అమానుషమైన హెచ్చుతగ్గులూ కారణాలయ్యాయి. క్రమేణా తక్కువ కులాలలోని హిందువులు ముస్లిముల్లో చేరిపోయారు. ఇస్లాంలో కులాలు లేని మాట నిజమే. ప్రార్థన సమయంలో అందరూ సమానమైన మాట నిజమే. కాని ఉత్తరోత్తరా ముస్లిముల్లో కూడా అంతస్తుబేధాలు, అనేక విధాలైన తారతమ్యాలు ఉన్నాయని బయటపడింది. దైవం పేరిట పాలకులూ, పురోహితవర్గాలూ ఇస్లాంలో మనుషుల్ని చిత్రహింస చేశారు. స్త్రీలను చిన్నచూపు చూశారు. ముస్లిములు కాని వారిని కాఫిర్లు అంటూ తక్కువగా చూచారు. మొత్తంమీద ముస్లింల దండయాత్ర వలన ఇండియాలో ఒక పెద్ద మైనారిటీవర్గం ఏర్పడి చరిత్రను మార్చివేసింది.

మధ్య యుగాలలో మతాన్ని మానవత్వంతో మార్చాలని అనేక మంది సంస్కర్తలు విఫల ప్రయత్నం చేశారు. బసవుడు కులాన్ని ఖండించాడు. కబీర్, నానక్, తుకారాం, జ్ఞానదేవ్, ఏక్‌నాథ్, ధర్మానంద, చరణ్‌దాస్, చైతన్య మొదలైన వారంతా గ్రామసీమల నుండి భక్తిప్రపత్తులతో పాటలు పాడుతూ జనాకర్షణ పద్ధతులు అవలంబించినప్పటికీ లోతుగా పాతుకుపోయిన కులాన్ని కదలించలేకపోయారు. హెచ్చుతగ్గులను తొలగించలేకపోయారు.

బ్రిటిషు పాలకులూ, యూరోపుదేశాల వారూ ఇండియాకి వచ్చిన తరువాత క్రైస్తవుల ప్రభావం వ్యాపించింది. ఈ మతానికి పాపాత్ములూ, పేదవారూ కావాలి. అప్పుడే వారి ప్రచారానికి ఆకర్షణ ఉంటుంది. అలాంటి అవకాశం భారతదేశంలో బాగా కనిపించింది. క్రైస్తవ ఫాదరీలు తక్కువ కులాల వారినీ, ముఖ్యంగా అంటరానివారిని ఆకర్షించి అపరిమితంగా మతం మార్పిడి చేశారు. విచిత్రమేమంటే అటు ముస్లిములూ, ఇటు క్రైస్తవులు కూడా కులాన్ని పోగొట్టలేకపోగా క్రమంగా కులాలను పాటించారు. హిందూ ఆచారాలను కొన్నిటిని స్వీకరించారు. అందువలన నేడు హిందువుల్లోని కులాలు ముస్లిముల్లోనూ, క్రైస్తవుల్లోనూ కనిపిస్తున్నాయి. మానవుల హెచ్చుతగ్గులు మతపరంగా పోవని తేలిపోయింది.

18, 19 శతాబ్దాలలో భారతదేశాన్ని మార్చటానికి మత సంస్కర్తలు మళ్ళీ ప్రయత్నించారు. అందులో భాగంగానే ఆర్యసమాజ్ పంజాబ్‌లోనూ, బ్రహ్మసమాజ్ బెంగాల్లోనూ, ప్రార్థనాసమాజ్ మహారాష్ట్రలోనూ, దివ్యజ్ఞానమతం మద్రాసులోనూ, రామకృష్ణ వివేకానంద మిషన్ మొదలైనవన్నీ చూస్తాం. మతాన్ని మార్చటానికి వీరు చేసిన ప్రయత్నంలో కొన్ని దోషాలు తొలగించగలిగారు. హిందువులు పాటించే అమానుషమైన సతీసహగమనాన్ని బ్రిటిషువారి సహాయంతో నిషేధించగలిగారు. కాని మౌలికంగా మార్పులు తేవడం సాధ్యపడలేదు. అంటరానితనం జోలికి పోలేకపోయారు. కులాల హెచ్చుతగ్గులను కదిలించలేకపోయారు. వీటిని సమర్థించే ధర్మశాస్త్రాలను, పురాణ ఇతిహాసాలను ఖండించలేకపోయారు. అలా ఖండించిన ఆర్యసమాజం పరిమితంగానే ఉండిపోయింది. చివరకు ఆదిమ ఆచారాలనూ, విగ్రహారాధనను సైతం తొలగించలేకపోయారు.

బెంగాల్లో హెన్రీలూయీ వివియన్ డిరోజియో (1809-31) కలకత్తాలో హిందూ కాలేజీలో లెక్చరర్‌గా ఉంటూ మతసంప్రదాయాలూ, దురాచారాలపై దాడిచేసి బెంగాల్ యువకులను ప్రోత్సహించి, హేతువాదాన్ని ప్రబోధించాడు. బహుశ అతడు ఎక్కువకాలం బ్రతికిఉన్నా కొంత ప్రభావం కనిపించేదేమొ - కాని హిందూ కాలేజీ అతణ్ణి ఉద్యోగం లోంచి తీసివేసిన సంవత్సరానికి కలరాతో చనిపోయారు. ఆ విధంగా బెంగాల్లో ప్రారంభమైన మానవతావాదం 19వ శతాబ్దంలో ఆగిపోయింది. మహారాష్ట్రలో పండితరమాబాయి, పూలే ప్రారంభించిన హేతువాదం కూడ మతప్రభావం ముందు నిలువలేకపోయింది.

20వ శతాబ్దంలో జాతీయోద్యమం ఉప్పెన వలె వచ్చింది. అరబిందో, తిలక్, గాంధీ జిన్నా వంటి వారి చేతుల్లో ఈ ఉద్యమం ప్రజలను బ్రిటిషువారికి వ్యతిరేకంగా చైతన్యవంతులను చేసింది. ప్రప్రథమంగా మతాన్ని రాజకీయాలలోకి తీసుకవచ్చారు. అందువలన మతంలో మంచిని వెతకటానికి ప్రయత్నించారు. ఒక చేతిలో బైబిల్, మరొక చేతిలో భగవద్గీత, ఖురాన్ పట్టుకున్న గాంధీ, ఈశ్వర్ అల్లా తేరేనామ్ అంటూ ప్రార్థనలు చేస్తే అటు హిందువులు గానీ, ఇటు ముస్లిములు గానీ ఒప్పుకోలేదు. అంటరానితనంపై గాంధీ చేసిన ఉద్యమానికి రాజకీయాలు తోడ్పడలేదు. గాంధీలో అగ్రవర్ణాల హిందువును చూచిన అంబేద్కర్ బౌద్ధం ఒక్కటే అంటరానివారికి

శరణ్యం అన్నారు. కాని మతం అంటరానితనాన్ని పోగొట్టలేదని మరొకమారు రుజువయింది. మత అసహనం కారణంగా రాజకీయోద్యమంలో మానవతకు తావు లేకుండా పోయి, దేశవిభజన జరిగి, ఊచకోత కోసుకున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో మనుషులందరినీ ఒకే తీరుగా చూడటానికి వీలైన తరుణంలో అధికారంలో ఉన్న నెహ్రూ దేశమంతటికీ యూనిఫారమ్ సివిల్‌కోడ్ పెట్టలేకపోయారు. అంతటితో రాధాకృష్ణ సెక్యులరిజానికి విపరీత వ్యాఖ్యానాలు చేసి మతానికి అధికారముద్ర సంపాదించగలిగారు. అన్ని మతాలు సమానమనే పేరిట ప్రభుత్వం మతాలన్నిటినీ ప్రోత్సహిస్తూ ఓట్ల కోసం మత సంస్కృతిని కట్టుదిట్టం చేస్తూ వచ్చింది.

20వ శతాబ్దంలో భారతదేశానికి పునర్వికాసం కావాలనీ, గతాన్ని హేతుబద్ధంగా పరిశీలించి అవసరమైన మేరకే స్వీకరించాలనీ మానవతావాదులు కోరారు. ఎం.ఎన్. రాయ్ నాయకత్వంలో ఈ మానవతావాదుల ప్రభావం అల్పంగానే మిగిలిపోయింది. శాస్త్రీయ పద్ధతిలో సెక్యులరిజం తీసుకురావాలని ప్రయత్నించిన ఎ.బి.షా., సత్యశోధన మండల్ ప్రభావం కూడా అట్టేలేదని చెప్పవచ్చు. విజ్ఞానం, సాంకేతికం, విపరీత వేగంతో ప్రపంచంలో ముందుకు పోతుండగా మనదేశంలో వాటిని మత అభివృద్ధికి వినియోగించుకుంటున్నారు. రాజకీయాలు ఈ విషయం తెలిసికూడా ఉదాసీనత వహిస్తున్నాయి. ప్రజలలో మానవతావాదాన్ని ప్రచారం చేయటానికి విద్యారంగం, టి.వి. రేడియో వంటి శక్తివంతమైన సాధనాలు ప్రభుత్వం చేతిలో ఉండి కూడా ఉపయోగించుకోలేక పోతున్నారు. శాస్త్రీయాభివృద్ధిని వెనక్కు తిప్పలేమని బ్రోనోస్కీ అన్నాడు. అది నిజమే కావచ్చు. అందుకు తగిన వైజ్ఞానిక మనస్తత్వం అభివృద్ధి కాకుండా మన పాలకులు తాత్కాలికంగా ఆపగలిగారు. మనం వెనుకబడి ఉండటానికి ఈ శాస్త్రీయ దృక్పథాన్ని మానవతా దృక్పథాన్నీ అలవరచుకోపోవడమే కారణం.

మానవతావాదానికి మైనారిటీ తీరినప్పుడే భారతదేశం ప్రపంచంలోని అగ్రస్థాయి దేశాలతో దీటుగా పురోగమించగలదు. ఇందుకు చాలా కృషి అవసరం.

*- హేతువాది, జూలై 1987*

# హేతువాదుల కార్యరంగం

మనకు బ్రతికున్న దేవుళ్ళు, చనిపోయిన దేవుళ్ళు అని స్థూలంగా రెండు రకాలున్నారు. తిరుపతి వెంకటేశ్వరుడు, జీసస్ క్రైస్తు, మహమ్మదు మొదలైనవారంతా చనిపోయిన బాపతు. రెండవ వర్గంలో సాయిబాబా, రజనీష్, శివబాలయోగి, జిల్లెళ్ళమూడి అమ్మ యిత్యాదు లున్నారు. ఇంకా కొత్త దేవుళ్ళు వెలుస్తూనే వున్నారు. మనుషులు కొలుస్తూనే వున్నారు. మానవుడి దృష్టి అనంతం అనడానికి యిది కూడా ఒక నిదర్శనమే.

రాజకీయ పార్టీలకు డబ్బు ఎంత యిచ్చినా, వారెంత వసూలు చేసినా దానికి చిట్టా, అవర్జా లేదు. ఆదాయపు పన్ను లేదు. అడిగేవాడు లేడు. అలాగే మతానికీ, దేవాలయానికీ, మసీదుకూ యిచ్చిన డబ్బుకు లెక్కలు లేవు.

కనుక దొంగడబ్బు సంపాదించాలన్నా, ఖర్చు పెట్టాలన్నా-రాజకీయ పార్టీ కావాలి. లేదా గుడి, మఠం, మతం కావాలి. ఇంకెక్కడన్నా అయితే పట్టుబడే అవకాశం వుంది. అప్పుడు కోర్టు, కేసు, పోలీసు, జైలు యిలాంటివి ఎన్నో రంగంలో ప్రవేశిస్తాయి. ఆదాయపు పన్నువారు, ఎక్సైజ్ శాఖవారు, పోలీసులు, రాజకీయాల్లోవారూ 'మహాభక్తులు' గనుక మతం జోలికి పోరు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉదాహరణకు చూడండి : జిల్లావారీగా ఎందరు బాబాలు, మహాత్ములు, యోగులు, సన్యాసులు, మాతలు, అమ్మలు, దేవీ అవతారాలు వున్నారో లెక్కలు తెలియదు. మన రాష్ట్రంలో భిక్షగాళ్ళ వృత్తిపై నిషేధం వుంది. అమలు జరగని చట్టాలలో అదొకటి. కనీసం అలాంటిదైనా యీ 'వర్గానికి' లేదు. కనుక వారు యథేచ్ఛగా తెగబడి, సంఘం మీద విరుచుకపడి దోస్తున్నారు.

ఇటీవల వీరిలో కొందరు రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారు. రాజమండ్రిలో రామలింగ సిద్ధాంతి కోసం సాక్షాత్తు ప్రస్తుత రాష్ట్రపతి అలనాడు హోమ్‌మంత్రిగా ప్రత్యేక విమానంలో వచ్చారు. ఇక సాయిబాబా సంగతి చెప్పనక్కరలేదు. కొందరు చిట్‌ఫండ్స్ వాళ్ళు డబ్బులు కాజేసి పారిపోయినట్లే, ఆశ్రమాలు పెట్టినవారు వున్నట్లే మాయం అవుతున్నారు. పూనాలో రజనీష్ అలాగే అమెరికాలో తేలాడు.

ఇదంతా ఎందుకు జరుగుతున్నది? ప్రభుత్వం అనుసరించే 'బూటకపు సెక్యులరిజం' వలన, అన్ని మతాలనూ సమానంగా చూడాలి అనే నెపంతో, అధికారంలో వున్నవారు ఎవరికిష్టమైన దానిని వారు భుజాన వేసుకొని మోస్తున్నారు. ముఖ్యమంత్రిగా అంజయ్య ఒక శంకరాచార్యుల మఠంలో గోపురానికి డబ్బు దానం చేశాడు. ముఖ్యమంత్రి కాబోయేవ్యక్తీ అయినవాడూ-అందరూ తిరుపతి, యాదగిరి, అన్నవరం, సింహాచలం, మంత్రాలయం ప్రభుత్వ ఖర్చుపై వెళ్ళి మొక్కుబడులు తీర్చుక వస్తుంటారు. వీరంతా ఎంత భక్తులంటే, ప్రార్థనలు చేయమని ఆదేశాలిస్తారు. యజ్ఞాలు చేయిస్తారు!!

దోపిడీ విపరీతంగా చేస్తే, మామూలు రాతికి బదులు పాలరాతితో గుడులు కట్టిస్తారు. హైదరాబాద్‌లో బిర్లామందిర్ యిందుకు ఉదాహరణ. అయ్యప్ప భక్తులైతే పాపం చేసినట్లు ఒప్పుకొని ప్రాయశ్చిత్తం కోసం వేరే దుస్తులు వేసుకొని, కొన్నాళ్ళు కష్టిస్తారు. క్రైస్తవులు తమ పాపాలను ఫాదరీలకు చెప్పుకున్నట్లే వీరు అయ్యప్పను శరణు వేడతారు.

ఈ విధంగా భక్తి రోజురోజుకూ ముదిరి, అనేక విధాల వెల్లడై అప్పుడప్పుడు, ఆవేశం పట్టజాలక మతకలహంగా పరిణమిస్తుంటుంది. మసీదు పక్కగా, వూరేగింపు వాయిద్యంతో

వెడితే మహమ్మదీయులు విజృంభిస్తారు. ఆవు జోలికిపోతే హిందువులు ఆగరు. ఎటొచ్చీ విలువలేనిది మనిషికే. అదీ మతసారాంశం!

ఏతా వాతా చెప్పొచ్చే దేమంటే, యీ మతాలను, వాటిపేరిట దేవుళ్ళుగా వెలసే వారిని కనిపెట్టి వుండడం అవసరం. సమాజంలో వారికి ప్రత్యేకత వుండరాదు. ఆశ్రమాలు, బాబాలు, మాతలు, మసీదులు, దేవాలయాలకు సంబంధించిన ఆస్తి వివరాలు ఎప్పటికప్పుడు వెల్లడించవలసిన అవసరం వున్నది. లేకుంటే సమాంతరంగా నల్లడబ్బుతో వీరు 'రాజ్యం' చేస్తున్నారు. వీరి ఆదాయం ఎక్కడిదో చెప్పవలసివున్నది. దానిపై అందరిమీద వేసినట్లు పన్ను వేయాలి.

తిరుపతి హుండీలో రహస్యంగా ముడుపువేసే పద్ధతికి స్వస్తి పలకాలి. దొంగ డబ్బు సంపాదించినవాడు, భయానికి లక్షల ధనం అర్పిస్తే మంచి పనిచేశాడనడం వెర్రి అవుతుంది. నిజమైన భక్తుడికి భయం వుండవలసిన పని లేదుగదా. లెక్కబెట్టి, ముడుపు చెల్లించి, రసీదు పొందాలి. అంత డబ్బు ఎలా సంపాదించాడో చెప్పగలగాలి. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నాడా లేదా చూడాలి. భగవంతుడి సన్నిధిలో భయమెందుకు? ప్రభుత్వం కూడా మతాల ఆదాయాలకు ఏ విధమైన మినహాయింపులు యివ్వరాదు. అయితే కొందరు వాదిస్తున్నట్లు అటువంటి డబ్బు బడులకు, మందిరాలకు సద్వినియోగమౌతుందిగా అనవచ్చు. ఆదాయపు పన్ను వేస్తే ప్రభుత్వానికే గదా డబ్బు చెందేది? ప్రభుత్వం ఖర్చుపెట్టేది కూడా ప్రజల సంక్షేమానికే గదా? పైగా దొంగ డబ్బు అరికట్టడం వలన, రూపాయి విలువ పెరిగి, ధరలు అదుపులోకి వచ్చి, ద్రవ్యోల్బణం తగ్గుతుంది కూడా. కాషాయవస్త్రం వేసుకున్న ప్రతి గడ్డపువాడికీ, జుట్టు పెంచుకున్న వారికీ, మినహాయింపులు ఇస్తుంటే, దోపిడీని ఎలా అరికడతారు? సమాజం నుండి పారిపోయి, బాధ్యతరహితంగా తిరిగేవాళ్ళంతా, దైవం పేరిట, మతం మాటతో మనుషుల్ని కాల్చుక తింటున్నారు. అలాంటి వాళ్ళ దగ్గర ఆత్మశాంతి లభిస్తుందని భ్రమపడుతున్నారు. కాని పాండిచ్చేరి ఆశ్రమం కట్టిన ఆరోవిల్ చూడండి. కొట్లాటలతో సతమతమౌతున్నారు. ఆస్తులున్న చోట యివి తప్పవు. మన దేవాలయ ట్రస్టీల సంగతి చాణుక్యుడే చెప్పాడుగా, ఒక కంట కనిపెట్టి వుండమని!

మతం వున్నంతకాలం మనిషికి శాంతి వుండదు. చరిత్ర రుజువు చేసిన సత్యమిది. సమాజంలో యితర శాఖల్ని చూచినట్లే మతాన్ని చూడడం ప్రభుత్వ సెక్యులర్ విధి. ప్రజలు వీటన్నిటినీ ఒక పట్టాన అంగీకరించరు. ఎందుకంటే మతం నూరిపోసిన, పోస్తున్న అజ్ఞానం వారికి వంటబట్టివున్నది గనుక. అది క్రమేణా పోగొట్టాలి. హేతువాదులు యీ ప్రచారం చేయాలి. చదువులో హేతువిధానం రావాలి. మతం పోతే ఆధ్యాత్మిక అమానుష నీతి పోతుంది. మానవ నీతి వస్తుంది. కనుక మతం లేకుంటే విలువలు పోతాయనడం ఘోరసూక్తి. అంటరానితనాన్ని, మనుషుల్లో తారతమ్యాల్ని, మనస్సును ధ్యానం పేరిట తాకట్టు పెట్టించే విధానాన్ని ఆలోచనను చంపేసే రీతుల్ని మతం పెంచి పోషించింది. అంటరానితనం పోవాలి అని కేకలేసేవారు. దీని

వెనుక మతం వున్నదని గ్రహిస్తే మంచిది. అలాగే కుటుంబ నియంత్రణ కావాలనే వారు, దీనిని మతం వ్యతిరేకిస్తున్నదని గ్రహిస్తే, మేలుకుంటారు. ప్రభుత్వం తలపెట్టే ప్రతి అభ్యుదయ చర్యకూ మతం అడ్డొస్తుంది. కనుక మతాన్ని పోషిస్తూ సంక్షేమ రాజ్యం తేవడం కల్ల.

## హేతువాదులకు సూచన :

మీ జిల్లాలో, కనీసం ఒక ప్రాంతంలో వున్న ఆశ్రమాన్ని, బాబాను, మాతను ఉదాహరణగా స్వీకరించి, వారి పుట్టుపూర్వోత్తరాలు సేకరించండి. ఆస్తుల వివరాలు తెలుసుకోండి. బాబా కుటుంబ వ్యవహారం, అతడి మానసిక ప్రవృత్తి వివరాలు నోట్ చేయండి. ఈ సమాచారం వలన విశ్లేషణ మొదలుపెట్టవచ్చు. ఇటువంటి పరిశోధన వైజ్ఞానిక పద్ధతిలో జరగాలి. ప్రభుత్వం వద్ద యిటువంటి సమాచారం వుండదు. పరిశోధనకు బాగా ఉపకరించే యీ విషయాలు, సమాజానికి ఎంతో తోడ్పడతాయి. ఏ రాజకీయ పార్టీ కూడా యీ పనికి పూనుకోదు. కనుక హేతువాదులకు పోటీలేని రంగం యిది.

*- హేతువాది, నవంబరు 1992*

# పిల్లల్ని మతాలకు దూరంగా వుంచండి

తండ్రి తెలుగుదేశం పార్టీలో వుంటే కుమారుడు (మైనర్) కూడా తెలుగుదేశం పార్టీకి చెందుతాడా? తల్లి కాంగ్రెస్ అయితే బిడ్డ (మైనర్) కూడా కాంగ్రెస్ పార్టీలో వుండాలా? రాజకీయాలు వంశపారంపర్యం కాదు. పెద్దవాళ్ళకు, అవగాహనతో, 18 ఏళ్ళ తరువాత విచక్షణతో ఓటువేసే హక్కు యిచ్చారు. ఎందుకని? చిన్నపిల్లలకు ఓటుహక్కు ఎందుకు లేదు? వారి పరిధి కాదు గనుక! యుక్తవయస్సు వచ్చిన తరువాత, రాజకీయాల్లో వారిష్టమొచ్చిన పార్టీలో చేరవచ్చు, చేరకపోవచ్చు. కనుక పుట్టగానే రిజిస్టర్‌లో ఏ పార్టీ అనే కాలంలో ఫలానా పార్టీ అని రాయరు.

చిన్నపిల్లల్ని అశ్లీల సాహిత్యానికి, బూతు సినిమాలకు, అసభ్యశృంగారానికి దూరంగా వుంచాలంటారు. ఎందుకని? పిల్లలకు లైంగిక అవగాహన వుండదు. అది పెద్దవారి పరిధి.

అలాగే, మతం. నమ్మకాలు కూడా చిన్నపిల్లల పరిధిలోనివి కావు. అవి అవగాహన వున్న పెద్దవారికి పరిమితం.

కాని తల్లిదండ్రులు తమ మతాన్ని పుట్టగానే పిల్లలపై రుద్దుతున్నారు. నమ్మకాలు నూరిపోస్తున్నారు. ఇది పిల్లల పట్ల గొప్ప నేరం, ఘోరకృత్యం. మతంలో వుండే అసహనం, గుడ్డినమ్మకాలు, పరమతద్వేషం, అన్నీ పిల్లలకు వస్తున్నాయి. అలాగే దురాచారాలు, కూడా అలవాట్లుగా, జీవితంలోభాగంగా మారుతున్నాయి. మతం పెద్దల పరిధి. కనుక రాజకీయాలు, సెక్స్ వలె, మతాన్ని కూడా పిల్లలకు దూరంగా వుంచాలి.

మతం పేరిట చిన్నపిల్లల్ని హిందువులు గుడికి తీసుకెళ్ళి గుండు చేయిస్తున్నారు. మొక్కమంటున్నారు. రాళ్ళురప్పల్ని కళ్ళకు అద్దుకోమంటున్నారు. మతం పేరిట బాల్యవివాహాలు చేశారు. ఇంకా అక్కడక్కడా చేయిస్తున్నారు. వాటిని ప్రభుత్వం నిషేధించింది. చిన్నపిల్లలకు పెళ్ళిచేసి, భర్త చనిపోతే, విధవలుగా బ్రతుకులు అగచాట్ల పాలైన ఉదంతాలు, మతాచారాల వలననే. అంతేగాదు సతీసహగమనం పేరిట భర్త చితిపై కాల్చేసిన ఘట్టాలూ చిన్నపిల్లల చరిత్రలో వున్నాయి. చిన్నప్పుడే గురువుల్ని ఎంపిక చేసి శంకరమఠాల్లో ఆచారాలు నూరిపోస్తున్నారు. క్రైస్తవులు చిన్నప్పుడే అమ్మాయిలను అమ్మగార్లగానూ (నన్స్) అబ్బాయిలను మతగురువులు గానూ (ఫాదరీ) "అంకితం" యిస్తున్నారు. పైగా అది దైవసేవగా పేర్కొంటున్నారు. చిన్నపిల్లలచే మంత్రాలు వల్లె వేయిస్తున్నారు. గుడులలో సేవలు చేయించుకొంటున్నారు. బైబిల్ పారాయణం చేయిస్తున్నారు.

ముస్లింలు పిల్లల్ని మసీదులకు తీసుకెళ్ళి కొరాన్ బట్టీపెట్టిస్తున్నారు. సుమారు 6 వేల చరణాలు అర్థం తెలియకుండానే పిల్లలు విధిగా, అరబ్బీలో కంఠస్తం చేయవలసి వస్తున్నది. పైగా పరమతద్వేషం, నూరిపోస్తున్నారు. చిన్న పిల్లలతో ముస్లిం దురాచారం ఘోరంగా పరిణమించినది. అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా "సుంతీ" చేయిస్తారు. 28 దేశాలలో ముస్లింలు యీ దురాచారాన్ని పాటిస్తున్నారు. అదంతా మతం పేరిటే వున్నది. అనేకచోట్ల అమ్మాయిలు ప్రమాదాలకు గురౌతున్నారు. ఐక్యరాజ్యసమితి కూడా యీ విషయం గుర్తించి, హెచ్చరించింది.

ఈ విధంగా పిల్లల్ని, మతంపేరిట హింసించడం అమానుషం. ఐక్యరాజ్యసమితి పిల్లల విభాగం యునిసెఫ్ యిటీవల పిల్లల హక్కులపై ప్రపంచసభ జరిపింది. దీనిని 187 దేశాలు ఆమోదించాయి. దీనిప్రకారం పిల్లలు తల్లిదండ్రుల ఆస్తికాదు. వారికీ వ్యక్తిత్వం వుంది. హక్కులు వున్నాయి. వాటిని పాటించాలి.

సంతకాలు చేసిన దేశాలు మతం జోలికి పోవడం లేదు.

కనుక యీ విషయమై ప్రపంచ మానవసంఘం ఒక తీర్మానం చేసి, ఐక్యరాజ్యసమితికి పంపాలని భారత హేతువాదసంఘం పక్షాన యిటీవల కోరాం. ఈ విషయంపై చర్చ జరగాలి. పిల్లలపట్ల మతం పేరిట జరిపే దారుణాలు ఆపాలి.

మతాన్ని గురించి పరిశీలించేటట్లు, ఆలోచించేటట్లు మత చరిత్రలు పాఠాలుగా చెప్పాలి. చిన్నప్పుడే నమ్మకాలతో కూడిన మతాల్ని వల్లెవేయిస్తే పిల్లల్లో వున్న విశిత పరిశీలనాదృష్టి మొద్దుబారుతుంది. నీతి, విలువలు అనేవి మానవహక్కులు. వాటిని చెప్పాలి. మతం కేవలం దైవహక్కులు చెబుతూ మనిషిని సేవకుడుగా, ఎందుకూ పనికిరానిబానిసగా చూస్తున్నది.

*- హేతువాది, మార్చి 1997*

# పిల్లలకు హక్కులున్నాయి! కానీ...?

ప్రపంచ స్థాయిలో గొప్ప మార్పు వచ్చింది. 21 శతాబ్దానికి అది శుభసూచకం. కాని ఆ మార్పు దేశాలకు, అందులో ప్రజలకూ, ముఖ్యంగా తల్లిదండ్రులకూ చేరాలి. అక్కడే వుంది తిరకాసు.

పదేళ్ళ క్రితం ఐక్యరాజ్యసమితి గొప్ప పనిచేసింది. పిల్లల హక్కులపై ప్రపంచ రాజ్యాల సమావేశం జరిపింది. బాగా పరిశీలించి, చర్చించి పిల్లల హక్కుల పత్రాన్ని రూపొందించారు. 54 ఆర్టికల్స్‌తో కూడిన పిల్లల హక్కుల్ని త్వరత్వరగా అన్ని దేశాలు ఆమోదించడం మరీ విశేషం. రెండే రెండు దేశాలు యింకా సరే అనవలసివుంది. ఒకటి సోమాలియా. అక్కడ ఒక ప్రభుత్వం అంటూ లేకుండా భీభత్స పరిస్థితి వుంది గనుక కొంత వేచివుండాల్సిందే. రెండో దేశం అమెరికా సంయుక్త రాష్ట్రాలు. అదీ ఆశ్చర్యకరమైన విషయం. అగ్రరాజ్యంగా, పెద్ద ప్రజాస్వామిక స్వేచ్ఛా దేశంగా గర్వించే అమెరికా పిల్లల హక్కుల్ని ఎందుకు ఆమోదించలేదు? పరిశీలించాలి.

పిల్లల హక్కుల్ని 192 దేశాలు ఆమోదించడం, చరిత్ర. ఇక మిగిలింది ఆయా దేశాల పార్లమెంటులు తగిన చట్టాలు చేయడం. తరువాత తల్లిదండ్రులకు త్వరగా యీ హక్కుల విషయం తెలియపరచి అమలుజరిగేటట్లు చూడడం. అక్కడే వుంది కీలకం అంతా.

పిల్లల హక్కులు ఏమి చెబుతున్నాయి?

తల్లిదండ్రులు ప్రధానపాత్ర వహించి పిల్లల హక్కుల్ని కాపాడాలి.

ఏమిటా హక్కులు? పిల్లల్ని హింసకు, దోపిడీకి, చాకిరీలకు, అమ్మకాలకు, అపహరణలకు దూరంగా వుంచాలి.

ఆడపిల్లలు, మగపిల్లలు అనే విచక్షణ చూపకుండా-సమానంగా పెంచాలి.

తగిన పోషకాహారం యివ్వాలి. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య చెప్పించాలి.

తగిన ఆరోగ్య సంరక్షణ చేయాలి.

స్వేచ్ఛగా పిల్లలు తమ భావాలు, అభిప్రాయాలు వెల్లడించే వీలు కల్పించాలి.

పిల్లలు విశ్రాంతిగా ఆడుతూ పాడుతూ కళలు, సంస్కృతి వికసింపజేసుకునే వీలు వుండాలి.

చదవడానికీ, వినడానికీ బాగా వున్నాయి. అందుకు అభ్యంతరం ఏముంది అని వెంటనే అనేస్తారు. అమలుపరచడంలో అడుగడుగునా చిక్కులున్నాయి!

పిల్లలకు హక్కులున్నాయనే సంగతి తల్లి దండ్రులకు నచ్చజెప్పడంలో గొప్ప యిబ్బంది

వుంది. మా పిల్లలు, మా యిష్టం, ఏమైనా చేసుకుంటాం, కొడతాం, తిడతాం, పెడతాం, పనిచేయిస్తాం మా యిష్టం వచ్చినట్లు దండం పెట్టిస్తాం అని తల్లిదండ్రులు అంటారు. మా పిల్లల్ని మా యిష్టం వచ్చినట్లు పెంచుకునే హక్కు లేదా అంటారు.

తల్లిదండ్రులకు నెమ్మదిగా నచ్చజెప్పడంలోనే పిల్లల హక్కుల సమస్య ఎదురౌతుంది.

పుట్టిన దగ్గరనుండి చనిపోయే వరకూ పరోక్షంగా, ప్రత్యక్షంగా అదుపుచేసే మతం వుంది. తల్లిదండ్రులు మత విశ్వాసంతో పెరిగి, అదే మంచిదనుకొని, తమ పిల్లలకూ తమ నమ్మకాలు, విశ్వాసాలు అంటగడతారు. పేరు పెట్టడం నుండి అనేక క్రతువులు, మతపరంగా సాగిస్తారు. ఇందులో పురోహితులు కీలకపాత్ర వహిస్తారు.

తల్లిదండ్రులు ఏ మతానికి, కులానికి, జాతికి, దేశానికి చెందిన వారైతే, అవే పిల్లలకు వంశపారంపర్య ఆస్తిగా అందిస్తారు. కనుక హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, యూదులు కొనసాగుతున్నారు. అలాగే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, కమ్మ, రెడ్డి, కాపు, మాల, మాదిగ కులాలు పిల్లలకు అంటుకుంటున్నాయి. ఇక్కడే పిల్లలకు స్వేచ్ఛ అవసరం, అదే కష్టమైన పని.

కొన్ని విషయాలు పెద్దల పరిధిలోనివి. సెక్స్, రాజకీయం అందుకు ఉదాహరణలు. పిల్లలకు అవి అవగాహన కావు. అందుకే పెళ్ళికి యుక్తవయస్సు రావాలన్నారు. రాజకీయంగా ఓటు హక్కుకు 18 ఏళ్ళు వుండాలన్నారు. అందుకు తల్లిదండ్రులకు అభ్యంతరం లేదు. చిన్న పిల్లలకు ఓటు కావాలని, లైంగిక చర్య కావాలని, పెళ్ళిళ్ళు కావాలని తల్లిదండ్రులు అనడం లేదు. అలాంటిదే మరొక పరిధి వుంది. అదే మతం, భక్తి విశ్వాసాలు పెద్దలకు సంబంధించిన నమ్మకం. పిల్లలు యుక్తవయస్సు వచ్చిన తరువాత వారిష్టమొచ్చిన మతాన్ని స్వీకరిస్తారు, లేదా నిరాకరిస్తారు. ఈ లోగా వారు తమ చదువులో విషయం తెలుసుకుంటారు. మూఢంగా నమ్మమనడానికీ, బడిలో అడిగి తెలుసుకోడానికీ చాలా తేడా వుంది. అడిగి తెలుసుకోవడం, పాఠాలలో శాస్త్రీయంగా మతాన్ని, సెక్స్‌ను, రాజకీయాల్ని గ్రహించడానికీ తేడావుంది.

ఈ విషయం చాలా దుర్లభమైంది. తల్లిదండ్రుల్ని ఒప్పించడం చాలా కష్టం. చిన్నప్పుడే బలవంతంగా ముస్లింలు తమ పిల్లల్ని మసీదులకు తీసుకెళ్ళి నిర్బంధంగా కొరాన్ అంతా వల్లెవేయిస్తున్నారు. క్రైస్తవులు దేవాలయాలలో బైబిల్ నూరిపోసి పిల్లలకు సండే స్కూల్స్ ద్వారా మూఢనమ్మకాలు నూరిపోస్తున్నారు. హిందువులు తమ పిల్లల పక్షాన మొక్కుబడులు చేసి, గుండ్లు కొట్టించి, వినాయకుడికి దండాలు పెట్టిస్తున్నారు. ఈ విధంగా అన్ని మతాల వారు చిన్న పిల్లల్ని ఆయా మతాల నమ్మకాలలో ముంచి తేల్చుతున్నారు. పిల్లల స్వేచ్ఛను అరికడుతున్నారు. ప్రశ్నించి తెలుసుకునే స్వభావాన్ని అణచిపెడుతున్నారు. భక్తి పేరిట భయం ప్రవేశపెడుతున్నారు. పాపం, నరకం, దైవం, దయ్యం అనే బూచి చూపి అన్వేషణ ఆపుతున్నారు.

చిన్న పిల్లల్ని వివిధ పనులకు వినియోగించడం మరొక చర్యగా వుంది. బడిలో చదవాల్సిన వయస్సులో పని చేయించి, వారి సంపాదన తల్లిదండ్రులు స్వీకరిస్తున్నారు. చిన్న పిల్లల్ని పరిశ్రమల్లో వినియోగించినప్పుడు, ఆ కర్మాగారాల ఉత్పత్తి స్వీకరించకూడదని కొన్ని ప్రజాస్వామిక దేశాలు ఆంక్షలు పెడుతున్నాయి. ఉదాహరణకు భారతదేశంలో చిన్న పిల్లల్ని తివాచీలు తయారుచేయడంలో, బాణాసంచా మందు సామగ్రి చేయడంలో, బీడీలు తయారుచేయడంలో వినియోగిస్తున్నారు. పిల్లల్ని తమ పెట్టుబడిగా వాడుకోవడం తల్లిదండ్రుల నేరం, కనడం అదుపులో పెట్టుకోమంటే, దేవుడిచ్చిన సంతానం అని సమాధానం సాకుగా చెబుతారు. అక్కడ కూడా మతాలు అడ్డొచ్చి, జనాభా అదుపును వ్యతిరేకిస్తూ, దైవం పేరిట, పవిత్ర గ్రంథాల పేరిట ద్రోహం చేస్తున్నాయి. కాలుష్యం పెంచడంలో మతాల పాత్ర చాలా వుంది. ఈ విషయంలోనూ తల్లిదండ్రులకు నచ్చజెప్పాల్సిందెంతో వుంది.

యుద్ధాలలో చిన్న పిల్లల్ని వాడడం మరో ఘోరచర్య. ఆఫ్ఘనిస్తాన్ మొదలు సోమాలియా వరకూ యుద్ధాలలో చిన్నపిల్లల్ని వాడారు. ఇంకా వాడుతున్నారు. మతం, దైవం పేరిట పిల్లలు సైతం దేశం కోసం, నాయకుడి కోసం త్యాగం చేయాలని బోధలు చేసారు. అనేక మంది పిల్లల్ని ఆహుతి చేశారు. ఈ విషయంలో ఏయే దేశాలలో ఎంతమంది పిల్లలు బలి అయిందీ సమితి వివరాలు ప్రచురించింది. అనేక చోట్ల మందుపాతర్లకు వికలాంగులుగావడం, చనిపోవడం కూడా నిరంతరం జరుగుతున్నది. మందు పాతర్లని తొలగించాలని తీర్మానించినా, ఈ ఉద్యమం కుంటుతూనే వుంది.

పిల్లలకు సైతం మతం పేరిట వైద్యం చేయకుండా, కేవలం ప్రార్థనతో చికిత్స సరిపోతుందనే నేరాలకు కొందరు పాల్పడుతున్నారు. క్రైస్తవ మతశాఖలు కనీసం 15 వరకూ యీ క్రూర చర్యను అమలుపరుస్తున్నాయి. దీనిపై అమెరికా, యూరోప్ దేశాలలో వుద్యమాలు సాగుతున్నాయి. మతహక్కు చాటున, పిల్లల రోగాలు వచ్చినట్లు చెప్పకుండా దాచిపెట్టి, చంపేసిన దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి. క్రిస్టియన్ సైన్స్, ఫెయిత్ అసెంబ్లీ, జెహోవా విట్నెస్, క్రీస్తు అసెంబ్లీ వంటి క్రైస్తవ శాఖలు యిలాంటి చర్యలకు పాల్పడుతున్నాయి. లోగడ భారత దేశంలో చిన్నపిల్లలకు రోగాలు వస్తే, మొక్కుకోవడం, కాల్చడం వంటి పిచ్చి వైద్యాలు చేసి ఆహుతి యిచ్చినట్లే, యివి కూడా సాగుతున్నాయి. ఇలాంటివి అన్ని మతాలలోనూ వున్నాయి. మదర్ తెరీసా వంటి వారు చిన్న పిల్లలకు మందులివ్వకుండా ప్రార్థనలతో సరిపెట్టిన సందర్భాలున్నాయి!

మతం పేరిట ప్రపంచ వ్యాప్తంగా మరో ఘోరం జరుగుతున్నట్లు సమితి ఇటీవల గుర్తించింది. మతం పేరు పెట్టకుండా సాంస్కృతిక దురాచారం అన్నారు. ఆడ పిల్లలకు సుంతీ చేయించడం యిందులో ఒకటి. కొన్ని ముస్లిం దేశాలు, కొన్ని ఆఫ్రికన్ దేశాలు యీ చర్య తప్పనిసరిగా చేస్తున్నాయి. బాలికల మర్మాంగం బుడుపును కోసేస్తారు. దీనివలన వాపులు, సెప్టిక్ అయి చనిపోవడం, సెక్స్ చర్యలో తీవ్ర ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. యునెస్కో

వారు, యీ చర్య జరిగినచోట ప్రథమచికిత్స కిట్స్ యిస్తున్నారు. అమెరికాలోని ముస్లింలు సైతం విదేశాలకు వెళ్ళి తమ ఆడపిల్లలకు సుంతీ చేయించుకొస్తున్నారు. అమెరికాలో ఆడపిల్లల సుంతీ నిషిద్ధం గనుక అలా చేస్తున్నారు.

ప్రపంచ మతాల సభను సమితి ఏర్పాటు చేసింది. పిల్లల విషయంలో జాగ్రత్త వహిస్తామని ఆయా మత ప్రతినిధులు అన్నారు. కాని మూల పవిత్రగ్రంథాలను ప్రశ్నించకుండా, మత మూల పురుషుల పెత్తనం తొలగించకుండా వున్నంత కాలం, పిల్లలపై అత్యాచారాలు, దూషణలు ఆపడం సాధ్యంకాదు. మతాలే పిల్లల హక్కుల్ని అమలుపరచనివ్వడం లేదు. మత గ్రంథాలలో పిల్లల్ని హింసించడాన్ని ఆమోదించారు. పిల్లల్ని బానిసలుగా చూడడాన్ని బైబిల్ ఆమోదించింది. అలాంటి మతాలు పిల్లల హక్కుల్ని అమలుపరచవు.

పిల్లల్ని ఎవరు ఎన్ని విధాల చిత్రహింసలకు గురి చేస్తున్నారనేది ఏకరవు పెడితే చాలా పెద్ద జాబితా అవుతుంది. ఏ మతం ఏ విధంగా పిల్లల్ని దారుణంగా అణచివేస్తున్నదీ పెద్ద జాబితాలోకి వస్తుంది. సమితి, యీ విషయం జాగ్రత్తగా గ్రహించి, హక్కుల పత్రం తయారుచేసింది. వీటిని ఆమోదించిన దేశాలు, తమ ప్రాంతంలో మతాల్ని జాగ్రత్తగా అదుపులో పెట్టి, పిల్లల్ని కాపాడాలి.

పుట్టిన పిల్లలందరూ పెరుగుతారు. ఎలా పెరుగుతున్నారనేది సమస్య. అక్కడే వారి హక్కుల ప్రస్తావన వస్తుంది. ఇందుకుగాను తల్లిదండ్రులకు చాలా చెప్పవలసి వుంది. పిల్లలహక్కులు అనేది చాలా మందికి వింతగా, కొత్తగా, ఆశ్చర్యంగా కనిపించవచ్చు. క్రమేణా, లోతుకు పోయే కొద్దీ అందులో శాస్త్రీయ సత్యం వుందని గ్రహిస్తారు. కొట్టి నోరు మూయించడం సులభం, నచ్చజెప్పడం, సందేహాలు తీర్చడం, ఓపెన్‌గా జవాబులివ్వడం, విసుక్కోకుండా సమాధానాలివ్వడం దుర్లభం.

ముఖ్యంగా పిల్లలకు అబద్ధాలు చెప్పకూడదు. తల్లిదండ్రులు చాలా సందర్భాలలో, క్రమశిక్షణ పేరిట, భయం పుట్టించే విషయాలు చెబుతారు. దేవుడికి దండం పెట్టకపోతే శిక్షలు పడతాయనీ, నరకానికి పోతారనీ, చీకట్లో రాక్షసులు, దయ్యాలు, భూతాలు వస్తాయనీ యిలాంటి వన్నీ తాత్కాలికంగా తల్లిదండ్రులకు ఉపకరించవచ్చు. కాని పిల్లలకు శాశ్వత హాని చేకూర్చుతాయి. దైవాన్ని గురించి పిల్లలు వేసే ప్రశ్నలకు చాలామంది తల్లిదండ్రులు తెలిసో తెలియకో ఆగ్రహిస్తారు, కొడతారు. అదే వారు చేస్తున్న పెద్ద తప్పు. అలాగే పిల్లలు తమ పుట్టుక గురించి అడిగినప్పుడు కూడా దేవుడు పుట్టించాడనీ, చనిపోయినప్పుడు దేవుడు దగ్గరకు వెళ్ళారనీ చెప్పి, అన్వేషణ చంపేస్తున్నారు. తల్లి దండ్రులకు యీ విషయమై చాలా చెప్పవలసివుంది. అక్కడే పిల్లల హక్కుల సమస్య వస్తుంది. ఇది ఒక విధంగా చిక్కులతో కూడినదైనా, తప్పనిసరిగా పరిష్కరించాలి.

పిల్లల హక్కులు గమనించనందున అనేక దారుణాలు జరిగిపోతున్నాయి. ప్రతి సంవత్సరం, సమితి అంచనా ప్రకారం ఒక కోటి ఇరవై ఐదు లక్షల మంది పిల్లలు చనిపోతున్నారు.

ఇందులో కనీసం 24 లక్షల మంది పిల్లల్ని రోగాలనుండి కాపాడడం సాధ్యమైనా, అశ్రద్ధ, అనాగరికత, అజ్ఞానం, అందుబాటులో వైద్యం లేక హతమౌతున్నారు. 40 లక్షల మంది పిల్లలకు శుభ్రమైన నీరు తాగే అవకాశం లేకుండా వెనుకబడిన దేశాలలో పెరుగుతున్నారు. ఆసియా దేశాలలో ఆరున్నర లక్షల మంది పిల్లలు వ్యభిచార వృత్తిలో వున్నట్లు అధికార లెక్కలు చూపుతున్నాయంటే, యీ సమస్య యింకెంత తీవ్రంగా వుందో గ్రహించవచ్చు. పెద్ద వాళ్ళ ఎయిడ్స్ వ్యాధులవలన, సెక్స్ అశ్రద్ధవలన చిన్న పిల్లలకు అవి సోకి హతమారుతున్నారు. 20 లక్షల మంది ఆడపిల్లల్ని సాలీనా "సుంతీ" ఘోరకృత్యానికి గురిచేస్తున్నారు. గత దశాబ్దంలో వివిధ యుద్ధాలలో చిన్నపిల్లల్ని వినియోగించి 20 లక్షల మందిని హతమార్చారు. 50 లక్షల మంది వికలాంగులుగా మారారు. కోటి మంది నిరాశ్రయులయ్యారు. మందుపాతర్ల వలన నిరంతరం పిల్లలు దారుణంగా బాధలకు, చావులకు గురౌతున్నారు.

ఈ విషయాలన్నీ ప్రపంచమతాల సభలు గుర్తించాయి. వీటిని అరికడతామని అంటున్నాయి. 1990లో ప్రిన్స్‌టన్ (అమెరికాలో) ప్రపంచ మత ప్రతినిధులు సమావేశమై పిల్లల హక్కుల్ని వెంటనే గుర్తించి అమలుపరచాలన్నారు. 1996లో మళ్ళీ యీ మత సంస్థలు తీర్మానాలు చేశాయి. 1993లో చికాగో నగరంలో 5 వేల మంది మత ప్రతినిధులు సమావేశమై చిన్న పిల్లల సంరక్షణ తక్షణ అవసరంగా పేర్కొన్నారు. దొంగ స్వయంగా ముందుకొచ్చి, "దొంగ, దొంగ" అని అరచి, తప్పించుకున్నట్లుగా, మతాలు ముందుకొచ్చి, చిన్న పిల్లల హక్కుల గురించి మొసలికన్నీరు కారుస్తున్నాయి. మతాలు చేస్తున్న ఘోరకృత్యాలు, మత గ్రంథాలలో పిల్లలకు వ్యతిరేకంగా వున్న దారుణాలు, మతాల పేరిట జరుగుతున్న చిన్న పిల్లల అత్యాచారాలు ఖండించ లేకపోతున్నారు.

మానవ హక్కులు కావాలని పోప్ అనడం ఎంత అపహాస్యమో, పిల్లల హక్కుల్ని గురించి మతాలు మాట్లాడడం అంతే.

పిల్లల హక్కుల గురించి బాగా ప్రచారం జరగాలి. ఇది మతేతరంగా సాగడం అవసరం.

యునిసెఫ్ సంస్థ పిల్లల హక్కుల కోసం చేస్తున్న కృషిని స్వచ్ఛంద సంస్థలు చేపట్టవచ్చు. టి.వి., రేడియో, పత్రికలు, మానవ హక్కుల సంఘాలు ప్రధాన పాత్ర వహించవచ్చు.

ప్రాథమిక పాఠశాల స్థాయి నుండీ పిల్లల హక్కుల గురించిన వివరాలు ఆకర్షణీయంగా రాసి పాఠాలుగా అందించాలి. ఉపాధ్యాయులు యీ హక్కుల పత్రాన్ని బాగా అధ్యయనం చేయాలి. టి.వి.లో చక్కని ప్రదర్శనలు డాక్యుమెంటరీల ద్వారా విపరీత ప్రసారాలు రావాలి.

మానవహక్కులలో భాగంగా పిల్లల హక్కులకు ప్రాధాన్యత వుందని గుర్తించాలి.

పిల్లలకు చెప్పవలసిన విషయాలలో సున్నితమైన పుట్టుక, పెరుగుదల గురించి ప్రామిథిస్ ప్రచురణ సంస్థ అమెరికాలో శాస్త్రీయ రచనలు వెలువరించింది.

లైంగికంగా చిన్న పిల్లలు వివిధ చిత్రహింసలకు గురైనప్పుడు వారిని ఎలా జాగ్రత్తగా చూడవలసిందీ పరిశోధన జరుగుతున్నది.

మనదేశంలో యీ విషయమై కప్పిపుచ్చడం చాలా ఎక్కువ. సమాజంలో యీ దురాచారాన్ని అరికట్టకపోతే పిల్లల భవిష్యత్తు బాగా దెబ్బతింటుంది. మనకు చాలా కాలంగా, గురుకులాలలో వున్న సెక్స్ దురాచారాలు, వివిధ రూపాలలో పొంచివుంది. దీనిని కూడా ఎదుర్కోవాలి.

పిల్లల హక్కుల విషయం 21వ శతాబ్దిలో అత్యంత ప్రాధాన్యత వహించేదిగా పరిణమించనున్నది. తల్లిదండ్రులకు యిది షాక్ ట్రీట్‌మెంట్. మతాలకు పునాదులు కదిల్చే పరిస్థితి.

*-మిసిమి మాసపత్రిక, ఆగస్టు-1999*

# చిన్నపిల్లలకు ఎలా చెప్పాలి?

పిల్లలకు చక్కగా విషయాలు చెప్పడం అంత సులభమేమి కాదు. అందుకు కృషి అవసరం. ఉపాధ్యాయులకు శిక్షణ ముఖ్యం.

మూఢ నమ్మకాలు చెప్పడం సులభం. ఆలోచించనక్కరలేదు. తర్కం, పరిశీలన, పరిశోధన అన్నీ శ్రమతో కూడిన పని. పిల్లల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, అటు తల్లిదండ్రులు, యిటు పెద్దలు, ఉపాధ్యాయులు అదిరించి బెదిరించి ఏవో చెప్పేస్తుంటారు. అందులో అబద్ధాలు, అసత్యాలు, అసంబద్ధాలు, అశాస్త్రీయాలు పుష్కలంగా వుంటాయి. అన్నింటికీ మించి గుడ్డి నమ్మకాలుంటాయి.

అవే పిల్లలకు హాని. పెద్దయినా చెరగని ముద్రవేస్తున్న యీ మూఢ నమ్మకాలకు భిన్నంగా పిల్లలకు చెప్పే పద్ధతుల కోసం మానవవాదులు, హేతువాదులు, నాస్తిక సంఘాలు కృషి చేస్తున్నాయి. తదనుగుణంగా పుస్తకాలు రాస్తున్నారు. ఇటీవల అమెరికాలో అలాంటి పుస్తకం వెలువడింది. పుస్తకం పేరు (Just Pretend - A Freethought Book for Children) డాన్ బార్కర్ దీని రచయిత. 72 పేజీల గ్రంథం ఆకర్షణీయ కార్టూను చిత్రాలతో అత్యంత అధునాతన శాస్త్రీయ దృక్పథంలో వుంది.

భారతదేశంలో దీనిని అనుసరించి ఉత్తమ రచనలు రూపొందించవచ్చు. ఆ పుస్తకం ఎలా సాగింది?

ఇద్దరు పిల్లలు మాట్లాడుకుంటారు. ప్రపంచంలో నీకు సరిగా పోలిన వారెవరూ లేరు అని ఒకరంటారు. (చేతిలో అద్దం వుంటుంది) నీవు ఒక ఆలోచనగల వ్యక్తివి. నీకు మెదడు వున్నది. అది ప్రత్యేకమైంది. మంచిచెడ్డలను నిజానిజాలను మెదడు చూపుతుంది.

నీవు చదివే పుస్తకం వెనుక ఒక కోటి రూపాయలున్నాయంటే, నమ్ముతావా? (ఒకబ్బాయి అడుగుతాడు) రెండో అబ్బాయి పుస్తకం వెనక్కుతిప్పిచూస్తాడు. కోటి రూపాయలు లేవు. కనుక నమ్మను. అంటాడు.

అయితే కథలలో, పురాణాలలో, గీతలో, వేదాలలో, ఇతిహాసాలలో ఇలాంటి నమ్మశక్యంగానివి ఎన్నో వింటుంటాం. అప్పుడేం చేయాలి?

అవన్నీ కథలుగా ఆనందించాలి. మరచిపోవాలి. నిజం అని నమ్మరాదు. పుస్తకం వెనక కోటిరూపాయలుండడం ఎంత కట్టుకథో, మిగిలిన గాథలు అంతే. కథలలోని విషయాలు నిజం అని నమ్మితే అది గుడ్డి నమ్మకం అవుతుంది.

ఎందరో దేవుళ్ళు, దేవతలు, పిశాచాలు కథల్లో వస్తాయి. అవన్నీ కథలు రాసినవారు ఊహించినవే. నిజంగా వున్నాయని నమ్మరాదు.

శంకరుడు ఏటా ఏదోక జంతువుపై వస్తాడంటారు. అదీ వూహే. క్రైస్తవులు శాంతాక్లాజ్ మిధ్యను నమ్మినట్లు! పిల్లల్ని భయపెట్టడానికి పెద్దలు కొన్ని కథలు అల్లుతారు. వినాయకుడికి దండం పెట్టకపోతే చదువురాదు అనేది అలాంటి నమ్మకాలలో ఒకటి. దేవుడి విగ్రహానికి కాలు తగిలితే కళ్ళుపోతాయంటారు. అదీ కథే.

ఎలా పుట్టాను నేను అని పిల్లలు అడిగితే, దేవుడు పుట్టించాడని చెప్పడం అబద్ధం. పిల్లలకు యింతకంటే అన్యాయం చేయడం మరొకటి లేదు. ఇప్పుడు అనేక దేశాలలో శాస్త్రీయంగానే ఆకర్షణీయంగా సులభంగా చెబుతున్నారు. అమెరికాలో ప్రామిథిస్ ప్రచురణకర్తలు యీ విషయమై చక్కని పుస్తకం ప్రచురించారు. పిల్లలకు దాచిపెట్టడంలో వుండే యిబ్బంది కన్నా, విప్పి చెప్పడంలో ఉపయోగం ఎక్కువ.

చాలామంది దేవుణ్ణి నమ్ముతారు. తినేముందు పడుకోబోయే ముందు పరీక్షలు ముందు దేవుడికి దండం పెట్టుకోమని పిల్లలకు చెబుతారు. దేవుడు అంటే ఏమిటో తెలియకుండానే పిల్లలు ఆ పని చేస్తుంటారు. అదొక అలవాటుగా మారిపోతుంది.

అడిగిన వరాలన్నీ దేవుడు యిస్తాడని పిల్లలకు చెబుతారు. దేవుడి గురించి చిన్నప్పటి నుండీ రకరకాలుగా యిలా తల్లిదండ్రులు నూరిపోయడం వలన చాలా హాని జరుగుతున్నది. ముఖ్యంగా పిల్లల్లో అడిగితెలుసుకునే జిజ్ఞాస చచ్చిపోతుంది. ప్రశ్నిస్తే తప్పు అని దేవుడి విషయంలో భయం కల్పిస్తున్నారు. పిల్లలకు దేవుడి విషయం చెప్పాలి. కాని నిజం చెప్పాలి.

దేవుళ్ళు అనేకం అనేక చోట్ల వున్నారని చెప్పాలి. ప్రాచీనకాలం నుండి నేటివరకు దేవుళ్ళు పుడుతూనే వున్నారని చెప్పాలి. ముస్లింలు అల్లాను, క్రైస్తవులు జీసస్‌ను, బౌద్ధులు బుద్ధుడిని, ఇలా అనేక మతాలు తమ దేవుళ్ళను సృష్టించుకున్నాయని చెప్పాలి. వీటికి భిన్నంగా భారతదేశంలో లక్షల సంఖ్యలో హిందూ దేవుళ్ళు దేవతలు వున్నారు. ఇందులో స్త్రీలు,

పురుషులు, జంతువులు, ప్రకృతి శక్తులు వున్నాయని చెప్పాలి. విగ్రహాలుగా, పటాలుగా దేవుళ్ళను గుడిలో దేవాలయంలో, మసీదులో (రాత పూర్వకంగా) దేవుళ్ళను పెట్టారు.

ఇవన్నీ ఎవరు చేశారు. మనుషులు.

కనుక దేవుడిని సృష్టించింది, కనిపెట్టింది. ఎవరు? మనుషులే.

సృష్టికర్త ఎవరు? మనిషి.

అందుకే మనుషుల తీరులో దేవుళ్ళు కనిపిస్తారు. ఇది చెప్పాలి.

పిల్లలు ప్రశ్నలు వేస్తారు. ఓపికగా చెప్పాలి. తెలియని వాటికి బుకాయింపు, అబద్ధం సమాధానం కాదు. తెలుసుకుందాం అనాలి.

అన్నిటినీ దేవుడు సృష్టించాడంటే, దేవుడిని ఎవరు పుట్టించారనే ప్రశ్న సహజమైనది. అందుకు జవాబు కన్నెర్ర చేయడంకాదు. దేవుడి పుట్టుపూర్వోత్తరాలు విడమరచి చెప్పడమే. పవిత్ర గ్రంథాలలో విడ్డూరపు కథల్ని పిల్లలకు కథలుగానే చెప్పాలి. పరమసత్యాలుగా నమ్మించరాదు.

పవిత్రగ్రంథాలలో జంతువులు మాట్లాడతాయి. అది కథ : పవిత్ర గ్రంథాలలో మగవాడి పక్కఎముక నుండి ఆడదాన్ని దేవుడు పుట్టిస్తాడు. అది కథ : అలాంటి కథల్ని వినోదంగా ఆనందించాలి. పిల్లలకు అలాగే చెప్పాలి.

ప్రవక్తలు చేసిన పాపకృత్యాలు, తప్పుడుపనులు, రుషులు చేసిన వ్యభిచారం అన్నీ దేవుడి ప్రేరణగా చెప్పి తప్పుకున్నారు. జనాన్ని నమ్మించడానికి అది పెద్ద ఎత్తుగడ.

ఏదైనా రుజువుకు నిలబడాలి. లేకుంటే నిరాకరించాలి.

పిల్లలకు శాస్త్రీయపంథా అలవాటు చేయాలి. ప్రవక్త, రుషి, మహాత్మ, బాబాలు చెప్పేది ప్రశ్నించవచ్చు. రుజువు చేయమనవచ్చు. పిల్లల్లో అలాంటి ధోరణి అవసరం.

ప్రార్థన చేస్తే రోగాలు తగ్గుతాయని భక్తులు ప్రచారం చేస్తారు. పిల్లలను వైద్యం లేకుండా చంపుతున్న సంఘటనలున్నాయి.

ప్రార్థన చేస్తే ఎవరూ పలకరు. ఎవరికీ వినిపించదు. ప్రార్థన అంటే, అవతలివైపు ఎవరూ లేకున్నా ఫోనులో వారితో మాట్లాడినట్లు! ఇది వృథా. పిల్లలకు యిది చెప్పాలి.

ఇలా శాస్త్రీయంగా చెబితే పిల్లలు అభివృద్ధి చెందుతారు.

ఈ విషయాలను చక్కగా కార్టూనుల ద్వారా అందించాలి.

*- హేతువాది, డిశంబరు 1999*

# పిల్లలకూ హక్కులున్నాయి! అమలుపరిచేది ఎవరు?

పిల్లలకు ఓటుహక్కులేదు.

ఎందుకని?

సమాజం, ప్రతినిధులు, పరిపాలన, రాజకీయం ప్రాతినిధ్యం తెలుసుకోడానికి యుక్తవయస్సు రావాలి. ఈలోగా అవన్నీ బడిలో, బయటా తెలుసుకోవచ్చు. ఇది ప్రపంచ వ్యాప్తంగా అంగీకరించిన విషయం.

పిల్లలు పెళ్ళిచేసుకోరాదు.

ఎందుకు?

సంసారం, దాంపత్యం, సెక్స్, సంతానం మొదలైన విషయాలు అవగాహన కావడానికి తగిన తరుణం కావాలి. వీటిని పాఠాల్లో, పెద్దల ద్వారా గ్రహించవచ్చు. కనుక పిల్లల పెళ్ళిళ్ళు నిషేధించారు. ఇంకా చెదురుమదురుగా వున్నా, మొత్తం మీద బాల్యవివాహాలు కూడదని అందరూ ఒప్పుకుంటున్నారు.

పైవాటికి చెందిన మరో అంశం వుంది. పిల్లలకు మూఢనమ్మకాలు, అలౌకిక విశ్వాసాలు అవగాహనకు రావు. అవి పెద్దల పరిధిలోనివి. కనుక వాటిని పిల్లలపై తెలిసో తెలియకో రుద్దకూడదు.

పిల్లలకు హక్కులున్నాయంటే చాలాకాలం నవ్వారు. "నాలుగు వడ్డించి చెప్పి చేయించాలి గాని పిల్లలకు స్వేచ్ఛ, హక్కులు ఏమిటి?" అన్నారు.

రానురాను ప్రపంచంలో అన్ని దేశాల వారు పిల్లల సంగతులు పట్టించుకున్నారు. దీని ఫలితంగా 1989లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ పిల్లల హక్కుల పత్రం ఆమోదించింది. ఆ విషయాలను వివిధ దేశాలు తమ చట్టాలతో అమలుపరచాలి.

కాని ఇంతవరకు అలాంటి ప్రపంచ చట్టం వున్నదని ఎక్కువ మందికి తెలియదు. బడుల్లో జాతీయగీతం వలె, పిల్లలహక్కుల పత్రాన్ని పాఠ్యాంశంగా చెప్పడం మొదలుపెట్టాలి.

పిల్లల హక్కుల్ని ఒప్పుకోవడం ఒక పట్టాన తల్లిదండ్రులకు యిష్టమైన అంశం కాదు. విషయం తెలియకనే అలా ప్రవర్తిస్తారు.

మా పిల్లలు, మేం కొడతాం తిడతాం. కాదనడానికి మీరెవరు? అనే ధోరణి అత్యధిక సంఖ్యాక తల్లిదండ్రులలో వుంటుంది.

పిల్లలు కూడా వ్యక్తిత్వం గలవారనీ, వారి మానసిక పరిణతికి స్వేచ్ఛగా నేర్చుకునే వాతావరణం, ప్రశ్నించే అవకాశం వుండాలనేది వైజ్ఞానిక దృక్పథం.

ప్రశ్న వేస్తే, అలా అడగకూడదు, కళ్ళు పోతాయి అనే తల్లిదండ్రులు పిల్లల పట్ల ద్రోహం చేస్తున్నారనేది సారాంశం. కొన్ని ప్రశ్నలు యిబ్బంది పెడతాయి. సమాధానాలు తల్లిదండ్రులకు తెలియకపోవచ్చు. కనుక పిల్లల నోరుమూయించడం భయపెట్టడం కొట్టడం మార్గాంతరం కాదు.

చిన్నప్పుడు అలా జిజ్ఞాసను అణచివేస్తే పెద్ద అయిన తరువాత, సైంటిస్ట్‌కు సైతం మనోవికాసం వుండదు.

హక్కులు పిల్లలకు వున్నాయని ఇన్నాళ్ళు తెలియకపోవడం తప్పుకాదు. తెలిసిన తరువాత అమలు చేయకపోవడం పిల్లలపట్ల అపచారం.

పాఠాల్లో పిల్లల హక్కులు ప్రచురించి ప్రచారంలోకి తేవడం కనీస కర్తవ్యం. తదనుగుణంగా మీడియా ప్రసారాలు స్పందించడం అవసరం. ఇందుకు పిల్లల పట్ల పెద్దలకు గల మానసిక గూడు తొలగించాలన్న మాట.

*- జనబలం, 7 జూలై, 2002*

# అపూర్వ అన్వేషణా కేంద్రం

నయాగరా వద్ద "సెంటర్ ఫర్ ఇంక్వయిరీ" అనే పేరిట యీ ప్రపంచ అన్వేషణా కేంద్రం నెలకొన్నది. ఇతర యాత్రాస్థలాల వంటిది కాదు. ఇక్కడ ప్రశ్నలకు సమాధానాలు వస్తాయి. కొత్త ప్రశ్నలు, సందేహాలు తలెత్తుతాయి.

ఇక్కడ ప్రపంచం మొత్తం మీద ఇంగ్లీషులో ప్రచురించిన హేతువాద, మానవవాద, సందేహవాద, నాస్తికవాద జిజ్ఞాస గ్రంథాలన్నీ కలిపి ఒక గ్రంథాలయంగా ఏర్పరచారు. ఇంకా సేకరణ సాగుతున్నది. క్రమేణా స్పానిష్, ఫ్రెంచి తదితర భాషలకు సైతం యీ సేకరణ విస్తరిస్తారు. పుస్తకాలేగాక, వివిధ పత్రికలు కూడా పాతవి ఇక్కడ భద్రపరుస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా జనాన్ని రకరకాలుగా మోసం చేయడం, వారిని మాయచేసి డబ్బు రాబట్టడం, మూఢనమ్మకాలను స్థిరపరచడం, వ్యాధులను నయం చేస్తామనడం, అతీంద్రియ శక్తుల బూచి చూపడం తెలిసినదే. ఒక్కమాటలో అదంతా బూటకం అని కొట్టిపారెయ్యకుండా, అన్ని రంగాల నిపుణులతో సంఘాలు ఏర్పరచారు. ప్రపంచంలో ఏ మూల ఇందుకు సంబంధించిన సమాచారం లభించినా స్వీకరిస్తారు. నిజానిజాలు నిగ్గు తేలుస్తారు. ఇందులో మొదటి సంఘం జ్యోతిష్యానికి చెందింది. ఇ.డబ్లు. కెల్లీ ఈ సంఘాధ్యక్షుడు. జ్యోతిష్యాన్ని శాస్త్రీయంగా పరిశీలించడం, వారు చెప్పేది ఎంతవరకు నిలబడుతుందో? ప్రపంచానికి చెప్పడం వీరి ఉద్దేశం. ఎక్కడ, ఎవరు సత్యమని చెప్పినా, అందుకు శాస్త్రీయాధారాలు చూస్తారు. పరీక్షకు నిలిస్తే ఒప్పుకున్నట్లు లోకానికి చాటి చెబుతారు. లేకుంటే లేదంటారు.

## పత్రికలు, టి.వి.పై కన్ను :

పత్రికలు, సమాచార కేంద్రాలు ప్రజల్ని విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. రేడియో, టి.వి., పత్రికలు ఈ కోవకు చెందుతాయి. వీటిని నిత్యమూ ఒక కంట కనిపెడుతూ, అవి చెప్పేవాటిలో అబద్ధాలు వుంటే బయటకు చెప్పడం యీ సంఘం ప్రధాన ఉద్దేశం. అంతేగాక అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేయడానికి వెనుక గాథ ఏమిటో తెలుసుకుంటారు. సినీతారలు, మతప్రచారకులు, రాజకీయ నాయకుల వలన కొన్ని మూఢనమ్మకాలు ఎలా వ్యాపించాయో గ్రహిస్తున్నారు. ఇది కూడా నిరంతర కృషిగా సాగే కార్యక్రమం. ఈ సంఘానికి ఎటిన్‌సి. రైయస్ అధ్యక్షులుగా వున్నారు.

## ఆరోగ్యం-అతీంద్రియ శక్తులు :

ఆరోగ్యం పేరిట అనేక చికిత్సా విధానాలు జనాన్ని ఆకర్షించి, సొమ్ము చేసుకుంటున్నాయి. ఆధునిక శాస్త్రీయ వైద్యానికి మార్గాంతరంగా వీరు గొప్పలు చెప్పుకుంటున్నారు. నిజంగా వీరి చికిత్సలో పసవుందా? ఎంతవరకు అది నిలుస్తుంది? ఏ మేరకు శాస్త్రీయం అని చూడడానికి మరొక సంఘాన్ని నియమించారు. విలియం జార్విస్ అధ్యక్షతన ఈ సంఘం పనిచేస్తున్నది.

అతీంద్రియ శక్తుల విషయమై కొన్ని యూనివర్సిటీలలో సైతం విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. జనం ఈ మోజులో పడిపోతున్నారు. కనుక యీ రంగాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి దేహైమన్ అధ్యక్షతన సంఘం ఏర్పరచారు. వీరు పేరాసైకాలజీ విషయాలన్నీ చూస్తారు.

ఇతర లోకాల నుండి ఎగిరే పళ్ళాలపై వింత మనుషులు రావడం, కొందరిని తీసుకెళ్ళడం, తిరిగి పంపడం, ఇలాంటి విషయాలు అర్ధశతాబ్ధంగా వ్యాప్తిలో వున్నాయి. దీనిపై విపరీత రచనలు వచ్చాయి. దీని నిజానిజాలు తేల్చుకోవడానికి ఫిలిప్ జే. క్లాజ్ అధ్యక్షతన ఒక సంఘం ఏర్పరచారు.

## మతాల అధ్యయనం :

ప్రపంచంలో ఎన్నో మతాలు వున్నాయి. వాటిని గుడ్డిగా అనుసరించేవారు, మతాలు మార్చుకునేవారు. ఒక మతం కంటె మరొకటి మిన్న అనేవారు, కొత్తమతాల్ని స్థాపించేవారూ ఉన్నారు. మతాల్ని గుడ్డిగా వ్యతిరేకించేవారూ వున్నారు. అలాగాక మతాలన్నిటినీ శాస్త్రీయంగా పరిశీలించడానికి హెక్టర్ అవలోస్ అధ్యక్షతన ఒక సంఘం ఏర్పరచారు. మతం పేరిట జరిగే వాటిని వీరు పరిశీలిస్తారు. మత గ్రంథాలను చూస్తారు. హిందూ, క్రైస్తవ, యూదు, ఇస్లాం, బౌద్ధం వంటి వాటి మూలగ్రంథాలను, ఆచారాలను శాస్త్రీయంగా పరిశీలిస్తారు. ఇస్లాంను అధ్యయనం చేయడానికి ఇబ్నువారక్‌ను ప్రత్యేకంగా యీ సంఘంలో చేర్చుకున్నారు. ఇస్లాంపై శాస్త్రీయ పరిశీలన అంతగా జరగనందున, ఆ లోపాన్ని పూరిస్తారు.

అన్వేషణా కేంద్రం ప్రపంచ సంస్థ అనడానికి కారణం వుంది. అనేక దేశాలలో ఈ సంస్థకు శాఖలు, ప్రతినిధులు వున్నారు. మనదేశంలో ఢిల్లీ, బొంబాయి, మద్రాసులలో ఈ కేంద్ర ప్రతినిధులు వున్నారు. చైనా, రష్యా, జపాన్, ఇటలీ, ఈజిప్టు, హంగరీ, జర్మనీ, స్పెయిన్, దక్షిణాఫ్రికా, తైవాన్, ఫిన్లాండ్, కెనడా, బెల్జియం, జకొస్లావేకియా, ఇజ్రాయిల్, ఐర్లండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, అర్జంటీనా, ఇంగ్లండ్, స్వీడన్, నార్వే, న్యూజిలాండ్, మెక్సికో, నెదర్లాండ్స్‌తో సహా మరికొన్ని దేశాలలో ప్రతినిధులు వున్నారు. ఆయా రంగాలలో జరిగే విషయాలు కేంద్రానికి తెలియపరచడం, ఎక్కడికక్కడ అద్భుతాలను, అతీంద్రియ విషయాలను, అపురూప చికిత్సలను పరిశీలించి, ఏ మేరకు శాస్త్రీయమో చూడడం వీరి ప్రధాన లక్ష్యం. ఇదొక బృహత్తర పథకం. ఎవరైనా ఆయా రంగాలలో సమాచారాన్ని అందిస్తే స్వీకరిస్తారు.

## రెండు పత్రికలు :

అన్వేషణా కేంద్రం ఎప్పటికప్పుడు అధ్యయన శిబిరాలు, గోష్టులు, చర్చలు నిర్వహిస్తుంటుంది. ఈ కేంద్రం రెండు పత్రికలు ప్రచురిస్తున్నది. ఒకటి ఫ్రీ ఇంక్వైరీ. ఇందులో భావాల బలం తేల్చడం ప్రధానం. ఏ విషయమూ చర్చకు అనర్హం కాదు. ఏ భావమూ పవిత్రమైనది కాదు. ఏదీ అంటరానిది కాదు. అన్నిటినీ రాపాడించి, శాస్త్రీయ పరిశీలనకు, మానవ హక్కులకు సరిపడుతుందా అనే దృష్టికి కొలమానంగా గ్రహిస్తారు.

మరో పత్రిక స్కెప్టికల్ ఇంక్వైరర్. ఇందులో అన్నిటినీ సందేహించి, ప్రశ్నించి, ఆధారాలకు నిలబడితేనే సరైనదని చెబుతారు. వినాయకుడి విగ్రహం పాలు తాగుతుందంటే ఎంతవరకు నిజం. అసలు కథ ఏమిటి? అని చూస్తారు. మేరీమాత కంట తడిపెడుతుంటే విగ్రహం పరిశీలించి, లోన ఏర్పాట్లు చూస్తారు. ఉన్నది ఉన్నట్లు జనానికి చెబుతారు. స్వస్థత కూటములలో ప్రార్థనతో అద్భుతంగా రోగాలు నయమవుతున్నాయని అంటే ఆ విషయాలను గ్రహించి పరిశీలిస్తారు. లోగడ జేమ్సురాండీ యిలాంటివాటి వెనుక వున్న అసలు విషయాలను బయటపెట్టాడు. ఆయన కూడా యీ సంస్థకు చెందినవాడే. చూపుతోనే చెంచాలు వంచడం, భవిష్యత్తు చెప్పడం మొదలైనవన్నీ వీరి పరిశీలనలోకి వస్తాయి. అందుకే యీ కేంద్రం విశిష్టమైనది. దీనిని సందర్శించడం యాత్రలో భాగంగా పెట్టుకోవాలి.

పాల్‌కర్జ్ యీ అన్వేషణా కేంద్ర స్థాపకులలో మూలపురుషుడు. న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీలో ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా రిటైరై ఆయన యీ కృషి చేబట్టాడు. తన ధనాన్ని కేంద్రస్థాపనకు ఇచ్చి మిగిలినది వసూలుచేసి పెద్ద భవనం నిర్మించారు. ప్రపంచమంతటా పర్యటించారు.

పాల్‌కర్జ్ మనదేశంలో కూడా పర్యటించారు. ఇటీవల చైనా కూడా వెళ్ళారు. అరబ్బు దేశాలలో శాస్త్రీయ పరిశీలనా సంఘాలు పెట్టడానికి తిప్పలు పడుతున్నారు.

అన్వేషణా కేంద్రంవారు ఇటీవల ఇంగర్‌సాల్ మ్యూజియమ్‌ను కూడా ఏర్పరిచారు. క్రైస్తవమతాన్ని, బైబిల్‌ను నిశిత విమర్శకు గురిచేసిన ఆర్.జి. ఇంగర్‌సాల్ మ్యూజియమ్ డ్రెస్డన్‌లో ప్రారంభించారు. ఇది న్యూయార్క్ రాష్ట్రంలో రోచస్టర్ దగ్గర వుంది.

ప్రామిథియస్ ప్రచురణలు ఈ కేంద్రానికి జీవగర్ర. వివిధ రంగాలలో శాస్త్రీయ కృషిని వీరు ప్రచురణల ద్వారా వెలికితీస్తుంటారు. ప్రచురించడానికి ఇతరులు వెనుకాడినవాటిని, శాస్త్రీయమని ఆధారాలుంటే, ఈ సంస్థ అచ్చేస్తుంది. అందుకే ప్రామిథియస్‌కు పేరు లభించింది.

ఏ భావాన్ని మతాన్ని అభిప్రాయాన్ని ముందుగా ఈ కేంద్రం తృణీకరించదు. శాస్త్రీయ పరిశీలనకు గురిచేయడం ఇందలి ప్రధానాంశం.

ఇకముందు అమెరికా సందర్శించేవారు సెంటర్ ఫర్ ఇంక్వయిరీని తప్పకుండా చూడాలి. న్యూయార్క్ స్టేట్ యూనివర్శిటీ పక్కనే బఫెలో నగరంలో ఇది వుంది. అక్కడకు వెళ్ళలేనివారు అనుబంధ కేంద్రాలతో సంబంధం పెట్టుకుని విషయాలు తెలుసుకోవచ్చు. అమెరికా వెళ్ళినవారు ఈ కేంద్రానికి ఉచితంగా ఫోను చేయవచ్చు. 1-800 - 634-1610 వీరి నెంబరు. వెళ్లదలచుకున్నవారు ఆమ్‌హెర్స్ట్, న్యూయార్క్ 14226-0703కు వెళ్ళవచ్చు. ("వార్త" సౌజన్యంతో)

*- హేతువాది, ఆగస్టు, సెప్టెంబరు 1997*

# మూఢనమ్మకాలు

అష్టగ్రహ కూటమి జరుగుతుంది గనుక అందరూ అరుణాచల ఆశ్రమానికి రండి. లేకుంటే హతమారిపోతారని సుప్రసిద్ధ రచయిత చలం మిత్రులకు ఉత్తరాలు రాశాడు. ఇంకేముంది? మూటాముల్లె కట్టుకొని కొందరు వెళ్లిపోయారు. 1962 నాటి సంగతి. కాని ఏమీ జరగలేదు.

నీవు పదవిలో పూర్తికాలం కొనసాగుతావని ముఖ్యమంత్రిగా వున్న డా॥ మర్రి చెన్నారెడ్డికి 1990 చివరలో జ్యోతిష్యులు దీవించి చెప్పారు. నెల తిరగక ముందే ఆయన పదవి కోల్పోయారు.

1991 మార్చిలో ముఖ్యమంత్రి పదవి కోల్పోతారని యిటీవల తిరుపతిలో సమావేశమైన జ్యోతిష్యులు ప్రకటించారు. భావ స్వాతంత్ర్యం ఉంది కనుక వారి స్వేచ్ఛను అలా వాడుకోనివ్వండి అని ముఖ్యమంత్రి జనార్ధనరెడ్డిగారు అన్నారు.

ఈ విధంగా ఎందరికో ఎన్నో చెబుతూ జ్యోతిష్యులు నమ్మిస్తున్నారు. నిజం కాకుంటే కర్మ అనుకుని జనం సర్దుకు పోతున్నారు. ఈలోగా ఏదో జరుగుతుందనీ, శాంతి చేయించేవారు, ఖర్చున పడుతున్నవారు లేకపోలేదు.

ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులు జ్యోతిష్యంలో నిజం వున్నదేమోనని పరిశీలించారు. కాని రుజువులకు, శాస్త్రీయ పద్ధతికి ఎక్కడా జ్యోతిష్యం నిలవడం లేదు.

పత్రికలలో కూడా వారఫలాలు, దినఫలాలు పేరిట రాస్తున్న వాటిని చదువుకొని, నిజమేనని నమ్మి మోసపోతున్నారు. సుప్రసిద్ధ సైంటిస్టు, ఖగోళ శాస్త్రజ్ఞుడు కారల్‌సాగన్ జ్యోతిష్యం మోసపూరిత భ్రమ అని స్పష్టంగా ప్రకటించారు. అమెరికాలో అలౌకిక శక్తుల్ని పరిశోధిస్తున్న సంఘంవారు పత్రికలకు రాస్తూ, వారఫలాలు, దినఫలాల అడుగున "ఇది కేవలం వినోదం నిమిత్తం ఉద్దేశించామని" ప్రకటించమని కోరారు. కొన్ని పత్రికలు అసలే జ్యోతిష్యాన్ని మానేశాయి.

మనదేశంలో జ్యోతిష్యులు ఆధారపడే నవగ్రహాలు వాస్తవంగా లేవు. రాహువు, కేతువు లనేవి కేవలం నీడలు అని తెలుసుకున్నారు. చంద్రుడు మాత్రం భూమికి ఉపగ్రహంగా గ్రహించారు. నక్షత్రంగా స్వయంప్రకాశం గల సూర్యుడిని కూడా మనవాళ్ళు గ్రహాలలో చేర్చారు. ఏ గ్రహానికి స్వయంగా వెలిగే శక్తి లేదు.

నెప్ట్యూన్, యురేనస్, ప్లూటో అనే గ్రహాలు కనిపెట్టారు. కాని అవి భారతీయ జ్యోతిష్యంలో చేర్చలేదు. వాటి ప్రభావం ఏమౌతుంది?

సూర్యుడి నుండి 8 నిమిషాలకు కిరణాలు భూమి మీదకు వస్తాయి. ఇందులో ఏ కిరణం ఆధారంగా పుట్టుకను నిర్ణయిస్తారు.

మన జ్యోతిష్యం ఆధారాలు లేని మూఢనమ్మకం. ఇది ఆచారంగా వస్తున్నది. పరిశోధన జరగలేదు.

మన శక్తిపై మనకు విశ్వాసం లేనప్పుడు ఇతరులు చెప్పే జ్యోతిష్యంపై ఆధారపడతాం. ఇది మనల్ని కృంగదీస్తుంది. మానసిక వికాసాన్ని అరికడుతుంది. ప్రశ్నించే తత్వాన్ని నిరుత్సాహపరుస్తుంది. ఖగోళశాస్త్రం ఏనాడో జ్యోతిష్యాన్ని అటకపై పెట్టి, మానవుల్ని ముందుకు తీసుకపోయింది.

మనదేశంలో అభివృద్ధి కుంటుతుండడానికి జ్యోతిష్యం వంటి మూఢనమ్మకాలే ప్రధాన కారణం. అబ్రహం కోవూరు వంటివారు జ్యోతిష్యుల్ని ప్రశ్నిస్తూ అనేక సందర్భాలలో రుజువుకై నిలబడమన్నారు. కాని ఎవరూ ముందుకు రాలేదు.

జ్యోతిష్యులు చెప్పే రాశిచక్రాలకు శాస్త్రీయాధారాలేవీ లేవు. విద్యుదయస్కాంతం, గురుత్వాకర్షణ, న్యూక్లియర్ శక్తులు కనుగొన్నారు. వీటి ప్రభావం జనంపై ఎలా వుంటుంది అనేది జ్యోతిష్యానికి బొత్తిగా తెలియదు. పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం అని సిగరెట్టు పెట్టెలపై వేస్తున్నారు. అయినా కొందరు తెలిసే పొగ పీల్చేస్తున్నారు. అలాగే జ్యోతిష్యం శాస్త్రీయం కాదు. కేవలం వినోదం మాత్రమేనని ప్రకటిస్తే - అయినా సరే నమ్ముతాం అనే వాళ్ళను నమ్మనివ్వండి.

యూంగ్, ఐసెంక్, న్యూటన్, కెప్లర్ వంటి శాస్త్రజ్ఞులు జ్యోతిష్యంలో ఆసక్తి చూపి ప్రయోగాలు చేసి, శాస్త్రీయమని రుజువు చేయలేకపోయారు.

అనేక మంది నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రజ్ఞులు జ్యోతిష్యాన్ని ఖండిస్తూ ప్రకటించి, ఇది అశాస్త్రీయమని చెప్పారు.

*- హేతువాది, నవంబరు 1991*

# రాజకీయాల్లో కులం : హేతువాదు లేమంటారు?

ఎక్కడ చూచినా కులం, తప్పించుకోడానికి వీల్లేని తీరులో కులం, పుట్టినదగ్గర నుండీ చనిపోయేవరకూ కులం. దీన్ని గురించి హేతువాదులు మాట్లాడరా? అని ప్రశ్న ఉదయిస్తున్నది.

సమాజం ఎదుర్కొంటున్న ఏ సమస్యనుండీ హేతువాదులు పారిపోరు. నిశితంగా, శాస్త్రీయంగా పరిశీలిస్తారు. పరిష్కారాలు సూచిస్తారు. అవి చేదుగా వుండొచ్చు, ఎదురీత కావచ్చు. అబద్ధాల వేట హేతువాదులకు అలవాటే. కులం విషయంలోనూ అంతే.

కులసమస్య కొన్ని వేల సంవత్సరాలుగా వుంది. ఇప్పుడు కొత్తగా చెప్పేదేమిటి? అని అడగొచ్చు. బ్రిటిష్‌వారి పాలన నుండీ కులానికి కొత్త అంటురోగం వచ్చింది. రాజకీయాల్లో, పరిపాలనలో కులం ప్రవేశించింది. ప్రజలందరికీ కావలసిన రంగంలో కీలకవ్యక్తులు వుంటూ కులాన్ని పాటిస్తే ప్రమాదకర పరిణామాలు వస్తున్నాయి. కనుక రాజకీయాల్లో కులం గురించి విప్పి చెప్పవలసి వస్తున్నది.

కులం మనదేశానికి ప్రత్యేక లక్షణం. హిందూమతానికి పుట్టిన విషపుత్రిక కులం. దీని కవల పిల్లే అంటరానితనం. మానవ హక్కులకు, మానవ సమానత్వానికీ, గౌరవానికీ, ఏ మాత్రం విలువ యివ్వకుండా పుట్టిన కులాన్ని మతపరంగా కట్టుదిట్టం చేసినందున అది వ్యాపించి, ఘోర పరిణామాలకు దారితీసింది.

వేదాలలోని "పురుషసూక్తం"లోనే వర్ణ విభజన ప్రస్తావించారు. ఆ తరువాత వర్ణవ్యవస్థ "గీత"లో స్పష్టంగా చెప్పి, నేనే నాలుగు వర్ణాల్ని సృష్టించానని కృష్ణుడు చెప్పాడు. ధర్మశాస్త్రాలన్నీ వర్ణవ్యవస్థను ఎలా పాటించాలో వివరంగా పేర్కొన్నాయి. హిందువులు పవిత్ర గ్రంథాలుగా పేర్కొన్న గ్రంథాలలో యిలా వచ్చిన వర్ణ వ్యవస్థను ఆర్యసమాజ్ వారు సమర్థిస్తూ, వేదాలలో పేర్కొన్న వర్ణ వ్యవస్థ కులం కాదని భాష్యం చెప్పారు. అంబేద్కర్ సుదీర్ఘంగా చూచి వర్ణవ్యవస్థే కులం అని నిగ్గు తేల్చారు.

"వివేకచూడామణి"లో ఆదిశంకరాచార్యులు కుల ప్రస్తావన తెచ్చి, అన్ని జన్మలలో మానవజన్మ ఉత్తమమైతే బ్రాహ్మణజన్మ మరీ ఉత్తమమనీ అందులోనూ వైదికుల స్థాయి అత్యున్నతమనీ అన్నారు.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు కులాల్లో అనేక పిల్ల పూడలు బయలుదేరి బలపడ్డాయి. ఈ నాలుగు కులాలకూ దూరంగా అంటరానివారనే కులాన్ని అమానుషంగా సృష్టించిన తీరు అంబేద్కర్ వివరంగా చర్చించారు.

ఏ కులంవారు ఏమి చేయాలి? అనే వివరాలు ధర్మశాస్త్రాలు చర్చించి, హద్దు దాటితే ఎలాంటి శిక్షలు వేయాలో చెప్పాయి. కులంలోని హెచ్చుతగ్గులే శిక్షలలోనూ పాటించారు. కులవృత్తిని వీడకు గువ్వలచెన్నా అంటూ ప్రబోధించారు. కులాలలో చీలికలు వచ్చాయి. కొట్లాటలు సంభవించాయి. లెక్కించడానికి వీలుగానన్ని ఉపకులాలు బయలుదేరాయి. కాని మూలం దెబ్బ తినలేదు. కులాన్ని సమర్థించే మతం వున్నంతకాలం యీ బలం అలానే వుంటుందని రుజువైంది. వేదాలు పవిత్ర ప్రమాణ గ్రంథాలని, గీత చేతిలో పట్టుకొని ప్రార్థనలు చేస్తున్నంత కాలం కులం ఉంటుంది.

కులం అంటే ఏమిటి అని శాస్త్రీయంగా పరిశీలిస్తే నిలవదు. బ్రాహ్మణులలో, కమ్మ, రెడ్డి, కాపు, మాల మాదిగలలో రక్త పరిశీలన చేస్తే అన్ని కులాల్లో అన్ని రకాలైన రక్తం వున్నది. ఒకరి రక్తం మరొకరికి యిచ్చి ప్రమాదాలలో, ఆపరేషన్ల సందర్భాల్లో ఉపయోగిస్తే - కుల రక్తం లేదని, ఏ కుల రక్తమైనా మరొక కులానికి డాక్టర్లు వాడవచ్చనీ రుజువైంది. రంగును బట్టి కులం నిర్ధారించే వీల్లేదు. అన్ని రంగులవారు అన్ని కులాల్లోనూ వున్నారు. గుణాన్ని బట్టి, వంశపారంపర్యతను బట్టి అనడానికి ఆధారాలు లేవు. అన్ని లక్షణాలు, తెలివితేటలు, మూర్ఖత్వాలు అన్ని కులాల్లోనూ వున్నాయి. కనుక కులం ఏ పరిశీలనకూ నిలవదు.

కులం ప్రమాదాన్ని గుర్తించిన మత, సాంఘిక, రాజకీయ సంస్కర్తలు వున్నారు. కులం పోవాలని వారు ప్రచారం చేశారు, రాశారు, కులాంతర వివాహాలు ప్రోత్సహించారు. అంతవరకు బాగానే వున్నది. కులానికి మూలం మతం అనే విషయం వారికి తెలియకపోలేదు. అయినా మతం సంస్కరిస్తే చాలనుకుంటే వీలుకాలేదు. వేదాల్ని, ఇతిహాసాల్ని, గీతను, శంకరాచార్య రచనల్ని వీరు సంస్కరిస్తే మత మౌలికవాదులు ఒప్పుకుంటారా? మూలవేరును తొలగించకపోతే, అది పిలకలు పెడుతూనే పోయింది. మతం బ్రతికి వున్నన్నినాళ్ళు కులం చావదని సంస్కర్తలు గ్రహించలేదు. కనుక కులాన్ని ఎంత వ్యతిరేకించినా అది నిష్ప్రయోజనమే అయింది. కులం పోవాలన్న గాంధీజీ వర్ణవ్యవస్థ నేనే సృష్టించానన్న భగవద్గీతను బోధించారు. కులం పోవాలన్న ఆర్యసమాజ్ వర్ణవ్యవస్థ గల వేదాల్లోకి పోదామన్నది. వివేకానంద ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా కులాన్ని పాటించిన అద్వైతే. ఈ విధంగా సంస్కర్తలు మూలం జోలికి పోకుండా ప్రాకులాడి విఫలమయ్యారు. కులాంతర పెళ్ళిళ్ళు చేసుకున్న తరువాత కూడా, వారి సంతానానికి చట్టరీత్యా తండ్రి కులాన్ని పాటిస్తారు. ఇది మతరీత్యా వచ్చిందే. కులాంతర పెళ్ళి చేసుకున్న తరువాత చేసుకున్నవారికీ, వారి సంతానానికీ కులం వుండరాదు. అలా చట్టాల్ని మార్చుకోవాలి. పాలకులు మార్చలేదు. ఇది మత ప్రభావమే.

కులాన్ని అధ్యయనం చేసి, విశ్లేషించి, విడమరచి చెప్పిన ఆధునికులలో యం.యన్. రాయ్, అంబేద్కర్, లోహియాలు పేర్కొనదగినవారు. వీరు మూలానికి పోయారు. మతం పోవాలన్నారు, అంటే హిందూమతం పాటించి నన్నాళ్లు కులం వుంటుందని సారాంశం. ఈ ధోరణికి భిన్నంగా మత సనాతనులు కులాన్ని సమర్థిస్తున్నారు. ఇందులో శంకరమఠాలు ప్రాధాన్యత వహిస్తున్నాయి. ఈ శతాబ్దంలోనే కంచి శంకరాచార్య వాయిస్ డివైన్ వ్రాసి కులాన్ని హిందూమత ధర్మంగా సమర్థించారు. కులాన్ని పోగొట్టలేనివారు అంటరానితనాన్ని రూపుమాపుతారనుకోవడం భ్రమ.

అంటరానితనం పాటించరాదని, అలా చేస్తే శిక్షార్హమని రాజ్యాంగంలో రాసుకున్నారు. అందుకు విరుద్ధంగా హిందూమతధర్మాల్ని పాటించే చట్టాలు చేశారు. ఆవును చంపరాదని ఆందోళనలు చేసి సాధించుకున్నారు. సతిని సమర్థించే పూరి శంకరాచార్యుల్ని ఏమీ చేయలేకపోయారు. దేవాలయ ప్రవేశాన్ని అంటరానివారికి లేకుండా చేస్తున్న పురోహితుల్ని ఆపలేకపోయారు. కులాన్ని పాటిస్తున్న శంకరాచార్యుల మఠాల చుట్టూ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు. పెళ్ళిళ్ళల్లో కులం పాటిస్తున్నారు. మళ్ళీ కులసంఘాలు విజృంభించాయి.

కులం రాజకీయాల్లో, పరిపాలనలో ప్రవేశిస్తే కీలక స్థానాలల్లో కుల ప్రాధాన్యత వుంటే అనేక ప్రమాదకర పరిణామాలు వస్తాయని బ్రిటిష్ పాలకులు గ్రహించారు. కనుక కుల ప్రాధాన్యత తగ్గించాలనుకున్నారు. ఈ ప్రయత్నం 19వ శతాబ్దంలోనే బ్రిటిష్‌వారు ఇండియాలో ఆరంభించారు. అయినా విఫలమయ్యారు. అదెలా జరిగిందో పరిశీలిద్దాం.

## బ్రిటిష్‌వారు కుల నిరోధక ప్రయత్నాలు :

బ్రిటిష్ పాలకులు వచ్చేనాటికి దేశంలో మతంపై పట్టు వున్నది బ్రాహ్మణులకే. మతానికి ఆయువుపట్టుగా వున్న దేవాలయాల్లో పురోహిత వర్గం బ్రాహ్మణులే. సమాజం మత ప్రభావంలో వుండేది. ఇది గ్రహించిన బ్రిటిష్‌వారు, మతం జోలికి పోకుండా, పాలనారంగంలో జాగ్రత్తపడదలచారు. ఆనాటి పాలనలో కీలకస్థానం రెవిన్యూశాఖదే. గ్రామస్థాయిలో కరణాలు, మునసబ్‌లు ప్రధానపాత్ర వహించారు. బ్రిటిష్‌వారు ప్రతి వివరానికి కరణాలపై ఆధారపడవలసి వచ్చేది. మతరీత్యా చదువుకున్న వర్గం బ్రాహ్మణులే. మిగిలిన కులాల వృత్తులు వేర్వు. ఇది పరంపరగా వచ్చింది. బ్రిటిష్ వారి రాకతో బ్రాహ్మణులు ఉద్యోగాల్లో ప్రవేశించారు. మన రాష్ట్రంలోకి తొలుత తమిళనాడు, మహారాష్ట్ర బ్రాహ్మణులు ఉద్యోగరీత్యా వచ్చారు. వారి ప్రాబల్యం చూచి బ్రిటిష్‌వారు ఉత్తరువులు జారీచేయాల్సిన స్థితి ఏర్పడింది.

## కమ్యూనల్ జి.ఓ. 1851లోనే :

వివిధ కులాలకు ఉద్యోగాలలో ప్రాతినిధ్యం వుండాలంటూ 1851లోనే బ్రిటిష్ పాలకులు

ఉత్తరువు జారీచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని స్టాండింగ్ ఆర్డర్ - నెంబరు 128 క్లాజు 2 అంటారు. రాష్ట్ర జనాభాలో 3.2 శాతం వున్న బ్రాహ్మణులు రెవిన్యూ శాఖలో అధిపత్యం వహించారు. ఉత్తరువు అమలుజరిగే తీరు ఆర్నెల్లకొకసారి పరిశీలించమన్నారు. ఈ స్థితి ఎందుకు వచ్చింది? అనంతపురంలో హుజూర్ తహసీల్దారుగా వన్న కృష్ణారావు అనే బ్రాహ్మణాధికారి తన వారిని 108 మందిని వివిధ ఉద్యోగాలలో ప్రవేశపెట్టాడు. ఇందుకు శిక్షగా ఆయనను కడపకు బదిలీ చేశారు. అక్కడ 117 మందిని తన కులంవారిని ఉద్యోగాలలో వేసుకున్నాడు. కేవలం తన కుటుంబాలకు చెందినవారే 80 మంది వున్నారు. కృష్ణారావును పోలిన సంఘటనలే గోదావరి, కృష్ణా జిల్లాలలోను బ్రిటీష్ వారు గమనించారు. బ్రిటీష్ వారి ఉత్తరువు కాగితాలపై వున్నదేగాని ఖచ్చితంగా అమలు జరగలేదు.

(ఆసక్తికరమైన వివరాలకు - ఆర్.ఇ. ఫ్రికన్ బర్గ్ పుస్తకం గుంటూరు డిస్ట్రిక్ట్ - ఆక్స్‌ఫర్డ్ ప్రచురణ 1965 చూడండి.)

దేవాలయాలకు, మఠాలకు ఆస్తిపాస్తులుండేవి. వాటిపై స్థానిక అగ్రకులాల వారి ఆధిపత్యం వుండగా, ప్రతి సలహాకు పురోహితులపై ఆధారపడేవారు. ఆస్తుల విషయంలో యెన్నో కలహాలు వచ్చాయి. అయినా బ్రిటీష్‌వారు దేవాలయాల జోలికి పోరాదని నిర్ణయించుకున్నారు. స్థానిక పరిపాలన బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టారు. అప్పట్లో పన్నులు వసూలు చేసుకోవడంలోనే వారు ఆసక్తి చూపారు. ఈ రంగంలో కూడా వంశపారంపర్యంగా కులరీత్యా వున్న కరణాలు, మునసబులే గ్రామాలలో ఆధిపత్యం వహించారు. బ్రిటీష్‌వారికి ఈ కులాధిపతులపై ఆధారపడడం తప్పనిసరైంది. బ్రిటీష్‌వారిచ్చిన ఉత్తర్వులు అమలు జరగకుండా కులం అడుగడుగునా అడ్డుపడింది. నెల్లూరు జిల్లాలో జి. వెంకటరమణయ్య (నియోగి) తన కులం వారికి 49 మందికి రెవిన్యూశాఖలో ఉద్యోగాలిచ్చినట్లు తెలుసుకున్నారు. 1893-95 మధ్య ఉద్యోగాలలో బ్రాహ్మణులే అత్యధిక సంఖ్యలో వున్నారని గ్రహించారు. కనుక ప్రభుత్వమే చొరవ తీసుకొని 1896-1911 మధ్య బ్రాహ్మణేతర అగ్రకులాల వారికి ఉద్యోగాలిచ్చారు. 1851లో యిచ్చిన ఉత్తరువు 60 సంవత్సరాలు అమలు జరగకుండా వుండిపోగా, 1912లో మరొకసారి గట్టి ప్రయత్నం ప్రభుత్వం చేసింది. ఉద్యోగాల పరీక్షకు పోటీలో 1892-1904 మధ్య 16 ఉద్యోగాలలో 15 బ్రాహ్మణులకే దక్కాయి. చదువులలోనూ, ఉద్యోగాలలోనూ బ్రాహ్మణులదే అగ్రస్థానం అయింది. కళాశాల హాస్టళ్ళలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర హాస్టళ్ళు పెట్టుకున్నారు. కాపు, రెడ్డి, కమ్మ, క్షత్రియ, రాజు, వైశ్య కులాలు వారు క్రమేణా తమ కులసంఘాలు పెట్టుకోనారంభించారు. మరోప్రక్క రాజకీయాల్లో కాంగ్రెసుపార్టీ కూడా బ్రాహ్మణాధిపత్య నాయకత్వంలో వుంది.

## జస్టిస్ పార్టీ కుల రాజకీయాలు :

కాంగ్రెసులో బ్రాహ్మణ నాయకత్వానికి వ్యతిరేకంగా బ్రిటీష్‌వారికి అనుకూలమైన జస్టిస్ పార్టీ పుట్టడానికి పరిస్థితులు సానుకూలించాయి. మద్రాసు రాష్ట్రంలో వున్న ఆంధ్రులు

యిందుకుగాను తమిళులతో చేతులు కలిపారు. కాంగ్రెసులో బ్రాహ్మణులు మధ్య నియోగి - వైదిక స్పర్థలు ఒక వైపున వుండగా, ఆంధ్ర-అరవ బ్రాహ్మణుల మధ్య కలహాలు మరోవైపు సాగాయి. ఇందులో దివ్యజ్ఞాన సమాజ నాయకురాలు అనిబిసెంట్ అరవ బ్రాహ్మణ కోపు వేసుకున్నది.

1912లో నటేశ మొదలియార్ ద్రావిడ సంఘాన్ని స్థాపించారు. ద్రావిడ సాహిత్య ప్రచురణ జరిగింది. బ్రాహ్మణేతర హాస్టళ్ళను ప్రోత్సహించారు. 1916లో దక్షిణభారత ప్రజాసంఘం వచ్చింది.

జస్టిస్ పార్టీకి నాంది పలికారు. అధికారంలోకి రావాలనే ఆకాంక్ష యిందులో వుంది. ఆంధ్ర, తమిళ బ్రాహ్మణేతరులు కలసి 1916లో యీ పార్టీని స్థాపించారు. బ్రిటీష్ వారి ఆశీర్వచనం వీరికి వుంది.

జస్టిస్ పార్టీ పుట్టేనాటికి రూరల్ బోర్డులు, తాలూకా బోర్డులు రాగా, ఆ తరువాత జిల్లా బోర్డులు వచ్చాయి. స్థానిక సంస్థలలో తమ ఆధిపత్యానికి ఆయా అగ్రనాయకులు ప్రయత్నించారు.

జస్టిస్‌పార్టీ అధికారానికి వచ్చిన తరువాత కొత్త కుల రాజకీయాలు వచ్చాయి. బ్రాహ్మణేతర పార్టీగా పేరు తెచ్చుకున్న పార్టీ బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ద్వేషించింది గాని, బ్రాహ్మణత్వాన్ని అనుకరించింది. బ్రాహ్మణుల వలె తామూ కావ్యాలు రాయగలమని, మంత్రాలు చెప్పగలమని, పాండిత్యం ప్రదర్శించగలమని నిరూపించదలచారు. అలాగే అనేక పుస్తకాలు వచ్చాయి. అన్ని రంగాలలో బ్రాహ్మణులను అనుకరించారు. పెళ్ళిళ్ళలో పౌరోహిత్యం చేయించారు. దీనివలన కమ్మ బ్రాహ్మణులనే పేరు కూడా వచ్చింది. మిగిలిన వారి కంటె కమ్మకులంవారు బ్రాహ్మణులతో బాగా పోటీపడ్డారు. కనుక వృత్తిరీత్యా తమ భృతిని దెబ్బతీశారనే కోపం బ్రాహ్మణులకు సహజంగానే కమ్మవారిపై ప్రబలింది. రెడ్లు, క్షత్రియులు, రాజులు, కాపులు అధికారం కోసం తిప్పలుపడినా వృత్తిరీత్యా బ్రాహ్మణులతో తారసిల్లలేదు. బ్రాహ్మణ, కమ్మద్వేషం బాగా ప్రబలి, నాటుకపోయింది. జస్టిస్‌పార్టీలో నాయకులు, ముఖ్యంగా పానగల్లు రాజా అవసరమైతే బ్రాహ్మణుల సహాయం తీసుకోవడానికి సిద్ధపడ్డారు. బొబ్బిలిరాజా జస్టిస్‌పార్టీలో బ్రాహ్మణుల్ని చేర్చుకోవాలన్నారు. మునిస్వామి నాయుడు కమ్మ ముఖ్యమంత్రిగా జమీందారులైన రాజులు, క్షత్రియులపై పోరాడారు. జస్టిస్‌పార్టీలోని బ్రాహ్మణేతరులు, ముఖ్యంగా రాజులు, క్షత్రియులు ఒక వైపు, కమ్మ మరోప్రక్క కొట్టుకున్నారు.

దేవాలయంపై బ్రాహ్మణులకు వున్న పట్టు తప్పించాలని జస్టిస్‌పార్టీ ప్రయత్నించి విఫలమైంది. అధికారంలో మంత్రులుగా జస్టిస్‌పార్టీవారున్నప్పటికీ, కీలక ఉద్యోగాలలో ఐ.పి.యస్. అధికార్లలో బ్రాహ్మణులు ఎప్పటికప్పుడు జస్టిస్‌వారికి అడ్డుపడుతూ వచ్చారు. సాధ్యమైనంతవరకు జస్టిస్‌పార్టీవారు తమ కులాల్ని ప్రోత్సహించి, పెంచి పోషించారు. విద్యారంగంలో,

హాస్టళ్ళలో కులరీతులు విస్తరిల్లాయి. స్థానిక సంస్థలలో ఉద్యోగాలు, పదవులు కులరీత్యా పంపిణీ జరిగింది. అలా వీలులేనిచోట అవసరమైతే ఎన్నికలు వాయిదావేసి, నామినేట్ చేసిన సందర్భాలున్నాయి. బ్రాహ్మణులు జస్టిస్‌పార్టీకి దూరంగా వుండగా, కాంగ్రెస్‌లో ఉత్తరోత్తరా ప్రముఖపాత్ర వహించిన కమ్మవారు జస్టిస్‌పార్టీకి సుముఖంగా వున్నారు.

కాంగ్రెసులో అన్నికులాలవారున్నప్పటికీ పెత్తనం బ్రాహ్మణులదే. స్వాతంత్ర్యం వచ్చేవరకూ అదే స్థితి కొనసాగింది. అయితే అందులో ఏకత్వం లేదు. వైదికనియోగ కలహాలు సంభవించాయి. ప్రకాశం - పట్టాభి రాజకీయాలన్నీ యీ బ్రాహ్మణశాఖల పరంగానే సాగాయి. అలాగే కొండా వెంకటప్పయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు మొదలైన నాయకులు, వి.వి. గిరి, తెన్నేటి విశ్వనాథం, కళా వెంకటరావు ప్రభృతులు యీ కలహ పురాణాల్లో రాజకీయాలు నడిపారు. కాంగ్రెసులో యీ బ్రాహ్మణ నాయకత్వాల చుట్టూ మిగిలిన అగ్రకులాలు పరిభ్రమించాయి. ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికలోనూ యివి పనిచేశాయి.

జస్టిస్‌పార్టీ 1937లో అంతమైన తరువాత క్రమంగా కాంగ్రెసులో చేరిన జమీందార్లు, పెద్ద రైతులు, బాబులు, ఆయా నాయకుల్ని ఆశ్రయించారు. జైళ్ళకు కూడా కులరాజకీయాల్ని మోసుకెళ్ళారు.

అధికారం కోసం కులాన్ని అడ్డం పెట్టుకొని కొట్టుకున్నారేగాని, అందరి సంక్షేమం కొరకు కాదని గ్రహించాలి. ఈ కుంపటి యజ్ఞంలో కొందరు కులాల పేరిట చదువుకొని, ఉద్యోగాలు సంపాదించి, ఆర్థికంగా బాగుపడి వుండొచ్చు. కాని సమాజంలో ఉత్తరోత్తరా ప్రబలిన కులద్వేషాలకు యివి దోహదం చేశాయి. ఆజ్యం పోశాయి. రాజకీయాల్లో కులాన్ని ప్రవేశపెట్టిన పాప ఫలితమే యిదంతా.

ఫిర్కా సంస్కరణ ద్వారా ఉద్ధరించాలని పథకం వేసిన టంగుటూరి ప్రకాశం, మద్రాసు ప్రభుత్వాధినేతగా అందరూ బ్రాహ్మణులనే ఫిర్కాస్కీంలో నియమించారు. ఇతర కులమంత్రులు తమ చేతనైనంతగా తమ కులంవారికి తోడ్పడ్డారు. ఎవరికి వారే కులాధిపతులుగా చలామణి అయ్యారు.

స్వాతంత్ర్యం వచ్చే నాటికి యిదీ కుల రాజకీయాల పరిస్థితి! కులసంఘాలు ఏర్పడి, తీర్మానాలు చేశాయి. కాని కులం పోగొట్టుకోవాలనే వామపక్ష ధోరణులు కూడా అప్పుడే వచ్చాయి. కులాంతర వివాహాలు జరిగాయి. పురోహితుడుకాని, మంత్రాలుకాని లేకుండా పెళ్ళిళ్ళు చేసుకున్నారు. కాని వారి సంతానానికి కులం పోగొట్టలేకపోయారు.

అంటరానితనం పోవాలనే కార్యక్రమం చేబట్టిన వారు కూడా పైపైన ఏదో పనులు చేశారుగాని, మూలం మతం రీత్యా వుందని గ్రహించారు. వెనుకబడిన కులాలవారు సైతం అంటరానివారిని కలుపుకోలేకపోయారు.

అందరికీ ఓట్లు వచ్చిన దృష్ట్యా అంటరానివారికి అత్యంత ప్రాధాన్యత యిచ్చి, రిజర్వేషన్‌లకు ఒప్పుకున్నారు. వారి ఓట్లకోసం అనేక ఆకర్షణలు విసిరారేగాని, అంటరానితనం పోగొట్టడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు. ప్రయత్నించరు కూడా.

తెలంగాణా ప్రాంతంలో బూర్గుల రామకృష్ణారావు - కొండా వెంకటరంగారెడ్డి కొట్లాటలు, రావు, రెడ్డి ముఠాల పేరిట బ్రాహ్మణ-రెడ్డి కలహాలు రాజకీయాల్లో ప్రవేశించాయి. ఆంధ్రతో కలిసే వరకూ యీ కులపోరాటాలు రాజకీయాల్లో సాగాయి. ఇందులో మహారాష్ట్ర, కర్నాటక వారు కూడా చేతులు కలిపారు.

మద్రాసు నుండి విడిపోయి ఆంధ్ర ఏర్పడినప్పుడు రెడ్డి నాయకత్వం జాగ్రత్తగా బ్రాహ్మణుల్ని కలుపుకున్నది. టంగుటూరి ప్రకాశాన్ని అడ్డం పెట్టుకుని సంజీవరెడ్డి పాలన సాగించారు. బెజవాడ గోపాలరెడ్డి ఈ సమరంలో సంజీవరెడ్డికి లొంగిపోయాడు. కమ్మ నాయకత్వం కోసం రంగాచేసిన కృషి, బ్రాహ్మణ ఆధిపత్యానికి బూర్గుల రామకృష్ణారావు ప్రయత్నం విఫలమయింది. తెలంగాణా ఆంధ్ర కలిసేసరికి రెడ్డి నాయకత్వం బలపడింది. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్డి నాయకత్వం తిరుగులేనిదిగా ప్రారంభమైంది.

ముఖ్యమంత్రి పదవి కీలకమైంది. అధికారం చేజిక్కించుకుంటే మిగిలినవి సమకూర్చు కోవడం సులభం. కులాన్ని బలపరచడమూ సాధ్యమే. ముఖ్యమంత్రి కులానికి ప్రాధాన్యత వస్తుంది. "మన వాళ్ళకు" పనులు జరుగుతాయి. ఇతర కులాలవారికి కొంత మేత పడేసి అట్టిపెట్టవచ్చు. రాజకీయాల్లో ప్రవేశించిన కులం, పరిపాలనలో, న్యాయవ్యవస్థలోనూ ప్రాకింది. ఆంధ్రప్రదేశ్‌లో వున్నతంతు ఇతర రాష్ట్రాలలోనూ వుండేవి. సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చెన్నారెడ్డి, అంజయ్య, విజయభాస్కరరెడ్డి, భవనం వెంకట్రామ్, జనార్ధనరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా రెడ్డి కులాన్ని జాగ్రత్తగా చూచుకోగలిగారు. సంజీవయ్య రాజీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి అయినందున అట్టే చేయలేకపోయారు. వెంగళరావు వెలమలకు సేవచేసినా వారి సంఖ్యాబలం తక్కువ అయినందున అట్టే రాలేదు. పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగా బ్రాహ్మణ రాజ్యస్థాపనకు కృషి చేశారు. వర్ణవ్యవస్థ కావాలన్న విశ్వనాధ సత్యనారాయణ పుస్తకాలు కొనిపించడంతో బాటు, వేయిపడగలు హిందీలోనికి అనువదించడం, పురోహితవర్గాన్ని కొమ్ముకాయడం వంటివి చేయగలిగారు. కేంద్రంలో ఇందిరాగాంధి తెలివిగా అంటరాని కులోద్ధరణ కార్యక్రమాలు చేబట్టి ఓట్లు దండుకోగా, రాష్ట్రాలలో అది బాగా ఉపయోగపడింది. బ్రాహ్మణేతర అగ్రకులాలకు వ్యతిరేకంగా హరిజనులు, బ్రాహ్మణులు కలవడం పెద్ద వ్యూహమే. ఇందిరాగాంధి తమ ఉద్ధరణకై చిత్తశుద్ధితో పనిచేసిందని నమ్మేవారూ, పి.వి. నరసింహారావు నాయకత్వాన్ని అంగీకరించే షెడ్యూలు కులాల వారూ యీ వ్యూహంలో పడి కొట్టుకుంటున్నవారే! రాష్ట్ర ముఖ్యమంత్రిగా యన్.టి. రామారావు వున్నపుడు కమ్మకులానికి యెక్కడలేని ప్రాధాన్యత వచ్చింది. మారుమూలనున్న వారిని వెతికి తెచ్చి పదవులు కట్టిపెట్టారు. కమ్మ రాజ్యస్థాపనకు

రామారావు కృషి చేశారు. రెడ్లు దీనిని వ్యతిరేకించారు. కాపులు యింకా విజృంభించి కమ్మ ద్వేషం పెంచుకున్నారు. వంగవీటి మోహనరంగా హత్యతో కాపు-కమ్మ ద్వేషం పరాకాష్టకు చేరింది. కర్ఫ్యూ కూడా ఆపలేని కలహాలు, హత్యలు జరిగాయి. కమ్మరాజ్యంలో కాపు సంఘాలు తామర తంపరగా వెలిశాయి. రెడ్లు, బ్రాహ్మణులు కాపులతో చేతులు కలిపారు. బ్రాహ్మణుల్ని దెబ్బతీసే ప్రయత్నంలో బౌద్ధాన్ని తిరగదోడడానికి రామారావు ప్రయత్నించారు. కంచి శంకరాచార్య మొదలు బ్రాహ్మణులు దీనికి శాపనార్థాలు పెట్టారు. వంశపారంపర్యంగా వస్తున్న గ్రామాధికారులను తొలగించడానికి రామారావు చేసిన ప్రయత్నం కూడా బ్రాహ్మణుల్ని దెబ్బతీయడానికేనని మరో కమ్మ నాదెండ్ల భాస్కరరావును అడ్డం పెట్టుకొని తాత్కాలికంగా విఫలమైన తరువాత ఎన్నికలలో రెడ్డి-కాపు-బ్రాహ్మణ కలయికతో కమ్మనాయకత్వాన్ని వూడగొట్టగలిగారు.

రిజర్వేషన్ల పేరిట రాష్ట్రంలో, కేంద్రంలో జరిగే కాండ అంతా కులోద్ధరణకు ఉపకరించింది. ఓట్ల కోసం జరిగే ప్రయత్నంగా మిగిలింది తప్ప ఇందులో మరో దృష్టి కనిపించలేదు. మండల్ కమీషన్ నివేదికతో అగ్రకులాల నిజస్వరూపం బయటపడింది. కులాధిక్యతను మెరిట్ పేరిట వారు వెల్లడించారు. ఈ ధాటికి తక్కువ కులాలవారు నిలవలేకపోయారు. రాష్ట్రంలో మురళీధరన్ కమీషన్ నివేదిక అమలుపరుస్తానని రామారావు అన్నప్పుడే యీ అగ్రకులాల ధోరణి వెల్లడైంది. అదే దేశవ్యాప్తంగా కనిపించింది. అంబేద్కర్ పేరిట జరుగుతున్న మోసం కూడా యీ రీతిలోనే వున్నది. హిందూ మతం కులాన్ని కట్టుదిట్టం చేసింది గనుక అదిపోతేగాని కులం పోదని చెప్పిన అంబేద్కర్ రాజకీయ పార్టీలకు అవసరం లేదు. ఆయన్ను అడ్డం పెట్టుకొని విగ్రహాలు వేసి, ఆరాధనలు చేసి, దండలు వేసి, నినాదాలతో షెడ్యూలు కులాల వారిని ఆకర్షించే ప్రయత్నం అన్ని పార్టీలు చేస్తున్నాయి. ఆ వూబిలో పడి కొట్టుకుంటున్న షెడ్యూలు కులాల నాయకులు నిజాన్ని గ్రహించలేక, వేసిన మేత వరకే తృప్తిపడుతున్నారు. అంటరానితనం వూరి వెలుపల అలాగే కొనసాగుతున్నది. మాల మాదిగ కొట్లాటలతో వారూ సతమతమౌతున్నారు. రాజకీయవాదులు యీ బలహీనతల్ని బాగా వాడుకుంటున్నారు. రాజ్యాంగంలో రాసుకున్న అంటరానితన నిషేధం అక్కడికే పరిమితమైంది. పదవులు పొందిన షెడ్యూలు కులాల నాయకులు ఉద్యోగాలలో వున్నవారు అంతవరకే చాలు అనుకుంటున్నారు. అంబేద్కర్‌ను వీరు చదవలేదు, చదివినా అంతుపట్టలేదు. రాజకీయాలలో చాలాకాలం మోసం చేయవచ్చు అని షెడ్యూల్ కులాల వారు గ్రహించలేకపోవడం గమనార్హం. బుద్ధుడ్ని అవతారం చేసి చంపినట్లే అంబేద్కర్‌ను హతమార్చేస్తున్నారు. ఇది మతపరంగా చాకచక్యంతో జరుగుతున్న కులయజ్ఞమే. ఒక మంత్రి లేదా శాసనసభ్యుడు శాసనాలు రాష్ట్ర ప్రజలందర్నీ వుద్దేశించి చేస్తాడు. ఎన్నికలలో ప్రజలు ఓటర్లుగా పాల్గొంటారు. కనుక గెలిచినవారు రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. రాజ్యాంగం మానవ హక్కుల్ని అంగీకరించి అందరికి న్యాయం చేకూర్చుతాననంటుంది. అందులో కులప్రసక్తి లేదు కనుక మంత్రిగాని శాసనసభ్యుడు గాని కులసభలకు వెళ్ళి పాల్గొని ప్రోత్సహించడం రాజ్యాంగవిరుద్ధం, అన్యాయం, నేరం కూడా. అందరికీ పరిపాలన అందించాల్సిన మంత్రి ఒక్క కులాన్ని సమర్థించరాదు.

మతం మనుషుల్ని గౌరవంగా చూడదు. మనుషులు దైవం కోసం బతకాలంటుంది. అన్ని మతాలు మానవ విలువలకు, హక్కులకు విరుద్ధమే. అందులో హిందూమతం ఒకటి. ఆ మతం ఇన్నాళ్ళూ కని, పెంచిన విషపుత్రికలే కులం, అంటరానితనం. పూర్వజన్మ సుకృతం, కర్మ అనే సిద్ధాంతాలను హిందూమతం ప్రవచించి ప్రబలించింది. కులానికి అవే ఆధారం కనుక మతాన్ని పెరికి వేయకుండా, కులాన్ని మాత్రమే తెంచివేయాలంటే సరిపోదు. ఇది మూలరహస్యం.

మనదేశంలో మతాన్ని సంస్కరించాలని కొందరు ప్రయత్నించి విఫలమయ్యారు. కులాన్ని పోగొట్టాలని మరికొందరు కృషిచేసి విఫలమయ్యారు. మూలానికి పోకుండా తాత్కాలికంగా పైపై ప్రయోజనాలకై పనులు చేస్తే యిలాగే వుంటుంది.

మతం మార్చి, బౌద్ధ, ఇస్లాం, క్రైస్తవ మతాల్లోకి కొందరు మారారు. కాని వారితో బాటుగా కులాన్ని తీసుకువెళ్ళారు. క్రైస్తవ దేవాలయాలలో అగ్రకులాలు, అంటరానివారు వేరుగా కూర్చుంటున్న సందర్భాలు చూచాం. పెళ్ళిళ్ళలోనూ యిలాగే జరుగుతున్నది. అయితే యిది ప్రధానాంశం కాదు.

హిందూమతంలో వుంటూ, వేద ప్రమాణాన్ని అంగీకరించి, గీతాబోధన సరయినదనే వారు కులాన్ని పోగొట్టడం అసాధ్యం. మతం-కులం విడదీయరానంతగా పెనవేసుకపోయాయి. కులాన్ని మాత్రమే తొలగించాలని కమ్యూనిస్టులు, సోషలిస్టు కుల నిర్మూలన సంఘాలవారు ప్రయత్నించి విఫలమయ్యారు. మతం జోలికి యెవరూ పోలేదు. అంబేద్కర్ మాత్రమే కొంతవరకు యీ ప్రయత్నం చేసి, బౌద్ధంలో అంటరానితనం, కులం వుండదు గనుక అది స్వీకరించమన్నాడు. ఆయన చెప్పిన బౌద్ధాన్ని యీ దేశంలో ఏనాడో చంపేశారు. మిగిలినదల్లా క్షీణించిన హీనయాన మహాయాన వజ్రయాన జాడ్యాలన్నీ అందులో వున్నాయి. కనుకనే బౌద్ధంలోకి మారిన షెడ్యూల్ కులాల వారి స్థితి ఏ మాత్రం మారలేదు. మతాలన్నీ మానవుడికి కొరముట్టుగా చూస్తాయే గాని వ్యక్తిత్వపు విలువ యిచ్చి చూడవు. మతం మానవ వ్యతిరేకి, మానవద్వేషి.

కులం పోగొట్టడమనేది యెదురీత కార్యక్రమం. మతంతో ముడివడి వున్న యీ సమస్యను దీర్ఘకాలికంగా పరిష్కరించాలి. ప్రారంభం యిప్పుడే చేయవచ్చు. చదువుకున్నవారిలో యీ మార్పు ప్రారంభం కావాలి. అదేమంత సులభం కాదు. శాస్త్రబద్ధతకు, హేతువుకు దూరమైన కులాన్ని గుడ్డిగా నమ్మి ఆచరిస్తున్న వారికి నచ్చజెప్పడానికి పెద్ద కృషి జరగాలి.

## ఏం జరగాలి?

పేర్లలో కులాన్ని సూచించడం మానాలి. ఇకముందు అలాంటి పేర్లు పెట్టవద్దని తల్లిదండ్రులకు చెప్పాలి. శాస్త్రి, శర్మ, రెడ్డి, కమ్మ, నాయుడు ఇత్యాదులు పేర్లకు తగిలించుకోరాదు.

కుల సభలకు, సమావేశాలకు ప్రజా ప్రతినిధులు వెళ్ళరాదు. వాటిని నిరసించాలి. ప్రభుత్వం ఏ స్థాయిలోనూ వాటికి గుర్తింపు యివ్వరాదు. వాటి కట్టడాలకు అనుమతి నిరాకరించాలి.

కులబోధన చేసే అంశాలు పాఠాలలో రాకుండా చూడాలి. కులచరిత్ర చెప్పి కుల విషబీజాల్ని పిల్లలకు విడమరచాలి.

కులాంతర వివాహాలు చేసుకున్నవారికి కులం పాటించరాదు. వారి సంతానానికీ అంతే. అలా వివాహాలు చేసుకున్నవారు ప్రస్తుతం తమ సంతానానికి తండ్రి కులాన్ని పాటిస్తున్నారు. రిజర్వేషన్ల లాభాలు పొందే నిమిత్తం కొందరు దుర్వినియోగం చేస్తున్నారు.

కులాంతర వివాహాలకు అత్యధికంగా, అపరిమితంగా ప్రభుత్వ ప్రోత్సాహం లభించాలి. ఆర్థికంగా, సామాజికంగా అనేక విధాల యీ సహాయం వుంటే త్వరగా కులాంతర వివాహాలకు ప్రోత్సాహం లభిస్తుంది.

కులాన్ని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రోత్సహించే మత క్రతువులు, మంత్ర తంత్రాలు నిరసించాలి. కులాన్ని బట్టి వివాహాలలో మంత్రాలు చదివే తీరుకు అభ్యంతరం రావాలి.

కంచి కామకోటి పీఠాధిపతి ఆశ్రమంలో నేటికీ స్మార్త బ్రాహ్మణులే వంటకు అర్హులని అగేహానందభారతి రాశారు. అలా కులాన్ని పాటించే ఆశ్రమాలను అధికారంలో వున్న రాష్ట్రపతి, ప్రధాని మొదలైనవారు బహిష్కరించాలి. ఇందుకు విరుద్ధంగా నేడు వీరక్కడకు వెళ్ళి పాదాక్రాంతులౌతున్నారు. ఈ దారుణం ఆపాలి.

కుల, మతపరమైన ఆస్తులకు పన్నుల మినహాయింపు ఎలాంటి స్థితిలోనూ యివ్వరాదు. ఇవి వ్యాపార పద్ధతులుగా స్వీకరించి, పన్నులు వేసి వసూలు చెయ్యాలి. ఈ నియమం ఆశ్రమాలకు, దేవాలయాలకు, వక్ఫ్ బోర్డులకు, బాబాలకు, మాతాశ్రమాలకు విధిగా అన్వయించాలి.

కులం పేరెత్తడం సిగ్గుచేటుగా చూచే అలవాటు రావాలి.

## ఇదీ వేయాల్సిన ప్రశ్న

నీవు హిందువు కావచ్చు, ముస్లిం కావచ్చు, క్రైస్తవుడవు కావచ్చు, మనిషివి ఎప్పుడౌతావు?

నీవు బ్రాహ్మణుడవు, క్షత్రియుడవు, వైశ్య, కమ్మ, రెడ్డి, కాపు, వెలమ, షెడ్యూల్ కులం కావచ్చు. మనిషిగా ఎప్పుడు మారతావు?

## ఇవీ రావాల్సిన ప్రశ్నలు

మనిషిని తక్కువచేసి చూసేవే మతాలు, కులాలు. మనిషిని మళ్ళీ మనిషిగా రూపొందించాలనేదే మానవవాదం. మనిషికి విలువ యిచ్చేదే మానవహక్కుల ఉద్యమం.

మనిషి దైవంకోసం, మతం కోసం, మోక్షం కోసం బ్రతకాలనే భ్రమ తొలగాలి. ఈ మోసం యిక సాగనివ్వరాదు.

నా మతం గొప్పది, దాని ద్వారానే మోక్షానికి పోతారని, ఏ మతానికి ఆ మతం బోధిస్తున్నది. నేను నమ్మిన దేవుడే సర్వోత్తముడని భక్తులు నమ్ముతారు. మిగిలిన మతాలు, మిగిలిన దేవుళ్ళు తక్కువే అని అర్థం. ఆ దృష్టితోనే మత మార్పిడులు, మత కలహాలు వచ్చాయి. మత దూషణలు- కాఫిర్లు, మ్లేచ్ఛులు, పేగన్లులాంటి మాటలు వచ్చాయి.

కులమూ అంతే. ఎవరికి వారు నా కుల కట్టుబాటు మంచిది అనుకుంటారు. అన్నిటికంటె ఉత్తమమైన బ్రాహ్మణకులం వైపుకు యెదగాలని ప్రయత్నిస్తూ సంస్కృతీకరణ చేశారు. ఇదీ మతపరంగానే వచ్చింది.

మతం, కులం కట్టుబాట్లు లేకుంటే మానవుడు కట్టలు తెంచిన స్వేచ్ఛతో అరాచకత్వం సృష్టిస్తాడని భయపెట్టి, స్వర్గం, పాపం, నరకం, దేవుడు, మతం, కులం అనే భయంకర అమానుష ఆయుధాలు వాడారు.

మనిషి స్వేచ్ఛాపిపాసి. హేతుబద్ధుడుగా ఆలోచించి, నిత్యమూ తెలుసుకుంటాడు. ఈ అన్వేషణలో ఇతరుల సహకారం స్వీకరిస్తాడు. ప్రకృతితో మానవుడు సహకారజీవి. అతడి సహకార లక్షణాన్ని మతం, కులం చంపేశాయి. అసహనం పెంచాయి. దురభిమానానికి పాలుపోశాయి. మానవతత్వం మనుగడ సాగించాలంటే మతం, కులం పోవాలి. ఆలోచనను చంపేసే నమ్మకాలు కుల, మత, ఛాందసాలు నాశనం చేయాలి. అవి చరిత్రగా మిగలాలి. వాటికి వాస్తవికతను ఆపాదించిన దోషం తొలగించాలి. ఇదీ మన కర్తవ్యం. ఇందుకు శాస్త్రీయపద్ధతి ఒక్కటే ఆయుధం.

***- హేతువాది, జనవరి 1992***

# చిట్కా వైద్యంలో కొత్త రష్యా డాక్టర్లు

రష్యాలో తిరుగుబాటు వచ్చి కమ్యూనిజం పోయిన తరువాత కొన్ని వివాదాలు తలెత్తాయి. అందులో మతఛాందసం ఒకటికాగా, అద్భుత చికిత్సకారులు మరొక ప్రక్క బాగా వ్యాపారం చేస్తున్నారు. అలాంటివారిలో ఇటీవల వ్లాడిమర్ మాక్సిమోవ్ (Vladimor Maximov) ఒకరు. మూఢనమ్మకాలకు, మతవిశ్వాసాలకు, అద్భుతచికిత్సల పేరిట మోసాలకు పేరెన్నికగన్న వెనుకబడిన ప్రాంతం రష్యాలోని సైబీరియా. మాక్సిమోవ్ అక్కడే యీ చికిత్సల చిత్రాలు నేర్చాడు. ఆయన వయస్సు 38. గత సంవత్సరం ఆయన అమెరికా వెళ్ళాడు. ప్రస్తుతం అక్కడ తన వ్యాపారాన్ని విస్తృతపరుస్తున్నాడు. అమెరికాలో చదువుకున్న జనానికి తీరిక, ఓపికలేక, మూఢవిశ్వాసాలతో జబ్బుల్ని నయం చేసుకోవాలనే మనస్తత్వం వ్యాపిస్తోంది. ఆ ధోరణిని మతవాదులు బాగా

గిట్టుబాటు వ్యాపారంగా మార్చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం మాక్సిమోవ్ కూడా చేస్తున్నాడు. అందులోనూ రష్యానుండి వచ్చాడు గనుక ఇంకా అద్భుతంగా అమెరికన్లకు కనిపించడం దూరపుకొండలు నునుపు సామెతను గుర్తుకు తెస్తుంది. అమెరికాలో వైద్యం బాగా ఖరీదు కనుక. అది అడ్డం పెట్టుకొని వీరు మార్గాంతరం అంటూ జబ్బుపడ్డవారిని ఆకర్షిస్తున్నారు. ఫోనుపై కొన్నాళ్ళు మాక్సిమోవ్ చికిత్స చేశాడట. ఇతడు తండ్రిని పోగొట్టుకొని, కమ్యూనిస్టు రాజ్యంలో బాధలుపడి, కసిగా యిలాంటి చికిత్స చిట్కాను మొదలుపెట్టాడు. కమ్యూనిస్టు హయాంలో అద్భుతచికిత్సల్ని అణచివేశారని, ప్రజలలో దీనిపై ఆసక్తి వున్నదనీ ఆయన ప్రచారం చేశాడు. జీవశక్తిని ప్రకృతికి అనుకూలంగా మలచడం తన ప్రత్యేకత అని, ప్రకృతి అందరికీ ఒకటే అనీ, దేహంలో చికిత్స అంతర్గతంగా వుంటుందనీ మాక్సిమోవ్ అంటాడు. నయం కానప్పుడు చిత్తశుద్ధితో ప్రార్థనచేస్తారనీ, అప్పటికీ కుదరకపోతే, ప్రకృతిపై ఆధారపడాలనీ అంటాడు! దేహంలో వున్న జీవశక్తికి తోడ్పడాలనేదే తన ఆశయం అనీ, అన్ని పవిత్ర కీర్తనలలోనూ సర్వసాధారణ ప్రకంపనాలున్నాయని పేర్కొన్నాడు.

స్టాలిన్‌కు, బ్రెజ్నెవ్‌కు సైతం అతీంద్రియ శక్తుల పట్ల నమ్మకాలుండేవని వీరు ప్రచారం చేస్తున్నారు. జార్ చక్రవర్తులు విదేశీమంత్రగాళ్ళను, ఆధ్యాత్మికవాదుల్ని సంప్రదించేవారు. చివరి జార్‌చక్రవర్తి కాలంలో రస్‌పుటిన్ ఇలాంటి శక్తులు చూపి తన గుప్పిట్లో ఎందరినో పెట్టుకుని ఆడించాడు. రష్యాలో బ్లావట్‌స్కీ అనే ఆమె పుట్టి, అమెరికాలో దివ్యజ్ఞాన సమాజం పెట్టి ఇండియాకు వచ్చి కల్మషం వ్యాపింపజేసిన విషయం చాలామంది మరచిపోలేదు.

మతాన్ని మూఢనమ్మకాల్ని బలవంతంగా తుడిచిపెట్టాలని ప్రయత్నించి విఫలమయ్యారు. శాస్త్రీయ పద్ధతి ద్వారా ప్రాథమిక పాఠశాల స్థాయి నుండీ పాఠాలు చెబితే మూఢనమ్మకాలు ఈ సరి పోయేవే. అద్భుత చికిత్సలకు తావు లేకుండా వుండేది. కమ్యూనిస్టులు 70 ఏళ్ళపాటు నియంతృత్వంలో ముసుగువేసిన విషయాలు ఈ రూపంలో బయటపడుతున్నాయి.

**- *హేతువాది, మే 1992***

# ఆంధ్ర సాహితీ సంస్కృతులు హేతువాద దృక్కోణం

దేశంలో మత సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమైనప్పుడు ఆంధ్రలో వాటి ప్రభావం సాహిత్యపరంగా కనిపించింది. బెంగాల్‌లో బ్రహ్మసమాజం విగ్రహారాధన పద్ధతిని, సతీసహగమనం పోవాలని, బాల్యవివాహాలు ఆపాలని, విధవా వివాహాలు చేసుకోవచ్చంటే, ఆంధ్రలో కందుకూరి వీరేశలింగం ఆ సమస్యల్ని తమ రచనల్లో ప్రతిబింబించారు. ఆ మాత్రానికే ఆయనపై సనాతనులు దాడిచేశారు.

కన్యాశుల్కం, వ్యభిచారం ఇత్యాది అవినీతికర సమస్యల్ని గురజాడ అప్పారావు ఇతివృత్తంగా స్వీకరించి ఉత్తరోత్తరా సంస్కరణవాదులకు కొన్ని మార్గాలు చూపారు.

స్త్రీ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, బిడ్డల శిక్షణలో శాస్త్రీయ దృక్పథం ఒక తీవ్ర ఉద్యమంగా చలం తన రచనల ద్వారా చూపారు. ఇవన్నీ మత పరిధిలో సంస్కరణలు ఉద్దేశించినవే.

కట్టమంచి రామలింగారెడ్డి ప్రబంధాలలో, భారతంలో స్త్రీలను చులకనగా చూచిన పద్ధతిని ఎత్తిచూపి, ద్రౌపదివంటి పాత్రలను శ్లాఘించారు. మతాన్ని మానవుడు సృష్టించాడు. ఎంతో సాహిత్యం మతపరంగా వచ్చింది. ఆ మతం, సాహిత్యం మానవుడికి ప్రాధాన్యత పోగొట్టి, అతడిని దేవుడికి బానిసగా, మూఢనమ్మకాల కీలుబొమ్మగా చేసి ఆడించాయి. ఇవి భరించలేక, మత సంస్కరణలు, వాటి ప్రభావంతో పైన సూచించిన తీరులో రచనలు వెలువడ్డాయి. కాని సనాతనులు సంస్కరణల్ని వ్యతిరేకించారు.

విశ్వనాథ సత్యనారాయణ వంటి వారెందరో కులతత్వంతో సహా సనాతన మతాన్ని, విలువల్ని అట్టిపెట్టాలన్నారు. సంస్కరణవాదుల్ని నిరసించే సాహిత్యం వచ్చింది. దివ్యజ్ఞాన సమాజం ఇందుకు అండదండలు చేకూర్చి పెట్టింది.

జస్టిస్‌పార్టీ బ్రాహ్మణ వ్యతిరేక సాంఘిక ఉద్యమంగా ఆంధ్రలో త్రిపురనేని రామస్వామి వంటివారిని ప్రోత్సహించింది. పురాణాలను, రామాయణ, భారత, భగవద్గీతలలోని అమానుష విలువల్ని చూపుతూ ఆయన రచనలు చేశారు. ఆర్యసమాజ్, హిందూ మహాసభ ప్రభావంతో ఆయన ఉద్యమం సాహిత్యపరంగా సాగగా కొందరిని ప్రభావితం చేసింది.

మతం పేరిట సాగుతున్న అంటరానితనాన్ని ఖండిస్తూ జాషువా కవితలు ఎందరినో కదలించి వేశాయి. దేవుడి పేరిట మతం దృష్ట్యా సాగిపోతున్న బూతును తాపీ ధర్మారావు కొంతవరకు శాస్త్రీయంగా బయటపెట్టారు.

మతాన్ని, దేవుణ్ణి అంగీకరిస్తూనే సంస్కరణలు రావాలని ఇలాంటి సాహిత్యం ఎంత వచ్చినా, మూలాన్ని పెకలించలేకపోయింది. మతానికి కట్టుబానిసలుగా మారిన మనుషులను బంధవిముక్తులను గావించడానికి తీవ్రస్థాయిలో గోరా నాస్తికఉద్యమం మొదలెట్టారు. వెలికి గురయ్యారు.

మరోప్రక్క దేశ స్వాతంత్ర్యోద్యమ ప్రవాహంలో ప్రభావితులైన వారు ఆ ధోరణిలో ఎన్నో రచనలు చేశారు. నాయకులపై కవితలు, వచనాలతో కూడిన సాహిత్యం వెలువడింది. ఉన్నవ లక్ష్మినారాయణ 'మాలపల్లి', తుమ్మల సీతారామమూర్తి 'ఆత్మకథ' ఇందులో భాగమే.

సంఘంలో జరుగుతున్న అక్రమాలు, మతం పేరిట సాగుతున్న దురన్యాయాలు 'సాక్షి' ద్వారా పానుగంటి లక్ష్మీనరసింహారావు వెల్లడించి నవ్వించారు.

మరోవైపు సామ్యవాద ఉద్యమాల హోరువలన ప్రచార సాహిత్యం పుంఖాను పుంఖంగా ప్రారంభమైంది. శ్రీశ్రీ యిందుకు శ్రీకారం చుట్టారు. కమ్యూనిస్టులు అప్పుడప్పుడూ మతాన్ని ముట్టడించినా, మతవిమర్శలోనే అన్ని విమర్శలూ ఆరంభించాలనే మార్క్స్ సూత్రాన్ని పాటించలేదు. ఆర్థిక చక్రం మారితే అన్నీ వాటంతట అవే కుదుటబడతాయని, మతం ఉపరితల నిర్మాణం అని భావించారు. అదంతా దోషపూరిత ఆలోచన అని రుజువైంది. కమ్యూనిస్టుల ప్రచార సాహిత్యం కొందరు యువకులను తాత్కాలికంగా ఉద్రేకపరచినా అది నిలవలేదు. అయితే స్వాములు, బాబాలు చేస్తున్న మోసాల్ని బయట పెట్టడంలో కమ్యూనిస్టు కవిత తోడ్పడింది.

గోపీచంద్ వంటివారు హేతువాద ధోరణిలో రచనలు ఆరంభించి క్రమేణా అరవిందో ప్రచారకులుగా మారిపోయారు.

హేతువాదం మతపరిధిలో మార్పులు తేవడం కుదరనిపని అని గ్రహించింది. మతాన్ని, దైవభావాన్ని శాస్త్రీయంగా పరిశీలించింది. మానవుడే కొలమానం, మనిషి అన్నిటికీ మూలం అనే మూలసూత్రాలతో హేతువాదం ఆవిర్భవించింది.

అంతర్జాతీయంగా వచ్చిన మానవ హక్కులు హేతువాదానికి పట్టుగొమ్మలు. మత సమాజంలో మానవహక్కులకై కృషిచేయడమంటే ఎదురీతే. అందుకే హేతువాదంలో రచనలు చేసేవారు మైనారిటీగానే మిగిలారు. వీరిది దీర్ఘకాలిక కృషి.

ఆంధ్రలో ఎం.ఎన్. రాయ్, మానవవాదతత్వంతో ప్రభావితులైన పాలగుమ్మి పద్మరాజు, జి.వి. కృష్ణారావు తమ రచనల ద్వారా కృషి చేశారు. వారి ప్రభావం పరిమితమే అయినా, రాజకీయ పార్టీల మోసాలు బయటపెట్టడంలోనూ, మానవుడి కీలకపాత్రను చాటడంలోనూ వీరి సాహితీసేవలు తోడ్పడ్డాయి.

సాహిత్యంలో ఔచిత్యం వుండాలని ఆవుల గోపాలకృష్ణమూర్తి తమ రచనలతో చెప్పారు. కొందరు కవులు, రచయితల్ని ఉత్తేజపరచారు. కొండవీటి వెంకటకవినుండి కొల్లా కృష్ణారావు వరకు ఆయన ప్రేరణలో రచనలుచేసి హేతువాదం మానవుడికి ఎలా అవసరమో చూపారు. మతంలోని అమానుష విలువల్ని ఎదిరించిన, ఆవుల గోపాలకృష్ణమూర్తి మనిషి కీలక స్థానాన్ని చాటడంలో తన పదునైన రచనల్ని ప్రయోగించారు.

హేతువాదానికి శాస్త్రీయ దృక్పథం పునాది. ఆంధ్ర సాహిత్యంలో శాస్త్రీయ పద్ధతి గురించి, శాస్త్రాన్ని గురించి రచనలు బహుకొద్ది మందే చేశారు. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి విజ్ఞాన వీధులు. మహీధర రామమోహనరావు రచనలు, కొడవటిగంటి కుటుంబరావు వ్యాసాలు, రావిపూడి వెంకటాద్రి విశ్వాన్వేషణ, జీవం అంటే ఏమిటి? శాస్త్రీయ రంగంలో హేతువాద దృక్పథం ప్రబలడానికి తోడ్పడుతున్నాయి. శాస్త్రాన్ని కూడా మతనమ్మకాలకు, మూఢవిశ్వాసాలకు అనుకూలంగా వాడే ప్రయత్నం కొందరు చేయకపోలేదు. అయితే అవి నిలవలేదు. శాస్త్రబలం అలాంటిది.

చరిత్రను హేతువాద దృక్కోణంలో చూడడం మన అవగాహనకు అవసరం. చాలాకాలం కట్టుకథలతో, పుక్కిటి పురాణాలను చరిత్రగా చలామణి చేశారు. అందుకు భిన్నంగా కల్లూరి బసవేశ్వరరావు, భట్టిప్రోలు హనుమంతరావు వంటివారు చరిత్రను శాస్త్రీయంగా అందించడానికి గట్టి ప్రయత్నాలు చేశారు. మన వెనుకబడినతనానికి చరిత్ర అవగాహన లోపించడం ప్రధానకారణం. ఏది వూహ, ఏది వాస్తవం అనే విచక్షణ లోపించింది. అందుకే చరిత్ర పరిశీలనకు శాస్త్రీయ దృక్పథం కొలమానంగా వుండాలి.

సెక్స్ గురించి మన సమాజంలో వున్నన్ని అపోహలు, అశాస్త్రీయ ఆలోచనలు మరే రంగంలోనూ లేవేమో! చలం కొంతవరకు యీ విషయంలో కొత్త మార్గాన్ని అవలంబించారు. ధనికొండ హనుమంతరావు, రాంషాలు మరికొంత ముందుకువెళ్ళి శాస్త్రీయ దృక్పథాన్ని ప్రబలింపజేశారు. వైద్యశాస్త్ర జ్ఞానంతో ముడివడివున్న యీ సెక్స్ జ్ఞానం విద్యార్థి దశ నుండి అందరికీ అవసరమని ప్రపంచవ్యాప్తంగా గ్రహించారు. డా॥ సమరం నాస్తిక కేంద్రం నుండి సెక్స్ జ్ఞానాన్ని, హేతుబద్ధంగా దినపత్రికల ద్వారా, పుస్తకాల రూపేణా విపరీత ప్రచారంలోకి తెచ్చారు. కామిగానివాడు మోక్షకామికాడనే మాట విన్నాం. ధర్మార్థ కామమోక్షాలలో కామాన్ని ఒక పురుషార్థంగా చేర్చారు. దేవాలయాలపై రతి రహస్యాలను చెక్కారు. అయినా సెక్స్ గురించి మూఢనమ్మకాలే మన సాహిత్యంలో ఎక్కడ చూచినా ఎదురయ్యాయి. హేతువాద దృక్పథం సెక్స్‌జ్ఞానంలో అవసరమని ఇప్పుడిప్పుడే కొద్దిమంది గ్రహించారు. ముఖ్యంగా రచనలు చేసేవారు తెలుసుకోకుండా వాత్సాయన కామశాస్త్రం దగ్గర ఆగిపోతే ప్రమాదం. స్త్రీలపట్ల వివక్ష చూపడంలో సెక్స్‌జ్ఞానలోపం ఒకటి అనేది కూడా గ్రహిస్తున్నారు.

మన సాహిత్యరంగంలో హేతువాద దృక్పథం బాగా లోపించడానికి సైకాలజి బొత్తిగా తెలుసుకోకుండా రచనలు చేయడం కారణం. సి. నరసింహారావు "రేపు" అనే పత్రిక ద్వారా సైకాలజీని ప్రజల్లోకి తీసుకెళ్ళి అనేక సమస్యల్ని హేతువాద దృక్పథంతో పరిష్కరింపజేయడానికి కృషిచేశారు. అధునాతనంగా మానసికరంగంలో పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి ప్రజల్లోకి రావాలి. స్త్రీపురుషులు, పిల్లలు గురించి శాస్త్రీయ అవగాహన వుంటేనే సమాజాన్ని హేతుబద్ధంగా ముందుకు తీసుకెళ్ళగలుగుతాం. ఇది నిత్యనూతనంగా జరగాల్సిన కృషి. బాల్యావస్థలోవున్న సైకాలజీ జ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఇంకా ఎంతో శ్రమ అవసరం.

సాహిత్యపరంగా మన సమాజంలో మహిళలకు జరిగిన అన్యాయం అమానుషమైనది. మతపరంగా వచ్చిన యీ వివక్ష అన్ని రంగాల్లోనూ ప్రబలింది. పాశ్చాత్య దేశాలలో వచ్చిన స్త్రీ విమోచనోద్యమం ఇంకా మన దగ్గర శైశవ దశలో వున్నది. ఆంధ్రదేశంలో కమ్యూనిస్టులు స్త్రీ శక్తి సంఘటనల పేరిట కొంత చైతన్యాన్ని తెచ్చారు. అయితే హేతువాద దృష్టిలో రచనలను చేసి మహిళా రంగంలో ఒక ఉప్పెనవలె చైతన్యం తేవడానికి మల్లాది సుబ్బమ్మ చేస్తున్న కృషి అనన్యసామాన్యం. మత ఛాందసులను అడుగడుగునా ఎదుర్కొంటూ ఆమె రచనలు సాగిస్తున్నారు.

ఆధునిక హేతువాద ధోరణికి మతవిమర్శ ఒక భాగంకాగా, శాస్త్రీయ దృక్పథం రెండవభాగంగా వున్నది. ఈ పద్ధతిని పాటిస్తూ తెలుగులో రచనలు చేస్తున్నవారు మల్లాది రామమూర్తి, రావిపూడి వెంకటాద్రి, ఆవుల సాంబశివరావు, కీ॥శే॥ నార్ల వెంకటేశ్వరరావు. మతాలన్నీ మానవుడికిగాక దైవానికి కేంద్రస్థానం కల్పించాయి. కర్మ, పునర్జన్మ, కులభేదాలు, అంటరానితనం, సతి, స్త్రీపట్ల వివక్ష యిత్యాదులన్నీ మతపరంగా వచ్చాయి. ఉన్నత సంప్రదాయాలుగా పేర్కొన్న వేదాలు, షడ్దర్శనాలు, ఉపనిషత్తులు, గీత, సామాన్యుడి సంప్రదాయాలుగా బహుళ ప్రచారం పొందిన భారత రామాయణ, పురాణాలు సమాజంలోని దోషాలకు ఆమోదముద్ర వేశాయి. వాటిని హేతువాద రచయితలు ఎదుర్కొనడానికి ప్రయత్నించారు. నార్ల వెంకటేశ్వరరావు జాబాలి, నరకంలో హరిశ్చంద్ర, ద్రౌపది, హిరణ్యకశిపుని వధ, సీతజోస్యం యీ కోవకు చెందినవే. అలాగే ఆవుల సాంబశివరావుగారి నాటికలు, విమర్శలుకూడా, మతదోషాల్ని సునిశితంగా పరిశీలించినా కొంత తీవ్రధోరణిలో రావిపూడి వెంకటాద్రి శంకరాచార్యుల తత్వాన్ని, మూఢనమ్మకాలను దుయ్యబట్టారు. ఇవన్నీ చాలా హేతుబద్ధంగా వున్నాయి. క్రైస్తవ, ఇస్లాం, హిందూ మతాల విమర్శలు మల్లాది సుబ్బమ్మ రచనల్లో కనిపిస్తాయి. "జిల్లెళ్ళమూడి అమ్మ" అనే రచన ఎం.వి. రామమూర్తి చక్కని విశ్లేషణ చేసి, బాబాలందరికీ అన్వయించేటట్లు శాస్త్రీయ పరిశీలన చేశారు.

వైజ్ఞానిక దృక్పథం ప్రత్యామ్నాయంగా వుండాలని, మతం స్థానంలో మానవ విలువలు వుండాలని హేతువాదులు ప్రతిపాదించారు. మతం, దైవం లేకుంటే నీతి వుండదనే భయాన్ని కాదంటూ, అవన్నీ మానవుడి సృష్టి అనీ, మనిషికి వైమనస్యత రాకుండా వుండడానికి మానవ హక్కులు, విలువలు పాటించాలని వీరు తమ రచనలలో చూపారు.

ఇస్లాంమతాన్ని హేతువాద దృక్పథంతో విమర్శించిన మల్లాది సుబ్బమ్మ, వివేకానందను నిశిత పరిశీలనకు గురిచేసిన ఆవుల గోపాలకృష్ణమూర్తి, బైబిల్ బండారాన్ని బయట పెట్టినందుకు ఎన్.వి. బ్రహ్మం అనేక నిర్హేతుక విమర్శలకు, చిక్కులకు లోనుగావలసి వచ్చింది. అయినా సాహిత్యంలో ఔచిత్యం కావాలని వీరు పట్టుబట్టారు.

హేతువాదం వేమనలో తొంగిచూడగా, వెంకటేశ్వరరావులో పరిపక్వతను అందుకోగా, వెంకటాద్రిలో శాస్త్రీయ పంథాలో సాగింది. హేతువాదం ఒక తాత్విక దృక్పథంగా అవగాహన అయిన తరువాత, అది కవితలో, నాటకంలో, నవలలో, సామాజిక, సాంకేతిక శాస్త్రాలలో, విమర్శలలో జీవం పోసుకుంటుంది.

మూఢనమ్మకాలు చాలా హాయిని సమకూర్చిపెడతాయి. కొందరు రచయితలు వీటిని బాహాటంగా తమ రచనలలో ప్రవేశపెట్టగా పాఠకుల్ని ఆకర్షిస్తున్నాయి. కాని ఇది మనిషి పురోగతికి పనికిరాదు. అందుకే హేతువాదం యిలాంటి రచనల్లోని మూఢత్వాన్ని ఖండిస్తుంది. నమ్మడం మొదలెడితే దేన్నైనా నమ్మొచ్చు. రుజువు అవసరం లేనప్పుడు, కర్మ, పునర్జన్మలపైన అన్నిటినీ

నెట్టెయ్యవచ్చు. హేతువాదం అడుగడుగునా శాస్త్రీయ పంథాను స్వీకరించి, తప్పులుచేస్తే దిద్దుకుంటూ, మనిషిని ముందుకు తీసుకెడుతుంది. ఇన్నాళ్లుగా మనకు యిష్టమైన నమ్మకాలను దెబ్బకొడుతుంటే కొందరికి బాధగా వుంటుంది. అయినా మానవ వికాసానికి శాస్త్రీయపంథా మూఢనమ్మకాలతో రాజీపడలేదు.

ఒక విధంగా చూస్తే హేతువాద రచనలు శైశవదశలోనే వున్నాయి. యువతరం ఇప్పుడిప్పుడే హేతువాదాన్ని ఆకాంక్షిస్తున్నది.

హేతువాదమన్న జ్యోతిని చేబూని
నరుడు నడచివచ్చె నేటి స్థితికి
హేయమౌను బ్రతుకు హేతువాదమువీడ
నవయుగాలబాట నార్లమాట

తెలిసిన విషయాలు తెలియనివాటిలో
ఎంతో స్వల్పమనును హేతువాది
విజ్ఞవీగ నతడు వేదాంతి కాడురా
నవయుగాలబాట నార్లమాట

ఇదీ సారాంశం :

ఎం.ఎన్. రాయ్, మానవతా ప్రభావం ఆంధ్రలో 1940 నుండీ కనిపించింది. ఆలోచనలలో శాస్త్రీయ దృక్పథానికి యీ తత్వం తోడ్పడింది.

(బెంగుళూరు తెలుగు మహాసభలకు 1990 మార్చి సమర్పించిన వ్యాసం)

*- హేతువాది, సెప్టెంబర్ 1990*

# అంబేద్కర్‌ను అంతం చేస్తున్నారు! ఆపగలవారున్నారా?

దేశంలో ఎక్కడ చూచినా అంబేద్కర్ పేరు వినవస్తున్నది. వినిపించే వారెవరనుకున్నారు? కాంగ్రెసు, భారతీయ జనతాపార్టీ, జనతాదళ్ పార్టీలు అంబేద్కర్‌ను భుజాన వేసుకొని మోస్తున్నాయి. పోటీపడి ఫోటోలు పెడుతున్నారు. విగ్రహాలు వేస్తున్నారు. వీధులకు పేర్లు పెడుతున్నారు. ఉత్సవాలు చేస్తున్నారు. అంబేద్కర్‌ను తెగ పొగిడేస్తున్నారు. అన్ని పార్టీలు, అందరు రాజకీయవాదులు అంబేద్కర్‌ను గౌరవిస్తుండగా ఇక కావాల్సిందేమున్నది! సాంఘీకన్యాయం రాకేం చేస్తుంది!

ఒకసారి జాగ్రత్తగా చరిత్రను పరిశీలించండి. హిందూమతం హింసతో జంతుబలులు

చేస్తూ యజ్ఞయాగాదులు జరుపుతూ వున్న రోజులలో బౌద్ధం పుట్టింది. అహింసావాదం ప్రచారం చేసింది. సంఘంలో వున్న హెచ్చుతగ్గులు పోవాలన్నది, స్త్రీపురుషులు సమానం అనీ, మానవులంతా ఒక్కటేనని అన్నది.

ప్రజలు బౌద్ధాన్ని ఆరాధించారు. ఆదరించారు. అనుసరించారు. అప్పుడేం జరిగింది? హిందూమతం పునరుద్ధరణ పేరిట, రాజుల సహాయంతో శంకరాచార్యులు మొదలైనవారు బౌద్ధాన్ని చంపేశారు. బౌద్ధభిక్షువులను నాశనం చేశారు. బౌద్ధ ఆరామాలను కొన్నిచోట్ల దేవాలయాలుగా మార్చారు. అయినా, బౌద్ధం పూర్తిగా నాశనం కాకపోయేసరికి, బుద్ధుడిని పొగడడం ప్రారంభించారు. నేడు అంబేద్కర్‌ను పొగిడినట్లే నాడు బుద్ధుడిని ఆకాశానికి కెత్తారు తెలివిగా. బుద్ధుడు కూడా దశావతారాలలో ఒక్కడన్నారు. దేవుడు అనే భావనను దూరంపెట్టిన బుద్ధుడినే దేవుడిగా మార్చి కొలిచారు. కాని బుద్ధుడి భావాలు అమలుపరచలేదు. సమానత్వం అనే మూలభావాన్ని ఆచరించలేదు. కాని బౌద్ధాన్ని పారద్రోలగలిగారు.

మనదేశంలో బౌద్ధం నాశనంగావడం పునర్వికాసానికి, హేతువాదానికీ, మానవ వాదానికి ప్రమాదంగా పరిణమించింది. కులాల హెచ్చుతగ్గులు మళ్ళీ విజృంభించాయి. బౌద్ధులకు, హిందువులకు జరిగిన పోరాటంలో అంటరానితనం పుట్టింది. సంస్కరణవాదులు ఎందరు పైపైన ప్రయత్నించినా, హిందూ సమాజంలోని దోషాల్ని తొలగించలేకపోయారు. ఈ దోషాలకు మూలాధారంగా "పవిత్ర" మతగ్రంథాలు, శాస్త్రాలు నిలిచాయి. వాటి జోలికి పోకుండా తలపెట్టిన సంస్కరణలు హిందూమతాన్ని అందలి దోషాల్ని తొలగించలేకపోయాయి. 20వ శతాబ్దంలో అంటరానితనాన్ని పాటించే హిందూ సమాజం ప్రపంచం దృష్టిలో తలవంపులకు గురైంది.

అలాంటి స్థితిలో అంబేద్కర్ వచ్చి కూలంకషంగా హిందూ సమాజంలోని దోషాల్ని పరిశీలించారు. వాటిపై పోరాడారు. ధ్వజమెత్తారు. ఆయన చెప్పినవి, చేసినవి సబబే అనిపించారు. అంటరాని కులాలవారు, శూద్రులు సమాజంలో గణనీయంగా వున్నారు. వారికి ఓట్లున్నాయి అవి లేనిదే ఏ పార్టీ గెలవదు. కనుక రాజకీయపార్టీలు కొత్త ఎత్తుగడలతో, తాత్కాలికంగా ఓటర్లను మభ్యపెట్టే వ్యూహాలు అనుసరిస్తున్నాయి. అందులో భాగంగా నేడు అంబేద్కర్‌ను తెగ పొగిడేస్తున్నారు. అది విని అటు షెడ్యూల్ కులాలు, అటు శూద్రకులాలు సంతోషపడి ఓట్లు వేయాలని రాజకీయ పార్టీల ఉద్దేశం.

అంబేద్కర్ సిద్ధాంతీకరించిన వాటిని ఆమోదించి ఆచరిస్తామంటే అభ్యంతరం ఏమిటి అనే ప్రశ్న రావచ్చు. అందుకే యీ వ్యాసం. అంబేద్కర్ రాసినవి, చెప్పినవి ఏ రాజకీయపార్టీ ఆమోదిస్తున్నది? ఎంతవరకు ఆచరించగలవు అనేదే యిప్పటి పరిశీలనాంశం. నిజంగా ఆమోదిస్తే సంతోషం. కాని పొగుడుతూ, గోతులు తవ్వి అంబేద్కర్‌ను పూర్తిగా చంపేయాలనే ఎత్తుగడ అయితే, జాగ్రత్త పడాలి. ఆ విషయం శ్రద్ధగా, లోతుగా పరిశీలించాలి. అంబేద్కర్ పేరిట, కొందరు బయలుదేరి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ కమిటీలు వేయమనీ, విగ్రహాలు

ప్రతిష్ఠించమనీ, ఉత్సవాలు జరపమనీ కోరుతున్నారు. ఇలాంటి అంబేద్కర్‌వాదులను సంతృప్తి పరచడానికి ప్రభుత్వాలు ఎప్పుడూ సిద్ధమే. అది కూడా అంబేద్కర్‌వాదాన్ని ఉరితీయడానికి పన్నుగడే. ఈ విషయం గ్రహించడానికి అంబేద్కర్‌వాదులకు కొంతకాలం పట్టొచ్చు. ఈలోగా ప్రమాదం జరిగిపోతుంది.

ముందుగా కాంగ్రెసుపార్టీ అంబేద్కర్‌వాదం పరిశీలిద్దాం :

## కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ ప్రేమ

"కాంగ్రెస్, గాంధీజీ అంటరాని వారికేం చేశా"రని ప్రశ్నిస్తూ అంబేద్కర్ పుస్తకం రాసి, గాంధీ బ్రతికుండగానే ప్రచురించారు. ఆ ప్రశ్నలకు నాటికీ, నేటికీ సమాధానం రాలేదు. బహుశా రాదుకూడా. గాంధీజీ సమాధానం చెప్పకపోవడానికి వ్యూహం, ఎత్తుగడ కారణాలైతే, కాంగ్రెసువారు జవాబివ్వకపోడానికి అశక్తత కారణం. అప్పటి కాంగ్రెసు వేరు, నేటి కాంగ్రెసు వేరు అనడానికి వీలున్నదా అంటే, వీల్లేదేమో. 100 సంవత్సరాల కాంగ్రెసు ఉత్సవాలు జరుపుకున్న కాంగ్రెసువారు, కాంగ్రెసు సంస్కృతి పుణికి పుచ్చుకున్నట్లు సగర్వంగా చెప్పుకున్నారు. కనుక, అదంతా చరిత్ర. నేడు కొత్తగా ఆరంభిద్దాం అనడానికి వీల్లేదు. అలాగే కాంగ్రెసుకు గుత్తాధిపత్యంగా గాంధీజీని స్వీకరించిన పార్టీ అంబేద్కర్ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే. అంబేద్కర్ వ్రాసిన పుస్తకం సారాంశంగా ప్రశ్నలేమిటో చాలా సంక్షిప్తంగా ఒక్కసారి కాంగ్రెసువారికి జ్ఞాపకం చేద్దాం. ఆ తరువాత వారేమంటారో వారికే వదిలేద్దాం.

సమాజంలో సంస్కరణలు కావాలని కాంగ్రెసు పుట్టినప్పటినుండీ ఒకవర్గం అభిప్రాయపడినా, రాజకీయ స్వాతంత్ర్యానికే ముందు ప్రాధాన్యత యివ్వాలని బలమైన వర్గం వాదిస్తూ వచ్చింది. కాంగ్రెసులో సంప్రదాయవాదులుగా ప్రభావితం చేసిన బాలగంగాధర్ తిలక్, అనిబిసెంట్ హిందూ సమాజాన్ని వెనకేసుకొచ్చారు. పైకి ఎన్ని చెప్పినా, కుల హెచ్చుతగ్గులు, అంటరానితనం పోవాలని వారు చిత్తశుద్ధితో కృషిచేయలేదు. అంటరానితనాన్ని డొంకతిరుగుడు వాదంతో అనిబిసెంట్ సమర్థించింది. కాని, అంటరానితనం తొలగించాలంటూ ఆమె అధ్యక్షతన కాంగ్రెస్ తీర్మానించి, ఆచరణలో ఏమీ చేయకుండా వుండడం (1917లో) గమనిస్తే, నిమ్నజాతుల్ని మోసగించడం ఒక పథకం ప్రకారం సాగిపోయిందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

ఆ తరువాత గాంధీజీ రంగప్రవేశం చేసి, కాంగ్రెసును ఆక్రమించి, అంటరానివారి ఉద్ధారకుడుగా ఎప్పటికప్పుడు భ్రమలు కల్పించడం, ఆయన రాజకీయ చతురతకు నిదర్శనం. అంటరానితనం తొలగించడానికి కార్యక్రమం చేబట్టాలని 1922లో గాంధీజీ ఆధ్వర్యాన కాంగ్రెసు పార్టీ తీర్మానించింది. దీనినే బార్డోలీ తీర్మానం అంటారు. అంతే, తీర్మానంతోనే పని ఆగిపోయింది. గాంధీజీ మాత్రం అంటరానివారి ఆర్తత్రాణపరాయణుడుగా పేరు తెచ్చుకున్నాడు. కాంగ్రెసువారు కమిటీలు వేశారే తప్ప, ఏమీ చేయలేదు. గాంధీజీ మిగిలిన విషయాలలో వెంటాడి పనులు

చేయించినా, అంటరానితనం వరకూ తీర్మానాలకే పరిమితం చేశారు. తిలక్ స్వరాజ్యనిధి వసూళ్ళుచేసి, నిర్మాణ కార్యక్రమం సాగించి, అంటరానితనం నిర్మూలనకు ఉపక్రమించారు. గాంధీజీ విజ్ఞప్తి మేరకు ప్రజలు 1921 లోనే ఒకకోటి 30 లక్షల రూపాయల నిధి యిచ్చారు. అంటరానితనం నిర్మూలనకు ఎంత ఖర్చు చేశారయ్యా అంటే 43 వేలు మాత్రమే. గాంధీజీ యీ విషయమై ఏమీ అనలేదు.

అంటరానివారికి ప్రత్యేక ప్రాతినిధ్యం వుండాలని అంబేద్కర్ కోరారు. బ్రిటిష్ పాలకులు అంగీకరించారు. ముస్లింలకు ప్రత్యేక ప్రాతినిధ్యం అంగీకరించిన గాంధీజీ, అంటరానివారికి ప్రత్యేక ప్రాతినిధ్యం వుండాలంటే ఆమరణ నిరాహారదీక్ష పూనారు. అంటరానివారు శతాబ్దాలుగా ఎలా వుంటున్నా సరే, వారు బాగుపడక పోయినాసరే, గాంధీజీ ప్రాణం విలువైంది గనుక, ఆయన్ను బ్రతికించుకోవాలన్నారు. అంబేద్కర్‌పై వత్తిడి తెచ్చి, బలవంతంగా ఆయనచేత ప్రత్యేక ప్రాతినిధ్యం కొరకు పట్టుబట్టనని ఒప్పించారు. అంటే గాంధీజీ కోరినట్లు అంటరానివారు హిందువులలో భాగంగా అలాగే అణిగిమణిగి పడివుండేటట్లు పూనా ఒడంబడిక చేసిందన్నమాట. అంబేద్కర్‌ను ఓడించి, గాంధీ నెగ్గి, అంటరానివారిని చాలా అన్యాయాలకు గురిచేశారు.

కేరళలోని గురువాయూర్ దేవాలయంలో అంటరానివారికి ప్రవేశం కల్పించకపోతే ఆమరణ నిరాహారదీక్ష పూనుతానని బెదిరించిన గాంధీజీ ఆ మాట ఎన్నడూ నిలబెట్టుకోలేదు. అగ్రవర్గాలవారు అంటరానివారి దేవాలయ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తుంటే, కాంగ్రెసుపార్టీ ఓట్లకోసం అగ్రకులాల వారిని సమర్థిస్తుంటే, గాంధీ, కాంగ్రెసును ఖండించలేదు.

చీటికిమాటికి సత్యాగ్రహాలు, ఆమరణ నిరాహారదీక్షలు చేసిన గాంధీజీ, ఒక్కసారైనా అంటరానితనం నిర్మూలనకు నిరాహారదీక్ష పూనలేదు. ఎందుకని? హిందూ సమాజంలో అంటరానివారిని అట్టిపెట్టాలని గాంధీజీ ప్రయత్నించడమేగాక సనాతనవాదిగా కులాలు, వర్ణాలు వుండటాన్ని సమర్థించాడు. వాటికి మూలమైన శాస్త్రాల్ని, గీతను ప్రచారం చేశాడు. కులాన్ని కాదని, వర్ణ వ్యవస్థను సమర్థించడం కూడా గాంధీజీ ఎత్తుగడే.

కనుకనే గాంధీజీవల్ల జాగ్రత్తగా వుండమని అంబేద్కర్ పదేపదే హెచ్చరించాల్సి వచ్చింది. అంటరానితనం తొలగించనిదే స్వరాజ్యం రాదన్న గాంధీజీ ఒక్కసారైనా నిరాహారదీక్షకు పూనుకోపోవడం, కాంగ్రెసు చేత ఎలాంటి కార్యక్రమాన్ని చేబట్టించకపోవడం గాంధీజీ చిత్తశుద్ధికి గీటురాయి. అలాగే సత్యాగ్రహం అనే ఆయుధాన్ని అంటరానివారి కోసం ఎన్నడూ ఉపయోగించని గాంధీజీ, 1929లో దేవాలయ ప్రవేశానికి అంటరానివారే సత్యాగ్రహానికి పూనుకుంటే, గాంధీజీ స్వయంగా వారిని ఖండించారు. అంబేద్కర్ ఆశ్చర్యపోయాడు. దేవాలయ ప్రవేశార్హత బిల్లును కేంద్ర శాసనసభలో రంగ అయ్యర్ ప్రవేశపెట్టడానికి గవర్నర్ జనరల్ అనుమతించకపోతే, చూసుకోమరి అని గాంధీజీ బెదిరించాడు. ఎన్నికల దృష్ట్యా యీ బిల్లుకు కాంగ్రెసు పార్టీ

మద్దత్తును ఉపసంహరించింది. గాంధీజీ కాంగ్రెసును వెనకేసుకొచ్చారే గాని, అంటరానివారిని కాదు. హరిజన సేవాసంఘం పక్షాన హక్కుల పోరాటానికి గాంధీజీ ఎన్నడూ అనుమతించలేదు. పైగా హరిజన సేవాసంఘ యాజమాన్యంలో హరిజనుల్ని గాంధీజీ తొలగించారు! పూనా ఒడంబడిక తరువాత అంటరానివారికి కేటాయించిన స్థానాలలో వారిపై పోటీపెట్టవద్దని కాంగ్రెసుకు గాంధీజీ సలహా యివ్వలేదు. కాంగ్రెసు మంత్రివర్గాలలో అంటరానివారికి ప్రాతినిధ్యం వుండాలని గాంధీజీ ఎన్నడూ పట్టుబట్టలేదు. పైగా మధ్య పరగణాలలోని మంత్రిమండలిలో అగ్నిభోజ్ అనే అంటరాని ప్రతినిధి నియామకాన్ని గాంధీజీ వ్యతిరేకించాడు.

గాంధీజీకి అంటరానివారిపట్ల చిత్తశుద్ధి లేదనడానికి అంబేద్కర్ ఎన్నో ఉదాహరణలు చూపాడు. అలాగే కాంగ్రెసువారి చర్యల్ని వస్త్రకాయంపట్టి వారి విద్రోహచర్యల్ని బట్టబయలు చేశాడు. కనుక వీటికి సమాధానం కాంగ్రెసువారే చెప్పాలి. లేదా, గాంధీజీని, స్వాతంత్ర్యానికి ముందున్న కాంగ్రెస్‌ను పూర్తిగా ఖండించాలి. తాము కొత్త అవతారం ఎత్తామని చూపాలి. అది సాధ్యమా? ఆచరణలో కాంగ్రెసువారు ఎలా వున్నారు? అదీ పరిశీలిద్దాం.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన హిందూ కోడ్ బిల్లును సనాతన హిందువులు వ్యతిరేకించారు. జవహర్‌లాల్ నెహ్రూ 'పైకి' సెక్యులర్, అభ్యుదయవాదిగా వున్నా ఎన్నికల సమయానికి సనాతనులకు లొంగిపోయాడు. ఫలితంగా అంబేద్కర్ నెహ్రూ మంత్రిమండలి నుండి రాజీనామాచేసి బయటకు పోవాల్సి వచ్చింది. ఆ తరువాత అంబేద్కర్ అంటరానివారి విమోచనకై ఉద్యమించి, "హిందువులలో వున్నంతకాలం వారికి సమానత్వం రావడానికి వీల్లే"దని గ్రహించి, బౌద్ధంలో చేరాడు, చేర్పించాడు. అంటరానివారిపట్ల ప్రేమ నటించిన కాంగ్రెసువారు, అంతవరకూవున్న సౌకర్యాలను, ప్రత్యేక కేటాయింపులను అంబేద్కర్ అనుచరులకు లేకుండా చేశారు. జనతా ప్రభుత్వంలోగాని మళ్ళీ వారి హక్కులు పునరుద్ధరణ కాలేదు!

అంటరానివారికి, శూద్రులకు ప్రత్యేక ఆహారంగావున్న ఆవు మాంసం కూడా నిషేధించడానికి వినోబాభావే పూనుకున్నాడు. ఆందోళన జరిగింది. గోవును చంపడం మతపరంగా పాపం అంటూ చిత్రీకరించి, ఆందోళనచేసి, వత్తిడితెచ్చి నిషేధ శాసనాలు చేయించారు. దీనికి కాంగ్రెసు మద్దత్తు వున్నది. ఆహారం ఏది తినరాదో శాసించే స్థితికి పోయారంటే, నియంతృత్వ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. అడుగడుగునా వినోబాభావే ఆశీస్సులకోసం ఇందిరాగాంధి, కాంగ్రెసువారు ప్రయత్నించారు. హరిజనుల ఉద్ధరణకే కంకణం కట్టుకున్నట్లు నటించిన ఇందిరాగాంధి, 20 సూత్రాల పేరిట హరిజన ఓట్లకై గాలంవేసి నెగ్గింది. కాంగ్రెసు పార్టీలో వచ్చిన చీలికను తనకు అనుకూలంగా మలచుకోగలిగిన ఇందిరాగాంధి, ఆర్థికంగా హరిజనులకు ఏవో పంచుతున్నట్లు చూపి, రాజకీయంగా వారిని నిర్వీర్యుల్ని చేసింది. అంటరానితనాన్ని పాటించే శంకరమఠాలను ఆమె ప్రోత్సహించడమే గాక, దక్షిణాదిలో శంకరాచార్యుల ఆశీస్సులకోసం తరచు వచ్చింది.

అలాంటి శంకర ఆశ్రమాలలో స్మార్త బ్రాహ్మణులే వంటలు చేయాలని నేటికీ కట్టుదిట్టాలు పాటిస్తున్నారు. తల్లి అడుగుజాడల్లోనే రాజీవ్‌గాంధీ కూడా అనుసరిస్తున్నాడు.

అంటరానితనం పాటిస్తున్నారంటూ మంత్రాలయం (కర్నూలు) గురించి మొత్తుకున్న మసాల ఈరన్నపై రాఘవేంద్రస్వామి ఆలయాధిపతులు కేసులుపెట్టి వేధిస్తే కాంగ్రెసువారు నిమ్మకు నీరెత్తినట్లున్నారు. చివరకు ఇందిరాగాంధి పాలనలో ఉక్కిరిబిక్కిరి అయినట్లు భావించిన జగజీవన్‌రామ్ కూడా కాంగ్రెసునుండి బయటపడిపోవాల్సి వచ్చింది. హరిజనుల పట్ల మొసలి కన్నీటితో కాంగ్రెసుపార్టీ, వారిని భ్రమలో అట్టిపెడుతూ వస్తున్నది. ఆచరణలో మాత్రం శాస్త్రాలను, మతాలను సమర్థిస్తూ, అగ్రకులాన్ని కొమ్ముకాస్తున్నది.

అంటరానితనం తొలగించడానికి కాంగ్రెసు నాడూ నేడూ చిత్తశుద్ధిని చూపలేదు. నేటికీ ఓట్లకై అంటరానివారిపట్ల ప్రేమ ఒలకబోసి మోసం చేస్తున్నది. కాంగ్రెసుపార్టీ నిర్వాకం అలాగున్నది. పదవులకోసం కొందరు కాంగ్రెసులోవుంటూ అంటరానివారిపట్ల తీవ్రద్రోహం చేస్తూ, అంబేద్కర్ ఉద్యమాన్ని ఉరితీస్తున్నారు. ఈ విషయం వారికి తెలియకకాదు. తాత్కాలిక ప్రయోజనం, స్వార్థం దృష్ట్యా అలా చేస్తున్నారు.

## భారతీయ జనతాపార్టీ - అంబేద్కర్

అంబేద్కర్‌కు ప్రస్తుతం దేశంలో కొత్త అభిమానులు ఏర్పడ్డారు. భారతీయ జనతాపార్టీ ఇటీవల ఒకనోట గాంధీజీని, మరోనోట అంబేద్కర్‌ను పొగుడుతూ, వారి ఆశయాలను ఆచరిస్తామంటున్నది. ఒకే వేదికపై గాంధీజీని, అంబేద్కర్‌ను చేర్చారంటేనే బిజెపిని శంకించవలసి వస్తున్నది. గాంధీజీని కొత్తగా గుత్తకు తీసుకున్న బి.జె.పి. తమ ఎత్తుగడలో అంబేద్కర్‌ని కూడా చేర్చడం గమనార్హం. కాని యీ ఎత్తుగడ విఫలంగాక తప్పదు. అంబేద్కర్‌లో బి.జె.పి. ఆమోదించే అంశమేదీ కనిపించడం లేదు. కేవలం ఓట్ల కోసమే, కాంగ్రెసువారి వలె, బి.జె.పి. కూడా అంబేద్కర్‌ను శ్లాఘిస్తున్నా, అది మరీ కృత్రిమంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే వుంది. అయినా, బి.జె.పి. నీతికి తానే పట్టం గట్టినట్లు పేర్కొంటున్నందున్న వారి విషయం పరిశీలించవలసి వుంది.

ఇటీవలే బి.జె.పి. వారు అయోధ్యలో రామమందిర నిర్మాణానికై కంకణం కట్టుకున్నారు. రామరాజ్యం నిర్మిద్దాం అంటూ, అయోధ్య మందిర నిర్మాణానికై దేశవ్యాప్తంగా బి.జె.పి. కార్యకర్తలు రాళ్ళు మోసుకొని వెళ్ళారుకూడా. అదంతా మతకలహాలకు దారితీసింది. కాని అంబేద్కర్‌ను పొగుడుతూ, ఆయన ఆశయాలను పాటిస్తామంటున్న బి.జె.పి. వారికి అసలు విషయం తెలియదనుకోలేం గదా! అందులో బాగా చదువుకున్న నాయకులు, అనుచరులు ఉన్నారు. వారిలో అందరూ కాకున్నా, కొందరైనా అంబేద్కర్ రచనలు చదివి వుంటారు. హిందూమతాన్ని గురించి, రాముడిని - రామాయణాన్ని గురించి అంబేద్కర్ రాసింది వారి దృష్టికి వచ్చే వుంటుంది.

అంబేద్కర్ రచనలలో అముద్రితంగా వున్న రచనలు కొన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రచురించగా, అందులో రాముడి గురించిన విషయమై పెద్ద ఆందోళన జరిగింది. బి.జె.పి., శివసేన, హిందూ ఛాందసులు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. కనుక అంబేద్కర్‌లో బి.జె.పి. వారు అంగీకరిస్తున్నదేమిటో, నిరాకరిస్తున్నదేమిటో జనానికి తెలియాలి. ఫలానా విషయం తృణీకరిస్తున్నామంటే, ఎందుకో కారణాలు కూడా బి.జె.పి. చెప్పాలి. ఇదేమీ చేయకుండానే బి.జె.పి. హఠాత్తుగా అంబేద్కర్ వర్ధంతులు, జయంతులు జరుపుతూ వూరేగింపులు చేస్తుంటే అంబేద్కర్ వణికిపోతుండాలి! బుద్ధుడికి హిందువులు పట్టించిన గతి, అంబేద్కర్‌కు బి.జె.పి. వారు పట్టించదలచారా?

అంబేద్కర్ హిందూమతాన్ని ఖండించారు. వేదాలనుండే మొదలైన వర్ణవ్యవస్థ, పురుషసూక్తంనుండీ 4 వర్ణాల వర్ణన పేర్కొని, నిరసించారు. ధర్మశాస్త్రాల అమానుష నియమాలను, రామాయణ, మహాభారత అవినీతి పంథాను బట్టబయలు చేశారు. హెచ్చుతగ్గుల హిందూసమాజంలో శూద్రుల స్థితి, బౌద్ధంపై పోరాడి సృష్టించిన అంటరానితనం హిందువులు ఎలా పోషించారో చారిత్రకంగా పేర్కొన్నారు. హిందువులు పూర్వం యజ్ఞయాగాదుల పేరిట ఆవుల్ని చంపి, ఆవు మాంసం తిన్న ఉదంతాల్ని చూపారు. హిందూమతంలో అంటరానివారికి స్థానం లేదనీ, సమానత్వం రాదనీ స్పష్టం చేశారు. కనుక హిందూమతాన్ని తృణీకరించి, బౌద్ధులుగా మారి అంటరానివారంతా సమానతను సాధించుకోవాలన్నారు.

అంబేద్కర్ కేవలం ద్వేషంతో, పగతో హిందువులలో అగ్రవర్ణాల వారిని, ముఖ్యంగా బ్రాహ్మణ ఛాందసులను తిట్టలేదు. సుదీర్ఘంగా పరిశోధించి, ప్రమాణాలతో విషయ పరిశీలన చేసి చూపారు. పరస్పర విరుద్ధ విషయాలను ఎత్తి, ప్రస్తావించారు.

మనువు తన ధర్మశాస్త్రంలో పేర్కొన్న అమానుష, క్రూర, ఘోర నియమాలు, నిషిద్ధాలు, అక్రమశిక్షలు, నిచ్చెనమెట్ల సమాజాన్ని బిగించిన తీరు చూపారు. అంటరానితనాన్ని శాస్త్రోక్తంగా సమర్థిస్తున్న ధర్మాలను అంబేద్కర్ చూపారు. ఇవేవీ తెలియనట్లు బి.జె.పి. నటిస్తోందా? లేక అవన్నీ మరచిపోదాం అంటోందా? అంబేద్కర్ ఆశయాలు అమలు జరగాలంటే, కొన్ని శాస్త్రాల్ని, గీతను, వేదాలను, రామాయణ, మహాభారతంలోని అంశాలను, ధర్మశాస్త్రాల్ని పక్కన బెట్టాలి. వాటిని పాటించరాదని, మానవ హక్కులకు అవి విరుద్ధమని గ్రహించాలి. పాఠ్యగ్రంథాలలో యీ అంశాలు రాకుండా చూడాలి. అంటరానితనాన్ని పాటించే ఆశ్రమాధిపతుల్ని ఖండించాలి. ఇవి చేయడానికి బి.జె.పి. సిద్ధపడితే మనం సంతోషించాలి, ఆహ్వానించాలి. కేవలం అంబేద్కర్‌ను పొగిడితే అది ఓట్ల వ్యూహంగానే భావించాలి. ఎన్నికల నినాదంలో (ప్రణాళికలో) రాంమందిర్ ప్రస్తావన బి.జె.పి. విరమించాలి. రాముడిని గురించి అంబేద్కర్ ఏమంటున్నాడో చూద్దాం :

## రాముడు కావాలా? అంబేద్కర్ కావాలా? తేల్చండి

రాముడిని దేవుడిగా పరిగణిస్తూ వుండేవారు, అతడు సీత శీలాన్ని శంకించి ప్రవర్తించిన తీరుకు అసహ్యపడాలి. ఈ విషయంలో రాముడి చర్య నేరంతో కూడింది. రాజుగా రాముడు, తపస్సుచేస్తున్న శూద్రుడు శంబుకుడిని చంపడం, అతడు ధర్మాన్ని అతిక్రమించాడనడం, ఇదంతా ఒక చనిపోయిన బ్రాహ్మణ యువకుడి నిమిత్తం చేశాడనడం తప్పు.

రాముడి పుట్టుక వ్యవహారమంతా వ్యభిచారంతో కూడినదే. బుద్ధ రామాయణం ప్రకారం సీత రాముడి సోదరి. కనుక యీ యిరువురి పెళ్ళి ఆదర్శం కాదు. రాముడు ఏకపత్నీవ్రతుడూ కాదు. వాల్మీకి రామాయణాన్ని బట్టి కూడా రాముడికి చాలామంది భార్యలున్నారు. (అయోధ్యకాండ 8వ సర్గ 12వ శ్లోకం) ఇంకా ఉంపుడుకత్తెలు కూడా రాముడికి వున్నారు. రాముడిని దేవుడిగా చూచేవారు ఈ విషయాలు పరిగణనలోకి తీసుకోవాలని అంబేద్కర్ అన్నారు. సమాధానం చెప్పజాలని భక్తులు కర్రలు తీసుకొని వీధిన పడ్డారేగాని సహనంతో చర్చించలేకపోయారు. అదీ "రామ" సంస్కృతి.

మనం కోరుకునే మానవ హక్కుల్ని హిందూమత సమాజంలో సాధించడం సాధ్యంకాదని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం సమానత్వం లేదు. స్వేచ్ఛకు గుర్తింపు లేదు. జ్ఞానాన్ని అందరికీ అందుబాటులో వుంచే అవకాశం లేదు. సౌభ్రాతృత్వం అసలే లేదు. కనుక హిందూమతం ప్రజాస్వామిక విలువలకు చోటు పెట్టడం లేదని అంబేద్కర్ స్పష్టం చేశాడు (ఫిలాసఫి ఆఫ్ హిందూయిజం). హిందూ ధర్మాలు, పవిత్ర గ్రంథాల ఆధారంగానూ, ఆచరణరీత్యానూ జరుగుతున్న తంతును అంబేద్కర్ విశదీకరించాడు. సాంఘిక న్యాయానికి తోడ్పడని హిందూమతాన్ని అమానుషమైనదిగా సహజంగానే అంబేద్కర్ నిర్ధారించాడు.

బి.జె.పి.వారు అంబేద్కర్ తత్వాన్ని, వాదనల్ని ఏ మేరకు అంగీకరిస్తున్నారో, ఎక్కడ ఎందుకు నిరాకరిస్తున్నారో తెలపాలి. అంటరానితనం పోవాలి అని చిలుకపలుకులు ఉచ్ఛరిస్తే సరిపోదు. అది ఎలా సృష్టి అయిందీ, మూలస్థంభాలుగా నిలచి దీనిని ఎవరు పోషిస్తున్నదీ, అది పోవాలంటే ఏం చేయాల్సిందీ అంబేద్కర్ చెప్పారు. హిందూ సమాజం పాటిస్తున్న యీ మహానేరం ప్రపంచ చరిత్రలోనే మచ్చగా నిలచింది. అంబేద్కర్‌ను వాడుకుని ఓట్లు తెచ్చుకుందామనే బి.జె.పి. తప్పు త్రోవలో పయనిస్తున్నదేమో చూచుకోవాలి. బుద్ధుడిని చంపేసినట్లే, అంబేద్కర్‌ని కూడా నాశనం చేయాలనే పెద్ద కుట్రలో భాగస్వామిగా బి.జె.పి. వ్యవహరిస్తున్నదా? కాదంటే, అందుకు భిన్నంగా ఆచరణలో కనిపించాలి.

జనతాదళ్ కూడా అంబేద్కర్‌ను గౌరవిస్తున్నది. పార్లమెంటు హాలులో నిలువెత్తు ఫోటో పెట్టమన్నారు. హరిజనులపై అత్యాచారాల్ని అందరూ ఖండిస్తున్నారు. కాని వాటికి మూలంగా నిలచిన మతం, ధర్మశాస్త్రాలు, ఆశ్రమాలు, హిందూ దురభ్యాసాలు రూపుమాపకుండా, అంబేద్కర్‌ను

గౌరవించడం సాధ్యం కాదని గ్రహించాలి. కాంగ్రెస్, జనతాదళ్ ఒక తానులో వస్త్రాలే. ఎటొచ్చీ బి.జె.పి. కొంచెం భిన్నమైంది. ముగ్గురూ కలసి అంబేద్కర్ వాదాన్ని తియ్యని మాటల్తో, చేతల్తో ఉరితీయదలచారు. ఈ విషయం అమాయకులైన వారికి అర్థం గావడానికి కొంత సమయం పట్టొచ్చు.

## మార్క్సిజం - అంబేద్కర్

అంటరానివారు, శూద్రులు హెచ్చుతగ్గుల సమాజంలో అనుభవిస్తున్న కిరాతక చర్యల్ని గమనించిన అంబేద్కర్ అనేక మార్గాంతరాలను అధ్యయనం చేశారు. ప్రపంచంలో అనేక మందిని ఆకర్షించిన మార్క్సిజాన్ని ఆయన పరిశీలించకపోలేదు. బౌద్ధాన్ని, మార్క్సిజాన్ని పోల్చి కూడా అంబేద్కర్ చూచాడు.

శాస్త్రీయ సోషలిజంగా తన సిద్ధాంతాన్ని నిలపదలచిన మార్క్స్ అది విధిగా వచ్చి తీరుతుందని భావించినట్లు అంబేద్కర్ విశ్లేషించాడు. కాని 1917లో రష్యాలో వచ్చిన విప్లవం మార్క్స్ సిద్ధాంతాలకు అనుగుణంగా రాలేదన్నాడు. అది విధిగా సంభవించలేదంటే, ఎంతోహింస, రక్తపాతం జరిగిందనీ, మానవ ప్రయత్నం వలన రష్యాలో విప్లవం వచ్చిందనీ అంబేద్కర్ చెప్పారు. చరిత్రను ఆర్థిక దృక్పథంతో చూడడం సరైనది కాదని రుజువైందని కూడా అంబేద్కర్ స్పష్టం చేశారు. క్రమేణా కార్మికుడు పేదరికంలోకి పయనిస్తున్నట్లు కూడా సిద్ధాంతీకరించడాన్ని ఎవరూ అంగీకరించడం లేదన్నారు. ప్రపంచాన్ని పునర్నిర్మించడమే తత్వం చేయాల్సిన పని అని మార్క్స్ చెప్పింది సరైనదిగా అంబేద్కర్ భావించారు. వర్గాలమధ్య సంఘర్షణవున్నట్లు మార్క్స్ అన్నది వాస్తవం. వ్యక్తిగత ఆస్తివలన ఒకరు శక్తివంతమైన వర్గంగా, దోపిడీ వలన పరిణమిస్తున్నారు. ఈ వ్యక్తిగత ఆస్తిని తొలగించి సమాజం శ్రేయస్సును కాపాడాలి.

ఈ లక్ష్యాలను సాధించడానికి మార్క్స్, హింసను, కార్మిక నియంతృత్వాన్ని సూచించగా, బుద్ధుడు అహింసను, మానసిక మార్పును అవలంబించాడు.

మార్క్సిజంలో రాజ్యపరమైన సిద్ధాంతం బలహీనమైనదని, శాశ్వతంగా నియంతృత్వాన్ని అది సూచిస్తున్నదనీ అంబేద్కర్ విమర్శించాడు. రాజ్యం హరించిపోతుందని చెప్పినా అది ఎన్నడు జరుగుతుందో, అలా జరిగిన అనంతరం ఏమౌతుందో స్పష్టపరచలేదన్నాడు.

రష్యా విప్లవం సమానత్వాన్ని సాధిస్తుందని ఆహ్వానించాం. కాని స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం లేని సమానత్వం సమాజానికి అనవసరం. కమ్యూనిజంలో ఇవి లేవు గనుక తృణీకరించాలని అంబేద్కర్ అన్నాడు.

## ముగింపు

అంబేద్కర్ భారత సమాజాన్ని విభిన్న కోణాల నుండి క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశోధనా

ఫలితాలను ప్రచురించారు. శూద్రులెవరు అనే అంశం తీసుకొని, వేదకాలం నుండీ వర్ణాలుగా విభజించి చీల్చిన విషయాలను చూపారు. వేదాలలో వర్ణాలు లేవనే వారి వాదనను ఖండించారు. వర్ణాలు, కులాలు వేరని చూపి, సమర్ధించుకొనే ధోరణులు కూడా అంబేద్కర్ ఖండించారు. ఈ విషయంలో ఆర్యసమాజ్, గాంధి మొదలైన వారంతా అంబేద్కర్ విమర్శలకు గురైనారు. చారిత్రకంగా బ్రాహ్మణులు నిర్వహించిన పాత్ర వివరంగా పరిశీలించాడు.

అంటరానివారంటూ మనువుకు పూర్వం లేరనీ, గుప్తుల కాలం నుండీ యీ జాడ్యం అమలులోకి వచ్చినట్లు అంబేద్కర్ చూపారు. మను ధర్మశాస్త్రాన్ని బాగా పరిశీలించి, ఖండించారు. ఆమాటకొస్తే ధర్మశాస్త్రాలలోవున్న హెచ్చుతగ్గుల ప్రస్తావన, అమానుష ధోరణులు అంబేద్కర్ విమర్శలకు గురైనాయి. హిందువులకు, బౌద్ధులకు జరిగిన సంఘర్షణలో అంటరానివారు ఏర్పడినట్లు, అలాగే గోవధ నిషేధంకూడా మతపరం చేసినట్లు చూపారు.

హిందూ సమాజంలో ప్రజాస్వామిక లక్షణాలు, మానవహక్కులు లేవని, ఉండడానికి వీల్లేదని సోదాహరణగా అంబేద్కర్ తెలిపారు. సమానత్వం సోదరత్వం, స్వేచ్ఛలకు హిందూమతంలో తావులేదన్నారు. హిందూమతం అనేది కలగాపులగం అనీ, క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధంలవలె నిర్దుష్టంగా నిర్వచించ వీల్లేదనీ విపులీకరించారు.

హిందువులలో భాగంగా అంటరానివారిని పరిగణించినంతకాలం వారికి విమోచన, సమానత్వం, స్వేచ్ఛ రాదని అంబేద్కర్ నిర్ధారించారు. అందుకే వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం కావాలన్నారు.

రాజకీయాధికారం లేనిదే, అంటరానివారికి హక్కులు ఏర్పడవనీ, బానిసలకంటె అధములుగా వారిని చూస్తారని అంబేద్కర్ పేర్కొన్నాడు.

ఆచరణలో, రాజకీయవాదులు కేవలం ఓట్ల కోసం అంటరానివారిపై ప్రేమ ఒలకబోస్తున్నట్లు అంబేద్కర్ గ్రహించారు. ఇందులో అగ్రగణ్యుడు గాంధీజీగా ఆయన పసిగట్టి పోరాడారు. గాంధీ చెప్పే మాటలకు, చేసేవాటికి ఎలా పొంతనలేదో చూపారు. హిందువులలోనే అంటరానివారిని అట్టిపెట్టి, శాశ్వత వెట్టిచాకిరీ చేయించుకొనే ధోరణిని గాంధీ సమర్ధించారన్నారు. బౌద్ధంలో మాత్రమే సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం లభించగలవని అంబేద్కర్ నమ్మారు. బౌద్ధం మనదేశంలో ఏనాడో చంపేయబడింది. దీనిని పునరుద్ధరించడం చాలా కష్టమని అంబేద్కర్ గ్రహించలేదు. మానవ హక్కులకై అంబేద్కర్ పోరాటం ముందుకు సాగించవలసివుంది.

## అంబేద్కర్ మనువా?

అంబేద్కర్‌ను తరచు మనువుతో పోల్చి, ఆధునిక రాజ్యాంగనిర్మాత అనీ, ఆధునిక మనువు అనీ నాజూకుగా తిడుతుంటారు. జీవితమంతా అంబేద్కర్ ఎన్నో పరిశోధనలు చేసి

మనువుచేసిన ఛండాలమంతా బయట పెట్టాడు. మనదేశంలో విప్లవ ప్రతీఘాతుకం మనువుతోనే వచ్చిందన్నాడు. అంటరానితనం మనువునుండే ఆరంభమైనదన్నాడు. ఆడవాళ్ళకు స్వేచ్ఛ పోవడం, హక్కులు పోవడం మనువుతోనే మొదలయ్యాయన్నాడు. అలాంటి చండాలపు మనువుతో అంబేద్కర్‌ను పోల్చడం పరోక్షంగా ఆయన్ను అవమానపరచడమే.

మన రాజ్యాంగాన్ని తగులబెట్టాలని అంబేద్కర్ ఆవేదన వ్యక్తం చేశాడు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాల్గొన్నప్పటికీ, తనకు యిష్టం లేనివి ఎన్నో చోటుజేసుకోవడంతో ఆయన అలా భావించాల్సి వచ్చింది. కనుక రాజ్యాంగంలోవున్న వాటన్నిటికీ అంబేద్కర్‌ను బాధ్యుడుగా చేయడమూ భావ్యంకాదేమో.

అంబేద్కర్ ఆరంభించిన కృషి అడుగడుగునా అగ్రకులాల అవరోధాలతో వెనుకంజ వేసింది. కనుక రాజకీయ, ఆర్థిక, మత ప్రలోభాలకు లొంగక, మానవహక్కుల నిమిత్తం పోరాడటం, అంబేద్కర్ లక్ష్యాలను సాధించడానికి కృషిచేయడమే.

**- హేతువాది, మే 1991**

# దివ్యశక్తులు వుంటే హేతువాదులకు అభ్యంతరమేమిటి?

మన యోగులు తపస్సు చేసి దివ్యదృష్టిని సాధించినట్లు, శక్తులు పొందినట్లు చెబుతారు. వారు ఏమిచేశారో ఎలా సాధించారో వివరాలు తెలియవు. శరీరాన్ని శుష్కింపజేసి కఠోరదీక్ష చేసినట్లు చదివాం. ఇప్పటికీ అలా చేస్తే గొప్ప సాధన సాధ్యమని భావిస్తున్నారు. ఇదంతా ఆధునిక సమాజంలో గందరగోళానికి దారి తీస్తున్నది. నేడు సాధువులున్నారు. వారు సమాజానికి సంబంధం లేకుండా బ్రతుకుతున్నారు. జనంలో వారిపట్ల నమ్మకాలు, భయాలు వున్నాయి. సాధువులు తమ శక్తులు ప్రదర్శించి జనాన్ని హడలెత్తించి కాలం గడుపుతున్న వారున్నారు. రాజకీయ నాయకులు సైతం సాధువుల్ని ఆశ్రయించి ప్రయోజనాలు ఆశిస్తున్నారు. జనం ఎవరి పనుల్లో వారుంటూ, ఎప్పుడైనా ఒకసారి తీర్థయాత్రలకు వెడుతూ సాధువుల్ని కలుసుకోవడం మహాత్యాలు చూచి, నమ్మి మొక్కడం సహజం. ఈ మహాత్యాల వెనుక ఏముంది, ఎలా జరుగుతున్నాయి అని తెలుసుకోడానికి ప్రయత్నించరు. చిన్నప్పటి నుండే నమ్మకాలతో పెరగడంవలన, సాధువుల చర్యలు దివ్యశక్తులుగా కనిపిస్తాయి.

చదువుకున్నవారు సైతం మొక్కుతున్నారు, కాళ్ళమీద పడుతున్నారు, వాళ్ళకంటే మీరు గొప్పా అని అడిగే వారున్నారు. చదువుకున్నవారూ చదువుకోనివారూ అనే తేడా నమ్మకాల విషయంలో పనిచేయదు. ఒక విషయం బాగా చదువుకొని, డిగ్రీ తెచ్చుకొని, పెద్ద ఉద్యోగంలో వున్నంత మాత్రాన మిగిలిన విషయాలన్నీ తెలియాలనేమీ లేదు. ఇతర రంగాలలో కూడా

శాస్త్రీయంగా తెలుసుకుంటున్నారనేది చదువుకున్నవారు అట్టే పట్టించుకోరు. కనుక చిన్నప్పటినుండీ తల్లిదండ్రులు, బడిలో ఎన్ని నేర్చుకున్నా నమ్మకాల నుండి చదువుకున్నవారు సైతం ఒక పట్టాన బయటపడలేరు. పదవుల్లో వున్నవారికి భయాలు ఎక్కువ. కనుక ఎందుకైనా మంచిదని మొక్కుబడులు చేస్తూ, అవి చెల్లిస్తూ వుంటారు. వీటిల్లో స్నేహితుల చెప్పుడుమాటలు బాగా పనిచేస్తాయి. ఆపదలో వున్నప్పుడు జబ్బు చేసినప్పుడు యివి మరీ నమ్మకాల్ని పెంచుతాయి. అంజనం, తాయెత్తు, పూజలు, వ్రతాలు, నోములు, మొక్కుబడులు, స్వాముల దర్శనం, జోస్యం మొదలైనవన్నీ యిలా వ్యాపిస్తూ వస్తున్నాయి.

అందరూ చూడలేని 'దివ్యదృష్టి' సాధువులకు ఎలా కలుగుతుంది? చిరకాలంగా ప్రచారంలో వున్న యీ విషయాన్ని అవగాహన చేసుకోవాలి.

మనిషి ప్రాణవాయువు పీల్చడం అతిముఖ్యాంశం. అది లేకుంటే బ్రతకడం, పీల్చిన ప్రాణవాయువు వూపిరితిత్తులలోకి, రక్తంలోకి, మెదడులోకి పోతుంది. మళ్ళీ వదిలేది బొగ్గుపులుసు వాయువు. యోగులు, సాధువులు, రుషులు వూపిరి బిగబడతారు. ఇది ఒక అలవాటుగా క్రమేణా అభ్యాసం చేస్తారు. యోగంలో ఇదొక భాగం. ప్రాణాయామం అనే యీ చర్య మోక్ష సాధనలో మెట్టుగా పేర్కొన్నారు. బొగ్గుపులుసు వాయువు ఎక్కువసేపు వూపిరితిత్తులలో, రక్తంలో అట్టిపెడితే, మెదడుకు చాలినంత ప్రాణవాయువు అందదు. మెదడు సాధారణంగా పనిచేయాలన్నా ముఖ్యంగా ఆలోచించాలన్నా ప్రాణవాయువు సహజంగా అందాలి. కృత్రిమంగా మెదడుకు ప్రాణవాయువు తగ్గిస్తే ఆలోచన కూడా తగ్గుతుంది. తొలిదశలో రకరకాల పగటి కలలు, దృశ్యాలు, అర్థంపర్థంలేని ఏవో దృష్టులు గోచరిస్తాయి. అదొక లోకం. కళ్ళు మూసుకొని ప్రాణాయామం ఆచరించేవారికి రంగు దృశ్యాలు, తనకు తెలియని దృష్టులు కనిపిస్తాయి.

ఇది కేవలం ప్రాణాయామం చేసేవారికే పరిమితం కాదు. మతం, దైవం పేరిట ప్రార్థనలు, భజనలు, కీర్తనలు, ఆరాధనలు, సంగీతాలు చేసేవారికీ దృశ్యాలు కనిపిస్తాయి. ఇలా చేసేవారందరూ వూపిరి తక్కువగా పీలుస్తూ, ఎక్కువగా బొగ్గుపులుసు వాయువు అట్టిపెడుతూ, గాలి ఎక్కువగా వదులుతుంటారు. అందుకే బాబాలు భక్తులచే గీతాలాపనలు చేయిస్తుంటారు. చెప్పిందే చెప్పేటట్లు పునరుశ్చరణ (రాం - రాం - సీతారాం వంటివి) గంటలకొద్దీ పాడిస్తారు. అలసట వచ్చేటంతగా యీ పనిచేసేసరికి, గుంపులో వున్నవారు ఆలోచించలేరు. ఇదొక సామూహిక మనస్తత్వం. వారికి ఇష్టదైవం కనిపిస్తున్నట్లు ఏవో దృశ్యాలు చూస్తున్నట్లు అనిపిస్తుంది. దీనినే మధురానుభూతిగా చిత్రిస్తారు. రజనీష్ ఆశ్రమంలో యిలా సామూహిక భజనలు, ప్రార్థనలు, నృత్యాలు జరపడం తెలిసిందే. కొలువులో పూనకాలు రావడం, అరుపులు కేకలతో ఎగరడం ఇలాంటి చర్యే. ఈ విధంగా జరిగినప్పుడు దృశ్యాలు చూచేవారికి తాత్కాలిక "మధురానుభూతులు" కలిగినా, క్రమంగా సాధారణ స్థితికి వస్తారు. అంటే వూపిరి మామూలుగా పీల్చుకుంటారన్నమాట.

చెవిలో మంత్రం చెప్పి, అదేపనిగా పునరుశ్చరణ చేయమనడంలో కూడా యీ సూత్రమే అమలు జరుగుతుంది. ఒంటరిగా కూర్చొని మంత్రాన్ని కొన్నివందల వేలసార్లు వుచ్ఛరించేవారికి ఆలోచన మరేదీ వుండదు. మెదడు మామూలుగా పనిచేయదు. "హరి ఓం" అని గాని, మరోవిధంగా గాని, చెప్పినమాటే నిరంతరంగా చెబుతున్నవారు గాలి తక్కువ పీల్చి, ఎక్కువ వదులుతారు. భక్తిగీతాలు పాడేవారూ అంతే.

పూర్వం తపస్సు పేరిట దేహాన్ని శుష్కింపజేసిన వారిలో బి విటమిన్, సి విటమిన్ బాగా తక్కువగా వుండేది. పోషకాహారం లోపం వలన కూడా మెదడు సరిగా పనిచేయదు. వారు కూడా దృశ్యాలను చూడడం, అవి దివ్యదృశ్యాలని మధురానుభూతులని, భ్రమించడం కద్దు. దేవుడు ప్రత్యక్షమైనట్లు, వరాలిచ్చినట్లు వీరు అనుభూతి పొందుతారు. మామూలు స్థితికి వచ్చిన తరువాత చుట్టుపట్ల వున్నవారికి వారి అనుభూతులు, దృశ్యాలు వర్ణిస్తే, జనం అది విని వారిని "ద్రష్టలు"గా దైవాంశసంభూతులుగా, దైవజ్ఞులుగా, రాజర్షులు, మహర్షులు యిత్యాది పేర్లతో పిలిచి, కొలిచేవారు.

సాధారణ జనం ఎక్కువరోజులు తినకుండా తాగకుండా వుండలేరు. వారు కష్టించి పనిచేస్తేగాని గడవదు. అలాంటివారిని వారానికో పర్యాయం ఉపవాసం వుండమని నియమం పెట్టారు. మతపరంగా సంవత్సరంలో కొన్నాళ్ళు వరుసగా ఉపవాసాలు చేయిస్తున్న సంగతి అన్ని మతాలవారికీ తెలిసిందే. అలా ఉపవాసాలు చేసినప్పుడు శారీరకంగా బలహీనులకు మెదడుపై కొంత ప్రభావం కనబడొచ్చు. పరిమిత దృశ్యాలు, అనుభూతులకు వారు లోనుకావచ్చు. ఇలాంటివారిలో ఆధ్యాత్మిక రచయితలుంటే, వారు చూచిన, విన్న అనుభూతుల్ని గేయాలు, కథలు, రచనలుగా మార్చి అందిస్తారు.

శరీరాన్ని కష్టపెట్టడం తప్పుకాదని, పాపిష్టి శరీరం, ఎంత బాధలకు లోనైనా, ఆత్మకు ముక్తివస్తే చాలునని అన్ని మతాలు చెప్పాయి. మొహరంలో ముస్లింలు, కొలువుల్లో హిందువులు శరీరాన్ని బాదుకుంటారు. అలాంటప్పుడు ఎడ్రినలిన్, హిస్టామైన్ అనేవి విడుదల అవుతాయి. పుండ్లు పడడం, గాయాలు ఏర్పడడం సహజంగా జరుగుతుంటుంది. ప్రోటీన్లు దెబ్బతిని, టాక్సిక్ పదార్థాలు రక్తంలోకి పోతాయి. హిస్టామైన్ విడుదల అయి మెదడుకు షాక్ తగులుతుంది. అడ్రినలిన్ ఎక్కువగా విడుదల అయితే మెదడుపై ప్రభావం చూపెట్టి, భ్రమలు కలుగుతాయి. మెదడు సక్రమంగా పనిచేయడానికి ఎంజైములు కావాలి. శరీరాన్ని బాదుకున్నందువలన ఏర్పడే గాయాల నుండి స్రవించే టాక్సిక్ పదార్థాలు మెదడును సరిగా పనిచేయనియ్యవు. అప్పుడు కలిగే అనుభూతుల్ని మార్మికులు గొప్పగా చిత్రించి దివ్యమైనవిగా ప్రచారం చేశారు. మరికొందరు నిద్రను తగ్గించుకొని యోగాసనాల పేరిట శరీరాన్ని బాధపెట్టుకుంటారు. వీరికి క్రమేణా నిద్రపట్టని జబ్బువస్తుంది. ఆ దశలో ప్రార్థనలు చేస్తుంటారు. వీరికి మధురానుభూతులు వస్తాయి. 'సమాధి' దశవరకూ పోతుంటారు కూడా.

మనం పీల్చే ప్రాణవాయువులో 20 శాతం మెదడుకు కావాలి. గుండె కొట్టుకుంటూ శరీరంలో ప్రసరింపజేసే రక్తంలో 5వ వంతు మెదడుకు అవసరం. ఇందులో ఏదీ తగ్గినా మెదడు మామూలుగా పనిచేయదు. మతపరంగా ఆధ్యాత్మికం పేరిట చేసే ఉపవాసాలు, శరీరాన్ని శుష్కింపజేయడం, పోషకాహారం తినకపోవడం, శరీరాన్ని బాదుకోవడం, వూపిరి తగినంతగా పీల్చుకోకపోవడం, పీల్చినా ఎక్కువసేపు బలవంతంగా అట్టిపెట్టి బొగ్గుపులుసు వాయువును పెంచడం యివన్నీ ఉన్మాద చేష్టలే. ఇందులో తరతమ భేదాలున్నాయి. కాని మతం పేరిట చలామణి అవుతున్నాయి గనుక వాటిని ఖండించడానికి వెనుకాడతాం.

## ఆల్డస్ హక్స్‌లీ ప్రయోగాలు :

మధురానుభూతుల్ని మరోవిధంగానూ సృష్టించవచ్చు. ఆల్డస్‌హక్స్‌లీ యీ పరిశోధన చేసి మెస్కలిన్ అనే మత్తుపదార్థాన్ని స్వీకరించాడు. తద్వారా కలిగిన అనుభూతుల్ని, అనుభవాల్ని రికార్డు చేయించాడు. మెస్కలిన్‌లో వ్యసనంగా అలవాటుపడే లక్షణాలు లేవు. కనుక పరిశోధనకు అనుకూలంగా వుంది. అనుభూతులు, దివ్యదృష్టి సహజంగా రావాలి గాని, మందులు మింగి తెప్పిస్తే అది కృత్రిమం అని విమర్శించారు. ఇంతవరకు చర్చించిన అంశాల్ని బట్టి శరీరాన్ని కృత్రిమంగా హింసించిన ఫలితంగానే అనుభూతులు వస్తాయని నిర్ధారణ అయిందిగదా. పైగా శరీరం రసాయనిక, భౌతిక, విద్యుత్ పద్ధతులలో పనిచేస్తున్నది. కనుక మెస్కలిన్ ప్రయోగం తప్పు లేదు.

మెస్కలిన్ అనేది ఎడారులలో లభించే జెముడునుంచి తయారుచేస్తారు. మన వూళ్ళల్లో నాగజెముడు, బ్రహ్మజెముడు అనే కోవలోనికే యిది చెందుతుంది. ప్రస్తుతం శస్త్ర చికిత్సలలో మెస్కలిన్ వాడుతున్నారు. కండరాలు సడలటానికి, మధురానుభూతులకు యిది ప్రసిద్ధి. ఇది అలవాటుకాని మత్తుపదార్థం. స్వీకరించిన అనంతరం, దీని ప్రభావం తగ్గిపోయిన తరువాత మరే అవలక్షణాలు కనిపించడంలేదు. అందువలన ఆల్డస్‌హక్స్‌లీ తనమీద మెస్కలిన్ ప్రయోగం చేసుకున్నాడు. ఒక గ్రాములో నాలుగోవంతును అరగ్లాసు నీళ్ళలో కలిపి తాగాడు.

మనం ఇతరులను ఎలా చూస్తున్నాం? అలాగే మనల్ని ఇతరులు ఎలా గమనిస్తున్నారు? వారు చెబితే తప్ప తెలియదు పూర్తిగా చెప్పరు కూడా.

సాధారణ మానవుడిగావున్న నేను పిచ్చివాడిగా ఎలా ప్రవర్తిస్తాను? అది నాకు నేనుగా తెలుసుకోగలగడం అరుదు, విశేషం. మెస్కలిన్ వేసుకొని ఎలా ప్రవర్తిస్తాడో తెలుసుకునే ప్రయత్నం ఆల్డస్‌హక్స్‌లీ చేశాడు. ఎవరి పిచ్చివారికి ఆనందం అంటామే గాని, పరిశోధన చేసి చూడం. రుషులు, యోగులు, బాబాలు యీ పనిచేశారు. అదే పని ఆల్డస్‌హక్స్‌లీ చేశాడు.

మెస్కలిన్ ప్రభావం కొన్ని గంటలపాటు వుంటుంది. అర్థగంట తరువాత యీ ప్రభావ లక్షణాలు మొదలౌతాయి. ఉదయం 11 గంటలకు మెస్కలిన్ స్వీకరించిన ఆల్డస్ హక్స్‌లీకి

గంటన్నర తరువాత వింత దృశ్యాలు కనిపించసాగాయి. అందరూ మామూలుగా చూచే బాహ్య ప్రపంచం "మరో విధంగా" కనిపించసాగింది. అప్పుడు హక్స్లీ పక్కనే వున్న పరిశీలకుడు అతడి మాటలన్నీ రికార్డు చేశాడు. మధ్యమధ్యలో హక్స్లీని ప్రశ్నిస్తూ పోయాడు. కాలం, ప్రదేశాలకు ప్రాధాన్యత లేకుండా పోయిందని హక్స్లీ ప్రవర్తన సూచిస్తుంది. సూటిగా ఆలోచించడం, జ్ఞాపకం పెట్టుకోవడం అంతగా వుండదు. చిన్నపిల్లవాడివలె బాహ్య ప్రపంచాన్ని చూస్తాడు. తన చర్యలకు కారణమేమిటో గ్రహించలేడు. ఇచ్ఛ దెబ్బతింటుంది. మంచి చెడ్డల విచక్షణ పాటించడు. కాలేయం (లివర్) ఆరోగ్యంగా పనిచేస్తున్నవారు మెస్కలిన్ పుచ్చుకుంటే, బాహ్య ప్రపంచం, అంతర లోకం కలిసిపోయి కనిపిస్తాయి.

మెదడుకు తగినంత గ్లూకోజ్ అందనప్పుడు, బలహీనతలు బయటపడతాయి. మెస్కలిన్ పరిశోధన అదే నిరూపిస్తుంది. అతీంద్రియ శక్తులు, దూరదృష్టి, దూరశ్రవణం, దివ్యదృష్టి అని పేర్లు పెట్టేవన్నీ ఇలాంటివే. అయోమయంగా ప్రపంచాన్ని తననూ చూచుకుంటే, వారిని మార్మికులంటాం (మిస్టిక్స్). అందమైన దృశ్యాలు చూచి కవిత్వం అల్లేవారూ, చిత్రాలు గీచేవారూ, శిల్పాలు చెక్కేవారూ వున్నారు. దేవుళ్ళ బొమ్మలు, శిల్పాలు చాలావరకూ ఆయా వ్యక్తుల మనోగతాలే. భారతమాత, ఆంధ్రమాత పేరిట చెక్కిన విగ్రహాలు, గీసిన బొమ్మలు యీ కోవకు చెందినవే.

మెస్కలిన్ ప్రభావంలో రంగుల్ని లోతుపాతులతో సున్నితంగా గ్రహించే లక్షణం కూడా వుంది. ఇది మార్మికులలో బాగా కనిపిస్తుంది. ఆల్డస్ హక్స్లీ కూడా ఇలాంటి అనుభూతుల్ని పొంది, రికార్డు చేశాడు. యోగం పేరిట ధ్యానం అనే అనుభవం వంటిదే మెస్కలిన్ పేరిట హక్స్లీ పొందాడు. అందుకే పతంజలి యోగంలో చిత్తవృత్తి నిరోధం ప్రధానం. అంటే మెదడు మామూలుగా ఆలోచించే ధోరణి ఆపేయాలి. మోక్షానికి అది దగ్గర మార్గం అన్నారు. బడుల్లో కూడా పిల్లలకు కాసేపు ధ్యానం నేర్పాలంటారే, అదంతా తెలిసీ తెలియక అనేమాటలే. సాధారణ వ్యక్తులెవరూ ఆలోచన ఆపలేరు. మెదడు మామూలుగా పనిచేయకపోతేనే యిది సాధ్యం. మధుమేహం (డయాబిటిస్) వున్నవారికి అప్పుడప్పుడు అశ్రద్ధవలన మత్తురావడం, స్పృహ తప్పడం కద్దు. ఉబ్బసం (ఆస్మా) వున్నవారికి తరచు ఎడ్రినలిన్ వలన రకరకాల వింత దృశ్యాలు కనిపించడం కద్దు. రామకృష్ణ పరమహంసకు మూర్ఛ వ్యాధి వుండేది. ఫిట్స్ వచ్చి పడిపోయేవాడు. తనను ఉన్మాదిగా చేయమని అరచేవాడు. ఇదంతా మహాత్ముని లక్షణంగా భక్తులు భావించారు. కాని అంతటి మహాత్ముడికి కేన్సర్ వస్తే దివ్య లక్షణాలు ఆదుకోలేదు. జబ్బుల్ని దైవలక్షణాలుగా చూచే గుణం వీరారాధనలో భాగమే. ఇది అన్ని మతాలలోనూ వుంది. ఏ మహర్షికి కేన్సర్ వచ్చినా ఇదే స్థితి! విదేశీయులు కొందరు పొగుడుతూ పుస్తకాలు రాస్తే మనవాళ్ళు అవి వుదహరించి, గొప్పతనానికి సర్టిఫికెట్లుగా భావిస్తున్నారు. తెల్లవాళ్ళంటే మనకున్న ఆరాధన, మనల్ని తక్కువగా చూచుకునే లక్షణమే యిదంతా.

మెస్కలిన్ అనేది శరీరానికి హానిచేయదు గనుక, పరిశోధనకు స్వీకరించారు. అదే మేరియానా (Marijuana), ఎల్.ఎస్.డి., గంజాయి అయితే అవి అలవాటుగా మారే ప్రమాదం వుంది. కొన్నాళ్ళు తీసుకొని మానేస్తే దేహంలో ఉపసంహరణానంతర లక్షణాలు వచ్చి బాధపెడతాయి. దీనికి వేరే చికిత్స అవసరమౌతున్నది. సాధారణ మానవులు పండగల సందర్భంగా ఉత్తరాదిలో భంగు తాగుతారు. గంజాయిఆకు పాలల్లో వేసి, మసాలా సుగంధ ద్రవ్యాలతో పాయసంవలె చేసి సేవిస్తారు. కాని సాధువులు గంజాయిని హుక్కాగా పీల్చుతారు. దీనికి అలవాటుపడతారు. తాంత్రికవిద్యను పాటించేవారు 'విజయ' పేరిట మత్తుపానీయం సేవిస్తారు. బెంగాల్ ప్రాంతంలో దీనినే 'సిద్ధి' అంటారు.

మతం పేరిట ఆధ్యాత్మిక చింతనలో సమాధి, కైవల్యం, ముక్తి, నిర్వాణం యిత్యాదులన్నీ పొందడానికి అనేక మార్గాలు చెప్పారు. అవన్నీ కృత్రిమాలే, సాధారణ జీవనం సాగించేవారికి కుదిరేవికావు. అలాగే మెస్కలిన్ పరిశోధన కూడా.

ఆరోగ్యవంతులు మెస్కలిన్ వేసుకొని పరిశోధన చేస్తే మధురానుభూతులు వస్తాయన్నాం. అనారోగ్యంగా వున్నవారు స్వీకరిస్తే నరకం, యమయాతన, సైతాన్ బాధలు, మురికికూపాలు మొదలైనవి అనుభవిస్తారు. లివర్‌లో మెస్కలిన్ చేరి ఇలాంటి చేదు అనుభవాలకు దారితీస్తుంది. సాధువులు, యోగులు అనారోగ్యంగా వున్నప్పుడు అనుభూతుల్ని పొంది, నరకం ఏమిటో వివరించారు.

హక్స్‌లీ చేసిన మెస్కలిన్ పరిశోధనపై మతవాదులు విరుచుకపడ్డారు. జహ్నర్ (R.C. Zaehner) వంటివారు పెద్ద పుస్తకాలే రాశారు. కాని సమాధానం చెప్పలేకపోయారు. హక్స్‌లీ అనుభూతి బౌద్ధులు చెప్పే శూన్యదశ వంటిదని అగేహానంద భారతి పేర్కొన్నారు. యోగం చెప్పేది కూడా యిలాంటి చిత్తవృత్తి నిరోధ శూన్యావస్థే. "నేనే బ్రహ్మను" అని సాధువు అంటే, మహానుభావుడు అంటాం, మామూలు వ్యక్తి మెస్కలిన్ తీసుకొని అలాగంటే, పిచ్చివాడంటాం. ఆల్డస్ హక్స్‌లీ చేసిన ప్రయోగాలవంటివి, ఉత్తరోత్తరా అగేహానంద భారతి చేశారు. ఇంకా కొందరు చేసినా, అగేహానంద స్వానుభవం గుర్తించి గమనించదగింది.

## అగేహానంద భారతి ప్రయోగాలు :

1958లోనే అగేహానంద భారతి అమెరికాలో కొత్తగా వచ్చిన ఎల్.ఎస్.డి-25 (లాసెర్జిక్ యాసిడ్ డైథైలామైడ్) పుచ్చుకున్నారు. రాత్రి 8 గంటలకు స్వీకరిస్తే తెల్లవారుజామున 4 గంటలవరకూ ప్రభావం వున్నది. ఎల్.ఎస్.డి. తీసుకునేవాళ్ళు ఆనందమయ వాతావరణంలో అంగీకార మిత్రుల సాన్నిహిత్యంలో గడపాలని భారతి సూచించారు. భంగు (గంజాయి రసం) కూడా యిలాగే తీసుకోవాలంటారు. అగేహానంద ఎల్.ఎస్.డి. పుచ్చుకున్నప్పుడు మాత్సుకో అనే అందమైన బౌద్ధస్త్రీ చెంతవున్నది. బ్రహ్మానంద సమయంగానూ, శూన్యావస్థను పొందిన క్షణాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. (ది లైట్ ఎట్ ది సెంటర్, పేజి 43) అహం బ్రహ్మాస్మి అనే స్థితికి

చేరుకుని, ప్రపంచమే నేను, నేనే ప్రపంచం అనే దశను అనుభవించామన్నారు. ఒక అరగంట వున్న ఈ స్థితి ఎల్.ఎస్.డి. వల్లా, మాత్సుకో అనే స్త్రీ సాంగత్యంలో లభించిందన్నారు. బౌద్ధులు చెప్పే శూన్యదశ, హిందువులు చెప్పే సమాధి, తురీయావస్థ, బ్రహ్మలో ఏకం కావడం యిత్యాదులన్నీ యివేనని భారతి అనుభవపూర్వకంగా చెప్పారు.

1952-53 ప్రాంతాలలో అస్సాంలో వుండగా తాంత్రిక యోగ సాధనలో కూడా శూన్యస్థితికి చేరుకున్నట్లు అగేహానంద భారతి పేర్కొన్నారు. తాంత్రిక విద్యలో పూర్వార్థం, ఉత్తరార్థం అని రెండు దశలున్నాయి. ఉత్తరార్థంలో మద్యం సేవిస్తూ, మాంసం, మత్స్యం ఆరగిస్తూ, స్త్రీ సన్నిధిలో ముద్రవేసి, మైధునం జరపాలి. సంభోగంలో రేతస్సును స్థంభింపజేయాలని కొందరు తాంత్రికులంటారు. ఊపిరిని, శుక్లాన్ని, ఆలోచనను స్థంభింపజేస్తే శూన్యదశ చేరుకుంటారని వారి నమ్మకం. బౌద్ధ తాంత్రికులు, హిందువులలో కొందరు యీ పద్ధతిని నమ్ముతారు. ద్వైతం పోయి ఏకత్వం సిద్ధిస్తుందని వారి విశ్వాసం. తాంత్రిక ఆశ్రమాలను భారత ప్రభుత్వం నిషేధించిన దృష్ట్యా ప్రస్తుతం తాంత్రిక యోగసాధన యీ పద్ధతిలో సాగడంలేదు.

1950 ప్రాంతంలో అగేహానంద భారతి సన్యాసిగా పాదయాత్ర చేస్తూ నాగపూర్ సమీపంలో దారితప్పారు. అప్పట్లో సౌందర్యలహరి ఆలాపిస్తూ సంచరిస్తున్నారు. అందులో అందమైన దేవీస్తుతి ఆయనకు హత్తుకుపోయింది. ఆకలితో అలసటతో వుండడం, అప్పుడే పాడుబడిన వితలేశ్వర దేవాలయానికి చేరుకున్నాడు. అక్కడ దేవీ విగ్రహం కనిపించగా, అప్పుడే పూజచేసి ఎవరో దండవేసి వెళ్ళిన దృశ్యం కూడా చూచాడు. నమస్కరించి, వెళ్ళిపోయాడు. కొన్ని మైళ్ళ దూరాన వున్న గ్రామస్తులు మజ్జిగ యిస్తే తాగి, దేవీ విగ్రహానికి పూజలు చేస్తున్న పూజారి ఎవరు అని అడిగాడు. వాళ్ళు ఆశ్చర్యపోయి చుట్టుపట్ల దేవీ విగ్రహం ఏదీ లేదని చెప్పారు. చూపిస్తాను రమ్మంటే, ఒక అబ్బాయిని యిచ్చి పంపారు. వెళ్ళి చూస్తే పాడుబడ్డ దేవాలయమేగాని, దేవీవిగ్రహం లేదు. తన మానసిక ధోరణి, మనస్సుపై సౌందర్యలహరి స్తుతి ప్రభావం వలన, ఆకలిపై వున్న అగేహానందకు దేవీ విగ్రహం కనిపించినట్లయింది. మనస్సులో వున్నదే బయట చూచినట్లయింది.

ఒకసారి హౌరా స్టేషన్‌లో వుండగా అగేహానంద భారతి దగ్గరకు ఒక సాధువు వచ్చి, నేనే భగవంతుడ్ని అన్నాడట. భారతి సమాధానమిస్తూ అది అసంభవం అన్నాడు. ఎందుకని? అని సాధువు ప్రశ్నిస్తే, నేనే భగవంతుడ్ని గనక అని భారతి సమాధానం చెప్పాడు. వెంటనే ఆ సాధువు భారతి కాళ్ళపై సాష్టాంగపడి, మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. అలా గట్టిగా అరమరికలు లేకుండా జంకూగొంకూ లేకుండా చెబితే నమ్మేవారున్నారు. వివేకానంద ఇలాగే రామకృష్ణ పరమహంస మాటలు నమ్మాడు. నీవు దేవుణ్ణి చూశావా అని నరేంద్రనాధ్ (వివేకానంద కాక పూర్వం) అడిగితే, చూశాను, నీవూ చూడొచ్చు అని రామకృష్ణ పరమహంస చెప్పేసరికి, మళ్ళీ ప్రశ్నించకుండా లొంగిపోయి శిష్యుడయ్యాడు. సూచన (Suggestion) అలా పనిచేస్తుంది సందేహవాదులమీద.

అరవిందుడు ఇంగ్లండ్‌లో చదువుకున్నాడు. ఇంగ్లీషులో కవిత్వం రాశాడు. ఇండియాకు వచ్చిన తరువాత జైలులో ఆయనకు 'దివ్యశక్తులు' కనిపించాయి. పాండిచేరిలో స్థిరపడి, భార్యను యించుమించు వదిలివేసి, పెళ్ళి అయి పిల్లలున్న ఫ్రెంచి వనితను ఆధ్యాత్మికంగా ఆకర్షించాడు. పాండిచేరిలో యోగిగా మారిన అరవిందుడు ఆధ్యాత్మిక చింతన ప్రభావంతో రాసిన లైఫ్ డివైన్, సావిత్రి గ్రంథాలలో పులుముడు ధోరణి మార్మిక లక్షణాలు బాగా కనిపిస్తాయి. లైఫ్ డివైన్ ఉద్గ్రంథాన్ని మూడో వంతుకు కుదించవచ్చని అగేహానంద భారతి వ్యాఖ్యానించాడు. ఆయన భక్తులు అరవిందుడు చనిపోయినప్పుడు, దేహం శుష్కించదనీ, శాశ్వతంగా వుంటుందనీ నమ్మి, ప్రచారం చేశారు. యోగశక్తులు అంతదూరం పోలేదని రుజువైంది!

ప్రపంచానికి గురువు, మరో అవతారం అని జిడ్డు కృష్ణమూర్తిని గురించి అనిబిసెంట్ దివ్యజ్ఞానం పేరిట ప్రచారం చేసింది. ఇదంతా శుద్ధ అబద్ధం అని గ్రహించిన కృష్ణమూర్తి జాగ్రత్తపడి, దూరంగా వున్నాడు.

గాంధీమహాత్ముడు తన ఆత్మశక్తి చెబుతున్నదంటూ, 1921లో దేశానికి స్వరాజ్యం లభిస్తుందని బాహాటంగా ప్రకటించి, పప్పులో కాలేశాడు. హిమాలయాలంత తప్పుచేశానని తరువాత ఒప్పుకోవలసి వచ్చింది.

ఇంతకూ యోగశక్తులు, దివ్యశక్తులు, అతీంద్రియశక్తులు వున్నాయా, లేవా? ఈ చర్చ వలన, సాధారణ మానవులకు యిలాంటివి లేవని తెలిందిగదా. పోతే కృత్రిమంగా శరీరాన్ని శుష్కింపజేసినందవలన, మెదడుకు తగిన పోషక పదార్థాలు అందకుండా చేసినందువలన, మందులవలన కొన్ని విలక్షణాలు కనిపిస్తాయి. వాటికి ముద్దుముద్దుగా దైవం పేరిట రకరకాల పేర్లు పెడుతున్నారు. ఇదే అలవాటుగా మారితే, జబ్బు క్రిందకు తేలుతుందన్నమాట. ఈ జబ్బు శారీరకమైనదే. మెదడు కూడా శరీరంలో ప్రధానమైన భాగమే, మరి మనోరోగం, మనోశక్తి మాటేమిటి?

## ఏది మనస్సంటే?

మనస్సు (మైండ్) అనేది, మనం సృష్టించిన తియ్యటి పదం. మనస్సు అనేది ఆత్మ, దైవంలాంటిదే, మానసిక రోగాలు ఆ కోవకు చెందినవే. మానసిక శక్తులు అనేది ఎంత నిజమో, మనస్సుకు పట్టే రోగాలు అంతే నిజం. వీటికి ఆధారం, రుజువు లేదు. అయినా మానసిక రోగాన్ని రుజువు చేస్తామంటూ మానసిక వైద్యులు బయలుదేరారు. ఇలాంటివారి గుట్టును థామస్ సాజ్ (Thomas Szasz) బట్టబయలు చేశాడు. టి.వి.లో కార్యక్రమాలు బాగా లేకపోతే, టి.వి.ని రిపేర్‌కు తీసుకెడితే ఏం ప్రయోజనం? కాని మానసికవైద్యులు అదే చేస్తున్నారు. శరీరంలోనో, మెదడులోనో వచ్చేవాటికి మానసిక జబ్బులని పేరుపెట్టి చికిత్స పేరిట వ్యాపారం చేస్తున్నాడు. అమెరికాలో సుప్రసిద్ధ హ్యూమనిస్టు థామస్ సాజ్ చేసిన విమర్శలకు సమాధానం చెప్పలేక తిట్లకు లంకించుకున్నారు.

మన సమాజంలో "పిచ్చి" వాళ్ళను మానసిక రోగులుగా చూడడం ప్రమాదకరం. 'పిచ్చి' అనేది శారీరక, మెదడుకు చెందిన జబ్బుగా గుర్తిస్తే గొడవలేదు. వైద్యం కూడా స్పష్టపడుతుంది. మానసిక లక్షణం అనేసరికి, రోగితో వైద్యుడు ఆడుకుంటున్నాడు. ఏదీ రుజువుకు నిలబడదు. అందుకని ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వడం, మత్తుమందు ఇవ్వడం, గ్రామాలలో కొట్టడం సాధారణమైపోయింది. థామస్ సాజ్ దీనంతటినీ దారుణ మోసంగా ఎదుర్కొంటున్నాడు. ఎదురీదుతున్నాడు? మన సమాజంలో మతం పేరిట దివ్యశక్తులు ఎలా ప్రాబల్యంలోకి వచ్చాయో పాశ్చాత్య లోకంలో పిచ్చిపేరిట సైకియాట్రి అలా తిష్టవేసుకున్నది. ఇప్పుడిప్పుడే అవి మనకూ అంటుకుంటూన్నాయి.

మతం పేరిట జనాన్ని సర్వకాలాల్లో మోసం చేయవచ్చు అనేది బలపడుతున్నది. కొందరికి ఆధ్యాత్మిక వ్యాపారం గిట్టుబాటుగా వుంది. కనుక ఏదో ఒక రూపేణా అది వదలకుండా పట్టుకొస్తున్నారు.

అయితే ఏం చెయ్యాలి? అనే ప్రశ్న రావచ్చు. పిల్లలకు హైస్కూలు స్థాయిలోనే శరీరాన్ని గురించి శాస్త్రీయంగా చెప్పడం మొదలెట్టాలని థామస్ సాజ్ సూచించారు. శరీరాన్ని, మెదడును అవగాహన చేసుకుంటుంటే, చాలా భ్రమలు తొలుగుతాయి. మనస్సు పేరిట (మైండ్) సృష్టించిన మతకల్పనలు, భ్రమలు, దౌర్జన్యాల నిజానిజాలు తెలుస్తాయి. సృజనాత్మక శక్తియుక్తుల గురించి పరిశోధన కూడా జరపాలని, వీటిగురించి సమన్వయీకరణ వుండాలని ఆల్డస్ హక్స్లీ సూచించారు. చదువుకున్న అమెరికావంటి చోట దివ్యశక్తులు, భక్తి, ప్రార్థనలతో చికిత్సలు, అద్భుతాల బండారాన్ని జేమ్స్ రాండీ బయటపెట్టారు. అయినా మతవాదులు బ్రతుకుదెరువుకు, సమాజంపై పట్టుకు రకరకాల ఎత్తుగడలు, వ్యూహాలు పన్నుతూనే వుంటారు. బాబాల అవతారాలు బలహీనుల్ని బాధిస్తూనే వుంటాయి. హేతువాదులు నిత్యం జాగరూకులై ఎదురీదాల్సిందే.

*- హేతువాది, జూన్-జులై 1991*

# పరలోక శక్తులు - నిద్ర పక్షవాతం

భూమి మీదకు అప్పుడప్పుడూ వేరే లోకాల నుండి మనుషులు వస్తున్నారని కొందరిని ఎత్తుకుపోయి మళ్ళీ వదలిపెడుతున్నారనే నమ్మకాలున్నాయి. వదంతులూ వున్నాయి. అమెరికా, యూరోప్‌లో యీ వింత ప్రచారం అనేక మందిని ఆకట్టుకున్నది. కొన్ని పుస్తకాలు, సినిమాలు వచ్చాయి.

ఇతర లోకాలలో మనుషులు వున్నారా? వారే భాష మాట్లాడుతారు? ఎలా ప్రయాణం చేస్తారు?

ఈ విషయాలపై పరిశోధనలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. కొందరు వ్యక్తులు

తమ వింత అనుభవాలను కథలుగా చెప్పిన ఉదంతాలను కూడా పరిశోధనకు గురిచేశారు. జపాన్‌లో యీ పరిశీలన బాగా జరుగుతున్నది. రాత్రిళ్ళు ఏవో దయ్యాలు, భూతాలు, శక్తులు కొన్నిసార్లు ఎవరో దేవుళ్ళు వచ్చి పూనినట్లు, మాట్లాడినట్లు వెంటబెట్టుకొని తీసుకెళ్ళి, మళ్ళీ తీసుకువచ్చి వదలివెళ్ళినట్లు చెబుతున్నారు.

జనాభాలో అనేకమంది ఎప్పుడో ఒకప్పుడు యీ వింత అనుభవాన్ని చవిచూస్తున్నారు. అందుకే యీ విషయానికి ప్రాధాన్యత వచ్చింది. పరలోకాల వ్యక్తులు వచ్చి నిద్రపోతున్న వ్యక్తుల్ని మేల్కొల్పడం, మీదెక్కి కూర్చొనడం యిత్యాది అనుభవాలు తెల్లారి చెప్పిన వారున్నారు.

ప్రాచీనకాలంలో వేరేలోకాల నుండి వచ్చినవారు చీపురుకట్టలు స్వారికి వాడినట్లు, మేఘాల మీద ప్రయాణం చేసినట్లు కథలున్నాయి. సినిమాలు చూచి, పుస్తకాలు చదివి అలాంటి అనుభవాలు మాకు కలిగాయనేవారున్నారు. ఆకాశం నుండి ఎగిరే పళ్లాలలో వచ్చి భూమి మీద వ్యక్తుల్ని కలసినట్లు కూడా కథలున్నాయి. వీటన్నింటిపై పరిశోధనలు జరిగాయి. కెనడాలోని అంటారియోకు చెందిన బ్రాక్ యూనివర్శిటిలో టోమొకాటకూచి యీ ఆకాశవ్యక్తులు ఎగిరే పళ్ళాల వింతలపై గొప్ప పరిశోధకుడు.

ఫుకుషిమా యూనివర్శిటి (జపాన్)లో కజూహికొపు కూడా వింత వ్యక్తులు భూమిపైకి వచ్చిపడుతున్న విషయం లోతుగా పరిశీలించారు. ఇంతవరకూ జరిగిన శాస్త్రీయ పరిశోధనల వలన తేలిందేమంటే, కొందరు వ్యక్తులకు నిద్రపక్షవాతం వస్తుంది. ఆ స్థితిలో వ్యక్తి నిద్రిస్తున్నాడా, మేల్కొనివున్నాడా అనేది సందేహాస్పదం.

నిద్రపక్షవాతం అంటే ఏమిటి? వ్యక్తి నిద్రిస్తుండగా ఒక్కొమారు మెదడుకు శరీరానికే సంబంధం పోతుంది. అలాంటప్పుడు వ్యక్తిని మోకాలిపై కొట్టినా అతడికి తెలియదు. అతడు నిద్రలో కళ్ళు విపరీతంగా కదలిస్తుంటాడు. ఈ స్థితి ఒకటి రెండు నిమిషాలు వుంటుంది. తరువాత మెదడుకు శరీరానికి మళ్ళీ సంబంధం ఏర్పడుతుంది. నిద్రపక్షవాతంలో వ్యక్తి కళ్ళు తెరవకుండానే తన వింత అనుభవాలను చూస్తాడు. ఇది స్త్రీలకు పురుషులకు అన్ని వయస్సులలోనూ రావచ్చు. నిద్రనుండి మేల్కొన్న నిద్రపక్షవాత వ్యక్తి తన నిద్రానుభవాలను నిజమైన సంఘటనలుగా జరిగినట్లుగా చెబుతాడు. ఈ విధంగా ఇతర లోకాల వ్యక్తుల కథలు ప్రచారంలోకి వచ్చాయి.

నిద్ర పక్షవాతం అరుదుగా ప్రమాదానికి దారితీస్తుంది. వుక్కిరి బిక్కిరిగా వూపిరి పీల్చుకోడానికి కొట్టుకుని చనిపోయినవారున్నారు. కాని చాలా మంది ఒకటి రెండు నిమిషాలకే లేస్తారు. నిద్రపక్షవాతం అనుభవ సమయంలో మాట్లాడబోయినా, శబ్దం రాకపోవడం, కదల్చబోయినా చేతులాడకపోవడం, వూపిరాడనట్లనిపించడం లక్షణాలు. గుండెపై ఎవరో అదిమిపెట్టినట్లుండడం కూడా మరో లక్షణం. ఇదంతా నిద్రపక్షవాత లక్షణమే.

చైనా, జపాన్, కెనడా, అమెరికాలలో నిద్ర పక్షవాతంపై పరిశోధనలు ముమ్మరంగా సాగాయి. కెనడాలో యీ అనుభవానికి ఓల్డ్ హాగ్ అని, జపాన్‌లో కొనషిబారి అని, వెస్ట్ ఇండీస్‌లో

కొక్మా అని, చైనాలో గైయీ అనీ నానుడిగా చెబుతారు. మన దగ్గర భూతాలు, శక్తులు, అమ్మవారు, పిశాచాలు పట్టి పీడించడం, అని సాధారణంగా పేర్లు పెడతారు. ఇవి నిద్రలోనే జరుగుతాయని విస్మరించరాదు. అయితే నిద్రపక్షవాతం అనేది ఒకటుంటుందని చాలామందికి తెలియదు.

*- హేతువాది, అక్టోబర్ 1999*

# ఇస్లాం (అరబ్) సామ్రాజ్యవాదం

అన్వర్ షేక్ పాకిస్తాన్ నుండి ఇంగ్లండ్ వచ్చి స్థిరపడి సొంతంగా ఇస్లాం, కొరాన్, సంప్రదాయాలు బాగా చదివాడు. అతడిని దిగ్భ్రాంతిపరచిన విషయాలు బయటపెట్టాడు. అడుగడుగునా మానవహక్కుల్ని వ్యతిరేకిస్తూ, సామ్రాజ్యవాదం స్థాపించే ఇస్లాం ప్రయత్నం అతడికి జుగుప్స కలిగించింది. జీవితమంతా ఇస్లాంలో కాచివడపోసి గ్రంథస్థం చేయడానికి పూనుకున్నాడు. అతడు కవి కూడా. సొంత ఖర్చులతో పుస్తకాలు వేసి భావప్రచారం సాగిస్తున్నాడు. తాను మానవవాదిని అని సగర్వంగా ప్రకటించుకున్నాడు.

అన్వర్ షేక్ అభిప్రాయాలను తట్టుకోలేని ఇంగ్లండు ఛాందస ముస్లింలు ఫత్వా జారీచేశారు. సమాధానం చెప్పలేక, వాదించలేక బలప్రదర్శనకు దిగడమే ఫత్వా సారాంశం. తస్లీమా నస్రీన్‌కు బంగ్లాదేశ్‌లో, సాల్మన్‌రష్దీపై ఇరాన్‌లో ఫత్వాల సారాంశం యిదీ. ముస్లిం ఛాందసులు తమపై వచ్చే విమర్శకు హేతుబద్ధంగా ఏమీ చెప్పలేరు. మతాన్ని అడ్డం పెట్టుకొని చంపుతామంటారు. అందుకు నిరసనగా అన్వర్ షేక్ నిలుస్తున్నాడు.

## అన్వర్ షేక్ సిద్ధాంతం

యూరపు పార్లమెంటులో ఓసోస్టాండ్లర్ నివేదిక చర్చకు వచ్చింది. పాశ్చాత్య ప్రపంచం ఇస్లాం గురించి విపరీత భయాందోళన చెందుతున్నదనడానికి ఆ నివేదిక నిదర్శనం. పెరిగిపోతున్న మతమౌఢ్యం పట్ల ప్రజాస్వామికవాదులు హెచ్చరికలు చేస్తున్నారు.

ముస్లింలలో టెర్రరిస్టులు పెరిగిపోవడం, ముస్లిమేతరుల పట్ల వ్యతిరేకత, అసహనం అధికంగావడం, ఇదంతా ఇస్లాం పేరిట వ్యాపించడం నిత్యకృత్యంగా మారింది.

ఇస్లాం ప్రకారం ముస్లింలందరూ ప్రపంచమంతటా తమ మతాన్ని వ్యాపించేటంత వరకూ వూరుకోరాదు. ముస్లింలు వున్న దేశంలో అధికారం ముస్లిమేతరుల చేతుల్లో వుంటే, ఆ దేశాన్ని దారుల్‌హర్బ్ అంటారు. ఆ దేశం ముస్లిం దేశంగా మారేటంతవరకూ నయాన భయాన కృషి సాగించాలి. ఒకసారి ఇస్లాం దేశంగా మారిన తరువాత దారుసలాం అవుతుంది. అంటే శాంతిదేశమన్న మాట.

దేశభక్తి, మాతృదేశం అన్నీ ఏమౌతాయి? ఇస్లాం ప్రకారం ముస్లింలందరూ అరేబియాను మాత్రమే పవిత్రంగా భావించాలి. ముస్లిం తండ్రి, తల్లి, సోదరి, సోదరుడు, ఎవరైనాసరే ఇస్లాంను పాటించకపోతే, వారిని ద్వేషించాలి. ఇస్లాంను స్వీకరించేవరకూ ముస్లింలు తిప్పలు పడాలి. అందుకుగాను టెర్రరిజం ఆచరించినా, చంపినా, దోచినా, నరికినా, మోసగించినా ఫరవాలేదు. అంతిమలక్ష్యం ఇస్లాంగా మారడమే.

ఇస్లాంను వ్యాపింపజేసే ప్రయత్నంలో ముల్లాలు (మతగురువులు) కీలకపాత్ర వహిస్తున్నారు. కీలకమంతా వారి చేతులో వుండడం వలన ఎన్నికైనవారు సైతం వారికి అడుగులకు మడుగులు వత్తాల్సి వస్తున్నది.

ఇస్లాంను వ్యతిరేకించే వారిపై ఫత్వాలు జారీచేసి, రచయితల, తాత్వికుల స్వేచ్ఛను అరికడుతున్నది ముల్లాలే.

ముల్లాలు ఇస్లాంను పాటిస్తున్నారా? లేదు. వారే ఇస్లాంకు ద్రోహులు.

కొరాన్‌లో స్పష్టంగా “మత నిర్బంధం కూడదు” అనీ, “నిజంగా నిలబడదలిస్తే నీ వాదన రుజువు చేసుకో” అనీ వుంది. (Cow : 111)

కొరాన్ ప్రకారం క్రైస్తవులు, హిందువులు, బౌద్ధులు, సిక్కులు, నాస్తికులు, యూదులు అంతా అపనమ్మకస్తులే. వారంతా నరకానికి పోతారు.

ఇస్లాంలో అతిప్రధాన విషయం ప్రవక్త. మహమ్మద్ సమకాలీనులలో తాలిహ, ముసేలిమా, అల్ అస్వాద్ అనేవారు తాము ప్రవక్తలమన్నారు. చివరకు పోరాటంలో మహమ్మద్ నెగ్గి నిలిచాడు. జనాన్ని సమ్మోహనంలో పడేయడానికి ప్రవక్త అనేది చక్కని సాధనం. దేవుడు అందరితో మాట్లాడడు. ఎవరికీ కనిపించడు. కనుక తనతో మాట్లాడాడనీ, తన ద్వారా ఆయన సందేశం అందిస్తున్నాడనీ అంటే ప్రవక్త మాటల్ని జనం నమ్ముతారు.

దేవుడు ఒక వ్యక్తిని ప్రవక్తగా నియమించినట్లు ఆధారాలు ఏమీ వుండవు. రుజువుకు నిలబడవు. నమ్మేజనం రుజువులు అడగరు. దేవుడు నాకు కనిపించి చెప్పాడంటూ ప్రవక్తలు నమ్మించేవన్నీ తెలివిగా ఆడే అధికార రాజకీయ నాటకమే.

అన్వర్ షేక్ తన “ఇస్లాం” రచనలో మహమ్మదు గురించి వివరంగా పరిశీలించి, ఆశ్చర్యకరమైన వాస్తవాలు బయటపెట్టాడు.

అల్లాను పక్కనబెట్టి మహమ్మదుకే ప్రాధాన్యత సంతరించేటట్లు చేయడం కీలక విషయం. రాజకీయవాదిగాను, జాతీయ సామ్రాజ్యవాదిగాను మహమ్మద్ తన గొప్పతనాన్ని నిలబెట్టుకున్నాడు.

ముస్లింలు రోజూ చేసే ప్రార్థనలో మహమ్మద్‌ను స్తుతించడం అంతర్భాగం.

దారూద్ అనే పేరిట ముస్లింలు మహమ్మద్‌ను ఆరాధిస్తారు. నటియకలాం అనే మహమ్మద్ స్తుతిని ప్రత్యక్షంగా పాటిస్తున్నారు. కవాలి కూడా మహమ్మద్ స్తుతిగానే సూరాలు ప్రచారంలో పెట్టారు. అల్లాతోబాటు మహ్మద్‌ను చేర్చి షహాదా ప్రమాణం చేస్తారు.

కొరాన్ ప్రకారం అల్లాతోబాటు ఇంకెవరిని చేర్చినా తప్పుగా భావించాలి. దీనికి భిన్నంగా మహమ్మద్ ఆచరణ పేరిట సాధించాడు.

నమ్మకాల గురించి హేతుబద్ధంగా ఆలోచించరాదంటూ మహమ్మదు తెలివిగా తన స్థానాన్ని కాపాడుకున్నాడు. తనను అనుకరిస్తే లాభిస్తుందన్నాడు.

ప్రవక్త అనే భావన మానవుడి తెలివితేటలకు నిదర్శనం. ప్రవక్త చేతిలో దేవుడు కీలుబొమ్మ.

తన కోర్కెలను, లక్ష్యాలను సాధించడానికి దేవుడిని అడ్డం పెట్టుకోవడమే ప్రవక్త చేసిన గొప్ప నాటకం. ఇది అందరు ప్రవక్తలకూ వర్తిస్తుంది.

మహమ్మదు చాలా తెలివిగా కొరాన్‌ను వాడుకున్నాడు. తానే చివరి ప్రవక్తను అని చాటుకోవడం అతడి తెలివికి పరాకాష్ఠ. అరబ్బు సామ్రాజ్యవాదానికి పితామహుడు మహమ్మదు ముస్లిం జాతీయవాదం ప్రారంభించాడు. దీని ప్రకారం ప్రపంచంలో ముస్లింలు ఎక్కడున్నా, అరేబియా ఔన్నత్యాన్ని గుర్తించాలి. అదే వారి పవిత్ర మాతృ, పితృభూమి. వారుండే దేశం రెండో స్థానంలో వుంటుంది. జీవితంలో ఒక్కసారైనా అరేబియా యాత్ర చేసి రావాలనే నమ్మకం కలిగించారు. అన్వర్ షేక్ యీ సూత్రాన్ని విడమరచి, ఉదాహరణగా భారతదేశాన్ని స్వీకరించాడు. ముస్లింలు ఇండియాలో తమ మసీదులను, చారిత్రక కట్టడాలను, ద్వితీయ స్థానంలో వుంచి, అరేబియా వైపు చూడడం ఇస్లాం సామ్రాజ్యవాదంగా చెప్పాడు. దీనివలన రాజకీయ, సామాజిక సంఘర్షణలకు దారితీయడాన్ని ఉదహరించాడు. అలానే ఇతర దేశాలలోనూ జరుగుతున్నది. తమ దేశంలో సంస్కృతిని, నాగరికతను, ఆచారాలను, తక్కువగా చూడడం, అరేబియా సామ్రాజ్యవాదంలో అంతర్భాగమే. ఇది ముస్లింలు ఆలోచించాల్సిన ముఖ్య విషయం.

సాంస్కృతికంగా ముస్లింలు అరేబియా బానిసలుగా మారడానికి ఇస్లాం కారణమని అన్వర్ షేక్ నిర్ధారించాడు. అరబ్బు సంస్కృతిని మాత్రమే పాటించిన మహమ్మదును ముస్లింలు అనుకరించి, ఆరాధించినంత కాలం యీ వైవిధ్యం తప్పదంటున్నాడు.

"ప్రవక్త" అనేది మానవుడి కల్పన అని, రుజువుకు, ఆధారాలకు నిలబడేది కాదని అన్వర్ షేక్ కుండబద్దలు కొట్టాడు. దేవుడి పేరిట నాటకమంతా ప్రవక్త ఆడి, జనం మూఢనమ్మకాన్ని బాగా దిమిస కొట్టాడన్నారు.

దేవుడిని నమ్మే జనం ఎలాగూ అతడిని కనలేరు, వినలేరు, మాట్లాడలేరు. ఆ స్థానంలోకి

అతి తెలివిగా ప్రవక్త వచ్చాడు. తనతో దేవుడు అన్నీ చెప్పిస్తున్నాడనీ, కనుక తనను నమ్మి, తాను చెప్పినట్లు నడచుకోమంటే, జనం అదే నిజం అనుకొని, ఆరాధిస్తున్నారు. ఇదీ అసలు విషయం.

అన్వర్ షేక్ స్పష్టంగా తాను మానవతావాదిననీ, అతీంద్రియశక్తుల పేరిట పాటించదగిందేదీలేదనీ, వివేచనతో మనిషి సాగిపోవాలనీ అన్నాడు. (ఇస్లాం పేజి 149) కొరాన్, బైబిల్, ఇతర "పవిత్ర" గ్రంథాలన్నీ పరస్పర విరుద్ధాలతో వున్నాయి. అవి మనుషుల్ని తప్పు దారిలో నడిపిస్తున్నాయి.

ఇస్లాంలో ముల్లాలు చాలామంది నమ్మకం లేనివారే! కాని ఇస్లాం వారికి కట్టుబాటుగా ఉంది. కనుక అడ్డం పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారని అన్వర్ షేక్ చక్కగా చెప్పారు. (చూడు ఇస్లాం : అరబ్ నేషనల్ మూవ్‌మెంట్ పుట 99)

***- హేతువాది, డిశంబరు 1999***

# పోపుగారి పాలు

కేథలిక్ మతాధిపతిని పోప్ అంటారు. ఇతడిని కార్డినల్స్ రహస్యంగా ఎన్నుకుంటారు. ప్రపంచంలో నూరుకోట్ల కేథలిక్కులకు పోప్ బ్రతికున్న దైవదూత. అతడి మాటను శిరసావహిస్తారు. ఇంత మంది జనానికి ఆధిపత్యం వహిస్తున్న పోప్‌ను రాజ్యాధిపతులు గౌరవిస్తారు. ఓట్ల కోసం రాజకీయ నాయకులు పోప్ మాట వింటారు. ఇది ఆసరాగా తీసుకొని పోప్ తన పెత్తనాన్ని అనేక విధాల విస్తరింపజేసుకోడానికి ప్రయత్నిస్తాడు. ఇది ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచనాటకం.

పోప్‌లు గతంలో చేసిన దుర్మార్గాలు, చేయించిన ఘాతుకాలు పెద్ద గ్రంథంగా చరిత్ర చెబుతున్నది.

ఇర్వింగ్ వాలెస్ తన లిస్టులు గ్రంథంలో పోప్ లియో సంభోగిస్తూ మరణించిన సత్యాన్ని పేర్కొన్నాడు. అదొక పరాకాష్ట.

మతాన్ని రాజకీయాలతో రంగరించిన పోప్‌లు రాజులను తలదన్నే రారాజులుగా చెలామణి అయ్యారు.

ఫ్రెంచి నియంత నెపోలియన్ ఇద్దరు పోపులను జైలులో పెట్టాడు. 7వ పయస్, 8వ పయస్‌లు అలా నెపోలియన్ వ్యతిరేకతతో కటకటాలు చూచారు.

19వ శతాబ్దంలో ప్రపంచ వాటికన్ సమితి ఒక నిర్ణయం చేసింది. ఇది 1870లో వెలువడింది. దీని ప్రకారం పోప్ నిర్ణయాలు తిరుగులేనివి. వాటిలో దోషం గాని, లోపం గాని వుండదు.

ఆధునికతను పూర్తిగా వ్యతిరేకించమని పోప్ 10వ పయస్ అందరికీ ఉత్తరువులిచ్చాడు. అలాంటి పోప్ రుషి (సెయింట్) అని పోప్ 12వ పయస్ పట్టం గట్టాడు.

12వ పయస్ పోప్ చరిత్రమలుపు తిప్పిన వ్యక్తి. అతడు మరొక రుషి అని నేటి పోప్ ప్రకటించాలనుకుంటున్నాడు. దీనికి కార్యక్రమం మొదలైంది.

12వ పయస్ పోప్ ఇటలీలో యూజినో కుటుంబీకుడు. 1876లో పుట్టిన యూజినో పచెలి చాలభాషలు ధారాళంగా మాట్లాడేవాడు. వాటికన్ రాజకీయాలలో చాలా ప్రాధాన్యత వహించిన పచెలి, యూదు వ్యతిరేకి. వాటికన్ నిర్ణయాలలో ఇతడు అతిప్రముఖపాత్ర నిర్వహించాడు. హిట్లర్‌తో చెట్టపట్టాలు.

పోప్‌గా ఎన్నికకాకముందే యూజినోపచెలి వాటికన్ ప్రతినిధిగా జర్మనీ రాజకీయాలలో నాటకాలాడాడు. అధికారానికి వస్తున్న హిట్లర్‌తో జర్మన్ కేథలిక్కులు ఒడంబడిక కుదుర్చుకోడానికి యితడే కారకుడు. జర్మనీలో కేథలిక్కులకు విద్యా, వైద్య తదితర సౌకర్యాలు, ప్రచార అనుకూలతలు యివ్వడానికి హిట్లర్ అంగీకరించాడు. దీనికి బదులుగా హిట్లర్‌కు వ్యతిరేకత లేకుండా జర్మనీలో కేథలిక్ రాజకీయ పార్టీని పార్లమెంటునుండి వైదొలగేటట్లు యూజినో పచెలి ఒప్పించాడు.

ఇంతటితో హిట్లర్‌కు ప్రధాన ఆటంకం తొలగింది. నియంతృత్వాన్ని చట్టబద్ధం చేయడానికి హిట్లర్‌కు యూజినో పచెలి బాగా తోడ్పడ్డాడు. ఇది 1933లో జరిగిన ఉదంతం. నాజీ నియంతృత్వానికి ఇలా మద్దత్తు యిచ్చిన కేథలిక్కులకు యూజినో పచెలి నాయకుడు. ఉత్తరోత్తరా యితడే పోప్ అయ్యాడు.

1939లో యూజినో పచెలి పోప్‌గా ఎన్నికయ్యాడు. హిట్లర్‌కు మరింత కలసివచ్చింది! యూదులను హతమార్చడానికి హిట్లర్ వేసిన పథకాలకు కొత్త పోప్ పరోక్షదీవెనలు లభించాయి.

అంతకు ముందు చనిపోయిన పోప్ హిట్లర్‌కు వ్యతిరేకంగా ప్రకటన యివ్వాలనుకున్నాడు. తగినంత సమాచారంతో అలాంటి ప్రకటన జారీచేయబోతుండగా 11వ పయస్ చనిపోయాడు. వెంటనే ప్రకటన స్వాధీనం చేసుకున్న 12వ పయస్ పచెలి మళ్ళీ దానిని వెలుగుచూడనివ్వలేదు.

యూదులను మట్టుబెడుతున్న హిట్లర్‌కు వ్యతిరేకంగా గాని, ఫాసిస్టు నియంత ముసోలినీకి విరుద్ధంగా గాని పోప్ మాట్లాడలేదు. ఆనాడు పోప్ వ్యతిరేకించివుంటే యూదులు అలా హతమయ్యేవారుకాదు. అయితే పోప్ కూడా యూదుల వ్యతిరేకిగదా. మానవహక్కుల గొడవ వారికి పట్టదు. దైవహక్కుల పేరిట మానవుల్ని చంపడం వారిలీల! దీనిపై ప్రపంచంలో తీవ్ర విమర్శ వచ్చింది. పోప్ దుర్మార్గ ప్రవర్తన ఖండనకు గురైంది.

పోప్ 12వ పయస్ తన దర్శనార్థం వచ్చిన సుప్రసిద్ధ బ్రిటిష్ కవి టి.ఎస్. ఇలియట్ సాహిత్యంపై బోధచేశాడు. ఫ్రాన్స్‌లో కేథలిక్ మేధావి టైల్ డి షార్డిన్ పరిణామాన్ని గురించి రాజీపడగా పోప్ అతడ్ని ముప్పుతిప్పలు పెట్టాడు. చివరకు అతడు అమెరికా ప్రవాసం పోవలసి వచ్చింది. అలా శిష్యుల్ని కూడా కాలరాచారు.

కేథలిక్కులు స్త్రీలను ద్వితీయ పౌరులుగా, బానిసలుగా చూస్తారు. పోప్ పయస్ 12 దీనికి ఆమోదముద్ర వేశాడు.

అలాంటి పోప్, రెండవ ప్రపంచ యుద్ధానంతరం, తనకు పడకగదిలో జీసస్ క్రీస్తు కనిపించాడని చెప్పడం మొదలెట్టాడు. ఇందుకు రుజువులు సాక్ష్యాలు అక్కరలేదుకదా. సాక్షాత్తు పోప్ చెబుతుంది భక్తులు నమ్మక ఏంచేస్తారు?

ఉద్యానవనంలో సూర్యుడు రంగురంగులుగా తిరుగుతున్నట్లు కనిపించాడని పోప్ మరొక విడ్డూరాన్ని ప్రచారం చేశాడు. అప్పుడు పక్కనే వున్న అతని డ్రైవర్ జవాని స్టెఫనోరి తనకు అలాంటి రంగులు కనిపించలేదన్నాడు.

అలాంటి పోప్ ఆధునిక వైద్యం బదులు, స్విట్జర్లాండ్‌లో నాటువైద్యం అనుసరించి బాధకు గురైనాడు. చివరకు ఆ చికిత్సలోనే చనిపోయాడు. స్విస్ ప్రాక్టీషనర్ పాల్ నెహాస్ పోప్‌కు సెల్యుథెరపి పేరిట చర్మం అడుగున గొర్రె, కోతి పిండాలనుండి జీవకణాలను ఇంజక్షన్ల ద్వారా ఎక్కించారు. అది సర్వరోగనివారిణి అనేవాడు. అందుకు రుజువులు, ఆధారాలు లేవు.

1958 అక్టోబరు 9న యూజినో పచెలి పోప్ పయస్ 12 చనిపోయాడు.

ఇప్పుడు ఆ పోప్ గొప్ప రుషి అని ప్రస్తుత పోప్ ప్రకటించాలనుకుంటున్నాడు. ఇందుకు పోప్ అద్భుతాలు కొన్ని, రుజువు అయినట్లు చూపాలి. వాటి పరిశీలనకు ఒక సంఘం నియమించాడు. అలాంటి రుషి పట్టా మదర్ థెరిసాకు సైతం అంటగట్టాలని ప్రయత్నాలు మొదలయ్యాయి.

*- హేతువాది, డిశంబరు 1999*

# పునర్వికాస పరిణామం
# డిరోజియో ఉజ్వల ఆరంభం

భారతదేశంలో పునర్వికాసం 19వ శతాబ్దం ఆరంభంలో మొదలయింది. మానవ హక్కులకు, విలువలకూ వ్యతిరేకంగా వున్న మత ఆచారాలూ, సంప్రదాయాలూ పరిశీలించి ప్రశ్నించడం ప్రారంభమైంది. మత గ్రంథాల ఆధారంతో కొందరు ఆచారాలను సంస్కరించాలని తలపెట్టగా, మరికొందరు తృణీకరించాలన్నారు. మొత్తం మీద సమాజంలో ఉన్న దోషాలను ఉభయులూ గుర్తించారు, మార్పు కోరారు. పాత పద్ధతులను గుడ్డిగా అనుసరించరాదనే ధోరణి వ్యక్తమైంది. ఇది దేశంలో పునర్వికాసానికి నాంది. బెంగాల్, బొంబాయిలలో ఈ ఆలోచన మొదలైంది. అప్పట్లో ఆంగ్లేయులు పాలిస్తున్న భారతదేశానికి కలకత్తా రాజధాని. ఇంగ్లీషు విద్య కొత్తగా ప్రారంభించగా చదువుకున్నవారి సంఖ్య వేళ్ళపై లెక్కించటానికి వీలుగా ఉండేది. కలకత్తా జనాభా 2.5 లక్షలున్న రోజులలో కొత్తగా ఇంగ్లీషు బోధనా భాషగా హిందూ కళాశాలను 1817లో

ప్రారంభించారు. రామమోహన్‌రాయ్ కలకత్తా వచ్చి ఆత్మీయ సభ స్థాపించి చర్చలు కొనసాగించిన రోజులవి. బెంగాల్ సంపన్న కుటుంబీకులు కలకత్తాలో 1817లో కొందరు యూరోపియన్లతో కలసి హిందూ కళాశాల స్థాపించారు. భారత పునర్వికాసానికి ఈ కళాశాల ఎంతో తోడ్పడింది. బహుశ ఈ కృషికి శ్రీకారం చుట్టిన వ్యక్తిగా హెన్రీ లూయీ ఎవియన్ డిరోజియోను పేర్కొనవచ్చు.

డిరోజియో 1809 ఏప్రిల్ 19న కలకత్తాలో పుట్టాడు. తండ్రి ఫ్రాన్సిస్ డిరోజియో. ఇతడు చీఫ్ అకౌంటెంట్‌గా జేమ్స్‌స్కాట్ కంపెనీలో పనిచేస్తూ ఉండేవాడు. తల్లి సోఫియా జాన్సన్. 1806లో వీరి వివాహం జరిగింది. డిరోజియో పుట్టిన 6 సం॥లకే 1815లో తల్లి చనిపోయింది. తండ్రి మరొక వివాహం చేసుకున్నాడు. సవతితల్లి అన్నా మేరియా రివర్స్ డిరోజియోను బాగా చూచుకున్నది. 1851లో ఆమె చనిపోయింది. 1809 ఆగస్టు 12న కలకత్తా సెంట్‌జాన్స్ చర్చిలో హెన్రీ డిరోజియో బాప్టిజం జరిగింది. డిరోజియో డ్రమండ్ అకాడమీలో చేరి పాఠశాల విద్య నభ్యసించాడు. డేవిడ్ డ్రమండ్ (1757-1843) కవి, తత్వచింతన కలవాడు. 1813లో ఇండియాకు వచ్చి అకాడమీని స్థాపించి చాలామందికి విద్యారంగంలో బీజాంకురాలు ఏర్పడటానికి తోడ్పడ్డాడు. ఈ స్కూలులో కవిత్వం, నాటకరంగాల గురించి ప్రత్యేక కృషి జరిగింది. పాఠశాలలో ఉండగానే డిరోజియో ఇంగ్లీషులో కవితలల్లాడు. ప్రతిభాశాలి అనిపించుకున్నాడు. ఐతే విద్యాభ్యాసం పూర్తికాకుండానే 14వ ఏట పాఠశాల వదలి తండ్రి పనిచేస్తున్న మర్కంటైల్ సంస్థలో రెండేళ్ళు ఉద్యోగం చేసి తరువాత భాగల్‌పూర్‌లోని తారాపూర్ నీలిమందు కంపెనీలో చేరాడు. ఉద్యోగం చేస్తున్నా నిర్విరామంగా కవితలు వ్రాస్తూనే ఉండేవాడు. ది ఇండియా గజెట్‌లో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగంలో చేరే నిమిత్తం 1826లో కలకత్తా చేరుకున్నాడు. డా॥ జాన్ గ్రాంట్ కారణంగా ఈ ఉద్యోగం లభించింది. 1826 నవంబరులో నెలకు 150 రూ. జీతంతో కలకత్తాలోని హిందూ కళాశాలలో టీచరుగా చేరాడు. అప్పటికే తన మొదటి కవితా సంపుటిని డా॥ గ్రాంట్‌కు అంకితం ఇచ్చాడు. కవిగా, రచయితగా రూపొందుతున్న డిరోజియో ఇంగ్లీషు పాఠకలోకంలో గుర్తింపు పొందనారంభించాడు. కలకత్తా మాగజైన్, బెంగాల్ మాన్యువల్ కేలడోస్కోప్, హేస్పెరస్, కలకటా లిటరరీ గజట్ వంటి పత్రికలలో తన కవితలూ, రచనలూ ప్రకటించాడు. సతీ సహగమన నిషేధాన్ని ఆహ్వానించాడు! గ్రీస్ విమోచనను శ్లాఘించాడు.

హిందూ కళాశాలలో డిరోజియో కొత్త పద్ధతిలో చరిత్రను బోధించాడు. ప్రశ్నించి తెలుసుకోవడం, వైజ్ఞానికంగా పరిశీలించడం అతడి ఆయుధాలుగా వుండేవి. కాంట్ తత్వంపై తీవ్రవిమర్శచేస్తూ రచన సాగించాడు. పాశ్చాత్య ఆలోచనా ధోరణిలో విద్యార్థులు పయనించటానికి వీలుగా కృషి చేశాడు. ఇది హిందూ కళాశాల విద్యార్థులను ఆకట్టుకున్నది. కళాశాలలో ప్రథమ చర్చావేదికను ప్రారంభించారు. సంప్రదాయాలనూ, ఆచారాలనూ పట్టించుకోకుండా తిరుగుబాటు ధోరణి వ్యక్తపరిచారు. డిరోజియో ఇంట్లోకూడా చర్చలు కొనసాగాయి. హిందూమతంలోని జుగుప్సాకరమైన అనేక ఆచారాలను వీరు నిరసించారు. సత్యాన్వేషణ ఒక్కటే వారికి లక్ష్యంగా కనిపించింది. 1828లో అకడమిక్ అసోసియేషన్ ప్రారంభించి యథేచ్ఛగా చర్చలు చేశాడు.

వారాంతంలో చర్చలు జరిపేవారు. అప్పట్లో కళాశాల విద్యార్థుల సంఖ్య కేవలం వందల్లోనే ఉన్నది. 1830 ఫిబ్రవరిలో ఎథీనీయమ్ అనే పత్రికను కూడా హిందూ కళాశాల విద్యార్థులు ప్రారంభించి 2 సంచికలు వెలువరించారు. ఇందులో స్త్రీవిద్య, న్యాయాన్ని అందించటంలో అధికవ్యయం లేకుండా చూడటం, మూఢనమ్మకాలపై విమర్శ సాగించారు. ఐతే, డా॥ హెచ్. హెచ్. విల్సన్ కళాశాల అధిపతిగా ఆ పత్రికను మూతవేయించారు. డిరోజియో తన ఉపన్యాస పరంపరలో బేకన్, బెంథామ్, హ్యూం, లాక్, పెయిన్, స్మిథ్‌ల తత్వాలను, ఆలోచనలను విద్యార్థులకందించారు. వలసవాదానికి వ్యతిరేకంగా విద్యార్థుల వాదన ప్రారంభమైంది. ఫ్రెంచి విప్లవాన్ని ఆవేశపూరితంగా సమర్థించారు.

సనాతన హిందువులు డిరోజియో నాయకత్వాన జరుగుతున్న ధోరణులను గమనించి ఆందోళన చెందారు. బృందావన్ గోపాల్ అనే విద్యార్థి సనాతనులకు డిరోజియో సమాజంలో జరుగుతున్న విషయాలను చిలవలు పలవలుగా చెప్పి వారిని కలవరపరిచాడు. 1831 ఏప్రిల్లో కళాశాలలో జరుగుతున్న విషయాలను వ్యతిరేకిస్తూ సనాతనులు ఒక కరపత్రాన్ని ప్రచురించారు. అప్పటికే డిరోజియోకు హెడ్‌మాస్టర్ యాక్స్‌లమ్‌కు సిద్ధాంతపరమైన వివాదం చెలరేగింది. 1831 ఫిబ్రవరి 5న కళాశాల సంఘం ఈ వివాదాన్ని సర్దుబాటు చేసింది. ఐతే, సనాతన హిందువుల ఆందోళన కారణంగా డిరోజియోపై ఒక ప్రత్యేక విచారణ సంఘాన్ని ఏర్పరిచారు. కళాశాలలో అలజడికి దారితీసిన డిరోజియోను తొలగించాలనేది అభియోగం. 1831 ఏప్రిల్ 23న హిందూ కళాశాల డైరెక్టర్లు ప్రత్యేక సమావేశం జరిపి విషయాన్ని పరిశీలించారు. యువకులను డిరోజియో చెడగొడుతున్నాడని ముగ్గురు సభ్యులు అభిప్రాయపడగా ఆరుగురు అందుకు సమ్మతించలేదు. విద్యార్థులపై కూడా చర్య తీసుకోవాలని, హిందూయిజంపై దాడిచేసే విద్యార్థులను కాలేజి నుండి తొలగించాలని ప్రతిపాదించారు. డిరోజియో దోషి అని కమిటీ తేల్చలేకపోయినా హిందువులలో ఉన్న వ్యతిరేక భావాన్ని దృష్టిలో పెట్టుకొని డిరోజియోను తొలగించాలని తీర్మానించారు. తొలగించనక్కరలేదని శ్రీకృష్ణసిన్హా వాదించారు. తొలగించటం ఆపద్ధర్మచర్యగా ప్రసన్న కుమార్ టాగోర్, రసమయిదత్త అభిప్రాయపడ్డారు. తొలగించటం అవసరమని చంద్రకుమార్ టాగోర్, రాధాకాంత్‌దేవ్, రామ్ కమల్‌సేన్, రాధామాధవ బంధోపాధ్యాయ తలపెట్టారు. 1831 ఏప్రిల్ 25న విల్సన్ సలహాపై డిరోజియో తన రాజీనామా లేఖను పంపారు. వదంతులుగా విల్సన్ పేర్కొన్న అభియోగాలను డిరోజియో ఎదుర్కొన్నారు. ఆయన ఒక లేఖ పంపిస్తూ నాస్తికవాదాన్ని చర్చించటం తప్పా అని అడిగారు. హ్యూం వాదనలను అందుకు వ్యతిరేకమైన అభిప్రాయాలను విద్యార్థులకు వినిపించామనీ, అందుకుగాను తనను సందేహవాదిగా, మ్లేచ్ఛుడుగా దూషించటం మతపరమైన వ్యక్తులకు అలవాటేనన్నారు. డిరోజియోను తొలగించిన తరువాత కొందరు విద్యార్థులు కూడా కాలేజినుంచి వెళ్ళిపోయారు. డిరోజియో "ఈస్ట్ ఇండియన్" అనే దినపత్రికను స్థాపించి తన అభిప్రాయాలనూ, ఆదర్శాలనూ కొనసాగించారు. ఆంగ్లో ఇండియన్లు, భారతీయులూ సఖ్యంగా ఉండాలన్నారు. ఏకేశ్వరారాధనను ప్రచారం చేసి

విగ్రహారాధనను వ్యతిరేకించిన బ్రహ్మసమాజవాదులు ముఖ్యంగా, ప్రసన్నకుమార్ టాగోర్ దుర్గపూజలో పాల్గొన్నందుకు డిరోజియో ఖండించారు. డిరోజియో అనుకూలురు, శిష్యులు కూడా వివిధ పత్రికలు పెట్టి, సంఘాలు స్థాపించి భావ ప్రచారానికి పూనుకున్నారు. 1831 డిసెంబరులో డిరోజియోకు కలరా వ్యాధి సోకింది. ఆ విషయం తెలిసి కూడా అతని మిత్రులు పడకచుట్టూ చేరి ఆతృతగా డిరోజియో చావుబ్రతుకులమధ్య కొట్లాడుతుండగా చెంత ఉన్నారు. డిసెంబరు 17న డిరోజియో చనిపోయారు.

చిన్న వయసులోనే జీవితాన్ని చాలించిన డిరోజియో చాలామంది యువకులను ప్రభావితం చేసి యువకులను ఉత్తేజపరచి పునర్వికాస ఉద్యమానికి నాంది పలికారు. డిరోజియోకు, రాంమోహన్‌రాయ్‌కూ స్నేహం ఉన్నదీ లేనిదీ స్పష్టపడలేదు. డిరోజియో స్థాపించిన అకడెమిక్ అసోసియేషన్ ప్రభావంతో ఆయన అనంతరం యువబెంగాల్ సంఘాన్ని స్థాపించారు. ఇది ఒక ఉద్యమంగా పెంపొందలేకపోయింది గాని ఇంచుమించు 10 సం॥ల పాటు డిరోజియో ప్రభావంతో కొందరు కృషిచేసినట్లు స్పష్టపడింది. టాం పెయిన్ "ఏజ్ ఆఫ్ రీసన్" చదవటం, బెంథామ్ సూత్రాలను అనుసరించటం, ఏడం స్మిత్ ఆర్థిక సూత్రాలను అధ్యయనం చేయటం వీరి ప్రధాన లక్షణాలుగా కనిపించాయి. డిరోజియో అనుచరులలో రసిక్ కృష్ణమల్లిక్, తారాచంద్ర చక్రవర్తి, రాంగోపాల్ ఘోష్, దక్షిణరంజన్ ముఖోపాధ్యాయ, కృష్ణమోహన్ బంధోపాధ్యాయ, రాధానాథ్ సిక్దర్ పేర్కొనదగినవారు. డిరోజియో స్థాపించిన అకడమిక్ అసోసియేషన్‌కు డా॥ హేర్ అధ్యక్షులుగా కొనసాగుతూ డిరోజియో ధోరణి ప్రచారంచేశారు. డేవిడ్ హేర్ హిందూ కాలేజి స్థాపకులుగా స్కూల్ సొసైటీనీ, స్కూల్ బుక్ సొసైటీనీ స్థాపించి మెడికల్ కళాశాలను 1835లో ప్రారంభించారు. డిరోజియోకు శిష్యులు బొంబాయి, గుజరాత్‌లలో కూడా ఉండేవారు. 1838 ఫిబ్రవరి 28న విజ్ఞానార్జనకు సమాజాన్ని ఏర్పరచి తారాచంద్ చక్రవర్తి అధ్యక్షతన మూడు సంపుటాలు ప్రచురించారు. డిరోజియో సంఘాలన్నీ సాంస్కృతిక సమితులుగా ప్రారంభమై రాజకీయాలలోకి దారితీశాయి. సత్యాన్వేషణ జరపాలనే డిరోజియో ధోరణి వీరంతా కొంతకాలం కొనసాగించి పునర్వికాస ఉద్యమానికి హేతువాద ధోరణికి నాంది పలికారు. కాని, అది అట్టేకాలం నిలవలేకపోయింది. మత సంస్కరణ వాదం ఒకవైపున, సనాతనవాదం మరొకవైపున సమాజాన్ని ఆకట్టుకున్నాయి.

*- హేతువాది, డిసెంబరు, 1988*

## పునర్వికాస పరిణామం

# సగం సంస్కరణ - సగం పునర్వికాసం

దేశంలో పునర్వికాసానికి డిరోజియో నాంది పలికితే, హిందూ పునర్వికాసానికి రాజా రామమోహన్‌రాయ్ శ్రీకారం చుట్టాడు. వాస్తవంగా అంచనా వేస్తే రామమోహన్‌రాయ్

సంస్కరణవాదానికి దేశంలో పితామహుడంటే సరిగా వుంటుంది. తన ఏకేశ్వరవాదానికి అనుకూలంగా వుండే ఉపనిషత్ రచనలను ఇంగ్లీషులోకి అనువదించి, ఒకే శక్తి వున్నదనే వాదం బలంగా వున్న ప్రమాణరచనల్ని వదిలేయడం గమనార్హం. ప్రమాణ గ్రంథాల్ని అనువాదాలలో యిలా మార్చేయడం సంస్కర్తలందరూ భారతదేశంలో చేసిన పనే!

42 సంవత్సరాలకే బ్రిటిష్‌వారి కొలువుచాలించి ప్రజాసేవకు ఉద్యమించిన రామ్‌మోహన్ కలకత్తా చేరారు. అంతవరకూ ఆయన జిల్లాలలో వివిధ ఉద్యోగాలు నిర్వహించి, సాహిత్య, మతరంగాలలో కృషిచేశారు. నాడు కలకత్తా భారతదేశ రాజధాని వివిధ మేధో రంగాలలో కలకత్తా అప్పుడే స్పందిస్తున్నది.

చదువుకుంటున్న కొద్దిమంది మధ్యతరగతి, ఉన్నతవర్గ విద్యార్థులలో కొందరు హిందూ ఆచారాలను, మూఢనమ్మకాలను ప్రశ్నించారు. పాశ్చాత్య చింతనాపరుల గ్రంథాలు చదివి ప్రభావితులైన విద్యార్థులు హిందూమతాన్ని ప్రశ్నించారు. క్రైస్తవ మతప్రచారకుల మద్దత్తు కూడా వీరికి లభించింది. ఇందుకు భిన్నంగా హిందూమతాన్ని రక్షించాలని మరికొందరు పూనుకొన్నారు. అలాంటి సమయంలో, 1815లో రామమోహన్ కలకత్తా చేరుకున్నారు. ఆయన వహించిన కీలకపాత్ర దృష్ట్యా కొంత పూర్వాపరం తెలుసుకోవడం అవసరం.

హిందూమతాన్ని సంస్కరించాలనే ఆయన ప్రయత్నం వలన, బెంగాల్‌లో హిందువులు క్రైస్తవులుగా మారిపోకుండా పెద్ద అడ్డుకట్ట వేయగలిగాడు. రామమోహన్ తొలుత ఇస్లాం మతప్రభావంలోకి వచ్చాడు. తరువాత క్రైస్తవమత ప్రభావం క్రిందకు వచ్చాడు. అవి రెండూ రంగరించి హిందూమతంలో జొప్పించే సంస్కర్తగా తేలాడు. అలాగే సంస్కృత భాషాధ్యయనం చేసి, పవిత్ర గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. వేదాలు చదివాడు. పర్షియన్, అరబిక్ భాషలు అభ్యసించాడు. ఖురాన్ చదివి ముస్లిం పండితుల సాంగత్యం చేశాడు. వీటన్నిటి వలన రామమోహన్ ఏకేశ్వరవాది అయ్యాడు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాలలోని ఏకేశ్వరవాద బలంతో తన సంస్కరణోద్యమాన్ని తలపెట్టాడు. రంగపూర్‌లో తన ఉద్యమాన్ని ప్రారంభించి స్నేహితులను కూడగట్టి ఏకేశ్వరారాధన ప్రార్థనలు చేసేవాడు. రంగపూర్‌లో వుండగానే ఉపనిషత్తుల్ని ఇంగ్లీషులోకి అనువదించాడు. వేదాంత గ్రంథం, వేదాంతసారం రాశాడు.

మరొక ఆసక్తికర అంశమేమంటే రామమోహన్ తాంత్రిక విద్య అభ్యసించాడు. హరిహరానంద వద్ద యీ విద్య నేర్చాడు. ఒక ముస్లిం స్త్రీతో కలసి తాంత్రికవిద్యను రంగపూర్‌లో ఆచరించిన రామమోహన్ క్రమేణా వేదాంతంలో ఆసక్తి కనబరచాడు. 1788 నుండీ పండిత నందకుమార్ విద్యాలంకార్ వద్ద వేదాంతం నేర్చుకున్నాడు. అరబిక్ - పర్షన్ భాషలలో రచనలు చేశాడుకూడా. అన్ని రచనలలోనూ ఏకేశ్వరారాధనపట్ల దృష్టిపెట్టాడు. రంగపూర్‌లో దివాన్‌గా వుంటూ దిగ్‌బీ గ్రంథాలను చదివి, ఇంగ్లీషు పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. మార్టిన్‌లూథర్ మత సంస్కరణ ఇతడిని ఉత్తేజపరచింది. తాను కూడా హిందూమతంలో విగ్రహారాధన పోగొట్టి, సరైన

హిందూమతాన్ని పునరుద్ధరించాలనుకున్నాడు. ఇంగ్లీషులో ఉదారవాదుల రచనలు అధ్యయనం చేశాడు.

హేతువాదం మతానికి పనికిరాదని రామమోహన్ అభిప్రాయం. హేతువు మన సందేహాలను పెంచుతుందే గాని, తీర్చదనే ఉద్దేశాలను వ్యక్తపరిచాడు. కనుక హేతువుకు మతప్రమాణాలను జోడించాలన్నాడు. ఇందుకు ఈశ్వరునిపై ఆధారపడాలన్నాడు. ప్రమాణ గ్రంథాలపై ఆధారపడక తప్పదనడంలోనే రామమోహన్ ప్రప్రథమంగా వెనుకంజ వేశాడు. తన హేతువుకు తృప్తికరంగా వుండే ప్రమాణాలను ఎంపిక చేసుకుంటానన్నాడు.

ఎన్నో విషయాలలో దైవం మనకు వెల్లడించే అంశాలుంటాయని రామమోహన్ నమ్మాడు, వ్రాశాడు. ఆయన అనువదించిన ఉపనిషత్తులకు పీఠికలు వ్రాస్తూ యీ ధోరణి వ్యక్తపరిచాడు. ఇస్లాంలో సూఫీ సన్యాసులవాదం పట్ల తొలుత ఆకర్షితుడైన రామమోహన్, క్రైస్తవంలో మతరీతులను, హిందూమతంలో వివిధస్థాయీ అంశాలను పట్టించుకొని, మత సంస్కర్తగా తేలాడు. కాని, రంగపూర్‌లో ఉన్నంతకాలం, రామమోహన్ ఎవరో జనానికి తెలియదు. 1815లో కలకత్తా వచ్చినప్పటి నుండీ ఆయన లోకానికి ప్రముఖుడుగా కనిపించాడు.

రాజధాని కలకత్తా 1815 నాటికి ఎలా వున్నదో గ్రహించిన తరువాత, రామమోహన్ కార్యకలాపాలు పరిశీలిద్దాం. అప్పుడు గాని సామాజిక - తాత్విక - రాజకీయ భూమిక మనకు అవగాహన కాదు.

బ్రిటిష్‌వారు పరిపాలించిన ప్రాంతాలలో కూడా, ముందుగా బెంగాల్ మేల్కొన్నది. అందులో కలకత్తా రాజధాని కావడంతో పాశ్చాత్యభావాలు త్వరగా వ్యాపించి తమ ప్రభావాన్ని చూపెట్టాయి. అలాంటి దశలో 1815లో రామమోహన్ ఉద్యోగాలకు స్వస్తిపలికి, 42వ ఏటనే ఒక సంఘాన్ని స్థాపించాడు. హిందూమతాన్ని సంస్కరించడానికి, సమాజాన్ని మార్చడానికి ఉద్దేశించిన ఆత్మీయసభ సమావేశాలు తరచు జరిగేవి. ఇక్కడే సతీసహగమనంపై చర్చలు సాగాయి. రామమోహన్ ఆత్మీయసభ ఆధారంగా కొందరు వేరే సభలు స్థాపించారు. అలా ఏర్పడిన వాటిలో ధర్మసభ పేర్కొనదగినది. రామమోహన్ వెల్లడించే సంస్కరణలకు వ్యతిరేకంగా హిందూమతోద్ధారకులు ఏర్పరచిన సభనే ధర్మసభ అన్నారు. అప్పుడే ప్రాథమికవిద్యను ప్రోత్సహించే నిమిత్తం స్కూల్ బుక్‌సొసైటీ, స్కూల్‌సొసైటి అనే సంఘాలను కూడా ఏర్పరచారు.

కలకత్తాలో సంపన్నులు కొందరు చేతులు కలిపి 1817లో హిందూ కళాశాలను స్థాపించారు. ఇదే కలకత్తా జీవనరంగంలో పెద్ద మలుపుకు దారితీసింది. ఇంగ్లీషులో చదువుకోవాలని, పాశ్చాత్య భావనలు అభ్యసించాలని, సంస్కృతం స్థానే ఇంగ్లీషులో లెక్కలు, భూగోళం, విజ్ఞానశాస్త్రాలు, చరిత్ర అధ్యయనం చేయాలన్నారు. సంస్కృతం కావాలా, ఇంగ్లీషు కావాలా అనే మీమాంసలో రామమోహన్, ఇంగ్లీషు కావాలనడం గొప్ప మార్పుకు నాంది పలికింది. ఇష్టం వున్నా లేకున్నా, ఇంగ్లీషు ప్రవేశపెట్టడంతో పాశ్చాత్య భావాలు వచ్చి, చాలామందిని ప్రభావితం చేయడం

గమనార్హం. దీనితోబాటే, 1818లో భారతీయ భాషలలో పత్రికలకు అంకురార్పణ జరిగింది. ఉత్తరోత్తరా యీ పత్రికలే రాజకీయ, సాంఘీక ఆయుధాలుగా పనిచేశాయి. కరపత్రాలు, చిన్న పుస్తకాలు వెలువడ్డాయి. కలకత్తాలో కార్యకలాపాలు విస్తరించాయి. అవి పునర్వికాసానికి, సంస్కరణకు తోడ్పడినట్లే, సనాతన ఛాందస భావాలను కాపాడుకోటానికీ ఉపయోగించాయి. ఆత్మీయసభ-ధర్మసభ మోహరించి, రెండు ధృవాలుగా నిలిచి పోరాడాయి. భారతీయులకు ప్రకృతితత్వం, రసాయనశాస్త్రం, శారీరకశాస్త్రం, గణితం అవసరమని, అవి నేర్పమని రామమోహన్ బ్రిటీష్‌వారిని కోరాడు. ఆ మేరకు ఆయన అభ్యుదయ పాత్రను నిర్వహించాడు. ఆత్మీయసభలో సభ్యుడుగా వున్న వైద్యనాథ్ ముఖర్జీ సనాతనుడు. రామమోహన్ హిందూ సనాతనత్వంపై దాడిచేసినప్పుడు ఆయన సభతో తెగతెంపులు చేసుకున్నాడు. హిందువులను నిర్బంధంలో వుంచుతూ, కట్టుబాట్ల పేరిట పెరగకుండా ఆచారాలు, సంప్రదాయాలు వెనక్కు నడిపిస్తున్నాయని రామమోహన్ పేర్కొన్నాడు. కనుక రాజకీయ, సామాజిక దృష్ట్యా మతసంస్కరణ అవసరమన్నాడు. సతీసహగమనం హిందువులకు మచ్చ అంటూ దీనిని తొలగించాలన్నాడు. సనాతనులు ఇందుకు ఒప్పుకోలేదు.

రామమోహన్‌రాయ్ హిందూమతాన్ని వ్యతిరేకించలేదు. కేవలం సంస్కరించాలన్నాడు. అందుకు కూడా సనాతనులు అంగీకరించలేదు. మతాన్ని సంస్కరించడానికి ఎవరికీ అర్హతలేదని సనాతనుల వాదన. అందుకే యీ దేశంలో సంస్కరణవాదులు మైనారిటీగా మిగిలిపోయారు. సనాతనవాదులే నెగ్గారు. నాటికీ నేటికీ అదే పరిస్థితి. ప్రమాణగ్రంథాలను ప్రశ్నించ వీల్లేదన్నప్పుడు, అక్కడక్కడా సంస్కరించి, కొంతకాదని మరికొంత ఔనంటే కుదరదు. మొత్తం నిరాకరించాలి. లేదా అంతా ఆమోదించాలి. మధ్యేమార్గం అవలంబించిన రామమోహన్‌రాయ్, ఆయన అనుచరులు విఫలమయ్యారు. చివరకు సతి విషయంలోనూ నెగ్గలేకపోయారు!

రామమోహన్‌రాయ్ 'కలకత్తా' చాలా చిన్నది. రాజధానిగా తెల్లవారు తమ అగ్రహారాల్లో ఉండగా, మిగిలినవారు వేరేవుంటూ వచ్చారు. బ్రాహ్మణ, కాయస్త, వైశ్యకులాలకు సమాజంలో అత్యున్నత స్థాయి, ప్రతిష్ఠ వుండేది. భద్రలోక సమాజం ఉన్నత కులాలకు పరిమితమైంది. ఇందులో జమీందార్లు, పరిపాలకులు, వ్యాపారస్తులు వుండేవారు. చిన్న వ్యాపారస్తులు, గుమాస్తాలు గృహస్త భద్రలోక్ తరగతికి చెందినవారు. వీరంతా ఉన్నతవర్గాలను అనుకరించే ప్రయత్నంలో వుండేవారు. మొత్తం చదువుకున్న భారతీయులు ఒకజాతిగా వుండగా, మిగిలినవారిని అలగా జాతిగా చూచేవారన్నమాట. అలగాజనం ఇంగ్లీషు చదివితే తమ ఆసక్తులు దెబ్బతింటాయని భద్రలోక్ వారు భావించారు!

భద్రలోక్‌వారు బ్రిటిష్‌వారికి విజ్ఞప్తులు చేయడం, అర్జీలు పెట్టడం, పరిమిత ప్రభావాన్ని చూపడం నిత్య కార్యక్రమంగా వుండేది. పత్రికలపై బ్రిటిష్‌వారు ఆంక్షలు విధించినప్పుడు 1823లో రామమోహన్‌రాయ్, తన స్నేహితులతో కలసి యీ ఆంక్షల్ని వ్యతిరేకిస్తూ అర్జీలు పెట్టారు. మొత్తంమీద భద్రలోక్‌లో ఉదారవాదులకు రామమోహన్ నాయకత్వం వహించగా,

సనాతనులకు గోపీమోహన్‌దేవ్, రాధాకాంతదేవ్ అజమాయిషీ చేశారు. రామమోహన్ హిందువులను ఆకట్టుక రావడంలో చివరివరకూ జాగ్రత్త వహించాడు. ఏటా బ్రాహ్మణులకు దానాలు చేసేవాడు. యజ్ఞోపవీతం విడనాడకుండా కాపాడాడు. ఇంగ్లండ్‌లో యూరోప్‌వారితో పంక్తి భోజనానికి కూర్చున్నా, రామమోహన్ శాకాహారానికే పరిమితమయ్యాడు. చనిపోయిన తరువాత తనను క్రైస్తవుల స్మశానంలో పెట్టవద్దన్నాడు. అలాగయితే తన ఆస్తి కుమారులకు సంక్రమించడంలో పేచీలు వస్తాయన్నాడు.

తన సమావేశాలకు అన్ని కులాలవారిని రామమోహన్ ఆహ్వానించేవాడు. కాని అధికసంఖ్యాకులు కులీన బ్రాహ్మణులే వుండేవారు.

మొత్తం మీద 1815 నుండీ కలకత్తాలో ఆత్మీయసభ ద్వారా రామమోహన్ సంస్కరణ కృషి చేశాడు. ఆధునిక విద్యకు ప్రోదిచేశాడు. పత్రికల స్వేచ్ఛ కోరాడు. సతీసహగమనాన్ని నిషేధించాలన్నాడు. సంస్కరణవాదంపై సనాతనుల దాడిని ఎదుర్కొన్నాడు. మరోవైపు జమీందార్ల ఆసక్తులను కాపాడడంలో యథాశక్తి కృషి కొనసాగించాడు.

## బ్రహ్మ సమాజం

1928లో కలకత్తాలో రామమోహన్ బ్రహ్మసమాజాన్ని స్థాపించారు. విశ్వవ్యాప్తంగా మతవాద ప్రచారం చేయాలని, ఒకే మతం, ఒకే దైవం వుండాలని వీరి ఉద్దేశం. ప్రపంచ ప్రభుత్వం కూడా ఏర్పడాలన్నారు. ఏకేశ్వరారాధన అనేది వేదసంహితలలో వున్నదని రామమోహన్ ఉద్దేశం. బ్రహ్మసమాజ ప్రభావం తక్షణమే అంతగా వున్నట్లు ఆధారాలు లేవు. పైగా యీ సమాజాన్ని స్థాపించిన రెండేళ్ళకే రామమోహన్ ఇంగ్లండ్ వెళ్ళిపోయాడు.

'రాజా' రామమోహన్‌రాయ్‌కు, బ్రహ్మసమాజ్‌కు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టింది సతీ సహగమన వ్యతిరేకత. సతీసహగమనం నాడు బెంగాల్, బీహారు ప్రాంతాలలో ఉన్నత తరగతులకు పరిమితమై వున్న దురాచారం. సతీసహగమనం నిషేధించరాదని ధర్మసభ సనాతనులు సంతకాలు సేకరించి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసిన రోజులవి! రామమోహన్ కుటుంబంలో సతీసహగమనం పాటించిన ఆధారాలేవీ లేవు, ఆయన వదిన అలకమంజరి భర్త చితిపై చనిపోయిందన్నప్పుడు, ఆధారాలు లేని కట్టుకథగానే యిది వ్యాపించింది. 1912లో జరిగినట్లు చెబుతున్న యీ కథనం సందర్భంగా రామమోహన్ అక్కడలేరు. వాస్తవాలు పరిశీలిస్తే 1818లో రామమోహన్ సతీసహగమన వ్యతిరేకత ప్రారంభించారు. అప్పటికే క్రైస్తవ మిషనరీలు, బ్రిటిష్ ప్రభుత్వం 'సతి' ఆచారాన్ని నిషేధించాలన్నాయి. ఇందుకు దేశీయుల మద్దత్తు కావాలని వారు ఆశించారు. ఒకేసారి 'సతి' నిషేధం జరిగితే, ప్రజలు తిరగబడతారని రామమోహన్ అభిప్రాయం వెల్లడించారు. క్రమేణా నిషేధం జరగాల్సిందేనన్నాడు. ఇంగ్లండ్ వెళ్ళినప్పుడు ప్రీవీ కౌన్సిల్‌లో సతి నిషేధంపై చర్చలు సాగుతుండగా, రామమోహన్ హాజరుకాలేదు. జమీందార్ల భరణం పెంచాలనే విషయం ఎక్కువగా పట్టించుకున్నాడు. అయితే సతి నిషేధం 1929లో

జరిగినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వాన్ని అభినందించాడు. పైకి ఎన్ని చెప్పినా రామమోహన్ ఆచరణలో కులాన్ని వదలుకోలేదు. బహు భార్యాత్వం కూడా పాటించి ముగ్గురిని పెళ్ళి చేసుకున్నాడు!

రామమోహన్ స్థాపించిన బ్రహ్మసమాజ్, 1833లో ఆయన ఇంగ్లండ్‌లో చనిపోయిన అనంతరం విచ్ఛిన్నదశలో పడింది. దేవేంద్రనాథ్ ఠాగోర్ పూనుకొని పునరుద్ధరించకపోతే బ్రాహ్మసమాజ్ ఏమయ్యేదో?

రామమోహన్ ప్రారంభించిన బ్రహ్మసమాజ్‌కు దేవేంద్రనాథ్ ఠాగోర్ నీరు పోశాడు. ద్వారకానాథ్ ఠాగోర్ యిచ్చిన ఆర్థిక సౌకర్యాలు అందుకు ఉపకరించాయి. దేవేంద్రనాథ్ 1839లో తత్వబోధిని సభకూడా ప్రారంభించి, బ్రహ్మసమాజ్‌కు సోదరసంస్థగా కొనసాగించారు. 1843లో తత్వబోధిని పత్రిక ప్రారంభించారు. ఆ ఏడే ఒక సమావేశం ఏర్పరచి సభ్యత్వం పెంచే చర్చలు సాగించారు. చేరిన సభ్యులకు క్రమశిక్షణ, నియమ నిబంధనలు ఏర్పరచారు. అప్పటినుండి ఆయనతో పాటుగా అక్షయకుమార్ దత్తు, రాజనారాయణ్ బోసు, కేశవచంద్రసేన్ ప్రముఖపాత్ర వహించారు.

బ్రహ్మసమాజ్‌లో ప్రముఖ హేతువాది అక్షయకుమార్‌దత్తు, తత్వబోధిని పత్రిక సంపాదకుడుగా తన భాషాశైలితో ఎందరినో ఆకట్టుకున్నాడు. రామమోహన్ అనుసరించాలనే అక్షయకుమార్ ఆనాటి దేవేంద్రనాథ్ మత ఛాందసాన్ని వ్యతిరేకించాడు.

వేదాలు అపౌరుషేయాలా అనే చర్చ దేవేంద్రనాథ్, అక్షయకుమార్‌ల మధ్య సాగింది. వేదాలలో దోషాలు, వైవిధ్యాలు ఉన్నాయి. అలాంటప్పుడు వేదాలను ప్రమాణంగా ఎలా స్వీకరించడం? ఈ విషయాన్ని 1850లో అక్షయకుమార్ దత్తు బాహాటంగా ఒక సమావేశంలో ప్రకటించారు. ఆ వాదనను బ్రహ్మసమాజ్‌లో సనాతనులు ఒప్పుకోలేకపోయారు. రాజనారాయణ్ ఇందుకు అంగీకరించలేదు. బ్రహ్మసమాజ్ చీలడానికి అది నాంది అయింది. దేవేంద్రనాథ్, రాజనారాయణ్‌లు క్రైస్తవ వ్యతిరేక ధోరణి వ్యక్తపరచగా, మరోవైపు మధ్యతరగతిలో యువకులు కొందరు క్రైస్తవ మతంలోకి మారిపోయారు. బ్రహ్మసమాజ్‌లో దేవేంద్రనాథ్ ఆసక్తిని కోల్పోతున్న సమయంలో అక్షయకుమార్‌దత్తు 1854లో ఆత్మీయసభ సమావేశం ఏర్పాటుచేశారు. దేవుడి లక్షణాలు ఎలాంటివో చర్చించి, చేతులెత్తే పద్ధతి ద్వారా, అధికసంఖ్యాకుల నిర్ణయం ప్రకారం వాటిని నిర్ధారించారు. ఆ తరువాత దేవేంద్రనాథ్ హిమాలయాలకు వెళ్ళిపోగా, అక్షయకుమార్ రిటైర్ అయ్యారు.

సిపాయిల తిరుగుబాటు జరుగుతున్న సందర్భంగా, 1857లో కేశవచంద్రసేన్ బ్రహ్మసమాజ్‌లో చేరి, మళ్ళీ జీవం పోశారు.

కేశవచంద్రసేన్ యించుమించు బ్రహ్మసమాజానికి ఉగ్రవాదిగా పనిచేశారు. సమాజం ఒక వైపున బహుళ ప్రచారం పొందినా, అతిత్వరలోనే చీలికకు కూడా దారితీసింది. కేశవచంద్ర ప్రేరణతో మహారాష్ట్రలో ప్రార్థనా సమాజం ఆరంభించారు. క్రైస్తవమతం పట్ల విపరీతంగా

ఆకర్షితులైన కేశవచంద్ర, హిందువులకు దూరమయ్యాడు. దేశ, విదేశాలలో బ్రహ్మ సమాజాన్ని ప్రచారం చేసిన కేశవచంద్ర అందులో చీలికలకు కూడా దారితీశాడు. 1865లో జంధ్యం ఉండాలా? అక్కరలేదా? అనే విషయమై తీవ్ర చర్చలు జరిగిన అనంతరం, కేశవచంద్ర బ్రహ్మసమాజ్‌లో చీలిపోయి భారత బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. 1878లో అందులోనూ చీలిక ఏర్పడింది. కేశవచంద్ర కుమార్తె మైనర్‌గా వుండగా, కూచ్‌బీహార్ యువరాజుకు యిచ్చి వివాహం చేసినప్పుడు తీవ్ర విమర్శలకు గురైనాడు. అప్పుడే చీలినవారు సాధారణ బ్రహ్మసమాజ్ ఏర్పరచారు.

పాశ్చాత్య ప్రపంచం నుండి మనం సైన్సు నేర్చుకోవచ్చునీ, వారికి మన ఆధ్యాత్మికత నేర్పవచ్చునీ కేశవచంద్ర ప్రచారం చేశాడు.

బ్రహ్మసమాజ్ శాఖలు దేశవ్యాప్తంగా ఏర్పడినా, వాటి ప్రచారం పరిమితంగానే నిలచింది. విగ్రహారాధన కంటే, ఏకేశ్వరారాధన కొంత మెరుగు అనుకున్నా, అది మతపరంగా ఛాందసుల వాదనల్ని అడ్డుకోలేకపోయింది. సామాజిక రంగంలో కొంత పురోభివృద్ధి సాధించినా మతపరంగా బ్రహ్మసమాజ్ అట్టే ముందుకు పోలేకపోయింది.

దేశంలో ప్రప్రథమంగా ఆధునిక యుగంలో సంస్కరణోద్యమం తలపెట్టిన బ్రహ్మసమాజం విఫలమైంది. మతాన్ని మూలంలో కొట్టాలే గాని, కొమ్మలు నరికితే మళ్ళీ చిలవలు పలవలుగా చిగుర్లు వేసి వ్యాపిస్తుందని రుజువైంది.

*- హేతువాది, ఫిబ్రవరి 1989*

## పునర్వికాస పరిణామం
# పదండి వెనక్కు-వేదాల్లో విమానాలున్నాయిట!

వేదాల్లోనే అన్నీ వున్నాయి. వేదేతరమైనవన్నీ తృణీకరించాలి. ప్రతి ప్రమాణం వేదాలకు మాత్రమే వున్నది. కనుక వేదకాలంలోకి పోదాం. - అంటూ 19వ శతాబ్దంలో దయానంద బయలుదేరాడు. ఆర్యసమాజ్‌ను స్థాపించాడు. క్రైస్తవులుగా, ముస్లింలుగా మారిన హిందువులను శుద్ధిచేసి మళ్ళీ హిందువులుగా మార్చే ప్రయత్నం చేశాడు. ఇంగ్లీషు చదువుల్ని, పాశ్చాత్య ఆలోచనా ధోరణులను కాదన్నాడు - ఉత్తరభారతంలో దయానంద్ బాగా పర్యటించాడు. విపరీతంగా ప్రచారం సాగించాడు. వేదప్రమాణాన్ని నిలబెట్టడానికి సనాతన పండితులను ఎదుర్కొన్నాడు. ఆర్యసమాజ్ ప్రభావం జాతీయభావాలు గలవారిపై ఎంతో పనిచేసింది. జనాన్ని వెనక్కు నడిపించింది.

భారతీయ తత్వశాస్త్రం, మతజ్ఞానం పరికిస్తే వేదప్రమాణాలను కాదన్న హిందువులు అరుదు. బ్రహ్మసమాజ్‌లో కొందరు వేదం అపౌరుషేయం అనడాన్ని ప్రశ్నించారు. మిగిలిన

వారంతా వేదాల్ని శిరసావహించారు. అయితే వేదాలకుతోడు ఉపనిషత్తులకు సైతం ప్రమాణాన్ని ఆపాదించారు. మరికొందరు గీతనుకూడా ప్రమాణంగా స్వీకరించారు. హిందువులకు దూరంగా జరిగిన జైనులు, బౌద్ధులు మాత్రం వేదాల్ని ఒప్పుకోలేదు. చార్వాకుడు స్పష్టంగా వేదాల్ని తృణీకరించాడు. షడ్దర్శనకారులందరూ వేదప్రమాణాన్ని అంగీకరిస్తూనే, ఒకర్ని మరొకరు నిరసించి, పూర్వ పక్షం చేయడానికి ప్రయత్నించారు. మేం చెప్పేదే వేదాలకు అనుకూలంగా వున్నదని రుజువు చేయడానికి తర్కాన్ని ప్రయోగించారు.

దయానందుడు బయలుదేరేనాటికి భారతదేశం విదేశీ పాలకులందరినీ చవిచూచింది. ముస్లింపాలన అంతమై ఇంగ్లీషువారి పాలన స్థిరపడింది. బ్రిటిష్‌వారు దేశీయుల మతం, సాంఘిక ఆచారాల జోలికి పోరాదని అధికార విధానంగా భావించారు. కాని ఇంగ్లీషు విద్యల ప్రభావంతో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, పునర్వికాసం మొదలైన భావాలు పరిమితంగా ప్రభావితం చేశాయి. యూరోప్ నుండి వచ్చి మిషనరీలు మారుమూల గ్రామాలకు సైతం వెళ్ళి మతమార్పిడులు చేశారు. క్రైస్తవులుగా మారినవారిలో ఎక్కువమంది అంటరాని వారుండడం గమనించాలి. అక్కడక్కడా కొద్దిమంది శూద్రకులాలవారు, చెదురుమదురుగా అగ్రకులాలవారు క్రైస్తవులయ్యారు. బ్రహ్మసమాజీకులపై క్రైస్తవ ఆలోచనా ప్రభావం బాగా వున్నది. వెనువెంటనే సనాతన పండితులు మతమార్పిడిని నిరసిస్తూ, ఈసడిస్తూ పోయారు.

దేశంలో ముస్లింలుగా మారడం అప్పటికే యించుమించు పూర్తి అయింది. వందలాది సంవత్సరాల ముస్లిం పాలనలో యీ మార్పిడి జరిగిపోయింది. ఇందులోనూ తక్కువ కులాల నుండి ఎక్కువగా ఇస్లాంలోకి మారగా, పదవులు-హోదాలు ఇత్యాది కారణాల రీత్యా అగ్రకులాలలో కొందరు ముస్లింలుగా మారారు.

హిందువులలో తక్కువ కులాలవారిని నీచంగా చూడడం, అంటరానివారిని పశువులుగా పరిగణించడం శతాబ్దాలుగా వస్తున్నది. మత ధర్మశాస్త్రాలు యీ ధోరణిని సమర్ధించాయి. అలాంటి హిందూ వ్యవస్థ నుండి మతమార్పిడి జరిగింది. ఇది చారిత్రక వాస్తవం.

దయానందుడికి యీ విషయాలన్నీ తెలియకపోలేదు. అయినా హిందూ సమాజాన్ని పునీతం చేసి, కాపాడాలని కంకణం కట్టుకున్నారు. ఆయన ప్రభావం దృష్ట్యా ముందుగా జీవిత విశేషాలు తెలుసుకుందాం.

సన్యాసులందరివలె దయానందుడి అసలు పేరు మూలశంకరుడు. ఇతడి తండ్రి తివారి. తల్లి అమృతాబెన్. వారు శివభక్తులు. గుజరాత్ రాష్ట్రంలో కర్షన్ జిల్లాకు చెందినవారు. కుటుంబమంతా మత సంస్కృతి సంప్రదాయాలతో, భక్తిప్రపత్తులతో నిండివుండేది. 1824లో మూలశంకరుడు పుట్టాడు. సంస్కృతం చదివాడు. ఇంగ్లీషు జోలికి పోలేదు. మూలశంకరుడికి ఆప్తులు సన్నిహితులు, చనువు గలవారు అతడి సోదరి, అతడి మామ. వారిరువురూ చనిపోవడంతో అతడు మానసికంగా వికలత చెందాడు. ఇంట్లో సంప్రదాయాల బరువు, బాధ్యతలు సనాతన

ఆచారవ్యవహారాలు చాలా హెచ్చు. ఉపవాసాలూ అంతే. అలాంటి ఒక సందర్భంలోనే మూలశంకరుడికి విగ్రహాల ప్రభావంపై అపనమ్మకం ఏర్పడింది. శివలింగంపై ఎలుకలు తిరగడంచూచి అలాంటి విగ్రహానికి విలువ ఏమిటని చేస్తున్న ఉపవాసం కాస్తా మూలశంకరుడు విరమించాడని ప్రతీతి. తల్లిదండ్రులకు యీ విషయం కోపంకూడా వచ్చిందట. అలా ఆలోచించిన మూలశంకరుడు తన ఆలోచనను తార్కికంగా విస్తరిస్తే ఎంతో ప్రయోజనం చేకూరేది. ఆ తరువాత మూలశంకరుడు గుజరాత్‌లోని కౌషియాలో మతవిజ్ఞానం అర్జించాడు. అప్పటికే సన్యసించాలనే భావన ప్రబలినట్లున్నది. తల్లిదండ్రులు పెళ్ళి తలపెడితే, మూలశంకరుడు తప్పించుకొని పారిపోయాడు. తండ్రి వెంటపడి, కుమారుని సన్యాసి కాకుండా సంసారిని చేయాలనే ప్రయత్నం విఫలమైంది.

19వ ఏటనుండే మూలశంకరుడు ఆశ్రమాలకు, సన్యాసులవద్దకు వెళ్లడంతో అతడి లక్ష్యం నిర్ధారణ అయింది.

మూలశంకరుడి పేరుమార్చి దయానంద అని నామకరణం చేసినవారు పరమానందుడు. ఆ తరువాత వివిధ ప్రదేశాలలో యోగాభ్యాసం, సంస్కృత వ్యాకరణం, తాంత్రిక విద్య కూలంకషంగా నేర్చాడు. వివిధ మతాల తీరుతెన్నులు పరికించాడు. 1860 నాటికి విరాజానందస్వామి వద్దకు (మధుర) చేరాడు. అప్పటికి మూలశంకరుడికి 36 సంవత్సరాలు. అంధుడైన విరాజానందవద్ద మూడేళ్ళపాటు శుశ్రూషచేసి చాలా నేర్చుకున్నాడు. 1863 నుండి 75 వరకు దయానందుడు ఉత్తరాదిలో నిర్విరామంగా పర్యటించాడు. సుమారు 50 మత సమావేశాలలో పాల్గొని, చర్చలు జరిపి, వేదికలపై సనాతనులతో పోటీపడి, తనదే పైచేయి అనిపించుకున్నాడు. ఇంచుమించు 40 వివాదాస్పద సభలలో దయానందుడు తన వాదనా పటిమను నిరూపించాడు. వీటిలో కొన్ని క్రైస్తవుల, ముస్లింల సభలు కూడా వున్నాయి. హిందూమతంలో వేదేతరంగా జరిగే వాటిని ఎదుర్కొన్నాడు. వేదాలకు భాష్యం చెప్పాడు.

దయానందుడు తన మత ప్రచార పర్యటనలో బ్రహ్మసమాజవాదులైన కేశవచంద్రసేన్, దేవేంద్రనాథ్ ఠాగోర్లను కలిశాడు. క్రైస్తవ మత ప్రభావం బ్రహ్మసమాజ్‌పై ఎక్కువగా వున్నదని అభిప్రాయపడ్డాడు. గోవిందరనడే, ఆర్.జి. భండార్కర్లతో చర్చలు జరిపారు. ప్రార్థనాసమాజ్ వారిని కలిశారు. ఇలా ప్రచారం సాగిస్తుండగా, దయానందునిపేరు అమెరికా వరకూ ప్రాకింది. దివ్యజ్ఞాన సమాజస్థాపకులైన బ్లావట్స్కీ, ఆల్కాట్‌లు తమ సంఘాన్ని దయానంద్ స్థాపించే ఆర్యసమాజ్‌తో విలీనం చేస్తామన్నారు. ఆయన అందుకు అంగీకరించారు. 1879లో వారు భారతదేశానికి వచ్చి అనుకున్న ప్రకారం తమ సమాజ్‌ను ఆర్యసమాజ్‌తో కలిపారు. కాని ఆ సంయోగం అట్టేకాలం నిలువలేదు. 1881లో విభేదాలతో వారు వేరయ్యారు.

1874లో దయానందుడి సత్యార్థ ప్రకాశిక రచన వెలువడింది. తొలి ప్రచురణలో గోమాంసం సైతం కొన్ని పరిమితులలో తినవచ్చన్నాడు. ద్వితీయ ముద్రణ నాటికి ఆ అభిప్రాయం

మార్చుకున్నాడు. క్రైస్తవ, ముస్లింలకు వ్యతిరేకంగా దయానందుడు రాసిన విషయాలను నేడైతే నిషేధించమనేవారే!

వీటిని తిరగరాశారు. సంస్కరణవాదులంతా యీ పని చేశారు. రామమోహన్‌రాయ్ ఏకేశ్వరవాదనకు అనుకూలంగా వున్నవాటినే స్వీకరించి మిగిలినవి వదలివేసినట్లు లోగడ గమనించాం గదా. అలాగే దయానందుడూ చేశాడు.

ఉదాహరణకు గాయత్రి జపంలో ప్రచోదయాత్ అనే పదాన్ని ప్రాణోదయాత్ అని మార్చేశారు. 'చోద్' అంటే అశ్లీలమైన అర్థం వుండటమే యిందుకు కారణం. అలాగే లింగం అంటే లైంగిక అర్థంలో చూడరాదని, వేదం ప్రకారం యీ పదానికి యజ్ఞస్థూపం అని భావం అన్నారు. లింగాకారానికి లైంగిక అర్థం, చిహ్నం ఎలా లేకుండాపోతాయో ఆర్యసమాజ్‌వారు చెప్పలేదు. సనాతనులు స్త్రీలకు పెట్టిన ఆంక్షలను ఆర్యసమాజ్ కొంతవరకు సడలించింది. స్త్రీలు వేదాలు చదవవచ్చనీ గాయత్రి జపం జపించవచ్చనీ, "ఓం" మంత్రోచ్చారణ చేయవచ్చనీ అన్నారు. సనాతనుల దృష్టిలో స్త్రీలంతా శూద్రులే! పరదా పద్ధతి కూడా ఆర్యసమాజ్ ప్రోత్సహించలేదు. బాల్యవివాహాలు వద్దన్నారు. విధవలు మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చన్నారు. సతీసహగమనాన్ని తృణీకరించారు. ఇన్నాళ్ళుగా హిందూ సమాజంలో మతం పేరిట స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను ఆర్యసమాజ్ కొంతమేరకు ఎదుర్కొన్నది. సనాతనుల అమానుష పద్ధతులను బట్టబయలు చేసింది.

దయానందుడు స్త్రీలపట్ల వింతగా ప్రవర్తించాడు. తన బోధనలకు స్త్రీలను రానిచ్చేవాడుకాడు. ఆర్యసమాజ్ వారు సహవిద్యను ప్రోత్సహించలేదు. విడిగానే పాఠశాలలు స్థాపించారు. అయితే స్త్రీలు కూడా ఆర్యసమాజ్‌లో చేరవచ్చు. స్త్రీలను దూరంగా వుంచాలనే ధోరణి బుద్ధుడు మొదలు దయానంద వరకు చూపారు.

దయానందుడు అన్నింటినీ తృణీకరించి వేదాలవైపు భారతీయుల్ని నడిపించదలచాడు. కనుక వేదాలు మనల్ని ఎక్కడికి తీసుకపోతాయో చూడాలి.

1875లో రాజకోటలో ప్రార్థనా సమాజ్‌ను పేరుమార్చి ఆర్యసమాజ్‌గా దయానందుడు రూపొందించాడు. అది ఆరుమాసాలే కొనసాగింది. ఆ సంవత్సరం ఏప్రిల్ 10న బొంబాయిలో సంపన్న వర్తకుల మద్దతుతో ఆర్యసమాజ్‌ను స్థాపించారు.

1877 జూన్ 24న లాహోర్‌లో ఆర్యసమాజ్‌ను స్థాపించారు. పంజాబ్‌లో యీ సమాజం దశదిశలా వ్యాపించి తన ప్రభావాన్ని చూపెట్టింది.

ఆర్యసమాజ్ స్థాపించిన కొద్ది సంవత్సరాలకే దయానందుడు మరణించాడు. (1883 అక్టోబరు 10)

ఆర్యసమాజ్ ఒక సంస్కరణోద్యమ మత ప్రచారశాఖ, వేదాలవైపు వెనక్కు నడుద్దామని

దయానందుడు ప్రచారం చేశాడు. హిందువులుగా వున్నవారు ఇతర మతాలలోకి మారరాదని, అప్పటికే మారినవారు, శుద్ధిపొంది, తిరిగి మాతృసంస్థలోకి రావచ్చునని దయానంద ఉద్బోధించారు.

దయానందుడు ఉపనిషత్తులతో సహా, వేదేతరమైన వాటికి శ్రుతి ప్రమాణాన్ని కాదనడం సాహసమే. బృహదారణ్యకోపనిషత్తులో దుర్భరమైన విషయాలున్నాయని (స్త్రీ పురుషుల లైంగిక ఆకర్షణ వంటివి) అలాంటి వాటికి శ్రుతి ప్రమాణం ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించాడు. అయితే వేదాలలో కూడా అంతకంటె దారుణ విషయాలు వున్నాయిగదా అవెలా సహిస్తావంటే, వేదాలలో విషయాలను గౌణఅర్థంలో చూడాలన్నారు. అంటే పైకి కనిపించే వాటికి నిగూఢమైన సూచనార్థం వుంటుందన్నారు. ఉపనిషత్తులను కూడా అలాంటి గౌణ (metaphorical) అర్థంలో చూడొచ్చుగదా అంటే, వీల్లేదన్నారు. నమ్మకాలకు తర్కం వుండదు. సహేతుకత వుండదు.

ఆర్యసమాజవాదులు ముఖ్యంగా దయానందుడు వేదాలలో సైతం కొన్నిచోట్ల మార్పులు చేశారు. తమ వాదనకు అనుకూలంగా వుండేట్లు ఉదాహరణకు కాలం గురించి వేదం ఏం చెబుతున్నది? కాలాన్ని కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలుగా విభజించారు. కృతయుగం స్వర్ణయుగమన్నారు. తరువాత స్థాయిలో త్రేతాయుగం వున్నది. ద్వాపరలో పతనం మొదలైంది. ఇక కలియుగం పతనానికి, అవినీతికి నిలయం అన్నారు. యుగాంతంలో అంతా భగవంతునిలో లీనమై మళ్ళీ కాలచక్రం కృతయుగంతో మొదలవుతుంది. ఇలాంటి కాలవిభజన ఎటువంటి పరిశీలనకూ నిలవదు.

సాపేక్షతా సిద్ధాంత పరంగా వస్తున్న కాలానికీ, వేదాలలో ఆధారాలు లేని కాలానికీ సంబంధం లేదు. వేదకాలం కేవలం నమ్మకాలపై అంధవిశ్వాసాలపై వున్నది కనుక దయానందుడు మనల్ని అలాంటి కాలచక్రాన్ని నమ్మమంటే ఎలా వీలవుతుంది? వేదాల్లోకి పోవడమంటే వెనక్కు వెళ్ళి అంధకారంలో చిక్కుకుపోవడమే.

దయానందుడు హైందవ మతంలో అతివాదిగా జాతీయవాదులకు వీరత్వాన్ని ప్రసాదించి పెట్టాడు. క్రైస్తవం, ఇస్లాం కంటె హిందూమతం గొప్పదన్నాడు. ప్రపంచమంతా హిందూమతం వ్యాపించాలని, అందరినీ హిందువులుగా మార్చవచ్చుననీ ఆశించాడు. దయానంద భావాలను ఆచరణలోకి తేవడానికి లాలా మున్షీరామ్, లాలా హన్సరాజ్, లాలాలజపతిరాయ్, రామదేవ మొదలైనవారు కృషిచేశారు. ఆధునిక విజ్ఞానశాస్త్రంలోని మూల విషయాలన్నీ వేదాలలోనే వున్నాయని, రైళ్లు, విమానాల వంటివాటికి కూడా ఆనాడే బీజాంకురాలు పడ్డాయని దయానంద్ అభిప్రాయపడ్డాడు. సంఘాన్ని సంస్కరించాలని తలపెట్టిన దయానంద్, వేదాల ఆధారంగా అంటరానితనాన్ని తిరస్కరించాడు. వంశపారంపర్యంగా వచ్చే కులానికి వేదాలలో చోటులేదన్నాడు. అయితే ప్రతిభ ఆధారంగా వర్ణవ్యవస్థ వున్నదన్నాడు. బహుభార్యాత్వం కూడదన్నాడు. విగ్రహారాధన తప్పు అన్నాడు. వేదాలలో సంహిత మంత్రభాగం అంతా దోషరహితమని దయానందుడి ఉద్దేశ్యం.

19వ శతాబ్దంలో వచ్చిన రెండు సంస్కరణ ఉద్యమాలు జాతీయవాదులను ప్రభావితం చేశాయి. బ్రహ్మసమాజ్ మితవాదులను ఆకట్టుకున్నది. జాతీయ అతివాదులు ఆర్యసమాజ్ పట్ల ఆకర్షితులై విజృంభించారు. లజపతిరాయ్ ఇందులో అగ్రస్థానం వహించగా, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, సావర్కార్‌లలో వివిధ రూపాలుగా వెల్లడైంది. కాంగ్రెసు పార్టీలో వీరు ఉగ్రవాదాన్ని ప్రబలింపజేశారు. వీరంతా మతాన్ని రాజకీయాల్లోకి తెచ్చారు. దయానంద్ వ్యక్తపరచిన ముస్లిం వ్యతిరేకతను పుణికిపుచ్చుకున్నారు. అది చిలవలు పలవలుగా పెరిగి తీవ్ర పరిణామాలకు దారితీసింది. సెక్యులర్ ధోరణి రాకుండా అడ్డుకట్ట వేసింది. "హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్‌లు ఉత్తరోత్తరా బయలుదేరి ద్వేషాల్ని రెచ్చగొట్టాయి. దీనికి మారుగా ముస్లింలీగ్, తదితర ముస్లిం మతసంస్థలు కూడా వేర్పాటువాదానికి దారితీశాయి. ముస్లింలు పరిపాలించిన, మతం మార్చిన చోట, ముఖ్యంగా పంజాబ్, నైజాం, హైదరాబాద్‌లో ఆర్యసమాజ్ తన పాత్ర వహించింది. మిగిలిన చోట్ల ఆర్యసమాజ్ ప్రభావం నామమాత్రమే.

## వేదాల్లో ఏముంది?

దయానందుడు ఆర్యసమాజ్ పెట్టి, హిందువులందరినీ వేదాల్లోకి నడిపించదలచాడు. మిగిలిన వాటినన్నీ కాదని, వేదాలు పట్టుకోడానికి అందులో ఏముంది? వేదాలు ప్రాచీనకాలంలో ఎందరో ఆలోచిస్తూ, ఆడుతూ, పాడుతూ, కంఠస్తం చేసిన విషయాలే. అవి సంప్రదాయబద్ధంగా విన్నంత, జ్ఞాపకమున్నంత ప్రచారంలోకి వచ్చాయి. ఏ ఒక్కరూ ఏర్చి కూర్చినవి కావు గనుక, మూల రచయిత ఎవరూ లేరు. రానురాను వీటికి దివ్యత్వాన్ని అంటగట్టారు. అపౌరుషేయాలన్నారు. ప్రమాణం అన్నారు. సుమారుగ చెప్పడం తప్ప వేదాలు ఎప్పుడు బయటపడ్డాయో కాలనిర్ణయం కూడా ఖచ్చితంగా లేదు.

వేదాలలో ప్రార్ధనలన్నీ దేవుళ్ళను, దేవతలను, ప్రకృతిని ఉద్దేశించినవే. ఆరోగ్యం, సంపద, దీర్ఘకాలిక జీవనం, ధైర్యసాహసాలు, గెలుపు, వర్షాలు, పంటలు, బంగారం, కీర్తి మొదలైనవి కావాలని ప్రార్ధనల సారాంశం. ఇదంతా ఆదిమ మానవుడి మనస్తత్వాన్ని సూచిస్తుంది. కార్యకారణవాదంలో ఆనాడు ప్రతిదానికి దేవుళ్ళు కారణం అనుకొని ప్రార్థించారు. వేదాలలో చాలామంది దేవుళ్ళున్నారు. ఇంద్రుడు, సూర్యుడు, వరుణుడు మొదలైనవారు గద్దెనెక్కుతూ దిగుతూ, ప్రజేచ్ఛ ప్రకారం మారారు! మానవులు తమ లక్షణాలను, బలహీనతలను దేవుళ్ళకు అంటి తమలో లేని శక్తిని దైవానికి ఆపాదించారు. అలాంటప్పుడు చేసిన ప్రార్ధనలలో అందమైన ఆకర్షణ పూరిత మంత్రాలు, శ్లోకాలు వున్నాయి. ఇది ఉద్వేగానికి సంబంధించిన విషయం. ఏకేశ్వరారాధన, బహుదేవతారాధన, ఏకశక్తి వూహ యిత్యాదులన్నీ వేదాలలో కనిపిస్తాయి. ఉత్తరోత్తరా పెంపొందిన దర్శనాలు, పురాణాలు, స్మృతులు అన్నీ వేదాలనే ప్రమాణంగా ఉదహరించడానికి యింత భిన్నత్వం, వైవిధ్యమే కారణం.

దయానందుడు కులాన్ని కాదన్నా, వేదాల్లోని వర్ణవ్యవస్థను అంగీకరించాడు. ఈ వర్ణాలే కులపద్ధతికి మూలం. వేద మతాచారాలను ఉల్లంఘించిన శూద్రులకు మరణదండన విధించిన స్మృతులు వేదోక్తంగానే చేశాయి.

వేదాలలో నరబలి అంగీకరించారు. (తర్కతీర్థ లక్ష్మణశాస్త్రిజ్యోషి-ఎ క్రిటిక్ ఆఫ్ హిందూయిజం, పుట 102) ఈ ఆచారాన్ని బ్రిటిష్ పాలకులు నిషేధించారు. బహుళ ప్రచారం పొందినట్లు ఆధారాలు లేవుగాని, ఆర్యులు నరబలి యిచ్చి సంపద పెంచుకోడానికి అది తోడ్పడుతుందని నమ్మినట్లు ఆధారాలున్నాయి.

ఋగ్వేదంలోనే వర్ణాల ప్రసక్తి వున్నది. బ్రాహ్మణ, క్షత్రియ ప్రస్తావన వున్నది. ఆర్యులు, దస్యులు (బానిసలు) అని పేర్కొన్నారు. ఆర్యులే మొట్టమొదట దండెత్తి వచ్చి, వర్ణాలను సృష్టించారు. ఆధిపత్యం వహించిన ఆర్యులలో బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య వర్ణాలు వచ్చాయి. వీరే సమాజంపై పెత్తనం చేశారు. వీరందరికీ సేవలు చేసేవారిని శూద్రులు అన్నారు. వేదయజ్ఞం చేసే అర్హత శూద్రులకు లేదు. సమాజంలో 75 శాతం ప్రజల శ్రమను అగ్రవర్ణాలవారు ఆనాటి నుండి దోపిడీ చేస్తూ, వస్తున్నారు. ఈ వేద వర్ణవ్యవస్థను దయానందుడు సమర్థించాడు. అక్కడికి పోదామంటాడు. శూద్రుడు పితికిన పాలు కూడా అపవిత్రమన్న వేదంలోకి మనల్ని తీసుకెళ్ళాలని దయానందుడు ఉద్దేశించాడు. దయానందుడు ఎంత సంస్కరణవాది అయినా, పుట్టింది, పెరిగింది అగ్రవర్ణమైన బ్రాహ్మణకులంలోనే. ఆయన నేర్చిన విద్య కూడా బ్రాహ్మణాధిపత్యాన్ని ఆపాదించేదే.

వేదకాలంలోనే బ్రాహ్మణాధిపత్యంపై క్షత్రియుల తిరుగుబాటుకు ఆధారాలున్నాయి. బ్రాహ్మణులు శూద్ర స్త్రీలతో వ్యభిచరించవచ్చును. ఆ పని శూద్రుడు గనుక బ్రాహ్మణ స్త్రీతో చేస్తే నరికేయాలన్నారు. ఇలాంటి తారతమ్యాలు, జుగుప్సాకర విషయాలు వేదాలలో వున్నాయి. వాటికి ఆసరాగా స్మృతులు వెలువడ్డాయి. గౌతమ, వశిష్ట, ఆపస్తంబ, మనువు, యాజ్ఞవల్క్య, నారద, బృహస్పతి, శంఖలిఖిత స్మృతులలో మానవులను నాలుగు కులాలుగా చీల్చి అమానుష నియమాలు చూపారు.

వేదకాలంలోని యజ్ఞాలకు, జంతుబలులకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు వచ్చాయి. బౌద్ధవిప్లవం అందుకు ఒక ఉదాహరణ. వేదకాలంలోని అమానుషత్వాన్ని చార్వాకుడు బయటపెట్టాడు. మత అసహనం ఆనాటినుండే ప్రబలింది. చార్వాకుడిని తిట్టడానికి అతడి రచనల్ని ఉదహరిస్తే అవే నేడు మనకు ఆధారాలయ్యాయి. అంతకు మించి అతడు పూర్తిగా ఏమి రాశాడో లభించకుండా నాశనం చేశారు. అలాంటి వేదకాలంలోకి దయానందుడు మనల్ని పొమ్మంటున్నాడు.

వేదాలలో తన వాదనకు అనుకూలమైన వాటినే దయానందుడు స్వీకరించాడు.

మిగిలినవన్నీ సూచనమాత్రంగా తీసుకోవాలేగాని, వాస్తవంగా భావించరాదంటాడు. ఇస్లాంకు, క్రైస్తవ మతానికి వ్యతిరేకంగా వచ్చిన ఆర్యసమాజం, దయానందుడి నాయకత్వాన దేశాన్ని కొంత మేరకు వెనక్కు నడిపించింది.

- *హేతువాది, మే 1989*

## పునర్వికాస పరిణామం
# ముందు స్వాతంత్ర్యం - తరువాత సంఘ సంస్కరణ

భారతదేశంలో పునర్వికాస ఛాయలు ముందుగా బ్రిటిష్ వారు పరిపాలించిన ప్రాంతాలలో కనిపించాయి. బెంగాల్, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలో కొత్త ఆలోచనలు వచ్చాయి. అలా మార్పుకు గురైన ప్రాంతాలలో మహారాష్ట్రను ప్రధానంగా పేర్కొనాలి.

మహారాష్ట్రలో బొంబాయి, పూనాలు చైతన్య కేంద్రాలుగా వుండేవి. మహారాష్ట్ర అంతటా హిందువుల సంఖ్య అత్యధికం. 88.5 శాతం హిందువులు కాగా, యిందులో బ్రాహ్మణులు కేవలం 45 శాతమే వుండేవారు. వీరే మహారాష్ట్రలో 19 శతాబ్దం చివర భాగంలోనూ, 20వ శతాబ్దం మొదట్లోనూ అన్ని రంగాలలో పెత్తనం చేశారు. 40 శాతం వున్న మరాఠీలు సమాజంలో మూగవారుగానే సేవలు చేశారు. వీరు ప్రధానంగా వ్యవసాయదారులు. అటు గ్రామ జీవితంలోగాని, ఇటు పట్టణ నాగరికతలో గాని సాంస్కృతిక, విద్యా, కళా రంగాలలో బ్రాహ్మణులే ఆధిపత్యం చేశారు.

బ్రాహ్మణులలో మళ్ళీ దేశస్థులనీ, చిత్ పవనులనీ రెండు శాఖలున్నాయి. బ్రాహ్మణులలో దేశస్థులు 45 శాతం వుండగా, చిత్ పవన బ్రాహ్మణులు 55వ వంతు వున్నారు. బ్రాహ్మణుల గురించి, అందునా చిత్ పవన శాఖ వారిని గురించి ప్రస్తావించవలసి వచ్చిందంటే, సామాజిక రంగంలో వారి ప్రాధాన్యత అంతగా వుందన్నమాట. చిత్‌పవన శాఖ వారిలో 80 శాతం పూనాలో వుండేవారు. వీరు కట్టుగా వుంటూ తమ ఆధిపత్యాన్ని విస్తరింపజేసుకున్నారు. వీరికి శంకేశ్వర శంకరాచార్యుడు గురువు. ఆయనే వీరి కలహాలు తీర్చేవారు. మరాఠా సామ్రాజ్యంలో వార్తాహరులుగా పనిచేసిన చిత్‌పవన బ్రాహ్మణులు ప్రభుత్వ రంగంలో అన్ని శాఖలలో విస్తరించారు. చివరకు పీష్వాలయ్యారు. ప్రభుత్వాలు వీరి సేవలకు బహుమానంగా మడులు మాన్యాలు యిచ్చి, పన్ను మినహాయించి సత్కరించాయి. బ్రిటిష్‌వారి చేతుల్లో ఓడిపోయిన పీష్వాలు, కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారిపోయారు. అది వారి సమయస్ఫూర్తికి, చతురతకూ నిదర్శనం. సాహిత్య, పౌరోహిత, సామాజిక రంగాలలో పెత్తనం మాత్రం తిరుగులేకుండా యీ బ్రాహ్మణులు నిర్వహించారు.

బ్రిటిష్ పాలనలో ముందుగా ఇంగ్లీషు చదువులు మొదలెట్టింది బ్రాహ్మణులే. బొంబాయి, పూనా ఇంగ్లీషు పాఠశాలలు, కళాశాలల్లో బ్రాహ్మణులే అత్యధికంగా వుండేవారు.

చిత్‌పవన బ్రాహ్మణులు పౌరోహిత్యంలో, వ్యవసాయంలో, వాణిజ్యంలో, విద్యలో, న్యాయ, వైద్య వృత్తుల్లో అల్లుకపోయారు. ప్రభుత్వోద్యోగాలలో అత్యధికసంఖ్యలో బ్రాహ్మణులే వున్నారు. ఈ విధంగా ఇంగ్లీషు విద్యవలన లభించిన సదవకాశాలను బ్రాహ్మణులే పొందారు. పత్రికారంగంలో కూడా యీ అవకాశాల్ని వారు వినియోగించుకున్నారు. విపరీతంగా సాహిత్య, చరిత్ర రచనలు కూడా బ్రాహ్మణుల కలంనుండే వెలువడ్డాయి.

అయితే బ్రిటిష్‌వారు తెలివిగా సామాజిక మతరంగాల జోలికి పోలేదు. వాటిపై పూర్తి ఆధిపత్యం బ్రాహ్మణులదే. దేవాలయాల పెత్తనం బ్రాహ్మణులదే. వీటి ఆధారంగా సమాజ ఆలోచనారంగంపై వీరికి పట్టు వుండేది.

మహారాష్ట్రలో మహదేవ్ గోవింద రనడే, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర తిలక్, అగార్కర్‌లు చిత్‌పవన బ్రాహ్మణులే. వీరు భారత పునర్వికాస రంగంలో భిన్న పాత్రలు వహించారు. అందులో ప్రముఖంగా పేర్కొనదగింది పూనాలో స్థాపించిన సార్వజనిక సభ, 1870లో యిది ఆరంభమైంది. ఇది అన్ని కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నా, పెత్తనం చిత్‌పవన బ్రాహ్మణులదే.

సార్వజనిక సభను ఆదర్శంగా స్వీకరించి బెంగాల్, మద్రాసు తదితర చోట్ల సభలు వెలిశాయి. ఉత్తరోత్తరా వివిధ సభల మధ్య కొంత సమన్వయం కూడా సాధించారు. ప్రభుత్వ చర్యలలో అనుకూలమైన వాటిని సమర్థించడం సమాజ వ్యతిరేకమనుకున్న వాటిని ప్రతిఘటించడం, సార్వజనిక సభ కార్యకలాపాలుగా వుండేవి. లిట్టన్ ప్రభువు తెచ్చిన దేశభాషల పత్రికాచట్టాన్ని ఈ సభ వ్యతిరేకించింది. ఉన్నత విద్యకు ప్రభుత్వ సహాయం ఉపసంహరింపవలసి వచ్చినప్పుడు కూడా వీరు ప్రతిఘటించారు. స్థానిక స్వపరిపాలన విస్తరించాలని సభ కోరింది. మొత్తం మీద రాజకీయ, సామాజిక రంగాలలో సార్వజనిక సభ చాలా కీలకపాత్ర వహించింది. తరువాత భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు యీ సభ దారి తీసిందనే విషయం గుర్తుంచుకోవాలి.

సార్వజనిక సభలో చిత్‌పవన బ్రాహ్మణాధిపత్యం వున్నప్పటికీ దృక్పథాలలో తీవ్ర విభేదాలున్నాయి. అవి సభా కార్యకలాపాలలో బయటపడ్డాయి. ఇక్కడే తిలక్, గోఖలే, అగార్కర్, రనడే పాత్రలు పరిశీలించాలి. వీరి ప్రభావం దేశంలో చదువుకున్నవారిపై బడింది.

బ్రిటిష్ పాలకుల దృష్టిలో చిత్‌పవన్ బ్రాహ్మణులు ప్రమాదకారులు. 1897లో ఇద్దరు బ్రిటీష్ అధికారుల్ని చేపేకర్ సోదరులు చంపేయడంతో బ్రిటిష్ పాలకులు వీరిపై నిఘా వేశారు. చిత్‌పవన బ్రాహ్మణులలో తిలక్ వర్గం దేశానికి స్వాతంత్ర్యం ముందు అవసరమని, ఆ తరువాత సాంఘికసంస్కరణల సంగతి చూచుకోవచ్చనీ అన్నారు రాజ్యాంగబద్ధంగా రాజకీయాలలో పాల్గొంటూ, సాంఘిక సంస్కరణలు కొనసాగించాలని ఒక వర్గం తలపోసింది. రాజకీయాలలో మతం వుండరాదని, సెక్యులర్‌గా వుండాలని గోఖలే, మతంలోనే దేశీయ జాతీయ భావన రేకెత్తించాలని తిలక్ ఉద్యమించారు. ఈ అభిప్రాయాలే సార్వజనిక సభలో బయటపడి,

తీవ్రస్థాయికి పోయాయి. ఒకదశలో సభ కార్యదర్శి పదవికి తిలక్ రాజీనామా యివ్వక తప్పలేదు. గోఖలే ఆ స్థానానికి వచ్చారు. తిలక్ పంతంతో, పగబట్టినట్లుగా తన ప్రత్యర్థులైన అగార్కర్, గోఖలే, రనడేలపై ధ్వజమెత్తాడు. మరాఠిలో కేసరి పత్రికను, ఇంగ్లీషులో మరాఠ పత్రిక పెట్టి, తిలక్ తన భావాలు ప్రచారం చేశారు.

పూనాలో సార్వజనిక సభను ఆక్రమించుకోడానికి తిలక్ ప్రయత్నించి, తనవారిని ఎంపిక చేయించారు. గోఖలే బయటకు పోయారు. బ్రిటిష్‌వారు హిందూ వివాహ వయోపరిమితి చట్టం తేడానికి ప్రయత్నిస్తే తిలక్ వ్యతిరేకించారు.

కాంగ్రెసు మహాసభలతో బాటుగా ఏటా అదే ప్రాంగణంలో సాంఘిక మహాసభలు జరిగేవి. రనడే వీటిలో చాలా ప్రముఖపాత్ర వహించాడు. కాంగ్రెసు సభలను సాంఘిక సభలను, వేరుచేయాలని పట్టుబట్టిన తిలక్ 1885 పూనా కాంగ్రెసు సమావేశాలనాటికి తన పంతం తగ్గించుకున్నాడు. ఆ విధంగా పునర్వికాసానికి తోడ్పడుతున్న రనడేను తగ్గించి, తిలక్ సంఘాన్ని కొంత వెనక్కు తీసుకెళ్ళాడు. సార్వజనిక సభ తిలక్ నాయకత్వాన పనిచేయలేక, స్థంభించిపోయింది. ఈ నష్టాన్ని తీర్చడానికి సాంఘిక మార్పుల దృష్ట్యా, డక్కన్ సభను స్థాపించి రనడే, గోఖలేలు కృషిచేశారు. అయితే సార్వజనిక సభ స్థాయి చేకూరలేదు. మరోవైపు తిలక్ పూర్తిగా రాజకీయాలలో నిమగ్నుడై, మతాన్ని ఆధారంగా ప్రజలతో రాజకీయ చైతన్యత తీసుకురావాలనుకున్నాడు.

*- హేతువాది, జూలై 1989*

# పునర్వికాస పరిణామం
# మూఢనమ్మకాలకు దివ్యజ్ఞానసమాజ సిమెంట్

భారతదేశంలో పునర్వికాసం రాకపోగా, మనల్ని అతివేగంగా వెనక్కు తీసుకెళ్ళే సమాజాలు విజృంభించి పనిచేశాయి. అందులో దివ్యజ్ఞాన సమాజం ఆరితేరింది.

విదేశాలలో పుట్టిన దివ్యజ్ఞాన సమాజం, మనదేశంలో ప్రవేశించి పాతుకపోయింది. దీని స్థాపకులు బ్లావట్స్కీ అనే రష్యన్ స్త్రీ, ఆల్కాట్ అనే అమెరికన్ 1875 నవంబరు 17న అమెరికాలో దివ్యజ్ఞాన సమాజానికి అంకురార్పణ చేశారు. ప్రకృతిలోనూ, మానవునిలోనూ బయలుపడని శక్తులు కనుగొనాలని వీరు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమాజం వారికి బ్లావట్స్కీ రాసిన ది సీక్రెట్ డాక్ట్రిన్ అనే గ్రంథం మూలాధారం. అనంతమూల స్వరూపమనేది భావానికీ, ఆలోచనకూ అందనిదని పేర్కొన్నారు. విశ్వంలో మార్పులన్నీ దైవలీలలుగా చెప్పారు.

ఆత్మలు, పునర్జన్మలు, కర్మలలో వీరికి నమ్మకం వున్నది. రుజువుకు నిలబడని దివ్యజ్ఞాన సమాజంవారి రచనలు కొందరిని ఆకర్షించాయి. ఈ రహస్యాలనేవి మీకెలా తెలుసు అని అడిగితే, దివ్యజ్ఞానం వారు తెల్లముఖం వేస్తారు.

రష్యన్ యువతి బ్లావట్స్కీ 17 సంవత్సరాల ప్రాయంలోనే తనకంటె ఎంతో ఎక్కువ వయస్సుగల వ్యక్తిని పెళ్ళాడింది. కాని, కొన్ని మాసాలకే అతడిని వదిలేసింది. ఆ చేదు అనుభవం తరువాత, ప్రపంచ పర్యటన జరిపింది.

1831లో బ్లావట్స్కీ రష్యాలో పుట్టి 1875లో అమెరికా చేరి దివ్యజ్ఞాన సమాజాన్ని స్థాపించింది. ఆ సమాజ కార్యదర్శినిగా ఇండియాలో ఆర్యసమాజ్ స్థాపకుడు దయానంద్‌కు ఉత్తరాలు రాసింది. తమ సమాజాన్ని ఆర్యసమాజ్‌లో విలీనం చేస్తామన్నారు. 1879లో భారతదేశం చేరుకుని, చెప్పిన ప్రకారం ఆర్యసమాజ్‌లో కలసిపోయారు కాని, ఆ కలయిక అట్టేకాలం సాగలేదు. అభిప్రాయభేదాలు రాగా, అతిత్వరలో విడిపోయారు. కల్నల్ ఆల్కాట్, మాడం బ్లావట్స్కీలు తమను క్రైస్తవ విరోధులుగా చిత్రించుకున్నారు. తరువాత బౌద్ధంలోకి మారారు. ఆర్యసమాజ్‌తో విడిపోయిన అనంతరం దేశంలో పర్యటించి, చివరకు మద్రాసులో అడయార్ కేంద్రంగా దివ్యజ్ఞాన సమాజస్థాపన చేశారు. సంస్కృతాన్ని పునరుద్ధరించాలని, ప్రాచీన మతం, తత్వం, కళలు తిరగదోడాలని ఉద్బోధించారు. హిందూ మత ధర్మాలు ఉన్నతమైనవన్నారు.

దివ్యజ్ఞాన సమాజం విదేశాలలో కొద్దిమంది చదువుకున్నవారిని ఆకట్టుకున్నది. అయితే దివ్యజ్ఞాన సమాజానికి బహుళ ప్రచారం రావడానికీ, అనేకమంది ఆకర్షితులు కావడానికీ అనిబిసెంట్ కీలకపాత్ర వహించింది. ఈమె 1889లో బ్లావట్స్కీ గ్రంథం చదివి, సమ్మోహితురాలైంది. వారి సమాజంలో అదొక మలుపు. 1891లో బ్లావట్స్కీ మరణించింది. ఆ తరువాత అనిబిసెంట్ తిరుగులేని సమాజ నాయకురాలైంది. కనుక అనిబిసెంట్ గురించి కొంత విపులంగా తెలుసుకోవడం అవసరం.

అనిబిసెంట్ 1847 అక్టోబరు 15న పుట్టింది. ఐర్లండ్ దేశీయురాలు, ప్రైవేట్ విద్యాభ్యాసం చేసింది. ఒక క్రైస్తవ మతాచార్యుడిని పెళ్ళి చేసుకున్నది. అతడితో సంతానం పొందింది. తొలి ఆకర్షణలకు గురిఅయ్యే ఉద్వేగిగా అనిబిసెంట్ జీవితమంతా ప్రవర్తించింది. 1873 నాటికి తన భర్తకు విడాకులిచ్చివేసింది.

1874లో ఫ్రీథాట్ సొసైటీలో చేరి, ఛార్లస్ బ్రాడ్లా ఉపన్యాసాలు విని, ఆకర్షితురాలైంది. అప్పటినుండి బ్రాడ్లాపట్ల విపరీత ఆకర్షణ పెంచుకొని, తానూ నాస్తికురాలుగా ప్రచారం చేసింది. హేతువాదిగా ఉపన్యాసాలు చేసింది. కుటుంబ నియంత్రణ ప్రచారం మొదలుపెట్టింది.

బెర్నార్డ్ షా ప్రభావంతో ఫేబియన్ సోషలిస్ట్ అయింది. ఎవరి ప్రభావంలో వుంటే ఆ భావాలు భుజాన వేసుకొని ప్రచారం చేయడం ఆమెకు అనవాయితీ అయింది. భావాలు బాగా అవగాహన చేసుకొని, నచ్చి, ప్రచారం చేయడం వేరు. తాత్కాలిక ఆకర్షణలకు, వ్యక్తుల సమ్మోహనాలకు లోబడి ప్రచారం సాగించడం వేరు. ఎత్తువారి చేతిబిడ్డవలె అనిబిసెంట్ ప్రవర్తించింది. బ్రాడ్లా తొలి ఉపన్యాసం విని, తానూ నాస్తికురాలినే అంటూ సభలలో పాల్గొన్నది. ఇంగ్లండ్‌లో పర్యటించి నాస్తికత్వం ప్రచారం చేసింది. దేవుని రుజువుకై చెబుతున్న సాక్ష్యాధారాలు

బలంగానూ, నమ్మదగినవిగానూ లేవని ఆమె తన స్వీయచరిత్రలో పేర్కొన్నది. 1875 నుండీ యీ ప్రచారంలో పాల్గొన్న అనిబిసెంట్ నేషనల్ సెక్యులర్ సొసైటీకి ఉపాధ్యక్షురాలైంది.

డా॥ ఛార్లస్ నోల్టన్ రాసిన పుస్తకంలో కుటుంబనియంత్రణ బోధనలు వున్నాయి. అవి క్రైస్తవులకు నచ్చలేదు. అతడి పుస్తకంలో ప్రచురణకర్త కొన్ని అశ్లీల చిత్రాలు వేసి అమ్మాడు. రచయితను ఇంగ్లండ్‌లో శిక్షించారు! ఆ దశలో అనిబిసెంట్ ముందుకొచ్చి రచయిత తన భావాలు స్వేచ్ఛగా వెల్లడించే హక్కువుండాలంటూ, అతడి పుస్తకాన్ని తిరిగి ప్రచురించింది. రచయిత అభిప్రాయాలన్నింటితో పూర్తిగా ఏకీభవించకపోయినాసరే, భావస్వేచ్ఛ ముఖ్యమని హేతుబద్ధంగా వాదించింది. ఈ పుస్తకం ప్రచురించిన నేరానికి అనిబిసెంట్, బ్రాడ్లాలు ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించారు కూడా.

అనిబిసెంట్ ఆనాడు క్రైస్తవ మత ధోరణులకు ఎదురీదింది. కుటుంబ నియంత్రణ కావాలంటూ ఒక రచన చేసింది. అయితే ఆమె తన భావాలతో తన సంతానాన్ని చెడగొడుతున్నదంటూ తండ్రి కోర్టులో కేసు వేసి, ఆమెను పిల్లల్ని వేరుచేయాలన్నారు. కోర్టు అందుకు అంగీకరించింది. 1879లో అనిబిసెంట్ అప్పీలుపై కూడా కోర్టు తీర్పు చెబుతూ, తల్లి పిల్లల్ని చూడొచ్చుగాని, పూర్తి హక్కులు తండ్రివేనన్నది.

అనిబిసెంట్ యీ విధంగా సాహసోపేత జీవితం గడుపుతుండగా సందేహాలకు, అనుమానాలకు గురైంది. నాస్తికత్వం, హేతువాదం ఆమెకు పూర్తిగా అవగాహన కాలేదు.

ఛార్లస్ బ్రాడ్లా శక్తివంతమైన ఆకర్షణ, వాగ్ధోరణి వాదనాబలానికి అనిబిసెంట్ సమ్మోహితురాలైంది. అంతేగాని హేతువాదం, నాస్తికత్వం శాస్త్రీయ దృక్పథం పూర్తిగా ఆకళింపు చేసుకొని ఆమె ప్రచారానికి దిగలేదు. దీనికి తోడు వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులు, ఎదురుదెబ్బలు ఆమెను మానసికంగా కుంగదీశాయి. అలాంటి సన్నివేశంలో బ్లావట్‌స్కీ రాసిన సీక్రెట్ డాక్ట్రిన్ (రహస్య సిద్ధాంతం) అనే పుస్తకం అనిబిసెంట్ చదివింది. అంతవరకూ వున్న హేతువాదాన్ని వదలేసింది. ప్రశ్నించకుండా ఆ రచనను గుడ్డిగా ఆమోదించింది. హేతువాదులు బ్లావట్‌స్కీని, ఆమె రచనల గురించి వేసిన ప్రశ్నలు కూడా అనిబిసెంట్ ప్రక్కన బెట్టింది. తనకు నచ్చితే ఇక ఎలాంటి వాదమూ అక్కరలేదనే ధోరణిలో ఆమె సాగిపోయింది.

దివ్యజ్ఞాన సమాజం ఏర్పడినప్పుడు మనోతత్వశాస్త్రం బాల్యదశలో వున్నది. విజ్ఞానరంగంలో ఇంకా నిర్ధారిత వాదమే ప్రబలివున్నది. జీవశాస్త్రం కొంతమేరకు పెంపొందినా, జన్యుశాస్త్రం వరకూ రాలేదు.

అలాంటి ఘట్టంలో హెచ్.పి. బ్లావట్‌స్కీ రచన రహస్య సిద్ధాంతం రెండు సంపుటాలు అనిబిసెంటు చదివింది. పునర్జన్మను సమర్థిస్తూ గత అనుభవాల్ని గురించి కథలుగా అల్లిన యీ పుస్తకం ఆమెను ఆకట్టుకున్నది. మానవుడిలో ఏడు విధాలైన దశలుంటాయని యీ పుస్తకం పేర్కొన్నది. ఆత్మపరిణామం చిత్రవిచిత్రాలుగా వర్ణించిన యీ రచన అనిబిసెంట్‌ను దిగ్భ్రాంతి

పరచిందట. ఈ రహస్యాలన్నింటికీ కొందరు దేవతలు కాపలావుండగా, వారితో బ్లావట్స్కీ మానసికంగా సంబంధం పెట్టుకున్నదట. హిమాలయాలలోని రుషులతో దివ్యజ్ఞాన సమాజం వారికి సంబంధాలున్నాయన్నారు. ఇలాంటి వారిలో సి.డబ్లు. లెడ్‌బీటర్, ఎ.పి. సిన్నెటు, కల్నల్ ఆల్కాటు మొదలైనవారున్నారన్నారు. దివ్యజ్ఞాన సమాజంవారు దూరశ్రవణ, దూరదృష్టి, అతీంద్రియ శక్తుల్ని నమ్మారు. ఇలాంటి అనేక ఆకర్షణలతో అనిబిసెంట్ ఎట్టకేలకు 1889లో దివ్యజ్ఞాన సమాజీకురాలైంది. 1891లో బ్లావట్స్కీలాడ్జి అధ్యక్షురాలైంది.

దివ్యజ్ఞాన సమాజం ప్రపంచ వ్యాప్తంగా సోదరభావాన్ని పెంపొందించాలని, ఆర్య సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని, మానవుడిలో దాగివున్న ప్రతిభలను బయటకు తీయాలని ఉద్దేశించింది.

దివ్యజ్ఞాన సమాజ స్థాపకురాలు మాడం బ్లావట్స్కీ 1891లో మరణించింది. అప్పటికే ఇండియాలో బెర్ట్రాం కెట్లే ప్రధాన కార్యదర్శిగానూ, ఆల్కాటు అధ్యక్షుడుగానూ ద్యివజ్ఞాన సమాజ వ్యవహారాలు చూస్తున్నారు. వీరికి తోడుగా ఎడ్ అనే వ్యక్తి వున్నాడు.

1893లో అనిబిసెంటు ఇండియా చేరుకున్నది. అప్పటినుండీ దేశంలో అనేక నగరాలలో పర్యటించి తన వాగ్ధోరణితో చదువుకున్న కొద్ది మందిని ముగ్ధుల్ని చేసింది. అప్పటికే దివ్యజ్ఞాన సమాజకేంద్రం కూడా ఇంగ్లండ్ నుండి ఇండియాకు మారింది. (1879)

దివ్యజ్ఞాన సమాజానికి అనిబిసెంటు నాయకత్వం వహించిన తరువాత ఇండియాలోని నగరాలలో బాగా ప్రచారం లభించింది. చదువుకున్న వారిలో అగ్రకులాలవారు దివ్యజ్ఞాన సమాజంలో చేరారు. బ్రహ్మసమాజంలో కొందరు చీలిపోయి, అనిబిసెంటుతో చేరారు. ఆల్కాట్ అనిబిసెంటులు పర్యటనలు చేశారు. అంతవరకూ దేశంలో సాంఘిక సంస్కరణలకు వున్న అనుకూలత కాస్తా వెనుకంజ వేసింది హిందూమతాన్ని, పవిత్రగ్రంథాల్ని ఆకాశానికెత్తి శ్లాఘించిన అనిబిసెంటు, సాంఘిక సంస్కరణల్ని వ్యతిరేకించింది. సనాతనులు యీ ధోరణి ఆసరాగా తీసుకొని దివ్యజ్ఞాన సమాజాన్ని పొగిడారు. హిందూ నాగరికతకు పొందికగా వుండేట్లు హిందూమత, సంఘాభివృద్ధికి తోడ్పడతామని అనిబిసెంటు నాయకత్వాన 1904లో మద్రాసు హిందూ సంఘం ప్రతిజ్ఞ చేసింది. అంతవరకూ సంస్కరణలు కావాలన్న వారంతా పాశ్చాత్య నాగరికతా ప్రేరణలో, వ్యామోహంలో పడినట్లు ప్రచారం జరిగింది. డిరోజియో-రామమోహన్‌రాయ్ ప్రభృతుల సంస్కరణలు, అభ్యుదయ ఆలోచనలు వెనుకంజ వేశాయి. అనిబిసెంటు భారత సమాజానికి తీరని ద్రోహం చేసింది.

కులం, భోగం వృత్తి, బాల్యవివాహాలు, విధవా పునర్వివాహాలు మొదలైనవన్నీ చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సిన విషయాలని అనిబిసెంటు వాదించింది. 20వ శతాబ్దం ఆరంభంలో సంస్కరణ ఉద్యమం వెనక్కు మళ్ళింది.

హేతువాదిగా, నాస్తికురాలుగా ఇంగ్లండ్‌లో సంసర్కణలకు, స్త్రీల హక్కులకు పోరాడిన అనిబిసెంటు, ఇండియాలో మత ప్రభావంతో వెనక్కు నడవడం ఆశ్చర్యపడాల్సిన విషయం కాదు.

భారతీయులలో అత్యధిక సంఖ్యాకులకు తెల్లవారంటే చాలా అధికులనే భావం ప్రబలింది. వారు పరిపాలించడం ఒక కారణంకాగా, తెల్లచర్మం, ఇంగ్లీషు భాష, వేషం, భావాలు ఇతర కారణాలుగా పేర్కొనవచ్చు. 19వ శతాబ్దం చివరలో ఇండియాకు వచ్చిన అనిబిసెంటు తెల్ల దొరసానిగా కొందరిని ఆశ్చర్యపరిస్తే, ఆమె ఉపన్యాసాలు, హిందూమతాన్ని పునరుద్ధరించాలనే ఆమె పిలుపు మరికొందరిని ఆకర్షించాయి. ఇది ఆసరాగా తీసుకొని అనిబిసెంటు ఇష్టమొచ్చినట్లు మాట్లాడింది. తాను పూర్వజన్మలో హిందువునే అన్నది. తమకు హిందూయిజాన్ని ప్రబోధిస్తున్న తెల్ల స్త్రీ పట్ల సనాతనులు కన్నెర్ర జేశారు. హిందూ సమాజాన్ని యధాతధంగా ఆమోదించిన అనిబిసెంటు, తరువాత హిందూ సమాజాన్ని సంస్కరించాలన్నది. ఇదిచూచి సంతోషించిన కొందరికి నిరాశే ఎదురైంది. ఆమె కావాలన్నది డిరోజియో-రామమోహన్‌రాయ్ హిందూ సంస్కరణలుకాదు, ప్రాచీన హైందవాన్ని తిరగదోడాలని అనిబిసెంటు పిలుపు యిచ్చింది. ప్రాచీన హైందవం వికాసంతోనూ శక్తివంతంగా వున్నట్లు ఆమె అభిప్రాయపడింది.

1913 నాటికి అనిబిసెంటులో మానసిక వృద్ధాప్య లక్షణాలు స్ఫుటంగా కనిపించాయి. అగస్త్యుడితో తాను ప్రత్యక్ష సంబంధం పెట్టుకోగలుగుతున్నానని, అతడి కోరికపై కొన్ని సంస్కరణలు ప్రతిపాదిస్తున్నానన్నది. బాల్య వివాహాలను ఎదిరించమని అగస్త్యుడు చెప్పాడనీ, అందుకు ఒక దళాన్ని ఏర్పాటు చేయమన్నాడనీ రాసింది. ఇలాంటి భ్రమలు నిజమని ఆమె నమ్మిందో, లేక అమాయకులను నమ్మించదలచిందోగాని. యీ విషయాలు గ్రంధస్తం చేసింది.

దివ్యజ్ఞాన సమాజంవారు ఉపనిషత్తులు, గీత మొదలైన గ్రంథాలను దేశ, విదేశాలలో ప్రచారం చేశారు. క్రైస్తవులను, బైబిల్‌ను వ్యతిరేకిస్తూ, హిందూ మతప్రాచీనతను పొగుడుతూ ప్రచారం సాగించారు.

భారతదేశంలో అనిబిసెంటు కేవలం మత ప్రచారంతో గాక, రాజకీయాలలో ప్రవేశించి, హోంరూల్ కావాలన్నది. ఇదికూడా ఆమెపట్ల ఆకర్షణకు మరో కారణంగా పేర్కొనవచ్చు. వృద్ధాప్యంలోబడిన అనిబిసెంటు తనకు వారసులు కావాలని, జిడ్డు కృష్ణమూర్తిని ఎంపిక చేసింది. చిత్తూరు జిల్లాకు చెందిన జిడ్డు నారాయణయ్య కుమారులను దత్తత స్వీకరించింది. 'కృష్ణమూర్తి, నిత్యానంద అనే యిరువురినీ అడయార్ దివ్యజ్ఞాన సమాజంలో పెంచి, చదువు చెప్పించి, వారసుల్ని చేయ సంకల్పించింది. వారిని ఇంగ్లండ్ పంపి పై చదువులు చెప్పించింది. 1909లో స్వీకరించిన జిడ్డు కృష్ణమూర్తిని అడయార్‌లో లెడ్‌బీటర్ ఆధ్వర్యాన అట్టిపెట్టారు. కృష్ణమూర్తి అందమైన కుర్రవాడు లెడీబీటర్ పెళ్ళికాని బిషప్. అతడు కృష్ణమూర్తి పట్ల ఆకర్షితుడై అక్రమ లైంగిక సంబంధానికి దిగాడు. ఈ వార్త దివ్యజ్ఞాన సమాజంలోనేగాక దేశమంతటా పాక్కింది.

కృష్ణమూర్తి తండ్రి కోర్టుకు వెళ్ళి తన కుమారులను తనకు అప్పగించమన్నాడు. హైకోర్టులో చాలాకాలం కేసు సాగింది. సి.పి. రామస్వామి అయ్యర్ యీ కేసులో అనిబిసెంటుకు వ్యతిరేకంగా వాదించాడు. కోర్టు అజమాయషీలో పిల్లల సంరక్షణ సాగాలని తీర్పు వచ్చింది. కాని అనిబిసెంటు ప్రీవీకౌన్సిల్‌కు వెళ్ళి తన అజమాయిషీలోనే వుండాలనే వాదనలో నెగ్గింది. ఆ తరువాత కృష్ణమూర్తి ఇంగ్లండ్‌లో ఉన్నత చదువులు కొనసాగించాడు.

జిడ్డు కృష్ణమూర్తి యుగపురుషుడని అనిబిసెంటు ప్రకటించింది. దివ్యజ్ఞాన సమాజంలో ప్రముఖస్థానం ఆక్రమించిన జిడ్డు కృష్ణమూర్తి క్రమేణా మూఢ నమ్మకాలు, అనిబిసెంటు ప్రచారాలపట్ల ఏవగింపు పెంచుకున్నాడు. తాను ప్రవక్తను కానని స్పష్టంచేశాడు. దివ్యజ్ఞాన సమాజంతో తెగతెంపులు చేసుకున్నాడు. అనిబిసెంట్ యిదంతా చూచి కుంగిపోయింది. కాని చేసేదిలేక దిగమింగింది. కృష్ణమూర్తి ఒకవైపున అనిబిసెంటును, ఆమె అనుచరులనూ తీవ్రంగా దుయ్యబట్టాడు. ఆ తరువాత జిడ్డు కృష్ణమూర్తితో బాటుగా, చాలామంది దివ్యజ్ఞాన సమాజానికి దూరమయ్యారు. అనిబిసెంటుకు కేవలం మద్రాసులో కొందరు బ్రాహ్మణులు మాత్రం అనుచరులుగా మిగిలారు. దివ్యజ్ఞాన సమాజం నానాటికీ క్షీణించింది. జిడ్డు కృష్ణమూర్తి అమెరికా వెళ్ళిపోయాడు.

1916లో హోంరూల్ లీగ్ స్థాపించిన అనిబిసెంటు 1917లో కాంగ్రెసు అధ్యక్షురాలైంది. ఇంగ్లండ్‌కూ, ఇండియాకు పూర్వజన్మ సుకృత సంబంధం వున్నదన్నది! గాంధిజీ రాజకీయాలలో ప్రవేశించి భారత స్వాతంత్ర్యోద్యమంలో ముమ్మరంగా ఉద్యమాలు చేబట్టిన తరువాత అనిబిసెంటు తగ్గిపోయింది. సత్యాగ్రహాలు, నిరాహారదీక్షలు, పన్నుల ఎగవేత వంటివి మంచిదికాదని అనిబిసెంటు చెప్పింది. జీవితం చివరి ఘట్టంలో అనిబిసెంటు ఆకర్షణ బాగా క్షీణించింది. 1933లో అనిబిసెంటు మరణించింది.

అనిబిసెంటు 1923లో ఇంగ్లీషులోకి గీతను అనువదించింది. అప్పటికి బ్లావట్‌స్కీ ప్రభావం ఆమెపై క్షీణించినా, దివ్యజ్ఞాన సమాజంవారు భక్తి, నిష్కామకర్మలకు ప్రాధాన్యత యిచ్చారు. రామకృష్ణ, వివేకానంద ఆశ్రమాలకూ దివ్యజ్ఞాన సమాజం వారికీ ఎప్పుడూ పడేదికాదు.

1917లో అనిబిసెంటు ఆధ్వర్యాన కాంగ్రెసు సమావేశం అంటరానివారిపట్ల సానుభూతి తీర్మానం చేసింది. విచక్షణ పోవాలన్నది. కాని అంతకుముందు అనిబిసెంటు రచనలలో అగ్రకులాలవారిని, అంటరానివారిని పాఠశాలల్లో కలిపి కూర్చోబెడితే అనర్థాలు, అంటురోగాలు వస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

గాంధీజీకి అనిబిసెంటుకు పడేదికాదు. గాంధేయ పద్ధతులను రాజకీయాలలో ఆమె నిరసించి, గర్హించింది. 1917లో బెనారస్‌లో గాంధీ మాట్లాడుతూ వైస్రాయిని ఖండిస్తుండగా, ఉపన్యాసం ఆపేయవలసిందిగా అధ్యక్షుడిని అనిబిసెంటు కోరింది. రానురాను రాజకీయాలలో

గాంధీది పై చేయి కాగా, అనిబిసెంటు పలుకుబడి తగ్గుముఖం పట్టింది. రాజకీయాలను, మతాన్ని కలిపేసి, సెక్యులర్ ధోరణులకు తావులేకుండా అనిబిసెంటు ప్రాతిపదికలు వేసింది. అసలే అజ్ఞానంతో, నిరక్షరాస్యతతో కొట్టుమిట్టాడుతున్న భారతదేశానికి అనిబిసెంటు, దివ్యజ్ఞానం పేరిట మరింత కట్టుకథల, పురాణాల, అంధకారాన్ని విరజిమ్మింది. దేశంలో కొద్దిమంది చదువుకున్న వారిని ఇంకా వెనక్కు నడిపించింది.

ఛార్లస్ బ్రాడ్లాతో కలసి యూరోప్‌ను ఉర్రూతలూగించిన అనిబిసెంటు 50 సంవత్సరాల పాటు ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఆమె కీర్తి అలా అత్యున్నత దశకుపోయి, పతనమైంది. ఎందుకని? తలాతోక లేని మూఢనమ్మకాలను ప్రజలపై రుద్ది, నమ్మించడానికిగాను అనిబిసెంటు హేతువాదాన్ని వదలేసింది. తాత్కాలికంగా ఆమెకు కొందరు నీరాజనం పట్టి, డబ్బిచ్చి, గౌరవించి, పీఠాధిపతిగా చేసి వుండొచ్చు. గాని సైన్సు వ్యాపించేకొద్దీ ఛార్లస్ బ్రాడ్లా నిలబడతాడేగాని అనిబిసెంటుకాదు. మానవ వివేచనకు పదునుపెట్టే రీతులే ప్రజల్ని ముందుకు నడిపిస్తాయి. అనిబిసెంట్ మతపరమైన రచనలు చదువుతుంటే కావాలని అజ్ఞానాన్ని ప్రసాదంగా పంచిపెట్టినట్లనిపిస్తుంది. సామాన్యులలో దివ్యజ్ఞానం వ్యాపించకపోవడం కూడా వారి మంచికే అనవచ్చు.

*- హేతువాది, ఆగష్టు 1989*

# పునర్వికాస పరిణామం
# భారత ముస్లింలలో పునర్వికాసం ఎందుకు రాలేదు?

ముస్లింలు భారతదేశంలో వందలాది సంవత్సరాలు పరిపాలించారు. దండెత్తి వచ్చిన వివిధ ముస్లింపాలకులకు దేశంలో ఎందరో సహాయపడ్డారు. ఇస్లాంలో కొందరు చేరిపోయారు. హిందూమతంలో లేని సమానత్వం ఇస్లాంలో లభిస్తుందని ఆశించారు. యూరోప్‌లో చారిత్రక పాత్ర నిర్వహించి, గ్రీక్, రోమన్ నాగరికతల్ని క్రైస్తవులకు అందించిన ముస్లింలు క్రమేణా తమ ఔన్నత్యాన్ని కోల్పోయారు. ఆ స్థితిలో వారు ఇండియాకు వచ్చారు. అసలే మత మౌఢ్యంలో కొట్టుకుంటున్న ఇండియాలో మరో మతాన్ని తెచ్చిపెట్టారు. బ్రిటిష్‌వారు దేశపాలనను చేబట్టిన తరువాత కూడా ముస్లింలు తమ గతాన్ని మరచిపోలేక బాధపడుతూ వచ్చారు. మతాన్ని, సమాజాన్ని వేరుచేసి చూడలేని ముస్లింలు, అసహనాన్ని పెంచుకున్నారు. తమ కష్టాలన్నిటికీ హిందువులే కారణమని మతనాయకులు బోధిస్తుంటే, సామాన్య ముస్లింలు అసలు వాస్తవాల్ని పరిశీలించకుండా, గుడ్డిగా మతనాయకుల మాటల్ని నమ్ముకున్నారు. దేశంలో రానురాను ముస్లింలలో మత మౌఢ్యం విపరీతంగా పెరిగిపోయింది.

భారత ముస్లింలలో షావాలి యుల్లాను అనుసరించేవారు అత్యధిక సంఖ్యలో వుండగా, కొందరు సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ ధోరణి సబబు అనుకుంటున్నారు. సరిహద్దు గాంధి అని పేరొందిన ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్ పంథాను పాటించగలవారి సంఖ్య వేళ్ళపై లెక్కించవచ్చు. సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ పునర్వికాసానికి కొద్దిగా నాంది పలికాడు. ముస్లింలు పాశ్చాత్య విద్యను చదవాలన్నాడు. ఆ మాత్రానికే ఆయన్ను "కాఫిర్" అని ముస్లిం మతగురువులు (ఉలేమాలు) పేరెట్టి తిట్టిపోస్తూ 'ఫత్వా' జారీ చేశారు.

ముస్లింలలో స్వల్పంగానైనా పునర్వికాసానికి బీజాంకురాలు నాటింది సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ అని చెప్పవచ్చు. ఆయనలో మతమౌఢ్యం తక్కువ అయితే ముస్లింలు ఒకప్పుడు పరిపాలించారనే విషయం విస్మరించలేని స్థితిలో ఖాన్ కూడా వుండేవాడు. అలీఘడ్‌లో ముస్లింల ఆధునిక విద్యకు ప్రాతిపదికలు వేసిన సర్ సయ్యద్, పక్కనే ముస్లింల వేర్పాటువాదానికి కూడా బీజాంకురాలు నాటాడు.

సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ (1817-1898) మతాన్ని, సైన్సును సమన్వయీకరించే ప్రయత్నం చేశాడు. ఇవి రెండూ పరస్పర విరుద్ధాలు కావన్నాడు.

సిపాయి తిరుగుబాటు కాలంలో బ్రిటిష్‌వారి ఉద్యోగిగావున్న సర్ సయ్యద్, తిరుగుబాటును ఖండించి, ముస్లింలు బ్రిటిష్ వారికి విధేయులుగా వుండాలన్నాడు. ఒకవైపున ముస్లింల ఆధిపత్యం క్షీణించిపోగా, ఇస్లాంను జాగ్రత్తగా నిర్వచిస్తూ ఆధునికతతో సర్దుబాటు చేయాలని సర్ సయ్యద్ ప్రయత్నించాడు. సైన్సు, ఇస్లాంలు విరుద్ధాలు కావంటూ వ్యాఖ్యానాలు చేసి, అలీఘడ్‌లో 1862లో సైంటిఫిక్ సొసైటి స్థాపించాడు. 1875లో ఆంగ్లో ఓరియంటల్ కళాశాలను స్థాపించిన సర్ సయ్యద్ ఆధునిక విద్యను ముస్లింలలో వ్యాపింపజేయాలని సంకల్పించాడు. శాస్త్రీయ చారిత్రక ప్రాధాన్యత గల పుస్తకాలను ఉర్దూలోకి అనువదించాలని ప్రోత్సహించాడు. ఈ మాత్రానికే ముస్లిం మత గురువులు మండిపడ్డారు. వారి ఆగ్రహానికి గురికాదలచుకోక, మత విద్యవరకూ వారిదే పెత్తనం అన్నాడు. అది సాకుగా తీసుకొని మతగురువులు తమ ఆధిపత్యాన్ని అట్టిపెట్టుకొని సైన్సు విద్య ప్రబలకుండా చూచారు. ముస్లింలలో రినైజాన్స్ రాకపోడానికి ఆదిలోనే ఆటంకం ఏర్పడిందన్నమాట.

దేశంలో కాంగ్రెసు పార్టీ ఏర్పడినప్పుడు, అలీఘడ్‌లో సర్ అహమ్మద్ ముస్లింల ఆధునీకరణ ఆరంభించాడు. జాతీయ కాంగ్రెస్‌లో అడ్డుపడ్డాడు. ఇది బ్రిటిష్‌వారికి నచ్చింది. అలీఘడ్ ముస్లిం విద్యాసంస్థలకు మద్దతు ప్రకటించిన బ్రిటిష్‌వారు, చీలించి పాలించడానికి సర్ సయ్యద్ తోడ్పడ్డాడు. రాష్ట్ర కేంద్ర శాసనసభలలో ప్రాతినిధ్యం విస్తృత ప్రాతిపదికపై వుండాలని కాంగ్రెసు కోరితే, సర్ సయ్యద్ వ్యతిరేకించాడు. అలగా జనం అలాంటి ఉన్నత సంస్థలలో ప్రాతినిధ్యం వహించరాదని సర్ సయ్యద్ ఉపన్యాసాలిచ్చాడు. ఇది బ్రిటిష్‌వారి ధోరణికి సరిపోయింది.

ముస్లింల పాలనలో రాజభాషగా ఉర్దూ వుండేది. దీనిస్థానే ప్రజలు మాట్లాడుకునే హిందీ ప్రవేశపెట్టాలని ఉత్తరోత్తరా కాంగ్రెస్ కోరింది. ముస్లిం ఔన్నత్యానికి ఉర్దూ మారురూపం అని భావించిన సర్ సయ్యద్ యీ మార్పును కూడా వ్యతిరేకించాడు. హిందువులు-ముస్లింలు కలసి పనిచేయడం కష్టమని సర్ సయ్యద్ జోస్యం చెప్పాడు.

సర్ సయ్యద్ గాని ఆయన అనుచరులుగాని ముస్లింలను రాజకీయాలలో ప్రోత్సహించలేదు. సాంఘిక సంస్కరణ సైతం ఆశించలేదు. కేవలం విద్యపై వారు దృష్టిపెట్టారు. తరువాత ధోరణి మార్చుకొని భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన కొద్దికాలానికే మహమ్మదీయ విద్యాసభను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ హిందువులదని, దీనినుండి దూరంగా వుండాలని సర్ సయ్యద్ ముస్లింలకు చెప్పాడు. దేశంలో బ్రిటిష్ పాలన కొనసాగాలని ఆయన కోరుకున్నాడు.

సిపాయీల తిరుగుబాటులో ముస్లింలు పాల్గొనలేదనీ, అది హిందువుల చర్య అనీ సర్ సయ్యద్ స్పష్టం చేశాడు. ఆయన అప్పట్లో యీస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా పనిచేస్తుండేవాడు. క్రైస్తవులైన బ్రిటిష్ వారి పాలనకు ముస్లింలు వ్యతిరేకులు కాదంటూ, తిరుగుబాటులో ఎవరైనా పాల్గొంటే అలాంటి ముస్లింలు ద్రోహం చేసినట్లే అన్నాడు.

బ్రిటిష్ పాలకులు భారతీయుల అభిప్రాయాలు తెలుసుకొని చట్టాలు చేయాలని, ఇందుకుగాను శాసనసభలలో భారత ప్రతినిధులుండాలన్నారు సర్ సయ్యద్. అయితే ఉన్నత వంశస్తులే అందులో ప్రవేశించాలన్నాడు!

ముస్లిముల్లో కొద్దోగొప్పో పునర్వికాసభావాలు ఏర్పడ్డాయంటే, సర్ సయ్యద్ వెలిబుచ్చిన, స్థాపించిన విద్యాసంస్థలే కారణం. పాత సంప్రదాయాల విద్యకు బదులు ఇంగ్లీషు చదువులు అవసరమని ఆయన ముస్లింలకు నచ్చజెప్ప ప్రయత్నించాడు. కాని ఛాందసులు వినిపించుకోలేదు. సంప్రదాయ విద్య ముస్లింలను వెనుకబడినవారిగా అట్టిపెడుతున్నదని సత్యాన్వేషణకు దోహదం చేయడం లేదనీ సెలక్ట్ కమిటీ ముందు చెప్పాడు. పాత చదువులలో కట్టుకథలు జాస్తిగా వున్నాయనీ, ఆధారాలు తక్కువనీ అంటూ, అతిశయోక్తులతో నమ్మించే ప్రయత్నాలు జరిగాయని పాత ముస్లిం విద్యను ఆయన ఖండించారు. దీనివలన కాలయాపన విపరీతంగా జరిగిందన్నారు. తాను చెప్పేది ఛాందస ముస్లింలకు నచ్చదని తనకు తెలుసునని కూడా ఆయన చెప్పారు. అలాంటి భావాలు వెల్లడించినందుకు ముస్లిం సనాతనులు సర్ సయ్యద్‌పై దుమ్మెత్తి పోశారు. అయితే బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన విద్యను ముస్లింలు చదవకపోతే, వారు శాశ్వతంగా వెనుకబడే వుంటారని కూడా సర్ సయ్యద్ హెచ్చరించారు. పాశ్చాత్య విద్యను, సైన్సును ఆహ్వానించి, 1877లో మహమ్మదీయ ఆంగ్లో ఓరియంటల్ కాలేజి స్థాపించిన సర్ సయ్యద్ ఆ విధంగా ముస్లింలలో కొందరిని సరైన బాటలో నడిపించే ప్రయత్నం చేశాడు.

ఎన్నికల పద్ధతిలో ప్రతినిధులు శాసనసభలకు వచ్చే పద్ధతి వలన అధిక సంఖ్యాకులైన

హిందువులకు బలం లభిస్తుంది. మతద్వేషాలు విపరీతంగా వుంటూ, కుల చీలికలు రగులుకొంటున్న చోట యిలాంటి ప్రాతినిధ్యం మంచిది కాదని సర్ సయ్యద్ అభిప్రాయం వెల్లడించాడు. అల్పసంఖ్యాకులు దెబ్బతింటారని, అధికసంఖ్యాకులు పెత్తనం చేస్తారని ఆయన ముస్లింలను భయపెట్టాడు.

కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జాతీయోద్యమంలో పాల్గొనవద్దని సర్ సయ్యద్ స్పష్టంగా ముస్లింలను కోరాడు. కాంగ్రెస్‌పార్టీ వలన ముస్లింలకు ప్రయోజనం చేకూరదన్నాడు. ముస్లింలు అధిక సంఖ్యాకుల ఉద్యమానికి దూరంగా వుండాలంటూనే, పాశ్చాత్యవిద్యను అభ్యసించాలని చెప్పిన సర్ సయ్యద్ పరస్పర విరుద్ధంగా ప్రవర్తించాడు. వేర్పాటు ధోరణులకు ఆయన బీజాలు నాటాడు. కనుక పాశ్చాత్య విద్యను అభ్యసించిన ముస్లింలు సైతం మత ప్రభావం వలన జాతీయోద్యమానికి దూరంగా వున్నారు. ఆ మేరకు ముస్లిం మతగురువులు ముస్లింలపై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు.

భారతీయ ముస్లింలలో అత్యంత ప్రాధాన్యత చూపెట్టిన మహమ్మద్ ఇక్బాల్ (1873-1938) సైతం, ఆధునీకరణస్థానే, ఇస్లాం పునరుద్ధరణే కోరుకున్నాడు. ఆధునిక ప్రపంచ రీతుల్ని ఇస్లాం పద్ధతులలోకి మలచుకోవాలన్నాడు. గతాన్ని పూర్తిగా తుడిచిపెట్టడం సాధ్యంకాదని ఆయన రాశాడు. సెక్యులర్ భావాలను వ్యతిరేకించాడు. మతాన్ని, రాజ్యాన్ని, రాజకీయాలను మిళితం చేయాలన్నాడు. అఖిలభారత ముస్లింలీగ్‌ను ప్రోత్సహించాడు. నాస్తికత్వాన్ని, పదార్థవాదాన్ని వ్యతిరేకించాడు. జాతీయవాదం, సోషలిజం స్థానే ఇస్లాం కావాలని ఇక్బాల్ కోరుకున్నాడు. పెట్టుబడిదారీ విధానం కూడా పనికిరాదన్నాడు. రాజకీయవ్యవస్థ అంతా ఇస్లాం పరంగా సాగాలన్నాడు. అయితే మార్క్సిజాన్ని, లెనిన్‌ను మెచ్చుకుంటూ పద్యాలు రాశాడు. హిందూ-ముస్లిం ఐక్యతను కోరిన ఇక్బాల్, క్రమేణా పాకిస్తాన్ భావానికి పితామహుడయ్యాడు. ఇప్పటికీ ఆయన ఆలాపించిన 'హిందూస్తాన్ హమారా' గేయాన్ని చాలామంది ఆప్యాయంగా పాడుకుంటూనే వున్నారు. కాని, భారతజాతీయవాదంలో ముస్లింలు అల్పసంఖ్యాకులుగా బాధితులౌతారనే దృష్టితో ఆయన జాతీయోద్యమానికి అనుకూలించలేదు.

భారతదేశంలో ముస్లింలు పెద్ద అల్పసంఖ్యాకవర్గంగా ఇక్బాల్ పేర్కొని, క్రమేణా పాకిస్తాన్ భావాన్ని ప్రచారం చేశాడు.

ముస్లిం నాయకుల వేర్పాటుధోరణి బ్రిటిష్ పాలకులకు నచ్చింది. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ముస్లింలను ప్రోత్సహించారు. సర్ సయ్యద్ అనంతరం, బెంగాల్ విభజన ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని, లార్డ్‌మింటో ఈ ప్రయత్నాలు చేశాడు. ముస్లింలు కొందరు ఆగాఖాన్ నాయకత్వాన 1906 అక్టోబరు 1న సిమ్లాలో వైస్రాయిని కలసి, తమకు ప్రత్యేక సౌకర్యాలు, ఏర్పాట్లు, ప్రాధాన్యత కావాలని అడిగాడు.

1906 డిసెంబరు 30న ముస్లింలీగ్ ఏర్పడింది. అదే వేర్పాటుకు నాంది అయింది. అన్ని సంస్థలలోనూ ముస్లింలకు కేటాయింపులు, వేరే ప్రాధాన్యతలు కోరడం ప్రారంభమైంది. కాంగ్రెస్‌ను వ్యతిరేకించడం కూడా మొదలైంది. ముస్లింలు జాతీయ జీవనస్రవంతిలో పాల్గొనకుండా వేరుచేయడంలో వారిని అన్ని విధాల బ్రిటిష్‌వారు ప్రోత్సహించారు. చీలించి పాలించే విధానం చక్కగా ప్రయోగించారు. అదే నేటికీ అంటుజాఢ్యం వలె పట్టుక వెన్నాడుతున్నది.

జాతీయోద్యమంలో వున్న కాంగ్రెస్ నాయకులు ఎలాగైనా ముస్లింలను కలుపుకపోవాలని చూచారు. పండిత మదన్‌మోహన్ మాలవీయా వంటి వారు ముస్లింలకు ప్రత్యేక సౌకర్యాలు, మినహాయింపులు (Weightages) వ్యతిరేకించారు. హిందువుల ఐక్యత పేరిట గణపతి ఉత్సవాలు తిరగదోడిన తిలక్ మాత్రం, బ్రిటిష్‌వారిని వ్యతిరేకించే నిమిత్తం, అవసరమైతే ముస్లింలకు కేటాయింపులు సైతం యివ్వాలని వాదించారు. లక్నో కాంగ్రెసు సభలలో తిలక్ యిలాంటి ధోరణి అనుసరించి, జాతీయ జీవన స్రవంతిలో ముస్లింలను కలుపుక పోవాలనే ఆశించాడు.

ఈలోగా ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు సంభవించాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతరం, ముస్లింల ఆటోమన్ సామ్రాజ్యం కూలిపోతుండగా, ముస్లింలు కలవరపడ్డారు. ఖిలాఫత్ ఉద్యమం ఆరంభమైంది. అప్పుడే జాతీయోద్యమంలో ప్రవేశించిన గాంధి ఖిలాఫత్ ఉద్యమాన్ని వెనకేసుకొచ్చారు. టర్కీలో ముస్తాఫా కెమాల్‌పాషా అనేక సంస్కరణలు తలపెట్టి, ఖలీఫా వ్యవస్థను అంతమొందించేశారు. మనదేశంలో ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొన్న ముస్లింలు కాంగ్రెసుకు దూరమయ్యారు. జాతీయోద్యమానికి వ్యతిరేకులయ్యారు. మిగిలిన కొద్దిమంది కాంగ్రెస్‌లో కొనసాగుతూ ముస్లింలను తమవెంట తీసుకరాలేకపోయారు. అబ్దుల్ కలాం ఆజాద్ వంటి వారిని జాతీయ ముస్లింలని నిందించారుకూడా. ఆ విధంగా హిందూ-ముస్లిం ఐక్యత కోసం గాంధీ చేసిన కృషి విఫలమైంది. మత ప్రాతిపదికలతో జాతీయోద్యమం నడపడంలో వున్న ప్రమాదం అదే. పునర్వికాసానికి కూడా యీ ధోరణులే అడ్డొచ్చాయి. లక్నో ఒడంబడిక ప్రకారం ముస్లింలు తమ మతాన్ని యిష్టం వచ్చినట్లు ప్రచారం చేసుకోవచ్చు, ఆచరించవచ్చు. అయినా వారు తృప్తిపడలేదు. తమ ఉర్దూభాషకు వేరే గుర్తింపు ఉండాలన్నారు. ఎన్నికలలో కేటాయింపులు కోరారు.

మతపరంగా ఎవరినీ విచక్షణతో చూడరాదని నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయాన్ని ప్రకటించింది. మోతీలాల్‌నెహ్రూ అధ్యక్షతన ప్రకటించిన ముసాయిదా తీర్మానాలలో యీ విషయం స్పష్టం చేశారు. ఇదికూడా ముస్లింలకు తృప్తినివ్వలేదు.

భారత రాజ్యాంగ చట్టానికి 1935లో వచ్చిన సవరణల దృష్ట్యా రాష్ట్రాలకు స్వయంపాలనా ప్రతిపత్తి లభించింది. 1937లో జరిగిన ఎన్నికలలో వివిధ పార్టీలు పోటీచేశాయి. కాంగ్రెసు ఆరు

రాష్ట్రాలలో ఆధిక్యత పొంది, అధికారాన్ని చేబట్టింది. ముస్లింలీగ్ తన వేర్పాటు ధోరణి మరోసారి ప్రదర్శించి, కాంగ్రెస్‌తో సహకరించలేదు. జమీందార్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ సంస్కరణలు కోరగా, ముస్లిం జమిందార్లు వ్యతిరేకించారు. మహమ్మదాలీ జిన్నా నాయకత్వాన వేర్పాటు ధోరణులు బాగా ప్రబలాయి. బ్రిటిష్‌వారు యధాశక్తి వారిని ప్రోత్సహించారు. 1939లో కాంగ్రెస్ మంత్రివర్గాలు ఆయా రాష్ట్రాలలో రాజీనామా యిచ్చాయి. బ్రిటిష్‌వారు చెప్పాపెట్టకుండా రెండవ ప్రపంచ యుద్ధంలో భారతీయుల్ని దించారని కాంగ్రెస్ అన్నది. ముస్లింలీగ్ మరోవైపున కాంగ్రెస్‌ను దుయ్యబట్టింది.

1940 మార్చిలో జరిగిన లాహోర్ సమావేశంలో ముస్లింలు పాకిస్తాన్ కావాలన్నారు. అంతటితో ముస్లింలను జాతీయ జీవనంలో కలపడమనేది అసంభవమని తేలిపోయింది.

ఆ తరువాత పాకిస్తాన్ సృష్టిని జాతీయనాయకులు వ్యతిరేకించినా, స్పర్థలు పెరిగాయేగాని, తగ్గలేదు. గాంధి ఆశలన్నీ అడియాశలయ్యాయి. మత ప్రాతిపదికలతో సమస్యలు పరిష్కారం కావని ఉద్యమ నాయకులు గ్రహించలేదు.

ముస్లింలకు ప్రత్యేక సౌకర్యాలు, కేటాయింపులు కావాలని పట్టుబట్టిన జిన్నా రానురాను వేర్పాటును సమర్థించాడు. జాతీయజీవనంలో తమది వేరే ప్రవాహం అని జిన్నా అంటుంటే, కాదని నెహ్రూ వాదించాడు. జనాభా ప్రాతిపదిక కంటె అదనంగా తమకు స్థానాలు కేటాయించాలని కూడా జిన్నా కోరాడు. ముస్లింలు కోరే జాతీయవాదంతో కాంగ్రెస్ రాజీపడాలని జిన్నా ఉద్దేశ్యం. నెహ్రూ వ్యతిరేకించాడు. ఈ సంఘర్షణే క్రమేణా పాకిస్తాన్‌కు దారితీసింది. ముస్లింలు వెళ్ళిపోయి, వేరే పొయ్యి పెట్టుకోడానికి హిందూ నాయకులకు యిష్టమే. ఎప్పటికైనా ముస్లింలతో తలనొప్పి అని వారి భావన. ముస్లింలు కోరింది యిచ్చి వారిని అట్టిపెట్టాలని కాంగ్రెస్ నాయకులు కొందరు భావించినా అది సాధ్యపడలేదు. ముస్లింలు జాతీయ రాజకీయ ప్రాతిపదికగా కోర్కెలు వెల్లడించలేదు. మత ప్రాతిపదికగా వారడిగేవన్నీ వున్నాయి. అంటే కాంగ్రెస్ ఆశించిన సెక్యులర్ ధోరణికి ముస్లిం కోర్కెలు విరుద్ధం. వారు ఇస్లాం మతాన్ని వ్యాపింపచేయాలని, రాజకీయాలు కూడా ఇస్లాం పరంగా వుండాలని అడిగారు. జమాతే ఉలేమా హింద్ అధ్యక్షుడు మౌలానా హుస్సేన్ అహమ్మద్ యీ విషయాలను సమావేశాలలోనే స్పష్టంచేశాడు. జాతీయ ముస్లింల ప్రకారం ఇండియాను క్రమేణా ఇస్లాం చెయ్యాలి. ఇది సాధ్యం కాదని గ్రహించి జిన్నా పాకిస్తాన్ కోరాడు. పాకిస్తాన్ కోరిన జిన్నా హిందువులను మత జాతీయవాదులని, గాంధి, నెహ్రూలు హిందూ ఛాందసులనీ చిత్రీకరించాడు. ఇస్లాం రాజ్యంలో కేవలం మతం వుండదు. రాజకీయాలు, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలన్నీ ఇస్లాం నిర్దేశిస్తుంది. ఇస్లాంను మార్చేదేమీ లేదని వారి మతవాదుల ఉద్దేశం. కనుక ఇస్లాంతో రాజీ కుదరడం జాతీయవాదులకు సాధ్యపడలేదు. హిందువులు పాలించే ఇండియాలో ముస్లింలు స్వేచ్ఛగా వుండలేరని ఇస్లాం నమ్మకస్తుల ధోరణి.

దేశవిభజన జరగడం, లక్షలాది ముస్లింలు పాకిస్తాన్ పోవడం, అలాగే హిందువులు

ఇండియా రావడం చరిత్రలో భాగంగా మారింది. అప్పుడు జరిగిన హింసాకాండ, హత్యలు, మతద్వేషం గాఢంగా ఉభయులలోనూ నాటుకపోయాయి. దేశవిభజన కారణంగా ఇండియాలో ముస్లింల శాతం 23 నుండి 10 శాతానికి తగ్గిపోయింది. కుటుంబ నియంత్రణ ముస్లింలు మతరీత్యా పాటించరు. జనాభా పెంచుకొని, క్రమేణా, ఎన్నాళ్ళకైనా సరే, ఇండియాను ఇస్లాం రాజ్యం చేసుకోవాలని ముస్లిం మతవాదుల లక్ష్యం. ఇది అప్పట్లో సాధ్యమయ్యే విషయం కాదని జిన్నా గ్రహించి, పాకిస్తాన్ కావాలన్నాడు. దేశంలో వున్న ముస్లింలకే సమస్య పట్టుకున్నది.

మిగిలిన కొద్దిమంది జాతీయ ముస్లిం నాయకులు పదవులలో, పార్టీలలో, రాజకీయాలలో పాల్గొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తొలి నెహ్రూ మంత్రిమండలి నుండీ అధికారంలో వున్నారు. మతవాదం విడనాడమని ఆయన చేసిన విజ్ఞప్తిని ముస్లింలు పెడచెవినబెట్టారు. ముస్లిం మతనాయకులదే ఆధిపత్యం అయింది.

దేశవిభజన జరిగిన కొద్దిరోజులకే ఒక ఛాందస హిందువు గాంధీని హత్య చేశాడు. కొంతకాలం ముస్లింల సమస్య ప్రకోపించకుండా ఆగిపోయింది.

రామ్, రహీం ఒకటేనని, ఈశ్వరుడు-అల్లా అంతా ఒకే దైవం అని గాంధీ నినదించాడు. ఒక చేత్తో గీత, మరో చేత ఖురాన్ పట్టుకొని ప్రార్థనలు చేశాడు. మత సామరస్యతకు యీ ధోరణి ఉపకరిస్తుందనుకున్నాడు. మతధోరణులు మార్చుకోకుండానే హిందువులు, ముస్లింలు కలసి పనిచేయవచ్చని గాంధి ఆశించాడు. ముస్లింలను మ్లేచ్ఛులని సనాతన హిందువులంటుంటే, హిందువులు కాఫిర్లని ముస్లింలు భావించారు. వేదికలపై మర్యాదలు యిచ్చిపుచ్చుకున్నా, హిందూ ముస్లిం భాయి భాయి అనేది హృదయపూర్వకంగా ఎవరూ నమ్మలేదు. ఖురాన్, గీత ఒకటే అంటే అసలే ఒప్పుకోలేదు. సర్ సయ్యద్ అహమ్మద్ ప్రారంభించిన వేర్పాటువాదం పెరిగిపోయి, పాకిస్తాన్‌కు దారితీసినా గాంధి నమ్మకంలో మార్పులేకపోవడం ఆశ్చర్యకరం. మతపరంగా రాజకీయాల్ని చూస్తే వచ్చే చిక్కు ఏమిటో గాంధి గ్రహించలేదు.

ముస్లింలు ప్రతి సమస్యనూ మత ప్రాతిపదికగా చూస్తున్నారు. జాతీయ, మానవతా దృక్పథాలతో చూడాలని గాంధి ఆశించాడు. అది జరగలేదు. బ్రిటిష్‌వారు వెళ్ళిపోతే, హిందు-ముస్లింల సమస్య సామరస్యంగా పరిష్కారమౌతుందనుకోవడం కూడా భ్రమే. సాంస్కృతిక, సామాజిక ధోరణులన్నీ మత ప్రాతిపదికతో చూచినంత కాలం, తీవ్ర అభిప్రాయ భేదాలు తప్పవు. మా మతమే అత్యున్నతమైందని, ప్రపంచ వ్యాప్తంగా మతాన్ని అందరిచేత అంగీకరింపజేయాలనే ధోరణి వున్నంత కాలం, మతసామరస్యం పగటి కలే.

## స్వాతంత్ర్యానంతరం ముస్లింలు :

దేశవిభజన జరిగిన అనంతరం, పునర్వికాసానికి చక్కని అవకాశం లభించింది. సెక్యులర్ రాజ్యాంగాన్ని రూపొందించారు. కాని అటు హిందూ సనాతనులు, ఇటు ముస్లిం చాదస్తులు

కూడా సెక్యులర్ ధోరణులకు ఒప్పుకోలేదు. మొట్టమొదట యూనీఫాం సివిల్‌కోడ్ వద్దన్నారు. తమ మతపరమైన చట్టాలే తమను పాలించాలని ముస్లింలు పట్టుబట్టారు.

ముస్లింలలో ఎన్నో చీలికలు ఏర్పడ్డాయి. రాజకీయంగా వివిధ పార్టీలలోకి ప్రవేశించిన ముస్లింలు, అత్యధికంగా కాంగ్రెసులో మిగిలిపోయారు. కొద్దిమంది కమ్యూనిష్టు పార్టీలో వున్నారు. జమాతే ఇస్లామి ముస్లింల మతపరమైన విషయాలలో ఆధిపత్యం వహించింది. 1964 నాటికి ముస్లిం మజ్లీస్ ముషావరత్ ఏర్పడింది. వివిధ పార్టీలలో, ముఠాలలో వున్న చదువుకొన్న ముస్లింలు సైతం మతపరంగా ఒకే ధోరణి అవలంభించడం ప్రారంభమైంది. ఇస్లాంను నిశితపరిశీలనకు గురిచేయడానికి వీరు ససేమిరా, ఒప్పుకోలేదు. సెక్యులర్, ఆధునిక ధోరణిలో రాజ్యం కొనసాగించాలన్నప్పటికీ, ముస్లింలు తమకు ఇస్లాం ప్రాతిపదికే వుండాలన్నారు. ప్రజాస్వామిక విధానంలో ముస్లింలు యిమడలేకపోతున్నారు, ఒకప్పుడు పరిపాలన సాగించిన ముస్లింలు ఆ చరిత్రను మరువలేకపోతున్నారు. అల్పసంఖ్యాకవర్గాలుగా ప్రత్యేక అవకాశాల కొరకే వారు నిరంతరం తాపత్రయపడుతున్నారు. పోనీ ముస్లింలు తమ సంస్థల్ని, సమాజాలను ఆధునీకరణకు గురిచేస్తున్నారా, అంటే అదీ లేదు. రాజకీయ అధికారంకోసం కొన్ని పార్టీలు ముస్లిం ఓట్లకై వారేదడిగినా ఒప్పుకుంటున్నారు. ఇది ఆసరాగా తీసుకొని ముస్లింలు తమ మతపర హక్కులే కట్టుదిట్టం చేసుకుంటున్నారు.

ముస్లింలలో ఆధునిక దృక్పథం రావాలని, సెక్యులర్, మానవ విలువలు ఆచరించాలని, మతాన్ని సంస్కరించాలని, అవసరమైన మేరకు మతాన్ని విమర్శించాలని కొందరు యువ ముస్లింలు బయలుదేరారు. వారిపట్ల సనాతన ముస్లింల వ్యతిరేకత చాలా ఎక్కువగా వుంది.

హమీద్ దల్వాయ్ ఆధ్వర్యాన ముస్లిం సత్యశోధక సమాజం మహారాష్ట్రలో ఎన్నో కష్టాల్ని సనాతనులనుండి ఎదుర్కొనవలసి వచ్చింది. అష్గర్ అలీ ఇంజనీర్ ప్రాణాలకి ముప్పు ఏర్పడింది. 1971లో వీరు ముస్లిం స్త్రీ సమావేశాలు కూడా ఏర్పరచారు. స్త్రీ పురుషులు సమానం అనే ప్రాతిపదికగా ఒకే సివిల్‌కోడ్ వుండాలని యీ స్త్రీ సమావేశం కోరింది. దేశంలో అక్కడక్కడా ఉత్తేజం పొందిన ముస్లిం యువతీ యువకులు మానవ హక్కులకు, ఒకే సివిల్‌కోడ్‌కు వత్తిడి చేసినా, అది పేలవంగానే మిగిలిపోయింది. ఛాందసుల వత్తిడి, ప్రభావం చాలా ఎక్కువగా వుంది. భారత ప్రభుత్వం గాని, వివిధ రాజకీయ పక్షాలుగాని ముస్లిం యువకులలో సెక్యులర్ ధోరణులకు అండగా నిలవలేకపోయాయి.

ముస్లింల ధోరణి మారాలని, వారి సంస్థలు ఆధునీకరణం కావాలని పట్టుబట్టిన కొద్దిమంది మాట ఇంకా దేశవ్యాప్తంగా మారుమోగలేదు. ఎ.ఎ.ఎ. ఫైజి, ఆలంఖుంద్ మీరి, ఎం.ఆర్.ఎ. బేగ్, ఎం. హబీబ్, హమీద్ దల్వాయ్, అస్గర్ ఆలీ ఇంజనీర్, ఎం. ముజీబ్, అబిద్ హుసేన్ వంటి వారిని ముస్లింలలో వేళ్ళపై లెక్కించవచ్చు. ముస్లిమేతరులు కొందరు ఆధునీకరణ విషయమై ముస్లింలకు తోడ్పడడానికి సిద్ధంగావున్నా, స్వీకరించడానికి ముస్లింలు సహనం

చూపడంలేదు. విదేశాలలో ఇస్లాం విమర్శలు, ఖురాన్ పరిశీలనలు, మహమ్మద్ జీవితాన్ని నిశితంగా గమనించిన సందర్భాలు వున్నాయి. అలాంటప్పుడు సనాతన ముస్లింలు అభ్యంతరపెడుతూనే వున్నారు. ఇటీవల సాల్మన్ రష్దీ రాసిన శాటనిక్ వెర్సస్ పుస్తకాన్ని అందరికంటె ముందు ఇండియా నిషేధించింది. రచయితను చంపేయమని ఇరాన్ నేత అయొతుల్లా ఖొమినీ శాసించాడు, మతవిమర్శలపట్ల అసహనం ఆ స్థాయికి చేరుకున్నది.

మార్క్సిజాన్ని ఇష్టపడిన ముస్లింలు, కమ్యూనిస్టు పార్టీలోవున్న ముస్లింలు సైతం ఇస్లాంను, అమానుష ముస్లిం మతధోరణులను విమర్శించకపోవడం ఆశ్చర్యకరం. మతం మత్తుమందు వంటిదన్న మార్క్స్ ప్రవచనాన్ని వీరు పట్టించుకోలేదు. అవకాశవాదం తప్ప యిందులో మరో కారణం కనిపించదు.

పాకిస్తాన్ ఏర్పడగానే అక్కడ కమ్యూనిష్టుల్ని తుదముట్టించారు. ఆ ఉద్యమాన్ని కాపాడదామని వెళ్ళిన భారత కమ్యూనిష్టు ముస్లింలు సజ్జాద్ జహీర్, అశ్రఫ్‌లను జైళ్ళలో పెట్టారు. పదేళ్ళ తరువాత వారు ఇండియాకు తిరిగి రావలసి వచ్చింది. కమ్యూనిష్టు పార్టీలో వున్న ముస్లింలు మతేతరంగా వ్యవహరించలేకపోయారు. క్రమేణా కమ్యూనిష్టుపార్టీలో ముస్లింలు క్షీణించారుకూడా. కమ్యూనిష్టు ముస్లింలు ఎవరూ ఇస్లాంను, మహమ్మద్‌ను, ముస్లిం వాదనను, షరియాను నిశిత పరిశీలనకు గురిచేయలేదు. కమ్యూనిష్టు పార్టీలోవున్న ముస్లిం నాయకులు ముస్లిం నాయకులుగానే ప్రవర్తించారు. పశ్చిమబెంగాల్‌లో మహ్మద్ ఇలియాస్ ఒక ఉదాహరణ.

భారతదేశాన్ని 800 సంవత్సరాలు పరిపాలించిన ముస్లింలు, నేటికీ శాశ్వత అల్ప సంఖ్యాకులుగా వుండాలనే ధోరణి దారుణమైంది. ఆధునిక సెక్యులర్ మానవ విలువలు వారిచే పాటింపజేయడం చాలా కష్టమైపోతున్నది. ఇందుకు వారి మతమే వారికి ప్రధానంగా అడ్డొస్తున్నది. ఆధునిక పాశ్చాత్య విద్యను ముస్లింలు అభ్యసించాలని సర్ సయ్యద్ అహమ్మద్ కోరాడు. ముస్లింలలో పునర్వికాసానికి అది ఆరంభదశ అయింది. కాని తొలుతనే సర్ సయ్యద్‌ను ఛాందస ముస్లింలు కాఫిర్ అని బోర్డు కట్టేశారు. పునర్వికాస ప్రవాహం ఆగింది.

నేడు ముస్లింలలో పునర్వికాసం కావాలి. వీటికి అడ్డొస్తున్న విషయాలేమిటి? ఒకటి బహుభార్యాత్వం, చారిత్రకంగా జరిగిపోయిన విషయాన్ని ఆధునికంగా పాటించాలనడం, స్త్రీ-పురుష సమానతకు భంగమని వారికి నచ్చచెప్పాలి. దేశ పరిస్థితుల దృష్ట్యా, మతధోరణి ప్రక్కనబెట్టి, కుటుంబాలను పరిమితం చేసుకోవాలి.

ఒకప్పుడు, ఖురాన్ ప్రకారం కూడా, బానిసల్ని అట్టిపెట్టుకొనేవారు. బానిసలలో లైంగిక సంబంధాలుండడం యజమానులకు తప్పుకాదు. నేడు అది కొనసాగాలని ముస్లింలు అనగలరా? అది మార్చుకోడానికి వారుసంసిద్ధత వ్యక్తపరచారుగదా! అలాగే మిగిలిన రంగాలలోనూ ఆధునీకరణకు పూనుకుంటే పునర్వికాసానికి దోహదం చేసినట్లే.

ఖురాన్ ప్రతిపాదించి, అమలుపరచిన శిక్షలు తు.చ. తప్పకుండా అమలు జరగాలని భారతదేశంలో ముస్లింలు అనగలరా? భారత శిక్షాస్మృతి అందుకు ఒప్పుకోదు గదా? ఆ విషయమై నేరస్తులను శిక్షించడంలో ఒకే రీతి చట్టాన్ని ముస్లింలు, హిందువులు పాటిస్తున్నారు. పౌరసంబంధమైన విషయాలలో కూడా ఇలాగే వుంటే గొడవేలేదు.

నేడు ప్రపంచవ్యాప్తంగా మానవహక్కులు కోరుకుంటున్నారు. స్వేచ్ఛ సమానత్వం అనేవి మానవ విలువలుగా గుర్తించారు. కాని, మానవహక్కుల్ని ఖురాన్ గుర్తించకపోతే ఏం చేయాలని ముస్లింలు ఆలోచించుకోవాలి. పురుషులకంటె స్త్రీలు తక్కువ అనడం, బానిసత్వాన్ని సమర్థించడం, ముస్లిమేతరులు అందరూ కాఫిర్లు అనడం అనేవి, నేడు సమర్థనీయాలా? ముస్లిం యువతరం వీటిని పరిశీలిస్తే గాని, పునర్వికాసానికి చోటు వుండదు. అలాగే వివాహం విషయంలోనూ, విడాకుల విషయంలోనూ స్త్రీ పురుష సమాన హక్కుల సంగతి వారు పరిశీలించాలి. ముస్లింలలో సమానత్వం అనేది ప్రార్థనల సమయంలో పాటిస్తున్నారు. తరువాత అసమానతలు బాగా ఆచరిస్తున్నారు. సంపన్నులు పేదవారిని సమానంగా చూడలేకపోతున్నారు. ఇతర మతాలవారి సంగతి ఇక చెప్పనక్కరలేదు. వారంతా ధిమ్మీలు, లేదా కాఫిర్లు!

విచిత్రమేమంటే, అనేక ముస్లిం దేశాలు ఇస్లాం పేరెత్తకుండానే చాలా సంస్కరణలు అమలు చేశాయి. ట్యునీషియా ముస్లిం దేశమే. అక్కడ బహుభార్యత్వాన్ని నిషేధించారు. అందుకు ఖురాన్ అడ్డుపడలేదు. ఈజిప్టులో ముస్లిం వక్ఫ్ బోర్డులలో వ్యక్తిగత పెత్తనం తొలగిస్తే, మతగురువులు మాట్లాడలేదు!

ముస్లిం మత చట్టాలను (షరియా) చాలా ముస్లిందేశాలు పాటించకుండా ఆధునీకరణకు పూనుకున్నాయి. ముఖ్యంగా నేరాలు చేసినవారి చేతులు, కాళ్ళు నరకడం వంటి క్రూర హింసల్ని అనేక ముస్లిందేశాలు వదలివేశాయి. ఇంకా సౌదీ అరేబియా, పాకిస్తాన్, లిబియాలలో ఇలాంటి దారుణాలు అమలుపరుస్తున్నారు. అయితే ఆ దేశాలలో ముస్లింలు పరిపాలిస్తున్నారు గనుక సరిపోయింది. ముస్లింలు పరిపాలనలో లేని చోట్ల ముస్లింలు తమ చట్టం ప్రకారం అమలు జరగాలని పట్టుబట్టడం లేదు, అమెరికా, యూరోప్, కెనడాలలో ముస్లింలు తగిన సంఖ్యలోవున్నా ముస్లించట్టం కావాలని కోరలేదు.

భారతదేశానికి ఒక లిఖిత పూర్వక రాజ్యాంగం వుంది. సాంఘిక సంస్కరణలు చేయాలని, ఒకే పౌరస్మృతి కావాలని, సెక్యులర్ సైంటిఫిక్ ధోరణులు అమలుపరచాలని రాజ్యాంగం స్పష్టంచేసింది. ముస్లింలు వీటినుండి తమను మినహాయించాలంటే, పునర్వికాసం వారిలో రాజాలదు.

టర్కీలో కెమాల్‌పాషా ఆధ్వర్యాన చాలా సంస్కరణలు జరిగాయి. ముస్లింలు ఆధునికీకరణ మార్గంలో పయనించారు. ఇరాన్‌లో షా ఆధ్వర్యాన ముస్లింలు పాశ్చాత్యులతో దీటుగా అనేక

విషయాలలో ఆధునికులయ్యారు. కాని, అక్కడ కూడా మత ఛాందసులు తిరగదోడి, పునర్వికాసాన్ని దెబ్బతీశారు.

సిరియా, అల్జీరియా, ఇరాక్, ఈజిప్టులలో ముస్లిం కుటుంబ చట్టాలలో విపరీతమైన ఆధునిక మార్పులు వచ్చాయి. అలాంటి సందర్భాలలో ఇంకా ఇండియాలో ముస్లింలు తమ చట్టాలలో ప్రభుత్వ జోక్యం కూడదనడం అర్థంలేని విషయమే.

ముస్లింలలో పునర్వికాసానికి దోహదం చేయగల అంశాలేమిటి? ఇస్లాం సంపూర్ణం అనీ, మార్చడానికి వీల్లేనిదనీ ముస్లిం సనాతనులు నమ్ముతారు. అధునిక శాస్త్రీయ ధోరణుల దృష్ట్యా ముస్లింలలో చదువుకున్నవారు యీ విషయాన్ని మళ్ళీ ఆలోచించాలి. ఇతర మతాలలో వచ్చిన విమర్శలు, పరిశీలనలు ఇస్లాంలోనూ రావాలి.

ఇలాంటి విమర్శలు, పరిశీలనలు బయటివారు శాస్త్రీయ దృక్పథం గలవారు పూనుకుంటేనే, త్వరగా పునర్వికాసానికి ఆస్కారం వుంటుంది. పుట్టినప్పటినుండీ చనిపోయే వరకూ హిందువు ఏంచేయాలి, ఎలావుండాలి అని మతం శాసించింది. అదంతా పునర్వికాస ధోరణుల వలన చాలావరకూ సడలుతున్నది. ఇంచుమించు ఇస్లాంలోనే అలాంటి నిర్దేశాలు వున్నాయి. వాటినే పునరాలోచించాలి. క్రైస్తవులలోనూ యిలాంటి మూఢాచారాలు, నమ్మకాలు బలంగా వుండేవి. పునర్వికాసం, వివేచన, పారిశ్రామిక శాస్త్రీయ విప్లవాల వలన వారు చాలావరకూ బయటపడ్డారు. ఎటొచ్చీ ముస్లింలపైనే మతగురువుల పట్టు ఇంకా సడలలేదు.

భారతదేశానికి హమీద్ దల్వాయ్‌లు ఎందరోకావాలి. అప్పుడే ముస్లింలలో తొందరగా పునర్వికాసానికి అవకాశం లభిస్తుంది.

***- హేతువాది, సెప్టెంబరు, నవంబరు 1989***

# పునర్వికాస పరిణామం
# గాంధిభాయి సెక్యులరిజంలో పునర్వికాసం

చైనా, కంబోడియా, వియత్నాంలలో గాంధివంటి అహింసావాది బ్రతికేవాడా? బ్రిటిష్‌వారి ఇండియా పాలనలో గాంధివంటివారు తమ ఆచారాలను, అలవాట్లను ప్రచారం చేసుకుంటూ, రాజకీయాలను మతంతో రంగరించి, మహాత్ములనిపించుకున్నారు.

దక్షిణాఫ్రికాలో పరిశోధనలుచేసి విఫలమైన గాంధి, ఇండియాలో కొంతవరకు సఫలమయ్యారు. 1920 నుండే, తిలక్ మరణానంతరం, గాంధీజీ కాంగ్రెసు నాయకత్వంలోకి వచ్చారు. అప్పటికే ఆయనకు తగినంత ప్రచారం లభించింది. ఆశ్రమాలతో దేశంలో రాజకీయాలు ఆరంభించిన గాంధీజీ, స్త్రీలను యీ రంగంలోకి ఆకర్షించగలిగారు. శాకాహారం,

ఆయుర్వేదం, ప్రకృతివైద్యం, ఉపవాసాలు, కఠోరనియమాలు, ఖద్దరు వడకటం, ధరించడం, లైంగిక కట్టుబాట్లు, రామరాజ్యం యిలాంటివన్నీ ఆశ్రమ స్త్రీలకు ఆకర్షణలే. అందుకే గాంధీజీ ఆశ్రమాలకు అంకితమైపోయిన స్త్రీలు కొందరుకాగా, దేశవ్యాప్తంగా గాంధేయ పద్ధతులలో ఆయన శిష్యరికం చేసిన మధ్యతరగతి స్త్రీలు కొల్లలుగా వున్నారు.

గాంధీజీ ఆశ్రమాల పోషణ చాలా ఖరీదైన విషయం. సమాజానికి ముఖ్యంగా కొందరు గాంధేయ వ్యాపారస్తులకు యిందుమూలంగా ఖర్చు చాలా అయింది. గాంధీని పేదరికంలో అట్టిపెట్టడానికి, మూడవతరగతి రైలు ప్రయాణాలకు విపరీతంగా ఖర్చయ్యేది. ఆశ్రమాలను సమాజం పోషించి, గౌరవించి, ఆరాధించడం చిరకాలంగా దేశంలో వస్తున్న సంప్రదాయమే. దీని ఆధారంగా గాంధీజీ తన రాజకీయాల్ని బాగా ప్రచారంలోకి తెచ్చాడు. ఆశ్రమ జీవనానికి ప్రచారం లభించింది, లాభించింది. సబర్మతి-వార్ధా ఆశ్రమాలు దేశంలో రాజకీయాన్ని నడిపిన కేంద్రాలుగా మారాయి.

గాంధీజీ రాజకీయాల్లో ప్రవేశించి స్తబ్ధతలోవున్న కాంగ్రెసును ప్రజా ఉద్యమంగా మార్చడానికి మతపరమైన విధానాలు ఉపకరించాయి. సత్యాగ్రహం, సహాయనిరాకరణ, నిరసనవ్రతం, నిరాహారదీక్షలు, అహింసాయుత ఆందోళనల్ని గాంధీజీ తన ఆయుధాలుగా ప్రయోగించారు. ఇవన్నీ చిరకాలంగా మతాలు వాడుతున్నవే. కాని స్వాతంత్ర్యోద్యమంలోకి వాటిని తెచ్చి ప్రయోగించడం గాంధీ వివేచనకు తార్కాణం.

గాంధీజీ ఏ ఉద్యమాన్ని ఆరంభించినా, అది ఎంత అహింసాయుతంగా వుండాలన్నా, చివరకు హింసకే దారితీస్తుంది. ఉద్యమాలను మొదలుపెట్టిన గాంధీజీ వాటిని హింసాయుతం కాకుండా ఆపలేకపోయారు. మతం సహనం పేరిట ఎంత ప్రబోధం చేసినా, అవసరమైనప్పుడు చాలా అసహనాన్ని హింసను చూపగలదు. గాంధీజీ ఉద్యమాలలో మతం పేరిట ప్రవహించిన రక్తం మత అసహనానికి తార్కాణమే. హిందూ-ముస్లిం భాయిభాయి అని గాంధీజీ నినదించి, జీవితమంతా కృషిచేశాడుగదా! ఆయన కళ్ళెదుట హిందూ-ముస్లింలు వూచకోత కోసుకున్నారు. దేశవిభజన వలన 60 లక్షల హిందూ-ముస్లింలు బలిఅయ్యారు. చివరకు మత ఛాందసుడి చేతిలో గాంధి హతమయ్యారు. రాముడు-రహీం ఒక్కడేనని, ఈశ్వర అల్లా తేరేనాం అనీ, ఒకచేతిలో భగవద్గీత మరో చేతిలో ఖురాన్ పెట్టుకున్న గాంధీ ఎందుకు విఫలమయ్యారు? రెండు మతాలవారూ గాంధీజీ మతపరంగా చెప్పింది అంగీకరించలేదు. రాజకీయ ప్రయోజనంకోసం గాంధీజీ బోధిస్తున్నాడని వారికి తెలుసు. కనుక ఎవరి మతాన్ని వారు అంటిపెట్టుకున్నారు. సమయంచూచి చంపుకున్నారు. భాయి-భాయి అనేది వేదికలపై నినాదంగా మిగిలింది.

మతాన్ని రాజకీయాల్ని వేరుగా వుంచాలని గాంధి భావించలేదు. ప్రజలపై మతప్రభావం ఏమిటో ఆయనకు బాగా తెలుసు. అతితక్కువగా వస్త్రాలు ధరించడం, ఆశ్రమ జీవనం గడపడం, పెళ్ళి అయ్యి పిల్లలు పుట్టిన తరువాత బ్రహ్మచర్యం పాటించడం, శాకాహారానికే అంకితం

గావడం, సొంతలాభం మానుకోవడం ఇలాంటివన్నీ ప్రజల దృష్టిలో పవిత్రమైనవి. గాంధీజీ యీ లక్షణాలు పాటిస్తూ ప్రజల్ని ఆకర్షించి, రాజకీయాల్లోకి మతాన్ని తెచ్చారు. రామరాజ్యం కోరిన గాంధీజీ హిందూమతవాది. మత ఐక్యత కోరిన గాంధి, హిందూమతంలో ఇస్లాం, బౌద్ధం, క్రైస్తవం యిముడుతాయనుకున్నాడు. ముస్లింలను హిందువులను మతపరంగా కలపాలని గాంధీజీ నినదించారు. అక్కడే ఆయన విఫలమయ్యారు. ఆయన పిలుపును అందుకొని రాజకీయోద్యమాల్లో ప్రవేశించిన హిందువులు, ముస్లింలు తమ మతాల్ని గట్టిగా పట్టుకొనే వచ్చారు తప్ప వదులుకొనిరాలేదు. హిందువులు, ముస్లింలు ఒకటేననిగాని, ఖురాన్-బైబిల్-గీత చెప్పేదంతా ఒకే సత్యమనిగాని ఏ మతస్తుడూ ఒప్పుకోలేదు, పైగా గాంధీజీ చెప్పేదంతా హిందూమత ప్రచారంగానే ఇతర మతస్తులు భావించారు. దేశ ఐక్యతకు, స్వాతంత్ర్యానికి మతపరమైన ఆయుధాలతో గాంధీజీ పోరాడుతున్నప్పుడే, పాకిస్తాన్‌కోసం ముస్లింలీగ్ ఏర్పడి, పోరాడి, సాధించిందికూడా.

గాంధి భావాల ప్రభావం విపులంగా పరిశీలించేముందు, సంక్షిప్తంగా ఆయన జీవితాన్ని, తన భావాలు సంతరించుకోడానికి తోడ్పడిన తీరును చూద్దాం.

గుజరాత్‌లోని పోరుబందరులో గాంధి ఒక వైశ్య కుటుంబంలో పుట్టాడు. గాంధి తండ్రి పోరుబందరు సంస్థాన ప్రధాని. వీరు ఐదుగురు అన్నదమ్ములు. అందరి కుటుంబాలు ఒకే యింట్లో వుండేవి. గాంధి తండ్రి నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. గాంధి తల్లి పుత్లిబాయి నాలుగో భార్య. గాంధి తండ్రి 47వ ఏట 24 సంవత్సరాల పుత్లిబాయిని పెళ్ళాడాడు. గాంధికి రెండు సంబంధాలు నిశ్చయిస్తే, వారిరువురూ చనిపోయారు. మూడో సంబంధం కస్తూరిబాతో కుదిరింది. గాంధికి 13వ ఏట పెళ్ళి అయింది. కస్తూరిబా పొరుగునే వుండేది. ఇద్దరూ ఆడుకునేవారు. తల్లికి ఎప్పుడూ తీరనిపని. పూజలు, ఉపవాసాలు, వైష్ణవ సంప్రదాయం, శాకాహారం, తండ్రిపట్ల గాంధీకి ప్రేమ, ఆదరణ, తండ్రి వృద్ధుడై, జబ్బు పడగా గాంధీ శుశ్రూష చేసేవాడు. బడికి వెళ్ళివస్తూ, భార్యతో కాలక్షేపం చేస్తూ, తండ్రికి సేవలు చేస్తుండే గాంధీకి జుగుప్స కలిగించే సంఘటన జరిగింది. ఒకసారి తండ్రికి సేవలుచేస్తూ మధ్యలో భార్యవద్దకు వచ్చాడు. మామ తన స్థానంలో తండ్రివద్ద వున్నాడు. భార్య చెంతవుండగా తలుపులుకొట్టి తండ్రి పోయినట్లు ఎవరో చెప్పారు. వచ్చిచూచిన గాంధీకి చివరి సమయంలో తాను తండ్రివద్ద లేకపోవడం, భార్యతో సంభోగంలో వుండడం వలన, ఏదోనేరం చేసినట్లు, సెక్స్‌చర్య పాపం అన్నట్లు భావించాడు.

గాంధీకి పాఠశాల మిత్రుడు షేక్ మెహతాబ్ వుండేవాడు. అతడు ఒక పోలీస్ అధికారి కుమారుడు. గాంధీకి సంరక్షకుడిగా వుండాలని నిర్ణయించుకొని, అన్నీ నేర్పాలనుకున్నాడు. మాంసాహారం తినిపించాడు. ధైర్యంగా వుండాలంటూ మగతనం నిరూపించుకోమని గాంధిని వ్యభిచారగృహాలకు తీసుకెళ్ళాడు. వైఫల్యాలు, సఫలతలు చవిచూచిన గాంధీకి, కామవాంఛ ఎక్కువగానే వుండేది. ఆ దృష్టితోనే లండన్‌లో కూడా యీ పరిశోధన సాగించాడు.

భార్య కస్తూరి అన్ని విధాలా గాంధి చెప్పినట్లు వినేది. కాని చదువుకోమంటే ససేమిరా అని మొండికెత్తింది. ఆ విషయంలో గాంధీ ఓడిపోయాడు. షేక్ మెహతాబ్ మాత్రమే లండన్ నుండి గాంధి రాసిన ఉత్తరాలు చదివి కుటుంబ సభ్యులకు వినిపిస్తుండేవాడు. తరువాత గాంధి అతడిని దక్షిణాఫ్రికా పిలిపించుకున్నాడు. అక్కడ మెహతాబ్ ధోరణి, వ్యభిచారం భరించలేక, బలవంతంగా వదిలించుకున్నాడు. చిన్నప్పటినుండే ముస్లిం స్నేహితుడి ప్రభావంలోవున్న గాంధీ, హిందూ-ముస్లిం భాయి భాయి అని నినదించాడు. కుటుంబమంతా యీసడించుకుంటున్నా గాంధీ తన స్నేహితుడు మెహతాబ్‌ను ఒక పట్టాన వదలుకోలేకపోయాడు. గాంధీ పెద్ద కుమారుడు హరిలాల్ ముస్లింగా మారడానికి షేక్ మెహతాబ్ ప్రభావం పరోక్షంగా వున్నది.

గాంధి తన జీవితచరిత్రను సత్య పరిశోధనగా పేర్కొన్నారు. తన తండ్రి, ముగ్గురు భార్యలు చనిపోగా, 4వ ఆమెకు, అనగా తన తల్లి పుత్లిబాయిని చేసుకున్నాడని రాశారు. కాని మూడోభార్య బ్రతికుండగానే (ఆమె బాగా అనారోగ్యంగా వుండగా) పుత్లిబాయ్‌ని చేసుకున్నారు. అలాగే షేక్ మెహతాబ్‌ను సంస్కరించడానికే అతడితో స్నేహం చేశానన్నారు. కాని వాస్తవానికి గాంధీని అతడే చిన్నతనంలో ఎక్కడబడితే అక్కడతిప్పి, అన్నీ తినిపించి, త్రాగించి, సిగరెట్లు పీల్చేటట్లు చేశాడు. మెహతాబ్ గురించి చాలా వాస్తవాలు వదిలేసి స్వీయచరిత్ర రాసినట్లు గాంధి ఒప్పేసుకున్నారు. వీరిద్దరికీ లైంగిక సంబంధాలుండేవని అనడానికి ఆధారాలు లేవు. వున్నవన్నీ వదంతులే. సూచనప్రాయమైన సంఘటనలు మాత్రం వున్నాయి. అలాంటి షేక్ మెహతాబ్ ప్రభావం గాంధీపై కనిపిస్తుంది. వ్యభిచార గృహాలకు వెళ్ళినప్పుడు విఫలమైన సంఘటన ఒక్కటే గాంధి పేర్కొన్నాడుగాని, సఫలమైన వాటి జోలికి పోలేదు. తన పరిశోధనకు అవి అనవసరమనుకోవచ్చు. వాస్తవాలు చెప్పకపోవడం సత్యాన్వేషణలో భాగమేమో తెలియదు. తొలిసారి ఆఫ్రికాకు వెడుతున్నప్పుడు కూడా గాంధి నిజాలు దాచినట్లు ప్రమాణపూర్వకంగా ఆధారాలున్నాయి. (చూడు. మహదేవన్ రాసిన ది లేయర్ ఆఫ్‌ది ఫీనిక్స్)

ఇంగ్లండులో చదువుకోడానికి సముద్రం దాటిన గాంధి, 1888 సెప్టెంబరులో 50 రోజులు ప్రయాణంచేసి, ఇంట్లో వాళ్ళకు అనేక ఒట్లు వేసి, గమ్యం చేరుకున్నాడు. ఇంగ్లండ్‌లో చదువుకుంటూనే కొన్ని అసత్య సత్య పరిశోధనలు చేసిచూచాడు. శాకాహారం, సంగీతం, వ్యభిచారగృహాల సందర్శన ఇందులో భాగమే. తనకు పెళ్ళి అయిందని చెప్పకుండా సాగిపోయిన గాంధి, ఒక పెళ్ళి ప్రతిపాదన వచ్చేసరికి నగ్నసత్యాన్ని బయటపెట్టక తప్పిందికాదు! ఇంకా ఆశ్చర్యమేమంటే భగవద్గీత, బైబిలు, ఖురాన్ వంటి గ్రంథాలు గాంధి ఇంగ్లండ్‌లోచదివి ప్రభావితుడైనాడు.

ఇంగ్లండ్‌లో చదువు పూర్తి చేసుకొని గాంధి ఇంటికొచ్చేసరికి తల్లి పుత్లిబాయి చనిపోయింది. ఆ తరువాత బ్రతుకుతెరువు నిమిత్తం దక్షిణాఫ్రికా ప్రయాణం కట్టాడు. అప్పటికే గాంధీపై టాల్‌స్టాయ్, రస్కిన్, థోరో ప్రభావం పడింది. ఇంగ్లండ్ పోడానికి మ్లేచ్ఛుడుగా సముద్రం

దాటినందున గాంధీని, ఆయన్ను సాగనంపిన కుటుంబాన్ని వైశ్యకులం వెలివేసింది. అది లెక్కచేయకుండా గాంధి అడ్వొకేట్ వృత్తిని (కులవృత్తిని వదిలి) చేపట్టదలచాడు. ఇండియాకు వచ్చిన గాంధిపై రేచాంద్‌భాయి మతపరంగా చాలా ప్రభావం చూపాడని చాలామందికి తెలియదు.

రేచాంద్‌భాయి వలన గాంధీపై జైన సిద్ధాంతాల ప్రభావం బాగా నాటుకపోయింది. ఇతన్ని రాజ్‌చంద్ర అని కూడా అంటారు. ఇతడిని గాంధీ గురువుగా భావించాడు. కాని 31 సంవత్సరాలకే ఆ గురువు చనిపోయాడు. వైష్ణవమతం, జైనమతం గాంధీజీలో కలిసిపోగా, యువకుడుగా కోర్టులో సత్యాన్ని పరిశోధించాలంటే వీలుకాలేదు. మరోవైపు అన్న వత్తిడిపై తనకు ఇంగ్లండ్‌లో పరిచయమైన బ్రిటిష్ అధికారివద్దకు వెళ్ళి విఫలమయ్యాడు. కథియవార్ వదలాలనుకుంటుండగా, దక్షిణాఫ్రికా వెళ్ళే అవకాశం లభించింది. మరో 20 సంవత్సరాల పాటు దక్షిణాఫ్రికాలో తన "సత్యాన్వేషణ"కై గాంధి 1893లో బయలుదేరాడు. దాదా అబ్దుల్లా కంపెనీ పక్షాన ట్రాన్స్‌వాల్ వెళ్ళాడు. కోర్టులో కూలి బారిస్టర్‌గా జడ్జిచే అగౌరవం పొందాడు. దక్షిణాఫ్రికాలో జాతి విచక్షణ రుచిచూచాడు. సంస్కరణ రంగంలోకి దిగాడు. భారతీయుల నందరినీ ప్రిటోరియాలో కలిశాడు. జాతి విచక్షణా బిల్లును వ్యతిరేకించడంలో ఇంగ్లండ్ రాణి బిల్లుకు ఆమోదముద్ర యివ్వకపోవడంలో గాంధిపాత్ర ప్రముఖంగా వుంది. దక్షిణాఫ్రికాలో తనకు చేదోడువాదోడుగా వుండడానికి షేక్ మెహతాబ్‌ను అట్టిపెట్టుకున్నాడు. వ్యభిచారిణుల్ని ఇంటికే తెచ్చి అనుభవిస్తున్న మెహతాబ్‌ను వదిలించుకొని, తన కుటుంబాన్ని తెచ్చుకోడానికి ఇండియా వెళ్ళాడు.

కులం నుండి వెలివేసిన గాంధీకి, ఆయన భార్య కస్తూరిబాకు మంచినీళ్లు కూడా యివ్వని వైశ్యులు, గాంధీకి కీర్తిప్రతిష్టలు వచ్చిన తరువాత మా కులంవాడన్నారు. దక్షిణాఫ్రికానుండి పూర్తిగా ఇండియాకు వచ్చేసినప్పుడు ఘనంగా సన్మానాలు చేశారు. గాంధి మాత్రం వైశ్యుడుగా పూసుక తిరగలేదు. కులపట్టింపులు, విధులు పాటించలేదు. 1896లో దక్షిణాఫ్రికా నుండి గాంధి ఇండియా వచ్చారు. ఆయన పేరు కాంగ్రెసు పార్టీ ద్వారా ఇండియాలో కొంత వ్యాపించింది. అయనకు 27 ఏళ్ళు. ఇండియాలో గోపాలకృష్ణ గోఖలేను తన గురువుగా గాంధి పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో భారతీయుల దారుణస్థితి, జాతి విచక్షణ గురించి గాంధీ ప్రచారం చేశాడు. తద్వారా ఆయన పేరు బాగా తెలియడమేగాక, జాతి విచక్షణ సమస్యకు యీసడింపు వచ్చింది. కుటుంబంతో తిరిగి వెళ్ళిన గాంధి దక్షిణాఫ్రికాలో తీవ్ర వ్యతిరేకతను చవిచూచారు. కాని బోయర్ యుద్ధంలో దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ సామ్రాజ్యం పక్షాన పోరాడారు. మొదటి ప్రపంచ యుద్ధంలోనూ ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్యం పక్షాన గాంధి వున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో మాత్రం జపాన్‌వారి సహాయంతోనైనాసరే బ్రిటిష్ వారిని తరిమేయాలని, క్విట్ ఇండియా పిలుపు యిచ్చారు.

1901లో దక్షిణాఫ్రికా నుండి కుటుంబ సమేతంగా ఇండియావచ్చిన గాంధి, వకీలుగా

ప్రాక్టీసు చేద్దామనుకున్నారు. ఆయేడు కలకత్తా కాంగ్రెసు సభలలో పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా నుండి పిలుపురాగా మళ్ళీ వెళ్ళారు. అప్పుడే ఒక నిర్ణయం తీసుకున్నారు. 31వ సంవత్సరం నుండి తాను-తన భార్య కస్తూరిబా స్నేహితులుగా మెలగాలనీ, సంభోగం వద్దనీ పెళ్ళి అయిన తరువాత, సంతానం కలిగిన అనంతరం బ్రహ్మచారిగా వుండడం సాధ్యమేననీ గాంధీ ఒట్టుపెట్టుకున్నారు. అయితే లైంగిక కామన చాలా బలవంతమైన మానసిక-శారీరక ప్రకృతి. పట్టుబట్టి ఆపేస్తే ఆ ప్రవృత్తి అనేక రూపాలలో బయటపడుతుంది. బ్రహ్మచర్యం అనేది భారతీయ తత్వంలో ఉన్నతమైనదిగా చిత్రీకరించారు. సంభోగంలో కూడా రేతస్సుస్కలనం కాకుండా ఆపేస్తే మెదడుకు ఆ శక్తిని పంపించగలిగితే, ఆ వ్యక్తి సాధకుడౌతాడని నమ్మారు. తాంత్రికంలో కుండలినీ విద్యపేరిట ఇలాంటివి చిత్రించారు. ఆధారాలు లేని యీ ఆచారాలు పాటించిన వారి బాధలు వర్ణనాతీతం. గాంధిగారు జీవితమంతా తన బాధను కప్పిపుచ్చుకోడానికి సెక్స్ పరిశోధనలు చేశారు. కలల్లో రేతస్సుస్కలనం అయింది. తన బ్రహ్మచర్య శక్తిని జీవితంలో చివరి దశవరకూ ఆయన పరీక్షించుకుంటూపోయారు. కస్తూరిబా అంగీకరించడంతో గాంధీ తన బ్రహ్మచర్యాన్ని దీక్షగా దక్షిణాఫ్రికాలోని రోజులనుండే పాటించారు. టాల్‌స్టాయ్ ఫారమ్, ఫేనిక్స్ ఫారమ్‌ల పేరిట దక్షిణాఫ్రికాలో రెండు శిబిరాలు స్థాపించారు. తన నమ్మకాలను ఆచరించడానికి కొందరు యువతీ యువకులను చేర్చుకొని, సత్యాగ్రహం మొదలు సెక్స్‌వరకూ పరిశోధనలు చేశారు. టాల్‌స్టాయ్ ఫారమ్‌లో ఒక చెరువులో యువతీయువకులను బట్టలు తీసేసి, స్నానాలు చేయమన్నారు. ఇద్దరు యువతులు ఒక యువకుడు స్నానం చేస్తూ సరససల్లాపాలు సాగించినట్లు గాంధీకి తెలిసింది. ఆ యిద్దరు అమ్మాయిలకూ జుట్టు కత్తిరించేశాడు. అబ్బాయి జోలికిపోలేదు.

భారతీయులు దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం ద్వారా సాధించవలసిన అంశాలు గాంధీజీ నేర్పాడు. ఇంగ్లండ్ వెళ్ళి విజ్ఞప్తులు సమర్పించాడు. తిరిగివస్తూ 1909 ఓడలో వారం రోజులలో "హింద్‌స్వరాజ్" రాశాడు. అందులో గాంధీ నమ్మకాలు వెల్లడయ్యాయి. చివరివరకూ వాటిని మార్చుకోలేదు. అప్పటికి టాల్‌స్టాయ్, రస్కిన్‌ల ప్రభావం ఆయనపై బాగా కనిపించింది. హింద్‌స్వరాజ్‌లోనే బ్రిటిష్ పార్లమెంటును వ్యభిచార సంస్థగా గాంధి చిత్రించారు.

గాంధి తన భార్య కస్తూరిబా పట్ల చాలా సందర్భాలలో అమానుషంగా ప్రవర్తించాడు. దక్షిణాఫ్రికాలో వుండగా, మలవిసర్జన తరువాత సెప్టిక్ లెట్రిన్ పద్ధతులు అవలంబించి, ఎవరి దొడ్డిని వారే కప్పిపుచ్చాలన్నాడు. కస్తూరిబాతోపాటు ఆశ్రమవాసులు అలాగే పాటించారు. అతిథులు ఇతరులు వస్తే వారి మలవిసర్జన శుభ్రం చేయమని కస్తూరిబాను ఆదేశించాడు. అది భరించలేక, ఇంట్లోనుంచి వెళ్లిపోతానని కస్తూరిబా అంటే తలుపుతీసి ఆమెను గాంధి బయటకు గెంటాడు. అలాంటి నిరంకుశ ప్రవర్తన భార్యపట్ల, స్త్రీలపట్ల గాంధి చూపాడు. గాంధి తన సంతానం పట్ల కూడా క్రూరంగానే ప్రవర్తించాడు. పెద్ద కుమారుడు హరిలాల్ ప్రేమించి పెళ్లి చేసుకుంటాననంటే, నా కొడుకువికాదు పొమ్మన్నాడు. దక్షిణాఫ్రికాలో జాతి విచక్షపై గాంధీ

పోరాడుతున్నప్పుడు గోఖలే సందర్శించాడు. గాంధీ ఆయన్ను తన ఆశ్రమానికి తీసుకెళ్లి ఆదరించాడు. ప్రభుత్వం కూడా గోఖలేను గౌరవంగా చూచింది. 1913 అక్టోబరు 28 గాంధీ, 2037 పురుషులు, 127 స్త్రీలు, 57 మంది పిల్లలతోసహా మినీ దండి మార్చివంటిది జరిపించి, అరెస్టు అయ్యాడు.

దక్షిణాఫ్రికాలో 21 సంవత్సరాలు పరిశోధనలు, పోరాటాలు చేసిన గాంధి, 1914 జులైలో ఇండియాకు వచ్చేశారు. స్వాగతాలు, సన్మానాలు అందుకున్నారు. గోఖలే సలహాపై దేశం చుట్టివచ్చి, అహమ్మదాబాద్ వద్ద సబర్మతి ఆశ్రమం స్థాపించారు. నేత పరిశ్రమలో కార్మికుల పక్షాన అంబాలాల్ శారాభాయిపై పోరాడారు. ప్రచారం లభించింది.

బీహార్‌లోని చంపరాన్‌లోని నీలిమందు రైతుల పక్షాన బ్రిటిష్‌వారిపై పోరాడిన గాంధీకి దేశవ్యాప్తంగా పేరొచ్చింది. గుజరాత్‌లోని కేడాజిల్లా రైతులు దుర్భిక్షం వలన పన్నులు చెల్లించలేకపోతుండగా, అధికారులు వారిని పీడించారు. గాంధీ తన సత్యాగ్రహ ఆయుధాన్ని రైతుల పక్షాన ప్రయోగించారు.

1919 ఏప్రిల్ 19 రౌలట్ సత్యాగ్రహోద్యమాన్ని గాంధి నిలిపేశారు. సత్యాగ్రహం అహింసకు దారితీయడం, బ్రిటిష్ సైనికుల్ని హతమార్చడం ఇందుకు కారణం. తన అంచనాలు హిమాలయాలంత తప్పులుగా పరిణమించాయని గాంధి ఒప్పుకున్నారు. ఇదంతా గాంధీ గొప్పతనాన్ని చాటింది.

1919లో మోతీలాల్ నెహ్రూ గాంధీని మహాత్ముడన్నారు. ఆ మాట గాంధికి అతుక్కుపోయింది. 48 సంవత్సరాలకు గాంధీ జాతిపితగా మారాడు.

కాంగ్రెస్‌లో తిలక్ మరణానంతరం, గాంధీ తిరుగులేని నాయకుడయ్యాడు. ముస్లింలను కలుపుకపోవాలనే ధోరణి బాగా చూపెట్టారు. ఖిలాఫత్ ఉద్యమాన్ని బలపరచారు. ముస్లింలలో ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, అబుల్‌కలాం ఆజాద్, అలీ సోదరులు, సుహ్రావర్ది, అన్సారి వంటి నాయకులు జాతీయోద్యమంలో గాంధీ అనుచరులయ్యారు. కాని ముస్లిం ఓటర్లు, గాంధీని ఆమోదించలేదు. ఈశ్వర-అల్లా తేరేనాం ఒప్పుకోలేదు.

1920 నుండే కాంగ్రెసుకు అనధికార నియంతగా మారిన గాంధీ పన్నుల నిరాకరణ, సత్యాగ్రహం, అహింసాయుత చట్ట వ్యతిరేకత, నిరాహారదీక్షల్ని నిరసన ఆయుధాలుగా ప్రయోగించారు. సామాన్య ప్రజలలో ముఖ్యంగా మధ్యతరగతి వారిలో చైతన్యం తెచ్చారు. 1925-30 మధ్య తన స్వీయచరిత్ర రాశారు. దేశపర్యటన చేశారు. ఖద్దరు ప్రచారం గావించారు. హరిజన, నవజీవన్ పత్రికలు పెట్టారు.

1930లో అహమ్మదాబాద్ వదలేసిన గాంధీ చనిపోయేవరకూ మళ్ళీ అహమ్మదాబాద్‌లో

స్థిరపడలేదు. 1930లో ఉప్పు సత్యాగ్రహం పేరిట జరిపిన దండి మార్చి, గాంధీ నాయకత్వాన్ని బ్రిటిష్‌వారు గుర్తించేటట్లు చేసింది. జవహర్‌లాల్ నెహ్రూను తన వారసుడుగా గాంధీ పేర్కొన్నారు.

1940 నుండి 42 వరకు మరోసారి గాంధి దేశాన్ని కదిలించేశారు. వ్యక్తిగత సత్యాగ్రహం, క్విట్ఇండియా ఉద్యమాలు గాంధి ప్రజా సైకాలజీ వాడుకున్న దానికి ఉదంతాలే. క్విట్ ఇండియా తరువాత స్వాతంత్ర్యం వచ్చేవరకూ గాంధీ ఉద్యమాలేవీ లేవు.

మొత్తంమీద దేశ స్వాతంత్ర్యోద్యమంలో మతాన్ని కలిపి, ప్రజల్ని రంగంలోకి తెచ్చిన గాంధి, రెండు విషయాలలో సెక్యులర్ ధోరణులు అలవరచలేకపోయారు. అంటరానితనం పోవాలని గాంధి ఎంతచెప్పినా, ప్రయత్నించినా హిందూమతం వినలేదు. హిందూ-ముస్లింలు ఒకటేనని గాంధి నినదించినా ఉభయమతాలూ పెడచెవిన పెట్టాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఒకపిలుపు యిస్తే గాంధీ పేరిట వీధుల్లోకివచ్చి, త్యాగం చేయడానికి సిద్ధపడినవారు, మతవిషయంలో గాంధీని ఎందుకు నిరాకరించారు! ఈ విషయం వివరంగా పరిశీలిస్తే, సెక్యులర్ ధోరణులు దేశంలో ఎందుకు అలవాటు కాలేదో స్పష్టపడుతుంది.

## అంటరానితనం

అంటరానితనం అమానుషమని, అది అడుగంటిపోవాలని గాంధీభాయి అన్నారు. అంటరానితనం నశించకపోతే హిందూమతమే పోతుందన్నారు. భారత రాజకీయాల్లోకి ప్రవేశించినది మొదలు అంటరానితనంపై గాంధీజీ పోరాడారు. కాని అంటరానితనానికి అమ్మ ఎవరు? కులం. ఈ రెండింటికీ మూలం ఏది? మతం. అటువంటిది హిందూమతం జోలికి పోకుండా, అంటరానితనం ఎలా పోతుంది? ఇది అంబేద్కర్ ప్రశ్న.

కులాన్ని వదలేయండి అంటే మతాన్ని వదలేయమనే అర్థమని అంబేద్కర్ ఉద్దేశం. కులానికి హిందూమత ప్రమాణ గ్రంథాలు, ముఖ్యంగా వేదాలు, శాస్త్రాలు కొమ్ముకాస్తున్నాయి. వాటినికాదంటే హిందువుగా ఎలా నిలబడతారు? సమానత్వాన్ని అంటరానివారికి తెచ్చిపెట్టాలంటే హిందూమతంలో సాధ్యంకాదు. అందుకని, ఎన్నికలలో అంటరానివారికి ప్రత్యేక నియోజకవర్గాలు వుండాలని అంబేద్కర్ పట్టుబట్టాడు. 1930-31లో లండన్‌లో జరిగిన ప్రథమ రౌండ్ టేబుల్ సమావేశంలో అంబేద్కర్ వాదనల్ని బ్రిటిష్ పాలకులు అంగీకరించారు.

అప్పుడు జైలులోవున్న గాంధి 'ససేమిరా' అంటూ, అంటరానివారు హిందువులకు దూరం కారాదన్నారు. బ్రిటిష్‌వారి ప్రతిపాదన వ్యతిరేకిస్తూ ఆమరణనిరాహారదీక్ష పూనారు. అంబేద్కర్ తన పట్టు మానాలన్నారు. కులనాయకులు, మతనాయకులు గాంధీపట్ల సానుభూతి ప్రకటించారు. గాంధీ చనిపోతే దేశం నాశనమౌతుందన్నారు. అంబేద్కర్ వత్తిడికి లొంగిపోయి, గాంధీజీ కోరినట్లు హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలు కోరబోనన్నాడు. శాసనసభలలో అంతకుముందు 71 స్థానాలుంటే వాటిని 148 వరకూ కేటాయించడానికి ఒప్పుకొని, హరిజనులకు

మేలు చేసినట్లు నటించారు. పూనా ఒడంబడిక పేరిట హరిజనుల్ని మనుషులుగా సమానత్వంతో బ్రతకడానికి వీల్లేకుండా గాంధిభాయి కృషిచేసి, హిందూమతంలో హెచ్చుతగ్గుల్ని తెలివిగా, జాగ్రత్తగా కొనసాగించారు. సనాతనులు సంతోషించారు.

## హిందూ-ముస్లిం భాయి భాయి

గాంధి చేసిన కృషిలో పాకిస్తాన్ ఏర్పడకుండా వుండాలని, హిందువులు ముస్లింలు కలసిమెలసి వుండాలనేది ముఖ్యం. ఈ విషయంలో గాంధి స్పష్టంగా విఫలమయ్యారు. రాజకీయంగా ఆయన యిచ్చిన పిలుపుల్ని గౌరవించి, రంగంలోకి దూకినవారు, మతపరంగా ఆయన ఉద్దేశాలను ఆచరణలో పెట్టడానికి సిద్ధపడలేదు.

మతాన్ని రాజకీయాల్లోకి తెచ్చిన గాంధి, తెలిసి, కావాలని ఆ పని చేశారు. రాజకీయాలకు మతానికి సంబంధం లేదనే వారికి మతం అంటే ఏమిటో తెలియదని గాంధి తన సత్యాన్వేషణ స్వీయగాథల్లో అన్నారు. భారతదేశంలో రామరాజ్యం ఏర్పరచాలని నినదించిన గాంధి, శాకాహారం, అహింస, అర్ధనగ్నంగా వుండడం, మతగ్రంథాలు పట్టుకొని ప్రార్థనా సమావేశాలు జరపడం, ఉపవాసాలు, నిరాహారదీక్షలు ఇత్యాదులన్నీ చేశారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని గాంధి పదేపదే చెప్పారు. ఈ విషయాన్ని ఏ మత సనాతనులూ అంగీకరించలేదు. ఎవరి మతం వారికి గొప్ప. ఇంకో మతాన్ని గొప్పది అనడం, వేదికలపై రాజకీయ ప్రయోజనాల నిమిత్తం పైపైకి చెప్పే విషయమే. గాంధిచేసిన ప్రతి పని వెనుక హిందూ ప్రభావాన్ని చూచిన ముస్లింలు, ఆయన్ను అంగీకరించలేదు. కాంగ్రెసులో హిందూ ఆధిపత్యాన్నే వారు చూచారు.

ముస్లింలను కాంగ్రెసులో అట్టిపెట్టాలని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో కలుపుకపోవాలని చేసిన ప్రయత్న ఫలితంగా లక్నో ఒడంబడిక వచ్చింది. ముస్లింలకు ప్రత్యేక ఎన్నికలు జరపడానికి ఒప్పుకున్నారు. ఖిలాఫత్ ఉద్యమాన్ని గాంధి సమర్థించడంలోనూ యీ ఉద్దేశ్యం వున్నది. ముస్లింల కొరకు గాంధి చాలాదూరం పోతున్నాడని, హిందువుల ఆసక్తులు పట్టించుకోవడం లేదని, సనాతనులు విమర్శించారు. గోవధ నిషేధం కూడా ముస్లింలకు వర్తించరాదని గాంధి అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం ఏ ఒక్క మతాన్ని అంటిపెట్టుకొని వుండరాదని, అన్ని మతాలు ఒకటే గనుక, ప్రభుత్వం అందరినీ సమానంగా చూడాలని గాంధి ఉద్దేశం. భారతదేశంలో ఘులాంటి అభిప్రాయం వలన, పైకి ఎలా చెప్పినా, హిందూ మతానిదే పైచేయిగా వుంటుందని ముస్లింల ఉద్దేశం.

పాకిస్తాన్ కావాలనడంలో హిందూ వ్యతిరేకత వున్నదని, ఇస్లాం ప్రత్యేకతను కోరుకుంటున్నదనీ, కనుక పాకిస్తాన్‌కు తాను వ్యతిరేకినని గాంధీ పదేపదే చెప్పారు. హిందూమతం - ఇస్లాం రెండు భిన్న సిద్ధాంతాలకు ప్రతినిధ్యం వహిస్తున్నట్లు తాను అంగీకరించనని గాంధీ

అన్నారు. గీత-ఖురాన్‌లలో దైవం ఒక్కటేనన్నారు. (చూడు : ఆనంద్ టి. హింగోరాని సంపాదితంలో టు ది హిందూస్ అండ్ ముస్లింస్ - ఎం.కె. గాంధీ 1942 అలహాబాద్) ఇక్కడే ముస్లింలు గాంధీని వ్యతిరేకించారు. హిందువులూ ఆయన్ను అనుసరించలేదు. దేశంలోని ముస్లింలు అందరూ పాకిస్తాన్ వెళ్ళిపోవాలని సనాతన హిందువుల ఉద్దేశం. న్యాయం సమకూర్చడంలో, శాంతిభద్రతలు అందించడంలో, మురికి నీటిపారుదల, పరిశుభ్రత, రోడ్లు, రవాణా వంటి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ దృష్టిలో ముస్లింలని, హిందువులని తేడా వుంటుందా అంటారు గాంధి. కనుక ప్రభుత్వం మతరహితంగానే వ్యవహరించాలంటారు.

గాంధి చివరి దశలో తన అభిప్రాయాలు బాగా మార్చుకొని, సెక్యులరిజం అమలు జరగాలన్నారు. మత విషయాలలో ప్రభుత్వ జోక్యం ఏ మాత్రం వుండరాదన్నారు, కాని కాంగ్రెసులో సైతం నాయకులు పాకిస్తాన్‌కు అనుకూలత చూపారు. దేశం విభజన జరిగితే శాంతి వుంటుందనుకున్నారు. బలవంతంగా గాంధీని ఒప్పించారు. మతపరంగా జరిగిన విభజన వలన లక్షలాది మంది చంపుకున్నారు. మతద్వేషాలు ఇంకా పెరిగిపోయాయి. బెంగాల్‌లో గాంధీ పుణ్యమా అని కొంతవరకు తాత్కాలికంగా మతహింస ఆగింది. గాంధీ కోర్కెలకు విరుద్ధంగా దేశ విభజన జరిగింది. గాంధి సెక్యులరిజం విఫలమైంది.

గాంధి యిలా విఫలం గావడానికి మూలకారణాలు తెలుసుకోవడం అవసరం.

## గాంధీ వైఫల్యం

మతంలోని సారాంశాన్ని సరిగా అర్థం చేసుకుంటే, హిందువులు ముస్లింలు కలసిమెలసి వుంటారని గాంధి నమ్మారు. ఈ "నిజం" అనేది ఎవరికి ఎట్లా అర్థమైనా, ఎవరి మతం యొక్క గొప్పతనం వారికి అట్టిపెట్టుకోవాలని, ఇతర మతాల కంటే తమది గొప్పదనీ భావించారు. అలా అనుకోకపోతే మతాలు పుట్టవు, పుట్టిన తరువాత వుండవు. మూర్ఖంగా నమ్మడం, ప్రశ్నించకపోవడం అనేవి మతానికి పునాదులు. మతం పట్ల మౌలికమైన అవగాహన, పరిశీలన, పుట్టుపూర్వోత్తరాలు తెలిస్తే మతం సడలిపోతుంది. గాంధి కూడా హిందూమత సంప్రదాయాలలో మునిగి తేలిన వ్యక్తే. అందుకు ఆయన హిందూమతాన్ని ఏనాడూ శాస్త్రీయంగా పరిశీలించలేదు. అలాంటి ప్రయత్నం కూడా చేయలేదు. లౌకికంగా సమస్యల్ని చూచాడు. అది మతవాదులకు నచ్చలేదు.

జీవితమంతా మతాన్ని అంటిపెట్టుకున్న గాంధీకి, చివరిదశలో జ్ఞానోదయమైంది. పాకిస్తాన్ విభజనతో, లక్షలాది హిందూ-ముస్లింలు చనిపోయిన తరువాత గాని మతంలోని ప్రమాదాలు గాంధీకి తెలిసిరాలేదు.

"మతం వ్యక్తిగత విషయం వ్యక్తి స్థాయిలో మతాన్ని అట్టిపెట్టగలిగితే రాజకీయ జీవన రంగమంతా చక్కబడుతుంది" అని గాంధీ 1947లో హరిజన్ పత్రికలో రాశారు (మే 16, 23, ఆగష్టు 31 సంచికలు) ప్రభుత్వం ఏ విధంగానూ మతం జోలికి రాకూడదని, సహాయం

చేయరాదని ఆయన అన్నారు. ప్రభుత్వ సహాయంతో కొనసాగే మతం వలన చాలా బాధలకు గురైనాం. ప్రభుత్వ నిధులపై ఆధారపడే మతం, మతమే కాదు అన్నారు గాంధీ (చూడు హరిజన్ 1948 మార్చి 23) అందుకు భిన్నంగా నేడు ప్రభుత్వ సంస్థగా మతం మారింది.

## గాంధి సాధించిందేమిటి?

స్వాతంత్ర్యోద్యమంలో సామాన్యుల్ని చైతన్యవంతుల్ని చేయడంలో మతాన్ని ఆయుధంగా వాడి, గాంధి కొంతవరకు సాధించారు. ఆయన పిలుపు యిస్తే చాలు, జనం రంగంలోకి దూకారు. అయితే అటు హిందూ సనాతనులు, ఇటు ముస్లిం చాదస్తులు గాంధీ విధానాలను వ్యతిరేకించారు. రాజకీయ ప్రయోజనాల నిమిత్తం, వేదికలపై ఈశ్వర-అల్లా తేరేనాం అని పాడినా, ఉభయ మతాల వారు, ఎవరి గొప్పదనం వారిదే అనుకున్నారు. హిందూమతాన్ని ధ్వంసం చేస్తున్నాడని హిందూ కరడుగట్టిన తీవ్రవాదులు గాంధీపై కన్నెర్ర చేశారు. ముస్లింలు గాంధీని నమ్మకుండా, తమ పొయ్యి తామే ఏర్పరచుకుంటామన్నారు.

స్వాతంత్ర్యం వచ్చే నాటికి మతం నిర్వహిస్తున్న పాత్ర ప్రభుత్వం దాని పట్ల అనుసరించాల్సిన విధానం గాంధీకి స్పష్టమైంది. కాని అప్పటికే చాలా ఆలశ్యమైపోయింది. ఏ మత సామరస్యత కోసం గాంధీ పోరాడాడో ఆ మత ఛాందసం, అసహనం, హింసకే గాంధి ఆహుతయ్యాడు.

మతాన్ని అవగాహన చేసుకోవడంలో గాంధి సామాన్య లౌకిక ధోరణి ప్రదర్శించారు. శాస్త్రీయ పంథా ఏనాడూ ఆయన చేబట్టలేదు. అందువలన గాంధీ విఫలం గాక తప్పలేదు. అయితే రాజకీయ రంగంలో మత విధానాలు వాడడానికి బ్రిటీష్ వారి పాలనలో సరిపోయింది కాని, ఫాసిజం, కమ్యూనిజం, ముస్లిం ఇస్లాం రాజ్యాలలో ఇది సాధ్యమయ్యేదా? అని ప్రశ్నిస్తే, సాధ్యం కాకపోయేదే అనుకోవలసివస్తుంది. 20వ శతాబ్దంలో గాంధేయ అహింసా విధానాలతో స్వాతంత్ర్యోద్యమాలు జరగడం గొప్ప విశేషం. భవిష్యత్తు తరాల వారు ఆదర్శంగా తీసుకోగలిగిన అహింసాయుత పద్ధతులు గాంధీ అవలంబించారు. మతపరంగా ఆయన విధానాలు పూర్తిగా విఫలమయ్యాయి. సెక్యులర్ పద్ధతులకు దేశంలో గట్టి పునాదులు వేయలేని గాంధి మత అసహనానికి గురయ్యారు.

*- హేతువాది, డిసెంబరు 1989; జనవరి 1990*

# పునర్వికాస పరిణామం

# క్రైస్తవులు పునర్వికాసానికి దోహదం చేశారా?

భారతదేశంలో క్రైస్తవులు మైనారిటీ వర్గంగా మూడోస్థానాన్ని ఆక్రమిస్తున్నారు. రెండోస్థానం ముస్లింలది. మొట్టమొదట కేరళలో అడుగుపెట్టిన క్రైస్తవులు, చాలా నెమ్మదిగా దేశంలో ప్రాకారు. యూరోప్ నుండి వచ్చిన వలస-సామ్రాజ్యవాదులంతా క్రైస్తవులే. ఆ విధంగా పోర్చుగీస్,

డచ్, ఫ్రెంచ్, ఇంగ్లీషువారు ప్రత్యక్షంగా కొంత, పరోక్షంగా మరికొంత క్రైస్తవాన్ని దేశంలోకి తెచ్చారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీవారు భారతదేశంలో వ్యాపారం ప్రధానంగా భావించారు. మత, సాంఘిక విషయాలలో తటస్థంగా వుండాలనుకున్నారు. దేశంలో ప్రొటెస్టంట్ మతాన్ని ప్రచారంచేసే ఉద్దేశంతో1698లో దేశీయ భాషలు నేర్చుకోవాలని పార్లమెంటు చట్టం చేసింది. కాని దేశంలో వ్యాపారం సాఫీగా సాగాలంటే మతం జోలికి పోరాదని కంపెనీ తన లౌకిక విధానంగా నిర్ణయించింది. ఆ పని పోర్చుగీసువారు చేయలేదు. 1546 నుండే పోర్చుగీసువారు గోవాలో కేథలిక్ శాఖను బలవంతంగా రుద్దారు. దేశీయ మతాచారాలపై ఆంక్షలు పెట్టారు. నేటికీ గోవాలో కేథలిక్ మతం వ్యాపించి వుండడానికి చారిత్రక కారణాలివే.

బ్రిటిష్ పాలకులు కొందరు తటస్థ వైఖరిని ప్రోత్సహించగా, మరికొందరు క్రైస్తవ మత ప్రచారాన్ని కాదనలేదు. కనుక మత ప్రచారకులు 1705 నుండీ తమ కార్యకలాపాలు పరిమితంగా సాగించారు. భారతదేశంలో మత ప్రచారాన్ని ప్రభుత్వపరంగా చేయాలనే ప్రయత్నాన్ని 1793లోనే బ్రిటిష్ పార్లమెంట్ నిరాకరించింది. 1813 నాటికి దేశంలో క్రైస్తవ మత ప్రచారకులకు అధికారిక స్థానం కల్పిస్తూ బ్రిటిష్ పార్లమెంటు ఆమోదం తెలిపింది. అమానుషమైన హిందూ ఆచారాలు కొన్ని తొలగించాలని మిషనరీలు పట్టుబట్టారు. సతీ సహగమనం, అంటరానితనం యిందులో వున్నాయి. లార్డ్ విలియం బెంటింగ్ గవర్నర్ జనరల్‌గా సతీ సహగమనాన్ని నిషేధించడానికి భారతీయుల మద్దత్తు, సహకారం కోరాడు. రామమోహన్‌రాయ్ వంటివారు నిషేధాన్ని అనుకూలించారు. ఛాందస హిందువులు వ్యతిరేకించారు. కుల ప్రాతిపదికగా హిందువులలో వంశపారంపర్య ఆస్తి సంక్రమణ మొదలైన హక్కులు మతం మార్చుకున్న వారికి పోతాయి. ఇలా జరగరాదని 1832లో బెంగాల్ నిబంధన క్రింద శాసించారు. సనాతనులు ఎప్పటికప్పుడు తమ మత విషయంలో బ్రిటిష్ పరాయి పాలకులు జోక్యం చేసుకుంటున్నారంటూ అభ్యంతరపెడుతూనే వచ్చారు.

బ్రిటిష్ పాలకులు 1850లో చట్టం చేస్తూ మతాన్ని మార్చుకున్న వారితో సహా అందరికీ విద్యాసంస్థలలో నిధులు సమకూర్చుతామనీ, మతం మార్చుకున్న వారికి సైతం రక్షణ కల్పిస్తామన్నారు. అప్పుడే క్రైస్తవ మిషనరీలు విద్యాసంస్థల్ని బాగా ప్రారంభించాయి. సెక్యులర్ ధోరణిలో విద్య సాగాలని ప్రభుత్వం కోరింది. హిందూమతం ప్రమాదంలో వున్నదని సనాతనులు గోలపెట్టారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం విక్టోరియా రాణి చేసిన ప్రకటనలో క్రైస్తవ మతాన్ని బలవంతంగా రుద్దబోమన్నారు. మతంలో జోక్యం చేసుకోమన్నారు.

కాని 19వ శతాబ్దం మధ్యనుండే బ్రిటిష్ ప్రభుత్వం బిషప్పులను నియమించింది. మతపరంగా తటస్థంగా వుంటామన్న బ్రిటిష్‌వారు ఆ సూత్రాన్ని దాటేశారు. క్రైస్తవ మతంలోకి హిందువుల్ని మార్చడం కొనసాగింది. బిషప్పులు ఇందులో ప్రముఖపాత్ర వహించారు. ప్రభుత్వ అజమాయిషీ తమపై వుండరాదని బిషప్పులు, క్రైస్తవ మతాధిపతులు పట్టుబట్టారు. క్రమేణా ప్రభుత్వ పట్టు సడలగా, క్రైస్తవ మతసంస్థలు తమ మనుగడ సాగించాయి.

1927లో బ్రిటిష్ పార్లమెంటు చట్టరీత్యా ఇంగ్లండ్‌లో బిషప్పులను నియమించి ఇండియాకు పంపడాన్ని ఆపేసింది. మతంపై బ్రిటిష్ ప్రభుత్వం పెత్తనం వదిలేసి, ఇండియాలో కార్యకలాపాలకు స్వేచ్ఛనిచ్చింది. మతాధిపతులు చట్టరీత్యా స్వతంత్రులైనా బ్రిటిష్ ప్రభుత్వంతో సన్నిహితంగానే వుంటూ వచ్చారు. ఏదో రూపేణా ప్రభుత్వం నుండి దేవాలయాల నిర్వహణకు నిధులు లభిస్తుండేవి. ఇంగ్లండ్ చర్చికి ప్రభుత్వ ఆదరణ బాగానే వుండేది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత యీ పద్ధతి అంతమైంది. రోమన్ కాథలిక్, వెస్లీ, ప్రెస్బిటేరియన్, శాఖలకు యిలాంటి ప్రభుత్వ ఆదరణ లభించకపోయినా, వారికి విదేశీ సహాయం అందేది. భారతదేశంలో బ్రిటిష్‌వారి క్రైస్తవ మత విధానానికి 1948 మార్చి 31న స్వస్తి పలికారు. అంతవరకూ వున్న భారత క్రైస్తవ మత చట్టాన్ని రద్దుగావించారు. (The Indian Ecclesiastical Establishment Act)'

భారత రాజ్యాంగం ప్రకారం మతస్వేచ్ఛ అందరికీ వున్నది. మతాన్ని యధేచ్ఛగా అనుసరించవచ్చు, ఆచరించవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు. ప్రభుత్వం యీ విషయంలో కేవలం ప్రజారోగ్యం, నీతి, ప్రజా కట్టుదిట్టాల దృష్ట్యానే జోక్యం చేసుకోవచ్చు. ఆయా మత సంస్థలు తమ సంస్థల్ని కొనసాగించవచ్చు. ఆస్తుల్ని సంక్రమింపజేసుకోవచ్చు. చట్టానికి లోబడి తమ సంస్థల, ఆస్తుల పాలన సాగించడానికి రాజ్యాంగ రీత్యా మతపరమైన వారికి హక్కులు వచ్చాయి. ఇది ఆసరాగా తీసుకొని క్రైస్తవ మిషనరీలు తమ కార్యకలాపాలను దేశంలో సాగించారు. విద్యాసంస్థల్ని, ఆసుపత్రుల్ని పెట్టారు. అల్పసంఖ్యాకవర్గంగా క్రైస్తవులు కొన్ని ప్రత్యేక హక్కులు పొందారు. దేశంలోని కొన్ని ప్రాంతాలలో క్రైస్తవుల కార్యకలాపాల్ని సనాతన హిందువులు అభ్యంతరపెడుతూ వచ్చారు. ఇవి మతకలహాల వరకూ దారితీశాయి.

కేరళలో క్రైస్తవ విద్యాసంస్థలకు ప్రభుత్వ నిధులు భారీగా అందుతుండేవి. 1957లో నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడి, క్రైస్తవుల మతాధికారాల్ని తగ్గించే చట్టం తెచ్చారు. దీని ప్రకారం కొన్ని పరిస్థితులలో మత విద్యాసంస్థల యాజమాన్యాన్ని అవసరమనుకుంటే ప్రభుత్వం చేబట్టవచ్చు. సుప్రీంకోర్టు యిందుకు అభ్యంతరపెట్టింది. అయితే ఫీజుల వసూళ్ళు, ఉపాధ్యాయుల నియామకం, జీతాల చెల్లింపులో క్రమబద్ధత పాటించేటట్లు ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చని సుప్రీంకోర్టు పేర్కొన్నది. కేరళలో క్రైస్తవులు కమ్యూనిస్టు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళన తీవ్రతరం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కేరళలో క్రైస్తవుల ప్రవర్తన, దీనికి కాంగ్రెసు వారిచ్చిన మద్దత్తు వలన, సెక్యులరిజం అర్థం మారిపోయింది. మతం విజృంభించి తన పరిధిని విస్తరించింది.

1909లో బ్రిటిష్ పాలకులు ఇండియాలో మతస్తులకు ప్రత్యేక ఓటు హక్కు యిచ్చారు. దీని ప్రకారం క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులు తమ మతపరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకునే హక్కు వున్నది. శాసనసభలలో ఆ విధంగా మత ప్రాతినిధ్యం వుండేది. భారత రాజ్యాంగం రూపొందించిన తరువాత యీ పద్ధతికి స్వస్తి చెప్పారు. బ్రిటిష్ పాలకులు సెక్యులర్ వ్యతిరేక ధోరణిలో మతాన్ని ప్రోత్సహించగా, క్రైస్తవులు దీనిని ఆసరా చేసుకొని మతవ్యాప్తికి కృషి చేశారు.

భారత రాజ్యాంగం ప్రకారం మతపరంగా ఎలాంటి పన్నులను వసూలు చేయరాదు. కాని ప్రభుత్వపరంగా మత సంస్థలకు లభిస్తున్న సహాయం పరోక్షంగా పౌరులిచ్చే పన్నుల నుండే వస్తున్నది. సెక్యులర్ ధోరణులు దెబ్బతీయడానికి ప్రభుత్వ మతధోరణి బాగా తోడ్పడింది. రాధాకృష్ణన్, గాంధి ధోరణులు సెక్యులరిజాన్ని బాగా దెబ్బతీశాయి. నెహ్రూ రాజీపడ్డారు.

క్రైస్తవ మతస్తులు 1953లో నాగపూర్‌లో సమావేశమై మతపరమైన విషయాలన్నీ వ్యక్తుల స్వేచ్ఛకు వదలివేయాలన్నారు. క్రైస్తవ మతంలోకి పేదవారిని మార్చే పద్ధతుల్లు మత మిషనరీలు సాగిస్తూ పోయారు. ఇలా మతమార్పిడి చేస్తే హిందూ మతాచారాలు, ఆచార వ్యవహారాలు, భాష, వేషం, అన్నీ మారిపోతాయని గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. (హరిజన్ 1935 మే 11 క్రైస్తవ మిషనరీలు, దెయిర్ ప్లేస్ ఇన్ ఇండియా, 1941 నవజీవన్ ప్రెస్) మతమార్పిడి చట్టరీత్యా ఆపాలని కూడా గాంధి అన్నారు. (హరిజన్ 1935 మే 11) క్రైస్తవ బిషప్పులు యీ విషయమై హిందువుల ధోరణిని నిరసిస్తూ వచ్చారు. క్రైస్తవులుగా మారిన వారిని శుద్ధిచేసి తిరిగి హిందువులుగా మార్చడాన్ని కూడా గాంధి ఖండించారు.

మొత్తం మీద క్రైస్తవులు మతమార్పిడి ద్వారా తరచు మతకలహాలకు దారి చూపారు.

క్రైస్తవుల విమర్శల వలన భారతదేశంలో, ముఖ్యంగా 19వ శతాబ్దంలో బ్రహ్మసమాజ్ బాగా ప్రభావితమైంది. రామమోహన్‌రాయ్, కేశవ చంద్రసేన్ యిందుకు నిదర్శన. ఆర్యసమాజ్ క్రైస్తవ వ్యతిరేకత చూపించింది.

తర్జన భర్జనలు సాగాయి. పరిమితంగా చదువుల్లో క్రైస్తవ మత ప్రచార ప్రభావం కనిపించింది. పేదరికం క్రైస్తవమతవ్యాప్తికి బాగా తోడ్పడింది. వైద్యం, విద్య, ఆహారం అస్త్రాలుగా ప్రయోగించి, క్రైస్తవ మిషనరీలు మారుమూలల్లో పేదల్ని ఆకట్టుకున్నారు. హరిజనుల్లో మతమార్పిడి చాలా చోట్ల చేయగలిగారు. బలవంతమైన మైనారిటీ శక్తిగా క్రైస్తవులు దేశంలో తలెత్తారు. మతమార్పిడి విషయమై క్రైస్తవులు రాజీపడలేదు. అది తమ హక్కుగా వారు భావిస్తున్నారు. క్రైస్తవ మతం విదేశీయం కాదనేటంత వరకూ పోయారు.

జవహర్‌లాల్‌నెహ్రూ ప్రధానిగా క్రైస్తవమతం భారతదేశంలో ప్రాచీనమైనదని, ఇంగ్లండ్‌కు పోక ముందే భారతదేశానికి సిరియన్ క్రైస్తవులు వచ్చారన్నారు. (1955 డిసెంబరు 3 నెహ్రూ లోక్‌సభ ప్రసంగం)

విద్యాసంస్థలలో మతబోధన చేస్తున్న క్రైస్తవుల ధోరణి పట్ల హిందువులలో నిరసన వ్యక్తమైంది. మతం అని సూటిగా అనకుండా నీతి పేరిట బైబిల్‌లోని విషయాలు బోధించడం క్రైస్తవుల ఎత్తుగడ అయింది. మత ప్రచారం చేసుకునే స్వేచ్ఛ విషయమై ఎన్ని అవరోధాలు, చట్టపరిమితులు వున్నా, క్రైస్తవులు రాజీపడలేదు. బలవంతంగా మతమార్పిడి జరగరాదని రాజ్యాంగం చెబుతున్నా, ఆచరణలో యిది తేల్చడం కష్టమై పోయింది. రాజ్యాంగ నిర్మాతలలో

కె.ఎం. మున్షి, వల్లభాయి పటేల్ వంటి వారు మత స్వేచ్ఛను సమర్థించారు. అదొక వరంగా క్రైస్తవులు వాడుకుంటున్నారు.

మతం మార్చుకున్నప్పటికీ పౌరహక్కులు, ఆస్తిహక్కులు కోల్పోరని 1850లోనే బ్రిటిష్‌వారు శాసనం చేశారు.

కాని హిందూ ఆస్తి సంక్రమణ చట్టం అందుకు విరుద్ధంగా వుంది. మతమార్పిడిని నిరుత్సాహపరచాలని హిందూ వంశపారంపర్య చట్టం (1956) ఉద్దేశించారు. మతం మారితే విద్యాసంస్థలలో హరిజనులకు యిచ్చే ప్రభుత్వ సౌకర్యాలు వుండవని 1947లోనే బొంబాయి ప్రభుత్వం శాసనం చేసింది. ఇలాంటి ధోరణి యితర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మతపరంగా వచ్చిన యీ విచక్షణ సెక్యులర్ ధోరణులకు తీవ్ర ప్రతిబంధకమైంది. సమస్యను మనుషుల పరంగా చూడక, చట్టాలు చేసేటప్పుడు మతాన్ని దృష్టిలో పెట్టుకున్నారు. క్రైస్తవ మిషనరీల పట్ల ఒకవైపున సనాతన హిందువులు నిరసన వ్యక్తపరుస్తుంటే, ఉదారవాదులు వారి సేవల్ని ప్రస్తుతించారు. వారి విద్యావిధానాన్ని మెచ్చుకుంటూ తమ పిల్లల్ని మిషనరీ స్కూళ్ళకే పంపిస్తున్నారు. వారి "క్రమ శిక్షణ"ను తెగ పొగుడుతున్నారు.

స్వాతంత్ర్యానంతరం దేశంలో క్రైస్తవ మిషనరీలు విపరీతంగా పెరిగిపోయి 1952 నాటికే 4683 వరకూ వచ్చాయి. ఇందులో విదేశీయులు చాలా ఎక్కువగానే వుండేవారు. ఉత్తరోత్తరా వారి సంఖ్య తగ్గిపోగా, దేశీయులు ఆస్థానాల్లోకి వచ్చారు. క్రైస్తవుల చదువుల పట్ల మెప్పు వున్నా, మిగిలిన అన్ని విషయాల్లో వారి పట్ల దేశంలో చిన్నచూపు వున్నది. 1952 నుండీ క్రైస్తవ విదేశీ మిషనరీలకు వీసాలు యివ్వడం అదుపులోపెట్టారు. తీవ్రవాదులైన హిందూ సనాతనులు క్రైస్తవ వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతం చేశారు. రామరాజ్యపరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్, ఆర్యసమాజ్, హిందూ మహాసభ యిలాంటి కార్యకలాపాలు చేబట్టాయి. మధ్యప్రదేశ్‌లో, నాసిక్‌లో క్రైస్తవులకు వ్యతిరేకంగా హిందూ మహాసభ చేసిన ఆందోళన వలన 1954లో నియోగి సంఘాన్ని మధ్యప్రదేశ్ (పరగణాలు) ప్రభుత్వం నియమించాల్సి వచ్చింది.

క్రైస్తవులు మతమార్పిడి కార్యకలాపాలు ఎక్కువ చేసి అస్సాం నాగాలను, బీహార్ జార్కండ్‌లను, మధ్యప్రదేశ్‌లో ఆదివాసులను మార్చేస్తున్నారని హిందూ సంఘాలు ఫిర్యాదు చేశాయి. నియోగి సంఘం విచారణ జరిపింది. 1956లో (ఏప్రిల్ 18) యీ నివేదిక వెల్లడైంది. డా॥ ఎం.బి. నియోగి నాగపూర్ హైకోర్టునుండి రిటైర్ అయిన ప్రధానన్యాయమూర్తి, ఆరుగురు సభ్యులు కూడా యీ విచారణ సంఘంలో వున్నారు. ఇందులో ఎస్.కె. జార్జి అనే సిరియన్ క్రైస్తవుడు కూడా వున్నారు. విచారణ పట్ల కేథలిక్కులు అభ్యంతరం తెలిపారు.

విచారణ సంఘ నివేదికను బట్టి, మతమార్పిడి దేశ ఐక్యతను విచ్ఛిన్నపరచే ఉద్దేశంతో జరుగుతున్నది. ముస్లింలీగ్ వలె క్రైస్తవులు కూడా ప్రత్యేక రాష్ట్రాన్ని (దేశాన్ని) కోరవచ్చు.

మతమార్పిడి చేస్తున్న మిషనరీలను ఉపసంహరించాలి. విదేశీయులను అదుపులో పెట్టాలి. మతప్రచార స్వేచ్ఛను భారతీయులకే పరిమితం చేసేట్లు రాజ్యాంగ సవరణ చేయాలి. మత ప్రచారాన్ని పూర్తిగా తొలగించే శాసనం కూడా ఉత్తరోత్తరా చేయాలని నియోగి సంఘం కోరింది.

ప్రభుత్వ అనుమతి లేకుండా క్రైస్తవ మత ప్రచార గ్రంథాలు పంచనివ్వరాదన్నారు. విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే పూర్తిగా అట్టిపెట్టాలని, మతసంస్థల జోక్యం వుండరాదనీ అన్నారు. నియోగి సంఘ సిఫారసులను క్రైస్తవులు వ్యతిరేకించారు. హరే కృష్ణ మెహతాబ్, అల్లాడి కృష్ణస్వామి వంటివారు కూడా నియోగి సంఘ సిఫారసులను నిరసించారు. కాని సనాతన హిందూ మనస్తత్వాన్ని నియోగి సంఘ నివేదిక ప్రతిబింబించింది. సెక్యులర్ ధోరణులకు పచ్చి వ్యతిరేకతను చూపిన యీ నివేదికను అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చించారు.

## క్రైస్తవుల - కమ్యూనిస్టుల దోబూచులాట!

కమ్యూనిస్టులు - కేథలిక్కులు దేశంలో సెక్యులరిజంతో బాగా ఆడుకున్నారు. కేరళలో కేథలిక్కులు కమ్యూనిస్టుల్ని కోపు వేసుకోవడం బిషప్పులకు వింతగా తోచింది. అలాంటి కమూనిస్టు మద్దత్తుదారులను మతం నుండి వెలివేస్తామని బిషప్పులు బెదిరించారు. 1960లో కేరళలో కమ్యూనిస్టుల్ని బలపరచిన కేథలిక్కులను త్రివేండ్రం ఆర్చ్ బిషప్ వెలివేశారు. కమ్యూనిస్టుల్ని బాహాటంగా బలపరచినా, ఓటువేసినట్లు తెలిసినా అలాంటి కేథలిక్‌లు వెలికి గురయ్యారు. ఇది అన్యాయమని కమ్యూనిస్టులు భావించారు.

లోక్‌సభలో తరిమెల నాగిరెడ్డి కమ్యూనిస్టు సభ్యుడుగా బిల్లు ప్రవేశపెడుతూ రాజకీయాల్లోకి మతం చొచ్చుక రావడాన్ని ఆపాలన్నారు. కేథలిక్ చర్చిని రాజకీయ ప్రయోజనాలకు వాడడాన్ని ఆపాలని బిల్లు ఉద్దేశించారు.

కమ్యూనిస్టుల బిల్లు ఓడిపోయినా, ఆసక్తికరమైన చర్చ సాగింది. తమ ఆధ్యాత్మిక ధోరణికి వ్యతిరేకంగా వున్న రాజకీయ పార్టీకి ఓటువేయవద్దని చెప్పే అవకాశం కేథలిక్కులకు వున్నదని హోంమంత్రి బి.ఎన్. దాతార్ వాదించారు. ఇందుకు సుప్రీంకోర్టు తీర్పుల్ని ఉదహరించారు. సనాతన హిందువులు, కొందరు కాంగ్రెస్ వారు సైతం నాగిరెడ్డి బిల్లును సమర్థించారు. బిల్లు వీగి పోయిందనుకోండి.

లోక్‌సభలో మరో కమ్యూనిస్టు సభ్యుడు ఎస్.వి. పరులేకర్ ప్రవేశపెట్టిన తీర్మానం కూడా ఆమోదించలేదు. ప్రార్థనా ప్రదేశాలు, యాత్రాస్థలాలు రాజకీయ ప్రచారానికి వినియోగించరాదని యిందలి సారాంశం. 1961 ఫిబ్రవరిలో వచ్చిన యీ అనధికార తీర్మానాన్ని సభ తిరస్కరించింది. ఈ విధంగా సెక్యులర్ వ్యతిరేక ధోరణులు చట్టసభలలో అధికారపక్షం ప్రదర్శిస్తూనే వచ్చింది.

భారతదేశ విద్యావిధానంలో మతపరమైన చదువు చెప్పాలని మన ప్రథమ విద్యామంత్రి అబుల్‌కలాం ఆజాద్ అభిప్రాయపడ్డారు. ప్రధాని నెహ్రూ దీనిని వ్యతిరేకించారు. క్రైస్తవులు మతం

అనకుండా, తమ పాఠశాలల్లో నీతిపేరిట క్రైస్తవేతరులకు బైబిల్ చెప్పినట్లే, హిందువులు ఆధ్యాత్మిక విలువల పేరిట చెప్పాలని కొందరు పేర్కొన్నారు. సి. రాజగోపాలాచారి మాత్రం మతపరమైన విద్య వుండాలన్నారు. ఏదో ఒక విధంగా మత విద్య వుండాలన్న వారిలో జాన్‌మత్తై, ఎస్.ఆర్. దాస్ (భారత ప్రధాన న్యాయమూర్తి) రుక్మిణి అరుండేల్, డా॥ సంపూర్ణానంద్ మొదలైనవారున్నారు. విద్యాసంఘాలు, ముఖ్యంగా రాధాకృష్ణన్ సంఘ నివేదిక సైతం ఏదో ఒక రీతిలో అన్ని మతాల కలగాపులగపు చదువునే కోరింది. అన్ని మతాల ఐక్యతా సూత్రాలు చెప్పాలన్నారు. అయితే క్రైస్తవులు ఇందుకు అంగీకరించలేదు. అన్ని మతాలు ఒకటే అనే సూత్రం ఏ మతానికీ అంగీకారం కాదని గ్రహించాలి.

ఒక మతం చెప్పిందే ఇంకోమతం కూడా చెబితే ఇక మతమార్పిడి దేనికి? "మా మతం, మా దేవుడు, మా వ్యవస్థ గొప్పది" అనే సూత్రం, నమ్మకంపైనే మతప్రచారం సాగుతుంది. మతమార్పిడి కూడా అంతే. అన్ని మతాల సారాంశం ఒక్కటే అనడం రాజకీయాల్లో వేదికలపై ఉపన్యాసాలకు పనికిరావచ్చు. మతకలహాల అనంతరం యిలాంటి ఉపన్యాసాలు తరచు చేస్తుంటారు. కాని మత నాయకులు, ముల్లాలు, పూజారులు, ఫాదరీలు ఎవరూ అన్ని మతాలు ఒకటే అనే సూత్రం అంగీకరించరు. గాంధి తన జీవితాంతం యీ సూత్రాన్ని ప్రచారం చేశారు. బేసిక్ విద్యలో సైతం యీ సూత్రమే ప్రతిపాదించారు. అయితే కొన్ని క్రైస్తవ పాఠశాలల్లో సాధారణ ప్రార్థనలకు అంగీకరించారు. ఇది ఎదురీత వద్దనుకొని చేసిన పనిమాత్రమే నీతిబోధన తరగతులకు తప్పనిసరిగా రానక్కరలేదని క్రైస్తవ విద్యాసంస్థలు పేర్కొన్నాయి. క్రైస్తవ విద్యాసంస్థలలో క్రైస్తవేతర ప్రార్థనలు వుండకపోయినా తప్పులేదని కలకత్తా హైకోర్టు తీర్పు చెప్పింది. (1957 ఎ.ఐ.ఆర్. కలకత్తా పుట 524)

దేశంలో క్రైస్తవులు విద్యారంగంలో తీవ్ర కృషి చేశారు, చేస్తున్నారు. 'వారి క్రమశిక్షణపై' జనానికి, ముఖ్యంగా మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు సదభిప్రాయం వున్నది. ప్రాథమిక, నర్సరీ స్థాయి నుండే కాన్వెంట్ విద్యకు పిల్లల్ని పంపడం విలాసమై పోయింది. ప్రతిష్ఠతో కూడిన విద్యగా కాన్వెంట్ చదువులు వున్నాయి. క్రైస్తవులను అనుకరిస్తూ గ్రామాలలో, నగరాలలో విపరీతంగా కాన్వెంట్లు తలెత్తాయి. కేరళలో విద్యారంగంలో అక్షరాస్యతలో అగ్రస్థానంలోవున్న క్రైస్తవులు, నాగాలాండ్ వంటి కొండ ప్రాంతాల్లో తమ విద్యావిధానంతో జనాన్ని ఆకట్టుకున్నారు. కాలానుగుణంగా క్రైస్తవులు మారి, దేశీయభాషలలో మతబోధ చేయడం కూడా 'వారి మత లౌక్యానికి, ఎత్తుగడకూ, పట్టుదలకూ సూచనలే. అవసరమైతే హిందూ ఆచార వ్యవహారాలతో రాజీపడి కట్టుబొట్టు పాటిస్తూనే, మతప్రచారం సాగిస్తున్నారు.

క్రైస్తవులలో మతం మినహాయిస్తే మిగిలిన హిందూ దోషాలన్నీ అంటుకునే వున్నాయి. ముఖ్యంగా కులాన్ని, అంటరానితనాన్ని పాటించడం ఘోరం. వారి దేవాలయాలలో సైతం ఉన్నత కులాలు, అంటరానివారని వేరుగా కూర్చున్న సందర్భాలున్నాయి. కులాంతర వివాహాలు

చేసుకోవడంలేదు. ఎన్నికలలో తమకులం అభ్యర్థికి ఓట్లువేయడం క్రైస్తవులలో వున్న జాడ్యమే. మతం మారినప్పటికీ సెక్యులర్ విలువలు రాకపోవడానికి యీ కారణాలన్నీ వున్నవి. సిద్ధాంతరీత్యా, మతం మారినవారికి కులం వుండరాదు. ఆ దృష్టితోనే మతం మారిన హరిజనులు ప్రభుత్వం యిచ్చే సౌకర్యాలకు అనర్హులన్నారు. క్రైస్తవ హరిజనుల్ని హిందూ హరిజనులతో సమానంగా చూడడంలేదు. ఆందోళనల ఫలితంగా వీరిని "ఇతర వెనుకబడిన తరగతులు"గా పరిగణిస్తున్నారు.

భారతదేశంలో పాశ్చాత్యీకరణ, మానవ విలువలు, వ్యక్తి స్వేచ్ఛ వ్యాపించడానికి క్రైస్తవుల విద్య చాలావరకూ ఉపకరించింది. కాని మతపరంగా వ్యవస్థలు, కులాలు, ప్రచారాలు, మతమార్పిడి సెక్యులరిజానికి అడ్డుగా నిలిచాయి. క్రైస్తవుల ప్రాబల్యం దేశంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం. మతకలహాలు కూడా క్రైస్తవుల పరంగా వున్నవి తక్కువే. దేశంలోని జనాభాలో వీరిశాతం 3 మాత్రమే. కాని మతపరంగా సమస్యలు పరిష్కారం కావాలని క్రైస్తవులు కోరుకున్నంతకాలం కలహాలు తప్పవు. అందరికీ ఒకే చట్టం వుండాలని అంగీకరిస్తేనే సెక్యులరిజం వస్తుంది. అందరూ చట్టం ముందు సమానం అని అంగీకరించక, క్రైస్తవులుగా తాము ప్రత్యేక చట్టాన్ని కోరుకుంటామన్నప్పుడే చిక్కువస్తుంది. అందుకే పునర్వికాస ఉద్యమానికి పరోక్షంగా తోడ్పడిన క్రైస్తవులు, ప్రత్యక్షంగా అడ్డుపడుతున్నారు!

***- హేతువాది, ఫిబ్రవరి 1990***

## పునర్వికాస పరిణామం

# పునర్వికాసానికి సిక్కుల అవరోధం

భారతదేశంలో సిక్కులకు 500 సంవత్సరాల చరిత్ర వున్నది. గురునానక్ స్థాపించిన సిక్కుల మతం అటు హిందువుల, ఇటు ముస్లింల ఆచార సంప్రదాయాల సమ్మిళితంగా వచ్చింది. గురు పరంపర సంప్రదాయాన్ని పాటించే సిక్కులకు అర్జున్ వ్రాసిన ఆదిగ్రంథం ప్రమాణంగా వున్నది. గురుముఖ లిపిని పవిత్రంగా సిక్కులు పరిగణిస్తారు. సిక్కులు క్రమేణా వీరోచిత జాతిగా పరిణమించారు. ప్రత్యేక దుస్తులు ధరించడం, కృపాణం ధరించడం, జుట్టు పెంచడం వారి ప్రత్యేకత. సిక్కులు హిందువులలో భాగమేనని గాంధీజీ భావించినా, తరువాత అభిప్రాయం మార్చుకున్నారు. ముస్లింలకు పాకిస్తాన్ ఏర్పడినట్లే, తమకూ సిక్కిస్తాన్ కావాలని వారు బ్రిటిష్ వారిపై వత్తిడి తెచ్చారు. సిక్కులు ప్రత్యేక గురుద్వారాలు నిర్మించుకున్నారు. ఈ గురుద్వారాలకు విపరీతమైన ఆస్తులున్నవి. మహంతులనే పురోహితులకు వాటిపై అజమాయిషీ వున్నది. శిరోమణి గురుద్వార ప్రబంధక సంఘం యీ గురుద్వార ఆస్తులపై అజమాయిషీ వహిస్తుంది. వంశపారంపర్యంగా వీటిని నిర్వహిస్తున్న పురోహితుల పెత్తనానికి 1925లో చట్టపరంగా బ్రిటిష్‌వారు స్వస్తి పలికారు. ఐదేళ్ళకో పర్యాయం ఎన్నికలద్వారా సిక్కులు ఎన్నుకునే

సంఘానికి మతసంస్థలపై పెత్తనం ఏర్పడింది. ఈ సంఘానికి వున్న పెత్తనం దృష్ట్యా సిక్కులలో కలహాలు సంభవిస్తున్నాయి.

1920 డిసెంబరు 14న శిరోమణి అకాలీదళ్ ఏర్పడింది. అప్పటి నుంచీ సిక్కులు మతాన్ని రాజకీయాల్లోకి తెచ్చారు. పంజాబ్‌లో సిక్కు జనాభా శాతం 13 మాత్రమే. అయినా శాసనసభలలో వీరికి జనాభాకు మించిన ప్రాతినిధ్యం లభిస్తూనే వున్నది. జాతీయోద్యమం ముమ్మరంగా సాగిపోతుండగా సిక్కులలో కొందరు ఉద్దాంసింగ్ నాగోకీ నాయకత్వాన దేశ స్వాతంత్ర్యానికి కృషిచేశారు. ఇందుకు భిన్నంగా జ్ఞాని కర్తార్‌సింగ్ ఆధ్వర్యాన సిక్కులు కాంగ్రెసును ప్రతిఘటించారు. 1942 క్విట్‌ఇండియా సందర్భంగా సిక్కుల చీలిక బయటపడింది. సిక్కిస్తాన్ కావాలనే ధోరణి వెల్లడైంది. సిక్కులు పాంథిక్ పార్టీని ఏర్పరచి, కాంగ్రెసును వ్యతిరేకించారు. (1946) వల్లభాయి పటేల్ వంటివారు సిక్కుల ప్రత్యేక సిక్కిస్తాన్ కోర్కెను తీవ్రంగా వ్యతిరేకించారు. దేశ స్వాతంత్ర్యం నాటికి పాకిస్తాన్ చీలినా, సిక్కుల కోర్కె తీరలేదు.

సిక్కిస్తాన్ కావాలంటూ స్వాతంత్ర్యానంతరం మాస్టర్ తారాసింగ్ ఆందోళనకు పూనుకున్నారు. 1949లో ఆయన్ను నిర్బంధించారు. అఖిలభారత అకాలీ మహాసభ 1951 మార్చిలో లూధియానోలో జరిపారు. సెక్యులర్ ప్రజాస్వామ్యం కావాలంటూనే సిక్కులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని సర్దార్ హుకుంసింగ్ నాయకత్వాన తీర్మానించారు.

సిక్కులలో కాంగ్రెసు, కమ్యూనిస్టు, అకాలీ పార్టీలకు చెందినవారున్నారు. అందరూ గురుద్వారాలపై పెత్తనం చలాయించే ప్రబంధక సంఘ ఎన్నికలలో తలపడుతూ వచ్చారు. మాస్టర్ తారాసింగ్ 1954లో యీ సంఘాధిపతిగా ఎన్నికయ్యారు. సిక్కుల మతం-రాజకీయాలు విడదీయరానివని ఆయన చాటారు. కాంగ్రెసును వ్యతిరేకిస్తూ సిక్కులకు ప్రత్యేక రాష్ట్రం కావాలన్నారు. హిందువులు పంజాబులో సిక్కులను అంతం చేయదలచారన్నారు. అలాంటి తారాసింగ్ రెండేళ్ళలో మాట మార్చి కాంగ్రెస్‌లో విలీనం అయ్యారు! (1956 అక్టోబరు 2) మతపరంగా సిక్కుల ఆసక్తిని కాపాడుతూనే, రాజకీయంగా కాంగ్రెస్‌లో వుండాలన్నారు.

ప్రబంధక సంఘ ఎన్నికలలో మాస్టర్ తారాసింగ్ 1958లో ఓడిపోయారు. ఆ తరువాత ప్రబంధక సంఘంలో నామినేటెడ్ సభ్యులను నియమించడానికి, సిక్కులు కానివారిని ఓటర్లుగా చేర్చడానికి చట్టాన్ని 1959లో మార్చారు. ఆమరణ నిరాహారదీక్ష బూనిన తారాసింగ్‌ను శాంతింపజేయడానికి నెహ్రూ ఒక సంఘాన్ని నియమిస్తామన్నారు. పంజాబీ రాష్ట్రం కావాలని తారాసింగ్ నినదించారు. 1960 ఎన్నికలలో తారాసింగ్ ప్రబంధక సంఘంలో గెలిచారు. పంజాబీ సుబాకై ఆందోళన చేబట్టారు. అప్పుడే సంత్‌ఫతేసింగ్‌ను తారాసింగ్ రంగంలోకి దింపారు. తారాసింగ్‌కు వ్యతిరేకంగా మరోవర్గం బయలుదేరింది. రాజకీయ పార్టీలు శిరోమణి ప్రబంధక సంఘంలో వుండరాదని పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్‌సింగ్ కైరాన్ 1959లో సూచించారు.

1962 అక్టోబరులో జరిగిన ఎన్నికలలో తారాసింగ్ నెగ్గారు. అప్పటి నుండే చీలిపోయిన

సిక్కులు కలహాలకు దిగారు. హజారాసింగ్ గిల్‌వర్గం 1965లో సంత్‌ను అకాలీదళ్ నుండి బహిష్కరించింది. 1967లో అఖిల భారత సిక్కు కౌన్సిల్ ఉత్తమసింగ్ దుగ్గల్ నాయకత్వాన ఏర్పడింది.

1966లో పంజాబీసుబా ఏర్పడింది. మాస్టర్ తారాసింగ్ 1967 నవంబరు 22న చనిపోయారు. సర్దార్ గుర్నాంసింగ్ నాయకత్వాన పంజాబ్‌లో ఏర్పడిన అకాలీదళ్ మంత్రివర్గం అంతర్గత కలహాల వలన పడిపోయింది. చీలిపోయిన ముఠాలు 1968లో తాత్కాలికంగా కలిశాయి. అయినా చీలికలు ఆగలేదు. సర్దార్ గుర్నాంసింగ్ ఒక ముఠాకు, ప్రకాశ్‌సింగ్‌బాదల్ మరో ముఠాకు నాయకత్వం వహించారు. ఇలా చీలిపోయి, కలయికలు సాగిపోతుండగా, చండీఘడ్ నగరం పంజాబ్‌లో వుండాలంటూ సంత్‌ఫతేసింగ్ తాను అందుకై ఆత్మాహుతి గావిస్తానన్నాడు. 1972లో శిరోమణి అకాలీదళ్ అనే పార్టీ ఏర్పడింది. గుర్‌బక్ష్ సింగ్ దీనికి నాయకత్వం వహించాడు. సంత్‌ఫతేసింగ్ రాజకీయాలనుండి విరమిస్తానని, మళ్ళీ రంగప్రవేశం చేశారు. 1973లో జలంధర్‌లో మరో అకాలీదళ్ ముఠా ఏర్పడింది. ఈ విధంగా అకాలీదళ్ చీలికలు గందరగోళాన్ని సృష్టించాయి. రానురాను వీరి పోరాటంకాస్తా, తీవ్రవాద స్థాయికి పోయింది. కాంగ్రెసు పార్టీ కొన్నాళ్లు భింద్రన్‌వాలా అతివాద నాయకత్వాన్ని బలపరచింది. అప్పుడు జైల్‌సింగ్ హోంమంత్రిగా వున్నారు. సిక్కులలో ఒక వర్గం తీవ్ర నిర్ణయం తీసుకొని సిక్కులకు ఖలిస్తాన్ కావాలన్నది. కొందరు సిక్కులు ఇందుకు అంగీకరించలేదు. ఖలిస్తాన్ కోరినవారు భయానక వాతావరణం సృష్టించ ప్రారంభించారు. విదేశాలలో శిక్షణ పొందడం, ఆయుధాలు సేకరించడం తీవ్రస్థాయిలో జరిగింది. శత్రు సంహారం చేపట్టారు. ప్రధాని ఇందిరాగాంధి హయాంలో పంజాబ్‌లో పరిస్థితి చేయిదాటిపోయింది. అతివాదులు గురుద్వారాలను, అమృత్‌సర్‌లోని స్వర్ణమందిర ప్రాంగణాన్ని ఆక్రమించారు. వారిపై సైనికచర్య తీసుకున్నారు. సిక్కులు అనేకులు చనిపోయారు. ఇది తీవ్ర నిరసనకు గురైంది. ప్రధాని ఇందిరాగాంధి భద్రతా సిబ్బందిలో వున్న సిక్కులు ఆమెను కాల్చి చంపారు. ఢిల్లీలోనూ, ఇతరచోట్లా సిక్కులను విచక్షణారహితంగా చంపేశారు. ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ సంఘటన సిక్కులలో చాలామందిని కాంగ్రెస్‌కు, హిందువులకు దూరం చేసింది. విచారణ సంఘాలను నియమించినా ఉపశమనం జరగలేదు.

1989లో జరిగిన సాధారణ ఎన్నికలలో సిక్కులు కొందరు పంజాబ్ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. రాష్ట్రపతి పాలనలో వున్న పంజాబ్‌లో అతివాదుల చర్యల్ని అదుపులో పెట్టలేకపోయారు. వి.పి.సింగ్ ప్రధానిగా పంజాబ్ వెళ్ళి సిక్కుల సమస్య శాంతియుతంగా పరిష్కరిస్తామన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా వున్నంతకాలం సిక్కులు శాంతం వహించలేదు.

మతాన్ని-రాజకీయాలను కలిపేసిన సిక్కుల సమస్య జటిలమైనదే. పునర్వికాసానికి, సెక్యులరిజానికి సిక్కుల ధోరణి ఆటంకమే.

*- హేతువాది, మార్చి 1990*

# పునర్వికాస పరిణామం
# హిందువులు మళ్ళీ పునర్వికాసం ఆరంభించాలి

భారతదేశంలో హిందువులు అత్యధిక సంఖ్యలో వున్నారు. ముస్లింలు అల్పసంఖ్యాకులు. క్రైస్తవులు మరీ తక్కువ. సిక్కులు ఒక రాష్ట్రంలో అధికంగా వున్నారు. బౌద్ధులు, పార్సీలు కూడా అల్పంగానే వున్నారు. అల్పసంఖ్యాకులు భయపడడం, తమ సంస్కృతిని, మనుగడను కాపాడుకోవాలనుకోవడం సహజం. కాని అటువంటి ధోరణి అధికసంఖ్యాకులైన హిందువులు కనబరుస్తున్నారు. ముఖ్యంగా కొన్ని సంఘాలు హిందువుల సంఘటన పేరిట తరచు ఆందోళనలు చేస్తున్నవి. ముస్లింలను, క్రైస్తవులను, సిక్కులను చూపి రెచ్చగొడుతున్నారు. సంకుచిత భావాలతో ప్రజల్ని ఆవేశపరుస్తున్నారు. మతకలహాలు అప్పుడప్పుడూ సంభవిస్తున్నవి. మతద్వేషాలు నిరంతరం ప్రబలుతున్నవి.

బ్రిటిష్‌వారి పాలనలో, చీలించి పాలించే ఎత్తుగడలు కూడా, హిందూ-ముస్లిం ద్వేషాలకు బాగా దోహదం చేశాయి. క్రైస్తవులుగా మార్చడంలో బ్రిటిష్‌వారి మద్దత్తు లభించడం వలన అక్కడక్కడ క్రైస్తవ-హిందూ ద్వేషాలు ప్రబలాయి.

కాంగ్రెసు పార్టీ ఏర్పడిన నాటికే దేశంలో ఆర్యసమాజ్ ప్రబలి వుంది. కాంగ్రెస్‌లో అతివాదవర్గం మతపరంగా హిందువులను పురికొల్పింది. రాజకీయాల్లోకి మతభావాలు ప్రవేశపెట్టిన బాలగంగాధర్‌తిలక్ గణేష్ ఉత్సవాలను, శివాజి పేరిట హిందువుల ఐక్యతను కోరాడు. రాజకీయాల్లో అదొక శాపంగా పరిణమించింది. హిందూ-ముస్లిం ద్వేషాలు పెచ్చరిల్లాయి.

కాంగ్రెస్‌లోని అతివాదులు బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా హింసను ప్రోత్సహించినారు. జాతీయవాదాన్ని, వందేమాతరం పేరిట హింసాత్మకతను కలిపేశారు. తిలక్, అరవిందో, లజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్ యిందులో ప్రముఖపాత్ర వహించారు. ముస్లింలు కాంగ్రెసు పార్టీ ద్వారా తాము పోరాడలేమనుకున్నారు. ముస్లింల సంరక్షణ జరగదనుకున్నారు. అతివాదుల మతనినాదాలు వారిని భయభ్రాంతులను చేశాయి. కాంగ్రెస్‌కు దూరమై ముస్లీంలీగ్ పెట్టుకున్నారు. జాతీయోద్యమంలో అంటీ అంటనట్లే వున్నారు. కొద్దిమంది జాతీయ ముస్లిం నాయకులు కాంగ్రెస్ ఉద్యమాల్లో పాల్గొన్నా, అత్యధిక ముస్లింలు వేరుగానే వుంటూ వచ్చారు. 20వ శతాబ్దం మొదటి భాగంలో హిందూ సంఘటన సంస్థలు వెలిశాయి.

## హిందూ మహాసభ

లాంఛనంగా హిందూ మహాసభ 1907 నాటికే ఏర్పడినా, అంతగా వ్యవస్థీకరణ చెందలేదు. ఆర్యసమాజ్ వారి శుద్ధి ఉద్యమాన్ని బలపరచిన హిందూ మహాసభ తొలుత బలంగాలేదు. తిలక్ శిష్యుడుగా బయలుదేరిన సావర్కార్ హిందూ మహాసభలో ప్రముఖ

నాయకుడుగా ఆవిర్భవించాడు. ముస్లింలుగా మారిన హిందువులను మళ్ళీ శుద్ధిచేసి హిందువులుగా మార్చడానికి వీరు కృషి చేశారు. ముస్లింలలో యిందుకు నిరసన, ప్రతిఘటన వచ్చింది.

కాంగ్రెసు మహాసభలు జరుగుతుండగా 1923లో బెల్గాంవద్ద హిందూ మహాసభ కూడా పెద్ద సమావేశం జరిపింది. ముస్లిం నాయకులతో సహా హిందూ ప్రముఖులు యిందులో పాల్గొని జాతీయోద్యమానికి మద్దతు ప్రకటించారు. హిందూ మహాసభ నాయకుడుగా ఆవిర్భవించిన వీరసావర్కార్ వ్రాసిన "హిందూత్వం" వారికి ప్రమాణ గ్రంథంగా మారింది. హిందువుల సంఘటన ప్రధాన నినాదమైంది. కాంగ్రెస్‌కూ హిందూ మహాసభకూ అట్టేకాలం వియ్యం కుదరలేదు. 1930 తరువాత యిరువురూ ఎవరిదారిన వారు పోయారు. ఎన్నికలలో కాంగ్రెస్‌కు పోటీగా హిందూ మహాసభ అభ్యర్థులను పెట్టింది. సావర్కార్ కొత్త నిర్వచనం ఇస్తూ, భరతభూమి తనదని భావించే ప్రతివారు హిందువేనని, యీ గడ్డపై పుట్టినవారంతా హిందువులని ప్రవచించాడు. హిందువులలో ముస్లింలు కలియరని, వారిని అనుమానాస్పదంగా చూడాలని సావర్కార్ అన్నారు. హిందూ మహాసభ అధ్యక్షుడుగా వున్న సావర్కార్ తన తీవ్ర ఉపన్యాసాలతో ముస్లింలను యింకా దూరం చేశాడు. హిందువులలో మాత్రం ఆయన అనుకున్నట్లుగా సంఘటన తీసుకరాలేకపోయాడు. హిందూ మహాసభ రాజకీయాలతో ఏనాడూ బలాన్ని పొందలేకపోయింది. సావర్కార్ హిందూ మహాసభను హిందువులు సొంతం చేసుకోలేదు.

హిందూమహాసభ సావర్కార్ నాయకత్వాన కొన్ని సంస్కరణలకు మద్దత్తు ప్రకటించింది. అందులో హరిజనుల దేవాలయ ప్రవేశం ఒకటి. అంటరానితనం పోవాలన్నది.

స్వాతంత్ర్యం వచ్చాక, హిందూ మహాసభ అఖండ భారత్ నినాదాన్ని చేపట్టినది. పాకిస్తాన్-ఇండియా కలసిపోవాలని కోరారు. ఇందుకు అవసరమైతే యుద్ధం చేస్తామన్నారు. గోవధ నిషేధించాలన్నారు. శుద్ధి ఉద్యమం సాగిపోవాలన్నారు. హిందూ వివాహచట్టం తొలగించాలన్నారు. నిర్బంధ సైనిక శిక్షణ కావాలన్నారు. సావర్కార్ నినాదాన్ని పదేపదే ప్రచారం చేశారు. "రాజకీయాలు హైందవం కావాలి. హిందూమతం సైనిక ధోరణిలో సాగాలి" హిందూ సోషలిజం కావాలని హిందూమహాసభ నినదించింది. సావర్కార్, వి.జి. దేశపాండే, ఎన్.సి. చటర్జీ మొదలైన హిందూ మహాసభ నాయకులు హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకించారు. భారతదేశంలో పునర్వికాసాన్ని అడుగడుగునా వీరు అడ్డుకొన్నారు. రాజకీయాలలో, ప్రతి ఎన్నికలలో హిందూ మహాసభ ఓటమిని చూచింది. అయినా వారు తమ ఫాసిస్టు ధోరణి విడనాడలేదు. రాజకీయాలలో నామమాత్రంగా నిలిచిన హిందూ మహాసభ సంస్కరణలకు అడ్డొస్తూ పునర్వికాసాన్ని ముందుకు సాగకుండా చేసింది.

## రామరాజ్య పరిషత్

హిందూమహాసభవలెగాక రామరాజ్య పరిషత్ ఇంకా సనాతనంగా భారతదేశంలో

తలెత్తింది. ఇది ప్రాంతీయ ప్రభావంతోనే రాజకీయాలలో పాల్గొన్నది. సెక్యులరిజాన్ని అడుగడుగునా వ్యతిరేకించిన రామరాజ్య పరిషత్ ఎన్నికలలో పాల్గొన్నది. ఏనాడూ ఎక్కడా బలం సంపాదించలేని రామరాజ్య పరిషత్ ప్రజల నిరాదరణకు గురైంది. రాజస్తాన్‌లో స్థానిక భూస్వాముల ప్రాపకంతో యీ పరిషత్ తలెత్తుకొని వున్నది. కులవృత్తులను వంశపారంపర్యతను సమర్థించే పరిషత్ కాంగ్రెసు తలపెట్టిన సంస్కరణలను నిరసించింది.

1949 ఏప్రిల్‌లో ఏర్పడిన రామరాజ్య పరిషత్ 1952 ఎన్నికలలో పాల్గొన్నది. ఉత్తరాది రాష్ట్రాలలో పరిషత్తుకు కేవలం 21 లక్షల ఓట్లు మాత్రమే వచ్చాయి. స్వామి కారపత్రి, స్వామి స్వరూపానంద సరస్వతి, నందనాల్‌శర్మవంటి వారి నాయకత్వం పరిషత్‌కు లభించినా, ప్రజల మద్దతు సంపాదించలేకపోయారు. సెక్యులరిజాన్ని పాశ్చాత్య ప్రజాస్వామిక భావాలను పరిషత్ వ్యతిరేకించింది. క్రమేణ ఎన్నికలలో పాల్గొనడం కూడా మానేశారు.

## రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్. ఎస్. ఎస్.)

1925లో ఆర్.ఎస్.ఎస్. కేవలం కొద్దిమంది మిత్రులతో డా॥ ఇశావ్ బలరాం హెడ్గేవర్ ఆధ్వర్యాన ఏర్పడింది. అనాథ బాలుడుగా హెడ్గేవర్ 1916 నుండి కాంగ్రెస్‌లో పనిచేశారు. హిందూ-ముస్లిం కలహాలు చూచి, హిందువులు సంఘటితపడాలని ఆయన ఒక నిర్ణయానికి వచ్చి, ఆర్.ఎస్.ఎస్. స్థాపించారు. ఆయనతోపాటే పెరిగిన యీ సంస్థ హెడ్గేవర్ చనిపోయే నాటికి (1940 జూన్ 21) లక్షమంది సభ్యులతో దేశంలో వ్యాపించింది. హిందూ-ముస్లిం కలహాలు సంభవించినపుడు ఆర్.ఎస్.ఎస్. ప్రముఖపాత్ర వహించింది. కలహాలలో గాయపడిన హిందువులకు సేవలు చేసింది. హిందువులలో ముఖ్యంగా సనాతనులలో ముస్లిం వ్యతిరేకత ప్రబలడానికి, హిందూ ఐక్యత కావాలనడానికి ఆర్.ఎస్.ఎస్. తోడ్పడింది.

హెడ్గేవర్ నాయకత్వాన ఆర్.ఎస్.ఎస్. హిందువులను సంఘటితపరచడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నది. ఇదొక సాంస్కృతిక సంస్థ అని, రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టపరచారు. హిందు సమాజాన్ని మళ్ళీ సజీవంగా పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హిందు యువకులను సమీకరించి, ఉదయమే కసరత్తు చేయడం, హైందవ వీరోచిత ప్రసంగాలు వినిపించడం, స్వచ్ఛంద సేవకులుగా మలచడం వీరి నిత్యకృత్యాలు. రాజకీయంగా తొలుత హిందు మహాసభను బలపరచారు. ఆర్.ఎస్.ఎస్.లో హెడ్గేవర్ అత్యున్నతాధిపతి. ఆయన్ను సర్ సంఘ సంచాలకుడనేవారు.

హెడ్గేవర్ వారసుడుగా ఎం.ఆర్. గోల్వాల్కర్ సర్ సంఘ సంచాలకుడయ్యారు (1940). నాగపూర్ యీ సంస్థ కేంద్రం. వీరి సంస్థల్లో కార్యకలాపాలు రహస్యంగా సాగుతాయి. బహిరంగంగా సంఘ లక్ష్యాలు, ఆశయాలు తొలుత ప్రకటించలేదు. ఎన్నికలు కూడా ప్రజాస్వామికంగా జరిగినట్లు ఆధారాలు లేవు. గోల్వాల్కర్ నాయకత్వాన ఆర్.ఎస్.ఎస్. బాగా

తీవ్రస్థాయిని సంతరించుకున్నది. ఇదొక ఫాసిస్టు లక్షణంగా కాంగ్రెస్‌కు, ఇతర పార్టీలకు అనిపించింది.

గాంధీజీని నాథూరాంగోడ్సే 1948 జనవరి 30న ఢిల్లీలో కాల్చి చంపిన తరువాత, ఆర్.ఎస్.ఎస్.ను ప్రభుత్వం నిషేధించింది. గోల్వాల్కర్‌ను అనేకమంది ఆర్.ఎస్.ఎస్. వారిని నిర్బంధించారు. చట్టవ్యతిరేక సంస్థగా ఆర్.ఎస్.ఎస్.ను పేర్కొన్నారు. తమపై నిషేధం తొలగించమని ఆర్.ఎస్.ఎస్. డిసెంబరు (1948)లో సత్యాగ్రహం చేసింది. ఆర్.ఎస్.ఎస్. లక్ష్యాలను లిఖితపూర్వకంగా తొలిసారి ప్రకటించారు. 1949 జులై 8న నిషేధం తొలగించారు. రాజకీయాల్లోకి ప్రత్యక్షంగా రావడానికి గోల్వాల్కర్ నిరాకరించారు. నెహ్రూ మంత్రిమండలిలో వున్న డా॥ శ్యాంప్రసాద్ ముఖర్జీని ఒప్పించి, ఒక హిందూ సంస్థను రాజకీయపరంగా స్థాపించడానికి పూనుకొన్నారు. వసంతరావు ఓక్ ఇందులో ప్రధానబాధ్యత స్వీకరించారు. ఆర్.ఎస్.ఎస్. లోపాయికారిగా మద్దతు యిచ్చే అంగీకారంతో జనసంఘ్ పార్టీ ఏర్పడింది.

1948లో ఆర్.ఎస్.ఎస్.ను నిషేధించిన తరువాత ఎత్తుగడల రీత్యా గోల్వాల్కర్ అనేక ప్రకటనలు చేసినా, మూల లక్ష్యం నుండి మారలేదు. హిందువులను సంఘటిత పరచడం, ముస్లిం వ్యతిరేకత, సెక్యులర్ వ్యతిరేకత స్పష్టంగా బయటపెట్టారు. జనసంఘ్‌తోనూ, తరువాత భారతీయ జనతాపార్టీగా మారిన రాజకీయ పక్షంతోనూ ఆర్.ఎస్.ఎస్. సన్నిహితంగా వున్నది. ఈ విషయమై తరచు వివాదం తలెత్తింది. 1978లో కేంద్రంలో జనతాపార్టీ అధికారంలోకి వచ్చినపుడు బి.జె.పి. ద్వంద్వ సభ్యత్వంపై గొడవ చెలరేగింది. ఇందిరాగాంధి ఎమర్జన్సీ ప్రవేశపెట్టినప్పుడు ఆర్.ఎస్.ఎస్. ప్రతిఘటించింది. కొందరు నిర్బంధానికి గురైనారు. గోల్వాల్కర్ వారసుడుగా సర్ సంఘ్ సంచాలకుడుగా దేవరజ్ వచ్చారు. జనసంఘ్, భారతీయ జనతా పార్టీలలో చాలామంది ప్రముఖులు ఆర్.ఎస్.ఎస్. నుండి వచ్చిన వారున్నారు. గోల్వాల్కర్ అభిప్రాయాలు అధ్యయనం చేసే ఆర్.ఎస్.ఎస్. వారు హిందు సంఘటన విషయమై ఫాసిస్టు ధోరణి అవలంభించారు. హిందువులతో సమానంగా ముస్లింలకు, క్రైస్తవులకు సమాన హక్కులివ్వడం ఆర్.ఎస్.ఎస్.కు యిష్టం లేదు. దేశంలో పునర్వికాసానికి ఆర్.ఎస్.ఎస్. ప్రధాన అడ్డంకిగా నిలిచింది. మానవ హక్కులను, సమానత్వాన్ని హర్షించలేని యీ సంస్థ సంకుచిత సంస్కృతిని సమర్థిస్తున్నది. 20వ శతాబ్దం నుండి 21వ శతాబ్దంలోకి పోవాల్సిన దేశాన్ని, వెనక్కు నడిపించాలని ఆర్.ఎస్.ఎస్. ప్రయత్నిస్తున్నది. అధిక సంఖ్యాకులైన హిందువులకు అప్పుడు ముస్లింలను, క్రైస్తవులను బూచిగా చూపి, కరడుగట్టిన సిద్ధాంతాలను యింకా ఆర్.ఎస్.ఎస్. నూరిపోస్తున్నది. ఈ సంస్థ అభిప్రాయాలను యధాతథంగా కాకున్నా, సడలించిన ధోరణిలో భారతీయ జనతా పార్టీలో ప్రతిబింబిస్తున్నాయి.

అంటరానితనాన్ని, కులాన్ని కాదంటున్న బి.జె.పి. హిందూ సంస్కృతే భారతీయ సంస్కృతి అంటున్నది. రాజకీయాలలో చురుకుగా వుండదలచిన యీ పార్టీ కొంత పట్టు విడుపులతో

వ్యవహరిస్తున్నది. మొత్తంమీద ఏదొక నెపంతో ముస్లిం, క్రైస్తవ, శిక్కు, వ్యతిరేకతలు ఈ పార్టీ కనబరుస్తున్నది. గోవధ నిషేధం, హిందూ కోడ్ బిల్లు వంటి సమస్యలలో వీరికీ ఆర్.ఎస్.ఎస్.కూ తేడాలేదు. ప్రజల ప్రధాన సమస్యల్ని పక్కదారి పట్టించే రీతిలో మత విషయాలకు అధిక ప్రాధాన్యత యిస్తుంటారు. రామజన్మభూమి, బాబ్రీ మసీదు వివాదాలు ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. మతద్వేషాలు రెచ్చగొట్టి తద్వారా ఓట్లు ఆకర్షించాలనే ధోరణి వున్నంతవరకూ పునర్వికాసానికి చోటులేదు. మతం వ్యక్తి గత విశ్వాసంగా భావించి, వీధుల్లోకి నమ్మకాలను తీసుకురానంతవరకూ ఫరవాలేదు. బి.జె.పి. అలాంటి ధోరణి అవలంభించడం లేదు. ముస్లింలు అంతకన్నా సెక్యులర్ వ్యతిరేక ధోరణిలో పయనిస్తున్నారు. ఎవరి మతాన్ని వారు బలప్రదర్శనకు, ఓట్ల ఆకర్షణకు సంఘటితం, క్రమశిక్షణ, ఐక్యత, సంస్కృతి పేరిట వాడినంతవరకూ మానవహక్కులు అమలు జరగవు.

ప్రొఫెసర్ బలరాజ్ మధోక్, డా॥ శ్యాంప్రసాద్ ముఖర్జి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అద్వాని, వాజ్‌పేయి మొదలగు నాయకులు వివిధ దశలలో జనసంఘ్‌ను, భారతీయ జనతాపార్టీని ముందుకు నడిపించారు. వీరు పేర్కొనే భారతీయ సంస్కృతి అంటే హిందూ సంస్కృతి మాత్రమే. పాకిస్తాన్‌తో ఇండియాకు యుద్ధం సంభవించినప్పుడు, బంగ్లాదేశ్ విమోచనకు భారత్ సహాయపడినప్పుడు బి.జె.పి. ప్రభుత్వాన్ని సమర్థించింది. ప్రధాని ఇందిరాగాంధీని భారతమాతగా వాజ్‌పేయి శ్లాఘించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జనసంఘ్ నాయకుడుగా గాంధీజీని జాతిపిత అనడాన్ని ఖండించారు. (1961) జవహర్‌లాల్ నెహ్రూ సెక్యులర్ పద్ధతులను జనసంఘ్ తీవ్రంగా ఖండించింది. ఉత్తరోత్తరా భారతీయ జనసంఘ్ తన పంథాను మార్చుకొని గాంధీజీని మహాత్ముడని గుర్తించింది. సతీ సహగమనాన్ని పూరీ శంకరాచార్య సమర్థిస్తే బి.జె.పి. ఆయన్ను ఖండించింది. ఎటొచ్చీ ముస్లింల సమస్య వచ్చినప్పుడే బి.జె.పి. తన నిజస్వరూపాన్ని చూపుతున్నది. సెక్యులరిజం పేరిట ముస్లింలను దువ్వుతున్నారనేది బి.జె.పి. విమర్శలో సారాంశం. భారతీయ జనతాపార్టీ ఎన్నికలలో పాల్గొంటూ అనేక ఒడిదుడుకులకు లోనైంది. 1978లో కేంద్రంలో అధికారానికి వచ్చిన వారిలో బి.జె.పి. కూడా వున్నది. మళ్ళీ 1989లో బి.జె.పి. కేంద్రంలో ఏర్పడిన జాతీయ ఫ్రంట్ ప్రభుత్వాన్ని సమర్థించింది. క్రమేణా కొన్ని రాష్ట్రాలలో బి.జె.పి. బలం అధికమైంది. పంజాబులో సిక్కుల సమస్య, కాశ్మీర్‌లో ముస్లింల వివాదం, ఒకే పౌరసత్వం వంటి సమస్యలు పరిష్కరించవలసి వచ్చినప్పుడు బి.జె.పి. సనాతన మతతత్త్వం బయటపెట్టవచ్చుననే ఆందోళన వున్నది. దేశంలో పునర్వికాసం రాకుండా బి.జె.పి. అడ్డుపడుతుందనే సూచనలు వున్నవి.

దేశంలో అత్యధిక సంఖ్యలో వున్న హిందువుల పక్షాన పార్టీలు ఏర్పడడం, వారిని రెచ్చగొట్టడం, వారి సంస్కృతిని కాపాడే పేరిట యితర మతస్తులపట్ల ద్వేషాన్ని ప్రబలించడం ఇత్యాదులన్నీ ఫాసిస్టు-నాజీ లక్షణాలే. కర్మ పునర్జన్మ వంటి మౌలిక దోషాలతో వెనుకబడి వున్న హిందువులు అంటరానితనం, కులం, మానవుల హెచ్చుతగ్గులనే భావాలతో మానసికంగా

ఇతరత్రా కుంగిపోయారు. పవిత్ర గ్రంథాల ప్రమాణంగా ఆచరిస్తున్న యీ భావాలను పోగొట్టుకోవాలి! హిందువులలో పునర్వికాసానికి రామమోహన్‌రాయ్, డిరోజియోలు 19వ శతాబ్దంలో నాంది పలికారు. రానురాను అవి వెనుకంజవేసి, మతమౌఢ్యం పెరిగింది. అందుకే ప్రపంచంలో ఇతరులతో బాటు ముందుకుపోలేకపోతున్నారు. ఇందుకు కృషి జరగాలి. వెనుకటి స్వర్ణయుగం అనుకుంటూ, రామరాజ్యం అనే భ్రమపూరిత నినాదాలతో ప్రజల్ని కొంతకాలం మభ్యపెట్టారు. శాస్త్రీయ పంథాలో, మానవవిలువలతో ముందుకు సాగాలంటే, గతం నుండి వస్తున్న దోషాల్ని, భారాన్ని తొలగించుకోవాలి. రాజ్యాంగానికి అడ్డొస్తున్న వాటిని దూరంగా పెట్టాలి. ముఖ్యంగా మతాన్ని వ్యక్తిపరంగా వుంచి, వీధుల్లో ప్రదర్శించనివ్వకుండా సాగాలి. ప్రజల్ని వెనుకబడినతనంలో అట్టిపెట్టి వారి ఓట్లతో ముందుకుపోదామనే పార్టీలు, సంస్థలు వ్యక్తులు పునర్వికాసానికి పెద్ద అవరోధం అని గ్రహించాలి. ఈ అడ్డంకి తొలగించుకోవడంలోనే విజ్ఞత వున్నది.

***- హేతువాది, మే 1990***

# అరవిందాశ్రమంలో ఆధ్యాత్మిక వ్యాపారం!?

అరవిందుడు తత్వవేత్తగా గొప్పవాడా, మర్మయోగిగా నిలబడతాడా, రాజకీయాల్లో ఆధ్యాత్మిక అతివాదిగా పేరు తెచ్చుకున్నాడా అనేది ప్రస్తుత సమస్య కాదు. భారతదేశం నుండి పారిపోయి, ఫ్రెంచివారి అధీనంలో వున్న పాండిచేరిలో దాక్కున్న అరవిందుడు అక్కడ ఏం చేశాడనేదీ ప్రస్తుతాంశం కాదు. అరవిందుడు భార్యతో కాపురం చేయలేదెందుకని అడిగే హక్కు మనకులేదు. ఫ్రాన్సులో వివాహిత అయి, పిల్లలున్న మరొక ఫ్రెంచి స్త్రీతో కలసి పాండిచేరిలో వున్నాడనటంలో మంచిచెడ్డలు వెతకటం యిప్పుడు సందర్భం అనిపించుకోదు. అదిగాక, ఆధ్యాత్మిక లోకపు విలువలు వేరు గదా! వాటిని మన సామాన్యుల విలువలతో కొలిస్తే మనమే చులకన అవుతాం.

## ఫ్రెంచి స్త్రీతో కలసి . . .

కాగా, అరవిందుడు ఉత్తరోత్తరా 'మాత'గా పిలువబడిన ఫ్రెంచి స్త్రీతో కలసి పాండిచేరిలో ఆశ్రమం పెట్టారు. దేశంలో యెక్కడ యెవరు ఆశ్రమం పెట్టినా జనం చేరతారు. మరి ఇంగ్లండులో చదువుకొని, అతివాద రాజకీయాలలో కొన్నాళ్ళున్న అరవిందుడు ఆశ్రమం పెట్టాడంటే, దానికి బహుళ ప్రచారం రావటంలో ఆశ్చర్యం లేదు. ఆశ్రమం అంటే సంప్రదాయబద్ధమైన ఆశ్రమం కాదు. పాండిచేరి సముద్రపు ఒడ్డున అధునాతన భవనాల సముదాయమే ఈ ఆశ్రమం. అరవిందుడు చనిపోయాడని ప్రచారంచేసి కొంతకాలం భక్తుల్ని నమ్మించారు. ఆ తరువాత మాతగా ఆశ్రమంపై ఆధ్వర్యం వహించిన ఫ్రెంచి స్త్రీ చనిపోయిందని ప్రచారం చేశారు. భక్తులు అప్పుడూ నమ్మారు, ఇప్పుడూ నమ్మారు.

నేను అడిగితే, వారిరువురూ అందరివలె మరణించలేదు. వేరే వున్నత కార్యాలపై మరొక స్థాయిలో వున్నారంటారు. కాదనే వారెవరయినా వుంటే ఎట్లా కాదో నిరూపించండి!

అట్లాంటి అరవిందాశ్రమానికి రెండు పర్యాయాలు వెళ్ళి రెండు వారాల పాటు వుండటం, వివిధ చర్యల్ని తిలకించటం, 'మాత'ను చూడటం, ఇంకా అనేక మందిని కలుసుకొని ఇంటర్వ్యూ చేయటం ఈ రచయిత స్వానుభవం కనుక చూసిందీ, విన్నదీ, తెలుసుకున్నదీ చెప్పాలని ఈ వ్యాసరచన చేస్తున్నాను.

అరవిందుడికి ఎందుకోగాని అంతంత మాత్రపువాళ్ళు భక్తులు కాలేదు. అంటే డబ్బులేనివారు. సామాన్యులు, చదువురానివారు, ఇట్లాంటివారు సాయిబాబాకో, జిల్లెళ్ళమూడి అమ్మకో, తిరుపతి వెంకటేశ్వరుడికో భక్తులయితే కావచ్చుగాని, అరవిందుడికి మాత్రం కాదు. పొరపాటున యెవరైనా అట్లాంటి వారుంటే సహవాసదోషం అయివుండాలి. తెలియక అయివుండాలంతే!

## అకడమిక్ అవినీతి :

మేం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి అరవిందాశ్రమానికి ఒక ముఠాగా బయలుదేరి వెళ్ళాం. కొందరు ఎం.ఏ. చదువుతున్నవారు, ఫిలాసఫీ శాఖాధిపతి డా॥ మధుసూదనరెడ్డి అరవిందుని అనుచరులు. సర్వసాధారణంగా డిపార్ట్మెంటు హెడ్ ఏ అభిప్రాయాలు కలిగివుంటారో వాటి ప్రభావం ఆ శాఖలో పనిచేసే వారిపైనా, వారి ఆధ్వర్యంలో చదివేవారిపైనా వుంటుంది. శాఖాధిపతి చలవ వుంటే యెందుకైనా మంచిదని గదా! ఇది ఈ ఒక్కశాఖకే పరిమితం కాదు. ఇంచుమించు అన్ని చోట్ల యీ ధోరణి చాలవరకు వుంటుంది. సరే, అదొక కథ. అట్లా వుంచండి. డా॥ మధుసూదనరెడ్డిగారి పిల్లలు అరవిందాశ్రమంలో చదువుకుంటున్నారు. ఇంకా వారి బంధువులెందరో అక్కడ వున్నారు. కనుక వారికి యెలాగూ అక్కడికి వెళ్ళిరావటం తప్పదు. వారి ప్రభావంతో మరికొందరు బయలుదేరారు. ఎట్లాగూ వెడుతున్నాం గదా, యేదయినా గిట్టుబాటు వుంటే, యెందుకు సద్వినియోగం చేసుకోగూడదని భావించారు. కనుక దక్షిణ భారత విద్యాసంబంధమైన యాత్ర అని నామకరణం చేశారు. దాని ఫలితంగా యూనివర్శిటీ అనుమతి, రైల్వే కన్సెషన్ లభించింది. మరి పాండిచేరి ఆశ్రమానికి అంటే యీ సౌకర్యాలన్నీ లభించవు గదా? ఎలాగు అయితేనేమి మద్రాసు మీదుగా పాండిచేరి చేరుకున్నాం. ఇదంతా ఎకడమిక్ కరప్షన్ అంటే అనండి.

## దర్శనం ఫార్స్ :

మేం ఆశ్రమానికి వెళ్ళిన సందర్భంగా, మాతను ఆమె గదిలో, మూడో అంతస్తులో దర్శించటానికి మధుసూదనరెడ్డి గారు యేర్పాట్లు చేశారు. మాత వద్దకు పోబొయ్యే ముందు మాకు కొంత బోధ చేశారు. ఎవరు ఎట్లా నడచుకోవాలి, ఏం చేయాలి అనేదే అందలి సారాంశం.

ప్రతివారూ మాతవద్ద మోకరిల్లి, ప్రణమిల్లాలి, మాతను ప్రశ్నలు అడగరాదు. మాత యిచ్చే పుష్పం స్వీకరించాలి. మాత చూసినంతసేపూ ఆమె కళ్ళలోకే చూడాలి. కళ్ళ ద్వారా ఆమె తన శక్తిని ప్రసరింపజేస్తుంది. నిశ్శబ్దంగా వుండాలి ఇత్యాదులన్నీ చెప్పాడు.

దర్శనానికి పెద్ద క్యూ వున్నది. భక్తుల్లో తగిన మానసిక వాతావరణం ఏర్పరచే నిమిత్తం కొన్ని చిట్కాలు ప్రయోగించారు. ఒక్కొక్క గదిలో కొంచెంసేపు ఆపి, కూర్చోబెట్టి, ఎవరో ఒకరు వచ్చి అరవిందులు - మాత ఆయా గదులలో ఎట్లా గడిపారో వివరించేవారు ఇట్లా దర్శనానికి ముందు ఒకగంటసేపు సస్పెన్స్ వాతావరణం సృష్టించారు.

## కృత్రిమ వాతావరణం :

తీరా మాత గదిలో ప్రవేశించి చూద్దుంగదా, కురువృద్ధురాలు వణకుతున్నది. మాటలో స్పష్టత లేదు. పక్క ట్రేలో కొన్ని పూలు పెట్టారు. రంగు రంగుల కలాలు వుంచారు. వెళ్ళినవారు ఒకరి తరువాత ఒకరు తొడుగులు ధరించిన ఆమె పాదాలను స్పృశించారు. దండం పెట్టారు. కళ్ళలోకి చూశారు. ఇచ్చిన పుష్పం స్వీకరించారు. కాని మా ముఠాలో ఆమెపైన నమ్మకం లేనివారూ, పాదాలు తాకటం యిష్టంలేనివారూ, నటించటం చేతకాని వారూ వున్నారు. ఏమి చేయాలో తోచని సందిగ్ధావస్థలో పడ్డారు వారు. ఇటు చూస్తే శాఖాధిపతి అనుగ్రహం పోతుందేమో! అటు అయిష్టమైన ఆచారాలు, అట్లాంటప్పుడు వారికి ధైర్యం చెప్పి నన్నునుసరించమన్నాను. దగ్గరకు వెళ్ళి పెద్దలకు పెట్టినట్లే నమస్కరించాం. ఆమె ప్రతి నమస్కారం చెయ్యలేదు. కళ్ళలోకి చూసే తతంగం చేయలేదు. నాతో పాటున్న కొందరు అదే విధంగా బ్రతుకు జీవుడా అని బయటపడ్డారు. మాతోపాటు వచ్చిన వారిలో మధుసూదనరెడ్డి గారి అన్న మాత్రం మాత కాళ్ళు పట్టుకుని వలవల ఏడ్చాడు. మాకు నవ్వొచ్చింది. బలవంతంగా ఆపుకున్నాం. మొత్తం మీద కృత్రిమంగానూ అసహ్యంగానూ వున్న ఆ వాతావరణం నుండి బయటపడ్డాం.

## పేరుకు అన్నీ అంతర్జాతీయాలే :

ఇక ఆశ్రమం, అందలి విశేషాలు తిలకించటానికి పూనుకున్నాం. ముందుగా అంతర్జాతీయ స్కూలు పేరిట వున్న సంస్థకు వెళ్ళాం. జుగల్ దా అనే ఒకాయన ఉపన్యాసం ఏర్పాటుచేశారు మా కోసం. ఆయన మాట్లాడబోయి యెందుకో వెక్కివెక్కి ఏడ్చాడు. ఎందుకో తెలియదు. మళ్ళీ నవ్వు ఆగలేదు. అందులో కారణం తెలియకుండా మగాళ్ళు ఏడుస్తుంటే నవ్వురాదా మరి! మాత జ్ఞాపకానికి వచ్చింది ఏడ్చానన్నాడాయన! అదొక ఫార్సు అనిపించింది. స్కూలంతా తిరిగి చూశాం. అది సంపన్నుల పిల్లలకే తప్ప మరెవరికి అందుబాటులో లేని స్కూలు. దాన్నెవరూ గుర్తించలేదు. అక్కడ చదువు ముగిసిన తరువాత ఏమి చెయ్యాలో వారికే తెలియదు. పైగా చదువులో చెప్పుకోదగిన విశేషాలు, ఇతర చోట్ల లేనివి, అక్కడేమీలేవు. నెలకు విద్యార్థి ఒక్కొక్కరూ

రు. 150లు ఫీజు చెల్లించాలి. మొత్తం 700ల మంది విద్యార్థులుంటే అర్హత వున్నా లేకున్నా 200ల మంది ప్రొఫెసర్లున్నారు;

ఆశ్రమంలో నళినీకాంత గుప్త అని మరొకరున్నారు. కొందరు వారికి అతిగౌరవం యిస్తున్నారు. మరికొందరు పాదస్పర్శ చేస్తున్నారు. ఏమిటి విశేషం అని విచారించగా, మాత అనంతరం ఆయనే సీనియర్ అని తెలిసింది. అంటే రంగం సిద్ధం చేసే వుంచారన్నమాట అనుకొన్నాం.

ఆశ్రమంలో అంతా డబ్బుతో కూడిన వ్యవహారమే. అక్కడికి వచ్చిన వారు అక్కడే భోజనం చెయ్యాలన్నారు. మాలో కొందరు ఆ భోజనం చెయ్యలేకపోయారు. మమ్మల్ని అక్కడే భోజనం చేయమన్న మా ప్రొఫెసర్ మాత్రం స్వగృహంలో విందారగించారు. విద్యార్థులు మాత్రం తరువాత ఊళ్ళోకి వెళ్ళి హోటల్లో తినవలసివచ్చింది. కాని అక్కడ మరో విశేషం జరిగింది. వూళ్ళోవాళ్ళు మమ్మల్ని చూచి, వెక్కిరిస్తూ మాట్లాడారు. ఆశ్రమానికి వచ్చారా అని వెటకారంగా అన్నారు. తీరా విచారిస్తే, ఊళ్ళోవారికి ఆశ్రమం అంటే చాలా ఆగ్రహం వున్నదని, ఆశ్రమానికి స్థానికులకు షష్టాష్టకం అని తేలింది. మేము వారం రోజులుంటే ఆశ్రమంలో తమిళవాసన ఎక్కడా కనిపించలేదు. బెంగాలీలు, గుజరాతీలు, కొంత ఫ్రెంచి ప్రభావం మాత్రం గోచరించింది.

## అంతా వ్యాపారమయం :

అరవిందాశ్రమం కొన్ని వ్యాపారసంస్థల్ని నడుపుతున్నది. వాటిలో కొన్నిటిని సందర్శించాం. అక్కడ పనిచేసేవారిని కలసి మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకొని ఆశ్చర్యపోయాం. భక్తులు ప్రచారం చేసేదానికి, వాస్తవానికీ గల అఖాతం అర్థమైంది.

ఆశ్రమంలో జింక్ షీట్లు తయారుచేసే పరిశ్రమ మొదలు-ప్రింటింగ్ ప్రెస్ వరకూ అనేక వ్యాపారాలున్నవి. వారిలో కొందరు వడ్రంగులను, మెకానిక్‌లను, ప్రెస్ కార్మికులను ఇంటర్వ్యూ చేశాం. బయట యిచ్చే వేతనాల కంటె యిక్కడ తక్కువ యిస్తున్నారని తెలిసింది. 1956లోనే ఆశ్రమంలో కార్మికులు సమ్మెచేశారని చెప్పారు. దీన్ని బట్టి ఆధ్యాత్మికత పేరిట ఎన్ని ఘోరాలు జరుగుతున్నాయో అనుభవించినవారు చెబితేగాని అర్థంకాదు. ఈ విధంగా ఆశ్రమంలో పనిచేస్తున్నవారికి అక్కడ జరిగే పనులపై గౌరవం గాని, వ్యక్తులపై అభిమానం గాని లేదంటే ఆశ్రమ పెద్దలలో తీవ్రలోపం వున్నదన్న మాటే. ఇన్ని దశాబ్దాలు గడిచినా స్థానికుల అభిమానం చూరగొనలేదంటే రోజురోజుకూ ఆ లోపం పెరుగుతున్నదన్నమాట. అందుకే హిందీ వ్యతిరేకోద్యమ సందర్భంగానూ, అరవిందుని పేరిట కేంద్ర విశ్వవిద్యాలయం అక్కడ స్థాపించాలన్నపుడూ స్థానికులు వ్యతిరేకించారు. ఆశ్రమంపై దండెత్తారు కూడా.

విద్యార్థినీ విద్యార్థులను కొందరిని కలిసి మాట్లాడాం. వారికి మాత అన్నా ఆశ్రమం అన్నా చాలా చులకనభావం వున్నదని అర్థమైంది. తల్లిదండ్రులు భక్తులు గావటంలో వారు తప్పనిసరిగా

అక్కడ వుండాల్సి వచ్చిందన్నారు. భవిష్యత్తులేని ఆ విద్యావిధానమంటే వారికి భయందోళనలే మిగిలాయి. క్రమశిక్షణ పేరిట నిత్యమూ అరవిందమాత భజన, ధ్యానం చేయించే విద్యావిధానమది.

జీవితంలో ఎక్కడో అనుకున్నది సాధించలేనివారు, జీవితమంటే విసుగెత్తినవారు, రిటైరైనవారు చాలమంది అక్కడకు వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అయితే వీరంతా బాగా డబ్బున్నవారే. ఆశ్రమంలో అలగాజనానికి, డబ్బులేనివారికి చోటులేదు. అదొక ఖరీదయిన, వింతైన ఆశ్రమం. డబ్బిస్తే యిక్కడ అన్నీ లభిస్తాయి.

## డబ్బిస్తే కోతి దిగి వస్తుంది :

కొంత డబ్బు ముట్టజెపితే, పుట్టిన పిల్లలకు పేర్లు పెట్టడం, ఫొటోలపై మాత సంతకం చేయటం, దీవెనలు పంపటం యిత్యాదులెన్నో జరుగుతవి. డబ్బు పంపకుండా దీవెనలు అడిగితే ఉత్తరానికి జవాబురాదు. ఇది స్నేహితుల అనుభవం స్వయంగా చూచినది.

రెండో పర్యాయం వెళ్ళినప్పుడు మాత ధర్మదర్శనం మేడపై నుండే యిచ్చింది. క్రింద వీధిలో భక్తులు నిలబడ్డారు. పైన ఫొటోలు తీశారు, ఫిలిం తీశారు. ఈ తంతు అయిన తరువాత సముద్రస్నానం చేయాలట. అక్కడ బీచ్‌లో కొంచెం దూరం వెళ్ళగా బెస్తవారున్నారు. తమ స్థలాల్ని ఆశ్రమం వారు కాజేసి తమను నిరాశ్రయుల్ని చేసిన ఉదంతాన్ని వారు చెప్పారు. మొత్తంమీద ఊళ్ళో ఎక్కడికెళ్ళినా ఆశ్రమాన్ని గురించి దారుణంగా మాట్లాడారు. ఆశ్రమంలో తమిళేతరులు మాత్రం మాత మరణించిందని ప్రచారం చేశారు. 1973 నవంబరు 17న, 94 ఏళ్ళకు ఆమె మరణించింది. ఎప్పటి పాటే పాడారు. ఆమె చనిపోలేదట. ఇంకా పెద్ద పనులేవో చేయటానికి అరవిందుని సన్నిధికి వెళ్ళినదన్నారు. ఏమైనా ఆశ్రమంలో పస అంతటితో తగ్గింది. కాగా అదొక భారీ పరిశ్రమ గనుక నడుస్తున్నది.

ఈలోగా అంతర్జాతీయ నగరం పేరిట ఆరోవిల్ అనే సిటీ నిర్మిస్తున్నారు. దాని వలన స్థానికులు చాలామంది నివాసాల్ని కోల్పోతున్నారన్న విషయం అట్లా వుంచండి అది విలాసపురుషుల భోగలాలసత్వానికి పనికొచ్చే ఇంద్రజాల నగరంవలె పథకం వేశారు గాని మరేమీ కాదు. మన సమాజంలో ఇమిడే నగరం కాదది.

## భక్తుల ప్రభావం :

అరవిందాశ్రమాన్ని గురించి ప్రచారం చేయటానికి అక్కడక్కడా పలుకుబడిగల, డబ్బున్న భక్తులున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొదలుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు వీరు వ్యాపించివున్నారు. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ వీరు నిత్యమూ ఆశ్రమ భజన యితరులచే చేయిస్తుంటారు. ఏదో పేరిట డబ్బు వసూలు చేస్తారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో హ్యూమన్ స్టడీస్ అనే పేరిట నడుస్తున్న వ్యవహారమంతా అరవిందుని భజనే. ఫిలాసఫీ సిలబస్‌లో అంతా అరవిందుని మయం చేశారు. విద్యార్థుల్ని అట్లా పరోక్షంగా, ఏమీ ఎరగనట్లు వశం చేసుకోవటం ఒక కళ.

ఏతా వాతా చెప్పొచ్చేదేమంటే, యీ ఖరీదైన విలాసపు ఆధ్యాత్మికత మన సమాజానికి అక్కరకు రానిదనే. సామాన్యులకు ఏ మాత్రం తోడ్పడని యిలాంటి ఆశ్రమాలు సమాజానికి చీడపురుగుల వంటివి. సమాజపు సంపదను అనుభవిస్తున్న యీ ఆశ్రమాలు కొత్తరకపు స్మగ్లర్స్ మాత్రమే.

*- హేతువాది, సెప్టెంబరు 1992*

# ఏది సెక్యులరిజం? ఎలా అమలుపరచడం?

సెక్యులరిజం చిక్కుల్లో పడింది. భక్తి బలప్రదర్శనకు దిగింది. రాజకీయ పార్టీలు ప్రజల్ని నలుచుకు తింటున్నాయి. అయోధ్యలో మసీదు - రామమందిర్ తగాదావలన, సెక్యులరిజం అంటే ఏమిటో నిర్దుష్టంగా తేల్చుకోవలసిన స్థితి వచ్చింది.

సెక్యులరిజంపై దాడిచేస్తున్న భారతీయ జనతాపార్టీ దేశంలో సెక్యులరిజం గురించి చర్చ జరగాలంటున్నది.

సెక్యులర్ శక్తులన్నీ ఏకం కావాలని ప్రధాని పి.వి. నరసింహారావు పిలుపు యిచ్చారు.

ఏది సెక్యులరిజం అంటే అన్ని మతాల్ని సమాన గౌరవంగా చూడడం అని రాధాకృష్ణన్ చెప్పిన భాష్యాన్ని వల్లెవేస్తున్నారు. ఆ పేరిట ఎవరిమతాన్ని వారు ప్రోత్సహిస్తూ, అధికారంలో వున్నవారు తమ వ్యక్తిగత నమ్మకాల్ని జనంపై రుద్దేస్తున్నారు.

ప్రధానిగావున్న పి.వి. నరసింహారావు హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కళ్యాణమండపానికీ వచ్చిన సాయిబాబా కాళ్ళకు మొక్కాడు. నాలుగేళ్ళపాటు దేశాన్ని సుభిక్షంగా వుంచమని (తన పదవీకాలం) పి.వి. కోరుకున్నాడు. రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ పుట్టపర్తి వెళ్ళి సాయిబాబా కాళ్ళకు వందనం చేశాడు.

ప్రజలు ఎన్నుకున్న పదవులలో వున్నవారు ప్రజలు తమకిచ్చిన సార్వభౌమత్వాధికారాన్ని ఇతరుల పాదాల వద్ద తాకట్టుపెట్టారు. ఇది ప్రజలకు అవమానం. ఇది సెక్యులర్ వ్యతిరేకం. అలాంటి వాళ్ళు సెక్యులర్ శక్తులు ఏకం కావాలంటే, పదవులు నిలబెట్టుకోడానికి ఎత్తుగడ మాత్రమే అవుతుంది.

సెక్యులరిజం అంటే ఏమిటి? మానవవాదులు, హేతువాదులు మొదటి నుంచీ యీ విషయమై స్పష్టంగానే చెబుతూ వచ్చారు.

సెక్యులరిజం అంటే అన్ని మతాలకు ప్రభుత్వం దూరంగా వుండటమే. మతాన్ని వ్యక్తిగత విశ్వాసంగా పరిగణించి, ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రసారాలను మతానికి వినియోగించకుండా వుండటమే సెక్యులరిజం. అంటే ఎవరు ఏ మతానికి చెందినా, చట్టం ముందు సమానమే. దీనికి అనుగుణంగానే రాజ్యాంగంలో ఆదేశసూత్రాలలో యూనిఫారమ్ సివిల్‌కోడ్ కావాలన్నాం.

నేరాలు చేసిన వారిని మతాతీతంగా ఒకే తీరులో శిక్షిస్తున్నట్లే, పౌరస్మృతి కూడా మతరహితంగా వుండాలి. సెక్యులరిజంలో మతానికి స్థానం లేదు. ప్రభుత్వం మతాన్ని పట్టించుకోరాదు. ఇది చాలా ముఖ్యం. ప్రభుత్వంలో వున్నవారు ఇందు నిమిత్తం చేయాల్సిన పనులు కొన్ని వున్నాయి.

మత ఉత్సవాలకు, పండుగ పబ్బాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించరాదు. పండుగ చేసుకోదలచిన వ్యక్తులు సెలవులు పెట్టుకోవాలి.

మత ఊరేగింపులు, మేళాలు, సమావేశాలు అన్నీ శాంతిభద్రతల సమస్యగానే ప్రభుత్వం పరిగణించాలి.

అధికారంలో వున్న వారెవరూ తమ అధికారాన్ని వినియోగించి మతపరమైన వాటిలో పాల్గొనరాదు. వాహనాలు వాడరాదు. పర్యటనలు చేయరాదు. రేడియో, టి.వి.లలో ప్రసారాలు మతపరంగా జరపరాదు. అలాంటప్పుడు ప్రజలలో అసూయ ద్వేషం పెచ్చరిల్లదు.

మతపరమైన ఆస్తులకు ఆదాయంపన్ను వుండాలి. బాబాలు, ఆశ్రమాలకు మినహాయింపులు వుండరాదు. అలాగే విద్యాసంస్థలలో మతపరమైన బోధనలు వుండరాదు. మతపరమైన యాజమాన్య గుర్తింపు వుండరాదు. మతాన్ని పాఠశాలల్లో శాస్త్రీయంగా పాఠాల్లో చెప్పవచ్చుగాని బోధనగా, ప్రచారంగా కాదు.

ప్రభుత్వ కార్యాలయాల్లో, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లలో మతపరమైన ఆరాధనలు, ప్రచారాలు, చందాలు వసూలుచేయుట నిలిపివేయాలి.

మసీదులు, దేవాలయాలలో మైకులుపెట్టి, పిల్లల చదువులకు అవరోధంగా శబ్దకాలుష్యం జరపడం అనుమతించరాదు.

రాజకీయవాదులు ఇన్నాళ్ళుగా మౌల్వీలను, బాబాలను ప్రోత్సహిస్తూ తమ అవసరాలకు వాడుకున్నారు. సాయిబాబా, కంచి ఆచార్య, పూరిశంకరాచార్య, ధీరేంద్ర బ్రహ్మచారి, చంద్రస్వామి, ఇలాంటి వారంతా ఆ బాపతే. ఆ పనులు మానాలి.

రోడ్డు మీద ట్రాఫిక్‌కు అడ్డమొచ్చే తీరులో మత మందిరాలు నిర్మించడాన్ని అనుమతించరాదు.

ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు మతపరంగా చేయడం ప్రభుత్వ యంత్రాంగానికి తగదు.

సెక్యులరిజాన్ని శాస్త్రీయంగా అమలుపరచడానికి గాను యూనిఫారమ్ సివిల్‌కోడ్ చట్టపరంగా తక్షణం తీసుకురావాలి.

*- హేతువాది, జనవరి 1993*

# దళితులకు సాంఘిక సమానత్వం కావాలి

దళితులకు ఓట్లు వున్నాయి. అవి రాజకీయ పార్టీలకు కావాలి. అన్ని పార్టీలు అనేక పథకాలు, ఆకర్షణలు వలగా వేసి దళితుల్ని ఆకర్షించడానికి యథాశక్తి పోటీ పడుతున్నాయి.

దళితుల మౌళిక సమస్యల్ని పరిష్కరించాలని ఏ రాజకీయ పార్టీ అనుకోవడంలేదు.

ఏమిటి ఆ మూల సమస్య?

అంటరానితనం, వూరికి దూరంగా, సంఘసేవలో మాత్రమే పనికివచ్చే వారుగా దళితుల్ని భారతదేశం ముద్రవేసింది. ఇది శతాబ్దాల చరిత్ర.

స్వాతంత్ర్య పోరాటంలో అంటరానితనం పోగొట్టే సమస్యను గాంధీ చేబట్టారు. మరో చేత్తో కులవ్యవస్థను సృష్టించి బలపరుస్తున్న గీతను చేతబూని ప్రార్థనలు చేశారు. ఆయన చిత్తశుద్ధిని అంబేద్కర్ ప్రశ్నించారు. ఈ విషయంలో అంబేద్కర్ వాదన సరైందని అన్పిస్తుంది.

మతంలో నుంచి పుట్టి పెరిగి వర్ధిల్లుతున్న కులం, అందులోనుంచి విషపుత్రికగా అవతరించిన అంటరానితనాన్ని అంబేద్కర్ చక్కగా వివరించారు. మూలసమస్య పరిష్కారం కావాలంటే మూలదోషాలనుంచి దళితులు బయటపడాలన్నారు. మతాన్ని ఎందరు సంస్కరించబోయినా విఫలంగావడానికి కారణం, మూలం జోలికిపోకపోవడమే.

రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అయినా అది పోలేదు. మాల, మాదిగ పేరిట దూషణలుగా శిక్షార్హం చేసిన చట్టాలువచ్చాయి. కాని దళితులు వూరికి దూరంగానే వున్నారు.

దళితులకు వున్న ఓటు హక్కును గుర్తించిన రాజకీయ పార్టీలు, దళితులలో దళారీలను ప్రోత్సహించాయి. ఎన్నికలనాడు ఓటు వేయించుకుంటే మళ్ళీ ఎన్నికలు వచ్చేవరకూ ఎన్నికైన ప్రతినిధిని రీకాల్ చేసే అవకాశం లేదని పార్టీలకు తెలుసు.

ఆర్థిక విషయాలకే ప్రాధాన్యత యిచ్చి రాజకీయ పార్టీలు ఆకర్షణలకు దిగాయి. ఇందుకు భాగంగానే భూములివ్వడం, ఇళ్ళ స్థలాలు కేటాయించడం, స్కాలర్‌షిప్‌లు, గుడులు, మందిరాలు నిర్మించడం, రిజర్వేషన్ల పేరిట ఉచ్చు పన్నడం అన్ని రాజకీయ పార్టీలు జాగ్రత్తగా ఆడుతున్న నాటకమే. దీనిలో ఇరుక్కున్న దళిత నాయకత్వం ఆయా రాజకీయ పార్టీలకు అమ్ముడుబోయి హాయిగా అనుభవించడం చూస్తూనే వున్నాం.

కాని దళితుల ప్రధాన సమస్య - అంటరానితనం అలాగే వుంది. అంబేద్కర్ సూచించిన మూలపరిష్కార మార్గం జోలికి పోతేనే యీ సమస్య పరిష్కారమై దళితులు మానవులుగా సమానహక్కులతో మనగలరు.

దళితుల్ని వుద్ధరిస్తామంటూ, మతసంఘాలు బయలుదేరి, హిందూమతం కాదని క్రైస్తవంలోకి మార్చడం మరో తంతు. దీనివలన సమస్య పరిష్కారం కాలేదు. పేదరికాన్ని మత వ్యాపారంగా సాగించడం దారుణం. ఒక మత దోషాన్ని మరో మత దోషం రూపుమాపలేదని రుజువైంది.

దళితులకు కావలసింది మత మార్పిడి కాదు. మానవహక్కులు, వైజ్ఞానిక విద్య కాని యిన్నాళ్ళుగా దళితుల్ని కర్మవాదంతో వారి గతి అంతేనని మతం అట్టిపెట్టింది. దీనికి మార్గాంతరంగా ఆర్థికసమస్య తీరిపోతే దళితులు మామూలుగా అందరితో సమానమౌతారని వామపక్షరాజకీయ పార్టీలు మభ్యపెట్టాయి. డబ్బున్న దళితులు సైతం అంటరానితనానికి గురౌతున్నారని యీ పార్టీలు గ్రహించకపోవడం సిద్ధాంత మూర్ఖత్వం వలననే.

దళితుల సమస్యలలో మూఢనమ్మకాలు, ఆచారాలు కూడా ప్రముఖంగా పేర్కొనాలి. అగ్రకులాలలో వున్నట్లే వీరికీ అనేక మతపరమైన అంధవిశ్వాసాలున్నాయి. పుట్టిన దగ్గరనుండీ చనిపోయేవరకూ యీ గుడ్డినమ్మకాలు వీరిని కుంగదీస్తున్నాయి.

అగ్రకులాల అంధవిశ్వాసాలు, మూఢాచారాలు, కుల అహంకారం ఖండిస్తున్న దళిత నాయకత్వం అదే స్థాయిలో దళితుల పట్ల ప్రవర్తించకపోవడం దోషమే. దళితుల దురాచారాలను, మత విశ్వాసాలను, జాతరలను, కులాన్ని వెనకేసుకురావడం దళిత నాయకత్వం లోపంగా వున్నది.

శర్మ, శాస్త్రి, ఆచారి, చౌదరి, రెడ్డి అనే కుల పేర్లను సూచించే రీతులు తప్పు అని, అవి తొలగించుకోవాలి అంటున్నాం. మాల, మాదిగ అని పెట్టుకోవడంలో గర్వించదగిందేమీ లేదని గ్రహించక, యిటీవల అలా కొందరు పేర్లకు కులం తగిలిస్తున్నారు. ఈ పని ఏ కులం చేసినా దోషమే, సంకుచితమే. కులం పోగొట్టుకోవాల్సిన అవసరం, మానవులుగా సమానత్వ హక్కులతో ఎదగాల్సిన రీతులు కావాలి. అవే పిల్లలకు నేర్పాలి. ఇందుకు దళితులు మినహాయింపుకారాదు. కాని అలా జరగడం లేదు. ఇదొక ప్రధాన సమస్య అయింది. దళితులలో కులాంతర వివాహాలు జరిగినప్పుడు, వెంటనే రిజిస్టర్ చేసుకోవాలి. వారి సంతానానికి కులప్రసక్తి లేకుండా చూడాలి. అప్పుడు నవసమాజం అవతరించి, విలువలు కాపాడడానికి దోహదం చేస్తుంది. ఇప్పుడు అందుకు భిన్నంగా, తండ్రి కులాన్ని తగిలిస్తున్నారు. కొన్ని సందర్భాలలో తల్లి కులాన్ని వాడుకుంటున్నారు. కులవ్యవస్థ పోగొట్టడానికి అది దారి తీయదని గ్రహించాలి.

దళితుల పిల్లలు చదువుకోవాలి. వారిని మానసిక విముక్తులు చేయడానికి వైజ్ఞానిక దృక్పథంతో విద్య చెప్పించడం, తప్పనిసరిగా బడికి పోయేట్లు చూడడం కర్తవ్యం. దళిత నాయకత్వం యీ రంగంలో దృష్టిపెట్టాలి. రాజ్యాంగపరంగా వున్న ఉచిత నిర్బంధ విద్య దళితులందరికీ వర్తించేటట్లు పట్టుబట్టాలి. ఒక్కతరంలోనే యీ మార్పుజరిగితే దళిత సమస్య పెద్దమలుపు తిరుగుతుంది. క్రైస్తవులుగా మారిన దళితుల పిల్లల్లో మార్పు కనిపించినా మతవిద్య

వలన వారి వెనుకబాటుతనం వారిని వెన్నంటుతూ వస్తున్నది. వైజ్ఞానిక విద్య వారికి విమోచన కల్పిస్తుంది.

దళితుల్ని చీల్చి, ఆయా రాజకీయ పార్టీలకు తాకట్టు పెట్టిస్తున్న దళితనాయకులే దళితులకు ద్రోహం చేస్తున్నారు. ఇది అన్ని పార్టీలకు చెందిన ఓట్ల, సీట్ల వ్యవహారం. దళిత నాయకత్వం చేస్తున్న యీ దళారీ వ్యవహారాలే ఇన్నాళ్ళుగా దళితుల్ని వెనకబాటుతనంలో అట్టిపెట్టాయి. తాత్కాలిక లోభాలకు కక్కుర్తి పడుతున్న నాయకులు, సుఖాలు అనుభవిస్తూ యీ పనులకు దిగారు. అధికారం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారంలో లేనివారు, ఎన్నికలకై ఎదురుచూస్తున్నారు.

దళితుల మరో ప్రధాన సమస్య జనాభా నియంత్రణ, ఇందుకుగాను వారికి మూఢనమ్మకాలు పోగొట్టి, కుటుంబ ఆర్థిక వ్యవస్థ వివరించి, దేశసమస్యకూ దీనికి గల సంబంధం చెప్పి, ఒప్పించవలసి వుంది. ఇదేమంతా సులభమైన విషయం కాకున్నా అవసరం. ఇక్కడకూడా మతనమ్మకం వారికి అడ్డుపడుతున్నది. కనుకనే సమస్య జటిలమైంది. దేవుడిచ్చిన సంతానం అనే భ్రమను తొలగించడానికి వైజ్ఞానిక విద్య చెప్పి ఒప్పించవలసి వుంది.

దళితుల సమస్య ఆర్థిక సమస్య కాదు. కేవలం ఆర్థిక బాధ తీరితే, అంటరానితనం పోయి సమానత్వం రాదనేది తేలిపోయింది. డబ్బున్న దళితులు సైతం అంటరానితనం సమస్యకు గ్రామాల్లో గురౌతూనే వున్నారు, మనిషిని ఆర్థికంతో కొలిచే తప్పుడు సిద్ధాంతం వలననే. దళితుల సమస్యలు దీర్ఘకాలికాలు, తాత్కాలికాలు అని రెండుగా చూడాలి. తాత్కాలికమైన వాటిని రాజకీయ పార్టీలు, మతపక్షాలు పట్టించుకొని, తీర్చడానికి ప్రయత్నిస్తూ, ఆకర్షిస్తున్నాయి. సౌకర్యాలు, ఉద్యోగాలు, కేటాయింపులు యీ కోవలోకి వస్తాయి.

దీర్ఘకాలికమైన అంటరానితనాన్ని పోగొట్టడం, మానవహక్కులు అమలుజరపడం, ఉచిత నిర్బంధ వైజ్ఞానిక విద్యను ఆచరణలోకి తీసుకురావడం కోసం దళిత నాయకత్వానికి స్పష్టమైన అవగాహన అవసరం. దళితుల అంధవిశ్వాసాలు, మూఢాచారాలు పోగొట్టకపోగా, వాటిని సమర్థించే నాయకత్వం వారికి ద్రోహులుగా పరిణమించింది. ముఖ్యంగా రాజకీయపార్టీలలో చేరి అధికార పదవులకోసం దళితుల్ని ఫణంగా పెట్టినవారు చేస్తున్న సాంఘికనేరం ఇంతా అంతా కాదు.

అగ్రకులాలలో వున్న జాడ్యాలు, రుగ్మతలు, దోషాలు, రాజకీయ దళారీతనం గర్హనీయాలు. వాటిని దళితులు ఆదర్శంగా తీసుకోవాల్సిందేమీ లేదు. రాజకీయ పార్టీలకు తమ కులాల్ని ఓట్ల ద్వారా తాకట్టు పెట్టించే దళారీ వ్యాపారాన్ని అగ్రకులాలే మొదలెట్టాయి. అది అంటురోగం వలె దళితుల్నీ ఆవహించింది. దాన్నుండి దళితులు బయటపడాలి.

తీవ్రమైన సమస్యకు పరిష్కారాలు కూడా తీవ్రంగానే పరిగణించి, అమలుపరచాలి.

***- హేతువాది, సెప్టెంబర్ 2002***

# 'అశాస్త్రీయతే 'దేశం' పునాది, లౌకికత్వానికి ఏనాడో సమాధి'

భారత రాజ్యాంగం అన్ని మతాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ సెక్యులరిజానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఏ ఒక్క మతానికో పెద్దపీట వేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అయితే నేడు సెక్యులరిజం స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో, దేశంలో అధికారంలో ఉన్నవారు వ్యవహరిస్తున్నారని అఖిల భారత హేతువాద సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. ఇన్నయ్య అభిప్రాయపడుతున్నారు. మన రాష్ట్రంలో అధికారంలో వున్న చంద్రబాబునాయుడు కూడా ఒకవైపు సెక్యులరిజాన్ని కాపాడతామని ప్రతిజ్ఞలు చేస్తూనే మరోవైపు మతపరమైన కార్యకలాపాల్లో పాల్గొని పరోక్షంగా మతాన్ని ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు పాలనలో మతాలను ఎలా వెనకేసుకొని వస్తున్నారు అన్న అంశాలపై ఇన్నయ్య 'ప్రభాతవార్త'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా అంటున్నారు....'

? **సెక్యులరిజంకు వాస్తవ నిర్వచనం ఏమిటి? అది టి.డి.పి. పాలనలో అమలౌతోందా?**

✡ సెక్యులరిజం అంటే మనదేశంలో రకరకాల వ్యాఖ్యలు, అర్థాలు ఉన్నాయి. రాజ్యాంగం ప్రకారం భిన్నమైన మతాలకు నిలయమైన భారత సమాజంలో అన్ని మతాలను సమానంగా చూడాలి. ఏ ఒక్క మతాన్నో భుజాన వేసుకొని దాన్ని ప్రభుత్వ పాలనలో ఆచరించరాదు. రాజ్యాంగానికి కట్టుబడి ప్రభుత్వ పాలన సాగించాలి కాబట్టి పాలకులు కూడా సెక్యులర్‌గా ఉండాలి. అయితే రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి అన్ని మతాలను దువ్వుతూ తాము సెక్యులరిజానికి కట్టుబడి ఉన్నామని నమ్మించడానికి ప్రయత్నిస్తోంది.

? **టిడిపి మతాలను దువ్వుతోందని అంటున్నారు. ఆ విషయాన్ని వివరిస్తారా?**

✡ మతాలను దువ్వి రాజకీయం కోసం వినియోగించుకునే వైఖరి ఎన్.టి. రామారావు నుంచి టిడిపిలో వస్తోంది. రంజాన్ నాడు ముస్లిం వేషంలో మసీదుకు వెళ్లి ప్రార్థన చేయడం, క్రిస్మస్ వేడుకలకు వెళ్లడం, హిందూ పండుగలను అధికారికంగా జరపడం, దేవాలయాల వద్ద అధికార లాంఛనాలు వినియోగించుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడడమే. అంతేకాదు ముస్లింలకు మక్కా, క్రైస్తవులకు వాటికన్ ఉన్నట్లుగా హిందువులకు తిరుపతిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కూడా ఎన్.టి.ఆర్. ప్రకటించారు. అదే బాటలో చంద్రబాబునాయుడు కూడా వెళ్తున్నారు. మతం వ్యక్తిగత నమ్మకం. దీన్ని అధికారికంగా ఆచరించడం ద్వారా సెక్యులర్ విలువలకు భంగం కలిగించడమే అవుతుంది.

? **సెక్యులరిజం అంటే అన్ని మతాలను సమానంగా చూడడం అన్నారు. అయితే అన్ని మతాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నా తప్పు పడుతున్నారు...**

✡ ఎవరి మతవిశ్వాసాలు వారివి. అది వ్యక్తిగతం కూడా. ఈ రెండూ నిర్వివాదాంశమైనవి.

అయితే రాష్ట్రంలో కీలకమైన పదవిని నిర్వహించే ముఖ్యమంత్రి మొదలుకొని, మంత్రులు, అధికారులు మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనడమే అభ్యంతరకరమైన అంశం. తిరుపతి, భద్రాచలంలలో జరిగే హిందూమత ఉత్సవాలు, క్రైస్తవులు ప్రార్థన ద్వారా వ్యాధులు నయం చేస్తామని, కాళ్లులేనివారికి నడిపిస్తాం అంటూ చేసే స్వస్థత సభలకు వెళ్లడం, మొహరం వంటి ముస్లిం పండగల్లో పాల్గొనడం రాజ్యాంగ విరుద్ధమే కాక ఉన్నత పదవుల్లో ఉన్నవారే ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ప్రజలు తప్పుదోవపట్టే ప్రమాదం ఉంది. అంతేకాక మత గురువులు, బాబాల ఆశ్రమాలు, మిషినరీలకు ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు వెళ్లడం వల్ల వాటిలో జరిగే అక్రమాలు, ఆర్థిక లావాదేవీలు, హత్యలు బహిర్గతం కావు. విదేశాల నుంచి నిధులను తెచ్చుకోవడానికి మతపరమైన సంస్థలకు మంత్రులు, అధికారుల సందర్శనలు పరోక్షంగా తోడ్పడతాయి. అంతేకాక ఇలాంటి సంస్థలు వాణిజ్య కార్యకలాపాలు సాగించినప్పటికీ పన్నుల సడలింపులు పొందుతున్నాయి. ఇవన్నీ పోను ప్రస్తుత ప్రభుత్వం సమ్మక్క-సారక్క వంటి పలు ఉత్సవాలను ప్రభుత్వం తరపున నిర్వహిస్తూ ఒక మతాన్ని వెనకేసుకొస్తోంది.

**? ఏ విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక మతాన్ని వెనకేసుకొస్తోందో వివరిస్తారా?**

✡ రాష్ట్ర మంత్రివర్గంలో ప్రత్యేకంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉండడమే హిందూమతాన్ని వెనుకేసుకురావడం అవుతుంది. హిందువులు విశ్వసించే దేవాలయాలకు సంబంధించి ప్రత్యేక శాఖ నెలకొల్పి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటుండడం వల్ల ఇతర మతాల నుంచి కూడా తమకు రాయితీలు కావాలన్న ఒత్తిడి వస్తుంది. అంతేకాక దేశవ్యాప్తంగా విమర్శలను ఎదుర్కొంటున్న జ్యోతిష్యం వంటి అశాస్త్రీయమైన కోర్సులను తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్.టి. రామారావు ప్రారంభించారు. ఎన్నో విమర్శలు వచ్చినప్పటికీ ఆ కోర్సులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఇదికాక వాస్తుకు ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర రాజధానిలోని సచివాలయం మొదలుకొని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వాస్తుకు అనుగుణంగా మార్పులు చేయడానికి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇదికాక రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భవనాలకు వాస్తు ఎలా ఉందని టెలికాన్ఫరెన్‌లలో అధికారులను విచారించిన దాఖలాలు కూడా ఉన్నాయి. దీనివల్ల అమాయక ప్రజల్లో వాస్తు పట్ల భ్రమలను పెంచినట్లే అవుతుంది.

**? రాష్ట్రంలో అమలౌతున్న విద్యావిధానంలో ఏమైనా లోపాలున్నాయా?**

✡ రాష్ట్రంలో అమలౌతున్న విద్యావిధానంలో బలవంతంగా పసిపిల్లలపై మతాచారాలను రుద్దుతున్నారు. క్రైస్తవ మిషనరీ స్కూళ్లలో క్రైస్తవ సంబంధ ప్రార్థనలు తప్పనిసరిగా అందరిచేత చేయిస్తుండగా, మదరసాల్లో, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ నిర్వహించే

శిశుమందిర్‌లలో చిన్నారులపై మత మౌఢ్యాన్ని రుద్దుతున్నారు. దీన్ని ప్రభుత్వం అడ్డుకున్న దాఖలాలు లేవు.

? **మతాలు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకునే పావులయ్యాయనే విషయంపై మీరేమంటారు?**

✡ ఇది అక్షరాలా వాస్తవం. వివిధ మతాల వారి రాజకీయ మద్దతు కూడగట్టుకునేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అనేక సామాజిక సమస్యలకు కారణమౌతున్నాయి. ఒక మతం వారు రోడ్డుపై ప్రార్థనా మందిరాన్ని కట్టుకున్నారని, పోటీగా ఇతర మతాల వారు రోడ్లను ఆక్రమించుకొని గుళ్లు, గోపురాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తున్నా వాటిని అడ్డుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉంది.

? **అయోధ్యలో వివాదానికి కారణమైన బిజెపి, దాని అనుబంధ సంస్థలకు ఇప్పటికీ చంద్రబాబు మద్దతును కొనసాగించడం సెక్యులరిజాన్ని అగౌరవపరచడం కాదా?**

✡ బిజెపి సంకీర్ణ ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు మద్దతు ఇవ్వడం రాజకీయ ఎత్తుగడ మాత్రమే. గతంలో ఆయన కమ్యూనిస్టులతో కూడిన యునైటెడ్ ఫ్రంట్‌లో కూడా ఉన్నారు. పరిస్థితులను బట్టి మారే ఈ మద్దతుకూ సెక్యులరిజానికి ఎలాంటి సంబంధం లేదు. అయితే సెక్యులరిజం పేరుతో రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రంలో అనేక కార్యకలాపాలు సాగుతున్నాయి. సెక్యులరిజంపై పాలకులకు సరైన అవగాహన లేని కారణంగా పలు అనర్థాలు జరుగుతున్నాయి. అన్ని మతాలను దువ్వడం సెక్యులరిజం ఎట్టి పరిస్థితుల్లోనూ కాజాలదు. బిజెపి, విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్., క్రిస్టియన్, ముస్లిం సంస్థలకు తమ మతాలపై మాత్రమే అపారమైన విశ్వాసం ఉంటుంది. ఇతర మతాలన్నీ నిజం కావు అన్నట్లు కూడా వ్యవహరిస్తాయి. అలాంటి మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొంటున్న చంద్రబాబు ప్రభుత్వం పరోక్షంగా మతతత్వాన్ని ప్రేరేపిస్తోందనే చెప్పాలి. జవహర్‌లాల్ నెహ్రూ పాలనలో సెక్యులరిజానికి ఎలాంటి భంగం కలగలేదు. దేశానికి రాష్ట్రపతిగా వున్న జాకీర్ హుస్సేన్ కూడా తన మత విశ్వాసాలను ఎప్పుడూ బహిర్గతంగా ప్రదర్శించలేదు. అలాంటి వైఖరి మన పాలకుల్లో రావాలన్నదే మా ఆకాంక్ష.

**- వార్త, మార్చి *2002***

# జీవిత చిత్రణలు

# నవ్య మానవుడు ఎరిక్ ఫ్రామ్

ఏమి చెబుతున్నామనేది ఎంత ముఖ్యమో, ఎలా చెబుతున్నామనేది అంతకంటే ప్రధానమైన అంశం. ఎరిక్ ఫ్రామ్ నుండి అందరూ నేర్వదగిన అంశంలో - ఎంత క్లిష్టమైన, జటిలమైన ఇనుప గుగ్గిళ్ళు కూడా ఆయన కలానికి లొంగి, కావలసినట్లు మైనం వలె ఒంపుసొంపులు తొడుగుకుంటాయి - అనేది చూడవచ్చు.

మార్క్సిజంతో ప్రారంభించి సైకో ఎనాలసిస్ వరకూ, ప్రేమ నుండి మానవ వాదం దాకా ఎరిక్ ఫ్రామ్ ప్రస్తావించాడు. అన్నిటినీ చదివించాడు. ప్రపంచ వ్యాప్తంగా ఎరిక్ ఫ్రామ్ అభిమానులు, శిష్యులు, అనుచరులు సగర్వంగా "మా గురువు" అని చాటుకునే వారున్నారు.

1975లో ఎరిక్ ఫ్రామ్‌కు ఉత్తరం రాసి, ఆయన రచన "ది సేన్ సొసైటి" అనువాదానికి అనుమతి కోరాను. ఆయన నుండి వెంటనే సమాధానం వచ్చింది. కాపీరైట్ వున్న గ్రంథం గనుక, ప్రచురణకర్తలు అనుమతి యివ్వాలని, తన సెక్రటరీ ఆ విషయంలో సహకరించగలడనీ రాశారు. చాలా సంతోషించారు. 1980లో ఆయన చనిపోవడం నాకు చాలా విచారాన్ని మిగిల్చింది.

1964లో కీ॥శే॥ ఆవుల గోపాల కృష్ణమూర్తి అమెరికా ప్రభుత్వ ఆహ్వానంపై అమెరికాలో పర్యటించబోతుండగా, ఎరిక్ ఫ్రామ్‌ను తప్పనిసరిగా కలుసుకోమని కోరాను. ఆ ప్రకారమే ఎ.జి.కె. ప్రయత్నించి, నిర్ణీత సమయంలో కలవాలని నిర్ణయించారు. ఎరిక్‌ఫ్రామ్ యిచ్చిన సమయానికి వెళ్ళలేక, ప్రయాణం దూరాన్ని, కాలాన్ని, అంచనా వేయడంలో పొరబడి కలుసుకోలేకపోయారు.

1955లో సేన్ సొసైటి ప్రచురితమైంది. అందులో తొలి అధ్యాయంలోనే ఎరిక్ ఫ్రామ్ ప్రత్యేకంగా ఎం.ఎన్. రాయ్ "రీజన్, రొమాంటిసిజం, రివల్యూషన్" గ్రంథాన్ని ప్రస్తావించారు. యూరోప్ పునర్వికాసం అవగాహన చేసుకోడానికి ఆ పుస్తకం చదవాలని పాఠకులకు సిఫారసు చేశారు. అంతకు ముందు సంవత్సరం క్రితమే రాయ్ చనిపోయారు. రాయ్ గ్రంథం 2 సంపుటాలు అప్పుడే వెలువడ్డాయి. అంటే ఎరిక్ ఫ్రామ్ ప్రచురణ జరిగిన కొద్ది రోజులకే రాయ్ పుస్తకం చదివారన్నమాట. రాయ్ - ఫ్రామ్‌లకు ఎంత పరిచయం వుందో తెలియదు. 1952లో తొలుత ఏర్పడిన అంతర్జాతీయ హ్యూమనిస్టు సంఘానికి రాయ్ వైస్ ప్రెసిడెంట్ గావడం, హ్యూమనిస్టువే అనే త్రైమాస పత్రికను నడిపే రాయ్ బహుశ ఫ్రామ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి వుండొచ్చు.

అమెరికా హ్యూమనిస్ట్ అసోసియేషన్ 1966 సంవత్సరంలో ఎరిక్ ఫ్రామ్‌ను హ్యూమనిస్ట్‌గా సత్కరించింది. తాను మానవ సహజవాదినని, రాడికల్ హ్యూమనిస్ట్‌నని ఫ్రామ్ స్పష్టీకరించాడు. అనేక పర్యాయాలు హ్యూమనిస్ట్ సంఘ సమావేశాలలో మాట్లాడి, సంఘం, సంస్కృతి ప్రభావం

వ్యక్తిపై వుంటుందన్నాడు. ఆ విధంగా చూస్తే పారిశ్రామిక సమాజాలలో వున్న వ్యక్తి వైమనస్యతకు గురౌతాడన్నారు. దీనిని Alienationగా చెప్పిన ఫ్రామ్ ధోరణి ఆనాడు కొలంబియా యూనివర్శిటీ, న్యూయార్క్ జనాలకు నచ్చలేదు.

హేతువాదంతో విశ్వాసం గనుక పొందికగా యిమడలేకపోతే, పాత సంస్కృతి ప్రభావాలు లక్షణంగా భావించి, విశ్వాసానికి తిలోదకాలివ్వాలని ఎరిక్ ఫ్రామ్ రాశాడు. (మేన్ ఫర్ హింసెల్ఫ్) విశ్వాసంస్థానంలో సైన్స్ చోటుచేసుకోవాలన్నాడు.

## ఎరిక్ ఫ్రామ్ పూర్వాపరాలు

ప్రపంచ వ్యాప్తంగా ఎరిక్ ఫ్రామ్ పేరెత్తగానే, ఆర్ట్ ఆఫ్ లవింగ్ పుస్తకం జ్ఞాపకం చేసుకుంటారు. మొదలుపెడితే చివరి దాకా చదివించే లక్షణం గల ఫ్రామ్, అతి జటిలమైన విషయాలను సులభంగా చెప్పడంలో ఆరితేరిన సామాజిక మనోవిజ్ఞాన మానవవాది.

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో యూదు పురోహిత (రాబై) కుటుంబంలో 1900 మార్చి 23న ఎరిక్ ఫ్రామ్ పుట్టాడు. తన తల్లిదండ్రులు చపలచిత్తురనీ, తనకూ కొస వెర్రి లేకపోలేదనీ రాసుకున్నాడు. తన 26వ ఏట వరకూ ఫ్రామ్ కూడా యూదు మత సంప్రదాయాలను పాటించి, బయటపడ్డాడు. ఫ్రామ్ యువకుడుగా సాల్మన్ రబిన్‌కోవ్ సోషలిస్టు భావాలకు, నెహెమియా నోబెల్ మార్మిక ధోరణిక గురయ్యాడు.

రైనర్ ఫంక్ కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడిస్తూ ఫ్రామ్ జీవిత విశేషాలు రాశాడు. ఫ్రామ్ కుటుంబంలో 20 ఏళ్ళ యువతి ఆత్మహత్య చేసుకోవడం, ఆమెను తన తండ్రి సమాధి పక్కనే పెట్టడం కొంత ప్రభావాన్ని కలిగించిందనీ, ఫ్రాయిడ్ సిద్ధాంతాల పట్ల శ్రద్ధ చూపడానికి యీ సంఘటన కారణమని అంటాడు.

విశ్వవ్యాప్తంగా అన్ని దేశాలు శాంతియుత సహజీవనం గడపవచ్చనే ఫ్రామ్ విశ్వాసం, మొదటి ప్రపంచ యుద్ధంతో పటాపంచలైంది. మానవుడిలో హేతు విరుద్ధ భావాల్ని, ధోరణుల్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు.

చరిత్రను లోతుగా అవగాహన చేసుకోడానికి మార్క్సు రచనలు ఫ్రామ్‌కు ఉపకరించాయి. మార్క్సు తొలి రచనలు మానవవాదంతో వున్నాయని చెప్పాడు. ఫ్రాంక్‌ఫర్ట్, హైడల్‌బర్గ్‌లో చదివి 1922 నాటికే డాక్టరేట్ పట్టం స్వీకరించిన ఫ్రామ్, 1926లో ఫ్రెడారైక్‌మన్‌ను పెళ్ళాడాడు. మ్యూనిక్‌లో మనోవిశ్లేషణ అధ్యయనం గావించాడు.

ఆనాడు ఫ్రాంక్‌ఫర్ట్ మేధావి వర్గాలు ఆలోచనారంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపెట్టాయి. అందులో కొంతకాలం ఫ్రామ్ కూడా వున్నాడు. సామాజిక శాస్త్రాలకూ, మానసిక విజ్ఞానానికీ సన్నిహిత సంబంధం వుండాలని ఫ్రామ్ ఉద్దేశ్యం.

జర్మనీలో తలెత్తిన నాజీవాదం, హిట్లర్ పెత్తందారీ తనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఫ్రామ్, ఉత్తరోత్తరా తన "అనాటమీ ఆఫ్ హ్యూమన్ డిస్ట్రక్టివ్‌నెస్"లో అటు హిట్లర్, యిటు స్టాలిన్ మానవ వినాశకర రీతుల్ని ఎలా ఎందుకు చేబట్టారో విడమరచాడు.

ఫ్రాయిడ్ అనుచరుడుగా కొన్నాళ్ళున్న ఫ్రామ్ క్రమేణా నిశిత పరిశీలకుడుగా మారి, ఫ్రాయిడ్‌లో నిలిచేది, నిలవనిది వేరు చేయగలిగాడు. మనోవిశ్లేషణ శిక్షణ పొంది ఆచరించాడు.

1931 నాటికే క్షయ వ్యాధి సోకగా, స్విట్జర్లాండ్‌లోని దావాస్‌లో వుంటూ, తన భార్యకు ఎడమయ్యాడు. తరువాత అమెరికాకు వలస వెళ్ళి కారెన్ హార్నేతో సన్నిహితుడయ్యాడు. పదేళ్ళపాటు వారి మిత్రత్వం సాగింది. అమెరికాలో స్థిరపడిన ఎరిక్ ఫ్రామ్ పౌరసత్వం స్వీకరించాడు. అంతవరకూ జర్మన్‌లో రచనలు సాగించిన ఫ్రామ్, 1939 నుండీ ఇంగ్లీషు రచనలు మొదలుపెట్టాడు.

ఎస్కేప్ ఫ్రం ఫ్రీడమ్ రచన 1941లో రాగా, ఫ్రామ్ సిద్ధాంతకారుడుగా వెలుగులోకి వచ్చాడు. అది అతడి మూల సిద్ధాంతం. మానవుడు వైమనస్యతతో, బాధ్యతల్ని తప్పించుకొని, ఏదొక పెత్తందారీ వ్యవస్థకు లొంగిపోయి, అటు నియంతలనో, యిటు దేవుడినో కొలుస్తూ తన బాధ్యత నుండి తప్పుకుంటా డన్నారు.

1944లో హెన్నీ గుర్‌లాండ్‌ను పెళ్ళి చేసుకున్నాడు.

1947లో మాన్ ఫర్ హింసెల్ఫ్ ప్రచురించాడు. అప్పటికి మానవవాదిగా ఆవిర్భవించి మానవుడు తన బాధ్యతల్ని తానే స్వీకరించాలని, మానవుడు కేంద్రస్థానంలోకి రావాలన్నాడు.

1950 నుండీ ఫ్రామ్ మెక్సికోలో వుంటూ అక్కడ సుప్రసిద్ధుడయ్యాడు. 1952లో రెండో భార్య చనిపోగా, ఆనిస్ ఫ్రీమాన్‌ను పెళ్ళాడాడు.

1955లో సుప్రసిద్ధ రచన సేన్ సొసైటి వచ్చింది. సామాజిక రీతుల్లో సోషలిస్టు వ్యవస్థ ఎలా అమలులోకి తేగలమనే సిద్ధాంత గ్రంథం అది.

నేటి ప్రపంచాన్ని ఆకర్షించినది ఆర్ట్ ఆఫ్ లవింగ్ 1956లో ఫ్రామ్ ప్రచురించారు. ప్రేమను భిన్న కోణాల నుండి శాస్త్రీయంగా చూడగలగడం అందలి విశేషం. 1959లో ఫ్రాయిడ్‌పై విశ్లేషణను స్వతంత్ర ధోరణిలో రాశారు. మరోపక్క ఫ్రామ్ సోషలిస్టు పార్టీలో అమెరికాలో ప్రముఖ పాత్ర వహించారు. ఆ దశలోనే 1961లో మార్క్స్ కాన్సెప్ట్ ఆఫ్ మాన్ రాశారు.

ప్రపంచ శాంతి సమావేశాల్లో పాల్గొనడానికి 1962లో మాస్కో వెళ్ళారు. బియాండ్ ది ఛైన్స్ ఆఫ్ ఇల్యూజన్ 1962లో ప్రచురించారు. ఆ తరువాతనే ది హార్ట్ ఆఫ్ మాన్ కూడా రాశారు.

అమెరికా విధానాన్ని వియత్నాం యుద్ధంలో పాల్గొనడాన్ని ఫ్రామ్ తీవ్రంగా నిరశించారు.

1966లో యు షల్ బి యాజ్ గాడ్స్ అనే రచన చేశారు. అప్పుడే తొలిసారి గుండెపోటు వచ్చింది. చనిపోయేలోగా మొత్తం 4 పర్యాయాలు ఫ్రామ్ గుండెపోటుకు గురయ్యారు.

1968 ది రివల్యూషన్ ఆఫ్ హోప్ రాసి, రాజకీయాలలో చురుకుగా పాల్గొనడం విరమించేశారు. స్విట్జర్లాండ్‌లో నివాసం ఏర్పరచుకొని తరచు అక్కడ వుంటూ, విశ్రాంతి తీసుకునేవారు.

1973లో "ది అనాటమీ ఆఫ్ హ్యూమన్ డిస్ట్రక్టివ్‌నెస్" అనే విశ్లేషణాత్మక పెద్ద రచన చేశారు. 1975లో టు హేవ్ ఆర్ టు బి అనే రచనలో మానవుడు తనకు తానుగా నిలబడగలగడం అవసరమనీ, కేవలం సంపద ఆర్జించినంతమాత్రాన వ్యక్తిగా వుండజాలడని అన్నాడు. (1976)

1977లో ఒకసారి 1978లో మరోసారి గుండెపోటుతో ఎరిక్ ఫ్రామ్ బాధపడుతూనే జర్మనీ, ఇటలీలలో ప్రత్యామ్నాయ ఉద్యమాలలో పనిచేశారు. 1980లో మరోసారి గుండెపోటు రాగా మరణించిన ఫ్రామ్‌ను స్విట్జర్లాండ్‌లో సమాధి చేశారు.

## ఎరిక్ ఫ్రామ్‌కు తత్వం వుందా?

ఎరిక్ ఫ్రామ్ కేవలం మనో విశ్లేషణకారుడుగా, విమర్శకుడుగా మిగులుతాడా? లేక అతనికి తత్వం కూడా ఏదైనా వుందా?

ఫ్రామ్ రచనల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అతని మానవవాద తత్త్వం స్పష్టంగా అవగాహన అవుతుంది.

మనిషి సహజ పరిణామంలో నుండి వచ్చాడు. ప్రకృతిలో భాగంగా వుంటూనే దానికి మించి పోవాలని మనిషి ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు కారణం ఏమంటే, మిగిలిన వాటికి లేని వివేచన మనిషిలో వుండడమే.

ప్రతిక్షణమూ మనిషి బయటి ప్రపంచంతో సంపర్కం వలన, ప్రకృతిలోనూ, తోటివారితోనూ పొందికగా యిమడడం ఎలా అని సంఘర్షణ పడుతూనే వున్నాడు.

మానవుడు తన ఉనికి విషయంలో పరిష్కార మార్గాలను అన్వేషించిన ఫలితంగా రెండే రెండు మార్గాలు మిగిలాయి. ఒకటి మానుషం. అదే మానవవాదం. రెండవది అమానుషం. ఈ అమానుష పరిష్కారాల ఫలితంగానే దైవాన్ని, అతీత శక్తుల్ని ఆత్మను, అమరత్వాన్ని వూహించుకున్నాడు. వాటికి క్రమేణా బానిసగా మారి కొట్టు మిట్టాడుతున్నాడు.

మానవవాదంలో మనిషి కేంద్రంగా వుంటాడు. ప్రకృతిని క్రమంగా పొరలు విప్పుకుంటూ, ఒక్కొక్క అరలో ఏముందో తెలుసుకుంటూ సాగుతాడు. అలా తెలుసుకోవడం నిరంతరంగానూ, అనంతంగానూ సాగుతుంది.

తాను గ్రహించింది తోటివారికి తెలియజెప్పడం, ఇతరుల నుండి గ్రహించడం మానవుడి సహకార లక్షణం. అందులో ఆనందం వుంది.

తెలుసుకోవడంలో ఎప్పుడూ చిక్కులు ఎదురౌతూనే వుంటాయి. అయినా కష్టపడి శాస్త్రీయ పద్ధతిని కనుగొన్నాడు. దాని సహాయంతో తెలుసుకుంటూ పోతున్నాడు.

మానవులకు ఇన్నేళ్ళుగా ఏ పరమాత్మ, ఏ ఆదిశక్తీ తోడ్పడలేదు. ఆదుకోలేదు. అలాంటివి వున్నాయనేది నమ్మకమే. దేవుడు, అతీతశక్తులు యిత్యాదులన్నీ మానవుడిని భ్రమల్లో ముంచెత్తాయి. బాధ్యతారహితుణ్ణి చేశాయి. సమస్యలు ఎదురైనప్పుడు తప్పుకు పోవడం, వైమనస్యత చెందడం, తనకు పట్టనట్లుండడం యివన్నీ అతీతశక్తుల, దైవాల భావనా ఫలితమే.

మానవుడు తోటివారికి తోడ్పడడం, నీతిగా విలువల్ని పాటించడం మానవ లక్షణం. మానవుడి వివేచనకు, అన్వేషణకు తోడ్పడే వ్యవస్థలు, సంస్థలు, సమాజాలు ఉత్తమమైనవి. మానవుడిని కించపరచి, విలువ లేకుండా, తక్కువగా చూచే వ్యవస్థలు అతన్ని అమానుషంగా ప్రవర్తించేట్లు చేస్తున్నాయి.

మానవుడు విశిష్టమైన జీవి. అతన్ని మూక స్వామ్యంలో కలిపేయడం అవివేకం. మానవుడి ప్రతిభ విప్పారడానికి తోడ్పడే సహకార విధానాలు ఏర్పరచుకోవాలి.

వివేచన ఒక్కటే మానవుడికి తోడ్పడగల ఆయుధం. దానిని సద్వినియోగపరచుకోవాలి.

మానవుడికి స్వేచ్ఛ అత్యంత విలువైనది. దానిని అరికట్టే విధానాలన్నీ అమానుషాలే. మానవుడు సంపూర్ణత వైపుకు ఎప్పుడూ సాగిపోవాలి. అది లక్ష్యంగా మంచి మార్గాలతో కదలాలి. స్వయం శక్తి పై మానవుడు నమ్మకం వుంచాలి. ఇదీ ఎరిక్ ఫ్రామ్ తత్వసారం.

## ఎరిక్ ఫ్రామ్ ముఖ్య రచనలు :

1. Escape from Freedom 1941
2. Man for Himself 1947
3. The sane Society 1955
4. The Art of Loving 1956
5. Sigmund Freaud Mission 1959
6. Marx's Concept of Man 1961
7. Beyond the Chains of Illussion 1962
8. The Heart of Man 1963
9. You shall be Gods 1966
10. The Revolution of Hope 1968

11. The Anatomy of Human destructiveness 1973

12. To have or to be 1975

ఇంకా ఎన్నో ప్రామాణిక వ్యాసాలు జర్మన్, ఇంగ్లీషులో కొన్ని గ్రంథాలు ఎడిట్ చేశారు అందులో హ్యూమనిజంపై ముఖ్యమైనవి వున్నవి.

*- మిసిమి మాసపత్రిక. మార్చి-2001*

# ఎం.ఎన్. రాయ్ ఇలా చేశాడా!

*(ఆంస్టర్ డాంలోని "అంతర్జాతీయ సాంఘిక చరిత్ర" ఆర్కైవ్స్‌లో నుండి తెప్పించిన పత్రాల ఆధారంగా తొలుత వెల్లడిస్తున్న గాథ)*

ఎం.ఎన్. రాయ్ (1887-1955) జీవితంలో ఒక ఘట్టం ఇన్నేళ్ళుగా మర్మంగా వున్నది. ఆయన తొలి భార్య ఎవిలిన్ 9 ఏళ్ళ కాపురం తరువాత హఠాత్తుగా విడిపోవడం ఎందుకో తెలియలేదు. ఎవిలిన్ ట్రెంట్ (1892-1970) శాంతిదేవి అనే పేరిట కమ్యూనిస్టు అంతర్జాతీయ ఉద్యమంలో పనిచేసి, రాసింది. ఆ కాలంలో తన జీవిత విశేషాలు గ్రంథస్తం చేసిన మానవేంద్రనాథ్ రాయ్ (తొలిపేరు నరేంద్రనాధ్ భట్టాచార్య) ఎవిలిన్ ప్రస్తావనే తీసుకురాలేదు. విడిపోయిన తరువాత ఉభయులూ పరస్పరం మౌనం దాల్చాలని ఏదైనా అంగీకారానికి వచ్చారేమో అనుకున్నాం. శిబ్‌నారాయణ్‌రే, వి.బి. కర్నిక్, హెయిత్ కాక్స్ మొదలైన వారి పరిశోధనలలో కూడా ఎవిలిన్ విడిపోవడంపట్ల వివరణ లేదు.

ఇప్పుడు లభించిన పత్రాలవలన ఎవిలిన్ కొన్ని విషయాలు వెల్లడించినట్లు ఆధారాలు తెలిశాయి. రాయ్ దంపతులకు సన్నిహిత మిత్రుడు, ఇండోనేషియాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, రెండో ప్రపంచ యుద్ధకాలంలో నాజీలచే హతమార్చబడిన స్నీవ్‌లైట్ పత్రాలలో ఎవిలిన్, రాయ్ ఉత్తరాలు వున్నాయి. స్నీవ్‌లైట్ డచ్ వాసి. అతని పత్రాలు నేడు ఆంస్టర్‌డాంలోని అంతర్జాతీయ సాంఘిక చరిత్ర సంస్థలో భద్రపరిచారు. వాటి ఆధారంగా కొన్ని సంగతులు తెలుస్తున్నాయి.

1917లోఅమెరికాలోని న్యూయార్క్‌లో పెళ్ళాడిన ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్‌లు 9 సంవత్సరాలు కలిసిమెలసి వున్నారు. మెక్సికో, రష్యా, యూరప్ దేశాలలో అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీలో కృషి సాగించారు. లెనిన్, స్టాలిన్, ట్రాటస్కీ, బరోడిన్‌లతో పనిచేశారు. భారత కమ్యూనిస్టు పార్టీని 1920 అక్టోబరులోనే తాష్కెంట్‌లో స్థాపించి, పెంచి పోషించారు. పత్రికలు నడిపారు. భారత కమ్యూనిస్టులకు డబ్బు, సలహాలు, పత్రికలు, సాహిత్యం పంపారు.

కనుక ఎవిలిన్ - రాయ్ దాంపత్యం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ఎవిలిన్ 1925 జులై 30న అమెరికా వెళ్లిపోయింది. ఆంస్టర్‌డాంలో జరిగిన కమ్యూనిస్టు వలస రాజ్యాల సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె హఠాత్తుగా స్వదేశం వెళ్ళింది. అంతకుముందు స్విట్జర్లాండ్‌లో రాయ్ దంపతులు "రెండవ ప్రేమయాత్ర" వంటిది అనుభవించారు. అక్కడే ఎవిలిన్‌ను వెళ్ళిపొమ్మని రాయ్, పిడుగువంటి ఉత్తరవులు యిచ్చాడు. ఎందుకో చెప్పమని ఎవిలిన్ అడిగింది. ఉంటానని బ్రతిమాలింది. రాయ్ తన నిర్ణయం మార్చుకోలేదు. కారణాలు ఏవీ చెప్పలేదు.

ఎవిలిన్ తన వ్యక్తిత్వం చంపుకోకుండా వుండదలచినప్పుడు, రాయ్ అలాంటి నిర్ణయానికి వచ్చినట్లు అభిప్రాయపడింది. అనేక సందర్భాలలో ఘర్షణలు వచ్చినా, తాను వ్యక్తిత్వం అణచుకొని, భార్యగా అణకువతో వున్నందున 9 ఏళ్ళు వుండగలిగానని, సింహావలోకనంలో ఎవిలిన్ తెలిపింది. 1921లోనే రాయ్ అలా ప్రవర్తించినప్పటికీ, తనపట్ల అలాంటి అభిప్రాయం వెల్లడించి వుంటే, అప్పుడే వెళ్ళిపోయే దానినని పేర్కొన్నది. రాయ్‌తో కేవలం భార్యగానే గాక, అతని ఉద్యమ కృషిలో భాగం పంచుకున్న ఎవిలిన్‌కు, విడిపోవాలనే రాయ్ నిర్ణయం షాక్ నిచ్చింది.

రాయ్ తనను ఒక విలాస వస్తువుగా వాడుకున్నట్లు వెనక్కు తిరిగి చూచుకున్నప్పుడు, అవగాహనకు వచ్చింది ఎవిలిన్. బహుభార్యాత్వ విధానంలో తాను ఒకత్తెగా వున్నాననే అభిప్రాయం కూడా ఎవిలిన్ వెల్లడించింది. నిష్కర్షగా చర్చచేయకుండా, దాచిపెట్టి, గుంభనగా విషయాలు వుంచడం బహుశ తూర్పు దేశాల సంస్కృతి కావచ్చునని ఎవిలిన్ నిర్ధారణకు వచ్చింది. ఏ ఘట్టంలోనైనా తాను పొరపాటు చేసినట్లు 9 సంవత్సరాలలో రాయ్ ఎన్నడూ దెప్పిపొడవ లేదు. అలాంటప్పుడు యీ హఠాత్తు నిర్ణయం ఎలా చేస్తాడని ఎవిలిన్ ఆశ్చర్యపోయింది.

1925 ఆగష్టు నుండీ అమెరికాలో వున్న ఎవిలిన్ అనేక ఉత్తరాలు రాసినా రాయ్ నుండి సమాధానం రాలేదు. ఉభయులకూ కుటుంబ, ఉద్యమ మిత్రుడుగా వున్న స్నీవ్‌లైట్‌కు విషయాలు రాసింది. కారణాలు కనుక్కోమన్నది. ఒకవేళ రాయ్ తిరిగి రమ్మన్నా, పూర్వంవలె వుండడం కుదరదని భావించింది. అయినా రమ్మంటాడేమో కనుక్కోమనికోరింది. వెళ్ళిపొమ్మనడానికి కారణాలు కావాలని తరచి అడిగింది. భారతదేశంలో పనిచేయాలని, తూర్పుదేశాల ఉద్యమాలలో పాల్గొనాలని ఆశించిన ఎవిలిన్, మళ్ళీ కమ్యూనిస్టు పార్టీ కోరితేనో, రాయ్ పిలిస్తేనో రాగలననుకున్నది.

మాతృదేశం అయిన అమెరికాలో అడుగు పెట్టిన ఎవిలిన్, నోరు విప్పినా, అక్కడ కమ్యూనిస్టు పార్టీలో పనిచేసినా దేశం నుండి పంపించేవారే. అప్పటికే 1926లో చికాగోలో జరిగిన అమెరికా కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో పాల్గొన్నది. కాని ముఠా తగాదాలు, నీచంగా వదంతులు వ్యాపించడం, రాయ్‌ను వదిలేసి వచ్చిందని తనపై నీలాపనిందలు, గూఢచారి అని, డబ్బు కాజేసిందని, మరెన్నోనిందలు విని విసుగుచెంది వారందరికీ దూరంగా వుండాలని నిర్ణయించుకున్నది.

ఎట్టకేలకు తన ఉత్తరాలకు రాయ్ సమాధానం యిస్తూ, అమెరికాలోనే వుండిపొమ్మని, తన దగ్గరకు రానక్కరలేదని తెలియజేశాడు.

క్రమేణా షాక్ నుండి తేరుకొని, జర్నలిస్ట్‌గా అమెరికాలో ఎవిలిన్ స్థిరపడింది. 1930లో ఇండియా తిరిగి వచ్చిన రాయ్‌ను బ్రిటిష్ పోలీస్ అరెస్టు చేయగా ఎవిలిన్ ఖండిస్తూ వ్యాసం రాసింది.

రాయ్ తన స్మృతులను రాడికల్ హ్యూమనిస్ట్‌లో ప్రతివారం రాస్తున్నప్పుడు తన పేరు ప్రస్తావిస్తాడేమోనని ఎదురు చూచింది. డెహ్రాడూన్‌లో చివరిదశలో రెండవ భార్య ఎలెన్‌కు చెప్పి రాయించిన రాయ్ ఏకోశానా ఎవిలిన్ గురించి నిజం చెప్పలేదు.

రాయ్ చనిపోయిన అనంతరం ఎలెన్ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఎవిలిన్‌తో సంబంధం పెట్టుకున్నది. కొందరు స్వదేశీ విదేశీ రాజకీయ పరిశోధకుల్ని ప్రోత్సహించి ఎవిలిన్ దగ్గరకు పంపించింది. రాయ్‌ను గురించి చెడుగా రాసిన వారిని ఎవిలిన్ ఖండించింది. రాబర్ట్ నార్త్ అనే రాజకీయ శాస్త్రజ్ఞుడికి రాయ్ గురించి అనేక విషయాలు ఎవిలిన్ చెప్పింది. చివరి వరకూ రాయ్‌పట్ల ఎవిలిన్ ఉదాత్తంగా ప్రవర్తించింది. కమ్యూనిస్టుగా ఎం.ఎన్. రాయ్ మాత్రం ఎవిలిన్‌పట్ల మానవ ధర్మంతో వ్యవహరించలేదు.

ఎవిలిన్-రాయ్ మధ్య సయోధ్యకై స్నీవ్‌లైట్ ప్రయత్నించకపోలేదు. ఎవిలిన్ అమెరికా వెళ్ళిన అనంతరం ఎం.ఎన్. రాయ్ స్నీవ్‌లైట్ యింట్లో కొన్నాళ్ళున్నాడు. అప్పుడు ఎంత చెప్పి చూచినా, రాయ్ రాజీకి ఒప్పుకున్నట్లు లేదు. ఈలోగా రాయ్‌ని తొందరపడి ఏమీ అనవద్దని, మళ్ళీ తూర్పుదేశాలలో ఉభయులూ కలిసే అవకాశం వుందనీ స్నీవ్‌లైట్ రాశాడు. బహుశ అప్పుడు విషయాలన్నీ రాయ్ విడమరచి, మనస్సు విప్పి చెప్పవచ్చునని కూడా ఎవిలిన్‌ను ఓదార్చాడు. కాని అలాంటిదేమీ జరగలేదు. ఎవిలిన్ యూరోప్ నుండి వెళ్ళిపోయిన సంవత్సరంన్నరకు గాని రాయ్ చైనా వెళ్ళలేదు. ఈలోగా ఆయనకు లూసీగీస్లర్ అనే స్విస్ కమ్యూనిస్టు యువతితో సన్నిహిత పరిచయం ఏర్పడింది. ఆమెను అంతరంగిక కార్యదర్శిగా చైనా తీసుకువెళ్ళాడు. ఎవిలిన్-రాయ్ 9 ఏళ్ళ దాంపత్యం అలా ముగిసింది.

# అమెరికాలో ఎం.ఎన్. రాయ్

## (ఎవిలిన్‌పై నూతన అంశాల వెల్లడి)

ఎం.ఎన్. రాయ్ మానవవాదిగా మారక ముందు, ఆ మాటకొస్తే కమ్యూనిస్టుగా పరిణమించక పూర్వం, అమెరికాలో అడుగుపెట్టాడు. అప్పటికి ఆయన ఎం.ఎన్. రాయ్ కూడా కాదు. తల్లిదండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య మాత్రమే. అమెరికాలో ఎం.ఎన్. రాయ్ ఏం చేశాడు, ఎలా ఆవిర్భవించాడనే విషయం పరిశోధించి యిక్కడ చారిత్రక ఆధారాలతో

పొందుపరుస్తున్నాను. లోగడ వెలికిరాని సంగతులు గనుక ఆసక్తికరంగా వుండగలవు. పదవులు లేకుండా ప్రపంచ రాజకీయాలలో ప్రజల దృష్టిని ఆకర్షించిన రాయ్ జీవితంలో వెల్లడికాని సత్యాలలో కొన్నిటినైనా పూరించడమే యీ పరిశోధన ఉద్దేశం.

రాయ్ తన స్వీయ గాథలలో తన అమెరికా జీవితాన్ని గురించి స్థూలంగా ప్రస్తావించాడు. కొన్ని వదలివేశాడు. మరికొన్ని జ్ఞాపకం వుండకపోవచ్చు. కావాలని చెప్పకుండా దాటేసిన అంశాలు వున్నాయి. ఇప్పుడు అవన్నీ చరిత్రలో భాగం గనుక, పరిశోధనాత్మకంగా వెల్లడిస్తున్నాను.

అమెరికాలో ఎం.ఎన్. రాయ్ జీవితం పెద్ద మలుపు. పేరు మార్చుకున్నాడు. పెళ్ళి చేసుకున్నాడు. జాతీయ ఉగ్రవాదం సడలించి, సంవత్సరం పాటు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో, రెండున్నర సంవత్సరాలు మెక్సికోలో వున్న రాయ్ పూర్తిగా మారిపోయాడు.

జర్మనీ సహాయంతో బ్రిటిష్ వారిని భారతదేశం నుండి వెళ్ళగొట్టాలని ఎం.ఎన్. రాయ్ ఆనాడు భావించాడు. అలాంటి ఆలోచన సుభాష్ చంద్రబోసు 25 ఏళ్ళ తరువాత చేశాడు. ఇండియా నుండి జావా వెళ్ళిన రాయ్, తిరిగి వెనక్కు వెళ్ళజాలక, చైనా, జపాన్‌ల మీదుగా అమెరికా బయలుదేరాడు. నిప్పన్ మారో అనే ఓడలో ఓక్లహోమా నుండి అమెరికా పశ్చిమ తీరమైన శాన్‌ఫ్రాన్‌సిస్కోకు జూన్ 16 (1916)న చేరుకున్నాడు.

నిప్పన్ మారో అనే ఓడ జూన్ 15 (1916) రేవుకు వస్తున్నట్లు స్థానిక పత్రిక ప్రకటించింది. (డైలీ కమర్షియల్ న్యూస్ 1916 జూన్ 15) ఇలాంటి వార్తను ముందు రోజు కూడా ఆ పత్రిక ప్రచురించింది. బహుశ ఓడరాక ఒక రోజు ఆలశ్యమై వుంటుంది. ఆ ఓడలో ఎం.ఎన్. రాయ్ ప్రయాణం చేశాడు. ఓడలో విదేశీ ప్రయాణీకుల సమాచారం ప్రకారం రాయ్ పేరు మార్టిన్ చార్లెస్ అలెన్, వయస్సు 28 సంవత్సరాలు. క్రైస్తవ మతస్తుడు. ఫ్రెంచి జాతీయుడు. శాశ్వత చిరునామా, దేవాలయం. పాండిచేరి, ఇండియా, చేరదలచిన స్థలం పారిస్. స్నేహితులు, బంధువులు ఎవరూ లేరు. 6 అడుగుల ఎత్తు. నలుపు రంగు. గడ్డం వుంది. పుట్టిన స్థలం హైతి. నగరం అయోనియా. అలాంటి మారువేషంలో మారుపేరులో, బ్రిటిష్ పోలీస్‌ను తప్పించుకుంటూ రాయ్ తొలి ప్రపంచ యుద్ధకాలంలో అమెరికాలో అడుగుపెట్టాడు. మే 28న ఓక్లహోమాలో బయలుదేరిన ఓడ ఫసిఫిక్ మహాసముద్రంలో 18 రోజులు ప్రయాణం చేసి శాన్‌ఫ్రాన్‌సిస్కో చేరిందన్న మాట.

ఓడలో ప్రయాణం చేస్తున్నప్పుడు రాయ్ మౌనం వహించక, అమెరికాలో నీగ్రోలు అక్కడి పాలకులపై తిరగబడి, తమ హక్కుల కోసం పోరాడాలని ప్రయాణికులతో చెప్పాడట. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ రికార్డులలో యీ విషయం ప్రస్తావించారు.

శాన్‌ఫ్రాన్‌సిస్కోలో బెల్‌వ్యూ అనే హోటల్‌లో రాయ్ బస చేశాడు. శాన్‌ఫ్రాన్‌సిస్కో క్రానికల్ పత్రిక యీ విషయం లోపల పేజీలలో చాలా అప్రధానంగా, చిన్న అక్షరాలలో 'హోటల్ కబుర్లు' అనే శీర్షిక కింద ప్రకటించింది. "చాలాకాలంగా ఇండియాలో గడిపిన రోమన్ కాథలిక్ మత

గురువు సి.ఎ. మార్టిన్ పారిస్ వెడుతూ యిక్కడ బెల్‌వ్యూలో మకాం పెట్టాడు. పారిస్‌లో ఆయన మత అధ్యయనం చేయనున్నారు. గత రెండేళ్ళుగా ఆయన చైనా, జపానుల్లో వున్నారు" (శాన్‌ఫ్రాన్‌సిస్కో క్రానికల్ జూన్ 16, 1916).

మరో స్థానిక దినపత్రిక శాన్‌ఫ్రాన్‌సిస్కో ఎగ్జామినర్ కూడా రాయ్ విషయం లోపల పేజీలలో అతిసాధారణ అంశంగా ప్రచురించింది. "రెవరెండ్ సి.ఎ. మార్టిన్, ఇండియాలో పాండిచేరివాసి, ప్రస్తుతం బెల్‌వ్యూలో వున్నారు. ఆయన రోమన్ కాథలిక్. రెండేళ్ళుగా చైనాలో మత ప్రచారకుడుగా, విద్యార్థిగా వున్నారు. పారిస్ వెడుతున్నారు, చైనాలో పరిస్థితులు విపరీత గందరగోళంగా వున్నట్లు ఆయన వర్ణించారు". (జూన్ 16, 1916)

ఎం.ఎన్. రాయ్‌ను పత్రికా ప్రతినిధులు కలసి వుంటారు. ఆయన చెప్పిన కథనాన్ని వారు చిన్న వార్తగా ప్రచురించారు.

మొదటి ప్రపంచ యుద్ధం మధ్యలో వున్న సమయంలో, బ్రిటిష్ పోలీసుల సమాచారం యింకా అమెరికాకు చేరక ముందు, రాయ్ ఒక మతగురువు వేషంలో గడ్డం పెంచి అలా అమెరికాలో అడుగుపెట్టాడు. ఇండియాలో ఉగ్రజాతీయవాదిగా బ్రిటిష్ వారితో పోరాడుతున్నప్పుడు రాయ్ సహచరుడుగా జదుగోపాల్ ముఖర్జీ వుండేవాడు. అతడి సోదరుడు ధనగోపాల్ ముఖర్జి అంతకు ముందు కొన్నాళ్ళుగా అమెరికాలో వుంటున్నాడు. రాయ్ హోటల్ ఖాళీచేసి పాలో ఆల్టో అనే ప్రదేశంలో వున్న స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రాంగణంలో ప్రవేశించాడు. అక్కడ ధన్‌గోపాల్ ముఖర్జీని కలిశాడు.

ధన్‌గోపాల్ ముఖర్జీ 1906 నాటికే అమెరికా వచ్చాడు. అతడు బెంగాలీ పురోహితుడి కుమారుడు. ధన్‌గోపాల్ స్టాన్‌ఫర్డ్‌లో చేరి 1914లో గ్రాడ్యుయేట్ అయ్యాడు. రాయ్ వచ్చే సరికి అదీ పరిస్థితి. ధన్‌గోపాల్ రచయిత, కవి. జనీస్, ఫ్రెంచి భాషలు మాట్లాడగల ప్రతిభాశాలి. అతడు ఎథెల్ రేడ్యూగన్ అనే అమెరికన్ ఐరిష్ యువతిని ప్రేమించాడు. ఆమె కూడా స్థాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో 1915లో గ్రాడ్యుయేట్ అయింది. రాయ్ వచ్చేసరికి ధన్‌గోపాల్, ఎథెల్ డేటింగ్ (ప్రేమ సంసారం) చేస్తున్నారు. వారికి అతిథిగా వచ్చిన రాయ్‌కు అక్కడే ఎవిలిన్ ట్రెంట్ పరిచయమైంది. ఎవిలిన్ కూడా రాయ్ వచ్చేనాటికి స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ఉద్యోగాన్వేషణలో వున్నది. ఎవిలిన్, ఎథెల్ సన్నిహిత స్నేహితురాళ్ళుగా వున్నారు. ఆ విధంగా రాయ్-ఎవిలిన్‌లు కలుసుకున్నారు. అది రాయ్ జీవితంలో పెద్ద మలుపు. ఎవిలిన్ జీవితంలో గొప్పమార్పు.

నరేంద్రనాథ్ భట్టాచార్య ఎలియాస్ చార్లెస్ మార్టిన్ స్టాన్‌ఫర్డ్‌లో మానవేంద్రనాథ్ రాయ్‌గా మారాడు. ఎవిలిన్, రాయ్‌లు ప్రేమించుకున్నారు. డేటింగ్ ప్రారంభించారు. అమెరికాలో పెళ్ళికాక ముందు పరస్పరం అవగాహన చేసుకోడానికి, భవిష్యత్తులో సుఖంగా గడపడానికి

వీలుగా యిరువురూ కలసి వుంటారు. ఆ సమయంలో అభిరుచులు, అభిప్రాయాలు గ్రహించి, అంగీకరిస్తే పెళ్ళి చేసుకుంటారు. లేకుంటే, ఎవరి దారి వారిది. ఈ పద్ధతిని డేటింగ్ అంటారు. ఇది తల్లిదండ్రులు సమాజం అంగీకరించిన విధానం. రాయ్, ఎవిలిన్‌లు అదే పద్ధతి అనుసరించారు. ఇంచుమించు ఒక ఏడాది కలిసివున్న తరువాత, పెళ్ళి చేసుకున్నారు. ఎవిలిన్ విషయం రాయ్ తన స్మృతులలో ప్రస్తావించలేదు. ఎవిలిన్ కూడా పుస్తక రూపేణా రాయ్‌ను గురించి ఏదీ రాయలేదు. అందువలన పరిశీలన శ్రమతో కూడిన పరిశోధనగా మారింది.

రాయ్ జీవితంలో ప్రవేశించి, రాయ్‌లో మార్పులకు ప్రధాన వ్యక్తిగా వున్న ఎవిలిన్ గురించి లోగడ అతిస్వల్పంగా మాత్రమే సమాచారం తెలిసింది. 1992లో ప్రారంభించి, 1994లో కొనసాగించి, ఎవిలిన్ గురించి చాలావరకు పరిశోధన పూర్తి చేయగలిగాను. అమెరికాలో విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, లైబ్రరీలు పురావస్తు మ్యూజియంలు ఇందుకు తోడ్పడ్డాయి. వ్యక్తులతో ఉత్తర ప్రత్యుత్తరాలు కొంత ఉపయోగించాయి. మొత్తం మీద ఎవిలిన్ గురించి చాలా వరకు సమాచారం అందించగలుగుతున్నందుకు పరిశోధకుడుగా తృప్తి చెందుతున్నాను.

మొదటి భర్తకు మొదటి భార్యగానే ఎవిలిన్ వున్నట్లయితే ఎం.ఎన్. రాయ్ అమెరికా జీవితం, ఎవిలిన్ పరిశోధన అనవసరం అనిపించేదే కాని, వారిరువురూ అంతర్జాతీయ రాజకీయాలలో ఎంతో ప్రధానపాత్ర వహించారు. ఇతరులపై చాలా ప్రభావం చూపెట్టారు. ఎవిలిన్ గురించి సమరేన్ రాయ్ ఒక్కరే కొంత పరిశీలించి, చాలా పరిమితంగా సమాచారం సేకరించగలిగారు. ఆయనను సంప్రదించాను కూడా. శిబ్ నారాయణ్‌రే కొన్ని అడ్రసులు ఇచ్చినప్పటికీ అవి అంతగా తోడ్పడలేదు. చివరకు స్వయంశక్తిపై ఆధారపడి, తిప్పలుపడి కొన్ని మార్గాలు కనుక్కోగలిగాను.

ఎవిలిన్ గురించి, ఆమె కుటుంబాన్ని గురించి క్లుప్తంగా ప్రస్తావించి, ఎం.ఎన్. రాయ్‌తో పరిచయం అయ్యే నాటికి ఆమెపట్ల అవగాహన ఏర్పరచడానికి ప్రయత్నిస్తాను.

ఎవిలిన్ లియోనార్డ్ ట్రెంట్ ఆమె పూర్తి పేరు. ట్రెంట్ ఇంటిపేరు. లియోనార్డ్ అని స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదివేటంత వరకూ వాడుకలో వున్నా, ఆ తరువాత కేవలం ఎవిలిన్ ట్రెంట్ అనే రాసుకున్నది. ఎవిలిన్ తల్లి అమెరికా స్త్రీ అయినా, తండ్రి బ్రిటిష్ పౌరుడు. ఎడ్విన్, అగస్టాలకు 1848 డిసెంబరు 13న లమార్టిన్ కనైనాక్ ట్రెంట్ పుట్టాడు. 12 సంవత్సరాల నాటికే ఓడలో అమెరికా చేరుకున్నాడు. మూడేళ్ళ పాటు సముద్రాల మీద ఓడల్లో పనిచేస్తూ తరువాత అమెరికా సివిల్ వార్‌లో పాల్గొని రెండుసార్లు గాయపడ్డాడు. బాగా కష్టపడి, గనుల ఇంజనీర్ అయ్యాడు.

లమార్టిన్‌కు గొప్ప పేరు ప్రఖ్యాతులు రాగా, జపాన్, ఆస్ట్రేలియా, టాస్మానియా ప్రభుత్వాలు ఆయన్ను పిలిపించి, సలహాలు స్వీకరించాయి. కలరెడొ రాష్ట్రంలో బౌల్డర్

ప్రాంతంలో మేరిడిలోంమెక్లాయిడ్ అనే ఫ్లోరిడా రాష్ట్ర యువతిని 1888 జూన్ 5న పెళ్ళి చేసుకున్నాడు. ఆ దంపతులకు 1892లో ఎవిలిన్ పుట్టింది. అప్పటికి గనుల ఇంజనీరుగా ఉటా రాష్ట్రంలోని లేక్ వ్యూ సిటీలో లామార్టిన్ వున్నాడు. ఎవిలిన్ తరువాత పుట్టినవారు చనిపోగా, ఆమె ముద్దులబిడ్డగా పెరిగింది. ఇంట్లో ఆమె చిన్నపిల్ల. మిగిలినవారు ఇనజ్, లేలాదిలోం, హెలెన్, వాల్టర్ ఎడ్విన్, ఫ్లోరెన్స్‌లు, ఇంజనీరింగ్ కంపెనీ తన పేరిట స్థాపించి, బాగా ఆర్జించిన లామార్టిన్, పిల్లలకు మంచి విద్య చెప్పించాడు. కొన్నాళ్ళ పాటు కంపెనీ అమ్మేసి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తిరిగివచ్చి కాలిఫోర్నియా రాష్ట్రంలో కుదురుకున్నాడు. అందువలన ఎవిలిన్ తల్లిదండ్రులతో బాటు తిరుగుతూ ప్రాథమిక విద్య భిన్న ప్రాంతాల స్కూళ్ళలో పూర్తిచేసింది. కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఆబర్న్‌లో స్కూలు విద్య అయిన తరువాత, లాస్ ఏంజలస్‌లోని స్త్రీల పాలిటెక్నిక్‌లో 1908లో చేరి హైస్కూలు విద్య నేర్చింది. అంతవరకూ ఎవిలిన్ జీవితం సాధారణంగా గడిచింది.

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం అప్పటికి యిప్పటికి అమెరికాలో ప్రతిష్టాత్మక సంస్థ. ఎవిలిన్ అందులో 1911లో ప్రవేశించింది. ఇంకా స్త్రీలకు ఓటుహక్కులేని రోజులవి. పైగా స్త్రీలను సమానంగా కూడా చూడడానికి అంతగా అలవాటు పడని విద్యాసంస్థల వాతావరణంలో ఎవిలిన్ ప్రవేశించింది. ఆమె కంటె ఆమె అన్న ఎడ్విన్ స్టాన్‌ఫర్డ్‌లో ముందే చేరి చదివాడు. అక్కడ చదవడం పెద్ద గౌరవం.

ఎవిలిన్ స్టాన్‌ఫర్డ్‌లో ఇంగ్లీషు సాహిత్యం ప్రధాన కోర్సుగానూ, ఫిలాసఫి ఫ్రెంచి అనుబంధ విషయంగానూ స్వీకరించింది. ఎవిలిన్ రెండో సంవత్సరంలోనే తన ప్రతిభను కనబరుస్తూ స్టేజిపై ఇంగ్లీషు నాటకాలలో పాల్గొన్నది. 1913 ఆగస్టు 28న స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ థియేటర్‌లో థామస్ ఆగస్టన్ రాసిన ఆన్‌ది క్వయట్ అనే హాస్య నాటకంలో ఎథెల్ పాత్ర నిర్వహించింది. ఈ నాటకానికి ముందే బాగా ప్రచారం యిచ్చారు. ఎవిలిన్ తన పాత్రను ఎంతో చక్కగా పోషించినట్లు పత్రికలు రాశాయి. ఈ నాటకం మూడు అంకాలతో కూడిన హాస్యప్రధానం. 20వ శతాబ్దం తొలి దశాబ్దంలో అమెరికా అత్యుత్తమ నాటికలో ఒకటిగా శ్లాఘించిన "ఆన్‌ది క్వయట్" న్యూయార్క్ బ్రాడ్వే థియేటర్లలో ఒక దశాబ్దం తరచు ప్రదర్శించారు. ఎవిలిన్ ఉచ్చారణ, ఉదాత్త అనుదాత్త స్వరం, పాత్ర పోషణ బాగా గుర్తింపు పొందాయి. అలా తన ప్రతిభను చూపిన ఎవిలిన్ 1913-14లో యూనివర్శిటీ పత్రిక "క్వాడ్"లో సహసంపాదకురాలుగా వున్నది. ముఖ్యంగా ఆటల్లో టెన్నిస్, ఫెన్సింగ్‌లో పాల్గొన్నది. స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో చదువుతుండగా ఎవిలిన్ తరచు తల్లికి ఉత్తరాలు రాస్తుండేది. వాటిని బట్టి కొంత సమాచారం లభిస్తున్నది. యూనివర్శిటీలో కొందరు బెంగాల్ వారుండేవారు. వారితో రవీంద్రనాథ్ ఠాగోర్ సాహిత్యం చర్చ చేసినట్లు ఎవిలిన్ పేర్కొన్నది. అలాగే మెక్సికన్ల సమావేశాల వలన వారి అలవాట్లు ఆచారాలు తెలుసుకున్నది. ఉత్తరోత్తర రాయ్‌తో బాటుగా మెక్సికో వెళ్ళినప్పుడు అవి తోడ్పడ్డాయి.

యూనివర్శిటీ విద్యార్థినిగా ఎవిలిన్‌కు ధనగోపాల్ ముఖర్జీ పరిచయం వున్నప్పటికీ,

సన్నిహిత స్నేహితురాలు ఎథెల్ రేడ్యుగన్ మాత్రమే. ఎథెల్, ధనగోపాల్ ప్రేమ వలన ఎవిలిన్ యిరువురికీ సన్నిహిత స్నేహితురాలైంది.

ఎథెల్ రేడ్యుగన్ అమెరికన్ ఐరిష్ యువతి. ఆమె కూడా 1915లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ధనగోపాల్ 1914లోనే చరిత్ర ప్రధానాంశంగా గ్రాడ్యుయేట్ అయ్యాడు.

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డేవిడ్ జోర్డన్‌స్టార్ వుండేవారు. ఆయన 1931లో ఛాన్సలర్‌గా రిటైర్ అయితే, శాశ్వత గౌరవ ఛాన్సలర్ పదవి యిచ్చారు. జోర్డన్ శాంతి కాముకుడు, సైంటిస్టు. అమెరికాలోని ప్రత్యేక జీవరాశిని ఏరి, అధ్యయనం చేసి రాశారు. ఆయన రచనలు, ఉత్తరాలు, డైరీలు భద్రపరిచారు. అయన భార్య చనిపోయిన తరువాత మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. రెండో భార్య ఆయనకు మేధా సహచారిణిగా వుండేది. (జెస్సిలూసినైట్) ఆమెను అప్పుడప్పుడు ఎవిలిన్, ఎథెల్ కలుసుకుంటుండేవారు. అలాంటి సందర్భాలలో డేవిడ్ జోర్డన్ స్టార్‌ను కూడా కలిశారు. ఆల్ఫాఫి సారొరిటి విభాగానికి చెందిన ఎవిలిన్ మేధావిగా రాణించింది.

గ్రాడ్యుయేషన్ ముగించుకొన్న ఎవిలిన్ 1916లో ఉద్యోగాన్వేషణ ప్రారంభించింది. పేదవారి సమస్యలపై వ్యాసాలు రాయాలని, జర్నలిజంలో స్థిరపడాలని ఆమె తలపోసింది. అలాంటి దశలో ఎం.ఎన్. రాయ్ తటస్థపడ్డాడన్నమాట.

రాయ్‌తో బాటుగా నిప్పన్ మారో ఓడలో భగవాన్‌సింగ్ అనే జాతీయ ఉగ్రవాది ప్రయాణం చేసినట్లు అమెరికా ఎఫ్.బి.ఐ. రికార్డు చెబుతుంది.

శాన్‌ఫ్రాన్సిస్కో నుండి జూన్ 17 లేదా 28 తేదీలలో (1916) రాయ్ బయలుదేరి, హోటల్ గదీ ఖాళీచేసి, స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రాంగణంలో ధనగోపాల్ ముఖర్జీని కలసి వుంటారు. బహుశ కొద్ది రోజులలోనే ఎవిలిన్‌తో కూడా పరిచయం అయి వుంటుంది. ఈ ఘట్టాలకు సంబంధించిన తేదీలు, పాత్రలు ఏవీ లేవు. ధనగోపాల్ ముఖర్జీకి సంబంధించిన పత్రాలు పెన్సిల్వేనియా యూనివర్శిటీ, సిరక్యూస్ యూనివర్శిటీలలో వున్నా, రాయ్ ప్రస్తావన ఏదీ లేదు. అతడి రచనలలో కూడా ఎక్కడా రాయ్ సందర్భం రాలేదు. ఎథెల్ రేడ్యుగన్ ఎక్కడైనా ప్రస్తావించినట్లు దాఖలాలు లభించలేదు. అసలు వ్యక్తులు రాయ్-ఎవిలిన్‌లు యీ విషయాలు రాయలేదు.

## ఎం.ఎన్. రాయ్ ఎవిలిన్ దంపతులు

స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ పాలో ఆల్టో అనే చిన్న ప్రాంతంగా వున్నది. ధనగోపాల్ ముఖర్జీ 1916లో అక్కడే నివసిస్తుండేవాడు. (861 రమోనా, పాలో ఆల్టో, కాలిఫోర్నియా) రాయ్ కూడా దగ్గరలోనే ఒక యింట్లో వుంటుండేవాడు. (245 రమోనావీధి, పాలో ఆల్టో). అయితే రాయ్ వుంటున్న యిల్లు పాలో ఆల్టో పోలీస్ అధిపతి తల్లి నివాసం. ఆ విషయం రాయ్‌కు తెలిసి

వుండదు. ఆమె పేరు ఎ.ఎఫ్. నోబెల్. రాయ్ ఫలానా వ్యక్తి అని తెలిసిన తరువాత నోబెల్‌ను కనుక్కుంటే, రాయ్‌కు చాలా ఉత్తరాలు వస్తుండేవనీ, ఇంగ్లండ్ నుండి ఎక్కువగా పోస్టు వచ్చేదని ఆమె చెప్పింది. కొన్నాళ్ళు రాయ్‌తో బాటు ఎస్.పి. సర్కార్ అనే జాతీయవాది వున్నాడు కూడా పాలో ఆల్టో ప్రాంతంలో క్లీనింగ్ అండ్ ప్రెస్సింగ్ సంస్థతో రాయ్ సంబంధం పెట్టుకున్నట్లు అమెరికా గూఢచారి సంస్థ కనుగొన్నది. అది జపాన్ వారి వ్యాపార కేంద్రం. రాయ్ తన పట్టుదల కొనసాగిస్తూ జర్మనీ నుండి ధనసహాయ ప్రయత్నాలు చేశాడు, అది రావడం ఆలశ్యమౌతూనే వుంది.

ఎవిలిన్-రాయ్‌లు ప్రేమించుకొని, పెళ్ళి చేసుకుందామనుకున్న తరువాత, ఎవిలిన్ తల్లిదండ్రులను కలిశారు. వారప్పుడు లాస్ ఏంజలస్ నగరంలో వుంటున్నారు. ఎవిలిన్ సోదరి పోవెల్ కూడా అక్కడే వుంటున్నది. ఉద్యోగాన్వేషణ విరమించి, ఎవిలిన్ యూరప్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు పెట్టుకున్నది. అవి ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులు. ఒక పట్టాన పాస్‌పోర్టు రాదు. కనుక స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ ఛాన్సలర్ డేవిడ్ జోర్డన్ స్టార్‌ను రికమండేషన్ కోరుతూ ఎవిలిన్ జూలై 31 (1916)న లాస్ ఏంజలస్ నుండి కోరింది. ఆయన భార్యతో తన పరిచయాన్ని, ఎథెల్ తానూ కలిసి ఆయన యింటికి వచ్చిన విషయాన్ని గుర్తు చేసింది.

జోర్డన్ వెంటనే స్టేట్ డిపార్ట్‌మెంట్‌కు సిఫారసు లేఖ పంపాడు. ఆ లేఖ చేరక ముందే ఎవిలిన్ పాస్‌పోర్టు దరఖాస్తు పంపివేసింది. అయితే జోర్డన్‌కు ధన్యవాదాలు జాబు ఆగస్టు 15న (1916) లాస్ ఏంజలస్ నుండే రాసింది.

ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్‌లు జర్మనీకి యు-53 జలాంతర్గామిలో పోదామనుకున్నారు. కాని ఎవిలిన్ కుటుంబం అందుకు అభ్యంతరపెట్టగా ఆ ప్రయత్నం విరమించారు. ధనగోపాల్ యీ విషయం ఒక సందర్భంలో సి.సి. ఆంథోనికి చెప్పాడు.

ఎవిలిన్ అన్న వాల్టర్ ఎట్యీన్ న్యూయార్క్‌లో వ్యాపారం చేస్తున్నాడు. అతడిని కలిసి సహకారం పొందాలని ఎవిలిన్ తలపెట్టి నిస్పృహ చెందింది. ఎవిలిన్ కుటుంబంలో కొందరు ఎం.ఎన్. రాయ్‌ను యిష్టపడగా మరికొందరు జాతి, రంగు ద్వేషం తొలగించుకోలేక, వారి పెళ్ళికి విముఖత చూపారు. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆర్నెల్లు వున్న తరువాత రాయ్-ఎవిలిన్‌లు న్యూయార్క్ చేరుకున్నారు. 1917 జనవరి నుండే తమ కార్యకలాపాలు న్యూయార్క్‌లో సాగించారు. ఈలోగా బ్రిటిష్ పోలీస్ వత్తిడిపై అమెరికా గూఢచారులు రాయ్ వెంట, భారత జాతీయవాదుల వెంటబడ్డారు. న్యూయార్క్‌లో రాయ్ తరచు నివాసాలు మార్చవలసి వచ్చింది. కొన్నాళ్ళు 236ఇ, 19వ వీధి, న్యూయార్క్‌కు మారాడు. ఇంకొన్నాళ్ళు 2116, డాలె ఎవెన్యూ, న్యూయార్క్‌లో వున్నాడు. పోలీసులు కనుగొనేలోపు యిలా యిళ్ళు మార్చవలసి వచ్చింది.

మరోవైపు భారత జాతీయ అతివాదులు కొందరు రాయ్ నుండి ఆర్థిక సహాయం

ఆశించారు. అలాంటివారిలో శైలేన్ ఘోష్ ఒకరు. సమయానికి జర్మనీ నిధులు అందక, రాయ్ మాట నిలబెట్టుకోలేక యిబ్బందుల పాలయ్యాడు. శైలేన్ ఘోష్ స్టాన్‌ఫర్డ్ నుండి నిష్టూరంగా టెలిగ్రాంలు యిస్తుండేవాడు. కొంచెం ఓపిక పట్టమని రాయ్ కోరుతుండేవాడు.

ఆర్థిక యిబ్బందులు తట్టుకోడానికి ఎవిలిన్ రకరకాల ఉద్యోగాలు చేసింది. న్యూయార్క్‌లోని అమెరికన్ సొసైటి, 131ఇ, 23వ వీథిలో రాయ్ కొన్నాళ్ళు, 6728వ ఎవెన్యూలోని సిలోన్ రెస్టరెంట్ అడ్రస్ సహచరులకు యిచ్చాడు.

న్యూయార్క్‌లో మూడు మాసాల పాటు లజపతి రాయ్‌తో ఎం.ఎన్. రాయ్ గడపగలిగాడు. ఎవిలిన్ ఆయన వద్ద పని చేయగా కొంత ఆర్థిక సహాయం చేయగలిగాడు. భారతీయ ఉగ్ర జాతీయవాదులలో కల్లా ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్‌లలో ఆయన శీలం, ప్రతిభ చూచి మెచ్చుకున్నాడు. అయితే అభిప్రాయ భేదాలు వున్నాయి.

చంద్రకాంత చక్రవర్తి మొదలు అనేక మంది భారతీయ జాతీయవాదులు రాయ్, ఎవిలిన్‌ల పట్ల ఈర్ష్య అసూయా ద్వేషాలు చూపారు. దుష్ప్రచారాలు చేశారు. ఈ లోగా రాయ్‌ను అమెరికన్ పోలీసులు వెంటాడి పట్టుకోగా అటార్నీ ఆయన్ను ప్రశ్నించాడు. సాక్ష్యాధారాలు సరిగా దొరకలేదు. అరెస్టు అయిన రాయ్ వెంటనే ఎవిలిన్‌ను పెళ్ళి చేసుకొన్నాడు. జైలులో వారు పెళ్ళి చేసుకోలేదని చంద్రకాంత్ చక్రవర్తి చేసిన ప్రచారాన్ని ఎవిలిన్ ఖండించింది. (రిచర్డ్ పార్క్ అనే పరిశోధకుడికి రాసిన లేఖ) డేనియల్ జేకబ్ అనే రాజకీయ శాస్త్రజ్ఞుడు కూడా జైలులోనే పెళ్ళి జరిగిందని రాశాడు. (బరోడిన్, స్టాలిన్స్ మేన్ చూడు, 1981 ప్రచురణ-హార్వర్ట్ యూనివర్శిటీ ప్రచురణ) రాయ్-ఎవిలిన్ పెళ్ళి జరిగినట్లు ఆ తరువాత ఎవిలిన్ తన దగ్గర పనిచేసినట్లు లజపతి రాయ్ రాశాడు. ఈ లోగా 1917 జూన్‌లో అమెరికాలో దేశద్రోహ నేరం కింద భారతీయ ఉగ్రవాదుల్ని అరెస్టు చేశారు. రాయ్ అలా అరెస్టు కాదలచుకోలేదు.

స్నేహితుల ద్వారా పుట్టినతేది, సర్టిఫికెట్, పాస్‌పోర్టు మరొకరిది తెప్పించుకున్నాడు. రైల్లో ఇరువురూ ప్రయాణం చేశారు. టెక్సాస్ రాష్ట్రంలోని లారెడో మీదగా జోస్, ఎలెన్ పేరుతో అమెరికా నుండి సరిహద్దులు దాటి మెక్సికో చేరుకున్నారు. ఆ తరువాత రాయ్ పాస్‌పోర్టును, సర్టిఫికెట్‌ను తిప్పి స్నేహితుడికి పంపేశాడు. (భిల్స్‌కు ఎలెన్ లేఖ 1920 మే3న ఎఫ్.బి.ఐ. 9771-బి. 41.

రాయ్ మెక్సికో పారిపోయాడని తెలియక న్యూయార్క్‌లో పోలీసులు గాలించారు. సాటర్‌డే పోస్టు పత్రిక విలేఖరిగా ఒక గూఢచారి శ్రీమతి బ్లాక్‌షార్డ్‌కు ఫోనుచేసి రాయ్‌ను గురించి, ఆరాతీస్తూ, రాయ్ ఒక కథ ప్రచురణ నిమిత్తం పంపాడనీ కొన్ని సందేహాలుండి ఫోను చేస్తున్నాననీ చెప్పాడు. రాయ్ తన దగ్గర వుండడం లేదని ఆమె చెప్పింది.

అరెస్టు అయిన వారితోబాటు భారతీయ ఉగ్రవాదులపై ఫిర్యాదులు విచారించి, శాన్‌ఫ్రాన్సిస్కోలో శిక్షలు విధించారు. పరోక్షంలో రాయ్‌ను శిక్షించామన్నారు. లజపతిరాయ్ కూడా

జులై 7 (1917)న ఎం.ఎన్. రాయ్‌కు శిక్ష విధించినట్లు పేర్కొన్నాడు. ఎటొచ్చీ శిక్ష అనుభవించాల్సిన రాయ్ మెక్సికోలో సురక్షితంగా వున్నాడు! ఆయనతో బాటు ఎవిలిన్ కూడా వున్నది.

## మెక్సికోలో ఎం.ఎన్. రాయ్-ఎవిలిన్

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒక ఏడాదిపాటు ఉగ్ర జాతీయవాద భారత రాజకీయాలు కొనసాగించిన ఎం.ఎన్. రాయ్ కొంత మారాడు. విశాల ప్రపంచం చూడడం, వివిధ వ్యక్తులను కలియడం కారణం కాగా, ఎవిలిన్‌ను పెళ్ళిచేసుకోవడం ప్రధాన కారణం. జర్మనీ నుండి డబ్బు, ఆయుధాలు సేకరించి బ్రిటిష్ వారి పాలన అంతం చేయాలనే ఆలోచన యింకా వుంది. జూన్ 15 (1917) నాటికి సరిహద్దులు దాటి మెక్సికో పారిపోయిన ఎం.ఎన్. రాయ్‌కు వూపిరి పీల్చుకున్నట్లయింది. అక్కడ రాయ్ గురించి ఆరాతీసిన బ్రిటిష్ రాయబార కార్యాలయం ఎప్పటికప్పుడు అమెరికాకు సమాచారాన్ని అందించింది. మెక్సికోలో రాయ్‌ను అరెస్టు చేసి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు తీసుకురావాలనే ప్రయత్నం విఫలమైంది.

మెక్సికో రాజధాని మెక్సికో నగరంలో రాయ్ దంపతులు కాలెడికోర్డిబా, 33డి, సిడాడ్‌డి మెక్సికోలో వున్నారు. కొన్నాళ్ళపాటు మాన్యుల్‌మాండెజ్ అనే పేరుతో రాయ్ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించాడు.

ఎవిలిన్ ఒక పరిచయ లేఖతో మెక్సికోలోని యుకటిన్ రాష్ట్ర గవర్నర్ అల్వారాడో సాల్వొడార్‌ను కలసి, కొన్ని విద్యాపథకాలకు ప్రతిపాదనలు యిచ్చింది. రాయ్‌తో పాటు హీరేంద్రనాథ్ సేన్, శైలేన్ ఘోష్‌లు కొన్నాళ్ళు మెక్సికోలో వుండి పనిచేశాడు.

చిరకాలంగా జర్మనీ సహాయం కోసం ఎదురు చూడగా, జావాలో అందవలసిన డబ్బు, ఆయుధాలు అందకుండాపోగా, చివరకు మెక్సికోలో డబ్బు మాత్రం రాయ్‌కు అందింది. 1917 ఆగస్టు నాటికి ధనసహాయం లభించగా ఎవిలిన్ పేరిట బాంక్ అకౌంట్ తెరిచారు. 6750 డాలర్లు, 15 వేల మెక్సికో పెసోస్ వుండేవి.

ఎం.ఎన్. రాయ్ మెక్సికోలో తొలుత భారత జాతీయోద్యమ ప్రచారం చేబట్టాడు. స్పానిష్ భాషనేర్చి, అందులో కరపత్రాలు, చిన్న పుస్తకాలు ప్రచురించాడు. భారత స్నేహితులు అనే సంఘం స్థాపించి, అందులో ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్ డైరెక్టర్లుగా వున్నారు. కార్యాలయం చిరునామా 1056, మెక్సికో, డి.ఎఫ్. అని వుండేది. భారతదేశ స్వాతంత్ర్యావశ్యకత వివరిస్తూ, బ్రిటిష్-అమెరికా ధోరణి ఖండిస్తూ రచనలు, ఉపన్యాసాలు సాగించారు.

మెక్సికోలో వుండగా రాయ్ తన ఫోటోలు తీయనిచ్చేవాడు కాదని ఆయన స్నేహితులు అనేవారట. చంద్రకాంత చక్రవర్తి, లాలాలజపతిరాయ్‌లు మెక్సికోలో వున్న ఎం.ఎన్. రాయ్‌తో సంబంధాలు పెట్టుకున్నారు. కొన్నాళ్ళ పాటు రాయ్ ఉత్తరాలు, వ్యాసాలు యంగ్ ఇండియా పత్రికలో ప్రచురణార్థం లజపతిరాయ్‌కు పంపాడు.

మెక్సికోలో పర్యటించి భారత అనుకూల ప్రచార ప్రసంగాలు చేసినట్లు ఎవిలిన్ తన తల్లికి రాసిన ఉత్తరాలవలన తెలుస్తున్నది. ఎవిలిన్ కూడా యీ ప్రచారంలో పాల్గొన్నది. ఇండియా చూడాలని ఎవిలిన్ ఉవ్విళ్ళూరింది. రాయ్ ఉపన్యాసాల పట్ల మెక్సికోలో సానుభూతి కనబరచారని ఎవిలిన్ పేర్కొన్నది. ఇండియాలో పునర్జన్మ నమ్ముతారనీ, ఆ విషయం తెలుసుకోవాలనీ అనుకున్నది.

ఎం.ఎన్. రాయ్ మెక్సికో నుండి లజపతిరాయ్‌తో సంబంధాలు కొన్నాళ్ళు అట్టిపెట్టి 1918 మార్చి 27న కూడా ఒక వ్యాసం పంపాడు. ది యంగ్ ఇండియాలో ప్రచురణార్థం పంపిన ఆ వ్యాసంలో విప్లవ పార్టీ ప్రతినిధిగా తాను రాస్తున్నాననీ, ఇండియాకు పూర్తి స్వేచ్ఛ కావాలే గాని, బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా స్వాతంత్ర్యం అక్కరలేదనీ స్పష్టీకరించాడు. భారత స్వాతంత్ర్యంలో అనిబిసెంట్ లాంటివారు ఏనాడు నాయకులుగా చలామణి కాజాలరన్నాడు.

భారతదేశం స్వతంత్రరాజ్యంగా మనజాలదనే లజపతిరాయ్ అభిప్రాయంతో రాయ్ విభేదించి, అది తప్పుడు భావన అన్నాడు. ఇంగ్లండ్‌కు కావలసింది భారతదేశంపై ఆర్థిక గుత్తాధిపత్యం గనుక, హోంరూల్ ఇవ్వడంగాని, ఆర్థికస్వేచ్ఛ ప్రసాదించడంగాని జరగదని రాయ్ రాశాడు. ఇంగ్లండ్‌ను ప్రాధేయపడడం మానేసి, దేశపూర్ణస్వరాజానికి నిలబడమని లజపతిరాయ్‌ను కోరాడు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూలదోయాలనేవారు జర్మన్ కుట్రదారులని ఎలా భావించారని లజపతిరాయ్‌ని ప్రశ్నించాడు. ఇండియాలోని 31 కోట్ల జనాభా మనుషులేనంటూ, వారికి హోంరూలుగాని, స్వతంత్రంగాని, మరే పరాయిరాజ్యంగాని అవసరం లేదని ఎం.ఎన్. రాయ్ రాశాడు. విప్లవం మాత్రమే భారతదేశాన్ని విమోచన వైపుకు నడిపించగలదన్నాడు.

లజపతిరాయ్‌కు ఉత్తరం జతచేస్తూ, ఆయన అభిప్రాయాలు యంగ్ ఇండియాలో ప్రచురించడానికి అభ్యంతరం వుండదని భావిస్తున్నానన్నాడు. అన్ని రకాల అభిప్రాయాలకు యంగ్ ఇండియా చోటివ్వాలన్నాడు.

బరోడిన్ మెక్సికో వచ్చేవరకూ ఎం.ఎన్. రాయ్ ఉగ్రవాదిగానే వున్నట్లు తెలుస్తున్నది. అయితే అమెరికా నుండి వచ్చిన రాడికల్ సోషలిస్టులు, మెక్సికోలోని సోషలిస్టుల సాంగత్యంలో రాయ్ కొంత మారుతూ పోయాడు.

ఎవిలిన్ మెక్సికో నుండి అప్పుడప్పుడూ తన తల్లికి ఉత్తరాలు రాస్తూ విశేషాలు వివరించేది. ఎవిలిన్ మెక్సికోలో వుండగా ఆమె తలిదండ్రులు వాషింగ్టన్ ప్రాంతానికి మారారు. ఎవిలిన్ అనేక మారుపేర్లతో వ్యవహరించింది. మార్టిన్, రాయ్ ఎలెన్, ట్రెంట్ యిలా పేర్లు పెట్టుకుంటూ వుండేది. ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్‌లు జర్మనీ డబ్బువచ్చిన తరువాత పెద్ద బంగళా అద్దెకు తీసుకున్నారు.

బరోడిన్ మెక్సికో వచ్చిన తరువాత ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్‌లు పూర్తిగా కమ్యూనిస్టులుగా

మారిపోయారు. బరోడిన్ ఆర్థిక యిబ్బందులను రాయ్ తీర్చాడు. జర్మనీ వారిచ్చిన ధనం ఆ విధంగా ఉపయోగపడింది. మెక్సికోలో రాయ్ దంపతులు ఆతిథ్యం స్వీకరించడానికి కమ్యూనిస్టు, సోషలిస్టు ప్రముఖులు అప్పుడప్పుడు ఆయన బంగళాకు వెళ్ళేవారు.

మెక్సికోలో రాయ్ దంపతుల చరిత్రాత్మక పాత్ర చాలా వరకు గ్రంథస్థమైంది. వారి ఖ్యాతి లెనిన్ వరకూ చేరడం, మాస్కో ఆహ్వానంపై రాయ్ దంపతులు 1920 జనవరిలో క్యూబా నుండి బయలుదేరి యూరోప్ దేశాల మీదుగా రష్యా చేరడం చరిత్ర కథనంగా వెలువడింది. ఎలెన్ జోస్ అనే పేరుతో రాయ్ ప్రయాణం చేశాడు.

రష్యాలో వుండగా ఎవిలిన్ తన కుటుంబంతో సంబంధాలు పెట్టుకునే వున్నది. ఉత్తరాలు రాసింది. పెట్రోగ్రాడ్, తాష్కెంట్, మాస్కో నుండి రాస్తూ ఎం.ఎన్. రాయ్ కార్యకలాపాలు, పెట్రోగ్రాడ్‌లో ఒక ర్యాలీలో పాల్గొన్న ఫోటో, విశేషాలు రాసింది. రష్యా సాంఘిక పరిస్థితులు వివరించింది.

1920 అక్టోబరులో తాష్కెంటులో స్థాపించిన భారత కమ్యూనిస్టు పార్టీలో ఎవిలిన్ సభ్యురాలుగా వుంది. 1921లో మాస్కోలో స్టాలిన్, రాయ్ స్థాపించిన కమ్యూనిస్టు విశ్వవిద్యాలయంలో ఎవిలిన్ సిద్ధాంతాలు బోధించింది. 1938లో ఈ యూనివర్శిటీ మూసేశారు. ఎం.ఎన్. రాయ్ సోవియట్ యూనియన్‌లో వుండగా అక్కడ నుండి మెక్సికో వెళ్ళిన ప్రముఖ చిత్ర నిర్మాత, డైరెక్టర్ సర్గై అయిసెన్ స్టైన్ మెక్సికోపై ఒక చిత్రం నిర్మించాడు. దాని పేరు క్యూ వివా మెక్సికో. అంటే మెక్సికో వర్థిల్లాలి అని అర్థం. ఆ చిత్రంలో మెక్సికో సమాజాభివృద్ధి నిర్మాతలలో ఒకరుగా ఎం.ఎన్. రాయ్‌ను చూపారు. 1930 నాటికి చిత్రం పూర్తయింది. కాని విడుదల కాలేదు. చిత్రం పట్ల స్టాలిన్ అనాసక్తి అందుకు కారణం కావచ్చు. చిత్ర నిర్మాతకు ఉత్తరోత్తరా లెనిన్ అవార్డు లభించింది. 1949లో ఆయన చనిపోయాడు. ఆ తరువాత చిత్రం విడుదల కాగా అనేక అవార్డులు పొందింది. రాయ్‌కు అలాంటి గుర్తింపు మెక్సికోలో వచ్చిందని చెప్పడానికి యీ ప్రస్తావన తెచ్చాను. న్యూయార్క్ మోడరన్ ఆర్ట్ మ్యూజియంలో యీ ఫిలిం వుంది.

సోవియట్ యూనియన్‌లో యూరోప్ చైనాలో ఎం.ఎన్. రాయ్ పాత్ర గురించి చాలా గ్రంథాలు వెలువడ్డాయి. అయినా ఇంకెంతో బయటకు రావలసింది వుంది. నేటి పరిస్థితుల దృష్ట్యా మాస్కోలో పరిశోధిస్తే అనేక సంగతులు తెలుస్తాయి. అలాంటి పరిశోధన జరగవచ్చు. 1920-30 మధ్య రాయ్ గురించిన అనేక విషయాలు మాస్కో కె.జి.బి. రికార్డులలో వున్నాయని, చాలా వరకు రష్యన్ భాషలో వున్నాయని తెలుస్తుంది.

## ఎవిలిన్ ఇంగ్లండ్ ఎందుకు వెళ్ళింది?

భారత కమ్యూనిస్టు పార్టీని 1920 అక్టోబరులో స్థాపించిన అనంతరం తాష్కెంట్ నుండి తిరిగి మాస్కోకు వచ్చిన ఎం.ఎన్. రాయ్, ఎవిలిన్‌లు విపరీత కృషిలో నిమగ్నులయ్యారు. 1921 మేలో ఎవిలిన్ ఇంగ్లండ్ వెళ్ళింది. రెవల్ (టాలిక్) నుండి ఆమె ఇంగ్లండ్‌లోని డోవర్ చేరుకున్నది.

1921 మే 21న అలా రహస్యంగా, ఎలెన్ అనే మారుపేరుతో ఇంగ్లండ్ రాగానే పోలీసులు పట్టుకున్నారు. లోగడ ఎవిలిన్ మెక్సికో నుండి రష్యా వెళ్ళినప్పుడు, మెక్సికో పాస్‌పోర్టు వున్న దృష్ట్యా మెక్సికో రాయబార కార్యాలయం వారు ఆమెను మెక్సికోవాసిగా గుర్తించారు. ఇంగ్లండ్ నుండి 1921 జూన్ 11న ఎవిలిన్‌ను ప్లిమత్ రేవు నుండి బలవంతంగా వేరాక్రుజ్ (పనామా)కు పంపేశారు. ఇంగ్లండ్‌లో కేవలం 18 రోజులు మాత్రం ఎవిలిన్ వున్నది.

ఎవిలిన్ ఆరోగ్యం బాగాలేదనీ కనుక ఆమెను జాగ్రత్తగా చూచుకోవలసిందిగా ఎస్తోనియన్ కమ్యూనిస్టు డబ్లు ఇకాస్టరె టెలిగ్రాంలు పంపాడు. అందులో ఒకటి ఎవిలిన్ సోదరి హెలెన్‌కు తెలియపరుస్తూ, బాంక్ ఎక్కౌంట్ న్యూయార్క్‌కు మారుస్తున్నామని, మెక్సికోలో ఆమెతో సంబంధం పెట్టుకోమని కోరాడు. మెక్సికో వాలోడెజ్‌కు మరో టెలిగ్రాం యిచ్చాడు. మాంట్రియల్‌లో మెన్‌బ్రోసన్‌కు టెలిగ్రాం యిస్తూ ఎవిలిన్‌కు సహాయపడమన్నాడు. ఎవిలిన్ ఆరోగ్యం గురించి టెలిగ్రాంలో ప్రస్తావించినదంతా కేవలం నమ్మించడానికి చెప్పిన అబద్ధమని పోలీసులు గ్రహించారు.

క్యూబా నుండి అమెరికాకు రావడానికి ఎవిలిన్ ప్రయత్నిస్తే అరెస్టు చేయాలని అమెరికా పోలీస్ సిద్ధపడ్డారు. కాని అట్లా రాకుండానే ఎవిలిన్ మాస్కో వెళ్ళిపోయింది. ఇంతకూ ఎవిలిన్ ఇంగ్లండ్‌కు ఎందుకు వచ్చిందో, ఎవరిని కలిసిందో, ఏం చేసిందో, తెలియదు. జులై 22 (1921) వరకూ క్యూబాలో వుంది, తరువాత రష్యా వెళ్ళింది. మొత్తం మీద ఎవిలిన్ 1921లో తన తాత-తండ్రి స్వదేశాన్ని సందర్శించగలిగింది. భవిష్యత్తులో పరిశోధన చేయాల్సిన అంశంగా యిది మిగిలిపోయింది. తిరిగి రష్యా వెళ్ళిన ఎవిలిన్ కమ్యూనిస్టు ఉద్యమంలో నిమగ్నమైంది. రష్యా నుండి తలిదండ్రులకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేది. అట్లాంటా సిటిలో ఒక మధ్యవర్తి ద్వారా ఒకసారి తలిదండ్రులకు జాబు చేరవేసింది.

ఎవిలిన్ అన్ని విషయాలలో ఎం.ఎన్. రాయ్‌కు చేదోడువాదోడుగా రష్యాలో యూరోప్‌లో నిలచింది. మాస్కోలోని టాయిలర్స్ ఆఫ్ ది యీస్ట్ యూనివర్శిటీలో బోధిస్తూనే, యూరోప్‌లోని వివిధ ప్రాంతాల నుండి సాహిత్యాన్ని, పత్రికలను, డబ్బును భారత కమ్యూనిస్టులకు పంపేవారు. ఇంప్రెకార్, వాన్‌గార్డ్, అడ్వాన్స్ వాన్‌గార్డ్, ది మాసెస్ ఆఫ్ ఇండియా పత్రికలలో "శాంతిదేవి" అనే పేరుతో ఎవిలిన్ వ్యాసాలు రాస్తుండేది. అందులో లెనిన్‌పై, గాంధీపై వ్రాసినవి, భారతదేశంలో బొంబాయి మిల్లు వస్త్రాల కార్మికుల సమ్మె రచన ప్రసిద్ధమైనది. అలా యూరోపియన్ దేశాలు వెంటబడుతుండగా, స్థలాలు మార్చేసి, పత్రికలు ఆపకుండా నిర్వహించడంలో ఎవిలిన్ కృషి చాలా వుంది. బెర్లిన్, స్విట్జర్లాండ్, పారిస్ మొదలైన చోట్ల వీరి కేంద్రాలుండేవి.

"వాన్‌గార్డ్" పత్రికను అమెరికాలో 127 మందికి, చైనాలో 11 మందికి, పర్షియాలో ఒకరికి పంపేవారు. అమెరికాలో భగవాన్ సింగ్, చంద్రకాంత చక్రవర్తి, కొలంబియా యూనివర్శిటీలో ఇద్దరు ప్రొఫెసర్లు, న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీ మొదలైన చోట్లకు పంపేవారు. 1924 వరకూ యిలా సంబంధాలు పెట్టుకున్నారు. ఇండియాకు విపరీతంగా ప్రచార పత్రికలు, సాహిత్యం గుప్పించారు.

పారిస్‌లో ప్రొ ఇండియా కమిటి పేరిట రాయ్ దంపతులు సాగించిన కార్యకలాపాలకు రాయ్ దేశ బహిష్కరణకు గురైనాడు. ఎవిలిన్ ఆ పని సాగించింది. ప్రవాస భారతీయ కమ్యూనిస్టుల స్థితిగతుల గురించి రాసింది. హెన్రిబార్బుసా తోడ్పాటు కూడా యిందులో వున్నది. 1925 జులై 11, 12 తేదీలలో ఆంస్టర్‌డాంలో కలోనియల్ సభలలో ఎవిలిన్ ప్రముఖ పాత్ర వహించింది. యూరప్‌లో ఆమె చివరి కార్యకలాపాలు అవే. పారిస్‌లో జోషిని కలిసిన ఎవిలిన్, తాను చమన్‌లాల్‌ను కలుసుకోగోరుతున్నానని చెప్పింది. అతడు షక్లావత్, స్నేహితుడు. ఎవిలిన్‌కు వ్యతిరేకంగా షక్లావత్ వున్నందున చమన్‌లాల్ కూడా ఎవిలిన్‌ను కలవదలచలేదు. ఈ విషయం లోతుగా పరిశీలించాలని ఎవిలిన్ తలపెట్టింది.

భారతదేశ కమ్యూనిస్టులకు సాహిత్యాన్ని ఓడలలో నావికుల ద్వారా పంపే ఏర్పాట్లు చేయాలని ఎవిలిన్ వ్యూహం చెప్పింది. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యూహంలో బలంగా ఒక సంఘాన్ని ఏర్పరచాలని కూడా ఆమె సూచించింది. అందులో భారత సానుభూతివరులను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి ఇతర చోట్ల నుండి చేర్చుకోవాలని చెప్పింది. ఇంగ్లండ్‌లోని భారతీయులకు సాహిత్యాన్ని చేరవేసేటందుకు వెళ్ళమని ఆర్. డబ్ల్యు రాబ్సన్‌ను కోరింది.

## ఎవిలిన్ రాయ్ ఎడబాటు

ఎవిలిన్ 1925 జులై 30న పారిస్ నుండి అమెరికా బయలుదేరింది. అంటే ఆంస్టర్ డాం కలోనియల్ సభల అనంతరం, ప్రొఇండియా కమిటి నిషేధానికి గురి అయిన తరువాత స్వదేశానికి వెళ్ళిందన్నమాట. తన తల్లిని చూడాలనే కోరిక వెలిబుచ్చినట్లు చెబుతారు.

అమెరికాలో ఎవిలిన్ ప్రవేశించినట్లు తెలుసుకున్న పోలీసులు ఆమెను పట్టుకొని, వెనక్కు పంపాలని అనుకున్నారు. ఆమె ఎలా దేశంలో ప్రవేశించిందో ఆరాతీసారు. ఎవిలిన్ తన సోదరి మేరిడిత్ వద్ద శాక్రమెంటో (కాలిఫోర్నియా)లో వున్నట్లు కనుగొన్నారు. కాని ఆమెను దేశం నుండి పంపించివేసే ప్రయత్నాలు విరమించారు. ఎవిలిన్ శాక్రమెంటో శాన్‌హోక్విన్ లోయ ప్రాంతాల్లో పర్యటించి, ఇండియన్ల మధ్య ఆందోళన కొనసాగించింది.

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డేవిడ్ జోర్డన్ స్టార్‌తో ఎవిలిన్ ఉత్తర ప్రత్యుత్తరాలు మళ్ళీ ప్రారంభించింది. ఎవిలిన్ ప్రతిభను గుర్తించిన జోర్డన్, తన పుస్తకం "ది హయ్యర్ ఫూలిష్‌నెస్" రివ్యూ చెయ్యమని ఆమెకు పంపాడు. అయితే అప్పటికే శాన్‌ఫ్రాన్‌సిస్కో క్రానికల్ ఎడిటర్ టఫ్ట్స్ మరొకరికి ఆ పని పురమాయించినందున ఎవిలిన్ చేయలేకపోయింది. డచ్ అమెరికన్ ఆర్టిస్టు పీటర్ వాన్‌వాలీస్ బర్గ్‌ను జోర్డన్‌కు పరిచయం చేసిన ఎవిలిన్ అతడి చిత్రపటిమను శ్లాఘించింది. ఆ తరువాత జోర్డన్ ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆందోళన వెలిబుచ్చి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆశించింది. 1931లో జోర్డన్ చనిపోయాడు.

న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యున్ పత్రికలో ఎవిలిన్ వ్యాసాలు రాసింది. శాన్‌ఫ్రాన్‌సిస్కోలో

ప్రపంచ విషయాలపై అనేక ఫీచర్స్ నడిపింది. 1935 వరకూ అలా రాస్తూనే పోయింది. 1928 అక్టోబరు నుండి శాన్‌ఫ్రాన్‌సిస్కో కె.పి.ఓ. రేడియో నుండి ప్రతివారం ప్రపంచ విషయాలపై ప్రసారాలు, చర్చలు సాగించిన ఎవిలిన్ కార్యక్రమాలు బాగా ఆకర్షించాయి. న్యూయార్క్‌లో మక్లూర్ న్యూస్ పేపర్ సిండికేట్ వారి నవలలకు ఎవిలిన్ సంపాదకురాలుగా పనిచేసింది. పాశ్చాత్య నృత్యంలో తొలి ప్రావీణ్యత పొందిన యాగ్నిస్ బూన్ అనే ఆమెను గురించి స్టాన్‌ఫర్డ్ ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో ఎవిలిన్ మంచి వ్యాసం వ్రాసింది. ఎవిలిన్ అన్న వాల్టర్ ఎడ్విన్ న్యూయార్కులో వ్యాపారం చేస్తూ, రాయ్-ఎవిలిన్ తొలిపరిచయ రోజుల్లో విముఖంగా వున్నాడు. ఎవిలిన్ తిరిగి వచ్చిన తరువాత ఆయనలో మళ్ళీ సోదర సుహృద్భావంతో ఉత్తరాలు రాసి సత్సంబంధాలు నెలకొల్పింది.

ఎవిలిన్ తల్లిదండ్రులు వృద్ధులు కాగా విరామం విశ్రాంతి కోసం ఆబర్న్ (శాన్‌ఫ్రాన్‌సిస్కో దగ్గర) స్థిరపడ్డారు. ఎవిలిన్ వారితో అప్పుడప్పుడూ గడిపి శుశ్రూషలు చేసింది. న్యూయార్క్‌లో స్థిరపడింది. సీరియస్ పనిచేబట్టాలని ఎవిలిన్ ఉద్దేశించింది. అందుకు పూనుకునే లోపే 1931 జులైలో ఎవిలిన్ తల్లి చనిపోయింది. అప్పటి నుండి తండ్రికి ఆసరాగా ఎవిలిన్ ఆబర్న్‌లో వుండిపోయింది. అదే నెలలో ఎం.ఎన్. రాయ్‌ను ఇండియాలో బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఎవిలిన్ వెంటనే అరెస్టును ఖండిస్తూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తెగనాడుతూ రివల్యూషనరీ ఏజ్ పత్రిక (న్యూయార్క్)లో వ్యాసం రాసింది. 1931 అక్టోబరులో యీ వ్యాసం అచ్చయింది. దీనిని బట్టి అంతర్జాతీయ విషయాలలో బాగా శ్రద్ధ వహించిన ఎవిలిన్, రాయ్ పట్ల అభిమానంతో వున్నదని గ్రహించవచ్చు. అయితే ఎవిలిన్-రాయ్‌ల మధ్య 1925 చివర నుండే ఉత్తర ప్రత్యుత్తరాలుగానీ, మరే విధమైన సంబంధాలుగానీ వున్నట్లు ఆధారాలు లభించలేదు. ఉభయులూ తమ విషయాలు ఎక్కడా ప్రస్తావించలేదు.

## ఎం.ఎన్. రాయ్ పట్ల అమెరికాలో స్పందన

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నత స్థాయికి చేరుకున్న ఎం.ఎన్. రాయ్ 1923 నుండీ స్టాలిన్‌కు దూరమౌతువచ్చాడు. చైనాలో తన వైఫల్యాలకు స్టాలిన్ ఇతరులను కొరముట్లు చేసే ప్రయత్నం యిందుకు కారణం. ఇండియాలో అప్పటికే రాయ్ పరోక్షంలో ఆయనపై కుట్రకేసులు విచారణ చేసి, దొరికితే శిక్షించడానికి బ్రిటిష్ ప్రభుత్వం సిద్ధంగా వుంది. అలాంటి తరుణంలో కె.సి. బెనర్జి అనే సి.ఐ.డి.ని కమ్యూనిస్టు విప్లవకారుడుగా నటించమని, అతడిని జైలులో పెట్టారు. తోటి విప్లవఖైదీల నుండి అతడు సమాచారం సేకరించాడు. అతడు పత్రికా విలేఖరులకు విడుదల చేసిన సమాచారం డిటెక్టివ్ కథవలె వుంది. దానికి విపరీత ప్రచారం లభించింది. వాస్తవాలు అబద్ధాలు కలిపి చేసిన కథనం పత్రికలకు మంచి ఆకర్షణీయంగా మారింది.

మానవేంద్రనాధ్ రాయ్ ప్రాచ్యబ్యూరో డైరెక్టర్‌గా, అంతర్జాతీయ కమ్యూనిస్టు అధినేతగా భారత కమ్యూనిస్టుల్ని నడిపిస్తున్నాడని బెనర్జి పేర్కొన్నాడు.

రాయ్ శిష్యుడుగా కె.సి. బెనర్జి విచారణ సాగించి కల్పించిన కట్టుకథ, రాయ్‌ను గురించి ఏం చెప్పిందీ చూద్దాం.

రాయ్ అసలు పేరు భట్టాచార్య. అతడు పుట్టింది 1885లో బర్మాలో. 10 ఏళ్ళ వయస్సులో అతడిని కెనడా మీదుగా కలకత్తా తీసుకువచ్చారు. 1920లో మెక్సికో నుండి రాయ్ ఇండియా వచ్చాడు. 1922లో భారత సమాఖ్య ఏర్పాటుపై నివేదిక సమర్పించాడు. గయ కాంగ్రెసు సమావేశంలో అది ప్రస్తావనకు వచ్చింది.

ఈజిప్టులో జనరల్ సర్ లీస్టాకిను హత్యచేయమని రాయ్ ఆదేశించాడట. అతడు వలస రాజ్యాలలో సైనికాధిపతి అట.

రాయ్ లేఖ తనకు లభించినదనీ, 15 వందల మాటలు గల యీ లేఖ వలన పై విషయాలు తెలిసినట్లు కె.సి. బెనర్జి చెప్పాడు. రాయ్ డైరీ కూడా దొరికినట్లు వెల్లడించాడు. అన్ని అబద్ధాలు ఒక గూఢచారి ద్వారా పత్రికలకు చెప్పే పథకం వేశారు.

ఇలాంటి కథను పై అధికారులకు చెప్పకుండానే కె.సి. బెనర్జీ బయటపెట్టాడని కూడా రాశారు. భారతదేశంలో వెల్లడించిన యీ విషయాలకు అమెరికాలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక (1928 సెప్టెంబరు 16న (పేజి 7 కాలమ్ 7 సెక్షన్ మూడు) ప్రచురించడం ఆశ్చర్యకరం. రాయ్‌కు వ్యతిరేకంగానూ, కమ్యూనిజానికి విరుద్ధంగానూ వున్న కథలకు అమెరికా అలాంటి ప్రాధాన్యత యిచ్చింది.

## రాయ్ అరెస్ట్ - అమెరికా రియాక్షన్

1931 జులైలో ఎం.ఎన్. రాయ్‌ను, ఆయనకు అసరా యిచ్చినందుకుగాను మరో యిరువురు విప్లవకారులను బొంబాయిలో అరెస్టు చేసినట్లు బెర్లిన్ నుండి ఇంప్రెకార్ కేబుల్ పంపింది. ఈ వార్తను అమెరికా కమ్యూనిస్టు వారపత్రిక రివల్యూషన్ ఏజ్ మొదటి పేజీలో ప్రచురించింది. దీనితో పాటు రాయ్ ఇండియాలో ఉగ్రజాతీయవాదిగా జీవితం ప్రారంభించి, కమ్యూనిస్టుగా చేబట్టిన విషయాలు కూడా పాఠకులకు అందించారు.

అమెరికాలో అత్యధిక సంఖ్యాక కమ్యూనిస్టు పక్షం న్యూయార్క్ నుండి నడిపిన రివల్యూషనరీ ఏజ్ పత్రిక రాయ్ అరెస్టు మొదలు శిక్షపడే వరకూ చాలా వార్తలు ప్రకటించింది. రాయ్ విడుదలకు తీవ్ర ఆందోళన సాగించింది. రాయ్ డిటెన్షన్ నుండి పంపిన వ్యాసం కూడా ప్రచురించింది.

జె లవ్‌స్టోన్ సంపాదకుడిగా కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రికగా వెలువడుతుండేది

రివల్యూషనరీ ఏజ్.బి.డి. వుల్ఫ్ దీనికి సహసంపాదకుడు. భారత కమ్యూనిస్టు పార్టీ రాయ్ అరెస్టు పట్ల మౌనం వహించడం సిగ్గుచేటు అని ఆగస్టు 29 (1931)న యీ పత్రిక ప్రధాన శీర్షికలో విమర్శించింది. జర్మనీ, స్వీడన్ దేశాలలో అనేక సంస్థలు రాయ్‌ను విడుదల చేయమని తీర్మానాలు చేశాయి. భారత కమ్యూనిస్టులు "నూరు శాతం కమ్యూనిస్టులు" రాయ్‌ను రెనగేడ్‌గా చిత్రించి, అతడిని ఎదుర్కోవాలని, లజ్జాకరమైన విమర్శలు చేసినట్లు యీ పత్రిక వ్యాఖ్యానించింది. జర్మనీ ఫాసిస్టులకు సైతం తోడ్పడిన అంతర్జాతీయ రెడ్ ఎయిడ్ సంస్థ, రాయ్ పట్ల విద్రోహకరంగా ప్రవర్తించి, అతడిని జైలులో కుమిలి పోనిమ్మని ప్రకటించింది.

జర్మనీ కమ్యూనిస్టు పార్టీ రాయ్ విడుదల కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. హాంబర్గ్‌లో బ్రిటిష్ కాన్సల్‌కు యీ మేరకు ఒక లేఖ అందజేశారు. రైష్‌స్టాగ్ కమ్యూనిస్టు ప్రతినిధి జడాష్ తీర్మానం ప్రవేశపెట్టగా హర్షధ్వానాల మధ్య ఆమోదించారు.

రాయ్ విడుదల కోరుతూ జర్మనీ, స్వీడన్‌లోనే గాక, అల్సాస్, చకోస్లోవేకియా కమ్యూనిస్టు పార్టీల నుండి కూడా తీర్మానాలు వచ్చాయి. సోషలిస్ట్ డెమొక్రటిక్ పత్రికలు రాయ్ అరెస్టు పట్ల మౌనం వహించడాన్ని యీ పత్రిక దుయ్యబట్టింది. రాయ్‌ను బ్రిటిష్ సామ్రాజ్యవాద కబంధహస్తాల నుండి విడుదల చేయించడానికి కార్మికసంఘాలు, వలసదేశాలలో అణిచివేతకు గురైనవారు ముందుకు రావాలని యీ పత్రిక కోరింది. వర్గ ఆసక్తి రీత్యా పెట్టుబడిదారీ పత్రికలు మౌనం వహించడంలో ఆశ్చర్యం లేదని వ్రాసింది. (సెప్టెంబరు 12, 1931).

## ఎం.ఎన్. రాయ్ విడుదలకై ఐన్‌స్టీన్ ప్రకటన

ప్రపంచ ప్రసిద్ధ భౌతిక శాస్త్రజ్ఞుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జర్మన్‌లో క్లుప్తమైన ప్రకటన చేస్తూ, మానవేంద్రనాథ్ రాయ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం విడుదలచేయాలని కోరారు. ఈ విషయాన్ని రివల్యూషనరీ ఏజ్ పత్రిక సెప్టెంబరు 26, 1931న ప్రకటించింది.

ఐన్‌స్టీన్ ప్రకటన మూలప్రతి నేడు జెరూసలేంలోని హిబ్రూ యూనివర్శిటి ఐన్‌స్టీన్ పత్రాలలో వుంది. దీని మైక్రోఫిలిం ప్రతి అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటి ఐన్‌స్టీన్ పత్రాలలో వుంచారు.

ఐన్‌స్టీన్ వలె యింకా అనేక మంది రాయ్ విడుదల కోరుతూ ప్రకటనలు చేశారు. ఫ్రెంచి కమ్యూనిస్టు నాయకుడు హెన్రి బార్బూస్ అలాంటి వత్తిడి చేశాడు. జర్మనీలో అనేక సంస్థలు రాయ్‌ను విడుదల చేయమని తీర్మానించాయి. కెమికల్ వర్కర్స్ యూనియన్, పబ్లిక్ హైస్కూలు టీంజ్, గెవిల్స్ బర్గ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, షోనింగన్ కేంద్ర కార్మిక సంఘం, జెనానేజర్ ఫ్రెండ్స్, ఫాసిస్టు వ్యతిరేక లీగ్ యిందులో పేర్కొనదగినవని రివల్యూషనరీ ఏజ్ ప్రకటించింది. (1931 సెప్టెంబరు 26 న్యూయార్క్) బ్రిటిష్ జైలు నుండి రాయ్ ప్రపంచ కార్మికులకు, రైతులకు, మేధావులకు ఒక విజ్ఞప్తి చేశాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై పోరాడమని కోరాడు. తాను

ఇండియాకు ఎందుకు తిరిగి వచ్చిందీ వివరించాడు. యీ ప్రకటన కూడా రివల్యూషనరీ ఏజ్ అక్టోబరు 10 (1931)న ప్రకటించింది. రాయ్ ప్రకటన పూర్తిపాఠాన్ని అక్టోబరు 17 (1931), అక్టోబరు 24న ఆ పత్రిక రెండు భాగాలుగా ప్రకటించింది. కాన్పూరు జైలు నుండి రాయ్ ఈ విజ్ఞప్తిని ఆగస్టు 23న (1931) బయటకు పంపగలిగాడు.

కెనడా కార్మిక సంఘంలో కూడా రాయ్ అరెస్ట్ గురించి చర్చించారు. ఫ్రెడరిక్ డగ్లస్ ఇంటర్ రేషియల్ క్లబ్బు న్యూయార్క్, బరోపార్క్, కార్మిక యువత క్లబ్బు న్యూయార్క్ కూడా రాయ్ విడుదలకై తీర్మానం చేసాయి. ఇండియాలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రాయ్ విడుదల కోరడాన్ని రివల్యూషనరీ ఎజ్ అక్టోబరు 24, 1931న ప్రకటించింది. ప్రధాన కార్యదర్శి ముకుందలాల్ యిచ్చిన టెలిగ్రాంను ప్రకటించారు.

## రాయ్ పక్షాన జోక్యానికై మహాత్మాగాంధీకి విజ్ఞప్తి

గాంధీజీ లండన్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటున్నప్పుడు మెజారిటి గ్రూపు కమ్యూనిస్టు పార్టీ ఒక కేబుల్ ద్వారా రాయ్ విడుదలకై ఆయన జోక్యం చేసుకోవాలని కోరింది. గాంధీజీ ఒక ప్రకటన చేయాలని అడిగితే, ఆయన నిరాకరించారు. ఈ విషయాన్ని మర్యాద మాటలతో అంతర్జాతీయ కార్మిక సంఘ కౌన్సిల్‌కు తెలియపరిచినట్లు రివల్యూషరీ ఏజ్ నవంబరు 14, 1931న ప్రకటించింది. రాయ్ సేవల్ని గుర్తుచేస్తూ వలస ప్రజల కోసం ఆయన పోరాటాన్ని పేర్కొని, ఆయన విడుదలకై కమ్యూనిస్టు పార్టీ మెజారిటి గ్రూపు అమెరికా నుండి విజ్ఞప్తిని పంపింది.

రాజకీయ ఖైదీల అంతర్జాతీయ సంఘం కూడా రాయ్ పక్షాన ఒక ప్రకటన చేసింది. లండన్‌లో సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు యీ ప్రకటన పంపారు. దీనిపై సంతకాలు చేసినవారు గమనించదగిన ప్రముఖులు ఏల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జెరోమ్ డేవిస్, ప్రముఖ నీగ్రోనాయకుడు డా॥ డబ్లు.ఇ.బి. డ్యుబాయ్, ప్రముఖ రచయిత వాల్డో ఫ్రాంక్, ప్రముఖ న్యాయవాది గార్ ఫీల్డ్ హేస్, మతవాది జాన్ హేన్స్ హోమ్స్, చికాగో యూనివర్శిటి ప్రొఫెసర్ రాబర్ట్ మోర్స్ లవెట్, బ్రూక్‌వుడ్ లేబర్ కాలేజి నుండి ఎ.జె. ముస్తే, ఫెడరల్ చిల్డ్రన్స్ బ్యూరో అధిపతి (మాజీ) జూతియా వెత్రాప్, ఇండస్ట్రియల్ డెమోక్రసీ లీగ్ డైరెక్టర్ నార్మన్ థామస్, నేషన్ పత్రిక ఎడిటర్ ఆస్వాల్డ్ గారిసన్ రోజర్ ఇబాల్డ్విన్ (సంఘాధ్యక్షుడు).

జైల్లో రాయ్‌ను అవమానకరంగా చూస్తూన్న తీరును ప్రపంచానికి తెలియపరిచి అభ్యంతరపెడుతూ రివల్యూషనరీ ఏజ్ 1932 జనవరి 2 ప్రకటన చేసింది. అప్పటికి పత్రిక పేరు వర్కర్స్ ఏజ్‌గా మారింది. రాయ్ డిఫెన్స్ సంఘాధ్యక్షుడు బి. సింగ్ యిచ్చిన జైలు వివరాలు ప్రకటించారు. రాయ్‌కు పుస్తకాలు ఏవీ యివ్వడం లేదనీ, పత్రికలు అందజేయడం లేదనీ, గాలి వెలుతురులేని గర్భగుడివంటి గదిలో పెట్టారని, వేడినీళ్ళ సరఫరా చేయడం లేదని బి. సింగ్ తెలియపరిచారు.

ఎం.ఎన్. రాయ్‌కు 12 సంవత్సరాల జైలుశిక్ష విధించడాన్ని వర్కర్స్ ఏజ్ జనవరి 23-1932న పతాక శీర్షికలో ప్రచురించింది. ఆటవిక పాశవిక శిక్షగా చిత్రించి, విమోచనోద్యమానికి యిది దెబ్బ అని పేర్కొన్నది. రాయ్ విడుదలకుద్యమించాలని విజ్ఞప్తి చేసింది.

రాయ్ పోరాటాలను యీ పత్రిక మరోసారి ప్రకటించి, రాయ్ విడుదలకు కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించింది. రాయ్ పక్షాన వాదిస్తున్న ఎక్బాల్ కృష్ణ కపూర్ కేసును అలహాబాద్ కోర్టులో చేబట్టనున్నట్లు తెలిపారు. గాంధీని అరెస్టు చేసి గౌరవంగా చూడడాన్ని, భారత కార్మికులకై పోరాడిన రాయ్‌ను అవమానకరంగా జైల్లో చూడడాన్ని పోల్చి, యీ పత్రిక విమర్శించింది. (జూన్ 4, 1932 వర్కర్స్ ఏజ్, న్యూయార్క్)

కాన్పూరు జైలు నుండి అర్ధరాత్రి రాయ్‌ను తరలించి తీసుకుపోగా, లక్నోలో యీ వార్త తెలిసిన రైల్వే కార్మికులు 5 వేల మంది స్టేషన్‌లో రైలు రాగానే బ్రిటిష్ సామ్రాజ్యం నశించాలి, రాయ్ వర్ధిల్లాలి అంటూ నినాదాలు యిచ్చారు. అయితే రాయ్ రైలులో లేడని కనుగొన్నారు. అయినా నినాదాలు కొనసాగించారు.

రాయ్‌ను బెరెల్లీ జైలులో పెట్టారు. అక్కడ స్థితిగతులు దారుణంగా వున్నాయి. భారతదేశం నుండి ఒక విలేఖరి పంపిన సమాచారాన్ని వర్కర్స్ ఏజ్ పత్రిక ప్రకటించింది. (ఏప్రిల్ 9, 1932)

రాయ్ విచారణ వివరాలను అజయ్ కుమార్ ఘోష్ వివరంగా రాయగా 1932 జనవరి 30న (శనివారం) వర్కర్స్ ఏజ్ పూర్తి వ్యాసరూపంలో ప్రచురించింది. రాయ్‌ను నిర్బంధించిన జైలు ముందు 50 వేల మంది నిరసన ప్రదర్శన చేశారు. అప్పుడు కాన్పూరుకు తరలించారు. దేశవ్యాప్తంగా నిరసన వెల్లువలు వచ్చాయి. మాజిస్ట్రేట్ జైలు గదిలో రాయ్‌ను విచారించాడు. బయటవారిని చూడడానికి రాయ్‌కు అనుమతి యివ్వలేదు. స్థానిక బార్ అసోసియేషన్‌కు విజ్ఞప్తి చేయనిస్తే, అప్పుడు కొందరు న్యాయవాదులు రాయ్ పక్షాన నిలిచి పోరాడారు. రాయ్ పక్షాన ప్రదర్శనలు చేసినవారిపై పోలీస్‌లు దారుణంగా ప్రవర్తించారు. (ఫిబ్రవరి 6, 1932 వర్కర్స్ ఏజ్)

రాయ్ పక్షాన పోరాడిన వివిధ సంఘాల గురించి ఇండిపెండెంట్ ఇండియా ప్రచురించగా రివల్యూషనరీ ఏజ్ ఆ వార్తల్ని ప్రచురించింది. (డిశంబరు 26, 1931)

రాయ్ రక్షణ సంఘంలో వున్నవారు : జవహర్‌లాల్ నెహ్రూ, పండిట్ నారాయణ ప్రసాద్, అరోరా మౌలానా, హజ్రత్ మోహాని, అజిత్ కుమార్ ఘోష్, గోపీనాధ్ సింగ్. రాయ్ పక్షాన వాదించడానికి జర్మనీ నుండి హర్ రోజన్ ఫెల్డ్‌ను రమ్మని కోరారు. అతడు సుప్రసిద్ధ న్యాయవాది. కాశీలో నవజవాన్ భారతసభ రాయ్ పక్షాన ఆందోళన చేబట్టింది. పొరపాటున రాయ్ అనుకొని పృధ్వీరాజ్ గంజ్ రాజాను పోలీస్ అరెస్టు కూడా చేశారు.

బెంగాల్‌లో రాయ్ రక్షణ సమితి ఏర్పడింది. సుభాష్‌చంద్రబోసు, ఆర్.ఎస్. రూయికర్, ఎస్. ముకుందలాల్, సత్యవతిదేవి, అసఫాలి, బ్రజేష్ సింగ్, కమలాదేవి చటోపాధ్యాయ వున్నారు.

బొంబాయిలో రాయ్ పక్షాన పోరాట సమితిలో జి.వై. ఛట్రేస్, గడ్కారి, మణిబెన్‌కారా, వి.బి. కర్నిక్, జి.ఎల్. ఖండాల్కర్, ఉషా బాయిడాంగే, లాల్‌జి పాండే, జుల్సారాం ఛౌదరి, ఎల్.డి. పాఠక్, పురుషోత్తమదాస్ త్రికందాస్, జయశంకర్ భట్, లోట్వాలా, ఎం.ఆర్. షెట్టి వున్నారు.

అదే సందర్భంలో ఎవిలిన్ వ్యాసం కూడా రివల్యూషనరీ ఏజ్ ప్రచురించింది. అయితే ఇ.ఆర్. అని మాత్రమే ఆమె రాసింది. తిరిగి అమెరికా వచ్చిన తరువాత ఎవిలిన్ ట్రెంట్ అని మాత్రమే ఆమె పత్రికలలో రాసుకున్నది.

## రాయ్ పక్షాన ఇంగ్లండ్ పార్లమెంట్‌లో

ఫెన్నర్ బ్రాక్‌వే, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నాయకుడుగా హౌస్ ఆఫ్ కామన్స్‌లో రాయ్ అరెస్టును ప్రస్తావించాడు. అప్పీలుకు సిద్ధమౌతున్న అంశం కూడా పేర్కొన్నాడు. రాయ్ పక్షాన పోరాడునున్నట్లు చెప్పాడు.

రాయ్ పక్షాన పోరాటం తీవ్రతరం చేస్తున్న దృష్ట్యా డబ్బు సహాయం చేసేవారు. పుస్తకాలు యివ్వదలచినవారు వర్కర్స్ ఏజ్ పత్రికకు అందజేయమని ఫిబ్రరి 27న 1932న విజ్ఞప్తి చేశారు.

రాయ్ కేసును హైకోర్టులో అప్పీలు చేసిన వార్తల్ని, ధనసహాయాన్ని యీ పత్రిక ప్రచురించింది. 20 పౌండ్ల బరువు కోల్పోయిన రాయ్, ఇన్ఫ్లూయంజాతో బాధపడుతున్నట్లు వెల్లడించారు.

రాయ్ పక్షాన అమెరికన్లు డబ్బు పంపగా రాయ్ స్వీకరించడానికి అంగీకరించలేదని పోస్టల్ శాఖవారు త్రిప్పి పంపారు. కాని యీ విషయం రాయ్‌కు తెలియదు. అమెరికా కమ్యూనిస్టు పార్టీ రాయ్ నిమిత్తం వసూలు చేసిన డబ్బు అలా వృధా అయింది.

## ఎవిలిన్ మళ్ళీ వివాహం

రాయ్‌తో విడిపోయి అమెరికా 1925 చివరిలోవచ్చిన ఎవిలిన్ తన పత్రికా వ్యాసంగాలలో మిస్ అని వ్రాసుకున్నది. రాయ్‌ను అరెస్టు చేసినప్పుడే ఇ.ఆర్. అని పొడి అక్షరాలు పెట్టడం మినహాయింపు. 1931లో తల్లి చనిపోయిన తరువాత ఆబర్న్‌లో తండ్రికి శుశ్రూష చేస్తూ వుండిపోయింది.

1935 మార్చి 9న ఎవిలిన్ తండ్రి లామార్టిన్ ఆబర్న్‌లో 86వ ఏట చనిపోయాడు. స్థానిక పత్రికలు ఆయన గొప్పతనాన్ని శ్లాఘిస్తూ రాశాయి. ఆయనకు 7గురు సంతానం, 15 మంది మనుమలు అప్పటికి వున్నారు. ఎవిలిన్‌కు సంతానం లేదు.

తండ్రి మరణానంతరం ఎవిలిన్ తిరిగి తన రచనలు ప్రారంభించింది. శాన్‌ఫ్రాన్‌సిస్కో క్రానికల్‌లో 1935 నవంబరు 3న కార్మికుల ఇళ్ళ సమస్యలు రాసింది.

ఎం.ఎన్. రాయ్ ఇండియాలో జైలు నుండి విడుదల సంవత్సరంలోనే అమెరికాలో ఎవిలిన్ రెండవ వివాహం చేసుకున్నది. 1936 అక్టోబరు 10న డెవిట్ జోన్స్, ఎవిలిన్‌ల పెళ్ళి జరిగింది. కాలిఫోర్నియా రాష్ట్రంలో రిచ్‌మండ్‌కు చెందిన డెవిట్ పెళ్ళి తరువాత ఓక్లాండ్‌కు మారాడు. ఎవిలిన్ స్థానిక పత్రికలకు వ్యాసాలు రాస్తూ వివాహజీవితం ఆనందంగా గడిపింది. డెవిట్ జోన్స్ కూడా వ్యాపారాలు చేస్తూ పత్రికారచనలు సాగించాడు.

1938, 39లో స్టేట్ ఎమర్జన్సీ రిలీఫ్ అడ్మినిస్ట్రేషన్ వారి బులెటిన్‌కు ఎవిలిన్ రచనలు చేసింది. ఆ సంస్థ చరిత్రను డెవిట్ అజమాయిషీ చేసి రాయించాడు. కొన్నాళ్ళు శాక్రమెంటోలో దంపతులు నివశించగా, ఎవిలిన్ స్థానిక పత్రికలో రాసింది. ఆ ప్రాంతం ఆమెకు చిరపరిచితం కూడా.

ఆ విధంగా 15 సంవత్సరాలు ఎవిలిన్-డెవిట్ దంపతులు జీవించిన అనంతరం 1949 ఫిబ్రవరి 20న డెవిట్ చనిపోయాడు. మళ్ళీ ఎవిలిన్ ఆబర్న్‌కు వచ్చి, అక్కడ స్థిరపడింది. 1949 ఏప్రిల్ 29న ఐన్‌స్టీన్ ఆమెకు ఒక ధన్యవాదాల జాబు రాశాడు. అణు శాస్త్రజ్ఞుల ఎమర్జన్సీ కమిటీకి ఎవిలిన్ చందా పంపగా అతడు అలా రాశాడు.

జైలునుండి విడుదల అయిన రాయ్ 1938లో, అంటే ఎవిలిన్ పెళ్ళి చేసుకొన్న రెండేళ్ళకు ఇండియాలో ఎలెన్‌ను పెళ్ళిచేసుకున్నాడు. ఇండియాలో రాయ్ అరెస్టు అయినప్పుడు పట్టించుకోని అమెరికా పత్రికలు, విడుదల అయిన తరువాత రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్‌వారికి తోడ్పడాలని రాయ్ ప్రకటించినప్పుడు అమెరికాలో న్యూయార్క్ టైమ్స్ ప్రకటించింది. హిట్లరిజాన్ని ఎదుర్కోడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి తోడ్పడాలని రాయ్ చెప్పినట్లు ప్రకటించాయి. (1939 సెప్టెంబరు 9)

రాయ్ రాడికల్ డెమొక్రటిక్ పార్టీ స్థాపించినప్పుడు మళ్ళీ న్యూయార్క్ టైమ్స్ ఆ వార్తను ప్రచురించింది.

అదేమిటో గాని న్యూయార్క్ టైమ్స్‌లో మొదటి నుండీ రాయ్ చనిపోయేవరకూ ముకేంద్రనాథ్ అనీ, మహేంద్రనాథ్ అనీ రాశారు. అమెరికాలో గూఢచారి సంస్థలు తొలుత అలాగే రాసినా, ఉత్తరోత్తరా దిద్దుకున్నారు. ఎం.ఎన్. రాయ్ చనిపోయిన వార్తను న్యూయార్క్ టైమ్స్ ప్రచురించింది.

## ఎవిలిన్ ట్రెంట్ చివరి దశ

ఎం.ఎన్. రాయ్ చనిపోయిన అనంతరం భారతదేశంలో, అమెరికాలో కొందరి దృష్టి

ఎవిలిన్‌పై మళ్ళింది. ఎవిలిన్ చివరిలో తన రెండవ భర్త పేరు రాస్తుండేది. ఆమెకు రెండవ భర్తతో కూడా సంతానం లేదు. ఆమె అక్క మెరిడిత్ కుమారుడు డివెన్, అతడి యిరువులు సోదరీమణులు ఎవిలిన్‌కు సన్నిహితంగా వుండేవారు.

ఎం.ఎన్. రాయ్ చనిపోకముందు చివరిదశలో ఆయన తన జీవితగాథాస్మృతులను చెబుతుంటే ఎలెన్ వ్రాసుకున్నది. అవి రాడికల్ హ్యూమనిస్టు వారపత్రికలో వరుసగా వచ్చేవి. అందులో ఎవిలిన్ ట్రెంట్ గురించి రాయ్ ఎక్కడా ప్రసావించలేదు. ఎవిలిన్ ఆ ప్రచురణ పట్ల ఆసక్తి కనబరచింది.

ఆబర్న్‌లో సొంత ఆస్తిపాస్తులు చూచుకుంటూ, స్థానికంగా చిన్న ఉద్యోగాలు చేస్తూ ఎవిలిన్ కాలం గడిపింది. ఎం.ఎన్. రాయ్ చైనా పాత్ర గురించి సమగ్రంగా పరిశోధించిన రాబర్ట్ సి. నార్త్ తొలుత ఎవిలిన్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి, ఆమె ఇంటికి వెళ్ళి మాట్లాడాడు. తన పుస్తకం ఆమెకు పంపించి, పరిశీలించమన్నాడు అచ్చుకాక ముందే, ఇంచుమించు అదే సమయంలో రిచర్డ్ సి. పార్క్ కూడా భారత కమ్యూనిజంపై పరిశోధన చేస్తూ, ఎవిలిన్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాడు. పార్క్ రచనల్లో ఎం.ఎన్. రాయ్ పట్ల దొర్లిన దోషాలను ఆమె ఎత్తిచూపింది. నార్త్ రచనల్లో తన పేరు తొలిగించమని ఎవిలిన్ కోరింది. ఇతరులు తనను గురించి అడిగినప్పుడు, విచక్షణ ఉపయోగించమని కోరింది. ఇండియా నుండి ముజఫర్ అహమ్మద్ ఉత్తరం రాయగా, నార్త్ ఆ లేఖను ఎవిలిన్‌కు పంపాడు.

ఎలెన్ కూడా ఎవిలిన్‌కు ఉత్తరాలు రాసి, శిబ్ నారాయణ్‌రే వస్తున్నట్లు, కలుసుకొని మాట్లాడతాడని తెలిపింది. శిబ్ నారాయణ్‌రే కూడా ఎవిలిన్‌ను స్మృతులు రాయమని కోరాడు. నాథనైల్ వైల్ కూడా మెక్సికో కమ్యూనిస్టు పార్టీలో వీరి పాత్ర గురించి అడిగాడు.

ఎం.ఎన్. రాయ్ కమ్యూనిస్టు ఉద్యమంలో, ఇండియాలో నిర్వహించిన పాత్రను అభినందించాలని ఎవిలిన్ తన వ్యాఖ్యానాలలో రిచర్డ్ పార్క్‌కు రాసింది. పార్క్ దోషాలను ఎత్తి చూపింది. అలాగే యితరులు కమ్యూనిస్టు ఉద్యమంలో రాయ్ పాత్రను, లెనిన్ సిద్ధాంతానికి అనుబంధంగా వలస విధానంపై రాయ్ సమర్పించిన సిద్ధాంతం పట్ల అవగాహన లోపాలను, దోషాలను చూపింది. ఛటోపాధ్యాయతో రాయ్ సంబంధాల విషయమై అవగాహన లోపాలను దోషాలను చూపింది. భారత విప్లవోద్యమానికి రాయ్ సమకూర్చిన మేధాసంపన్నతను అర్థం చేసుకోవాలన్నది. తాత్విక పునాదులు తొలుత కల్పించింది రాయ్ మాత్రమే. అందుకు తగిన సాహిత్యాన్ని సమకూర్చిందీ రాయ్ ఒక్కడే.

ఆ విషయం భారతదేశంలో గుర్తింపు పొందినట్లు ఎవిలిన్ చెప్పింది. ఇలాంటి ఘనతకు నిందించడంగాక, రాయ్‌ను అభినందించాలని ఎవిలిన్ కోరింది. రాయ్ తన పరిణామ దశలో ఎన్నో మార్పులకు లోనయ్యాడని, అయితే అతనికి నేర్చుకునే శక్తి సామర్థ్యాలున్నాయని ఎవిలిన్

రాసింది. బ్రిటిష్ పోలీసులు రాసింది తు.చ. తప్పకుండా ఆమోదించే ధోరణి, ముఖ్యంగా లెఫ్టినెంట్ కాయ్ వంటివారు నిష్పాక్షికంగా వుండలేనివారు రాసింది అట్టే నమ్మరాదని, రాయ్‌ను గురించి పార్క్‌కు రాసింది.

భారత విప్లవోద్యమంలో రాయ్ నిర్వహించిన పాత్ర, అతడి చిత్తశుద్ధికి అన్యాయం చేయవద్దని పార్క్‌ను ఎవిలిన్ కోరింది. రాయ్ పట్ల కొన్ని వ్యాఖ్యలు ఆయన అభిమానుల్ని దిగ్భ్రాంతి చేసేవిగా వున్నాయని ఎవిలిన్ హెచ్చరించింది.

చంద్రకాంత చక్రవర్తి దోషాల్ని ప్రస్తావించి, రాయ్ భార్య కలోనియల్ కమిషన్‌లో లేదని అతడు రాయడం, జైలులో మా పెళ్ళి జరగలేదనడం, స్టాన్‌ఫర్డ్‌లో మేం కలుసుకోలేదని, న్యూయార్క్ కలిసి వెళ్ళలేదని అనడం కేవలం అతడి వూహలు, భ్రమలు మాత్రమేనని ఎవిలిన్ తన వ్యాఖ్యలలో పార్క్‌కు రాసింది. 1956 జూన్ 8న ఆబర్న్ నుండి రిచర్డ్ పార్క్‌కు ఎవిలిన్ యీ విషయాలు రాసింది.

భారత కమ్యూనిజాన్ని గురించి పెద్ద గ్రంథం రాసిన విండ్ మిల్లర్ ఉపన్యాసం స్వయంగా ఒక చోట విన్న ఎవిలిన్ అతడిని పరిచయం చేసుకోవడం మంచిదని రాబర్ట్‌నార్త్‌కు రాసింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో కమ్యూనిస్టు పార్టీపై పరిశోధన చేసిన పి.సి. జోషి కూడా 1969లో ఎవిలిన్‌ను కలుసుకోవడానికి ఉత్తరాల ద్వారా ప్రయత్నించాడు. ఆమె జవాబు రాసినట్లు లేదు.

1966లో నార్త్‌కు రాసిన లేఖ ప్రకారం ఎవిలిన్ యింట్లో 1963లో అగ్నిప్రమాదం సంభవించి, రికార్డులు తగులబడిపోయాయి. అందులో ముఖ్యమైన కాగితాలు వుండి వుండవచ్చు. 1970 నవంబరు 21న ఎవిలిన్ ఆబర్న్‌లో చనిపోయింది. స్థానిక పత్రికలు అప్పుడు కూడా రాయ్ ప్రస్తావన తీసుకరాలేదు.

ఆమె మరణానంతరం, ఎవిలిన్ అక్క కుమారుడు డివెన్ మెరిడిత్ మిగిలిన కొన్ని కాగితాలు, ఉత్తరాలను, ఫోటోలను కాలిఫోర్నియా స్టేట్‌లోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వున్న హూవర్ వార్, పీస్ రివల్యూషన్ అనే సంస్థకు యిచ్చాడు. ఆ కాగితాలలో నార్త్, పార్క్ శిబ్రే, ఎలెన్ ఉత్తరాలు తప్ప, పాత రికార్డు ఏదీ లేదు.

రాయ్ ఫోటోలు కొన్ని వున్నాయి. ఒక ఫోటో క్రింద 'నన్ను ఆరాధించే నా యిష్టదేవతకు' అని ఎం.ఎన్. రాయ్ రాసినట్లున్నది.

*- హేతువాది, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ 1995*

# ఎం.ఎన్. రాయ్ - అబ్బూరి లేఖలు

ఆంధ్రప్రదేశ్‌కు ఎం.ఎన్. రాయ్‌ను పరిచయం చేసిన, ఆద్యుడు కీ.శే. అబ్బూరి రామకృష్ణరావు. తొలుత కమ్యూనిస్టుగా ప్రారంభించిన అబ్బూరి, ఆంధ్ర యూనివర్శిటీలో లైబ్రేరియన్‌గా పనిచేశారు. నాట్యగోష్టి, నట్టాలి అనే సంస్థలు 1933 నాటి నుండే స్థాపించి స్టేజి ఆర్ట్ పెంపొందించిన ఘనత అబ్బూరివారిదే.

1937 నుండీ ప్రారంభించి చనిపోయేవరకూ, ఎం.ఎన్. రాయ్ తరచు అబ్బూరికి ఉత్తరాలు రాశారు. వాటన్నిటినీ ఇప్పుడు వెలుగులోకి తెచ్చిన అబ్బూరి ఛాయాదేవిగారు, అభినందనీయులు. అయితే అబ్బూరికి వ్రాసిన ఉత్తరాలన్నీ లభ్యం కాకపోవడంతో కేవలం ఒక్క లేఖ ప్రచురించగలిగారు. 1948లో ఎం.ఎన్. రాయ్ వాల్తేరు వస్తున్న సందర్భంగా లభించిన ఉత్తరం మాత్రమే ఉంది. 1940 ప్రాంతాల్లో నాటి బ్రిటీష్ పోలీసులు దాడి చేసినప్పుడు అబ్బూరి ఇంట్లో పట్టుకుపోయిన వాటిలో ఉత్తరాలు కూడా తీసుకెళ్ళినట్లు ఆయన కుమారుడు కీ.శే. అబ్బూరి వరదరాజేశ్వరరావు వ్రాశారు. ఎం.ఎన్. రాయ్ అనుచరులలో అబ్బూరి సంతానం ఉన్నది.

1936లో లక్నోలో అభ్యుదయ రచయితల సమావేశం జరిగింది. అందులో అబ్బూరికి మున్షీ ప్రేమ్‌చంద్‌కూ జరిగిన వాదోపవాదాలు, జైలులో ఉన్న ఎం.ఎన్. రాయ్ దృష్టికి వచ్చాయి. అబ్బూరి గురించి రాజేంద్రదత్తనిగం ద్వారా తెలుసుకొని కమ్యూనిస్టులలో అలా ఎదురుతిరిగి స్వేచ్ఛగా మాట్లాడగలగడాన్ని రాయ్ మెచ్చుకొన్నారు. అప్పటికే రాయ్ జైలు నుండి, బయటకు వేసిన రాజకీయ సాహిత్యాన్ని పంచుతున్నారు. హెచ్.ఆర్. మహాజని లక్నోలో అబ్బూరికి రహస్యంగా రాయ్ సాహిత్యం అందించాడు. వాల్తేరు తిరిగివచ్చిన అబ్బూరి కమ్యూనిస్టుపార్టీ సెల్ సమావేశాలలో రాయ్ ప్రస్తావన రాగా, అది చర్చించవీల్లేదని అభ్యంతరాలు వచ్చాయి. రాయ్ పట్ల ఆకర్షితుడైన అబ్బూరి కమ్యూనిస్టు పార్టీకి దూరం అవుతూ రాయ్‌తో సంబంధం పెట్టుకోదలచాడు.

జైలు నుండి విడుదల అయిన ఎం.ఎన్. రాయ్ ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సభలలో పాల్గొన్నాడు. ఈ సమావేశాలకు కాకినాడ నుండి ఎం.వి. శాస్త్రి (ములుకుట్ల వెంకట శాస్త్రి) వెళ్ళారు. కుందూరి ఈశ్వరదత్ మద్రాసు నుండి ఇంగ్లీషులో ప్రచురిస్తున్న ప్యూపిల్స్ వాయిస్ పక్షాన వెళ్ళినట్లు అబ్బూరి వరదరాజేశ్వరరావు ఈ పుస్తకంలో వ్రాశారు.

ఎం.ఎన్. రాయ్ పట్ల ఆకర్షితుడైన ఎం.వి. శాస్త్రి తిరిగొచ్చి, అబ్బూరికి విషయాలు చెప్పి, రాయ్‌ను ఆహ్వానించారు.

నెల్లూరులో 1937, ఆగష్టులో కీ.శే. వెన్నెలకంటి రాఘవయ్య ఆధ్వర్యాన ఆంధ్ర వ్యవసాయకార్మికుల సభ జరిగింది. ఎం.ఎన్. రాయ్ దీనిని ప్రారంభించారు. అపుడు రాయ్ జబ్బుపడగా, కాకినాడ వచ్చి విశ్రాంతి తీసికోమని ఎం.వి. శాస్త్రి ఆహ్వానించారు. కాకినాడ చేరుకొన్న

రాయ్‌ను శాస్త్రి ఆదరించి జాగ్రత్తగా చూచారు. అక్కడే తొలుత అబ్బూరి రామకృష్ణారావు కూడా రాయ్‌ను కలుసుకొన్నారు. బొంబాయి నుండి ఎలెన్ వచ్చి చేరింది. అబ్బూరి ఆహ్వానంపై రాయ్ వాల్తేరు వెళ్ళి సముద్రతీరాన దాదాపు నెలన్నర విశ్రాంతిగా ఉన్నారు. అప్పుడే రాయ్ మేథాశక్తిని చర్చలలో గమనించిన అబ్బూరి జీవిత పర్యంతం రాయిస్టుగా మారిపోయారు. రాయ్ స్థాపించిన రాడికల్ డెమొక్రటిక్ పార్టీలోనూ, అది రద్దుచేసిన తరువాత ఉద్యమంలోనూ అబ్బూరి పనిచేశారు. అప్పటి ఉత్తరాలలో కొన్ని లభించగా ఢిల్లీలోని నెహ్రూ మ్యూజియంలో భద్రపరిచారు. అవే యిప్పుడు, చిన్ని పుస్తకంగా రూపం దాల్చాయి.

1937 నుండీ అబ్బూరికి వ్రాసిన ఉత్తరాలలో రాయ్ కొన్ని పేర్లు ప్రస్తావించాడు. అలాంటి వారు అటు పార్టీలోగానీ, ఇటు ఉద్యమంలోగానీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పనిచేసి ఉండొచ్చు. వివరాలు చరిత్రకారులు పరిశీలించవలసి ఉంది. అలా ప్రస్తావనకు వచ్చిన పేర్లు : దేవకీనంద (విజయనగరం), గుప్త (వాల్తేరు), రామకృష్ణ పరమహంస, కె. కృష్ణారావు (ఏలూరు), ఎం.వి. శాస్త్రి జగన్నాథం, సుబ్రహ్మణ్యం, నారాయణమూర్తి (ప. గోదావరి), ఫణిరాజు, శర్మ (రాజమండ్రి), నరసింహారావు (విజయనగరం), సుప్రసిద్ధ ఆర్టిస్టు ఎస్.ఎన్. చేమకూరి ఒక సందర్భంలో రాయ్ పుస్తకానికి ఆర్ట్ ముఖచిత్రం గీసినట్లు ప్రస్తావన ఉంది.

కొత్త సచ్చిదానందమూర్తి తన ఇండియన్ ఫిలాసఫీ పుస్తకానికి రాయ్‌ను పీఠిక వ్రాయమని కోరిన విషయం చెబుతూ, అయన్ను గురించి వాకబు చేసిన మాటలు ఒక లేఖలో ఉన్నాయి. తరువాత ఆ పుస్తకానికి రాయ్ సుదీర్ఘ పీఠిక వ్రాశారు. సచ్చిదానందమూర్తి ఉత్తరోత్తరా తన భావాన్ని మార్చుకొని ఆ పుస్తకాన్ని కాదన్నారు. కీ.శే. నార్లవంటివారు అందుకు బాధపడ్డారు. ఎం.ఎన్. రాయ్ చనిపోయినప్పుడు అబ్బూరి ఒక కవితలో తన సంతాపాన్ని వ్రాశారు. రాయప్రోలు శ్రీనివాస్ దీన్ని ఇంగ్లీషులో అనువదించారు. 1980 జనవరి రాడికల్ హ్యూమనిస్టులో ముద్రితమైంది. రాయ్ సమాధి శ్రద్ధాంజలిలో భాగంగా ఈ గేయాన్ని అనాడు పెట్టారు.

రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక ఎడిటర్ ఆర్.ఎం. పాల్, మానవవాద ఉద్యమనాయకులు వి.ఎం. తార్కుండే వ్రాసిన వ్యాసాలు చాలా పుస్తకంలో చేర్చారు.

అబ్బూరి ఛాయాదేవి ఈ చిన్నపుస్తకాన్ని ప్రచురించి మంచిపని చేశారు. ఆర్.ఎం. పాల్ కుటుంబానికి ఆమె సన్నిహితురాలు. పాల్ కుమార్తె సంగీతామాల్ నేడు రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక సంపాదకత్వాన్ని బొంబాయి నుండి చూస్తున్నారు. పుస్తకంలో ఎలెన్ ఉత్తరం కూడా ఒకటి చేర్చారు.

అబ్బూరి అండ్ ఎం.ఎన్. రాయ్
ప్రచురణ : అబ్బూరి ట్రస్ట్,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044.
వెల : రూ. 40/-

***- హేతువాది, అక్టోబరు 2000***

# హ్యూమనిస్ట్ "రాణె"
# అనుభవాలు - ఆదర్శాలు

బొంబాయిలో కాకలు తీరిన హ్యూమనిస్ట్ అడ్వకేట్ ఎం.ఎ. రాణె. ఇటీవలన ఆయన అనుభవాలు - ఆదర్శాలు పెద్ద గ్రంథంగా వెలువరించారు. ఆయన్ను సత్కరించడానికి కొందరు సంఘంగా ఏర్పడి రానే రచనల్ని సంకలనంగా 500 పుటల్లో ప్రచురించారు.

రాణె 1925లో పుట్టారు. బొంబాయి తరలివచ్చి హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నప్పుడు వి.ఎం. తార్కుండేతో పరిచయమై, సాన్నిహిత్యంగా మారింది.

తొలుత ఎం.ఎన్. రాయ్ రాడికల్ డెమొక్రటిక్ పార్టీని వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు చేసిన వారిలో రాణె కూడా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఎం.ఎన్. రాయ్ బ్రిటిష్‌వారిని సమర్థిస్తూ ఫాసిస్టు దేశ ప్రమాదాన్ని ఎదుర్కొడానికి అలాచేయాలని, యుద్ధంలో బ్రిటన్ గెలిస్తే, ఇండియాను వదలి వెడుతుందని చెప్పాడు. అది తరువాత నిజమైనా, యుద్ధకాలంలో కాంగ్రెస్ వీరజాతీయాభిమానులకు రాయ్ మాటలు నచ్చలేదు. అలాంటప్పుడు రాయ్ రచనలు చదివాడు. అప్పుడు గాని రాణెకు అసలు విషయాలు అవగాహన కాలేదు. అంతటితో మారిపోయి, రాడికల్ హ్యూమనిస్ట్‌గా పరిణమించాడు.

రాణె చాలా కాలం రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక నడపటానికి ఆర్థిక సహాయం చేశాడు. "మేరా భారత్ మహాన్" అనే శీర్షికన రాడికల్ హ్యూమనిస్టులో హాస్య, వ్యంగ్య రచనలు చేశాడు.

ప్రస్తుత సంకలనానికి Good Times - Bad Times - Sad Times అని పేరు పెట్టారు. రాణె రచనలలో వృత్తి రీత్యా అనుభవాలు, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, మతం, మానవ హక్కులు మొదలైన అంశాలన్నీ చేర్చారు. కొద్దిగా స్వీయగాథ కూడా వున్నది.

వి.ఎం. తార్కుండే యీ సంకలనానికి పీఠిక రాశారు. రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమం పేద వర్గాలలోకి చొచ్చుకపోవాలని తార్కుండే అన్నారు. తార్కుండే 90 ఏట, ఆయనపై ఒక పెద్ద గ్రంథాన్ని రాణె వెలువరించారు. ప్రస్తుతం 75వ ఏట వున్న రాణె, జీవితమంతా రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమానికి కృషి చేస్తామని అన్నారు.

ఎం.ఎన్. రాయ్ నడిపిన అధ్యయన శిబిరాలలో పాఠాలు నేర్చిన రాణె, జాతీయవాదంలో వున్న లోపాన్ని గ్రహించగలిగాడు. మతాన్ని రాజ్యాన్ని వేరుపరచవలసిన అవసరాన్ని అర్థం చేసుకున్నారు. ప్రజాసంఘాలు ఏర్పరచవలసిన అవశ్యకతను, అట్టడుగునుండే ప్రజాస్వామ్యం నిర్మించాల్సిన తీరు గ్రహించారు.

కాంగ్రెసు ఫాసిస్టు ధోరణిని, జన సంఘ మతమౌఢ్యాన్ని రాణె తన వ్యాసాలలో

బట్టబయలుచేశారు. నాస్తికత వివరించి ప్రతి రాడికల్ హ్యూమనిస్ట్‌కూడా నాస్తికుడేననీ, అయితే తాత్విక అవగాహన, తాత్వికపునాదులు మానవవాదులకు వుండటంతో వారి ధోరణి పరోక్షంగా గాక, ప్రత్యక్షంగా సాగిపోతుందన్నారు.

రాణె రచనలు ఇంగ్లీషులో సరళంగా వున్నాయి.

M.A. Rane, 75th Birthday Felicitation Committee వారు ప్రచురించిన 500 పుటల గ్రంథాన్ని 300 రూపాయలకు యిస్తున్నారు.

*- హేతువాది, ఏప్రిల్ 2001*

# అబద్ధాల వేట
# ఏది సత్యం? గాంధీగారూ!

గాంధీగారిని కాంగ్రెసు వారు, స్వాతంత్ర పోరాటయోధులు, సర్వోదయవాదులు "మహాత్మ"గా చూస్తారు.

మానవవాదులు, హేతువాదులు గాంధీజీని మనిషిగా భావించి, అంచనావేస్తారు. అందరి మనుషులవలె, గాంధీకూడా రాగ ద్వేషాలు, ఈర్ష్య అసూయలుగల వ్యక్తి. గాంధీజీ గొప్పతనాన్ని హేతువాదులు గ్రహిస్తారు, లోపాల్ని నిర్మొహమాటంగా చూపుతారు. అది శాస్త్రీయ ధోరణి. మనిషిని అంచనా వేయడానికి పూర్తి వ్యక్తిత్వాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం, అన్ని వివరాలు కూలంకషగా తెలుసుకోవడం అవసరం, "మహాత్ముడ"ని ఆరాధించే వారు నిజానిజాలు విడమరచి చూడలేరు. సమాధుల్ని పూజిస్తారు, భజనలు చేస్తూ వ్యక్తి ఆరాధనతో తృప్తిపడతారు.

గాంధీజీ హేతువాదుల దృష్టిలో గొప్ప స్వాతంత్రపోరాట రథసారథి. సత్యాగ్రహాన్ని ఆయుధంగా స్వీకరించి, అహింసా పద్ధతిలో, అశేష ప్రజానీకాన్ని పోరాట రంగంలోకి దింపిన వ్యక్తి గాంధీజీ, దేశ స్వాతంత్ర విషయంలో రాజీపడకుండా పోరాడిన విశిష్ట నాయకుడు. చరిత్రలో గాంధీజీ ఆ విధంగా చిరస్మరణీయుడుగా నిలుస్తాడు. స్వాతంత్ర పోరాటంలో హిందూ ముస్లింలను కలుపుకురావాలని ఆకాంక్షించిన గాంధీజీ, మత సామరస్యతకై కృషిచేశారు. స్వాతంత్ర పోరాటాన్ని గ్రామాలలోకి తీసుకెళ్ళారు. మహిళల్ని ఉత్తేజ పరచారు. ఎటు చూచినా దేశ స్వాతంత్ర పోరాట నాయకుడుగానే గాంధీజీ కనబడతారు. మంచి లక్ష్యానికి మంచి మార్గం అనుసరించాలని చెప్పిన వ్యక్తిగా గాంధీజీ ఆదర్శప్రాయుడే. అలాంటి గాంధీజీ తన జీవితమే సత్య పరిశోధనగా పేర్కొన్నారు. అందుకే జీవిత చరిత్ర రాశామన్నారు.

గాంధీజీ జీవితచరిత్ర పరిశోధించి రాయాల్సివుంది. ఇంకా ఆ పని జరగలేదు. ముఖ్యంగా గాంధీజీ తొలిజీవితం, దక్షణాఫ్రికా రంగంలో ఆయన పాత్ర శాస్త్రీయ ఆధారాలలో

అధ్యయనం చేయాలి. అప్పుడుగాని అసలు గాంధీ మనకు అర్థంకారు. గాంధీ జీవితంపై అనేక గ్రంథాలు వచ్చాయి. దేశ విదేశ రచయితలు ఎన్నో పుస్తకాలు రాశారు. ఇందులో ప్రసిద్ధులుకూడా కొందరున్నారు. గాంధీజీ రాసిన స్వీయ చరిత్ర ఆధారంగానే వీరిలో చాలా మంది తమ రచనలు చేశారు. అక్కడే వచ్చింది చిక్కు. గాంధీజీ సంపూర్ణ రచనలు వెలువడ్డాయి, సంపూర్ణ పరిశోధన మాత్రం యింతవరకూ వెలువడలేదు! "మహాత్మ" అని భావించిన వారు పరిశోధన చేయలేరు. గాంధీ తన తొలి జీవితాన్ని గురించి రాసిందే వీరుకూడా స్వీకరించారు. అయితే అందులో దోషం ఏమిటి? అనే ప్రశ్న రావచ్చు. ఇక్కడ ఆగి, "మహాత్మ" విషయం కొద్దిగా గమనిద్దాం.

"మహాత్మ" అనే బిరుదు నన్ను బాధపెడుతున్నది............ నేను సంపూర్ణత్వాన్ని జీవితంలో ఎన్నడూ ఆపాదించుకోలేదు. నా సహచరులలో వున్న అపవిత్రత నాలోని దోషాన్ని సూచిస్తున్నది. "మహాత్మ" అనే మాట నాకు తిట్టుగా వుంటుంది - ఇదీ గాంధీజీ అభిప్రాయం. ఆ మాత్రం గ్రహింపు పరిశోధకులకు, రచయితలకు వుంటే యీ పాటికి స్వతంత్రంగా గాంధీజీ జీవిత చరిత్ర వచ్చివుండేదే.

1922లోనే సంపూర్ణ స్వరాజ్యం వస్తుందన్న గాంధీజీ, కేవలం తన మనస్సాక్షికి దైవం చెబుతున్న దృష్ట్యా అలా ఘంటాపథంగా చెప్పగలుగు తున్నామన్నారు. కాని, శాస్త్రీయాధారాలతో మనస్సాక్షి మాటల్ని పరిశీలించలేదు. స్వాతంత్రం 1922లో రాలేదు, హిమాలయాలంతటి తప్పుచేశానన్నాడు గాంధీజీ. కాని, అనుచరులు మాత్రం యింకా అలాంటి తప్పులుచేస్తూనే వున్నారు.

గాంధీజీ తన తొలి జీవిత వాస్తవాలు లండన్ డైరీ పేరిట ఇంగ్లీషులో రాశారు. 20 సంవత్సరాలు జాగ్రత్తగా అట్టిపెట్టి 1909లో 120 పేజీల లండన్ డైరీని తన బంధువు భగన్‌లాల్‌కు అప్పగించారు గాంధీ కార్యదర్శిగా సేవలు చేసిన మహదేవ దేశాయికి 1920లో అవి చేరాయి, ఉత్తరోత్తరా అది ప్యారీలాల్‌కు చేరిందో లేదో తెలియదు. కాని, గాంధీజీ స్వయంగా నోట్ పుస్తకాలలో ఇంగ్లీషులో నిర్మొహమాటంగా రాసిన నిజాలు అదృశ్యమయ్యాయి కేవలం 20 పేజీలు అట్టిపెట్టి గాంధీజీ శీలాన్ని కాపాడదలచిన భక్తులు, మిగిలిన లండన్ డైరీని నామరూపాలు లేకుండా చేశారు. ఎందుకిలా జరిగింది? లండన్‌లో విద్యార్థి జీవితాన్ని యథాతథంగా గాంధీ రాస్తే, భక్తులకు షాక్ కొట్టి అదంతా బయటకొస్తే కొంప మునుగుతుందని, రచన కనబడకుండా చేసి తృప్తిపడ్డారు! గాంధీజీకి సంబంధించిన నిజాలు నాశనం చేయడంలో ఆయన శిష్యులు ఎప్పటికప్పుడు తగిన పాత్ర వహిస్తూనే వున్నారు. మహాత్మగాంధీ రచనల సంపుటాలలో ఇట్లాగే కొన్ని వాస్తవాలను 1938లో నాశనంచేస్తే, గాంధీజీకి తెలిసికూడా వూరుకున్నారు!

లండన్ డైరీలో మిగిలిన 20 పేజీల ఆధారంగా లండన్ ప్రయాణం గురించి కొన్ని వివరాలు లభిస్తున్నాయి, దక్షిణాఫ్రికా గురించి 30 ఏళ్ళ తరువాత జ్ఞాపకం వున్నంతవరకూ గాంధీజీ రాస్తే, అదే మిగిలిన వారికి ఆధారమైంది.

గాంధీజీ జీవితంలో మలుపుతిప్పిన సంఘటన 1893లో దక్షిణాఫ్రికా వెళ్ళడమే, అక్కడ ప్లీడరుగా ప్రాక్టీసుపెట్టి, సంపాదించుకోవాలని, ఇండియాలో అలాంటి అవకాశం లేదని గాంధీజీ భావించి ప్రయాణం కట్టారు. కాని, ఆ విషయం దాచిపెట్టి, 1893 ప్రయాణం గురించి పట్టీపట్టనట్లు రాశారు. ఇండియాలో పొందిన వైఫల్యానికి బదులు, దక్షిణాఫ్రికాలో పట్టుబట్టి సాధించాలని గాంధీజీ లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే సాధించారుకూడా. కాని ఆ విషయం తన రచనలో దాచారు. దక్షిణాఫ్రికాలో గాంధీజీ రాసిన పబ్లిక్ పిటిషన్ ప్రచురించిన సంపుటాలలో చేర్చలేదు. 1893 సంవత్సరం గాంధీజీ జీవితంలో ఎంత మలుపు తిప్పిందో, అంతగా ఆ విషయాన్ని ఆయన దాచారు. దాదా అబ్దుల్లా కేసు కోసమే ఆయన దక్షిణాఫ్రికా వెళ్ళలేదు. వెళ్ళి అక్కడ పట్టంగట్టి, ప్లీడరీగా కుదురుకోవాలనే నిశ్చయంతోనే వెళ్ళారు. అది సాధించారు కూడా.

గాంధీ జీవిత రచన చేసిన ప్యారీలాల్, దక్షిణాఫ్రికాలో గాంధీజీ వెళ్ళకముందు జాతి విచక్షణ పట్టించుకున్నవారే లేరని మనల్ని నమ్మించే ప్రయత్నం చేశారు. కాని అప్పటికే ప్రిటోరియాలో సి.ఎం. పిళ్ళె, కింబర్లీలో దొరస్వామి పిళ్ళె, ఎ.ఒ. అల్లె వున్నారన్న సంగతి ఆయన పరిశోధించనేలేదు. మునుస్వామి అనే మరో వ్యక్తి కూడా యధాశక్తి జాతి విచక్షణకు వ్యతిరేకంగా, తమ హక్కులకోసం పోరాడిన వారిలో వున్నారు. ఇదంతా గాంధీయులు దాచారు. గాంధీకూడా దాచాడు. అదేబాధ, దక్షిణాఫ్రికాకు కేవలం కేసునిమిత్తం వెళ్ళివుంటే, అది పూర్తికాగానే గాంధీజీ వచ్చివుండేవారు. ఆయనకు వీడ్కోలు సభకూడా జరిగింది. అయినా గాంధీజీ అక్కడ వుండాలని భావించినందున, అందుకు తగిన పోరాట కారణాలుకూడా ఆయనకు లభించాయి. అలా చెబితే బాగుండేది. సత్యంకోసమే పుట్టినట్లు చెప్పిన గాంధీ, యీ విషయాన్ని దాచనక్కరలేదు, పైగా భారతీయులు సంతోషించేవారు. గాంధీజీ అబద్ధాలతో దక్షిణాఫ్రికా జీవితం ఆరంభించి, సఫలీకృతులయ్యారు. వీడ్కోలు సమావేశంనాటికే గాంధీజీ దక్షిణాఫ్రికాలో కొనసాగడానికి, భారతీయుల పక్షాన ఒక విజ్ఞాపన పత్రం సిద్ధంచేశారు. కొందరి సంతకాలు సేకరించారు, భారతీయులకు ఓటు హక్కు నిరాకరించే బిల్లును వ్యతిరేకించడానికి ఉద్యమించారు. అదంతా బాగానే వుంది, కాని స్వీయ చరిత్రలో, ఓటుహక్కు బిల్లు గురించి తనకు తెలియనే తెలియదని గాంధీజీ పచ్చి అబద్ధంఆడారు. సత్యశోధనకై అంకితమైన వ్యక్తి అలా ఎందుకు చేశారు?

దక్షిణాఫ్రికాలో వుండదలచలేదు గనుక, వచ్చినపని పూర్తి అయింది గనుక, ఇండియాకు వెళ్ళదలచానని గాంధీజీ రాశారు. ఇదికూడా దారుణ అబద్ధం. ప్రిటోరియాలో కేసు విషయం చూస్తూనే, మరోపక్క దక్షిణాఫ్రికా సాంఘిక రాజకీయ పరిస్థితిని గురించి నోట్స్ రాసుకున్నారు. నేటాల్ భారతీయుల నిమిత్తం, వారి ప్లీడరుగా అక్కడే వుండదలచి గాంధీజీ తన కృషి అంతా కేంద్రీకరించారు. నేను ఇండియా వెళ్ళాలనుకుంటే, దైవం మరో విధంగా తలచింది. అని గాంధీ రాశారు. కాని గాంధి చేసిన కృషిఅంతా ఒక పథకం ప్రకారమేనని సాక్ష్యాధారాలు, ఆయన ఉపన్యాసాలు, భారతీయుల సమావేశాలు తెలుపుతున్నాయి.

దక్షిణాఫ్రికాలో వుండదలచిన గాంధీజీ కావాలని పార్లమెంటుకు దరఖాస్తు సమర్పించడంలో జాప్యంచేశాడు. సమయానికి దరఖాస్తు యిస్తే పార్లమెంటులో ఓటు హక్కు బిల్లు ఆగేదే, అప్పుడు గాంధీజీ చేసేది లేక, ఇండియా తిరిగి రావలసి వచ్చేది. అక్కడే వుండదలచి, జాప్యం చెయ్యాలని, బిల్లు వస్తుందని తెలిసి కూడా వూరకున్నాడు. భారతీయులకు ఓటు హక్కు వున్నట్లే, నేటాల్ భారతీయులకు వుండాలని గాంధీ తన స్వీయ గాథలలో రాశారు. 1890లో భారతీయులకు ఓటు హక్కు లేదని తెలిసీ గాంధీ అలా వ్రాశారంటే, దీనిపై వ్యాఖ్య పాఠకులకే వదలేస్తున్నాను. 1893 సంవత్సరం గాంధీ జీవితంలో పెద్ద మలుపు అని ఇంతకు ముందే పేర్కొన్నాం. అంతకుముందూ ఆ తరువాత ఓడ ప్రయాణాలు, అనుభవాలు క్షుణ్ణంగా పూసగుచ్చినట్లు రాసిన గాంధీ, 1893 ఓడ ప్రయాణం మాత్రం అంటీ అంటనట్లు రాశాడు. ఆయన జీవిత చరిత్ర పరిశోధకులు ఆ విషయం పట్టించుకోలేదు.

గాంధీ మార్గ్ త్రైమాస పత్రిక సంపాదకుడు, గాంధేయ అధ్యయనంలో నిపుణుడు టి.కె. మహదేవన్ ప్రత్యేక పరిశోధనచేస్తే అనేక నగ్న సత్యాలు బయటపడ్డాయి. (చూడండి : ది ఇయర్ ఆఫ్ ది ఫెనిక్స్ 1982 ఆర్నాల్డ్ హానిమన్, ఢిల్లీ ప్రచురణ) వృత్తి రీత్యా తనకు సంబంధించిన విషయమై గాంధి రహస్యంగా వ్యవహరించడంకద్దు (చూడు : టి.కె. మహదేవన్ రాసిన ద్విజ : ఎ ప్రాఫెట్ అన్ ఆర్మ్‌డ్ 1977) గాంధీ తన జీవిత చరిత్రను గుజరాత్‌లో రాసి, వారం వారం నవజీవన్ పత్రికకు పంపాడు. 1922 నుండే జైలులో వుంటూ కేవలం జ్ఞాపకశక్తిపై ఆధారపడి గాంధీ రాశాడు. తన సత్య శోధన రచనలో చాలా తప్పులు దొర్లినట్లు మగన్‌లాల్ గాంధీకి రాసిన లేఖలో అంగీకరించారు. కాని దక్షిణాఫ్రికాకు చెందిన విషయాలు రాసిన తరువాత గాంధీ ఎన్నడూ దిద్దలేదు. పుస్తక రూపంలో జీవిత చరిత్రను వేస్తున్నప్పుడు కూడా గాంధీ మళ్లీ దిద్దలేదు. కనుక, దొర్లిన దోషాలు అలాగే వున్నాయి. చరిత్రలు రాసిన గాంధేయులుగాని, అభిమానులుగాని ఆయన రచనలలో నిజానిజాలు పరిశీలించలేదు. గోవింద బాబు కొన్ని విషయాలు గాంధి తన జీవిత చరిత్రలో ఎలా వదిలేసిందే ప్రస్తావించగా, సత్యాన్వేషణకు రాశాకగాని, కార్యకర్తలకు ధృవపత్రాలివ్వడానికి కాదని గాంధీ యంగ్ ఇండియాలో బదులిచ్చారు (జనవరి 31-1929) గాంధీ తన సత్యశోధనలో కావాలని నిజాల్ని దాచేస్తే ఎవరేం చేస్తారు? దక్షిణాఫ్రికాలో తాను ప్లీడరుగా దాదా అబ్దుల్లా కేసు చేబట్టినా, అతడు దొంగ సరుకు రవాణా చేస్తుండేవాడనే సత్యాన్ని గాంధీజీ దాచేశారు. కాని తన కుటుంబ మిత్రుడైన రుస్తుంజీ మాత్రం దొంగ సరుకు రవాణాలో పట్టుబడ్డాడని రాశాడు ఆయనమీద ప్రేమతోనే అలా రాశానని, జీవితగాథ వున్నంతవరకు రుస్తుంజీ పేరు చిరస్థాయిగా వుండాలని తన ఉద్దేశమని, అందుకే ఇతరుల పేర్లు వదలేశానని, తన కుమారుడు మణిలాల్ అభ్యంతరానికి సమాధానమిచ్చారు (1928 జులై 15)

వివేకానంద శిష్యురాలు నివేదితను కలసినవిషయమై గాంధీ ప్రస్తావనను వివరిస్తూ 1927 జులై మోడరన్ రివ్యూ విమర్శించగా, గాంధీ తప్పడు కూడా కేవలం జ్ఞాపకశక్తిపై ఆధారపడి రాశానని, సత్యశోధనకై ఉద్దేశించాను గనుక మనస్సుపై పడిన ముద్ర దృష్ట్యానే యిది చూడాలన్నారు!

కేవలం జ్ఞాపక శక్తిపై ఆధారపడి సత్య శోధన చేస్తే వచ్చిన దోషాలు గాంధీ జీవితంలో యిన్నీ అన్నీకాదు. అయితే 30 సంవత్సరాల తరువాత జీవిత చరిత్ర ధారావాహికంగా రాసినా, కొన్ని సంగతులు ఫొటో తీసినట్లే రాశారు. తన జీవిత చరిత్ర ప్రభావం చాలామందిపై వుంటుందని తెలిసిన గాంధీ నిజాలు చెప్పడంలో జాగ్రత్త వహిస్తే, సత్య శోధన బాగుండేది! ప్యారీలాల్, పెయిన్, హటన్‌బాక్‌తో సహా జీవితచరిత్ర రాసినవారంతా గాంధీ రాసిన దానినే యథాతథంగా మనకు చెప్పడం వలన, శాస్త్రీయ పరిశోధన జరగలేదని తేలింది. గాంధీ అబద్ధాలు రాస్తే, ఆయన చరిత్రకారులు అవే చిలక పలుకుల్లాగా మనకు తిప్పి చెప్పారు. దక్షిణాఫ్రికాలో గాంధీ వీడ్కోలు సమావేశం అందుకు మచ్చుతునక! గాంధీజీ తన సత్యశోధనలో తన బాల్య ముస్లిం మిత్రుడు షేక్ మెహతాబ్ గురించిన అనేక వాస్తవాలు వదలేశానన్నారు. వాళ్ళిద్దరి మధ్య స్వలింగ సంపర్క సంబంధం వుందని ఎరిక్ ఎరిక్సన్ తన గాంధీస్ ట్రూత్‌లో అంటాడు. షేక్ మెహతాబ్ చిన్నప్పటినుండే మిత్రుడుగా గాంధీచేత చేయించని పాపం అంటూ లేదు. చివరకు దక్షిణాఫ్రికాకు సైతం షేక్ మెహతాబ్‌ను పిలిపించుకున్నాడు. అయినా సత్యశోధన రచనలో చాలా వాస్తవాలు వదలేశారు.

దక్షిణాఫ్రికాలో గాంధీజీ చాలా పరిశోధనలు చేశారు. ఆయన కీర్తి ఇండియాలో వ్యాపించింది. భారతీయుల కోసం పోరాడి, దెబ్బలుతిని, నిలిచిన ధైర్యశాలి గాంధీ. దక్షిణాఫ్రికా అనుభవాలే గాంధీని భారతదేశంలో నాయకుడిగా రూపొందించడానికి పునాదులు వేశాయి. దక్షిణాఫ్రికాలో తన భార్య కస్తూరిబాను ఒక దశలో ఇంట్లోనుంచి గెంటశాడు యువతతో టాల్‌స్టాయ్‌ఫాంలో పరిశోధనలు చేశాడు. చెరువులో స్నానాలు చేస్తున్న యువతీ యువకులు చిలిపి చేష్టలు చేయగా, వారిని నగ్నంగా నడిపించి, ఆడపిల్లల జుట్టు కత్తిరించిన పరిశోధనకూడా యిందులో ఒకటి. నలుగురు పిల్లలు పుట్టిన తరువాత, ఇక లైంగిక సంబంధం వద్దని ఒట్లు పెట్టుకున్నదికూడా దక్షిణాఫ్రికాలోనే. గాంధీ బాల్య వివాహం చేసుకొని, విపరీతంగా లైంగిక కార్యకలాపంలో మునిగి తేలిన విషయం విస్మరించరాదు. అది గ్రహిస్తే ఆయన పెళ్ళి అయిన వారికి బ్రహ్మచర్యం పాటించమని సలహా యివ్వడంలో విజ్ఞతను గమనించవచ్చు. లైంగిక వాంఛలు ఆగాయో లేదోనని వృద్ధాప్యంలో కూడా కలకత్తా - నౌఖాళిలో ఇద్దరు యువతులమధ్య నగ్నంగా పడుకుంటే, ఆయన కార్యదర్శి నిర్మలకుమార్ బోసు అభ్యంతరపెట్టి రాజీనామా యిచ్చిన విషయం గుర్తుంచుకోవాలి.

గాంధీ జీవితంలో స్వాతంత్ర పోరాటం ఆయనకు గొప్పతనాన్ని తెచ్చిపెట్టింది. అంతవరకే స్వీకరించకుండా ఇతర విషయాలు కూడా ప్రభావితం చేయడంతో మనం పరిశీలించి, అర్హతలు గమనించవలసి వచ్చింది. గాంధీ అభిప్రాయాలు ఆయుర్వేదం మొదలు ఆవుల వరకూ అనేక అంశాలపై వున్నాయి. అవన్నీ సత్యశోధన అనలేం. గాంధీ సైన్స్ బొత్తిగా చదువుకోలేదు. శాస్త్రీయ ధోరణిలో చూస్తే గాంధీ భావాలు అసలే నిలబడవు. అశాస్త్రీయమైన భావాలు వదిలేద్దాం. బీహారులో భూకంపం వస్తే, ప్రజలు పాపం చేశారు గనుక దేవుడు ఆగ్రహించాడని గాంధీ

ప్రకటించాడు. ఆయన సన్నిహిత అనుచరులే - పండిట్ నెహ్రూతో సహా యీ అశాస్త్రీయ ధోరణిని బాహాటంగా ఖండించారు. దేశీయ దుస్తులే ధరించాలంటూ, రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సిల్కుబట్టలు వదలేయమంటే ఆయన నిర్మొహమాటంగా నిరాకరించారు. దేవాలయాలపై బూతుబొమ్మలున్నచోట, తనకు పెత్తనం వుంటే కూలగొడతానని గాంధీ అంటే, ఖజురాహో దేవాలయ శిల్ప సంపద అభినందించిన వారు నవ్వుకున్నారు (అగేహానంద భారతి) కనుక స్వాతంత్రపోరాటం మినహా మిగిలిన విషయాలలో గాంధీ భావాలు అట్టే పట్టించుకుంటే మనం నవ్వులపాలవుతాం. రాజకీయాలలో మాత్రం గాంధీ గారి చిత్తశుద్ధిని కొన్ని సందర్భాలలో శంకించినవారు లేకపోలేదు. అదికూడా ఆషామాషీగా కాదు, ఆధారాలతోనే అందులో అంబేద్కర్ పేర్కొనదగిన వ్యక్తి, ఆయన అడిగిన ప్రశ్నలు, చూపిన ఆధారాలు తిరుగులేనివి. గాంధీజీ అబద్ధాలకు మరోనిదర్శనంగా యీ విషయాలు నేటికీ మనముందున్నాయి. అటు గాంధీని ఇటు అంబేద్కర్‌ను ఒకే వేదికపై నిలబెట్టి పొగిడే రాజకీయ వాదులను విస్మరించి యీ విషయాలు పరిశీలించాలి. ఓట్లకోసం పడే పాట్లు వున్నంతకాలం రాజకీయ వాదులు ఎవరినైనా వాడుకుంటారు. శాస్త్రీయ పరిశీలనకు వారి ప్రవర్తన అడ్డురాకూడదు.

అంటరాని తనం పోవాలని గాంధీ పదే పదే అంటుండేవాడు. దీనికి గాను ఆయన దేవాలయాలలో హరిజనులకు ప్రవేశం వుండాలన్నారు. హరిజన అనే పదంకూడా ప్రచారంలోకి తెచ్చారు. ఈ రంగంలో గాంధీ చిత్తశుద్ధిని అంబేద్కర్ ప్రశ్నించారు. గాంధీ అబద్ధాలను బయటపెట్టారు.

ఎన్నో సత్యాగ్రహాలు, నిరాహార దీక్షలు ఎన్నో కారణాలకై చేసిన గాంధీ, కనీసం ఒక్కసారైనా అంటరానితనం పోవడానికి నిరాహార దీక్ష పూనలేదేమని అడిగారు. గాంధీ సమాధానం చెప్పలేదు. అలాగే, అంటరాని వారి పక్షాన ఒక్క సత్యాగ్రహమైనా ఎందుకు చేయలేదని అంబేద్కర్ ప్రశ్నిస్తే గాంధీ మౌనం వహించారు. స్వరాజ్యం రావడానికి అంటరానితనం పోవాలని ఉపన్యాసాలిచ్చిన గాంధీ, ఖద్దరు ధరించాలన్నారే గాని, కాంగ్రెసు సభ్యత్వానికి అంటరానితనం పాటించబోమని ప్రతిన చేయమనలేదు. గాంధీ చేయకపోతేమానె అంటరానితనం పోగొట్టడానికి నాందిగా 1929లో బావులు వాడుకోడానికి, దేవాలయ ప్రవేశానికి సత్యాగ్రహం తలపెట్టారు కొందరు హరిజనులు. దీనిని సమర్థించకపోగా, గాంధీ ఖండించడం అంబేద్కర్‌కు ఆశ్చర్యం వేసింది. కేరళలో గురువాయూర్ గుడి హరిజనులకు తెరవకపోతే ఆమరణ నిరాహారదీక్ష పూనుతానని బెదిరించిన గాంధీ, ఆ మాట ఎన్నడూ పాటించలేదు. హరిజనుల దేవాలయ ప్రవేశబిల్లును రంగ అయ్యర్ కేంద్ర శాసనసభలో ప్రవేశపెట్టినా, ఎన్నికలు దగ్గరపడుతుంటే కాంగ్రెసుపార్టీ ఆ బిల్లుకు మద్దతు ఉపసంహరిస్తే, గాంధీ కనీసం అభ్యంతరమన్నా తెలుపలేదేమి? హరిజన సేవా సంఘంలో హరిజనులు లేకపోగా వారిపై దాడులు జరిగితే పౌరహక్కులు కాపాడుకునే నిబంధన కూడా సంఘ నియమావళిలో చేర్చలేదు.

హరిజనులకు ప్రత్యేక రాజకీయ హక్కులు ప్రసాదించే ఒప్పందాన్ని వ్యతిరేకించడానికి ఆమరణ నిరాహార దీక్ష పూనిన గాంధీ, ముస్లింలకు అలాంటి హక్కులిస్తుంటే కాదనలేదు. అంటరాని వారిపై ప్రేమవున్న గాంధీ కాంగ్రెసు మంత్రి వర్గాలలో వారికి ప్రాతినిధ్యం వుండాలని సూచన చేయలేదు. మధ్యపరగణాలలో అగ్ని భోజ్ అనే హరిజనుడ్ని మంత్రిగా నియమిస్తే గాంధీ వ్యతిరేకించారు. ఇలాంటి విషయాలన్నీ బాధతో ఆవేదనతో అంబేద్కర్ తన పుస్తకంలో వివరంగా రాశారు. (చూడు : వాట్ కాంగ్రెస్ అండ్ గాంధి వేవ్ డన్ టు ది అన్ టచ్ బుల్స్ 1945 థాకర్ అండ్ కో బాబ్)

గాంధీ ముఖ్యంగా హిందువు. ప్రార్థనా సమావేశాలలో గీతా పారాయణం చేసేవారు. వర్ణాశ్రమ ధర్మాలను సమర్థించారు. వర్ణాలు కావాలంటే కులాలు కావాలనడమే, అంటరానితనం హిందూ మత పుత్రికే, అంటరానితనం పోవాలంటే హిందూమతంలో సాధ్యంగాదు. గాంధీకి యీ విషయం బాగా తెలుసు. రాజకీయాలలో ప్రాబల్యంకోసం, స్వాతంత్రోద్యమం బలహీన పడకుండా చూడడానికి హరిజనుల్ని గాంధీ ఆకర్షించారు, వాడుకున్నారు. అంతకు మించి ఆచరణ కార్యక్రమం ఏదీ లేదు. చివరి దశలో కులం పోవాలని గాంధీ రాశారు. కాని అప్పటికే ఆయన హరిజనులకు చాలా అన్యాయం చేశారు. అంబేద్కర్ యీ విషయం గ్రహించి హెచ్చరించినా హరిజనులు గ్రహించలేదు. హిందూ మతం పట్టు వారిని వదలలేదు. ఆ మతంలోనే వుంటూ అంటరానితనం పోగొట్టుకోవడం సాధ్యంకాదని వారూహించలేదు. గాంధీ తెలివిగా హరిజనుల్ని మోసగించగలిగారు.

ఆధునిక భారతదేశం గాంధీని వదలేసి ఎం.ఎన్. రాయ్‌ను అనుసరించి వుంటే యెంతో ముందుకు పోయేది, బాగుపడేది అని కీ॥శే॥ నార్ల వెంకటేశ్వరరావు ఆవేదనతో రాశారు. కాని అది యెదురీత. ఎం.ఎన్. రాయ్ శాస్త్రీయ పరిశీలకుడు. ఆయన్ను అనుసరించడం నమ్మకస్తులకు చాలా దుర్లభం. గాంధీ ఆకర్షిత వ్యక్తి. ప్రజలలోవున్న మూఢనమ్మకాలను పాటించి, రాజకీయాలకు వాడుకున్న నాయకుడు. కనుక ఆయనకువున్న పలుకుబడి ప్రచారం ఎం.ఎన్. రాయ్‌కు వూహించలేం. గాంధీ భావాలపట్ల నమ్మకంలేని నెహ్రూ, సైతం రాజకీయాలలో నాయకత్వంకోసం గాంధీజీకి శిరస్సు వంచక తప్పలేదు. యెదురు తిరిగిన సుభాస్ చంద్రబోసు, అంబేద్కర్ దెబ్బతిన్నారు.

భారతీయ జనతాపార్టీ సైతం గాంధీని పొగడాల్సిన పరిస్థితి మన దేశంలో వుంది. ఓట్లు కావాలంటే ప్రజా బాహుళ్యంలో సెంటిమెంటుకు వ్యతిరేకంగా పోకూడదన్నమాట. ప్రజలకు శాస్త్రీయ ధోరణి చెప్పాలని గాంధీవంటి వారు తలపెడితే యెలావుండేదో! కాని గాంధీ గోవధ నిషేధం, ఆయుర్వేదం, ప్రకృతి చికిత్స, శాఖాహారం, ఉపవాసాలు, ఖద్దరు వంటి అనేక విషయాలలో ప్రవాహానికి అనుకూలంగా వెళ్ళారు. అందుకే స్వాతంత్రోద్యమంలో ఆయన మతాన్ని తెలివిగా రాజకీయాల్లోకి తెచ్చారు. చివరిదశలో మతాన్ని రాజకీయాలకు దూరంగా

వుంచాలన్నారు. అప్పటికే ముదిరిపోయింది. దేశంలో మూఢనమ్మకాలకు, అశాస్త్రీయ ధోరణులకు గాంధి గట్టి పునాదులు వేశారు.

భవిష్యత్తు బాగా వుండాలని కోరుకునే వారు గాంధీ జీవితాన్ని శాస్త్రీయంగా పరిశీలించాలి. చరిత్రను సైంటిఫిక్‌గా రాయాలని ఎం.ఎన్. రాయ్ కోరాడు. అందుకు భిన్నంగా గాంధీ స్వీయగాథలు, రచనలు వున్నాయి. పరిశోధకులు సత్యాన్వేషణకు పూనుకుంటే వాస్తవాలు బయటకు వస్తాయి. ఈశ్వర-అల్లా తేరేనాం అంటూ గాంధీ జయంతులలో టోపీలు పెట్టుకొని సమాధికి పూలుచల్లుతూ, భజన చేసినంత కాలం "సత్యాన్వేషణ" జరగదు. వీరారాధనలో ఆలోచన వుండదు.

గాంధీకి చరిత్రలో ఏ మేరకు గౌరవ స్థానం యివ్వాలి అనేదికూడా శాస్త్రీయ పరిశీలకులు నిర్ధారించాలి. స్వాతంత్ర్య పోరాటంలో ఆయనకు సముచిత స్థానం యివ్వడానికీ మిగిలిన విషయాలలో పాటించడానికీ తేడా గ్రహించాలి.

*- హేతువాది, నవంబర్ 1993*

# శాస్త్రవేత్త గెలీలియోను హతమార్చిన తీరు!

భూమి చుట్టూ గ్రహాలు, గోళాలు, తారలు తిరుగుతాయని మత శాస్త్రాలు చాలాకాలం నమ్మించాయి. పవిత్ర గ్రంథాలలో అలా రాసుకొని జనాన్ని అనుసరించమన్నారు టాలమీ అలాగే రాశాడు.

పరిశీలన, పరిశోధన వచ్చి మతభావాల్ని కాదంటూ అసలు విషయాన్ని వున్నది వున్నట్లు బయటపెట్టాయి. కోపర్నికస్ 1543లో సూర్యుడు కేంద్రం అనీ, భూమి కాదని రాసి చనిపోయాడు. అంతటితో అప్పటి వరకూ టాలమీ (క్రీ.శ. 150) రాసిన భూకేంద్ర సిద్ధాంతం తలక్రిందులు చేయాల్సి వచ్చింది. భూమి స్థిరంగా, కదలించడానికి వీలు లేకుండా వుంటుందని బైబిల్ చెప్పింది. క్రైస్తవులు అలాగే నమ్మారు. (సామ్ 93)

కెప్లర్ వచ్చి సూర్యుడు కేంద్రం అన్నాడు. అతడు గెలీలియో సమకాలీనుడే!

గెలీలియో ఇటలీలో పుట్టి పెరిగి చదువుకున్నాడు. అతడి మిత్రుడే మఫె బార్బెరిని (Maffew Barberini). ఇద్దరూ ఇటలీ పీసా యూనివర్శిటీలో చదువుకున్నారు. మిత్రులుగా ఎదిగారు. కాగా మత వ్యవస్థలో బాగా పలుకుబడి, ధనం గల కుటుంబం నుండి వచ్చిన బార్బెరిని కార్డినల్‌గా తరువాత పోప్‌గా ఎన్నికయ్యాడు. 55 సంవత్సరాల ప్రాయంలో పోప్‌గా అతడు 8వ అర్బన్ అని నామకరణం చేసుకున్నాడు.

**గెలీలియో తన పరిశోధనా రచన :** డైలాగ్‌ని (Dialogue) కేథలిక్ మత సెన్సార్ వారికి

ముందే అందించాడు. అది పరిశీలించిన వారు అభ్యంతరపెట్టలేదు. పోప్, గెలీలియో తరచు కలసి చాలాసేపు మాట్లాడుకునేవారు. ఇరువురూ ఇటలీ ఫ్లారెన్స్‌లో పెరిగారు. గెలీలియో వైద్యం చదివిన రోజుల్లో అర్బన్ లా చదివాడు. సూర్యుడు కేంద్రం అని రాసినప్పుడు గెలీలియోకు కొందరు జాగ్రత్త అని హెచ్చరించారు. గెలీలియో చాలా సంవత్సరాలు యూనివర్శిటీలో సైంటిస్టుగా బోధించి గౌరవం పొందాడు. కేథలిక్ మతస్తుడుగా వున్నాడు. 1631లో లెటర్స్ ఆన్ సోలార్ స్పాట్స్ ప్రచురించాడు. అప్పటికే టెలిస్కోప్ పరిశీలనలు చేశాడు. లోగడ గ్రీక్, లాటిన్‌లో సూర్యుడికి ప్రాధాన్యత యిస్తూ రచనలు వచ్చినా అవి జనంలోకి ప్రాకలేదు. గెలీలియో తన డైలాగ్ ఇటాలియన్ భాషలో రాశాడు. అది విపరీత జనాకర్షణ పొందింది.

## గ్రంథ నిషేధం - జైలు శిక్షా!

గెలీలియో సిద్ధాంతం కేవలం ప్రతిపాదనే అని పైకి చెప్పినా సమకాలీన సైంటిస్టులు, ప్రజలు ఆయన వైపు మొగ్గారు. కేథలిక్ మతం వూగిపోయినది.

పోప్ అర్బన్ దృష్టికి "డైలాగ్" రాగా ఆయన మండిపడి గెలీలియోను విచారణకు పెట్టాడు. 10 మంది కార్డినల్స్ విచారణ సంఘంగా ఏర్పడ్డారు. ఏడుగురు శిక్షకు అనుకూలంగా వుండగా ముగ్గురు సంతకం చేయలేదు. ఏకగ్రీవాభిప్రాయంగాకున్నా అధిక సంఖ్యాకుల నిర్ణయం ప్రకారం గెలీలియోకు మతశిక్ష వేసి నిర్బంధంలో వుంచారు. శిక్షలో భాగంగా ప్రార్థనలు చేయమన్నారు. 1663 జూన్ 22న శిక్ష విధించే నాటికి గెలీలియో 69వ సంవత్సరంలో అంధత్వంలో బాధపడుతున్నాడు. అతడి పుస్తకం డైలాగ్స్‌ని కేథలిక్ నిషేధ జాబితాలో చేర్చారు 1632లో! దీనిని "ఇండెక్స్" అంటారు. హిట్లర్ మెయిన్ కాంప్ వంటి పుస్తకాలు నిషేధించని పోప్, శాస్త్రజ్ఞుల సత్యాన్వేషణ ఫలితాల గ్రంథాలను నిషేధించారు.

1822లో గెలీలియో డైలాగ్‌ను నిషేధ జాబితా నుండి తొలగించారు. 1992లో పోప్ క్షమాభిక్ష కోరుతూ గెలీలియో పట్ల తప్పు చేశామన్నాడు. గెలీలియో పుస్తకం నిషేధించినా అది ఇతర భాషలలోకి అనువదించడం ప్రపంచ దృష్టికి రావడం, గెలీలియో సరైన ఆధారాలతో వాస్తవాలు చెప్పాడని గ్రహించడం అందరి కళ్ళు తెరిపించింది. గెలీలియో నివాసాన్ని ఫ్లారెన్స్ యూనివర్శిటీ వారు మళ్ళీ పునరుద్ధరించారు 1999 నాటికి! గెలీలియో గెలిచాడు. క్రైస్తవమతం ఓడిపోయింది. జైలులో నిర్బంధించిన గెలీలియోకు అతని కుమారుడు, ఇద్దరు శిష్యులు వచ్చి సహాయపడుతుండేవారు. 1638లో ప్రచురితమైన గెలీలియో పుస్తకం (ఫోర్స్, మోషన్ గురించి) న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాలకు ఉపకరించింది.

పీసాటవర్‌పై నిలబడి ఒక బరువైన వస్తువు మరొక ఏదైన వస్తువు ఒకేసారి కింద పడేస్తే రెండూ ఒకేసారి భూమిని చేరాయి. గెలీలియో చేసిన యీ ప్రయోగం అంత వరకూ వున్న నమ్మకాన్ని కాదన్నది. అరిస్టోటిల్ బరువైన వస్తువులు తొందరగా కింద పడతాయన్నాడు.

క్రైస్తవులు అరిస్టోటిల్ దగ్గరే ఆగి, భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతాడని, బల్లపరుపుగా భూమి వుంటుందని, భూమి కదలదనీ నమ్మారు. అది తప్పనే సరికి తలక్రిందులై, అన్నవారిని చంపడం మొదలెట్టారు. అదీ వారి మతసహనం. క్రైస్తవుల క్రూరత్వానికి బలి అయిన గెలీలియో 1642లో నిర్బంధవాసంలో గ్రుడ్డివానిగా అస్తమించాడు. ఆ తరువాత ఎప్పుడో క్రైస్తవులు తప్పు చేశామని చెంపలేసుకుంటే ఏం ప్రయోజనం!

*- నాస్తికయుగం, జూలై 2000*

# హిందూ నెపోలియన్‌గా వివేకానంద

వివేకానందను తమ గురువుగా స్వీకరిస్తున్నట్లు యిటీవల ఆర్.ఎస్.ఎస్. నాయకులు ప్రకటించారు. అది సరైన నిర్ణయం. వివేకానంద స్థానాన్ని సక్రమంగా గుర్తించారనడానికి యిదొక నిదర్శనం.

హేతువాదులు, మానవవాదులు యిదే విషయాన్ని అనేక సంవత్సరాలుగా చాటి చెబుతున్నారు. అయినా జనం అంతగా పట్టించుకోలేదు. వివేకానంద ఆర్.యస్.యస్. తత్వానికి, ధోరణికి ఆద్యుడు. కనుక వారాయన్ను గురువుగా భావించడం సముచితం. అయితే కమ్యూనిస్టులు సైతం యిటీవల వివేకానంద సూక్తులు పుస్తకాలుగా ప్రచురించారు. ఆయన ఫోటోలు పెట్టి సభలు జరిపారు. వివేకానంద ఆ విధంగా అటు ఆర్.యస్.యస్. వారికీ, యిటు కమ్యూనిస్టులకు గౌరవ ప్రదముడుగావడం, ఆయన వ్యక్తిత్వ విశేషమా? పరిశీలించాలి. హేతువాదులు, మానవవాదులు కోరుతున్న దేమంటే, వివేకానందను చదివి, అర్థం చేసుకొని, తరువాత అంచనా వేయమని! అలా జరగడం లేదు. ఏవో కొన్ని సూక్తులు, యెక్కడో ఒక ఉపన్యాస భాగాన్ని ఉదహరించి, పొగిడేస్తున్నారు వీరారాధన చేస్తున్నారు. ఆవేశపూరిత వాతావరణం సృష్టిస్తున్నారు. వివేకానందను నిశితంగా పరిశీలించడం, విమర్శించడం మహా తప్పిదంగా, భారత వ్యతిరేకతగా చూస్తున్నారు. అది ఫాసిస్టు లక్షణం.

మానవవాదులపై ఇదేమీ కొత్తగా వచ్చిన అపనింద కాదు. 1920లో యం.యన్. రాయ్ వివేకానందను విమర్శించారు. ఆ తరువాత హ్యూమనిస్టులు వివేకానందపై పరిశోధన, పరిశీలన చేసి, విమర్శించారు. అగేహానంద భారతి ప్రత్యక్షంగా రామకృష్ణ మఠంలో చేరి, లోన ఏం జరుగుతుందో గుట్టు రట్టు చేశాడు.

ఆంధ్రలో హ్యూమనిస్టు ఉద్యమ నాయకుడు ఆవుల గోపాలకృష్ణమూర్తిని అమెరికా ప్రభుత్వం 1964లో ఆహ్వానించినప్పుడు తెనాలిలో వీడ్కోలు సభ జరిగింది. గుంటూరు రాజేశ్వరరావు అనే ఆయన వ్యంగ్యంగా ఆవుల గోపాలకృష్ణమూర్తిపై విమర్శల వర్షం కురిపించారు. వివేకానంద ప్రస్తావన తెచ్చి, ఆయన గొప్పతనం చాటమనీ, ఆయన అడుగుజాడల్లో నడవమని

కొందరు సలహా యిచ్చారు. తాను అమెరికా వెళ్ళేది వివేకానంద ప్రచారం కోసం కాదనీ, ఎవరైనా అడిగితే నిక్కచ్చిగా తన అభిప్రాయం చెబుతాననీ, వివేకానంద విషయంలో హ్యూమనిస్టులకు స్పష్టమైన అవగాహన వున్నదనీ అన్నారు. ఆ వార్త ఆంధ్రప్రభలో ప్రచురించారు. నీలంరాజు వెంకటశేషయ్య ఆనాడు ఆంధ్రప్రభకు ఎడిటర్‌గా వుంటూ, గోపాలకృష్ణ మూర్తిపై అనేక లేఖల విమర్శలు చేయించారు. ఆయన్ను అమెరికా నుండి వెనక్కు పిలిపించాలన్నారు. ముదిగొండ శివప్రసాద్ వంటి తిరోగమన ఛాందసులు అదే అవకాశంగా తీసుకొని తిట్టారు.

ఆ తరువాత పశ్చిమ బెంగాల్‌లో నిరంజనధర్ హ్యూమనిస్టుగా పరిశోధన చేసి, వివేకానందపై విపులంగా రాస్తే, పెద్ద స్పందన వచ్చింది. కాని ఆయన రాసిందాన్లో ఫలానా దోషం వుందని యెవరూ చూపలేకపోయారు.

అగేహానందభారతి చేసిన విమర్శల దృష్ట్యా ఆయన పుస్తకాన్ని (ఆకర్ రోబ్) రామకృష్ణ మిషన్‌వారు భారతదేశంలో నిషేధించేటట్లు భారత ప్రభుత్వంపై వత్తిడి తీసుకరాగలిగారు. అది వారి మత సహనానికి గీటురాయి! ముస్లింలు సాల్మన్ రష్దీ గ్రంథాన్ని నిషేధించినట్లే యిదీ జరిగింది. క్రైస్తవులు యెన్నో గ్రంథాలు నిషేధించారు. మతాలన్నిటికీ అంతటి సహనంవుంది మరి!

ఉదయం దినపత్రికలో ఎ.బి.కె. ప్రసాద్ ఎడిటర్‌గా నా వ్యాసాన్ని ప్రచురించారు. అందులో ఒక ఎడిటోరియల్ నోట్ రాస్తూ "మహాత్ములను కేవలం భజిస్తూ వుండడం మన ధ్యేయం కారాదు, మానవుడే ఒక తప్పొప్పుల పట్టిక, ఇందుకెవరూ మినహాయింపు కాకపోవచ్చు. నిజానిజాల గురించిన అన్వేషణా దృష్టి ఆరోగ్యమనే భావన ఒక్కటే ఇక్కడ ప్రధానమని గమనించ ప్రార్థన" అన్నారు. 1985లో యీ వ్యాసం జనవరి 27 ప్రచురితమైంది. మరునాడే లాఠీలు పట్టుకొని వీరహిందూ యువకులు ఉదయం ఆఫీసుకు వచ్చారు. సమాధానం రాయండి, వేస్తాం అని సంపాదకులు అన్నా, వారు పట్టించుకోలేదు. అలాంటి వ్యాసం ప్రచురించరాదన్నారు. ఆ మరునాడు వివేకానందను ఆకాశానికెత్తుతూ ఎడిటోరియల్ రాయాల్సిన దుస్థితి కల్పించి జర్మనీలో హిట్లర్ రాజ్య లక్షణాలను గుర్తుకు తెచ్చారు. అదీ వివేకానంద భక్తుల విచక్షణా జ్ఞానం.

వివేకానంద గురించి అబద్ధాలు రాయడం లేదు. దుష్ప్రచారం చేయడం లేదు. ఉన్నది ఉన్నట్లు తెలియపరుస్తూ, హేతువాద దృష్టితో మా పరిశీలనాభిప్రాయాల్ని, భవిష్యత్తు దృష్ట్యా చెబుతున్నాం.

## వివేకానందగా మారిన నరేంద్ర

కలకత్తాలో నరేంద్రనాథ్‌దత్తా బ్రహ్మ సమాజంలో వుండేవాడు. చదువుకునే రోజులలో ఆయనపై కొంతమేరకు క్రైస్తవ మిషనరీల ప్రభావం పడింది. రామకృష్ణ అప్పటికే దక్షిణేశ్వర్‌లో పరమహంసగా ప్రచారం పొందినా, నరేన్‌ను ఆకర్షించలేదు. 1863లో పుట్టిన నరేన్ ఒక

మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. విద్యార్థిగా సహజ ధోరణిలో ప్రశ్నిస్తుండేవారు. తొలుత రామకృష్ణను చూచినప్పుడు నరేన్ ఆకర్షితుడు కాలేదు. కాని రామకృష్ణ మాత్రం నరేన్ పట్ల విపరీత యిష్టత పెంచుకొని, ఎలాగైనా అతడ్ని తన శిష్యునిగా చేసుకోవాలని పదే పదే కబురు చేస్తుండేవాడు. ఈ విషయం పాఠకులు గ్రహించాలి.

నరేన్ కాలేజీలో చదువుకునే రోజుల్లో పెళ్ళి సంబంధాలు చూచారు. పెళ్ళి కుదరడానికి ఏవో చిన్న పేచీలు అడ్డం రాగా, ఆలశ్యం జరిగింది. పెళ్ళి ప్రయత్నం తెలిసిన రామకృష్ణ, నరేన్‌కు నచ్చజెప్పి, పెళ్ళి ప్రయత్నం విరమింపజేయడానికి చాలా కృషి చేశారు. కాని ఫలితం రాలేదు. నరేన్ పెళ్ళికి విముఖత చూపలేదు. ఆ దశలో నరేన్ తండ్రి చనిపోయాడు. ఇంటి యజమాని హఠాత్తుగా లేకుండా పోవడం, నరేన్ పెద్ద కుమారుడుగా బరువు బాధ్యతలు మోయాల్సి వచ్చింది. ఏదైనా ఉద్యోగం చేద్దామని విఫల ప్రయత్నం చేసిన నరేన్, తప్పనిసరిగా దక్షిణేశ్వర్ వెళ్ళాడు. అది పెద్ద మలుపు. ఆకలితో, అప్పులతో, సంసార భారంతో ఏం చేయాలో దిక్కుతోచక, ఉద్యోగం రాక, అలమటిస్తూ రామకృష్ణ దగ్గరకు వెళ్ళిన నరేన్ స్థితి ఊహించుకోవచ్చు. ఆశ్రమంలో చేరితే సంసార బాధ్యతలు ఉండవు, అడిగేవారు లేరు. ఆకలి బాధ వుండదు. నరేన్ వెళ్ళిన స్థితి అలాంటిది రామకృష్ణకు ఎలాగూ నరేన్ కావాలి. అలాంటి శిష్యుని కోసం రామకృష్ణ కొన్నాళ్ళుగా ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నాంగదా. యెవరి అవసరం వారిది. పరస్పర అనుకూల స్థితి ఏర్పడింది. సన్యాసి కావడానికి నరేన్ సిద్ధపడ్డాడు. సన్యాసిగా చేసుకోవడమే గాక ప్రియశిష్యుడిగా స్వీకరించడానికి రామకృష్ణ ఆసక్తి కనబరచాడు. సన్యాసిగా మారిన నరేన్, ఇల్లు వదలి ఆశ్రమానికి మారాడు. సన్యాసి తన ఇంటిని, ఆస్తిపాస్తుల్ని, పూర్వాశ్రమాన్ని పూర్తిగా వదలేయాలి. పేరు మార్చుకోవాలి నరేన్ పేరు వివేకానంద అని మారలేదు. "వివిశానంద" అని మారింది. ఆ తరువాత "సచిదానంద" అని 1892 వరకూ వుండేది. ఇది కూడా పాఠకులు గుర్తుపెట్టుకోవాలి. సన్యాసి మనస్తత్వం గురించి చాలా విపులంగా, నిశితంగా, అన్ని కోణాల నుంచి యం.యన్. రాయ్ వివరించి, 1936లోనే ప్రచురించారు. పాఠకులు అది చదవాలి. నరేన్ సన్యాసి అయి, వివేకానందగా మారిన తరువాత, తిండికీ, బట్టకూ, నివాసానికి గతుల్ని ఒక్కసారి ఆయన మరచిపోలేకపోయాడు. అందుకు తోడు, అతని తల్లి అప్పుడప్పుడు ఆశ్రమానికి వచ్చి కష్టనిష్ఠూరాలు చెప్పుకునేది. వివేకానంద కూడా తరచు ఇంటికివెళ్ళి కుటుంబ కలహాలు పట్టించుకుంటుండేవాడు.

నరేన్ సన్యాసి అయిన తరువాత, 5 సంవత్సరాలకే, 1886లో రామకృష్ణ పరమహంస కేన్సర్‌తో చనిపోయారు. రామకృష్ణకు ప్రియశిష్యుడిగా నరేన్ బాగా సన్నిహితుడయ్యాడు.

రామకృష్ణ పరమహంస అద్వైత వేదాంతాన్ని చెప్పేవాడని కాసేపు గుర్తుంచుకోవాలి. ఆయన శిష్యుడుగా చేరిన నరేన్ వేదాంతాన్ని, మాయావాదాన్ని తృణీకరించలేదు, పైగా ప్రచారం చేయడానికి పూనుకున్నాడు. రామకృష్ణ చివరి దశలో మాత్రమే నరేన్ సన్నిహితంగా మెలగగలిగాడు. అయినప్పుడు యోగాభ్యాసం యెవరి వద్ద నేర్చుకున్నాడని పరిశీలిస్తే 'పౌహార్జీ' వద్ద అనేది

గమనార్హం. ఉత్తరోత్తరా నరేన్ రాజయోగంగా ప్రచారం చేసిన యోగాభ్యాసం అదేనన్నమాట. రామకృష్ణను అవతారంగా వివేకానంద గుర్తించలేదు. ఆశ్రమవాసుల నిమిత్తం ఆయన ఒక కరపత్రం వ్రాసి, రామకృష్ణను ఎవరు ఎలాగైనా భావించవచ్చని స్పష్టంగా రాశాడు. రామకృష్ణ మరణానంతరం ఆశ్రమాన్ని పోషించాల్సిన శిష్యులు, భిక్షాటన చేద్దామని తలపెట్టారు. వివేకానంద ఆ విధంగా దేశమంతా తిరగవలసి వచ్చింది. ఎవరు డబ్బిచ్చినా ఆయన స్వీకరించేవారు కాదని, పచ్చి అబద్ధాలు యింకా రాస్తూనే వున్నారు. (చూడు : స్వామి లోకేశ్వరానంద, స్టేట్స్‌మన్ సెప్టెంబరు 16, 1993) అసలు బయలుదేరిందే డబ్బు కోసం.

వివేకానందపై బ్రహ్మసమాజ్, కొంత మేరకు క్రైస్తవ మిషనరీల సేవల ప్రభావం చూపెట్టాయని ఉదహరించాం. తన గురువు రామకృష్ణ చెప్పిన వేదాంతానికీ, సమాజంలో పేదరికానికి పొత్తు కుదరకపోవడం వివేకానంద గమనించక పోలేదు. హిందూ ఆశ్రమ ధర్మానుసారం ఎవరికి వారు వ్యక్తిగతంగా మోక్షసాధన కోసం కృషి చేయాల్సిందే. వ్యక్తి బాధలు, పేదరికం అలాంటివన్నీ కర్మ ప్రకారం వచ్చినవే. కనుక ఒకరు మరొకరికి సహాయపడేదేమీ లేదు. అందుకే సేవాధర్మం హిందూ సంప్రదాయం కాదు. ఇందుకు భిన్నంగా వివేకానంద సేవాధర్మాన్ని ప్రవేశపెట్టాడు. ఒక వైపు రామకృష్ణ ఆశ్రమం వారే వివేకానంద ప్రయత్నాన్ని వ్యతిరేకించారు. అయినా వినకుండా సేవాధర్మాన్ని ఆయన ప్రచారం చేశారు. అది వివేకానంద విశిష్టత. గోసంరక్షకులు వచ్చి చందాలు అడిగితే, ముందు మలమలమాడే పేదల సంగతి చూడండి అని చెప్పడం వివేకానంద గొప్పతనం. ఈనాడు వివేకానందుని శ్లాఘించే వారిలో చాలా మంది గోసంరక్షకులే వుండడం కూడా గమనార్హం. వివేకానందను వాడుకోవాలనుకునే వారే యీ మత ఛాందసులనే సంగతి గుర్తుచేయడానికే యీ ఉదాహరణ తెచ్చాను. మాటలెన్ని చెప్పినా, వాదనలు ఎలా మలచినా, చివరకు అద్వైత వేదాంతాన్నే వివేకానంద ధ్యేయం అని కూడా మరో ప్రక్క మరచిపోరాదు! సన్యాసిగా పర్యటించిన వివేకానంద దేశమంతటా స్వదేశీ సంస్థానాలలోనూ, జమీందార్ల వద్దకూ వెళ్ళాడు. వాళ్ళ అతిథిగా వున్నాడు. డబ్బు వసూళ్లకు వెళ్ళాడు గనుక వారి ఆతిథ్యం స్వీకరించాడు. రామకృష్ణ ఆశ్రమం గుక్కతిప్పుకొని నిలవడానికి వివేకానంద ఆదుకోవడమే ఆదిలో తోడ్పడింది. పనిలో పనిగా తన కుటుంబానికి కూడా ఆర్థిక సహాయం చేసుకోవడానికి వివేకానంద భిక్షాటన తోడ్పడింది. కష్టాల్లో వున్న తన కుటుంబానికి నెలకు వంద రూపాయల చొప్పున యిప్పించడంలో వివేకానందుడు కృతకృత్యుడయ్యాడు. ఖేత్రి మహరాజా అందుకు ఒప్పుకొని, ప్రతి నెలా వివేకానంద తల్లికి, సోదరులకు వంద రూపాయలు పంపేవాడు. 1890 ప్రాంతంలో 100 రూపాయలంటే ఇప్పుడు లక్షరూపాయల విలువ! తన తల్లికి సొంత యిల్లు కట్టించి పెట్టాలని సన్యాసిగా వివేకానంద ప్రయత్నించి విఫలుడయ్యాడు. బేలూరు మఠం నుండి 3 వేల రూపాయలు రుణంగా తీసుకున్నాడు. మహారాజాలను అడిగినా ఎందుకోగాని డబ్బు రాలేదు. చివరకు గృహనిర్మాణ తలంపు విరమించాడు. తన పేరిట మఠం స్థలాన్ని కొనుగోలు చేస్తే అది కోర్టు కేసుగా మారింది. తన పేరిట స్థలం కొనమని అమెరికా నుండి కూడా

రామకృష్ణానందకు ఉత్తరం రాశాడు వివేకానంద! కుటుంబాన్ని మరచిపోని సన్యాసిగా వివేకానంద చివరి వరకూ ఆస్తిపాస్తులకోసం ప్రయత్నించడం ఆయన కుటుంబ ప్రేమను సూచిస్తుంది. రాజయోగంపై రాసిన పుస్తకానికి డబ్బురాగా, అది బాంక్‌లో వేసి, తన తదనంతరం తన తల్లికి యివ్వమన్నాడు. ఇదంతా వివరంగా ఎందుకు వ్రాయవలసి వచ్చిందంటే, సన్యాసిగా అవసరార్థం మారిన వివేకానంద, సన్యాసి ధర్మాన్ని పాటించలేకపోయాడని చూపడానికే. అమెరికాలో సైతం తన అభిమాని సెవియర్ ఇచ్చిన సొమ్మును కుటుంబానికే పంపిన వివేకానంద, ఇంటికి అలాగే పంపించమని కూడా ఆమెను కోరాడు.

రామకృష్ణ చనిపోయిన తరువాత, మఠాన్ని పోషించడానికి బ్రతికించడానికి జమిందార్లు పూనుకున్నారు. ఇందుకు నాంది పలికినవాడు మధుర మోహన్ అనే జమిందారు. ఆయన రామకృష్ణను బాగా వాడుకున్న జమిందారు. యాత్రల పేరిట రామకృష్ణ వెంట వెళ్ళి, కాశీలో జమిందార్లతో తన అవసరాల గురించి పట్టించుకున్న మధురమోహన్ చాలా తెలివైనవాడు. జమిందారుగా మధురమోహన్ నరరూప ఫాసిస్టు. అతిక్రూరుడు. ప్రజల్ని పీడించి పన్నులు వసూలు చేసి విలాసంగా బ్రతికిన జమిందారు. రైతుల్లో తీవ్ర అసంతృప్తి, ఆందోళన వున్నచోటుకు రామకృష్ణ పరమహంసను తీసుకెళ్ళి, భక్తిని ప్రదర్శించేవాడు. రైతులు ఏమీ చేయలేకపోయేవారు. ఆకలితో, అప్పులతో వున్న రైతులకు భక్తిని చూపడం మన దేశ సాంప్రదాయం. అది మధురమోహన్ బాగా గ్రహించాడు. రామకృష్ణ అందుకు కొరముట్టుగా ఉపకరించాడు. అలాగే మరికొందరు జమిందార్లు కూడా రామకృష్ణ అనంతరం ఆశ్రమం పట్ల ఆసక్తి కనబరచారు. డబ్బివ్వడానికి సంసిద్ధులయ్యారు. వివేకానంద వారి వద్దకు వెళ్ళాడు. వారు డబ్బిచ్చారు. ఆశ్రమం బతికింది. వివేకానంద తన గురువువలె జమిందార్ల దారుణ పాలనకు తోడ్పడ్డాడు. ఇదంతా వేదాంత భక్తి పేరిట, ప్రాక్టికల్ వేదాంతం అనే నినాదంతో సాగిపోయింది. ఆ సందర్భంగా వివేకానంద జాతీయ వాదోపన్యాసాలు కూడా చేశాడు. అవి జాతీయవాదుల్ని ఆకర్షించాయి. కాంగ్రెసులోని అతివాదులు కూడా వివేకానంద ప్రవచనాలకు ప్రేరితులయ్యారు. ఇది వివేకానంద వ్యక్తిత్వానికి మరో వైపు కనబడిన తీరు.

రామకృష్ణ ఆశ్రమాన్ని పోషిస్తున్న బెంగాల్ జమిందార్లు కష్టాల్లో పడ్డారు. ఆశ్రమాన్ని ఆదుకోలేని దుస్థితిలో వున్నారు కనుక బెంగాల్ వెలుపల జమిందార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితిలో వివేకానంద పర్యటనకు బయలుదేరాడు.

వివేకానంద 1891లో ప్రారంభించి ఎక్కడ పర్యటించారో గమనించుదాం. జైపూర్, ఖేత్రి, అహమ్మదాబాద్, అళ్వార్, కథియవాడ్, జునాగఢ్, పోర్‌బందర్, ద్వారకా, పైలితానా, బరోడా, ఖండ్వా, పూనా, బొంబాయి, బెల్గాం, బెంగుళూరు, మలబార్‌తీరం, కొచ్చిన్, తిరువాన్కూరు, త్రివేండ్రం, మధురై, రాంనాడ్, రామేశ్వరం, కన్యాకుమారి. వివేకానంద పర్యటనలో రాజులు, దివానుల వద్ద అతిథిగా రాచమర్యాదలతో వుంటూ, మరో చోటకు వెళ్ళేముందు పరిచయపత్రాన్ని

యువరాజు, దివాన్‌ల దగ్గర తీసుకెళ్ళేవారు. రామకృష్ణ మతానికి తగిన నిధుల్ని వివేకానంద సమకూర్చగలిగారు. ఈ పర్యటనలో వివేకానందకు అనేకమంది శిష్యులు, భక్తులు, అభిమానులు సమకూడారు. జాతీయోద్యమంలో నాయకుడు తిలక్ కూడా ఆయన్ను కలసిన వారిలో వున్నారు.

వివేకానంద స్వయంగా భక్తిగీతాలాపన చేసేవాడు. సంగీతం నేర్చిన వ్యక్తిగా ఆయన పర్యటనలో అది చాలా ఆకర్షించింది. ఉద్వేగ పూరితంగా పేదరికం గురించీ, స్త్రీల పట్ల విచక్షణ గురించి వివేకానంద మాట్లాడేవాడు. గీత చదివే బదులు ఫుట్‌బాల్ ఆడడం మంచిదని ఉపన్యాసాల ధోరణి వుండేది. ఇదంతా జనాన్ని ఆకర్షించగా జాతీయ ఉద్యమకారుల్ని ఉత్తేజపరచింది. దేశవ్యాప్తంగా మధ్యతరగతిలో వివేకానందకు ప్రచారం లభించగా ఉన్నత వర్గాలవారు అయన్ను పోషించారు. ఆ విధంగా దేశ పర్యటన ముగించుకున్న సందర్భంలో, ప్రపంచ మత సమావేశం షికాగాలో జరుగబోతున్నట్లు ఇండియాకు వార్త వచ్చింది. అది మరొక పెద్ద మలుపు. స్వదేశీ సంస్థానాదిపతులు తమ ఘోరకృత్యాలు, ప్రజాపీడన కప్పిపుచ్చుకోడానికి వివేకానందను అడ్డం పెట్టుకున్నారు. బ్రిటిష్ పాలనకంటె దేశీయ ప్రభువుల పాలన మెచ్చుకుంటూ వివేకానంద వారికి వత్తాసు పలికారు. ఉభయులూ చెట్టాపట్టాలు వేసుకొని, సామాన్య ప్రజల్ని పట్టించుకోలేదు. వివేకానంద పేదవారిపట్ల సానుభూతి చెబుతూ చేసిన ప్రసంగాలు, రాసిన రాతలు ఒక ఎత్తుకాగా, అందుకు విరుద్ధంగా పేదల్ని రైతుల్ని దారుణంగా అణచివేసిన స్వదేశీ సంస్థానాధిపతుల్ని పల్లెత్తు మాట అనకపోగా, వారిని ఆకాశానికెత్తారు. కనీసం సంస్థానాలలో సామాన్యులు ఎలా వున్నారని కూడా విచారించలేదు. ఫ్యూడల్ పాలనకు మతపరమైన మద్దత్తు లభించడంతో, జమిందార్లు వివేకానందకు డబ్బు గుప్పించారు. అంతటితో ఆగక ఆయన్ను ప్రపంచ మత మహాసభకు పంపడానికి సిద్ధపడ్డారు. వివేకానంద కూడా అదొక సదవకాశంగా భావించారు.

అమెరికా పోవడానికి ముందు ఖేత్రి మహారాజా బహిరంగ దర్బారు నిర్వహించి, "వివేకానంద" అని కొత్త సన్యాసి పేరు పెట్టారు. 1893 వేసవి నుండే వివేకానంద పేరు ప్రచారంలోకి వచ్చింది. అదీ వివేకానంద పేరుకు మూలం. వివేకానంద వెంట జగ్‌మోహన్‌లాల్ (ఖేత్రి మహారాజా దివాన్) రాగా బొంబాయి వెళ్ళి అమెరికా ప్రయాణానికి సన్నద్ధమయ్యారు. స్వామీజీకి కావలసినవన్నీ సమకూర్చిపెట్టి, స్టీమర్‌లో మొదటి తరగతి టిక్కెట్ కొనిచ్చారు. ప్రయాణపు ఖర్చుల నిమిత్తం కొంత సొమ్ము యిచ్చారు. అంతేకాదు వివేనందకు ఒక సిల్కు తలపాగా తయారుచేసి తొలుత యిచ్చింది కూడా ఖేత్రి మహారాజానే. అదే వివేకానందకు చిహ్నంగా మారింది. అప్పటికి రామకృష్ణ భార్య శారదామణి బ్రతికేవుంది. ఆమె ఆశీర్వచనం పొంది, 1893 మే 31న బొంబాయిలో పెనిన్సులా అనే స్టీమర్‌లో ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణంచేసి జులై 25న కెనడాలోని వాంకోవర్ చేరుకున్నారు. బొంబాయిలోనే స్వామిజీకి జమిందార్లిచ్చిన ధనాన్ని సర్క్యులర్ నోట్లుగా మార్చి ఇచ్చారు. అమెరికా చేరుకునేనాటికి వివేకానంద ఆ నోట్లు

పోగొట్టుకోగా, ఆ విషయం తెలిసి, తామస్ కుక్ అండ్ సన్స్ ద్వారా మహారాజా మళ్ళీ డబ్బు సమకూర్చారు. ఈలోగా వాంకోవర్ నుండి రైల్లో షికాగో జులై 30న చేరారు. సెప్టెంబరులో గాని మత మహాసభ జరగదు. అందువలన షికాగో నుండి బోస్టన్ వెడుతుండగా మిస్‌కేట్ శాన్ బార్న్ అనే వృద్ధురాలు తటస్తపడి, ఆదరించింది. వివేకానందను తన అతిథిగా అట్టిపెట్టి, గుర్రపు బగ్గీపై తిప్పి జనానికి ప్రదర్శించింది. హార్వర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జాన్ హెన్రీరైట్‌కు పరిచయం చేసింది. అతడు వివేకానందకు మత మహాసభ ప్రతినిధిగా వెళ్ళమని మళ్ళీ షికాగో పంపాడు. ఆయన యిచ్చిన అడ్రసు పారేసుకున్న వివేకానందకు జార్జీ హేల్ అనే స్త్రీ తటస్తపడి, ఆదరించి, మత మహాసభ ప్రతినిధిగా వెళ్ళే ఏర్పాట్లు చేసింది.

వివేకానందపై అమెరికాలో అనేక దుష్టప్రచారాలు ప్రచారంలోకి రాగా ఇండియా నుండి ఖేత్రి, జునాగడ్ మహారాజాలు ఆయనకు ఉత్తరాలిచ్చి పరువు నిలబెట్టారు.

షికాగోలో ప్రపంచ మత మహాసభలు 1893 సెప్టెంబరు 11న ప్రారంభమై సెప్టెంబరు 27న ముగిసాయి. వివేకానంద తొలిరోజున సంక్షిప్త ప్రసంగం చేశారు. మళ్ళీ సెప్టెంబరు 15న మాట్లాడారు. సెప్టెంబరు 19న వివేకానంద హిందూమతంపై వ్యాసం చదివారు. సమావేశం చివరినాడుకూడా వివేకానంద క్లుప్తంగా మాట్లాడారు. మొత్తం 10 మతాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. కొలంబస్ ఆర్ట్ పాలెస్‌లో జరిగిన యీ సమావేశాలలో 7 వేల మంది వరకూ హాజరయ్యారు. షికాగో సమావేశాలు వివేకానందకు పేరు తెచ్చిపెట్టాయి. భారత జమిందార్లు తాము చేసిన ఖర్చు వృథా కాలేదని సంతోషించారు.

షికాగో మత సమావేశం వలన వివేకానందకు ఇండియాలో విపరీత ప్రచారం లభించింది. వివేకానంద ఉపన్యాసాలు మత సమావేశంలో ఆకర్షణీయమైనాయి. ఆయన వాగ్ధోరణి కొందరికి బాగా నచ్చింది. షికాగో ఉపన్యాసాలు మతపరంగా అమెరికావారు గ్రహిస్తే, జాతీయ హైందవవాదంగా భారతీయులు స్వీకరించారు. షికాగోలో చేరినవారంతా మతపరమైన విశ్వాసులే. ఎవరి మతం వారికి గొప్ప. అలాగే చాటుకున్నారు. వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని చాటడమే గాక, పాశ్చాత్యం భౌతికవాదమయమనీ, భారతదేశం ఆధ్యాత్మికమనీ, కనుక ప్రపంచానికి హైందవాన్ని ఎగుమతి చేయాలనే ధోరణి కనబరచాడు. ఇదే భారతీయులలో మతవాదుల్ని ఆకట్టుకున్నది.

ముస్లింలు ఇస్లాంను, క్రైస్తవులు బైబిల్ ఆధారంగా క్రైస్తవాన్ని ప్రపంచ మతాలుగా చాటి, తమకు తిరుగులేదని ఎవరికి వారు చెప్పుకుంటూ, ఇతరుల పట్ల అసహనాన్ని ప్రదర్శిస్తుండగా వివేకానంద అడ్డుతగిలాడు. ఉగ్ర హైందవవాదిగా మాట్లాడాడు. ఇది వీర హిందువులకు నచ్చింది. వివేకానంద షికాగో విజయం పట్ల అసూయపడిన కొన్ని మతవర్గాలు ఆయనపై విషప్రచారాలు చేయకపోలేదు. అవి తట్టుకొని, ఎదురీది, అమెరికాలో పర్యటించి డబ్బు వసూలు

చేశాడు. అమెరికా పర్యటనలో వివేకానంద హిందూ ప్రవక్తగా ప్రవచనాలు పలికాడు. అద్వైత వేదాంతాన్ని ఆచరణలోకి తేవాలని కొత్త పదాలతో భాష్యాలు చెప్పాడు.

క్రైస్తవ మత ప్రచారం, మిషనరీల సేవలు కూడా హిందూమతం అవలంబించేటట్లు వివేకానంద కృషిచేశాడు. అమెరికాలో అనేకమంది డబ్బు గుప్పించేశారు. మేరీ బర్క్ వంటివారు శిష్యులయ్యారు.

మనిషిలోని దైవశక్తిని గుర్తించాలని వివేకానంద నినదించాడు. మనిషి ఆశక్తిపై ఆధారపడాలన్నాడు. జాతీయవాదులకు యిది కూడా చాలా ఆకర్షణీయంగా పరిణమించింది. సేవాభావాన్ని వివేకానంద భారతీయులకు బోధించాడు. ఇది క్రైస్తవం నుండి స్వీకరించి, వేదాంతానికి జోడించడం వివేకానంద గొప్పతనం. అమెరికాలో క్రైస్తవ మిషనరీలు, యూనిటేరియన్ శాఖతో బాగా పరిచయం చేసుకున్నాడు. షికాగో మతసభలో కొన్ని వ్యాసాలు కూడా అయనపై ప్రభావం చూపెట్టాయి. బోస్టన్‌లో క్రైస్తవ క్లబ్‌లో వివేకానంద ప్రసంగించారు. ఎపిస్కోపల్ చర్చ్ వారితో పరిచయాలు ఏర్పరచుకున్నాడు. బాప్టిస్టు చర్చివారితో సన్నిహితత్వం పెంపొందించుకున్నాడు. ఇదంతా ప్రాక్టికల్ వేదాంత భావానికి, రామకృష్ణ మిషన్ స్థాపనకు దారి తీసింది. భారతదేశంలో హిందూమతం బాగా బ్రతకడానికి వేదాంత సోషలిజం పేరిట జనాన్ని ఆకట్టుకోదలచాడు. ప్రతి మనిషీ దేవుడే గనుక, మనిషిని ప్రేమిస్తే దైవాన్ని ప్రేమించినట్లే అని చెప్పాడు. మనిషికి సేవచేస్తే దైవసేవ చేసినట్లే అన్నాడు. భారతదేశం ఆధ్యాత్మికమనీ, పాశ్చాత్యలోకం భౌతికమనీ, కనుక వారందరికీ భారతదేశమే ఆధ్యాత్మికత చెప్పగలదనీ అన్నాడు. ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా జయించాలనే వివేకానంద హిందూ నెపోలియన్ అయ్యాడు. పాశ్చాత్య పదార్థవాద వ్యామోహం కూడదన్నాడు. ఇది కూడా జాతీయవాదులకు మరింత ఉత్తేజాన్నిచ్చింది.

వివేకానంద భారత ఆధ్యాత్మికవాదాన్ని ఎం.యన్. రాయ్ ఉత్తరోత్తరా ఖండించారు. సోదాహరణగా, భారతదేశం కూడా పాశ్చాత్యలోకానికి ఏ మాత్రం తీసిపోని పదార్థ భౌతికవాదంతో వున్నదని చూపారు. డిరోజియా, రామ్మోహన్‌రాయ్‌లు ఆరంభించిన పునర్వికాసోద్యమానికీ వివేకానంద అడ్డుకట్ట వేశాడు. పాశ్చాత్య లోకం నుండి సైంటిఫిక్ స్పిరిట్ నేర్చుకోవాలనే ధోరణికి వివేకానంద ప్రతిభంధకమయ్యాడు. దేశాన్ని వెనక్కు నడిపించాడు. ఆయన ఆదర్శాలతో సాగిన జాతీయోద్యమం మానసికంగా, సామాజికంగా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయలేకపోయింది. కేవలం ఉద్రేకం మాత్రమే గాక, నమ్మకాన్ని జోడించి వివేకానంద వివేచనను చంపేశారు. ఎటు తిప్పినా చివరకు ప్రజలకు యోగాన్ని, వేదాంతాన్ని బోధించి, చింతన చంపేశారు? చిత్తవృత్తి నిరోధం యోగానికి మూలం. అదే చిట్కాగా వివేకానంద స్వీకరించి, ఆకర్షణీయ కరపత్రాలు వ్రాసి ప్రచారం చేశారు. రాజయోగం పేరిట ఆయన రాసిన చిట్కాలు బాగా అమ్ముడుపోయాయి. డబ్బు వచ్చింది. గురువు లేకుండా యోగం అభ్యసించరాదంటూనే, అదొక చిట్కామార్గంగా రాజయోగం అనే పేరిట ప్రచారం చేయడం విశేషం.

వివేకానంద యోగ ప్రచారాన్ని అగేహానంద భారతి విమర్శించారు. ఆత్మ పరమాత్మల సంలీనాన్ని సూచించే లయ యోగానికి వివేకానంద రాజయోగం అనే ఆకర్షణీయ పదం వాడాడన్నారు. గురువు లేకుండా యోగం అభ్యసిస్తే ప్రమాదకరమని హెచ్చరించిన వివేకానంద, అలాంటి ప్రమాదాన్నే చిట్కా కరపత్రాలలో ప్రచారం చేశాడన్నారు. వైద్యం చేసేవారు నాలుగు రకాల డాక్టర్లన్నట్లు, యోగాన్ని 4 రకాలుగా వర్గీకరించి వివేకానంద ప్రచారం చేయడాన్ని భారతి పెద్ద దోషంగా పేర్కొన్నారు. రాజ, కర్మ, జ్ఞాన, భక్తి యోగాల పేరిట వివేకానంద చేసిన ప్రచారం ఆధారంగా చాలామంది పాశ్చాత్యలోకం, అదే పరమసత్యం అనే భ్రమలో వున్నట్లు భారతి చూపారు. పతంజలి యోగాన్ని వక్రీకరించిన వివేకానందను, కొందరు స్వాములు బాగా వాడుకుంటున్నారన్నారు.

వివేకానంద పుస్తకం చదివి యోగాభ్యాసం చేసి పిచ్చెక్కిన వాళ్ళున్నారని భారతి చెప్పారు. హిందూమతం సహనంతో కూడిందనే వివేకానంద వాదం కూడా పూర్తిగా దోషపూరితమనీ, మూలసూత్రాలలో హిందూమతం యితర మతాలతో అంగీకరించదని, తీవ్రస్థాయిలో వాదిస్తుందనీ ఆయన చెప్పారు.

మత సమావేశాల అనంతరం అమెరికాలో వివిధ ప్రాంతాలు పర్యటించిన వివేకానంద విలాసవంతమైన స్టార్ హోటళ్ళలో వుంటూ డబ్బుకు కొదవలేని స్థితిలో, ప్రచారాన్ని చేసి, వివిధ పరిచయాలతో కొంతకాలం గడిపారు.

తిరిగి వస్తూ ఇంగ్లండ్‌లో ఆగిన వివేకానంద ఎడ్వర్డ్ స్టర్డీకి అతిథిగా వున్నారు. కాని వివేకానంద విలాసజీవితం చూచిన తరువాత అతిత్వరలోనే ఎడ్వర్డ్ తన సంబంధాన్ని తెంచుకున్నాడు. అమెరికాలో లియో లాండ్స్ బర్గ్ కూడా వివేకానందతో సంబంధాలు తెంచుకోడానికి విలాస జీవితమే కారణం.

అమెరికా నుండి ఇంగ్లండు వచ్చిన వివేకానంద మతపరమైన మార్గరెట్ నోబుల్ అనే యువతిని తన శిష్యురాలిగా లోకానికి పరిచయం చేశారు. ఆమె నివేదిత వివేకానంద చనిపోయిన తరువాత ఆమె స్కూలు పెట్టి, సొంతంగా సామాజిక సేవ చేసింది వివేకానంద ప్రభావం ఆమెపై తాత్కాలికమే అయింది.

ఇండియాకు విజయవంతంగా తిరిగి వచ్చిన వివేకానందకు జమిందార్లు అపూర్వ స్వాగతం పలికారు. వారి డబ్బుతో అమెరికా వెళ్ళిన విషయం వివేకానంద విస్మరించలేదు. దేశంలో అడుగుపెట్టగానే రామనాథపురం రాజా ఘనస్వాగతం ఏర్పాటుచేసి, తొలుత అడుగిడిన చోట వివేకానంద విగ్రహస్థాపన చేయించాడు. ఆచరణాత్మక వేదాంతాన్ని చూపడానికి వీలుగా పేదలకు రాజావారు అన్నదానం చేసి, ప్రాక్టికల్ వేదాంతానికి ప్రారంభోత్సవం చేశారు.

వివేకానంద అశ్వంథాన్ని స్వయంగా రాజా కూడా కాసేపు లాగి తన వేదాంత భక్తిని

ప్రదర్శించారు. అప్పుడు జరిగిన సభలో రామనాధపురం రాజాకు రాజర్షి బిరుదును వివేకానంద ప్రసాదించారు.

ప్రజల్ని పీడించి పన్నులు వసూలు చేయడంలో రామనాడ్ రాజా పెట్టింది పేరు. కరువు కాటకాలతో జనం విలపిస్తుంటే, విలాసజీవితం గడిపిన రామనాడ్ రాజా తెలివిగా తన అధ్యాత్మికతను, వివేకానందను అడ్డంపెట్టుకొని జనానికి చూపాడు. ఆధ్యాత్మికం అనగానే నోరు మూసుకొనే అమాయకుల్ని ఆకట్టుకోవడం రాజాలకు బాగా తెలుసు. ఆ తరువాత రాజాలందరూ మద్రాసులో వివేకానందకు ఘన స్వాగత సభ జరిపారు. గైక్వాడ్ మహారాజా స్వయంగా అధ్యక్షత వహించారు.

బెంగాల్ రాష్ట్రానికి వచ్చిన వివేకానందకు మళ్ళీ జమిందార్ల స్వాగతమే లభించింది. ఉత్తర పర రాజా (పియరి మోహన్ ముఖోపాధ్యాయ), సోవా బజార్ మహారాజా (బినయ్ కృష్ణ దేవ్ బహుదూర్) దర్భంగా మహరాజా, మహరాజా నరేంద్ర కృష్ణ బహదూర్, మహరాజా గోవిందలాల్ రాయ్‌బహదూర్‌లు ఆహ్వానసంఘంగా ఏర్పడి స్వాగతం పలికారు. గ్వాలియర్ మహారాజా వచ్చి చేరారు.

డార్జిలింగ్‌లో బర్ద్వాన్ మహారాజా తన అంతఃపురాన్ని వివేకానంద సేవలకు యిచ్చారు. కాశ్మీర్ మహారాజా వివేకానంద గృహనిర్మాణానికి ఒక స్థలం కేటాయించారు. కలకత్తాలో జమిందార్లు విందులిచ్చారు. స్వదేశీ సంస్థానాలలో జమిందార్లు చూపిన ఆదరణ వివేకానంద కృతజ్ఞతలతో స్వీకరించారు.

1897లో రామకృష్ణ మఠం ఏర్పరచారు. జమిందార్ల డబ్బు పుష్కలంగా వచ్చి పడింది. వివేకానంద విలాస జీవితం, జమిందార్లతో స్నేహం రామకృష్ణ ఆశ్రమ సన్యాసులకు నచ్చలేదు. నిరసన తెలిపారు. బేలూరు మఠంతో సంబంధాలు తెంచుకొని పేదల రామకృష్ణ సభ ఏర్పరుచుకున్నారు. గిరీంద్ర, హరధకాలు యిందుకు అధ్వర్యం వహించారు. సంపన్నుల మఠానికి వివేకానంద ఆధిపత్యం వహించారన్నమాట. జమిందార్లు యీ చీలిక చూసి కలవరపడ్డారు. రామకృష్ణ జయంతి కూడా ఎవరికి వారే జరుపుకున్నారు. ఇదంతా వివేకానంద మూలంగానే జరిగిందని వేరే చెప్పనక్కరలేదు. పేదల కోసం ఎన్నో మాటలు చెప్పిన వివేకానంద, ఎప్పుడూ జమిందార్ల పక్షం వహించడమే యిందుకు మూలం అని గ్రహించాలి.

మతాన్ని రాజకీయాల్లోకి తెచ్చిన వ్యక్తి వివేకానందుడే. జాతీయోద్యమకారులకు, బెంగాల్ విప్లవకారులకు ఆయన ఉత్తేజాన్నిచ్చాడు. బెంగాల్‌లో ప్రారంభమైన సెక్యులర్, పాజిటివిస్ట్, హేతువాద ఉద్యమాలు కూడా వివేకానంద ఉద్రేక నినాదాలతో ఆగిపోయాయి. ఇండియా ఆధ్యాత్మికంగా గొప్పది గనుక పాశ్చాత్యుల నుండి నేర్చుకోవల్సిందేమీ లేదనే ధోరణికి ఆద్యుడు వివేకానందుడే. సైన్స్ వ్యాపించకపోడానికి, వివేచనతో ఆలోచించకపోడానికి, వివేకానందుడు ఆజ్యం పోశాడు.

నిరంజన్‌ధర్ తన వేదాంత అండ్ బెంగాల్ రినైజన్స్‌లో వివేకానంద గురించి హేతు దృక్పథంతో పరిశోధన చేశారు. అగేహానంద భారతి స్వయంగా రామకృష్ణ మిషన్‌లో పనిచేసి, 8వ సంపుటాన్ని పరిష్కరించడంలో తోడ్పడిన వ్యక్తి. ఆయన తన రచనలలో వివేకానంద గురించి నిశిత పరిశీలన చేశారు. అవన్నీ ఈ రచనకు ఆధారాలు కూడా.

దేశం వెనక్కు నడుస్తున్నది. ఈ ప్రయాణం వివేకానంద వేదాంతంతో ఆరంభమై యిప్పుడు వేగం పుంజుకున్నది. యువత ఇది గ్రహించి తిరోగమనాన్ని ఆపి, శాస్త్రీయ పద్ధతి వైపు మళ్లితేనే పురోగమనం, పునర్వికాసం సాధ్యం. వివేకానందను చరిత్రలో భాగంగా పరిగణిస్తేనే యిది సాధ్యం. మధ్యతరగతివారు వివేకానందను చదవకుండానే, ఏవో కొన్ని సూక్తులు ముక్కున పెట్టుకొని ఆరాధిస్తున్నారు. వివేకానంద రచనలు చదివితే, విచక్షణకు వివేచనకు నిలబడవని రుజువు కాగలదు.

***- హేతువాది. డిశంబర్ 1993***

# మూర్ఛ రోగులకు మొక్కితే మోక్షం వస్తుందా?

## రామకృష్ణ పరమహంసగా మారిన గదాధర్

యువకులు ఉద్రేకంగా వుండడం సహజం. వయోధర్మం కూడా. కొన్ని ఆదర్శాలతో ఉత్తేజితులు కావడం, వాటిని సాధించడానికి హింసకు సైతం వెనుదీయకపోవడం యువకులలో చూస్తాం. వివిధ రాజకీయ పార్టీలు యువకులను వాడుకోవడం కూడా గమనిస్తున్నాం. కాని యువతరం భక్తిమార్గంలో పడినా, భజనలు మొదలెట్టినా, పూజా పునస్కారాలలో మునిగిపోయినా ఆశ్చర్యపడాలి. ఇటీవల కొందరు యువతీయువకులు రామకృష్ణ ఆశ్రమాలకు, శభరిమలైకు, ఇతర అధ్యాత్మిక కేంద్రాలకు ఆకర్షితులౌతున్నారు. అంటే యీ జాతిలో ఏదో పెద్ద లోపం వున్నదన్నమాట. ఈ లోపాలలో ఒకటి ఉపన్యాసాల వాగ్ధోరణిలో కొట్టుకుపోతూ, వాస్తవాలు తెలుసుకోకపోవడం. ఉదాహరణకు రామకృష్ణ పరమహంస, వివేకానంద గురించి ఎంతమందికి నిజాలు తెలుసు? అవి గ్రహించకుండా గుడ్డిగా పెద్దల్ని అనుకరించడం, ఆలోచనను చంపుకోవడం యువతరంలో రుగ్మతను సూచిస్తుంది. ఆ దృష్టితో రామకృష్ణ, వివేకానందలను గురించి కేవలము వాస్తవాలు దృష్టికి తెస్తాను.

## రామకృష్ణ పరమహంస

రామకృష్ణకు తల్లిదండ్రులు పెట్టిన పేరు గదాధర్. తండ్రి క్షుధీరాం మధ్యతరగతి పురోహితుడు. గదాధర్‌కు ఎనిమిదేళ్ళు వచ్చేసరికి తండ్రి చనిపోయాడు. పెద్దన్న రాంకుమార్ కూడా పౌరోహిత్యం చేసినా, కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. గదాధర్ గ్రామంలోని పాఠశాలకు వెడుతుండేవాడు. ఇది హుగ్లీ జిల్లాలో వున్నది. కామార్పుకర్ గ్రామం సన్యాసులకు

కూడలి. బర్ద్వాన్ - నీలాచలం మధ్య వున్న ఈ గ్రామం మీదుగా సాధువులు, సన్యాసులు తరచు పయనిస్తుండేవారు. వారు సమీప సత్రంలో విడిది చేస్తుండేవారు. ఆ విధంగా గదాధర్ సాధువులను చూస్తుండేవాడు. తన కుమారుడు సాధువుల్లో కలసిపోతాడేమోనని తల్లి చంద్రమణి భయపడుతుండేది.

గదాధర్ ఇంట్లో కొందరికి మూర్ఛల జబ్బు వుండేది. మేనత్త రాంషేకు, గదాధర్ సోదరి కాత్యాయనికి మూర్ఛలు వచ్చేవి. హిస్టీరియాతో కూడ ఈమె బాధపడుతుండేది. కారణాలేవైనా, గదాధర్‌కు కూడా యీ జబ్బులు సంక్రమించాయి. గదాధర్ బక్కప్రాణి. చదువు ఒంటపట్టలేదు. గదాధర్‌కు చిన్నతనంలో హఠాత్తుగా ఫిట్స్ రావడం, పడిపోవడం గమనించిన గ్రామస్తులు అతడికి వాయురోగం వచ్చిందన్నారు. కారుమబ్బుల మధ్య మెరుపులు చూచినప్పుడు తొలుత గదాధర్ మూర్ఛవచ్చి పడిపోయాడు. అనూర్ అనే గ్రామానికి స్త్రీల వెంట వెడుతుండగా రోడ్డుమీద రెండో పర్యాయం మూర్ఛ వచ్చింది. స్వగ్రామంలో శివుడుగా నటిస్తున్నప్పుడు మూడోసారి మూర్ఛ వచ్చింది. (మూర్ఛల వివరాలకు శారదానంద "లీలా ప్రసంగ" చూడండి. 5 సంపుటాలు)

చిన్నతనం నుంచీ గదాధర్‌కు కామప్రవృత్తి, చింతన ఎక్కువగా వుండేది. గ్రామ స్త్రీలు స్నానంచేసేచోటుకు తరుచు వెళ్ళగా, ఆడవాళ్ళు అభ్యంతరపెట్టారు. చెట్టుచాటున దాగి స్నానంచేసే స్త్రీలను చూచేవాడు. అది గమనించిన స్త్రీలు గదాధర్ తల్లికి చెప్పారు. ఆమె గదాధర్‌ని చితక్కొట్టింది. అయినా స్త్రీల సాంగత్యం అంటే గదాధర్‌కు మక్కువ తగ్గలేదు. పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. కబుర్లు చెప్పి, పాటలు పాడి స్త్రీలను ఆకర్షించేవాడు. స్త్రీ వేషాలు వేసేవాడు. ఎక్కువగా స్త్రీలమధ్య గడిపేవాడు.

విపరీత కామవాంఛను అణుచుకోటానికి గదాధర్ చేసిన ప్రయత్నం అతడిని మరింత రోగగ్రస్తుణ్ని చేసింది. శారదను పెళ్ళాడి కూడా ఆమెను తల్లిగా చూడాలని ప్రయత్నించాడు. స్త్రీని చూస్తేనే గదాధర్‌కు కామవాంఛ కలిగేది. అది అణచుకోడానికి తీవ్రపయత్నం చేసి మరింత రోగగ్రస్తుడైనాడు. ప్రతి స్త్రీని తల్లిగా భావిస్తేగాని కామవాంఛ అణగిపోయేది కాదు. రానురాను కామాన్ని తగ్గించుకోలేక, మెడలో ఒక ఉచ్చును తగిలించుకొని, కోరిక కలిగినప్పుడు ఉచ్చు బిగించుకొనేవాడు. బాధ భరించలేక మూర్ఛపోయేవాడు. అదలా ఉంచండి.

జాన్ బజార్ జమీందారీ కుటుంబానికి చెందిన రాష్మణి 9 లక్షల రూపాయలతో దక్షిణేశ్వర్‌లో దేవాలయ సముదాయాన్ని నిర్మించింది. అందులో జగదాంబ విగ్రహప్రతిష్టాపన చేయించి, అన్న భోగం ఏర్పరచాలని, బ్రాహ్మణ పురోహితుడిని నియమించాలని తలపెట్టింది. ఆమె శూద్రకులానికి చెందినదిగావడంతో బ్రాహ్మణులెవరూ ముందుకు రాలేదు. గదాధర్ అన్న రాంకుమార్ ఆమెకు సలహాయిస్తూ దేవాలయాన్ని బ్రాహ్మణులకు యిచ్చేస్తే సమస్య పరిష్కారమౌతుందన్నాడు. ఆమె ఆ సలహాను పాటించి రాంకుమార్‌నే పురోహితునిగా నియమించింది. అతని వెంట గదాధర్ కూడా వూరు విడిచి దక్షిణేశ్వరానికి వచ్చేశాడు. పల్లెటూరు

వాతావరణంలో పుట్టి పెరిగిన గదాధర్‌కు అంతా కొత్తగా వింతగా వున్నది. తన అన్న పురోహితుడుగా జగదంబ విగ్రహ ప్రతిష్ఠాపన చేసినప్పటికీ, గదాధర్ మాత్రం బజార్లో అటుకులు కొని తిన్నాడే తప్ప, అన్న భోగంలో పాల్గొనలేదు. వైష్ణవ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన తాను జంతుబలి యిచ్చే శాక్తేయుల గుడిలో యిమడలేక, చివరకు ప్రసాదం కూడా స్వీకరించలేని స్థితిలో గదాధర్ సతమతమయ్యాడు. అన్న రాంకుమార్ ఎంత బ్రతిమిలాడినా గదాధర్ అంటరానితనాన్ని పాటించకుండా వుండలేకపోయాడు. (చూడండి లీలా ప్రసంగం)

తండ్రి తరువాత తండ్రివలె తనను చూస్తున్న పెద్దన్న రాంకుమార్ కూడా చనిపోయేసరికి, గదాధర్ మానసికంగా కుంగిపోయాడు. తనకంటె 31 సంవత్సరాల పెద్ద అయిన రాంకుమార్ మరణంతో, అసలే మూర్ఛలతో, రుగ్మతలతో బాధపడుతున్న గదాధర్ యింకా బలహీనపడ్డాడు.

దక్షిణేశ్వరంలో రాష్‌మణి నిర్మించిన సత్రంలో సాధువులు తరచు వచ్చి బసచేస్తుండేవారు. గదాధర్‌కు వారితో సంబంధం ఏర్పడింది. వారు చెప్పేవి పాటించి, ఉపవాసాలుంటూ, విశ్రాంతిలేని రాత్రులతో కాలం గడుపుతూ ఆరోగ్యం మరింత క్షీణింపజేసుకున్నాడు.

రాష్‌మణి అల్లుడు మధురమోహన్ చాలా చురుకైనవాడు. ముందుచూపుగలవాడు. గదాధర్ రోగలక్షణాలను పరిశీలించి వాటికి దివ్యత్వాన్ని అంటగట్టాడు. రాంకుమార్ వద్దని చెబుతున్నా వినకుండా గదాధర్‌ను ఒక దేవాలయానికి పురోహితుడిని చేయించాడు. గదాధర్ మూర్ఛలు కేవలం మూర్ఛలు కావని, దైవలక్షణాలని మధురమోహన్ ప్రచారం చేశాడు. ఈలోగా గదాధర్ ఒక భైరవి వద్ద తాంత్రికవిద్యను అభ్యసించాడు. తన కామప్రవృత్తి అంతా తాంత్రికతతో తీర్చుకొన్నాడు. ఆధ్యాత్మిక చింతన, మధురప్రేమ పేరిట గదాధర్ తన కోర్కెల్ని తీర్చుకున్నాడు. భైరవి ప్రేరణ ప్రోత్సాహాలతో మధురమోహన్ ప్రచారంచేస్తూ, గదాధర్ దైవస్వరూపుడనీ, అవతారమని చెప్పాడు. ఈ విషయం నిర్ధారించటానికి ఒక సభ ఏర్పాటుచేశాడు. మధురబాబు చేతి చలవతో బ్రతుకుతున్న యిద్దరు పండితులు ఆ సభలో వున్నారు. అలాంటి వారంతా కలసి గదాధర్‌ను అవతార పురుషుడన్నారు. మధురమోహన్ కథలు అల్లి, గదాధర్‌ను రామకృష్ణుడని నామకరణం చేశాడు. తన కుటీరంలో నుంచి ఒకనాడు చూస్తుండగా, అటూ యిటూ తిరుగుతున్న గదాధర్ తనవైపుకు వస్తుండగా కాళీకామాతగానూ, అటువైపు పోతుండగా సాక్షాత్తు శివుడుగానూ కనిపించాడనీ మధురబాబు చెప్పాడు. గదాధర్ అప్పటినుంచీ రామకృష్ణుడయ్యాడు. (చూడండి క్రిస్టోఫర్ ఈషర్ వుడ్ వ్రాసిన రామకృష్ణ అండ్ హిజ్ డిసైపుల్స్ పుట 54-1965) అంతటితో ఆగకుండా రామకృష్ణకు పరమహంస అని కూడా చేర్చి ప్రచారం చేశారు.

రామకృష్ణ కాళీ ఆలయ పురోహితుడుగా అతిగా నిష్టలు పాటించి, దేహాన్ని శుష్కింపచేస్తే, నరాల బలహీనతల వలన, మూర్ఛలు రావడమే గాక, పిచ్చి లక్షణాలు కూడా స్పష్టపడ్డాయి. అలా పిచ్చెక్కినప్పుడు అయన్ను తాళ్ళతో కట్టేవారు. (చూడు : ధర్మప్రచారక్ 1384 ఆగస్టు 6)

పురోహితుడుగా పిచ్చి లక్షణాలున్న రామకృష్ణను చూపి, అవన్నీ దైవలక్షణాలని చెప్పి, మధురబాబు బంధువు హృదయ్ డబ్బు వసూలు చేస్తుండేవాడు. వచ్చినవారికి యీ లక్షణాల ఔన్నత్యం చెబుతుండటం విని, రామకృష్ణ ఒక సందర్భంలో హృదయ్‌ను బాగా చివాట్లు పెట్టాడు. అంతేగాక కఠోర నియమాల వలన తనకు మానసిక స్థితి బాగాలేదని, ఉన్మత్త లక్షణాలు వచ్చాయని కూడా రామకృష్ణ స్పష్టంగా ఒప్పుకున్నాడు. (చూడండి. శివనాథశాస్త్రి 'మెన్ ఐ హేవ్ సీన్' పుట 103)

మధురమోహన్ యీ విధంగా ఎందుకు చేశాడు? అతడు జమీందారుడుగా కర్కోటకుడు. రైతుల్ని హింసించి, డబ్బు పిండేవాడు. హత్యలు, దోపిడీలు చేయించేవాడు. రైతులు యితనిపట్ల జుగుప్సతో వుండేవారు. కసి తీర్చుకోడానికి సిద్ధంగా వుండేవారు కూడా. అలా ఆగ్రహావేశులైన రైతుల వద్దకు వెడుతూ, రామకృష్ణను వెంటబెట్టుకొని పోయేవాడు మధురబాబు. మత మనస్తత్వంగల ప్రజలు, ఎవరో మహానుభావుడు వచ్చాడని, రామకృష్ణను చూస్తూ పూజిస్తూ వుంటే, మధురబాబు తన పని తాను చూచుకునేవాడు. మధురబాబు తనతోబాటుగా యితర జమిందార్లను కూడా రామకృష్ణ దగ్గరకు తెచ్చాడు. అలా సన్నిహితమైన జమీందార్లలో బలరాంబసు ఒకడు. జమీందార్లు తమ నిరంకుశ పాలనకు రామకృష్ణను అడ్డం పెట్టుకుని వాడుకున్నారు.

మధురబాబు, రాష్మణి జమీందార్లకు కుటుంబవైద్యుడు మహేంద్రరావ్ సర్కార్ తరచు రామకృష్ణకు చికిత్స చేస్తుండేవాడు. స్త్రీలను, బంగారాన్ని తాకితే దేహం స్థంభించిపోతుందని, ఆ విధంగా కామినీ కాంచనాలకు తాను దూరమని రామకృష్ణ చెప్పాడు. ఇదంతా నరాల బలహీనత జబ్బు లక్షణాలని డాక్టర్ సర్కార్ ఆయనకు వివరించాడు. రామకృష్ణ పూజించే కాళికామాత సంతాల్ జాతికి చెందిన ఆటవిక దేవత అనీ ఉత్తరోత్తరా ఆర్యులు తమ దేవతగా మార్చారని డా॥ సర్కార్ వివరించి రామకృష్ణకు చెప్పాడు. రామకృష్ణ అవతారంకాదని అతడికే కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు. (చూడు : రామకృష్ణ కథామృతం. మహేంద్రనాథ్‌లాల్ గుప్త రచన)

గొంతు కేన్సర్‌తో రామకృష్ణ చావుబ్రతుకులమధ్య వున్నప్పుడు డా॥ సర్కార్ చికిత్స చేసినా ప్రయోజనం లేకపోయింది. శిష్యులు మాత్రం పడకచుట్టూచేరి, యిదంతా లీల అనీ, ఆయన ఆడుకుంటున్నారనీ, యధాస్థితికి త్వరలోనే చేరుకుంటాడనీ అంటుండేవారు. గొంతుతో ఏదీ మింగుడుపడక ఆయన యమయాతన పడుతుంటే, కాళికను అడగమని శిష్యులు కోరారు. ఇతరుల నోటిద్వారా ఆహారం స్వీకరిస్తున్నావుగదా అని కాళి చెప్పిందట. అయితే కేన్సర్ వచ్చే వరకూ ఎందుకు తిన్నట్లు, అప్పుడు యితరులు లేరా అంటే, అలాంటి ప్రశ్నలు వేయరాదంటారు. ఇదొక ఆధ్యాత్మిక ఆత్మవంచన. యోగశక్తితో కేన్సర్‌ను నయం చేసుకోమని శిష్యులు కోరాగా, దైవ సాన్నిధ్యం నుంచి దృష్టి మరలించడం తనకిష్టంలేదనేవాడు. ఈ విధంగా తనకు తాను మోసం చేసుకుంటూ, ఇతరులను నమ్మిస్తూ బాధతో రామకృష్ణ చనిపోయాడు.

చిన్నప్పటినుండీ రోగాలతో బాధలు పడిన రామకృష్ణను పురోహితుడుగా రాష్మణి జమిందారిణి, పరమహంసగా మధురబాబు జమిందారూ బాగా వాడుకున్నారు. గ్రామస్తులు, బంధువులు, ఇంట్లోవారు మాత్రం రామకృష్ణను వాయురోగంతో బాధపడే కాముకునిగానే చూచారు.

రామకృష్ణకు చదువులేదు. ప్రాథమిక పాఠశాల దశలోనే ఆయన చదువు ఆగిపోయింది. బెంగాలీ తప్ప మరో భాషరాదు. అదికూడా మాట్లాడటమేకాని, చదవడం వ్రాయడం ఆయన వంతుకాదు. కాగా జ్ఞాపకశక్తి ఎక్కువగా వుండేది. ఇంట్లో పౌరోహిత్య సంప్రదాయం వలన మాటకారి అయ్యాడు. శిష్యులుచేరి ఆయన చెప్పిన మాటలంటూ మనకందించిన వాటిలో అతిశయోక్తులు వున్నా, అనుకోకుండా కొన్ని నిజాలు చెప్పారు.

రామమోహన్‌రాయ్ చనిపోయిన తరువాత రామకృష్ణ పుట్టాడు. పునర్వికాస ఉద్యమం ఆరంభమైన బెంగాల్‌లో రామకృష్ణ ప్రభావం వలన దేశం వెనుకంజ వేసింది. కాంగ్రెసుపార్టీ పుట్టిన మరుసటేడు ఆయన చనిపోయాడు. కాని ఆయన పేరిట వేదాంత ప్రచారం చేసి, మఠాలు స్థాపించి రామకృష్ణ పేరును నిలబెట్టిన ఖ్యాతి వివేకానందకు దక్కుతుంది. మేధావుల పట్ల యిష్టత కనబరచని రామకృష్ణ తన పేరు ప్రతిష్టలు యినుమడింప జేసుకోడానికి వివేకానందను గట్టిగా, పట్టుదలగా వెంటపడి ఆకర్షించాడు. అదే రామకృష్ణకు ఎంతో ఉపయోగకారి అయింది. వివేకానంద కొన్నాళ్ళు కనిపించకపోతే రామకృష్ణ స్వయంగా ఆయనింటికి వెళ్ళేవాడు. వివేకానందకు పెళ్ళిచేయాలని తల్లిదండ్రులు తలపెట్టగా, చేయిజారిపోతున్నాడని రామకృష్ణ అడ్డుపడ్డాడు. భగవంతుడిని తాను చూచానని చెప్పేసరికి, రామకృష్ణలో గురికుదిరిన వివేకానందుడు, సందేహాలను వదలి గురువును గౌరవించడం, ఆదరించడం, ప్రచారం చేయడం మొదలెట్టాడు. రామకృష్ణుడు తన లక్ష్యాన్ని సాధించాడు.

***- హేతువాది, ఫిబ్రవరి 1985***

# చిత్తశుద్ధి లేని వివేకానంద (నరేంద్రనాథ్)

వివేకానందకు అమ్మ నాన్న పెట్టిన పేరు నరేంద్రనాథ్. 1863 జనవరి 12న కలకత్తాలో ఒక సామాన్య కుటుంబంలో పుట్టాడు. అక్కడే బి.ఎ. వరకూ చదివాడు. ఇంటర్‌మీడియట్ చదువుతుండగా, ఇంగ్లీషు లెక్చరర్ మాటల సందర్భంలో రామకృష్ణ విషయం ప్రస్తావించాడు. తొలిసారి ఆ విధంగా చూచాయగా పేరు విన్న వివేకానందుడు, ఎప్పుడైనా రామకృష్ణను చూడాలనుకున్నాడు. విద్యార్థిగా ఆయనకు సందేహాలుండేవి. దేవుణ్ణి చూచినవారెవరైనా వున్నారా అనేది ప్రధాన సంశయం. అంతేగాని నాస్తికుడుగా ఏనాడూ వివేకానందుడు లేడు. ఎవరైనా గట్టిగా చెబితే నమ్మడానికి సిద్ధంగా వున్న వివేకానందునికి "తాను చూచానని" రామకృష్ణ తడుముకోకుండా చెప్పేసరికి వివేకానంద నమ్మేశాడు.

దక్షిణేశ్వర్‌లో తొలిపర్యాయం రామకృష్ణను చూచినప్పుడు, వివేకానంద పట్ల రామకృష్ణకే ఎక్కువ ఆకర్షణ ఏర్పడింది. ఒకనెల తరువాత రెండోపర్యాయం వివేకానంద వచ్చినప్పుడు ఆయనమీద రామకృష్ణ కాలుపెట్టాడు. "నాకు తల్లిదండ్రులున్నారు. వారిని చూడవలసిన బాధ్యత నాది. మీరు ఏంపని చేశారని" వివేకానందుడు వాపోయాడు. తల్లిదండ్రులు వివేకానందకు పెళ్ళి సంబంధాలు చూస్తుండగా రామకృష్ణ ఆయనింటికి వెళ్ళి బ్రహ్మచారిగా వుండమని, దైవచింతనలో నిమగ్నం కమ్మని తరచు బోధించేవాడు. పెళ్ళికి వివేకానందుడు విముఖుడు గాకపోయినా, అతని తండ్రి మరణించడంతో ఆ సమస్య వాయిదా పడింది. పెళ్ళి అంతకుముందు కుదరబోయి కూడా చిన్న విషయాలవద్ద తేడాలు రాగా తాత్కాలికంగా ఆగింది. ఇంటికి పెద్దకుమారుడైన నరేంద్రనాథ్ (వివేకానంద) సంపాదించి, పోషించవలసి వచ్చింది. ఉద్యోగాన్వేషణ చేశాడు. వివేకానందకు కొందరు రౌడీ మిత్రులుండేవారు. రౌడీపనులకు వారు పురమాయించారు. కాని వివేకానంద తమాయించుకొని రామకృష్ణ వద్దకు వెళ్ళి తన దుస్థితి చెప్పగా, ఆయన కాళికామాతను వేడుకోమన్నాడు. ప్రయోజనం లేకపోయింది. ఇక ముందు తినడానికి, కట్టుకోడానికి లోపం వుండబోదని రామకృష్ణ హామీయిచ్చి వివేకానందను ఓదార్చాడు. (చూడు : లీలాప్రసంగం)

ఉద్యోగాన్వేషణలో ఒకనాడు అలసి సొలసి రోడ్డుపక్క అడ్డం పడ్డ వివేకానంద, ఇక ప్రయోజనం లేదని సంసార పక్షాన్ని వదలేశాడు. దక్షిణేశ్వరాలయానికి తరచు వెడుతుండేవాడు. రామకృష్ణ ప్రభావంలో నరేంద్ర సన్యాసిగా మారి, విరాజహోమం జరిపి, సంసారలోకంతో సంబంధం తెంచుకొన్నాడు. సంసార బాధ్యతల్ని ఆ విధంగా తప్పించుకొని ఆశ్రమానికి చేరిన వివేకానంద తన వారిని విస్మరించలేకపోయాడు. తల్లి అప్పుడప్పుడూ మఠానికి వచ్చి కుటుంబవిషయాలు చెప్పి, సంప్రదించి వెడుతుండేది. పూర్వీకుల ఆస్తిపాస్తుల విషయమై తన కుటుంబానికీ తన మేనత్తకూ వచ్చిన తగాదా కోర్టు వరకూ వెళ్ళగా, వివేకానంద ఆ విషయమై శ్రద్ధ కనబరచాడు.

వివేకానంద చాలావరకు జమిందార్ల సహవాసంతోనే గడిపాడు. బాగా సుఖాలు కోరుకునేవాడు. అమెరికా వెళ్ళబోయేముందు తన తల్లికి సోదరులకు నెలకు 100 రూపాయల చొప్పున డబ్బు పంపించేటట్లు ఖేత్రి మహారాజా ద్వారా ఏర్పాట్లు చేశాడు. ఆ తరువాత 'స్వామిజీ' కోరికపై మహారాజా ఆయనకు కూడా వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం నెలకు వంద రూపాయల చొప్పున మంజూరు చేశాడు. (చూడు ఫర్‌గాటెన్ ఛాప్టర్స్, వేణి శంకర్, పుట 146-191) తాను 'రిటైర్' అయిన తరువాత నివసించడానికి అనువుగా తన తల్లి పేరిట గంగానది ఒడ్డున ఒక యిల్లును నిర్మించవలసిందని, అందుకుగాను 10 వేల రూపాయలు యివ్వమని మహారాజును వివేకానందుడు కోరాడు. తన పేరిట స్థలం కొనమని 1895లో రామకృష్ణానందకు వివేకానంద వ్రాశాడు. వివేకానందుడి పేరిట కొన్న మఠం భూమిపై బెల్లి మునిసిపాలిటీకి ఆయనకూ దావాలు నడిచాయికూడా. (ప్రబుద్ధ భారత, 1901 ఆగస్టు) స్వామిజీ కోర్కె ననుసరించి తొలుత 500

రూపాయల్ని అజిత్‌సింగ్ పంపాడు. బేలూరుమఠం నుండి 3 వేల రూపాయల్ని వివేకానంద అప్పుగా తీసుకొన్నాడు. కాని డబ్బు చాలనందున ఇంటి ప్రయత్నం విరమించాడు. (చూడు : మిసెస్ బుల్‌కు వ్రాసిన లేఖ 1900 మే 18)

వివేకానందుడు ఎక్కడకు వెళ్ళినా సర్వసౌకర్యాలు కోరుకునేవాడు. అమెరికా వెళ్ళినప్పుడు బాల్టిమోర్‌లోని ఫస్ట్‌క్లాసు హోటల్‌లో వుండాలనుకున్నాడు. ఉన్నాడు కూడా. ఇంగ్లండ్‌లో తన శిష్యుడు ఎడ్వర్డ్‌స్టర్జీ అతిథిగా వున్నందున, వివేకానందుడిలో సన్యాసత్వం లేదని తెలుసుకున్న శిష్యుడు నిస్పృహ చెందాడు. ఆయనతో సంబంధాలు తెంచేసుకున్నాడు.

ఖేత్రి మహారాజా యిచ్చిన డబ్బు తన పుస్తకం రాజయోగం (ఆంగ్ల ప్రతి)పై వచ్చిన డబ్బును కూడబెట్టి న్యూయార్క్‌లో సెయింట్ ఫ్రాన్సిస్ లెగెట్ వద్ద వివేకానందుడు దాచాడు. ఇదంతా (వెయ్యి డాలర్లు) తన కుటుంబానికే ఉద్దేశించాడు. 1900 డిశంబరు 27న ఓక్‌బుల్‌కు వ్రాస్తూ తను చనిపోతే డబ్బంతాతన తల్లికి అప్పగించమన్నాడు. వివేకానందుడి అభిమాని శ్రీమతి సెవియర్ అమెరికాలో 6 వేల రూపాయలు యివ్వడమే గాక, తరచు డబ్బు పంపింది. ఆ విధంగా పంపడం మానేయవద్దని వివేకానందుడు కోరాడు. మరో వెయ్యి రూపాయలు అదనంగా యివ్వమని కూడా కోరాడు. అమెరికా, ఇంగ్లండ్‌లలో స్వామీజీ విలాసంగా గడిపిన తీరు పట్ల అసంతృప్తితో లియోన్ లాండ్స్‌బర్గ్ తన శిష్యరికానికి స్వస్తి పలికాడు. (వివరాలకు చూడు : మేరీ బర్క్ : సెకండ్ విజిట్ పుటలు 71, 79, 81-82, 85-87, 379) సన్యాసిగా నివసించలేని వివేకానందుడు, తన కుటుంబ ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడానికి చేసిన ప్రయత్నాల వలన తోటి సన్యాసులకు, మఠంలోని వారికి చాలా యిబ్బంది కలిగింది. వారెంతగా చెప్పినా వివేకానందుడు మారలేదు.

రామకృష్ణ చనిపోయిన తరువాత బేలూరుమఠం ఆర్థిక చిక్కుల్లో పడింది. కొందరు భిక్షాటన చేశారు గాని ప్రయోజనం అట్టే లేకపోయింది. ఆ బాధ్యత తన నెత్తిన వేసుకొన్న వివేకానంద అఖిలభారత భిక్షాటనకు 1891లో బయలుదేరాడు. రెండేళ్ళపాటు దేశమంతా తిరిగాడు. ముఖ్యంగా స్వదేశీసంస్థానాలలో హిందువుల పాలన క్రింద వున్న వాటికి వెళ్ళాడు. ఎక్కువగా రాజాలు, దివాన్ల వద్ద బస చేశాడు. రాజాల వద్ద పరిచయపత్రాలు ఆధారంగా పర్యటన సాగించాడు. బాగా డబ్బు వసూలు చేసి మఠాన్ని పోషించాడు : వివేకానందుడు వసూళ్ళకై వెళ్ళిన జమిందారీ, స్వదేశీ సంస్థానాలు యివి, ఆల్వార్, జైపూర్, అజ్మీర్, ఖేత్రి, అహమ్మదాబాద్, కథియవార్, జునాగఢ్, పోరుబందరు, ద్వారకా, పైలితానా, బరోడా, ఖండ్వా, బొంబాయి, పూనా, బెల్గాం, బెంగుళూరు, కొచ్చిన్, మలబార్, తిరువాన్కూర్, త్రివేండ్రం, మధురై, రామనాడ్, రామేశ్వరం, కన్యాకుమారి.

అమెరికాలో జరుగనున్న ప్రపంచ మత సమావేశానికి వెళ్ళమని ముగ్గురు జమిందార్లు వివేనందుడిని ప్రోత్సహించి, డబ్బిచ్చి పంపారు. ఖేత్రి, రామనాడ్, మైసూరు మహారాజాలు యీ

కృషి చేశారు. వివేకానందుడి అమెరికా ప్రయాణానికి మద్రాసులో ఆయన శిష్యులు ప్రయత్నిస్తే అతికష్టం మీద 500 రూపాయలు వసూలయ్యాయి. జమిందార్లపై ఆధారపడిన వివేకానందుడు ఆ డబ్బును పేదలకు పంచేయమన్నాడు. జమిందార్లు బాగా కోపు వేసికొని అమెరికాకు సాగనంపారు. పెనిన్సులా స్టీమర్‌లో ఫస్ట్‌క్లాస్ టికెట్ కొనిపెట్టి, కొంత డబ్బిచ్చి, ఇతర వస్తువులు కొనిచ్చారు. ఆ సందర్భంగానే కాషాయ సిల్కు వస్త్రాలు, సిల్కు తలపాగా జమిందార్లు కుట్టించారు. దివాన్ జగమోహన్‌లాల్ తన జమిందారు ఉత్తరువులమేరకు స్వామీజీ అవసరాలన్నీ చూచి ప్రయాణానికి ఓడ ఎక్కేవరకూ బొంబాయిలో వున్నాడు. వివేకానందుడనే పేరుకూడా ఖేత్రిమహారాజా ఒక దర్బారులో ప్రకటించాడు. అప్పటినుంచీ నరేంద్రనాథ్ కాస్తా వివేకానందుడై పోయాడు. కాని ఆయన కావాలనుకున్న పేరు సచ్చిదానంద మాత్రమే. హరిదాస్ మిత్రకు 1892 అక్టోబరులో వ్రాసిన లేఖలో సచ్చిదానంద అని సంతకం చేశాడు. కాని వివేకానంద అనే పేరు స్థిరపడి బహుళ ప్రచారానికి వచ్చింది. తలపాగా ధరించడానికి వివేకానందుడు తొలుత తటపటాయించాడు. అదే అతడికి ప్రతీకగా, సుప్రసిద్ధ చిహ్నంగా మారింది.

మహారాజా యిచ్చి పంపిన డబ్బును అమెరికాలో స్వామీజీ పారేసుకున్నాడు. ఆ విషయం తెలిసి వెంటనే 500 రూపాయలు స్వామీజీకి యివ్వమని 'మహారాజావారు' థామస్ కుక్ అండ్ సన్స్‌కు కేబిల్ యిచ్చాడు. (ఫర్‌గాటెన్ ఛాప్టర్స్-శర్మ పుట 34-94) ఇండియా నుండి జమిందార్లు స్వామిజీకి పార్సిల్స్ పంపుతూ, ఉత్తర ప్రత్యుత్తరాలు చేస్తూ వచ్చారు. ఈ విధంగా అమెరికాలో స్వామీజీ అవసరాలకు ఎలాంటి లోపం రాకుండా జమిందార్లు జాగ్రత్త వహించారు. అమెరికాలో వివేకానందుడిపై జరిగిన దుష్టప్రచారాన్ని కూడా ఖేత్రి, జూనాగడ్ మహారాజాయే ఎదుర్కొని పరువు కాపాడారు.

చికాగోలో హిందూమత ప్రతినిధిగా పాల్గొని ఇండియాకు తిరిగి వచ్చిన వివేకానందకు జమిందార్లు ఎగబడి, పోటీబడి స్వాగతం పలికి సన్మానించారు. తొలుత రామనాడ్ రాజా, వివేకానందకు స్వాగతం పలికి, ఆయన విగ్రహం కూడా ప్రతిష్ఠించాడు. పేదలకు అన్నదానం చేసాడు. రాజా స్వయంగా వివేకానంద ఎక్కిన బండిని లాగాడు. అందుకు బదులుగా రాజావారికి రాజర్షి అని బిరుదును ప్రసాదించాడు వివేకానందుడు. రామనాథపురం జిల్లాలో రాజకీయంగా రాజావారు చేయని అవినీతి అంటూ లేదు. ప్రజల్ని పీల్చి పిప్పిచేశాడు. కాని, భక్తికి లోపంలేదు. తరువాత వివేకానందకు మద్రాసులో రాజాలు 'క్యూ'లో వుండి స్వాగతం పలికారు. (చూడు : గంభీరానంద : యుగనాయక్ వివేకానంద మొదటిభాగం 267-270 354-400) ఈ సభకు హెచ్.హెచ్. గైక్వార్ అధ్యక్షత వహించాడు. తరువాత కలకత్తాలో వివేకానందను సన్మానించారు. ఉత్తర పరరాజా ప్రియ మోహన్ ముఖోపాధ్యాయ, సోవాబజార్ మహారాజా, మహారాజా వినయ్ కృష్ణదేవ్ బహదూర్, దర్భంగా మహారాజా, మహారాజా నరేంద్రకృష్ణ బహదూర్, మహారాజా గోవిందలాల్‌రాయ్ బహదూర్, రాజారాజేంద్ర నారాయణ్ బహదూర్ గారలు సన్మాన సంఘంగా ఏర్పడి ముందుకు వచ్చారు. రాజా రాధాకాంతదివ్ భవన ప్రాంగణలో

స్వాగత సభ జరిగింది. గ్వాలియర్ మహారాజా వచ్చి పాల్గొన్నారు. తరువాత స్వామీజీ డార్జిలింగ్ వెళ్ళగా బర్ద్వాన్ మహారాజా తన భవనాన్ని వాడుకోమని వివేకానందకు యిచ్చాడు. ఇల్లు కట్టుకోడానికి కాశ్మీరు మహారాజా స్థలం యిచ్చాడు. అద్వైత ఆశ్రమ నిర్మాణానికి గాను భింగరాజా డబ్బిచ్చాడు. వివేకానందకు ఎటుచూచినా స్వదేశీసంస్థానాధిపతులు, జమిందారులు, యువరాజులు, సంపన్నులు అండగా నిలచారు. ఆదరించారు. రాజాలపట్ల తన ప్రేమను వెల్లడిస్తూ వివేకానంద 1897 మేలో జునాగడ్ దివాన్‌కు ఉత్తరం వ్రాశాడు. సముద్ర ప్రయాణం చేసినందుకు తనను వెలివేస్తే, తనతో సాంగత్యం గల దేశీయ సంస్థానాధిపతుల్ని కూడా వెలివేయాల్సి వస్తుందని 1897 జులై 9న, సిస్టర్ మేరీకి వ్రాసిన లేఖలో పేర్కొన్నాడు. వివేకానంద సన్యాసి అయిన తరువాత ఆయనకు ఘనంగా మహారాజా వినయ్‌కృష్ణదేవ్ బహద్దూర్ ఒక విందు ఏర్పరచాడు. (ది బెంగాలీ పత్రిక సంపాదకీయం 1895 మే 18)

దేశీయ ప్రభువుల్ని శ్లాఘించడంలో వివేకానంద వెనుకాడలేదు. బ్రిటిష్‌వారి పాలనలో కరువు తాండవిస్తుండగా స్వదేశ సంస్థానాలు హాయిగా వున్నాయన్నాడు. (1899 అక్టోబరు 30 మేరీకి లేఖ) అంతటితో ఆగలేదు. బ్రిటిష్ వారిని తరిమేసి స్వదేశ సంస్థానాధిపతులకు పట్టం కట్టాలని ఉవ్విళ్ళూరాడు. అందుకుగాను ఒక కూటమి ఏర్పాటు చేయాలనుకున్నాడు. అవసరమైతే ఆయుధాలు ప్రయోగించడానికిగాను తుపాకులు తయారుచేసే సర్‌హిరాం మాక్సింతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకున్నాడు. (పరివ్రాజక్ పుట 123)

వివేకానందపై తిరుగుబాటు 1899లో గిరీంద్ర, హరధన్ అనే యిరువురి నాయకత్వాన కొందరు భక్తులు బేలూరు మఠం నుండి చీలిపోయి, వివేకానంద చర్యలకు నిరసనగా పేదల రామకృష్ణ సభను ఏర్పరచారు. స్వామిజీ సహజంగానే దీనిని అంగీకరించలేదు. ఎదురు తిరిగిన బేలూరు మఠం భక్తులు అక్కడ జరిగే ఉత్సవాలను, చివరకు రామకృష్ణ జన్మదినోత్సవాన్ని సైతం బహిష్కరించారు. సన్యాసిగా వుంటానన్న వివేకానంద జమిందార్ల సాంగత్యంలో చేసే పనులు నచ్చక యీ తిరుగుబాటు వచ్చినది.

అమెరికాకు రెండు పర్యాయాలు వెళ్ళిన వివేకానంద ప్రధానంగా ధనసేకరణకే ప్రయత్నించాడు. కాని కొంతవరకే సఫలీకృతుడైనాడు. అమెరికాలో సంపన్నులు కొందరు శిష్యులైన పిమ్మట వివేకానందకు డబ్బు కొరత లేదు. ఇండియాకు తిరిగి వచ్చిన వివేకానంద దేశంలోని ఉగ్రవాదులకు (టెర్రరిస్టులు) ఉత్తేజాన్ని కలిగించాడు. అమెరికాలో వుండగా వివేకానందకు క్రైస్తవ సంఘాలతో, యూనిటేరియన్ చర్చితో బాగా సన్నిహిత పరిచయం ఏర్పడింది. వారి సేవాదృక్పథం ఆయన్ను ఉత్తేజపరచింది. క్రైస్తవ సోషలిస్టుల నినాదాలు, సేవలు ఆయన్ను ఆకట్టుకున్నవి. వీటన్నిటిని రంగరించి, ఇండియాలో రామకృష్ణ మిషన్ ఏర్పరచాడు. సాంఘిక సేవ అనేది మతపరంగా చేయడం సన్యాసులకు యిష్టం లేకున్నా వివేకానంద మాత్రం యీ విషయంలో పట్టుదలగా ముందుకు పోగలిగాడు.

అయితే హైందవ ఔన్నత్యం అనే అతి జాతీయవాదాన్ని బోధించిన వివేకానంద, ఫాసిజానికి పునాదులు వేశాడు. పాశ్చాత్య దేశాలకన్నా ఇండియా గొప్పది అనే శుష్కనినాదం తాత్కాలికంగా కొందరిని ఉత్తేజపరచినా ఆచరణలో ప్రయోజనం లేదని తేలింది. హేతువాదాన్ని చంపడానికి ప్రయత్నించిన వివేకానంద దేశంలోని మూఢవిశ్వాసాలకు పునాదులు గట్టిపరచాడు. ఆధునీకరణ గావించడాన్ని పాశ్చాత్యంగా భోదించాడు!

వివేకానందలో రెండు వ్యక్తిత్వాలున్నవి ఒకటి దేశభక్తి, బాధితుల పట్ల ఆదరణ. దీనితోనే ఆయన చాలా మందిని ఉత్తేజపరచగలిగాడు. రెండవది వేదాంతసారమైన మాయావాదం సంపన్నులంతా యీ మాయావాదం వివేకానంద పట్ల ఆకర్షితులయ్యారే గాని, ఆయన సేవాతత్పరతను చూచికాదు. తప్పనిసరి పరిస్థితులలో బ్రహ్మచారిగా వుండిపోవలసిన వివేకానందను సన్యాసిని చేసి రామకృష్ణ మరీ యిబ్బంది పెట్టేశాడు. ప్రకృతి ఆయనపై కసి తీర్చుకోగా 39 సంవత్సరాలకే 1902లో వివేకానంద చనిపోయాడు.

రామకృష్ణ తెలిసీ తెలియక జమిందార్లకు ఉపయోగపడితే, వివేకానంద కావాలని జమిందార్లను వెనకేసికొని, వారికి అండగా నిలిచాడు. పేదల పొట్ట గొడుతున్న జమిందార్లను ప్రజల ఆగ్రహానికి గురికాకుండా వేదాంత చక్రాన్ని అడ్డేశాడు. దోపిడీ విధానానికి అణచివేతకు అండగా నిలిచాడు. పేదలపట్ల ఎంత జాలి చూపినా, జమిందార్లకే ఫలితం దక్కింది!

(నిరంజనధర్ 'వేదాంత-బెంగాల్ రినైజాన్స్'కు కృతజ్ఞతతో)

*- హేతువాది, మార్చి 1985*

# 21వ శతాబ్ది తాత్వికుడు పీటర్ సింగర్

గౌరి తీరిగ్గా టి.వి. చూస్తున్నది. అనాధ పిల్లల్ని అప్పగిస్తే లక్ష రూపాయలు ఒక్కొక్కరికీ యిస్తామని, అమెరికాలో పిల్లలు లేని సంపన్నులు పెంచుకోడానికి ముందుకు వస్తున్నారని ప్రకటన చూచింది. వెంటనే తనకు తెలిసిన వీధి అనాధ బాలుడిని టి.వి.లో చూపిన అడ్రస్‌కు చేరవేసింది. లక్ష రూపాయలు కళ్ళజూసింది. హాయిగా కొత్త మోడల్ టి.వి. సెట్ కొనుక్కున్నది. విలాసవంతమైన హోటల్‌కు వెళ్ళి ఖరీదైన భోజనం చేసి తృప్తిగా తేపింది. ఇంతలో పక్కింటి లక్ష్మి వచ్చి గౌరికి ఒక వార్త చేరవేసింది. టి.వి.లో ప్రకటించునట్లు, కొనుక్కున్న పిల్లల్ని అమెరికా సంపన్నులకు చేర్చడం లేదట. పిల్లల్ని చంపేసి వారి కిడ్నీలు, లివర్, కళ్ళు విడి భాగాలుగా అమ్ముతున్నారట. గౌరి యీ దుర్వార్తకు అదిరి పడింది. ఇప్పుడేం చేయాలి. తన వద్ద వున్న డబ్బు తిరిగి యిచ్చేసి పిల్లవాడిని వాపస్ కోరాలా? వీధిలో దిక్కులేకుండా తిరుగుతున్న అబ్బాయి ఏమైతేనేం అని వూరుకోవాలా?

ఇది నైతిక సమస్య. ఇలాంటివి ఎదురైతే ఏం చేయాలి? ఆధునిక తాత్వికుడు పీటర్

సింగర్ చర్చను ప్రారంభించి పెద్ద దుమారం లేపాడు. సంపన్న దేశాలలో విలాసాలకు ఖర్చుచేసే వారు ఒక్కసారి ఆలోచించి, వాటిని తగ్గించుకుంటే, ఆ పొదుపుతో పేద పిల్లలు బాగుపడతారంటాడు.

పీటర్ సింగర్ హేతుబద్ధమైన ఉపయోగతావాది చింతనాపరుడు. మనం చేసే పనుల ఫలితాలను, బాగోగులను బట్టి మంచిచెడ్డలు నిర్ధారించాలంటాడు.

వస్తువులన్నీ వుండగా వాటిని మార్చేసి, లేదా అవతలపారేసి, కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన వాటికోసం సంపన్నులు పరుగెడుతుంటారు. సెలవుల్లో ఖరీదైన పిక్నిక్‌లకు వెడతారు. అత్యంత విలాసవంత హోటళ్ళలో బాగా ఖర్చుపెట్టి తాగుతారు, తింటారు. అవసరం లేని ఖర్చులు పెడతారు. ఆ డబ్బులో కొంతైనా విరాళంగా యిస్తే చాలామంది అనాధ పిల్లలు, పేద పిల్లలు బాగుపడతారంటాడు పీటర్ సింగర్.

తన వాదానికి మద్దతుగా పీటర్ సింగర్ మరో తాత్వికుడి రచనలు కూడా ఉదహరించాడు. న్యూయార్క్ యూనివర్శిటీ ఫిలాసఫర్ పీటర్ సింగర్ 1996లో ప్రచురించిన పుస్తకంలో యిలాంటి వాదన ఆకట్టుకున్నది. (Peter Singer: “Living High And Letting Die”)

అయితే పిల్లల్ని ఎందుకు కాపాడాలి? అంటే, రోగాలకు, ఆకలికి పిల్లలు బాధ్యులు కారు. వారిని కన్న తల్లిదండ్రులు, సమాజం అందుకు బాధ్యత వహించాలి. కనుక అలాంటి పిల్లల్ని ఆదుకోవడం బాధ్యతగా స్వీకరించాలని పీటర్ సింగర్ వాదించాడు.

బాల్యదశలో ఆకలి, రోగాలు లేకుండా బయటపడితే ఆ తరువాత వారి తిప్పలు వారు పడతారు. కనుక 2 వేల రూపాయలు దానం చేస్తే ఒక పిల్లవాడు (లేదా బాలిక) ప్రమాదస్థితిని దాటి బయటపడే అవకాశం వుంది.

ప్రపంచంలో అనేక మంది ఆ మాత్రం దానం చేయగల స్థితిలో వున్నారు. అయినా ఉదాసీనంగా అశ్రద్ధ చేస్తున్నారు. ఎందరో పిల్లలు సహాయం అందక చనిపోతున్నారు. ఇదీ స్థితి.

జర్మనీలో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యూదులను చంపారు, చిత్రహింసలకు గురి చేశారు. నాజీలు హిట్లర్ నాయకత్వాన జరిపిన యీ దారుణ అమానుష చర్యలు జర్మనీ పౌరులకు తెలుసు. అయినా వూరుకున్నారు. పిల్లలు చనిపోతున్నా బాధపడుతున్నా తెలిసీ కనీస దానం చేయకపోవడం అలాంటిదేనని పీటర్ సింగర్ అంటున్నాడు.

కనీస అవసరాలు తీరేవారు, విలాసాల జోలికి పోకుండా దానం చేయడం నైతిక బాధ్యత అని తాత్వికుడు పీటర్ సింగర్ విజ్ఞప్తి చేస్తున్నాడు. జీవించడమేకాదు. నైతికంగా మంచి జీవనం అవసరం. ఆ దృష్ట్యా అతడు వాదిస్తున్నాడు.

## ఎవరీ పీటర్ సింగర్?

1946లో ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో పుట్టిన పీటర్ సింగర్ అటు ఆస్ట్రేలియాలోనూ,

ఇంగ్లండ్‌లోనూ చదివి రెండేళ్ళు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా పనిచేశాడు. అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ లెక్చరర్‌గా అనుభవం పొందాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో మొనాష్ యూనివర్శిటీ ప్రొఫెసర్.

మానవ జీవ నీతి శాస్త్ర కేంద్రం డైరెక్టరుగా పీటర్ సింగర్ ప్రపంచ ఖ్యాతి పొందాడు. ఆస్ట్రేలియాలోని విక్టోరియా ప్రాంతంవారు అయన్ను సెనేటర్‌గా నిలబడమని కోరారు. 1992 నుండీ అంతర్జాతీయ బయో ఎథిక్స్ సంస్థ స్థాపకుడుగా కృషి చేస్తున్నారు. 1985 నుండీ బయో ఎథిక్స్ పత్రిక సహసంపాదకుడు.

ఇప్పుడు పీటర్ సింగర్‌ను అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటీవారు మానవ విలువలు అధ్యయనం చేసే బయో ఎథిక్స్ కేంద్రంలో ప్రొఫెసర్‌గా ఆహ్వానించారు. ఆయన అంగీకరించి చేరారు. కాని ఆయన నియామకాన్ని ప్రశ్నిస్తూ ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో జీవకారుణ్య సంఘాలవారు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఎందుకని?

పుట్టిన పిల్లలు ఒకనెల లోపు వికలాంగులని, శారీరకంగా తీవ్ర లోపాలు వున్నాయని తెలిస్తే వారిని చంపేయడం మంచిదని పీటర్ సింగర్ అభిప్రాయం. పిల్లలు సుఖ సంతోషాలను యివ్వాలేగాని, తాము బాధపడుతూ, తల్లిదండ్రులకు, సమాజానికి క్షోభ తీసుకొచ్చే రీతిలో పరిణమించరాదని ఆయన ఉద్దేశం. కనుక అలాంటి పిల్లల్ని నెల రోజుల లోపు చంపేస్తేనే అందరికీ మంచిదన్నాడు. దీనిపై హాహాకారాలు బయలుదేరాయి.

గర్భస్రావం అనుమతించాలనీ, తీవ్ర బాధలు భరించలేక ఎవరైనా చనిపోతామంటే వారిని అలా చనిపోనివ్వాలని అందుకు డాక్టర్లు తోడ్పడడంలో తప్పు లేదని పీటర్ సింగర్ వాదించాడు. యూరోప్, అమెరికాలలో పెద్ద చర్చనీయాంశంగా యీ వాదం మారింది.

1968లో పీటర్ సింగర్ రెనాటా డయమంగ్‌ను వివాహమాడాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. రచనలతో బాటు, కూరగాయల పెంపకం, ఈత, నడక ఆయన అభిరుచులు.

కోతుల జాతిని సంరక్షించాలనే (Ape Project) పథకంలో విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞుల మద్దత్తు పీటర్ సింగర్ గడించాడు. పరిణామంలో మానవులతో సమంగా వున్న వివిధ కోతి జాతుల్ని ఏ మాత్రం సంహరించరాదని వాదించాడు. కోతి అంగాలు పరిశోధనకు స్వీకరించడం తప్పు కానప్పుడు, మెదడు లేకుండా పుట్టిన శిశువుల అంగాలను తీసుకోవచ్చు గదా అంటున్నాడు.

21వ శతాబ్దంలో కొత్త సూత్రాలు రావాలి. లోగడ టాలమీ విశ్వాసాన్ని కోపర్నికస్ దెబ్బ కొట్టాడు. అతడి లోపాల్ని కెప్లర్ సరిదిద్దాడు. అలాగే ముందుకు సాగడంలో మార్పులు చేసుకోవాలి. ఇందుకుగాను పీటర్ సింగర్ కొత్త నిబంధనలు సూచించాడు. బైబిల్ 10 ఆజ్ఞలు యిప్పుడు మార్చుకోవాలంటున్నాడు. అందులో ముఖ్యమైనవి:

1. మానవజీవితం మారుతుందని గ్రహించాలి.

2. నీ నిర్ణయాలకు వచ్చే ఫలితాలను స్వీకరించే బాధ్యత నీదే.

3. బ్రతకాలా వద్దా అనేది వ్యక్తి యిష్టం. దానిని గౌరవించు.

4. పిల్లలు కావాలంటేనే వారిని యీ లోకంలోకి తీసుకురావాలి.

5. జీవరాసులలో విచక్షణ చూపవద్దు.

జంతువులపట్ల హింసను పీటర్ సింగర్ తీవ్రంగా ఖండించాడు. ఆయన రాసిన పుస్తకం జంతు విమోచన (Animal Liberation) చదివి అనేక మంది శాఖాహారులుగా మారిన దాఖలాలున్నాయి. జంతువుల హక్కుల పోరాట కర్తలకు యిది వేదప్రమాణంగా వుంది.

అధునాతన ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాలో (1996) ఎథిక్స్‌పై పీటర్ సింగర్ విపుల వ్యాసం రాశారు. ప్రాచ్య పాశ్చాత్య నైతిక పరిణామాన్ని చక్కగా సమీక్షించారు. 21వ శతాబ్దంలో ఎదురుకాబోతున్న నైతిక సమస్యల ప్రస్తావన తెచ్చారు. ఈ విషయంలో ఆయన జొనాథన్ గ్లోవర్ రచన చూపారు. (Jonathan Glover, 1984, What Sort of People should there be?) రానున్న అనేక క్లిష్ట సమస్యలను, నైతిక సంక్షోభాలను ఆయన మన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా జనిటిక్స్ రీత్యా యీ సమస్యలు తలెత్తనున్నాయన్నారు. పిల్లలు లేని వారికి తోడ్పడే నిమిత్తం, స్థంభింపజేసిన రేతస్సు కణాల ద్వారా ఒకామె గర్భం ధరిస్తుంది. తీరా పిల్ల పుట్టిన తరువాత తానే అట్టిపెట్టుకుంటానంటే, ఏమౌతుంది? మనకు అనూహ్యమైన నైతిక సమస్యలు వస్తాయంటున్నాడు.

భారతదేశంలో నీతి, తత్వం, మతం కలసి పోయిన రీతిని పీటర్ సింగర్ ప్రస్తావించాడు. వేదాలు, బౌద్ధ, జైనాలు, చార్వాక నీతి విషయాలు చూపాడు. జంతువుల్ని చంపి యజ్ఞాలు చేస్తే పుణ్యలోకాలకు పోతారనే వేదాలను ప్రశ్నిస్తూ, అలాగయితే వృద్ధ తల్లిదండ్రులను చంపేస్తే సరాసరి స్వర్గానికి పోతారుగదా అని చార్వాకుడు చెప్పిన ఉదంతాన్ని పీటర్ సింగర్ ఆశ్చర్యంతో చూపాడు.

పాశ్చాత్య లోకంలో, తాత్విక ప్రపంచం పీటర్ సింగర్‌ను పట్టించుకుంటున్నది.

## Peter Singer కొన్ని ముఖ్య రచనలు :

1. Animal Liberation
2. Marx
3. The Expanding Circle : Ethics & Sociobiology
4. Practical Ethics
5. Rethinking : Life and Death
6. Democracy and Disobedience
7. Reproduction Revolution

Articles :

Ethics : Encyclopedia Britannica 1996 edition

Co-Editor : Bio Ethics Journal

*- మిసిమి మాసపత్రిక, జనవరి-2000*

# రామమోహన్‌రాయ్ పునర్వికాసానికి తోడ్పడ్డాడా?

భారతదేశంలో పునర్వికాసానికి నాందిపలికిన వ్యక్తిగా రామమోహన్‌రాయ్‌ను పేర్కొంటాం. ఆయనతోనే అది ఆగిందని కూడా అంటుంటాం. అలాంటి వ్యక్తి జీవితాన్ని గురించి చాలా పరిశోధనలు జరిగిన తరువాత బయటపడిన విషయాలు గమనిస్తే ఆశ్చర్యపడక మానం. ఆ దృష్టితో కొన్ని పరిశీలనాంశాలు యిక్కడ ఉదహరిస్తున్నాను :

బెంగాల్ రాష్ట్రంలోని ముర్షీదాబాద్ జిల్లా సంస్థ గ్రామానికి చెందిన సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో రామమోహన్ జన్మించాడు. పౌరోహిత్యం వంశపారంపర్యంగా వారి వృత్తి. రామమోహన్ ముత్తాత మొగలాయిల క్రింద రెవిన్యూశాఖలో ఉన్నతోద్యోగిగా పనిచేశాడు. కృష్ణచంద్రబందోపాధ్యాయ ఆయన పూర్తి పేరు. ఆయన చేసిన ఉద్యోగాన్ని రాయ్-రాయన్ అనేవారు. అది క్రమేణా రాయ్‌గా మారింది. బందోపాధ్యాయ స్థానంలో రాయ్ వచ్చి అదే యింటి పేరైంది. ఉద్యోగరీత్యా కృష్ణచంద్ర వెళ్ళి రాధానగర్‌లో వున్నారు.

రామమోహన్ తాత వ్రజవినోద్, తండ్రి రమాకాంత్‌లు బాగా ఆస్తులు సంపాదించారు. ఆ సంప్రదాయంలో రామమోహన్ పుట్టాడు. రమాకాంత్ తన ముగ్గురు పుత్రులకు 1796లోనే ఆస్తుల్ని పంచేశాడు. పన్ను చెల్లింపు తప్పించుకోడానికి యీ పనిచేశాడు. ఆ పంపకాలలో రామమోహన్‌కు 50 బిగాల వ్యవసాయక్షేత్రం, జొరశాంకోలో కలకత్తా గృహం సంక్రమించాయి. దీనితోబాటు డబ్బు కూడా లభించింది. పంపకాలు జరిగిన 9 మాసాలకే రామమోహన్ కలకత్తా వచ్చి వడ్డీవ్యాపారంలో దిగాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగులకు పెద్ద వడ్డీలతో డబ్బిచ్చేవాడు. (కలకత్తా రివ్యూ 1933 Vol. 49 నెం. 3, పుట 238)

1797లో ఆండ్రూరాంసేకు 5 వేల రూపాయలు, థామస్ ఉడ్రోఫ్‌కు 5 వేలు అప్పిచ్చాడు రామమోహన్. వందరూపాయలు నెలకు జీతం తెచ్చుకునే ఉద్యోగిగా బెనారస్‌లో రామమోహన్ జీవితం ప్రారంభించాడు. అక్కడ కొద్దికాలమే వున్నాడు. తిరిగివచ్చి వుడ్రోఫ్ కింద దివాన్ అయ్యాడు. తరువాత జాన్‌డిగ్బే కింద చేరాడు. దివాన్‌గా యితడికి మంచి పేరు లేదు.

దివాన్‌గా ఉద్యోగం చేస్తున్నా, వడ్డీవ్యాపారం మానలేదు. తన బంధువు గోపీమోహన్ ఛటర్జీని కలకత్తాలో యీ పనికి వియోగించాడు. రంగపూర్‌లో కూడా యిదే వడ్డీవ్యాపారం సాగించాడు. తరచు రంగపూర్ నుండి కలకత్తాకు డబ్బు చేరవేస్తుండేవాడు. ఈ విధంగా వడ్డీలతో

కూడబెట్టిన ధనంతో భూములు కొంటూపోయాడు. శాశ్వత కౌలుదారీ విధానం క్రింద భూములకు విలువ పెరిగింది. ఆ దృష్ట్యా అప్పులపాలైన జమీందార్ల నుండి గ్రామాలకు గ్రామాలే రామమోహన్ కొనేశాడు. 1799 జులైలో జహనాబాద్ పరగణాలోని గోవిందపూర్‌ను గంగాధర్‌ఘోష్ వద్ద 3100 రూపాయలు యిచ్చి కొనేశాడు. చంద్రకోన పరగణాలోని రామేశ్వరపూర్‌ను రాంతనూరాయ్ వద్ద 1250 రూపాయలకు కొన్నాడు. 1803లో లాంగులాపురాను, 1809లో శ్రీరాంపూర్, కృష్ణనగర్‌లను కొన్నాడు. కలకత్తా, హుగ్లీ, రంగపూర్‌లలో గృహాలు నిర్మించాడు.

జమీందారుగా మారిన రామమోహన్‌కు మంచి పేరు రాలేదు. ప్రజల్ని అణచివేస్తాడని ప్రతీతి తెచ్చుకున్నాడు. రాంనగర్ వాసి రాంజోయ్‌వాతవ్యాల్ హుగ్లీ కోర్టులో దావావేసి, తన తోట, పొలాన్ని దోచుకున్నందుకు రామమోహన్‌పై కేసుపెట్టాడు. అందుకు కోర్టు రామమోహన్‌కు డబ్బు చెల్లించమని శిక్ష వేసింది. 2092 రూపాయలు చెల్లించవలసి వచ్చింది. రామమోహన్ చేసిన క్రూర హింసాత్మక చర్యలన్నీ అతని సేవకుడు జగన్నాధమజుందార్ జరిపినవే.

దారుణంగా రైతుల్ని అణచివేస్తూ, అక్రమంగా భూముల్ని ఆక్రమించుకున్న జమీందార్లను వెనకేసుకొని రామమోహన్ ప్రభుత్వానికి దరఖాస్తులు, అర్జీలు పెడుతుండేవాడు. బెంగాల్, బీహార్, ఒరిస్సాలలోని జమీందార్ల పక్షాన అలా పెట్టిన అర్జీని బ్రిటీష్‌కంపెనీ వారు 1829 సెప్టెంబరు 29న నిరాకరించిన ఘట్టం లేకపోలేదు. (ఏషియాటిక్ ఇంటెలిజెన్స్ 1830 పుట 203-205) ఇంగ్లండ్‌లో కూడా జమీందార్ల పక్షాన విఫల పోరాటం జరిపాడు. కరపత్రాలు ప్రచురించాడు.

నీలిమందు తయారుచేసే నిమిత్తం భూములు సంపాదించే అవకాశం బ్రిటిష్‌వారికి కూడా వుండాలని రామమోహన్ పోరాడి, బ్రిటిష్‌వారి మన్ననలు పొందాడు. దేశీయ జమీందార్ల దోపిడీకి జతగా బ్రిటీష్ జమీందార్లు కూడా చేరడానికి రామమోహన్ బాగా తోడ్పడ్డాడు.

బ్రిటిష్‌వారు యధేచ్ఛగా వ్యాపారం చేసుకోవాలని కూడా రామమోహన్ కోరాడు. దేశీయ పరిశ్రమలు, కళలు నాశనమైనప్పటికీ, కళాకారులకు బ్రిటీష్‌కంపెనీలలో ఉద్యోగాలు, జీతాలు బాగా లభిస్తాయన్నాడు. ఇటలీ, గ్రీసు, స్పెయిన్ దేశాల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోరిన రామమోహన్ ఇండియాలో బ్రిటిష్‌పాలకులు బాగా స్థిరపడి పాలించడానికి మద్దత్తు యిచ్చాడు.

ఢిల్లీలో నామమాత్రంగా బ్రతుకుతున్న మొగల్ చక్రవర్తికి బ్రిటిష్ వారిచ్చే భరణం చాలనందున, అది పెంచమని కోరడానికి రామమోహన్‌ను ఇంగ్లండు వెళ్ళమన్నారు. దీనికి ఆయన అంగీకరించాడు. ఇంగ్లండు వెడితే గౌరవంగా వుండాలనే దృష్టితో 1829 ఆగస్టులో 'రాజా' అనే బిరుదును మొగల్ చక్రవర్తి ప్రసాదించాడు. సాలీనా 4 వేల పౌండ్ల ఆదాయం లభించే ఒక జాగీర్ కూడా రామమోహన్‌కు యిచ్చాడు. ఆ విధంగా రామమోహన్ మొగలాయి చక్రవర్తి కోసం, ఆయన ఖర్చులతో ఇంగ్లండు వెళ్ళాడే తప్ప, అందరూ భ్రమిస్తున్నట్లు సతీసహగమన నిషేధానికి కాదు!

ప్రభుత్వం మాత్రం రామమోహన్‌కు యిచ్చిన 'రాజా' బిరుదాన్ని గుర్తించలేదు. (జె.కె. మజుందార్ "రాజరామమోహన్‌రాయ్, అండ్ ది లాస్ట్ మొగల్స్ పుట 115, 116 పుట 206-207) మొగల్ చక్రవర్తి ప్రతినిధిగా కలకత్తాలో వుంటున్న ఫరీద్‌ఖాన్ చనిపోయాడు. రామమోహన్‌ను ఇంగ్లండు పంపిస్తున్న విషయం ఆయన ప్రభుత్వానికి తెలియజేయవలసి వున్నది. అది జరగలేదు. ఆయన స్థానంలో వచ్చిన ఫజల్‌బేగ్ ప్రభుత్వానికి లోగడ ఫరీద్‌ఖాన్ ఉత్తరం వ్రాసినట్లు దొంగ ఉత్తరం సృష్టించాడు. ఇందుకు రామమోహన్ తోడ్పాటు వున్నది. (పొలిటికల్ ప్రొసీడింగ్స్ 1830 జులై 23 నం. 98)

సతీసహగమనాన్ని ఒక్కసారిగా నిషేధించక, క్రమేణా తొలగించాలని రామమోహన్ ఉద్దేశ్యం. కాని బ్రిటిష్ ప్రభుత్వం 1829 డిసెంబరులో నిషేధశాసనం చేసింది. 1830 జనవరి 14న కలకత్తాలోని 800 మంది ఈ నిషేధానికి వ్యతిరేకంగా గవర్నర్ జనరల్‌కు విజ్ఞప్తి చేశారు. అప్పుడు రామమోహన్ మేల్కొని ఇంగ్లండు పోడానికి అదే అవకాశమనుకొని, ప్రీవీకౌన్సిల్‌లో సతీసహగమన నిషేధానికి అనుకూలంగా వాదించడానికి తనను ఇంగ్లండు పోనివ్వమని కోరాడు. మొగల్‌చక్రవర్తి ప్రతినిధిగా కాక, వ్యక్తిగతంగా వెడతానంటే ప్రభుత్వం అంగీకరించింది. 1830 నవంబరులో ఇంగ్లండు బయలుదేరాడు. వెళ్ళినవాడు, ప్రీవీకౌన్సిల్‌లో సతీసహగమన నిషేధంపై వాదోపవాదాలు పూర్తిగాకముందే ఫ్రాన్స్ వెళ్ళిపోయాడు. పైగా మొగలాయి చక్రవర్తి పక్షాన కృషిచేస్తూ, ఆయన ప్రసాదించిన 'రాజా' బిరుదును బాగా వాడుకున్నాడు. ఆయన కృషివలన మొగల్‌చక్రవర్తి భరణాన్ని సాలీనా మూడువేల పౌండ్లు పెంచారు కూడా. ఇదంతా ఇండియా ప్రభుత్వ ఆదాయంనుంచి చెల్లించాలన్నారు. అదికూడా చాలదని ఇంకా పెంచమని రామమోహన్ కోరాడు. (ఢిల్లీలో గవర్నర్ జనరల్ ఏజంటు ప్రభుత్వ పొలిటికల్ సెక్రటరీకి 1830 జులై 18న వ్రాసిన లేఖ) ఈ విధంగా ఫ్యూడల్ చక్రవర్తికి తోడ్పడడంతో మిగిలిన జమీందార్లు కూడా ఎగబడి తమ కష్టాలు తీర్చమన్నారు. గ్వాలియర్ రాణి బైజాబాయి తన రాయబారిగా 1833లో రామమోహన్‌ను నియమించింది. అయోధ్య, మైసూరు రాజాలు కూడా యిలాంటి ప్రయత్నమే చేశారు.

1718 నుంచి పండితనందకుమార్ విద్యాలంకార్ వద్ద సంస్కృతం, వేదాభ్యాసం చేశాడు రామమోహన్. రాంనారాయణ అధికారివద్ద స్వగ్రామంలో పర్షియన్, అరబిక్ భాషలు నేర్చాడు. ఇస్లాం ప్రభావంలో ఏకేశ్వరాధన కోరాడు. తన కుటుంబంతో వచ్చిన అభిప్రాయ భేదాల కారణంగా రామమోహన్ తన తండ్రి శ్రాద్ధకర్మను కలకత్తాలో చేశాడు. ఇది ప్రాచీన వైష్ణవ పద్ధతిలో చేశాడు. చనిపోబోయేముందు తండ్రి రమాక్రాంతుడు తీవ్రమైన అప్పులలో పడ్డాడు. దీనివలన జైలులో పెట్టారు. ఆ అవమానంతో ఆయన చనిపోయాడు. అలాగే అన్నకూడా అప్పుల పాలయ్యాడు. అప్పటికే సంపన్నుడుగావున్న రామమోహన్ వీరిని ఆదుకోడానికి ఏమీ చేయలేదు. జైలులోవున్న అన్న జగన్‌మోహన్ తనను విడిపించమని తమ్ముడిని కోరగా, నోటు రాయించుకొని 1804 ఫిబ్రవరి 13 లోగా తిరిగి చెల్లించే షరతుపై వెయ్యి రూపాయలు అప్పుగా యిచ్చాడు.

రంగపూర్‌లో వుండగా ఒక ముస్లిం స్త్రీతో రామమోహన్ తాంత్రిక విద్యను ఆచరించాడు. హరిహరానందుడి ప్రభావం క్రింద యిది జరిగింది. తాంత్రిక విద్యలో రామమోహన్‌కు దీక్ష యిచ్చింది హరిహరానందుడే.

ఫోర్ట్ విలియం కాలేజీలో రామమోహన్ చదువుతుండగా డిగ్‌బీ అనే ఆంగ్లేయుడు పరిచయమైనాడు. రాంపూర్‌లో డిగ్‌బీ అధికారిగా నియమితుడై రామమోహన్‌కు ఉద్యోగం యిచ్చాడు. రెవిన్యూ శాఖలో దివాన్‌గా చేరిన రామమోహన్, డిగ్‌బీ లైబ్రరీ ఆధారంగా ఇంగ్లీషు పుస్తకాలు చదివాడు. ఇక్కడే ఆంగ్ల గ్రంథాల లిబరల్ ఆలోచన వలన ప్రభావితుడైనాడు, అయితే హేతువాదాన్ని ఆమోదించక, మతపరమైన విషయాలను అర్థం చేసుకోడానికి హేతువు తోడ్పడదని రామమోహన్ వ్రాశాడు. దైవసాక్షాత్కారం వంటివాటిలో అతడికి నమ్మకం వున్నది.

రామమోహన్‌ను ఇంగ్లీషు పాలకులు బాగా వాడుకున్నారు. కూచ్ బీహార్, భూటాన్ రాజులకు వచ్చిన సరిహద్దు తగాదాలు తీర్చడానికి 1809, 1811, 1815లో రామమోహన్ ఆ ప్రాంతాలకు వెళ్ళాడు, భూటాన్‌రాజు నేపాల్‌ను సమర్థిస్తున్నందున, అతన్ని ఆకట్టుకోడానికి బ్రిటిష్‌వారు రామమోహన్‌ను నియోగించారు. భూటాన్‌రాజుకు విలువైన బహుమతుల్ని రామమోహన్ ద్వారా బ్రిటిష్‌వారు పంపారు. నేపాల్‌ను బలపరచకుండా భూటాన్ రాజును మళ్ళించడంలో రామమోహన్ సఫలీకృతుడైనాడు.

ఫ్రెంచివిప్లవంతో ఉత్తేజితుడైన రామమోహన్, ఆ భావాలను ఇండియాకు అన్వయించ దలచలేదు. బ్రిటీష్ సామ్రాజ్యం ఇండియాలో సుస్థిరంగా వుండడానికి యధాశక్తి కృషిచేశాడు.

పాట్నాలో వుండగా టిబెట్ లామాల గురించి, బుద్ధిజాన్ని గురించి తెలుసుకొని, ఉత్తరోత్తరా రామమోహన్ టిబెట్ వెళ్ళివచ్చాడు. 1788-90 ప్రాంతాల్లో యీ ప్రయాణం చేశాడు.

## సతీసహగమనం - రామమోహన్ పాత్ర

1812లో తన పెద్దన్న భార్య అలకామంజరి భర్త చితిపై చనిపోవడం చూచి, సతీసహగమన అలవాటును మాన్పించాలని కంకణం కట్టుకున్నాడని ఒక కథ ప్రచారంలో వున్నది. అన్న జగన్‌మోహన్ చనిపోయినప్పుడు రామమోహన్ అక్కడలేడు. ఈ ఉద్యమాన్నీ తరువాత ఆరేళ్ళకు, అంటే 1818లో గాని రామమోహన్ ఆరంభించలేదు. ఆయన గురువు హరిహరానంద ముందుగా సతీసహగమనాన్ని నిరసిస్తూ ఇండియా గజట్‌లో వ్రాశాడు. (1818 మార్చి 27) తాంత్రికులు సతీసహగమనాన్ని వ్యతిరేకిస్తారు. ఆ సంప్రదాయంలో రామమోహన్ వచ్చాడు. బ్రిటీష్‌వారు, క్రైస్తవమిషనరీలు అంతకు ముందు యీ అమానుష ఆచారాన్ని వ్యతిరేకించారు. సతీసహగమన విషయమై రామమోహన్ రచనల్ని చదివిన బెంటింగ్, కలకత్తాలో ఆయన్ను సంప్రదించిన మాట వాస్తవం. అంతేగాని యీ ఉద్యమాన్ని ప్రారంభించింది రామమోహన్ కాదు. సాంఘిక ఆచారాలలో కూడా రామమోహన్ అభ్యుదయవాదికాదు.

రామమోహన్ కులాన్ని, కులాచారాలను పాటించాడు. చనిపోయే వరకూ జంధ్యం వేసుకున్నాడు. ముగ్గురు భార్యలను, అందులోనూ బాల్యవివాహాలను చేసుకున్నాడు.

ఆనాటి హేతువాది, శాస్త్రీయ ఆలోచనాపరుడు అయిన డిరోజియోను రామమోహన్ వ్యతిరేకించాడు.

ఆంగ్లేయులను, ముస్లిం మాజీపాలకులను దృష్టిలో పెట్టుకుని జీవితమంతా ఫ్యూడల్‌గా బ్రతికిన రామమోహన్‌రాయ్ విశేషాలు ఇటీవల చాలా వెలుగులోకి వచ్చాయి. ఆయన ఇంగ్లీషు విద్య కావాలన్నా, సతీసహగమనం పోవలన్నా వాటి వెనుక ఇలాంటి ఉద్దేశాలున్నవి. అయినప్పటికీ సనాతనులపై పోరాడి కొంతవరకైనా కృషి సాగించాడని సరిపెట్టుకోవాల్సిందే.

ఉన్న మతాలు, దేవుళ్ళు చాలవన్నట్లు, బ్రహ్మసమాజాన్ని స్థాపించి, మానవుడిని సొంతంగా ఆలోచించే అవకాశం కోల్పోయేటట్లు రామమోహన్ చేశాడు. చరిత్రను నిశితంగా పరిశీలిస్తే ఇలాంటి సత్యాలు బయటపడుతున్నవి. అయినప్పటికీ గతంపట్ల మనం నిర్దాక్షిణ్యంగా వ్యవహరించకపోతే, పునర్వికాసంరాదు, మనం ముందుకు పోలేం.

(నిరంజనధర్‌కు కృతజ్ఞతతో)

*- హేతువాది, ఏప్రిల్ 1987*

# మతరాజకీయ వ్యాపారంలో మదర్‌తెరిసా

కేన్సర్ బాధ భరించలేక మూలుగుతుంటే, జీసస్ క్రీస్తు నిన్ను ముద్దెట్టుకుంటున్నాడని మదర్ తెరిసా అన్నది. అందుకు బదులుగా ఆ వ్యాధిగ్రస్తుడు, దయచేసి నన్ను ముద్దెట్టుకోవద్దని సిఫారసు చేయమని ఆమెను అడిగాడట.

ఇది జరిగింది కలకత్తాలోని మదర్‌తెరిసా "పిల్లల ఆశ్రమం"లో. ఆమె నిర్వహించిన అనాథపిల్లల గృహాలలో పిల్లలకు రోగాలొస్తే, నయం కావడానికి మందులు వాడేవారు కాదు. ప్రార్థనలు చేసేవారు. అది వారి విశ్వాసం.

సుప్రసిద్ధ బ్రిటిష్ మెడికల్ మ్యాగజైన్ "లాన్సెట్" ఎడిటర్ రాబిన్‌ఫాక్స్ స్వయంగా 1991లోనే కలకత్తాలో ఈ దృశ్యాలు చూచారు. అలాగే విశ్వవిఖ్యాత జర్నలిస్ట్ క్రిస్టోఫర్ హిచెన్స్ కూడా స్వయంగా మదర్‌తెరిసాను కలసి ఇలాంటి సంఘటనలు గ్రహించారు.

అయితే మదర్‌తెరిసాకు గుండెపోటు వస్తే, ప్రార్థన చేస్తూ, జీసస్‌క్రీస్తు ముద్దుపెట్టుకున్నాడని అనుకుని సరిపెట్టుకున్నారా? స్టార్‌హోటళ్ళ వంటి కార్పోరేట్ ఆస్పత్రులలో చేర్చారు. ఏమిటీ విచక్షణ? అలాంటి ప్రశ్నలు "భారతరత్న" మదర్‌తెరిసా గురించి వేయకూడదంతే.

మదర్‌తెరిసా పేరుమార్చి, ఊరుమార్చి పోప్ దృష్టి ఆకర్షించి, నోబెల్‌ప్రైజ్ గ్రహించింది.

భోపాల్‌లో ఒకరోజు పొద్దున్నే నిద్రలేచే సరికి వేలాది కార్మికులు, పిల్లలు, తల్లులు యూనియన్ కార్బైడ్ విషవాయువులు కారణంగా చనిపోయారు. అమెరికా కంపెనీ యాజమాన్యం ఖంగుతిన్నది. కలకత్తానుండి హుటాహుటిన భోపాల్ చేరుకున్న మదర్‌తెరిసా జీవకారుణ్యంతో ఒక విజ్ఞప్తి చేసింది. కార్మికులనుద్దేశించి ప్రకటన చేసిందని భ్రమపడితే పొరపాటే. యాజమాన్యాన్ని క్షమించమని మదర్‌తెరిసా కోరింది. అది ఆమె ప్రత్యేకత!

1976లో హైదరాబాద్‌లో నేను మదర్‌తెరిసాను ఇంటర్వ్యూ చేసాను. అప్పట్లో ఆంధ్రజ్యోతి బ్యూరోఛీఫ్‌గా నేను పబ్లిక్‌గార్డెన్స్‌లో ఒక కార్యక్రమం సందర్భంగా మదర్‌తెరిసాతో మాట్లాడాను. ఏది అడిగినా ఆమె సమాధానం ఒక్కటే, అంతా దైవకృప అనీ, పరిష్కారానికి ప్రార్థన మార్గమని చెప్పడమే. చాలా నిరుత్సాహపడ్డాను. ఆమెనుండి నేను ఏవో సమాధానాలు ఆశించడం పొరపాటని గ్రహించాను. అయితే ఆమెకు మద్దతుగా బలమైన క్రైస్తవమతం, ప్రభుత్వాలు, పాలకవర్గాలు ఉన్నందువల్ల సాగిపోయింది. మదర్‌తెరిసా గురించి చాలామందికి చాలావిషయాలు తెలియవని, గుడ్డినమ్మకమే ఆధారమని గ్రహించాను. పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు, ఎంతో మంది యువతులు చెరచబడి పారిపోయి, ఇండియా వచ్చారు. అయినా సరే, వారెవరూ గర్భం తొలిగించుకోరాదని అదంతా దేవుడిచ్చిన ప్రసాదం అని మదర్‌తెరిసా ప్రకటించింది. అది ఆమె జీవకారుణ్యానికి, దైవభక్తికి గీటురాయి.

ఐర్లాండ్‌లో కేథలిక్కులు అత్యధికంగా ఉన్నచోట గర్భస్రావం విడాకుల విషయం పార్లమెంటులో చర్చికి రాగా, మదర్‌తెరిసా గూడా కల్పించుకుని తన మత ప్రకారం విడాకులు ససేమిరా వీలుకాదన్నది.

కానీ డయానా యువరాణి విడాకులు తీసుకుంటుంటే అది దైవేచ్ఛ అని మదర్‌తెరిసా దీవించింది. ఆమెది నాలుకేనా అనబోకండి. డబ్బు, పలుకుబడి, ఆకర్షణ ఉన్న డయానా ప్రభావమే వేరు. మదర్‌తెరిసా అక్కడ అవకాశవాదం చూపించింది.

ఇలాంటివి ఏకరువు పెట్టడం ఈ రచన ఉద్దేశం కాదు. లోకానికి తెలియని మదర్‌తెరిసా గురించి నిజాలు చెప్పడమే ముఖ్యం. నీవు ఎన్ని నిజాలు చెప్పినా, మదర్‌తెరిసా కీర్తి తగ్గదు అంటారా? వారికి నమస్కారాలు.

మదర్‌తెరిసా (1910-1997) తల్లిదండ్రులు పెట్టిన పేరుకాదు. ఆమె పుట్టింది మాసడోనియా దేశంలోని స్కోపీజేలో. సోదరి, సోదరుడు ఉన్నారు. క్రైస్తవమత శాఖలో నన్స్ అయ్యే ఒక సాంప్రదాయం పాటించి, 15వ యేట ఈమె ఐర్లాండ్ వెళ్ళింది. అక్కడినుండి ఇండియాలో కలకత్తా చేరుకున్నది. 1929లో కొన్నాళ్ళు టీచర్‌గా చేసి, చివరకు నన్‌గా కుదురుకున్నది. తొలిపేరు ఆగ్నస్ గోన్షా బొజాక్సు.

చిన్నపిల్లల్ని సేకరించి, అనాధశరణాలయాలలో పెట్టడం క్రైస్తవ మతప్రచారంలో ఒక భాగం. ఆ కార్యక్రమం మదర్‌తెరిసా చేపట్టింది. చిన్నప్పుడు పిల్లల్ని రాబడితే, వారిని ఎలా

కావాలంటే అలా తయారు చేసుకోవచ్చనేది సెయింట్ అగస్టీన్ మూలసూత్రం. జెసూట్‌ఫాదరీలు కూడా అదే పాటిస్తారు. నన్స్ కూడా ఆ దోవలో నడుస్తారు. మదర్‌తెరిసాకు కలకత్తా వీధులు కావలసినంతమంది పిల్లల్ని అందించాయి. ఛారిటీస్ రావడం మొదలైంది. అనేకచోట్ల, వివిధ దేశాల్లో పిల్లల అనాథశరణాలయాలు స్థాపించారు.

పిల్లలకు జబ్బుగా ఉన్నప్పుడు ప్రార్థనలు చేయడం, చనిపోతున్న వారి పక్కన నిలబడి మత విధులు ఆచరించడం మదర్‌తెరిసా ఆశ్రమం ఆచారమే. ఆ విధంగా మతమార్పిడి సున్నితంగా చాపకింద నీరువలె ఆచరించారు. అసలు ఉద్దేశం అది కాదంటుండేవారు! ప్రపంచ వ్యాప్తంగా కేథలిక్కులు, వారి సంస్థలు మదర్‌తెరిసా సేవల్ని పూదరగొట్టాయి. పోప్‌కూడా పొగిడాడు. అంతటితో గుర్తింపుతోబాటు డబ్బు కూడా రావడం మొదలైంది. డబ్బు సేకరించడానికి కేథలిక్కులు అనుసరించే అనేక మార్గాలలో ఛారిటీస్ సంస్థలు ముఖ్యం. మదర్‌తెరిసా అరమరికలు లేకుండా వసూళ్ళు చేసింది.

హైతీదేశపు పాలకులుగా, నరహంతకులుగా ప్రజల్ని నలుచుకుతిన్న డ్యువలియర్ కుటుంబానికి మదర్‌తెరిసా సన్నిహితురాలైంది. జీన్‌క్లాడ్ డ్యువలియర్ ఆమెకు సన్మానాలు చేసి, డబ్బిచ్చింది. మదర్‌తెరిసా తన సత్కారానికి సమాధానంగా డ్యువలియర్ కుటుంబం పేదల ప్రేమికులని ఉపన్యసించింది. అంతకంటే పచ్చి అబద్ధం మరొకటి ఉండదు.

అమెరికాలో అప్పులిస్తానని నిధులు సేకరించి, మోసగించిన ఛార్లెస్‌కోటింగ్ జైల్లో పడ్డాడు. 252 మిలియన్ డాలర్ల మోసగాడికి జైలు శిక్ష తప్పించమని మదర్‌తెరిసా జడ్జికి ఉత్తరం రాసింది! కోటింగ్ 1.25 మిలియన్ డాలర్లు ఆమె నిధికి ఇచ్చాడు. ఆ డబ్బు తిరిగి ఇచ్చేస్తే కోటింగ్ చేతిలో మోసపోయిన కొందరికైనా ఆదుకుంటామని అడ్వకేట్ అడిగాడు. జవాబు లేదు. రాబర్ట్ మాక్స్‌వెల్ అనే పత్రికా ప్రచురణ కర్త 450 మిలియన్ పౌండ్లు వాటాదార్ల దగ్గర మోసం చేసినప్పటికీ అతని వద్ద మదర్‌తెరిసా డబ్బు పుచ్చుకున్నది. న్యూగినీ దేశంలో మతమార్పిడులు విపరీతంగా చేయించింది.

భారతదేశంలో ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన అత్యవసర పరిస్థితిని పొగుడుతూ ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఉద్యోగాలు బాగా లభిస్తున్నాయని, సమ్మెలు లేవని మదర్‌తెరిసా సర్టిఫికెట్ ఇచ్చింది. అందువల్లనే అనలేంగానీ, ఆ తరువాతే ఆమెకు భారతరత్న లభించింది.

భారతదేశంలో డబ్బుపెట్టకుండా విదేశీ బాంకులలో దాచారు. చివరకు అంతా వాటికన్ బాంకుకు ముట్టింది. ఆమె చనిపోయేనాటికి ఒక్క న్యూయార్క్‌లోనే 50 మిలియన్ డాలర్లు మూలుగుతున్నాయి. చట్టప్రకారం ఛారిటీస్‌కు వసూలైన డబ్బు వేరే ఖర్చు చేయకూడదు. మదర్‌తెరిసాను అడిగేదెవరు?

సుప్రసిద్ధ జర్నలిస్ట్ క్రిస్టోఫర్ హిచిన్స్, తారిక్ అలీ ఇంగ్లాండ్‌లో ఒక డాక్యుమెంటరీ తీసి (హెల్స్ ఏంజిల్) ఛానల్ 4లో మదర్‌తెరిసా గుట్టురట్టు చేసారు. 'ది మిషనరీ పొజిషన్' శీర్షికన

హిచిన్స్ ఒక పుస్తకం వెలువరించారు. సునంద దత్త రే కూడా నిశిత పరిశీలనా వ్యాసాలు రాసారు. అరూప్ ఛటర్జీ 'న్యూ స్టేట్స్‌మెన్' లో 1997 సెప్టెంబర్ 26న తీవ్ర పరిశీలనా వ్యాసం రాసారు. ధీరుషా ఇండియాలో మతమార్పిడిలు చేసిన మదర్‌తెరిసా గురించి రాసారు.

మదర్‌తెరిసా వసూళ్ళ గురించి జర్మనీలో స్టెరన్ అనే పత్రిక విచారణ జరిపింది. నిధులు ఎంత, ఎక్కడ ఉన్నాయి? ఎలా ఖర్చు చేస్తున్నారని అడిగితే చెప్పలేదు. అంతా రహస్యం అన్నారు.

స్టెర్న్ పత్రికలో వాల్టర్ ఫ్యూలెన్ వెబర్ 1998 సెప్టెంబర్ 1న సుదీర్ఘ విమర్శలు చేస్తూ మదర్‌తెరిసా నిధులు, బాంకులో దాచి, పిల్లలకు ఖర్చుపెట్టని తీరు, చివరకు రోమ్ బాంకుకు చేర్చిన విధానం బయట పెట్టాడు. సుజన్ షీల్డ్స్ లోగడ మదర్‌తెరిసా వద్ద పనిచేసి విసుగుతో బయటపడి న్యూయార్క్‌లో డబ్బు విషయాలు వెల్లడించింది.

కలకత్తా వీధుల్లో మదర్‌తెరిసాకు దానంగా వచ్చిన బట్టలు అమ్ముకోవడం, పేదపిల్లలు ఆమె ఆశ్రమాల్లో దిక్కులేక ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో బ్రతకడం వెల్లడయ్యాయి. ఏమైతేనేం, మతం ఆమెకు చాలా మంచి ప్రచారం చేసిపెట్టింది.

మదర్‌తెరిసా చనిపోగానే, పోప్‌జాన్‌పాల్ కొత్త ఎత్తుగడకు నాంది పలికాడు. మతవ్యవస్థలో చనిపోయిన వ్యక్తిని సెయింట్ చెయ్యాలంటే రెండు అద్భుతాలు చూపాలి. కనీసం 5 సంవత్సరాలు వేచి ఉండాలి. మతవ్యాపారంలో పోప్ ఆరితేరిన వ్యక్తి కనుక. అంత జాప్యం లేకుండా మదర్‌తెరిసాను సెయింట్ చేయడానికి పూనుకున్నాడు. 19 అక్టోబర్ 2003లో అందుకు తొలిప్రక్రియ ప్రకటించాడు.

ఇక అద్భుతాల సృష్టి ఎలా జరిగిందో చూద్దాం. పశ్చిమబెంగాల్‌లో ఆదివాసి కుటుంబానికి చెందిన మోనికాబ్రస్రా అనే ఆమెకు 5గురు పిల్లలు. పేదకుటుంబం. ఆమెకు చికిత్స చేయగా, కడుపులో పెద్ద గడ్డ వచ్చింది. బాలూర్‌ఘటా ఆస్పత్రిలో డా॥ రంజన్ ముస్తాఫ్ చికిత్స చేయగా, కడుపులో గడ్డ పోయింది. మోనికాబ్రస్రా ఒకనాడు కలలో మదర్‌తెరిసాను చూసినట్లు, ఆమె సమాధిని సందర్శించినట్లు, దాని ఫలితంగా ఆమెకు ఉన్న కడుపులో గడ్డ మాయం అయినట్లు కథ సృష్టించారు. తొలుత అది సరైనది కాదని ఆమె భర్త సీకో అన్నాడు. తరువాత వారి పిల్లల్ని క్రైస్తవబడిలో చేర్చడం, వారికి కొంతభూమి సమకూర్చడంతో, అద్భుతకథ నిజమేనని చెప్పించారు.

మదర్‌తెరిసా బ్రతికుండగా అనాధపిల్లల పేర నిధులు వసూలు చేసి, రోమ్‌కు చేరవేస్తే, చనిపోయిన తరువాత సెయింట్ పేరిట డబ్బు వివిధ రూపాలలో వసూలు అవుతుంది. ఇది కొన్నాళ్ళు సాగుతుంది. దీన్నే మతవ్యాపారం అనవచ్చు. ఇలా నిత్యనూతనంగా భక్తుల్ని వంచిస్తూ పోవడం ఆధ్యాత్మిక ప్రక్రియలో అనుచానంగా వస్తున్నది. ఇక మదర్‌తెరిసా ఫోటోలు, విగ్రహాలు, రకరకాల చిహ్నాలకు ఏ మాత్రం కొదవలేదు.

***- మానవ వికాసం, జూన్ 2005***

# హిస్టీరియా - చార్‌కాట్ పాత్ర

హిస్టీరియాకు వైద్యస్థాయిని సమకూర్చిన చార్‌కాట్ (1825-1893)ను గురించి తెలుసుకొని తరువాత దాని పరిణామాన్ని చూద్దాం. వందేళ్ళ చరిత్ర వున్న హిస్టీరియా నేడు ఆధునిక మానసిక చికిత్సలోకి ప్రవేశించిన తీరు శాస్త్రీయమా అనేది ప్రశ్న. జబ్బుకూ-నటించే రోగానికీ తేడా గమనించాలని హిస్టీరియా చరిత్ర సూచిస్తున్నది. హిస్టీరియా లక్షణాలలో మాటలు చెప్పకుండా సూచించే రీతులు ప్రధానం కాగా, జబ్బున్న మనుషుల లక్షణాలను అనుకరించడం, నిస్సహాయతను నటించడం మరో లక్షణం. ఇందులో కొంత మోసపూరిత ధోరణి, ఇతరులపై ఆధిపత్యకాంక్ష, అదుపులో పెట్టడం కూడా హిస్టీరియా విశిష్టతలు. హిస్టీరియాను జబ్బుల్లో చేర్చి, శారీరక రుగ్మతల స్థాయికి సమానంగా చూడడం మరో ఆధునిక రీతిగా పెంపొందింది. ఇది 'కనిపెట్టిన' కల్పితరోగం. దీనికి ఆద్యుడు జీన్‌మార్టిన్ చార్‌కాట్. ఇతడు నరాలజబ్బుల శాస్త్రజ్ఞుడు. ఆనాడు నరాల రోగాలకు చికిత్స లేదు. చార్‌కాట్ కేవలం వైద్యుడే గాక, సార్‌బోన్ యూనివర్శిటీలో ప్రొఫెసర్, సాల్‌పెట్రిలో వైద్యుడు కూడా. ఇతడి చికిత్సలో వున్న రోగులు ఆస్పత్రిలో చేరడానికి - జబ్బు వున్నా లేకున్నా-పేదరికంలో మగ్గేవారు, సమాజానికి పనికిరానివారు, ఇతరులకు యిబ్బంది కలిగించేవారు వున్నారు. కుటుంబంలో తగిన శ్రద్ధ పొందలేనివారు, ఆస్పత్రిలో చేరితే సులభంగా వుంటుందనుకునేవారు వున్నారు. తక్కువ తరగతుల నుండి వీరు వచ్చారన్నమాట.

చార్‌కాట్ గురించి ఫ్రాయిడ్ వ్యాఖ్యానిస్తూ అతడు ద్రష్ట అనీ, హఠాత్తుగా అతడికి విషయం గ్రహణంలోకి వస్తుండేదనీ అన్నారు. లక్షణాలుచూచి యిలాంటి నిర్ణయాలకు వచ్చేవాడు. ఇలా చూచి చూచి, ఒక నిర్ణయానికి వచ్చే ప్రత్యేక దృష్టి తనకున్నదని చార్‌కాట్ గర్వించేవాడు. దీనిని నోసోగ్రఫీ అన్నారు. అంటే వ్యాధుల క్రమబద్ధ వివరణ అన్నమాట.

క్రైస్తవుల దేవుడు తొలుత తోటలో ఆదాంను వదిలేస్తే అతడు అన్నింటినీ వర్గీకరించి పేర్లు పెట్టాడని కథ. అలాగే తన వద్ద చేరిన రోగుల్ని రోజూ తిలకించి చార్‌కాట్ కూడా పేరు పెట్టేవాడట. అమానుషమైన యీ వర్గీకరణ వైద్యంలో ప్రవేశపెట్టింది చార్‌కాట్ కాగా, ఆధునిక మానసిక వైద్యం పేరిట దీనికి ఆమోదముద్ర వేశారు!

చార్‌కాట్ తన రోగుల్ని యిలా నరాలజబ్బులవారిగా చెప్పడానికి లోగడ చనిపోయినవారి మెదడులు ఆయన పరిశీలించాడు. చార్‌కాట్‌కు నాటి ఫ్రెంచి సమాజంలో పలుకుబడి వుంది. ప్రధాని రాంబెట్టాకు సన్నిహితుడు, రష్యా డ్యూక్ నికొలస్‌కు స్నేహితుడు. ఫ్రెంచి-రష్యా సంధిలో ఆయన పాత్ర వుంది. ఉన్నతవర్గాలలో మెలిగిన చార్‌కాట్, పేదరోగుల్ని (జబ్బులేని మానసిక నరాల ఫిర్యాదులవారిని) ఎలా చూచేవాడో గమనించవచ్చు.

ఇంట్లో పని తప్పించుకోడానికి ముంతే అనే ఒక రైతు యువతి చార్‌కాట్ ఆస్పత్రిలో

చికిత్స పేరిట చేరింది. సాల్‌పెట్రె ఆస్పత్రిలో ఆమెకు నిర్బంధచికిత్స జరుగుతున్నా ఇంటికన్నా అదే ఆమెకు నచ్చింది, ఇంటికి తిరిగి వెళ్ళమన్నా ఆమె అంగీకరించలేదు. హిస్టీరియా రోగిగా ఆస్పత్రిలో వుండడమే సుఖంగా వున్నదామెకు. నేటి పిచ్చాసుపత్రివలె నాడు చార్‌కాట్ ఆస్పత్రి వున్నదన్నమాట. మతసంస్థలలో చేరిన అమ్మగార్లవలె ఎంత నిర్బంధంవున్నా కనీసావసరాలు తీరేవి. డాక్టరుకు భయపడి, లొంగివుండటం వల్ల అన్నీ సక్రమంగా జరిగేవి. మతాచార్యులు చెప్పినట్లు నడుచుకుంటే మఠాలలో, ఆశ్రమాలలో అలాగే వుంటుంది. స్వేచ్ఛ, వ్యక్తిత్వం, సొంత ఆలోచన చంపుకుంటే సరి.

హిస్టీరియా రోగులుగా వర్గీకరించినవారిని చార్‌కాట్ పరిశీలిస్తుండేవాడు. వీరు నాటకం ఆడటంలేదని, అబద్ధం చెప్పడంలేదనీ చార్‌కాట్ ఉద్దేశం. నరాలజబ్బు పేరిట హిస్టీరియా చికిత్సకు ఆనాడు ఏమాత్రం గౌరవం లేదు. హిస్టీరియా పేరిట ఏదైనా చేయొచ్చు. చార్‌కాట్ తన పలుకుబడి ఉపయోగించి హిస్టీరియాకు గౌరవాన్ని ఆపాదించాడు. శారీరకంగా ఎలాంటి జబ్బులేని నరాల జబ్బుకు హిస్టీరియా అని నామకరణం చేశారన్నాం గదా.

ఫ్రాన్స్‌లో గిలిటన్ బయలుదేరి ఉరి తీయడానికి సౌకర్యాలు పెంపొందించే పద్ధతులు చూపాడు. ఇది ఉరి తీసేవాడి నిమిత్తం చేసిన సంస్కరణ. అలాగే జబ్బు పేరిట నటించి, ఆస్పత్రిలో వుండడానికి చార్‌కాట్ మార్గం సులువుచేశాడు. బాగుపరచి బయటకు పంపే ఉద్దేశం లేదు. హిస్టీరియా నేడు మానసిక చికిత్స గౌరవం పొందడానికి ఫ్రాయిడ్ మొదలు ఎందరో తోడ్పడ్డారు.

హిస్టీరియా రోగి వర్ణించే లక్షణాలకు, నిజంగా జబ్బుచేసిన శారీరకరుగ్మతలు కొన్నిసందర్భాలలో పోలిక చూపవచ్చు. ఇది హిస్టీరియా రోగి వర్ణించే తీరులోనే వుంది. వైద్యుడు యీ తేడా గమనిస్తే హిస్టీరియా గుట్టు రట్టవుతుంది. కాని వైద్యుడికి అది గిట్టుబాటు కాదు. కనుక వైద్యపరిశోధకుడే యీ పనిచేయాలి. చార్‌కాట్ తన రోగులకు తానొక సేవకుడుగా భావించలేదు. వారి లక్షణాలను వర్గీకరించడమే ప్రధాన కర్తవ్యంగా పెట్టుకున్నాడు. పెత్తందారీతనంతో దబాయింపు విధానాన్ని అవలంబించిన చార్‌కాట్, శాస్త్రీయ పరిశోధనకు పూనుకోలేదు. హిస్టీరియా, హిప్నాసిస్ అనేవి పరిశోధనాంశాలైతే, చార్‌కాట్ చెప్పాడు గనుక అవే ప్రమాణాలు అని అనరు. నిత్య పరిశోధనలో రుజువుకు నిలబడ్డాయా లేదా అని చూస్తారు. హానిమన్ చెప్పాడు గనుక, హోమియో సరైనది అన్నట్లే, వేదాల్లోవుంది గనుక తిరుగులేదన్నట్లే, చార్‌కాట్ విషయంలోనూ ప్రవర్తించారు.

హిస్టీరియా నరాలజబ్బుగా చిత్రించి ప్రచారం చేయడంలో చార్‌కాట్ తనను తాను వంచించుకుంటున్నట్లు, అబద్ధాన్ని ఒక కళగా ప్రచారం చేస్తున్నట్లు గ్రహించకపోలేదు. సమాజంలో తన స్థానాన్ని నిలబెట్టుకోడానికి చార్‌కాట్ తన ప్రచారాన్ని కొనసాగించవలసి వచ్చింది. శారీరక రసాయనిక లక్షణాలు వైద్యరంగానికి చెందినవి. కాని వాటిలో నిర్ధారణ కావాలి. మానసిక,

సామాజిక లక్షణాలకు చక్కని మాటలు పనిచేస్తాయి. కనుక మరో చికిత్స పేరిట రుజువుకు నిలబడని రీతుల్ని చార్‌కాట్ మొదలు నేటివరకూ అవలంబిస్తున్నారు.

హిస్టీరియా రోగులు, ముఖ్యంగా స్త్రీలు, ఎలా అబద్ధాలు చెప్పి మోసం చేసి నటిస్తారో చార్‌కాట్ పేర్కొన్నాడు. వైద్యులకు నచ్చచెప్పడంలో వారు తమ చాకచక్యమంతా ప్రయోగిస్తారన్నారు. హిస్టీరియా దొంగజబ్బు అని చార్‌కాట్‌కు బాగా తెలుసునన్నమాట. చార్‌కాట్ తన కాలంలో రోగుల వంచన తెలిసే ఒప్పుకున్నాడు. అది అతడికి ప్రతిష్ఠను, కీర్తిని, పలుకుబడిని తెచ్చిపెట్టింది. అదే విధానం మరో రూపంలో మానసికవైద్యులు కొనసాగిస్తున్నారు. చార్‌కాట్ తన పరిశీలనలు ఏనాడూ తిరిగి చూచుకోలేదు. ఏ రోగినీ హిప్నటైజ్ చేసి పరిశీలించలేదు. కనుక తాను రోగుల్ని గురించి చెప్పేవాటి మంచిచెడులు పరిశోధనకు గురిచేసిన తీరేలేదు. ఇంకా విశేషం ఏమంటే, చార్‌కాట్ శిష్యులు రోగుల్ని హిస్టీరియా లక్షణాలతో నటించమని శిక్షణ యిచ్చిన ఉదాహరణలున్నాయి! చార్‌కాట్ మరణానంతరం యీ విషయాలు కొన్ని బయటపడ్డాయి. చార్‌కాట్ శిష్యులు ఎవరూ, గురువుకు భయపడి కాబోలు, రోగుల్ని గురించి నిజం చెప్పలేదు. చార్‌కాట్ నియంతృత్వ మనస్తత్వం కూడా యిందుకు కారణం కావచ్చు.

హిస్టీరియా గురించి చార్‌కాట్ దృష్టి ఏమంటే, రోగి తన లక్షణాలను మానవ సంబంధాలుగా చూపుతున్నాడనే, అయితే ఆ మాట బయటకు ఎందుకు చెప్పలేదంటే, ప్రజలలో హిస్టీరియా పట్ల వున్న భావన అట్టిపెట్టడానికే. సమాజంలో తన ప్రయోజనాల కోసం, నిజం కప్పిపుచ్చి, వైద్యం అనే గౌరవాన్ని హిస్టీరియాకు తెచ్చిపెట్టిన అపఖ్యాతి చార్‌కాట్‌కు దక్కాలి. చార్‌కాట్ కారణంగా ఫ్రెంచి సైన్స్ అకాడమీ హిస్టీరియాను స్వీకరించింది. 1882 ఫిబ్రవరి 13న అకాడమీకి చార్‌కాట్ తన భావాలు తెలియపరచాడు. అప్పటికీ పశు అయస్కాంతం గురించి అకాడమీ ఖండించింది. అందువలన హిస్టీరియాకు అయస్కాంతశక్తితో ఎలాంటి సంబంధం లేదని చార్‌కాట్ ప్రకటించాడు. కాని, చార్‌కాట్ చెప్పే హిస్టీరియా, హిప్నాటిజాన్ని అకాడమీ పరీక్షకు గురిచేయాలి కదా. మెస్మర్ అయస్కాంతాన్ని అలాచేసి ఖండించారు గదా. అలా చేయలేకపోవడం చార్‌కాట్ పలుకుబడికి నిదర్శనం కావచ్చుగాని, అకాడమీ శాస్త్రీయ ప్రతిష్ఠకు కాదు. హోమియోపతిలో పలుకుబడి పనిచేసి, శాస్త్రీయ పరిశీలన పక్కకు నెట్టినట్లే, హిస్టీరియాలోనూ జరిగింది!

## ఆధునిక వైద్యంలో హిస్టీరియా

భయంతో కూడిన హిస్టీరియాలో ఎందుకు ఆందోళన చెందుతున్నదీ వ్యక్తికి తెలియదని ఫెనికెల్ (Fenichel) సిద్ధాంతీకరించాడు. ఒంటరిగా వదలి వెడుతుంటే చిన్నపిల్లలు భయపడతారే, అలాంటిదే ఆందోళనాపూరిత హిస్టీరియా అంటే. పిల్లలలో యీ లక్షణాన్ని హిస్టీరియా అనం గదా.

మానసిక రుగ్మతలన్నీ మెదడుకు చెందినవేనని కార్ల్‌వెర్నిక్ అన్నాడు. కాని, మానసికం అంటే ఏమిటో నిర్ధారణ యింతవరకూ జరగలేదు. హిస్టీరియాలో కొన్ని సంజ్ఞలు దేహం ద్వారా

వెల్లడౌతాయి. ఇందులో సంఘపరమైనవి కొన్ని వున్నాయి. కాని, జబ్బువలె సూచనలు వెల్లడించడం ఎందుకంటే, జనానికి మరో విధంగా వాటిని తెలిపే రీతులు అలవాటు కాలేదు గనుక!

ఫ్రాయిడ్ వియన్నా నుండి పారిస్ వెళ్ళి చార్కాట్ వద్ద హిప్నాటిజం నేర్చి, హిస్టీరియా జబ్బేనని ప్రకటించేశాడు. అయితే రోగుల చరిత్ర తెలిసినప్పుడు, వారు రోగులు కాదని, రోగ సంబంధమైన బాధలుగాక, కుటుంబ సామాజిక బాధలే వున్నాయని ఫ్రాయిడ్ గ్రహించాడు. బంధువులను, భాగ్యాలను పోగొట్టుకున్న ఒక అమ్మాయి 18 మాసాలపాటు ఒంటరితనం అనుభవించడం ఫ్రాయిడ్‌కు బాగా తెలుసు. అలాగే తరచు కాళ్ళనొప్పులని ఫిర్యాదుచేసిన మరొక ఆమెను కూడా హిస్టీరియారోగిగా ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. ఆ రోగులకు శారీరక జబ్బుల లక్షణాలు లేవు. తమ లక్షణాలను మరొక తీరుగా మార్చి చెప్పుకుంటారని ఫ్రాయిడ్ నమ్మాడు. లైంగిక సంబంధమైన అసంతృప్తిని శారీరక బాధలుగా చూపడం ఒక తీరన్నమాట. మానసిక ప్రవర్తనను శారీరక ప్రవర్తనగా మార్చి ఫ్రాయిడ్ చూపాడు. ఇందులో పరిశోధన ఏ మాత్రం చేయలేదు. 1895లో హిస్టీరియా గురించి ఫ్రాయిడ్ రాసిన నాటికి, ఇంకా సిఫిలిస్ కనుగొనడానికి వాసర్‌మన్ పరీక్ష రాలేదు. అందుకని మనస్సు అనేమాట అడ్డం పెట్టుకొని ఫ్రాయిడ్ ప్రచారం చేశాడు. ఇలా సిద్ధాంతీకరించేవారికి ఆనాడు పేరుప్రతిష్ఠలు జనబాహుళ్యంలో త్వరగా వ్యాపించేవి. తెలిసీ తెలియని డాక్టర్లు వీటిని అనుకరించేవారు. ఫ్రాయిడ్‌పై కోఎనాలసిస్‌కు శాస్త్రీయాధారాలు లేవు. మానసికచికిత్స పేరిట వీరు ప్రచారంలోకి వచ్చారు. మనస్సు శరీరాన్ని ప్రభావితం చేస్తుందనే వీరి సిద్ధాంతంలో ప్రధాన లోపం ఏమంటే, మెదడును మనస్సుగా చిత్రించడం వీరు పేర్కొనే మానసిక లక్షణాలు పరిశోధన పరిధిలోకి రావు. మెదడు శరీరంలో భాగం. అది పరిశోధనలోకి వస్తుంది.

***- హేతువాది, అక్టోబరు 1991***

**కనుకట్టు - సమ్మోహనం గుట్టు**

# మెస్మరిజం - అసలు వాస్తవాలు

మెస్మరిజం అనే మాట బహుళ ప్రచారం పొందింది. మన సినిమాలలో, వైద్యంలో, వూళ్ళల్లో, ఎన్నో నోళ్ళల్లో మెస్మరిజం అనేమాట వింటుంటాం. అయినా మెస్మరిజం లోతుపాతులు చాలామంది తెలుచుకోకుండానే యీ మాట ప్రభావానికి లోనుగావడం మన అలవాట్ల బానిసత్వాన్ని సూచిస్తుంది. కనుక నిజానిజాలు విడమరచి చూద్దాం.

ఫ్రాంజ్ ఏంటన్ మెస్మర్ (1733-1815) ఆస్ట్రియా దేశవాసి. కాన్‌స్టన్స్ సరస్సు ఒడ్డున చిన్న ఆస్ట్రియా నగరం - 1733 మే 23న ఇజ్నార్‌లో పుట్టాడు. వైద్యం అభ్యసించక ముందు దైవశాస్త్రం చదివాడు. 1766 నాటికి వైద్యంలో కూడా డాక్టరేట్ పుచ్చుకున్నాడు. గ్రహాలు మానవుడిపై ఎలా

ప్రభావం చూపుతాయనే విషయమై సిద్ధాంతం వ్రాసి డిగ్రీ స్వీకరించాడు. 1768లో మెస్మర్ ఒక భాగ్యశాలి అయిన విధవను వివాహమాడాడు. సాంస్కృతిక జీవనంలో కళలు ఆస్వాదించి, అనుభవిస్తూ జీవితం గడిపాడు. అయినా విలాసాలతో వృధా చేయక, జ్ఞానార్జనకు కృషిచేశాడు.

ఆనాడు యూరప్‌లో కొత్తగా బహుళ ప్రచారం పొందుతున్న అయస్కాంతంతో చికిత్సపట్ల మెస్మర్ ఆకర్షితుడయ్యాడు. మరియా తెరీసా కొలువులో జ్యోతిష్యుడుగా మాక్సి మిలియన్‌హెల్ అనే జెసూట్ ఫాదరీ అయస్కాంతంతో వైద్యం చేస్తుండేవాడు. ఇది 1774 నాటిమాట. మొదట్లో నీటితో వైద్యం చేస్తుండే ఫాదరీ, క్రమేణా అయస్కాంత రాళ్ళు వాడాడు. ఒక సాంకేతిక నిపుణుడి సాయంతో భిన్న ఆకారాలు గల అయస్కాంత రాళ్ళు అతడు తయారుచేస్తుండేవాడు. రోగి శరీరంలో రుగ్మత వున్నచోట యీ అయస్కాంతరాళ్ళు పెట్టేవాడు. వియన్నా వైద్యసంఘం యీ విషయమై అతడిని పట్టించుకోలేదు. 1774 వేసవిలో వియన్నాకు వచ్చిన విదేశస్తుడు తన భార్యకు అయస్కాంత వైద్యచికిత్స చేయమని కోరాడు. హెల్ నుండి ఇదంతా మెస్మర్ నేర్చాడు. మానసిక చికిత్స కూడా హెల్ ముందుగా మెస్మర్‌కు చెప్పాడు. సంపన్న స్త్రీకి తాను ఎలా చికిత్స చేస్తున్నదీ హెల్ ఎప్పటికప్పుడు మెస్మర్‌కు తెలియజేసేవాడు. కొన్నాళ్ళకు ఆ స్త్రీకి నయమైనట్లు మెస్మర్ స్వయంగా తెలుసుకొని అయస్కాంతచికిత్స పట్ల ఆకర్షితుడయ్యాడు.

1774-1776 అయస్కాంత చికిత్సలు చేసిన మెస్మర్, విశ్వవ్యాప్తంగా ద్రవపదార్థం వుంటుందని నమ్మాడు. అదే అయస్కాంత ప్రభావానికి మూలం అనుకున్నాడు. అయస్కాంతం కేవలం కొన్ని అంగుళాల మేరకే ప్రభావం చూపుతుందని మెస్మర్‌కు తెలుసు. కనుక అయస్కాంతంలో దాగివున్న శక్తులు వున్నాయని, అవే రోగాన్ని నయం చేస్తున్నాయని విశ్వసించాడు. రోగం వున్నదని భ్రమించి వచ్చే రోగులపై మెస్మర్ చికిత్స బాగా పనిచేసింది. అయస్కాంత రాళ్ళు సర్వాంతర్యామి శక్తిలో భాగం అని మెస్మర్ నమ్మిన తరువాత, నీటిని ఆ రాళ్ళతో అయాస్కాంతీకరణ గావించి రోగులచేత తాగించేవాడు. పింగాణి కప్పులు, పళ్ళాలు, బట్టలు, పరుపులు, అద్దాలు అయస్కాంతీకరణ చేసేవాడు. విద్యుత్‌వలె అయస్కాంత ద్రవం కూడా అట్టిపెట్టి, ఇతర వస్తువులకు అందించవచ్చని మెస్మర్ భావన. పెద్ద తొట్లు తయారుచేసి అందులో రెండు వరసల సీసాలు అమర్చి, వాటి మూతలకు బెజ్జాలు పెట్టి, వాటి నుండి ఇనుపచువ్వలు పైకి వచ్చేటట్లు చేసి, రోగులను ఆ ఇనుపచువ్వలను తాకమనేవాడు. సామూహికంగా రోగులు తొట్టిలో కూర్చొని యీ చికిత్స పొందేవారు. ఒకరి చేతులు మరొకరు పట్టుకొని కూర్చుంటే అయస్కాంతం ఒకరి నుండి మరొకరికి ప్రాకుతుందని మెస్మర్ నమ్మించాడు.

మెస్మర్ పలుకుబడి, కీర్తి ఆనోటా ఆనోటా పడి బాగా వ్యాపించగా రానురాను అయస్కాంత రాళ్ళతో పనిలేదని, తన వ్యక్తిత్వ ప్రభావంతో చికిత్స చేయవచ్చని మెస్మర్ గ్రహించాడు. లోగడ ఎవరికైనా నయమైందంటే అది తన వ్యక్తి ఆకర్షణ ప్రభావం వల్లనేనని కూడా అతను గ్రహించాడు. తానే ఒక అయస్కాంతం అని మెస్మర్ ఊహించాడు. 1776 నుండి

అయస్కాంత రాళ్ళకు తిలోదకాలిచ్చాడు. ఆ తరువాత తమ మాటల మూటలతోనే చికిత్సకు ఉపక్రమించి కొనసాగించాడు.

ఆనాటి శాస్త్రజ్ఞులు మెస్మర్ చికిత్సను శాస్త్రీయం కాదని ఖండించారు. అయస్కాంత ప్రభావ పరిమితులు శాస్త్రజ్ఞులకు తెలుసు. కాని నయమైనదని చెప్పే రోగుల సాక్ష్యాలను మెస్మర్ వాడుకొని, తన చికిత్సను అలాగే చనిపోయేవరకూ చేశాడు. కనుకట్టు విద్యగా అది ప్రచారంలోకి వచ్చింది.

అయస్కాంత ప్రభావం శరీరంలోని అన్ని భాగాలలో వ్యాపించి ఉంటుందనీ, నరాలపై దీని ప్రభావం పడుతుందనీ 1775లో మెస్మర్ ఒక వైద్యుడికి రాశాడు. పశువుల అయస్కాంతం కూడా వున్నదని మెస్మర్ నమ్మాడు. మూర్చలు, ఉదాశీనత, మంకు మొదలైన లక్షణాలు నయంచేసే అయస్కాంత పరిశోధనలు చేస్తున్నట్లు మెస్మర్ పేర్కొన్నాడు. సూచన (Suggestion) అనేది వైద్యంలో భాగంగా మారిందన్నమాట. నిజమైన శారీరక రుగ్మతలు వుంటే మెస్మర్ చికిత్సకు స్వీకరించేవాడు కాదు. తనకేవో జబ్బు లక్షణాలున్నాయని భ్రమించేవారినే మెస్మర్ తీసుకునేవాడు. నరాల జబ్బున్న వారినే తాను చికిత్సకు చేర్చుకుంటానని మెస్మర్ స్పష్టం చేశాడు. అక్కడే అతడి కిటుకు పనిచేసింది. ఇదే మెస్మరిజంలో ఆకర్షణ. శరీరాన్ని బాధిస్తూ పైకి కనిపించే రోగలక్షణాలు అయస్కాంత చికిత్సకు పనికి రావన్నాడు. మాటలు, ఉపమానాలు సూచనలుగా పనిచేస్తాయని, అవి నరాల జబ్బున్న మానసిక రోగులకే పరిమితం అని మెస్మర్ వాదన!

హస్తలాఘవం, కనికట్టు, మాటల ఉపమానాలు అనేవి మెస్మర్ ప్రయోగించిన ఆయుధాలన్నమాట. రోగంతో బాధ వున్నట్లు చెప్పే శారీరక భాగాల్ని మెస్మర్ తాకి నిమిరేవాడు. ఆ విధం నయమైతే అది వైద్యమే ననేవాడు. అదే చేతి చలవ (అయస్కాంత ప్రభావం) అనేవాడు. తన అబద్ధాలను తానే నమ్మడం, ప్రచారం చేయడం, రోగుల్ని నమ్మించడం మెస్మర్ పనిగా కొనసాగించాడు. ఖనిజ సంబంధమైన అయస్కాంతం రోగిని నయం చేస్తుందనకుండా, అయస్కాంత ప్రభావం వేరే వుందని మెస్మర్ అనేవాడు. మనుషుల్లో మార్మికంగా అయస్కాంతశక్తి గర్భితమై వుందన్నాడు.

ఆనాటి శాస్త్రజ్ఞులు మెస్మర్‌ను తీవ్రంగా ఖండించారు. పశు అయస్కాంతం అనే పేరిట మెస్మర్ ప్రచారంలో పెట్టిన భావనకు ఆధారాలేవీ లేవన్నారు. అయస్కాంత రాళ్ళకు బదులు, అయస్కాంత ప్రభావం గల చేతిస్పర్శ మెస్మర్ ఆకర్షణగా ప్రచారంలోకి వచ్చింది.

నమ్మకంతో నయం అవుతుందనే వారికి మాటల ఆకర్షణ ప్రధాన లక్షణం. మెస్మర్ ఆనాడు ప్రయోగించింది అదే, మతపరంగా చేస్తున్నవారి ఆయుధమూ అదే. హోమియోవారు నేడుచేస్తున్నదీ యిదే. కొంతవరకు ఆయా నమ్మకం చికిత్సకారుల విచిత్ర వేషధారణ కూడా పనిచేస్తుంది. వారు వాడే కొన్ని వింత పరికరాలు కూడా దోహదం చేస్తాయి. నమ్మకం, భయం రోగిలో వుండగా అవే వైద్యుడికి అక్కరకు వస్తాయి.

ఫ్రాలిన్ పేరడిస్ అనే బాలిక 1763 డిసెంబరు 9 ఉదయం హఠాత్తుగా తన చూపు పోయిందని తెలుసుకున్నది. ఆ బాలిక వయస్సు 4 ఏళ్ళు. కంటి నరం పక్షవాతంతో వున్నందున యిది నయం కాదని వైద్యులు చెప్పారు. తల్లిదండ్రుల సంప్రదాయంగా ఆ బాలికకు పియానో వాయించడం అలవాటైంది. రాణి కొలువులో ఆమె తల్లిదండ్రులు పనిచేసేవారు. ఆ బాలిక ప్రతిభ రాణిని ఆకర్షించింది. 10 ఏళ్ళపాటు వియన్నాలో అత్యుత్తమ కంటివైద్యుడు చికిత్స చేసినా చూపు రాలేదు. ఈలోగా పియానోపై తన ప్రతిభను చూపుతున్న పేరడిస్ (మరియాతెరీసా అని కూడా పిలిచేవారు) లండన్, ప్యారిస్ మొదలైన చోట్ల కచేరీలు చేసి, గుడ్డి అమ్మాయి అద్భుతంగా పియానో వాయించడం పట్ల అందర్నీ ఆకట్టుకున్నది. కంటివైద్యుడు ఏంటన్ వాన్ స్టార్క్ 14 ఏళ్ళ ప్రాయంగల ఆ అమ్మాయి కంటి నరం చెడలేదని నిర్ణయించాడు. కాని అతడి చికిత్స పనిచేయలేదు. గుడ్డితనాన్ని నటనగా ఆమె వాడుకుంటుందన్నమాట. అది గిట్టుబాటు గుడ్డితనం.

అలాంటి దశలో మెస్మర్ తటస్థపడ్డాడు. శారీరకంగా కంటిజబ్బు వుంటే నయం కాదని, లేకుంటే చికిత్స చేయవచ్చనీ చెప్పాడు. 1776లో మెస్మర్ ఆమెకు చికిత్స ప్రారంభించాడు. 1777 నుండీ ఆమె మెస్మర్ చికిత్సాలయంలో వుండగా, కొద్దివారాలలోనే చూపు కొంతమేరకు వచ్చింది. తల్లిదండ్రులు సంతోషించారు. మొదటిసారి చూపు వచ్చినప్పుడు ఎదుట వున్న మెస్మర్‌ను చూచి, ఎంత భయంకర దృశ్యం అని ఆమె వ్యాఖ్యానించింది. చూపు వచ్చిన తరువాత ఆమె మానసికంగా కృంగిపోయింది. బంధుమిత్రులను చూచినప్పుడు మూర్ఛ పోతుండేది. ఆమె హిస్టీరియా జబ్బుతో వుందని బయటపడింది. కావాలని గుడ్డితనం నటించిన ఫలితమిది.

వియన్నాలో జోసెఫ్‌బార్త్ ఆధ్వర్యాన వైద్యబృందం పరిశీలించి మెస్మర్‌ను తీవ్రంగా విమర్శించింది. ముందున్న వస్తువుల్ని మరియాతెరీసా పేరడీస్ యింకా గుర్తించలేకపోతున్నదని వారు వెల్లడించారు. అంతటితో మెస్మర్ ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఆ అమ్మాయికి చూపు వచ్చి వుంటే (మెస్మర్ చెబుతున్నట్లు) రాణి యిచ్చే డబ్బు ఆమె తల్లిదండ్రులకు యిక యివ్వనవసరం లేదన్నారు వైద్యులు. పియానో వాయించే కచేరీలలో ఆమె పట్ల ఆకర్షణ సగం పోవడం ఖాయమన్నారు. దీంతో ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తెను తమకు అప్పగించమని మెస్మర్‌ను కోరారు. మెస్మర్ కుంగిపోయాడు తన ప్రతిష్ఠ దెబ్బ తిన్నందుకు!

మెస్మర్ - రోగిగా వున్న మరియాతెరీసా ప్రేమికులుగా వున్నట్లు సమాజంలో ప్రాకిపోయింది. వియన్నాలో యీ విషయం దుమారం వలె అల్లుకపోయింది. ఈ ఫార్సుకు అంతం పలుకమని రాణి మెస్మర్‌ను ఆదేశించింది. 1777 మే 2న మెస్మర్ ఆ ప్రేమికురాలిని తల్లిదండ్రులకు అప్పగించాడు. ఆమె వయస్సు 18 ఏళ్ళు.

తల్లిదండ్రుల వద్దకు చేరిన మరియా తెరీసాకు మళ్ళీ చూపులేదు. గుడ్డితనాన్ని ఆమె ఆనందించింది. అలాగే పియానో కచేరీలు చేసి కీర్తి ఆర్జించింది. మొజార్ట్ కూడా ఆమె కోసం

ప్రత్యేకంగా సంగీతం సమకూర్చాడు. 1784లో పారిస్‌లో అంధురాలుగా ఆమెను జనం పొగుడుతుంటే, అపఖ్యాతి పాలైన మెస్మర్ అక్కడే వున్నాడు!

1778లో వియన్నా నుండి పారిస్ వెళ్ళిపోయిన మెస్మర్ ఎకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడి వద్దకు చేరి తన మెస్మరిజాన్ని శాస్త్రీయంగా పరిశీలించమన్నాడు. అధ్యక్షుడు ఛార్లస్ లి రాయ్ యీ విషయం పరిశీలించడానికి మెస్మర్‌ను రాసి యివ్వమన్నాడు. మెస్మర్ 27 ప్రతిపాదనలు రాశాడు. చికిత్స సంపూర్ణతకు తన విధానం పరాకాష్ఠ అని మెస్మర్ గొప్పలు చెప్పుకున్నాడు. తన వైద్యవిధానం ప్రచారం చేయడానికి ప్రభుత్వం నియమించిన మతసంస్థ కావాలన్నాడు. ప్రభుత్వం, మతంతో నిమిత్తం లేకుండా సైన్సు పరిశోధన జరుగుతున్న పునర్వికాస కాలంలో మెస్మర్ అలా కోరాడు.

1778లో మెస్మర్, విశ్వసమాజం అనే రహస్య సంస్థ పారిస్‌లో స్థాపించి తన వైద్య ప్రచారానికి పూనుకున్నాడు. దీని శాఖలు ఫ్రాన్స్‌లో ఏర్పడ్డాయి. మెస్మర్‌కు ఆదాయం పెరిగింది. తాను కనుగొన్న పశు అయస్కాంతం తనకు తప్ప ఎవరికీ తెలియదని, దీనిని ఖండించే అధికారం ఎవరికీ లేదని ప్రచారం చేసుకున్నాడు. ఛార్లస్ ది ఎస్లాన్స్, నికొలస్‌బెరగస్ అనే యిరువురు శిష్యులు మెస్మర్‌కు బాగా ప్రచారం చేసి పెట్టారు.

1784 మార్చి 12న లూయి 16 ఒక విచారణ కమిషన్ మెస్మర్ గురించి నియమించారు. ఇది సైన్స్ అకాడమీ కోరికపై జరిగింది. మెస్మర్ శిష్యుడు ఛార్లస్ ఆస్పత్రిలో విచారణ సాగించారు. రసాయన శాస్త్రజ్ఞుడు ఏంటొని లవోసియర్, జీన్‌సిల్వన్ బెయిలీ (ఖగోళ శాస్త్రజ్ఞుడు) జోసెఫ్ఇగ్నాస్ గిలొటన్ (వైద్యుడు - గిలొటన్ ఉరి ఇతడిపేర వచ్చింది) బెంజమిన్ ఫ్రాంక్లిన్ (అప్పట్లో అమెరికా రాయబారిగా ఫ్రాన్స్‌లో వున్న సైంటిస్టు) కమిషన్‌లో వున్నారు.

మెస్మర్ చికిత్సలో అయస్కాంత ప్రభావం ఏదీ లేదని కమిషన్ కనుగొన్నది. ఇదంతా తప్పుడు శాస్త్రంగా తేల్చారు. మెస్మర్ వైద్యంలో చికిత్సపొంది నయం అయిందన్నవారిలో చాలామంది శారీరక రోగులు కాదని కమిషన్ కనుగొన్నది. నిజంగా జబ్బున్న ఇద్దరు వ్యక్తులపై మెస్మర్ అయస్కాంత చికిత్స ప్రభావం ఏమీ లేదని గమనించారు. ఒకామె ఉబ్బసం రోగి. సెంట్ ఆర్మన్ అనే విధవ, మరొక యువతి అన్సం. ఆరేళ్ళ క్షయరోగి బాలిక కూడా ఎలాంటి నివారణ పొందలేదు.

మెస్మర్ శాస్త్రీయ పంథా తప్పుడుది అని కమిషన్ క్షుణ్ణంగా పేర్కొన్నది. మెస్మర్ చెప్పే ద్రవం లేదని కూడా చెప్పింది. 1784 ఆగస్టు 11న కమిషన్ తుది నివేదికలో మెస్మర్‌ను ఖండించింది. మెస్మర్ పేర్కొన్న విశ్వద్రవ్య పదార్థ చర్య ఏదీ కనిపించలేదనీ, కొందరిలో వూహల కారణంగా శరీరంలో మూర్ఛలు వస్తున్నాయనీ చెప్పారు. ఊహలు రాకుండా అయస్కాంతం చేయగలిగిందేమీ లేదన్నారు. ·అయస్కాంతం శూన్యం. ఊహే అతిముఖ్యం అన్నారు. అంటే

మెస్మర్ చికిత్స మానసిక సంబంధమే తప్ప, శరీరానికి వస్తే అతడేమీ చేయజాలడన్న మాట. పశు అయస్కాంతం అనేది సందేహాస్పదం అని బెంజమిన్ ఫ్రాంక్లిన్ పేర్కొన్నారు. ఇలాంటి వాటి ఆధారంతో చికిత్స చేయబూనడం భ్రమే అన్నాడు. ఈ విధంగా కమిషన్ నివేదిక మెస్మర్‌కు వ్యతిరేకంగా వచ్చింది. 1785లో ఆయన కుడిభుజం వంటివారు కూడా మెస్మర్‌కు ఎదురు తిరిగారు. అయస్కాంత చికిత్స గురించి ఆయన అనుచరుడు బెర్గాసే ఉపన్యాసం యివ్వడాన్ని మెస్మర్ ఖండించాడు. రహస్యం బట్టబయలు చేసినట్లు భావించాడు. త్వరలోనే మెస్మర్ పారిస్‌కు స్వస్తి పలకవలసి వచ్చింది.

1799లో మెస్మర్ (అది 1957లో ఇంగ్లీషులో జెరోం ఈడెన్ అనువదించారు) మానసిక రుగ్మతకు భౌతిక ఆధారం (అయస్కాంతం) కనుగొన్నవాడిగా తనకు గుర్తింపు రావాలని ఆకాంక్షించాడు. ప్రకృతి శాస్త్రంలో కొత్త సూత్రాలు కనుగొన్నట్లు మెస్మర్ భావించినా, అది రుజువు కాలేదు. మనుషులకు, జంతువులకు అయస్కాంత ద్రవ్యం వుందని మెస్మర్ వూహించాడు. ఇది ఇతరులు చూడలేరని, తనకు మాత్రమే తెలిసిన దేవతావస్త్రాలుగా మెస్మర్ పేర్కొన్నాడు! ఈ విశ్వద్రవ్యం మెస్మర్ దృష్టిలో సర్వరోగనివారిణి. మెస్మర్ సృష్టించుకున్న కల్పనాలోకం నిజమని నమ్మాడు. భక్తితో రోగాలు కుదురుతాయనే వారికీ మెస్మర్‌కూ తేడా లేదు. అయితే శరీరానికి వచ్చిన రోగాలు మెస్మర్ చికిత్స వలన నయం కాలేదు. రోగాలన్నీ నయం చేయవచ్చుగాని రోగుల్ని కాదని మెస్మర్ చెప్పాడు! రోగలక్షణాలు శరీరానికి లేనప్పుడు అవి మానసిక చికిత్సలో ప్రధాన భాగాలుగా చెప్పారు. ఇలామానసిక రోగాలు కుదుర్చుతామనే మెస్మర్ వంటివారే నేటి చికిత్సకు ఆధారమయ్యారు. నయం కావడం, కాకపోవడం ఆయా వైద్యుల మాటల ప్రతిభ, నాటకీయత, రోగుల మనోలక్షణాల బట్టి వుంటుందన్న మాట! ఇదీ మెస్మర్ కథ.

కనుకట్టు విద్యగా నేటికీ యిది ప్రచారంలో వుంది!

***- హేతువాది, నవంబరు 1991***

ఫ్రాయిడ్ సృష్టించిన కొత్త మతం

# ఫ్రాయిడ్‌లో నిజాలు - భ్రమలు

సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా వుంది. మార్క్సు భావాలు ఎంతగా ఆకర్షించాయో, మానసికరంగంలో ఫ్రాయిడ్ యీ శతాబ్దంలో అంతగా ఆకర్షించాడనవచ్చు. విచిత్రమేమంటే అత్యధిక సంఖ్యాకులు మతాన్ని గుడ్డిగా అనుసరిస్తున్నట్లే, ప్రశ్నించకుండా నమ్ముతున్నట్లే. ఫ్రాయిడ్ ఎవరో, ఏం చెప్పాడో, ఏం చేశాడో తెలుసుకోకుండానే అనుసరిస్తున్నారు. ఈ లక్షణాలు చదువుకున్నవారిలో కనిపిస్తున్నందున మనం యింకా జాగ్రత్తగా పరిశీలించాలి.

అమెరికాలో సుప్రసిద్ధ సైకియాట్రిస్ట్, హ్యూమనిస్ట్ థామస్ సాజ్ (Thomas Szaajz) గత

ముప్పయ్ సంవత్సరాలుగా మనోవిజ్ఞానరంగంలో నిజం చెప్పి, ఎదురీదుతున్నాడు. ఫ్రాయిడ్ గురించి ఆయన పరిశోధనలు, ఆయన పేర జరుగుతున్న విషయాలు చాలా జాగ్రత్తగా పరిశీలించి చెప్పాడు. ఫ్రాయిడ్‌కు అలవాటుపడిన వారికి కొన్ని వింతగానూ, కొన్ని షాకింగ్‌గానూ వుంటాయి. శాస్త్రీయ పరిశీలనలో యివి సర్వసాధారణమే.

వియన్నా విశ్వవిద్యాలయం నుండి 1881లో ఫ్రాయిడ్ ఎం.డి. డిగ్రీ స్వీకరించాడు. వియన్నా జనరల్ హాస్పిటల్‌లో రెండేళ్ళు పనిచేశాడు. మనం హవుస్ సర్జన్ అంటామే అదన్నమాట. మొదట్లో నిపుణుడుగా అవుదామనే ఆలోచన లేకున్నా 1883లో అభిప్రాయం మార్చుకున్నాడు.

పారిస్ వెళ్ళి 1885 అక్టోబరు నుండి 1886 ఫిబ్రవరి వరకూ అంటే నాలుగున్నర మాసాలు సుప్రసిద్ధుడైన జాన్ మార్టిన్ చార్కాట్ వద్ద వున్నాడు. 1887 నుండి 1888 వరకూ మెదడు పై పుస్తకం రాయడానికి గాను అధ్యయనం చేశాడు. అదెందుకో గాని పూర్తి కానేలేదు. 1891లో నరాల విషయమై (APhosia) ఫ్రాయిడ్ సుప్రసిద్ధ గ్రంథం ప్రచురితమైంది. 1883 నుండీ 1897 వరకూ నరాల విషయం బాగా పట్టించుకొని, ఫ్రాయిడ్ అందలి లోతుపాతులు అధ్యయనం చేశాడు.

వియన్నాలో వైద్యవృత్తి చేసున్న సుప్రసిద్ధుడు జోసెఫ్ బ్రాయర్ (Joseph Breuer) 26వ ఏట నుండి ఆ రంగంలో వున్నాడు. ఆయన వద్దకు వచ్చే రోగులలో 21 సంవత్సరాల అనా ఓ అనే ఆమె హిస్టీరియా లక్షణాలతో వుండేది. తన జీవితంలో ఎదుర్కొన్న అనేక విషయాలను డాక్టర్‌తో మాట్లాడితేనే ఆమెకు ఉపశమనం. వూరట లభించాయని "మాట్లాడే చికిత్స"గా ఆమె ఆ చికిత్సా విధానానికి పేరు పెట్టింది. ఫ్రాయిడ్, బ్రాయర్‌లు యీ పద్ధతికి ఉత్తరోత్తరా కథార్సిస్ అని పేరు పెట్టారు. మనో విశ్లేషణలో యీ పద్ధతి, అభివృద్ధి చెందని ప్రాథమిక దశగా ఫ్రాయిడ్ చెప్పాడు. ఇది గ్రీక్ మాట.

అనా ఓ ఏం చేసింది? తన జబ్బు లక్షణాలను తానే అనుకరించి డాక్టర్ బ్రాయర్‌తో మాట్లాడింది. అంటే జబ్బు లక్షణాలు ఆమెకు తెలుసనన్నమాట. కనుక ఆ లక్షణాలను తెచ్చిపెట్టుకొని రోగిగానూ, డాక్టర్‌తో ఆ లక్షణాల గురించి మాట్లాడి మామూలు వ్యక్తిగానూ మారిందన్న మాట. మానసిక రోగులు కావాలని జబ్బు తెచ్చుకోవడం చాలా సందర్భాలలో బయటపడింది.

గ్రీకుల నాటకాలలో, ముఖ్యంగా అరిస్టాటల్ కెథార్సిస్ పద్ధతిని స్టేజిపై చూపారు. గ్రీకు సాహిత్యాన్ని ఫ్రాయిడ్ చదివాడు. గ్రీకులలో ఉపవాసం, మాట్లాడడం ద్వారా ఉపశమనం పొందటం అలవాటే. విషాదాంత నాటకాలలో ప్రేక్షకులపై ప్రభావాన్ని చూపెట్టే ఉద్వేగరీతుల్ని కెథార్సిస్ అన్నారు. ఫ్రాయిడ్ వీటినే తన చికిత్సా విధానంలో ప్రవేశపెట్టాడు. ఫ్రాయిడ్ కనుగొన్నట్లు ప్రచారంలోకి వచ్చిన పద్ధతి ఇదే.

ఫ్రాయిడ్ తన సొంత వైద్యవృత్తికి 1886లో నాంది పలికాడు. అప్పటికి ఆయన వయస్సు 30 సంవత్సరాలు. వియన్నాలో నరాల జబ్బు నిపుణుడుగా ప్రారంభించాడు. వారానికి మూడు పర్యాయాలు కాసోవిట్జ్ సంస్థలో చిన్న పిల్లల నరాల జబ్బుకు వైద్యుడుగా వెళ్ళేవాడు. అప్పుడే తీరిక వుండేది గనుక అనువాదాలు చేయడం, పుస్తక రచనలో నిమగ్నుడయ్యాడు. నరాల జబ్బు నయం చేసుకోడానికి వచ్చిన రోగులనుండి ఫీజు వసూలుచేసేవాడు. అప్పట్లో ఎలక్ట్రోథెరపీ విరివిగా వినియోగించేవాడు. దీనితో పాటు మర్దన, స్నానాలు చేయించడం కూడా చికిత్సలో భాగంగా వుండేది. ఆరేళ్ళపాటు యీ విధానం సాగించిన తరువాత ఫ్రాయిడ్ దారి మళ్ళించాడు. నరాల్లో ఉత్తేజం కలిగించడానికి విద్యుత్ ప్రసరింపజేసే పద్ధతి ఆనాడు బహుళ ప్రచారంలో వుండేది.

తరువాత హిప్నాసిస్ విధానం చేబట్టిన ఫ్రాయిడ్, 1889 వరకూ ఆ పద్ధతి అనుసరించాడు. నరాల జబ్బుకు అది ఉత్తమ చికిత్స అని అప్పట్లో నమ్మకం ప్రబలివుంది. ఇందులో కూడా వైద్యుడు రోగి మధ్య సంభాషణ ప్రధానం అని గుర్తుంచుకోవాలి. ఫ్రాయిడ్ తన రోగుల్ని పండుకోబెట్టి ఎదురుగా తానొక కుర్చీపై కూర్చొని మాట్లాడడం అలవాటు చేసుకున్నాడు. జీవితాంతం యీపద్ధతి ప్రయోగించాడు. కేంద్రీకరించి మాట్లాడే పద్ధతిని రోగులపై ప్రయోగించి, రోగిని కూర్చోబెట్టి కళ్ళు మూసుకోమని, ఒక రోగలక్షణంపై కేంద్రీకరించమని చెప్పి, జ్ఞాపకం వచ్చినంత వరకు రోగం ఎలా ఆరంభమైందో గుర్తు తెచ్చుకోమనేవాడు. రోగికి యిలాంటి చికిత్సా విధానాన్ని 1892లో ఆరంభించిన ఫ్రాయిడ్, ఎంతసేపూ ఏమీ గుర్తుకు రాని ఒకామెకు, నొసలు నొక్కి జ్ఞాపకం వస్తాయని చెబుతూ పోయాడు. రోగి తనతో మాట్లాడడానికి అయిష్టంగావున్నపుడు యిలాంటి పద్ధతిని ఫ్రాయిడ్ వాడేవాడు. 1895 వరకూ తన చికిత్సను కెథార్సిస్ విధానం అని స్టడీస్ఇన్ హిస్టీరియాలో రాసుకున్నాడు.

## సైకో ఎనాలసిస్ :

మొట్టమొదటగా 1896లో సైకో ఎనాలసిస్ అనే మాటను ఫ్రాయిడ్ వాడాడు. జోసెఫ్ బ్రాయర్ విధానం వలన సైకో ఎనాలసిస్ పద్ధతికి తాను దారితీసినట్లు ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. జీవితమంతా ఆ మాటనే వాడాడు.

ఫ్రాయిడ్ నరాల జబ్బులకు చికిత్స చేసేవానిగా ఆరంభించి, కేవలం వైద్యం చేయడం గాక, జబ్బుకు మూలం ఏమిటో తెలుసుకోవాలనుకునేవాడు. విల్‌హెల్మ్ ఫ్లయిస్‌తో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా యీ విషయం వెల్లడైంది. శాస్త్రీయ మనోవిజ్ఞాన పథకం కూడా చేయాలని తలపెట్టాడు. వైజానిక స్థాయికి మానసిక రీతుల్ని తీసుకరావాలని ఆయన ఉద్దేశించాడు. వ్యక్తి మనస్సులో (మెదడులో?) రెండురకాల నరాలున్నాయని, ఒక విధమైనవి ఎలాంటి అవరోధాలు లేకుండా ప్రత్యక్ష జ్ఞానాన్ని అట్టిపెట్టగా, రెండో రకమైనవి జ్ఞాపకాలను వుంచుతాయన్నాడు. మెదడులో జరిగే వాటికి ఉపమానాలతో వివరణ యివ్వడం 1895 నుండీ ఫ్రాయిడ్ చేసిన

విధానమే. శాస్త్రీయ రుజువుల జోలికి పోకుండా పద ప్రయోగంతో మెదడులోని రీతుల్ని వర్ణించడమే ఫ్రాయిడ్ శాస్త్రీయ పద్ధతి. ఫ్లయిస్‌కు రాసిన ఉత్తరాలలో ఫ్రాయిడ్ తన వైద్యరంగపు అసంతృప్తిని కప్పిపుచ్చి, పెద్ద మాటలతో నరాల జబ్బుల్ని చిత్రించడాన్ని గమనించవచ్చు. ప్రాక్టీస్ అంతగా లేని తనకు, చార్కాట్ పేరు బాగా అక్కరకొచ్చినట్లు ఫ్రాయిడ్ 1888 ఫిబ్రవరి 4న ఫ్లయిస్‌కు రాసిన ఉత్తరంలో పేర్కొన్నాడు. రోగుల దగ్గరకు వెళ్ళడం, మాట్లాడడం అనేది నా వృత్తిలో ముఖ్య అంశం కాగా, నా కాలమంతా అలానే వృధా అవుతున్నదన్నాడు. వైద్యవృత్తిలో మరే రంగానికీ తాను అర్హుడిని కాదు గనుక నరాల జబ్బు చికిత్సకు పరిమితం గాక తప్పలేదన్నాడు. జనరల్ ప్రాక్టీసు చేయడానికి వయస్సు మించిపోయిందని అదంతా నేర్చుకునే వ్యవధి లేదన్నాడు. ఈ దృష్ట్యా నరాల జబ్బులపై ఫ్రాయిడ్ దృష్టి కేంద్రీకరించి, తన విధానాన్ని వ్యాప్తిలోకి తెచ్చాడు.

నరాల జబ్బుకు మూలం సెక్స్ (లైంగికం) అని ఫ్రాయిడ్ అభిప్రాయపడడానికి చార్కాట్, బ్రాయర్, ఫ్లయిస్‌లు తొలుత కారణం. ఒక్కసారి అలాంటి నిర్ధారణకు వచ్చిన తరువాత ఫ్రాయిడ్ యీ రంగంలో యింకా సాగదీశాడు. అతిగా సెక్స్ జీవనం గడపడం వల్ల న్యూరస్తేనియా అనే జబ్బు వస్తుందన్నాడు. ఫ్రాయిడ్ ఎప్పుడూ పోలికలు ఉపమానాలతో తప్ప, శాస్త్రీయ పరిశోధనతో నిర్ధారణకు రాలేదు. అతడి ఉపమానాలే జనాన్ని ఆకర్షించాయి. పురుషులలో న్యూరస్తేనియా అనే నరాల జబ్బు రావడానికి హస్తప్రయోగం ప్రధాన కారణం. కాగా, ఇది యవ్వనంలో బయటపడుతుందని ఫ్రాయిడ్ చెప్పాడు. హస్తప్రయోగం వలన పిచ్చి వస్తుందని ఆనాటి సైకియాట్రీ చెప్పింది. ఫ్రాయిడ్ ఇది పట్టించుకోలేదు. యవ్వనంలో స్త్రీతో సంబంధం వున్న పురుషులకు నరాలజబ్బు రాదన్నాడు. స్త్రీలలో యవ్వనంలో లైంగిక సంబంధాలు నరాల జబ్బుకు దారితీస్తుందన్నాడు. అంటే స్త్రీలకు ఒక రకంగానూ పురుషులకు మరో విధంగానూ అతడు రోగనిర్ధారణ చేశాడన్న మాట. లైంగిక సంబంధమైన విషయాలలో ఫ్రాయిడ్ తన అనుభవాల రీత్యా సిద్ధాంతీకరించినట్లు కూడా రాసుకున్నాడు. నరాల జబ్బుకు మరో కారణం కూడా ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. సంభోగం సంతృప్తిగా జరిగనప్పుడు నరాల జబ్బుకు దారితీస్తుందని, ఇది పూర్తిగా నయం చేయలేకపోయినా, కొంతవరకు ఆపవచ్చునన్నాడు. సుఖరోగాలైన సిఫిలిస్, గనేరియాను దృష్టిలో పెట్టుకొని యిలా చెప్పాడు. లైంగిక కారణాలుగా నరాల జబ్బు వస్తుందని ఫ్రాయిడ్ చెప్పడంలో ఉపమానాల ప్రాధాన్యతే తప్ప, శాస్త్రీయ పరిశోధన, నిర్ధారణ ఏదీ లేదు.

సైకో ఎనాలసిస్ పేరిట ఫ్రాయిడ్ రాయదలచిందంతా 1906 లోపు రాశాడు. హిస్టీరియా, కలలు, అణచిపెట్టే భావాలు, చిన్నప్పటి లైంగికం, అచేతన అవస్థ గురించి ఫ్రాయిడ్ అభిప్రాయాలు లోకానికి తెలిశాయి. ప్రపంచం వీటిని చర్చించింది. ఫ్రాయిడ్‌కు వ్యతిరేకత, అనుకూలత వెల్లడైంది. ఫ్రాయిడ్ పేర్కొన్న రంగంలో శాస్త్రీయ పరిశోధన జరగనందున క్రమపద్ధతిలో భిన్న భావాలు వ్యక్తమయ్యే అవకాశం అప్పట్లో లేదు కనుక ఫ్రాయిడ్ చెప్పింది జనాకర్షణ పొందింది.

ఈ విషయాన్ని గ్రహించిన ఫ్రాయిడ్ తన సైకో ఎనాలసిస్ భావాల్ని వ్యాపింపజేయడానికి తీవ్ర స్థాయిలో ఉద్యమించాడు.

## అంతర్జాతీయ సైకో ఎనాలసిస్ సమితి :

వ్యాపార రంగంలో కొత్తగా వచ్చిన సరకు అమ్మడానికి వినియోగించే పద్ధతులన్నీ ఫ్రాయిడ్ ప్రయోగించి సఫలుడయ్యాడు. సైకో ఎనాలసిస్ ఉద్యమంలో ఎక్కువగా యూదులు ఉన్నారు. యూదుల పట్ల వ్యతిరేకత, జుగుప్స వున్నదన్న సత్యం అతడికి తెలుసు. యాడ్లర్, కార్ల్ అబ్రహం, ఎల్.హెచ్. స్టెకల్, ఫెరెంజి వంటి సైకో ఎనాలసిస్ ప్రముఖులంతా ఫ్రాయిడ్ అనుచరులేగాక, యూదులు కూడా. పైగా సెక్స్ గురించి మాట్లాడటం కూడా సమాజంలో కొంత వ్యతిరేకతను కలిగిస్తుంది. కనుక జనాకర్షణ పద్ధతులు అవలంబించడానికి గాను, యూదు కాని ప్రసిద్ధుడిని సైకో ఎనాలసిస్ సమితికి నాయకుడిగా చేయదలిచాడు. కార్లగస్టావ్‌యుంగ్ (Jung) ను అంతర్జాతీయ సైకో ఎనాలసిస్ సమితి అధ్యక్షుడుగా ప్రతిపాదించాడు. యూదులు ఇందుకు వ్యతిరేకత చూపగా, వారికి నచ్చజెప్పి, యూంగ్‌కు జాతి విద్వేషం వున్నా తన కోసం వదులుకోడానికి సిద్ధపడ్డాడని యూదు వ్యతిరేకత మానేసి తనతో స్నేహంగా వుండడానికి ఒప్పుకున్నాడని ఫ్రాయిడ్ తన తోటి యూదులకు చెప్పాడు. వియన్నా స్టెకల్‌హోటల్‌లో యూదులకు యిలా నచ్చచెప్పిన అనంతరం, కార్ల్‌యూంగ్ అధ్యక్షుడయ్యాడు. ఆ విధంగా అంతర్జాతీయ సైకో ఎనాలిసిస్ సంఘం పుట్టగా దీనికి అనేక శాఖలు ఏర్పడ్డాయి.

యూంగ్, యాడ్లర్‌లు రానురాను ఫ్రాయిడ్‌కు భిన్నంగా సైకో ఎనాలసిస్ సూత్రాలు తమ పద్ధతిలో పెంపొందించారు. ఫ్రాయిడ్‌కు యిది సుతరామూ నచ్చలేదు. తాను సూచించిన మూలసూత్రాలను అనుసరిస్తేనే సైకో ఎనాలసిస్ అని ఫ్రాయిడ్ పట్టుబట్టాడు. ఇంచుమించు పేటెంట్ హక్కుగా సైకో ఎనాలసిస్‌పై ఫ్రాయిడ్ తన అజమాయిషీ కావాలనుకున్నాడు. కారున్‌హర్నె, హారీస్టాక్ సల్లివన్, ఎరిక్‌ఫ్రామ్‌ల మధ్య ఫ్రాయిడ్ అనంతరం ఇంచుమించు యిలాంటి పేటెంట్ హక్కు తగాదా, సైకోఎనాలసిస్ గురించి సాగింది. శాస్త్రీయ పరిధిలో యిది విడ్డూరమే!

ఫ్రాయిడ్‌కూ యాడ్లర్‌కూ సైకో ఎనాలసిస్ తగాదా కేవలం మూలసూత్రాలకే పరిమితమైతే అర్థం చేసుకోవచ్చు. కీర్తి దాహం, ధనసంపాదనలో యీ తగాదా రావడం విచారకరం. తన సూత్రాలను మాత్రమే సైకో ఎనాలసిస్ అనాలని, ఏ మాత్రం తేడా వచ్చినా ఒప్పుకోననీ ఫ్రాయిడ్ పట్టుబట్టాడు.

యాడ్లర్ మానవ ప్రవర్తన గురించి సిద్ధాంతీకరించాడనీ, నరాల జబ్బుకు పరిమితం కాలేదని ఫ్రాయిడ్ 1914లో విమర్శించాడు. అప్పటికి వియన్నా సైకో ఎనాలసిస్ సొసైటి అధ్యక్షుడుగా యాడ్లర్‌ను రాజీనామా పెట్టేటట్లు తెరవెనుక వత్తిడి చేశాడు. కాంగ్రెసు పార్టీపై గాంధీజీ పెత్తనం ఎలా వుండేదో, సైకో ఎనాలసిస్ సంఘాలపై ఫ్రాయిడ్ మాట అలా చెల్లింది.

తాను యాడ్లర్‌కు నాయకత్వం అప్పగిస్తే తన సూత్రాలకు భిన్నంగా పోతాడా అని ఫ్రాయిడ్ ఆగ్రహించాడు. వియన్నా సంఘసభ్యులు చెప్పగా అతడిని తొలగించినట్లు పేర్కొన్నాడు. అలాగే యూంగ్‌కు ప్రధాన పదవి కట్టబెట్టినట్లు రాశాడు.

మొదటి ప్రపంచ యుద్ధంలో తన సైకో ఎనాలసిస్ ప్రకారం నరాల జబ్బుకు చికిత్స సఫలమైందని, వైద్య సైనిక రంగాలలో యిది నిజమని ఫ్రాయిడ్ ప్రచారం చేసి నమ్మించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో సైకో ఎనాలసిస్ సఫలమౌతుండగా, ఇంతలో యుద్ధం ముగిసిందని ఫ్రాయిడ్ బాధపడ్డాడు. 1918 సెప్టెంబరు 28, 29లో బుడాపెస్ట్‌లో జరిగిన సైకో ఎనాలసిస్ 5వ అంతర్జాతీయ సమావేశాలకు యుద్ధంలో పాల్గొన్న సైనికాధిపతులు సైతం అనేక మంది వచ్చారు. 2 లక్షల 50 వేల డాలర్లు ఒకతను చందా యిచ్చాడు. ఫ్రాయిడ్‌కు అక్కడ వీరారాధన లభించింది. తన జీవిత కృషి సఫలమైందని ఫ్రాయిడ్ సంతోషించాడు.

థామస్ సాజ్ ప్రకారం ఫ్రాయిడ్ పద ప్రయోగంతో ఆకర్షించే గొప్ప వ్యక్తి. సైకో థెరపి అనేది చికిత్స కాదు. మాట్లాడడం అందులో ముఖ్యవిధానం. అచేతన రీతుల వలన మనిషి ప్రవర్తన వుంటుందని, ఇది వక్రరీతులలో సాగుతుంటుందని ఫ్రాయిడ్ ఉద్దేశం.

మానవుడు స్వేచ్ఛాపరుడు కాదనీ అతడికి స్వేచ్ఛగా ఆలోచించే ఇచ్ఛ లేదనీ ఫ్రాయిడ్ మూలసూత్రం. ఇందుకు అనేక ఆధారాలు చూపే ప్రయత్నం అతడు చేశాడు. ది సైకో పాథాలజీ ఆఫ్ ఎవ్విరిడే లైఫ్ అనే పుస్తకం రాశాడు. తాను గొప్ప శాస్త్రజ్ఞుడనని చాటడానికి ఫ్రాయిడ్ ప్రయత్నించాడే గాని, మానవుడి మనస్సు ఎలా పనిచేస్తుందో చూపలేదు. చేతన అచేతన ఉద్దేశాలను గమనిస్తే, మనం యాంత్రికంగా తీసుకునే నిర్ణయాలన్నీ కావాలని చేస్తున్నట్లనిపించదన్నాడు. అచేతనం నుండి యీ ఉద్దేశాలు వస్తుండగా, నిర్ధారణ అనేది స్పష్టపడుతున్నదన్నమాట. నియతి విధానం మానసిక రీతిలోనే గాక, నేర న్యాయంలో కూడా వున్నదని ఫ్రాయిడ్ రాశాడు.

లియొనార్డో డ వించిని ఉదాహరణగా స్వీకరించిన ఫ్రాయిడ్ తన నియతివాదాన్ని అన్వయించి చెప్పాడు. లియోనార్డో నెమ్మదిగా పనిచేయడం ఒక లక్షణంగా కనిపిస్తున్నదన్నాడు. ఫ్రెస్కో చిత్రాలు వెయ్యాలంటే త్వరగా పనిచేయాలి. తడి ఆరకముందే చిత్రం పూర్తిగావాలి. అందుకే నెమ్మదిగా చిత్రం వేసే రీతిలో లియొనార్డో ఆయిల్ చిత్రాలు వేశాడని ఫ్రాయిడ్ అన్నాడు. లియొనార్డోపై విరుచుకుపడ్డ ఫ్రాయిడ్ ఒక ఉదాహరణ యిస్తూ, చిన్నతనంలో ఒక డేగ వచ్చి తోకతో లియొనార్డో మూతిపై కొట్టిందట. ఆ విషయం ప్రస్తావిస్తూ లియొనార్డోను స్వలింగ సంపర్కం కోరిన, ఆచరించిన వాడుగా చిత్రించాడు. (Homo Sexual) అసలు చిక్కు ఏమంటే ఇటలీ భాషలో గాలిపటం అనే మాటను జర్మనీలో డేగ అని అనువదించడం వలన యీ గందరగోళం ఏర్పడింది. ఇది గమనించకుండా ఫ్రాయిడ్ రాసింది వేదాక్షరంగా సైకో ఎనాలసిస్

స్కూలువారు శిరసావహించారు. లియొనార్డో హోమో సెక్సు గలవాడని ఫ్రాయిడ్ ఉద్దేశం. ఈ నేరం రుజువు కానందుకు ఆనాడు ఇటలీ కోర్టు లియొనార్డొను వదిలేసింది గాని, ఫ్రాయిడ్‌ను మాత్రం వదల్లేదు.

## ఒడిపస్ కాంప్లెక్స్ :

మొదటిసారిగా 1910లో ఒడిపస్ కాంప్లెక్స్ ప్రయోగం చేసిన ఫ్రాయిడ్ సైకో ఎనాలసిస్‌లో దీనికి అత్యంత ప్రాధాన్యత యిచ్చాడు. పిల్లవాడు తల్లిని కోరడం, కూతురు తండ్రిని కోరడం యిందలి మూలసూత్రం ఒడిపస్ కాంప్లెక్స్‌ను అవగాహన చేసుకోని వారికి నరముల జబ్బు వస్తుందని ఆయన చెప్పాడు. ఒడిపస్ కాంప్లెక్స్‌లో కేవలం సూచనల సంజ్ఞ, చిహ్నం మాత్రమే వున్నదని, ఇందులో తల్లి అనేది అందుకోలేనిదిగా భావించాలని, తండ్రి అనేది మనలోని అంతరభావనగా స్వీకరించాలని, దీనినుండి బయటపడి స్వతంత్రుడిగా మారాలని యూంగ్ రాశాడు. ఈ వ్యాఖ్యానాన్ని ఫ్రాయిడ్ తీవ్రంగా నిరసించి ఖండించాడు. యూంగ్ కొత్త మత నైతికపద్ధతి సృష్టించాడన్నాడు. సైకో ఎనాలసిస్‌ను ఉపమానంగా భావించడం క్షమించరాని నేరంగా ఫ్రాయిడ్ చెప్పాడు. నరాలజబ్బు అంటే ఏమిటో ఫ్రాయిడ్ నిర్ధారణగా చెప్పలేదుగాని, కారణాలు అన్వేషించడంలో ఒడిపస్ కాంప్లెక్స్‌ను పేర్కొన్నాడు. కనుక అదేమిటో తెలుసుకోవడం అవసరం.

## ఒడిపస్ గాథ :

థీబిస్ రాజు లూయిస్‌కు పిల్లలులేరు. ప్రవక్త డెల్ఫిక్‌ను సంప్రదిస్తే, తనకూ తన భార్య జూకాస్తాకు పుట్టే కొడుకు తనను చంపుతాడని చెప్పింది. కనుక భార్యను దూరంగా వుంచాడు. ఆమె ఆగ్రహించి లూయికి తప్పత్రాగించి తనతో సంభోగం జరిపిస్తుంది. తొమ్మిది మాసాలకు కొడుకు పుడతాడు. కొడుకును దాయానుండి లాక్కెళ్ళి కాళ్ళకు మేకులుకొట్టి, కట్టేసి, కొండల్లో పారేయిస్తాడు లూయి. ఒక గొర్రెలకాపరి ఆ బాలుడ్ని కాపాడి ఒడిపస్ అని పేరు పెడతాడు. మేకులు దిగిన కాళ్ళు ఒంకరపోయినందుకు యీ పేరు వచ్చింది. ఆ బాలుడిని తీసుకొచ్చి పిల్లలులేని కొరింత్‌రాజు పోలిబస్, రాణి పెరిబోసియాలకు యిస్తాడు. పెరిగిన తరువాత ఒడిపస్ తన తల్లిదండ్రులను పోలివుండనందుకు స్నేహితుడు వెక్కిరిస్తాడు. ఒడిపస్ వెళ్ళి డెల్ఫిక్ ఆరకిల్‌ను తన భవిష్యత్తు గురించి అడుగుతాడు. నీ తండ్రిని చంపి తల్లిని పెళ్ళిచేసుకుంటావని ప్రవక్త చెబుతుంది. తన తల్లిదండ్రులను అతిగా యిష్టపడిన ఒడిపస్ యిది విని, కొరింత్ తిరిగి వెళ్ళకుండా, డాలిస్‌వైపు పోతుండగా రథంపై పయనిస్తున్న లూయి తారసిల్లాడు. తప్పుకోమని లూయిస్ అరుస్తాడు. పెద్దవాళ్ళకు గౌరవం చూపమంటాడు. ఒడిపస్ వినకుండా, తన తల్లిదండ్రులు, దేవుళ్ళే తనకు గౌరవ పాత్రులంటాడు. లూయిస్ రథం పోనివ్వమంటాడు. ఒడిపస్ కాళ్ళమీదుగా రథం కదలగా, ఆగ్రహంతో రథసారధిని, రాజు లూయిస్‌ను ఒడిపస్ చంపేస్తాడు. తరువాత థీబస్‌కు వెళ్ళిన ఒడిపస్, అక్కడున్న స్పినిక్స్ వేసిన చిక్కుప్రశ్నలకు

సమాధానంచెప్పి, దాని బారి నుండి నగరాన్ని కాపాడతాడు. ప్రజలు కృతజ్ఞతతో అతడిని రాజుగా ప్రకటిస్తారు. జూకాస్తాను తన తల్లి అని తెలియకుండానే పెళ్ళిచేసుకుంటాడు. థీబస్‌లో ప్లేగువ్యాధిరాగా మళ్ళీ డెల్ఫిక్ ఆరేకిల్‌ను సంప్రదిస్తారు. లూయీ హంతకుడిని బహిష్కరించమంటుంది. తాను రోడ్డుపై చంపింది లూయీనేనని ఒడిపస్‌కు తెలియదు. ఎవరైనాసరే, లూయీ హంతకుడు దేశం వదలిపోవాలని ఒడిపస్ ప్రకటిస్తాడు.

గ్రీసు రుషిగా పేరొందిన అంధుడు టెరిఫాన్‌వచ్చి ఒడిపస్‌తో మాట్లాడి ప్లేగువ్యాధి పోవాలంటే భూమిలో పాముదంతాలు నాటినవ్యక్తి త్యాగం చేయాలంటాడు. జూకాస్తా తండ్రి మోనోసిస్ అప్పుడు పైకిలేచిరాగా, నగర ప్రజలు అతడి త్యాగాన్ని శ్లాఘిస్తారు. టెరిఫాన్ అప్పుడే రహస్యం వెల్లడిస్తూ, ఒడిపస్ నీ భర్తను చంపాడని జూకాస్తాకు చెబుతాడు. పెరిబోయా రాసిన లేఖ ద్వారా ఒడిపస్ దత్తత విషయం కూడా తెలుస్తుంది. వెంటనే జూకాస్తా వురిపోసుకొని చనిపోగా, ఒడిపస్ ఆమెనుండి ఒక పిన్నులాగి కళ్ళల్లో పొడుచుకొని గుడ్డి వాడౌతాడు.

ఇదీ ఒడిపస్ కథ. ఫ్రాయిడ్ యీ కథలో తనకిష్టమొచ్చిన భాగాలు స్వీకరించి, కొన్ని వదిలేసి, తల్లికీ, కొడుకుకూ లైంగికసంబంధంతో నరాల జబ్బుకు ముడిపెట్టాడు. లైంగిక సంఘర్షణలో రీతులను ఆకర్షణీయ పదజాలం అన్వేషించి పెట్టాడు. అందుకు ఒడిపస్ గాథను వాడుకున్నాడు.

ఒడిపస్ తన తండ్రిని చంపి తల్లిని పెళ్ళిచేసుకోవాలని తలపెట్టలేదు. పైగా అలాంటిదేమీ జరగకుండా చూడదలచాడు. తాను చంపింది తన తండ్రిని అని ఒడిపస్‌కు తెలియదు. ఇది అచేతనంగా వున్నదని, తాను చంపుతున్నది ఎవరినో అనే విషయం అచేతనంగా (unconscious) ఒడిపస్‌కు తెలుసని ఫ్రాయిడ్ భాష్యం చెప్పాడు.

ఒడిపస్ గాథలో లూయిస్ పాత్ర ఏమిటి? ఒడిపస్ కాంప్లెక్స్ వుంటే, కొడుకును చంపాలనుకున్న లూయిస్ కాంప్లెక్స్ మాటేమిటి అని థామస్ సాజ్ ప్రశ్నించాడు. ఈ గాథలో కుమారుడి హత్య అనే ధోరణి ప్రధానం గదా! తండ్రులందరికీ కుమారులను హతమార్చి, భార్యలను తమకే సొంతం చేసుకోవాలనే కోరిక వుంటుందని, ఇది ప్రపంచవ్యాప్తంగా వున్నదని ఫ్రాయిడ్ సూచించలేదేమి? ఒడిపస్ చర్యను బట్టి ఆత్మరక్షణలో నిమగ్నమయ్యాడు.

ఒడిపస్‌ను పసిబిడ్డగా వుండగానే చంపాలని లూయిస్ తలపెట్టడమేగాక డాలస్ రోడ్డుపై ఎదురైనప్పుడు మరోసారి చంపాలని భావించాడు. ఫ్రాయిడ్ యీ వాస్తవాలను తన సిద్ధాంతానికి యిమడనందున వదిలేశాడు.

ప్రాచీన గ్రీకులు తండ్రి హత్య, తల్లి కుమారుల లైంగిక సంబంధం గురించి మాట్లాడడానికి యిష్టపడేవారు కాదు. ఒడిపస్ తన ఉద్దేశాలను కప్పిపుచ్చి పరోక్షంగా వెల్లడించాడనే ఫ్రాయిడ్ వ్యాఖ్యానం కూడా యిమడదు. తననుతాను శిక్షించుకున్న ఒడిపస్ చర్యను మనోవిజ్ఞాన

శాస్త్రజ్ఞులు వ్యాఖ్యానిస్తూ లైంగిక విషయాలను అణచివేయడంగా పేర్కొన్నారు. ఇది కూడా సరికాదు. ప్లూటార్క్ తన గాథలలో హిప్పోపొటమస్ తన తండ్రిని చంపి తల్లిని బలవంతం చేసినట్లు రాశాడు. దీనినిబట్టి ప్రతివాడికీ హిప్పోపొటమస్ ధోరణి వున్నదంటామా? ఒడిపస్ ధోరణి అనేది ఫ్రాయిడ్ భాష్యం చెప్పినట్లుగా గ్రీక్ కథలో ఎక్కడా లేదని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా పేర్కొన్నది. ఒడిపస్ ఉద్వేగాలు అతడిని పురికొల్పి యీ పనులు చేయించలేదనేది స్పష్టం. ఒడిపస్ ధోరణి అనేది సైకో ఎనాలసిస్‌కు బాగా అక్కరకొచ్చింది. కనుక గాథల్ని, మతాన్ని, చరిత్రను, వ్యక్తి ప్రవర్తనను తమ యిష్టం వచ్చినట్లు చిత్రించి, శాస్త్రీయం అనే ముసుగువేసి చికిత్సపేరిట భాష్యం చెప్పిన సైకో ఎనలిస్టులు ద్రోహం చేశారు.

రాజు ధోరణి మార్చేసి ఒడిపస్‌కు అంటగట్టిన ఘనత ఫ్రాయిడ్‌దే. ఈ రంగంలో ఫ్రాయిడ్ జోలికి ఎవరూ పోలేదు గనుక యిష్టమొచ్చినట్లు పదజాలాన్ని ప్రయోగించి, నాటకం ఆడాడు. మానవ ప్రవర్తనను తనకు అనుకూలంగా మార్చి, తన సిద్ధాంతాలలో యిమిడ్చాడు. ఫ్రాయిడ్‌కు చాలామంది అనుచరులుండడం, సైకో ఎనాలసిస్‌ను ఆమోదించడంతో ఫ్రాయిడ్‌కు ఆమోదముద్ర పడింది. ఒడిపస్ పాత్రకు ఫ్రాయిడ్ చేసిన భాష్యంవంటిదే లియొనార్డో హేమ్లట్, వుడ్రోవిల్సన్ పట్ల కూడా అన్వయించి, ఉన్నత లక్షణాలను దుష్టమైనవిగా, శ్లాఘనీయమైన విషయాలను గర్హనీయంగా చూపాడని థామస్ సాజ్ పేర్కొన్నారు. (ది మిత్ ఆఫ్ సైకోతెరపి)

ఒడిపస్ కాంప్లెక్స్ అనేది ఫ్రాయిడ్‌కు యిష్టప్రీతి అయిన వ్యాఖ్యానం. అది శాస్త్రీయం అని చెప్పాడుగాని, తన సొంత ఆస్తిహక్కుగా చూచుకొని, ఎవరు దాని జోలికి వచ్చినా విరుచుకపడ్డాడు. ఒడిపస్ కాంప్లెక్స్‌ను కనిపెట్టి వెల్లడించినందుకు ప్రపంచంలో చూపవలసినంత కృతజ్ఞత రాలేదన్నాడు. (సైకో ఎనాలసిస్‌పై పరిచయ ఉపన్యాసాలు) ఒడిపస్ గాథ ఫ్రాయిడ్ కనిపెట్టింది కాదు. ఇందులో ఫ్రాయిడ్‌కు ప్రపంచం ధన్యవాదాలు చెప్పాల్సిందేమీ లేదు. ఒడిపస్ కాంప్లెక్స్ విషయమై తాను భాష్యం చెప్పినట్లే సైకొ ఎనాలసిస్‌లో వుండాలని అటూఇటూ తప్పగూడదని ఫ్రాయిడ్ ఉద్దేశం. కాని ఆయన మాత్రం తన యిష్టం వచ్చినట్లు సమయానుకూలంగా ఒడిపస్ కాంప్లెక్స్ గురించి మాటలు మార్చేస్తుండేవాడు. ఒడిపస్ కాంప్లెక్స్ ప్రపంచవ్యాప్తంగా వున్నట్లు చివరిదాకా ఆయన పేర్కొన్నాడు. (అవుట్ లైన్ ఆఫ్ సైకొ ఎనాలసిస్) ఇందుకు సాక్ష్యాధారాలు ఏమీ చూపలేదు. కేవలం గ్రీకు కథకు అతడి వ్యాఖ్యానమే చూపాడు. కుమారులందరూ ఒడిపస్ కాంప్లెక్స్‌లో పయనించక తప్పదన్నాడు. తండ్రి బలాన్ని చూచి ఈర్ష్యపడేగుణం కుమారుడికి వుంటే, వికలాంగుడు బలహీనుడైన తండ్రి వున్నచోట ఏమౌతుంది? తండ్రి చనిపోగా, తల్లి పెంచినచోట ఎలా వుంటుంది? షేక్స్‌పియర్ పాత్ర హామ్లెట్‌లో కూడా ఫ్రాయిడ్ ఒడిపస్ ధోరణి చూచాడు!

మామూలుగా వాడుకలో వున్న పదాలకు కొత్త ముసుగు వేయడం ఫ్రాయిడ్‌కు కొట్టిన పిండిగా థామస్ సాజ్ చూపాడు. మనస్సు (Mind)ను మనోపరికరం (Physic apparatus) అనీ,

రాగద్వేషాలను ఇడ్ (ID) అనీ, స్వీయంను అహం (ego) అనీ, చైతన్యతను సూపర్ ఇగో అనీ ఫ్రాయిడ్ పేర్లుపెట్టి పిలిచి, ప్రచారం చేశాడు. సంఘర్షణలు, పరస్పర విరుద్ధ కోరికల బదులు ఫ్రాయిడ్, ధోరణులు (Complexes) అస్పష్టభావాలు (ambivalenses) అనీ చెప్పాడు. అన్నిరకాల లైంగికాలను లిబిడొ అని నామకరణం చేశాడు. ఇది ఈరోస్ (eros)గా, జీవనప్రేరణ (Life Instinct)గా వెల్లడౌతుందన్నాడు. సైకోఎనాలసిస్ అంటే మాట్లాడటమే. ఏం మాట్లాడాలి? ఫ్రాయిడ్ చెప్పినట్లు మాట్లాడాలి. కాకుంటే తిట్లు!

మానవులలో సగం మంది స్త్రీలు. వారంతా లైంగికంగా అణగారిపోయారంటాడు. ఉపమానాలు చెప్పడంలో సిద్ధహస్తుడైన ఫ్రాయిడ్ రాస్తూ, పురుషుల లైంగికావయవం, వికలాంగం రూపంలో వుండటమే బాలికల పెరుగుదలలో ప్రధాన అంశం అంటాడు. వారికి మర్మావయవంలోవున్న కేంద్రిక కూడా (Clitoris) తక్కువ స్థాయిదనీ, లైంగిక లోపాన్ని సూచించే ధోరణి వున్నదనీ చెబుతూ, ఇతర విషయాలలో స్త్రీ కూడా ఒక వ్యక్తి అని విస్మరించరాదంటాడు. స్త్రీలకు వ్యతిరేకంగా ఫ్రాయిడ్ చేసిన భాష్యంవలన అతడికి సెక్స్ పట్ల సరైన అవగాహన లేదనేది స్పష్టం.

సెక్స్ (లైంగిక సంబంధం) వాంఛనీయమైన కామం అనీ, వ్యక్తిగత అభిరుచి అనీ, పరస్పర సన్నిహితత్వానికి పరాకాష్ట అనీ, స్త్రీపురుషుల మధ్య పరస్పర గౌరవం సూచిస్తుందనీ ఫ్రాయిడ్ విస్మరించినట్లు థామస్ సాజ్ స్పష్టపరిచాడు.

ఫ్రాయిడ్ దృష్టిలో మానవజాతి అంతా మనోవైకల్యంతో వున్నవారే.

## ఫ్రాయిడ్‌లో యూదుజాతి లక్షణం :

ఫ్రాయిడ్ పూర్వీకులంతా యూదులే. అతడి ముత్తాత రాబి ఎఫిరం ఫ్రాయిడ్, తాత రాబి స్లొమొఫ్రాయిడ్. యూదుగా పుట్టిన ఫ్రాయిడ్ అసలు పేరు స్లోమో (Sclomo). యూనివర్శిటీలో 1873 చేరినప్పుడు తనను తక్కువగా చూడడంతో ఫ్రాయిడ్ ఇంకా యూదు స్వభావాన్ని గట్టి పరచుకున్నాడు. జీవితమంతా యూదుగా గడిపిన ఫ్రాయిడ్ తన లేఖల్లో యీ స్వభావాన్ని బాగా స్పష్టపరిచాడు. యవ్వనదశలో 1882లో తనకు కాబోయే భార్యకు వ్రాసిన జాబులో యూదులుగానే జీవితం ఆనందమయం చేసుకుందామని వ్రాశాడు. 1895లో యూదుల సంఘం బనాయ్ బ్రత్ సమాజంలో చేరి జీవితాంతం వున్నాడు. యూదుల సమావేశాల్లో ప్రతివారం పాల్గొని ఉపన్యాసాలిచ్చేవాడు. సైకో ఎనాలసిస్ సఫలం కావాలంటే ఆర్యుల్ని కలుపుకోవాలని వ్యూహంగా పేర్కొన్నాడు. 1908లో అబ్రహంకు వ్రాసిన లేఖలో ప్రాచీన యూదుల పట్టుదలే, చివరివరకూ కాపాడుతుందని ధైర్యం చెప్పాడు.

యూదులుగా అబ్రహాం, ఫెరెంజోలను దగ్గరతీసి సైకో ఎనాలసిస్ ప్రోత్సహించిన ఫ్రాయిడ్, యెత్తుగడగా మాత్రమే యూంగ్‌ను ప్రోత్సహించినట్లు పేర్కొన్నాడు లేఖల్లో. సైకో

ఎనాలసిస్‌ను యూదుల సిద్ధాంతంగా భావించాడు. యూదుగా వుండటమే అద్భుతమనీ, విశ్లేషణకు అందని సిద్ధాంతం యూదులే చెప్పగలరని 1936లో బార్బరాలో (Barbara Low) కు వ్రాసిన ఉత్తరంలో బయటపడ్డాడు. ఫ్రాయిడ్ చాలాకాలం యూదుల ఆచార సంప్రదాయాలు పాటించలేదు. కాని యూదులతో సమైక్యంగా భావించుకున్నాడు. బయట తాను మతంలేని నాస్తికుడుగా ప్రచారం చేసి, వారితో కలసిపోవడం, ఫ్రాయిడ్ ద్వంద జీవితనీతికి నిదర్శనం. తన సైకో ఎనాలసిస్‌ను అడ్డం పెట్టుకుని వ్యతిరేకుల్ని భయపెట్టిన ఫ్రాయిడ్ యూదుమతాన్ని బాగా వాడుకున్నాడు.

1939లో 80వ సంవత్సరం పైబడగానే ఫ్రాయిడ్ మోసెస్ అండ్ మోనోథీయిజం అనే చివరి గ్రంథం వ్రాశాడు. ఇందులో యూదు వాద పుట్టుపూర్వోత్తరాలు ప్రస్తావించాడు. మోసెస్‌తో తాదాత్మ్యం చెందాడు. క్రైస్తవులు, నాజీలు, యూదులపై జరిపిన అత్యాచారాలకు పగతీర్చుకునే ధోరణి ఫ్రాయిడ్ ప్రదర్శించాడు. పగ తీర్చుకోవడం ప్రతి మతం చేసే పనే. యూదులకిది ప్రత్యేక లక్షణంగా వున్నట్లు వారి పవిత్ర గ్రంథాలలోనే చెప్పారు. ఫ్రాయిడ్ ఆ సూత్రాల్ని పాటించాడు.

## కార్ల్ యూంగ్ ఏమన్నాడు? :

మనోవిజ్ఞానంలో ఫ్రాయిడ్‌తో పాటు పనిచేసిన యూంగ్ కూడా చాలా ప్రభావం చూపెట్టాడు. అంతర్జాతీయ సైకో ఎనాలసిస్ సంఘాధ్యక్షుడుగా కొన్నాళ్ళున్న యూంగ్ (1875-1961) వైద్యం చదివాడు. జ్యూరిచ్ సైకియాట్రి సంస్థలో పనిచేశాడు. కలలపై ఫ్రాయిడ్ వ్యాఖ్యానం 1900లో వెలువడిన నాటికే. యూంగ్ సైకియాట్రి గురించి అభిప్రాయం వెల్లడిస్తూ, అదొక మతం అన్నాడు. మానసిక రోగాల పరిధిలో మానవ, నైతిక దృక్పథాన్ని ఫ్రాయిడ్ ప్రవేశపెట్టాడని ఉద్దేశం. రోగి చెబుతున్నాడనేది గాక, రోగలక్షణాలు వాటి లెక్కలు సేకరించడంలో సైకియాట్రి వైద్యులు ఆసక్తి చూపారన్నాడు. మానసిక రోగులుగా, హిస్టీరియా లక్షణాలు చూపేవారు నటిస్తున్నారని 1906-1908 మధ్య యూంగ్ వ్రాశాడు.

ఒక మతం స్థానంలో మరో మతాన్ని మాత్రమే స్థాపించవచ్చని యూంగ్ 1910లో వ్రాస్తే, ఫ్రాయిడ్ అదిరిపడి, తనను మతస్థాపకుడుగా చూడొద్దని అన్నాడు. మతం అనే మాట ఫ్రాయిడ్‌కు గిట్టదు. యూంగ్ దృష్టిలో అది మంచిదే. సైకో ఎనాలసిస్‌లో జీవశాస్త్రం కంటె, అధ్యాత్మికత హెచ్చుగా ఉన్నదని యూంగ్ నిర్ధారణకు వచ్చాడు. ఫ్రాయిడ్ దీనిని వైద్యంగా శాస్త్రీయమైనదిగా ప్రచారం చేసి ఆచరించదలస్తే, యూంగ్ ఇదొక మతంగా ఆధ్యాత్మికంగా భావించి ప్రచారం చేశాడు. థామస్ సాజ్ దృష్టిలో యూంగ్ సత్యానికి సన్నిహితంగా వున్నాడు. అంతటితో ఫ్రాయిడ్ ధ్వజమెత్తి యూంగ్‌ను దుయ్యబట్టాడు. యూంగ్ మాత్రం రానురాను సైకోథెరపిలోని ఉపమానాలు, మతలక్షణాలు, ఆత్మ ఉపశమనం స్పష్టపరిచాడు. ఫ్రాయిడ్ దృష్టిలో నరాల జబ్బు, సైకోసిస్ అనేవి రోగాలే. యూంగ్ దృష్టిలో నరాల బలహీనత జబ్బు కాదు. సైకోసిస్ రోగం కావచ్చు.

మొదటి ప్రపంచ యుద్ధంలో సైనికులకు విద్యుత్ షాక్ యిచ్చి చికిత్స చేసి చిత్రహింసకు గురిచేసిన పద్ధతులను చాలామంది తీవ్రంగా విమర్శించారు. 1927లో నోబెల్ బహుమతి అందుకున్న జూలియస్ వాగ్నర్ జారెగ్ (1857-1940) చిత్రహింసల చికిత్సను ఫ్రాయిడ్ వెనకేసుకొచ్చాడు. అతడి పద్ధతిలో ఆస్ట్రియా సైకియాట్రిస్టులు చిత్రహింస షాక్ వైద్యం పాటించారు. ఆస్ట్రియా యుద్ధ మంత్రిత్వశాఖ ఒక విచారణ సంఘాన్ని నియమించింది. వారు ఫ్రాయిడ్ అభిప్రాయమడిగితే వాగ్నర్ జారెగ్ (Wagner-Jauregg) పద్ధతిని ఆయన సమర్ధించాడు. వాగ్నర్ తన స్వీయచరిత్రలో యుద్ధ ఖైదీలలో నరాల జబ్బు పేరిట నటించిన సైనికులకు యిచ్చిన చికిత్స క్రూరమైనదేనని ఒప్పుకున్నాడు. యుద్ధం వలన వచ్చే నరాల మనోరుగ్మతకు సైకో ఎనాలసిస్ చికిత్స పనిచేస్తుందని ఫ్రాయిడ్ గొప్పలు చాటుకున్నాడు. యుద్ధం నుండి తప్పించుకోడానికి జబ్బువచ్చినట్లు నటించే సైనికుల లక్షణాలను, ఫ్రాయిడ్ తన గంభీర పదజాలంతో, అందులో అచేతన వుద్దేశాలే వున్నాయని సిద్ధాంతీకరించాడు. సైనికుడు అబద్ధం ఆడటంకాదనీ, చేతన అచేతన ఉద్దేశాలు గుర్తించకపోవడం తప్పు అనీ ఫ్రాయిడ్ అన్నాడు. కావాలని ఫ్రాయిడ్ అబద్దాలు అల్లినట్లు సాజ్ విమర్శించాడు. అబద్దాలు ఆడి నటించేవారికీ, నరాల మనోబలహీనతలు వున్నవారికీ పోలికలు తేడాలు వున్నాయని ఫ్రాయిడ్ తన పదజాలంతో పాఠకులను గందరగోళపరచాడు.

విద్యుత్ షాక్ వైద్యం, హిప్నాసిస్‌దశ నుండి విడివడి, సైకో ఎనాలసిస్ పెరిగింది. దీనికి ఒక శాస్త్రీయస్థాయి సమకూర్చడానికి ఫ్రాయిడ్ తన ప్రభావాన్ని పదజాలాన్ని ప్రయోగించాడు. వైద్య అవసరం దృష్ట్యా యిది ఆవిర్భవించిందన్నాడు. ఫ్రాయిడ్ మొదట్లో ఎలక్ట్రోథెరపి వాడాడు. తర్వాత హిప్నాసిస్‌కు మారాడు. ఉత్తరోత్తరా సైకో ఎనాలసిస్ అనే తొడుగుతో జనాన్ని ఆకర్షించాడు.

సైకో ఎనాలసిస్‌లో శాస్త్రీయం ఏదీ లేదు. ఫ్రాయిడ్ సృష్టించిన కొత్త మతం అది.

## ముగింపు :

నేను సైన్సు మనిషిని కాదు సాహసిని మాత్రమే అని ఫ్రాయిడ్ 1890 ఫిబ్రవరి 1న విల్‌హెల్మ్ ఫ్లెస్‌కు వ్రాశాడు. సైకో ఎనాలసిస్ అనేది, కోకాకోలా వలె ఒక ట్రేడ్‌మార్కు. అదొక ఉపమానం. మాట్లాడటం ఇందులో ముఖ్యం. దీనిని ఫ్రీ అసోసియేషన్ పద్ధతి ద్వారా విశ్లేషించవచ్చని ఫ్రాయిడ్ తన విధానంగా పేర్కొన్నాడు. డాక్టరు కావాలనుకున్నదే రోగి నుండి రాబట్టడానికి యిందులో ప్రయత్నిస్తారు. మాట్లాడే పద్ధతికి వైద్యం తొడుగుతెచ్చిపెట్టిన ఫ్రాయిడ్ యూదుల మతరీతులకు ఆధునిక ముసుగువేశాడు. జీవితానికి అర్థం, జీవిత విలువ ప్రశ్నించేవారంతా రోగులే అని ఫ్రాయిడ్ అన్నాడు. సంభాషణను చికిత్సగా మార్చిన ఫ్రాయిడ్ గొప్ప సాధకుడే! సైన్స్ ముసుగులో వున్న మతమే సైకో ఎనాలసిస్. అచేతనం అనేది తనకే తొలుత

తెలిసిందని ఫ్రాయిడ్ గొప్పలు చెప్పాడు. లైంగికం (సెక్స్) అంటే వక్రభాష్యం చెప్పి, హస్తప్రయోగం, సుఖవ్యాధులు తప్పుడు పద్ధతి అని ప్రచారం చేశాడు. హాస్యం ఆనందించాలి, కాని సైకోఎనలిస్ట్ విశ్లేషించి, అందులోని మజాను పోగొడతాడు. ఫ్రాయిడ్ తన విశ్లేషణ సూత్రాల్ని తానే ఉల్లంఘించాడు అచేతనం అనేది సైకో ఎనాలసిస్ పేరిట ప్రచారంలోవున్న మాఫియా మాత్రమే. ఈతరానివాడు నీళ్ళలో పడినవాడిని కాపాడడం వంటిదే. మానసిక రోగులకు సైకో ఎనాలసిస్ చికిత్స! మతాన్ని సైన్స్‌గా ఒప్పించడం ఫ్రాయిడ్ గొప్పతనం.

*- హేతువాది, మార్చి, ఏప్రిల్, మే 1992*

# ఫ్రాయిడ్ విశ్లేషణలపై సరికొత్త శోధన!

ఇరవయ్యో శతాబ్దంలో కొత్త ఆలోచనలు పాదుకున్నాయి. మానసిక ప్రపంచంలోని అంశాల గురించి శోధించడానికి తగిన భూమిక అంతకుముందే ఏర్పడింది. ఇందుకు సిగ్మండ్ ఫ్రాయిడ్ చేసిన పరిశోధనలే మూలంగా ప్రచారమొందాయి. ఫ్రాయిడ్ పరిశోధనలు విభిన్నరంగాలపై, ప్రాంతాలపై ప్రసరించాయి. తెలుగునేల కూడా అందుకు మినహాయింపు కాదు. అయితే ఆయన పరిశోధనల ప్రామాణికతపై ఇదివరలోనే ప్రశ్నలు తలెత్తాయి. సాహిత్య కళారంగాలకి సైతం ఫ్రాయిడ్ ఆలోచనల్ని అనుసంధానించి వ్యాఖ్యానించే పద్ధతి ఉంది. ఈ దృష్ట్యా ఫ్రాయిడ్ నేపథ్యాన్ని, ఆయన పరిశోధనల తీరును, వాటి ఫలితాల్ని గురించి తెలుసుకోవడం అవసరం. ఆయన ఆలోచనల్ని ఎంతవరకు ఆమోదించగలమన్న విషయాలపై సరైన అంచనాలకు రావడం తప్పనిసరి. ఇందుకు ఉపకరించే వ్యాసమిది.

జగమంతా సెక్స్ మయంగా చూసిన ఫ్రాయిడ్ ఒక శతాబ్దం పాటు ప్రపంచంలో ఎన్నో రంగాల్ని ప్రభావితం చేశాడు. ఐన్‌స్టీన్, మార్క్స్, డార్విన్ కోవలో ఫ్రాయిడ్‌ను చేర్చిన సందర్భాలు లేకపోలేదు. రానురాను ఫ్రాయిడ్‌ను బాగా అధ్యయనం చేసి, ఆయన చెప్పినవి, చేసినవి ఎంతవరకు నిలుస్తాయో పరిశీలించారు. ఆయన శిష్యులే గురువును కొంతవరకు నిరాకరించి, పనికొచ్చేవి ఏమిటో బేరీజు వేస్తున్నారు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856-1939) నాస్తికుడు, హేతువాది, యూదు డాక్టరుగా ఆరంభమైన ఫ్రాయిడ్ ఈల్‌లో గోనడ్స్ గురించి పరిశోధనతో రంగప్రవేశం చేశాడు. ఫ్రాయిడ్‌పై గ్రీక్ సాహిత్య ప్రభావం అధికం. ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్స్‌లలో జీవించిన ఫ్రాయిడ్, తన చివరి రోజులలో హిట్లర్ నాజీ నియంతృత్వ ధోరణుల వల్ల ఇంగ్లాండ్ వెళ్ళి అక్కడే గడిపి కేన్సర్‌తో చనిపోయాడు.

మతాన్ని ఆద్యంతాలు వ్యతిరేకించిన ఫ్రాయిడ్, మన చుట్టూ వున్న ప్రపంచంలో మనం సృష్టించుకున్న కోర్కెల లోకంపై, అదుపుపెట్టే యత్నమే మతం అన్నాడు. మతం అనేది ఒక భ్రమ అనీ, అయితే ఓదార్పు యిచ్చే విషయంగా అది పరిణమించిందనీ ఫ్రాయిడ్ అన్నాడు. మతం

నుండి బయటపడినవారు, స్వేచ్ఛగా సంపూర్ణ జీవనం సాగించగలరని కూడా ఫ్రాయిడ్ చెప్పాడు. దీనితో మతస్తులు ఆయనపై విరుచుకపడ్డారు. క్రైస్తవ మతం, అందులోనూ కేథలిక్ శాఖ మానవ శత్రువు అని కూడా స్పష్టం చేశాడు. ది ఫ్యూచర్ ఆఫ్ ఇల్యూజన్‌లో ఫ్రాయిడ్ మత విమర్శ చేశాడు (1927) విశ్వవ్యాప్తంగా వున్న మానసిక రుగ్మతగా మతాన్ని చిత్రించిన ఫ్రాయిడ్, దాన్నుండి బయటపడాలన్నాడు.

సృష్టి, ఊహ అనేవి ఫ్రాయిడ్ మూలాధారాలు. వాటిని జనం మధ్యకు తెచ్చి చర్చలో పెట్టాడు. ప్రతి వ్యక్తికీ కొద్దోగొప్పో యీ సృష్టి లక్షణాలుంటాయి. అందరూ వూహిస్తారు. సంకేతాలు వాడతారు. మనోవిశ్లేషణ సిద్ధాంతసారంగా ఫ్రాయిడ్ యీ సంగతి నొక్కి చెబుతాడు. ఫ్రాయిడ్ డాక్టరు. కాని అతని చికిత్సలో నయమైన రోగుల దాఖలాలు తక్కువ. అతని సిద్ధాంతాలు ప్రజాబాహుళ్యంలో తగ్గిపోతున్నా, కొన్ని మూలసూత్రాలు మాత్రం చర్చలో మిగిలాయి. బాధాకరమైన కోర్కెల్ని, వూహల్ని బలవంతంగా అణచివేస్తామనేది అందులో పేర్కొనదగింది. నోరుజారి మాట అనడంపై ఫ్రాయిడ్ వివరణ ఆకర్షణీయంగా మారింది. యుంగ్ వంటి శాస్త్రపరుల పట్ల ఫ్రాయిడ్ రాగద్వేషాలు, సిద్ధాంత ప్రచారాలు సైకో ఎనాలసిస్ ఒక చికిత్సగా వ్యాప్తికి తేవడం, స్వప్నాలకు అర్థం చెప్పడం, యివన్నీ అతని ప్రజ్ఞకు నిదర్శనాలు. సనాతన మత నమ్మకాలు గల కుటుంబంలో పుట్టిన ఫ్రాయిడ్ తనకు నాస్తికుడుగా, అజ్ఞేయవాదిగా పేర్కొన్నాడు. కాని జీవితమంతా యూదుగానే వున్నాడు. యూదు సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అలవాట్లు ఫ్రాయిడ్ పాటించాడు.

## వైద్యునిగా ఆరంభం

వియన్నా యూనివర్సిటీలో 1881లో ఫ్రాయిడ్ మెడిసిన్ డిగ్రీ పుచ్చుకున్నాడు. వియన్నా జనరల్ ఆస్పత్రిలోనే పనిచేశాడు. తరువాత 1883 నుంచీ నరాలపై దృష్టి పెట్టి అధ్యయనం చేస్తూ నిపుణుడుగా తేలాడు. పారిస్‌లో అప్పటికే జీమార్టిన్ చార్కాట్ సుప్రసిద్ధుడుగా వున్నాడు. ఫ్రాయిడ్ 1885లో చార్కాట్ వద్ద అధ్యయనం చేశాడు. (1885-1886) తరువాత మెదడుపై ప్రత్యేక పరిశీలన మొదలెట్టి, రచనకు పూనుకున్నాడు. కాని అది ఎన్నడూ పూర్తిచేయలేదు ఎందుకోమరి! నరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఫ్రాయిడ్ తన తొలి రచన 1891లో వెలువరించాడు. నరాల విషయంలో అది గొప్ప గ్రంథంగా పేరొందింది. 1883లో నరాల పరిశీలన ఆరంభించిన ఫ్రాయిడ్ 1897 వరకూ అందులో నిమగ్నుడయ్యాడు. అది అతడి పరిశోధనా దృష్టికి పరీక్షా సమయం. ఫ్రాయిడ్ కొత్తగా వైద్యం ప్రాక్టీసు చేస్తున్న రోజులలో ఎలక్ట్రో థెరపీ వుండేది. స్టడీస్ ఇన్ హిస్టీరియా అనే రచనలో ఫ్రాయిడ్ ఎలక్ట్రో థెరపీ ప్రస్తావన తెచ్చాడు.

ఫ్రాయిడ్ యిష్టపడిందీ, అసలు చికిత్సగా నమ్మిందీ మనోవిశ్లేషణ (సైకో ఎనాలసిస్) దీనివల్ల అతనికి పేరు, ప్రపంచ ఖ్యాతి వచ్చాయి. కొత్తపేర్లు ప్రచారంలోకి తేవడంలో, ఉపమానాలు వాడడంలో, గ్రీక్ రోమన్ గాథల నుండి ఉదాహరణలు స్వీకరించడంలో ఫ్రాయిడ్

దిట్ట. ముప్పయ్యవయేట నరాల జబ్బులను కుదిర్చే డాక్టర్‌గా జీవితాన్ని ఆరంభించిన ఫ్రాయిడ్ అనువాదాలు, పుస్తక సమీక్షలు చేసేవాడు. విద్యుత్ చికిత్స, హిప్నాసిస్ (మోహనిద్ర) చికిత్సలు క్రమంగా విరమించి, కొత్త సిద్ధాంతంతో, సరికొత్త పదజాలంతో ఫ్రాయిడ్ తన ప్రాక్టీసు అవతారాన్నే మార్చేశాడు. అతన్ని ప్రపంచం గుర్తించింది. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతం రావడానికి ముందు జోసఫ్ బ్రాయర్ (1842-1925) చికిత్స ప్రభావం వుండేది. దీనిని కథార్‌సిస్ అనేవారు. ఇది కేవలం రోగితో సంభాషించడం. గ్రీక్ పదం కథార్‌సిస్‌ను చికిత్సలో చేర్చుకున్నారు.

రోగిని ఒక పడక కుర్చీపై ఆసీనులయ్యేటట్లు చేసి, మాట్లాడుతూ, వింటూ పోవడం యీ కథారసిస్ చికిత్స ప్రత్యేకత. పడుకున్న రోగి పక్కనే డాక్టరు కూర్చొని, ఒకానొక లక్షణంపై ఆలోచన నిలిపి, అందుకు సంబంధించిన పాత జ్ఞాపకాలన్నిటినీ చెబుతూ పొమ్మంటారు. ఆలోచనలకూ రోగానికీ సంబంధం చూడడం యీ చికిత్సలో ప్రధానాంశం. ఈ విధంగా వివిధ పద్ధతులు ప్రయోగిస్తూ ఫ్రాయిడ్, 1896లో మొదటిసారిగా సైకోఎనాలసిస్ అనే మాట వాడాడు. ఆ మాటే ప్రపంచ ప్రసిద్ధి చెంది, వాడుకలోకి వచ్చింది. దీనికి పితామహుడుగా ఫ్రాయిడ్ సుప్రసిద్ధుడయ్యాడు. సైకోఎనాలసిస్ (మనోవిశ్లేషణ) ఒక ఉద్యమంగా తలెత్తింది. వివిధ దేశాలలో ఎందరో యీ చికిత్సను అనుసరించారు.

ఫ్రాయిడ్ జీవితంలో విలియం ఫ్లైస్ (1858-1928) చాలా ముఖ్యుడు. అతనితో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాల వల్ల ఎన్నో లోతుపాతులు బయటపడ్డాయి. నరాల జబ్బుకు లైంగిక సంబంధమైన మూలం వున్నదని అతనివద్దే ఫ్రాయిడ్ గ్రహించాడు. సెక్స్ కారణాలుగా జబ్బులు వస్తాయని ఫ్రాయిడ్ అనేక ఉపమానాలు, కథలు, గ్రీకుగాథలు ఉదహరించి, విస్తారంగా వివరించాడు. పురుషులలో నరాల జబ్బు (న్యూరస్తేనియా) రావడానికి హస్తప్రయోగం కారణమని యిది యవ్వనారంభదశలో వస్తుందని అన్నాడు. యవ్వనదశలో స్త్రీలతో సంపర్కంగల పురుషులకు ఈ జబ్బు రాదన్నాడు. హస్తప్రయోగం వల్ల పిచ్చి వస్తుందనే నమ్మకం వైద్యరంగంలో ఫ్రాయిడ్ కాలం నాటికే బలపడి వుంది.

స్త్రీలలో హిస్టీరియాకు, నరాల జబ్బులకు యవ్వనారంభ దశలో బలవంతపు సెక్స్ ప్రయోగాలు కారణమని ఫ్రాయిడ్ అన్నాడు. పురుషులలో యవ్వనదశలో సెక్స్ ప్రయోగం రోగాన్ని రాకుండా చేస్తుంటే అదే సెక్స్ ప్రయోగం స్త్రీలలో రోగానికి దారితీస్తుందని ఫ్రాయిడ్ పరస్పర విరుద్ధనిర్ణయాలు చేశాడు.

ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతాలు ప్రపంచాన్ని బాగా ఆకర్షించాయి. తన సెక్స్ సిద్ధాంతాలకు తన సొంత అనుభవాలే కారణమని ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. సంభోగంలో రేతస్సు ముందుగానే పడిపోవడం, తృప్తిగా సంభోగం జరగకపోవడం రోగ లక్షణాలకు దారితీస్తున్నట్లు ఫ్రాయిడ్ చెప్పాడు. సుఖరోగాలను కూడా ఫ్రాయిడ్ తన సిద్ధాంతంలో స్వీకరించాడు. అలాంటి రోగాలను ఆపవచ్చుగాని, పూర్తిగా నయం చేయలేమన్నాడు. గనేరియా, సిఫిలిస్ వంటి లక్షణాలు దృష్టిలో

పెట్టుకొని ఫ్రాయిడ్ తన సెక్స్ సిద్ధాంతంలో వివరణ యిచ్చాడు. క్రమేణా సైకో ఎనాలసిస్ అనే ఫ్రాయిడ్ సిద్ధాంతం పుంజుకున్నది. హిస్టీరియా, కలలు, కోర్కెల్ని అణచుకోవడం, చిన్నతనంలో సెక్స్, అచేతనం అనేవాటిని ఫ్రాయిడ్ ప్రచారంలోకి తెచ్చాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలోనే ఫ్రాయిడ్ తన సిద్ధాంత రచనలు లోకానికి చాటాడు. దీని ఆచరణకు ఉపక్రమించినవారు సైకో ఎనాలసిస్‌ను ఒక ఉద్యమంగా స్వీకరించారు. ఎదురు చెప్పడానికి భయపడ్డారు. ఫ్రాయిడ్ పలుకుబడి అలా వుండేది.

## మనోవిశ్లేషణ (సైకో ఎనాలసిస్)

ఫ్రాయిడ్ కనుగొన్నట్లు ప్రసిద్ధిచెందిన సిద్ధాంతం పేరు సైకో ఎనాలసిస్. అంటే మనోవిశ్లేషణ. అదొక ప్రపంచ ఉద్యమంగా వ్యాపించి, సంఘాలు వెలిశాయి. అంతర్జాతీయ సంఘాధ్యక్షులుగా సుప్రసిద్ధ మనోవైజ్ఞానికుడు కార్ల్‌యుంగ్‌ను పెట్టి ఫ్రాయిడ్ ప్రచారం చేశాడు. వియన్నా సంఘాధ్యక్షుడుగా మరో మనోవైజ్ఞానికుడు యాడ్లర్ వున్నాడు. 1906 నాటికే ఫ్రాయిడ్ తన వినూత్న సిద్ధాంతాలు రాసి, ప్రచారంలో పెట్టాడు. వాటిని అమలులోకి తెచ్చాడు. ఎదురులేని విధంగా యీ సిద్ధాంతాలు అతిత్వరగా అల్లుకుపోయాయి. వైజ్ఞానిక దృక్పథంతో పరీక్షకు నిలుస్తాయా లేదా అని చూడదలచినవారు మైనారిటీ అయ్యారు. అలాంటివారు విమర్శలు ఆనాటి ప్రచారంలో కొద్ది మందికే చేరాయి.

హిస్టీరియా అంటే ఏమిటి, అణచివేతకు అర్థం ఎలా చెప్పాలి, కలలు వాటి స్వభావం, చిన్నప్పటి సెక్స్ ప్రవృత్తి, అచేతనం బలం గురించి ఫ్రాయిడ్ చెప్పినవి ఆకర్షణీయంగా అంటుకుపోయాయి. సైకో ఎనాలసిస్ రంగంలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ప్రచారంలో పెట్టడానికి యూంగ్ యాడ్లర్‌కు తోడు, కార్ల్ అబ్రహం, విల్‌హెల్మ్ స్టెకల్ వంటివారు బాగా కృషిచేశారు. ఫ్రాయిడ్ అనంతరం కారన్ హర్నే, హారీస్టాక్ సల్లివన్, ఎరిక్ ఫ్రాంలు యీ రంగంలో నిలిచి పనిచేశారు. కాంగ్రెస్ పార్టీకి గాంధి ఎలా వుండేవారో, సైకో ఎనాలసిస్ సంఘానికి ఫ్రాయిడ్ అలా నిలిచాడు. పదవులు నిర్వహించకపోయినా, పెత్తనం చేశాడు. ఆయన మాట చెల్లింది. వ్యతిరేకుల్ని చిత్తుచేసి నెగ్గుకురావడంలో ఫ్రాయిడ్ ఆరితేరాడు. యూంగ్, యాడ్లర్ క్రమేణా తమ సొంత వ్యాఖ్యానాలతో ఫ్రాయిడ్‌కు దూరం అయ్యారు. అయినా ఫ్రాయిడ్ పలుకుబడి తగ్గలేదు. సైకో ఎనాలసిస్‌పై సర్వహక్కులూ తనకే వున్నాయని, అందులో అక్షరం మార్చాలన్న తన అనుమతి కావాలన్నట్లు ఫ్రాయిడ్ ప్రవర్తించాడు. మార్పులు చేసే హక్కు తన ఒక్కడికే వున్నదని చూపాడు. ఈ నేపథ్యంలో సైకో ఎనాలసిస్ సిద్ధాంతం ఆచరణ ఎలా సాగిందో గమనిద్దాం.

ఇది 20వ శతాబ్దపు విచిత్ర కథనం. ఫ్రాయిడ్ గొప్పతనం గమనార్హం. సైకో ఎనాలసిస్‌లో మాట్లాడడమే ముఖ్యం. అటు వైద్యుడు, ఇటు రోగి ఇద్దరే వుంటారు. ఒకరు మాట్లాడుతుంటే మరొకరు వింటారు. రోగిని మాట్లాడనిచ్చి, అతని పదాలలో అర్థాన్ని గూఢార్థాన్ని సంకేతాలను విప్పి చెప్పడం సైకో ఎనాలసిస్ చికిత్స. ఈ విద్యలో ఫ్రాయిడ్ ఆరితేరినవాడు. గ్రీకు, రోమన్ గాథల నుండి ఎంతో అరువుతెచ్చి ఫ్రాయిడ్ తన రచనల్లో వాడాడు.

ఫ్రాయిడ్ మూలాధారం అవ్యక్త మనస్సు. అదే వ్యక్తుల్ని కదిలించి, నడిపించి, మాట్లాడిస్తుంది. అంటే మానవుడిని అవ్యక్త మనస్సు నిర్దేశిస్తుంది. మానవుడు స్వేచ్ఛగా ఇచ్ఛాపూర్వకంగా ప్రవర్తించే శక్తిమంతుడు అనుకోవడం సరికాదు. మానవుడి ప్రవర్తన గురించి 'ది సైకోపాథాలజీ ఆఫ్ ఎవ్విరిడే లైఫ్'లో ఫ్రాయిడ్ వివరించాడు. దీని ప్రకారం స్వేచ్ఛగా ప్రవర్తించే అవకాశం లేదు. అవ్యక్త మనస్సు నడిపిస్తుంది. అవ్యక్తత నుండి ప్రవహించేవన్నీ మన చేతన దశను ప్రభావితం చేస్తాయి. ఇది తిరుగులేని విషయంగా ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. మార్టిన్ లూథర్, లియొనార్డో వంటి సుప్రసిద్ధ వ్యక్తుల ప్రవర్తన తన అవ్యక్త సిద్ధాంతాన్ని బలపరుస్తున్నట్లు చెప్పుకున్నాడు. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతంలో చాలా వినూత్న ప్రయోగాలు, పదాలు, ఉపయోగాలు, కథలు కనిపిస్తాయి. అందులో గ్రీకుకథగా వుంటూ వచ్చిన ఒడిపస్ విషయాన్ని ఫ్రాయిడ్ స్వీకరించాడు. దీనినే ఒడిపస్ కాంప్లెక్స్ అంటారు. మనోవిశ్లేషణలో కీలకపాత్ర వహించిన ఒడిపస్ కథను 1910లో మొదటిసారి ఫ్రాయిడ్ రంగం మీదకు తెచ్చాడు. ఫ్రాయిడ్ సెక్స్ సిద్ధాంతంలో మూల విషయంగా యిది పరిణమించింది. చిన్నతనంలో ఆరంభమయ్యే సెక్స్ ఆలోచన, ప్రవర్తన పెద్దదయిన తరువాత ఎలా ప్రభావితం చేస్తుందో చూపడానికి యీ కథను ఫ్రాయిడ్ వాడుకున్నాడు. ఫ్రాయిడ్ ప్రకారం ఏడాది వయస్సుకే పిల్లవాడికి తల్లిపై లైంగికప్రేమ అంకురార్పణ జరుగుతుంది. ఆడపిల్లలకు తండ్రిపై అలాంటి యిచ్ఛ వుంటుంది, ఇదే తండ్రిపై ద్వేషంగా పిల్లవాడిలోనూ, తల్లిపై ద్వేషంగా కుమార్తెలోనూ అంకురార్పణ అవుతుంది. దీనినే ఒడిపస్ కాంప్లెక్స్‌గా చెబుతున్నారు. కానీ అసలు కథకి ఎన్నో వక్రీకరణలు చేశారు. కనుక మూలం ఏమిటో తెలిస్తే గానీ ఫ్రాయడ్ విశ్లేషణల విశ్వసనీయత బయటపడదు.

## ఒడిపస్ కథ ఏమిటి?

మనోవిశ్లేషణలో మూలసూత్రంగా స్వీకరించిన ఒడిపస్ సూత్ర కథ ఏమిటి? ఇది గ్రీకు గాథ. థీబ్స్ అనే ప్రాంతానికి రాజు లూయిస్. అతనికి పిల్లలు లేరు. ఆరకిల్ కొండ దేవతను అడిగితే, పిల్లవాడు పుడతాడు కాని వాడే నిన్ను చంపుతాడని చెబుతుంది. ఆ మాటలు నమ్మిన రాజు లూయిస్ తన భార్య జొకాస్తకు దూరంగా వుంటాడు. దీనికి ఆమె ఆగ్రహిస్తుంది. అతన్ని బాగా తాగించి, అతనితో జతకడుతుంది. ఆ తర్వాత పిల్లవాడిని కంటుంది. రాజు ఆ పసివాడిని లాక్కొని రెండు కాళ్ళు కలిపి మేకులు కొట్టి సిథారన్ పర్వతంపై పడేస్తాడు. లాయిస్ అనుకున్నట్లు ఆ పిల్లవాడు కొండపై చనిపోలేదు. ఒక పశువుల కాపరి చూసి కొరింత్ ప్రాంతానికి తీసుకువచ్చి, ఒడిపస్ అని పేరు పెడతాడు. ఆ ప్రాంతానికి రాజు అయిన పోలిబస్, రాణి పెరిబోయాకు పిల్లలు లేకుంటే, వారికి ఒడిపస్‌ను ఇచ్చేస్తాడు. పిల్లవాడు పెరిగి, యవ్వనదశకు వస్తాడు. అతణ్ణి చూసిన స్నేహితులు తల్లిదండ్రుల పోలికలు అతనిలో లేవని నెపం వేస్తారు. సంప్రదాయానుసారం ఆరికల్ కొండ దేవత దగ్గరకు వెళ్ళి తనను గురించి అడుగుతాడు. "నువ్వు నీ తండ్రిని చంపి, నీ తల్లిని పెళ్ళాడతావు ఫో" అంటుంది. తల్లిదండ్రులను విపరీతంగా ప్రేమించిన ఒడిపస్ ఈ

జోస్యం విని, తిరిగి కొరింత్ ప్రాంతానికి కాకుండా దూరంగా వెళ్ళిపోవాలనుకుంటాడు. డాలిస్ ప్రాంతంవైపు వెడుతుంటే ఒకచోట ఇరుకుదారిలో రథంపై వస్తున్న లాయిస్ ఎదురౌతాడు. ఇద్దరూ ఎదురెదురుగా తప్పుకొని వెళ్ళేటంత వెడల్పు లేదు. ఒడిపస్‌ను తప్పుకోమని లూయిస్ హుకుం చేస్తాడు. ఒడిపస్ నిరాకరిస్తాడు. రథం ముందుకు సాగగా, లూయిస్ రథచక్రాలు ఒడిపస్ కాలును నలిపేస్తాయి. ఆగ్రహంతో లూయిస్‌ను, రథసారథిని ఒడిపస్ చంపేస్తాడు. తాను చంపుతున్నది తన నిజ తండ్రినే అని ఒడిపస్‌కు తెలియదు. థీబ్స్ వెళ్ళగా అక్కడ చిక్కు ప్రశ్నలు వేసే స్ఫినిక్స్ ఎదురౌతుంది. చిక్కుముడి విప్పినవారే బతికి ముందుకు సాగిపోగలరు. ఒడిపస్ ఆ చిక్కు ప్రశ్నల్ని విప్పి, నగరాన్ని పీడిస్తున్న స్ఫినిక్స్‌ను వదిలిస్తాడు. నగరవాసులు ఆనందంతో అప్పుడే విధవగా మారిన జొకాస్తా రాణిని ఇచ్చి ఒడిపస్‌కు పెళ్ళి చేస్తారు. ఆమె తన నిజమైన తల్లి అని ఒడిపస్‌కు తెలియదు. థీబ్స్ ప్రాంతానికి ప్లేగువ్యాధి వ్యాపిస్తుంది. డెల్ఫిక్ దేవతను అడిగితే, లూయిస్ రాజును చంపినవాడిని వెళ్ళగొట్టమంటుంది. తానే చంపినట్లు ఒడిపస్‌కు తెలియక, హంతకుడిని తరిమేస్తానంటాడు.

గ్రీసులో గౌరవపాత్రుడైన టైరిసియస్ అనే అంధుడు. ఒడిపస్‌ను కలిసి, నగరం కోసం ఒక వ్యక్తి ఆహుతి కావాలంటాడు. తాను త్యాగం చేయటానికి సిద్ధమని జొకాస్తా రాణి తండ్రి ప్రకటిస్తాడు. కాని అసలు రహస్యం మరొకటి వున్నదనీ, దేవతలు బలికోరే వ్యక్తి వేరే వున్నాడనీ చెబుతాడు. తన కుమార్తె జొకాస్తాను పెళ్ళాడిన ఒడిపస్ ఆమె కుమారుడనీ, అతను చంపింది అతని తండ్రి లూయిస్‌నేనని బయటపెడతాడు. ఒడిపస్ పొరుగురాజుకు ఎలా దత్తపుత్రుడో వెల్లడౌతుంది. జొకాస్తా ఆ కఠోర సత్యం విని ఉరి వేసుకుంటుంది. ఆమె దగ్గరే ఒక పిన్ను లాక్కొని, కంట్లో పొడుచుకొని, ఒడిపస్ అంధుడౌతాడు.

ఇదీ ఒడిపస్ గాథ. ఫ్రాయిడ్ ఉదహరించే ఒడిపస్ కాంప్లెక్స్ ఈ గాథ నుండే స్వీకరించాడు. అదెలాగో పరిశీలిద్దాం. అసలు గ్రీక్ కథను ఫ్రాయిడ్ యథాతథంగా స్వీకరించలేదు. తన సెక్స్ సిద్ధాంతానికి అనుగుణంగా కథను మలచుకొని, భాష్యం చెప్పాడు. ప్రచారం చేశాడు. అది ఫ్రాయిడ్ సిద్ధాంత ప్రచారబలం.

ఒడిపస్ తన తండ్రిని చంపదలచుకోక వెళ్ళిపోయాడు. అసలు తండ్రి ఎవరో అతనికి తెలియదు. అడ్డొచ్చిన వ్యక్తిని చంపుతున్నప్పుడు తాను హతమారుస్తున్నది తన తండ్రినే అని ఒడిపస్‌కు తెలియదు. తల్లిని పెళ్ళి చేసుకుంటున్నప్పుడు ఆమే తన తల్లి అనేది కూడా ఒడిపస్‌కు తెలియదు. తల్లితో చిన్నతనం నుండే లైంగిక సంబంధం పెట్టుకోవాలని అతను కోరుకోలేదు. కనుక ఫ్రాయిడ్ సిద్ధాంతానికి ఒడిపస్ కథ యిమడదు. అయినా అదే కథను తీసుకొని, ఒడిపస్ చేసిందంతా అవ్యక్త అచేతన మనస్తత్వ బలం వల్ల అని చెప్పి లోకాన్ని నమ్మించడం ఫ్రాయిడ్ ప్రచార బలానికి నిదర్శనం.

ఒడిపస్ కాంప్లెక్స్ ప్రకారం తండ్రి పట్ల ద్వేషం, తల్లీ పట్ల కామం వుండాలి. అవి ఒడిపస్ కథలో లేవు. అయినా ఫ్రాయిడ్ ఒడిపస్ కాంప్లెక్స్ సృష్టించాడు. ఒక ప్రాచీన గాథను తన సిద్ధాంతానికి అనుగుణంగా మార్చుకోవడమేగాక, అది శాస్త్రీయమని చెప్పడం ఫ్రాయిడ్ బుకాయింపుతనం. ఇది సైకో ఎనాలసిస్ మూలాధారం. అది ఎవరూ పరీక్షకు పెట్టకుండా చాలాకాలం అంగీకరించడం విశేషం! ఫ్రాయిడ్ వాడి, ప్రచారంలో పెట్టిన సూపర్ ఈగో, ఇద్, ఈగో వంటి పదాలను ఆకర్షణ వున్నదేగాని శాస్త్రీయ పరిశోధనగాని, ఆధారాలతో కూడిన రుజువుగాని లేదు. అయినా కథకుడివలె ఫ్రాయిడ్ తరచు యీ పదజాలాన్ని వాడుతూ పోయాడు. అలా వాడగా, అదే నానుడిగా మారి, మూలాధారణ ఏమిటి అని అడగడం మరచిపోయారు జనం.

## స్త్రీలు - ఫ్రాయిడ్

స్త్రీల పట్ల ఫ్రాయిడ్ ధోరణి, అవగాహన అశాస్త్రీయతకు పరాకాష్ట. ఆడపిల్ల పెరగడంలో ఆమె లైంగికంగా చిదికిపోవడం పెద్దమలుపు అంటాడు. పిల్లలు పుట్టించకుండా ఎద్దుకు వట్ట చితకకొడతారు. అలాగే పురుషాంగం స్త్రీలలో చితికిపోవడమే స్త్రీ లైంగిక లోపంగా ఫ్రాయిడ్ చిత్రించాడు. లైంగిక లోపాన్ని కప్పిపుచ్చుకోవడం స్త్రీ జీవిత పర్యంతం అవస్థగా మారిందంటాడు. మిగిలిన విషయాలలో మాత్రం స్త్రీకి వ్యక్తిగా గౌరవం వుంటుందన్నాడు. సెక్స్ సిద్ధాంతాలకు ఆద్యుడు, మూలపురుషుడు అని భ్రమపడేవారు తెలుసుకోవాల్సిన సత్యమిది. స్త్రీ పురుషుల మధ్య సెక్స్ సంబంధంలో ఆప్యాయతలు, ప్రేమ, వ్యక్తిత్వ వెల్లడి వంటివేమీ ఫ్రాయిడ్ దృష్టిలో లేవు.

## ఆద్యంతాలూ యూదు జాతీయత

తన స్వీయగాథలలో ఫ్రాయిడ్ రాస్తూ తాను యూదుగానే వున్నానన్నాడు. అబ్రహాం, ఫెరెంకిలకు రాసిన ఉత్తరాలలో కూడా తన జాతీయతత్వం గట్టిగా చెప్పాడు. మనోవిశ్లేషణ ఉద్యమాన్ని, చికిత్సను, సిద్ధాంతాన్ని వ్యతిరేకించడాన్ని, విమర్శించడాన్ని యూదు వ్యతిరేకతగా ఫ్రాయిడ్ చూపిన సందర్భాలు లేకపోలేదు. యూదులలో మార్మిక దృష్టి లేదనీ, కనుక వైజ్ఞానిక దృష్టికి వారు బాగా పనికొస్తారని ఫ్రాయిడ్ ఉద్దేశం.

ఫ్రాయిడ్ పలుకుబడి, బహుళ ప్రచారం వల్ల అతడి సిద్ధాంతాన్ని ఆనాడు ఎవరూ టెస్ట్‌కు పెట్టలేదు. సైంటిఫిక్ కాదని ఎవరైనా అంటే, విరుచుకుపడడం తప్ప, శాస్త్రీయ సమాధానం ఎన్నడూ రాలేదు. మతాలలో ఆత్మను అడ్డం పెట్టుకున్నట్లే, మానసిక రంగంలో సైకో ఎనాలసిస్ కారుడు అవ్యక్తం, ఉపవ్యక్తం వంటి పదాలను కవచాలుగా వాడారు. అది ఫ్రాయిడ్ ప్రచార సాధనం. అదే ప్రచార గొప్పతనం. ఫ్రాయిడ్‌పై చాలా పరిశోధనలు జరిగాయి. అందులో థామస్ సాజ్ అతిముఖ్యమైన విమర్శలు చేశాడు. ఈ రచనకు ప్రధానాంశాలు అతని రచనల నుండి స్వీకరించాను. ఫ్రాయిడ్ సైకో ఎనాలసిస్ చికిత్సా విధానాన్ని అక్షరాలా పాటించడం మానేశారు.

చాలా మార్పులు వచ్చాయి. వాషింగ్టన్ సెయింట్ ఎలిజబెత్ సైకియాట్రి ఆస్పత్రిలో యీ విషయాలు గమనించాను. థామస్ సాజ్‌ను సిరక్యూస్ విశ్వవిద్యాలయంలో (న్యూయార్క్ రాష్ట్రం, అమెరికా) కలిశాను. ఆయన పుస్తకాలు, వ్యాసాలు గమనించాను. ఫ్రాయిడ్ శిష్యులు కూడా అనేక మార్పులు చేశారు. ఎరిక్‌ఫ్రాం కూడా ఫ్రాయిడ్ గొప్పతనాన్ని గుర్తిస్తూనే, ఆయన లోపాల్ని చూపారు. థామస్ సాజ్ రచన ది మిత్ ఆఫ్ మెంటల్ ఇల్‌నెస్ చదవమని కోరుతున్నాను.

*- వార్త, అక్టోబరు 2002*

# ఇద్దరు నరేంద్రనాథ్‌లు

ఇద్దరూ నరేంద్రనాథ్‌లే. ఇరువురూ బెంగాలీయులే. ఉభయులూ అవివాహితులే. ఆ యిద్దరూ ఉగ్రజాతీయవాదులే.

ఒక నరేంద్రనాథ్ 19వ శతాబ్దం చివరలో, మరో నరేంద్రనాథ్ 20వ శతాబ్దం ఆరంభంలో అమెరికాలో అడుగుపెట్టారు.

సందేహవాదిగా, విద్యార్థిదశలో, పేదరికం భరించలేని స్థితిలో, రామకృష్ణ పరమహంస దగ్గరకు నరేంద్రనాథ్ వెళ్ళారు. దేవుణ్ణి చూపిస్తానని అభయం ఇచ్చేసరికి సాష్టాంగపడిపోయాడు. ఆశ్రమవాసి అయ్యాడు. రామకృష్ణ శిష్యుడయ్యాడు. సన్యాసిగా మారాడు. ప్రచారకుడుగా పరిణమించాడు. సంప్రదాయానుసారం పేరు మార్చుకున్నాడు. నరేంద్రనాథ్ కాస్తా వివేకానంద అయ్యాడు. ఆ పేరుతోనే అమెరికాలోని చికాగో మతసమావేశంలో మాట్లాడాడు. హిందూమత ప్రచారం చేశాడు. అందులోనూ వేదాంత ప్రసారం గావించాడు. దేశంలో జాతీయవాదులకు మత ఉద్వేగాన్ని అందించాడు. అంతవరకూ బ్రహ్మసమాజం తలపెట్టి, పరిమితంగా ఆచరిస్తూ వచ్చిన పునర్వికాసాన్ని వివేకానంద వచ్చి అడ్డుకున్నాడు. జమిందార్ల సహాయ సహకారాలతో మతపునరుద్ధరణకు పూనుకున్నాడు. అమెరికాలో, ఇండియాలో అదే చేశాడు. ఇండియా ఆధునిక యుగంలో అడుగుపెట్టకుండా అడ్డుకున్నాడు. మాటల గాంభీర్యతకు, ఉద్వేగప్రసంగాలకు ముగ్ధులయ్యే జనానికి వివేకానంద వాగ్ధోరణి, ప్రసంగ పాఠాలు హత్తుకపోయాయి. ఆలోచించకుండా ఆమోదించేవారికి వివేకానంద బాగా గురి కుదిరాడు. రామకృష్ణను ఆయన గుడ్డిగా అనుసరిస్తే, జనం వివేకానందను ఆమోదించారన్న మాట.

మరొక నరేంద్రనాథ్ మత ఉద్రేకంతో ఆరంభించి, బ్రిటిష్‌వారిని అదరగొట్టి తరిమేయాలని, అందుకు జర్మనీ ఆయుధాలు సేకరించాలని ప్రయత్నించాడు. బ్రిటన్‌కు జర్మనీ శత్రువు గనుక, శత్రువుకు శత్రువు మన మిత్రుడు అనే సూత్రాన్ని అనుసరించాడు. (ఉత్తరోత్తరా సుభాస్‌చంద్రబోసు యిదే బాటలో నడిచాడు) ఆ వేటలో అమెరికా పశ్చిమతీరం చేరుకున్న నరేంద్రనాథ్ అచిరకాలంలోనే ఎవిలిన్‌తో పరిచయంకాగా ఆమెను పెళ్ళిచేసుకున్నాడు. న్యూయార్క్‌లో అభ్యుదయవాదుల

సాంగత్యం, లైబ్రరీలో మార్క్సిస్టు సాహిత్యం పరిచయమైంది. జాతీయవాదం సడలడం ఆరంభమైంది. పూర్తిగా పోవడానికి కొంతకాలం పట్టింది. అమెరికాలోనే నరేంద్రనాథ్ పేరు మానవేంద్రనాథ్‌గా మారింది.

మానవులంతా సమానం అని మానవ హక్కులు ప్రపంచవ్యాప్తంగా అమలు పరచాలన్నప్పుడు, సంకుచిత జాతీయవాదం ఎలా పనికొస్తుంది? మన మతం మంచిదని వివేకానంద, హిందూమతాన్ని గురించి ప్రచారంచేస్తే అందులో విశ్వజనీనత ఎంతవరకు వుంది? అని ఆలోచించాలి.

జాతీయవాదాన్ని, తరువాత మార్క్సిజాన్ని కాదని, శాస్త్రీయపంథాలో మానవవాదాన్ని అవలంబించిన ఎం.ఎన్. రాయ్ చాలామందికి రుచించకపోవచ్చు. అతడి సిద్ధాంతాలు జీర్ణం కావడానికి కాలం పట్టొచ్చు. భారతదేశం వివేకానందను తృణీకరించి, ఎం.ఎన్. రాయ్‌ను అనుసరిస్తే, మిగిలిన ప్రపంచంతో పాటు ముందంజ వేసేదే. ఇప్పుడు ఆ ప్రయత్నమే జరగాలి.

*- హేతువాది, మార్చి 1992*

# ఆవుల గోపాల కృష్ణమూర్తి
## (స్కెచ్)

గుంటూరు జిల్లా తెనాలి తాలూకా మూల్పూరు గ్రామంలో సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబంలో కనిష్టుడుగా ఏప్రియల్ 29-1917లో జననం. ఉన్నత పాఠశాలా విద్యాభ్యాసం తురుమెళ్ళలో. ఆనాడే విద్యార్థులలో వేరుగా మసిలాడు. ప్రైవేటుగా తెలుగు చదువుకున్నాడు. అప్పుడే 'కృష్ణశతకం' వ్రాసాడని వినికిడి. కళాశాల విద్యాభ్యాసానికి గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో చేరినప్పటినుండి ప్రతిభావ్యుత్పత్తులు విప్పార నారంభించినవి. స్వగ్రామంలో జి.బి.యస్. సరస్వతీ స్వాములవారితో తాత్త్విక చర్చ ఫలితంగా కలానికి పదునెక్కింది. సెలవుల్లో యింటికి వచ్చి, పురాణ శాస్త్రులకు పోటీగా తానూ మహాభారత ఘట్టాలను పురాణంగా చెప్పాడు. అది విని బ్రహ్మానందభరితులైన తల్లి దిష్టి తీసెయ్యటం యేమంత విశేషంకాదేమో.

గుంటూరు కళాశాలా జీవితంలో భవిష్యత్తుకు పునాదు లేర్పడ్డయ్. ఇంగర్‌సాల్, త్రిపురనేని రామస్వామి రచనలు ఛాందస భావాల్ని ఛేదించటానికి వుపకరించగా, ఆ ప్రోత్సాహం మున్ముందుకు నడిపించింది. పట్టణ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నుకోబడటం అందులో భాగమే. అప్పుడే కర్ణాకర్ణిగా ఎం.ఎన్.రాయ్‌ని గురించి విని, తెలుసుకోవాలనే జిజ్ఞాసలోవుండగా, ఒకానొక కమ్యూనిస్టు రాయ్‌ని దూషిస్తుంటే, సాచి చెంపపెట్టు పెట్టిన ఉద్రేకి గోపాలకృష్ణమూర్తి. ఆప్తమిత్రుడు ఎలవర్తి రోసయ్య చాదస్తాన్ని వదలించ దీక్షబూని, త్రిపురనేని

రామస్వామి పద్యాలు వినిపించి, విప్లవబీజాలు నాటి ఒకనాటి రాత్రి పిలక కత్తిరించిన చిలిపి గోపాల కృష్ణమూర్తి. యదార్థ సాహిత్య సమితి స్థాపించి గ్రాంధిక వాదానికి మద్దత్తుగా రచనలు సాగించాడు. ఆ తర్వాత, సిద్ధాంతంలో వ్యతిరేక సిద్ధాంతం పుట్టినట్లు, పచ్చి వాడుకభాషావాదిగా, తన పేరును 'క్రుష్ణమూర్తి' అని వ్రాసుకున్నాడు. ఆ తర్వాత ఎం.ఎన్. రాయ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, 'ఇండిపెండెంట్ ఇండియా' దినపత్రిక తెప్పించి, గుంటూరులో అమ్మిన ఘట్టాలు కేవలం తలపులుగా నిలిచిపోయినయ్. లక్నోలో ఎం.ఏ., ఎల్.ఎల్.బి., చదువుతుండగా రాయ్, బోస్ ప్రభృతులతో పరిచయమైంది. ఆవుల దృష్టిలో బోస్ 'సోషల్ ఫాసిస్టు' కాగా, రాయ్ తాత్త్విక విప్లవమూర్తిగా సన్నిహితత్వం వల్ల గ్రహించగలిగాడు. నేషనల్ హెరాల్డ్‌లో వ్యాసాలు వ్రాయటంతో పత్రికా రచనలోకి దిగాడు. అప్పటి గోపాలకృష్ణమూర్తి తేడాగల రాయిస్టు. చివరివరకూ అలాగే వున్నాడు. తేడా గల రాయిస్టుగా వుండగలగటమే ఆయన వ్యక్తిత్వ విశిష్టత.

విద్యాభ్యాసానంతరం కొద్దిమాసాలు మాత్రం మద్రాసులో, తర్వాత గుంటూరులో న్యాయవాదవృత్తి అభ్యసిస్తూ, చివరకు తెనాలిలో స్థిరపడ్డాడు. ఆంధ్ర రాడికల్ డెమొక్రటిక్ పార్టీ కార్యదర్శిగా సన్నిహితులనుండిగూడా ఫిర్యాదులు తెచ్చుకొని, విచారణకు ధైర్యంగా నిలబడి, వ్యక్తి స్వేచ్ఛను నిలబెట్టుకున్నాడు. ఆనాటి గోపాల కృష్ణమూర్తి ఉద్రేకి, వుద్వేగి. తీవ్రంగా వ్రాసేవాడు. కరకుగా ఉండేవి. గాంధీని గురించి వ్రాస్తే, ఆప్తమిత్రులే సహించలేకపోయారు. 1942లో రాడికల్ పత్రిక స్థాపించి, పార్టీ పత్రికగా నడిపారు. సమకాలీన సిద్ధాంతాల్ని వెంటనే అర్థం చేసుకుని, అన్వయీకరణ గావించి, తెలుగులో విడమరచి చెప్పగలగటం గోపాల కృష్ణమూర్తికి అబ్బిన విద్య. అందుకే ఆంధ్రలో ఎం.ఎన్. రాయ్‌కు భాష్యకారుడు కాగలిగాడు. బహుశ అధ్యయన శిబిరాల్లో 'పీఠాధిపతి'గా యితరులు ముద్రవేయటానికి కూడా యిదే కారణమనుకోవచ్చు. త్రిపురనేని రామస్వామిచేత రాయ్ గ్రంథాలు చదివించి, మెప్పించాడు. ఆంధ్ర నుండి వచ్చిన ఫిర్యాదుల నాధారంగా రాయ్ ఎడముఖంగా వుంటే, తానూ పెడముఖంపెట్టి, చివరకు రాయ్ రాజీకి వచ్చేట్లు ప్రవర్తించిన పట్టుదల; కొరియా యుద్ధం వంటి సమస్యలలో 'నీకింకా కమ్యూనిస్టు మనస్తత్వం వదలలేదని' రాయ్‌ని ముఖాన కొట్టినట్లు అనగల సాహసోపేత భావుకుడు మూర్తి. అందుకే తేడాగల రాయిస్టు. రాయ్ పార్టీని రద్దుచెయ్యాలనే తీర్మానాన్ని బలపరచి భావగమన వేగాన్నందుకున్న ఆలోచనాపరుడు. క్రమేణా పలుకులో పరుషం సడలించి, మాధుర్యం పెంచి, వ్రాతలలో 'పోలీసు దెబ్బల' తీరును సాగించాడు. వివిధ రంగాలలో పునర్వికాసోద్యమాన్ని నడిపే యత్నంలో నిర్విరామ కృషి చేసి, అనారోగ్యానికి పునాదులు వేసుకున్నాడు. అవసరమొచ్చినప్పుడు జారుకునే మిత్రులనబడే వారిమధ్య, ఆషాఢభూతులుచుట్టూ క్రమ్మిన వాతావరణాన్ని నిబ్బరంగా ఆకళింపుజేసుకొని, ఎన్నో మానసిక వైవిధ్యాల నెదుర్కొంటూ, గజ గమనం సాగించాడు. 1954లో తెనాలి పురపాలక సంఘాధ్యక్షుడుగా కొద్దికాలంపాటు నిర్మాణాత్మక ప్రజాస్వామ్యం ఆచరించ ప్రయత్నించి, కొంత సఫలత కొంత విఫలత పొందాడు. మానసికంగా ఒక్కొక్క మెట్టెక్కుతూ, తామర తంపరగా మాజీ మిత్రులను తయారుచేసాడు. ఆయన 'చుట్టూ ప్రపంచంలో' పత్రికా

విలేఖరులు, కళాకారులు, కవులు, స్వాములు, పురపాలకులు, రాజకీయపు మనుషులు, హ్యూమనిస్టులు, అన్యులు వుండేవారు.

పదవులు లేనివారికి, 'నష్టజాతకులకు', సన్మానాలు చేయించాడు. స్వేచ్ఛ దెబ్బతినే ఏ విధాన్నైనా ధైర్యంగా ఎదిరించాడు. 'మూడక్షరాల', 'ఐదవ తరగతి' పండితుల మొదలు, 'బ్రహ్మీమయమూర్తుల' వరకూ అన్ని రంగాలలో భిన్నస్థాయి భేదాలతో, ఆదరించటమో ఎదిరించటమో చేయగలిగాడు. ఎంతటి ఆప్తులైనా తప్పుదారిన పడితే, 'తప్పు' అని హెచ్చరించగలిగాడు. పదుగురాడు మాటే చెల్లాలి అంటే, అది హేతుబద్ధం కాకుంటే, అలాగని చెప్పి, ప్రవాహానికి అడ్డంగా, ఎదురుగా ఈదాడు. ఆయన ఠాగూర్‌ను విమర్శిస్తూ వ్యాసం వ్రాస్తే, 'రాడికల్ హ్యూమనిస్ట్' (ఆంగ్ల వారపత్రిక) ప్రచురించలేకపోయింది. రాడికల్ హ్యూమనిజం కూడా అనార్కిజానికి దారి తీస్తుందంటే ఆశ్చర్యపోయారు అనుచరులు. కాశ్మీర్ సమస్యపై వ్యాసాలు వ్రాస్తుంటే, అరెస్ట్ చేస్తారేమోనని మిత్రులు భయపడకపోలేదు. సంస్కృతానికి తెలుగే మాతృక అంటే ఆశ్చర్యంతో నోర్లు నొక్కుకున్నారు.

అసలు ఆవుల గోపాలకృష్ణమూర్తిలో లోపాలే లేవా? అన్నీ అత్యుత్తమ లక్షణాలేనా? అంటే అదేమికాదు. కాని లోపాల నుండి నేర్చుకునేదేమున్నది, లోపాలు తప్ప!

తారీఖులతో నిమిత్తంలేని జీవితం గడపి, ఒకరు అనుసరించ వీల్లేని పంథాలో గమించి, విశేషణాలలో యిమడని రీతిగా ఎన్నో పనులు చేసాడు.

వ్యాసాలు-ఉపన్యాసాలు, పౌరోహిత్యం, ప్రెస్‌క్లబ్, బాలకళామందిర్, లయన్స్ క్లబ్, పంతుళ్ళ సమావేశాలు; సన్మానాలు కవులకు, కళాకారులకు; స్టడీకాంపులు, రాడికల్ హ్యూమనిస్టులకు; అన్నిటా 'గాత్రం' పాడి, 'వైశేషికత్వాన్ని' నిలబెట్టుకున్నాడు. అనేక యుద్ధముల ఆరితేరిన జ్ఞానవృద్ధుడయ్యాడు. అఖిల భారత సమావేశాల్లో, అమెరికా, ఐరోపాలలో విశిష్టుడుగానే చలామణి అయ్యాడు. ఇంట్లో పిల్లలమధ్య హాయిగా కాలక్షేపం చేసాడు. వాళ్లు పూజలు, పునస్కారాలు చేస్తుంటే - మతస్వేచ్ఛ అర్థం చేసుకుని ఆచరణలో పెట్టిన వ్యక్తిగనుక - నిరోధించనూలేదు, ప్రోత్సహించనూ లేదు. తన భావాలు చెప్పేవాడు. వాటి ప్రభావం తక్షణమే చూడాలన్నంత రాజకీయవాది కాదు.

ఆంధ్రలో పునర్వికాసోద్యమం వ్రాస్తూ, అందులో ఆయన పాత్ర వ్రాస్తే, కొంత స్వీయం కలసొస్తుందని, చనువుతో నేనంటే 'పార్కలాం' అన్నాడేగాని, దానికి నాంది పలకలేదు. అన్యులు ఆ కృషి చేసేదెప్పుడోమరి!

*- హ్యూమనిజం, అక్టోబరు 1966*

# అమెరికాలో ఆవుల గోపాలకృష్ణమూర్తికి హెచ్చరిక!

అమెరికాలో పర్యటించినా ఆంధ్రలో వున్నా ఆవుల గోపాలకృష్ణమూర్తి విశిష్ట హ్యూమనిస్టుగానే ప్రవర్తించాడు.

1964లో అమెరికా ప్రభుత్వ ఆహ్వానంపై 3 మాసాలు పర్యటించిన ఆవుల గోపాలకృష్ణమూర్తి (ఎ.జి.కె)కి సంబంధించిన కొత్త విశేషం తెలిసింది.

అప్పట్లో బి.కె. నెహ్రూ భారత రాయబారిగా అమెరికాలో వున్నాడు. ఆయన భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బంధువు కూడా. నెహ్రూ విధానాలు నిశితంగా పరిశీలించిన ఎ.జి.కె.ను అమెరికాలోని భారత రాయబారి హెచ్చరించాడట, ఏమని?

జవహర్‌లాల్ నెహ్రూను అమెరికాలో విమర్శిస్తే, ఎ.జి.కె.ను బలవంతంగా ఇండియా పంపివేయాల్సి వస్తుందని!

కాని, ఎ.జి.కె. తన విమర్శలు ఏ మాత్రం సడలించలేదు. హెచ్చరికల్ని ఖాతరు చేయలేదు. తానుహేతుబద్ధం అనుకున్న విమర్శ చేశాడు.

ఆనాడు ఎ.జి.కె. చికాగోలో వుంటున్న వడ్లమూడి శ్రీకృష్ణకు అతిథి. శ్రీకృష్ణగారు ప్రస్తుతం వాషింగ్టన్ సమీపంలో మేరీలాండ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన తెనాలి తాలూకా మోపర్రు వాసి ఎ.జి.కె. పట్ల భారత రాయబార కార్యాలయం ప్రవర్తన గురించి వడ్లమూడి శ్రీకృష్ణ నాకు యిటీవలే వెల్లడించారు.

అమెరికాకు ఆహ్వానించిన వారిలో ఎ.జి.కె. వంటి వ్యక్తి చాలా అరుదైన వారని అమెరికా ప్రభుత్వం భావించిందట.

ఎ.జి.కె. కుమార్తె జయశ్రీ పెళ్ళి నిశ్చయమైన సందర్భంగా మద్రాసు నుండి బి.ఎస్. ఆర్ కృష్ణ వచ్చి ఆహ్వానం అందజేశారు. అది ఆనాడు హ్యూమనిస్టులకు పెద్ద పండుగ. పెళ్ళిలో ఆవుల సాంబశివరావు ఆధ్వర్యాన కవి సమ్మేళనం జరుగుతుండగా అమెరికాకు ఎ.జి.కె. ఆహ్వానం కూడా ఒక సంబరంగా సాగింది.

ఎ.జి.కె. ఆహ్వానాన్ని భరించలేని వ్యక్తులు కొందరు వివేకానంద పేరిట కొత్త ఎత్తుగడకు పూనారు. సన్మానం పెట్టి అమెరికాలో వివేకానంద గొప్పతనం చెప్పిరమ్మనారు. అలాంటి భట్రాజీయం తాను చేయనని, ఉన్నది ఉన్నట్లు వివేకానంద గురించి చెబుతాననీ, అదీ ప్రస్తావన వస్తేనే మాట్లాడతాననీ ఎ.జి.కె. అన్నారు.

ఇంకేముంది? ఆ మాట పట్టుకొని, ఆనాడు ఆంధ్రప్రభ సంపాదకుడుగా వున్న నీలంరాజు వెంకటశేషయ్య (కంచి శంకరాచార్య పాదపూజ భక్తుడు) ధ్వజమెత్తాడు. ఎ.జి.కె.ను అమెరికా వెళ్ళనివ్వరాదని, వెళ్ళినా వెనక్కు పిలిపించాలని లేఖలు ప్రచురించారు. హైందవం నాలుగు పడగల నాగు అలా ఫాసిజం వెదజల్లింది. కాని అమెరికా ప్రభుత్వం గాని, భారత ప్రభుత్వం గాని, యీ ఫాసిస్టు విమర్శలు పట్టించుకోలేదు.

అమెరికా నుండి తిరిగి వచ్చిన ఎ.జి.కె. తన పర్యటనానుభవాలు ప్రజలకు సభాముఖంగా వివరించాడు. పుస్తకం ప్రచురించాడు.

ఎ.జి.కె. వంటి బహుముఖ ప్రజ్ఞాశాలి హ్యూమనిస్టు ఉద్యమంలో వుండడం, బాగా పునాదులు వేయడానికి తోడ్పడింది.

ఎ.జి.కె.పై సమగ్ర పరిశీలన అవసరం. విపుల గ్రంథం వెలువడితే భవిష్యత్తులో హేతువాదులకూ హ్యూమనిస్టులకూ చాలా మార్గదర్శకంగా వుంటుంది.

స్టడీకాంపులలో ఎ.జి.కె. నిర్భయంగా ఎం.ఎన్. రాయ్‌ను కొన్ని సందర్భాలలో ఎదుర్కొన్నారు. ఒకసారి కొరియా విషయమై అలాంటి వివాదంలో తీవ్ర అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు ఉభయులూ ఒక రోజంతా ముభావంగా, ఎడముఖం పెడముఖంతో వున్నారట. ఇది గమనించిన ప్రముఖ హ్యూమనిస్టులు ఉభయుల్నీ కలిపి వాతావరణం చల్లబరిచారట.

త్రిపురనేని రామస్వామి - ఎం.ఎన్. రాయ్ భేటీ తెనాలిలో జరిగినప్పుడు రాయ్ అసంతృప్తితో రామస్వామి ఆర్యసమాజ్ వాసనలు పోగొట్టుకోలేనివాడిగా పేర్కొన్నట్లు ఎ.జి.కె. చెప్పారు.

కాంగ్రెసు అధ్యక్ష పదవికి పోటీచేసిన ఎం.ఎన్. రాయ్ పొరపాటున గెలిచి వుంటే రాడికల్ హ్యూమనిజం ఎటు పొయ్యేదోనని నవ్వుతూ ఎ.జి.కె. వ్యాఖ్యానించేవారు.

ఎం.ఎన్. రాయ్‌ను చివరిదాకా కమ్యూనిస్టు భయం వెంటాడిందనీ, చంపుతారనే అనుమానం వుండేదనీ, రాయ్‌ను దగ్గరగా పరిశీలించిన ఎ.జి.కె. అంటుండేవారు.

ఎ.జి.కె.ను గురించి తెలుసుకోవలసిందీ, ఉద్యమానికి ఆయన చేసింది భావితరాలకు చెప్పాల్సింది చాలా వుంది.

## రోశయ్యను మార్చి ఎ.జి.కె.

సుప్రసిద్ధ టీచర్‌గా పేరొందిన ఎలవర్తి రోశయ్యగారు ఎ.జి.కె.కు మంచి స్నేహితులు. రోశయ్యగారు గుంటూరు ఎ.సి. కాలేజి, జె.కె.సి. కాలేజి, భీమవరం కాలేజీలలో పనిచేశారు. విశిష్ట లెక్చరర్‌గా పేరొందారు. కరడుగట్టిన గ్రాంధికవాది. అలాంటి రోశయ్యగారు విద్యార్థి దశలో పిలక పెంచి, చాదస్తంగా నన్నయగారు, తిక్కనగారు, ఎర్రనగారు అంటూ కవిత్వమంటే చెవికోసుకునేవారు. ఎ.జి.కె. గుంటూరు హాస్టల్‌లో ఒకనాడు తెల్లవారుజామున రోశయ్య పిలక కత్తిరించేశాడు. అపచారం అంటూ రోశయ్య వాపోతుండగా పేరుచెప్పకుండా త్రిపురనేని రామస్వామి సూతపురాణంలో ఒక పద్యం చదివి వినిపించాడు. రోశయ్యగారు ఆకర్షితుడై బాగుంది, ఎవరు రాశారు? అని అడిగాడు. ఎ.జి.కె. చెప్పకుండా మరో పద్యం చదివి, అలా రోశయ్యను ఆకర్షించారు. చివరకు పేరు చెప్పగా రోశయ్యగారు ఆశ్చర్యపోయి, ఆ తరువాత రామస్వామి కవితలన్నీ చదివారు. అప్పటినుండే చాదస్తం తగ్గించుకున్నారు. లెక్చరర్‌గా రోశయ్యగారు

ఎందరో విద్యార్థులకు మానవవాదాన్ని, ఎం.ఎన్. రాయ్‌ను పరిచయం చేశారు. ఎ.జి.కె., రోశయ్యలు మంచి సన్నిహిత మిత్రులుగా చివరి వరకూ కొనసాగారు.

ఎ.జి.కె. ఎందరో కవుల్ని, గాయకులను, కళాకారులను ప్రభావితం చేశారు. కొండవీటి వెంకటకవి, అత్తోటరత్న కవి, కొత్త సత్యనారాయణ, వాసిరెడ్డి వెంకట సుబ్బయ్య మొదలైన వారెందరో యీ పట్టికలో వున్నారు.

ఎ.జి.కె. సెక్యులర్ వివాహాలు చేయిస్తూ, ప్రతి వివాహంలో సరికొత్త ఉపన్యాసం చేసి, యువతను ప్రోత్సహించేవారు. నేను విన్న చివరి పెళ్ళి ఉపన్యాసం చీరాలలో, కీ॥శే॥ రాజారెడ్డి కుమారుడు భాస్కర్ పెళ్ళి ఉపన్యాసం అద్భుతం. బహుశ అది రికార్డు అయివుంటే భాస్కర్ వద్ద (ఒంగోలు) లభించవచ్చు.

అధికారంలో వున్న వారిని ఎ.జి.కె. ఖాతరు చేసేవారు కాదు. గవర్నర్‌గా వున్న చందూలాల్ త్రివేది ముఖ్యమంత్రిగా వున్న నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్యలు ఎ.జి.కె. నిశిత విమర్శలకు గురైనవారే.

అధికారంలో లేనప్పుడు ప్రజానాయకులను గౌరవించడం ఎ.జి.కె. ఆనవాయితీ. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, ఆచార్యరంగా వంటివారిని అలానే సత్కరించారు.

రాజ్యాంగం 19వ సవరణపై ఎ.జి.కె. బాపట్ల ఉపన్యాసం రాజాజీని ముగ్ధుడిని చేసింది. ఆ విషయమై ఎ.జి.కె.ని. శ్లాఘించారు.

నీలం సంజీవరెడ్డికి తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అక్రమ పద్ధతిలోగౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, సెనెటర్‌గా వున్న ఎన్. విజయరాజకుమార్ దావా వేశాడు. ఆ కేసును ఎ.జి.కె. చేబట్టి నెల్లూరులో వాదించారు. ముఖ్యమంత్రిపై అలా పోరాడిన వ్యక్తి ఎ.జి.కె.

గుండెపోటు వచ్చి మంచంలో వున్న ఎ.జి.కె. కీ॥శే॥ ఎ.బి.షా నేనూ కలసి వెళ్ళి ఆరోగ్యం విషయమై అశ్రద్ధ వహించవద్దన్నాం, చికిత్సకు మద్రాసు వెళ్ళమన్నాం, సరేనన్నాడు. కాని మంచంలో వున్నా కేసుల విషయం సంప్రదించడం, విశ్రాంతి లేకుండా చేసిన వాతావరణంలో ఎ.జి.కె. అకాలమరణం చెందాడు. అది హ్యూమనిస్టు ఉద్యమానికి పెద్దలోటు, కోలుకోలేని దెబ్బ తగిలింది!

**- హేతువాది, మే *2000***

# టంగుటూరి ప్రకాశం

మన సంప్రదాయం ప్రకారం కీర్తిశేషులైన వ్యక్తిని మితిమీరి శ్లాఘిస్తుంటాం. దీనివలన ఆ వ్యక్తిలోని మంచిచెడులను శాస్త్రీయంగా అంచనా వేయడానికి వీల్లేకపోతున్నది. రాజకీయాలలోనూ, మతరంగంలోనూ ఈ విధమైన వీరారాధన బాగా పాతుకుపోయింది.

ముఖ్యంగా చనిపోయినవారి పేరు చెప్పుకుని బతికేవారికి నిశితపరిశీలన అంటే బొత్తిగా గిట్టదు. టంగుటూరి ప్రకాశం గారి విషయంలో ఇదే జరుగుతోంది.

1872లో నేటి ప్రకాశం జిల్లా కనపర్తి గ్రామంలో సనాతన కుటుంబానికి చెందిన నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు ప్రకాశం. ఒక విధంగా వీరిది "బతికిచెడిన" కుటుంబం. తాతతండ్రులు బాగా ఆస్తిపాస్తులు అనుభవించినా ప్రకాశం మాత్రం చిన్ననాటినుండీ పేదరికం చవిచూచాడు. నాయుడుపేట, ఒంగోలులలో ప్రకాశం చదువుకుంటున్న రోజుల్లో రౌడీల స్నేహంతో దొంగతనం చేసే వరకూ సాహసించాడు కాసూరి రంగడు, నవులూరి రమణయ్య మొదలైన రౌడీలే ఆనాడు ప్రకాశానికి స్నేహితులు. బజార్లో అమ్ముకునేవాళ్ళ దగ్గరా, పంటపొలాలమీదా దొంగతనాలు చేసేవారు. దీని వలన ప్రకాశానికి ఆ వయసులోనే సాహసం, నిర్భీతి అనే లక్షణాలు వచ్చాయి. డబ్బుకు ఎప్పుడూ ఎవరో ఒకరిని కొట్టితెచ్చుకుంటే సరిపోతుందనే భావం చిన్ననాడే ఏర్పడింది.

గాంధీజీకి హైస్కూలు చదువు రోజుల్లో ముస్లిం రౌడీ స్నేహితుడు తగిలినట్లే, ప్రకాశం గారికి నాటక వేషాల సందర్భంగా ఉండదల్లీ సాహెబుతో సహా అనేక మంది ముస్లిం మిత్రుల సాంగత్యం అబ్బింది. అనేక నాటకాలలో ఆడ పాత్రలు కూడా ధరించిన ప్రకాశం ఆ అలవాట్లను రాజమండ్రిలో కూడా కొనసాగించాడు. ఆ కారణంగా 15వ ఏట మెట్రిక్ తప్పాడు. ప్రైవేటుగా మెట్రిక్ పాస్ అయినా చెడిపోతున్నాడనే భయంతో 18వ ఏట హనుమాయమ్మతో అద్దంకిలో పెళ్ళి చేశారు. కాని "స్త్రీ చాపల్యంవల్ల సంసారజీవితంలో సౌఖ్యంలేద"ని ప్రకాశం నిజం ఒప్పేసుకున్నాడు. (నా జీవితయాత్ర పేజీ 126) ప్రకాశం 19వ ఏట ఎఫ్.ఎ. పాసై మద్రాసు వెళ్ళి 'లా' చదివాడు. 1894లో రాజమండ్రిలో ప్రాక్టీసు మొదలుపెట్టి, మునిసిపాలిటీ వ్యవహారాలలో తలదూర్చాడు. మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నిక కావాలని మూడుసార్లు ప్రయత్నించి ఓడిపోయి, 1899లో తొలిసారిగా నెగ్గాడు. మునిసిపాలిటీ రాజకీయాలు నాడూనేడూ ఒకేరీతిలో వున్నాయి. 30 ఏళ్ళకు రాజమండ్రి మునిసిపల్ ఛైర్మన్ అయిన ప్రకాశం, ప్లీడర్ వృత్తి సాగిస్తూ క్రిమినల్ కేసులలో రాణిస్తుండేవాడు.

రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం అప్పటికే సంస్కరణోద్యమంలో, సమాజ ఛాందసాలకు ఎదురీదుతూ అష్టకష్టాలు పడుతుండేవాడు. ప్రకాశం అక్కడేవున్నా, వీరేశలింగంపై గౌరవం వుందని వ్రాసుకున్నా, ఆచరణలో అందు కనుగుణమైన పనులు చేసినట్లు ఎక్కడా గోచరించదు. పైగా తమ్ముడు శ్రీరాములు కోసం వీరేశలింగంపై కేసులో వాదించి, వృత్తిధర్మం అని చెప్పుకున్నాడు, ప్రకాశం.

మునిసిపల్ రాజకీయాలకూ, సంస్కరణవాదానికీ పొత్తు కుదరలేదు. కాని ఇంగ్లండ్‌లో బారిస్టర్ చదివి తిరిగివచ్చినప్పుడు మాత్రం అందరిలా ప్రాయశ్చిత్తం చేసుకోడానికి నిరాకరించిన ప్రకాశం, మొండిధైర్యం ప్రదర్శించాడు.

ఇంగ్లండులో బారిస్టర్ చదువు సందర్భంగా ప్రకాశానికి రాజకీయాల వాసన తగిలింది. దాంతోపాటే మాంసాహారం, సిగరెట్టు కూడా అలవాటయ్యాయి. కాంగ్రెస్‌లో అతివాది అయిన లాలాలజపతిరాయ్‌తో పరిచయమయింది. కాంగ్రెసు రాజకీయాలలో తిలక్ కూడా అతివాదే. వీరి అతివాదం అంటే మతవాదమే. ఇది ప్రకాశానికి వచ్చింది. గోఖలే వంటి మితవాదులు ప్రకాశానికిష్టంలేదు.

1893లో మద్రాసులో వివేకానంద వలన కొంత ప్రేరేపణ పొందానని ప్రకాశం చెప్పుకున్నాడు. 1907లో సూరత్ కాంగ్రెసు మహాసభలలో అతివాదులు-మితవాదులు చెప్పులతో కొట్టుకున్న సందర్భంగా, ప్రకాశం అతివాదుల పక్షాన్నే వున్నాడు. ఆ తరువాత "ఎప్పుడైనా కులాసాగా కాంగ్రెస్‌కి వెడుతూ ఉండేవాణ్ణి. అంతకంటె ఎక్కువగా కాంగ్రెస్ ఎప్పుడూ నన్ను ఆకర్షించలేకపోయింది" అని ప్రకాశం స్పష్టీకరించాడు.

1907 నుంచి మద్రాస్‌లో బారిస్టర్‌గా ప్రాక్టీస్ చేశాడు. 14 సంవత్సరాల పాటు నిర్విరామంగా జరిపిన ఈ ప్రాక్టీస్‌లో మొదటి ఏడు సంవత్సరాలు అప్పులు తీర్చి సంసారాన్ని పోషిస్తూ తరువాత ఏడు సంవత్సరాలలో బాగా సంపన్నుడయ్యాడు. భూములు, బంగళాలు కొని స్థిరాస్తి పరుడయ్యాడు. మధ్యలో అనిబిసెంట్ రాజకీయాల పట్ల ఆకర్షితుడయ్యాడు.

గాంధీజీ 1921లో ఇచ్చిన సహాయ నిరాకరణోద్యమ పిలుపును అందుకొని కోర్టు ప్రాక్టీసు వదలుకొని రాజకీయాలలోకి పూర్తిగా ప్రవేశించినవారిలో ప్రకాశం ఒకరు. కాని గాంధీశిష్యుడుగా లేదా అనుచరుడుగా ప్రకాశం ఎప్పుడూ రాణించలేదు. మనస్సు అతివాదంపై నిమగ్నమై వుండటంవలన, అప్పటికి తిలక్ పోవడం వలన సి.ఆర్. దాసుకు, మోతీలాల్‌కు చేరువగా మెలిగాడు. ఈ వైరుధ్యమే ఆయనకు చిక్కులు తెచ్చిపెట్టింది.

స్వరాజ్య పత్రికను 1921 అక్టోబరులో మద్రాసునుంచి ప్రకాశం ప్రారంభించాడు. అప్పుడే గాంధీజీతోనూ, రాజగోపాలాచారితోను ప్రకాశానికి పరిచయం ఏర్పడింది. కాని ఆ పరిచయస్నేహం అట్టేకాలం నిలవలేదు. స్వరాజ్యపత్రికను మూసేయమని గాంధీజీ పదేపదే సలహా ఇవ్వడం ప్రకాశం మొండికేయడం జరిగింది. గాంధీజీ తన కుమారుడు దేవదాస్ గాంధీకి రాజాజీ కుమార్తె లక్ష్మితో పెళ్ళిచేశాడు. ఆ విధంగా వియ్యంకులుగా సన్నిహితులైవారు ప్రకాశాన్ని జీవితాంతమూ వ్యతిరేకించారు. గాంధీతో ఢీకొనడమంటే ఆనాడు మాటలు కాదు అలాగే "గుంటనక్క"గా పేరు తెచ్చుకున్న రాజాజీ ఎత్తుగడలను గమనించడం, ఎదుర్కోవటం సామాన్యం కాదు.

గాంధేయులకు స్వరాజ్యవాదులకూ మధ్య నిలబడి "సెంట్రల్ పార్టీ" పెట్టిన ప్రకాశం సఫలం కాలేదు.

1921లో ప్లీడరీ వృత్తి వదలడం, స్వరాజ్యపత్రిక ప్రారంభించడంతో ప్రకాశం జీవితంలో పెద్ద మలుపు తిరిగింది. రాజకీయాలలో ఉంటూ వృత్తిని సాగిస్తే అదొక తీరు. కాని మరొక యావ

లేకుండా రాజకీయమే వృత్తిగా పెట్టుకున్నప్పుడు, తాను బతకడం ఎలా, కుటుంబాన్ని పోషించడం ఎలా అనే సమస్య వస్తుంది. మనదేశంలో రాజకీయమే వృత్తిగా గలవారు ప్రజలపైనే ఆధారపడుతున్నారు. ప్రకాశం కూడా ఆ కోవలో చేరాడు. "నేను సంపాదించినదంతా ఖర్చుపెట్టాను. కాబట్టి దేశంమీదబడి ఎంత వసూలుచేసినా ఫరవాలేదు" అనే ధోరణి అవలంబించిన ప్రకాశం చాలా బాధ్యతారహితంగా రాజకీయాలలో నీతి, అవినీతి అనే గీటురాయి లేకుండా చేశాడు. ఇటువంటి ధోరణిని ఎవరు అవలంబించినాసరే మంచిదికాదని డాక్టర్ లోహియా ఖండించాడు.

మద్రాసుకు సైమన్ కమిషన్ రాక సందర్భంగా ప్రకాశం పాత్ర గురించి చాలా మంది రాశారు.

కానీ ప్రకాశంగారు 'నా జీవితయాత్ర'లో రాసిన విషయాలు గమనించాలి. మొదటిసారి సైమన్ కమీషన్ బొంబాయిలో 1928 ఫిబ్రవరిలో అడుగిడినప్పుడు మద్రాసులో నిరసన ఊరేగింపులు జరిపారు. ఆనాడు శ్రీనివాస అయ్యంగారు, వెనుక ప్రకాశంగారూ అనుచరులతో పోతుంటే మెరీనాబీచ్‌లో పోలీసులు అటకాయించారు. "ముందడుగు వేయవలసిందనే ఆదేశం కాంగ్రెస్ ఇచ్చి ఉండలేదు. అందుకని కాస్త తటపటాయించా" అని ప్రకాశం రాశారు. (పేజీ 372) ఆ తరువాత సైమన్ కమీషన్ మద్రాసు వస్తున్న సందర్భంగా పూర్తి హర్తాళ్ పిలుపు యిచ్చారు. ప్రకాశం ఆనాడు కారులో బయలుదేరితే బీచ్‌లో, మౌంట్ రోడ్‌లో, ఫ్లవర్ బజారులో పోలీసులు అడ్డగించారు. ప్రకాశం వెనక్కు వెళ్ళాడేగానీ తుపాకీకి గుండె చూపలేదు. ఆ తరువాత పారిస్ కార్నర్‌లో ఒక వ్యక్తి చనిపోయిపడివున్నాడు. అతన్ని చూడటానికి వెళ్ళనివ్వమని ప్రకాశం కోరాడు. "ఒక సిపాయి నా గుండెకు బారుచేసి తుపాకి పట్టుకున్నాడు నాకుదారి యివ్వవలసిందని వానిని నేను కోరాను. మీరు బలవంతంగా వెళ్ళదలిస్తే మేము కాల్చవలసి వస్తుందన్నాడు వాడు. నాపక్కన గుంపులోవున్న ఒక మహమ్మదీయ యువకుడు, ధైర్యం వుంటే కాల్చు. మేమంతా సిద్ధంగా వున్నాం ఆయనెవరో నీకు తెలియదల్లేవుంది" అని అరిచాడు.

"కొద్ది క్షణాల తర్వాత వాడు తప్పుకుని దారియిస్తూ దయయుంచి ఏ గడబిడా చేయవద్దని గుంపును కోరవలసిందని ప్రాధేయపడ్డాడు. నేను వచ్చే వరకూ శాంతంగానే వుండవలసిందని గుంపును కోరి ముందుకు సాగి గుండు దెబ్బలతో పడి వున్న, ఆ మృతదేహాన్ని చూసి, ఆ రోడ్డుకు ఎదురురోడ్డున హైకోర్టు వెనుకభాగాన వున్న ఒక భవనంలో ఆశీనుడయివున్న చీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్‌ను చూడగోరాను.

ఇది ఆనాడు జరిగింది. టంగుటూరి ప్రకాశం కేంద్ర శాసనసభలో వుండగా మాలవ్యాపార్టీలో చేరాడు. కాంగ్రెసులో ఇమడలేకపోయాడు. అయితే గాంధీజీ పిలుపు ఇచ్చినప్పుడు ఉప్పు సత్యాగ్రహంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ జైలుకు వెళ్ళాడు.

గాంధీజీతోసహా ఎవరినిగురించీ ప్రకాశం మర్యాదగా మాట్లాడేవాడు కాదు. బహిరంగ

సభలలో వాడు, వీడు అనే పదప్రయోగాలు బాగా చేసేవాడు. శ్రీనివాసయ్యంగార్, రాజగోపాలాచారి గురించి "ఏదో విధంగా బినామీ మంత్రిపదవులనైనా స్వీకరించి తమ వాంఛలను తీర్చుకోవాలనే కోరిక ఆ యిరువురి నాయకులకూ మిక్కుటంగా ఉంది" అని ప్రకాశం రాశాడు. 1927లో సుబ్బరాయన్ మద్రాసులో ఏర్పరచిన మంత్రివర్గ సందర్భంగా ప్రకాశం చేసిన వ్యాఖ్య అది.

గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్ళడం అవివేకం అనీ, బెల్గాం కాంగ్రెస్ అధ్యక్ష పదవికి గాంధీ ఒప్పుకోవడం, మనోదౌర్భల్యం అనీ ప్రకాశం రాశాడు. ఆంధ్ర కాంగ్రెస్ వ్యవహారాలను చూస్తే, ముఠా రాజకీయాల పితామహుడు ప్రకాశం అనవచ్చు. ఆయనకు, ఇతర నాయకులకూ తరచు తగాదాలు వచ్చాయి. పట్టాభికి ఈయనకూ శాశ్వత కలహం వుండేది. అలాగే బులుసుసాంబమూర్తి, కొండా వెంకటప్పయ్య మొదలైనవారితో పేచీలు పడ్డాడు. 1937లో మద్రాసు ప్రధాని కావాలని ప్రకాశం ప్రయత్నించినా, ఆంధ్రులే బలపరచలేదని తెన్నేటి విశ్వనాథం వాపోయాడు.

ఆ ముఠా తగాదాల్ని చివరకు జైళ్ళలో కూడా కొనసాగించారు. మళ్ళీ పదవిని వదల్లేక 1937లో ప్రజాపార్టీ అని పెట్టారు. అక్కడకు వెళ్ళిన ప్రకాశం, రంగాలు అందులో చేరారు. తర్వాత రంగా చీలి వేరే పార్టీ పెట్టారు. 1952 తొలి సాధారణ ఎన్నికలలో ప్రకాశం ప్రతిచోటకూ తిరిగి కాంగ్రెస్ మంత్రుల అవినీతిని బయటపెట్టాడు. వాళ్ళంతా ఓడిపోయారు. మద్రాసు బీచ్ నియోజకవర్గంలో నిలబడి తానూ ఓడిపోయాడు. అప్పట్లో సోషలిస్టులు కలిసి రాగా ప్రజా సోషలిస్టు పార్టీ ఏర్పడింది.

మద్రాసులో మంత్రిమండలి ఏర్పాటు సమస్య వచ్చింది. కాంగ్రెసువారు రాజాజీ కోసం ప్రయత్నించారు. రంగా పార్టీ అందుకు అండగా నిలిచింది. తన రాజకీయ జీవితమంతటా కమ్యూనిస్టులను తిట్టిన టంగుటూరి ప్రకాశం, ముఖ్యమంత్రి పదవి కోసం, ఒక ఫ్రంటు నాయకుడుగా వారితోనే కలిసి మంత్రిమండలి ఏర్పరచాలని విఫలప్రయత్నం చేశాడు. కుటిలనీతి రాజకీయాలలో కాంగ్రెస్‌వారే నెగ్గారు. దానితో అప్పటికే 80 సంవత్సరాలు వచ్చిన ప్రకాశం కొత్తగా ఏర్పడనున్న ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రజాసోషలిస్టు పార్టీని తన్నేసి అంతవరకూ కుళ్ళిపోయిందని విమర్శించిన కాంగ్రెసుతోనూ, అవినీతిపరులని తిట్టిన సంజీవరెడ్డి వంటివారితోనూ చేతులు కలిపాడు. అయినా ప్రకాశం ముఖ్యమంత్రి పదవి కర్నూలులో కూడా ఆట్టేకాలం వుండలేదు.

రాజకీయాలలో నీతి చాలా అవసరం. మానవ విలువలు కావాలి. అవి రెండూ లేనప్పుడు సమాజాన్ని పరిపాలించడానికి అర్హత కోల్పోతారు. ఆంధ్ర రాజకీయాలలో ప్రకాశం ఎటువంటి నైతిక విలువల్ని కూడా చూపలేకపోయాడు. ఇంకా లోతుకు పోతే చాలా విషయాలున్నాయి. అందులో కొన్నిటిని "నా జీవితచరిత్ర"లో ప్రకాశం రాసినప్పటికీ క్రొవ్విడి లింగరాజు, తెన్నేటి విశ్వనాథం కొట్టి వేయించారని తెలిసింది. మున్సిపాలిటీ రౌడీ రాజకీయాలను రాష్ట్రస్థాయికి తెచ్చిన ప్రకాశం - ముఠా నాయకుడుగా తప్ప ఎదగలేకపోయాడు.

కృష్ణాపత్రిక సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు సరదాగా ఏటా కొందరికి బిరుదులు తన పత్రిక ద్వారా ప్రకటిస్తుండేవాడు. అలా ఒక ఏడు ప్రకాశానికి "ఆంధ్రకేసరి" అని ఇచ్చారు. ఈ సంగతి తెలిసినవారు తక్కువ.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రావతరణ సమస్య 1913లో మొదలై, చాలామంది త్యాగాలను కోరింది. కాని తీరా రాష్ట్రం రాబోయే సమయానికి ప్రకాశం, పట్టాభిల ముఠాతగాదాల వలన యీ సమస్య కొంత సాగదీయవలసి వచ్చింది. జవహర్‌లాల్, వల్లభాయ్, పట్టాభిల నివేదికను అంగీకరిస్తే 1950 నాటికే ఆంధ్రరాష్ట్రం ఏర్పడి వుండేది. కాని ఆ కీర్తి పట్టాభికి దక్కుతుందని ప్రకాశం అడ్డుపడి మద్రాసు మాకే కావాలన్నాడు. తెన్నేటి విశ్వనాధం ఏమి రాశారో గమనించండి. "చివరకు, 1952లో సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలలోని ఆంధ్రసభ్యులు చెన్నపట్నం మీద ఆశవదులుకోవడం వల్ల, ఆంధ్ర కాంగ్రెసుపార్టీ వారు చెన్నపట్నం తమిళ రాష్ట్రంతో కలిపివేయాలన్ని నివేదికలో సంతకం చేయడం వల్ల - ప్రకాశంగారు, ఆయన అనుయాయులు కూడా చెన్నపట్నం లేకుండా ఉన్న ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి అంగీకరించవలసి వచ్చింది" (నా జీవితయాత్ర-అనుబంధ సంపుటి చతుర్థఖండము పేజి 772 ఎమెస్కో ప్రచురణ) అంతవరకూ బాగానే వుంది. తరువాత పొట్టి శ్రీరాములు 52 అక్టోబరు 19న ఆమరణనిరాహారదీక్ష పూని, మద్రాసుతో కూడిన ఆంధ్ర కావాలంటే, ప్రకాశం అందుకు మద్దతు ప్రకటించాడు. అప్పుడు జరిగిన హింసలో ఆస్తుల మాటెలావున్నా, ప్రాణనష్టం ఎంతో జరిగింది. నాయకుల చెలగాటంలో ప్రజలు చితికిపోవడం పరిపాటే. అందుకు ప్రకాశం మినహాయింపుకాదు. జీవితాంతమూ మద్రాసు నగరం కోసం ప్రకాశం పట్టుబట్టి పోరాడివుంటే, ఆయన పట్టుదల గలవాడని మెచ్చవచ్చు. కాని పదవి ఎరచూపేసరికి అన్నీ మరచిపోతూ వచ్చాడు.

ప్రకాశం చేసిన త్యాగాలను, సేవలను, దోషాలను అంచనావేసి చూస్తే, మొత్తం మీద తప్పటడుగులే ఎక్కువ. వ్యక్తిగతంగా ఆయన నుండి మనం నేర్చుకునేవి ఏమీలేవు. జమిందారీ వ్యతిరేక పోరాటం, గాంధీ వంటి నాయకులతో ఢీకొనడం వంటి విశేషాలే చెప్పుకోదగినవి.

*- ఈనాడు, ఆగస్టు 1982*

# తెలుగునేలను సస్యశ్యామల సీమగా మార్చడానికి బ్రిటిష్‌వారితో పోరాడిన ఆర్థర్ కాటన్

గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ త్రాగటానికి నీళ్ళులేవు. ఒక ఏడు అతివృష్టి, మరొక ఏడు అనావృష్టి. ఏటా గోదావరి వరదలు చేసే బీభత్సం. 1854 వరకూ గోదావరి ప్రజలు పడ్డ యిక్కట్లు యిన్నీ అన్నీ కాదు. నేడు ఉభయగోదావరి ప్రజలు పచ్చ పచ్చగా ఉండటానికీ, తెల్లబట్టలు

ధరించటానికీ, సుష్టుగా భోంచేయటానికీ వెనుక పెద్ద గాథ ఉన్నది. ఒక్కమాటలో చెప్పాలంటే గోదావరిని అదుపులోపెట్టి, ప్రజావసరాలు తీర్చే నదిగా మార్చటానికి మూలపురుషుడు సర్ ఆర్థర్ కాటన్. ఆయన కేవలం గోదావరి ప్రజలకే గాక అన్నదాతగా భారతీయులకు చిరస్మరణీయుడు.

## గోదావరి ప్రజల కన్నీటి గాథ

పశ్చిమ కనుమల్లో పుట్టిన గోదావరి తెలంగాణాలో ప్రవహిస్తూ భద్రాచలం వద్ద గోదావరి జిల్లాలో ప్రవేశిస్తున్నది. నాడు యీ జిల్లా పేరు గోదావరి కాదు. రాజమండ్రి పాపికొండల మధ్య ప్రవహించి, ధవళేశ్వరం వద్ద రెండుగా చీలి, బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ విధంగా ప్రవహిస్తున్న గోదావరిని ప్రజలు అనాదిగా పూజించారు. పవిత్రంగా చూశారే గాని, నిస్సహాయంగానే ఉండిపోయారు. 1831లో అతివృష్టి, 1832లో తుఫాను వచ్చి అల్లకల్లోలం చేయగా 1833లో గుంటూరు కరువు వచ్చి ప్రజల్ని మాడ్చేసింది. ఆ కరవులో తాళలేక గోదావరి ప్రజల్లో చాలామంది మూటాముల్లె కట్టుకొని దక్షిణాదికి తరలివెళ్ళారు. ఉన్నవారు లేనివారనే తరతమ భేదం లేకుండా సాగిన యీ ప్రయాణాల్లో జిల్లా మొత్తం మీద ప్రతి నలుగురిలో ఒక్కరు గతించారు. ఎంత దారుణమైన కరువంటే, ఆడపిల్లల్ని కొందరు హైదరాబాద్‌కు అమ్ముకున్నారు. ఊళ్లోగుండా ధాన్యం పోవాలంటే పోలీస్ బందోబస్తుతో తప్ప సాధ్యమయ్యేది కాదు. ప్రభుత్వం ఏదో పేరుకి చెరువులు త్రవించే పనులు చేయించినా అవి అంతగా ఉపకరించలేదు. రోడ్లన్నీ శ్మశానాలుగా మారిన నాటి దృశ్యాలు బ్రిటిష్ చరిత్రకారులు సైతం ప్రస్తావించక తప్పలేదు. (మోరిస్ వ్రాసిన హిస్టరీ ఆఫ్ గోదావరి చూడండి.) ఈ కరువునుండి కొంచెం తేరుకునేసరికి 1839లో మళ్ళీ పెనుతుఫాను వచ్చి దెబ్బతీసింది.

## మూతపడిన ప్రత్తి మిల్లులు

గోదావరి ప్రాంతంలో నాడు ప్రత్తి విరివిగా పండించేవారు. మిల్లులు స్థాపించారు. కాని యింతకంటే చౌకగా బట్టలు ఉత్పత్తిచేసే పద్ధతుల్ని బ్రిటిష్‌వారు కనుగొన్నందున యిక్కడ మిల్లులు మూతపడ్డాయి. దీనితో ప్రత్తి జీవనాధారంగా కూడా పోయింది. అంతవరకు మిల్లులపై ఆధారపడేవారు కూడా భూముల్ని అమ్ముకోవాల్సి వచ్చింది. భూముల ఫలసాయం దైవాధీనంగా ఉన్నది. జిల్లాలో ప్రభుత్వాదాయం కూడా క్షీణించింది. ప్రజలు క్షీణించారు. 1821 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 7,38,308 అయితే, రెండు దశాబ్దాల తరువాత 1841 లెక్కల ప్రకారం 5,61,041 అని తేలింది. దీన్ని బట్టి కరువుల బారికి ఎందరు గురైనారో వూహించవచ్చు. గ్రామాల్లో అమరకపు వ్యవసాయ పద్ధతి ననుసరించి, భూమి అంతా ఎవరో ఒక పెద్దమనిషి స్వీకరించి, కౌళ్ళకిచ్చి శిస్తు వసూలు గావించి ప్రభుత్వానికి యిస్తుండేవారు. అందుకెవరూ సాహసించటం లేదు. తహసిల్దారు బలవంతముగా ఎవరో ఒకరికి అంటగడుతుండేవాడు.

ఆ పరిస్థితిని పరిశీలించమని మద్రాసునుండి మౌంట్‌మోరి అనే అతన్ని పంపించారు.

నన్ను కాదని ఎవరినో పంపిస్తారా అని నాటి బ్రిటిష్ కలెక్టర్ కినుక వహించి అతనికి సహకరించలేదు. అయినా మౌంట్‌మోరి పరిస్థితి చూచి ప్రభుత్వానికి నివేదించాడు. ఇది 1844 నాటి గాథ. ప్రభుత్వం కళ్ళు తెరిచింది. కరువు నివారణకై ఏం చేయాలో ఆలోచించసాగింది.

## కరవులో కాటన్ ప్రవేశం

అట్లాంటి దారుణ పరిస్థితిలో సర్ ఆర్థర్ కాటన్ వచ్చాడు. అతను అప్పటికే కావేరి నదిని మళ్ళించి తంజావూరు ప్రజలకు సేవలు చేసి ఉన్నాడు. అనారోగ్య కారణంగా విశాఖపట్టణంలో చర్చి నిర్మాణం వంటి తేలిక పనులు చేస్తున్నాడు. ప్రభుత్వ కోరికపై గోదావరినది ప్రాంతమంతా సర్వే చేశాడు. సుదీర్ఘమైన నివేదిక సిద్ధం చేశాడు, ఘాటైన మాటలతో ప్రభుత్వాన్ని ఎత్తిపొడిచాడు. సైన్సు, నాగరికత వున్నదనుకొనే బ్రిటిష్‌వారు పరిపాలిస్తూ కూడా ప్రజల్ని యీ విధంగా ఉంచడం, నీటిని సద్వినియోగం చేసుకునేటందుకు తోడ్పడకపోవడం గర్హనీయమన్నాడు. అప్పటికి 40 సంవత్సరాలుగా బ్రిటిష్‌వారు గోదావరి ప్రజల సంకటస్థితిని చూస్తూ మిన్నకుండడం క్షంతవ్యం కాదన్నాడు. గోదావరి ప్రాంతమంతా చెరకు పండిస్తే ఎగుమతులు పెరుగుతాయనీ, ప్రజల ఆదాయం ప్రభుత్వాదాయం పెరిగి ఉభయ కుశలోపరిగా ఉండొచ్చన్నాడు. 1845 ఏప్రిల్ 17న తన నివేదిక ప్రభుత్వానికి సమర్పించాడు. తదనుగుణంగా గోదావరికి ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించడం ముఖ్యం. వరదల బారినుండి పంటల్ని కాపాడటానికి కరకట్టలు వేయటం, పంటలకు ప్రయాణాలకు తోడ్పడే కాలువలు త్రవ్వటం, మురికినీటిపారుదల సౌకర్యాలు అమర్చటం, ధాన్యం రవాణా దృష్ట్యా అవసరమైన రోడ్లు, బ్రిడ్జీలు నిర్మించటం తక్షణ కర్తవ్యాలన్నారు. దీనివలన ఎంత ఖర్చు అయ్యేదీ, ఏ విధంగా ఆదాయం వచ్చేదీ అంచనా వేసి చూపాడు. మొత్తం ఖర్చు 1,20,000 పౌండ్లు కాగా, ఒక్క ఆనకట్ట వరకూ 45,575 పౌండ్లు అవుతుందన్నాడు, నాటి పౌండు విలువ పది రూపాయలు. కాటన్ నివేదికను ఇండియాలోనూ, ఇంగ్లండులోనూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎట్లాగైతేనేమి అతని పథకాన్ని ఆమోదించారు.

## ఆనకట్ట చరిత్ర

గోదావరిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట పని 1847లో ప్రారంభమైంది. కాటన్ చీఫ్ ఇంజనీరుగా పనిచేపట్టి, ధవళేశ్వరం వద్ద యిల్లు వేసుకొని నిర్విరామ కృషి చేశాడు. పనివారంతా అతన్ని "సన్యాసి" అనేవారు. నిష్కామకర్మగా అతను చేస్తున్న పనినిబట్టి వారట్లా పిలిచేవారు. 1847లో ఆనకట్ట ప్రారంభించినది మొదలు 1850 వరకూ 30,54,413 మంది కార్మికులు అక్కడ పనిచేశారు. రోజుకు సగటున 2500 నుండి 3500 మంది కూలీలు ఉండేవారు. ఆనకట్ట నిర్మాణం ప్రారంభించినది మొదలు కాటన్‌కు ప్రభుత్వ తోడ్పాటు అంత ఉత్సాహకరంగాలేదు. సర్వేకుగాను ఒక వెయ్యి పౌండ్లు యిచ్చారు. తొలుత ఆరుగురు ఆఫీసర్లనడిగితే ముగ్గురినే యిచ్చి సరిపెట్టుకొమ్మన్నారు. అదీ అనుభవంలేని వారిని పంపించారు.

కాటన్ మొదటినుండీ ఒక వాదన చేస్తూ వచ్చాడు: ఇక్కడ కూలీలచేత పని త్వరగా చేయించవచ్చు, సంవత్సరానికి ఆరు మాసాలు నిర్విఘ్నంగా ఆనకట్టపని సాగించవచ్చు. ఆనకట్టతో పాటు వెన్వెంటనే కాలువల త్రవ్వకం సాగితే గాని, ప్రజలకు ఉపయోగం జరగదు. రైళ్ళపై డబ్బు తగలేసే కంటే, నీటివనరులపై ఆ డబ్బు వినియోగిస్తే అటు రవాణాకు యిటు భూమి అభివృద్ధికీ ఉపయోగపడుతుంది కనుక ఒక లక్ష పౌండ్ల చొప్పున ఐదేళ్ళపాటు వరుస డబ్బు మంజూరు చేస్తే పనంతా పూర్తి అవుతుంది. ఫలితం ఆశాజనకంగా వుంటుంది, అంటే ప్రభుత్వం పెడచెవిని బెట్టింది. మొత్తం ప్రాజెక్టు పనులన్నీ పూర్తి గావటానికి 27 సంవత్సరాలు పట్టింది. ఈలోగా అంచనాలు తారుమారయ్యేవి. కూలీ ధర పెరిగింది. ఇట్లా అంటీ అంటనట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది.

## కష్టాల మధ్య కాపురం

ఆర్థర్ కాటన్ మాత్రం పట్టుదలతో ఆనకట్ట పని పూర్తి గావించాడు. అప్పుడే ఒక ఏడాది ప్రాయంలో కుమార్తె చనిపోయింది. ఇంట్లోకి ఎప్పుడూ పాములు వస్తుండేవి. గుట్టలు ప్రేల్చుతుంటే రాళ్ళు యింటి మీద పడుతుండేవి. ఆరోగ్యం అంతంతమాత్రంగాగల కాటన్ ఎండలకు తట్టుకోలేకపోయాడు. ఎండదెబ్బ అతన్ని మంచాన పడేసింది. సెలవుబెట్టి, బాధతో కొన్నాళ్ళు ఆస్ట్రేలియా వెళ్ళి విశ్రాంతి తీసుకున్నాడు. తాను వెడుతూ ఓర్ అనే సమర్థుడైన ఇంజనీరుకు పని అప్పగించి వెళ్ళాడు.

కాటన్ ఉండగానే, 1849లో పెద్ద వరద వచ్చింది. గంటకు 18 అంగుళాల చొప్పున నది పొంగింది. దానితోపాటు సుడిగాలి వచ్చింది. ఆ దెబ్బతో మొత్తం ఆనకట్ట కొట్టుకపోయిందనే భయపడ్డారు, 22 గజాలు గండిపడి ఆ మేరకు కట్ట కొట్టుకుపోయింది. మరొకచోట 44 గజాల గండిపడింది. అయితే వర్షాకాలం ముమ్మరంగా రాకమునుపే ఆ గండ్లు పూడ్చి ఆనకట్టను నిలబెట్టగలిగారు. మొదటి ఐదేళ్ళు లాకులపై ఖర్చు అవసరం లేకుండా పోయింది రిపేర్లు కూడా అక్కరబడలేదు. ఆనకట్టవద్ద కావలసినంత క్వారీ రాయి లభించటం, అడవులనుండి పెద్ద దూలాలు దొరకటం, యిట్లాంటి సౌకర్యాలన్నీ కాటన్ బాగా సద్వినియోగపరుచుకున్నాడు.

చేసిన పని సక్రమంగా ఉపయోగపడే నిమిత్తం, శిక్షణపొందిన నిపుణులను శాశ్వతంగా నియమించమని కాటన్ అభ్యర్థించాడు. 1854 నాటికి ఆనకట్ట పని పూర్తి అయింది. కాటన్ సంతృప్తిపడ్డాడు. గోదావరి ప్రజలు మళ్ళీ తలెత్తుకున్నారు. ఆదాయం పెరిగింది. జనాభా పెరగజొచ్చింది. ప్రభుత్వం కూడా తృప్తిపడింది. కాలువలన్నీ త్రవ్వక పూర్వపు మాట యిదంతా.

స్థూలంగాచూస్తే ఆనకట్ట పూర్తి అయిన తరువాత ఏడు లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చింది. జిల్లా ఆదాయం 2,30,000 నుండి 5,70,000కి పెరిగింది. ఎగుమతులు 60,000 నుండి 80,000కి పెరిగాయి. 1852లో నరసాపూర్, అత్తిలి కాలువ త్రవ్వగా ఆ ఒక్క

కాలువక్రిందే, 13 వేల ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చింది. 1855 నుండీ గోదావరి ప్రజలు ఖచ్చితంగా చదువులకు సెస్సు చెల్లిస్తూ వచ్చారు. ఇట్లా ఆదాయం పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం డెల్టా ప్రాంతాన్నంతటినీ సాగులోకి తెచ్చే ప్రయత్నం వెంటనే తలపెట్టలేదు. అది బ్రిటిష్ ప్రభుత్వం!

## సుఖాంతం కాదు

1860లో కాటన్ రిటైర్ అయ్యాడు. 1859లో జిల్లా పరిపాలనలో మార్పులు జరిగాయి. రాజమండ్రి జిల్లా కోస్తా గోదావరి జిల్లాగా మారింది. ఉభయగోదావరులింకా రాలేదు. 1857 సిపాయి తిరుగుబాటు సమయంలో విధ్వంసక చర్యలు జరుగుతాయని, ఆనకట్టలు పాడుచేస్తారని భావించారు. కాటన్ దక్షిణాదిలో బ్రిడ్జిలు, ఆనకట్టలు తనిఖీచేస్తూ ఉండేవాడు కాని దక్షిణాదిన సిపాయి తిరుగుబాటు ప్రభావం లేకుండాపోయింది. కాటన్ ఇంగ్లండు వెళ్ళిపోయాడు. కథ యింతటితో ముగియాల్సింది. అప్పుడు సుఖాంతంగా ఉండేది. అట్లా జరగలేదు.

కాటన్ మొదటినుండీ ఒక వాదన చేస్తూ వచ్చాడు. భారతదేశానికి రైళ్ళకంటె కాలువల వలన ఎక్కువ ఉపయోగం ఉంటుందని అతని ఉద్దేశం, అని పంటలకూ, ప్రయాణాలకూ పనికొస్తాయని వాదించేవాడు. ఈ వాదనను వ్యతిరేకించేవారు ఎప్పుడూ ఉండనే ఉన్నారు. వారంతా ఇంగ్లండులో కాటన్‌పై చర్చ లేవనెత్తారు. ఇండియాలో కాటన్ చేసిన పనులు సత్ఫలితాల నివ్వలేదని, దండుగ మారివనీ, కనుక విచారణ జరగాలన్నారు. అక్కడ కామన్స్ సభలో చర్చ జరిగింది.

ఫలితంగా కాటన్ పనులపై విచారణకు సెలక్టు కమిటీ నియమించారు. 1878లో లార్డ్ జార్జి హేమిల్టన్ అధ్యక్షతన ఏర్పడిన యీ సంఘం 900 పై చిలుకు ప్రశ్నలు వేసి, కాటన్‌ను పరీక్షించారు. సర్ జార్జి కాంప్‌బెల్ వంటివారు కాటన్ వ్యతిరేకత బాగా చూపారు. ఐనా నాడు కామన్స్‌సభలో జరిగిన చర్చలకు పత్రికలలో జరిగిన వాదోపవాదలకు; సెలక్టు కమిటీ ప్రశ్నలకు సమాధానం చెప్పి రాణించగలిగాడు కాటన్. కాటన్ తాను చేసిన పనిలో నమ్మకం ఉంచటమేగాక, ఫలితాలను ప్రత్యక్షంగా చూపగలగటమే కాటన్ ధైర్యానికి ఆస్కారమయింది.

రైలుమార్గాలు వేసిన తరువాత వచ్చిన ఫలితాలనూ కాలువల వలన వచ్చిన వాటిని పోల్చి బాగోగులు చూపారు.

## "గోదావరి డెల్టా పితామహుడు"

దేశీయుల ఆదరాభిమానాలకు మన్ననలకు కాటన్ పాత్రుడయ్యాడు, యివి కేవలం పొగడ్తలు కాదు. కాటన్ ఆచరణలో దేశీయులపై ఉంచిన నమ్మకం, వారిచే పనిచేయించుకున్న తీరు, పల్లకి ఎక్కిన ప్రభువువలెగాక, తానూ ఒక కూలీగా అందరితో కలసి కష్టించిన ఫలితంగా ఆయనకు ఆదరణ లభించింది. వి. వీరన్నవంటి ఓవర్సీర్లు కాటన్‌కు లభించారు. వీరన్న

తరువాత సబ్-ఇంజనీరుగా పైకివచ్చాడు. రాయ్‌బహదూర్ బిరుదు పొందాడు. కాటన్‌కు సహకరించి పనులు జరగటానికి తోడ్పడ్డాడు. ఆనకట్టపై ఒకచోట అతని పేరిట ఫలకం ఉన్నది. 1867లో వీరన్న చనిపోయాడు.

1879-80లో కరువు విషయమై నియమించబడిన ఫామిన్ కమిషన్ కూడా సాగునీటి పథకాల ఆవశ్యకత, ప్రాధాన్యతను నొక్కిచెప్పి, కాటన్ వాదనను సమర్థించాయి. వీటన్నిటి దృష్ట్యా నాటి గోదావరి జిల్లా అసోసియేషన్‌వారు కాటన్‌కు "గోదావరి డెల్టా పితామహు"డని నామకరణం చేశారు. ఆయన పేరిట ఒక టౌన్‌హాలు నిర్మించి తమ కృతజ్ఞత చూపారు. రిటైర్ అయిన తరువాత 1863లో మరొక్కసారి కాటన్ ఇండియా వచ్చి వెళ్ళాడు.

1899 జులై 14న ఆర్థర్ కాటన్ చనిపోయాడు. భారతదేశ బంధువుగా చిరస్మరణీయుడైన కాటన్, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ముఖ్యంగా గోదావరివాసులకు బంగారుపంటల్ని యిచ్చిన వ్యక్తిగా చరిత్రకెక్కాడు. ప్రజల దీనావస్థ కళ్ళారా చూచి, తెలుపు నలుపు అనే రంగు బేధం లేకుండా, మానవతాదృక్పధంతో ఆచరణకు ఉపక్రమించిన మానవతావాది కాటన్. అందుకనే ఆయన నాటికీ, నేటికీ ఆదర్శప్రాయుడు. వృధాగా పోతున్న నీటిని ప్రవహించే బంగారంగా మార్చిన కాటన్ ముందుచూపు గమనార్హమైనది.

ఆర్థర్ కాటన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోదగినవారు ఆయన కుమార్తె లేడీహోప్ పరిష్కరించి ప్రచురించిన "సర్ ఆర్థర్ కాటన్" అనే గ్రంథం చదవాలి. తొలిసారి 1900లో ప్రచురితమైన యీ గ్రంథం 1964లో కలకత్తా ఇంజనీరింగ్ అసోసియేషన్ వారు మరలా ప్రచురించారు.

***- హేతువాది, నవంబరు 1995***

# కార్మికోద్యమానికి స్ఫూర్తి వెంకట్రావు

ఆంధ్రలో కార్మికోద్యమ పితామహులలో ఒకడుగా పెమ్మరాజు వెంకట్రావు చరిత్రలో నిలుస్తారు. వి.వి. గిరి, బి. శివరావు వంటివారితో సన్నిహితంగా కృషిచేసిన ఖ్యాతి ఆయనది. 1907లో పుట్టిన పెమ్మరాజు వెంకట్రావు 1928 నాటికే గనుల ఇంజనీరింగ్ శాఖలలో (చీపురుపల్లి, విజయనగర ప్రాంతం) పనిచేసి అనుభవం గడించారు. 1931 నుండి నెల్లిమర్ల జూట్‌మిల్స్ కార్మిక సంఘం స్థాపించి 25 సంవత్సరాలు అధ్యక్షులుగా వున్నారు. అప్పుడే వరాహగిరి వెంకటగిరి, బి. శివరావులతో ఉత్తరప్రత్యుత్తరాలు నడపడం, కార్మిక రంగంలో విశేష అనుభవం గడించడం ఆయన ప్రత్యేకత. 1938 సెప్టెంబర్ 1 నుండే కార్మిక పత్రిక అనే వారపత్రిక విజయనగరం నుండి పెమ్మరాజు వెంకట్రావు సంపాదకత్వాన వెలువడింది. రెండవ ప్రపంచ యుద్ధారంభ రోజులలో వెంకట్రావు ప్రపంచ రాజకీయాల్ని అవగాహన చేసుకుంటూ ఉద్యమాల్ని సాగించారు.

ఆ దశలో వెంకట్రావుకు ఆంధ్ర పర్యటనకు వచ్చిన ఎం.ఎన్. రాయ్ భావాలు దృష్టికి రాగా, ఆకర్షితుడయ్యాడు. ఎం.ఎన్. రాయ్ స్థాపించిన ఇండియన్ లేబర్ ఫెడరేషన్‌లో చేరాడు. అప్పటి నుండి ఎం.ఎన్. రాయ్ 1954లో చనిపోయేవరకూ పెమ్మరాజు వెంకట్రావు రాడికల్ హ్యూమనిస్టు భావాలతో రచనలు చేశారు. ఆయన తరచు కవితలు కూడా రాసేవారు. భారత పునర్వికాసం, బౌద్ధ విప్లవంపై దృష్టి వుండేది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మిక సంఘం నుండి తన స్థానాన్ని హైదరాబాద్‌కు మార్చిన వెంకటరావు, కాంగ్రెసు పార్టీలో చేరారు. ఆ సందర్భంగా ఆవుల గోపాలకృష్ణమూర్తికి రాస్తూ, కమ్యూనిజాన్ని ఎదుర్కోడానికి కాంగ్రెసు ద్వారా కృషి చేస్తానని, రాయ్ భావాలు అమలుచేయడానికి పార్టీలో పనిచేస్తాననీ అన్నాడు. ఆ ప్రకారమే కాంగ్రెస్ పత్రిక పెట్టి రాయ్ భావాలు వ్యాసరూపంలో అందించారు.

నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా పెమ్మరాజు వెంకట్రావును అభిమానించారు. గాంధీభవన్‌లో వెంకట్రావు రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ముక్కుసూటిగా వున్న వెంకట్రావును కాంగ్రెస్ నాయకులు పైకి మెచ్చుకున్నా ఆయన్ను పైకి రానివ్వలేదు.

రాష్ట్రపతి నామినేషన్ వలన పెమ్మరాజు వెంకట్రావు ఒక టరమ్ శాసనమండలి సభ్యుడుగా పనిచేశారు. అప్పుడు తనవంతు కృషి కనిపించింది. 1958లో గోల్కొండ దినపత్రిక ఆగిపోగా వారపత్రికగా పెమ్మరాజు వెంకట్రావు కొంతకాలం హైదరాబాద్‌లో నిర్వహించారు. కాని అదీ అట్టేకాలం సాగలేదు.

కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పెమ్మరాజు వెంకట్రావు క్రమేణా కాంగ్రెసు రాజకీయాలకు దూరంగా జరిగారు. ప్రెస్‌లు స్థాపించి నష్టపడ్డారు. 1982లో ఎన్.టి. రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు కొద్దికాలం వెంకట్రావు సన్నిహితంగా వున్నారు. ఇరువురి భావాలూ పొత్తు కుదరక, వెంకట్రావు రాజకీయాలకు స్వస్తి పలికారు. 1987 సెప్టెంబరులో పెమ్మరాజు వెంకట్రావు హైదరాబాద్‌లో చనిపోయారు. ఆయన కృషి, రచనలు గ్రంథస్తం కావలసివుంది.

***- వార్త, 14 అక్టోబరు, 2001***

# రచ్చగెలిచిన జర్నలిస్టు చింతామణి

తెలుగువాడేగాని తెలుగులో రాయలేదు. ఉన్నది హిందీ ప్రాంతంలో అయినా ఆ భాషరాలేదు, రాయలేదు! అదీ సి.వై. చింతామణి విశేషం.

భారత జర్నలిజంలో పోప్ అని పేరు తెచ్చుకున్న చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి స్వాతంత్ర్యానికి ముందున్న సుప్రసిద్ధ జర్నలిస్టు. విజయనగరం సంస్కృతి, సంప్రదాయం పుణికి పుచ్చుకున్న చింతామణి 1880 ఏప్రిల్ 10న పుట్టారు. ఆద్యంతాలు ఆయనిది ఇంగ్లీషు చదువు, రాతకోతలు అన్నీ అందులోనే సాగాయి.

విజయనగరం మహరాజ కళాశాల విద్యాభ్యాసం అయిన తరువాత చింతామణి తన జర్నలిస్ట్ అభిరుచి తెలుగు హార్ప్ వీక్లీ ద్వారా కనబరచారు. అలాగే వైజాగ్ స్పెక్టేటర్ వారపత్రికలోనూ రాశారు. అలా ఆరంభమైన ఆంగ్ల రచనా వ్యాసంగం చింతామణి జర్నలిజానికి బాటలువేసింది.

బహుశ 18 సంవత్సరాలకే పత్రిక ఎడిటర్ అయిన ఖ్యాతి చింతామణికే దక్కుతుందేమో! 1898లోవిజయనగరం నుండి వెలుబడిన ఇండియన్ హెరాల్డ్ సంపాదకుడుగా కొన్నాళ్ళు తన వ్యక్తిత్వాన్ని చూపారు. అక్కడ నుండి మద్రాసు వెళ్ళి మద్రాసు స్టాండర్డ్‌లో చేరారు. జి. సుబ్రహ్మణ్య అయ్యర్ సంపాదకుడుగా వున్న ఆ పత్రికలో చింతామణి రాణించలేదు.

అలహాబాద్‌కు ప్రవాసం వెళ్ళిన చింతామణి ఇంగ్లీషు జర్నలిజంలో అసమాన ప్రతిభ కనబరచి, లీడర్ అనే దినపత్రికకు సంపాదకుడయ్యాడు. 1909లో మొదలైన సంపాదకత్వం 1941 వరకూ సాగి, ఆగింది. అన్నేళ్ళు అలహాబాద్‌లోవున్నా చింతామణి హిందీ నేర్చుకోలేదు. ఇంగ్లీషులోనే ఈతకొట్టారు.

పత్రికకు అంకితమైన చింతామణి అన్ని పనులు చూసుకోవడమేగాక, నిర్దిష్టత కోసం ప్రయత్నించే వారు. పత్రిక రాగానే పొద్దున్నే రెడ్ పెన్సిల్ తీసుకొని తప్పులన్నీ చూపుతూ ఆఫీసుకు అందించేవారు. లీడర్ పత్రిక అలహాబాద్ నుండి వెలువడుతున్న రోజులలో ఉత్తరప్రదేశ్ (నాడు ఉత్తర పరగణాలు)కు అదే రాజధాని. తరువాత లక్నోకు రాజధాని మారినా, పత్రిక మారలేదు.

కాంగ్రెస్ రాజకీయాలలో చింతామణికి సంబంధం సన్నిహితంగా వుండేది. అయితే ఆయన గోఖలే వర్గానికి చెందిన లిబరల్ (ఉదారవాది). గాంధీకి, తిలక్‌కు భిన్నంగా వున్న గోఖలే కాంగ్రెస్‌లో మితవాదేగాక, అల్పసంఖ్యాకుడు కూడా. అయినా నిలదొక్కుకున్నాడు. లిబరల్ పక్షంలో చింతామణి కీలకపాత్ర వహించాడు. వాదబలం గట్టిగా వున్న చింతామణి, అటు గాంధీ యిటు గోఖలేకు గౌరవ పాత్రుడయ్యాడు. అభిప్రాయాలలో రాజీపడకుండా చింతామణి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నాడు.

జర్నలిస్ట్‌గా, లీడర్ పత్రిక సంపాదకుడుగా కొనసాగుతూనే, ఎన్నికలలో నిలిచి, గెలిచి, ఉత్తరపరగణాలలో శాసనమండలికి చింతామణి వచ్చారు. 1920 నాటి మాట అది. గెలిచిన తరువాత విద్యామంత్రి అయ్యారు. ఆ ఎన్నికలలో కాంగ్రెసు బహిష్కరించగా, లిబరల్ పక్షం మాత్రం పాల్గొన్నది.

1921 జనవరిలో విద్యామంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చింతామణి 28 మాసాల అనంతరం ప్రభుత్వంతో, వైస్‌ఛాన్సలర్‌తో పేచీలు రాగా పదవికి రాజీనామా యిచ్చి చరిత్ర సృష్టించారు. 1923 ఏప్రిల్ 19న మంత్రి పదవి వదలిన చింతామణి, లీడర్ పత్రికా సంపాదకుడుగా తన జర్నలిస్ట్ యాత్ర కొనసాగించారు. 1930లో జరిగిన లండన్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని చింతామణి ప్రధాన పాత్ర వహించాడు. తరువాత జరిగిన లండన్ సమావేశాలలో గాంధీజీ పాల్గొనడానికి చింతామణి కీలకపాత్ర వహించాడు.

చింతామణి అలవాట్లలో శాకాహారి అయినా, నిరంతరం సిగరెట్లు తాగి, కిల్లీలు నమిలేవాడు. అవి రెండూ ఆరోగ్యానికి చెరుపుగా మారాయి. అనారోగ్యం దాపురించి ఆయన పడుతున్నప్పుడు చింతామణి నేలమీద పడి దొర్లేవాడని ఆయన కుమారుడు గణేష్‌విశ్వనాథ్ చెప్పారు. చనిపోయినప్పుడు మంచంమీద వుండరాదని నమ్మకం అట. అంతేగాక, నమ్మకాలు లేకుండా జీవితాన్ని ఆరంభించిన చింతామణి, రానురాను పూజాపునస్కారాలతో బాగా నమ్మకాలలో మునిగిపోవడానికి కారణం తెలియదని గణేష్‌విశ్వనాథ్ అంటారు. చింతామణిచే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చక్కని ఉపన్యాసాలు యిప్పించిన ఘనత నాటి వైస్‌ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌దే. అలహాబాద్, బెనారస్ విశ్వవిద్యాలయాలు గౌరవ పట్టాలిచ్చాయి. నేటివలె సంతర్పణగాక, నాడు గౌరవ పట్టాలకు గౌరవం వుండేది.

అన్నట్లు చింతామణి చదువుకున్నది విజయనగరం మహారాజా కాలేజీలో కేవలం ఇంటర్ మాత్రమే!

ఆయన రచనలలో పుస్తక రూపం దాల్చినవి బహుకొద్ది. ఇండియన్ పాలిటిక్స్ అండ్ ది మ్యూటినీ; ఇండియన్ సోషల్ రిఫాం, స్పీచెస్ అండ్ రైటింగ్స్ ఆఫ్ సర్‌ఫిరోజ్‌షా మెహతా అనే పుస్తకాలున్నాయి. చింతామణి లేఖలు, పత్రాలు, పుస్తకాలు, డైరీలు అన్నీ ఢిల్లీలోని నేషనల్ ఆర్కైవ్స్‌లో భద్రపరిచారు. బ్రిటిష్ ప్రభుత్వం చింతామణికి 1939 జూన్‌లో సర్ బిరుదు యిచ్చింది. బ్రిటిష్ వారిని తగిన సందర్భాలలో విమర్శించడానికి ఆయన వెనుకాడలేదు. ఎం.ఆర్. మసానితో కలసి భారత రాజ్యాంగంపై వ్యాఖ్యానాలు రాశారు.

1941 జులై 1న చింతామణి మరణించారు. భారత జర్నలిజానికి గొప్ప నష్టం అని గాంధీజీ వ్యాఖ్యానించారు. అలహాబాద్‌లో నేడు చింతామణి రోడ్ ఒకటి వున్నది. సుప్రీంకోర్టు తొలి రిజిస్ట్రార్ పి. నరసింహమూర్తితో వియ్యమందిన చింతామణి అద్యంతాలు జర్నలిస్ట్ కుటుంబాలతో సంబంధం పెట్టుకున్నారు. చింతామణి మనమడు రామకృష్ణ, సుప్రసిద్ధ జర్నలిస్ట్ జి.ఎస్. భార్గవ కుమార్తె ప్రొఫెసర్ పుష్పను వివాహమాడారు. వారంతా చింతామణి కీర్తి యినుమడింపజేసే ప్రయత్నాలలో వున్నారు.

*- వార్త, 28 అక్టోబరు, 2001*

# సెక్యులర్ జర్నలిస్ట్ ధూళిపూడి ఆంజనేయులు

ఆంధ్రలో పుట్టి పెరిగినా ఆంజనేయులు కేవలం ఇంగ్లీషులోనే రాసి పెద్ద జర్నలిస్టుగా ఖ్యాతి చెందారు. గోపాలశాస్త్రి ఆయన్ను డాంజనేయులు అని పిలవగా డి.ఎ అని పాఠకలోకానికి పరిచితులు. ఆయన ఏది రాసినా, చెప్పినా స్పష్టంగా, మృదువుగా, మర్యాదగా వుండేది.

కోటంరాజు రామారావు నడిపిన "ఇండియన్ రిపబ్లిక్"లో తొలుత జర్నలిజానికి అక్షరాభ్యాసం

చేసిన ఆంజనేయులు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎలవర్రులో పుట్టారు. (1924 జనవరి 10) స్కూలు చదువు అంతా కింగ్‌జార్జి పాఠశాల తురుమెళ్ళలో జరిగింది. ఆనాడు జిల్లాలోనే అది ప్రతిష్ఠాత్మకమైన స్కూలు. దక్షిణామూర్తి అనే క్రమశిక్షణ సైనికుడుగా హెడ్మాస్టర్ ఆధ్వర్యాన పేరొందిన ఆంజనేయులు విద్య ముగించారు. తరువాత మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఎం.ఎ. చదివి, లా కోర్సు పూర్తిచేశారు. తొలుత నుండే జర్నలిస్టు జీవితాన్ని ఎంపిక చేసుకున్న ఆంజనేయులు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సబ్ ఎడిటర్‌గా, మద్రాసులో ఆరంభించారు. ఇది 1948 నాటి మాట. 5 ఏళ్ళ తరువాత అక్కడే "హిందూ" పత్రికకు మారారు.

మరో 5 ఏళ్ళపాటు హిందూ సబ్‌ఎడిటర్‌గా సాగిన ఆంజనేయులు, ప్రభుత్వ ఉద్యోగంలో జర్నలిస్టుగా అడుగుపెట్టారు. 1959లో మద్రాసులో 'వాణి' ఆకాశవాణి పత్రిక ఎడిటర్‌గా మరో రకమైన జర్నలిజం ప్రారంభించారు. అప్పటికే ఆంజనేయులు వివాహం చేసుకున్నారు. ఆయన భార్య ఆదిలక్ష్మి తెలుగు, తమిళ భాషాచార్యులు. ఆమె రష్యాలోని లెనిన్‌గ్రాడ్ (సెయింట్ పీటర్స్‌బర్గ్) వెళ్ళి 1958 నుండి 1962 వరకూ వున్నారు. అదే కాలంలో ఆంజనేయులు రష్యా, యూరప్ దేశాలు పర్యటించారు. తన అనుభవాలను 'విండో టు ది వెస్ట్' అని పుస్తకంగా ప్రచురించారు. ఉత్తమ ట్రావలాగ్‌గా ఆ రచన మెప్పు పొందింది.

1962లో శాంతిశ్రీని కన్న ఆదిలక్ష్మి, ప్రసవించిన 15 రోజులకే లెనిన్‌గ్రాడ్‌లో చనిపోగా, సోవియట్ ప్రభుత్వం 16 మాసాలపాటు బిడ్డను పెంచి, ఇండియాలో తండ్రికి అప్పగించారు. 18 సంవత్సరాల అనంతరం శాంతిశ్రీ సోవియట్ పౌరసత్వం వదులుకోగా, రష్యా ప్రభుత్వం ఆమె పేరిట వుంచిన భరణం అందజేసింది. ఇప్పుడు పూనా విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్‌లో ప్రొఫెసర్‌గా వున్న శాంతిశ్రీ తండ్రికి సహాయపడుతూ వచ్చింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరీత్యా ఆంజనేయులు ఢిల్లీ, హైదరాబాద్, మద్రాసులో వుంటూ సమాచారశాఖలో జర్నలిస్టుగా వృత్తిధర్మం నిర్వర్తించారు. ఉద్యోగంలో వున్నా వివిధ పత్రికలకు రాస్తూ ఆంజనేయులు మంచి పేరు తెచ్చుకున్నారు. అంతకుమించి, చక్కని రచనలు ప్రచురించారు. ఆయన రాసిన పత్రికలు క్వెస్ట్, ఇండియన్ రివ్యూ, థాట్, ఇండియన్ లిటరేచర్, త్రివేణి, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, ఇండియన్ రైటింగ్ టుడే పేర్కొనదగినవి.

తెలుగు పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునేవారు. స్వతంత్ర టైమ్స్, డక్కన్ హెరాల్డ్, న్యూస్‌టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురించాయి. భవాన్స్ జర్నల్‌లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీనిఫలితంగా జీవితచరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్‌చౌదరి మొదలైనవారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు.

తెలుగు సాహిత్యాన్ని, రచయితల్ని తెలుగేతరులకు అందించడం ఆయన విశిష్టత. ఇందులో భాగంగా గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ రాయగా, కలకత్తా రైటర్స్ వర్క్ షాప్‌వారు వెలువరించారు

వృత్తిరీత్యానూ, వ్యక్తి దృష్ట్యా ఆంజనేయులుగారికి ఎందరో సన్నిహితులయ్యారు. వారిలో నార్ల వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, బి.ఎస్.ఆర్. కృష్ణ, కె. శ్రీనివాస అయ్యంగార్, వామనరావు, పట్టాభిరాం, ఎ.ఆర్.బాజీ, భావరాజు నరసింహారావు ప్రభృతులెందరో వున్నారు. నార్ల వెంకటేశ్వరరావు తన ఇంగ్లీషు రచనల్ని ముందుగా ఆంజనేయులు పరిశీలించిన తరువాత ప్రచురించేవారు.

సాహిత్య అకాడమీ ప్రచురించిన కట్టమంచి రామలింగారెడ్డి, కేంద్ర ప్రచురణ సంస్థ వెలువరించిన కందుకూరి వీరేశలింగం పేర్కొనదగిన ఆంజనేయులు రచనలు.

విశ్వనాథ సత్యనారాయణ, గోపీచంద్, బైరాగి, పాలగుమ్మి పద్మరాజు, శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైన వారిని తెలుగేతరులకు చక్కగా మదించి పరిచయం జేయడం ఆంజనేయులు కృషిలో భాగమే. ఆయన రెండో భార్య హేమలత హిందీ విద్వాంసురాలు. ఆమె కూడా ఆంజనేయులుగారి రచనల్లో, సమాచార సేకరణలో తోడ్పడుతుండేది. ఆంజనేయులు గారికి పుస్తకాల సేకరణ మంచి అభ్యాసం. ఆయన 1999లో చనిపోయిన తరువాత శాంతిశ్రీ, ఆ గ్రంథాలయాన్ని పూనాకు తరలించారు.

ద్వివేదుల విశాలాక్షి రచన "గ్రహణం విడిచింది" ఇంగ్లీషులోకి అనువదించారు.

ఆంజనేయులు రిటైర్ అయిన తరువాత మద్రాసులో స్థిరపడి, హిందూలో బిట్వీన్ యు అండ్ మి అనే శీర్షిక 10 సంవత్సరాలు (1981-91) నిర్వహించారు. సున్నిత హాస్యం, విమర్శ ఆయన రచనల్లో కనిపించేది. ఆంజనేయులు సెక్యులర్ జీవితం గడిపారు. కుమార్తె వివాహం రిజిస్టర్ చేయించి, కన్యాదాన పద్ధతి నిరసించారు. సంగీతం, సంస్కృతం, సాహిత్యం అంటే ప్రత్యేకాభిమానం.

మద్రాసు ప్రెస్ క్లబ్‌లో 30 సంవత్సరాలు అధ్యక్షులుగా వున్నారు. సాహిత్య విమర్శ, సాంఘిక సంస్కరణలపై కూడా రచనలు చేశారు. చిట్టచివరగా ఖాసాసుబ్బారావు జీవితచరిత్ర రాశారు. అది ఇంకా వెలుగు చూడాల్సివుంది. వీరబ్రహ్మేంద్రను సెక్యులర్ రుషిగా అభివర్ణించి రచన చేశారు కూడా. ఆంజనేయులుగారితో చర్చించడం చక్కని అనుభవం. అలాంటి అనుభవం నేనెప్పుడూ జ్ఞాపకం చేసుకుంటాను.

***- వార్త, 4 నవంబరు, 2001***

# విలక్షణ పాత్రికేయుడు గో.రా. శాస్త్రి

ఆ డబ్బుకు పిండి రుబ్బమంటే రుబ్బేస్తానని సంపాదకుడుగా వ్యాఖ్యానించిన గోరాశాస్త్రి కఠోరంగా మాట్లాడినట్లనిపించవచ్చు. కాని ఆయన అద్యంతాలూ జర్నలిస్ట్‌గానే గడిపారు.

గోరాశాస్త్రికీ గోరాకూ మధ్య ఎలాంటి సంబంధం లేకున్నా కొందరు గందరగోళంతో యిరువురూ ఒకటే అనుకోపోలేదు. ఒకరికి రావలసిన ప్రశంసలు, తిట్లు మరొకరికి రావడమూ జరిగింది. విజయవాడలో నాస్తికోద్యమ నిర్మాతగా గోపరాజు రామచంద్రారావు తనపేరును గోరా అని క్లుప్తీకరించారు. గోరాశాస్త్రి అసలు పేరు గోవిందుని రామశాస్త్రి.

గోరాశాస్త్రి ఒరిస్సా సరిహద్దుల నుండి విశాఖపట్టణం వరకూ అనేక చిన్న బతుకుదెరువు ఉద్యోగాలు చేసి, చివరకు ఆనాటి రాజధాని మద్రాసు చేరారు.

ఖాసా సుబ్బారావు ఇంగ్లీషు స్వతంత్రను, గోరాశాస్త్రి తెలుగు స్వతంత్రను మద్రాసు నుండి నడిపారు. "మద్రాసు మెయిల్ మాకు ప్రియబాంధవి" అంటుండేవారు గోరాశాస్త్రి. అప్పట్లో కలకత్తా నుండి మద్రాసుకు నడిచే మెయిల్ ద్వారా ఉత్తరాలు, వ్యాసాలు అందుకునే వారు. తెలుగు స్వతంత్ర చిన్న పెద్ద రచయితలకు ప్రోత్సాహకారిగా, భిన్నాభిప్రాయాల వేదికగా నిలిచింది. మద్రాసు సంస్కృతి, సంగీతం, మోర్ మార్కెట్‌లో చౌకగా లభించే విదేశీ సాహిత్య పత్రికలు, గోష్ఠులు, రచయితల ప్రవాసం అన్నీ గోరాశాస్త్రిని ఆకట్టుకున్నాయి. ఆయన సికింద్రాబాద్‌లో స్థిరపడినా చివరి దాకా మద్రాసు అంటేనే అభిమానంగా వుండేవారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మిగిలిన పత్రికల వలె తెలుగు స్వతంత్రకూగడ్డుకాలం వచ్చింది. అప్పుడు హైదరాబాద్ మకాం మార్చి శ్రీదేవి (రచయిత్రి, డాక్టరు) సహకారంతో తెలుగు స్వతంత్ర నడిపారు. కాని అట్టేకాలం నడపలేక ఆపేశారు. 'కాలాతీత వ్యక్తులు' నవలరాసిన శ్రీదేవి చనిపోయారు.

గోరాశాస్త్రి ఆంధ్రభూమి ఎడిటర్ అయ్యారు. సికింద్రాబాద్‌లోని జీరాలో అద్దె ఇంట్లో నివశిస్తూ, చివరివరకూ గడిపారు. కొందరు జర్నలిస్టుల వలె గోరాశాస్త్రి సంపాదనలో పడలేదు. ఆయనకు నిత్యమూ ఆర్థిక యిబ్బందులు వుండేవి. ముగ్గురు అమ్మాయిలు వుండగా పుత్రసంతానం లేదు. ఖర్చుబాగా వుండేది. అందువలన ఎప్పుడూ సంసార లంపటత్వ కష్టాలలో యీదుతుండేవాడు.

ఆంధ్రభూమి సంపాదకుడుగా గోరాశాస్త్రి వున్నప్పుడు నేను ఎన్. శూలపాణి అనే పేరుతో వ్యాసాలు రాశాను. చాలా సంవత్సరాలు యిరువురం పరిచయం లేకుండానే సాగింది. తీరా పరిచయం అయినప్పుడు గోరాశాస్త్రిగారు ఆశ్చర్యపోయారు. ఒకటి పేరు గురించి, రెండు వయస్సు గురించి. గోరాశాస్త్రి గారితో పరిచయం సన్నిహిత స్నేహంగా మారిన తరువాత, తరచు

వారి యింట్లో భోజనాలు చేస్తూ ఎక్కువసేపు చర్చలతో కాలక్షేపం చేశాం. అప్పుడే సెట్టి ఈశ్వరరావు (మద్రాసు సోవియట్ కౌన్సిల్‌లో ఉద్యోగం) కె. నారాయణరావు (శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు), రమాదేవి (ప్రస్తుత కర్నాటక గవర్నర్), శశాంక (కవి), భాట్టం శ్రీరామమూర్తి, ఇచ్ఛాపురపు జగన్నాథరావు (రచయిత, ఆఫీసర్), డా॥ పి. తిరుమలరావు, ఉపద్రష్ట కృష్ణమూర్తి, గోపాలశాస్త్రి (గోపాల చక్రవర్తి) పరిచయమయ్యారు.

గోరాశాస్త్రిగారి అభిప్రాయాలు, రాగద్వేషాలు బాగా ఘాటైనవి. కనుక ఒక పట్టాన ఆయనకు దగ్గరగా అందరూ వచ్చేవారు కారు. చర్చలలో నిర్మొహమాటంగా ఎత్తిపొడుపులు, ఖండన మండనలు వుండేవి. ఆంధ్రభూమి సంపాదకుడుగా వున్నప్పుడు, డక్కన్ క్రానికల్ సంపాదకీయాలు రాయమని గోరాశాస్త్రిని యాజమాన్యం కోరింది. అది అదనపు పని, శ్రమతో కూడినది అయినా ఆర్థిక యిబ్బందుల కారణంగా గోరాశాస్త్రిగారు అంగీకరించి ఇంగ్లీషు సంపాదకీయాలు రాసేవారు. ఒక్కోసారి అటు తెలుగు, ఇటు ఇంగ్లీషు సంపాదకీయం రాయడం సమయభావం వలన కష్టంగనుక, వరదాచారి (ప్రస్తుతం తెలుగు యూనివర్శిటీలో) పొత్తూరి వెంకటేశ్వరరావు (నేడు ప్రెస్ అకాడమీ అధ్యక్షులు)కు ఆ పని అప్పగించేవారు. సంపాదకీయాలు రాస్తున్న రోజులలో యించుమించు ప్రతిరోజూ సీతారాం (యునైటెడ్ న్యూస్‌లో జర్నలిస్ట్)తో ఫోనులో సంప్రదిస్తుండేవారు. పదౌచిత్యం, సరైన అర్థంకోసం గోరాశాస్త్రి సరస ఫోను సంభాషణలు అప్పుడప్పుడు తిట్లవరకూ సాగేవి. గోరాశాస్త్రిగారు రానురాను సంపాదకీయాలకే పరిమితమై మిగిలిన ఆఫీసు బాధ్యతలు ఇతరులకు అప్పగించేవారు.

శ్రీశ్రీ, రావిశాస్త్రి అంటే గోరాశాస్త్రికి యిష్టం. శ్రీశ్రీ అభిప్రాయాలతో గోరాశాస్త్రి ఎక్కడా అంగీకరించకపోయినా, మద్రాసు రోజులనుండే వారి స్నేహం అలాగే కొనసాగింది. శ్రీశ్రీ సమాచార తృష్ణ ఆయనకు బాగా నచ్చింది. రావిశాస్త్రి హైదరాబాద్ వచ్చినప్పుడల్లా కలుస్తుండేవారు. నేనూ ఆయనతోబాటే కలసి వారి సంభాషణలు విని ఆనందించేవాడిని. రావిశాస్త్రి ఉపమానాలు గోరాశాస్త్రి ప్రత్యేకాభిమానరీతులు. ఉప్పులూరి కాళిదాసు "ఆనందవాణి" పత్రిక గురించి తొలుత నేను గోరాశాస్త్రిగారి ద్వారానే తెలుసుకున్నాను. చిలవలు పలవలుగా ఆ పత్రిక దాని సంపాదకుడి విషయాలు చెప్పుకునేవారు. అందులో నిజమే ఎక్కువ అని గోరాశాస్త్రిగారన్నారు. అంతేగాక ఉప్పులూరి కాళిదాసును ఆయన ఇంటికి వచ్చినప్పుడు శాస్త్రిగారే పరిచయం చేశారు. అది వేరేకథ.

రాజకీయవాదులు అట్టే గోరాశాస్త్రి గారి దగ్గరకు వచ్చేవారు కారు. ఆయన కూడా మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసేవాడు కాదు. ఎప్పుడైనా ఒకసారి పి.వి. నరసింహారావును విద్యామంత్రిగా, ముఖ్యమంత్రిగా చూడకపోలేదు.

గోరాశాస్త్రి గారికి నిత్యమూ కరువే అని చెప్పానుగదా. అది దృష్టిలో పెట్టుకుని కర్నూలులో ఆయనకు సత్కారం తలపెట్టాం. మండవ శ్రీరామమూర్తి (ప్రస్తుతం విజయవాడలో రిటైర్ అయిన వ్యవసాయ బాంక్ ఆఫీసర్) సి. ధర్మారావు నేనూ పూనుకున్నాం. ఒక సంచిక

ప్రచురించాం. కర్నూలు జిల్లా పరిషత్తు అధ్యక్షుడుగా కోట్ల విజయభాస్కరరెడ్డి, విద్యామంత్రిగా పి.వి. నరసింహారావు సహకరించగా ఒక సభ జరిపి, గోరాశాస్త్రిగారికి కొంత ఆర్థిక సహాయం వసూళ్ళ ద్వారా అందించగలిగాం.

హైదరాబాద్‌లో రేడియో చర్చలలో గోరాశాస్త్రి పాల్గొనేవారు. మద్రాసు నుండే ఆయన రేడియో నాటికల ప్రత్యేకత సాధించారు. "ఆశ ఖరీదు అణా" అనే కథ నుండి అనేకం పాఠకుల మన్ననలు పొందాయి. దిగంబర కవుల రచనలు గోరాశాస్త్రి విమర్శలకు గురయ్యాయి. అర్థరాత్రి నాంపల్లి స్టేషన్ వద్ద రిక్షాకూలితో ఆవిష్కరించిన తొలి పుస్తకాన్ని గోరాశాస్త్రి ఎద్దేవా చేసేవారు. జీరాలో గోరా అంటూ కమ్యూనిస్టు కవులు ఆయన్ను విమర్శించేవారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వాన్ని బాగా మెచ్చుకుంటూ, పోగారితనం ఆయన శిల్పంలో వుందనేవాడు. కాని వ్యక్తిగా కృష్ణశాస్త్రి అబద్ధాన్ని జీవించాడనేవాడు.

రామోజీరావుగారు ఈనాడు పత్రిక పెట్టడానికి సంకల్పించినప్పుడు గోరాశాస్త్రిని సంప్రదించారు. హైదరాబాద్ అబిడ్స్‌లో వున్న మార్గదర్శి కార్యాలయంలో చాలా పర్యాయాలు సాయంకాలాలలో యీ సమావేశాలు జరిగాయి. అందులో నేనూ పాల్గొన్నాను. కొత్త పత్రిక ఎదుర్కోబోయే సమస్యలు, దినపత్రికల తీరుతెన్నులు, విదేశాలలో పత్రికల వ్యవహారం మొదలైన అంశాలు చర్చకు వచ్చేవి. గోరాశాస్త్రి తన అనుభవాల దృష్ట్యా రామోజీరావుతో అనేక అంశాలు చెప్పేవారు. ఆయన శ్రద్ధగా వినేవారు. ఈ సమావేశాలు ఏర్పాటు కొంతకాలం సాగిన తరువాత 'ఈనాడు' వెలువడింది. నేను ఆ చర్చలలో పాల్గొనడం వల్ల గోరాశాస్త్రిగారి మద్రాసు అనుభవాలెన్నో గ్రహించగలిగాను. 1970 ప్రాంతంలో నార్ల వెంకటేశ్వరరావు అన్నా, ఆయన సంపాదకీయాలన్నా గోరాశాస్త్రికి గిట్టేవికావు. మద్రాసు నుండే వారిరువురికీ సఖ్యతలేదు. ఖాసా సుబ్బారావు గొప్పతనం ఎన్నోవిధాల గోరాశాస్త్రి కొనియాడుతుండేవారు. టంగుటూరి ప్రకాశం జర్నలిజం గురించి కడుపుబ్బ నవ్వించే విశేషాలు చెప్పేవారు.

స్టీవెన్ స్పెండర్ ఆంగ్లకవిత్వం పట్ల గోరాశాస్త్రికి ప్రత్యేక మోజు వుండేది. గోరాశాస్త్రి సంపాదకీయాలలో కొన్ని, ఆయన నాటికలు, కథలు ఈతరం వారికి అందవలసివుంది. గోరాశాస్త్రిగారికి అండగా నిలచి చివరివరకూ సహాయపడిన ఖ్యాతి మిత్రులు సి. ధర్మారావుదే. దూరతీరాలు, ఆనందనిలయం, పరువుకోసం పోతే వంటి రచనలు పునర్ముద్రణ అయితే బాగుంటుంది. 1982 మేలో ఆయన మరణించిన అనంతరం గోరాశాస్త్రిని యిప్పుడిప్పుడే మళ్ళీ తలుస్తున్నారు. డా॥ పి. తిరుమలరావు తన స్వీయ చరిత్ర కట్టలుగా రాసి, గోరాశాస్త్రి దగ్గర పడేసేవారు. ఆయన చిత్రికపట్టి, శైలిపెట్టి, నానాతిప్పలుపడి ఒక క్రమంసమకూర్చేవారు. ఆవిధంగా అనేకమందికి గోరాశాస్త్రి సాహిత్యసేవ చేశారు.

***- వార్త, 20 జనవరి, 2002***

# రాయిస్టు ఆలోచనలకు పాదు వేసిన ఎం.వి. శాస్త్రి

తెలుగునాట పత్రికారంగానికి చెందిన ప్రముఖులు ఎందరో ఉన్నారు. ఇతర రంగాలతో సంబంధం ఉన్నా పత్రికా రంగానికి సేవలు అందించిన అరుదయిన పాత్రికేయులు కూడా ఉన్నారు. పాత్రికేయులుగా ఉంటూనే విభిన్న రంగాల్లో రాణించినవారు కూడా ఉన్నారు. వారిగురించి ఈ తరానికి పరిచయం చేసే ప్రయత్నమిది. అందులో భాగంగా అందిస్తున్న తొలివ్యాసమిది.

జర్నలిస్ట్‌గా ఆరంభించి, తలవని తలంపుగా ఆంధ్రలో పునర్వికాసోద్యమానికి నాంది పలికిన ములుకుట్ల వెంకటశాస్త్రి (ఎం.వి. శాస్త్రి) పాత్ర గమనార్హం.

కుందూరి ఈశ్వరదత్తు స్వాతంత్ర్యోద్యమ రోజులలో పీపుల్స్ వాయిస్ అనే పేరిట మద్రాసు నుండి ఇంగ్లీషు పత్రిక నడిపారు. 1936లో ఫైజ్‌పూర్‌లో (మహారాష్ట్రాలో ఒక గ్రామం) కాంగ్రెసు పార్టీ మహాసభ డిసెంబరులో జరిగింది. ఆ సభా విశేషాలు రాసే నిమిత్తం ఎం.వి. శాస్త్రిని పీపుల్స్ వాయిస్ పక్షాన పంపారు. కాకినాడలో చదువు ముగించిన ఎం.వి. శాస్త్రి ఉత్సాహంగా వెళ్ళారు. అక్కడ జైలు నుండి విడుదలై వచ్చి, రాజకీయాలలో హేతుబద్ధంగా, అంతర్జాతీయ వ్యవహారాలు అవలీలగా మాట్లాడిన ఎం.ఎన్. రాయ్ మాటలు ఎం.వి. శాస్త్రిని ఆకట్టుకున్నాయి. గాంధీ మత, మిత ధోరణిని వ్యతిరేకిస్తూ మాట్లాడిన రాయ్‌ను ఆంధ్రకు ఆహ్వానించి వచ్చారు శాస్త్రి.

1937 జూలై చివరలో మద్రాసులో యువజనసభలో పాల్గొన్న ఎం.ఎన్. రాయ్ ఆగస్టు 1న తొలిసారి ఆంధ్రలో అడుగుపెట్టారు. నెల్లూరులో వెన్నెల కంటి రాఘవయ్య ఆధ్వర్యాన జరిగిన వ్యవసాయ కార్మికుల మహాసభకు ఎం.ఎన్. రాయ్ ప్రధాన వక్తగా వచ్చారు. అక్కడ జబ్బుపడ్డారు. కాకినాడ నుండి ఎం.వి. శాస్త్రి వెంటనే వచ్చి ఎం.ఎన్. రాయ్‌ను తమ వూరికి తీసుకెళ్ళారు. అక్కడ శాస్త్రిగారి వద్ద రాయ్ కోలుకుంటున్నప్పుడే, విశాఖపట్టణం నుండి అబ్బూరి రామకృష్ణారావు (యూనివర్శిటీలో లైబ్రేరియన్, థియేటర్ నిపుణులు) వచ్చారు. ఆవిధంగా ఎం.ఎన్. రాయ్‌ను వారిరువురూ ఆంధ్రకు పరిచయం చేశారు. వారి జీవితాల్లో అదొక పెద్ద మలుపు అయింది. ఎం.వి. శాస్త్రి అప్పటి నుండీ రాయ్ అనుచరుడుగా పనిచేశారు. రాడికల్ డెమొక్రటిక్ పార్టీలో ప్రధానపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర రాడికల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభల్ని కాకినాడలో నిర్వహించారు. బెంగాల్ నుండి కె.కె. సిన్హా ప్రారంభోపన్యాసకులుగా వచ్చారు.

ఆంధ్రలో ఎప్పుడు పర్యటనకు వచ్చినా శాస్త్రి దగ్గరకు వచ్చేవారు రాయ్ దంపతులు. రాడికల్ హ్యూమనిస్ట్ పత్రికలో శాస్త్రి అనేక వ్యాసాలు రాశారు. ఇంగ్లీషులో వ్యాసాలు రాయడంలో శాస్త్రి గారు దిట్ట. చాలా హేతుబద్ధంగా, మంచి శైలిలో, హాస్యం తొణికిస్తూ రాసేవారు. రాయ్

1954లో చనిపోయిన అనంతరం, అడ్వొకేట్‌గా ప్రాక్టీసు చేసిన శాస్త్రిగారు రాజగోపాలాచారి వాదనల పట్ల, ఉదారవాద, స్వేచ్ఛాభావాల పట్ల ఆకర్షితులయ్యారు.

1959లో రాజాజీ స్వతంత్ర పార్టీ స్థాపకులుగా ఆంధ్ర పర్యటించినప్పుడు కాకినాడలో శాస్త్రిగారింట్లో జరిగిన విందులో నేను పాల్గొన్నాను. ఆనాడు గొప్ప సభ జరిగింది. రాజాజీ ఉపన్యాసాన్ని తెలుగులోకి అనువదించడానికి ప్రయత్నించిన ఉషశ్రీ విఫలమయ్యారు. చివరకు శాస్త్రిగారి సలహాపై గౌతులచ్చన్న అనువదించి, మెప్పించారు. శాస్త్రి స్వరాజ్య పత్రికలో అనేక వ్యాసాలు రాశారు. కె. సంతానం సంపాదకుడుగా మద్రాసు నుండి నడిచిన ఆ పత్రిక మేధావులను ఆకర్షించింది. ముఖ్యంగా హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నాన్ని అడ్డుకున్నది.

ఎం.వి. శాస్త్రి ఆంధ్రలోని రాడికల్ హ్యూమనిస్టులలో ఆవుల గోపాలకృష్ణ మూర్తికి సన్నిహితులుగా వుండేవారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికలలో గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.వి. శాస్త్రి నిలిచారు. ములుకుట్ల వెంకటశాస్త్రికి ఓటు వేయమంటూ ఆయన ఒక ఆకర్షణీయ విజ్ఞప్తి ఓటర్లకు పంపారు. శాస్త్రిగారు నెగ్గి, ఎం.ఎల్.సి.గా ఒక టరమ్ పనిచేశారు.

శాసనమండలిలో పరిమితంగా మాట్లాడినా, చాలా లోతైన భావోపన్యాసాలు చేశారు. హుందాగా ప్రవర్తించారు. 1962 నుండి ఆయన ఎం.ఎల్.సి.గా హైదరాబాద్‌లో వుంటూ వచ్చారు. అప్పుడే స్వతంత్ర పార్టీ సమావేశాల్లోనూ పాల్గొన్నారు.

రాజగోపాలాచారి ముఖ్యంగా ఎం.వి. శాస్త్రి తీర్మాన పాఠాన్ని మెచ్చుకునేవారు. శాస్త్రిగారు రాస్తే రాజాజీ యథాతథంగా అక్షరం మార్చకుండా ఆమోదించేవారు. ఆయన ఇంగ్లీషు అంత బాగా వుండేది. శాస్త్రి గారికి అందరూ అమ్మాయిల సంతానమే. పెళ్ళిళ్ళరీత్యా వారిలో కొందరు అమెరికా వెళ్ళారు. శాస్త్రి గారు అనేక పర్యాయాలు అమెరికా పర్యటించారు. హైదరాబాదులో వుండగా దంటు భాస్కరరావుతో కలిసి శాస్త్రిగారు వినోద, సాహిత్య కార్యకలాపాలు ఆనందించేవారు. శాస్త్రిగారి వ్యాసాలు, శాసనమండలి ఉపన్యాసాలు గ్రంథస్థం కావలసివుంది. 1990లో శాస్త్రిగారు మరణించారు.

***- వార్త, 7 అక్టోబరు, 2001***

# విశిష్ట పాత్రికేయుడు ఎజికె

దినపత్రికల నాయకత్వం అనే శీర్షికతో ఆనాటి ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలను హద్దుల్లో పెట్టిన అసాధారణ వ్యక్తి ఆవుల గోపాలకృష్ణమూర్తి. తెనాలిలో 1942లో రాడికల్ అనే పత్రికా సంపాదకుడుగా ప్రారంభించి, ఉత్తరోత్తరా రాడికల్ హ్యూమనిస్ట్, సమీక్ష అనే పత్రికలు నడిపారు. వృత్తిరీత్యా అడ్వకేట్ అయిన ఎ.జి.కె. అసాధారణ ప్రతిభావంతుడుగా గుర్తింపు పొందారు.

నా చుట్టూ ప్రపంచం అనే శీర్షికతో ఎజికె వాహిని పత్రిక (విజయవాడ)లో రాసిన అంశాలు ముఖ్యమంత్రులను, రాజకీయ నాయకులను కదలించాయనడానికి అనేక ఆధారాలున్నాయి. ఒకేఒక పర్యాయం తెనాలి మునిసిపల్ ఛైర్మన్‌గా చేసిన ఎజికె ప్రపంచ దృష్టిని ఆకర్షించడానికి ఆయన పత్రికా వ్యాసాలు, ప్రసంగాలే కారణం. 1964లో అమెరికా ప్రభుత్వం ఎజికెను ఆహ్వానించగా, బి.ఎస్.ఆర్. కృష్ణ తెచ్చిన ఆహ్వానలేఖ అందరినీ ఆశ్చర్య ఆనందాలతో ముంచెత్తింది. మారుమూల వున్న ఒక అనధికారిని కేవలం ప్రతిభ ఆధారంగా గుర్తించి, పిలవడం ఎజికె గొప్ప మానవతవాద విలువలకు గీటురాయి. దానికి తగ్గట్లే మూడు నెలలు పర్యటించిన ఎజికె అమెరికా వారిని ఆశ్చర్యపరిచే హేతువాద ఔన్నత్యాన్ని కనబరచారు. అది చరిత్ర.

ఎజికె పత్రికా రచనలు చాలా పదునుగా కొత్త దిశలో సాగాయి. ఎందరినో ఉత్తేజపరచిన ఎజికె విమర్శలు, చాలామందిని ఇబ్బంది పెట్టేవి కూడా. గాంధీజీపై 1942లోనే రాడికల్ పత్రికలో ఎజికె రాసిన వ్యాసం అబ్బూరి రామకృష్ణారావును దిగ్భ్రాంతిపరచగా, ఆయన, ఎం.వి. రామమూర్తి కలిసి ఎం.ఎన్. రాయ్‌కు ఫిర్యాదు చేశారు. రాయ్ ఆ వ్యాసాన్ని పూర్తిగా బలపరచగా, తరువాత మల్లాది రామమూర్తి, అబ్బూరిగారలు ఎజికె సన్నిహితులుగా మారారు.

**గవర్నర్ త్రివేది :** ఆంధ్ర గవర్నర్‌గా కాకలుతీరిన ఐ.సి.ఎస్ అధికారి చందూలాల్ త్రివేది వుండగా, ఒకసారి తెనాలి సందర్శించారు. అప్పుడు మునిసిపల్ ఛైర్మన్‌గా వున్న ఎజికె, పురపాలక సమావేశానికి వచ్చిన త్రివేదికి చురకలు వేయడం, త్రివేది తన తప్పిదాన్ని గ్రహించి క్షమాపణ చెప్పడం, చెప్పుకోదగిన అంశం. ప్రొటోకోల్ తెలిసిన త్రివేది, వేరే సభకు ముందు వెళ్ళి, అనంతరం మునిసిపల్ సభకు వచ్చారు. అందుపై ఎజికె చమత్కారంగా అంటేటట్లు వేసిన చురక త్రివేదికి నచ్చడం గమనార్హం.

**నీలం సంజీవరెడ్డి :** ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి తెనాలి రాగా, మునిసిపాలిటీ వారడిగిన రెండు రోడ్లలో ఒకటి మంజూరు చేసినట్లు ప్రకటించారు. అప్పటి వరకూ ఎవరికీ అడిగిన రెండిటిలో సగం యివ్వలేదని, చప్పట్ల మధ్య సంజీవరెడ్డి ప్రకటన చేశారు. ఎజికె చెబుతూ రెండిటిలో ఒకటి సగంకాదనీ, అడిగిన రెండు రోడ్లలో మంజూరు చేసిందానికి బదులు రెండోది యిస్తే సంతోషిస్తామన్నారు. మంజూరుచేసిన రోడ్డు విలువ 20వేలు కాగా, రెండో రోడ్డు విలువ లక్షరూపాయలని ఎజికె అనేసరికి, సంజీవరెడ్డి బిత్తరపోగా, జనం ఎజికెకు హర్షధ్వానాలు పలికారు. నన్ను ఏడిపించడానికి ఎజికెను సభకు పిలిచారా అని తరువాత మునిసిపల్ బంగళాలో ఆలపాటి వెంకట్రామయ్య (కీ.శే.మంత్రి)తో సంజీవరెడ్డి మండిపడ్డారు.

**దామోదరం సంజీవయ్య :** ముఖ్యమంత్రిగా సంజీవయ్య వున్నప్పుడు, ఎజికెకు మిత్రుడు. ఒకసారి విజయవాడ పర్యటనకు వెళ్ళి, గుట్టమీద వున్న హరిజన (దళిత) హాస్టల్‌కు వెళ్ళవలసి వుండగా నేను ఎక్కలేనంటూ తిరిగి వెళ్ళిపోయారు. దీనిపై ఎజికె వ్యాఖ్యానిస్తూ "ముఖ్యమంత్రి పదవికి దేక గలిగినవాడు ఆ మాత్రం దళితుల కోసం గుట్టెక్కలేకపోయాడా" అన్నారు. ఆంధ్రపత్రిక

ఆమాటల్ని ప్రధానంగా ప్రచురించడంతో, సంజీవయ్య స్పందించి వెంటనే కార్యక్రమం వేసుకొని దళిత హాస్టల్ సందర్శించడమేగాక, ఎజికెకు మెచ్చుకోలు లేఖ రాశాడు.

**తిమ్మారెడ్డి** : పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి వ్యవసాయ మంత్రిగా దిగిపోయినప్పుడు తెనాలిలో ఎజికె పూనుకొని ఘనంగా ఆయన్ను సన్మానించి, ఒక సంచిక ప్రచురించి బహూకరించారు. పదవిలో లేనప్పుడు గుర్తించడం, వ్యక్తికి గౌరవమని ఎ.జి.కె స్పష్టం చేశారు. అది ఎజికె హేతుపద్ధతికి, మానవ విలువలకు పట్టంగట్టే తీరు.

**విద్యామంత్రితో** : ఎస్‌బిపి పట్టాభిరామారావుకు రవాణ, విద్యాశాఖలు ఆంధ్రప్రదేశ్ తొలిమంత్రి వర్గంలో యివ్వగా "విద్య కదలబారుతుందన్నమాట" అని ఎజికె చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకున్నది. చలన రహితంగా వున్న విద్యాశాఖపై అదొక చురక. అప్పుడే పాఠ్యగ్రంథాల జాతీయకరణ చేయడం, విశ్వనాథసత్యనారాయణ రాసిన పాఠంలో బుద్ధుణ్ణి రాక్షసుడుగా, పాపాల్నిపెంచేవాడుగా చిత్రించడం జరిగింది. దీనిపై ఎజికె తన రచనల ద్వారా ధ్వజమెత్తి, ఆ పాఠాన్ని ఉపసంహరించేవరకూ పోరాడారు. ఎజికె విమర్శలకు పట్టాభిరామారావు వుక్కిరిబిక్కిరైపోయారు.

**మాకినేని బసవపున్నయ్య** : చదువుకునే రోజులలో (2వ ప్రపంచ యుద్ధ సమయం) గుంటూరు ఎసి కాలేజిలో కమ్యూనిస్టు నాయకుడు మాకినేని బసవపున్నయ్య, ఎజికె మిత్రులే. ఎం.ఎన్.రాయ్ అనుచరులతో మాట్లాడవద్దని కమ్యూనిస్టు పార్టీ రహస్య తీర్మానం చేసింది. ఆనాటి రాజకీయ కారణాలతో చేసిన ఆ నిర్ణయం ఎజికెకు తెలిసింది. రోడ్డుమీద అనుచరులతో వెడుతున్న బసవపున్నయ్యను కావాలని నిలదీసి, ఎజికె పరామర్శలు చేశాడు. తప్పించుకుపోవాలని ప్రయత్నించిన బసవపున్నయ్యను ఉద్దేశించి "విప్లవాలు పరిగెత్తిపోవడం లేదు లేవోయ్ ఆగి మాట్లాడు కాసేపు" అని ఏడిపించాడు. చుట్టూ చూస్తున్న కమ్యూనిస్టు అనుచరులు గిలగిల్లాడిపోయారు కాసేపు! తీర్మానం అలా అమలుజరుగుతున్నందుకు.

**రాజాజీమెప్పు** : రాజ్యాంగ 17వ సవరణ వలన రైతు లోకానికి నష్టం వాటిల్లుతుందని, నియంతృత్వ ధోరణులు ప్రబలుతాయని రాజగోపాలాచారి, ఎన్.జి. రంగా ఆందోళన చేశారు. ఆ సందర్భంగా బాపట్లలో పెద్దసభ జరిగింది. ఆ విషయంపై ముందుగా ఎజికె మాట్లాడారు. అది విన్న తరువాత రాజాజీ వ్యాఖ్యానిస్తూ, యిక తాను మాట్లాడవలసిందేమీ లేదని, చాలా విడమరిచి లోతుపాతులతో ఎజికె ప్రసంగించారన్నారు. రాజాజీ అలా శ్లాఘించడం ఎజికె విషయ పరిజ్ఞానానికి, పరిపక్వ విమర్శకు సర్టిఫికెట్. ఆస్తులను ప్రభుత్వం స్వాధీనపరచుకోవడానికి జవహర్‌లాల్ నెహ్రూ తలపెట్టిన సవరణ విషయం. ఇదంతా (1957) స్టడీకాంపులలో ఎజికె అధ్వర్యం, ఆచార్య నిర్వహణ, కొత్తవారిని ప్రోత్సహించే తీరు, విషయాన్ని విపులీకరించడం ఒక అద్భుత ప్రక్రియగా వుండేది. అందులో పాల్గొని ఎజికె పట్ల ఆకర్షితులుకాని వారు లేరు.

ఆలిండియా కాంప్‌లో ఒకసారి ఎం.ఎన్. రాయ్‌తో కొరియా విషయంలో విభేదించగా, వీరారాధకులు ఆశ్చర్యపోయారు. ఎ.జి.కె వీరారాధకుడు కాదు. చివరకు ఆ విషయం గుర్తించిన ఎం.ఎన్.రాయ్ దిగివచ్చి ఎజికెతో సత్సంబంధాలు సాగించాడు. ఎ.బి.షా, వి.ఎం. తార్కుండే, జి.డి. పరేఖ్, కె.కె. సిన్హ మొదలైన హూయమనిస్టులతో ఎజికె పనిచేశారు. అన్నిటా తన వ్యక్తిత్వమే రాణించింది. పత్రికారంగంలో ఎజికె సన్నిహితులు చాలామంది వుండగా, ప్రముఖులలో పండితారాధ్యుల నాగేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు పేర్కొనదగినవారు.

**వివేకానంద, నెహ్రూ వివాదం :** 1964లో ఎజికె, అమెరికా వెళ్ళబోతున్న సందర్భంగా తెనాలిలో సన్మానించారు. వివేకానందను గురించి గొప్పగా అమెరికాలో ప్రశంసించమని సభలో కోరగా, వున్నదివున్నట్లే వివేకానంద గురించి చెబుతానుగాని, కోరినట్లు స్తుతి పాఠాలు చెప్పనని ఎజికె అన్నారు. దీనిపై ఆంధ్రప్రభ నీలంరాజు వెంకటశేషయ్య సంపాదకత్వాన తీవ్ర దాడిచేసింది. నెలరోజులపాటు లేఖలు, నిందారోపణలు గుప్పించింది. ఎజికెను అమెరికా నుండి వెనక్కు పిలిపించాలని ఉద్యమించింది. ఆ దురుద్దేశ ఉద్యమం ఫలించలేదు. కాని ఎజికె వ్యాఖ్యల బాగోగులు పరిశీలనకు వచ్చాయి. ఎజికె అమెరికాలో వివేకానందపై ప్రస్తావనే తేలేదు. అటువంటి సందర్భంరాలేదు. కాని జవహర్‌లాల్ నెహ్రూపై ఎజికె వ్యాఖ్యలు ఆనాటి రాయబారి బి.కె. నెహ్రూకు నచ్చలేదు. రాయబార కార్యాలయం వారు ఎజికె పర్యటన ఆపించాలని, వీలైతే ఇండియాకు పంపాలని ప్రయత్నించినట్లు వడ్లమూడి శ్రీకృష్ణ చెప్పారు. నెహ్రూపై విమర్శలు చేయవద్దని ఎజికెకు కబురు పంపారు. కాని ఎజికె అవి పట్టించుకోలేదు. ఇండియాలో నెహ్రూ విధానాల పట్ల ఎలాంటి విమర్శనాత్మక ధోరణి చూపాడో, అదే అమెరికాలోనూ కొనసాగించాడు. 1940 నుండి 1967లో గుండెపోటుతో చనిపోయేవరకూ "వ్యాసోపన్యాసకుడు"గా ఎజికె రాణించారు.

ఎజికె తెలుగులోనూ ఇంగ్లీషులోనూ మంచివక్త. చాలా ఆకర్షణీయంగా, జటిల అంశాలను సులభంగా అర్థం అయ్యేట్లు చెప్పేవారు. సాహిత్య సభలలో ఆయనకు ఒక ప్రత్యేకస్థానం వుండేది. ఎజికెను సభకు పిలిచారా అని విశ్వనాథ సత్యనారాయణ ముందు అడిగి, ఆరాతీసి ఎజికె వస్తున్నారంటే, ఆ సభకు వచ్చేవారే కాదు. కాటూరి వెంకటేశ్వరరావు, తుమ్మల సీతారామమూర్తి, ఏటుకూరి వెంకట నరసయ్య, పూతల పట్టు శ్రీరాములు మొదలైనవారు ఎజికె యిష్టులు. చాలా మంది కవులు, గాయకులు, రచయితలు ఎజికెను గురువుగా భావించేవారు. అందులో కొండవీటి వెంకటకవి ఒకరు. ఆయన రాసిన నెహ్రూ చరిత్ర కావ్యానికి ఎజికె సహాయపడ్డారు. ఢిల్లీ వెళ్ళి నెహ్రూను కలసి పుస్తకం యిచ్చినప్పుడు జవహర్‌లాల్‌నెహ్రూ అడిగితే, ఈ గ్రంథం వెనుక ఎజికె వున్నట్లు వెంకటకవి చెప్పారు.

పెళ్ళిళ్ళు సెక్యులర్ పద్ధతిలో చేయించడం, అప్పుడు ఎజికె చెప్పే ప్రసంగం గొప్ప అంశం. బోర్ కొట్టకుండా కొత్త అంశాన్ని ఆలోచింపజేసేట్లు అందించడం ఎజికె మేధస్సుకే చెల్లింది. (నా వివాహం ఎజికె చేయించారు తెనాలిలో. ఆవుల సాంబశివరావు అధ్యక్షత వహించారు 1964 మే

31న) అందరూ అనేదేమంటే, సాధారణ విషయాన్ని ఎజికె చెబితే అది అసాధారణంగా మారుతుందని!

సమాజాన్ని ప్రభావితం చేసిన జర్నలిజం ఎజికెది. ఎజికె రచనలు ఇంకా పుస్తకరూపం దాల్చవలసి వుంది. పరిశోధన జరగాల్సివుంది. "నా అమెరికా పర్యటన" పుస్తకం తప్ప, మిగిలినవన్నీ వ్యాసాలే. ఇంగ్లీషులో తక్కువగానూ, తెలుగులో విపరీతంగానూ వున్న వ్యాసాలు, అనేక రచనలకు ఆయన పీఠికలు పరిచయాలు సమగ్ర సంపుటాలుగా రావాలి. ప్రసంగ టేప్‌లు వుంటే అవికూడా భద్రపరచవలసి వుంది.

జర్నలిస్టులపై ఎజికె ప్రభావానికి నిదర్శనగా ఒక అంశం ప్రస్తావిస్తాను. 1954లో ఎం.ఎన్. రాయ్ చనిపోయినప్పుడు నార్ల వెంకటేశ్వరరావు సంపాదకత్వాన మద్రాసు నుండి వెలువడే ఆంధ్రప్రభ సంపాదకీయ ప్రస్తావన చేయలేదు. దేశంలోని ప్రముఖ పత్రికలన్నీ రాశాయి. గుంటూరులో ఏకాదండయ్య హాలులో సంతాపసభ జరిగింది. ఎజికె మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యల్ని ఆంధ్రప్రభ విలేకరి సోమయాజులు యథాతథంగా పంపారు. "ఎవడో దారినపోయే టాంపాయ్ చనిపోతే, ఒక వటవృక్షం కూలింది, ఒక తార రాలింది అని సంపాదకీయాలు రాసే ఆంధ్రప్రభకు ఎం.ఎన్. రాయ్ ఎవరో తెలియదా" అని ఎజికె చేసిన వ్యాఖ్యానం నార్ల వెంకటేశ్వరరావును తగిలింది. వెంటనే ఎం.ఎన్. రాయ్ రచనలు తెప్పించుకొని, కూలంకషంగా చదివి, మరుసటేడు గొప్ప సంపాదకీయం రాశారు. అప్పటినుండీ ఎజికె, నార్ల మిత్రులయ్యారు.

*- వార్త, 21 అక్టోబరు, 2001*

# సైన్సు సంగతులు

# మనుషులు మరెక్కడ లేరా?

మనం పుస్తకాల్లో చదివాం. కథల్లో విన్నాం. సినిమాలలో చూశాం. దేవుళ్ళకు, రాక్షసులకు, దేవతలకు వింత ఆకారాలు వున్నాయని, నాలుగు తలలు, మూడు కళ్ళు, ఎనిమిది చేతులు, సగం జంతువు యిలా ఎన్నో వింతలు వున్నాయి. వీరంతా వేరే లోకాల్లో వుంటారనీ, ఎప్పుడైనా భూమి మీదకు వస్తారనీ కూడా చెబుతారు. మేఘాలమీద, ఎగిరే పళ్లాల ద్వారా, క్షణంలో ప్రత్యక్షమవుతారని కథలు అల్లారు. పిల్లలకు ఇలాంటివి చెప్పినప్పుడు, అవి కథలన్నీ, ఊహలనీ చెబితే సరి. కాని అలా జరగడం లేదు. అందుకే పెద్దవాళ్ళు అయినా చిన్నప్పటి వింత కథలు మనస్సునుండి తొలగకపోగా, అవన్నీ నిజాలనే దృష్టితో మొక్కులు పూజలు జరుపుతున్నారు. సైన్స్ పరిధిలో పరిణామం, సాపేక్షత, జీవుల పుట్టుక తెలుసుకుంటున్నారు.

ఇంతవరకు తెలిసిన ప్రకారం గాలి పీల్చుకొని బతికే జీవులు భూమికే పరిమితం. మిగిలినచోట్ల జీవులు వుండాలంటే ప్రాణవాయువు (ఆక్సిజన్) బదులు హైడ్రోజన్, ఇతర వాయువులు పీల్చి బతికే వారు కావాలి. భూమి మీద తప్ప ఆక్సిజన్ ఎక్కడా వున్నట్లు దాఖలాలు లేవు. జీవుల పరిణామానికి కార్బన్ ప్రధానంగా కావాలి. ఇందులో జీవాణువులున్నాయి. దీని అణువులు తీగలుగా మెలివేసుకుని, ఇతర అణువులతో కలుస్తాయి. సిలికాన్‌లోనూ ఇలాంటి కలయిక వున్నా, కార్బన్ అంత బంధం లేదు. జీవితాన్ని నిర్మించే అణుసముదాయం కార్బన్‌కే వుంది. కార్బన్‌లో అణువుల అనుబంధమే డెక్సైరైబోక్లిన్ డి.ఎన్.ఎ అణువులకూ, రైబోనూక్లిన్ యాసిడ్ ఆర్.ఎన్.ఎ.ల అణువులకూ దారితీసింది. వీటిచుట్టూ ప్రొటీన్లు, ఎంజైమ్‌లు, తగిన ఇతరాలు వచ్చాయి. జీవి లక్షణం ఏమంటే తన నుండి మరో జీవిని తయారు చేసి సమాచారాన్ని అందించడం, భూమ్మీద నాలుగు బిలియన్ సంవత్సరాల క్రితం జీవ సంబంధమైన పుట్టుక మొదలై, నేటి దశకు క్రమంగా పరిణమించింది. జీవోత్పత్తిని పెంచే ముందు, అందుకు అనుగుణమైన ఆర్ఎన్ఎ రైబోజైమ్స్ ఏర్పడ్డాయి. పరిణామం క్రమేణ నిరంతరంగా ఎలా కొనసాగుతున్నదో పరిశీలించారు. ఇది నిర్జీవలోకంలోనూ, జీవలోకంలోనూ సాగుతున్నది. ఇంతవరకూ పరిశీలించిన దానిని బట్టి, గ్రహాలలో, తారలలో మరెక్కడా జీవ లక్షణాలు కనిపించలేదు. ఒకటి రెండు గ్రహాలలో ప్రాథమిక జీవ లక్షణాలకు అనువైన వాతావరణం మాత్రమే ఒకప్పుడు వుండేదన్నారు. భూమి మీద జీవరాశిలో కూడా మనుషులు మాత్రమే మాట్లాడడం, రాయడం, జ్ఞాపకశక్తితో ఆలోచనలకు రూప కల్పన చేయడం కనుగొన్నారు.

ఇతర లోకాల్లో జీవులు వుండాలంటే 40 సెంటిగ్రేడ్ డిగ్రీల వేడివరకు వాతావరణం వుండే స్థితి కావాలి. అంతకు మించినా, సున్న స్థాయికి తగ్గినా ఎంజైమ్‌లు బతకడం కష్టం. రేడియేషన్ తీవ్రంగా వున్నా జీవరసాయనిక చర్య పూర్తిగా దెబ్బతింటుంది. అప్పుడు కణాల అభివృద్ధి జరగదు. భూమి మీద వున్న సమతుల్య వాతావరణం, ఇతరచోట్ల లేదు. భూమిపై మొక్కలు ప్రాణవాయువును

వదిలి, బొగ్గు పులుసు వాయువును స్వీకరిస్తాయి. జంతువులు, మనుషులు బొగ్గు పులుసు వాయువును వదలి, ఆక్సిజన్ పీల్చుకుంటారు. ఇది ఇతర గ్రహాలు, నక్షత్రాలలో లేదు. అక్కడున్న గ్యాస్‌లు పీల్చుకొని జీవులు ఉండాలంటే, వారి ఊపిరితిత్తులు, జీవ విధానం భిన్నమైనది కావాలి. గురుత్వాకర్షణలో గ్రహాలు, నక్షత్రాలు భిన్నంగా వున్నాయి. భూమి మీద వున్నదానికీ, వాటికీ తేడా కనబడుతున్నది. గనుక జీవులసైజు కూడా ఆ రకంగా మారాలి. శని గ్రహంలో చాలా ఎక్కువ గురుత్వాకర్షణ భూమితో పోల్చితే వుంది. చంద్రునిలో మనకంటే చాలా తక్కువ వుంది. కనుకనే చంద్రుని పైకి కృత్రిమ నౌకలలో వెళ్ళిన మానవుడు ఆక్సిజన్ గొట్టాలు పెట్టుకున్నాడు. తేలిపోతున్నందున నడక కష్టమై, శిక్షణ పొందాల్సి వచ్చింది. నాలుగు తలలు వుంటే ఎంతో రక్తం నాలుగు మెదడులకు కావాలి. అంతేకాక ఒక గుండె తట్టుకోలేదు. కాబట్టీ మనపురాణాలలో వింత జీవులు, దేవుళ్ళు, దేవతలు వూహాజనితాలని తెలుసుకోవాలి.

ఏమైనా ఇంతవరకూ భూమిపై తప్ప మరెక్కడా మనుషులున్నట్లు రుజువుకాలేదు.

*- వార్త, 3 ఫిబ్రవరి, 2002*

# బంగారం తయారు చేయడమెలా?

పూర్వకాలం నుండీ కొందరికి బంగారం తయారుచేయాలనే కోరిక వుండడం, జీవితాలే అందుకు ధారబోయడం విన్నాం. వేమన కూడా కొన్నాళ్ళు ప్రయత్నం చేశాడని వినికిడి. ఇది చాలాదేశాలలో వున్న అలవాటే. రాజులు, రాణులు కూడా యీ బంగారం చేసే విద్యను ప్రోత్సహించారు.

గ్రీకులలో కూడా ఒక లోహాన్ని మరొకటిగా మార్పిడి చేయగలమనే నమ్మిక ప్రబలంగా వుండేది.

అరబ్బులలో యీ విద్య చాలా ఎక్కువగా వుండేది. సీసం బంగారమైతే కావాల్సిందేముంది? దీనిపై అరబ్బులు చాలా గ్రంథాలు రాశారు. చైనాలో యీ బంగారం చేసే పని చాలామంది చేబట్టినట్లు తెలుస్తున్నది.

బంగారం చేయడం ఒక రహస్య విద్యగా పేర్కొనేవారు. ఇంగ్లండ్‌లో ఒకటో ఎలిజబెత్ రాణి బంగారం చేయించే ప్రయత్నం అధికారికంగా తలపెట్టి విఫలమైంది. ఒక దశలో బంగారం చేసే ప్రయత్నాన్ని ఇంగ్లండ్ నిషేధించింది. 22వ పోప్ జాన్ బంగారం చేయాలని ఎంతో కృషిచేసి చతికిలబడ్డాడు. బంగారం చేయడానికి వినియోగించే పద్ధతులు రాసిన వారు రహస్య పదజాలాన్ని, నిగూఢ అర్థాల్ని వాడారు. వాటిలో ఏదో దాగివుందని కొందరు జుట్టు పీక్కుని అర్థాలకై అన్వేషిస్తుండేవారు.

మొత్తం బంగారం చేయడం అనేది ఒక ఆశగానే మిగిలింది. కొలిమిని వాడి ఒక లోహాన్ని మరొక లోహంగా మార్చే మోటుప్రయత్నాలు చిరకాలం చేసి వూరుకున్నారు. న్యూక్లియర్ ఫిషన్ పద్ధతిలో ఇతర లోహాల నుండి బంగారం చేయవచ్చు. దీనికి అయ్యే ఖర్చు బంగారానికి మించి చాలా అవుతుంది. పూర్వం బంగారం చేయడానికి ముడిసరుకుగా ఇనుమును, మరోలోహాన్ని (పాదరసం, సీసం) అమ్లాన్ని కలిపేవారు. బాగా కొలిమిలో వేడిచేసి చల్చార్చేవారు. ఇలా చేయడంలో విషవాయువులు రావడం, చీకటి గదుల్లో జబ్బులకు గురికావడం, ఒక్కోసారి చనిపోవడం కూడా జరుగుతుండేది. కొందరు పిచ్చెక్కి తిరిగిన ఘట్టాలు లేకపోలేదు. ముడిసరుకును కలపడం, వేడి చేయడం, అరబెట్టడం, అమ్లంలో ముంచడం, వెన్నెలలో, సూర్యరశ్మిలో బంగారం తయారవుతుందని పడిగాపులు కాచి, నిరాశ చెందడం జరిగిన ఘట్టాలే. అమ్లంలో ముంచి కరిగించిన ముడిసరుకును ఆవిరి అయ్యేట్లు చేసి ఇదంతా జరగడానికి నెలలు, ఒక్కోసారి సంవత్సరాలు పడుతుండేది. ఓపికగా బంగారం వస్తుందనే అత్యాశతో యీ క్రమం పాటిస్తుండేవారు. చాలామంది యీ పద్ధతుల్లో హతమయ్యారు. ఉత్తరోత్తరా పొటాషియం నైట్రేట్‌ను కొలిమి నుండి బయటకు తీసిన ముడిసరుకుకు కలిపేవారు. తుదిదశలో ముడిపదార్థాన్ని పేటికలో అమర్చేవారు. తరువాత చేయగలిగిందల్లా ఎదురుచూడటమే. ఏ దశలోనూ ఎవరికీ బంగారం రాలేదు. ఎన్ని మంత్రతంత్రాలు, రహస్య కార్యకలాపాలు సాగించినా నిరాశే మిగిలింది. ఆధ్యాత్మిక విద్యగా పవిత్ర చర్యగా బంగారం చేయడాన్ని చూచినా ఫలితం మాత్రం శూన్యం. సుప్రసిద్ధ మనోవిజ్ఞాని కార్ల్‌యూంగ్ కూడా బంగారం చేసే విద్యలో నమ్మకం వుంచి, దానికి ఏవేవో మానసిక రీతుల్ని చెప్పేవాడు. మూకమనస్తత్వం అనే పదాన్ని వాడాడు. కలల్లో కనిపించే ఆశల్ని నిజం చేయడానికి మూకమనస్తత్వం, సామూహిక అచేతనం అన్వయిస్తారని చెప్పాడు. ఇవన్నీ కేవలం మాటలు తప్ప, అర్థాలు లేనివే.

బంగారం చేయడం సాధ్యమేననీ, ఆధునిక, భౌతిక, క్వాంటం సిద్ధాంతాల ఉదాహరణలు అందుకు సాక్ష్యమనీ కొందరు నమ్మకస్తులు అంటుంటారు. కాని ఆధునిక విజ్ఞానంలో అంచనాలు, పరిశోధనలు, ఫలితాలు అన్నీ రుజువుకు నిలిచాయని వీరు విస్మరించారు.

న్యూటన్ వంటి శాస్త్రజ్ఞులు కూడా బంగారం చేసేవిధానాల పట్ల ఆసక్తి కనబరచినా, అది రహస్యంగానే అట్టి పెట్టారు తప్ప, బయటకు చెప్పలేదు. రుజువుకు నిలవకపోవడమే యీ రహస్యానికి కారణం. నా యిష్టం నేను నమ్ముతాను అంటూ బంగారం తయారుచేయవచ్చు అనే వారిని అలా వదిలేయాల్సిందే.

*- వార్త, 24 ఫిబ్రవరి, 2002*

# వికృతాకారాలు - వింత జీవులు

మనుషులు తోడేలువలె ప్రవర్తించడం, అడవిలో జంతువులతో కలిసి హాయిగా బతకడం సినిమాలో చూశాం. నిజజీవితంలో యిలాంటివి సాధ్యమా?

కొందరు రాత్రిళ్ళు సంచరిస్తూ, మనుషుల రక్తం పీల్చి తమ ఆకలి తీర్చుకుంటారనే భయానక కథలు వున్నాయి. మన పురాణాలలో, పవిత్రగంథ్రాలలో దేవుళ్ళు, రాక్షసులు, దేవతలు కొందరు ఎనిమిది చేతులతో, పన్నెండు తలలతో, మరికొందరు మూడోకన్నుతో, ఇంకొందరు సగం స్త్రీగా వున్నట్లు వర్ణనలువున్నాయి. వినాయకుడి ఆకారం సంగతి సరేసరి. మానవాకారంలో వుంటూ కొన్ని వికృతాలుగల జీవులు అక్కడక్కడా తటస్థపడుతున్నాయి. అందరివలెగాక వీరికి కొన్ని అంశాలు ఎక్కువో, తక్కువో వుంటాయి. అవే మామూలుగా కాక విపరీతంగా పెరుగుతాయి. వీరిని పాతాళలోకవాసులనీ, అడవి మనుషులనీ రకరకాలుగా పిలుస్తారు. దయ్యాలుగా, పిశాచాలుగా కొందరు తలుస్తారు. వాంపైర్స్ నాగలోక కన్యలు అనే పిల్లల కథల్లో వీరున్నారు.

వాంపైర్లపై పుస్తకాలు, సినిమాలు వచ్చాయి. వీరి లక్షణాలలో చీకటి తప్ప వెలుగు చూడలేకపోవడం రక్తాన్ని పీల్చడం ప్రధానంగా చెబుతారు. పరపీడన పరాయణులుగా, అధికార దాహంతో యీ వాంపైర్లను చిత్రించారు. పూర్వం నుండే పుట్టుకలో వికృతాలు రావడానికి దగ్గరసంబంధాలు, మేనరికాలు, రక్తసంబంధాలు ఒక ప్రధాన కారణంగా చెబుతారు. తల్లి కొడుకు, తండ్రి కూతురు మధ్య లైంగిక సంబంధం, వివాహాలు నిషిద్ధంగా వున్నాయి. అలాగాక, రక్త సంబంధ వివాహాలు, సంపర్కంవల్ల వికృతాకారాలు పుట్టడం జరుగుతూనే వుంది.

జన్యుశాస్త్రం ప్రకారం పెళ్ళిళ్ళు బంధుత్వం లేనివారిని చేసుకుంటే మంచిది. ముఖ్యంగా రక్తసంబంధాలు వద్దంటున్నారు. వంశపారంపర్యంగా దగ్గర సంబంధాలవల్ల పోర్ఫిరియా అనే వ్యాధి వస్తున్నది. ఇది ప్రోటీన్ ఉత్పత్తిని అడ్డుకొంటున్నది. అలాంటప్పుడు పాలిపోయినట్లు అయిపోతారు. రక్తంలో హిమోగ్లోబిన్ సద్వినియోగం గాకపోవడం, ఆక్సిజన్ సరిగా వాడకపోవడం వల్ల యిలా జరుగుతుంది. చర్మం కింద పోర్ఫిరిన్ చేరుతుంది. ఇందుమూలంగా సూర్యకాంతిని చూడలేకపోవడం, వంటి నిండా పొడలు రావడం జరుగుతుంది. ఇది వాంపైర్ లక్షణం.

వాంపైర్లు చీకట్లో సంచరిస్తూ వెల్లుల్లి వాసన భరించలేకుండా వుంటారు. పోర్ఫియా బాధితుల లక్షణం అది. వెల్లుల్లిలో ఎంజైంలు పోర్ఫియా బాధితులలోలేని ప్రోటీన్లను అందిస్తాయి. కాని వెల్లుల్లి తిన్నా, వాసన చూసినా వాంపైర్ల చర్మం కంది, ఒక్కోసారి తీవ్ర వ్యాధికి గురౌతారు. పోర్ఫియా వ్యాధిగ్రస్తులలో పండ్ల గమ్స్పోయి పండ్లు బయటకు పొడుచుకువస్తాయి. పోర్ఫియా వ్యాధి వున్నవారికి రక్తప్రీతి వుండడానికి పోర్ఫిరిక్ రింగులు కట్టుగా వుండకపోవడమే. యవ్వనదశ వచ్చేసరికి వీరిలో ప్రోటీన్ కొరత బాగా బయట పడుతుంది. అలాంటప్పుడు వారికి పెళ్ళి అయితే పాలిపోవడం, రక్తం పీల్చడం, బాగా జరిగిపోతుంది. సహజంగా దీని చుట్టూ చాలా కథలు వ్యాపిస్తాయి.

కొన్ని దీవులలో, సముద్రం మధ్య లంకలలో పరిమిత ఆహారం లభిస్తుంది. ఆకు అలములు తినే సముద్ర ఆవులలో వుండే కాలేయం (లివర్)లో ఎ విటమిన్ సమృద్ధిగా వుంటుంది. ఇది రెటినోల్‌గా వుంటుంది. అది తిన్నవారికి పుట్టుకలో వ్యాధులు వస్తాయి. దీవులలో బాగా వెడల్పాటి పాదాలతో పుట్టిన పిల్లలు యిలాగే లోపాలతో వుండగా, మెర్‌మెయిడ్ కథలొచ్చాయి. పుట్టుకలో వికృతాల వల్ల దవడలలో వచ్చిన రూపం మారుతున్నది. అలాంటి వారిని చూసి ఆడవితోడేలు మనిషిగా చిత్రించారు. హింసాయుతంగా ప్రవర్తించడానికి మానసికశక్తి సక్రమంగా లేకపోవడం కూడా ఒక కారణం.

నరసింహావతారం మన కథల్లో సుప్రసిద్ధమే. అలాగే చాలా జంతు ఆకారాలు మన గాథల్లో పవిత్రతను, రాక్షసత్వాన్ని సంతరించుకున్నాయి. ఇలాంటి వికృతాకారాలు పుట్టుక దోషాల కారణంగా వచ్చినవే. పరిణామ క్రమంలో అక్కడక్కడా దారితప్పి, వికృతాకారాలు రావడం జరిగింది. పరిసరాల ప్రభావం కూడా దీనిపై వుంది. అక్కడక్కడా చిన్న సమూహాలు ఇతరులతో సంబంధం లేకుండా, కుంచించుకుపోయి, తమలోతామే వివాహాలు చేసుకొని, పుట్టుకలో అనేక లోపాలకు చోటు యిచ్చారు.

నేపాల్‌లో 'యతి' అనే వింత ఆకారాన్ని చూసినట్లు కొందరు చెప్పగా, దీనిపై చాలా కథలు వచ్చాయి. పాశ్చాత్య దేశాలలో మంచుమనిషి మొదలైనవి వున్నాయి. పరిణామంలో అక్కడక్కడా వచ్చిన వికృతాలు, దారి తప్పిన తీరుకు యీ వింత ఆకారాలే నిదర్శనం. ఇవన్నీ అధ్యయనం చేసేలోగా కథలు అల్లేశారు. పరిణామాన్ని జాగ్రత్తగా పరిశీలించిన డార్విన్ తొలుత వివరణ యిస్తూ మనకూ కోతులకూ పూర్వీకుల సాధారణ లక్షణాలను చెప్పాడు. అంతేగాని కోతిలోనుండి మానవుడు వచ్చాడని చెప్పలేదు. ఈ విషయం కొందరు తెలిసీతెలియక కోతి నుండి మనిషి వచ్చినట్లు చెబుతుంటారు. పరిణామవంశంలో ఉభయులకూ ఒకే లక్షణాలు వుండడం. ఒక దశలో వేరుపడిన జీవులు మానవులు గావడం అనేది జరిగింది. అందులో జన్యువిభాగం అధ్యయనం చేసి వికృతాకారాల కారణాలు చెబుతున్నారు. భూమిపై వున్న మనుషులు ఒకరికొకరు తెలియకముందు ఆకారాల వికారాలపై కథలు వచ్చాయి. ఏమాత్రం తేడా వచ్చినా కథ అల్లారు. ఇందులో రంగు, రూపం బాగా చోటు చేసుకున్నాయి. విడమరచి అధ్యయనం చేస్తే కారణాలు తెలుస్తాయి.

అప్పుడు పరిష్కారాలు సాధ్యపడతాయి. ఆశ్చర్యంలో అద్భుతాల్ని ఆరాధిస్తుంటే అన్వేషణ కుదరదు. జిజ్ఞాసతో తెలుసుకోదలిస్తే క్రమంగా పొరలు విప్పవచ్చు.

*- వార్త, 24 మార్చి, 2002*

# నాస్తికులు - హోమియో

నాస్తికులు, హేతువాదులు, మానవవాదుల్లో అక్కడక్కడా కొందరు హోమియో వైద్య వృత్తి చేస్తున్నారు. అది శాస్త్రీయం కాదనే విమర్శ వచ్చినప్పుడు వారి వృత్తి దెబ్బతింటుందనే దృష్ట్యా, సమర్థించుకుంటున్నారు. విమర్శలకు హేతుబద్ధంగా శాస్త్రీయంగా సమాధానం చెప్పకుండా, మొండి వైఖరి అవలంభిస్తున్నారు. కొన్నిటిల్లో శాస్త్రీయంగా వుండాలని, కొన్నిటిల్లో శాస్త్రీయంగా వుండకపోయినా ఫరవాలేదనే ధోరణి సరైనది కాదు.

హోమియో విషయమై ప్రపంచ వ్యాప్తంగా మానవవాదులు, హేతువాదులు శాస్త్రీయ పరిశీలన చేశారు. ఇందుకుగాను ప్రసిద్ధ శాస్త్రజ్ఞుల సహాయం స్వీకరించారు. హోమియో శాస్త్రీయం అని రుజువు అయితే అంగీకరించడానికి నాస్తికులు, మానవవాదులు సిద్ధమే. కాని పరిశోధన, పరిశీలనలో ఎన్ని టెస్టులు చేసినా సైంటిఫిక్ అని రుజువు కాలేదు.

శాస్త్రీయ పద్ధతి విశ్వవ్యాప్తమైనది. ఇండియాలో చేసినా అమెరికాలో చేసినా ఫలితాలు ఒకేరకంగా వస్తాయి. ఒకరు రుజువు పరిస్తే అదే పరీక్షలు ఇంకొకరు జరిపినా అదే ఫలితాలు వస్తాయి. ఖమ్మంలో రుజువు అయితే కాలిఫోర్నియాలోనూ అవే ఫలితాలు వస్తాయి. అందుకే శాస్త్రీయపద్ధతి విశ్వవ్యాప్తమైనది. ఇందులో రాగద్వేషాలకు తావులేదు. మన వాళ్ళకు ఒక నిబంధన, మరొకళ్ళకు మరొక రూల్ శాస్త్రీయ పద్ధతిలో వుండదు. ఇదే హోమియోకూ వర్తిస్తుంది. నాస్తికులలో, హేతువాదులలో హోమియో ప్రాక్టీసు ఎవరైనా చేసినంత మాత్రాన అది రుజువుకు అతీతం కాదు. పోనీలే, మనవాడుగదా అని మినహాయించలేం.

హోమియో మందులు 30 ఎక్స్ మొదలు ఏవైనా సరే తీసుకొని, యిష్టం వచ్చిన లాబొరేటరీ (పరిశోధనాలయం)లో పరీక్షకు పెట్టండి. అందులో ఏ మందూ వుండదు. అయినప్పుడు ఎలా పని చేస్తుంది?

హోమియో ఔషధాలు తయారుచేయడంలో అవలంబించే పద్ధతి ప్రకారం ఒక పాలు పదార్థం, 10 పాళ్ళు సారాయి లేదా నీరు కలిపి కుదుపుతారు. అందులో నుంచి మళ్ళీ ఒక పాలు తీసుకొని మరో 10 పాళ్ళు సారాయి కలిపి కుదుపుతారు. ఇలా కుదుపుతూ పోతుంటే కొంతసేపటికి కనీసం ఒక్క అణువు కూడా మూలపదార్థం లేకుండా పోతుంది. 30 ఎక్స్ హోమియో మందులో ఒక పాలు మందు వుంటే సారాయి పాళ్ళు 1000 000 000 000 000 000 000 000 000 000 000 అన్నమాట. అంటే 7874 గాలన్ల నీటిలో లేదా సారాయిలో ఒక అణువు హోమియో వుంటుందన్న మాట. 200సి లో 10400 అణువుల సారాయి / నీటికి ఒక హోమియో అణువు వుంటుంది. అంటే 1కి 400 సున్నాలు చేర్చి చూచుకోవాలి.

విజ్ఞానశాస్త్రం ప్రకారం విశ్వంలో అణువులన్నీ $10^{80}$ (1కి 80 సున్నాలు చేర్చాలి) వున్నాయి.

200సి హోమియో అంతకు మించిపోయింది. అవగాడ్రో అనే శాస్త్రజ్ఞుడు హానిమన్ సమకాలీనుడు. పదార్థంలో అణువుల విషయం అంచనా వేసే రీతి అతడు చెప్పాడు. రసాయనిక శాస్త్రం ప్రాథమిక పాఠాలు తెలిసిన వారికి యీ విషయం అవగాహన అవుతుంది. హోమియో ఈ సూత్రానికి విరుద్ధంగా వుంది.

## హోమియోలో మందు లేకున్నా పనిచేస్తుందని వాదించే వారున్నారు.

ఒక్క అణువు కూడా హోమియో మందులో లేనప్పుడు, కేవలం సారాయి, నీరు, చక్కెర మాత్రం హోమియో లక్షణాలను గుర్తు పెట్టుకొని చికిత్సకు ఉపకరిస్తాయని, కుదుపుతూ పలచబడేటట్లు చేస్తే హోమియోలో శక్తి అధికమవుతుందనేది నమ్మకం అయితే కావచ్చుగాని, రుజువుకు నిలవదు.

హోమియోలోను ప్రసిద్ధుల సిద్ధాంతాలు, ఆచరణ కూడా శాస్త్రీయ పరీక్షకు పెట్టడం, ఎక్కడా రుజువుకు నిలవకపోవడం సర్వత్రా జరుగుతూనే వుంది. అయితే హోమియోకు పలుకుబడి, ప్రచారం వుంది. అది నమ్మేవారిపై పనిచేస్తున్నది. ముఖ్యంగా ప్లాసిబో (Placebo) ఆధారంగా హోమియో వ్యాపారం సాగుతున్నది. డాక్టరు వస్తున్నాడన్నా అతని చేతి మీదుగా మందిచ్చినా కొందరికి వూరట లభిస్తుంది. ప్రతి మనిషికీ ఏదైనా రుగ్మత వచ్చినప్పుడు ఆటుపోటులుంటాయి. మందు తీసుకోకపోయినా శరీరం తట్టుకొని నిలబడగల రీతులు కొన్ని సందర్భాలలో లేకపోలేదు. అలాంటి అవకాశాల్ని తమ విజయంగా చెప్పుకునే చికిత్సాపరులున్నారు.

మెదడువాపు వ్యాధికి బెల్లడోనా యిస్తే పనిచేస్తుందని హోమియోవారు ప్రచారం చేసి, ప్రభుత్వం దగ్గర పలుకుబడి వుపయోగించి, మాత్రలు పంచారు. రాష్ట్రంలో జనానికి బెల్లడోనా యిచ్చి మెదడువాపు వ్యాధి వచ్చినవారిని మినహాయించి, మిగిలినవారిని తమ వలననే వ్యాధి రాలేదని ప్రచారం చేయగల ఘనులు.

హోమియో రాజకీయ పలుకుబడి ఎలా పనిచేస్తుందో ఒక ఉదాహరణ గమనిద్దాం.

అమెరికాలో ఒక హోమియో డాక్టరు రాయల్ కోప్‌లాండ్ న్యూయార్క్ నుండి సెనేటర్‌గా ఎన్నికయ్యాడు. 1938లో ఆయన తన పలుకుబడి ప్రచారాన్ని ఉపయోగించి ఔషధాల పరిశీలన పరిధిలోకి హోమియో రాకుండా మినహాయించేటట్లు చేయించగలిగాడు. Food, Drug, Cosmetic Act ప్రకారం అమెరికాలో అన్ని మందులూ పరీక్షకు గురైన తరువాతనే అమ్మనిస్తారు. హోమియోపతి వారు గుట్టుచప్పుడుగా వ్యవహరించి మినహాయింపు తెచ్చుకొని, హాయిగా పంచదార మాత్రలు అమ్ముకుంటున్నారు. మనదేశంలో హోమియో పరిశోధన అనేదేమి లేదు. కేవలం మందుల అమ్మకం, డాక్టర్ల వ్యాపారం వున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో హోమియో వారికి విపరీత పలుకుబడి వుంది. అదంతా సరే. ఇంతకూ శాస్త్రీయం అంటేనే చిక్కు. అది లేకుండా. చిట్కా వైద్యంగా చలామణి అయినంతకాలం చేపమందు, తేలుమంత్రం వంటిదే అది

కూడా. కాని, శాస్త్రీయం అని రుజువు కాని వైద్యానికి ప్రభుత్వం నిధులు యివ్వరాదు. ప్రముఖ శాస్త్రజ్ఞులు డా॥ పి.ఎం. భార్గవ ఆ మాట అంటే, తిట్టారు, ఆయనపై దాడిచేశారు గాని, సమాధానం రాలేదు. ప్రజలలో మూఢనమ్మకాలు మత మౌఢ్యాలు వున్నట్లే, హోమియో వంటి చికిత్సలూ వున్నాయి. దీనికి హేతువాదులు, నాస్తికులు గురిగావడం విచారకరం. నేను జర్నలిస్టుగా పనిచేస్తుండగా హోమియోపై విమర్శ చేస్తే ఒక కమ్యూనిస్టు జర్నలిస్టు మిత్రుడు వచ్చి, విమర్శలు మానేయమన్నాడు. ఎందుకు అని అడిగితే, హోమియో కళాశాలలో తమ పార్టీ నాయకత్వాన యూనియన్ వున్నదని, వారికి బాధగా వున్నందున సహకరించమన్నాడు. అంతేగాని శాస్త్రీయం కాదనే విమర్శలకు సమాధానం రాలేదు.

మనదేశంలో అన్ని వైద్యాలను ముఖ్యంగా అలోపతిని పూర్తిగా నిషేధించి, హోమియోను విధిగా అందరూ స్వీకరించాలని నిర్బంధం పెడితే కుటుంబ నియంత్రణ సమస్య అతివేగంగా పరిష్కారమౌతుంది.

*- నాస్తికయుగం, అక్టోబరు-నవంబరు 2000*

# హోమియో శాస్త్రీయమని ప్రపంచంలో ఎక్కడా రుజువుకాలేదు!

హోమియోపతి శాస్త్రీయమని ప్రపంచంలో ఇంతవరకూ ఏ ఒక్క సందర్భంలోనూ రుజువు కాలేదు. రుజువు చేద్దామని ప్రయత్నించిన ఫ్రాన్స్, ఇంగ్లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్, జర్మనీ దేశాల హోమియోవైద్యులు విఫలమయ్యారు. ఈ విషయంలో బ్రిటీష్ హోమియో వైద్యులకు చిత్తశుద్ధి వుంది. ఈ సంవత్సరంలోనే (1990 ఏప్రిల్) లండన్ నుండి వెలువడుతున్న బ్రిటిష్ హోమియోపతిక్ జర్నల్ త్రైమాస పత్రికలో బెర్నార్డ్ లియరీ కుండబద్దలు కొట్టి చెప్పేశారు. హోమియోపతికి మూలం జీవశక్తి అనీ, ఇది ఆధునిక శాస్త్రీయ విజ్ఞాన పద్ధతిలో రుజువు చేయజాలమనీ రాశారు. ఆధునిక పదార్థ విజ్ఞానం, రసాయన సూత్రాలలో యీ జీవశక్తి యిమడదన్నారు. అలాగే హోమియో మందులలో ఏ మేరకు మందువున్నదీ రసాయన సూత్రం ప్రకారం రుజువు చేయజాలమనీ, అవొగాడ్రో సూత్రం అన్వయిస్తే కుదరదనీ ఒప్పేసుకున్నారు. అయితే హోమియో ఆధారపడే "జీవశక్తి"కి మూలం ఏమిటి అంటే, వివరించలేమని, స్పష్టంగా అన్నారు. అలాంటి వారితో పేచీలేదు. హోమియో శాస్త్రీయమని మొండిగా విర్రవీగేవారితోనే పేచీ.

## హోమియో వాస్తవాలు కొన్ని

హోమియో శాస్త్రీయమని రుజువు పరచడానికి పాశ్చాత్య దేశాలలో ప్రయత్నాలు జరిగాయి. 1988లో డా॥ జాక్ బెన్ వెనిస్తి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ హెల్త్ అండ్ మెడికల్ రీసర్చిలో యీ

కృషి చేశారు. వీరి అధ్యయనంలో ఇటలీ, ఇజ్రాయిల్, ఫ్రాన్స్, కెనడా హోమియో వైద్యులు తోడ్పడ్డారు. ఈ పరిశోధన జరిగేటప్పుడు సేకరించే సమాచారాన్ని పరిశీలిస్తామని నేచర్ పత్రికా సంపాదకుడు మేడక్స్, డా॥ వాల్టర్ స్టీవర్ట్ (అమెరికా ఆరోగ్య సంస్థకు చెందిన వ్యక్తి) జేమ్స్ రాండీలు కోరారు. పరిశోధనా ఫలితాలు నేచర్ పత్రికలో ప్రచురిస్తామన్నారు. తీరా చూడనివ్వకపోయినా, పరిశోధనా ఫలితాలు గమనిస్తే తప్పుడు లెక్కలిచ్చినట్లు తేలింది. శాస్త్రీయపరిధిలోకి రావాలని హోమియో తాపత్రయం అర్థం చేసుకోవచ్చు. శాస్త్రీయ పరిశోధనకు నిలవలేని హోమియోవారు శాస్త్రానికి పరిమితి వుందనీ, అన్నీ శాస్త్రం ద్వారా వివరించలేమనీ తప్పుకుంటున్నారు. శాస్త్రీయ విజ్ఞానం అంతం లేనిది. రుజువుకు నిలవనపుడు అరమరికలు లేకుండా తృణీకరించి, ఆధారాలకై అన్వేషిస్తుంది. పెత్తందారీతనాన్ని ఒప్పుకోదు. ఎంత గొప్పవారు చెప్పినా, మందువాడినా రుజువు ఒక్కటే ప్రమాణంగా స్వీకరిస్తుంది.

హోమియోను గురించి వాస్తవాలు అనేకం వున్నాయి. అమెరికాలో వివిధ దశలలో హోమియో గురించి పరిశీలన సాగింది. ఫెడరల్ ఫుడ్ డ్రగ్ కాస్మటిక్ చట్టం 1938లోనే హోమియోను క్షుణ్ణంగా పరీక్షకు పెట్టి శాస్త్రీయ పరిశోధనకు నిలవలేదని అమెరికాలో ప్రకటించారు. కేన్సర్ నివారణ, వైరస్ చికిత్స, ఉద్దీపన ఔషధాలు అని అమ్మే హోమియో మందులన్నిటినీ బలవంతంగా 1984లో ఫెడరల్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నిలిపివేసింది. పెన్సిల్వేనియా ఆరోగ్యశాఖ కూడా 1985లో హోమియో ఔషధాలను పరిశీలించి నొప్పినివారిణి, శక్తి పునరుజ్జీవనాలు, మొదలైన ఆకర్షణీయ పేర్లుగల వాటిని నిలిపేశారు. 1986లో జార్జి గెస్ అనే హోమియో వైద్యుడు కోర్టుకు వెళ్ళి, హోమియోను రుజువుచేయలేక, ఓటమిని అంగీకరించాడు. (అమెరికాలో నార్త్ కెరోలైనా) అమెరికా ఫెడరల్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నియమ నిబంధనలు హోమియోకు అన్వయిస్తే, హోమియో మందులు మార్కెట్‌లో వుండజాలవని స్టీఫెన్ బారెట్ ప్రకటించారు.

ఆస్ట్రేలియాలో కూడా హోమియో గురించి వాదోపవాదాలు సాగాయి. పార్లమెంటు చివరకు శాస్త్రజ్ఞులతో కూడిన సంఘాన్ని నియమించి పరిశీలింపజేస్తే మందుశాతం తగ్గించుకుంటూపోతే, శక్తి పెరుగుతూ పోతుందని రుజువుకాలేదని నివేదిక సమర్పించింది 1977లో.

హోమియో పితామహుడు హానిమన్ జర్మనీలో 1819లో యువరాజు షవర్జన్ బర్గ్‌కు వైద్యం చేస్తే అతడు చనిపోయాడు. ఇది చూచి మండిపడిన ప్రజలు హానిమన్ వెంటబడి తరిమికొట్టి, ఆయన మందుల్ని, పుస్తకాల్ని తగులబెట్టారు. హానిమన్ తరువాత ఫ్రాన్స్‌లో స్థిరపడి 80వ ఏట తనకంటె 45 సంవత్సరాల చిన్న యువతిని పెళ్ళాడి హోమియో ప్రాక్టీసు చేశారు. ఆయన చనిపోయేనాటికి (1843) ఆధునిక వైద్య, జీవ, అణు, జన్యు, శారీరక శాస్త్రాలు అభివృద్ధి చెందలేదు. బహుశా హానిమన్ యీ శాస్త్రాల పరిశోధనల రీత్యా తన వైద్యాన్ని విడనాడి, మారేవాడేమో.

మనదేశంలో సైంటిఫిక్ మెథడ్ అంటే ఏమిటో వివరించే బొమ్మల ప్రదర్శన ఒకటి డా॥ పి.ఎం. భార్గవ ఏర్పరచారు. అందులో శాస్త్రీయ, అశాస్త్రీయ పద్ధతుల ఉదాహరణలు పేర్కొంటూ, హోమియోను అశాస్త్రీయంగా ఉటంకించారు. ఎలా అశాస్త్రీయమో ఉత్తరోత్తరా వ్యాసాలు రాశారు, వివరించారు కూడా. శాస్త్రీయపద్ధతి అంటే ఏమిటో తెలిసిన పాశ్చాత్య హోమియో వైద్యులు శాస్త్రీయమని రుజువు చేయడానికి తిప్పలు పడుతున్నారేగాని, శాస్త్రీయ పద్ధతినే తిట్టడం లేదు. మనదేశంలో హోమియో శాస్త్రీయమని రుజువుపరచడానికి కంట్రోల్డ్ ఎక్స్‌పరిమెంట్ జరగలేదు. ఎవరికో ఎందుకో తగ్గిందని కథలు చెబితే శాస్త్రీయ పరిశోధన కిందకు రాదు. అలాగైతే, హోమియో ద్వారా తగ్గనివారు, చనిపోయిన వారి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. అప్పుడేమంటారు? మనదేశంలో హోమియో శాస్త్రీయమని రుజువుపరచే పరిశోధనలు ఎక్కడ ఎవరు ఎప్పుడు చేశారో చూపితే సరిపోతుంది గదా? పలుకుబడి చట్టాలు చేయించుకొని నిధులు సమకూర్చుకోవడం శాస్త్రీయతా?

## శాస్త్రీయపద్ధతి అంటే?

శాస్త్రీయ పద్ధతి అంటే స్థూలంగా ప్రపంచవ్యాప్తంగా అంగీకారం వుంది. సమస్యకు సంబంధించిన సమాచారం లభించినంతమేరకు సేకరించడం, ఆ మేరకు విశ్లేషించడం, తద్వారా ప్రతిపాదనలు చేసి సిద్ధాంతీకరించడం, సిద్ధాంతాన్ని క్లిష్ట పరీక్షకు గురిచేయడం - ఇదీ వరుసక్రమం. పరీక్షకు నిలబడిన తరువాతనే ఆమోదిస్తారు. ఇలా రుజువైన సిద్ధాంతం ఇతరమైన రుజువైన సిద్ధాంతాలతో పొందికగా వుందో లేదో చూస్తారు. అయితే రుజువైన ఏ విషయమైనా శాశ్వత సత్యం అనరు. తాత్కాలిక సత్యంగానే పేర్కొంటారు. కొత్త ఆధారాలు, వాస్తవాలు లభిస్తుంటే కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదిస్తారు. ఈ విధంగా శాస్త్రజ్ఞానం నిత్యనూతనంగా గమిస్తుంటుంది. ఫలానా శాస్త్రజ్ఞుడు చెప్పాడు గనుక అది తిరుగులేనిది అనే అధికారిక, పెత్తందారీ ప్రమాణాలు శాస్త్రీయ పద్ధతిలో వుండవు. ఒకసారి రుజువైన విషయం కొత్త ఆధారాలతో తృణీకరణకు గురైతే విచారించాల్సిన పనిలేదు. సెంటిమెంట్‌కు తావులేదు.

రెండు సిద్ధాంతాల మధ్య పోటీ రావడం శాస్త్రీయ పద్ధతికి మామూలే. అప్పుడు క్లిష్ట పరీక్షకు ఏది నిలుస్తుందో చూచుకుంటారు. న్యూటన్, హూగిన్స్ సిద్ధాంతాల మధ్య ఇలాగే జరిగింది.

శాస్త్రీయ పద్ధతిలో రుజువు చేసిన తరువాత, ప్రపంచంలో ఎక్కడైనా ఎవరైనా అలాంటి రుజువు మళ్ళీ చేయవచ్చు. హోమియో కూడా అలాగే రుజువుకు నిలబడితే సంతోషమే. రుజువు చేయడానికి ఒక శాస్త్రజ్ఞుల సంఘాన్ని నియమించమంటే, ఆగ్రహించి తిట్లకు, శాపాలకు దిగాల్సిన పనిలేదు.

మానవుడి ప్రాణం ఎంతో విలువ గలది. దీనితో చెలగాటం ఆడకూడదు. శాస్త్రీయపద్ధతిలో

వైద్యం పెంపొందబట్టి, అంటురోగాలు, హృద్రోగాలు, అత్యవసర పరిస్థితిలో ఆదుకోవడం సాధ్యపడింది.

మన రాజ్యాంగం 51(ఎ) ప్రకారం శాస్త్రీయ ఆలోచన పెంపొందించడం మన విధిగా పేరొన్నది. అందుకు విరుద్ధంగా ప్రస్తుతం హోమియో వున్నది గనుకనే, శాస్త్రీయపద్ధతిలో సాగినట్లు రుజువుపరచమంటున్నాం.

*- హేతువాది, నవంబర్ 1990*

# హోమియో అమానుషం : అమెరికా హ్యూమనిస్టుల నిర్ధారణ

హోమియో శాస్త్రీయమని రుజువుపరచడానికి అమెరికా, యూరోప్ దేశాలలో తీవ్ర ప్రయత్నం చేశారు. ఈ విషయమై అమెరికా హ్యూమనిస్టులు నిపుణుల సంఘం వేశారు. హోమియో చిట్కా వైద్యమనీ, శాస్త్రీయంగా నిలబడదని తేలింది.

1988 జూలైలో ఫ్రాన్స్‌లో ఇద్దరు శాస్త్రజ్ఞులు తమ పరిశోధనల ద్వారా హోమియో శాస్త్రీయమని ప్రకటించారు. టైం, న్యూస్‌వీక్ వంటి పత్రికలు సైతం విపరీతంగా ప్రచారం చేసిపెట్టాయి. ఇంకా ఆశ్చర్యమేమంటే, నేచర్ అనే సైన్సు పత్రిక యీ విషయంపై వ్యాసం ప్రచురించింది. హోమియోకు సైంటిఫిక్ స్థాయి రావడానికి అదే ఆధారం అన్నారు. పారిస్ వెలుపల ఇన్‌సెమ్ (INSERM – The Institute National de la Santo et la Recherche Medicale) అనే పరిశోధనా సంస్థకు చెందిన 13 మంది సంతకాలు చేశారు. దీనికి నాయకత్వం వహించిన జాక్ బెన్‌వెనిస్టె (Jacques Benveniste) అతనికి తోడుగా ఇజ్రాయిల్ ఆమె ఎలిజబెత్ డెవెనాస్ (Elizabeth Davenas) కీలకపాత్ర వహించారు. పరిశోధనల వలన వడపోసిన నీటిలో యాంటిబాడీ కణాలను తొలగించినా, నీటిలో యాంటిబాడి రసాయనిక శక్తి "ఎలాగో" వున్నదన్నారు. అంటే నీటికి జ్ఞాపకశక్తి వుందన్నమాట. ఇదే వాస్తవమైతే హోమియో శాస్త్రీయమని రుజువైనట్లే. నేచర్ పత్రిక పరిశోధనా వ్యాసాన్ని ప్రచురిస్తూ (చూడు 333 - సంపుటి పుట 816) ఇది నమ్మశక్యం కాకుండా వుందని వ్యాఖ్యానించింది.

బెన్‌వెనిస్టె పరిశోధన ప్రకారం తాను వాడిన యాంటిబాడీ కణాలు నీళ్ళలో కలిపి, పలచబరచినా, ఇంకా $10^{120}$ విభాగంగా, శక్తివంతంగా వుందన్నాడు. ఔషధం ఎంత పలచబరిస్తే అంత శక్తివంతం అవుతుందనీ, అసలు ఔషధ లక్షణం పదార్థంగా ఏ మాత్రం లేకున్నా దాని శక్తివలన నయం చేస్తుందనీ హోమియో అంటుంది. బెన్‌వెనిస్టె పరిశోధన ప్రకారం నీరు - "ఎలాగో జ్ఞాపకశక్తితో" - యాంటిబాడి లక్షణాలను కొనసాగిస్తుందన్నాడు. నీటిలో యాంటిసెరమ్ కణాలు తొలగించినా, హైడ్రోజన్ అణువులు ఎలాగో ఓలాగ యాంటిబాడి చర్యను సాగిస్తుందన్నాడు. ఇదే

సరైనదైతే, హోమియో శాస్త్రీయంగా రుజువైనట్లే. హోమియో ఔషధాలలో మందు వున్నట్లు రుజువు కాకున్నా, దాని శక్తి పనిచేస్తుందన్నమాట.

నేచర్ పత్రిక, వ్యాసమైతే ప్రచురించింది. కాని ఎంతో విమర్శ ఎదుర్కోవలసివచ్చింది. ఈ పరిశోధనలో సత్యాసత్యాలను తెలుసుకోడానికి నేచర్ పత్రిక సంపాదకుడు జాన్ మాడోక్స్, మేరీలాండ్ జాతీయ ఆరోగ్య సంస్థలోని జీవరసాయన శాస్త్రజ్ఞుడు వాల్టర్ స్టేవర్ట్, సుప్రసిద్ధ హ్యూమనిస్టు మాంత్రికుడు జేమ్స్‌రాండి వెళ్ళారు. వారు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

డాక్టర్ జాక్ బెన్‌వెనిస్టి పరిశోధనలు అంకెలదోషాలతో వున్నాయి. పరిశోధన మళ్ళీ మళ్ళీ జరిపే తీరులోలేదు. దోషాల్ని తొలగించే తీరు అమలుపరచలేదు. శాస్త్రీయ పరిశోధనకు నిలబడే స్థితి ఎక్కడా కనిపించలేదు. హోమియో మందులు తయారుచేసే కంపెనీలో ఇద్దరు కూడా బెన్‌వెనిస్టి పరిశోధకులలో వున్నారని తెలిసింది. పరిశోధన పేరిట వీరు చేసిన పనికి ఆ కంపెనీ ఖర్చులు భరించింది. దీనిపై వ్యాఖ్య అనవసరం.

సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు డా॥ స్టీఫెన్‌బారెట్ యీ విషయాలన్నీ పరిశోధించి కన్స్యూమర్ రిపోర్ట్స్‌లో (1987 జనవరి) ఇలా రాశాడు. "హోమియో ఔషధాలు శారీరకంగా ప్రభావం చూపలేనంత పలచబడి వున్నాయి. వైద్యశాస్త్రం ప్రకారం యీ ఔషధాలు అర్థంపర్థం లేనివి. ఇందులో ఎలాంటి పసలేదని, పనిచేయవని అమెరికాలో 49 ఫార్మసీస్కూల్స్ ఫాకల్టీ సభ్యులు పేర్కొన్నారు. రోగాలు వాటంతట అవే కుదురుకునే సందర్భాలలో పంచదార మాత్రల ప్రభావం మాత్రమే హోమియో ఔషధాలకు వుంటుంది. అలాంటి ఔషధాలు, డిగ్రీలున్న డాక్టర్లు వాడినా, చిట్కావైద్యులు వాడినా రోగులకు ప్రమాదమే. రోగి ఒకపక్క జీవన్మరణ సమస్యతో కొట్టుమిట్టాడుతుంటే, పనిచేయని ఔషధాలు యివ్వడం ప్రమాదం. హోమియో ఔషధాలు ప్రయోగించడం హానికరం. సొంతవైద్యం మరీ యిబ్బంది. జబ్బు విపరీతంగా వున్నప్పుడు, నొప్పి ఏమిటో తెలియకుండానే మాత్రలిచ్చే హోమియో చికిత్స వలన రోగి చనిపోవచ్చు. కేన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులకు హోమియో ఔషధాలు యివ్వరాదని కూడా 1988లో ఫెడరల్‌డ్రగ్ సంస్థ ఆదేశించింది.

శాస్త్రీయం అని రుజువుపరచలేక, హోమియో డాక్టర్లు చౌకబారు రచనలతో, కరపత్రాలు, పుస్తకాలతో జనాన్ని ఆకట్టుకుంటున్నట్లు స్టీఫెన్‌బారెట్ విమర్శించారు.

హోమియో మందుల్ని ఎలాంటి శాస్త్రీయ పరిశీలన లేకుండానే సరాసరి జనానికి అమ్మడం, మందులో ఏముందో చూపకపోవడం కూడా విమర్శలకు గురైంది. మనుషులకు యిచ్చే ఔషధాలు ఫెడరల్ డ్రగ్ నియమాల్ని పాటించకపోవడం, అమానుషచర్యగా భావిస్తున్నారు. ఎవరికి వారు హోమియో డాక్టర్లుగా ముద్రవేసుకొని, జనాన్ని దోచుకుంటూ, డబ్బుచేసుకునే వారి సంఖ్య కూడా పెరిగింది.

సైన్స్ రచయిత మార్టిన్ గార్డినర్ హోమియో మోసాల్ని, అశాస్త్రీయతను ఎండగట్టాడు. కేన్సర్ వంటి రోగాల్ని నయం చేస్తామంటూ జనాన్ని చంపుతున్న ఉదాహరణలు చూపాడు.

హోమియోపతి డాక్టర్లు విమర్శలకు సమాధానాలు చెప్పలేక, శాస్త్రీయం అని రుజువు చేయలేక, వీధినబడి తిట్లకు లంకించుకున్న ఉదాహరణలు గార్డినర్ ఉదహరించాడు.

బెన్‌వెనిస్టి పరిశోధనలు బోగస్ అని తేలేసరికి, హోమియో సంస్థ అతన్ని 1989లో సస్పెండ్ చేసింది.

హోమియో అద్యంతాలు మోసంతో కూడిన, అర్థంలేని వైద్యవిధానంగా గార్డినర్ చిత్రికబట్టాడు, జేమ్స్‌టైలర్‌కెంట్‌ను, హోమియో వారంతా హానిమన్ తరువాత, మహాత్మునిగా ఆరాధిస్తారు. ఆయన రాసిన లెక్చర్ ఆన్ హోమియోపతిక్ మెడిసన్ అనే 982 పేజీల గ్రంథం అయోమయపు అశాస్త్రీయ పులుముడు అని గార్డినర్ విమర్శించాడు. కెంట్ రచనలో ఏ పేరాకూడా సాక్ష్యాధారాలకు నిలబడదన్నాడు. (గార్డినర్ ఆన్ ది వైల్డ్ సైడ్ 1992 పుట 39)

హానిమన్ "జీవశక్తి"ని నమ్మాడు. హోమియో శాస్త్రీయం అనేవారు దీనిని ఎలా రుజువు చేస్తారు?

హోమియో పేరిట, పుస్తకాలు చదివి, జనానికీ మందులిస్తూ, వారికి నయం చేశాం, వీరికి ఇంగ్లీషు మందుల ద్వారా తగ్గనిచోట హోమియో ద్వారా తగ్గించాం, అని ప్రచారం చేసేవారున్నారు. అమెరికాలో ఇలా చేసిన వారిని పట్టుకొని జైల్లో వేశారు. ఫ్లొరిడా రాష్ట్రంలో 1985లోనే ఇది జరిగింది. అలాంటి స్థితి మనదేశంలో ఎప్పుడు వస్తుందో మరి!

హోమియో డాక్టర్లు సెనేటర్లను పట్టుకొని హోమియో లైసెన్సు బోర్డులు ఏర్పరచడానికి అమెరికాలో ప్రయత్నిస్తున్నారు. శాస్త్రీయం అని రుజువుపరచలేకపోయినా, ఇలాంటి లాబీ చేయడంలో వారు సుప్రసిద్ధులు. మనదేశంలో కూడా ఇదే తంతు. కీలకస్థానాల్లో వున్నవారిని పట్టుకొని హోమియోకు నిధులు సమకూర్చుకోవడం ఆనవాయితీ అయింది. శాస్త్రీయమని బొకరించడం తప్ప. ఒక్క ఆధారం కూడా చూపని వారికి ఆగ్రహం రావడం సహజం. వృత్తి దెబ్బతింటుంది గనుక యిది అర్థం చేసుకోవచ్చు.

వైద్యరంగంలో ఏ చట్టమూ హోమియోకు వర్తించరాదంటున్నారు. అలాచేస్తే హోమియో నిలబడదు. కాబట్టి పైరవీలు (సిఫారసులతో), ప్రచారంతో పత్రికలలో పచ్చి అబద్ధాలతో ప్రాకులాడుతున్నారు. అమాయక జనాన్ని మోసం చేస్తున్నారు. అలోపతి వైద్యరంగంలోని విషయాల్ని తెలివిగా హోమియో ప్రచారానికి వాడుకుంటున్నారు.

విదేశాల్లో విమర్శలు తట్టుకోలేక, శాస్త్రీయం అని రుజువుపరచే ప్రయత్నాలన్నా చేశారు. మనదేశంలో అలాంటి ప్రయత్నం అసలే లేదు.

హోమియో చికిత్సకు ఇన్సూరెన్స్ లేదు. అలోపతికి వున్నది. ఎందుకని? హోమియో చికిత్సలో ఏ ఔషధాలు యిస్తున్నారో రోగికి చెప్పరు. ఎందుకని? హోమియోలో వైఫల్యాలు బయటపెట్టరు. తగ్గినవి మాత్రం బాగా ప్రచారం చేసుకుంటారు. లైసెన్స్‌లేని హోమియో డాక్టర్లను నిర్బంధించమని కోరరు. అదంతా అమానుష ప్రక్రియే.

హోమియో చికిత్సలో మనిషి ముఖ్యం కాదు. తగ్గకపోతే, ముదిరిన తరువాత వచ్చావంటారు. అలోపతిలో అంతా చెడగొట్టుక వచ్చావంటారు. చనిపోతే, అసలు బాధ్యత వహించరు. కిక్కురుమనరు. అందుకే యిది అమానుష వైద్యం. వైఫల్యాలను స్వీకరించి, నిరంతర పరిశోధన జరిపి, మనుషుల్ని కాపాడటానికి కృషిచేస్తేనే వైద్యం శాస్త్రీయం అవుతుంది. వేదప్రమాణంవలె, హానిమన్ ఆరాధ్యుడంటూ జీవశక్తి నమ్మకాలతో, మనుషుల్ని హతమార్చడం మంచిదికాదు. రోగాన్ని ఎదుర్కొని, నయం చేసుకునే గుణం దేహానికి వుంది. హోమియోవారు ప్రచారం చేసుకుంటున్నారు. డాక్టరుపై విశ్వాసంతో పనిచేసే తీరువుంది. అదికూడా ప్లాసిబో ప్రభావంగా పేర్కొనక హోమియోవారు వ్యాపారం చేసుకొంటున్నారు. ఆరోగ్యవంతులకు హోమియో బాగా పనిచేస్తుందన్నమాట!

హార్ట్ ఎటాక్ వస్తే హోమియోకు పరిగెత్తం. అంటురోగాలొస్తే హోమియో కోసం వెళ్ళం. అలాంటప్పుడు హోమియో స్వీకరిస్తే ఫామిలీ ప్లానింగ్ వారికీ ఇక ప్రచారం అక్కరలేదు. అలోపతి పూర్తిగా నిషేధిస్తే, హోమియో మాత్రమే వుండాలంటే, జనాభా సమస్య దెబ్బకు తీరుతుంది!

ఇంతకూ మన ప్రశ్న అలాగే మిగిలింది. హోమియో శాస్త్రీయమని ఇండియాలో ఏమిటి రుజువు? ఒక్క ఉదాహరణ చూపమనండి విమర్శలు మానేద్దాం.

హోమియో శాస్త్రీయమని రుజువు చేయడానికి కంట్రోల్డ్ పరిశోధన గాని, డబుల్ బ్లయిండ్ టెస్ట్ గాని చేశారా? చేస్తే ఎవరు? ఎక్కడ? వివరాలేమిటి? ఒక ఆధారం ఇండియాలో చూపమనండి.

అమెరికాలో హ్యూమనిస్టులు ఒక నిపుణుల సంఘం నియమించారు. దానికి స్టీఫెన్‌బారట్ అధ్యక్షులు. ఆయన ఆధ్వర్యాన జరిగిన పరిశీలనల ఫలితంగానే హోమియో శాస్త్రీయం కాదని తేలింది. మనుషుల ప్రాణాలతో ఆడుకోవద్దని వారు హెచ్చరిస్తున్నారు. సొంతవైద్యం చేసుకోమనే హోమియో ప్రచారం మరీ అమానుషం, బాధ్యతారహితం, అశాస్త్రీయం.

*- హేతువాది, అక్టోబరు 1992*

# హోమియో సాంఘిక నేరమా? అమానుషమా?

అలోపతి (ఆధునిక వైజ్ఞానిక వైద్యం) తప్పులు చేస్తుంది. తప్పులు ఒప్పుకుంటుంది. దిద్దుకుంటుంది. మానవుడికి మేలు చేయాలనే దీక్షతో అనేక పరిశోధనలు చేస్తుంటుంది. ఇది అనంతం. నిత్యకృత్యం. తాను చెప్పిందే వేదం అనదు. తన జ్ఞానం సంపూర్ణం అనదు. విమర్శలు స్వీకరిస్తుంది సహనం ప్రదర్శిస్తుంది. ఆ విధంగా ఆధునిక వైద్యం (అలోపతి) దినదినాభివృద్ధి చెందుతూనే వున్నది. ఇతర శాస్త్రీయ పరిశోధనా ఫలితాలను వైద్యరంగంలోకి స్వీకరిస్తుంది. దుష్పరిణామాలను తొలగించడానికి, తగ్గించడానికి చేతనైన ప్రయత్నం చేస్తుంది. పరీక్షలు జరిపి, తద్వారా చికిత్స చేస్తుంది. నమ్మకాలు విశ్వాసాలు ఆధారంగా వైద్యం తలపెట్టదు. ఇది శాస్త్రీయ పంథా. అలోపతి వైద్యం మానవులందరికీ సామాన్యమైంది. రష్యాలో, చైనాలో, అమెరికాలో ఎక్కడ వైద్యం కనిపెట్టినా అది ప్రపంచమంతటా దాపరికం లేకుండా వ్యాపిస్తుంది. మానవుల సొత్తుగా అలోపతి వైద్యం పరిణమించింది.

డాక్టర్లు తప్పులు చేస్తే అడిగే హక్కు, పరిహారం కోరే అవకాశం రోగులకు అలోపతిలో వుంది. వైద్యభీమా పద్ధతులు అమలులో వున్నాయి. రోగికి ఏమేమి మందులు ఎలా యిచ్చారో, చికిత్స ఎలా జరిపారో రికార్డు చేస్తారు. దీనివలన తప్పులు దిద్దుకునే అవకాశం లభిస్తుంది.

అంటురోగాలతో లక్షలాది చనిపోవడాన్ని ఆపింది అలోపతి మాత్రమే. అంతుబట్టని రోగాలను పరిశీలించి, పరిశోధనలు జరుపుతున్నది, అలోపతి వైద్యంలోనే సాధ్యం. ఇతర వైద్య విధానాల జోలికి అలోపతి వెళ్ళదు.

హోమియోపతి వైద్యం జర్మనీలో హానిమన్ అనే వైద్యుడు ప్రవేశపెట్టి, ప్రచారం చేశాడు. అయన బ్రతికుండగానే హోమియోపతి చిట్కా వైద్యమా కాదా అనే చర్చ ఆరంభమైంది. అది నేటికీ కొనసాగుతున్నది.

ఆధునిక వైద్యాన్ని (అలోపతి) తీవ్రంగా విమర్శిస్తూ హోమియో ప్రచారంలోకి వచ్చింది. హానిమన్ ఆరంభించిన యీ ప్రక్రియను హోమియో వైద్యులు విస్తృతంగా వాడుకుంటున్నారు.

హోమియోశాస్త్రీయమా కాదా, అనేది హేతువాదులు, మానవవాదులు శాస్త్రజ్ఞులు చేబట్టిన అంశం. ప్రపంచవ్యాప్తంగా యీ విషయమై పరిశోధన సాగింది. హోమియో శాస్త్రీయమేనని హోమియోపతి వైద్యవృత్తిలో వున్నవారు చెబుతూనే వున్నారు. ఆధారాలేమిటి అన్నప్పుడు సమాధానం చెప్పలేకపోతున్నారు. హోమియో సూత్రాల్ని, మందుల్ని, చికిత్సను శాస్త్రీయ పరిశోధనకు పెట్టిన శాస్త్రజ్ఞులకు ఇది సైంటిఫిక్ అని ఆధారాలు ఎక్కడా లభించలేదు. శాస్త్రీయమని కొందరు హోమియోవాదులు ఇచ్చిన సాక్ష్యాధారాలు తప్పుడువని రుజువైంది. శాస్త్రీయ పద్ధతిని అనుసరించే యూరప్, అమెరికా వంటి చోట్ల హోమియో క్షీణించింది. వెనుకబడిన దేశాలలో హోమియో ఇంకా ప్రచారంలో వుంది.

హోమియో వైద్యాన్ని ప్రవేశపెట్టిన హానిమన్ (1755-1843) తొలుత అలోపతి డిగ్రీ పొందాడు. ఆనాడు రోగాలకు హెచ్చు మోతాదుల్లో మందులివ్వడం పట్ల హానిమన్ అభ్యంతరపెట్టాడు. తన డిగ్రీ చదువును వదిలేసి హోమియో పద్ధతి పరిశీలించి, చిన్న మోతాదుల్లో మందులివ్వాలని, రోగలక్షణం ఔషధ లక్షణం ఒకటే అయినప్పుడు చికిత్స కుదురుతుందన్నాడు. మందులలో మోతాదు తగ్గిస్తూ పోవడంతోబాటు, వాటి శక్తి పెంచే రీతి కూడా పేర్కొన్నాడు. హోమియో సూత్రాలను క్రోడీకరించాడు. ఔషధ లక్షణాలు గ్రంథస్తం చేశాడు. ఇవన్నీ ఒక వైపున చేస్తూనే, ప్రతి మనిషికి జీవశక్తి (వైటలిజం) వుంటుందని హానిమన్ నమ్మాడు.

మనుషులందరి లక్షణాలను మూడు రకాలుగా వర్గీకరించాడు. సిఫిలిస్, సోరా, సైకో అనే యీ లక్షణాలకుగాని, జీవశక్తికిగాని, సూక్ష్మీకరించే మందులలో శక్తి పెరుగుతుందనడంలో గాని ఎక్కడా శాస్త్రీయ పద్ధతి లేదు. శాస్త్రీయ పరిశోధనలకు హానిమన్ తన సూత్రాల్ని పరీక్ష పెట్టలేదు. ఒక మహర్షి వలె చెప్పి, ప్రవర్తించాడు. మూలపురుషులంతా అంతేనేమో.

హానిమన్ రుజువులనేవి శాస్త్రీయ పద్ధతికి నిలబడేవి కావు. అలాగే ఆయన శిష్యులు చెప్పిన రుజువులు కూడా రుజువులు కావు. వాటిని అనుభవాలు అంటే సరిపోతుంది. వ్యక్తిగత అనుభవాలను శాస్త్రీయరంగంలో పరీక్షకు పెట్టిన ఉదాహరణలు ఎన్నో వున్నాయి. శాస్త్రీయ పద్ధతి తెలిసినవారు అలా చేస్తారు. సింకోనా బెరడు నోట్లో వేసుకుంటే చలి ఒణుకు మొదలైన మలేరియా లక్షణాలు హానిమన్‌కు వచ్చాయట. అదే ఆయన రుజువుగా పేర్కొన్నాడు. దీనిపై సిద్ధాంతీకరించి, ఆచరణకు పూనుకున్నాడు. కాదన్న వాళ్ళని తిట్టాడు. మత ప్రచారకుడివలె అసహనం ప్రదర్శించాడు. కొత్త పద్ధతి కొందర్ని ఆకర్షించగా, జనాకర్షణను హానిమన్ తెలివిగా వాడుకున్నాడు. హోమియో వైద్యం తొలుత అంతగా సఫలం కాకపోయినా రానురాను ప్రచారం ప్రబలి, డబ్బు సంపాదన జరిగింది.

జర్మనీలో హానిమన్ హోమియో పలుకుబడితో ముందుకు పోతుండగా ఎదురుదెబ్బ తగిలింది. ఆయన చికిత్స చేసిన యువరాజు షవార్జన్ బర్గ్ (Schwartzenberg) 1819లో చనిపోయాడు. జనం రెచ్చిపోయి, హానిమన్ పుస్తకాల్ని, మందుల్ని తగలబెట్టారు. అంతటితో జర్మనీ వదలి, ఫ్రాన్స్ పారిపోయి, అక్కడ ఒక సంపన్న యువతిని పెళ్ళాడాడు. హోమియో వైద్యులకు ఆదర్శప్రాయమైన పనికూడా హానిమన్ చేపట్టాడు. పలుకుబడిగల ప్రభు వర్గాలనే ఆయన ఆశ్రయించి వారి అండదండలతో తన వృత్తి ప్రాబల్యాన్ని పెంచుకునేవాడు. గ్రాండ్ డ్యూక్ ఫెర్డినాండ్ అండతో అలా కొనసాగాడు. 80వ సంవత్సరంలో తనకంటె 45 సంవత్సరాల తక్కువ వయసు గల ఫ్రెంచి సంపన్న యువతిని పెళ్ళాడిన హానిమన్ బాగా డబ్బు కూడా ఆర్జించాడు.

హానిమన్ సూత్రాలు అన్వయించి రోగాల్ని నయం చేయడం, కనీసం తగ్గించడం,

రాకుండా చేయడం సాధ్యం కాదని ఆయన బ్రతికుండగానే నిర్ధారణ అయింది. యూరోప్ దేశాలలో, కలరా, ఇన్ఫ్లూయంజా, రక్త విరేచనాలు, ఎల్లో ఫీవర్, ప్లేగు మొదలయినవి రావడమే గాక, లక్షలాది ప్రజలు తుడుచుకపోయారు. హానిమన్ చనిపోయేనాటికి ఆధునిక అలోపతి వైద్యం బాల్యదశలో వుంది. ఆ తరువాతే అనేక విధాల అది పెంపొందింది.

హోమియో చుట్టూ చాలా ఆకర్షణీయ కథలు, చిత్రవిచిత్రాలు అల్లారు. కొందరు జ్యోతిష్యానికి ముడిపెట్టారు. అర్సనిక్, బెల్లడోనా వంటి ఔషధాలకు వ్యక్తిత్వ లక్షణా లున్నాయన్నారు. పెట్టుబడి అంతగా అవసరం లేని గిట్టుబాటు వ్యాపారంగా హోమియోపతి చాలా మందికి అక్కరకొస్తుంది కనుక హోమియోను శాస్త్రీయం కాదన్నా, రుజువు చేయమన్నా కోపం వస్తున్నది. గ్రామాల్లో సైతం చదువు అట్టే రానివారుకూడా చిట్కావైద్యంగా హోమియోను ప్రయోగిస్తున్నారు. హోమియో వైద్యుడికి అర్హతలు, డిగ్రీలు, అనుభవం అక్కరలేదు. పత్రికలలో చదివి, పాది పట్టుకొని వైద్యం చేస్తున్నవారున్నారు. తగ్గితే తమ గొప్పతనంగానూ, తగ్గకుంటే రోగి కర్మగానూ చెప్పవచ్చు. ఇదీ హోమియో పేరిట జరుగుతున్న తంతు.

హోమియోపతి శాస్త్రీయం అని చెప్పేవారు జీవశక్తి (Vital Force) ని ఎలా నమ్ముతారో వివరించవలసి వుంది. జీవశక్తి పనిచేసే తీరులో గందరగోళం ఏర్పడితే, రోగ లక్షణాలు వస్తాయని దీనికి చికిత్స చేసి, సామరస్యత ఏర్పరచాలని వారు నమ్మి రాశారు. ఇది శాస్త్రీయ పరిశోధనలో యిముడుతుందా?

హానిమన్ పేర్కొన్న హోమియో మూలసూత్రాల్ని (ఆర్గానన్) శాస్త్రీయ పరీక్షకు పెట్టారా? రుజువయ్యాయా? రుజువు కానివి ఏవైనా వున్నాయా? ఉంటే వాటిని తృణీకరించారా? శాస్త్రీయ పద్ధతిలో తప్పొప్పులు దిద్దుకుంటూ ముందుకు పోయే ధోరణి వుంది గదా. హోమియోలో ఏవి యింత వరకు తప్పు అని తేల్చారు? శాస్త్రీయ పద్ధతికి గురిచేసినట్లు ఆధారాలు ఏవి? మన దేశంలో హోమియోను శాస్త్రీయ పరీక్షకు గురిచేసిన ఆధారాలు మచ్చుకు ఒక్కటి చూపగలరా?

వ్యాధినిరోధకశక్తి (ఇమ్యునైజేషన్) సూత్రాన్ని అలోపతి కూడా చెబుతున్నది. హోమియో పేర్కొనే సారూప్య సిద్ధాంతం కూడా ఇదే అని అసలు మూలసూత్రం హోమియోదే నని ప్రచారం చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. అలోపతి యిచ్చే టీకాలమందు హోమియో పేర్కొనే పలచబరిచిన ఔషధం కాదు. టీకాల మోతాదు తగ్గిస్తే ఫలితం రాదు. టీకాలమందు పలచబరిస్తే పనిచేయదు. శరీరంలో రోగనిరోధకశక్తిని పెంచడానికి, రోగక్రిముల్ని చంపేయడానికి తగిన మోతాదుల్లో మందు ఎక్కిస్తారు. కనుక హోమియో సూత్రానికి భిన్నంగా టీకాల వైద్యం సాగుతున్నది. అది బాగా పనిచేస్తున్నట్లు రుజువైంది. అంటురోగాలతో లక్షలాది మంది తుడిచిపెట్టుకపోకుండా టీకాల వైద్యం ఆపింది. పోలియోవంటి వ్యాధులు రాకుండానూ టీకాలవైద్యం తోడ్పడింది.

హోమియో పేరిట చాలాచోట్ల అలోపతి వైద్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల పట్టుబడ్డారు. పాకిస్తాన్‌లో దంకాప్ (Dumcap) తయారుచేసి, ఉబ్బసానికి హోమియో చికిత్సగా ప్రచారం చేసి అమ్ముతుంటే పట్టుకున్నారు. (చూడు 1986 ఏప్రిల్ 12 లాన్సెట్ పత్రిక 862-863 పుటలు) హోమియో పేర్కొనే ఔషధాల మోతాదు ఆధునిక రసాయనిక సూత్రాలకు విరుద్ధంగా వుంది. దీనినే అవగార్డోసూత్రం అంటారు. దీని ప్రకారం హోమియో చెప్పే 30X నుండి ఆపైన మోతాదుల్లో దేనిలోనూ మందులేదు చక్కెర, సారా మాత్రమే వుంది. మందు సూక్ష్మరూపంలో వున్నదనీ, అది శాస్త్ర పరికరాలకు అందదనీ హోమియో ప్రచారకులు చెబుతారు. అయినా హోమియో శాస్త్రీయం అంటారు. హోమియో వారే అలా అనగలరు.

హోమియో మందిస్తే రోగలక్షణం ప్రకోపించినట్లుంటే, మంచిదనీ, పెరిగిన తర్వాత తగ్గుతుందని కొందరు ప్రచారం చేస్తారు. ఇది కూడా నమ్మకమే. శాస్త్రీయ పద్ధతికి విరుద్ధమే కాన్సర్, ఎయిడ్స్ వ్యాధులు పెరిగిన తరువాత, తరగవు! తరిగేది మనిషే. అందుకు హోమియో బాధ్యత వహించదు.

కొన్నిటికి హోమియో బాగా పనిచేస్తుందని ప్రచారం చేసేవారున్నారు. కొన్నిటికీ పరిమితమైన చికిత్సా విధానం వుంటుందా! వైఫల్యాలకు ఇదొక ముసుగు. అనేక రోగాలు ఏ మందూ లేకుండా కొన్నాళ్ళకు సర్దుకుపోవడం, తగ్గిపోవడం కద్దు. అలాంటి సమయంలో హోమియో మందు తీసుకొని తగ్గిందంటే, అదే వారి ఖ్యాతిగా మిగులుతుందన్నమాట. ప్రతి చిట్కావైద్యంలోనూ యిలాంటివి వున్నాయి. గుండెపోటు వచ్చినప్పుడు, కలరా వంటి ప్రమాదకర అంటురోగాలు వచ్చినప్పుడు, రోడ్డు ప్రమాదాలలో ఎముకలు విరిగినప్పుడు, మెదడుకు సంబంధించిన జబ్బులు వచ్చినప్పుడు హోమియో చికిత్సకు పరిగెత్తరేం?

హోమియో వలన నాకు తగ్గిందనేవారు సైతం పైన పేర్కొన్న ప్రమాదాలలో అలోపతికి వెడుతున్నారెందుకని? కొందరు హోమియో వైద్యులు సైతం, రోగుల్ని అలోపతికి వెళ్ళమని చెబుతున్నారెందుకు? ఇవన్నీ చాలా సీరియస్‌గా ఆలోచించాల్సిన విషయాలు. వైద్యం మనిషి ప్రాణానికి సంబంధించింది. దానితో హోమియో చెలగాటమాడుతున్నది. అందుకే అది అమానుషం. హోమియో మందులు ప్రమాదకరమైనవి కావనీ సైడ్‌ఎఫెక్ట్స్ వుండవనీ, తగ్గితే సరేసరి, తగ్గకుంటే మందువల్ల హాని లేదనే ప్రచారం కూడా వుంది. ఇది మరీ మోసం. సీరియస్ జబ్బులలో సరైన సమయానికి వైద్యం లేకుంటే ప్రాణాపాయం వస్తుంది. హోమియో చౌకగా లభిస్తుందనీ, ప్రమాదం లేదనీ చికిత్స ప్రారంభిస్తే మనిషి చనిపోయే అవకాశం వుంది.

హోమియో వల్ల ఏదైనా ప్రమాదం వచ్చినా వైద్యులు ఎలాంటి చిక్కూ లేకుండా తప్పించుకుంటున్నారు. జీవిత ఆరోగ్య బీమా హోమియోలో లేదు. మందులో మందులేదు గనుక ఏ మందు యిస్తే రోగికి చిక్కువచ్చిందో తెలియదు. హోమియో మందులలో ఏ పాళ్ళలో

ఏది వుందో చూపించే పట్టిక వుండదు, రోగికి వచ్చిన జబ్బు, దానికి హోమియో చికిత్స స్పష్టంగా రాయరు. కనుక ఇతరులకు అది తెలుసుకునే అవకాశం రాలేదు. హోమియోలోనే ఇలాంటి రహస్య చికిత్స కొనసాగుతున్నది!

హోమియో చికిత్స వ్యక్తిగతంగా చేస్తారుగాని. సామాన్య లక్షణాలకు కాదనే వాదన వున్నది. అంటే టైఫాయిడ్ జ్వరం 10 మందికి వస్తే ఒక్కొక్కరికీ ఆయా వ్యక్తిని బట్టి చికిత్స వుంటుందన్నమాట. అందరికీ ఒకే మందు ఒకే పద్ధతి వుండదు. కనుక ఎంతమంది మనుషులున్నారో అన్ని చికిత్సా పద్ధతులుంటాయన్న మాట. అలాంటప్పుడు హోమియోను రుజువు చేయమనడం ఎలా సాధ్యం? అయినా హోమియో శాస్త్రీయం అని యెందుకంటున్నారు? రోగాల్ని బట్టి ఫలానా మందు వేసుకోండని పత్రికలలో, పుస్తకాలలో చిట్కా వైద్యం యెందుకు ప్రచారం చేస్తున్నారు?

కేవలం హోమియో సూత్రాలకు భిన్నంగా ప్రవర్తించే యీ పద్ధతి వ్యాపార లక్షణమే ఆధునిక వైద్య ఉప్పెనకు తట్టుకోడానికి హోమియో ఏ స్థితికైనా దిగజారుతున్నదన్న మాట. డబుల్ బ్లైండ్ టెస్ట్, రాండం శాంపిల్ పద్ధతులు హోమియోలో కుదరవు! హోమియోపతి ప్రచారకులు యెప్పటికప్పుడు కొత్త యెత్తుగడలతో జనాన్ని మోసం చేస్తూనే వున్నారు. బాగా చదువుకున్నారనుకున్న అమెరికా, యూరోప్‌లలోనే యీ మోసాలు చేస్తున్నారు. అలాంటప్పుడు వెనుకబడిన దేశాలు వారికి ఒక లెక్క కాదు.

పారిస్‌లోని ఒక హోమియో సంస్థ పరిశోధన పేరిట అనేక కట్టుకథలు అల్లి సుప్రసిద్ధ సైన్సు పత్రిక నేచర్‌కు పంపగా, వారు ప్రచురించారు. దీనిపై ఫిర్యాదులు రాగా, ఆ పత్రికవారే ఒక నిపుణుల సంఘాన్ని పంపారు. తీరా విచారిస్తే అంతా మోసం అని తేలింది. పరిశోధనా సంస్థలో హోమియో పేరిట శాస్త్రీయ పద్ధతిలో రుజువు చేశామన్నవారికి ఉద్వాసన పలికారు.

హానిమన్ తరువాత అంతటివాడని హోమియో వైద్యులు ప్రచారంచేసే జేమ్స్‌టైలర్‌కెంటే కూడా ఎన్నో కాశీమజిలీకథలు ప్రచారంలోకి తెచ్చి అమెరికాలో హోమియో ప్రచారం చేశాడు. ఆయన రాసిన లెక్చర్స్ అనే హోమియోపతి మెడిసిన్ గ్రంథంపై మార్టిన్ గార్డినర్ వ్యాఖ్యానిస్తూ శాస్త్రీయాధారం ఏకోశానా లేకుండా 982 పేజీలు ఎలా రాసాడా అని ఆశ్చర్యపోయాడు. ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి పేరిట ప్రచారమవుతున్న పుక్కిటి పురాణాలు యిలాంటివేనని ఆయన సబబుగానే విమర్శించాడు. (ఆన్ ది వైల్డ్ సైడ్ - 1992 ప్రామిథియస్ బుక్స్ పుట 39)

హానిమన్ కాలంలో అలోపతి వైద్యం చేస్తున్న పనుల పట్ల విముఖతతో హోమియో వైద్యం ప్రవేశపెట్టాడు. ఇందులో మోతాదు తగ్గిస్తూ శక్తి పెంచడం అనేది ఆకర్షణీయ విషయం. జంతువులు, మొక్కలు, ఖనిజాలు, రసాయనాల వంటి వాటినుంచి యీ మందులు తయారుచేశారు. ఇందులో కరిగే వాటిని నీళ్ళలోగాని, సారాలోగాని కలిపేవారు. ఒక పాళ్ళు ఔషధం, 99 పాళ్ళ సారా

లేదా నీరు కలిపి చేసే పద్ధతి ఒకటి, అలా కలిపి, బాగా పది సెకండ్ల పాటు వూపి, అందులో ఒక పాలు మళ్ళీ తీసుకొని 99 చుక్కలు సారా లేదా నీరు కలిపేవారు ఇలా చేసుకుంటూ పోయే మందుల్ని 6C, 9E, 30C అలా పేర్లు పెట్టారు. ఈ పద్ధతిలో ఒక పాలు ఔషధం. 9 పాళ్ళు నీరు లేదా సారా కలుపుతూపోతే 3X, 6X, 30X అంటూ పేర్లు పెట్టారు. సులభంగా కరగని వాటిని మెత్తగా నూరి తరువాత యీ ప్రక్రియ చేసేవారు. ఇలా పలచబరిచే పద్ధతిని శక్తివంతం చేయడంగా (పొటెంటైజేషన్) అన్నారు. రసాయన శాస్త్రంలో అవగాడ్రో కనుగొన్న సూత్రం ప్రకారం మూలపదార్థం కోల్పోకుండా పలచబరచడానికి ఒక పరిమితి వుంది. 6023 x $10^{23}$ అనే యీ పరిమితిని హోమియోలో 12Cతో లేదా 24Xతో పోల్చవచ్చు. అంటే ఆ తరువాత మందులలో మందు వుండదన్న మాట. అయితే పదార్థం లేకున్నా శక్తి వున్నదనీ అది జీవశక్తి (వైటల్ ఫోర్సు)ని ప్రకోచింపజేసి పనిచేస్తుందని హానిమన్ నమ్మాడు. హోమియో మందుల్ని పరిశీలిస్తే మందు ఏమీ వుండదని తేలింది. నమ్మకంతో బ్రతికేవారిని శాస్త్రీయ పద్ధతిలో నిరూపించమనడం సాధ్యం కాదు.

మనుషుల్లో నమ్మకాలు ప్రబలి వున్నాయి. ప్రతి రోగి కూడా వైద్యుడి దగ్గర చిన్న పిల్లవాడి మనస్తత్వంతో వుంటాడు. వీటిని ఆసరాగా తీసుకొని హోమియో వైద్యులు దోపిడీ చేస్తున్నారు. యెన్నో ప్రశ్నలు వేసి, అలోపతిని తిట్టి రోగిలో బలహీనతను పెంచుతున్నారు. మన రోగులలో ఒక పట్టాన డాక్టర్ శక్తి సామర్థ్యాలను ప్రశ్నించే తత్వం లేదు. ఆ విషయం కూడా హోమియోవారు బాగా వాడుకుంటున్నారు. హోమియో రీసెర్చి అని బోర్డులు పెట్టి భ్రమలు కలుగజేస్తున్నారు. సర్వరోగ నివారిణిగా హోమియోను ముద్రవేస్తున్నారు. ఎయిడ్స్, మెదడువాపు వంటి వ్యాధులు రాకుండా ఆపగల శక్తి వుందని ప్రచారం చేస్తున్నారు. వైద్యరంగంలో ప్రభుత్వానికి వున్న బలహీనతల్ని బాగా వాడుకుంటున్నారు. అలోపతికి వున్న నియమ నిబంధన హోమియోపై రాకుండా అధికార్లను రాజకీయనాయకులను పట్టుకొని జాగ్రత్తలు పడుతున్నారు. పత్రికలు ద్వారా మూఢనమ్మకాన్ని ప్రచారం చేసి, సంపాదిస్తున్నారు. మానవవాదులు ప్రశ్నించేది ఒక్కటే. హోమియో శాస్త్రీయపద్ధతికి రుజువు కాగలదా? అయితే ఆధారాలేమిటి?

హోమియోను ప్రభుత్వం నిషేధించాలని మానవవాదులు కోరడంలేదు. శాస్త్రీయం అని రుజువుపరిచేవరకూ ప్రభుత్వ నిధులు యివ్వరాదని మాత్రమే కోరుతున్నారు. అమెరికాలోని నార్త్ కరోలైనా రాష్ట్రంలో హోమియో వైద్యాన్ని ఆపారు. కోర్టులో హోమియో శాస్త్రీయమని రుజువు కానందుకే యిలా చేశారు. ఇంగ్లండ్‌లో మెడికల్ బోర్డు అజమాయిషీ క్రిందకు హోమియోను తెచ్చారు. మనదేశంలో హోమియో పేరిట మారుమూల గ్రామాలలో సైతం సంపాదన జరుగుతుంది. అశాస్త్రీయమైన వైద్యాన్ని పాటిస్తే సమాజ నేరమౌతుంది, రాజ్యాంగంలో 51Ah ప్రాథమిక విధి ప్రకారం హోమియో పట్ల నిరసన తెలుపడం హ్యూమనిజమే.

శాస్త్రీయపద్ధతిని మనకు అనుకూలమైన చోట వాడుకుంటామని, మన వృత్తికి ఆదాయానికి

దెబ్బ తగిలేచోట వాడుకోబోమని అంటే కుదరదు. హ్యూమనిస్టులు, హేతువాదులు తెలిసో తెలియకో హోమియో వైద్యం చేబట్టారనుకోండి అది శాస్త్రీయం అవునా కాదా అని ప్రశ్నించినప్పుడు వారు కూడా ఆ పరీక్షకు నిలవాలి. అదొక్కటే మినహాయించి మిగిలిన వాటిలో మానవవాదం అంటే కేవలం అవకాశవాదులుగా మిగులుతాం. వృత్తి లాభసాటిగా వుంది గనుక, ఏమైనాసరే హోమియోను సమర్థిస్తామనడం హేతువాదంకాదు. రుజువులు చూపి శాస్త్రీయ పద్ధతి అని నిరూపించడం. లేదంటే హోమియో తప్పు అని యితరులకు చెప్పి, తాము వృత్తి మానడం హ్యూమనిజం.

*- హేతువాది, జనవరి 1994*

# పెట్టుబడి లేని గిట్టుబాటు వ్యాపారం యోగ

యోగ విద్యను అమెరికాలో ప్రచారం చేసిన వివేకానంద 39వ ఏట చనిపోయాడు. యోగవిద్యను పాటించిన ఆదిశంకరాచార్యుడు 33వ సంవత్సరంలో మరణించాడు. కనుక యోగం వలన ఆయువు పెరిగి, చాలాకాలం ఆరోగ్యంగా వుంటారనేది అందరికీ చెందిన సత్యం కాదేమో!

ఇప్పుడు ఎక్కడ చూచినా యోగ బోర్డులు వెలిశాయి. మానసిక ఆరోగ్యం పేరిట, రకరకాల చికిత్సలు చేస్తున్నారు. యోగంలో అనేక పేర్లు వచ్చాయి. రాజయోగం, సిద్ధయోగం మొదలైనవి జనాన్ని ఆకర్షిస్తున్నాయి. విదేశాలకు ఎగుమతి అవుతున్న యోగం వలన కొందరు బాగా ఆర్జిస్తున్నారు. ప్రాచీన భారత సంస్కృతి పేరిట యోగం వీధిన బడింది. యోగం పెట్టుబడి లేని మంచి గిట్టుబాటు వ్యాపారంగా మారింది. బాబాలు, మాతలు తలెత్తినట్లే యోగం కూడా పాపులారిటీ సంతరించుకున్నది.

అసలు విషయం మభ్యపెట్టి యోగం వలన ఆరోగ్యంగా వుంటారని, ధనార్జన చేస్తున్న నేపథ్యంలో కొంచెం పూర్వాపరాలు చూద్దాం.

## ఏది యోగం?

యోగం, భారతదేశం కనుగొన్న ప్రాచీన దర్శనం. మొత్తం ఆరు దర్శనాలలో యోగ ఒకటి. మోక్షం సాధించాలంటే లోగడ ఎవరి మార్గం వారు సూచించారు. మాది మాత్రమే మోక్షాన్ని సాధించగలదు అని చాటారు. అలాంటి ఆరు దర్శనాలు : న్యాయం, వైశేషికం, సాంఖ్యం, యోగం, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంసలు.

యోగం కనుగొన్న ఆద్యుడుగా పతంజలి పేరు చెబుతారు. అతని ప్రకారం మోక్ష సాధనకు ఎనిమిది మార్గాలు సూచించాడు. ఇందులో తొలిమెట్టు మాత్రమే ఆసనాలు.

వీటన్నిటిని నియమానియమాలన్నాడు. ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి మెట్టు మెట్టుగా సాధిస్తూ మోక్షాన్ని పొందాలి.

పతంజలి యోగంలో మూలసూత్రం చిత్తవృత్తి నిరోధం. ఆలోచన స్థంభింప జేసి, ముందు ఒక వస్తువుపై మనస్సు లగ్నం చేయాలి. తరువాత నిరాకారంపై దృష్టి పెట్టాలి. ఆలోచన చంపేయడం చాలా ముఖ్యమైన అంశంగా యోగం పాటిస్తుంది. ఇదంతా గురువు వద్ద నేర్చుకొని పాటించాలే గాని సొంతంగా ఆచరించరాదన్నారు.

వివేకానంద యోగాన్ని గైడ్ పుస్తకాలుగా రాసేసి, పాపులర్ చేశాడు. ముఖ్యంగా అమెరికాలో ఆయన గైడ్ చిట్కాలు బాగా అమ్ముడుపోయాయి ఆత్మ-పరమాత్మ విలీనం కావడమనే లయ మార్గాన్ని వివేకానందుడు రాజయోగం అని పేరు బెట్టి ప్రచారంలోకి తెచ్చాడు.

ఒకప్పుడు గురుకులాల్లో ఆశ్రమాలకు పరిమితమైన యోగం నేడు వీధి వ్యాపారంగా ధనార్జనకు అక్కర కొస్తున్నది. చాలా మంది ఆరోగ్యంతో యోగాన్ని ముడిపెట్టి అసలు విషయాన్ని దాచేశారు.

గురువు దగ్గర యోగం నేర్చుకొని అభ్యసించాలి అనే సూత్రాన్ని వదలేసి, వివేకానందుడు మొదలు అనేక మంది రాసి బజార్లో అమ్ముతున్న గైడ్ల ఆధారంగా యోగ స్కూళ్ళు, కేంద్రాలు వచ్చేశాయి.

పైగా కొందరు యోగం శాస్త్రీయమని చెప్పేటంత వరకూ సాహసిస్తున్నారు. శాస్త్రీయ పద్ధతికి యోగం ఎన్నడూ పరీక్షకు పెట్టలేదు. సైంటిఫిక్ విధానానికీ, యోగానికీ సంబంధం లేదు. కేవలం మూఢ నమ్మకంగానే యోగం నాడూ నేడూ ప్రచారంలో వుంది. ఆ విషయంలో స్పష్టత అవసరం.

కసరత్తు, వ్యాయామం ఆరోగ్యం కొరకు చేసే అభ్యాసాలు వేరు. యోగం ఉద్దేశం అదికాదు. అందుకే అసలు విషయం దాచిపెడుతున్నారని చెప్పవలసి వస్తున్నది. చిత్తవృత్తి నిరోధం యోగం పాటించవలసిన సూత్రమైతే, మోక్ష సాధన లక్ష్యం మార్గాన్నీ - లక్ష్యాన్నీ యోగం అరమరికలు లేకుండా చెప్పిందని మరచిపోరాదు.

యోగంలో చాలా రకాలున్నాయి. అందులో కుండలినీ యోగం ఒకటి కాగా, తాంత్రిక యోగం మరొకటి. తాంత్రిక యోగంలో సెక్స్ కూడా అమలుపరిచారు. స్త్రీని సాధనంగా చేసుకుని యీ యోగాన్ని అమలుపరచాలన్నారు. క్రమేణా తాంత్రిక యోగం సెక్స్ షాపులుగా మారాయని, కేంద్ర ప్రభుత్వం దీనిని నిషేధించింది. ఒకప్పుడు గుజరాత్, అస్సాం, బెంగాల్‌లో పాటించిన తాంత్రిక కేంద్రాలు నేడు మూతపడ్డాయి.

స్త్రీ బదులు వస్తువును పెట్టి తాంత్రిక విద్య అమలుచేసే రీతుల్ని కేరళలో పాటిస్తున్నారు.

కుండలినీయోగం ప్రకారం ముడ్డి దగ్గర వెన్నెముక చివరి భాగంలో మనిషి శక్తి వుంటుందని నమ్మకం. ఆ శక్తిని ప్రకోపింపజేసి క్రమేణా వెన్నెముక ద్వారా పైకి తెచ్చి మెదడు గుండా తీసుకురావడం ఆ పద్ధతి. ఇలాంటి శక్తి అనేది వూహాజనితమేగాని, ఆధారాలకు నిలవదు. నమ్మకం అన్నప్పుడు ఆధారాలు అడగరాదు.

హఠ యోగం చమత్కారాల మయం. నీటిపై నడుస్తామని, గాలిలో తేలగలమని గొప్పలు చెప్పిన వారున్నారు. ఇవేవీ ఎన్నడూ నిజం కాలేదు.

ఇక యోగాభ్యాసంలో ఫాషన్‌గా మారిన ప్రాణాయామం కొన్నిసార్లు ప్రమాదకారి అని గ్రహించాలి. ఊపిరి బిగబట్టి వదలడం ఇందలి ముఖ్యాంశం. 45 సెకండ్ల వరకూ వూపిరి బిగబడితే చిక్కులు రావు. కొందరు అలవాటుగా రెండు మూడు నిమిషాలు వూపిరి పీల్చి బిగబడతారు. మనం పీల్చిన ప్రాణవాయువు (ఆక్సిజన్) శరీరానికి ఉపయోగపడిన తరువాత బొగ్గుపులుసు వాయువుగా (కార్బన్-డయాక్సైడ్) బయటకు వస్తుంది. అంటే బొగ్గుపులుసు వాయువును శరీరం అట్టిపెట్టుకోదు. బలవంతంగా వుంచితే చిక్కులు వస్తాయి. ఈ చిక్కులలో పేర్కొనదగినవి మూర్ఛ రావడం, స్పృహ తప్పడం, పగటి కలలు రావడం, వింత దృశ్యాలు కనిపించడం, భ్రమలు కలగడం వున్నాయి.

బొగ్గుపులుసు వాయువు ఎక్కువసేపు అట్టి పెడితే వచ్చే పరిణామాలను శాస్త్రీయంగా పరిశీలించారు. ఇందులో ఒక అంశం ఏమంటే, రక్తంలో టెన్షన్ 40 ఎం.ఎం. వుండాలి. బొగ్గుపులుసు వాయువు వుండడం ఎక్కువైతే టెన్షన్ కూడా ఎక్కువ అవుతుంది. 80-90 వరకూ టెన్షన్ పెరిగిందనుకోండి. భ్రమలు, కలలు, వింత ఆలోచనా ధోరణులు వస్తాయి. వాటినే దైవాంశాలుగా, విపరీత వ్యాఖ్యానాలు చేసి చూపుతారు. రామకృష్ణ పరమహంస యిలానే చెప్పేవాడు. ఆయన తరచు మూర్ఛలకు గురయ్యేవాడు. ఈ విధమైన స్థాయి కొనసాగిస్తే సమాధి అని చెప్పే స్థాయి వస్తుంది. అంటే స్పృహ కోల్పోవడం అన్నమాట. తిరిగి యధాస్థితి రావడానికి చాలాసేపు పడుతుంది. ఆ స్థితిని దైవసాన్నిధ్యంగా చిత్రించే వారున్నారు. కాని మెదడుపై యిలాంటి వత్తిడి వలన ప్రమాదకర స్థితి ఏర్పడుతుంది. దేహం శుష్కించిపోతుంది. యోగం పేరిట తెలిసీ తెలియక కొందరుయీ దశలకు చేరుకుంటుంటారు. ఇందులో యిమిడిన ప్రమాదాలు తెలుసుకోలేరు.

ఇప్పుడు చాలా చోట్ల వెలసిన యోగ కేంద్రాలలో అసలు విషయం చెప్పరు. చెబితే జనం రాకపోవచ్చు, భయపడవచ్చు. కనుక కేవలం ఆరోగ్యం కొరకు, మానసిక ఉల్లాసం కోసం, టెన్షన్ తగ్గించడానికి అని మాత్రమే చెబుతారు. ఇది ఒక రకంగా మోసం చేయడం, మభ్యపెట్టడమే. డబ్బు కోసం కక్కుర్తిపడి మూలవిషయాలను దాచడం మన సంప్రదాయంలో వుంది. వాస్తులో కుల ప్రసక్తి వున్నా, నేడు ఆ విషయం దాచి పెడుతున్నారు గదా. అలాగే యోగం కూడా.

లోగడ ధీరేంద్ర బ్రహ్మచారి ఢిల్లీలో టి.వి.లో యోగప్రచారం చేశాడు. ఆయనకు అనాటి ప్రధాని ఇందిరాగాంధి అండ వుండేది. ఆయనకు ఆయుధాల కర్మాగారం వున్నదని తరువాత బయటపడి పరువు పోయి ప్రచారం కోల్పోయాడనుకోండి. అలాగే కొందరు నేడు పదవులలో ఉన్నవారి ప్రాపకం సంపాదించి, యోగాన్ని ప్రచారం చేస్తున్నారు. యోగానికి రాజకీయం జోడైంది. కీలక పదవులలో వున్నవారు యోగాన్ని సమర్ధించడం తెలిసి కాదు. ఇతరేతర కారణాలే అందుకు కారణం.

ఆరోగ్యానికి ఎక్సర్‌సైజ్ చేయడం యోగ కాదు. ఏదైనా రుగ్మతలున్నవారు డాక్టర్‌ను సంప్రదించి, వ్యాయామం చేయడం మంచిది. యోగ వలన వచ్చే పరిణామాలకు బాధ్యులు లేరు. ఇన్సూరెన్స్ లేదు. యోగ శాస్త్రీయ పరిశోధనకు గురి చేసిన దాఖలాలు లేవు. అలా చేయకుండా అనుమతించడం ప్రభుత్వానికి సైంటిఫిక్ పాలసీ లేకపోవడమే!

***- నాస్తికయుగం, మే 2001***

# యోగ

చదువుకున్న వారిని సులభంగా మోసం చేయవచ్చు అనడానికి ఇప్పుడు విరివిగా వ్యాపిస్తున్న యోగ దుకాణాలే దానికి నిదర్శనం వీధి వీధికి కొత్త పేర్లతో వెలసిన యోగ కేంద్రాలు చాలామందిని ఆకర్షిస్తున్నాయి.

రోగాలు వచ్చిన వారు, ఇళ్ళలో సమస్యలున్నవారు టెన్షన్ పడుతున్నవారు, యీ యోగ విధానాలకు ఆకర్షితులవుతున్నారు. యోగం భారతీయ విలక్షణ విధానం. ఇది యిప్పుడు విదేశాలలో కూడా గిట్టుబాటు వ్యాపారంగా ప్రచారమవుతున్నది.

యోగ స్కూలు తెరవడానికి, ఫీజులు వసూలు చేయడానికి, లైసెన్స్ అవసరం లేదు. పెట్టుబడులు సైతం అట్టే అక్కరలేదు. యోగాభ్యాసాలతో బాటు ఆకర్షణీయంగా మాట్లాడడం కొంత ఆధునిక పరికరాలు జోడించడం కూడా ఆకర్షణకు తోడ్పడుతున్నది. యోగం పేరిట చికిత్సకు ముడిపెడుతున్నందున దీనికి కొత్త కారణం వచ్చింది కూడా.

యోగం వలన రిలాక్స్ కావచ్చుననీ, టెన్షన్ తగ్గించుకోవచ్చునని, ప్రశాంతత వనగూడునని తాత్కాలికంగా కష్టాలు మరిచిపోవచ్చుననీ, ఆరోగ్యం కుదుట బడుతుందనీ చెబుతారు. ఇవన్నీ ఆకర్షణీయాలే కాగా చాలామంది ప్రశ్నించకుండా యోగాభ్యాసాలకు లొంగిపోతున్నారు. ఇటీవలే కొత్త మాటలు వినవస్తున్నాయి. యోగ కూడా సైంటిఫిక్ అనడం!

యోగానికి మూలసూత్రం చిత్తవృత్తి నిరోధం. అంటే మానవుడి ప్రధాన లక్షణమైన ఆలోచనను స్థంభింపజేయడం. యోగంలో ఇంద్రియాల్లో ఒక వస్తువుపై గాని బిందువుపై గాని

దృష్టి పెట్టి, మిగిలిన ఆలోచనలు రానివ్వకుండా చూడమంటారు. అదే ఆలోచన చంపడానికి నాంది. ఆలోచిస్తే ప్రశ్నలు వస్తాయి. గుడ్డిగానమ్మడం వలన ఆలోచన చచ్చిపోతుంది. అలా ఆరంభించిన యోగం 8 మార్గాల సోపానం చెప్పింది. ఇందులో మెట్లు మెట్లుగా మనిషిని తీసుకుపోయినారు. మోక్షం అంటే వెంటనే అందరూ ఒప్పుకోరు గనుక, ఆధునిక పదజాలంతో ఆకర్షించడం యోగంలో పెద్ద ఎత్తుగడ.

యోగానికీ, ఆరోగ్యానికి చికిత్సకూ సంబంధం లేదు. కాని కొందరు అలాంటి సంబంధం కల్పిస్తున్నారు. యోగాభ్యాసాలతో ఎక్సర్‌సైజ్ 8 మార్గాలలో ఒక మార్గమే. అలా చెప్పక మభ్యపెట్టడం వారి చిత్త ప్రవృత్తికి గీటురాయి.

యోగంవలన దీర్ఘాయిస్సు అనేది మరొక భ్రమ, శంకరాచార్యులు, వివేకానంద, రామకృష్ణ పరమహంస (గదాధర్), రమణ మహర్షి యోగం చేసిన వారే. వివేకానంద 38 ఏళ్ళకి చనిపోయాడు. రమణ, రామకృష్ణులు కేన్సర్‌తో చనిపోయారు. శంకరాచార్య 32 ఏళ్ళకే చనిపోయారు. కనుక ఆయుష్షు గురించి మరిచిపోవాలి.

యోగాభ్యాసాల వలన మెదడు ఎలా పనిచేస్తుందో యోగులకు తెలియదు. ఆనాడు అంత సైన్స్ పెంపొందలేదు. నేడు మెదడు గురించి చాలా తెలుస్తున్నది. ఇంకా తెలియాల్సింది ఎంతో ఉంది.

మెదడు నాలుగు విధాలైన తరంగాలు ప్రసరిస్తుంది. మెదడు పనిచేసే తీరులో తరంగాలకూ సంబంధం వుంది.

నిద్ర పోతున్నప్పుడు ఆల్ఫాతరంగాలు వస్తాయి.

దృష్టి కేంద్రీకరించినప్పుడు బీటా తరంగాలుంటాయి.

సమస్యలు సాధించేటప్పుడు, పనిచేస్తున్నంతసేపు బీటా తరంగాలు వుంటాయి.

గాఢ నిద్రలో డెల్టా తరంగాలు వస్తాయి.

మోహనిద్రావస్తలో (సుషుప్తి దశ) తీటా తరంగాలు వుంటాయి.

ఈ తరంగాలను ఎలక్ట్రోసిఫలోగ్రాఫ్ (ఇఇజి) యంత్రంతో కొలుస్తారు. జెన్ బౌద్ధం యోగులు పేర్కొనే సుషుప్తి అవస్తను నేడు సైన్స్ వివరిస్తుంది. ఎమ్.ఎన్. రాయ్ ఈ విషయాన్ని వివరంగా శాస్త్రీయంగా రాశారు.

యోగంలో ప్రాణాయామం ఒకటి. మనిషి ఊపిరిపీల్చడం వదలడం అనుకోకుండా చేసే పని. యోగంలో ఊపిరి బిగబట్టమంటారు. అంటే పీల్చిన ప్రాణవాయువు బొగ్గుపులుసు వాయువుగా మారిన తర్వాత వదిలివేయాలి. కానీ, అట్టిపెడితే అది శరీరానికి పనికిరాదు. గనుక

హాని చేస్తుంది. కొంతసేపు అట్టిపెడితే పగటి కలలు వస్తాయి. భ్రమలు కలుగుతాయి. ఆ తరువాత దశలో మైకంకమ్మినట్లు దీర్ఘనిద్రావస్థలోకి పోతారు. అటువంటి దశ నుంచి యధాస్తితిరావడానికి కొంతసేపు పడుతుంది. కానీ, ఆ దశను కొందరు ముక్తికి చేరువైన సమాధి దశగా చెపుతారు. రామకృష్ణ పరమహంస విషయంలో యిలానే జరిగింది. శరీరానికి యీ దశలో హాని జరుగుతుంది.

యోగాభ్యాసాల వలన ఏదైనా జరిగితే అందుకు బాధ్యత వహించే వారెవరూ లేరు. మళ్ళా ఆధునిక చికిత్సకు పోవల్సిందే.

ఆధునిక వైద్యరంగానికి యోగాన్ని జోడించే ఎత్తుగడ కొన్ని ఆశ్రమాల వారు ఇటీవల వాడుకలోకి తేవడం వారి వ్యాపారాన్ని తెలివిగా ఆధునీకరణ చేయడానికే.

ప్రపంచంలోనే మేధావివర్గానికీ సాధారణ ప్రజానీకానికి మధ్య అగాధం పెరుగుతున్నది. అందువల్లనే విజ్ఞాన శాస్త్రానికీ, సనాతనవాదానికి మధ్య సంబంధం లేకుండా పోతున్నది. అందువల్లనే సాధారణ ప్రజానీకం మతవాదాల్లో నిమగ్నమై ఆధునిక విజ్ఞాన తాత్విక ఫలితాలను అందుకోలేక సతమతమైపోతున్నారు. కాగా విజ్ఞానశాస్త్ర ఫలితాలైన సాంకేతిక పరికరాలను వాడుకోవలసిన పరిస్థితిలో ఈనాడు మతం పడిపోయింది. ఇది ఆధునిక జాడ్యాలకు ఒక కారణం కాగా, ఇప్పుడు కంప్యూటర్ యుగంలో ప్రవేశించాం. ఇది సాధారణ పౌరుడికి మాయాలోకంలాగా దర్శనమిస్తుంది. అర్థమయ్యేస్థితిలో లేదు. అంటే విజ్ఞానికీ సాధారణుడికీ మధ్య పూడ్చరాని అగాధం మిగిలిపోయింది. ఇది ప్రమాద సంకేతం. వేల సంవత్సరాలనాడు ఈ స్థితిలోనే సాధారణమానవుడికంటే భిన్నంగా పౌరోహిత వర్గం పెరిగిపోయింది. అందునా భారతదేశంలో ఆ వర్గం సాధారణ ప్రజానీకానికి అందనంత దూరంగా జరిగి మానవుడిలో తారతమ్యాలను చాలా పెంచివేసింది. ఈ చారిత్రక సత్యాన్ని మనం గుర్తిస్తే, కేవలం అక్షరజ్ఞానం కాకుండా వైజ్ఞానిక తాత్విక ఫలితాలు సామాన్య ప్రజలదాకా మనం మోసుకువెళ్ళాలి. అది మన బాధ్యత.

***- హేతువాది, అక్టోబరు 2001***

# జపాన్ దిగుమతి రేకి చికిత్స

విదేశాల నుండి మనకు అనేక మార్గాంతర వైద్య చికిత్సలు వచ్చాయి. అందరూ తమది సైంటిఫిక్ అని ముద్ర వేసుకొంటున్నారు. విచారణ జరిపి, నిగ్గు తేల్చే వైద్యసంస్థ లేదు గనుక, ఎవరికి చేతనైనంత వారు సంపాదించుకొని, జబ్బు మనుషుల్ని బాగా వాడుకుంటున్నారు.

ఇప్పుడు మార్కెట్‌లో రేకి (REY-KEY అని పలుకుతారు) కొత్తగా వ్యాపిస్తున్నది. ఇది జపాన్ నుండి వలస వచ్చింది. ఇప్పటికే అమెరికా యూరోప్‌లకు వ్యాపించిన రేకి వైద్యం, భారతదేశంలో అడుగిడింది.

జపనీస్ అర్థంలో రే అంటే స్పిరిట్. రేకి అనగా ఆధ్యాత్మిక జీవశక్తి అని అర్థం. జీవన శక్తిని నడిపించే స్పిరిట్ అన్నమాట.

మికాఓ ఉసుయై (MIKAO USUI) 1802-1883 - జపాన్‌లో మత ఉద్యమం నడిపాడు. అతడు కనుగొన్నదే రేకి వైద్యం. మన రుషుల వలె, ప్రవక్తల వలె యితడికీ దివ్యవాణి వినపడడం, భ్రమలు కలగడం, మనిషికి చికిత్స చేయడానికి యీ దివ్యవాణి అక్కరకు వస్తుందనడం అవసరమన్నాడు. మికాఓ తరచు ఉపవాస దీక్షలు చేసి, ఆ తరువాత తనకు దివ్యవాణి తెలిపిందంటూ బయట పెట్టేవాడు.

జీవశక్తిలో వడిదుడుకులు సంభవించినప్పుడు రోగాలు వస్తాయని రేకి సిద్ధాంతం. విశ్వమంతటా శక్తి వ్యాపించి వుంది. దీనిని రేకి విధానం ప్రత్యేక శక్తితో కనుగొని, రోగికి ప్రసరింపజేస్తుంది. విశ్వంలోని శక్తిని సరైన మార్గంలో పెడితే రోగి కుదురుకుంటాడన్నమాట. విశ్వశక్తిని రోగి దగ్గరకు కేవలం రేకి డాక్టర్ మాత్రమే తేగలడు. విశ్వశక్తి తోడ్పాటుతో వ్యక్తిలోని శక్తి పెరిగి, రోగం నయమౌతుంది. ఆ విధంగా రోగిలోని శక్తిని సమపాళ్ళలో మళ్ళించడంతో వ్యక్తి స్వస్తత పొందుతాడు.

అయితే రేకి వలన రోగాలు తగ్గకపోతే? అందుకు కారణం రోగి విశ్వశక్తిని స్వీకరించకుండా నిరోధిస్తున్నాడన్నమాట! అంటే, రోగి పూర్తిగా రేకి డాక్టర్‌కు లొంగిపోయి అతడు చెప్పింది వింటే, ఏ రోగమైనా తగ్గిపోతుంది. అన్ని రోగాలకు రేకి చికిత్స వుంది.

నేడు రేకి చికిత్స మూడు దశలలో నేర్పుతున్నారు. దీనికిగాను బాగా ఫీజులు వసూలు చేస్తున్నారు. మత పరిభాషను అడుగడుగునా రేకి చికిత్సలో ప్రయోగిస్తారు. రేకి విధానంలో వివిధ దశలలో మత సంకేతాలు వాడతారు. ఉద్వేగరీతుల్ని యథాస్థితికి తెస్తామంటారు.

*- నాస్తికయుగం, జూన్ 2001*

# జ్యోతిష్యం

చదువుకున్నవారు, డిగ్రీలున్నవారు చేతులు చూపించుకుంటున్నారు. ముహూర్తాలు పాటిస్తున్నారు. అర్ధరాత్రి పెండ్లిళ్లు చేస్తున్నారు. అధికారంలో వున్నవారు, రాజకీయాల్లో వున్నవారు ప్రతిదానికీ ముహూర్తాలు పాటిస్తున్నారు. ఎక్కడ చూచినా ఆస్థాన జ్యోతిష్యులు తయారయ్యారు.

"హిందు", "ఈనాడు" వంటి పత్రికలు జ్యోతిష్యాన్ని ప్రచురించడంలేదు. కాని చాలా దినపత్రికలు వార, దిన ఫలాలు, రాశిచక్రాలు వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా యిది వున్నది. సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులు విజ్ఞప్తి చేసినా, జ్యోతిష్యం శాస్త్రీయం కాదని తెలిపినా, అది కేవలం వినోదం అని ప్రకటించమన్నా, పత్రికలు మొండిగా పాఠకులను మోసం చేస్తున్నాయి. ఏ రెండు పత్రికలూ

ఒకేరోజు ఒకే విధమైన జ్యోతిష్యాన్ని ప్రచురించడంలేదు. జ్యోతిష్యానికి ప్రత్యేక పత్రికలు వెలువడుతున్నాయి. జ్యోతిష్యం అంచనాలు ఎన్నివిధాల తప్పిపోయాయో, చూపినా, జనం ఇంకా గుడ్డిగా నమ్ముతూనే వున్నారు. తప్పిపోయిన అంచనాలకు జ్యోతిష్యులు బాధ్యత వహించడం లేదు. జనం మాత్రం మా కర్మ అనుకుంటూ, మరో ముహూర్తం కోసం, ఇంకో జ్యోతిష్యుణ్ణి వెతుక్కుంటూ పోతున్నారు.

జ్యోతిష్యం పూర్వకాలం నుంచీ వున్నది. అన్ని దేశాల్లోనూ వివిధ రీతుల్లో పాటిస్తున్నారు. మన దేశ జ్యోతిష్యానికి అమెరికా జ్యోతిష్యానికీ చాలా తేడాలున్నాయి. అలాగే మిగిలిన చోట్ల కూడా. జ్యోతిష్యం పూర్వంనుండి ఆకాశంలోని నక్షత్రాలు, గ్రహాలపై ఆధారపడింది. వాటి చలనం, అక్కడ నుండి వచ్చే వెలుగు, ఆకర్షణ మన జీవితాల్ని ప్రభావితం చేస్తాయనే నమ్మకమే జ్యోతిష్యానికి మూలం. శాస్త్రంలో పరిశీలన ఒక భాగం. అది రానురాను ఖగోళ శాస్త్రానికి దారితీసింది. ఖగోళశాస్త్రం శాస్త్రీయంకాగా, జ్యోతిష్యం నమ్మకంగా మిగిలిపోయింది.

పూర్వం రాజులు జ్యోతిష్యుల్ని పెట్టుకునేవారు. జ్యోతిష్యం తప్పిపోతే, చెప్పిన జ్యోతిషుణ్ణి వురితీసేవారట చైనాలో! అలా కాకపోయినా, జ్యోతిష్యంచనాలకు బాధ్యత వహించేటట్టు చేయడం అవసరం. అప్పుడు కొంత అయినా అదుపు వస్తుంది. అమెరికాలో అధ్యక్షుడుగా రీగన్ జ్యోతిష్యులను పెట్టుకొని, వారి ప్రకారం నడచుకున్నాడు.

అలెగ్జాండ్రియా, ఈజిప్టు, బాబిలోనియా, గ్రీక్, రోమన్ నాగరికతలలో జ్యోతిష్యం వుండేది. దేశభవిష్యత్తును అంచనావేస్తూ వూహిస్తూ చెప్పే జ్యోతిష్యం, వ్యక్తిపరంగా చెప్పే జ్యోతిష్యం వుండేది. మరణాలకు, ఉపద్రవాలకు గ్రహాలు కారణం అని నమ్మేవారు. పూర్వం నుండి వస్తున్న ఆ నమ్మకం అలా అంటురోగంలా ప్రబలుతూ వచ్చింది.

తెలుగు రచయిత చలం కూడా రమణాశ్రమంనుండి అందరికీ వుత్తరాలు రాసి, అష్టగ్రహ కూటమికి ప్రపంచం అంతమౌతున్నదనీ రమణాశ్రమానికి వస్తే బ్రతికిపోతారని జోస్యం చెప్పాడు. అలాంటిదేమీ జరగలేదు. చలం రాసింది నిజమేనని నమ్మి వెళ్ళినవారున్నారు. అలా రాసినందుకు చలానికి శిక్షలేదు. బెంగుళూరులో రామన్ అనే జ్యోతిష్యుడు చెప్పినవి ఎన్నివిధాల తప్పిపోయాయో శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. హెచ్. నరసింహయ్య యీ విషయమై ఒక సంకలనం ప్రచురించారు. అయినా రామన్ పట్ల శిక్షలు లేవు. అందుకే జ్యోతిష్యులు బాధ్యతారహితంగా రాస్తున్నారు. అంచనాలు వేస్తున్నారు. దీనివలన జరిగే నష్టాలు అనూహ్యం. జ్యోతిష్యులు సాంఘిక నేరస్తులు. వీరిపట్ల చట్టం అవసరం.

చాలా జ్యోతిష్యాలు అందరికీ వర్తించేటట్లు అస్పష్టంగా వుంటాయి. నెల మొదటివారంలో జీతాలు వస్తాయి గనుక, సంతోషంగా వుంటారని, నెల చివరలో కష్టాల్లో వుంటారని స్థూలంగా సూచించడం యిందులో భాగమే. అలాగే రుతువులు, శీతోష్ణస్థితిని బట్టి అంచనాలు చెప్పడం ఒక వ్యూహం మాత్రమే.

అలెగ్జాండ్రియా లైబ్రరీలో పనిచేసిన సుప్రసిద్ధ టాలమీ మొదలు న్యూటన్, కెప్లర్ వరకూ జ్యోతిష్యాన్ని నమ్మారు. ఆధునిక కాలంలో సైకాలజిస్టు కార్ల్ యూంగ్. ఇసెంక్‌లు నమ్మారు. శాస్త్రీయంగా జ్యోతిష్యాన్ని రుజువుచేయాలని కృషిచేసి విఫలమయ్యారు. జ్యోతిష్యం అశాస్త్రీయమని రుజువైంది. అయినా అది వదలడం లేదు!

కెప్లర్ కాలానికి ఆరు గ్రహాలే తెలుసు. ఆ తరువాత ఖగోళవిజ్ఞానం మరో మూడు గ్రహాల్ని కనుగొన్నది. ఇండియాలో ప్రాచీనకాలం నుండి నవగ్రహాలను అంటిపెట్టుకున్నారు. ఉత్తరోత్తరా ఖగోళవిజ్ఞానం ప్రకారం కనుగొన్న ప్లూటో, యురేనస్, నెప్ట్యూన్‌ను చేర్చలేదు. అంటే అన్ని గ్రహాల ప్రభావాన్ని భారతీయ జ్యోతిష్యం పరిగణలోకి తీసుకోకుండానే, మనిషి భవిష్యత్తును అంచనా వేస్తున్నాయన్నమాట. మరి గ్రహాల ప్రభావం నిజంగా మనిషివైపుంటే భారతీయ జ్యోతిష్యం వదలివేసిన గ్రహాల మాటేమిటి? అసంపూర్తి అంచనాలు సరైనవి ఎలా అవుతాయి? భారతీయ జ్యోతిష్యంలో గ్రహాలకూ, నక్షత్రాలకూ తేడా కూడా తెలియకుండా గ్రంథాలు రాశారు. సూర్యుడు నక్షత్రాలలో ఒకటి. అది స్వయంప్రకాశం. అదికూడా ఒక గ్రహంగా పేర్కొన్నారు. నవగ్రహాలకు వెలుగు వుండదు. గ్రహాలు సూర్యుని వెలుగు స్వీకరిస్తాయి.

నవగ్రహాలలో రాహువు, కేతువు అనేవి కేవలం గ్రహణం సందర్భంగా ఏర్పడే నీడ మాత్రమే. అదికూడా గ్రహంగా భావించడం తెలియకనే. భూమి చుట్టూ తిరిగే చంద్రుణ్ణి కూడా గ్రహాల్లో చేర్చారు. ఈ విధంగా ఖగోళశాస్త్రానికి భిన్నంగా లోపభూయిష్టంగా వున్న భారతీయ జ్యోతిష్యం యింకా ఎందరినో నమ్మిస్తున్నదంటే, మనం ఎంత వెనుకబడివున్నామో గ్రహించాలి.

మూఢనమ్మకాలు మన గుత్తాధిపత్యం కాదు. యూరోప్, అమెరికాలలో సైతం జ్యోతిష్య వ్యాపారం సాగుతూనే వున్నది. ఒక రంగంలో చదువుకున్నవారు తమకు తెలియని ఇతర రంగాల విషయాలన్నీ అద్భుతాలని భావిస్తున్నారు. న్యూయార్క్ టైమ్స్ వంటి పత్రిక జ్యోతిష్యాన్ని ప్రచురించడంలేదు. కాని వాషింగ్టన్ పోస్టు వంటివి రాశిఫలాల్ని వేస్తున్నాయి. అమెరికా మూఢనమ్మకాల వ్యతిరేకసంఘం విజ్ఞప్తి చేయగా, కొన్ని పత్రికలు మాత్రం జ్యోతిష్యం ప్రచురిస్తూనే - అది కేవలం వినోదం కొరకేనని పేర్కొంటున్నాయి. మరికొన్ని పత్రికలు జ్యోతిష్యం అసలే మానేశాయి. పాఠకులను వంచించటంలో భాగమే జ్యోతిష్యం ప్రచురించడం.

శాస్త్రజ్ఞులు ఖగోళ పరిశీలన చేసిన అనంతరం గ్రహాలకు, నక్షత్రాలకు ప్రాచీన గ్రీకు, రోమన్ దేవుళ్ళ పేర్లు పెట్టారు. అదికూడా మూఢనమ్మకాలను అట్టిపెట్టడానికి దోహదం చేస్తున్నది.

జ్యోతిష్యం జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రాచీనులు భయంతో కథలు అల్లి, వాటినే నమ్మినట్లు తెలుసుకోవచ్చు. గ్రహాలకు, నక్షత్రాలకు, ఆకాశంలో జరిగే వాటికీ దైవ ప్రభావాన్ని చూచారు.

జ్యోతిష్యంలో పేర్కొనే గ్రహాల ఆధారంగా, ఆకాశంలో రాశిచక్రాలను వూహించారు. ఆకాశాన్ని విభజించి రాశిచక్రాలు వేయడం పూర్వీకుల కట్టుకథల ప్రతిభకు నిదర్శనం. భారతీయులు,

పాశ్చాత్యులు యీ పనిచేశారు. త్రిశంకుస్వర్గంవలె రాశులు కూడా మానవ సృష్టికి నిదర్శనమే. రాసులు నిజంకాదు. జ్యోతిష్యాన్ని శాస్త్రీయమని చూపాలనే ప్రయత్నంలో ఫ్రెంచి గణిత శాస్త్రజ్ఞుడు మైకెల్ గాక్విలిన్ చాలామంది పుట్టిన తేదీలు రాశిచక్రాలకు పొందిక వున్నట్లు పేర్కొన్నాడు. అయితే అన్ని సందర్భాలలో ఇది రుజువు కాలేదు. ఎవరు ఎన్ని తిప్పలు పడినా శాస్త్రీయం అని మాత్రం నిక్కచ్చిగా నిర్ధారించలేకపోయారు.

మన రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం తెలుగుదేశం హయాంలో దోణప్ప వైస్ ఛాన్సలర్‌గా వుండగా, డిగ్రీ, డిప్లొమా జ్యోతిష్య కోర్సులు పెట్టింది. ఆ తరువాత సి. నారాయణరెడ్డి వైస్‌ఛాన్సలర్‌గా వుండగా హేతువాద సంఘం పక్షాన నేను అభ్యంతర పెట్టగా, నాకూ కొత్తపల్లి వీరభద్రరావుకూ ఒక సమావేశం ఏర్పరచారు. వాదోపవాదాలు విన్న తరువాత, శాస్త్రీయమని రుజువుపరచడం యూనివర్శిటీ బాధ్యత అని నారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. డిగ్రీస్థాయిలో జ్యోతిష్యం తొలగించారు. రామన్ అనే బెంగుళూరు జ్యోతిష్కుడు అభ్యంతరపెట్టి, రాజకీయవత్తిడి తీసుకరావడానికి ప్రయత్నించినా, నారాయణరెడ్డి లొంగకుండా, శాస్త్రీయమనే ఆధారాలు చూపమన్నారు. రామన్ చూపలేకపోయారు. డిప్లొమా కోర్సు నుండి జ్యోతిష్యాన్ని తొలగించమని వైస్‌ఛాన్సలర్ పేర్వారం జగన్నాథంను కోరగా, ఆయన సెనెట్‌లో చర్చకు పెట్టారు. సెనెట్ ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. శాస్త్రీయమని రుజువు చేయటానికి ముందుకు రాలేదు. యూనివర్సిటీల స్థాయి అలా వుంది. ఒక ఆస్పత్రిని పరిశోధనా కేంద్రంగా స్వీకరించి, పుట్టినవారిపై ఎలాంటి ప్రభావం వుంది, ఉత్తరోత్తరా జ్యోతిష్యం చెప్పినవి వారిపట్ల రుజువు అయ్యాయా, పరిశీలించే బాధ్యత యూనివర్సిటీపై వుంది. కేవలం కొందరికి ఉద్యోగాలు కల్పించే నిమిత్తం యిలాంటి కోర్సులు పెడితే, ఆ కోర్సుల డిగ్రీలు పట్టుకొని, వారు మరికొందరికి హానిచేయవచ్చు. యూనివర్శిటీలు బాధ్యతారహితంగా, రాజ్యాంగవిరుద్ధంగా వున్నాయనడానికి (51Ah నిబంధన) ఇదొక ఉదాహరణ.

జ్యోతిష్యంలో చంద్రుడిని గూర్చి చిలవలు పలవలుగా పేర్కొంటారు. భూమికి ఉపగ్రహమైన చంద్రుడిలోకి యంత్రాల్ని పంపడం, మానవులు వెళ్ళి అక్కడి పదార్థం తేవడం, పరిశీలించడం జరిగింది. అయినా చంద్రుడిపట్ల కట్టుకథలు చెబుతూనే వున్నారు. చంద్రుడి ప్రభావం పెద్ద స్థలాలపైనా, సముద్రాలపైనా వుంటుంది. చిన్నస్థలాల మీద నదులు, చెరువుల మీద వుండదు. మనుషులపై ఎలాంటి ప్రభావం లేదు. గురుత్వాకర్షణ శక్తి పెద్దవాటిపైనే వున్నట్లు స్పష్టంగా రుజువైంది. అమావాస్య, పున్నమి పేరిట చెప్పే చంద్రుడి ప్రభావ కథలన్నీ వినోదించేవిగాని, నమ్మవలసినవి కావు. మనుషులు వెళ్ళి వచ్చిన చంద్రుడు వేరు. మత గ్రంథాలు పేర్కొనే చంద్రుడు వేరనే మూర్ఖ నమ్మకస్తులూ వున్నారు.

మనపై మనకు విశ్వాసం, ధైర్యం లేనప్పుడు జ్యోతిష్యం వంటి బలహీనతలు చోటుచేసుకున్నాయి.

**- *హేతువాది, మార్చి 1994***

# విశ్వాన్వేషణల్లో ఎక్కడున్నాం?

రావిపూడి వెంకటాద్రి "విశ్వాన్వేషణ"కు అర్ధశతాబ్దం వయస్సు వచ్చింది. అప్పటినుండి ఖగోళశాస్త్రం నిరంతర పరిశోధనలు జరుపుచూనే వున్నది. యుగయుగాలు మానవుడు చూపుతున్న జిజ్ఞాసకు ఖగోళశాస్త్రం క్రమేణా సమాధానాలు చెబుతూ, పురోగమిస్తున్నది. వెంకటాద్రి విశ్వాన్వేషణ రచన అనంతరం జరిగిన పరిశోధనలు పరిశీలించడం మానవవాదుల, హేతువాదుల అన్వేషణలో భాగమే. ఆంధ్రప్రదేశ్‌లో అధునాతన సైన్సును అందించడంలో అత్యంత సులభమార్గాన్ని వెంకటాద్రి చూపారు. ఎందరో హేతువాదులు ఈ జ్ఞానార్జన చేస్తున్నారు.

ఇటీవల జరుగుతున్న విశ్వాన్వేషణలో బిగ్‌బాంగ్‌తో మనం చూస్తున్న విశ్వం ఆరంభమయ్యిందని తెలిసింది. ప్రపంచంలోని సైంటిస్టులు దాదాపు ఈ అభిప్రాయానికి వచ్చారు. ఖగోళశాస్త్రంలో బిగ్‌బాంగ్ తరువాత పరిణామక్రమాన్ని క్రైస్తవులలో సనాతనులైన కేథలిక్కులు సైతం అంగీకరిస్తున్నారు. స్టీఫెన్ హాకింగ్ రోంలో సెమినార్‌లో మాట్లాడిన అనంతరం ఆయన్ను క్రైస్తవాధిపతి పోప్ దగ్గరకు తీసుకెళ్ళారు. బిగ్‌బాంగ్ నుండి ప్రారంభమై జరిగిన పరిణామాన్ని తాము అంగీకరిస్తున్నామనీ, అయితే బిగ్‌బాంగ్ సృష్టికార్యం గనుక అదెలా జరిగిందని ప్రశ్నించవద్దని పోప్ సలహా యిచ్చాడు.

హవాయ్ దీవులలో మానాకీ కొండపై వంద మిలియన్ డాలర్ల వ్యయంతో "కెక్ టెలిస్కోప్" యిటీవలే ఏర్పరచి విశ్వాన్వేషణ యింకా కొనసాగించారు. కాలిఫోర్నియాలో ఒక దాత ఈ టెలిస్కోప్ నిర్మాణ ఖర్చులు భరించడం పెద్ద విశేషం. ఈ టెలిస్కోప్ పరిశీలించే తీరును బాక్‌గ్రౌండ్ ఎక్స్‌ప్లోరర్ (కోబ్) అంటున్నారు.

15 బిలియన్ సంవత్సరాల క్రితం బిగ్‌బాంగ్‌తో నేటి ప్రకృతికి ప్రారంభదశ పట్టింది. అప్పుడు ఆకాశం, కాలం, శక్తి, పదార్థం అనే తేడాలు లేవని గుర్తుంచుకోవాలి. స్టీఫెన్ హాకింగ్ ప్రభృతులు ఈ విషయాన్ని స్పష్టంగా వ్రాశారు. హేతువాదులు వాటిని ఎప్పటికప్పుడు చదువుతుండాలి.

ఏకత్వం నుండి భిన్నత్వం ఏర్పడడంలో ప్లాంక్ (Plank) అనే సైంటిస్టు సూచించిన కాలమానాన్ని స్వీకరించి చూస్తే బిగ్‌బాంగ్ జరిగి, ప్రకృతిసృష్టి 10-43 సెకండ్లలో మొదలయ్యింది. ఖగోళంలో సెకండ్‌కు 186000 మైళ్ళ వేగంతో కాంతి పయనిస్తుందని గుర్తుంచుకోవాలి.

మొట్టమొదట విశ్వశక్తులలో గురుత్వాకర్షణశక్తి బొడ్డు తెంచుకొని వేరయ్యింది.

రెండోదశలో స్ట్రాంగ్‌ఫోర్స్ వచ్చింది. అప్పటికి అణువులు యింకా ఏర్పడలేదు.

అణుకేంద్రాలను కలిపివుంచే శక్తి ప్రకృతిలో సిద్ధమయిందన్న మాట. స్ట్రాంగ్ ఫోర్స్ వేరుకావడంలో విశ్వ విస్తరణ వేగం పెరిగింది. అప్పటినుండీ పరస్పరం విశ్వంలో ఈ విస్తరణ సాగుతూనే వుంది.

తరువాత దశలో క్వార్కులు, వ్యతిరేక క్వార్కులు బయలుదేరి పరస్పరం తారసిల్లి హరించిపోయాయి. పదార్థానికి తొలిదశ ఈ క్వార్క్ మాత్రమే. అలా తారసిల్లగా అదనంగా వున్న క్వార్కుల వలన విశ్వపదార్థం రూపొందింది. ఇందులోనే ఎలక్ట్రానులు, పార్టికల్స్ వున్నాయి. బిలియన్ క్వార్కులు ఢీకొంటే అదనంగా ఒక్క క్వార్క్ మిగిలి అలాంటివన్నీ కలసి పదార్థంగా వచ్చాయి.

తరువాత దశలో విద్యుదయస్కాంతశక్తి ఆకర్షణ వికర్షణ గలది విడిపోయి బయటపడింది. ఈ లక్షణం ఫొటాన్లలో వుంది.

చివరగా రేడియో యాక్టివ్ ఒకే చూపే వీక్‌ఫోర్స్ (అణుధార్మికశక్తి) విడివడింది. దీనివల్లనే సూర్యరశ్మి మనకు వస్తున్నది.

విశ్వం చల్లబడేకొద్దీ క్వార్కుల నుండి ప్రోటానులు, న్యూట్రాన్లు వచ్చాయి. ఇంకా చల్లబడగా అణువులు రూపొందాయి. అలావున్న విశ్వపరిణామంలో ఎక్కడబట్టినా శక్తి (ఎనర్జీ) ప్రాధాన్యతే వుండేది. పదార్థ విజృంభణ ఆ తరువాతే వచ్చింది. చల్లదనం ఎక్కువ అవుతుంటే గురుత్వాకర్షణశక్తికి మూలంగా పదార్థం ఆసరా యిచ్చింది. పదార్థం ఘనీభవించి వివిధ రూపాలు దాల్చింది. పదార్థంలో 99 శాతం అంధకారమయం అని మరచిపోరాదు.

విశ్వం విస్తరణ చల్లారుతుండడం సాగిపోగా పదార్థంకు విద్యుదయస్కాంతశక్తి భిన్నమార్గాలు అవలంబించాయి. హైడ్రోజన్, హీలియం, లిథియం అణువులు ఏర్పడేటందుకు వీలుగా ఎలక్ట్రాన్లను నూక్లి వశపరచుకుంది. అప్పటినుండే విశ్వం కనిపించసాగింది. వెలుగు (ప్రోటాన్లు) యధేచ్ఛగా విహరించింది. విశ్వంలో వుండే ఈ ప్రోటాన్లనే మైక్రోవేవ్ రేడియేషన్ అంటున్నాం.

కోబ్ టెలిస్కోపు ద్వారా విశ్వంలో మైక్రోవేవ్ రేడియేషన్ అలల్ని పదార్థం తొలుత ఏర్పడిననాటి స్థితిని చూడగలుగుతున్నారు.

పాలపుంతలు ఏర్పడడం, గురుత్వాకర్షణ వలన ఈ పరిస్థితి కొనసాగడం దీని వలన క్వాసార్లు, నక్షత్ర సముదాయాలు తలెత్తడం విశ్వపరిణామంగా పేర్కొన్నారు. విశ్వవిస్తరణ మాత్రం సాగిపోతూనే వుంది.

(ఖగోళశాస్త్రంలో ఈ పరిశోధనల వెనుక చాలా కృషి వుంది. హేతువాదులకు అర్థం కావడానికి వీలుగా, సాధ్యమయినంత సులభంగా చెప్పే ప్రయత్నంలో అధునాతన విషయాల్ని యిలా అందిస్తుంటాం. అందులో ప్రతి చిన్న విషయానికి పెద్ద వివరణ కావాలి.)

***- హేతువాది, ఏప్రిల్, మే, జూన్ 1994***

# ఈనాటి సైన్సు విశేషాలు

(సైన్సు చాలా సుందరమైన, అందమైన అద్భుత విషయాలు కనుగొన్నది. అవి ప్రాథమిక దశ నుండి పిల్లలకు చెప్పాలి. తెలియనివి చెప్పకూడదు. అబద్ధాలు అసలే చెప్పరాదు. నమూనాగా కొన్ని సైన్సు సత్యాలు ఇన్నయ్య అందిస్తున్నారు.)

## మనం ఒకచోట నిల్చుంటే, మన వేగం ఎంత?

కదలకపోవడం అనేది తరచుగా వాడే మాట అయినా, అది వాస్తవమా?

భూమధ్యరేఖ వద్ద మనం గంటకు వెయ్యిమైళ్ళ వేగంతో భూమితో పాటు తిరుగుతాం. కర్కాటక, మకరరేఖల వద్ద కొంచెం తక్కువగా తిరుగుతాం.

సూర్యునిచుట్టూ భూమి గంటకు 67 వేల మైళ్ళ వేగంతో, తిరుగుతుంది, అందులో మనమూ వున్నాం!

పాలపుంత చుట్టూ సూర్యుడు గంటకు 13 లక్షల మైళ్ళ వేగంతో తిరుగుతుంది. మనమూ అందులో భాగమే.

మనం కదిలితే, ఈ వేగాలకు అది కలుపుకోవాలన్నమాట.

## క్షణాలలో సమాచారం ఎలా సాధ్యం

ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా క్షణాల మీద మనకు ఎలా తెలుస్తున్నది?

పత్రికలు, రేడియోలు, టెలివిజన్, ఫోను, టెలిప్రింటర్ మనకు అందించే సమాచారానికి నేడు శాటిలైట్సు (కృత్రిమ ఉపగ్రహాలు) తోడ్పడుతున్నాయి. ఇవి ఆకాశంలో ఆయా దేశాల వారు నెలకొల్పారు.

భూమధ్యరేఖపైన 22 వేల 300 మైళ్ళ ఎత్తున ఆకాశంలో శాటిలైట్ ఏర్పరిస్తే భూమి తిరిగినట్లే అదికూడా తిరుగుతుంది కనుక, మన దృష్టిలో "స్థిరంగా" వున్నట్లే. ఆర్థర్ సి క్లార్క్ 1940లో చెప్పిన యీ విషయాన్ని 1964లో మొదట అమలుపరచారు. నేడు వందలాది శాటిలైట్లు ఆకాశంలో నెలకొల్పారు. ఒక్కొక్క శాటిలైట్ ఒకే సమయంలో 120000 టెలిఫోన్ కాల్స్ అందించగలుగుతుంది. అలాగే టెలివిజన్ ప్రసారాలు కూడా! గురుత్వాకర్షణ ఆధారిత కృత్రిమ ఉపగ్రహాలు సంకేతాలను పంపించడంలో తోడ్పడుతున్నాయి.

## తప్పించుకోలేని శక్తి

భూమిపై మనం ఎక్కడికెళ్ళినా గురుత్వాకర్షణ తప్పదు.

తలుపులు మూసినాసరే, ప్రతిచోటా యిది పనిచేస్తూనే వుంటుంది.

మనం పడిపోకుండా అట్టిపెట్టేది గురుత్వాకర్షణే!

గురుత్వాకర్షణ తరంగాలను యింకా పరిశోధనాలయంలోకి తేలేకపోయాం!

## గతాన్ని చూడగలమా

మనం చూచే నక్షత్రాలు, సూర్యుడు పాలపుంత అన్నీ గతంలోవే.

8 నిమిషాల క్రితం వున్న సూర్యుడినే మనం చూడగలుగుతున్నాం.

మనం చూచే నక్షత్రాలు కోట్లాది సంవత్సరాల క్రితంలోనివే.

వెలుగు సెకండుకు 186282 మైళ్ళ వేగంతో ప్రసరిస్తుంటే అలా చూడగలుగుతున్నాం.

## మనం మోసే బరువు ఎంత?

మనం ఒకచోట కదలకుండ కూర్చుంటే ఎంత బరువు మోస్తున్నట్లు?

వింత ప్రశ్నగా వుంది గదూ! వాస్తవానికి 10 టన్నుల బరువు మనపై పడుతున్నది.

భూమిపై వున్న గాలి చదరపు అంగుళానికి 14.7 పౌండ్ల వత్తిడి కలిగిస్తుంది. మన శరీరంపై అన్ని కోణాల నుండి ఈ గాలి బరువు వుంటుంది.

మనలోని అంగాలు, కణాలు అదేశక్తితో మనపై పడే గాలి శక్తిని వెనక్కు తిప్పికొడుతుంటాయి. కనుకనే 10 టన్నుల బరువుతో పడేగాలికి మనం అణగిపోవడంలేదు.

గాలిలేని శూన్యంలో మనిషిని పెడితే పటాపంచలైపోతాడని తెలుసుకోండి!

## పోలరైజ్డ్ అద్దాల శక్తి

ప్లాస్టిక్ గ్లాస్‌తో చేసిన కళ్ళజోడు పెట్టుకుంటే చాలా మార్పు జరుగుతుంది. ప్లాస్టిక్‌లో ఏటవాలు కణాలు (elongated molecules) కలిసి రంధ్రం వలె ఏర్పడతాయి. ఈ రంధ్రాలు అడ్డంగా అమర్చితే అడ్డంగా ప్రసరించే తరంగాలనే పోనిస్తుంది.

రైట్ కోణంలో అమర్చిన రెండు ఫిల్టర్ల గుండా వెలుగు ప్రసరించదు. అంటే ఒకటి అడ్డంగా, మరొకటి నిలువుగా అమర్చిన గ్లాస్ ద్వారా వెలుగు తరంగాలను పోనివ్వదు.

## స్థిరత్వంలో చలనం

కదలకుండా పడివున్నదనుకునే ఏ వస్తువులోనైనా చలనం వుంటుంది. మనం చూచేవాటికీ, లోన జరిగేదానికీ చాలా తేడా వుంది.

అణువులు, రేణువులు, పరమాణువులు, నిరంతరం చలనంలో వుంటాయి. అది మనం కంటితో చూడలేం. న్యూక్లియస్, ఎలక్ట్రాన్లు, అణువులు కదులుతూనే వుంటాయి. ఘన, ద్రవపదార్థాలలోని అణువులు నిరంతరం కదులుతూనే వుంటాయి. వాయు పదార్థాలలో ఇక చెప్పనక్కరలేదు.

కదలకుండా వున్నట్లు కనిపించే లోహాలలో గంటకు 20 లక్షల మైళ్ళ వేగంతో ఎలక్ట్రాన్లు చలిస్తుంటాయి!

## వైరస్ అంటే

వైరస్ వల్ల ఫ్లూ, ఆటలమ్మ, మసూచి వంటి తీవ్ర జబ్బులు వస్తాయి.

సూక్ష్మజీవిలో పదోవంతు పరిమాణం వుండే వైరస్ ప్రాణి కాదు. పెద్ద జీవాణువుల చుట్టూ వుండే ప్రొటీన్ వంటివి. జీవాణువుతో వైరస్ తారసిల్లినప్పుడు కణాల ఉత్పత్తి విధానం వైరస్‌లో ఏర్పడి ఇతర కణాలకు ప్రాకుతుంది.

సూక్ష్మక్రిముల వలన టైఫాయిడ్, క్షయ, న్యుమోనియా, కోరింతదగ్గు, సిఫిలిస్, గనేరియా, కుష్టు, ధనుర్వాతం వస్తాయి.

వైరస్‌కూ బాక్టీరియాకు యీ తేడా వుందని గ్రహించాలి.

## సూక్ష్మకణాలు : (జీవాణువులు)

సూక్ష్మకణాలు కంటికి కనిపించవు. అయినా ఒక్కొక్క జీవకణంలో 200 బిలియన్ అతిసూక్ష్మ కణాలు (మాలెక్యూల్స్) వుంటాయి. అంగనిర్మాణానికి యివి సాధనాలు.

జీవకణాలు శక్తినిస్తాయి. ఇవి ఎమినోయాసిడ్స్ నుంచి ప్రొటీన్లు తయారుచేస్తాయి. జీవకణాల్ని విభజించి, మరిన్ని జీవకణాల్ని రూపొందిస్తాయి.

అన్ని జీవులకూ, ప్రాణానికీ ఆధారం జీవాణువులే (డై ఆక్సిరైబోన్యూక్లిక్ యాసిడ్-డి.ఎన్.ఏ.)

జీవాణువును విప్పిచూస్తే నిచ్చెన మెట్ల వలె కనిపిస్తుంది. అందులో రెండు జతల కలయికతో నాలుగు రసాయన పదార్థాలుంటాయి. అడినైన్, థైమైన్, గ్వానైన్, సైటోసైన్ అనే కోడ్ వరుసనే జన్యువు (జీవి) అంటాం. ఇందులో అడినైన్, థైమైన్ ఒక జతగా, గ్వానైన్, సైటోసైన్ మరో జతగా కలుస్తాయి. వివిధ ప్రొటీన్లకు వీటి కలయిక ఉపకరిస్తుంది.

## జీవాణువుల రహస్యం

జీవాణువుల సంకేతాలు విప్పుకుంటే రహస్య సంకేతం గ్రహించవచ్చు. నాలుగు

జీవాణువులు తగిన రీతిలో కలసి, అచ్చుగుద్దినట్లుగా రూపొందుతాయి. అణువు విభజించుకొనే ముందు తగిన రీతిలో రూపొందే కొత్త అణువుకు తగ్గట్లు సిద్ధమౌతుంది. ప్రొటీన్ తయారుగావడానికి ఒక జన్యు అణువు విప్పుకొని, తాత్కాలిక నమూనా రూపొందుతుంది.

మనిషిలో జన్యు అణువు ఎంజైమ్‌కు తారసిల్లినప్పుడు, ఇన్సులిన్ తయారయ్యేట్లుగా జన్యు అణువును తెగగొడుతుంది. జన్యు అణువుల ప్రవంతిలో ఇన్సులిన్ జొప్పించే తీరులో ఇతర ఎంజైమ్‌లు చిన్న పేగులలోని సూక్ష్మజీవులతో కలుస్తాయి.

ఇకోలి లక్షలాదిగా తనను పోలిన జీవాణువులను తయారుచేసుకుంటుంది. అమినో యాసిడ్ అణువుల్ని ఇన్సులిన్‌గా తయారుచేయడం ఆశ్చర్యకరంగా సాగుతుంది.

## సూక్ష్మ అణువుల అనంతశక్తి

పరమాణువుల ప్రవర్తన జాగ్రత్తగా పరిశీలిస్తే, గురుత్వాకర్షణ శక్తి భారం వలన యివి మూడు విచిత్ర కలయికల్ని రూపొందిస్తున్నట్లు తెలుసుకున్నారు. అందులో పల్సార్ (న్యూట్రాన్ నక్షత్రం) ఒకటి. కాగా, బ్లాక్ హోల్ మరొకటి. ఈ రెండూగాక, వైట్‌డ్వార్ఫ్ మరొకటి. సూక్ష్మాణువుల మధ్యగల ఖాళీప్రదేశాన్ని కోల్పోవడం వల్ల యివి ఏర్పడడం ఆశ్చర్యకరంగా వుంటుంది.

వైట్ డ్వార్ఫ్‌లో సాంద్రత ఉక్కుకంటే 10 వేల రెట్లు ఉంటుంది. ఒక చంచా బరువు 10 టన్నులు వైట్ డ్వార్ఫ్‌లో వుంటుంది. సూర్యుని వంటి నక్షత్రం తగులబడి, అణగిపోగా యిది జరుగుతుంది.

సూర్యునికంటె 1.4 రెట్ల సాంద్రతగల తార అణగారిపోతే, దాని గురుత్వాకర్షణ శక్తిని అందులోని ఎలక్ట్రాన్లు ఏ మాత్రం అడ్డుకోలేవు. ప్రొటాన్లు న్యూక్లియస్‌తో మిళితమై అణగిపోతాయి. ఘనపు సెంటీమీటర్ పరిమాణం 10 మిలియన్ టన్నుల బరువు వుంటుంది. ఆ న్యూట్రాన్ తారలు తిరుగుతూ రేడియో పల్స్ విడుదలచేస్తాయి.

## బ్లాక్ హోల్

సూర్యుడికంటె మూడు రెట్లున్న నక్షత్రంలో గురుత్వాకర్షణశక్తి న్యూట్రాన్ తారకూడా ఆపలేనంతగా వుంటుంది. అలాంటి గురుత్వాకర్షణ పదార్థన్నంతటినీ అనంత సొరంగంలోకి లాగేస్తుంది. అందులో నుండి వెలుతురుకు సైతం తప్పించుకొనే దారిలేదు!

బ్లాక్ హోల్‌లో భూమి అంత పదార్థం ఒక ముత్యపు పరిమాణంలో వుంటుంది. మొత్తం పరిమాణం అనూహ్యం.

***- హేతువాది, నవంబరు 1995***

# శాస్త్రీయ పద్ధతి వినియోగం - దుర్వినియోగం

ఇండియాలో శబ్ద ప్రమాణానికి విలువ ఎక్కువ. వేదాలు శబ్ద ప్రమాణాలే. వాటిని 'అపౌరుషేయాలు' అన్నారు. (ఎక్కాల పుస్తకం కూడా అపౌరుషేయమే) ఈ శబ్ద ప్రమాణాన్ని రుజువుకు పెట్టరు. అదంతా నిజమేనని నమ్ముతారుగూడా. బలీయమైన ఈ సంప్రదాయం బాగా నాటుకపోయినందువలన మనకు శాస్త్రీయ పద్ధతి బాగా అలవాటు కాలేదు.

అచ్చులో ఉన్నదంతా నిజమని నమ్మే మరో సంప్రదాయం గూడా ఉన్నది. చదువుకున్నవారు మనదేశంలో 30% కాగా, అందులో వచ్చీరాని భాషాజ్ఞానం కలవారే ఎక్కువగా ఉన్నారు. పత్రికలలో వచ్చే అశాస్త్రీయ విషయాలు, అభూత కల్పనలు, వారఫలాలు, సన్యాసుల బోధనలు నమ్మేవారున్నారు.

అధికార ప్రమాణం కూడా మరొక ప్రమాదకారిగా పరిణమించింది. పండితులూ, కళాకారులూ, శాస్త్రజ్ఞులు వారి పరిధిలో నిపుణులు కావచ్చు. కాని, ఒక రంగంలో పేరు తెచ్చుకున్న వ్యక్తి ఏం మాట్లాడినా అతని, పరిధికాని విషయాలను చెప్పినా, ప్రమాణంగా తీసుకోటం కనిపిస్తున్నది. సూరిభగవంతం ఫిజిక్స్‌లోని ఒక విభాగమైన స్ఫటికాలపై పరిశోధన చేసి ప్రమాణాలను సాధించాడనుకొందాం. ఆయన తనకు వచ్చిన కీర్తినీ, పేరును వినియోగించుకొని సత్యసాయిబాబా భక్తుడుగా ప్రచారం చేసాడు. నమ్మేవారు ఆయన్ను భక్తుడుగాగాక, శాస్త్రజ్ఞుడుగా గౌరవించి, అంతటి శాస్త్రజ్ఞుడే చెపుతున్నప్పుడు మనవంటి వారిదేమున్నది? అని సాష్టాంగపడతారు. ఇలా వ్యక్తుల మాటల్ని సందర్భసహితం కాకపోయినా ప్రమాణంగా స్వీకరిస్తున్న ప్రమాదం భిన్నరంగాలలో ప్రబలి ఉన్నది. శాస్త్రీయ పద్ధతిని అన్వయించక పోవటం వలన ఈ చిక్కు వచ్చింది. సైన్సులో గూడా ఇలాంటి దోషాలు లేకపోలేదు. ఉదాహరణకు, ఎలక్ట్రాన్, ఖగోళశాస్త్రం, అలోపతి, ప్రజాస్వామ్యం అనేవి ఆయా రంగాలలో శాస్త్రీయ పద్ధతికి నిలబడే అంశాలు. ఇందుకు భిన్నంగా జ్యోతిష్యం, ఆయుర్వేదం, హోమియోపతి, దేవుడు, మార్క్సిజం అనేవి అశాస్త్రీయాలు. అనగా రుజువుకు నిలబడవు. నమ్మకం వీటికి ప్రధానం. ఇదే విధంగా సైన్సు పరిధిలో అనేక అశాస్త్రీయ విషయాలు కొందరు ఆకర్షణీయంగా ప్రచారం చేస్తున్నారు. అతీంద్రియ శక్తులు, మరణించిన వారితో మాట్లాడటం, పునర్జన్మ, సంఖ్యకు బలం ఉంటుందనీ, కంటిచూపుతో దూరాన ఉన్న వస్తువును కదిలించవచ్చుననీ, మొదలైనవి ఎన్నో శాస్త్రం పేరిట ప్రచారంలోకి వచ్చాయి. వీటిలో ఏదీ క్లిష్టమైన పరీక్షకు నిలబడదు. మిడిమిడి జ్ఞానంతో అన్వయించే శాస్త్రీయ పద్ధతి వలన రుజువులు లభించినట్లు కనిపించినప్పటికీ, సరైన పద్ధతిలో ఇవి రుజువు చేయజాలనివే.

శాస్త్రజ్ఞులు సహితం పరిశీలన, వివేచన ఆధారంగా ఒక్కొకసారి కొన్ని నమ్మకాలను ఏర్పరచుకొంటారు. కుళ్ళిపోతున్న మాంసం నుండి క్రిమికీటకాలూ, ఈగలు తదితర సూక్ష్మజీవులు

పుట్టుకొస్తాయని ఒకప్పుడు నమ్మేవారు. నిర్జీవ పదార్థం నుండి జీవం పుట్టిందని కూడా కొంతకాలం నమ్మేవారు. 17, 18, 19 శతాబ్దాలలో ఇలాంటి నమ్మకాలు బాగా విస్తరించి ఉండేవి. సూక్ష్మదర్శిని (మైక్రోస్కోప్) 19వ శతాబ్దం మధ్యలోగాని కనిపెట్టలేదు. సూక్ష్మజీవులు ఉన్నాయని కనుగొన్న తరువాత, నిర్జీవ పదార్థం నుండి దానంతటదే జీవం పుడుతుందనే నమ్మకం తొలిగిపోయింది. లూయిపాశ్చర్, ఎఫ్.ఎ. పోచే ఈ విషయాలపై పరిశోధనచేసి పరస్పర విరుద్ధమైన నిర్ణయాలకు వచ్చారు.

తమ పరిశోధన శాస్త్రీయమైనదే అని ఇద్దరూ భావించారు. పరిశీలన, పరిశోధన, తర్కాన్ని ఇరువురూ వినియోగించుకున్నారు. కాని పరిశోధన చేసేటప్పుడు అందుకు వినియోగించే పరికరాలు శుభ్రంగా ఉన్నాయా, లేదా, గాలిలో ఉండే ధూళి, సూక్ష్మజీవుల ప్రభావం పరికరాలపై పడకుండా ఎఫ్.ఎ. పోచే జాగ్రత్త వహించలేకపోయాడు. ఇందుకు భిన్నంగా లూయిపాశ్చర్ పరికరాలను వేడినీటిలో స్టెరిలైజ్ చేసి జాగ్రత్త వహించాడు. మిగిలినదంతా ఇరువురూ, శాస్త్రీయ పద్ధతిలోనే చేశారు. కాని ప్రధానమైన ఈ తేడా వలన నిర్జీవం నుండి జీవం పుట్టుకొస్తున్నట్లు పోచేకు తేలగా, అది అబద్ధమని పాశ్చర్ రుజువు చేసాడు. చివరకు పాశ్చర్ చేసిందే సరైనదని తేలింది. సాక్ష్యాధారాలు నిర్దుష్టంగా కనుగొనటం వ్యయప్రయాసలతో కూడినపని. అందుకు ఓర్పు, జాగ్రత్త, ప్రశ్నించే స్వభావం, క్లిష్టపరీక్షకు నిలబెట్టే ధోరణి ఉండాలి. ఈ దృష్ట్యా మానవులపై శాస్త్రీయ పరిశోధన చేయటం జటిలమైన సమస్య. అందువలన శాస్త్రీయ పద్ధతిలో మానవులకు సంబంధించి మూడు విధాలైన రీతులను పాటిస్తున్నారు. ఒకటి 'కోహార్ట్' అధ్యయనం. కొందరు వ్యక్తులను చాలాకాలంపాటు పరిశీలించి వారి అలవాట్లకూ, ఆరోగ్యానికీ ఉన్న సంబంధాన్ని గమనించటం ఈ పద్ధతిలో ఉన్నది. తమలపాకు నమిలేవారికి గొంతు కేన్సర్ వస్తుందా? అనే పరిశీలన చేయాలంటే ఇటువంటి పద్ధతిని అనుసరిస్తున్నారు. 'క్రాస్ సెక్షన్ సర్వే' మరొక పద్ధతి. ఇందులో కొందరు వ్యక్తులను ప్రస్తుత స్థితిలో ఎలా ఉన్నారో చూచి, దాన్నిబట్టి వారి లక్షణాలనూ ఆరోగ్యస్థితిని పోల్చిచూడటం జరుగుతున్నది. లావుగా ఉన్నవారికి, గుండె జబ్బులు వస్తాయనే లక్షణాన్ని ఇలా పరిశీలించటం జరుగుతున్నది. మూడవ పద్ధతి 'కేస్ కంట్రోల్' అధ్యయనం. ఇందులో గతాన్ని ఆధారంగా వ్యక్తుల లక్షణాలు, ప్రస్తుతం ఉన్న స్థితి, గతానికి ప్రస్తుతానికీ ఉన్న సంబంధం చూస్తారు.

శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనల వలన ఉపయోగం ఏమంటే ఒకరు రుజువు చేసినదాన్ని మరే శాస్త్రజ్ఞుడైనా రుజువు చేయవచ్చు. అంటే క్లిష్టపరిస్థితి అనేది బహిరంగ సత్యమన్నమాట. శాస్త్రీయ పద్ధతిలో, క్లిష్ట పరీక్షకు నిలబడిన తరువాత ఎవరైనా నమ్మవలసిందే. మరొక శాస్త్రజ్ఞుడు అది తప్పని రుజువు చేసేవరకూ శాస్త్రీయ సత్యం నిలబడుతుంది. విజ్ఞానంలో ఏదీ శాశ్వతం కాదు. దేనినైనా, ఎప్పుడైనా ప్రశ్నించవచ్చు. న్యూటన్ను, ఐన్‌స్టీన్ ప్రశ్నించాడు. హైజన్‌బర్గ్ వచ్చి ఐన్‌స్టీన్ను తల్లక్రిందులు చేసారు. ఈ విధంగా కాలానుగుణంగా విజ్ఞానపరిధి విస్తృతమవుతున్న కొలదీ, కొత్తవి కనుగొనటం జరుగుతున్నది. పాతవాటికీ చారిత్రక విలువ మాత్రం ఉంటుంది.

శాస్త్రానికి, సాంకేతికానికీ తేడా ఉన్నది. సాంకేతికం శాస్త్రం ఆధారంగా వస్తుంది. ఉదాహరణకు మనం రోజూవాడే రేడియో, టెలివిజన్, టేప్ రికార్డర్లు సాంకేతికపరమైనవి. విద్యుత్-అయస్కాంత తరంగాల గురించి శాస్త్రం పరిశోధించి కనుగొన్నది. అది సిద్ధాంతం. దాన్ని అన్వయిస్తే సాంకేతికమౌతుంది. విద్యుత్-అయస్కాంత తరంగాల అన్వయీకరణే రేడియో. అలాగే ఆటంబాంబు సాంకేతికపరమైనది. పదార్థాన్ని శక్తిగానూ, శక్తిని పదార్థంగానూ పరస్పరం మార్చుకోవచ్చుననేది రుజువైన శాస్త్రీయ సిద్ధాంతం. శాస్త్రం బహుళ ప్రచారంలోకి రాదు. నిపుణులైన కొందరికే ఇది పరిమితం. దీనిని మరికొందరు నిపుణులు సాంకేతికంగా మారుస్తారు. మన నిత్య జీవితంలో ఆటంబాంబు-ఆయుధాలు మొదలైన సాంకేతిక విషయాలను చూస్తున్నాం కనుక, అదే సైన్సు అనుకొని మానవాళిని సైన్స్ నాశనం చేస్తుందని విమర్శిస్తుంటాము. సైన్స్‌ను దుర్వినియోగపరచటం సద్వినియోగం చేయటం అనేది సాంకేతిక శాస్త్రానికి చెందినది. ఈ ప్రధానమైన తేడాను గమనించాలి.

ఆధునిక శాస్త్రీయ పద్ధతిలో ముఖ్యమైన దశలు కొన్ని ఉన్నాయి. పరిస్థితిని పరిశీలించి తదనుగుణమైన విషయాలన్నిటినీ సేకరించటం, ఆ విషయాలాధారంగా అంచనా వేయటం, అంచనాను పరిశీలనకు పెట్టటం. శాస్త్రీయ పద్ధతిలో క్రొత్త ప్రతిపాదన రుజువుకు నిలబడితే అది కూడా శాస్త్రంలో భాగం అవుతుంది. ఐన్‌స్టీన్ గురుత్వాకర్షణకు కాంతికిరణాలు గురిఅవుతాయని, అవి శక్తిని మోసుకెళుతుంటాయనీ, అందువలన నక్షత్రాలనుంచి వచ్చే కాంతి కిరణాలు సూర్యుని గురుత్వాకర్షణకు ఒంగుతాయని సిద్ధాంతీకరించాడు. ఇది వాస్తవమేనని శాస్త్రజ్ఞులు పరిశోధన ద్వారా రుజువు చేసారు.

## మార్క్సిజం శాస్త్రపద్ధతికి నిలబడదు

సామాజిక విషయాలలో కూడా తరచు శాస్త్రీయ పద్ధతిని గురించి వింటుంటాం. మార్క్సిజం శాస్త్రీయమైన సిద్ధాంతమని ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని చర్చిద్దాం. మార్క్స్, ఏంగిల్స్ శాస్త్రజ్ఞులు కారు. 19వ శతాబ్దంలో ఉన్న శాస్త్రాలను చదివి తదనుగుణంగా సిద్ధాంతీకరణ చేసారు. వారి అంచనాలేవీ క్లిష్టపరీక్షకు నిలబడలేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో కమ్యూనిస్టు విప్లవం వస్తుందనీ, కార్మిక నాయకత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఇది ఎక్కడా జరగలేదు. ఇందుకు భిన్నంగా రష్యా, చైనా వంటి దేశాలలో కమ్యూనిస్టు విప్లవం వచ్చింది. కార్మిక నియంతృత్వం ఏర్పడలేదు. కమ్యూనిస్టు సమాజంలో పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, రాజ్యం హరించిపోతుందనీ మార్క్స్ చెప్పాడు. అది ఎప్పటికి జరుగుతుందో చెప్పలేదు. కమ్యూనిస్టు దేశాలలో ఈ ధోరణి అమలు జరగటం లేదు. మార్క్సిజం విఫలం కావటానికి పరిస్థితులపై నెపం వేస్తున్నప్పటికీ, అసలు ఎలాంటి శాస్త్రీయ పరీక్షకూ నిలబడే అవకాశం లేదు. మార్క్స్, ఏంగిల్స్ అనంతరం సాపేక్ష సిద్ధాంతం - క్వాంటమ్ సిద్ధాంతం, పార్టికల్ సిద్ధాంతం, జెనెటిక్స్ (జన్యుశాస్త్రం) వచ్చాయి. వీటన్నిటికి ఆధారాలు రుజువయ్యాయి.

ఇందులో ఏ ఒక్కటినీ కమ్యూనిస్టులు తమ సిద్ధాంత రీత్యా పరీక్షకు పెట్టలేదు. పైగా రుజువైన ఈ సిద్ధాంతాలను సోవియట్ యూనియన్ నిరాకరించింది. గతి తార్కిక భౌతికవాదంతో సహా అన్నీ పోతాయనే దృష్టితో సాపేక్ష సిద్ధాంతాన్ని స్టాలిన్ చనిపోయేవరకూ సోవియట్ రష్యాలో ప్రవేశింపనివ్వలేదు. ఆధునిక జన్యుశాస్త్రాన్ని కూడా ఆమోదించని లైసెంకో చెప్పిన ప్రచార ధోరణిని బలపరిచారు. న్యూ క్వాంటమ్ సిద్ధాంతాన్ని కూడా స్టాలిన్ చనిపోయే వరకూ విమర్శిస్తూనే ఉన్నారు. ఇప్పుడిప్పుడే రుజువైన ఈ సిద్ధాంతాలను సోవియట్ యూనియన్ వంటి కమ్యూనిస్టు దేశాలు తప్పనిసరిగా ఆమోదిస్తున్నాయి. అయితే ఇన్నాళ్ళూలేని కొత్త జాడ్యం ఒకటి కమ్యూనిస్టు దేశాలలో ప్రబలుతున్నది. అతీంద్రియ శక్తులను నమ్మటం, చూపుతో ఇనుప పరికరాలను వంచటం వంటి అశాస్త్రీయ విధానాలపై అసక్తి చూపుతున్నారు. ఈ విధంగా మార్క్సిజంలో వేసిన అంచనాలు శాస్త్రీయ పద్ధతికి నిలబడవు గనుక వాటిని నిరాకరించవలసి వుంటుంది. అయితే మన కమ్యూనిస్టులు భారతదేశంలో సైన్సు జోలికి, ముఖ్యంగా శాస్త్రీయ పద్ధతికి పోవడం లేదు. తాము నమ్మిన సిద్ధాంతాలకు శాస్త్రీయ పద్ధతిని అన్వయించటం లేదు. మతపరమైన మూఢ నమ్మకాలకూ - మార్క్సిస్ట్ మూఢనమ్మకాలకూ తేడా లేదు. శాస్త్రీయ పద్ధతి దృష్ట్యా సైన్సు పేరిట జరుగుతున్న కొన్ని మోసాలను బయటపెట్టటానికి అమెరికాలో ఒక సంఘాన్ని ఏర్పరచి నిరంతర పరిశోధన చేస్తున్నారు. తప్పుడు వ్రాతలగుట్టును బయటపెడుతున్నారు. మనకు కూడా ఇలాంటివి చాలా అవసరం.

*- హేతువాది, మే 1986*

**ఆధునిక సైన్స్ కొలత!**

# న్యూటన్ నుండి ఐన్‌స్టీన్ వైపుకు

మనం నిత్యజీవితంలో ఆకాశం (ప్రదేశం), కాలం అనే మాటల్ని తరచు వాడుతుంటాం. తత్వంలోనూ యివి తరచు వస్తాయి. కాని సైన్స్‌లో ప్రదేశానికి, కాలానికి అర్థం వేరు. ఇన్నాళ్ళు న్యూటన్ ప్రపంచంలో అలవాటుపడిన మనం యిప్పుడు ఐన్‌స్టీన్ విశ్వంలో అడుగుపెట్టాం. మన భావాలెన్నో మార్చుకోవలసి వస్తున్నది. ఖగోళశాస్త్ర పరిశోధనలు మన సంప్రదాయ ఆలోచనల్ని పూర్తిగా మార్చివేస్తున్నాయి. ఆధునిక భావాల ప్రభావాన్ని తెలుసుకునే ముందు మన సంప్రదాయ సైన్స్ ఏమి చెప్పిందో గమనిద్దాం.

న్యూటన్ గతిసూత్రాలను రూపొందిస్తూ ప్రదేశాన్ని కూడా ఒక ద్రవ్యంగా పరిగణించి, దాని ప్రభావం పదార్థంపై వుంటుందన్నాడు. పదార్థం వుంది, అది ప్రదేశంలో పయనిస్తుంది. ఈథర్ అనేది వుంది, పదార్థం ఈథర్‌లో పయనిస్తుంది, అన్నాడు.

కోపర్నికస్ కనుగొనే వరకూ భూమి నిలకడగా వుండేదనీ, సూర్యచంద్ర నక్షత్ర గ్రహాలన్నీ

భూమి చుట్టూ తిరుగుతాయనీ అనుకున్నారు. సూర్యుని పరిధిలో వున్న మనం కేంద్ర స్థానంలో లేమని కోపర్నికస్ తేల్చి చెప్పాడు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుంది. మానవుడి మతపరమైన దైవపరమైన అహం దెబ్బతిన్నది. అయినా భూమి కదలనట్లుంటుంది. సూర్యుడు, చంద్రుడు మాత్రమే కదులుతున్నట్లనిపిస్తుంది.

కదలికను గురించి అధ్యయనం చేసిన న్యూటన్, ఏదో ఒక శక్తి వలన కదలిక జరుగుతుంటుందన్నాడు. గురుత్వాకర్షణ వలన యాపిల్ భూమిపై పడుతుంది. ఒక వస్తువును కొంత శక్తితో విసిరితే ఆ మేరకు అది వెళ్ళి, శక్తి అయిపోగానే ఆగిపోతుంది. న్యూటన్ చెప్పిన సిద్ధాంతాలలో గురుత్వాకర్షణ అతిముఖ్యమైనది. గ్రహాల చలనం కూడా వీటి ప్రకారం వివరించాడు. అయితే గురుత్వాకర్షణ కేవలం ఆకర్షిస్తుందే గాని, తిప్పికొట్టదు. విద్యుదయస్కాంతంలో ఆకర్షణ - తిప్పికొట్టడం రెండూ వున్నవి. న్యూటన్ సిద్ధాంతం వలన వచ్చిన చిక్కులు జేమ్స్‌క్లర్క్‌మాక్స్‌వెల్ తీర్చాడు. క్షేత్రాన్ని కనుగొనడమే యిందుకు కారణం. ఆ తరువాత విద్యుదయస్కాంత తరంగాలు కనుగొని యింకా పురోగతి సాధించారు.

ఈథర్‌లో భూమి పయనిస్తుందని న్యూటన్ నమ్మాడు. కాంతి కూడా ఈథర్‌లో పరిమిత వేగంతో పయనిస్తుందని మాక్స్‌వెల్ నమ్మాడు. ఈథర్ కొరకు పరిశోధనలు చేసి చూడగా అలాంటిదేమీ లేదని మైకేల్‌సన్ (1852-1931) మోర్లే (1838-1923) పరిశీలనలో తేలింది. ఈథర్‌ను కనుగొనడానికి కాంతి కిరణాలను వాడారు. ఈథర్ వుంటే కాంతి కిరణాల పయనంలో తేడా రావాలి. ఏటవాలుగా కిరణాలను వెనక్కు, ముందుకు ప్రయోగించి చూచారు. ఇదెలాగంటే నదిలో ఒకరు ఆ ఒడ్డుకూ యీ ఒడ్డుకూ యీదారనుకోండి. అదే సమయంలో మరొకరు నదీ ప్రవాహానికి కొంతదూరం వాలుగా, కొంతదూరం ఎదురీదారనుకోండి. నదికి అడ్డంగా యీదిన వ్యక్తి అటూ యిటూ కూడా కొంతమేరకు ప్రవాహం వెంట పోతాడు గనుక సులభంగా యీదుతాడు. ఎదురీదిన వ్యక్తి బాగా జాప్యం చేయక తప్పదు. ప్రవాహం అతన్ని ఆటంకపరుస్తుంది. అలాంటి తీరులో కాంతి కిరణాలను ప్రయోగిస్తే తేడా కనిపించలేదు. నదీ ప్రవాహం వలె విశ్వంలో ఈథర్ ప్రవాహం వుంటే కాంతికిరణాలలో తేడా వచ్చేదే. న్యూటన్ నమ్మిన ఈథర్ రుజువు కాలేదు. ఈథర్ లేదు గనుక ఎలాంటి రుజువూ దొరకలేదు. కదలకుండా వుండే విశ్వంలో ఖాళీ ప్రదేశం గుండా పయనించే పదార్థవేగాన్ని కొలవగలమని యిన్నాళ్ళూ న్యూటన్ నమ్మినదంతా సరికాదని తేలిపోయింది.

ఏదో ఒక పదార్థంతో పోల్చి చూచి మాత్రమే మరొక వస్తువు వేగాన్ని చూడగలమని, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (1879-1955) తన ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతం ద్వారా చెప్పాడు. పోల్చకుండా కేవలం వేగం కనుగొనడం అసాధ్యం. ఐన్‌స్టీన్ చెప్పిన కొత్త సిద్ధాంతం ప్రకారం కాంతివేగం ఎక్కడైనా ఒకటే. అంటే భూమిమీద వున్నా, చంద్రుడిమీద వున్నా, రాకెట్‌లో పయనిస్తున్నా, ఎవరు కొలిచినా కాంతివేగం ఒకటే. న్యూటన్ చెప్పిన ప్రదేశం - కాలం దోషపూరితాలని, స్థిరమైన ప్రదేశం, కాలం

లేవని స్పష్టపడింది. విశ్వమంతటా కాలం ఒకే తీరులో, స్థిరంగా వుంటుందని న్యూటన్ చెప్పింది కూడా సరికాదని స్పష్టపడింది.

కవల పిల్లల్ని ఉదాహరణగా తీసుకొని చూద్దాం. ఒకరు భూమి పైన వున్నారు. మరొకరు కాంతివేగంతో రాకెట్‌లో సమీప నక్షత్రానికి వెళ్ళి వచ్చారు. వెళ్ళి రావడానికి పట్టిన సమయం రాకెట్‌లో వున్న వ్యక్తికి గంటల్లో వుండగా భూమిపై వున్న వ్యక్తికి సంవత్సరాలు పడుతుంది. తన తోటి కవల కంటె ఎన్నో సంవత్సరాలు చిన్నవాడుగా రాకెట్‌లో ప్రయాణం చేసిన వ్యక్తి తిరిగివస్తాడు! ఇదెలా జరుగుతుంది?

ఇరువురూ పరస్పరం కాంతి కిరణాల ద్వారా చూస్తారు. కాంతి ప్రయాణం చేసే కాలం యెక్కువసేపు పట్టిందంటే దూరం అంతగా వుందన్న మాట. చంద్రుడి నుండి ఒక సెకండ్‌లో కాంతి కిరణం భూమిపైకి వస్తుంది. సూర్యుడి నుండి 8 నిముషాలలో కాంతి భూమిపైకి చేరుతుంది. అంటే 8 నిమిషాల క్రితం సూర్యుణ్ణి మనం చూస్తున్నామన్న మాట. కాని మనం చూచే నక్షత్రాలు యిప్పటివి కావు. కొన్ని సంవత్సరాల క్రితం బయలుదేరిన కాంతికిరణాలు భూమిపైకి చేరేసరికి మనం నక్షత్రాలను చూడగలుగుతున్నాం. సెకండుకు 1,86,000 మైళ్ళు పయనిస్తుంటే, మనం 4 కాంతి సంవత్సరాల క్రితం బయలుదేరిన కిరణాల్ని చూస్తున్నామంటే ఎంత దూరాన నక్షత్రం వుందో అంచనా వేయండి. ఇరువురు కవల పరిశీలకుల గడియారాలను పోల్చి చూస్తే తేడా కనిపిస్తుంది. ఇద్దరూ దూరంగా జరిగిపోతుండగా, వారి గడియారాలు నెమ్మదిగా పోతున్నాయనిపిస్తుంది. ఇద్దరూ చేరువ అవుతుంటే గడియారాల వేగం పెరుగుతుంది. కవలల్లో ఒకరు భూమి మీద వుండగా, రెండో వ్యక్తి నక్షత్రం దగ్గరగా కాంతివేగంతో వెళ్ళి వచ్చారనుకోండి. నక్షత్రదూరం పది కాంతి సంవత్సరాలనుకొండి. ఇరువురి గడియారాలు ఒకరితో ఒకరు పోల్చుకుంటే 2 : 3 రెట్లు నెమ్మదిగా సాగినట్లనిపిస్తుంది.

నక్షత్రానికి వెళ్ళి వచ్చిన వ్యక్తి 9.7 సంవత్సరాలకు (రాకెట్ టైం) భూమి మీదకు తిరిగివస్తాడు. 22.2 సంవత్సరాలు భూమి మీద వున్న వారికి గడచిపోతుంది. అంటే భూమి మీద వున్న వ్యక్తి తనకంటె 12.5 సంవత్సరాలు పెద్ద అయినట్లు కనుగొంటాడు. ప్రయాణం చేసిన వ్యక్తి కాంతివేగంతో రాకెట్‌లో పోవడమే యిందుకు కారణం. ప్రయాణం చేసి తిరిగివచ్చిన వ్యక్తి రాకెట్‌లో వేగాన్ని పెంచడం తగ్గించడం, భూమిపై అలాంటి అనుభవం లేకపోవడం విస్మరించరాదు.

భూమిపై వున్న వ్యక్తికి 10 కాంతి సంవత్సరాలు కాగా, రాకెట్‌లో ప్రయాణం చేసే వ్యక్తికి 4.36 కాంతి సంవత్సరాలే అయినట్లుంది. అంటే కాలం కుంచించుక పోయిందన్నమాట. నక్షత్రం స్థిరంగా వుందని భావించి, రాకెట్‌లో పోయే వ్యక్తి కాలాన్ని చూచుకుంటాడు. చలనంలో దూసుకుపోతున్న వ్యక్తికి కాలం కుంచించుకుపోవడమనేది, ప్రదేశపరంగా వుంటుంది. ఈ విషయమై హెన్‌డ్రిక్‌లారెంజ్ (1853-1928), జార్జి ఫిజ్జరాల్డ్ (1851-1901) పరిశోధనలు జరిపి ఫలితాలు వెల్లడించారు.

న్యూటన్ పేర్కొన్న ప్రదేశ-కాల సత్యాలు ఐన్‌స్టీన్ సూచించిన ప్రత్యేక సాపేక్షతా సిద్ధాంతంలో కలసిపోయాయి. ఆ తరువాత 1915లో వచ్చిన సాధారణ సాపేక్షతా సిద్ధాంతంలో ఇవన్నీ మిళితమయ్యాయి. న్యూటన్ గతిసూత్రాలు తప్పు అనం. కాని ఐన్‌స్టీన్ సిద్ధాంతానికి లోబడి పరిమిత సత్యాలుగానే వాటికి విలువ వుంటుంది. విశ్వమంతటికీ అవి చెల్లవన్నమాట. సైన్స్‌లో ఇలా నిరంతర ప్రగతి సాగుతూ వుంటుంది.

## మార్పు

మనం చూస్తున్న వాటిల్లో కొన్ని ఎన్నడూ మారనట్లు, నిత్యం తెల్లవారడం పొద్దుకుంగడం గమనిస్తాం. కొండలు సముద్రాలు అలాగే వుంటాయి. కాని మనం మాత్రం మారుతుంటాం. పుట్టుక, పెరుగుదల, మరణం మార్పులో భాగమే. అలాగే కొన్ని వస్తువులు తుప్పుపడుతుంటాయి. మరికొన్ని శిథిలమవుతుంటాయి. మారనిది అంటూ ఏదీలేదు. ఎంతసేపట్లో మారతాయనేదే ప్రశ్న. మార్పుకు పట్టే కాలాన్ని బట్టి కొన్ని అసలు మారనట్లే అనిపిస్తాయి. మార్పుతో ముడివడి కాలం వున్నది. మనం దీనినే గతం, వర్తమానం, భవిష్యత్తు అని విభజించాం. భౌతిక విజ్ఞానం గతం-భవిష్యత్తునే పేర్కొన్నది. కాలాన్ని విడిగా చూచిన తీరును ఐన్‌స్టీన్ మార్చేసి, కాలం-ప్రదేశం కలిపేడు.

విశ్వంలో ఎన్నో వస్తువులు వుండగా వాటిలో మార్పులు వివిధ రకాలుగా కనిపిస్తున్నవి. సైన్సులోని భిన్నశాఖలు ఆయా రంగాలలోని మార్పుల్ని అధ్యయనం చేసి చెబుతున్నాయి.

*- హేతువాది, ఫిబ్రవరి 1992*

# నేనెలా పుట్టాను?

పిల్లలందరు అడిగే ప్రశ్న నేనెలాపుట్టాను?

ఎప్పుడోకప్పుడు అమ్మను అడిగే యీ ప్రశ్నకు సరైన సమాధానం రాదు, అబద్ధాలు చెప్పి తప్పుకుంటారు. దేవుడు పుట్టించాడంటారు. ఏవో కట్టుకథలు అల్లి మాట తప్పిస్తారు. కనుక పిల్లలకు అదొక వింతగా, మిగిలిపోతుంది. చాలాకాలానికి గాని అసలు విషయం తెలియదు. అపటికే చాలా అసంబద్ధ నమ్మకాలు నాటుకపోయి వుంటాయి.

పిల్లలకు నిజం చెప్పాలి. చెప్పేది ఆకర్షణీయంగా వాస్తవంగా వుండాలి. అసత్యం పలకాల్సిన అవసరం లేదు.

తల్లి కడుపులో సూక్ష్మమైన అండాలు వుంటాయి. తండ్రి పొత్తికడుపులోనూ సూక్ష్మమైన జీవరేతస్సు కణాలు వుంటాయి. తల్లిదండ్రులు కలుసుకున్నప్పుడు సంపర్కంవలన తండ్రి రేతస్సు, తల్లిఅండం చేరడానికి ప్రయత్నిస్తాయి. అలా కలిసినప్పుడు తల్లికడుపులో బిడ్డ పుట్టటం మొదలౌతుంది.

తల్లి గర్భంలో బిడ్డ ఒక సంచిలో పెరగడం మొదలౌతుంది. అక్కడ చీకటి గనుక బిడ్డ కదులుతుంది గాని చూడలేదు. క్రమేణా పెరుగుతూ కాళ్ళు చేతులు కళ్ళు అలా శరీరభాగాలు ఏర్పడతాయి. బిడ్డ పెరుగుతుంటే తల్లి కడుపు పెరుగుతుంటుంది. తల్లి తినే ఆహారం బిడ్డకుసైతం ఒక పేగుద్వారా చేరుతుంటుంది. బిడ్డపుట్టిన తరువాత యీ పేగును కోసేస్తారు. అక్కడ ఏర్పడే దానినే బొడ్డు అంటారు.

అబ్బాయి, అమ్మాయి అనేది తండ్రి జీవరేతస్సు కణం వలన నిర్ధారితమౌతుంది. గర్భంలో వుండగానే అబ్బాయి, అమ్మాయి అనేది యిప్పుడు చెప్పగలుగుతున్నారు.

తండ్రి రేతస్సు, తల్లిఅండం వలన ఏర్పడే సంతానం, అటు తల్లి యిటు తండ్రి లక్షణాలతో పుడతారు. తల్లి కడుపులోని ఒక సంచిలో పెరిగే బిడ్డ చుట్టూ గోరువెచ్చని ద్రవపదార్థం వుంటుంది. అందులో బిడ్డ కదులుతుండడం తల్లికి తెలుస్తుంటుంది.

9 మాసాలపాటు తల్లిగర్భంలో పెరిగిన తరువాత, బిడ్డ బయటకు వస్తుంది. అప్పుడు ఎముకలు చాలా మెత్తగా వుంటాయి. బిడ్డ పుట్టబోయేముందు తల్లిగర్భసంచి పగిలి అందులోని ఎమ్నియాటిక్ ద్రవం కారిపోతుంది. బిడ్డ పుట్టబోయే ముందు శరీరమంతా లానూగో అనే వెంట్రుకలుంటాయి. పుట్టేనాటికి తలపై తప్ప మిగిలిన వెంట్రుకలు రాలిపోతాయి. తల్లిగర్భసంచిలో వున్న వెనిక్స్ అనే మైనం వంటి పదార్థం బిడ్డను కాపాడుతుంది. పుట్టిన అనంతరం యీ మైనంకూడా పోతుంది.

తల బరువు వలన పుట్టబోయే ముందు బిడ్డ, గర్భసంచిలో తలక్రిందులుకాగా, ప్రసవంలో తల ముందుకు బయటపడుతుంది. బిడ్డ బయటపడడానికి సమయం రాగానే తల్లికి నొప్పులు వస్తాయి. అప్పుడు ప్రసవానికి సిద్ధపడుతుంది.

పుట్టగానే బిడ్డ వూపిరి పీల్చడం వదలడం ఆరంభమౌతుంది. తల్లిగర్భంలో అవసరమైన, ఆహారం అందించే పేగు (అంబలికల్ కార్డ్) తుంచేస్తారు.

అబ్బాయి పుడితే పురుషాంగం, అమ్మాయి పుడితే స్త్రీ అంగం వుంటుంది. అది ప్రధానతేడా. అబ్బాయి ఒక రకంగా అమ్మాయిని ఒక రకంగా చూడడం, పెంచడం ఆనవాయితీగా వస్తున్నది.

అమ్మాయిలు 12 ఏళ్ళు వచ్చేసరికి చనుకట్టు పెరుగుతుంది. ఇవి పిల్లలు పుట్టిన తరువాత పాలు యిచ్చేందుకు ఉపకరిస్తాయి.

సెక్స్‌లో అమ్మాయిలకు అబ్బాయిలకు తేడా వుండడం వలన మిగిలిన వాటిలోనూ తేడా వున్నదని చాలాకాలం అనుకున్నారు.

ఆటపాటల్లో, అభ్యాసాలలో అభిరుచులలో, శక్తిపాటవాలలో యిరువురూ సమాన స్థాయి కలవారే. ఉభయులూ అన్ని పనులూ చేయగలరు. సంతానంలో ప్రసవించడం, బహిష్టు అనేవి ప్రధానంగా స్త్రీపరమైనవి.

ఏ ఉద్యోగమైనా, వృత్తి అయినా యిరువురూ చేయగలరు. ఈ విషయాలు చెప్పాలి. సులభంగా, సునిశితంగా, ఆకర్షణీయంగా చెబితే, ఎంత జటిలమైన శాస్త్రీయ విషయమైనా పిల్లలు బాగా నేర్చుకుంటారు.

*- హేతువాది, ఏప్రిల్ 2000*

# ఇప్పుడు వీస్తున్న సైన్స్ గాలి

సైన్స్ లేకుండా గడిపే జీవితం ఒకప్పుడు వుండేదేమో. నేడు ప్రత్యక్షంగా, పరోక్షంగా మనందర్నీ సైన్స్ ప్రభావితం చేస్తున్నది. సైంటిఫిక్‌గా వుండడం అనేది మానవ విలువ. సైన్స్ అమానుషం కాదని తేలింది. సైన్స్ ప్రజాస్వామికం. స్వేచ్ఛకు గౌరవాన్నిస్తుంది. సైన్స్ సహకారాన్ని కోరుతుంది. మొండివాదాన్ని కాదంటుంది. నిరంతర అన్వేషణ కోరుకుంటుంది. దీనికి అంతం లేదు.

సైన్స్ మానవుడి శక్తివంతమైన ఆయుధం. దీని ఆధారంగా ఎంతో తెలుసుకొని పురోగమిస్తున్నాడు. ప్రపంచంలో ఏమూల ఎవరు తెలుసుకున్నా అచిరకాలంలోనే అది మానవులుందరి సొత్తుగా మారుతుంది. సైన్స్ విశ్వజనీనం. అందులో గుత్తాధిపత్యం లేదు.

సైన్స్‌లో ఎన్నో పరీక్షలు జరుగుతాయి. ఇవన్నీ రుజువుకోసం జరిగేవే. అనేక పద్ధతులు అవలంబించి, నిర్ధారణకు వస్తారు. కనుకనే సైంటిఫిక్ అనడానికి ఎంతో విలువ, గౌరవం, ఆదరణ లభిస్తుంది.

ప్రకృతే సైన్స్‌కు పరిశోధనాలయం. అందులో భాగమే మనిషి. ప్రకృతిలో అన్నీ తెలుసుకోడానికి సైన్స్ క్రమేణా ప్రయత్నిస్తుంది. ఒకనాడు తెలియని విషయాలు నేడు తెలుస్తున్నాయి. ఇంకా ఎన్నో తెలియాలి. పరిశోధనలు, పరిశీలనలు నిరంతరం జరుగుతున్నాయి. వీటికి అంతంలేదు. ఇలా తెలుసుకుంటున్నప్పుడు, లోగడ మనం నమ్మినవి, ఎన్నో మారిపోవచ్చు. తల్లిదండ్రులు, సమాజంలో పెద్దలు, గుడిలో మతస్తులు, బడిలో ఉపాధ్యాయులు సంప్రదాయంగా చెప్పిన విషయాలు మార్చుకోవలసి వస్తుంది. సైన్స్ రుజువు చేసిన వాటికి విరుద్ధంగా నమ్మినవాటిని దూరంగా వుంచవలసి వస్తుంది. పిల్లలకు వాటిని చెప్పడం మానాల్సి వుంటుంది. ఇది బాధగా అనిపిస్తుంది అయినా తప్పదు.

చిన్న పిల్లలు అనేక ప్రశ్నలు వేస్తుంటారు. తల్లిదండ్రులు ఏమి చెబితే అది వారిపై ప్రభావాన్ని చూపుతుంది. గాఢంగా హత్తుక పోతుంది. కనుక మూఢనమ్మకాలు పిల్లలకు చెప్పకూడదు. తల్లిదండ్రులకే సైన్స్ రానప్పుడు ఏంచేస్తారు? తమ పెద్దలు తమకు చెప్పిన వాటిని పిల్లలకు బోధిస్తుంటారు. అలా తరతరాలుగా, సంప్రదాయికంగా మూఢనమ్మకాలు, భయాలు అశాస్త్రీయ విషయాలు ప్రచారం అవుతుంటాయి. పిల్లల్లో నాటుకపోయిన యీ విషయాలు

పెద్దవారయిన తరువాత కూడా ఒక పట్టాన వదలవు. అప్పుడు సైన్స్ చదువుకున్నా, నమ్మకాలు ఒక పక్కన సైన్స్ మరోవైపు అట్టిపెడతారు. చాలా సందర్భాలలో సైన్స్‌ను బడికి, పుస్తకాలకు, పరిశోధనాలయానికి పరిమితంచేసి, నమ్మకాలను పాటిస్తుంటారు. చదువుకున్నవారే అలా చేస్తుంటే మిగిలినవారు ఇంకా సులభంగా నమ్మకాల వూబిలో వుండిపోతారు.

ఇంత జరుగుతున్నా మానవులుగా మనం సైన్స్ వలననే ఎంతో పరిణామం చెందాం. ఇంకా మానసికంగా ఎదిగే అవకాశం వుంది. సైన్స్ మనకు చేసిన చేకూరుస్తున్న ప్రయోజనం ఇంతా అంతా కాదు.

నేను చెప్పిందే ఆఖరిమాట ఇంతకు మించిందిలేదు అని సైన్స్ అనదు. ఇప్పటికి వున్న ఆధారాలు, రుజువులు, పరిశీలనల వలన యీ పరిస్థితికి వచ్చాం అంటుంది. కొత్త విషయాల వలన పరిస్థితి మారవచ్చు. అప్పుడు మన అభిప్రాయాలు మార్చుకుంటాం.

సైన్స్‌లో వ్యక్తి ఆరాధన పూజ వుండవు. ఫలానావ్యక్తి గొప్ప సైంటిస్టు గనుక అతడు ఏ విషయం చెప్పినా అదే ప్రమాణం అనరు. రుజువుకు నిలబడడం ఒక్కటే సైన్స్‌లో గౌరవాన్ని పొందే విషయం మార్పుకు, చేర్పుకు సైన్స్ ఎప్పుడూ సిద్ధమే.

తెలుసుకోవలసింది చాలావుంది, తెలుసుకున్నది పరిమితం అనే విచక్షణ వలన, మానవుడు వినయంగా ప్రవర్తిస్తాడు. సర్వజ్ఞుడు. సర్వాంతర్యామి అనేవి లేవు. అన్నీ తెలిసినవారు అనేది తప్పు. గ్రంథాలలో ఇలాంటి మాటలు రాసినా వాటికి అర్థంలేదు. ఇది గ్రహించడం అవసరం. ఇన్నాళ్ళూ యీ మాటలతో చాలామంది బయలుదేరి మనుషుల్ని మానసికంగా, తరువాత ఇతరత్రా దోపిడీ చేశారు. ఇంకా చేస్తున్నారు. మనకు తెలియని విషయాలు వున్నాయంటే, వాటిని పూజించమని, అర్థంకాదు. తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అందుకు సైన్స్ తోడ్పడుతుంది. నువ్వు అజ్ఞానివి, పాపివి అని సైన్స్ మనిషిని తిట్టదు. నీకు తెలుసుకునే శక్తివుంది, ప్రయత్నించు అంటుంది.

సైన్స్ ఏం చెబుతుంది? యెప్పటికప్పుడు యీ విషయం తెలుసుకోవడం అవసరం. చిన్నప్పుడు సైన్స్ చదువుకున్నాం గదా అని సరిపెట్టుకుంటే పొరపాటే. సైన్స్ నిత్యనూతనం, నిత్యయవ్వనం గలది. సైన్స్ యెప్పుడూ "శాశ్వతం" అనదు "తాత్కాలికం" అంటుంది. కనుక ఏ రంగంలోనైనా ఇప్పుడు సైన్స్ ఏమంటున్నదనేది ముఖ్యం. సైన్స్ ఏమైనా చెప్పనీ, నా నమ్మకం నాది అని మూర్ఖంగా విశ్వసించే వారున్నారు. వారి వల్లనే మతాలు బతికి, వ్యాపారం చేసుకోగలుగుతున్నాయి.

మానవుడిని సైన్స్, ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయికి తీసుకుపోడానికి తోడ్పడుతుంది. మానవ విలువల్ని కాపాడడానికి సైన్స్ గొప్ప సాధనంగా నిలచింది. మతాలన్నీ మనిషిని కించపరచాయి. చిన్నచూపు చూచాయి. మనిషికి గౌరవం యివ్వకపోగా, విశ్వాసాలతో

కుంచించాయి. మతం చెప్పే విలువలన్నీ దైవం పేరిట నమ్మకాల్ని బోధించే విలువలే. మతం అమానుషం. సైన్స్ మానుషం. మతానికి దైవంపై నమ్మకం కీలక వ్యాపారం. సైన్స్ కేవలం మనిషికి ఉపకరించే ఆయుధం, విలువ.

సైన్స్ గురించి తెలియకుండా, అనేక నమ్మకాలను కూడా సైంటిఫిక్ అని ప్రచారం చేస్తున్నారు. అది వ్యాపార లక్షణం నమ్మేవారున్నంతకాలం, ప్రశ్నించకుండా గుడ్డిగా అనుసరించే వారున్నంత కాలం ఇలా మోసాలు, వ్యాపారాలు సాగిపోతూనే వుంటాయి. ప్రశ్నించడం, తెలుసుకోవడం యివన్నీ శ్రమతో కూడినవని, ఎవరినో నమ్ముకొని, పూజలు చేస్తూ వుంటే, ప్రశాంతంగా వుంటుందనేవారే ఎక్కువగా వున్నారు. మతస్తులకు వారే కావాలి. అలాంటివారు సైన్స్‌ను యెప్పుడూ నిరుత్సాహపరుస్తారు. సైంటిఫిక్ మెథడ్‌ను ప్రోత్సహించరు. సైంటిస్టులను వ్యతిరేకిస్తారు. అవసరమైతే హతమారుస్తారు. దైవం పేరిట, మతం పేరిట సైంటిస్టులను బలి యివ్వడానికి వారు వెనుకాడలేదు.

హేతువాదులు, మానవవాదులు యెప్పటికప్పుడు సైన్స్‌లో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు తెలుసుకుంటుండాలి.

నమ్మకాలు అనేక తీరులు. గుడ్డిగా నమ్మడం, పెద్దలు చెప్పారని. తల్లిదండ్రులు ఆచరిస్తున్నారని నమ్మేవారున్నారు. అలాగునే, వాదనతో, తర్కంతో, విచక్షణతో, ఆలోచన చేసి నమ్మేవారున్నారు. సైన్స్ యీ రెండో పద్ధతిని వాడుతుంది.

ప్రకృతిని తెలుసుకోడానికి, మన స్థానం అందులో గ్రహించడానికే సైన్స్ తర్కం ఉపయోగించాం. దీని వలన పూర్వీకులకు తెలియని అనేక విషయాలు తెలిశాయి. ఇలా తెలుసుకోడానికి కొందరు శాస్త్రజ్ఞులు శాస్త్రీయ పద్ధతిని, గణితాన్ని ఆయుధాలుగా ప్రయోగించారు. అట్లా తెలుసుకుంటునప్పుడు, చిరకాలంగా మన మతాలు చెప్పినవి, పెద్దలు నమ్మినవి దోషపూరితాలని తేలింది.

మానవుడికి సైన్స్ ఎంతో ప్రాధాన్యతను తెచ్చిపెట్టింది. విశాల ప్రకృతిలో మానవుడి స్థానం యెక్కడో ఒక మూలవున్నా, అతడి వివేచన, చైతన్యం వలన ఎనలేని ప్రాధాన్యత మనిషికి లభించింది. సైన్స్ అమానుషం అనడం తెలియకనే కోపర్నికస్ సైన్స్‌లో విప్లవానికి నాంది పలికాడు. పరిణామవాదంతో డార్విన్, మనిషి గతాన్ని తెలుసుకునేటట్లు చేశాడు. ప్రకృతిని నిష్పాక్షికంగా చూచి తెలుసుకునే శక్తి సైన్స్ వలన లభించింది. ప్రకృతి నియమాలను భిన్నకోణాలనుండి మనిషి గ్రహిస్తున్నాడు.

అన్వేషణ అనంతం. సైన్స్ అందుకు తోడ్పడుతున్నది. అనుకోని సంఘటనలు ప్రకృతిలో జరుగుతుంటే, సైన్స్ వాటిని అన్వేషిస్తుంటుంది. ప్రకృతిలో నియమాల్ని చూచిన మానవుడు వాటిలో వచ్చే మార్పుల్ని అద్భుతాలుగా స్వీకరిస్తున్నాడు. అంతటితో ఆగి, పూజించక, అద్భుత సంఘటనల వెనుక కార్యకారణ సంబంధం అన్వేషిస్తున్నాడు.

మానవుడికి మెదడు పెద్ద సాధనం. మెదడు పనిచేసే తీరు పూర్తిగా యింకా తెలియలేదు. మెదడు కూడా శరీరంలో భాగమే, శరీరం ప్రకృతిలో భాగమే. ఆ విధంగా మెదడు కూడా ప్రకృతి నియమాలకు లోబడి పనిచేస్తుంది. ప్రకృతి మనలో ప్రతిబింబిస్తుంది.

ప్రకృతి అంతా నియమబద్ధమా? మనకు తెలిసిన మేరకు అలా కనిపిస్తున్నది. తెలియంది చాలావుంది. అది క్రమేణా తెలుసుకుంటున్నాం. ఇలా తెలుసుకునేటప్పుడు నియమం తప్పిన సందర్భాలు ఎదురౌతున్నాయి. కొత్త సాధనలు, ఆయుధాలు కావలసి వచ్చాయి. తెలియని రంగం ఎదురైనప్పుడు నమ్మకస్తులు ఆగిపోతారు, ప్రార్థిస్తారు. సైన్స్ అలాగాక, మన పరిమితుల్ని గ్రహిస్తూనే, కొత్త విషయాలను కొత్త రీతులలో తెలుసుకునే ప్రయత్నం చేస్తుంది. తార్కికంగా తెలుసుకునే ప్రయత్నంలో ఆగమనం అనీ, నిగమనం అనీ వచ్చాయి. ఆ తరువాత ఆ రెండిటినీ కలిసి, ప్రతిపాదనల నుండి రాబట్టే సిద్ధాంతాలు వచ్చాయి. శాస్త్రీయపద్ధతి వీటన్నిటినీ వాడుకున్నది. ఇలా శాస్త్రీయంగా చూస్తే, ప్రకృతి నియమబద్ధంగా కనిపించింది. అంటే జరుగుతున్న సంఘటనల మధ్య కార్య కారణ సంబంధం వున్నదన్న మాట. తెల్లవారడం-చీకటిపడడం రోజూ చూచి, అందులో క్రమత్వాన్ని గ్రహించి దీని వెనుక కార్యకారణ సంబంధాలు తెలుసుకున్నారు. అలవాటు చొప్పున సూర్యోదయం పొద్దుగూకడం అంటున్నా, భూమి తిరగడం ఇందుకు ప్రధాన కారణం అని రుజువైంది. కారణాలు అన్వేషిస్తుంటే, ప్రకృతిలో ఒకదానికి మరొకటి సంబంధం వున్నట్లు కనుగొంటూ పోయారు. పరస్పరం యీ సంఘటనలు ఆధారపడుతున్నాయి. ఇలా జరగకపోతే, ప్రపంచమంతా గందరగోళం, క్రమరాహిత్యం అవుతుంది. ఒక సంఘటన మరో సంఘటనకు దారితీస్తుండగా, ఇవి పరస్పర ఆధారాలు కాగా, ఇలా నియమబద్ధంగా జరగడం ముందే నిర్ధారితమై పోయిందా? అంటే నియతివాదం వుందా? జరగబోయేదంతా నిర్ణయమై పోయిందా? సైన్స్ ప్రకారం న్యూటన్ చలన సిద్ధాంతాలు, లాప్లాస్ సూత్రాలు కూడా నియతివాదాన్ని సమర్థించాయి.

ఒక వస్తువు ఎక్కడ వుందో తెలిస్తే అది ఎలా పయనిస్తుందో చెప్పవచ్చు, ఎటు పోతున్నదో తెలిస్తే ఎక్కడ ఆగుతుందో, భవిష్యత్తులో దాని మనుగడ ఏమిటో తెలుసుకోవచ్చు అని లాప్లాస్ అన్నాడు. సైన్స్ యీ నియతివాదాన్ని చాలాకాలం అంగీకరించింది. నియమం తప్పినట్లు కనిపించే సంఘటనలు తెలుసుకోవడంలో మనకు చేతగాక, నియమరాహిత్యం అంటున్నామని నియతివాదులు చెప్పారు.

సైన్స్‌లో నియతి అనియతివాదుల సంఘర్షణ చాలా కాలంగా (70 సంవత్సరాలుగా) సాగుతున్నది. క్వాంటం సిద్ధాంతం వచ్చినప్పటినుండీ యీ వాదోపవాదాలు విజృంభించాయి. ఈ దృష్ట్యా సైన్స్ ఇప్పుడేమి చెబుతుందో చూద్దాం.

విశ్వాన్ని ఎవరు సృష్టించారు?
తనంతట తానే సృష్టించుకోగలదా?

సృష్టి ఎలా జరిగింది? అనే విషయమై మతాలు యెన్నో కథలు, గాథలు అల్లాయి. మతం చెప్పింది నిజమని నమ్మి, వెనక్కు వెళ్ళి, కార్యకారణ వాదాన్ని అంగీకరించినా, ఒక చోట ఆగిపోతున్నారు. ఒక స్థితిలో దేవుడు సృష్టించాడంటున్నారు. సైన్స్ పేర్కొనే పెద్ద ప్రేలుడు (బిగ్ బాంగ్) అదేనంటున్నారు. కార్యకారణ వాదాన్ని అక్కడ ఆపేయమంటున్నారు. దేవుడి మనస్సు మనకు తెలియదు గనుక. ఆ విషయాన్ని తరచిచూడడం అనవసరం అంటున్నారు. దేవుడికి కారణం ఏమిటి అని అడగరాదంటున్నారు. ప్రశ్న ఆపేయమనడం, దేవుడే అన్నిటికీ మూలం అనడం సరైన వాదమైతే, ప్రకృతికి ఆ వాదాన్ని యెందుకు అన్వయించరాదు?

పెద్ద ప్రేలుడుతో యీ విశ్వం ఆరంభం అయిందని, సైన్స్ కనుగొంటున్నది. అంటే ప్రేలుడుకు ముందు ఏమున్నదో ప్రశ్నించరాదనిగాని, తెలుసుకోరాదనిగాని సైన్స్ అనడం లేదు. ఇంతవరకు తెలిసిన దానినిబట్టి బిగ్‌బాంగ్ వరకూ వెనక్కు వెళ్ళగలిగాం. 15 బిలియన్ సంవత్సరాల క్రితం పెద్ద ప్రేలుడుతో యిప్పుడున్న విశ్వం ఆరంభమైంది.

ఐన్‌స్టీన్ రూపొందించిన సాపేక్షతా సిద్ధాంతం ఆధారంగా, గురుత్వాకర్షణ సూత్రాన్ని దృష్టిలో పెట్టుకొని, స్టీఫెన్ హాకింగ్, రోజర్ పెన్‌రోజ్ పెద్ద ప్రేలుడు విషయం చెప్పారు. దీనితో విశ్వం యెప్పుడూ స్థిరంగా వుంటుందనే (Steady State) సిద్ధాంతం ప్రక్కకు పెట్టారు. అయితే పెద్ద ప్రేలుడుకు కారణం ఏమిటి అంటే, అలాంటిదేమీ కనబడడం లేదంటున్నారు. కారణం లేకుండా సంఘటన సాధ్యమా అనేది చిక్కు సమస్య అయింది. ఇక్కడే క్వాంటం సిద్ధాంతాన్ని సాపేక్షతా సిద్ధాంతానికి జోడిస్తే సమస్యకు పరిష్కారం వస్తుందంటున్నారు.

క్వాంటం సిద్ధాంతం ప్రకారం లోగడవున్న కారణాలు ఆధారంగా, జరగబోయేది నిర్ధారించి చెప్పలేం. అనూహ్యమైన మార్పులు సూక్ష్మ ప్రపంచంలో సాధ్యమే. స్థూల ప్రపంచానికి సూక్ష్మ ప్రపంచ అనూహ్య మార్పును అన్వయిస్తే, సరిపోతుంది. విశ్వం తలవని తలంపుగా వచ్చిందన్నమాట. క్వాంటం లోకంలో పదార్థం నిర్దిష్ట కారణాలు లేకుండానే ఆవిర్భవిస్తున్నది. విశ్వం కూడా అలా వచ్చిందనుకోవాలి. రేడియోధార్మిక అణువులు ఎలా క్షీణిస్తున్నాయో తెలియనట్లే. ఇది కూడా యెలా ఆవిర్భవించిందో తెలియదు. అతీత శక్తి ఏదో వుందనుకోనక్కరలేదు. అలా అనుకుంటే మళ్ళీ మొదటికే వస్తాం. ఆ శక్తికి మూలం ఏది అనే ప్రశ్న వస్తుంది.

విశ్వం పెద్ద ప్రేలుడుతో ఆరంభమైనప్పుడు, యావత్తు పదార్థం బాగా కుంచించుకొని వుండి వుండాలి. అంటే గురుత్వాకర్షణ శక్తి, పదార్థ సాంద్రత, ఒకే కేంద్రంగా అణగి వుండేదన్నమాట. దీనినే ఏకస్థానంగా (Singularity) శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

పెద్ద ప్రేలుడుతో విశ్వం ఆరంభం కావడమంటే, కాలం-ఆకాశం కూడా అందులోనే యిమిడి వున్నట్లు గ్రహించాలి. మళ్ళీ ఐన్‌స్టీన్ సిద్ధాంతం స్వీకరించి, విశ్వానికి పరిమితి వున్నా హద్దులులేవు అన్నాడు. విశ్వం దానంతట అది వున్నది. దీనికి సృష్టికర్త లేదు. ఆది, అంతం లేని

విశ్వానికి, హద్దులు కూడా లేవు అని స్టీఫెన్ హాకింగ్ అన్నాడు. (ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైం పేజి 149) క్వాంటం సిద్ధాంతం ప్రకారం అంచనాలన్నీ వుజ్జాయింపుగా (సుమారుగా) చేసేవేగాని, కచ్చితంగా కాదు. ఈ సూత్రాన్నే విశ్వానికి అన్వయించాలన్నమాట.

విశ్వం పెద్ద ప్రేలుడు సంభవించినప్పటినుండీ విస్తరిస్తూ పోతున్నది. అలాంటి విశ్వంలోనే మనుషులు పరిణమించారు. విశ్వం కుంచించుకపోతే మనుషులు వుండరు. మనం జీవించడానికి ఆహారం స్వీకరిస్తాం గదా. అది మనకు శక్తిని యిస్తుంది. దీనిని క్రమపద్ధతిలో శక్తిని స్వీకరించడం అనొచ్చు. ఆ శక్తిని శరీరం ఉష్ణంగా మార్చుకుంటుంది. అప్పుడు క్రమం తప్పి, శక్తి క్రమరాహిత్యంగా పనిచేస్తుంది. ఇదే సూత్రం విశ్వంలోనూ పనిచేస్తున్నది. విశ్వం విస్తరిస్తున్నందు వలన క్రమరాహిత్యత పెరగడంలేదు. విశ్వానికి అవధులు లేనందువలన యిది సాధ్యపడుతున్నది.

## పరిణామం ఇలా జరుగుతోంది

మనిషి బ్రతకడానికి అవసరమైన కొన్ని ముఖ్య లక్షణాలు భూమి మీద వున్నాయి. కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, కాల్షియం, ఫాస్ఫరస్, ఇతర గ్రహాలలో వున్న అమ్మోనియా, మిథేన్ భూమి మీద లేనందున, ప్రాణానికి హాని కలగడం లేదు. ఉష్ణోగ్రత 5 సెంటిగ్రేడ్ నుండి 40 సెంటిగ్రేడ్ వరకూ వున్నది. అంతకు మించితే మనిషికి కష్టం. సూర్యరశ్మి సమృద్ధిగా లభిస్తున్నది. భూమి సూర్యుని చుట్టూ తిరగడం, ఇంచుమించు సూర్యుని నుండి స్థిరంగా ఉష్ణోగ్రత రావడం ప్రాణానికి అనుకూలంగా వుంది. భూమి గురుత్వాకర్షణ శక్తి బలంగా వున్నందున యిక్కడ వాతావరణం హరించకుండా వుంది. మనల్ని పడిపోకుండా పట్టివుంచే మోతాదులో యీ భూమి గురుత్వాకర్షణ వుంది. భూమిపైన కొంత దూరంలో ఓజోన్‌పొర కప్పివుండడంతో సూర్యుని నుండి వచ్చే అల్ట్రావైలెట్ రేడియేషన్ మనల్ని కాల్చివేయడం లేదు. విశ్వంలో యెంత సంక్షోభం వున్నప్పటికి, భూమి ప్రశాంతంగానే కొనసాగుతున్నది.

ఇలాంటి అనుకూల స్థితిలో భూమిపైన వాతావరణానికి యిమిడిపోతూ, ప్రాణం పరిణమించింది. అలా పొందికగా యిమడలేని ప్రాణులు హరించిపోగా, యిమడగలిగినవి పెరిగిపోయాయి. భూమి మీద వున్న వాతావరణం చంద్రుడిమీద లేదు. కనుక అక్కడ ప్రాణం మనుగడ సాగించలేదు. అనేక నక్షత్రాలు అనూహ్యంగా పేలిపోతుంటాయి. అలాంటిచోట ప్రాణం వుండడానికి వీల్లేదు.

స్ఫటికం ఉదాహరణగా చూస్తే వాటంతట అవే చక్కని రూపాలుగా పెరుగుతూ పోతాయి కాని వాటికి మనవలె ప్రాణం లేదు. నక్షత్రాలు క్రమపద్ధతిలో వున్నాయి. అయినా వాటిలో ప్రాణంలేదు మన శరీరంపై విద్యుదయస్కాంతం ప్రభావం చూపుతున్నది. ప్రకృతిలోని నాలుగు శక్తులలో విద్యుదయస్కాంతం (ఎలక్ట్రో మాగ్నటిక్) ఒకటి మాత్రమే అయినా మిగిలిన మూడుశక్తుల ప్రభావం ప్రాణంపై ఏ మేరకు వున్నదీ తెలియదు. అంటే, గురుత్వాకర్షణ శక్తి, న్యూక్లియర్ స్ట్రాంగ్ ఫోర్స్, న్యూక్లియర్ వీక్ ఫోర్స్ అనేవాటి ప్రభావం మనపై పనిచేస్తున్నదా లేదా అనేది తెలియదు.

మనకు తెలిసిన మేరకు భూమిపై ప్రాణం అనేది సుమారు 4 బిలియన్ సంవత్సరాల క్రితం ఆరంభమైంది. క్రమేణా ప్రాణుల పరిణామం జరిగింది. ఈ పరిణామంలో భిన్న జీవులు వచ్చాయి. పరిణామం చాలా నెమ్మదిగా జరిగింది. కోతి నుండి మానవుడు పరిణమించడానికి కొన్ని మిలియన్ల సంవత్సరాలు పట్టింది. అలా వెనక్కు వెళ్ళి పరిశీలిస్తుంటే విశ్వం 15 బిలియన్ సంవత్సరాల క్రితం ఒక్కసారిగా బద్దలై పరిణామం మొదలైందని తెలుస్తున్నది. అప్పటినుండీ విశ్వం విస్తరిస్తూ పోతున్నది. హీలియం వంటివి ఉత్పత్తి కాకుండా ఆరిపోయాయి. వేడితగ్గుతూ అణువులు ఏర్పడ్డాయి. విస్తరిస్తున్న విశ్వంలో కొన్నిచోట్ల గురుత్వాకర్షణ శక్తి యెక్కువై, విస్తరణ మందగించింది. నక్షత్ర సముదాయాలు ఏర్పడ్డాయి. సూర్యుడివంటి నక్షత్రాలు హైడ్రోజన్‌ను హీలియంగా మార్చేశాయి. ఆ విధంగా జనించిన శక్తినే మనం వేడి అని, కాంతి అని పిలుస్తున్నాం. సూర్యుడు 5 వేల మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు అంచనా వేశారు. దీని చుట్టూ బరువైన కణాలు కలసి గ్రహాలు, భూమి ఏర్పడ్డాయి.

భూమి ఏర్పడినప్పుడు చాలా వేడిగా వుండేది. వాతావరణం లేదు. క్రమేణా చల్లారుతూ వాతావరణం ఏర్పడింది. అప్పటి వాతావరణం ప్రాణులకు అనుకూలం కాదు. ప్రాణహాని కలిగించే వాయువులు వుండేవి. అందుకు తట్టుకోగల ప్రాణి సముద్రాలలో మనగలిగింది. వాటిలో తమను తాము పెంచుకోగలవి మాత్రమే మిగిలి, తతిమ్మావి నశించాయి. అంటే హైడ్రోజన్ సల్ఫైడ్ స్వీకరించి, ఆక్సిజన్ వదిలే జీవులన్నమాట! క్రమంగా వాతావరణం మారుతూ జీవపరిణామంలో చేపలు, ప్రాకే జంతువులు, పాలిచ్చేవి, తరువాత మనుషులు వచ్చారు.

## అత్యంత ఆధునిక విశేషాలు

కవల పిల్లల్లో ఒకరు కొండమీద, మరొకరు సముద్రమట్టంలో వున్నారనుకోండి. కొంతకాలం తరువాత వారిద్దరూ కలుసుకుంటే కొండమీద పెరిగిన వ్యక్తి పెద్దవాడిగా కనిపిస్తాడు. అయితే యీ తేడా అంతగా కొట్టొచ్చినటనిపించదు. కాని కాంతి వేగంలో కవలలో ఒకరు ప్రయాణం చేస్తే భూమ్మీదున్న వానికంటే అతను చాలా చిన్నవానిగా కనిపిస్తాడు. సైన్సు ఇలాంటి అద్భుతాలెన్నో పేర్కొంటున్నది. మనం చూస్తున్న ప్రపంచానికీ, సైన్సు పరిశోధించి చెప్పే ప్రపంచానికీ ఎంతో తేడా వుంది. (ఈ విషయంపై వివరంగా ఈ వ్యాసం చివర)

స్టీఫెన్ హాకింగ్ చిన్న పుస్తకం రాసి ఇలాంటి విషయాలను విడమరచి చెప్పాడు. సైన్స్‌లో అద్భుతాలు చెప్పిన హాకింగ్ కూడా ఒక అద్భుత వ్యక్తే. అతడి శరీరంలో చాలాభాగం పనిచేయడం లేదు. మెదడు మాత్రం గొప్పగా కృషిచేస్తున్నది. దాని ఫలితమే అతడి పుస్తకం (ఎ బ్రీఫ్ హిస్టరి ఆఫ్ టైం.)

మనం చూస్తున్న విశ్వాన్ని గురించి యెన్నో కథలు, గాథలు వున్నాయి. దీన్నంతటినీ పెద్ద తాబేలు మోస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అయితే తాబేలు దేనిమీద వున్నట్లు అని ఒక

శాస్త్రజ్ఞుడు ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదు! అంచులు లేని పరిమిత విశ్వం గురించి ఐన్‌స్టీన్ చెప్పాడు. తాబేలు చివరకు వెడితే పడిపోతాంగదా? బెర్ముడా సముద్ర గర్భంలోకి పోతామా? అని హాకింగ్ అడిగాడు.

విశ్వాన్ని గురించి పూర్వకాలం నుండి నేటి వరకూ యెందరో తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు భిన్న సిద్ధాంతాలు చెబుతూ వచ్చారు. విశ్వం యెక్కడ నుంచి వచ్చింది? దీనికి మొదలు చివర వున్నాయా? కాలం అంటే ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ప్రయత్నాలు జరిగాయి. సైన్స్ పేర్కొన్న సిద్ధాంతాలన్నీ తాత్కాలికమే. యావత్తు ప్రపంచాన్ని వివరిస్తూ ఒకే సిద్ధాంతం వస్తే బాగుండునని సైన్సు కలలు కంటున్నది. కాని అది కలగానే మిగిలిపోయింది. విశ్వాన్ని పడగొట్టి, సైన్సు వివరణ యిస్తున్నది. ప్రపంచం ఎలా మారుతున్నదో చెబుతున్నది. ప్రపంచం ఎలా ప్రారంభమైందో తెలుసుకుంటున్నది. పరిణామక్రమం చెబుతున్నది.

ప్రస్తుతం రెండు పెద్ద సిద్ధాంతాల దగ్గర సైన్సు ఆగింది. ఒకటి సాపేక్షితా సిద్ధాంతం. ఐన్‌స్టీన్ పేర్కొన్న యీ విశిష్ట సిద్ధాంతం విశ్వాన్ని వివరిస్తున్నది. ఇది స్థూల ప్రపంచం ఇందులో కార్యకారణ సంబంధాలున్నాయి.

మరో సిద్ధాంతం సూక్ష్మ ప్రపంచంలోని అణువులు, కణాలు, పరమాణువులు గురించి పేర్కొంటున్నది. ఇక్కడ కార్యకారణ సంబంధాలు విఫలమయ్యాయి. నిర్ధారణగా చెప్పే స్థితి లేదు. ఉజ్జాయింపుగా అంచనాలు వెయ్యాలే తప్ప నిక్కచ్చిగా చెప్పే స్థితిలేని సూక్ష్మ ప్రపంచాన్ని గురించి క్వాంటం సిద్ధాంతం యెంతో కనిపెట్టింది.

సాపేక్షతా సిద్ధాంతానికి క్వాంటం సిద్ధాంతాన్ని జోడించగలిగితే, విశ్వాన్ని వివరించగల పొందికైన సిద్ధాంతం సాధ్యమే. దీనికోసం ఐన్‌స్టీన్ ప్రయత్నించి విఫలమయ్యాడు. స్టీఫెన్ హాకింగ్ అలాంటి ప్రయత్నం సాధ్యమేనంటున్నాడు. యెలాగ? అంటే డార్విన్ పేర్కొన్న పరిణామ సూత్రంలో సహజంగా యెంపిక చేసుకునే పద్ధతిని హాకింగ్ సూచించాడు. లోపాలున్న జీవులు నశించడం, పరిణామానికి తట్టుకొని బ్రతకగల జీవులు మాత్రమే కొనసాగినట్లే, సాపేక్షతా సిద్ధాంతం క్వాంటం సిద్ధాంతం కలిపి ఒకే సిద్ధాంతంగా రూపొందించవచ్చని హాకింగ్ ఆశిస్తున్నాడు.

మనం రోడ్డుపై వెడుతుంటే కార్ల శబ్దాలు వింటుంటాం. కారు సమీపిస్తుంటే శబ్దం యెక్కువగానూ దూరంగా పోతుంటే శబ్దం సన్నగిల్లుతుండడం సర్వసాధారణమే. అలాగే ఆకాశంలో నక్షత్రాలు మనకు దగ్గరగా వస్తుంటే వాటి కాంతి నీలంగానూ, దూరంగా జరుగుతుంటే ఎర్రగానూ కనిపిస్తాయి. దీన్ని డాప్లర్ ప్రభావం అంటారు. ఆకాశంలో పాలపుంతలు, అనేక తారలు ఒకదాని నుండి మరొకటి రోజురోజుకూ దూరంగా వెళ్ళిపోతున్నాయి. హబుల్ అనే శాస్త్రజ్ఞుడు జీవితమంతా వీటిని పరిశీలించి అన్నీ దూరంగా జరిగిపోతున్నట్లు కనుగొన్నాడు. విశ్వం స్థిరంగా లేదు. విస్తృతమౌతూ వుంది. న్యూటన్ కాలంనుండే విశ్వమంతా స్థిరంగా వున్నదనే నమ్మకం పటాపంచలైంది. హబుల్ ఒకవైపున, ఫ్రైడ్‌మన్ మరోపక్క విశ్వం విస్తృతమయిపోతున్నట్లు

నిర్ధారించారు. ఒక బెలూన్ మీద చుక్కలు పెట్టి, గాలివూదితే, బెలూన్ పెరుగుతూ వుంటుంది. అప్పుడు చుక్కలన్నీ వెడల్పు అవుతూ వుంటాయి. అన్నీ ఒక దానినుండి మరొకటి జరుగుతూ పోతాయి. ఇందులో ఏదీ కేంద్రస్థానం కాదు. అలాగే మన విశ్వంకూడా. ఇప్పుడు కనిపెట్టినదాన్ని బట్టి విశ్వం యిలా క్రమంగా విస్తరిస్తూ ఒక తారనుండి మరొకటి యెడమైపోతుంటే, ఒకప్పుడు ఇవన్నీ దగ్గరగా వున్నాయన్నమాట. యెప్పుడో ఒకనాడు అవి ఒకచోట నుండి ప్రయాణం మొదలెట్టాయన్న అర్థం వస్తుంది. ఆ ప్రారంభదశనే (బిగ్‌బాంగ్) బ్రహ్మాండం బద్దలు కావడం అన్నారు. అంటే కాలం కూడా అప్పుడే మొదలైందని అర్థం. దీన్ని దేవుడి సృష్టిగా మతవాదులు నమ్ముతున్నారు. అంతకు ముందు ఏముంది అనే ప్రశ్నకు తావు లేదంటున్నారు.

విశ్వానికి సంబంధించిన సిద్ధాంతాలన్నీ బిగ్ బాంగ్ దగ్గర విఫలమయ్యాయా? ఇది పెద్ద చిక్కుప్రశ్న. హాకింగ్ యిందుకు సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. క్వాంటం సిద్ధాంతం పేర్కొన్న అనిశ్చిత సూత్రాన్ని అన్వయిస్తే ఇందుకు జవాబు లభిస్తుందని ఆయన ఆశిస్తున్నాడు. అనిశ్చిత సూత్రం అంటే ఏమిటి?

స్థూల ప్రపంచం అంటే మనం చూస్తున్న భూమి, గ్రహాలు, గోళాలు, తారలు, నక్షత్రాలు, పాలపుంతలు అన్నమాట. ఇక్కడ నిర్ధారణగా జరిగే సంఘటనలు చెప్పవచ్చునని, కార్యకారణ సంబంధం వుందని సైన్స్ భావించింది. లాప్లాస్ యీ నిర్ధారిత సూత్రానికి మూలపురుషుడు. ప్రపంచం ఇప్పుడు ఎలావుందో, ఎటు పయనిస్తుందో గమనిస్తే ముున్ముందు ఏమౌతుందో చెప్పవచ్చు అన్నారు. ఇలా నిర్ధారితమైపోతే, దేవుడి స్వేచ్ఛ ఏమైనట్లు అని మతవాదులు వాపోయారు. నిర్ధారితవాదాన్ని, కార్యకారణ సంబంధాన్ని ఐన్‌స్టీన్ వరకూ నమ్మారు. ఆ దశలో అస్థిరత వచ్చిపడింది. దీనికి మూలం హైసెన్‌బర్గ్ అనే శాస్త్రజ్ఞుడు. ఇది సూక్ష్మ ప్రపంచానికి చెందిన విజ్ఞానం అంటే ఎక్స్‌రేలు, గామారేలు, కాంతి, సూక్ష్మాణువులు మొదలైన వాటికి చెందినవన్నమాట. ఎలక్ట్రాన్ యెక్కడుందో చెబితే యెటుపోతుందో వూహించవచ్చు. యెటుపోతుందో నిర్ధారిస్తే, యెక్కడ వుంటుందో చెప్పవచ్చు. అలా జరగాలంటే ఎలక్ట్రాన్‌పై కాంతిని ప్రసరింపచేయాలి. ఆ కాంతి ఎలక్ట్రాన్ స్థితిని, గతిని మార్చేస్తుంది. ఎలక్ట్రాన్ గురించి నిర్ధారణగా చెప్పలేకపోయారు. ఇది మనం వాడే పరికరం వలనగాని, మన జ్ఞానలోపం వలనగాని జరుగుతున్నది కాదని కూడా తేలింది. అనిశ్చితం అనేది సూక్ష్మాణువుల లోకానికి చెందిన వాస్తవం అని రుజువైంది. అక్కడే ఘర్షణ మొదలైంది. కార్యకారణవాదం దెబ్బతిన్నది. సైన్సులో ఐక్యతావాదులు పొందిక కోసం ఎంతో ప్రయత్నించి విఫలమయ్యారు. ఐన్‌స్టీన్ తన సాపేక్షత సిద్ధాంతంలో క్వాంటం అనిశ్చితను పరిగణనలోకి తీసుకోలేదు. అప్పటినుండే క్వాంటం సిద్ధాంతం తీసిన దెబ్బను తట్టుకోడానికి కార్యకారణవాదులు, నిశ్చితవాదులు ప్రయత్నిస్తూనే వున్నారు. ఎప్పటికైనా విశ్వంలోని నాలుగు శక్తుల్ని ఐక్యంగా చూసే అవకాశం లభిస్తుందనీ, అందుకు దగ్గరగా చేరుకుంటున్నామనే హాకింగ్ కూడా నమ్ముతున్నాడు. ఆ నాలుగు శక్తులు వాటి వివరాలు ఏమిటో పరిశీలిద్దాం.

## విశ్వంలో శక్తులు

విశ్వంలో సైన్సు కనుగొన్న శక్తులు నాలుగు. ఈ శక్తిని తీసుకెళ్ళే కణాలు ఆధారంగానే నాలుగు రకాలుగా విభజన చేశారు. ఇందులో మూడు శక్తుల్ని సైన్స్ కలపగలిగింది. ఒకటిమాత్రం కలిసిరావడంలేదు. అందరికీ చిరకాలంగా తెలిసిన గురుత్వాకర్షణశక్తి ప్రత్యేకంగా కలిసి రాకుండా వున్నది. ఇది విశ్వవ్యాప్తంగా వున్నది. రెండు వస్తువుల మధ్య ఆకర్షణగా పనిచేసే యీ శక్తి ఎప్పుడూ తిప్పికొట్టదు. చంద్రుడికీ, భూమికీ మధ్యవున్న ఆకర్షణశక్తి యిలాంటిదే. అలాగే సూర్యుడికీ భూమికీ మధ్య గురుత్వాకర్షణ వున్నది. పరమాణువు నుండి పాలపుంతల వరకూ ఎక్కడబడితే అక్కడ గురుత్వాకర్షణ శక్తి వుంది. సూర్యునిచుట్టూ భూమి తిరగడానికి యీ శక్తే కారణం. గురుత్వాకర్షణ వుందని తెలిసినా, ఇంతవరకు వాటి తరంగాలను సైన్స్ పరిశోధనాలయాలలో పట్టుకోలేకపోయారు. అయినా ప్రయత్నాలు సాగిస్తూనేవున్నారు.

రెండవది విద్యుదయస్కాంత శక్తి. ఇది ఆకర్షిస్తుంది. తిప్పికొడుతుంది. రెండు పాజిటివ్ క్షేత్రాల మధ్య యిది తిప్పికొడుతుంది. ఒకటి పాజిటివ్ మరొకటి నెగటివ్ అయితే ఆకర్షిస్తుంది. విద్యుత్తులో ఇది మనకు నిత్యానుభవమే.

మూడోశక్తి న్యూక్లియర్ స్వల్పశక్తి. అణుధార్మిక (రేడియో యాక్టివ్) చర్యలో ఇది గమనించవచ్చు. విద్యుదయస్కాంతశక్తిలో ఇది కలపవచ్చునని 1967లో అబ్దుల్ సలాం, స్టీవెన్ వైన్ బర్గ్ అనే శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. 1979లో వీరికి నోబెల్ బహుమతి వచ్చినది కూడా. సూర్యుడిలో న్యూక్లియర్ అణుశక్తి విద్యుదయస్కాంతంగా మారడానికీ, మనకు వస్తున్న వెలుగునకు యిదే కారణం.

నాలుగోశక్తి న్యూక్లియర్ (బలీయ) శక్తి. అణుకేంద్రంలో ప్రోటానులు, న్యూట్రాన్లను కలిపి వుంచేటందుకు యీ శక్తి పనిచేస్తున్నది. ఈ శక్తులన్నిటినీ కలిపి చూడగల సిద్ధాంతానికై శాస్త్రజ్ఞులు కృషి చేస్తున్నారన్నాం గదా. మన మనుగడే ఐక్య సిద్ధాంతానికి దారితీస్తున్నదని హాకింగ్ పేర్కొన్నాడు.

ఇలాంటి కృషి జరపడంలోనే హాకింగ్, బ్లాక్ హోల్స్ గురించి ఎంతో కనుగొని మనకు వివరించాడు. బ్లాక్ హోల్స్ గురించి సైన్సులో వింత కథలు గాథలు బయలుదేరాయి. వాస్తవానికి దగ్గరలో వుండే విషయాలేమిటో చూద్దాం.

## చీకటి తారలు

నల్లని నక్షత్రాలు! (బ్లాక్ హోల్స్)

నల్లని నక్షత్రాలున్నాయా? కంటితో చూస్తేగాని నమ్మను అన్నాడొక సైంటిస్టు. అలా చూడగలిగితే వాటిని నల్లని నక్షత్రాలని ఎందుకంటారు? అసలు అలాంటి నల్లని నక్షత్రాలు వున్నాయా? ఉన్నాయని స్టీఫెన్ హాకింగ్ నిర్ధారణగా చెబుతున్నాడు. ఇందుకుగాను పరోక్షమైన ఆధారాలు చూపుతున్నారు. ఏమిటవి?

వెలుగు అనేది బాణం వలె దూసుకపోతుందని న్యూటన్ వరకూ నమ్మారు. ఆ తరువాత కాంతి కిరణాలు కేవలం సూటిగా, కణాలుగా పోవడమే కాదు, తరంగాలుగా, అలలుగా కూడా పయనిస్తాయని కనుగొన్నారు. కాంతికి రెండు లక్షణాలున్నాయన్నమాట. దీనికి, నల్లని నక్షత్రాలకు సంబంధం ఏమిటి అనే సందేహం రావచ్చు. ఐన్‌స్టీన్ తన సాధారణ సాపేక్షతా సిద్ధాంతంతో కొత్త సత్యాలు అనేకం పేర్కొన్నాడు. కాంతి కిరణాలు నక్షత్రాల దగ్గరగా ప్రయాణం చేస్తున్నప్పుడు సూటిగాకాక, వంగుతున్నాయి. నక్షత్రపు గురుత్వాకర్షణశక్తి యిందుకు కారణం. అలాంటి వంపు నల్లని నక్షత్రాల వద్ద కూడా జరుగుతున్నది. అంటే నక్షత్రం లేనిచోట, కాంతికిరణం ఆకర్షితమై వంగుతున్నదంటే, అక్కడేదో భారీ పదార్థం వున్నదన్నమాట. దీనినే నల్లని నక్షత్రం అన్నారు. ఇలాంటివి విశ్వంలో కోకొల్లలుగా వున్నాయన్నారు. ఇవి నల్లని నక్షత్రాలుగా ఎందుకున్నాయి? వాటి వెలుగు ఏమైంది? నక్షత్రాలు ఎలా ఏర్పడతాయి? తరువాత వెలుగు ఎలా కోల్పోతాయి? అనే అంశంపై తీవ్ర పరిశోధన జరిగింది. భారత ఖగోళ శాస్త్రజ్ఞుడు చంద్రశేఖర్ ఇందుకు ఎంతగానో తోడ్పడ్డాడు.

గురుత్వాకర్షణ వలన హైడ్రోజన్ గ్యాస్ వంటిది తనకుతానే భారంగా మారి, గాస్ అణువులు పరస్పరం గుద్దుకుంటాయి. ఇలా అణువుల సంఘర్షణ వలన వేడి పెరిగిపోతుంది. క్రమేణా ఈ గాస్ అంతా హీలియంగా మారుతుంది. ఈ చర్యలో విడుదల అయ్యే వేడి వలన నక్షత్రం వెలుగు యిస్తుంది. కొంతకాలానికి గాస్ కుంచించుకపోవడం ఆగిపోయి, నక్షత్రం స్థిరంగా వుంటుంది. న్యూక్లియర్ రియాక్షన్ వలన గురుత్వాకర్షణ కూడా సమతుల్యంగా వుంటుంది. కాలక్రమేణా నక్షత్రంలోని హైడ్రోజన్, తదితర గాస్ తగ్గిపోతూ వుంటుంది. నక్షత్రం ఎంత పెద్దదైతే, గురుత్వాకర్షణ నిలబెట్టుకోడానికి అంత వేడికూడా అవసరమౌతుంటుంది. వేడి ఎక్కువైతే అంతగా శక్తి ఖర్చవుతుంటుంది. మన సూర్యుడి పరిస్థితి కూడా అంతే. నక్షత్రంలో ఇంధనం అయిపోతుంటే అది చల్లబడుతుంది. కుంచించుకపోతుంది. పెద్ద నక్షత్రాలలో ఇలా జరిగినప్పుడు, వాటి గురుత్వాకర్షణకు అవి తట్టుకోలేవు. ఆ గురుత్వాకర్షణ చెంతకు వచ్చిన కాంతి కిరణాలు కూడా అందులోపడి హరించుకపోతాయి. అలాంటి ప్రాంతాన్నే నల్లని నక్షత్రాలు అని పేర్కొంటున్నారు.

విశ్వపరిశోధనకై ఒక వ్యోమగామి వెళ్ళి తాను చూస్తున్నదంతా సంకేతాల ద్వారా ప్రతి సెకండుకూ తెలియజేస్తున్నాడనుకుందాం. అతడు నల్లని నక్షత్రానికి సమీపంగా చేరుకుంటూ తన గడియారంలో 11 గంటల 59 నిమిషాల 59 సెకండ్ల వరకూ సంకేతాలు పంపాడనుకోండి. క్రింద పరిశీలించే వారికి అతడు పంపే సంకేతాల వెలుగు క్షీణిస్తూ, పేలవం అవుతూ పోతుండగా, ఒక క్షణంలో యింకేమీ కనబడదు. వ్యోమగామి కాస్తా నల్లని నక్షత్రంలో పడిపోయాడు. గురుత్వాకర్షణ శక్తిని పరిశోధక ఓడ గమనిస్తున్నా, వ్యోమగామి సంకేతాలు యిక రావని మాత్రం గ్రహిస్తారు. నల్లని నక్షత్రం నుండి ఏదీ బయటకు రాదు.

మన సూర్యుడు కూడా నల్లని నక్షత్రంగా ముమ్ముందు మారతాడు. అందుకు చాలాకాలం పడుతుంది గనుక ప్రస్తుతం మనకంత దిగులు లేదంటాడు హాకిన్స్!

సూర్యునిచుట్టూ తిరిగే భూమి కూడా గురుత్వాకర్షణ తరంగాలను పుట్టిస్తుంది. దీని వలన క్రమేణా భూమికాస్తా సూర్యుని దగ్గరగా చేరుతుంది. ఆ తరువాత సూర్యుడిలోపడి స్థిరపడుతుంది. ఈ పరిభ్రమణంలో అటు సూర్యుడూ, ఇటు భూమి కోల్పోతున్న శక్తి చాలా స్వల్పం. సూర్యుడిలో భూమి పడిపోడానికి మిలియన్ల సంవత్సరాలు పడుతుంది. భూమి తన పరిధిని స్వల్పంగా మారుస్తూ పోతుంటే రేడియో తరంగాల వంటి పల్సార్స్‌ను విడుదల చేస్తుంటుందని గ్రహించారు. గురుత్వాకర్షణ కోల్పోయిన నక్షత్రాలు వేగంగా తిరిగి, నల్లని నక్షత్రాలుగా రూపొందుతాయి. కొంతకాలానికి అవి స్థిరపడతాయి.

బ్లాక్ హోల్స్ (నల్లనక్షత్రాలు) వున్నాయని 1971 నాటికి హాకింగ్స్ సిద్ధాంతీకరించాడు. ఆకాశం నుండి వచ్చే రేడియోతరంగ సంకేతాలను తొలుత (1967 వరకూ) మరో చోట మనుషులుండి పంపిస్తున్నారని తలపోశారు. తరువాత ఇది నిజం కాదని, యివి పల్సార్స్ అని, పరిభ్రమించే న్యూట్రాన్ నక్షత్రాలు పంపేవనీ తెలుసుకున్నారు. ఇంతకూ బ్లాక్ హోల్స్ ఉనికి గ్రహించేదెలా? రెండు నక్షత్రాలు పరస్పరం ఆకర్షించుకుంటున్నట్లు ఖగోళ శాస్త్రజ్ఞులు తెలుసుకున్నారు. అలాగే వెలుగుతున్న నక్షత్రం ఒకటి వెలుగులేని నక్షత్రం పట్ల ఆకర్షితమై తిరుగుతున్నట్లు తెలుసుకున్నారు. ఇలాంటి బ్లాక్‌హోల్‌కు ఒకదానికి సైగ్నస్ ఎక్స్-1 అని పేరు పెట్టారు. ఇలాంటివి విశ్వంలో ఎన్నో వుంటాయని భావిస్తున్నారు.

బ్లాక్‌హోల్స్‌లో వేడి విపరీతంగా వుంటుంది. అవి చిన్నవైతే వాటి వేడి కూడా ఎక్కువే. చిన్న బ్లాక్‌హోల్స్‌ను కనిపెట్టడం కూడా సులభం అని హాకింగ్స్ భావించాడు.

బ్లాక్‌హోల్ చుట్టూవున్న ప్రదేశంలో గురుత్వాకర్షణ ప్రభావం వుంటుంది. బ్లాక్‌హోల్‌లో ఏదో ఒక పదార్థం ఆకర్షితమైనా, ఎంటోపీ పెరుగుతుంటుంది. బ్లాక్‌హోల్స్ నుండి రేడియేషన్ వస్తుంది. స్థిరంగా వుండే బ్లాక్‌హోల్స్ నుండి కూడా రేడియేషన్ బయటపడుతుంది. బ్లాక్‌హోల్ నుండి ఏదీ రాదనుకుంటే, ఇలా రేడియేషన్ వస్తుందనటమేమిటి? బ్లాక్‌హోల్ పరిసరాల నుండి అలా వస్తుందని హాకింగ్స్ చెప్పాడు. క్వాంటం సిద్ధాంతం పేర్కొన్న అస్థిరత్వ సూత్రం ఆధారంగా, బ్లాక్‌హోల్ చుట్టూ వుండే ప్రదేశంలో శూన్యావస్థ లేదు. అక్కడ క్షేత్రంలో కొంత అస్థిరత్వ గురుత్వాకర్షణ, కాంతి కిరణాలున్నాయి. పరోక్ష ప్రభావాల వలన అలాంటి కిరణాలు వున్నాయని గ్రహించవచ్చు. ఈ పదార్థ కణాలలో జంటలున్నప్పుడు ఒకటి పదార్థకణంగానూ, మరొకటి పదార్థ వ్యతిరేకకణంగానూ వుంటుంది. ఇందులో ఒకదానికి పాజిటివ్ శక్తి వుంటే, మరొకదానికి పరోక్షశక్తి వుంటుంది. పరోక్షశక్తి గలది తొందరగా హరించిపోతుంది. వాస్తవకణాలకు ప్రత్యక్షశక్తి వుంటుంది. రెండూ కలిస్తే పరస్పరం హరించిపోతాయి.

బ్లాక్‌హోల్స్ వుంటే వాటినుండి గామాకిరణాలు, ఎక్స్‌రేలు వస్తుండాలి. పరిశోధకుడు బ్లాక్‌హోల్‌లో పడిపోతే ఛిన్నాభిన్నమైపోతాడు గనుక ఏం జరిగిందో అతడు మనకు చెప్పే అవకాశం లేదు. కాని అతని సాంద్రత మేరకు బ్లాక్‌హోల్ పెరుగుతుంది గనుక, రేడియేషన్ రూపంలో తిరిగి విశ్వంలోకి వస్తుంది.

బ్లాక్‌హోల్‌లో ఏది పడినా ధ్వంసమైనట్లే. విశ్వం కూడా ఒకసారి ఎప్పుడో ధ్వంసమౌతుందని సిద్ధాంతీకరిస్తున్నారు. విశ్వం ప్రారంభం కావడం కూడా పెద్ద ప్రేలుడుతో మొదలయిందనుకుంటున్నారు.

ఈ విశ్వానికి ఆది అంతం వుందా? ఉంటే ఎలా జరిగింది అనేది సైన్సుకు పెద్ద సమస్యే. విశ్వం పెద్ద ప్రేలుడుతో ఆరంభమై తరువాత విస్తరిస్తూ పోతున్నదంటారు. దీని ప్రకారం రేడియేషన్‌గాని, పదార్థంగాని చల్లబడుతూ పోతుంది. వేడి ఎక్కువగా వున్నప్పుడు కణాలు వేగంగా కదులుతూ, పరస్పర ఆకర్షణను తప్పించుకోగలవు. చల్లారుతున్న కొద్దీ కణాల మధ్య ఆకర్షణ పెరిగి, ఆకట్టుకుంటాయి. ఎక్కువ వేడి వున్నప్పుడు కణాలు, అందుకు వ్యతిరేక కణాలు జంటలుగా ఉత్పత్తి అవుతాయి. ఇవి కొన్ని పరస్పరం తారసిల్లి హరించుకపోతాయి. హరించేదానికంటే ఉత్పత్తి ఎక్కువగా వుంటుంది. వేడి తక్కువ అవుతున్నప్పుడు కణాలు తక్కువ శక్తితో వుంటాయి గనుక కణ-వ్యతిరేకకణజంటల ఉత్పత్తి కూడా తగ్గుతుంది. అప్పుడు పరస్పరం హరించుకపోవడమూ ఎక్కువగానే వుంటుంది.

పెద్ద ప్రేలుడుతో విశ్వం ఆరంభమైనప్పుడు వేడి విపరీతంగా వుండేది. తరువాత విశ్వవిస్తరణ ఆరంభమై రేడియేషన్ తగ్గింది. ఈ తగ్గుదల ప్రతి సెకండ్‌కూ ఎక్కువగానే వుంది. అప్పుడు విశ్వంలో ఫోటాన్లు, యెలక్ట్రాన్లు, న్యూట్రినోలు, వాటి వ్యతిరేక కణాలు ఉండేవి. విశ్వం విస్తరిస్తూ చల్లబడుతుంటే కణం వ్యతిరేక కణోత్పత్తి తగ్గిపోయింది. యెలక్ట్రాన్లు - వ్యతిరేక యెలక్ట్రాన్లు హరించుకపోయి, ఫోటాన్లు యెక్కువకాగా, యెలక్ట్రాన్లు కొద్దిగా మిగిలాయి. న్యూట్రినోలు, వ్యతిరేక నూట్రినోలు బలహీనంగా పరస్పరం తారసిల్లడం వలన, అవి హరించుకపోగా, మిగిలాయి. పెద్ద ప్రేలుడు అనంతరం, వేడి తగ్గుతుండడం, విశ్వవిస్తరణ సాగుతుండడంతో, ప్రోటాన్లు, న్యూట్రాన్లు బలీయమైన న్యూక్లియర్ శక్తి ఆకర్షణను తప్పించుకోలేక భారమైన హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేశాయి (డియోటేరియం) అయితే పెద్ద ప్రేలుడు జరిగిన కొద్ది గంటలకే హీలియం, ఇతర కణాల ఉత్పత్తి ఆగిపోయింది. ఆ తరువాత విస్తరణ జరుగుతూ పోయింది. యెలక్ట్రాన్లు, నూక్లైలు కలసి అణువులుగా రూపొందాయి. విశ్వంలో దట్టంగా పదార్థం వున్నచోట విస్తరణ ఆలస్యంగా జరిగింది. గురుత్వాకర్షణే యిందుకు కారణం. అలాంటి చోట్ల మళ్ళీ పరిభ్రమణ జరగడం, కొన్ని నక్షత్రాలు పళ్ళెం ఆకారంగా, కొన్ని బంతి ఆకారంగా ఏర్పడ్డాయి.

ఈ విశ్వపరిణామంలో మన సూర్యుడు పరిభ్రమిస్తున్న గాస్ నుండి జనించడం, ఇందులో భారమైన కణాలు 2 శాతం వుండటం కద్దు. మరికొన్ని భారకణసముదాయం సూర్యుని చుట్టూ గ్రహాలుగా ఏర్పడ్డాయి. వీటిలో మన భూమి కూడా ఒకటి.

భూమి ఏర్పడినప్పుడు చాలా వేడిగా వుంటూ, వాతావరణం లేకుండా సాగింది. క్రమేణా చల్లారి శిలలనుండి వచ్చిన గాస్ ద్వారా వాతావరణాన్ని యేర్పరచింది. అదీ ప్రాణానికి పనికొచ్చేది కాదు. అందులో ప్రాణవాయువులేదు, అప్పటి గాస్‌లు అన్నీ మనకు హాని కలిగించేవే. హైడ్రోజన్ సల్ఫైడ్ (కుళ్ళిన కోడిగుడ్డు వాసన) భరించి జీవించగల ప్రాణులు వుండి వుండవచ్చు. ఆనాడు సముద్రాలలో ఇవి పెంపొందాయి. ఈ పరిణామ క్రమంలో ఆదిమదశ జీవులు హైడ్రోజన్ సల్ఫైడ్ స్వీకరించి, ఆక్సిజన్ వదలి వుండొచ్చు. అంతటితో వాతావరణం మారింది. నేడు మనము గమనిస్తున్న తీరులో ఈ వాతావరణము ఆరంభమై ఉన్నత జీవులకు అవకాశము లభించింది.

విశ్వం, మన సైన్సుకు తెలిసినంతలో, పెద్ద ప్రేలుడుతో ఆరంభమై, అతివేడిగా వుంటూ, విస్తరించే కొద్దీ చల్లారుతూ పరిణమిస్తున్నది. అయినా ఇంకా ఎన్నో సందేహాలు వస్తున్నాయి. సాపేక్షతా సిద్ధాంతం కొంతవరకు సమాధానం చెబుతుండగా, మరికొన్నిటికి క్వాంటం అస్థిరత సూత్రం జవాబిస్తున్నది.

విశ్వం పరిమితమైనదీ, అవధులు లేనిది అని సాపేక్షతా సిద్ధాంతం పేర్కొంటున్నది. విశ్వంలో నియమాలు వున్నాయి. ఇవి దేవుడు సృష్టించాడని సరిపెట్టుకున్నా, పరిణామంలో అవి సైన్స్‌కు అవగాహన అవుతున్నాయి. దేవుడు తొలిదశలో ఇలాంటి నియమాలు ఎందుకు సృష్టించాడనేది తెలియదన్నారు. మనకు అర్థంకాని రీతిలో నియమాలు ప్రారంభించిన దేవుడు వాటిని పరిణామంలో వాటంతట అవే పెంపొందేటట్లు ఎందుకు వదలేసినట్లు? సంఘటనలు అడ్డగోలుగా జరగడం లేదని సైన్స్ చెబుతున్నది. అందులో నియమం వుంది. అలాంటి నియమం తొలిదశకు వర్తించదా. తొలిదశలో ఎన్నో అవకాశాలుండగా, అందులో ఏదో ఒకటి ఎంపిక చేసి, విశ్వాన్ని ప్రారంభించారనుకుందాం. అలాంటి విశ్వం నుండి క్రమబద్ధమైన విశ్వం వచ్చింది. అవధులు లేని పరిమిత విశ్వానికి ఆది అంతం లేదు గనుక సృష్టికర్తకు చోటులేదని హాకింగ్ చెప్పాడు.

## వృద్ధాప్యం రాకుండా!

కవల పిల్లల్లో ఒకరు భూమిపై వున్నారనుకోండి. అతడి పేరు పృథ్వీ. మరొకరు ఆకాశంలో రాకెట్‌లో కాంతివేగంతో ప్రయాణం చేస్తున్నాడనుకొండి. అతడి పేరు ఆకాశ్. ఒకరికొకరు కాంతి సంకేతాలు పంపించుకుంటూ వుంటారు. అవి చేరడానికి పట్టే సమయం గమనించాలి. దూరం ఎక్కువ అయ్యే కొద్దీ సంకేతాలు అందడం ఆలస్యమౌతుంటుంది. చంద్రుడి వద్దకు ఆకాశ్ వెళ్ళాడనుకొండి. అక్కడినుండి పృథ్వికి సంకేతం ఒక్క సెకండ్‌లో అందుతుంది. సూర్యుడి దగ్గరకు వెళ్ళాడనుకోండి. అక్కడనుండి ఆకాశ్ పంపే సంకేతం పృథ్వికి 8 నిమిషాలలో చేరుతుంది. సమీప నక్షత్రానికి వెళ్ళాడనుకోండి 4 సంవత్సరాలకు గాని ఆకాశ్ పంపిన సంకేతం పృథ్వికి చేరదు.

కాంతివేగానికి కొంచెం తక్కువగా ఆకాశ్ 10 కాంతి సంవత్సరాలు దూరం వెడితే, అతడి

గడియారంలో 4.84 సంవత్సరాలుగా చూపుతుంది. మరో పది సంవత్సరాలకు గాని భూమి మీదవున్న పృధ్వికి యీ సంగతి తెలియదు. అప్పటికి అతడి గడియారం ప్రకారం 21.1 సంవత్సరాలు అవుతుంది.

మొత్తంమీద 22.2 సంవత్సరాలకు ఆకాశ్ తిరిగి భూమి మీదకు వస్తాడు. తిరుగు ప్రయాణంలో వేగం హెచ్చించి 1.1 సంవత్సరంలోనే చేరుకుంటాడు. తిరిగి వచ్చిచూస్తే భూమిపై 22.2 సంవత్సరాలు గడిచాయి. భూమిమీద వున్న పృధ్వి తనకంటె 12.5 సంవత్సరాలు ముసలివాడైనట్లు కనుగొంటాడు. ఈ మార్పులన్నింటికీ, ఆకాశ్ ప్రయాణ వేగం, దానిలో మార్పులు కారణం. ఇందులో రెండు ప్రధానాంశాలు పనిచేస్తాయి. ఒకటి డాప్లర్ ప్రభావం అంటారు. మనకు దగ్గరగా కారు వస్తుంటే శబ్దం పెరిగిపోతున్నట్లు, దూరంగా పోతుంటే శబ్దం సన్నగిల్లుతున్నట్లు వుంటుంది. క్రిస్టియన్ డాప్లర్ (1803-1853) అనే శాస్త్రజ్ఞుడు పేర్కొన్న యీ సూత్రాన్ని కాంతికి అన్వయిస్తే, దూరంగా జరిగిపోతున్న వాటి నుండి వచ్చేకాంతి ఎర్రగానూ, దగ్గరగా వస్తున్న వాటి కాంతి నీలంగానూ వుంటుంది. పైన మనం చర్చించిన అంశంలో డాప్లర్ ప్రభావం చూస్తాం. రెండవది కాలం కుంచించుకపోవడం, ఇద్దరి పరిశీలకుల మధ్య ఎడం ఎక్కువ అవుతుంటే, వారి గడియారాలు నెమ్మదిగా తిరుగుతున్నట్లు, చేరువగా వస్తుంటే గడియారాలు తొందరగా తిరుగుతున్నట్లనిపిస్తుంది. సాపేక్షతా సిద్ధాంతం కాంతివేగాన్ని గురించి చర్చించగా వచ్చిన సారాంశమిది.

## యాంటిమేటర్

ఆధునిక సైన్స్ పరిశోధనలలో బయటపడిన మరొక ఆశ్చర్యకరమైన అంశం యాంటిమేటర్!

అందులో మీ ప్రతిబింబం కనిపిస్తే ముద్దుగానే వుండొచ్చు. కాని నిజలోకంలో అలా కనిపిస్తే షేక్‌హేండ్ ఇవ్వద్దని స్టీఫెన్ హాకింగ్ హెచ్చరించాడు. మన ప్రతిబింబం నిజలోకంలో మన వ్యతిరేక పదార్థం. వ్యతిరేకపదార్థాలు తారసిల్లితే రెండూ అంతమౌతాయి. మరి ఏమి మిగులుతుంది? రేడియేషన్ రూపంలో అది వస్తుంది. అంటే పదార్థం నాశనం కాదు. రూపం మారుతుంది అనే దానికి సరిపోతుంది, రెండు అలలు ఢీకొంటే ప్రశాంతత ఏర్పడినట్టు. యాంటిపదార్థం విశ్వంలో ఎక్కడైనా వుందేమో ఇంకా తెలియలేదు. సైన్సుకు తెలిసినంతవరకూ పదార్థమేవుంది. సూక్ష్మలోకంలో అణువుల స్థాయిలో పదార్థ వ్యతిరేక లక్షణాలున్నవని కనుగొన్నారు. వీటినే ఎలక్ట్రాన్లలో చూచి పాజిట్రాన్ అన్నారు. కణం - యాంటికణం ఢీకొంటే వాటిలోని ఎలక్ట్రిక్ ఛార్జి పరస్పర విరుద్ధ స్వభావం గనుక అది నాశనమౌతుంది. కాని వాటిలోవుండే ద్రవం హరించిపోదు. ద్రవ్యరాశి కూడా శక్తే. అది రూపం మార్చుకుంటుంది. అప్పుడే గామా కిరణాలు వస్తాయి. హరించుకపోయేముందు ఎంత మేరకు ద్రవ్యరాశి (మాస్) వున్నదో, అంత శక్తి కూడా గామా కిరణాలుగా వస్తాయి.

యాంటిమేటర్ లక్షణాలు గల యాంటి ప్రోటాన్, యాంటి న్యూట్రాన్‌లు కలిపితే 1965లో యాంటిహైడ్రోజన్ న్యూక్లియస్ ఏర్పడింది. అలాగే యాంటి హీలియం కూడా రూపొందించారు. ఇదంతా సూక్ష్మలోకములో పరిశోధనల ఫలితమే. స్థూల ప్రపంచములో యిలా యాంటిమేటర్ భారీగా వున్నట్లు తేలలేదు. అలాంటిది వుండే అవకాశం లేకపోలేదు.

ఎక్కడైనా నక్షత్రం యాంటిమేటర్‌తో వుంటే అక్కడ గ్రహంలో మనుషులుంటే, వారికి మనం యాంటిమేటర్‌గా కనిపిస్తామన్నమాట!

*- హేతువాది, మార్చి, మే, జూన్ 1993*

# సూదుల మందు (అక్యూపంక్చర్)

నమ్మకమా? శాస్త్రీయమా?

అక్యూపంక్చర్ వైద్య విధానం ప్రాచీన చైనాలో వుండేది. సైన్సు అభివృద్ధి చెందక పూర్వం, చైనాలో యిదొక నమ్మకంగా ప్రబలింది. దేహమంతటా జీవశక్తి ("కి") ప్రవహిస్తుంటుందని, సూదులు గుచ్చడం ద్వారా, అనారోగ్యంగావున్న వ్యక్తిలో జీవశక్తిని ప్రభావితం చేయవచ్చునని చైనీయులు కొందరు నమ్మేవారు. మొదట్లో దేహంలో 365 చోట్ల సూదులు గుచ్చవచ్చని గుర్తించారు. అవి రానురాను పెరుగుతూపోగా, ప్రస్తుతం 2 వేల స్థానాలు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల యివి 2500 వరకూ వున్నాయి! అక్యూపంక్చర్ విధానాన్ని పాటించే వారిలో బేదాభిప్రాయాలున్నాయి. నాలుగు వేల సంవత్సరాల క్రితం చైనాలో అక్యుపంక్చర్ అరంభమైనప్పుడు, పంచభూతాలు - నీరు, లోహం, భూమి, అగ్ని, చక్క - దేహంపై ప్రభావం చూపెడతాయని నమ్మారు. దేహంలోని జీవశక్తికి స్త్రీ, పురుష (ఇన్, యంగ్) లక్షణాలున్నాయన్నారు. వీటి మధ్య సమన్వయం సాధించడానికి, సున్నితమైన సూదులు వాడి, దేహంలోని 14 స్థానాలలో వున్నవాటిని ప్రేరేపించవచ్చుననీ, ఉత్తేజపరచడం సాధ్యమనీ భావించారు. ఒక్కొక్క స్థానం ఒక అంగానికీ, ఒక్కొక్క పనికే చెందుతాయన్నారు. సున్నిత సూదులు ఆయా స్థానాలలో గుచ్చి, జీవశక్తిని తగిన రీతిలో మలుస్తారన్నారు. గుచ్చిన సూదుల్ని కొన్ని నిమిషాలు అట్టిపెట్టి, తీసేసిన తరువాత, సూదులు గుచ్చినచోట్ల ఆకులతో స్వల్పంగా కాల్చేవారు.

వ్యక్తికి వున్న రోగలక్షణాల బట్టి, ఏ స్థానాలలో సూదులు గుచ్చాలో నిర్ధారిస్తారు. నాడిని చూచి, స్త్రీపురుషులకు వేర్వేరుగా, యీ సూది చికిత్స చేస్తారు. దేహంలోని 12 అంగాలకు ప్రాతినిధ్యం వహించే నాడిని గుర్తించి, చికిత్స చేస్తారు. సూదులు గుచ్చడం, తీయడం, ఎంతసేపు వుంచాలనడం, ఎక్కడ గుచ్చాలనడం, ఆయా వ్యక్తులకు వచ్చిన రోగాన్ని బట్టి వైద్యుడు నిర్ధారిస్తాడు.

చైనా చరిత్రలో అక్యూపంక్చర్‌కు ఆదరణ, అనాదరణ వుంటూ వచ్చింది. కొన్నాళ్ళు బ్రహ్మరథం పట్టడం ఒక్కోసారి యీసడించి పక్కన బెట్టడం చైనా సుదీర్ఘ చరిత్రలో జరిగింది.

అక్యూపంక్చర్ పేర్కొనే దేహస్థానాలు (జ్యోతిష్యంలో రాసులవలె) అనాడు యీనాడు శాస్త్రీయంగా రుజువుకాలేదు. దేహంలో జీవశక్తి ప్రవహిస్తుందని, ఇది స్త్రీ పురుష అంగాలలో భిన్న తీరులలో వుంటుందనేది కేవలం నమ్మకం మాత్రమే.

మూత్రపిండాలు (కిడ్నీ), మానవశక్తి (యిచ్ఛ)కీ, భయానికి కేంద్రం అని, కాలేయం (లివర్) వలన కన్నీళ్ళు వస్తాయని, ఆలోచనకు కూడలి (స్ప్లీన్) ప్లీహం అనీ అక్యూపంక్చర్ నమ్మకాలలో పేర్కొనదగినవి. దేహమంతటికీ చెందిన అక్యూపంక్చర్ స్థానాలు చెవులలో వున్నాయని వీరి విశ్వాసం.

దేహంలో యే భాగం ఎక్కడవుందో ఆధునిక వైద్యవిజ్ఞానం పరిశోధించి చెబుతున్నది. ఇందుకు అక్యూపంక్చర్ పూర్తిగా భిన్నం, విరుద్ధం కూడా. సూదులు గుచ్చి, సుఖ ప్రసవం చేయించవచ్చని, బాధా నివారణకు అక్యూపంక్చర్ మంచిదనీ ఆపరేషన్లకు (అనస్తేషియా) మత్తుమందువలె యిది ఉపకరిస్తుందనీ ప్రచారంతెచ్చి, బాగా వ్యాపారం చేస్తున్నవారున్నారు. కొందరు డాక్టర్లు తాము దేహంలో కొత్త స్థానాలు కనుగొన్నామంటూ, వాటికి తమ పేరు పెట్టి వైద్యం పేరిట డబ్బు గుంజుతున్నారు.

మావో చివరి రోజులలో చైనాలో అక్యూపంక్చర్ ప్రచారం చేశాడు. అందువలన కమ్యూనిస్టులు కొందరు యిది పార్టీపరంగా స్వీకరించి, ప్రచారసాధనంగా వాడుకుంటున్నారు. అక్యూపంక్చర్‌ను వివిధ రీతులలో మావో ప్రచారం చేయించాడు. ప్రభుత్వ ప్రచారాలు చేసినట్లే, కొందరు రోగులు ఆపరేషన్ సమయంలో మావోను పొగడుతూ కులాసాగా కబుర్లు చెబుతున్నట్లు ఫోటోలు చూపి ఫిల్మ్‌తీసి అక్యూపంక్చర్ ఒక చైనా కమ్యూనిస్టు విధానంగా ముద్ర వేశారు!

చైనాలో ప్రాచీన మూఢనమ్మకంగా బయలుదేరిన అశాస్త్రీయ విధానం కమ్యూనిస్టు మావో ప్రచారంవలన ప్రపంచ వ్యాప్తమయింది.

అక్యూపంక్చర్‌లో మందులులేవు, కనుక మందులవలన కలిగే చెడు యిందులో లేదనీ ప్రచారం చేస్తున్నారు.

అక్యూపంక్చర్ విధానంలో వాడే సూదులు పొరపాటున, దేహస్థానంలో సరైన చోటగాని, కొంచెం పక్కన గుచ్చినా, జీవశక్తి ప్రవాహాన్ని ప్రభావితం చేయజాలదని చెప్పారు? అదేమోగాని, కొన్నిచోట్ల నరాలలోకి గుచ్చిన సూదులు ప్రమాదాలకు దారితీసిన సందర్భాలున్నాయి. నేడు గుచ్చే సూదుల వలన ఎయిడ్స్ వ్యాధి (ఇది వస్తే నయంకాదు ఇంకా మందు కనుక్కోలేదు గనుక) రావచ్చు. అంటువ్యాధులు ఒకరివి మరొకరికి రావచ్చు. కేవలం నొప్పి నివారణే చికిత్స కాదు. రోగనిర్ధారణ ముఖ్యం. అక్యూపంక్చర్‌కు అది తెలియదు.

ఆధునిక వైద్య విజ్ఞానం కనుగొన్న దేహంలోని నరాలు, ఇతర సున్నిత భాగాలు యేవీ అక్యూపంక్చర్‌కు తెలియవు.

కొందరు డాక్టర్లు, సూదులకు విద్యుత్ పరికరాలు అమర్చి, గుచ్చుతూ, రోగుల్ని ఆకర్షిస్తున్నారు. దీని వలన అదనంగా రోగికి ఒరిగేదేమిలేదు. కంప్యూటర్ వాడి జ్యోతిష్యంతో ఇంకా యెక్కువ మోసం చేస్తున్న రకంగానే యిది కూడా వుంది.

కొందరు అక్యూపంక్చరులో ఆధునికులమని పేర్కొంటూ, ప్రాచీన చైనా విధానానికి సవరణలు సూచించారు. దేహంలో స్థానాలు లేవన్నారు. దేహం అంతటా అక్యూపంక్చర్ సూదులు వాడవచ్చునంటున్నారు. నొప్పులు తగ్గించటానికి రోజుల తరబడి విద్యుత్ పరికరాలతో కూడిన సూది వైద్యం వీరు వాడుతున్నారు.

మరికొందరు - అక్యూప్రజర్ అంటే సూదుల బదులు - ఒక విధమైన మసాజ్ పద్ధతిని వాడుతున్నారు. ఇంతకూ సారాంశం యేమంటే, అక్యూపంక్చర్‌లో శాస్త్రీయం యేదీలేదు, వైజ్ఞానిక పరీక్షకు నిలబడేది యేదీ యిందులో లేదు. అలాంటి శాస్త్రీయ విధాన పరీక్షలు ఎక్కడా జరగలేదు. అయినా కొందరు అక్యూపంక్చర్ కూడా సైంటిఫిక్ అని జనాన్ని మోసం చేస్తున్నారు. ఏదో కారణం వలన తగ్గిన రుగ్మతల్ని తమ వలననే తగ్గిపోయాయని వీరు ప్రచారం చేస్తున్నారు. తగ్గకపోతే వీరేమీ బాధ్యత వహించరు. వైద్యవిధానంలో ఏ మాత్రం పరిచయంలేని జనం ఇలాంటి మోసాలకు తాత్కాలికంగా ఆకర్షితులై బాధలకు గురికావటం జరుగుతుంది.

***- హేతువాది, జూన్ 1993***

# పుస్తక పరిచయాలు

# నేను ముస్లింను ఎందుకు కాదు?

Why I am not a Muslim by IBN WARRAQ,

(Pub :- Promethus Books, U.S.A.)

కథ చెప్పడమేగాదు, వినడం కూడా చేతకావాలన్నాడు రాచకొండ విశ్వనాధశాస్త్రి. పుస్తకాలు రాయడం ఒక ఎత్తు. వాటిని అచ్చు వేయడానికి ధైర్యం కావాలి. సాల్మన్ రష్దీ, తస్లీమానస్రీన్ (బంగ్లాదేశ్ "లజ్జ" రచయిత్రి) రచనలు వెలువడిన తరువాత, చాల మంది ప్రచురణకర్తలు వివాదాస్పద రచనలంటే భయపడుతున్నారు. ముఖ్యంగా ముస్లింలను, మహమ్మద్, కొరాన్, ఇస్లాం చట్టాలను విమర్శించే గ్రంథాల జోలికి పోకూడదనుకుంటున్నారు. అలాంటి సందర్భంలో అమెరికాలోని హ్యూమనిస్టు ప్రచురణ సంస్థ ప్రామిథిస్ వారు ధైర్యంగా యీ పుస్తకాన్ని యిటీవలే వెలువరించడం ఆహ్వానించదగిన మార్పు.

పుస్తకరచయిత ముస్లిం. ఇస్లాంను బయటివారు విమర్శించిన రచనలు చాలా వున్నాయి. వాటిని ముస్లింలు అంతగా పట్టించుకోరు. కాని తమలోని ఒక వ్యక్తి విమర్శిస్తే, చంపేసే వరకూ, అమానుషంగా ప్రవర్తిస్తారు. శటానిక్ వర్సెస్ రాసిన సాల్మన్ రష్దీని చంపేయమని ఇస్లాం అధిపతి అయొతుల్లా ఖొమిని ఉత్తర్వులు జారీచేశారు. బంగ్లాదేష్‌లో తస్లీమా నస్రీన్‌కు తలదాచుకునే అవకాశం లేక, స్వీడన్‌కు పారిపోవాల్సిన దుర్గతి పట్టించారు. వారి పుస్తకాలను నిషేధించారు. మళ్ళీ యీ దేశాలన్నీ మానవ హక్కుల పత్రం పాటిస్తామని సంతకాలు చేసిన వారే! ఇబన్ వారక్ రచన చాలా లోతుపాతులతో, నిశిత పరిశీలనతో, అనేక మంది రచయితలను పట్టి చూచి రాసిన గ్రంథం. అంతా అయిన తరువాత ఇక తాను ముస్లింగా వుండలేనంటున్నాడు. అది ధైర్యానికి నిదర్శన ప్రకటన.

బెర్ట్రాండ్ రస్సెల్ నేనెందుకు క్రైస్తవుణ్ణి కాదు అనే రచన చేస్తే ప్రపంచంలో ఇతర మతస్తులు మెచ్చుకున్నారు. ఇబన్ వారక్ అంటాడు. రసెల్ రచనలో క్రీస్తుకు బదులు అల్లాను పెడితే, అదంతా ముస్లింలకు యధాతథంగా వర్తిస్తుంది. అలాగే అన్ని మతాలకూ చెందుతుంది. నేనెందుకు హిందువును కాలేదు అని యిటీవల రామేంద్ర బీహార్‌నుండి ఒక రచన ప్రచురించాడు. అదికూడా రసెల్, ఇబన్ వారక్ ధోరణిలోదే.

ఈ రచనలో 17 అధ్యాయాలు వున్నవి. ఇబన్ వారక్ చాలా పరిశోధన చేసి ప్రతి అంశాన్ని పట్టిచూచి, రాశాడు. రష్దీ వ్యవహారంతో తొలి అధ్యాయం ఆరంభమౌతుంది. 1989 ఫిబ్రవరిలో ఇరాన్ అధిపతి అయొతుల్లా ఖొమిని ఫత్వా జారీచేసి సాల్మన్ రష్దీని చంపమన్నాడు. పాశ్చాత్యులలో కొందరు ముస్లింలను దువ్వడానికిగాను యీ చర్యను సమర్ధించారని, ఖొమిని చర్యను ఖండించలేకపోయారని ఆయన చూపారు. ఫ్రెంచి తత్వవేత్త ఫూకోసైతం ఖొమిని చర్యల్ని ఆహ్వానించి, ఇరాన్‌లో దారుణాల పట్ల కళ్లు మూసుకున్నట్లు రచయిత ప్రస్తావించారు. శాస్త్రీయ

రంగంలో పరిశోధనలు, రుజువులు, ప్రగతిని కొంత వరకు క్రైస్తవులు స్వీకరించి, మత ఛాందసాన్ని సవరించారని, ఇంకా ముస్లింలు ప్రారంభించ లేదని రచయిత అన్నారు. అయితే శాస్త్రీయ ఉప్పెనకు కొరాన్ తట్టుకోలేదని కూడా ఆయన అన్నాడు.

రెండో అధ్యాయంలో ఇస్లాం పుట్టుపూర్వోత్తరాలు, యూదు క్రైస్తవ మతాల, గ్రంధాల ప్రభావం సుదీర్ఘంగా చర్చించారు. విగ్రహారాధన వ్యతిరేకించే ముస్లింలు మక్కాలో కాబా" నల్లరాతిని ప్రతిష్టించి, ఆరాధించే రీతులు ఎలా వచ్చాయో వివరించారు. ఇది ఆకాశంనుండి వూడిపడిన ఉల్క అని కీ॥శే॥ కారల్‌శాగన్ రాశారు. మక్కా మీదుగా ఎమెన్, సిరియా వెళ్ళే ఒంటె వ్యాపారస్తులు కాబావద్ద ఆగి, పక్కనే వున్న ఊట బావి నీటితో సేద తీర్చుకొని వెళ్ళేవారని రచయిత పేర్కొన్నారు.

మూడో అధ్యాయంలో మూలాధారాల పరిశీలనలో ఎదుర్కొంటున్న సమస్యల్ని, రచయిత కూలంకషంగా చూచారు. ఖురాన్ గురించి ముస్లిం సనాతనులు చెప్పే అబద్ధాలు మొదలు, మహమ్మద్, సంప్రదాయాల వెనుక ఎంత వరకు నిలబడగల చరిత్ర వుందో చూపారు.

నాలుగో అధ్యాయంలో మహమ్మద్ సందేశాలను రచయిత విప్పి చూపారు. మహమ్మద్ గురించి రాసిన వాళ్ళలో చాలా మంది వ్యతిరేకులు కాదని, అయినా వాస్తవాలు తెలిపారనీ, ముస్లింలు అదంతా గ్రహిస్తే అంత అభిలషించరని రచయిత అన్నారు. మహమ్మద్‌లో మక్కా కాలంలో మహమ్మద్ చిత్త శుద్ధిగల మత నమ్మకస్తుడుగా వున్నాడు.

ఖురాన్ గురించి ఐదవ అధ్యాయం విపులంగా పరిశీలిస్తుంది. ముస్లింలు ఖురాన్ పవిత్రమనీ, దైవదత్తమనీ, సత్యమనీ నమ్ముతారు. అలాంటి గ్రంథంలో పరస్పర విరుద్ధాలు, ప్రక్షిప్తాలు, భిన్న పాఠాంతరాలు వుండడాన్ని రచయిత చూపాడు. ఖురాన్ సూచించే శిక్షలో మానవహక్కుల్ని ఎలా ఉల్లంఘిస్తున్నాయో రచయిత పేర్కొని ఇస్లాం దేశాలన్నీ మానవహక్కుల పత్రం అంగీకరించిన విషయం గుర్తు చేశారు. బైబిల్ వలె ఖురాన్ కూడా సృష్టివాదం ఒప్పుకోగా, సైన్స్ అందుకు విరుద్ధంగా పరిణామ వాదానికి సాక్ష్యాధారాలు చూపుతున్నది. అలాగే జీవంకూడా.

ఇస్లాంలో నియంతృత్వం ఎలా వుందో రచయిత మరొక అధ్యాయంలో చూపాడు. ఇస్లాం అంతా విధులతో కూడినది. పుట్టిన దగ్గరనుండీ చనిపోయే వరకూ జీవితాన్ని అదుపులో పెట్టడం ఇస్లాం పని. కనుకనే ఇస్లాంలో సెక్యులరిజం లేదు. అంటే మతం - రాజ్యం విడిగా చూడడం లేదు. ఇస్లాం యావత్తూ నాలుగు స్థంభాలపై ఆధారపడుతుంది. ఖురాన్, సున్నా, (ప్రవక్త ప్రవచనాలు), వీటిని గురించి ఒక అంగీకారానికి వచ్చిన ముస్లిం పండితుల మాటలు, ఉపమానాలతో కూడిన వాదన. రచయిత ననుసరించి ఖురాన్ 7-9 శతాబ్దాల మధ్య రాసిందే. ఇందులో యూదు, క్రైస్తవ, జొరాస్ట్రియన్, సమారిటన్ నుండి స్వీకరించి చేర్చినవి చాలా వున్నాయి. ఇందులో శాస్త్రీయంగా నిలబడని దోషాలు, వ్యాకరణ భాషా దోషాలు, కాలదోషం,

పరస్పర విరుద్ధ విషయాలు, అసంబద్ధాలు పేగన్ల పట్ల అసహనం, హింస, హత్య, స్త్రీపురుష అసమానతలు, బానిసత్వాన్ని అంగీకరించం, అమానుష శిక్షలు, మానవ వివేచన పట్ల జుగుప్స వున్నాయి. దైవదత్తమైన వాటిలో యిలా వుండడం అర్థం లేనిదని రచయిత ఉద్దేశం. ఉదారత, తల్లి దండ్రులపట్ల గౌరవం వంటివి వున్నప్పటికీ అసంబద్ధాల మధ్య అవి మునిగిపోయాయి.

ఇస్లాంలో పురోహిత వర్గం లేదని ముస్లిం పండితులు చెబుతారు. కాని ఇస్లాంకు సరైన వ్యాఖ్యానం చేసే పేరిట అన్ని చోట్ల పురోహిత వర్గం తిష్ఠ వేసి పెత్తనం చేస్తున్నది. ఉలేమాలు వీరే. ముస్లింలలో నిశిత పరిశీలన, శాస్త్రీయ దృక్పథం పెంపొందకుండా నిరోధిస్తున్నది యీ ముల్లాలే. వెయ్యేళ్ళ క్రితం ఆనాటి పరిస్థితులలో వచ్చిన హరియా చట్టాలు నేడు చారిత్రకంగా చూడాలేగాని, తుచ తప్పకపాటిస్తే నైతిక ప్రగతి వుండదని రచయిత ఘంటా పథంగా చెప్పారు.

**మానవహక్కులు :** ముస్లిం దేశాలు ఇస్లాంను పాటిస్తూనే, మానవహక్కుల్ని అంగీకరిస్తూ సంతకాలు చేశాయి. ఐక్యరాజ్య సమాఖ్యలో వీరు సభ్యులే. కాని ఆచరణలో అడుగడుగునా మానవ హక్కుల్ని ఇస్లాం అడ్డు కొంటున్నది. ఇస్లాంలో స్త్రీలు పురుషులు సమానం కాదు. పురుషుడి సాక్ష్యంలో సగం విలువ మాత్రమే స్త్రీ సాక్ష్యానికి వుంటుంది. స్త్రీలకు అన్ని విధాల స్వేచ్ఛను ఇస్లాం పరిమితం చేస్తుంది. ముసుగు వేసుకోమంటుంది. మానవ హక్కుల ప్రకారం స్త్రీ పురుషులకు హక్కులు స్వేచ్ఛ, భావాలు సమానంగా వుండాలి. కాని ఇస్లాం ప్రకారం స్త్రీలు ముస్లింలు కాని వారిని పెళ్ళి చేసుకోరాదు. ముస్లిం దేశాలలో నివశించే ముస్లిమేతరులకు, కోర్టులో గాని, మరెక్కడా సమాన హక్కులు లేవు. ముస్లిం దేశాలలో నాస్తికులు, నమ్మకం లేనివారు చంపబడాల్సిందే. ముస్లిం దేశాలలో ఇతరమతాల వారు తమ ప్రార్థనలు చేసుకోడానికి, బాహాటంగా గుడి, చర్చి నిర్మించడానికి, పవిత్ర గ్రంథాలు చదవడానికి వీల్లేదు. మానవహక్కులు బానిసత్వాన్ని వ్యతిరేకిస్తుండగా ఇస్లాం గుర్తిస్తున్నది. బానిస స్త్రీలతో లైంగిక సంపర్కం ముస్లింలకు ఖురాన్ అనుమతిస్తున్నది. (సురా 4:3)

మానవహక్కుల ప్రకారం క్రూరమైన, అమానుషమైన శిక్షలు, మానవత్వాన్ని దిగజార్చే శిక్షలు వుండరాదు. ఇస్లాం ప్రకారం కొరడాతో బహిరంగంగా కొట్టడం, చేతులు కాళ్ళు నరకడం, రాళ్ళు విసరి చంపడం అనుమతిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమని మానవహక్కులు చెబుతుండగా, ఇస్లాం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నది. ముస్లింలలో ఇతరులు మతం మార్చుకొని చేరవచ్చు కాని ముస్లింలు మతం మార్చుకొని వేరేపోడానికి వీల్లేదు.

ప్రజాస్వామ్యం - ఇస్లాం పొసగనివని, మానవహక్కులకు ఇస్లాంలో అవకాశం లేదని రచయిత వివరంగా చెప్పారు. ముస్లింలు ఇతర ప్రపంచంతో పాటు ముందుకు సాగడానికి, మతాన్ని రాజ్యాన్ని విడదీసే సెక్యులరిజం అవసరమని రచయిత అన్నారు.

**స్త్రీలు-ఇస్లాం:** స్త్రీలపట్ల ఇస్లాం ఎలా ప్రవర్తిస్తున్నదో చాలా వివరంగా రచయిత ఒక అధ్యాయంలో

చర్చించారు. క్రైస్తవుల వలె ఇస్లాంకూడా పురుషుని సృష్టి ముందు జరిగిందని భావించారు. స్త్రీల పట్ల ఇస్లాం చాలా క్రూరంగా, హేయంగా ప్రవర్తించిన ఉదాహరణలు రచయిత చూపాడు.

స్త్రీ బహిస్టు సమయంలో ఖురాన్ తాకరాదు, కాబా చుట్టూ తిరగరాదు, ప్రార్థన చేయరాదు, ఉపవాసం వుండరాదన్నారు. స్త్రీ పురుష అసమానత్వం ఖురాన్‌లో నిర్దిష్టంగా వుంది (సురా 2.282) ఆస్తిహక్కులో కూడా అబ్బాయికి రెండు రెట్లు అమ్మాయికి ఒక భాగం చెందాలన్నారు.

రక్తపాతంతో కూడిన పగ సాధింపు ఇస్లాంలో పేర్కొన్నారు. (సురా 2.178) స్త్రీలకంటె పురుషులు వివేచనలో అధికులని ముస్లిం న్యాయవేత్తలు పేర్కొన్నారు.

ముస్లిం స్త్రీల ముసుగు వారి బానిసత్వానికి గృహ నిర్బంధానికి, తక్కువగా చూడడానికి నిదర్శనంగా నిలచింది. ముస్లిం స్త్రీలు అనేకదేశాలలో బయటకు వచ్చి, తమ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను వెల్లడిస్తున్నా, మొత్తం మీద ఇస్లాం వారిని చిన్న చూపు చూస్తూనే వుంది. రచయిత యీ రంగంలో సోదాహరణలతో వివరణ యిచ్చారు.

ఇస్లాం సాహిత్యంలో వైన్, స్త్రీలగురించి రమణీయమైన కవితలు సాహిత్యం యీ రచయితే ప్రస్తావించారు. వైన్ దైవదత్తమని మహమ్మద్ ఒక చోట ఖురాన్‌లో ప్రస్తావించాడు. (16.69) మరొక చోట వైన్ నిషిద్ధం అని కూడా చెప్పాడు (5.92)

ప్రతి మతం ఆహార పానీయాలలో నిషేధాలు పాటించింది. హిందువులు, క్రైస్తవులు దీనికి మినహాయింపుకాదు. ముస్లింలు పందిని నిషేధించారు. చైనాలో ముస్లింలు పంది మాంసం తింటూనే, దానిని పోర్క్ అనకుండా, మటన్ అని సరిపెట్టుకుంటున్నారు. మొరాకోలో రహస్యంగా తింటున్నారు.

లైంగిక ఆచారాలలో పురుషాయితం, స్త్రీల పట్ల స్త్రీలు అనుసరించే రీతుల్ని కూడా రచయిత ప్రస్తావించారు. ముస్లిం కవుల కవితల్ని చూపారు.

**మహమ్మద్:** రచయిత ఒక అధ్యాయంలో మహమ్మద్ వ్యక్తిత్వాన్ని అంచనా వేశారు. చరిత్రలో ఆయనగొప్ప వ్యక్తి అన్నారు. మక్కా కాలమంతటా మహమ్మద్ చిత్తశుద్ధితో ప్రవర్తించాడన్నారు. మదీనా కాలంలో మహమ్మద్ మారి పోయినట్లు చెప్పారు.

ముస్లింలకు తప్ప ఇతరులకు ముక్తిలేదని, మానవాళికి యీ సందేశం అందించడానికి దైవం నిర్ణయించినట్లు చెప్పారు. ఇది పెద్ద భ్రమ అని రస్సెల్‌ను ఉదహరిస్తూ రచయిత పేర్కొన్నారు.

ఖురాన్ దైవదత్తమనీ, అదే అంతిమ సత్యమనీ మహమ్మద్ చెప్పడంతో కొత్త భావాలకు, స్వేచ్ఛకు స్వస్తి పలికినట్లయిందని రచయిత స్పష్టంచేశారు.

పాశ్చాత్య దేశాలలో ముస్లింలపట్ల, ఇస్లాం, ఖురాన్ గురించి రాజీధోరణిలో ప్రవర్తించడం వలన, ప్రజాస్వామ్యవిలువల పట్ల రాజీపడినట్లయిందని రచయిత హెచ్చరించారు. స్వేచ్ఛకూ, ఇది లేని వారికీ పోరాటం జరుగుతుందనీ, 21వ శతాబ్దంలో ముందుకు పోవాలంటే స్వేచ్ఛతో కూడిన, ప్రజాస్వామిక మానవ హక్కులు పాటించాలని రచయిత అంటున్నారు.

సాల్మన్ రష్డీ శటానిక్ వర్సెస్ వంటిది కాదీ పుస్తకం. ఒక ముస్లిం పండితుడు ప్రజాస్వామిక, స్వేచ్ఛా పిపాసిగా ఆక్రందనతో రాసిన పుస్తకం యిది. అయితే ముస్లింలలో వున్న అసమానం దృష్ట్యా యీ రచనకు సుప్రసిద్ధ హ్యూమనిస్ట్ ప్రచురణ సంస్థ అమెరికాలో చేబట్టింది. బహుశ ఇస్లాం గురించి యింత విపులంగా, సమగ్రంగా యిటీవల ఏ రచనా వెలువడలేదేమో.

భారత దేశంలో హమీద్ దల్వాయ్, ఎ.బి. షా వంటి వారు చేసిన రచనలు చాలా మందిని ఆలోచింపజేశాయి. ఈ రచన బహుళ ప్రచారంలోకి వస్తే యింకా కళ్ళు తెరుస్తారు. ఖురాన్ గురించి కూలంకషంగా చర్చించిన అనంతరం, సుమారు 6వేల సురా సూత్రాలతో కూడిన ఖురాన్‌ను రోజూ ముస్లిం పిల్లలకు నూరిపోసి, కంఠస్తం చేయించడం కూడా రచయిత ప్రస్తావించారు.

*- మిసిమి మాసపత్రిక, ఏప్రిల్-1997*

# పిశాచ పీడిత ప్రపంచం

కార్ల్‌శాగన్ ఒక ఆకర్షణీయ, అపూర్వ శాస్త్రజ్ఞుడు. ఆయన చనిపోబోయే ముందు (1996) ఒక పుస్తకం రాసిపోయాడు. దాని శీర్షిక: పిశాచ పీడిత ప్రపంచం (The Demon haunted world) (కార్ల్‌శాగన్ 62వ యేట 20 డిసెంబరు 1996న మరణించారు.)

శాగన్ ఏది రాసినా, చెప్పినా జనానికి అర్థమయ్యేట్లు, అందుబాటులో ఆచరించేటట్లు చెప్తాడు. కాస్మాస్ పేరిట ఆయన రాసిన పుస్తకమూ అంతే, ప్రపంచ వ్యాప్తంగా కాస్మాస్ కార్యక్రమాలు టి.వి.లలో తిలకించిన వారికి యీ సంగతి తెలుసు. సైన్స్‌ను ఆకాశం నుండి భూమి మీదకు తెచ్చిన సైంటిస్టు శాగన్. సైన్స్ అంటే అదేదో మనకు తెలియని, గందరగోళశాస్త్రం అనే భ్రమ తొలగించాడు. సైన్స్ నిపుణులు లోతుపాతులు గ్రహించి అనేక విషయాలు కనిపెడతారు. వాటిని సాంకేతిక నిపుణులు ఆచరణలో పెడతారు. అదే ఉపయోగం, అందులోనే హానికూడా వుంది. హాని ఎక్కువ అతిశయోక్తులతో చూపి, అది సైన్స్‌కు అంటగట్టి, బూచిగా చిత్రించిన సందర్భాలున్నాయి.

కార్ల్‌శాగన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు. కార్ల్ మార్క్స్ తత్వాన్ని భూమి మీదకు తెచ్చి జనంలో పడేయమన్నాడు. సైన్స్‌ను ఒక తత్వంగా చూచిన శాగన్ అదేపని సమర్థవంతంగా చేసి, ఎంతో సేవ జరిపిన వాడయ్యాడు.

చుట్టూవున్న చీకటి చూసి, నిస్సహాయంగా కూర్చోవద్దు. ఒక కొవ్వొత్తి అయినా వెలిగించు. ఇదీ దయ్యాల ప్రపంచంలో శాగన్ సూత్రం. ఆయన సైన్స్ ప్రచారానికి పూనుకోలేదు యీ పుస్తకంలో. ఆ పని చేసే వారు చాలా మంది వున్నారు.

సైంటిఫిక్ మెథడ్ (శాస్త్రీయ పద్ధతి) ఒక కొవ్వొత్తిగా స్వీకరించమన్నాడు. ఎన్ని ఒడిదుడుకులున్నా, రాగద్వేషాలున్నా, సైన్స్‌ను ముందుకు నడిపించి, మనుషులకు ప్రగతి చూపి, ఇంత వరకూ రావడానికి మూలకారణంగా శాస్త్రీయ పద్ధతే, అంటే, సైన్స్‌కూ, సైంటిఫిక్ మెథడ్‌కూ తేడా చూపుతున్నాడన్నమాట. తెలుసుకోవడం, ప్రశ్నించడం, తప్పు అయితే దిద్దుకోవడం, విషయసేకరణ, కొత్త ఆలోచనల్ని పరీక్షకు పెట్టడం, అందుకు సాక్ష్యాధారాలు చూపడం, పరీక్షకు నిలవకపోతే కొట్టిపారేయడం, నిలిస్తే సిద్ధాంతీకరించడం, దేనినీ పవిత్రం పేరిట ప్రశ్నించకుండా వదలకపోవడం, మనం చిరకాలంగా నమ్మేది శాస్త్రీయంగా తప్పు అని రుజువైతే అంగీకరించడం - ఇదే శాస్త్రీయ పద్ధతి. కొన్నిసార్లు శాస్త్రజ్ఞులే అనుసరించలేకపోతున్నారు. కాని అదే అవసరం.

కార్ల్‌శాగన్ తన 457 పుటల గ్రంథంలో స్వానుభవాలు జోడించి, ఏదో లోకాల్లో ఎవరో ఆకాశ వ్యక్తులున్నారనే భ్రాంతుల్ని తిరస్కరించాడు. ఎగిరే పళ్ళాల వెనుక వున్న భ్రమల్ని బయటపెట్టాడు. ప్రతి శాస్త్రానికి ప్రతిబింబంగా వున్న అశాస్త్రీయ రూపాల్ని చూపాడు. ఉదాహరణకు ఖగోళశాస్త్రం ఒకవైపు, జ్యోతిష్యం మరొక పక్క చూపాడు.

25 అధ్యాయాలుగల యీ పుస్తకం ఎక్కడా బోర్ కొట్టదు. అర్థం చేసుకోడానికి తల బొప్పికట్టదు. నిఘంటువులు భూతద్దాలతో చూడనక్కరలేదు. అంతగా విడమరచి శాగన్ చెప్పాడు. ప్రకృతి అద్భుతాలను ఆనందించాలి. అనుభవించాలి, అంతటితో ఆగక, తెలుసుకోవాలి. ఇది నిరంతరం సాగవలసిన జిజ్ఞాస. పూజిస్తే తెలుసుకోలేం. ఆరాధిస్తూ కూర్చుంటే అంతుబట్టదు. అంతు తేల్చుకోవాలనే శాస్త్రీయ పట్టుదలవుంటే కొంత ముందుకు పోతాం. అలా పోవడంలో ఆనందం వుంది. ఆ పని చేయమని శాగన్ ప్రోత్సహిస్తున్నాడు.

ప్రభుత్వాలు తప్పులు చేయకుండా చూచే బాధ్యత ప్రజలదని సూత్రీకరించాడు. ఇందుకు తల క్రిందులుగా వ్యవహారం సాగిపోతున్నది. వ్యక్తులు తప్పులు చేస్తే దిద్దుకోవడం సులభం. ప్రభుత్వాలు చేస్తే, సమర్థించుకోడానికి ప్రయత్నిస్తాయి. అదే ప్రమాదం.

ప్రతి అధ్యాయానికీ రిఫరెన్స్ గ్రంథాలపట్టిక శాగన్ చూపాడు. చాలా అందంగా గ్రంథం ముద్రించారు. ఖరీదునుబట్టి అందరూ కొనడం యిబ్బందికరం గనుక, గ్రంథాలయాలకు, సంస్థలకు, కాలేజీలకు తెప్పిస్తే, చాలామందికి ఉపయోగపడుతుంది.

శాగన్ గురించి కొంత వ్యక్తిగత అనుభవం చెప్పడం మంచిదేమో. నేను ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాను. తీరిక లేని సైంటిస్టుగా, అమెరికాలోని కార్నెల్ యూనివర్శిటీలో డంకెన్ ప్రొఫెసర్‌గా వుంటూనే, నాకు జవాబులు రాశాడు. ఒక ఉత్తరంలో భారతదేశంలో మానవవాద

మిత్రులకు మీద్వారా శుభాకాంక్షలు అందజేస్తున్నాను అన్నాడు. అదే చివరి ఉత్తరం. భద్రంగా జ్ఞాపికగా అట్టిపెట్టాను. వాషింగ్టన్‌లో రెండు పర్యాయాలు శాగన్‌ను కలిశాను. ఫోటో తీయించుకున్నాను. ఆయన వివాదాస్పద విషయాలు కూడా చాలా అహ్లాదంగా చెబుతారు.

**CARL SAGAN :**

The Demon - Haunted World, Science As a Candle in the Dark PP 457 1/8 Demmy 1996 $ 30, Random House, New York.

*- మిసిమి మాసపత్రిక, జూన్-1997*

# "పిచ్చి" అంటే

నీవు దేవుడితో మాట్లాడితే ప్రార్థన అంటారు. దేవుడు నీతో మాట్లాడాడంటే పిచ్చి అంటారు. సుప్రసిద్ధ సైకియాట్రిస్టు థామస్ సాజ్ సూక్ష్మంగా చెప్పిన సత్యమిది.

ఇటీవల ఆయన గ్రంథం Insanity వెలువడింది. అందులో ఆయన కొన్ని మౌళికాంశాలు లేవనెత్తి, ప్రశ్నించి, వివరించారు. మనం అలవాటుగా మాట్లాడే అనేక సందర్భాలు ఎంత అసమంజసమో, అశాస్త్రీయమో చెప్పారు.

మానసిక రోగం అనేది ఉపమాలంకారం అని, పిచ్చి అనేది మిధ్య అని సాజ్ అంటుంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఏది పిచ్చో చెప్పమని ఆయన అడిగితే నోరు నొక్కుకోవాల్సివస్తుంది. అలాగే మానసిక రోగం అని అతిసులభంగా వాడేస్తుంటాం. మానసికం అంటే ఏమిటి అని సాజ్ ప్రశ్నిస్తే సమాధానానికి తన్నుకోవాల్సిందే. వీటన్నింటినీ ఆయన చాలా లోతుగా పరిశీలించాడు.

రోగాలు శరీరానికి వస్తాయి. వాటి లక్షణాలు పరిశీలించి, చికిత్స చేస్తారు.

ప్రవర్తన మనిషికి సంబంధించినది. ఇందులో నవ్వడం, ఏడ్వడం, కోపగించడం, అనురాగం, మొదలైనవి వుంటాయి.

అంతవరకూ అర్థమైంది. మూడోది: మానసికం. అక్కడే వచ్చింది చిక్కు. తత్వవేత్తలు మనస్సు గురించి చాలా రాశారు. కాని మానసిక రోగాల జోలికి పోలేదంటారు సాజ్. సైకియాట్రిస్టులు మనస్సు అంటే ఏమిటో చెప్పకుండానే మానసిక రోగాలకు చికిత్స చేస్తున్నారని సాజ్ అభ్యంతరపెట్టారు. మానసిక చికిత్స అనేది దేవతా వస్త్రాలతో పోల్చి, దేవతలూ లేరు, వస్త్రాలు లేవని సాజ్ చెప్పాడు.

కొందరు యిటీవల పిచ్చి అంటే, మెదడుకు వచ్చే రోగం అంటున్నారని, అలాగయితే మెదడు స్పష్టంగా శరీరంలో ఒక భాగం అనీ, దానికి నిర్దుష్టమైన శాస్త్రం, లక్షణాలు వున్నాయని

అన్నాడు. మెదడులో ఏభాగం ఎలా పనిచేస్తున్నదో, దానికి చికిత్స ఏమిటో మెదడు శాస్త్రం అధ్యయనం చేస్తున్నదని సాజ్ స్పష్టం చేశారు. కనుక "పిచ్చి" అనేది ఒక అంగానికి వచ్చే రోగంగా నిర్ధారించలేకపోయారని ఆయన అన్నారు.

ఆత్మ అనేది వున్నదనే భ్రమ కల్పించి దానికి చికిత్స నిమిత్తం వివిధ శిక్షలు సైతం విధించిన పురోహిత వర్గం ఎలా ప్రవర్తిస్తున్నదో, సైకియాట్రిస్టులు కూడా మానసికం పేరిట అలానే చేస్తున్నారన్నారు.

ఫ్రాయిడ్ మానసిక రోగాలకు మూలంగా స్వప్నాలను స్వీకరించాడు. అదొక శాస్త్రంగా పెంపొందించే ప్రయత్నం చేశాడు. ఆ భ్రమలో సైకో ఎనాలసిస్ రూపొందింది. నేడు అదంతా శాస్త్రీయం కాదని, రుజువుకు నిలవడం లేదని తెలిసేసరికి, అనేక చిలవలు పలవలుగా మార్పులు చేశారు. కాని సైకియాట్రిని మాత్రం వదలకుండా, 'మానసికచికిత్స' అంటూ కొనసాగిస్తున్నారు.

మనుషులు వివిధ రకాలుగా ప్రవర్తిస్తారు. అందులో మనకు యిష్టం లేనివాటికి "పిచ్చి", "ఉన్మత్తత" "మనోవికారం" అని పేరుపెట్టడం, మానసిక చికిత్స చేయాలనడం, బలవంతంగా ఆస్పత్రిలో చేర్పించడం - యివన్నీ సాజ్ అభ్యంతర పెడుతున్నారు. తనలో తాను నవ్వుకోవడం, ఏడ్వడం, రోడ్డు మీద పోతూ అలా ప్రవర్తించడం "పిచ్చి"గా వర్ణిస్తున్నారు. అలాంటి వ్యక్తి ఎవరి జోలికీ రాకుండా, హానిచేయకుండా వున్నంతవరకూ, బలవంతంగా ఆస్పత్రి పాలు చేయడాన్ని కూడా సాజ్ ఆక్షేపిస్తున్నారు.

స్క్రూడ్రైవర్ అనే మత్తు పానీయం వుంది. ఓడ్కాలో నారింజరసం కలిపి, స్క్రూడ్రైవర్ అనే పేరు పెట్టారు. మరమేకులు విప్పడానికి మనం వాడే స్క్రూడ్రైవర్ వుంది. స్క్రూడ్రైవర్ తాగినప్పుడు మత్తెక్కి ఒళ్ళు తెలియకుండా ప్రవర్తిస్తుంటే, స్క్రూడ్రైవర్ చెడిపోయిందని షాపుకు తీసుకెళ్ళి బాగుచేయమంటే ఎలా వుంటుంది? మానసిక చికిత్స కూడా అలాంటిదే అన్నారు సాజ్.

మానసిక రోగం అనేది ఉపమాలంకారం వంటిదనే తన సిద్ధాంతాన్ని 5వ అధ్యాయంలో సాజ్ సమర్థించారు. ఒక విషయానికి మరోపేరు పెట్టి అలంకారంగా మనం వాడుతుంటాం. వాటిని సాగదీసి, నిజం అనుకుంటే చిక్కువస్తుంది. కాని సైకియాట్రి నేడు అలాగే చేస్తున్నది. ఫాదర్ అంటే తండ్రి. క్రైస్తవ ఫాదర్ అంటే పూజలు చేసే పురోహితుడు. నిజమైన తండ్రికీ క్రైస్తవ ఫాదర్‌కూ వాడుకలో తేడా వుంది. రెండూ ఒకటే అనుకుంటే చిక్కు వస్తుంది.

అలాగే కొన్ని హాస్య ఉపమానాలుంటాయి. వాటిని విని నవ్వుకొని ఆనందించాలేగాని, తు.చ. తప్పకుండ స్వీకరిస్తే చిక్కువస్తుంది.

ఒక అమెరికా యాత్రికుడితో చైనా అధికారి యిలా అన్నాడు. ప్రపంచంలో అతిపెద్ద దేశం

ఏదో తెలుసా? క్యూబా. క్యూబా ప్రభుత్వం మాస్కోలో వుంటుంది. క్యూబా సైన్యం ఆఫ్రికాలో వుంటుంది. క్యూబావాసులు అమెరికాలోని ఫ్లొరిడా రాష్ట్రంలో వుంటారు.

ఇది సునిశిత విమర్శనాయుత వ్యంగ్యంగా, స్వీకరించాలి. వాస్తవంగా గ్రహిస్తే ప్రమాదం. సైకియాట్రిలో మనిషి ప్రవర్తనను యిలా స్వీకరించడం జరుగుతున్నదని సాజ్ చూపడానికి చాలా ఉదాహరణలు యిచ్చారు.

అనుకరణ గురించి రాస్తూ, మానసిక రోగాలలో యిదెలా పరిణమించిందో చూపారు. ఇతరులను అనుకరించడం, జబ్బుగా వున్నట్లు నటించడం సైకియాట్రి సమస్యలలో ప్రధానంగా వున్నట్లు సాజ్ వివరించారు. చార్కాట్ కాలం నుండీ యిలా మానసిక రోగులుగా, మూర్ఛరోగులుగా నటించడం వస్తున్నది. దానికి తగ్గట్లే నయం చేసినట్లు నటించడం కూడా వచ్చింది.

మానసిక రోగాన్ని వివరించి, మనస్సు, మానసిక రోగం అంటే విడమరిచి, అంతా గాలి మాట అని చూపారు.

మొత్తం మీద యీ పుస్తకం "పిచ్చి" వైద్యం చేసే వారికి మింగుడుపడని వాదనలతో వుంది. సాధారణ పాఠకులకు చాలా ఆశ్చర్యం కలిగించే విషయాలున్నాయి. మనందరం అలవాటుగా, ప్రశ్నించకుండా ఆమోదించే విషయాలను సాజ్ ప్రశ్నించి మనల్ని ఆలోచించేటట్లు చేస్తారు. జబ్బు అనేది చాలా లోతుపాతులతో సాజ్ చర్చించారన్నాం గదా. ఉదాహరణకు కొందరికి "ప్రేమ జబ్బు" వుంటుంది. ఇది ఉపమానంగా స్వీకరించాలేగాని, శరీరానికి ఏదో జబ్బు చేసినట్లూ చికిత్స అవసరమైనట్లూ భావించరాదు. కొందరు ఆర్థిక యిబ్బందుల వలన దిగజారిపోవచ్చు, మాట్లాడడం యిష్టం లేక మౌనం వహించవచ్చు. వారికి జబ్బు వున్నట్లు భావించరాదు. కాని సైకియాట్రిస్టులు అలాంటి వారిని కూడా రకరకాల "పిచ్చి" పేర్లు పెట్టి ఆస్పత్రి పాలుచేస్తున్నారు.

రోగికీ వైద్యుడికీ గల సంబంధాన్ని చర్చించినప్పుడు, రోగిపై సైకియాట్రిస్టుకు గల పట్టు ఎలాంటిదో సాజ్ వివరించాడు. ఈ సందర్భంగా ఆయన అధికారానికి చెందిన వివిధ దృక్పథాలను బాగా విడమరచి చెప్పారు.

రోగులకు గల హక్కులను సాజ్ చర్చించారు. చట్టవిరుద్ధంగా ప్రవర్తించని రోగులకు హక్కులుంటాయి. చట్టాన్ని అతిక్రమించిన వారిని శిక్షించే తీరు వున్నది. మానసిక రోగులు ఇతరులను కొడుతున్నారని, ఆస్తికి నష్టం కలిగిస్తున్నారని అంటారు. అలాంటి పనులు నేరం క్రిందకు వస్తాయి. కాని అలాగాక, వారికి "పిచ్చి" అని ముద్రవేసి, ఆస్పత్రి పాలు చేసి సైకియాట్రిస్టులు వారిని తమ బానిసలుగా చేసుకుంటున్నారనేది సాజ్ విమర్శ. మతం మత్తుమందు అని మార్క్స్ అన్నాడు. సాజ్ దృష్టిలో మతాన్ని సృష్టించిన మనిషే మత్తును కూడా సృష్టించుకున్నాడంటారు. మాటలగారడీలో పడి కొట్టుకుంటున్నామని సాజ్ వాదన.

జబ్బు వస్తే, డాక్టర్లు నయం చేయాలేగాని, ఉద్దేశాలు అంటగట్టరు. సైకియాట్రిలో ఉద్దేశాలు చూస్తున్నారు. ఒక 42 ఏళ్ళస్త్రీ తాగి, కారునడుపుతుండగా, పోలీసు పట్టుకొని వూపిరి పరీక్ష (తాగుడు నిర్ధారణకు) చేయబోగా ఆమె నిరాకరించింది. తన్నేసింది, అరిచింది. గొడవ చేసింది. కోర్టులో న్యాయమూర్తి ఎదుట చెబుతూ, బహిష్టుకు ముందు లక్షణాలుగా తన ప్రవర్తనను వివరించింది. కోర్టు ఆమెను వదిలేసింది! సాజ్ యిలాంటి ఉదాహరణలు యిస్తూ, నేరానికీ రోగానికీ తేడా చూడనప్పుడు యిలాంటి స్థితి వస్తుందన్నాడు.

సైకియాట్రి పేర్కొనే అనేక లక్షణాలు వ్యక్తిగత, ఆర్థిక, చట్టబద్ధ, సామాజిక, రాజకీయరంగాలకు చెందినవని, వైద్యరంగంలోకి రానివనీ సాజ్ చూపారు.

సాజ్ వాదనలకు సమాధానం చెబితే, సైకియాట్రిస్టుల వృత్తి దెబ్బతింటుంది. ఆదాయం పోతుంది. కనుక వాదనకు దిగరు. శాస్త్రీయ వివరణకు పూనుకోరు. తమ పలుకుబడి వినియోగించి పెత్తనం చేస్తున్నారు.

ఆత్మ, మనస్సు, మోక్షం, నరకం దేవుడు, దయ్యం మొదలైనవి పురోహిత వర్గానికి ఆయువుపట్టు. వాటిని రుజువు చేయాల్సిన బాధ్యత వారికి లేదు. మనుషులు నమ్మినంతకాలం అవి వారి ఆయుధాలే.

మానసిక రోగం, మనోవికారం, ఉన్మత్తత, పిచ్చి యిత్యాదులు సైకియాట్రిస్టుల అస్త్రాలు. అవి రుజువుకు నిలబడతాయా లేదా అనేది వారికి పట్టదు. దీనిపై వారి వ్యాపారం సలక్షణంగా సాగిపోయినంతకాలం, జనం "పిచ్చి" వదలదు!

*- మిసిమి మాసపత్రిక, ఆగష్టు-1997*

# బిలియన్స్ అండ్ బిలియన్స్

కార్ల్ శాగన్ రాసి, అచ్చుకాక పూర్వమే చనిపోయిన చివరి పుస్తకం బిలియన్స్ అండ్ బిలియన్స్ యిప్పుడు విడుదల చేశారు. ఆయన భార్య చివరి మాట జోడించి, పాఠకులను ద్రవింప జేసే మమత చూపారు. కార్ల్ శాగన్ మరణానంతరం ఆమె అందుకున్న లక్షలాది సానుభూతి లేఖలను బట్టి శాగన్ బ్రతికే వున్నాడని డ్రుయన్ రాశారు.

శాగన్ ఇతర పుస్తకాలవలె యీ చివరి గ్రంథం కూడా జీవితం, మరణం, భవిష్యత్తు గురించి రాయగా, విపరీతంగా జనాకర్షణ పొందుతున్నది. సైన్స్‌ను, మానవాళికి సాంకేతిక రంగ ప్రమాదాలను, నివారణను శాగన్ అతి సున్నితంగా చర్చించి, మార్గాంతరాలను చూపడం యిందలి ప్రత్యేకత.

రెండవ అధ్యాయం ఎత్తుగడలోనే చదరంగం కథను స్వీకరించారు. తొలుత యిది

కనుగొన్న పర్షియా మంత్రి అద్భుత చర్యకు రాజు ఆకర్షితుడై, ఏం కావాలని కోరుకోమన్నాడట. 64 గడులకూ మొదటిగడికి ఒక గోధుమ గింజతో మొదలెట్టి, రెట్టింపు చేసుకుంటూ పోయి, 64వ గడికి ఎంత ధాన్యం వస్తే అంత యిప్పించమని మంత్రి అడిగాడట. అదేం కోరిక! డబ్బు, స్త్రీలు, భవనాలు, ఆస్తులు, అలాంటివి కోరుకోమన్నాడు రాజు. మంత్రి వినయంగా తానడిగింది యిప్పిస్తే చాలన్నాడట. సరేనని, లెక్క మొదలెడితే, మొదటి గడికి ఒక గోధుమ గింజ రెండవ గడికి రెండు, మూడో గడికి 4, అలా హెచ్చిస్తూ పోయారట. 64వ గడి వచ్చేసరికి రాజుగారి ధాన్యాగారం చాల లేదు సరిగదా, అప్పు పడి, రాజ్యం అప్పగించాల్సి వచ్చిందట.

ఈ ఉదాహరణను శాగన్ పేర్కొని భారత దేశంలో కూడా లెక్కలు కనిపెట్టిన ఖ్యాతి ప్రస్తావించారు. ఆ లెక్కలు మన జనాభాకు అన్వయిస్తే ఎంత ముంచుక పోయే స్థితి వస్తుందో చూడమన్నారు.

వాతావరణ కాలుష్యాన్ని గురించి శాగన్ రాసింది మరీ ఆకర్షణీయంగా, హెచ్చరికగా బాగా వున్నది. ప్రపంచం యావత్తూ కాలుష్యానికి తోడ్పడుతుండగా అందులో అమెరికా 20 శాతం అందిస్తున్న విషయాం గుర్తు చేశారు.

భూమికి 25 కిలో మీటర్ల ఎత్తులో వున్న ఓజోన్ పొరకు బెజ్జం పడింది. అంటార్కిటికా వద్ద తొలుత సైంటిస్టులు యిది కనుగొన్నారు. అయితే ఏమిటి? సూర్యరశ్మిలో వుండే అల్ట్రావైలెట్ కిరణాలు సూటిగా మన మీద పడతాయి. అది కాన్సర్ వంటి రోగాలకు దారితీస్తుంది. శరీరానికి వుండే రోగనిరోధకశక్తి పోతుంది. ఓజోన్ పొరకు బెజ్జం పడడానికి కారణం మనమే. క్లోరో ఫ్లూరో కార్బన్లు వాడటం వలన యీ ప్రమాదం ఏర్పడింది. మనం వాడే రిఫ్రిజిరేషన్, సెంట్లు, అనేక పరిశ్రమలలో వాడే స్ప్రేలు, ఇన్సులేషన్, సాల్వెంట్స్‌లో యిది వున్నది. ఇందులో కణాలు ఆకాశంలో ఓజోన్ పొరలోని కణాల్ని ఎదుర్కొంటున్నాయి. అదే ప్రమాదం. భవిష్యత్తులో యీ ప్రమాదం యింకా పెరిగిపోతుంది. శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తే, తొలుత పారిశ్రామికులు నిరోధించారు. తరువాత ఒప్పుకొని, వీటి వాడకాన్ని తగ్గించడానికి అంగీకరించారు. పూర్తిగా వీటిని ఆపడానికి కొంత కాలం పట్టవచ్చు. కాని ఆపి తీరాలని, భవిష్యత్తు తరాల సంక్షేమకారుడుగా కార్ల్‌శాగన్ స్పష్టం చేశారు. 'ఎ పీస్ ఆఫ్ స్కై యీజ్ మిస్సింగ్' అని ఈ అధ్యాయానికి చక్కగా శీర్షిక పెట్టారు.

సైన్స్ - మతం గురించి కార్ల్‌శాగన్ చేసిన చర్చ ఉత్తేజ పూరితంగా, మానవ వాదంతో యిమిడివున్నది.

రాజ్యాధిపతులు, మతాధిపతులు ఏర్పరచిన సంయుక్త సమావేశాలు 1988 ఏప్రిల్‌లో ఆక్స్‌ఫర్డ్‌లోనూ, 1990 జనవరిలో మాస్కోలోనూ జరిగాయి. అందులో పాల్గొన్న శాస్త్రజ్ఞుడుగా శాగన్ తన అనుభవాల్ని రాశారు. వాతావరణ కాలుష్యాన్ని ఆపి, భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత గురించి ఒక విజ్ఞప్తి చేయగా దానిపై మతాల వారు, రాజకీయ నాయకులు ఒడంబడికపై

సంతకాలు చేశారు. అందుకే యీ విషయంలో మతం - శాస్త్రం చేరువ అయ్యాయని శాగన్ రాశాడు. ఆ సందర్భంగా ఒక ఆసక్తికర విషయం ప్రస్తావించాడు.

వివిధ మతాలవారు సమావేశంలో ప్రార్థనలు చేశారు. అలాగే భారత వేద పండితుడు ఓం మంత్రాన్ని ఉచ్ఛరించగా అది అందరూ అనుకరించారట. సోవియట్ విదేశాంగ మంత్రి షెవర్నాట్జి కూడా అందులో చేరి ఓం పఠనం చేశాడట. కాని గొర్బచేవ్ మాత్రం మౌనం దాల్చాడట. ఆయన వెనకే లెనిన్ విగ్రహం వున్నది.

'మన శత్రువులు' అనే అధ్యాయంలో ఇంకో విశేషాన్ని శాగన్ బయటపెట్టారు. అమెరికా రష్యాలు శాగన్ వ్యాసాన్ని ఒకేసారి ప్రచురించాయి. అమెరికాలో పెరేడ్ పత్రిక. రష్యాలో ఓగోన్యాక్ (Ogonyak) ఈ వ్యాసాన్ని ప్రచురించి చర్చకు పెట్టారు. 1988లో జరిగిన విశేషం యిది. మనకు వేరే ప్రపంచాల నుండి ఎవరో వచ్చి దాడి చేసే ప్రమాదం లేదనీ, మనం సహజ వనరులను తగలేయడంలో ప్రమాదం వుందనీ, బొగ్గు తగలేసి కార్బన్ డయాక్సైడ్ పెంచి, వాతావరణం వేడెక్కేటట్లు చేస్తున్నామని శాగన్ హెచ్చరించారు. అమెరికా - రష్యాలు యిది ఆపితే, ఎడారులుగా కొన్ని ప్రాంతాలు మారిపోకుండా వుంటాయన్నారు.

నిజం గురించి అటు అమెరికాకు గాని, యిటు సోవియట్ యూనియన్‌కు గాని గుత్తాధిపత్యం లేదని శాగన్ అన్నారు.

ఆ సందర్భంగా లెనిన్ మాటల్ని శాగన్ ఉదహరించారు. సోవియట్ యూనియన్‌లో శాగన్ వ్యాసంలోని భాగాలను, లెనిన్‌పై వ్యాఖ్యలను సెన్సార్ చేశారు. ఇప్పుడు తమదే తప్పు అని, లెనిన్ ప్రస్తావన చేసిన శాగన్ సరిగానే ఉదహరించాడని అర్బటోల్ తన స్మృతులలో ప్రకటించారు.

గర్భస్రావంపై చర్చించిన అధ్యాయంలో జీవనాన్ని హత్య చేయడం అంటే ఏమిటనే విషయంపై శాగన్ సునిశిత ప్రశ్నలు వేశారు. ప్రతి మనిషి రేతస్సులో భూమిని నింపగల శక్తి వున్నదనీ, రేతస్సు వృధా అవుతుంటే, అదంతా హత్యగా పరిగణించాలా అన్నారు.

ప్రపంచ సంక్షేమ నిమిత్తం ఇస్లాం కూడా కుటుంబ నియంత్రణ పాటించాలని సిరియాకు చెందిన గ్రాండ్ ముఫ్తి 1990 ప్రపంచ సభలో చెప్పడం అందరినీ ఆకట్టుకున్న విషయం అని శాగన్ జ్ఞప్తి చేశారు.

మరణాన్ని సహజంగా స్వీకరించిన శాగన్ తన గొప్పతనాన్ని యీ గ్రంథంలో చూపాడు. సైన్స్‌ను సామాన్యులకు అందించిన శాగన్ శ్లాఘనీయుడు.

*- మిసిమి మాసపత్రిక, సెప్టెంబర్-1997*

# మేధావుల చిత్రణ

ఒకసారి మనదేశం నుండి ఒకాయన "ఎడ్వర్డ్ షిల్స్, సోషల్‌సైంటిస్ట్, ఇంగ్లండ్" అని ఉత్తరం, రాస్తే అది చేరింది! ఇది బ్రిటిష్ పోస్టల్ విధానపు గొప్పతనం చాటుతుండగా, ఎడ్వర్డ్‌షిల్స్ ఖ్యాతిని కూడా చూపుతున్నది.

సోషియాలజి అంటే కొద్దోగొప్పో తెలిసిన ప్రతివారికీ ఎడ్వర్డ్ షిల్స్ పరిచయమే. ప్రపంచ మేధావుల గురించి రాసిన షిల్స్, తానూ ఆ కోవలోని వాడే. అతని పుస్తకం ఈ సంవత్సరం వెలువడింది. (PORTRAITS by Edward Shils Introduction, edited Joseph Epstein, The University of Chicago Press, London & Chicago 1977, PP 255, 1/8 Demmy Size Paper book)

10 మంది మేధావుల గురించి ఎడ్వర్డ్ షిల్స్ రాసిన వ్యాసాలను ఎంపిక చేసి, ఆయన మరణానంతరం ప్రచురించారు. 1995 జనవరి 23న షిల్స్ 84వ ఏట కాన్సర్‌తో చికాగోలో మరణించారు. అమెరికన్ స్కాలర్ అనే మేధావుల పత్రిక సంపాదకుడు జోసెఫ్ ఎప్‌స్టైన్ షిల్స్ గురించి సుదీర్ఘ పీఠిక రాసి, ఆసక్తికరంగా అందించారు.

మనదేశం నుండి నిరాద్ చౌదరి మాత్రమే యిందులో వుండగా, మిగిలిన వారు రేమండ్ అరన్, సిడ్నీ హుక్, రాబర్ట్ మేనార్క్ హచిన్స్, లె పోల్డ్ లబెజ్, హరాల్డ్ లా స్కీ, కార్ల మన్‌హం, ఆర్నాల్డో డాంటెమొమిగ్లి యానో, జాన్‌యు. నెఫ్, లియోజి లార్డ్ వున్నారు. షిల్స్ రాసిన మేధావుల పీఠిక కూడా వుంది.

ఎడ్వర్డ్ షిల్స్ మన దేశ మేధావులకు సుపరిచితుడు. 1956 నుండి 57 వరకు ఇండియాలో గడిపిన షిల్స్, ఆ తరువాత యేటా ఒకసారి వచ్చి వెడుతుండేవాడు 1967 వరకూ. అప్పుడే ఒకసారి బొంబాయిలో 1964లో ఎ.బి. షాతో ఆయన్ను కలిశాను. మినర్వా అనే పత్రిక నిర్వహించిన షిల్స్ అనేక రచనలు చేశారు. ఎన్‌కౌంటర్ పత్రికలో రాశారు. The Bulletin of the Atomic Scientists అనేది కూడా లియోజి లార్డ్‌తో కలసి నిర్వహించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, క్రేంబ్రిడ్జి, చికాగో యూనివర్శిటీలలో ప్రొఫెసర్‌గా పనిచేసిన ఎడ్వర్డ్ షిల్స్‌కు సమకాలీన ప్రపంచ మేధావులతో సన్నిహిత పరిచయం వుంది. భారత మేధావుల గురించి ఒక పెద్ద వ్యాసం రాశారు, అలాగే యూరోప్ మేధావుల గురించి కూడా.

ఆర్నాల్డో మొమిగ్లియానో (Arnaldo Momigliano)ను తన గురువుగా షిల్స్ భావించాడు. ఆయన మెచ్చుకున్న మేధావులలో ఎ.ఎస్. నయపాల్, ఫిలిప్ లార్కిన్, పీటర్ బ్రౌన్, అలెగ్జాండర్ సోల్జినిట్సిన్, బార్చగాహి ఇ.హెచ్. గోంబ్రిక్, ఎలికెడోరి వున్నారు.

రేడియో, టి.వి. సైతం వాడకుండా, న్యూయార్క్ టైమ్స్‌కే పరిమితమైన ఎడ్వర్డ్ షిల్స్,

సాహిత్యం ద్వారా సోషియాలజిలోకి వచ్చిన మేధావి. ఆయన రచనలు ప్రామాణికంగా ఉన్నత స్థాయిలో వుండేవి.

చికాగో విశ్వవిద్యాలయంలో ఒకప్పుడు ఎంత వున్నతస్థాయి పరిశోధన, పరిశీలన, బోధన కొనసాగిందో షిల్స్ పీఠికలో అవగాహన అవుతుంది. హెరాల్డ్ లాస్‌వెల్, టాల్కాట్ పార్సన్స్, రాబర్ట్ పార్క్, ఫ్రాంక్ నైట్ వంటి వారు ఉద్దండులుగా వున్న యూనివర్శిటీలో షిల్స్ రాటు తేలాడు. వారి సహచర్యం, బోధనా పటిమలు స్ఫురణకు తెచ్చుకొని, ప్రస్తుతించాడు. కాని ఎక్కడా అతిశయోక్తి భట్రాజీయం కనిపించదు. షిల్స్ అంచనాలు మాత్రం ఆకర్షణీయంగా వున్నాయి. లూయిస్ విర్త్ (Louis Wirth) తనపై చూపిన ప్రభావాన్ని షిల్స్ వివరించారు.

జాన్ నెఫ్ నాడు చికాగో విశ్వవిద్యాలయంలో పేరొందిన అర్థిక శాస్త్రవేత్త, అతని లెక్చర్స్ కూడా షిల్స్ విన్నాడు. అప్పటికే మాక్స్‌వెబర్, ఎమిలిడర్క్ హైగెల సోషియాలజీతో ప్రభావితుడైన షిల్స్ చికాగో వాతావరణంలో పై స్థాయికి ఎదిగాడు. అపరిస్థితులు నేడు మారి పోయాయని, ఫెడరల్ ప్రభుత్వ యిష్టాయిష్టాలపై వుండడం, నిధులకోసం ట్రస్టీలపై ఆధారపడడం, గిరిగీసుకొని గూడుకట్టుకొని ముడుచుక పోవడం నేడు స్పష్టంగా వున్నదనీ షిల్స్ విచారం వ్యక్త పరిచారు. నేటికీ చికాగోలో ఉన్నతస్థాయి విద్యావాతావరణం వున్నదని వారితో షిల్స్ అంగీకరించలేకపోయాడు. తరాల అంతరం కనిపిస్తున్నదన్నాడు. షిల్స్ పీఠిక కాగానే, ఒక్కొక్క వ్యక్తినీ కూలంకషంగా పరిశీలించిన వ్యాసాలు వున్నాయి.

**రేమండ్ ఆరన్ :** ఫ్రాన్స్‌లో 1983 అక్టోబరు 17న అస్తమించిన సుప్రసిద్ధ సామాజిక శాస్త్రజ్ఞుడు రేమండ్ ఆరన్ (RAYMOND ARON) ప్రపంచంలో కీన్స్ (Keynes) తరువాత, అంతగా ఆకర్షించిన సోషల్ సైంటిస్టు. ఆయన మాటను యూరోప్, అమెరికా ప్రముఖులు పట్టించుకునేవారు. హెన్రీకి సింజర్, రాబర్ట్ మక్‌నమారా వంటి వారు చెవిన పెట్టేవారు. కాని ఫ్రాన్స్‌లో అయనను ఏకాకిని చేసి రియాక్షనరీ అని, ఫాసిస్టు అని వామపక్షాలవారు పేర్లు పెట్టారు. అంద్రీ మాల్రా (Andre Malrawx) వంటివారి అభిమానాన్ని పొందిన ఆరన్ చివరి రోజులలో ఫ్రాన్స్ దృష్టిని ఆకర్షించారు. మార్క్సిజం పట్ల నిశిత పరిశీలన చేసిన ఆరన్, ఆచరణకూ సిద్ధాంతానికీ మార్క్సిజం చూపిన అఖాతమే దాని పట్ల ఫ్రాన్స్ వైముఖ్యతకు కారణమన్నారు.

విద్యారంగంలో సామాజిక వేత్తగా, ప్రభుత్వరంగంలో ప్రచారవేత్తగా రచనలు చేసిన ఆరన్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఖ్యాతిని తెచ్చుకున్నాడు. ప్రజాసమస్యల పట్ల స్పందించిన ఆరన్, బృహత్తర రచన చేయలేక పోయానని చివరలో బాధపడ్డాడు.

ఆదర్శాలు (utopias) ఆరన్‌ను ఎన్నడూ ఆకట్టుకోలేదు. ఏ సమాజమూ సంపూర్ణంకాదనీ, ప్రతిదీ విమర్శకు గురిచేయాలనీ, మార్గాంతరాలతో బేరీజు వేయాలనీ, ఆరన్ ఉద్దేశం. వివేచన యధేచ్ఛగా వినియోగించాలన్నాడు.

ఆరన్‌తో తన 40 సంవత్సరాల పరిచయాన్ని షిల్స్ చక్కగా కుదించి వివరించారు. జాన్‌పాల్‌సాత్రె ఒకవైపున ఆరన్‌ను విపరీతంగా ఖండించినా, ఆరన్ అతడి పట్ల ఓర్పుగా వ్యవహరించిన తీరును పేర్కొన్నారు. మానవసమాజాలను తాత్వికంగా పరిశీలించిన ఆరన్ ఎన్నో ఒడిదుడుకులకు, విమర్శలకూ, ఖండన మండనలకూ తట్టుకున్నాడన్నారు. మానవ మస్తిష్కంనుండి హేతువును మట్టుబెట్టడం దుస్సాధ్యమని ఆరన్ దృఢ విశ్వాసం. వివేచన పట్ల అచంచల విశ్వాసంతోనే ఆరన్ రచనలు సాగించాడు. నిగ్రహంగా వ్యవహరిస్తూ, ఇతరుల పట్ల జాగ్రత్త వహిస్తూ, మేధావిగా సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తిగా ఆరన్‌ను షిల్స్ పేర్కొని, జోహోర్లు అర్పించారు.

22 పుటలలో ఆరన్ గురించి ఎంతో నిగూఢంగా షిల్స్ చూపగలిగారు. ఆయన వెలుగు నీడల్ని అందంగా పేర్కొన్నారు. వ్యక్తిత్వం అంచనా వేసిన తీరు చూచి మనం ఎంతోనేర్చుకోవచ్చు. రేమండ్ ఆరన్ గురించి మనలో చాలామంది చదివినా, షిల్స్ చెప్పిన తీరు హుందాగా, వివేచనాత్మకంగా, నిష్పాక్షింగా వుంది. వ్యక్తి చిత్రణ అలావుండాలి. సన్నిహిత పరిచయంగల మేధావిని గురించి ముఖస్తుతి చేయకుండా, లోకానికి అద్దం పట్టిచూపడం షిల్స్ వంటి సామాజిక శాస్త్రజ్ఞుడికే తగును.

**నిరాద్ సి. ఛౌదరి:** షిల్స్ చిత్రణలో ఒక భారతీయ మేధావి నిరాద్ ఛౌదరి చోటు చేసుకున్నాడు. ఆ విధంగా ప్రపంచ మేధావుల కోవలో నిరాద్ ఛౌదరి నిలబడ్డాడు. షిల్స్‌కు బాగా పరిచితుడు, యిష్టుడైన మరొక భారతీయ నవలాకారుడు ఆర్.కె. నారాయణ.

1921లో కలకత్తా యూనివర్శిటీలో డిగ్రీ పొందలేక, వదిలేసిన నిరాద్ ఛౌదరి ఆలిండియా రేడియోలో వుద్యోగంచేస్తూ పదవీ విరమణానంతరం ఇంగ్లాండ్ ప్రవాసం వెళ్ళాడు. రచయితగా భారతదేశంలో పేరున్నా బ్రతకడానికి తగిన అధారవృత్తి కాలేదు. అందుకని భార్య ప్రోత్సాహంతో దేశాంతరం తరలి, పెద్ద పేరు పొందాడు. కాని దేశాన్ని ప్రేమించడం మానలేదు. ఆయన నిశితపరిశీలన, విమర్శ చాలామందికి నచ్చక పోయినా, అలాగే చెప్ప దలచింది నిర్మొహమాటంగా రాశాడు. గాంధీజీ పట్ల తీవ్ర విమర్శ చేస్తూ, దేశాన్ని వెనక్కు నడిపించే ఆయన ధోరణిని దుయ్యబట్టాడు. ఆయన రచనలలో ది ఆటోబయాగ్రఫీ ఆఫ్ ఏన్ అన్‌నోన్ ఇండియన్, ది హేండ్ గ్రేట్ అనార్క్ అనే రెండూ గొప్పవని షిల్స్ పేర్కొన్నారు. భారత సమాజం, పాశ్చాత్య భావాలతో సంబంధం అనేవి ఛౌదరి దృష్టిని బాగా ఆకట్టుకున్నాయి. 50 సంవత్సరాల ప్రాయంలో తొలి రచన ప్రచురించిన ఛౌదరి. ది ఇండియన్ ఇంటలెక్చువల్, హిందూయిజం కాంటినెంట్ ఆఫ్ సర్సి, క్లైవ్, మాక్స్ ముల్లర్ గురించి రాశారు.

భారతీయుడుగా, బెంగాలీగా, యూరోప్‌వాసిగా, ఇంగ్లీష్‌మన్‌గా స్పందించిన ఛౌదరి, విశిష్ట రచయితగానే నిలిచాడు. ప్రపంచ పౌరుడుగాపరిణమించాడు.

పొట్టిగా, బక్కపలచగా వుండే ఛౌదరి, ఎంతో ఆత్మ విశ్వాసంతో, నిబ్బరంగా రచన సాగించి తన జ్ఞాన పరిధిని విస్తరించి, ప్రతిభచూపాడని షిల్స్ రాశారు. ఇంగ్లండ్‌లో స్థిరపడినా ఇండియాను వదలని రచయిత ఛౌదరి, భారతదేశ విభజన పట్ల కూడా ఆయన బాధతో రచన చేసి Thy Handలో చూపారు.

1955లో తొలుత యూరోప్ వెళ్ళిన ఛౌదరి ఇట్టే ప్రయాణం చేయని రచయిత. అంతవరకూ కలకత్తా లోనే గడిపిన ఛౌదరి, ప్రపంచాన్ని ఎంతో సన్నిహితంగా చూచాడని షిల్స్ అన్నారు. బ్రహ్మసమాజ ప్రభావితుడైన ఛౌదరి, ఉదారవాది.

ఛౌదరి ఇంగ్లీషులో రాయడం మొదలు పెట్టిన తరువాత, ఇంగ్లండులో గుర్తింపు లభించింది. క్రమంగా ప్రపంచం గుర్తించింది. భారతదేశంలో ఆయనకు అవమానాలు నిరాదరణ వున్నా, తట్టుకొనినెగ్గుకొచ్చాడు. తలవంచని రచయితగా నిరాద్ ఛౌదరి తన అభిప్రాయాలను చాటాడు. చాలా లోతుగా అధ్యయనం చేసిన అనంతరమే రచనకు ఉపక్రమించే వాడు.

ఎడ్వర్డ్ షిల్స్ తన అభిప్రాయాన్ని వెల్లడించి ఛౌదరికి న్యాయం చేకూర్చాడు.

**సిడ్నీహుక్ :** రాజకీయం పలికినా, తత్వం మాట్లాడినా సిడ్నీహుక్ హేతుబద్ధంగా రాసేవాడు. ఆయన ప్రభావం సమకాలీన సామాజిక శాస్త్రాలపై చాలా కనబడుతుంది. బెర్ట్రాండ్ రస్సెల్, జాన్ డ్యూయీ, మెరిస్ కోహెన్‌ల శిష్యరికం చేసిన సిడ్నీహుక్ మార్క్సిజం బాగా అధ్యయనం చేశాడు. సత్యాన్వేషణ అత్యున్నతమైనదని ఆయన సిద్ధాంతం. సోషలిస్టు భావాలు వున్నా, ప్రజాస్వామ్యాన్ని, వ్యక్తి స్వేచ్ఛను తప్పనిసరిగా ఆదరించాలన్నాడు.

రాజకీయాలు వాదించేటప్పుడు చాలా పట్టుదల చూపెట్టిన సిడ్నీ హుక్ వివేచన మాత్రం ఎన్నడూ సడలించలేదు. 1920 ప్రాంతాలలో సోవియట్ యూనియన్ పట్ల అమెరికాలో కమ్యూనిస్టు పార్టీ పట్ల కొంత సానుభూతి చూపినా, మిగిలిన వామపక్షమేధావుల వలె ప్రవాహానికి కొట్టుక పోలేదు. గుడ్డిగా కమ్యూనిస్టులను వ్యతిరేకించే వారి పట్ల సిడ్నీహుక్ తన అయిష్టత చూపాడు.

ట్రాట్స్కీరక్షణ సంఘంలో పాల్గొన్న హుక్, మాస్కోలో మారణ కాండపై విచారణలో ఆసక్తి చూపి, సాంస్కృతిక స్వేచ్ఛ కావాలనే సంఘాల స్థాపనలో చేరాడు. ప్రజా జీవిత సమస్యలతో స్పందించిన హుక్, రేమాండ్ ఆరన్ వలె చాలా సందర్భాలలో పాల్గొని, వివాదాస్పద చర్యలకు దిగాడు. చాలా ప్రతిభావంతుడైన యూదుగా హుక్ తన జీవితంలో అత్యధిక కాలం న్యూయార్క్‌లోనే గడిపాడు.

**హెరాల్డ్ లాస్కీ:** లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో 3 దశాబ్దాలు పనిచేసిన లాస్కీ పుస్తకాలు

నేడు ఆ సంస్థలోనే చదవడం లేదు. కాని ఆయన సమకాలీనులు రాజకీయాల్లో లాస్కీ వద్ద వ్యాకరణం నేర్చారు. ప్రపంచ వ్యాప్తంగా లాస్కీ ప్రభావం వుండగా, వామ పక్షాలపై యీ ప్రభావం వీరారాధనకు పోయింది. 1993లో లాస్కీ శతజయంతి కూడా జరిపారు.

మాంచెస్టర్‌లో సంపన్న యూదుకుటుంబంలో పుట్టిన హెరాల్డ్ లాస్కీ, హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో బోధించి గొప్ప పేరు పొందాడు. తరువాతే లండన్‌లో స్థిరపడి 1950లో చనిపోయే వరకూ ఉపాధ్యాయుడుగా వున్నాడు. ఆయన రచయితే గాక, గొప్ప వక్త కూడా ఇంగ్లండ్ రేషనలిస్ట్ సంఘాధ్యక్షుడుగా కొంతకాలం వున్న లాస్కీ, లేబర్‌పార్టీ సోషలిస్టుగా వున్నాడు. అయితే ఒకసారి నమ్మిన వాటిని మళ్ళీ మళ్ళీ రాస్తూ, కాలానుగుణంగా వస్తున్న మార్పుల్ని సరిగా గమనించక పోవడం ఆయన లోపం.

ఫేబియన్ సోషలిస్ట్‌గా పరిణమించిన లాస్కీ, బలీయ కేంద్ర ప్రభుత్వం పట్ల విశ్వాసం ప్రకటించాడు. కొన్నాళ్ళు సిడ్నీ బీట్రిస్ వెబ్‌సిద్ధాంతాల ప్రభావం కింద లాస్కీ వున్నాడు. సోవియట్ యూనియన్‌ను సమర్థించి, అమెరికా సామ్రాజ్యవాదాన్ని లాస్కీ ఖండించాడు. లెఫ్ట్ బుక్ క్లబ్ స్థాపించిన లాస్కీ అటు ఉపాధ్యాయుడుగానూ యిటు ప్రపంచ వ్యవహారాలలోనూ ఆసక్తితో పాల్గొన్నాడు.

**లియో జిలార్డ్ :** అణ్వాయుధాలు సోవియట్ యూనియన్, అమెరికాల మధ్య ప్రచ్ఛన్న పోరాటసమస్యలలో కీలక పాత్ర వహించిన మేధావి లియోజిలార్డ్ (Leo Szilard). అతడు సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలలో ప్రతిభాశాలి. శాస్త్రీయ పరిశోధనకు అగ్రతాంబూలం యిచ్చాడు. 1932లోనే హిట్లర్ అధికారానికి రాబోతున్నాడని గ్రహించి యితరులను హెచ్చరించిన యింగిత జ్ఞాని. 1937లో అతడు యూరోప్ నుండి అమెరికా వలస వెళ్ళి ప్రధాన పాత్ర వహించాడు. అణుశాస్త్ర పరిశోధనలు బయట పెట్టవద్దని జర్మనీ పాలకుడైన హిట్లర్‌కు అవి తెలిస్తే ప్రమాదం అని హెచ్చరించాడు.

బాంబు ప్రయోగాన్ని గురించి అమెరికా అధ్యక్షుడికి నచ్చ చెప్పడానికి ఐన్‌స్టీన్‌న్ని కూడా రంగంలో దింపాలని జిలార్డ్ ప్రయత్నించాడు. ది వాయిస్ ఆఫ్ ది డాల్ఫిన్స్ అనే రచన చేసిన జిలార్డ్, తరచు ఆటమిక్ సైంటిస్టుల బులిటన్‌లో వ్యాసాలు రాసేవాడు. "ఏటమ్స్ పర్‌పీస్" బహుమానం పొందిన జిలార్డ్ చివరి దాకా ఆస్థి పాస్తులు లేకుండా బ్రతికిన మేధావి. తన అభిప్రాయాలు అటు కృశ్చేవ్ కూ, యిటు కెనడీకి తెలియపరచిన జిలార్డ్, కాన్సర్ వ్యాధితో మరణించాడు. ఆయన మేధస్సుకు ఎడ్వర్డ్ షిల్స్ చాలా గొప్పగా హారతులిచ్చాడు.

**జాన్ యునెఫ్ :** చికాగో విశ్వవిద్యాలయ స్థాపకులలో ఒకరైన నెఫ్ గొప్ప మేధావి. ఆయన బొగ్గును గురించి రాసినా, అందరితో కథవలె చదివించగల సత్తా వున్న ప్రతిభావంతుడు. వాస్తవానికి బొగ్గుపరిశ్రమపై ఆయన చేసిన పరిశోధన గొప్పది.

30 సంవత్సరాల పాటు చికాగో విశ్వవిద్యాలయంలో పనిచేసిన నెఫ్ సోషల్ థాట్‌పై ఒక సంఘాన్ని ఏర్పరచాడు.

నెఫ్ లెక్చరర్‌గా చాలా క్రమబద్ధమైన వాడని షిల్స్ అన్నాడు. బ్రిటీష్ బొగ్గు పరిశ్రమ గురించి విద్యార్థులను ఆకట్టుకునే లెక్చర్ యివ్వడం నెఫ్‌కే చెల్లిందన్నాడు. ఆర్థిక రంగంలో కవిత్వాన్ని జొప్పించి, టి.ఎస్. ఇలియట్‌ను ప్రస్తావించగల సమర్థత నెఫ్‌కు వున్నది. తన పరిశోధనా ఫలితాలను బేరీజు వేసి క్లాసులో చెప్పడం ఆయన అద్భుత ప్రతిభగా షిల్స్ చెప్పారు. ప్రతి తరగతిలో కొత్త విశేషాలను చెబుతూ, జర్మనీలోని విద్యారంగ లక్షణాలు అమెరికాలో ప్రవేశపెట్టిన ఖ్యాతి నెఫ్‌కు దక్కాలని షిల్స్ అంటారు.

**కార్ల్‌మన్ హైం :** షిల్స్ రాసిన మేధావులలో కార్ల్‌మన్ హైం సుప్రసిద్ధ సామాజిక శాస్త్రజ్ఞుడు. మేధావులకు సంబంధించిన ఆయన దృక్పథం షిల్స్‌ను ఆకట్టుకున్నది. కాంట్ వలె తానూ ఆకర్షించాలని మన్‌హైం భావించినా, అది సఫలం కాలేదు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనిమిక్స్‌లో ఆయనకు తగిన ఆదరణ లభించ లేదు.

అమెరికాలో తన రచనలు గురించి ఏమనుకుంటున్నారో అనే విషయమై అతడు శ్రద్ధగా పట్టించుకునే వాడు.

కార్ల్ పాపర్ రాసిన పావర్టి ఆఫ్ హిస్టారిసిజం విమర్శ ప్రధానంగా మన్‌హైంను దృష్టిలో పెట్టుకున్నదే. హైక్ (Hayey) రాసిన రోడ్‌టు సెర్ఫడం కూడా మన్‌హైంపై విమర్శతోకూడిందే. సోషియాలజీ ప్రొఫెసర్ మారిస్ గింజ్‌బర్గ్ కూడా మన్‌హైంపై ధ్వజమెత్తి విమర్శలు చేశాడు. మన్ హైం చనిపోయినప్పుడు ఎడ్వర్డ్ షిల్స్ వెళ్ళగా, గింజ్‌బర్గ్ తన భర్తను చంపేసినట్లు (విమర్శలతో!) ఆయన భార్య విలపిస్తూ అన్నది.

గలీలియో సొసైటీలో సభ్యులుగా మైకెల్ పొలాని, మన్‌హైంలు సన్నిహితులు. కాని అభిప్రాయాలలో విరుద్ధంగా వుండేవారు. టి.యస్. ఇలియట్ యితడిమేధస్సును శ్లాఘించాడు. అయినా ఇంగ్లండులో ప్రవాసిగా మన్‌హైం యిమడలేక పోయాడు.

**అర్నాల్డ్ డాంట్ మొమిగ్లి యోనో :** మేధావులకు, పరిశోధకులకు తెలిసిన మొమిగ్లియానో, బహుళ ప్రచారం లేని గొప్ప వ్యక్తి. అతని రచనలన్నీ 750 వరకూ వున్నవి. ఇతడు 1908లో పుట్టాడు. యూదు, ఆక్స్‌ఫర్డ్‌లో కృషి చేశాడు. ఇటలీలో రాని రాణింపు అక్కడ వచ్చింది. చికాగోలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా వుండేవాడు. గిబ్బన్ గొప్పవాడని, మైకల్ రోస్టో విజఫ్ (Mikhail Rostovzeff) ప్రాచీన చరిత్ర పండితులలో గొప్ప వాడని మొమిగ్లోయానో అనేవాడు. కేంబ్రిడ్జి ప్రాచీన చరిత్రలో యితడి ప్రతిభ కనిపిస్తుంది. చివరి దశలో బాగుగా గుర్తింపు, రాణింపు, ప్రచారం లభించగా తృప్తి చెందిన మేధావి. మతనమ్మకాలు ఉపరితల విషయాలుగా భావించరాదని, యీ విషయమై మార్క్సిస్టు దృక్పథం సరైనది కాదని ఆయన భావించాడు.

రాబార్ట్ మెనార్డ్ హచిన్స్, లియోపోల్డ్, లబెజ్ గురించి విశిష్టంగా షిల్స్ జోహార్లు అర్పించాడు.

మేధావులను గుర్తించడం వారి ప్రతిభకు జోహార్లు అర్పించడం, అందులో అతిశయోక్తులు లేకుండా అంచనా వేయడం షిల్స్ పుస్తక విశేషం. దీన్నుండి మన రచయితలు నేర్చుకోదగింది వుంది.

*- మిసిమి మాసపత్రిక, మార్చి-1998*

# పునర్జన్మ - ఒక పరిశీలన

మనిషి ఒక్కసారే పుట్టి పోడనీ, ఎన్నో సార్లు జన్మ ఎత్తుతాడనీ, అందులో జంతువులు యితర జీవజాలం కూడా వుండొచ్చుననీ, ప్రతి జన్మకూ కొత్త దేహం వస్తుందనీ నమ్ముతారు. ఇది ఆద్యంత రహితంగా సాగుతుందని కొందరూ, నిర్వాణంతో జన్మ ముగుస్తుందని కొందరూ నమ్మారు.

కర్మ సిద్ధాంతానికి మంచి చెడ్డలను జత చేస్తారు. ప్రస్తుత జన్మకు కారణం లోగడ జన్మలలో చేసిన మంచి, చెడ్డలు కారణం అంటారు. వీటిలోనే శిక్షలు, బహుమతులు కూడా యిమిడి వున్నాయి.

ఈ పునర్జన్మ కర్మ సిద్ధాంతాలు నమ్మిన వారిలో సుప్రసిద్ధ వ్యక్తులున్నారు. కనుక సిద్ధాంతం సరైనదని చెబుతారు.

టి.హెచ్. హక్సలీ 1893లో పరిణామం నీతి గురించి చెబుతూ వంశపారంపర్యంగా శీలం రావడం కర్మ సిద్ధాంతం వంటిదన్నాడు. ఇంకేముంది? హక్సలీ సైతం పునర్జన్మను అంగీకరించాడన్నారు! ఆయన మనస్సు - శరీరం సమస్య చర్చించే సందర్భంగా ఆ ప్రస్తావన తెచ్చాడు. మరణానంతరం మానవుడు వుండడని కచ్చితంగా హక్సలీ పేర్కొన్నాడు.

పునర్జన్మవాదుల ప్రకారం తల్లిదండ్రులు నిమిత్తమాత్రులు. మానవుడిలోని అనేక గుణాలకు తల్లిదండ్రులు కారణం కాదన్నారు.

పునర్జన్మను నమ్మిన ఎఫ్.డబ్ల్యు.హెచ్. మైర్స్ (Myers) గురించి బెర్ట్రాండ్ రస్సెల్ చతురోక్తిగా చెబుతూ, ఒక విందులో చనిపోయిన తరువాత నీవు ఏ మౌతావని మైర్స్‌ను ఒకరు అడిగారట. శాశ్వతానందం లభిస్తుందని మైర్స్ అంటూనే, తినేటప్పుడు అలాంటి అప్రియ ప్రస్తావన ఎందుకన్నాడట! అలాగే పునర్జన్మ నమ్మిన ఒక తండ్రికి అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సిరాగా అతడు దిగాలుపడి వున్నాడట. అతడి కుమారుడు చూచి, నాన్నా, నీకు పునర్జన్మపై నమ్మకం వుందిగా, ఏం ఫరవాలేదన్నాడట. అందుకు తండ్రి మండిపడి, ఇలాంటి సందర్భంలో హాస్యంగా మాట్లాడొద్దన్నాడట!

ప్రపంచంలో వున్న అన్యాయం, అక్రమం చూస్తుంటే, దేవుడున్నాడని, కనుక న్యాయాన్యాయాలు నిర్ణయించడానికి, పునర్జన్మలు కర్మలు వుండాలి అంటారు కొందరు. కార్యకారణవాదం కూడా యిందులోకి తెస్తుంటారు. కాని ఆ వాదం ప్రకారం అన్యాయాలకు, అక్రమాలకు కారణమైన చెడ్డ దేవుళ్ళు వుండాలి. మానవులు సంతోషంగా వుండడానికి హామీయిచ్చే నియమం ఏదీ లేదని రస్సెల్ చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి.

"కర్మ సిద్ధాంతాన్ని పరిశీలిస్తే, ఇందులో భవిష్యత్తు. అంచనా వేసే రీతి లేదని గ్రహించవచ్చు". అనిబెసెంట్, బ్లావట్స్ రాసిన విషయాలు, ప్రొఫెసర్ జి. ఆర్. మల్కాని - ప్రొఫెసర్ వారెన్ స్టెయిన్ క్రాస్ మధ్య ఫిలసాఫికల్ క్వార్టర్లీ (1965)లో జరిగిన చర్చను ఇక్కడ ఉదహరించవచ్చు. కొన్ని మార్మిక విషయాలు మనకు తెలియవని, చర్చించరాదని మల్కాని అన్నారు. ఏ పాపానికి ఏ శిక్ష విధించాలి అనేది అలాంటిదే అన్నారు. ఈ లోకంలో యింత శిక్ష అన్యాయం ఎందుకున్నదో మనం వివరించలేమన్నాడు.

కొందరు దేవుడితో నిమిత్తం లేకుండా, కర్మ దానంతట అదే పనిచేస్తుందని నమ్ముతారు. కర్మ సహజ సిద్ధాంతం అని మల్కానీ వంటి వారు నమ్మారు.

ఏది మంచి, ఏది చెడ్డ అనేది ఎక్కడ ఎవరు నమోదుచేస్తారు? దానిని బట్టి ఫలితం నిర్ణయించే తీరు ఎలా వుంటుంది? నిర్ణయాలు ఎవరు తీసుకున్నా వాటిని అమలుపరచేదెలా? అంటే లోగడ చేసిన పనులకు వచ్చే జన్మలో ఫలానా మనిషిగా పుట్టాలని నిర్ణయిస్తే అదెలా అమలుజరుగుతుంది? భూకంపంలో వేలాది మంది చనిపోవడం కర్మ వలనా? టెర్రరిస్టులు కొందరిని చంపడం కర్మ సిద్ధాంతమా? కర్మను వెనుకేసుకొచ్చే మల్కాని వంటి వారు యిలాంటి వాటికి సమాధానం చెప్పజాలరు.

పునర్జన్మలు కర్మ ప్రకారం వస్తాయని అనిబిసెంట్ నమ్మినా, ఉత్తరోత్తరా జన్మలకు తగిన దేహాలను ఎలా వెతికి తెస్తారో చెప్పలేక పోయారు. మూకుమ్మడి హత్యలు, భూకంపాలు న్యాయంగా కర్మ ప్రకారం సంభవించాయని చెప్పగలరా? అలాగైతే కోట్లాది యూదులను నాజీలు హతమార్చడం కర్మ ప్రకారం న్యాయం కావాలి.

తార్కికంగా గాని, శాస్త్రీయంగా గాని, కర్మ నిలబడదు. ఈ విషయంలో ప్రాచ్యపాశ్చాత్య సిద్ధాంతకారులను పాల్ ఎడ్వర్డ్స్ పరిగణనలోకి తీసుకున్నారు. ఎ.జె. అయ్యర్ వంటి బ్రిటిష్ తాత్వికుల భావాలు కూడా ప్రస్తావించారు.

**బెనర్జి హెచ్.ఎన్. :** పూర్వజన్మల గురించి ఇండియాలో కొన్నేళ్ళ క్రితం సంచలనం సృష్టించిన హెచ్.ఎన్. బెనర్జి గురించి చూదాం. బెనర్జి అమెరికాలో కూడా కొంత ప్రచారం పొందాడు. ఒక కేంద్రం కూడా నెలకొల్పి, మూసేశాడు. ఏన్ మిల్లర్ అనే సినీతార పూర్వజన్మలో ఈజిప్టు రాణి హత్సెసుట్ అన్నాడు. అతడి పుస్తకాలు డబుల్‌డే ప్రచురణకర్తలు వెలువరించారు. తరవాత

బెనర్జిని ఇండియాలో అరెస్టు చేశారు. అతడివన్నీ కట్టుకథలని తేలింది. యు.జి.సి. వారు కూడా కొంత నిధిని సమకూర్చి తరువాత నాలుక కొరుక్కున్నారు. అమెరికాలో అతడు ఓక్లొహోమా రాష్ట్రంలో షోఫెన్‌బర్గ్ రీసెర్చ్ ఫౌండేషన్ పెట్టి మూసేశాడు.

పూర్వజన్మలే గాక, రానున్న జన్మలు కూడా చెప్పడం మామూలే. ఫ్యూచరాలజీ పేర వీరు చెప్పేవన్నీ కొన్ని వందల వేల ఏళ్ళ అనంతరం జరుగుతాయంటున్నారు. కనుక రుజువుకు నిలబడవు.

గత జన్మల విషయం సాధారణంగా గుర్తుండవంటారు. ఎక్కడో కొందరు గుర్తున్నాయన్నప్పుడు, సంచలనం జరిగింది. ఇండియాలో యిలాంటివి అప్పుడప్పుడు ప్రచారంలోకి వచ్చాయి.

కృష్ణుడికి గతజన్మలన్నీ గుర్తున్నాయట. బౌద్ధులకు గత జన్మలు తెలుస్తాయని టిబెట్‌లో నమ్ముతారు. అనిబెసెంట్ తన గత జన్మల గురించి చెప్పింది. జన్మలలో తేడా వచ్చినప్పుడు ఏమీ సంజాయిషీ వుండదు. అయితే యివేవీ రుజువులకు నిలబడవు.

**సాయిబాబా :** సాయిబాబా అతీంద్రియ శక్తులు, నిర్ణయాలు అంగీకరించిన స్టీవెన్సన్ గురించి రాస్తూ పరిశోధనకు, రుజువుకు నిలబడక పోవడాన్ని ప్రస్తావించారు. గాలిలో నుండి చేయి చాపి వస్తువుల్ని సృష్టించగలిగితే, కొన్ని భౌతిక సూత్రాల్ని అధిగమించి పోయినట్లవుతుందన్నారు. అది conservation principleకు దాటిపోయినందున సైన్స్‌లో గొప్ప విషయం అవుతుందనీ, ఆయన ప్రతిష్ఠ యినుమడిస్తుందనీ, కనుక రుజువుకు అంగీకరిస్తే బాగుంటుందన్నారు. సాయిబాబాను పరీక్షించడానికి శాస్త్రజ్ఞులు, మాంత్రికులు (Magicians) తగిన వారన్నారు.

మద్రాసు క్రిస్టియన్ కాలేజిలో రిటైర్ అయిన సి.టి.కె. చారి అతీంద్రియ శక్తులు గురించి చాలా రాశారు. చిన్నపిల్లల పునర్జన్మల గురించిన విషయాలు పచ్చి కట్టు కథలని ఆయన రాశారు.

దేవుడు నిర్వికారుడు, సర్వాంతర్యామి అనే వాదనను చూస్తే అలాంటి దేవుడికీ, మనుషులకూ, ప్రపంచానికి ఎలా సంబంధం వుంటుందో అడిగారు. మనుషుల ప్రార్థనలు అలాంటి దేవుడికి ఎలా వినిపిస్తాయని అడిగారు. ఒకవేళ వింటే, తన శక్తిని యీ ప్రపంచంలోకి ఎలా పంపిస్తాడని తెలుసుకోవాలన్నారు. కేవలం మనస్సు (Pure Mind) భౌతిక ప్రపంచంతో ఎలా సంబంధం పెట్టుకుంటుందనేది అవగాహన కానిది.

ఒకే ఆకారం లేదా శరీరం రెండు చోట్ల వుండడం, పరకాయ ప్రవేశం, రెండు జన్మల మధ్య ఆత్మ నిరాకారంగా తిరగడం, ముసలివాడుగా చనిపోయి, పిల్లల్లో పుట్టడం యిలాంటివన్నీ రచయిత చర్చించారు. మరోజన్మలో పునర్జన్మ సిద్ధాంతానికి విరుద్ధంగా 5 వాదనలు ఉన్నాయి. పరిణామ సిద్ధాంతం పునర్జన్మని తృణీకరిస్తుందని చూపారు. బిగ్ బాంగ్ తరువాత చాలాకాలం

జీవం పరిణమించలేదు. అప్పుడు ఆత్మలు లేదా జన్మలు, ఎక్కడ వున్నాయి?

పునర్జన్మ సిద్ధాంతానికీ జనాభా పెరుగుదలకూ వున్న వైరుధ్యం ఉంది. మానవశరీరంలోనే మానవుడి ఆత్మ వుండగలదంటే జనాభా సిద్ధాంతంలో యిమడదు. కొత్త ఆత్మలు పుట్టవనీ, ఆత్మలు అనాదిగా శాశ్వతమనీ అంటే, జనాభా సిద్ధాంతం దీనిని తిప్పికొడుతుంది.

అటు పాశ్చాత్యులు యిటు ప్రాచ్యవాదులు నమ్ముతున్న కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను విపులంగా పరిశీలించిన గ్రంథం పాల్ ఎడ్వర్డ్స్ రాసిన 'రెయిన్ కార్నేషన్'. పూర్వాపరాలన్నీ ప్రస్తావించి, చివరకు శాస్త్రీయాధారాలకు నిలవబోవడం లేదని చాటారు.

ఇండియాలో జరిగినట్లు వింతగా నమోదైన అనేక పునర్జన్మ విషయాలను రచయిత ప్రస్తావించారు. తాను కొలంబియా యూనివర్శిటీలో చదువుతుండగా వేద ప్రకాశ్ మనగ్దలా అనే సహపాఠి ఎన్నో ఉదంతాలు చెప్పాడట. ఏమీ చదువుకోని ఒక రైతు ఒకనాడు పొద్దున్నే లేచి ధారాళంగా సంస్కృతం మాట్లాడాడట. అలాగే 1926 ఉత్తరాదిలో జరిగినట్లు ప్రచురితమైన జగదీష్ పునర్జన్మ విషయాలు పేర్కొన్నారు. వాటిలో పూర్వాపరాలు చూడకుండా శాస్త్రీయ పరిశీలన చేయకుండా ఎలా నమ్మారో చూపారు. ఈ విషయమై సి.టి.కె. చారి రాస్తూ మతపరంగా కొందరు అబద్ధాలు ఆడడం, కథలు అల్లడం, పవిత్రత పేరిట ఆనవాయితీగా వచ్చినట్లు స్పష్టంచేశారు. పునర్జన్మ కథలలో భాష్యకారులను, నిలబడి చూచేవారిని, తల్లిదండ్రులను నమ్మజాలమని, ప్రశ్నించాలని చారి రాశారు.

రాకేష్‌గౌర్ పునర్జన్మ ఉదంతం ఇండియాలో జరిగినట్లు ప్రచారంలోకి వచ్చింది. ఇది పేరా సైకాలజి జర్నల్‌లో ప్రచురితమైంది 1981లో. 1969లో పుట్టిన రాకేష్ గౌర్ తోంక్ అనే నగరంలో విఠల్ దాస్‌గా పుట్టి గిట్టినట్లు చెప్పిన కథయిది. రాకేష్ ప్రయాణం, వెంట తండ్రి వుండడాన్ని రాశారు.

పాశ్చాత్యులు రాసేసరికి నమ్మేస్తారు. పాశ్చాత్యులలో మనకంటె నమ్మకస్తులున్నారని మరవకూడదు. శాస్త్రీయ పరిశోధనా పద్ధతులు అన్వయించి పరిశీలించారా లేదా అనేదే ప్రధానంగా చూడాలి. రచయిత యీ దృష్టితో గమనించి, నమ్మకాలను నిరాకరిస్తున్నారు.

అబద్ధాలు కొన్నాళ్ళకు నిజాలుగా ప్రచారం గావడం, ఒక్కొక్క వ్యక్తి తన అబద్ధాలను ఉత్తరోత్తరా, నిజమని తానే నమ్మడం చూస్తున్నాం. పునర్జన్మ, కర్మ నమ్మకాలలో యిలాంటివి వున్నాయి. ముందుగానే నమ్మి, వెళ్ళి చూస్తే అద్భుతాలు జరిగినట్లే వుంటాయి. వాటిని నిశితంగా పరిశీలించే శక్తి నమ్మకస్తులకు వుండదు. ఇది చదువుకున్న వారికి, కొన్ని సందర్భాలలో శాస్త్రజ్ఞులకూ వర్తిస్తుంది. శాస్త్రజ్ఞులను సైతం అద్భుత మాయాజాలంతో మోసగించవచ్చు. కనుక పరిశీలక బృందాలలో మంత్రజాలం తెలిసిన వారిని చేర్చితే చాల వాస్తవాలు బయటపడతాయి.

కొందరికి అద్భుతశక్తులు వస్తాయి. అవి ఎలా వచ్చాయో పరిశీలించే బదులు, ఆ వ్యక్తి చుట్టూ కథలు అల్లడం, పునర్జన్మ శక్తులు అంటగట్టడం కూడా ఉండాలి. ఐరిష్ గణిత శాస్త్రజ్ఞుడు విలియం హామిల్లన్ (1805-1865) 13 భాషలతో పండితుడు. చిన్నతనంలోనే గణితంలో విశేష ప్రజ్ఞ కనబరిచాడు. ఇలాంటి కోవలో మొజార్ట్ వంటి వారున్నారు. ఇదంతా పూర్వజన్మ సుకృతం అని నమ్మేవారున్నారు. అది శాస్త్రీయ పద్ధతి కాదు. పరిశీలించి తెలుసుకోవడమే ఉత్తమం. అయితే మనకు తెలియని వాటి పట్ల, ఏదో ఒక కట్టుకథ అల్లే బదులు, రుజువులు దొరికే వరకూ వేచివుండడం, పరిశీలన కొనసాగించడం ఉత్తమ విధానం.

REINCARNATION - A Critical Examination : Paul Edwards

Prometheus Books, USA

*- మిసిమి మాసపత్రిక, మే-1998*

# విజ్ఞాన సమన్వయం

ఒకప్పుడు తన సామాజిక సిద్ధాంతాలతో ప్రపంచాన్ని కలవరపెట్టి, ఉద్రిక్తతలూగించిన ఎడ్వర్డ్ విల్సన్ నేడు కొత్త ఆలోచనలతో మళ్ళీ ప్రకోపింపజేస్తున్నాడు. మనకు విభిన్నంగా, విరుద్ధంగా కనిపించేవాటి మధ్య సమన్వయం సాధ్యమంటున్నాడు. అన్నింటికీ పరిష్కారం జీవశాస్త్రంలో చూడొచ్చు అంటున్నాడు. ఇందుకు ఆయన స్వీకరించిన పరిశోధన చీమలు!

చీమలకు మెదడులో 10 లక్షల కణాలే వున్నాయి. మనిషి మెదడులో వంద బిలియన్ కణాలున్నాయి. చీమల ప్రవర్తన, క్రమబద్ధత సాధ్యమైనప్పుడు మనిషి తన శక్తిని వినియోగిస్తే ఇంకెంతో సాధించగలడని విల్సన్ సిద్ధాంతీకరిస్తున్నాడు.

అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేస్తున్న విల్సన్ ప్రస్తుతం 68వ పడిలో వున్నాడు. ఆయన పరిశోధనాలయంలో 538000 చీమల నమూనాలు, వర్గీకరణ నిమిత్తం సారాయిలో పెట్టి వుంచిన మరో 3 లక్షల చీమలు చూచేవారికి ఆశ్చర్యం వేస్తుంది. చిన్నప్పటి నుండే అలబామా రాష్ట్రం అడవులలో చీమల్ని సేకరించి, ప్రకృతిని అధ్యయనం చేసిన విల్సన్ పులిట్జర్ బహుమానం అందుకున్న రచయిత.

మన ప్రవర్తన మన తల్లిదండ్రుల జన్యుకణాల నుండి సంక్రమించిందని, వారి శిక్షణ నుండి పిల్లలు పుణికి పుచ్చుకుంటారని సిద్ధాంతీకరిస్తూ "సోషియోబయాలజీ" రాసినప్పుడు చాలామంది గగ్గోలు పెట్టారు. రానురాను విల్సన్ సోషియోలజీని సీరియస్‌గా స్వీకరించి పరిశీలిస్తున్నారు.

నేడు జీవకణశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, జీవకణశాస్త్రం ఎన్నో సూక్ష్మాలు అందిస్తున్నది. కనుక మెదడు ఆలోచనా స్రవంతి లోతుపాతుల్లోకి పోగలమని విల్సన్ అంటున్నాడు.

సిద్ధాంతాలకు, నమ్మకాలకు బానిసలుగా బ్రతకడంకాదు, ఉన్నతస్థాయికి ఎదుగుతూ పోవడం మానవ లక్షణాలలో విశిష్టమైనదని విల్సన్ గట్టిగా చెబుతున్నాడు.

మనకు శాస్త్రాల వలన జ్ఞానం విపరీతంగా వస్తున్నది. దీని ఫలితంగా వివిధ జ్ఞాన శాఖల్ని సమన్వయీకరించి చూచుకోవలసిన అవసరం కలిగిందంటున్నాడు.

హెరాల్డ్ విల్సన్ 7వ ఏట మిలటరీ స్కూలులో చేరి చదివాడు. ఒక దుర్ఘటనలో ఒక కన్ను కనిపించకుండా పోయింది. పుట్టినప్పటి నుండీ చెముడు వచ్చింది. విల్సన్ ఒక్కడే సంతానమైనా తల్లిదండ్రులు విడాకులు యిచ్చుకున్నందున, చిన్నప్పటినుండీ కష్టజీవితానికి అలవాటుపడ్డాడు. హార్వర్డ్ యూనివర్శిటీలో చేరిన తరువాత, జీవశాస్త్రాన్ని యితర రంగాలకు అన్వయించవచ్చని గ్రహించాడు. సమన్వయం అతడి వూపిరిగా మారింది.

శ్రీలంక వరకూ పర్యటించి, చీమల నమూనాలు సేకరించి పరిశోధించిన విల్సన్, వాటిపై ప్రామాణీకరించిన శాస్త్రజ్ఞుడయ్యాడు. అది మూలంగా పెట్టుకొని, ఇతర జీవజాలమంతా పరిశీలించాడు. క్రమేణా మనిషికి కూడా విస్తరించాడు. దీని ఫలితంగా 1978లో "ఆన్ హ్యూమన్ నేచర్" ప్రచురించాడు.

మనిషి పరిణామంలో భాగం. తన జన్యుకణాల ప్రభావంతో అతడు ప్రవర్తిస్తుంటాడు. భవిష్యత్తులోకి తొంగి చూస్తుంటాడు. ఒకప్పుడు మనిషి మాజిక్ ద్వారా తన జ్ఞానాన్ని అదుపులో పెట్టాలనుకున్నాడు. నేడు కళల ద్వారా వివిధ గందరగోళాలను శాస్త్రాలను సమన్వయీకరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇది విల్సన్ సిద్ధాంతం.

క్రైస్తవ మతంలో పుట్టి పెరిగిన విల్సన్ అందులో నుండి మానవవాదిగా ఎదిగాడు. ప్రకృతిలోని వైవిధ్యాన్ని అభినందించసాగాడు. పరిణామం సాగిపోతూ వున్నదన్నాడు. ఇందుకు మానవుడు ఇంకా ప్రయోజనాత్మకంగా దోహదం చేయాలంటే, వివిధ రీతుల్ని బాగా అవగాహన చేసుకోవాలన్నాడు అటు ప్రకృతి, యిటు జన్యు కణాల వలన మానవుడు మసలుకుంటున్నాడు. వీటిని సమన్వయించాలంటున్నాడు. పరిసరాలను ధ్వంసం చేయకుండా జీవనం కొనసాగించడం అవసరమంటాడు.

విల్సన్ భార్య ఐరీన్ (Irene) అతడికి బాగా సహకరిస్తుంది

ప్రస్తుతం విల్సన్ రాసి ప్రచురించిన కొత్త పుస్తకం మళ్ళీ విజ్ఞాన ప్రపంచాన్ని ఆలోచింపజేస్తున్నది. జ్ఞాన సమన్వయీకరణ యీ గ్రంథానికి మూలం (Consilience: The Unity of Knowledge)

ఒకవైపు విజ్ఞానరంగం ఎంతో సాధించగా, మరొక పక్క దీనిని ఖండిస్తూ యీసడిస్తూ కొందరు ప్రచారం చేస్తున్నారు. అతీంద్రియ శక్తులు, దివ్యత్వం, మహిమల పేరిట కొందరు

రంగంలోకి దిగి మోసాలకు పాల్పడుతున్నాడు. మరికొందరు మూర్ఖంగా మతగ్రంథాలలోనే సర్వస్వం వున్నదని నమ్ముతున్నారు. కాని ఇంకా కొందరు తత్వం పేరిట సిద్ధాంతీకరిస్తూ శాస్త్రాన్ని వెక్కిరిస్తున్నారు. పోస్ట్ మోడరనిస్ట్ శాఖ యిందులో ఒకటి. ఇంకా సాంస్కృతిక సాపేక్షత వాదులున్నారు. నియోమార్క్సిస్టులు వీరికి తోడయ్యారు. ఫాయర్ బాండియన్లు, కున్ వాదులున్నారు. అలాంటి వారందరినీ దృష్టిలో పెట్టుకొని విల్సన్ కొత్త పుస్తకం రాశాడు. విజ్ఞానం సంకుచితం కాదనీ, మానవుడిని పెంచేదేకాని తగ్గించేది కాదని విల్సన్ అన్నాడు. అందుకే వివిధ విజ్ఞాన శాఖల సమన్వయం కోరుతున్నాడు.

వికాసయుగం మానవుడిని స్వేచ్ఛ వైపుకు నడిపించిన విషయం విల్సన్ గుర్తు చేస్తున్నాడు. మానవుడి పురోగతికి అత్యంత శక్తివంతమైన ఆయుధం విజ్ఞానమే.

విజ్ఞానాన్ని సమన్వయీకరించడం అవసరమైన విల్సన్ మూల సిద్ధాంతం ముఖ్యమైనది. ఎవరికి వారు ప్రత్యేక కృషి చేసి, ఆయా రంగాలలో ఎన్నో కనిపెడుతున్నాడు. సాధిస్తున్నారు. కాని బయట ఏం జరుగుతున్నదో గ్రహించడంలేదు. అందువలన మూఢనమ్మకాలు, మూర్ఖత్వాలు వుంటున్నాయి. సమన్వయీకరణ జరిగితే యీ లోపం సవరించవచ్చు. కెమిస్ట్రీలో జరిగేది, జీవశాస్త్రజ్ఞులకు, ఫిజిక్స్‌లో పరిశోధనలు, భూగర్భ శాస్త్రజ్ఞులకూ, ఖగోళంలో ఏం జరుగుతున్నదో మానసిక శాస్త్రజ్ఞులకూ తెలియాలంటే, సమన్వయీకరణ జరగాలన్న మాట. ఎవరికివారే మడిగట్టుకొని, తమదే గొప్ప రంగం అనుకొంటూ, మిగిలిన రంగాలను పట్టించుకోపోవడం లోపం. ఇది తొలగాలి.

లోగడ కార్నప్, రైకన్‌బాక్, ఎం.ఎన్. రాయ్, వంటివారు యిలాంటి సమన్వయీకరణ ధోరణులు కొంత వరకు చేశారు. అలాంటి కృషి చాలా భారీ ఎత్తున యిప్పుడు జరగాలని విల్సన్ ఉద్దేశం.

విజ్ఞాన రంగంలో ఒక భాగం మరొక విభాగానికి ఎలా ఉపకరిస్తుందో శాస్త్రజ్ఞులు గ్రహిస్తున్నారు. సమన్వయీకరణలో కేవలం విజ్ఞానశాస్త్రాలేగాక, మానవశాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు చేర్చడం విల్సన్ విశిష్టత. అక్కడే వివాదం తలెత్తుతున్నది.

పరిణామంలో జన్యుకణాలు, పరిసరాలు రెండూ పరస్పరం ప్రాధాన్యత వహిస్తూ, పోతున్నాయనేది విల్సన్ మూలసిద్ధాంతం. అలాంటి సమన్వయీకరణ సాధ్యం కాదని రిచర్డ్ రోర్టీ (Richard Rorty) వాదిస్తున్నాడు. చాలకాలం పట్టినాసరే అలాంటి సమన్వయీకరణ వైపు సాగి పోవడం అవసరమనీ, సాధ్యమనీ విల్సన్ అంటాడు.

విజ్ఞానాన్ని నీతికి సైతం అన్వయించవచ్చని విల్సన్ అంటాడు. మొత్తం మీద గొప్ప గ్రంథం రాసి విల్సన్ మళ్ళీ సంచలనం సృష్టించాడు.

*- మిసిమి మాసపత్రిక, నవంబర్-1998*